# స్వాతంత్ర్యానంతర తెలుగుసాహిత్యం విద్యావిమర్శ

**(Post Independence Telugu Literature Critique of Education)**


పరిశోధన

పి.మల్లికార్జున్

*(97HTPH07)*

పర్యవేక్షణ

ఆచార్య కె.కె.రంగనాథాచార్యులు


తెలుగులో పి హెచ్.డి డిగ్రీకోసం

హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయానికి

సమర్పించిన సిద్ధాంత వ్యాసం

*2004*

*To,*

*Uncle*
*Sri J.Gopala Krishna Murthy*
*Mandal Educational Officer*

P.Mallikarjan,
Ph.D. Student,
Department of Telugu,
School of Humanities,
University of Hyderabad.

Date: 25-8-'04.

This is to certify that I, P.Mallikarjan have carried out the research embodied in the present thesis for the full period prescribed under Ph.D. ordinances of the University of Hyderabad. My Topic of the Ph.D. programme is "Swatantryanantara Telugu Sahityam: vidya vimarsa" (Post Independence Telugu Literature: Critique of Education).

I declare to the best of my knowledge that no part of this thesis was earlier submitted for the award of research Degree of any University.

P.Mallikarjan,
(97HTPH07)

01/9/2004
Head of the Department

HEAD
Department of Telugu
University of Hyderabad
Hyderabad-500 046.

Signature of the Supervisor

3/9/04
Dean of the School

DEAN
School of Humanities
University of Hyderabad
Central University P.O.
HYDERABAD - 500 046.

పరిశోధనకు అవకాశమిచ్చిన హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం
తెలుగుశాఖకు,
దార్శనికులు, పర్యవేక్షకులు ఆచార్య కె.కె. రంగనాథాచార్యులవారికి,
మిత్రులకు

కృతజ్ఞతలు

==========

## ముందుమాట

పరిశోధనాంశం స్వాతంత్ర్యానంతర తెలుగుసాహిత్యం : విద్యావిమర్శ. ఇందులో ప్రధానంగా చర్చించాల్సిన అంశం విద్యావిధానాన్ని కేంద్రంగా చేసుకుని వచ్చిన రచనల స్వరూపస్వభావాలను పరిశీలించటం. అయితే ఒక ప్రత్యేక అంశంపై వచ్చిన రచనలను విశ్లేషించేందుకు ఆ అంశంపై కనీస అవగాహన అవసరం. ఆ క్రమంలోనే భారతదేశంలో ప్రాచీనకాలంనుంచి నేటివరకు విద్య భావనల్లో వచ్చిన మార్పులను అధ్యయనం చేయటం జరిగింది. అందుచేతనే ప్రాచీనకాలంలోను, మధ్యయుగంలోను, ఆధునికయుగంలోను విద్యావ్యవస్థ తీరుతెన్నులను పరిశీలించటం పరిశోధనలో మొదటిదశగా చోటుచేసుకుంది. ఈ దశలో చేసే అధ్యయనం విద్య మౌలిక స్వభావాన్ని అవగాహనచేసుకునేందుకు దోహదపడుతుంది. పరిశోధనలో రెండవదశ ప్రధానమైనది. ఈ దశలో విద్యావిధానంలోని విభిన్నాంశాలను సమగ్రంగా అధ్యయనం చేయటం జరిగింది. విద్యావిమర్శలో వస్తువైవిధ్యం ఇందులో చర్చకువస్తుంది. వస్తుపరమైన విమర్శను ప్రధానంగా సామాజిక, మనోవిశ్లేషణాత్మక విమర్శలనే రెండు విభాగాల క్రింద చర్చించటం చూస్తాం. సామాజిక విమర్శలో భాగంగా పాఠశాల కేంద్రంగా చేసుకుని రూపొందే మానవ సంబంధాలు, పాఠ్యాంశాలు, వాటి సంబద్ధత, బోధనాపద్ధతులు, పరీక్షావిధానం, స్త్రీవిద్య, మేధోవలస, విద్యార్థులు--వారి హక్కులు వంటి విభిన్న అంశాలు వాటి సామాజిక, తాత్త్విక భూమికతో చోటుచేసుకుంటాయి. మనోవిశ్లేషణాత్మక విమర్శలో భాగంగా ఉపాధ్యాయ, విద్యార్థుల మనస్తత్వచిత్రణ, విద్యార్థి మనస్తత్వంపైన తల్లిదండ్రుల ప్రభావం, పాఠశాల క్రమశిక్షణ, దండనలు వంటి అంశాలు వ్యక్తుల మనస్తత్వాలను ప్రధానభూమికగా చేసుకొని చర్చించటం జరిగింది. ఇక రచనల్లోని రూపవైవిధ్యాన్ని పరిశీలించటం పరిశోధనలో మూడవదశ. ఈ దశలో వివిధ రచనల్లో కథనం, కథనశిల్పం, భాష, పాత్రచిత్రణ వంటి శిల్పపరమైన అంశాలు చర్చకువచ్చాయి. ప్రత్యామ్నాయ విద్యావిధానం పట్ల తెలుగుసాహిత్యంలో ప్రతిఫలించిన స్పందనలను అధ్యయనంచేయటం పరిశోధనలో చివరిదశ. అనంతరం విద్యావిధానంపై సాహిత్యంలో

వచ్చిన ప్రతిస్పందనలను మరింత విస్తృతంగా అధ్యయనం చేసేందుకు తగిన సూచనలనందించటం పరిశోధనకు ముగింపు.

పరిశోధనాపరిధి జీవితమంత విస్తృతమైనదికావటంతో, పరిశోధనలో అధ్యయనానికంటే, సృజనాత్మక సాహిత్యాన్ని సేకరించేందుకు ఎక్కువ సమయాన్ని వెచ్చించాల్సి వచ్చింది. విద్యావిధానం ప్రధానభూమికగా కలిగిన రచనలను సేకరించేందుకు స్వాతంత్ర్యానంతర తెలుగుసాహిత్యంలోని రచనలన్నింటినీ సాధ్యమైనంతమేరకు అవలోకించాల్సిన అవసరం ఏర్పడింది. పరిశోధనలో ప్రత్యేకించి ఒక రచనాప్రక్రియకే పరిమితం కాలేదు. అన్ని రచనాప్రక్రియలను (కథ, నవల, నాటకం, కవిత్వం) స్వీకరించటంతో పరిశోధనాంశం మరింత విస్తృతరూపం దాల్చింది. నవలల్లో రచనమొత్తం ఓ ప్రధాన అంశంచుట్టూ నడవటం సాధారణం. అందువల్ల విద్యావిధానానికి సంబంధించికూడా ఒక నవల ఒకే అంశాన్ని సమగ్రంగా చర్చించే వీలుంటుంది. కాని కథల్లో ఈ పరిస్థితి ఉండదు. కాన్వాస్ చిన్నది కావటాన, ఒకే అంశాన్ని లోతుగా చిత్రించటం కథల్లో మనకు కనిపిస్తుంది. అందువల్ల ప్రతి చిన్నకథ ఓ విభిన్న సమస్యను వెలికితీసే వీలుకలుగుతుంది. ఈ కారణంచేతనే పరిశోధనలో నవలలకంటే కథలకు అధిక ప్రాధాన్యాన్నివ్వటం జరిగింది. అంతేకాకుండా విద్యావిధానం ప్రధానాంశంగా వచ్చిన నవలలు స్వల్పంగానే కనిపిస్తాయి. వానిలోకూడా విద్యావిధానంలోని అన్ని అంశాలను సమగ్రంగా, చిత్రించినవి అరుదు. అందుచేత పరిశోధన అధికంగా కథలు ప్రధానభూమికగాచేసికొని సాగింది. విద్యావిధానాన్ని స్పృశించిన కవిత్వం పరిశోధనలో భాగమైంది. అయితే అది చాలా స్వల్పం.

అయితే దేన్నీ పరిపూర్ణంగా భావించలేం కాబట్టి ఈ పరిశోధనకూడా పరిపూర్ణంకాదు. సమయాభావం కారణంగా పరిశోధనాంశంలో ప్రతిపాదించిన కాలానికి సంబంధించిన అన్ని రచనలు అధ్యయనంలో భాగంకాలేకపోయి ఉండవచ్చు. పరిశోధనాంశానికి, కాలానికి సంబంధించి పరిధిని నిర్ణయించుకోవటంలో ప్రదర్శించిన అత్యుత్సుకతే ఇందుకు కారణమని భావించాలి. పరిశోధనా పరిధిని నిర్ణయించుకోవటంలో కొంత జాగరూకత వహించి ఉంటే పరిశోధన మరింత సమగ్రంగా రూపొందించేందుకు వీలుపడి ఉండేదని భావన.

పరిశోధకుడు

==========

విషయసూచిక

ప్రారంభం 1-2

1. విద్య : వివిధ భావనలు -- తాత్త్విక సామాజిక ఆధారాలు 3-73

1.1. ప్రాచీనకాలంలో విద్యభావన 4-26

1.1.1. విద్య : విభిన్న భావనలు 5

1.1.2. అధ్యయన విధానం 10

1.1.3. బోధనా విధానం 11

1.1.4. పరీక్షా విధానం 13

1.1.5. బౌద్ధ విద్య 15

1.1.6. వృత్తివిద్యలు 16

1.1.7. ఉపాధ్యాయ విద్యార్థి సంబంధాలు 17

1.1.8. విద్యాభ్యాస విధులు : నియమాలు 19

1.1.9. విద్యా విధానం : రాజ్యపోషణ 23

1.1.10. విద్య : ప్రయోజనం 23

1.2. మధ్యయుగంలో విద్య భావన 27-43

1.2.1. ముస్లిం విద్యావిధానం : ప్రాథమిక విద్య 28

1.2.2. ముస్లిం విద్యావిధానం : ఉన్నత విద్య 30

1.2.3. దేశీయ విద్యావిధానం : ప్రాథమిక విద్య 36

1.2.4. దేశీయ విద్యావిధానం : ఉన్నత విద్య 40

1.3. ప్రాచీన, మధ్య యుగాల్లో స్త్రీ విద్య 44-51

1.3.1. దేశీయ విద్యావిధానం : స్త్రీవిద్య 47

1.3.2. ఇస్లాం విద్యావిధానం : స్త్రీ విద్య 49

1.4. ఆధునిక కాలంలో విద్యభావన 52-73

1.4.1. బ్రిటీష్ కాలంలో భారత విద్యావ్యవస్థ 54

1.4.2. స్వాతంత్ర్యానంతరం విద్యావ్యవస్థ 58

1.4.3. స్వాతంత్ర్యానంతరవిద్య : ఒక విహంగావలోకన 70

2. తెలుగు సాహిత్యం : విద్యావిధానం : వస్తుగత విమర్శ 74-207

2.1. సామాజిక విమర్శ 76-136

2.1.1. విద్య : సామాజిక వైరుధ్యాలు 78

2.1.2. విద్య : తల్లిదండ్రుల ప్రభావం 98

2.1.3. మేధో వలస 108

2.1.4. స్త్రీ విద్య 115

2.1.5. పరిశోధన 126

2.1.6. శ్రమ-ప్రతిభ-రిజర్వేషన్లు 132

2.1.7. వ్యాపారాత్మక విద్య 136

2.2. మనోవిశ్లేషణాత్మక విమర్శ 142-207

2.2.1. పాఠ్యపుస్తకాల భారం 142

2.2.2. క్రమశిక్షణ : హక్కులు 145

2.2.3. దండనలు 150

2.2.4. పోటీతత్త్వం 157

2.2.5. లైంగికవిద్య 166

2.2.6. పరీక్షా విధానం : మూల్యాంకనం 170

2.2.7. ఉపాధ్యాయులు: విభిన్నపార్శ్వాలు 180

2.2.8. విద్యార్థులు: వివిధ స్వభావాలు 201

3. తెలుగు సాహిత్యం : విద్యావిధానం : రూపగత విమర్శ 208-259

3.1. రచనావిధానం : పాత్రచిత్రణ 210-224

3.1.1. రచనావిధానం 210

3.1.2. పాత్ర చిత్రణ 214

3.2. కథనం 225-231

3.3. కథనశిల్పం 232-251

3.3.1. ఎత్తుగడ 233

3.3.2. సంఘటన 235

3.3.3. సంఘర్షణ 239

3.3.4. సన్నివేశం 245

3.3.5. ముగింపు 246

3.4. భాష 252-259

3.4.1. మాండలికం 252

3.4.2. వ్యంగ్యం 253

3.4.3. విరామచిహ్నాలు 255

3.4.4. శీర్షికా వైవిధ్యం 256

4. తెలుగు సాహిత్యం : ప్రత్యామ్నాయవిద్య 260-280

4.1.1. ప్రత్యామ్నాయవిద్య 266-279

ముగింపు 281-282

*ప్రారంభం:*

ప్రాచీనకాలంలో విద్యను విజ్ఞానాన్ని అందించేసాధనంగా కంటే భౌతిక ప్రయోజనాలను చేకూర్చే సాధనంగానే భావించటం ఎక్కువగాకనిపిస్తుంది.

"విద్య నిగూఢ గుప్తమగు విత్తము రూపము పురుషాళికిన్
విద్య యశస్సు భోగకరి విద్య గురుండు విదేశ బంధుడున్
విద్య విశిష్ట దైవతము విద్యకు సాటి ధనంబులేదిలన్
విద్య నృపాల పూజితము విద్య నెరుంగనివాడు మర్త్యుడే" అంటూ

భర్తృహరి వ్యక్తచేసిన భావనలో విద్యకుగల ఈ భౌతిక ప్రయోజనం కనిపిస్తుంది. కాలక్రమంలో సమాజంలోని మార్పుకు అనుగుణంగా 'విద్య' కుగల అర్థంలోకూడా మార్పు చోటుచేసుకున్నది. స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్యోద్యమకాలంలో ఉపాధికి విజ్ఞానానికి సమాన ప్రాధాన్యాన్నిచ్చేదిగా 'విద్య' గుర్తింపు పొందింది. విశ్వనాథ 'వేయిపడగలు' నవలలో వ్యక్తమైన అభిప్రాయంలో ఈ మార్పు గుర్తించవచ్చు.

"విద్య ప్రధానంగా రెండువిధములు. ఒకటి వృత్తివిద్య. రెండవది జ్ఞానము కొరకుచదువువిద్య. ఇవి రెండును గలుపరాదు. వృత్తివిద్య జీవనాధారమైనది. జ్ఞానము కొరకైన విద్య మానిసిహృదయమునకు సంస్కారము తెచ్చుటకేర్పడినది." (విశ్వనాథ.1969: 543)

తర్వాతికాలంలో ఉపాధికల్పించటంకంటే విజ్ఞానాన్నందించటమే విద్య ప్రయోజనంగా భావించటం అధికంగా కనిపిస్తుంది.

గాంధీ, ఠాగూర్, స్వామి వివేకానంద, అరవిందో, జకీర్‌హుస్సేన్, సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి ప్రముఖవిద్యావేత్తలు, విశ్వనాథ, చలం, గురజాడ, గిడుగు, వీరేశలింగం వంటి రచయితలు విద్యనుగూర్చి విస్తృతంగా చర్చించారు. విద్యపట్ల వీరికి గల ఆలోచనలన్నింటిని పరిగణనలోకితీసుకుంటే 'విద్య'కు నిర్దుష్టమైన అర్థంలభిస్తుంది. వీరి అభిప్రాయాలలో ప్రధానంగా రెండు అంశాలు కనిపిస్తాయి.

1. ప్రస్తుతం విద్యగా ప్రచారంలో ఉన్న భావాలను తిరస్కరించటం.
2. విద్యకు నిర్దుష్టమైన అర్థాన్నిచ్చేందుకు ప్రయత్నించటం.

విద్య కేవలం పాఠ్యాంశాల పరిజ్ఞానం (జకీర్‌హుస్సేన్) , సమాచారసేకరణ (అరవిందో), అక్షరాస్యత (గాంధీ,విశ్వనాథ), విషయపరిజ్ఞానం (స్వామి వివేకానంద) అంటూ ప్రచారంలోఉన్న భావాలను వీరు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. ఈభావాలను తిరస్కరించటంతో పాటుగా 'విద్య'కు సరైన అర్థాన్నిచ్చేందుకు ప్రయత్నించారు.

వాస్తవదృక్పథంలో విద్య రెండు ప్రధానభూమికలు పోషించాలి. అవి వ్యక్తిగత, సామాజికాంశాలు ( టి.పి.మీనన్, పి.సి.బెనర్జీ).

**వ్యక్తిగతాంశం :** విద్య శారీరక/బౌద్ధిక చైతన్యానికి ప్రేరణనిచ్చేది (గాంధీ), వ్యక్తి ఉన్నతికి దోహదపడేది (జకీర్‌హుస్సేన్), శారీరక సామర్థ్యాన్ని, ఆధ్యాత్మిక చైతన్యాన్నిచ్చేది (అరవిందో), పదార్థవిషయమై యదార్థ విషయజ్ఞానం కలిగినది (కందుకూరి), స్వంతఅనుభవాలు నేపథ్యంగా రూపొందింది (నెహ్రూ), జీవితంతో సన్నిహితత్వం కలిగినది (ఠాగూర్) అయిఉండాలి.

**సామాజికాంశం :** విద్య జీవనపోరాటంలో సహాయకారిగా (వివేకానంద), వ్యక్తుల ఆలోచనల పరస్పరమార్పిడికి దోహదకారియై (సర్వేపల్లి), హేతుబద్ధతకలిగి (దయానంద,కందుకూరి), సర్వమానవాళిపట్ల ప్రేమనుపంచేదిగా (స్వామివివేకానంద) ఉండాలి.

అయితే ఈ రెండురకాల ప్రయోజనాలను నిర్దుష్టంగా నిర్వచించినవారు నెహ్రూ, విశ్వనాథలు. విద్యలో వ్యక్తి పెరుగుదలకు తోడ్పడే సాంస్కృతిక పార్శ్వం ఒకటి, వ్యక్తి నైపుణ్యాన్ని పెంచే ఉత్పాదక పార్శ్వం మరొకటి. సాంస్కృతిక పార్శ్వం వ్యక్తి మూర్తిమత్వ వికాసాన్ని సూచించేదిగా కేవలం వ్యక్తిగతాంశం కలిగి ఉంటే, ఉత్పాదక పార్శ్వంలో వ్యక్తిగత, సామాజిక ప్రయోజనాలు రెండూ యిమిడివున్నాయి.

విద్యకుగల ఈ విస్తృత ప్రయోజనాలను, లక్ష్యాలను క్రోడీకరించినట్లుగా'చలం' సాధారణపరిభాషలో ఇలా అంటారు.

"విద్య అంటే ఆనందించే శక్తిని వృద్ధిచెయ్యటం, సౌందర్యాలకు కళ్లు తెరవడం, బాధలనుంచి, కష్టాలనుంచి తప్పించుకునే నేర్పునివ్వడం. ఇతరుల స్వేచ్ఛలను అర్థగించే స్వార్థపరత్వం నుంచి, అంతా తనకేకావాలని దాచుకునే కాపీనం నుంచి, భయాలనుంచి తప్పించగలగటం." (చలం.1987: 184)

ఇల్యా ఎహ్రెన్‌బర్గ్ సాహిత్యం గురించి కూడా దాదాపు ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తంచేశాడు.

"సాహిత్యం ప్రజలను జ్ఞానవంతులుగా చేస్తుంది. వారు ఇతఃపూర్వంకన్నా బాగా జీవించటానికి తోడ్పడుతుంది. వారి భావోద్రేకాలను ఉన్నతపథానికి గొనిపోతుంది. తమ బంధువుల, స్నేహితుల, ఇతరప్రజలందరిని గురించి ఆలోచించేటట్లు చేస్తుంది. నవలలు, కథలు,కవిత సమాజాన్ని బంధించే భావోద్రేక బంధనాలు" (ఇల్యా ఎహ్రెన్‌బర్గ్.1989: 54)

వీరిరువురి అభిప్రాయాల్లో విద్యాప్రయోజనాలకు, సాహిత్యప్రయోజనాలకు గల సారూప్యత గోచరిస్తుంది. ఈ సారూప్యత కారణంగానే విద్య తనలక్ష్యాన్ని సాధించే దిశలో విద్యావిధాన రూపకల్పన జరిగేందుకు దోహదపడే సునిశిత విమర్శ సాహిత్యంలో విస్తృతంగా చోటుచేసుకున్నది.

తెలుగుసాహిత్యంలో విద్యావిధానంపై వచ్చిన ఈ సునిశిత విమర్శను విశ్లేషణాత్మకంగా పరిశీలించటం ద్వారా విద్యారంగంలో అవసరమైన మార్పులను గుర్తించటానికి వీలుకలుగుతుంది.

పరిశోధన ప్రధానంగా నాలుగు దశలుగా సాగుతుంది. అవి

1. విద్య : వివిధ భావనలు : తాత్విక సామాజిక ఆధారాలు
2. తెలుగు సాహిత్యం : విద్య : వస్తుగత విమర్శ
3. తెలుగు సాహిత్యం : విద్య : రూపగత విమర్శ
4. తెలుగు సాహిత్యం : ప్రత్యామ్నాయ విద్య

# 1. విద్య : వివిధ భావనలు :
# తాత్త్విక సామాజిక ఆధారాలు

ఒక వ్యవస్థ స్వరూప స్వభావాలను అధ్యయనం చేయాలంటే ముందుగా ఆ వ్యవస్థ రూపొందటానికి వెనుకగల తాత్త్విక, చారిత్రక భూమికపట్ల అవగాహన అవసరం. అదేవిధంగా భారతీయ విద్యావ్యవస్థ పట్ల ఒక సమగ్రమైన అవగాహన కలగాలంటే దాని స్వరూపస్వభావాలను భారతదేశ చారిత్రక పరిణామక్రమంలో భాగంగానే అధ్యయనం చేయాల్సి ఉంటుంది. అప్పుడే భారతీయ విద్యావ్యవస్థపట్ల ఒక సమగ్ర దృక్పథం ఏర్పడుతుంది. భారతీయ సామాజిక పరిణామ క్రమాన్ని మూడు ప్రధాన విభాగాలుగా అధ్యయనం చేయవచ్చును. అవి ప్రాచీనయుగం, మధ్యయుగం, ఆధునికయుగం. ఈ మూడుకాలాల్లో విద్యావ్యవస్థలో వచ్చినమార్పులు, వాటి స్వరూప స్వభావాలు వేరువేరుగా చర్చించటంద్వారా భారత విద్యావ్యవస్థ పరిణామక్రమంపట్ల ఒక నిర్దుష్టమైన అవగాహన ఏర్పడుతుంది.

1.1. ప్రాచీనకాలంలో 'విద్య' భావన
1.2. మధ్యయుగంలో 'విద్య' భావన
1.3. ప్రాచీన మధ్యయుగాల్లో స్త్రీవిద్య
1.4. ఆధునిక కాలంలో 'విద్య' భావన

*"The object of Ancient Hindu education was made three-fold: the acquisition of knowledge, the inculcation of social duties and religious rites and above all the formation of character"*

*---Santosh Kumar Da:1930*

=====================

ప్రాచీన కాలంలో 'విద్య' భావన

మానవజాతి ప్రారంభంలో విద్య జీవితంలో భాగంగానే ఉంది తప్ప ప్రత్యేకమైన అధ్యయనంగా లేదు. అయితే ఆహారం, వసతి, రక్షణ వంటి సౌకర్యాలకోసం ప్రకృతిని అదుపులోకి తెచ్చుకునే ప్రయత్నంలో మానవులు ప్రకృతిని అధ్యయనంచేయటం ప్రారంభించారు. ఇదే ప్రయత్నపూర్వక అభ్యసనానికి ప్రారంభం. వ్యక్తిలోని అంతర్గత నైపుణ్యాలను గుర్తించి, వాటిని వెలికితీసేందుకు ఈ ప్రయత్నపూర్వక అధ్యయనం దోహదపడింది. ప్రాచీనకాలంలో 'విద్య' భావనకు నాందికూడా ఈ దశలోనే జరిగిందని భావించవచ్చు.

ఉపాధ్యాయుడు సాంప్రదాయికంగా తను పొందిన జ్ఞానాన్ని విద్యార్థులకందించేప్రక్రియగా భారతీయ విద్యావిధానం ప్రారంభమైంది. క్రతు కర్మకాండలు కొన్ని శాస్త్రాలకు జన్మనిచ్చాయి. పూజాపీఠ నిర్మాణానికి సంబంధించిన విస్తృత నియమనిబంధనలు జ్యామితికి, బీజగణితాలకు పునాదివేశాయి. కర్మకాండలకు, ఇతరవిషయాలకు సరైన కాలాన్ని నిర్ణయించవలసిరావటం జ్యోతిష, ఖగోళశాస్త్రాల ఆవిర్భావానికి కారణమైంది. యజ్ఞపశువుల అంగాంగ పరిశీలనతో శరీరధర్మశాస్త్రం అభివృద్ధిచెందింది. శాస్త్రాలను దోషరహితంగా ఉండేలాచూడటం వ్యాకరణ, భాషాశాస్త్రాల అభివృద్ధికి దారిచూపింది. వేదసంహితల్లో, అరణ్యకాల్లో, ఉపనిషత్తుల్లో విశ్వం, విశ్వంలో మానవుని స్థానం గురించి విస్తృతంగా జరిగిన చర్చ, అవగాహన విస్తృత తత్త్వశాస్త్ర, తర్కశాస్త్ర జ్ఞానానికి మూలమైంది. జ్ఞానం ప్రత్యేక అధ్యయనాంశంగా రూపొందటానికి ఇదే ప్రారంభంగా భావించాలి.

ప్రాచీనకాలంలో భారతీయులు విద్యను జీవితపర్యంతం కొనసాగే ప్రక్రియగా భావించారు. వ్యక్తి జీవితాన్ని నాలుగుదశలుగా విభజించి ప్రతిదశకు ప్రత్యేకబాధ్యతలను అప్పగించారు. ఆయా దశల్లో వారిబాధ్యతల సమర్థ నిర్వహణే వారిని తర్వాతిదశకు సిద్ధంచేసేది. మొదటిదశ వ్యక్తిమొదటు

వికసించి, మెదడు ఆదేశాలకనుగుణంగా పనిచేసేరీతిలో శరీరం రూపొందటం. రెండవదశ వ్యక్తి తను అభ్యసించిన నియమాలను అనుసరిస్తూ, వాటి వాస్తవస్వభావాన్ని, ప్రపంచంలోని అంశాలను, అందలి విధులను గుర్తించడంద్వారా శారీరకంగా, మానసికంగా పవిత్రులుగా మనగలగడం. మూడవదశ వ్యక్తికి, బాహ్య వ్యక్తిత్వానికి మధ్య నిజమైన సంబంధాన్ని గుర్తించడంకోసం మానవుని ఉనికిని తెలుసుకోవటం. చివరిదశ వ్యక్తి సాంప్రదాయిక నియమ నిబంధనలనుంచి విముక్తిపొంది ఉన్నతమైన ఆధ్యాత్మికానందం కోసం పనిచేయటం. ఇలా భారతీయ విద్యావ్యవస్థ కేవలం మూసతరహా శిక్షణ కాకుండా వ్యక్తి మూర్తిమత్వవికాసం లక్ష్యంగా సాగినట్లుగా తెలుస్తున్నది.

### *1.1.1. విద్య : విభిన్న భావనలు:*

ప్రాచీన సాహిత్యంలో 'విద్య'కు సమానార్థకాలుగా నాలుగు పదాలు కనిపిస్తాయి. వేదమంత్రాలలో 'శిక్ష' అనే పదాన్ని 'అభ్యసించు, ఉచ్చరించు' అనే అర్థంలో వాడటం కనిపిస్తుంది. బ్రాహ్మణీయాలు, ఉపనిషత్తులు, సూత్రాలలో 'సమీపించు' అనే అర్థంలో 'అధ్యయన' పదం వాడుకలో ఉంది. శిష్యులు గురువువద్దకు విద్యకోసం వెళ్ళటం అనే అర్థంలో ఈ పదం ఉపయోగించారు. 'దగ్గరతీయు' అనే అర్థంలో 'ఉపనయన' క్రతువు నిర్వహించటం ఇలాంటిదే. ఇంకా ప్రాచీన సాహిత్యంలో 'వినయ' 'ఒక ప్రత్యేకమైన జీవనవిధానాన్ని అలవరచుకోవట'మనే అర్థంలో వాడినట్లుగా తెలుస్తుంది. మనిషిలోని అంతర్గతశక్తులను వెలికితీసి, వాటిని అభివృద్ధిపరచటం అనే అర్థంలో కాళిదాసు 'ప్రబోధ' వాడినట్లుగా తెలుస్తున్నది.

ప్రాచీన భారతంలో విద్య విభిన్నకాలాల్లో విభిన్నభావనలతో ప్రాచుర్యంపొందింది.

**వేదకాలం** :వేదకాలంలో విద్య లౌకిక జ్ఞానాన్ని,ప్రాపంచిక వాస్తవాలను తెల్పడంతో పాటుగా తపస్సు,యోగం ద్వారా సత్యాన్ని ఆవిష్కరించేదిగా విస్తృత అర్థాన్ని కలిగివుంది. అయితే ఈకాలంలో అధ్యయనం ఎక్కువగా మతపరమైన ఆలోచనలతో నిండివుంది. 'బ్రహ్మచర్యం' పేరుతో విద్యావిధానం కొనసాగింది.

దక్షసంహిత బోధనావిధానాన్ని గురించి ఇలా పేర్కొంటుంది. మొదటగా వేదాల ఔన్నత్యాన్ని గుర్తించటం. వేదాలపై చర్చ, అధ్యయనం, వేదపఠనం, చివరకు శిష్యులకు వేదాల్లో శిక్షణనివ్వటం. ఇది వేదాలకు చెందిన పంచసూత్ర అభ్యాసం. మతవిజ్ఞానానికి చెందిన వాస్తవాలను అధ్యయనం(పదాలను గ్రహించటం), శబ్దం(అర్థాన్ని గుర్తించటం), ఊహ(సాధారణీకరణకు దారితీసే తర్కం), సుహృత్ప్రాప్తి(ఉపాధ్యాయునిచే నిర్ధారణ), దానం(అన్వయం) అనే ఐదింటి సహాయంతో గ్రహించవచ్చు. ఈ ఐదు డ్యూయీ ప్రతిపాదించిన వానితో సరిపోల్తాయి. డ్యూయీ పేర్కొన్న అంశాలు. సమస్య, దాని ఉనికి (అధ్యయనం, శబ్దం), సూచించదగిన పరిష్కారాలు, వానిలో ఒక పరిష్కారంఎంపిక, చర్య (అన్వయం, దానం), శుశ్రూష (వినాలనే కోరిక), శ్రవణం (వినేక్రమం), గ్రహణం (స్వీకరించటం), ధారణం (గ్రహించినదానిని జీర్ణం చేసుకోవటం), ఊహాపోహ (చర్చ), అర్థవిజ్ఞానం (సరైన జ్ఞానాన్ని గ్రహించటం), తత్త్వవిజ్ఞానం (వాస్తవజ్ఞానం).

**ఉపనిషత్తులు** : తర్వాతికాలంలో వెలువడిన ఉపనిషత్తులు మానవ మౌలిక సమస్యలను ఆవిష్కరించేందుకు ప్రయత్నించటంతో విద్య ఈకాలంలో అత్యున్నత స్థాయిని పొందినట్లుగా భావించారు. ఈకాలంలోనే విద్య కేవలం జ్ఞానాన్నందించే సాధనంగా మాత్రమే కాకుండా వ్యక్తిగత జీవితావసరాలు తీర్చేదిగా కూడా గుర్తింపు పొందింది. విద్యను కేవలం లక్ష్యంగా కాకుండా

లక్ష్యాన్నిసాధించేందుకు అనుసరించదగిన మార్గంగా భావించారు. 'బ్రహ్మవర్చస్సు' అంటే అనంతమైన జ్ఞానాన్ని పొందటం లక్ష్యంగా పేర్కొన్నారు. ఈ విద్యా సాధనే 'స్వాధ్యాయ' గా పేరు పొందింది.

ఈ కాలంలో సమాజంలో వివిధకులాలు అనుసరిస్తున్న కులవృత్తుల ప్రాతిపదికగా విద్యాబోధన జరిగేది. అయితే నాటికి వృత్తుల ఆధారంగా కులాలమధ్య స్పష్టమైన విభజన జరిగినట్లుగాని, ఒక్కో వృత్తి ఒక్కో కులంగా రూపొందినట్లుగాని కన్పించదు. అందువల్లనే ఈ కాలంలో ఒకే కులంలో వేర్వేరు వృత్తులు నిర్వహించటం కనిపిస్తుంది. ఒక బ్రాహ్మణ కుటుంబంలో వివిధ వృత్తులు నిర్వహించటం ఋగ్వేదంలో ప్రస్తావించారు.

త్రయీవిద్యలు: కౌటిల్యుడు నాటి జ్ఞానాన్ని అన్వీక్షకీ, త్రయీ, వార్తా, దండనీతి అని నాలుగు భాగాలుగా విభజించాడు. కౌటిల్యుని అర్థశాస్త్రప్రకారం అన్వీక్షికి, త్రయి, వార్త, దండనీతి అనేవి విద్యలు. పదార్థాల స్వరూపాన్ని హేతువులచేత పరీక్షించేవిద్య అన్వీక్షికి (Philosophy). రుగ్యజు: సామవేదాలు 'త్రయి'. కృషి (వ్యవసాయం), పశుపాలన, వర్తకం వీటికి వార్త (Economics) అని పేరు. దణ్డనీతి అనగా రాజనీతి (Political Science)

అన్వీక్షకీ, త్రయీ, వార్తా, దణ్డనీతిశ్చేతి విద్యా: (కౌటిల్యుడు.1999:13)

కౌటిల్యుడు తనకుముందు విద్యలుగా ప్రచారంలో ఉన్నవానినికూడా తన రచనలో పేర్కొన్నాడు. త్రయి, వార్త, దండనీతి ఈ మూడే విద్యలు అని మానవ అర్థశాస్త్రాన్ని అనుసరించేవారి భావన (త్రయీ వార్తా దణ్డనీతి శ్చేతి మానవా: ; త్రయీ విశేషో హ్యన్వీక్షకీతి) అయితే వార్త, దండనీతి అనేవే విద్యలు అని బృహస్పతి రచించిన అర్థశాస్త్రాన్ని అనుసరించేవారి భావన (వార్తా దణ్డనీతిశ్చేతి బార్హస్పత్యా:, సంవరణ మాత్రం హి త్రయీ లోకయాత్రావిద ఇతి) కాగా దండనీతి ఒక్కటే విద్య అని ఔశానసుల (శుక్రాచార్యుడు రచించిన అర్థశాస్త్రం అనుసరించేవాళ్ళు) భావన (దణ్డనీతిరేకా విద్యేత్యౌశనసా:, తస్యాం హి సర్వవిద్యారమ్భా: ప్రతిబద్ధా ఇతి) (కౌటిల్యుడు.1999:13)

అయితే మొదట చెప్పిన నాలుగు విద్యలే విద్యలు అని కౌటిల్యుని అభిప్రాయం. మానవులు వాటి సాహాయంతో ధర్మార్థాలను తెలుసుకుంటారు కాబట్టి అవి 'విద్యలు' అని చెప్పబడుతున్నాయి. ఇక్కడ విద్య అంటే ఏదైనా ఒక విషయం తెలుసుకొనడానికి సాధనం అయినది అని అర్థం.

చతస్ర ఏవ విద్యా ఇతి కౌటిల్య:. తాభిర్ధర్మార్థౌ యద్ విద్యాత్ తత్ విద్యానాం విద్యాత్వమ్ (కౌటిల్యుడు.1999:13)

సామవేదం, ఋగ్వేదం, యజుర్వేదం అనే మూడువేదాలు 'త్రయి'. ఈ త్రయి అథర్వవేదము, ఇతిహాసవేదమూ-- ఇవన్నీ వేదాలు. శిక్ష(వర్ణాలను ఎలా ఉచ్చరించాలో చెప్పే శాస్త్రం), కల్పం (ఆయా యజ్ఞాలు చేసే విధానాన్ని బోధించే శాస్త్రం), వ్యాకరణం, నిరుక్తం (పదాల నిర్వచనాన్ని చెప్పే శాస్త్రం), ఛంద: శాస్త్రం, జ్యోతిషం-- ఈ ఆరు వేదాంగాలు. (సామర్గ్యజుర్వేదా: త్రయ: త్రయీ, అథర్వవేదేతిహాస వేదౌచవేదా:. శిక్షా, కల్పో, వ్యాకరణమ్, నిరుక్తమ్, ఛన్దోవిచితి:, జ్యోతిషమితి చా జ్గాని) (కౌటిల్యుడు.1999:15)

దర్శనాలు:

సాంఖ్యయోగాలు భారతదేశంలో అతి ప్రాచీనకాలంనుంచీ ప్రచారంలో ఉన్న దర్శనాలు.

ఒకదానితో ఒకటి దగ్గర సంబంధం ఉన్నవి. ఆత్మ స్వరూపాదులను బోధిస్తాయి.

సాంఖ్యమ్, యోగః, లోకాయతం చేత్యాన్వీక్షికీ. ధర్మాధర్మౌత్రయ్యామ్. అర్థానర్థౌ వార్తాయామ్. నయాపన యౌ దణ్డనీత్యామ్. బలాబలే చైతాసాం హేతు భిరన్వీక్షమానా అన్వీక్షికీ లోకస్యోపకరోతి, వ్యసనే2భ్యుదయేచబుద్ధి మవస్థాపయతి; ప్రజ్ఞావాక్య క్రియా వైశారద్యంచ కరోతి. (కౌటిల్యుడు.1999:14)

సాంఖ్యం, యోగం, లోకాయతం, అన్వీక్షికి, త్రయియందు (వేదత్రయంలో) ధర్మాధర్మాలు, వార్తలో అర్థానర్థాలు (లాభనష్టాలు) చర్చించబడతాయి. దండనీతిలో నీతిమార్గం, అవినీతిమార్గం చర్చించబడతాయి. హేతువులచేత ఈ విద్యలలో బలాబలాలను పరీక్షించి అన్వీక్షికి లోకాలకు ఉపకారం చేస్తుంది. వ్యసన సమయంలో అయినా, అభివృద్ధి సమయంలో అయినా బుద్ధిని నిలకడగా ఉండేటట్లు చేస్తుంది. ప్రజ్ఞా వైశారద్యాన్ని, అనగా బుద్ధిలో, ఆలోచనలలో సామర్థ్యాన్ని కలిగిస్తుంది.

ఈ అన్వీక్షికి ఎల్లప్పుడూ అన్ని విద్యలకీ దీపం అనీ, అన్ని కర్మలకీ ఉపాయం అనీ, సకల ధర్మాలకీ ఆశ్రయం అనీ పెద్దలు చెపుతారు. వ్యవసాయం, పశువులపాలనం, వర్తకం ఈ మూడింటికీ 'వార్త' అనిపేరు. అన్వీక్షికి, త్రయి, వార్త వీటి యోగక్షేమాలకి సాధనమైనది దండం. అనగా దండ భయం ఉంటేనే లోకంలో జనులు పై విషయాలమీద తగిన శ్రద్ధచూపుతారు. ఆ దండాన్నిగూర్చి చెప్పేది, లేదా ఆ దండం ప్రయోగించే విధానం "దండనీతి".

తస్మాద్దణ్డమూలాస్తిస్రో విద్యాః వినయమూలో దణ్డః ప్రాణ భృతాం యోగక్షేమావహః (కౌటిల్యుడు.1999: 20)

అందువలన అన్వీక్షకి, త్రయి, వార్త అనే మూడు విద్యలు దండం (దండనీతి) మీద ఆధారపడి ఉంటాయి. వినయంమీద అనగా శాస్త్రజ్ఞానంమీద ఆధారపడిన, శాస్త్రజ్ఞానంతో కూడిన దండం మానవులకు యోగక్షేమాలను ఇస్తుంది.

కృతకః స్వాభావికశ్చ వినయః . క్రియా హి ద్రవ్యం వినయతి నా ద్రవ్యమ్. శుశ్రూషా శ్రవణ గ్రహణ ధారణ విజ్ఞానోహాపోహ తత్త్వాభినివిష్ట బుద్ధిం విద్యా వినయతి, నేతరమ్. (కౌటిల్యుడు.1999: 20)

కృత్రిమమూ (ప్రయత్నంచేసి సంపాదించినది), స్వాభావికమూ (సహజంగా అప్రయత్నంగా వచ్చినది) అని వినయం రెండువిధాలు. క్రియ (శాస్త్రాభ్యాసాదికం) ద్రవ్యాన్ని (యోగ్యత ఉన్న వ్యక్తిని) సంస్కరిస్తుంది కాని అద్రవ్యాన్ని (ఏమాత్రమూ యోగ్యత లేనివానిని) సంస్కరించదు. శుశ్రూష (వినాలనే కోరిక), వినడం, గ్రహించడం, ధారణం (మరచిపోకుండా ఉండడం), విజ్ఞానం (ధరించిన విషయాలలో ఏది సాధ్యము, ఏది అసాధ్యము అనే జ్ఞానం), ఊహ (మాటలలో చెప్పనిదానిని అనుమాన ప్రమాణాదులచే తెలుసుకొనడం), అపోహ (యుక్తి విరుద్ధమైనదానిని విడిచివేయడం), యదార్థాన్ని తెలుసుకొనాలనే పట్టుదల -- ఇవి ఉన్నవానికే విద్య వినయాన్ని సంపాదిస్తుంది కాని ఇవి లేనివానికి ఉపయోగించదు.

విద్యానాంతు యధాస్వమ్ ఆచార్య ప్రామాణ్యాద్ వినయః నియమశ్చ. (కౌటిల్యుడు.1999: 20)

విద్యల విషయంలో ఆయా విద్యల స్వరూపాన్ని పట్టి, ఆచార్యుని ప్రామాణ్యాన్నిపట్టి వినయమూ (Training), నియమమూ ఉంటాయి.

పగటి మొదటి భాగంలో ఏనుగులను, గుర్రాలను, రథాలను నడపడంలోను, ఆయుధవిద్య

యందూ శిక్షణపొందాలి. చివరిభాగంలో ఇతిహాసాలు వినడంలో శిక్షణపొందాలి. పురాణమూ (బ్రహ్మపురాణాదికం), ఇతివృత్తం (రామాయణ భారతాదికం), ఆఖ్యాయిక (దివ్యపురుషుల చరిత్ర, మనుషుల చరిత్ర మొ), ఉదాహరణం (తంత్రాఖ్యాయిక-- పంచతంత్రం మొదలైనవి), ధర్మశాస్త్రం, అర్థశాస్త్రం ఇవన్నీ 'ఇతిహాసం'. మిగిలిన పగటిభాగాన్ని (మధ్యభాగాన్ని), అవకాశం లభించిన రాత్రిభాగాన్ని పూర్తిగా కొత్త విషయాలు తెలుసుకొనడానికీ, తెలిసినదానిని గట్టిపరచుకొనడానికి (గృహీత పరిచయానికి), బాగా తెలియనివాటికి గూర్చి మాటిమాటికీ వినడానికీ వినియోగించాలి.

వివిధ శాస్త్రాల అధ్యయనంవల్ల ప్రజ్ఞ (మూడుకాలాలకీ సంబంధించిన విషయాల జ్ఞానం) కలుగుతుంది. ప్రజ్ఞవల్ల యోగం (శాస్త్రంలో చెప్పిన విషయాల అనుష్ఠానంలో శ్రద్ధ -- Practical application) కలుగుతుంది. యోగంవల్ల ఆత్మవత్త (ఆత్మవిశ్వాసం, ఆత్మనిగ్రహం -- Self possession) కలుగుతుంది. ఇదే విద్యలవల్ల కలిగే సామర్థ్యం.

**వేదాంగాలు** : వీని ప్రకారం ప్రాచీన సంప్రదాయాలను ఉపాధ్యాయుని నుంచి విద్యార్థి గ్రహించటం, పవిత్ర గ్రంథాలను మననంచేయటం విద్యగా గుర్తింపు పొందింది. వేదాధ్యయనానికి, అవగాహనకు, అన్వయానికి ఉద్దేశించినవి వేదాంగాలు. అవి శిక్ష (ధ్వని విజ్ఞానం), ఛాందస్ (ఛందోజ్ఞానం), వ్యాకరణ (వ్యాకరణం), నిరుక్త (పదవిజ్ఞానం), జ్యోతిష (జ్యోతిష్యం), కల్ప (మత కర్మకాండ). మొదటి రెండు వేదపఠనానికి, తర్వాతి రెండు వేదాల అవగాహనకు, చివరి రెండు వాని అన్వయానికి ఉద్దేశించినవి. అలా క్రతుకర్మకాండల్లో ప్రాచీన భారతీయ విద్యావిధానం మూలాలు దొరకుతాయి.

ఈ కాలంలో ఐదేళ్ళవయసులో కుటుంబప్రభావం నుంచి శిశువును తప్పించి స్వావలంబన దిశగా శిశువుకు శిక్షణ ప్రారంభించేవారు. ఏడు/ఎనిమిది సంవత్సరాలకు ఆధ్యాత్మిక గురువుద్వారా పవిత్ర సాంప్రదాయాల్లో శిక్షణ మొదలౌతుంది. తండ్రివృత్తినే శిశువు స్వీకరించే వ్యవస్థ కనుక, శిశువు తను చేపట్టబోయే వృత్తిలో ప్రత్యక్షంగా పాల్గొంటూ తనకవసరమైన శిక్షణపొందే అవకాశం ఉంది. అందువల్ల సూత్రాలలోకూడా విద్యలో వివిధ స్థాయిల్లోని పాఠ్యప్రణాళికలనుగురించి పేర్కొనలేదు. అయితే పరోక్షంగా మాత్రం కొన్ని ఆధారాలు లభిస్తాయి. న్యాయ, తర్కశాస్త్రాల అధ్యయనానికి వ్యాకరణ, సాహిత్య, నిఘంటు తదితర అంశాలలో అవగాహన అవసరం. వేదాంతానికి వేదమంత్రాలు, వేదాంగాలపరిజ్ఞానం, క్రమానుగత మత శిక్షణ అవసరం. మత కర్మకాండల నిర్వహణపైన హక్కుకలిగినవారే మీమాంసను అధ్యయనం చేయాల్సిఉంటుంది. అలా వివిధ శాస్త్రాలు వివిధ పూర్వజ్ఞానాన్ని అర్హతగా పేర్కొన్నాయి. వీటన్నింటిలో ఉత్తమమైనది వేదాంత. సంస్కృత భాషాపరిజ్ఞానంగల విద్యార్థికి సాంఖ్య, న్యాయ, వైశేషికాల అధ్యయనానికి అర్హతుంటుంది. ప్రాథమిక, ఉన్నత విద్యల అధ్యయనానికి ఎటువంటి కఠిన నిబంధనలు ఆనాడు అనుసరణలో లేవు. విద్యార్థి అర్హతలు, పరిజ్ఞానానికి సంబంధించిన అంశాలలో ఉపాధ్యాయునికే సర్వాధికారాలు ఉండేవి.

**సూత్రములు** : ఇవి పూర్వపు విద్యావిధానాన్నే కొనసాగించాయి. మనువు ప్రకారం విద్యార్థి 4వ వంతు తన ఆచార్యుని నుండి, తన స్వీయ ప్రతిభద్వారా 4వ వంతు, సహచరులనుంచి 4వ వంతు, మిగిలింది తర్వాతికాలంలో అనుభవంద్వారా అభ్యసిస్తాడు. ఈ కాలంలో మానవుని మూర్తిమత్వ వికాసమే విద్య పరమావధిగా గుర్తింపు పొందింది. కేవలం పఠనంతో అధ్యయనం పూర్తికాదని, ఆచరణ ప్రాధాన్యతను గుర్తించారు.

వ్యక్తిత్వ వికాసం లేని మేధోవికాసం, ఆచరణలేని వేదాధ్యయనం విద్య ప్రాథమికలక్ష్యాలనే

దెబ్బ తీస్తాయని గుర్తించారు. అందుకే కేవలం మేధస్సుమాత్రమేకాకుండా బాలుని సంపూర్ణ మూర్తిమత్వ వికాసం ప్రాచీన విద్యావిధాన లక్ష్యంగా పేర్కొన్నారు.

**యాస్కుడు :** కేవలం వేదాలను పఠించగలిగి వానిని అర్థంచేసుకోలేని వ్యక్తి అజ్ఞానే అన్నది యాస్కుని భావన. యాస్కుని ప్రకారం ఈకాలంలో స్త్రీకి విద్య నిరాకరింపబడలేదు. వేదాలను అధ్యయనం చేసిన స్త్రీని 'బ్రహ్మవాదిని' గాపేర్కొన్నారు.

**తత్త్వవిద్య :** భారతీయ ఆలోచనావిధానంలో తత్త్వం విద్యలో భాగమైంది. (1) కపిలుని 'సాంఖ్యము' (2) పతంజలి 'యోగము' (3) గౌతముని 'న్యాయం' (4) కనాదుని 'వైశేషికం' (5) జైమిని 'కర్మ/పూర్వమీమాంస' (6) బాదరాయణుని 'వేదాంతం/ఉత్తర మీమాంస'--అనే ఆరు తాత్త్వికపద్ధతులను విద్యగా గుర్తించారు.

**యోగవిద్య :** ఈ కాలంలోనే యోగవిద్యకు ప్రాధాన్యత వచ్చింది. జ్ఞానంద్వారా అజ్ఞానాన్ని తొలగించవచ్చు. ధ్యానం ద్వారానే అటువంటి జ్ఞానం లభిస్తుంది. అటువంటి అధ్యయనానికి 'యోగ' నిర్దిష్టమైన మార్గం అని పేర్కొన్నారు.

వేదానంతరకాలంలో పతంజలిసూత్రాల ఆధారంగా యోగా ఒక సాధారణ బోధనాంశంగా రూపొందింది. యోగాలో ఎనిమిది అభ్యాసాలున్నాయి. (1) యమ (ఇతరులకు హాని కలిగించక పోవటం, నిజాయితీ, నిరాడంబరత, పేదరకం వంటి అంశాల్లో క్రమశిక్షణ కలిగిఉండటం. (2) నియమ (స్వచ్ఛత, నిబద్ధత, ఆత్మసంయమనం, అధ్యయనం) (3) ఆసనం (4) ప్రాణాయామం (5) ప్రత్యాహార (6) ధారణ (7) ధ్యానం (8) సమాధి.

నాటి విద్యావిధానంలో అనుమానాలనివృత్తికి, వాదనలకు, చర్చలకి అవకాశం ఉండేది. విభిన్న అభిప్రాయాలకు, ఆలోచనలకు స్థానం కల్పించి వాదోపవాదాలు, చర్చలద్వారా పరిష్కారాలను కనుగొనటం నాటి విధానంలో ప్రధానాంశం. వాస్తవ జ్ఞానాన్ని ఆవిష్కరించటమే విద్య ప్రధాన లక్ష్యంగా ఉంది.

**పురాణకాలంలో విద్య:** పురాణాలలో సైనికశిక్షణను గూర్చినచర్చ ఎక్కువ. రామాయణంలో రాజు అధ్యయనంచేయాల్సిన విద్యలగురించి పేర్కొన్నారు. అవి ధనుర్వేదం, నీతిశాస్త్రం, ఆలేఖ్యం (చిత్రకళ), లేఖ్యం (లేఖనం), లంఘనం (దుమకటం), ప్లవనం (ఈత), లేఖ్య--సాంఖ్య (లేఖన, సంఖ్యాశాస్త్రం), గాంధర్వవిద్య (లలితకళలు), న్యాయం (తర్కం), నీతిశాస్త్రం (రాజనీతి). పారిశ్రామిక, సాంకేతిక విద్యకు సంబంధించిన ఆధారాలు స్వల్పంగానే లభిస్తాయి. ఆయుర్వేదం అన్నికులాలకు అధ్యయనాంశంగా ఉంది. మానసిక, నైతిక అభివృద్ధికి ఉద్దేశించిన సహజప్రక్రియగా విద్యను ప్రాచీనులు గుర్తించారు. కృత్రిమ పద్ధతులద్వారా ఇది సాధ్యపడదని వారు గ్రహించారు.

**బౌద్ధవిద్య:** బౌద్ధవిద్య పూర్తిగా ఆరామాలు కేంద్రంగా సాగింది. వేదవిద్య క్రతువులు ప్రధానంగా సాగింది. అయితే వేద విద్యావిధానంలో మాదిరిగానే బౌద్ధ విద్యావిధానంలో కూడా వాదనలు, చర్చలు ప్రధానంగా కనిపిస్తాయి. బౌద్ధ విద్యావిధానంలో నీతివిద్య అదనంగా చోటుచేసుకుంది. దేశీయవిద్యావిధానం గృహ కేంద్రంగా సాగితే, బౌద్ధ విద్యావిధానంలో గృహస్థానాన్ని ఆరామం పొందింది. గృహ అనుబంధాలను విచ్ఛిన్నం చేయటంద్వారానే బౌద్ధ విద్యావిధానం ప్రారంభంకావటం గమనార్హం. వైద్య, శస్త్ర చికిత్సలకు బౌద్ధం అధికప్రాధాన్యం ఇచ్చింది. వైద్యవిద్య 7సవత్సరాల కోర్సుగా వుంది. మూడు వేదాలు, 18 సిప్పలు/కళలు ఇక్కడ అధ్యయన అంశాలు. వేదవిద్యను సాహితీవిద్యగా, కళలకు సంబంధించిన విద్యను శాస్త్ర, సాంకేతిక

విద్యగా పరిగణించాలి. బౌద్ధం విద్యను ప్రయోగాత్మకం చేసింది. వైద్యవిద్యలో మొక్కల జీవితాన్ని ప్రత్యక్షంగా అధ్యయనం చేయటం ఇందుకు నిదర్శనం.

**క్రీ॥శ॥5వశ॥లో విద్య : ఫాహియాన్ :** ఈ నాటికి కూడా మౌఖిక బోధన కొనసాగుతున్నది. ఫాహియాన్ పేర్కొన్నట్లుగా విద్యావ్యవస్థ ప్రాచీనకాలంనుంచే భారతదేశంలో ఉన్నా ఇందుకు సంబంధించిన సమాచారంమాత్రం లభ్యంకాలేదు.

**క్రీ॥శ॥7వశ॥లో విద్య : హ్యుయాన్‌సాంగ్ :** ఈ కాలంలో హ్యుయాన్‌సాంగ్ సెంట్రల్ ఆసియా, భారతదేశాల్లో 16సం॥పాటు పర్యటించాడు. నాలుగువేదాల అధ్యయనం భారతీయ విద్యావిధానంలో భాగంగా హ్యుయాన్‌సాంగ్ పేర్కొన్నాడు. అవి యజుర్వేదం, ఆయుర్వేదం, సామవేదం, అధర్వణవేదం అని పేర్కొనటాన్నిబట్టి హ్యుయాన్‌సాంగ్‌కు వీటిపట్ల సరైన అవగాహన ఉన్నట్లుగా అనిపించదు. ఈ కాలంలో బోధన మౌఖికంగానే సాగింది.

నాటి విద్యావిధానంలో విద్యార్థి ముందుగా 'సిద్ధం' అనే కార్యక్రమంలో పాల్గొనాలి. ఇందులో సంస్కృత అక్షరాలు, అచ్చులు, హల్లుల సంకలనం 12 అధ్యాయాలుగా నేర్పుతారు. సిద్ధంలో నైపుణ్యం పొందిన తరువాత 7 సం॥ వయసులో ప్రముఖ శాస్త్రాలుగా పేరుపొందిన ఐదు శాస్త్రాల (వ్యాకరణం, శిల్పస్థానవిద్య, చికిత్సావిద్య, హేతువిద్య, అధ్యాత్మవిద్య) అధ్యయనం ప్రారంభించవచ్చు. వీనితోపాటుగా తాత్వికమైన, ప్రయోగాత్మకమైన, లౌకికమైన, మతపరమైన అంశాల అధ్యయనంతో ప్రాథమికవిద్య పూర్తవుతుంది. ఉన్నతవిద్యలో శాస్త్ర అధ్యయనంతో పాటు వాటి ప్రయోగ అధ్యయనం కూడా ఉంటుంది. అభ్యసనవిధానంలో ప్రాచీన భారతీయ విధానాలైన శాస్త్రపఠనం, వాటి అర్థాన్ని అవగాహన చేసుకోవటం ఇంకా ఆచరణలో వుంది. అయితే బౌద్ధ ఆరామాలలోని విద్యావిధానం వ్యక్తిత్వవికాసానికి, వాదనాపటిమను పెంచేందుకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చింది.

### *1.1.2. ప్రాచీన అధ్యయనవిధానం :*

ఈ విధానంలో జ్ఞానార్జనకోసం అనుసరించే సాంప్రదాయక విధానాలు రెండున్నాయి. వానిలో పదేపదే జ్ఞప్తికితెచ్చుకొనటం ద్వారా మేధను విస్తృత పరచుకోటం మొదటిది. అక్షరాలద్వారా ఆలోచనల్లో పరిణతి సాధించటం రెండవది. 6సం॥ల వయసులో విద్య ప్రారంభమవుతుంది. మొదటి అధ్యయనం 'సిద్ధిరస్తు' లో 49 అక్షరాలు, 300 శ్లోకాలలో కూర్చిన 1000 పదాలుంటాయి. విద్యార్థి 8సం॥ ల వయసులో మొదలుపెట్టి 8నెలల కాలంలో పూర్తిచేయాల్సిన రెండవ గ్రంథం పాణిని 'సూత్రం'. తర్వాత ధాతువులపై గ్రంథాన్ని అధ్యయనంచేయాలి. అనంతరం 10సం॥ ల వయసులో మొదలుపెట్టి 3సం॥ల కాలంలో మూడుఖిలాలు పూర్తి చేయాలి. ఆ తర్వాత పద్య, గద్య రచన అభ్యసిస్తూ తర్కం (హేతువిద్య), అధిభౌతికం (అభిధర్మకోశం) అధ్యయనం చేయాలి.

(1) శబ్దవిద్య (వ్యాకరణం, నిఘంటునిర్మాణం) (2) శిల్పస్థానవిద్య (కళలు) (3) చికిత్సవిద్య (వైద్యం) (4) హేతువిద్య (తర్కం) (5) అధ్యాత్మవిద్య (విశ్వాత్మ గురించిన శాస్త్రం-తత్త్వశాస్త్రం)- ల అధ్యయనం ద్వారా సాధారణవిద్య పూర్తవుతుంది. తర్వాత ప్రత్యేకాంశాల అధ్యయనం ప్రారంభమౌతుంది.

ఉన్నతవిద్య వ్యాకరణానికి, మతానికి సంబంధించి రెండురకాలుగా వుంటుంది. ఆరామాలలో విద్య మేధాపరంగాను, నైతికంగాను వ్యక్తి అభివృద్ధి లక్ష్యం గలదిగా ఉంటుంది. భారతీయ

విద్యావిధానం మొత్తం గురు, శిష్య అనుబంధం ఆధారంగా సాగటం గమనార్హం.

మతం ప్రధానలక్షణంగా కలిగింది కావటంచేత 'నలందా' లో విద్య అధికంగా క్రతువులు, మతాచారాలతో నిండివుంది. ఇద్దరు ఉపాధ్యాయులు ఒకక్లిష్టమైన అంశంపై వాదోపవాదాలు జరపటంతో ప్రారంభమయ్యే అధ్యయనంలో విద్యార్థులు తమ అభిప్రాయాలు వ్యక్తచేస్తూ అనుమానాలు నివృత్తి చేసికొని జ్ఞానాన్ని పొందే అవకాశం వుండేది.

విద్య : లౌకిక దృక్పథం:

బ్రాహ్మణఆధిపత్యంనుంచి తప్పించి విద్యను అన్నికులాల వారికీ అందించేప్రయత్నం బౌద్ధం చేసింది. బౌద్ధ ఆరామాలు లౌకికదృక్పథంగల ప్రాథమికవిద్యను అందించాయి. ఆరామ పాఠశాలల్లోని బోధనాంశాలనుగురించి చైనాయాత్రికులు కొంతమేరకు సమాచారాన్నందించారు. అక్షరమాల, పన్నెండు అధ్యాయాల పుస్తకం సిద్ధిరస్తుల అధ్యయనంతో పిల్లలు విద్యాభ్యాసం ప్రారంభిస్తారని హుయాన్‌సాంగ్ పేర్కొన్నాడు. అనంతరం పంచవిద్యల అధ్యయనం ప్రారంభ మౌతుంది. అవి శబ్దవిద్య (వ్యాకరణం), శిల్పస్థానవిద్య (వృత్తులు,కళలు), చికిత్సావిద్య(వైద్యం), హేతువిద్య (తర్కం), ఆధ్యాత్మవిద్య (తత్త్వం)లు.

భారతదేశంలో సాధారణవిద్యగా పేర్కొనే వ్యాకరణంలో ఐదు విభాగాలున్నాయి. అవి (అ) 'సిద్ధిరస్తు' అధ్యయనంలో మొదటి భాగం. ఇందులో 49 అక్షరాలుంటాయి. అవి ఒకదానితో ఒకటి జతపడి 18 భాగాల్లో అమరి ఉంటాయి. మొత్తం పదివేలకుమించిన పదాలు, 300కు మించిన శ్లోకాలు ఇందులో ఉన్నాయి. ఆరు సంవత్సరాల వయస్సులో పిల్లలు దీని అధ్యయనం ప్రారంభించి ఆరునెలల్లో పూర్తిచేస్తారు. ఇది మహేశ్వరదేవుడు ప్రవచించినట్లుగా చెప్తారు. (ఆ) 'సూత్రా' అధ్యయనంలో రెండవభాగం. వ్యాకరణశాస్త్రాలన్నింటికీ 'సూత్ర' మూలం. ఇందులో వేయి శ్లోకాలు, పాణినిసూత్రాలు ఉన్నాయి. పిల్లలు ఎనిమిది సంవత్సరాల వయస్సులో 'సూత్ర' అధ్యయనం ప్రారంభించి ఎనిమిదినెలల కాలంలో పూర్తిచేస్తారు. (ఇ) మూడవ అంశం 'ధాతు'. ఇందులో కేవలం వ్యాకరణ నియమాలకు చెందిన వేయి శ్లోకాలు ఉన్నాయి. (ఈ) మూడు ఖిలలకుద్దేశించిన రచన నాల్గవది. అవి వేయిశ్లోకాలతోనిండిన అష్టధాతు, వేయిశ్లోకాలుగల వెంచ్, వేయిశ్లోకాలుగల ఉనాది. (ఉ) 'వృత్తిసూత్ర' చివరిది. పాణిని సూత్రాలకు వ్యాఖ్యానం ఇది. పాణిని సూత్రాలనుగురించిన పూర్తి వివరణలు ఇందులో 18000ల శ్లోకాల్లో పేర్కొన్నారు. 15సంవత్సరాల వయసులో దీని అధ్యయనం ప్రారంభించి ఐదుసంవత్సరాల కాలంలో పూర్తిచేస్తారు.

### *1.1.3.* ప్రాచీన బోధనావిధానం:

ఉపాధ్యాయునితో స్వేచ్ఛాపూరిత వాతావరణంలో చర్చలు, ప్రశ్నోత్తరాలు, నిర్మాణాత్మక ఉదాహరణలు, నిజజీవితానికిచెందిన దృష్టాంతాలు వంటివి ప్రాచీన బోధనలో ప్రధానంగా కనిపించే విధానాలు. మహాభారతంలో ప్రత్యేకించి శాంతి, అనుశాసన పర్వాల్లో ప్రశ్నోత్తరాలద్వారా బోధనావిధానం ఎలాఉంటుందో తెలుస్తుంది. మనువు భావనలో

"ఆచాయాత్ పాదమాదత్తే పాదం శిష్య స్వమేధయా

పాదమ్ సబ్రహ్మచారిభ్యా పాదం కాలక్రమేణతు"

జ్ఞానంలో నాలుగోవంతు ఉపాధ్యాయునినుంచి, నాలుగోవంతు స్వయంగాను, నాలుగోవంతు సహాధ్యాయుల నుండి, నాలుగోవంతు జీవితానుభవంద్వారాను పొందుతాడు. భవిష్యత్ సందేహాలను

అవగాహనచేసుకునేందుకు వీలుగా విద్యార్థి అధ్యయనంచేసిన అంశాలను మననం చేయటం గురించి మనువు పేర్కొన్నారు. ప్రాథమిక బోధనలో కేవలం సూచనలు మాత్రం ఇచ్చి విద్యార్థులచే పరిష్కరింపచేయటం ఉపాధ్యాయుని విధి.

వేదాల బోధన పూర్తిగా మౌఖికం. ఆనాడు లిపి అందుబాటులో లేకపోవటం ఇందుకు కారణంగా చెప్పుకోవచ్చు. అయితే ఈ మౌఖికబోధన కొన్ని హేతుబద్ధమైన నియమాలమీద ఆధారపడినట్లుగా తెలుస్తుంది. ఋషులు మంత్రాలను స్వరసహితంగా ఉచ్ఛరించటం అధ్యయనంచేసి ఉంటారుకాబట్టి వారినుంచి మౌఖికంగా అధ్యయనం చేయటం అవసరమన్నది నాటిభావన. జ్ఞాపకశక్తికి సంబంధించిన అధ్యయనం క్రతువుల నిర్వహణకు, పాఠశాల సమావేశాలకు తోడ్పడుతుంది. పదాల పునరుచ్చారణకు సంబంధించిన అనేక నియమాలు ప్రాతిశాఖ్యాలలో పేర్కొన్నారు. ఇలాంటి మౌఖికశిక్షణ ఆధునిక పాశ్చాత్యవిద్యావేత్తలుకూడా ప్రవచించటం విశేషం. 17వశతాబ్దపు ప్రముఖ ఫ్రెంచి విద్యావేత్తలు మానసికశక్తులను అభివృద్ధిపరిచేందుకు వీలుగా సంభాషణానైపుణ్యాలకు ప్రాధాన్యతనిస్తూ పుస్తకాలను వీలైనంతమేరకు తొలగించటం అవసరమని భావించారు. ప్రాథమికవిద్యకు సంబంధించినంతవరకు పెస్టాలజీ, ఫ్రోబెల్‌లు ఈ అంశానికి మరింత ప్రాధాన్యతనిచ్చారు. విద్యలో ఏస్థాయిలోకూడా పుస్తకాలు అవసరంలేదన్నది రూసోభావన. ఈ ఆలోచనలు పరిగణనలోకి తీసుకుంటే మౌఖికబోధన విద్యార్థి అవగాహనాసామర్థ్యానికి పదునుపెట్టే సాధనంగా గుర్తించవచ్చు.

సరైన శ్రద్ధాసక్తులతో చేసిన అధ్యయనం నైపుణ్యాన్ని పెంపొందించటమే కాక మానసిక సామర్థ్యాన్ని పెంచుతుంది. అలాంటప్పుడే ఇతరరంగాల్లో కూడా ఈ సామర్థ్యాన్ని ఉపయోగించేందుకు వీలౌతుంది. ప్రాచీన విద్యావేత్తలు ఈ అంశాన్ని గుర్తించి జ్ఞాపకశక్తికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. పదేపదే వల్లెవేయటం ఈ జ్ఞాపకశక్తికి ఆధారం.

వేదాలను దోషరహితంగా అధ్యయనంచేసి వల్లెవేయగల సామర్థ్యంపైనే విద్యార్థి ప్రతిభను అంచనావేసేవారు. అధ్యయనానికి పునశ్చరణ ఆధారమన్నది కాళిదాసు భావన. అయితే మనస్ఫూర్తిగా అభ్యసించేవారు, రచించేవారు, పరిశీలన చేసేవారు, ప్రశ్నలద్వారా తమ సందేహాలు నివృత్తి చేసుకునేవారు సూర్యకాంతితో కలువ విచ్చుకున్న చందంగా వికసిస్తారని సుభాషితంలో పేర్కొన్నారు. అలా వ్యక్తిత్వవికాసానికి మననం, పరిశీలన, ప్రశ్నించేస్వభావం దోహదకారులని నాటి విద్యావేత్తలు గ్రహించారు.

అధికభాగం ఉపాధ్యాయుని నిర్ణయానికే వదిలివేసినా సాధారణంగా సూక్ష్మంనుంచి సంక్లిష్టానికి, తెలిసినదాన్నుంచి తెలియనిదానికి, మూర్తంనుంచి అమూర్తానికి బోధనసాగాలనే ఆధునిక నియమాలను నాడుకూడా పాటించేవారు. నాటి పాఠశాలల్లోని విద్యాబోధన విద్యార్థుల మనోవికాసానికి అనుగుణమైనదిగా ఉన్నట్లు హుయాన్‌సాంగ్ పేర్కొన్నారు. మందకొడితనానికి అలవాటుపడిన విద్యార్థులకు పట్టుదలగా బోధించే స్వభావం నాటి గురువులకున్నట్లుగా తెలుస్తున్నది.

పంచతంత్ర, హితోపదేశ వంటి కథలు నైతికవిలువల బోధనలో ప్రముఖపాత్ర వహిస్తాయి. ఇలాంటి బోధనాపద్ధతిని ఉపయోగించి నాటి గురువులు బోధనలో శ్రమతోకూడిన బట్టీ పద్ధతిలోని విసుగును తగ్గించేప్రయత్నం చేసారు. ఈ విషయంలో ఫ్రోబెల్ "విద్యార్థులకు ప్రకృతినిగూర్చి తెలుసుకోవాలన్న ఉత్సాహం, తమజీవితాన్ని తమకు తెలిసిన వాటితోకాకుండా తెలియని వాటితో పోల్చి చూసుకోవాలన్న కోరిక బలంగా ఉంటుంది. దానికి అనుగుణంగా బోధన ఉంటే అది మరింత

ఉత్సాహకరంగా ఉంటుంది" అంటారు.

ఉపన్యాసపద్ధతి ప్రాచీన విద్యావిధానంలో అమల్లో ఉన్న మరొక బోధనాపద్ధతి. అయితే ఈ పద్ధతిని ఆదర్శవంతమైందిగా చెప్పలేము. అనేకమంది విద్యార్థులున్న తరగతిలో చేసే ఉపన్యాసం శ్రద్ధచూపని విద్యార్థులకు ఉత్సాహపూరితంగా ఉండదు. ఈ పద్ధతిలో కేవలం ఉపన్యాసకుడు మాత్రమే పాల్గొంటారు. అయితే సందేహనివృత్తి కోసం విద్యార్థులు ఉపాధ్యాయుని కలుసుకొంటుంటారు. ఇందువల్ల ఉపాధ్యాయునికి విద్యార్థుల సామర్థ్యాలను అంచనావేసేందుకు, వారిని ప్రోత్సహించేందుకు వీలుంటుంది. ప్రతివిద్యార్థి తన ప్రతిభకు అనుగుణమైన శిక్షణను పొందేందుకు అవకాశం ఉంటుంది. విద్యార్థి తన ప్రతిభకనుగుణంగానే తరువాత తరగతిలోకి ప్రవేశం పొందే వీలుంటుంది. మందబుద్ధులకోసం ప్రతిభావంతుని అదేతరగతిలో ఉంచటంకాని, ప్రతిభావంతులకోసం మందబుద్ధిని ఉత్తీర్ణుని చేయటంకాని ఉండదు. అందువల్ల విద్యార్థుల కాలం, శక్తి వృధా అయ్యేందుకు అవకాశంలేదు. ఆధునిక విద్యావేత్తలమాదిరిగానే ప్రాచీన భారతీయ తత్త్వవేత్తలు విద్యార్థి శక్తి, సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకున్నట్లుగా దీన్నిబట్టి తెలుస్తుంది. మందబుద్ధులకు ఉత్సాహమున్న రంగాలలో నైపుణ్యాన్ని పెంపొందించే వైఖరి ఈ విద్యావిధానంలో మనకు గోచరిస్తుంది. ఇందుకు సంబంధించిన అనేక కథాప్రణాళికలు హితోపదేశ, పంచతంత్రాలలో మనకు కనిపిస్తాయి. దీన్నిబట్టి ఆనాటినుంచే బోధనలో మనకు ప్రాజెక్టుపద్ధతి ఉన్నట్లు గ్రహించవచ్చు.

మానిటరింగ్ పద్ధతి కూడా భారతదేశంలో విద్యావిధానంలో ప్రాచుర్యంలో ఉంది. దాదాపు 500లకు మించిన విద్యార్థులకు బోధన, నిర్వహణ ఒక ఉపాధ్యాయునికి సులభసాధ్యం కాదు. అందువల్ల గురువు కొందరు తెలివిగల విద్యార్థులను తన సహాయక ఉపాధ్యాయులుగా నియమిస్తారు. తను లేనిసమయంలో శిష్యులలో పెద్దవారికి తన బాధ్యతలను అప్పగించటం కూడా ఈ విధానంలో భాగమే. ఈ మానిటోరియల్ పద్ధతిలో అనుకూలాంశాలనేకం ఉన్నాయి. బోధించే విద్యార్థులకి బోధనలో శిక్షణలభించే అవకాశం కలుగుతుంది. ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది. నాయకులుగా రూపొందగల విద్యార్థులను గుర్తించి, వారికి తగిన అవకాశం కల్పించేవీలు ఏర్పడుతుంది. ఇతరులకంటే విద్యార్థులే తోటి విద్యార్థులను బాగా అర్థంచేసుకోగలరు కనుక వారిలో ప్రజాస్వామ్యభావాలు పెంపొందే వీలు కలుగుతుంది.

### *1.1.4. పరీక్షావిధానం:*

ప్రాచీన విద్యావిధానంలో తరగతుల విభజన లేదు కాబట్టి నూతన తరగతుల ఏర్పాటుకు ఉద్దేశించిన పరీక్షావిధానం అవసరంలేకపోయింది. విద్యార్థులు అనుసరించినా, లేకపోయినా వారికి నూతన పాఠ్యాంశాల బోధన ఉంటుంది. విద్యార్థి మనసులో నాటుకోకముందే పరీక్షించటంవల్ల ప్రయోజనంలేదన్నది నాటి భావన. అందువల్ల ఉపాధ్యాయుని నిర్ణయంపైనే విద్యార్థి ప్రతిభ గణించబడుతుంది. ఒక విద్యార్థి ప్రతిభావంతుడిగా గురువు గుర్తించితే అతడిని ప్రోత్సహిస్తారు. ఉన్నతవిద్య పూర్తయినవెంటనే పరీక్షకోసం పండితుల సమావేశంలో వీరిని చర్చకు నిలపుతారు.

ఈ పరీక్షలన్నీ దాదాపు మౌఖికమైనవే. ఈ పరీక్షలు ప్రతిభకంటే, జ్ఞాపకశక్తినే అధికంగా పరీక్షిస్తాయి. ఉన్నతస్థాయిలో ప్రత్యేకనైపుణ్యం ప్రదర్శించాల్సిన అంశాల్లో విద్యార్థుల ప్రజ్ఞను అంచనావేసేందుకు ప్రయత్నిస్తారు. ఉన్నత క్రతువులలో జరిగే చర్చల గురించి బ్రాహ్మణాలు, ఉపనిషత్తులలో చేసిన వర్ణనలు ఈ అంశాన్ని బలపరుస్తాయి.

కాలక్రమంలో విజ్ఞానశాస్త్రాలు అభివృద్ధిచెందిన తర్వాత మరింత ప్రయోగాత్మక పరీక్షా విధానం అమల్లోకొచ్చింది. ప్రముఖ వైద్యుడు జీవకుడు వైద్యవిద్యను తక్షశిలలో ఏడు సంవత్సరాలపాటు అభ్యసించాడు. అనంతరం పరీక్షలో తక్షశిల చుట్టుపక్కల పదిహేనుమైళ్ళ పరిధిలోగల మొక్కల్లో ఔషధవిలువలనుజ అతను గుర్తించాల్సి వచ్చింది. నాలుగు రోజుల పరిశీలన తర్వాత ఔషధీయ విలువలు లేని మొక్క వానిలో ఒక్కటికూడా లేదని పేర్కొంటూ తన పరిశోధనా ఫలితాలను వెల్లడించాడు.

విద్య నేటిమాదిరిగా పరీక్షాప్రధానంగా, పరీక్షలే విద్యకు సర్వస్వం, విద్యకు అంతిమలక్ష్యం అన్న భావన నాడులేదు. విద్య ప్రధానలక్ష్యం వ్యక్తిత్వవికాసంగా భావించేవారు. నెలవారీ, త్రైమాసిక, అర్థసంవత్సర, సాంవత్సరిక అంటూ అనేక పరీక్షలుండేవికావు. పరీక్షా విధానం చాలా టూకీగా నేటి కాలపు పద్ధతులతో నిమిత్తంలేకుండా ఉండేది. అభ్యాసకుల సామర్థ్యం వారి అధ్యాపకులే స్వయంగా పరీక్షించేవారు. ఏ పాఠ్యాంశంలోనైనా విద్యార్థి నైపుణ్యాన్ని అంచనావేసేందుకు ఉపాధ్యాయుడే నిర్ణయాధికారిగా ఉండేవాడు. ఉపాధ్యాయుని అంచనా ఆధారంగానే విద్యార్థి తదుపరి తరగతిలోకి ప్రవేశించగలుగుతాడు. ఉత్తీర్ణత పొందినవారు అధ్యయనంలో తర్వాతిస్థాయిని అందుకునేవారు. అయితే విద్యార్థులను ఉత్తీర్ణులను చేసేటప్పుడు సంవత్సరం మొత్తంలోని ప్రతిభను పరిగణనలోకి తీసుకొనేవారు. మిథిలలో చివరిసంవత్సరంలో శలాకాపరీక్షా అనే ఒక సాంవత్సరిక పరీక్షకు హాజరుకావలసి ఉంటుంది. విద్యార్థి తనుగా రాసిన అంశాన్ని సంపూర్ణంగా తప్పుల్లేకుండా వివరించాల్సి ఉంటుంది. ఆయా రంగాల్లోవిద్యార్థి ప్రతిభ ఆధారంగా విద్యార్థికి పట్టా లభించేది.

కొన్ని అధ్యయనసంస్థలు ధృవపత్రాలుకూడా జారీచేసేవి. మిథిల విశ్వవిద్యాలయం అందులో విద్యనభ్యసించిన వారికి డిప్లొమాలు ప్రదానం చేసేది. డిగ్రీలజారీ సమయంలో ఛూరికా భూషణం పేరుతో స్నాతకోత్సవం లాంటిది నిర్వహించేవారు. ఈ ఉత్సవంలో విద్యార్థి స్నాతకస్థాయివిద్యకు గుర్తుగా దుస్తులకు ఒక పతకాన్ని తగిలించేవారు. కొన్ని సంస్థల్లో విద్యార్థులకు బిరుదులు ప్రదానంచేసేవారు.

మతధర్మశాస్త్రం, న్యాయశాస్త్రం, వ్యాకరణం వంటి అంశాల్లో పండితులమధ్య తరచుగా వాదోపవాదాలు, చర్చలు, జరుగుతుండేవి. ఈ పద్ధతిలోనే విద్యార్థి జ్ఞానాన్ని అంచనావేసేవారు. విద్యార్థి స్థానాన్నికూడా ఈ పద్ధతిలోనే నిర్ణయించేవారు. పండితులు ఎప్పుడు కలిసినా వివాదాస్పద అంశాలపై చర్చలుజరపటం ఆనాటి సంప్రదాయం. చర్చల్లో తమవాదానికి మద్దతుగా వారు ఆ అంశాలపై నిపుణుల అభిప్రాయాలను ఉదహరిస్తుండేవారు. ఆచార్యుల నియామకాల్లో అభ్యర్థి సామర్థ్యాన్ని ఇటువంటి చర్చలద్వారానే అంచనావేసేవారు. చర్చల్లో ఉత్తమప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసేవారు.

క్రమశిక్షణ:

ఎటువంటి భౌతిక శిక్షలు విధించకుండానే గురువు శిష్యులను ఆదేశించగలిగుండాలని గౌతముని ఉవాచ. అత్యవసర సమయాల్లో ఆకుల్లేని బెత్తంతో లేదా చిన్నతాడుతో శిక్షించవచ్చు. మనువు స్వల్ప తరహాశిక్షలను అంగీకరించాడు. క్రమశిక్షణకోసం మినహా మరే విధంగానూ తన శిష్యులను, కుమారులను మినహా మరెవ్వరినీ బెత్తంతో శిక్షించరాదు. భార్య, కుమారుడు, సేవకుడు,

సోదరుడు, శిష్యుడు తప్పుచేసి దోషులుగా నిర్ధారణైతే బెత్తంతో దండించవచ్చు. అయితే శరీరంలో పైభాగంలో కాకుండా మోకాళ్ళ క్రిందనే ఈ శిక్షలు అమలుజరపాలి. ఆపస్తంబ శిక్షలవిషయంలో మరింత కఠినంగా వ్యవహరిస్తూ ఉపాధ్యాయుడు తన ఇష్టంమేరకు ఉపయోగించగల శిక్షల జాబితాను పొందుపరిచారు. భయపెట్టటం, నిరాహారుణ్ణిచేయటం, చలినీళ్ళస్నానం, బెత్తంతో దండించటం, పాఠశాలనుంచి వెలివేయటం వంటివి ఆ జాబితాలో ఉన్నాయి. ఉన్నతవర్గాల పిల్లలుసైతం ఈ సాధారణ దండనలనుంచి తప్పించుకోలేరు. కౌటిల్యుని ప్రకారం 16సంవత్సరాల వయసుతో క్రమశిక్షణాకాలం ముగిసినట్లే భావిస్తూ తర్వాత అతనిని స్నేహితునిగానే చూడాలి.

వీడ్కోలు :

వీడ్కోలుసమయంలో ఉపాధ్యాయుని ఉపన్యాసం నేటి ఆధునిక విశ్వవిద్యాలయాల్లో పట్టాలప్రదానం సమయంలో కులపతి ఉపన్యాసం మాదిరిగానే ఉండేది. వీడ్కోలు ఉపన్యాసంలో అనేక అంశాలగురించిన చర్చ కనిపిస్తుంది. ప్రథమంగా సంసారిక జీవితం, పితృత్వం జాతి కొనసాగింపుకోసం తప్పనిసరిగా చేపట్టవలసిన కర్మలుగా పేర్కొంటారు. సంస్కృతి కొనసాగింపుకోసం వేదాధ్యయనం, వేదాలబోధన తప్పనిసరి విధులుగా పేర్కొంటారు. గృహ, సామాజిక బాధ్యతలు మూడవస్థానాన్ని ఆక్రమిస్తాయి. తల్లి, తండ్రి, గురువు, అతిథి వీరిని దేవతలుగా, ఉన్నతులుగా గౌరవించటం, సుఖదుఃఖాల్లో వీరికి సముచితస్థానాన్నివ్వటం మరికొన్ని విధులు. అలానే పిల్లలు తమ ఆరోగ్యాన్ని, ఆస్తులను నిర్లక్ష్యం చేయకూడదు. ఉపాధ్యాయుని మంచి వ్యక్తిత్వాన్ని అనుకరించటం, చెడును మరచిపోవటం, తమకంటే ఉన్నతులకు గుర్తింపునివ్వటం విద్యార్థికర్తవ్యాలు.

### *1.1.5. బౌద్ధవిద్య:*

బౌద్ధారామాల్లో కొందరు విద్యార్థులు నివాసితులుకాగా కొందరు ప్రతిరోజూ ఆరామానికి వచ్చివెళ్తుండేవారు. చెక్క పలకపైన అక్షరాలను బోధించటంతో శిక్షణ ప్రారంభించేవారు. వాటిని బిగ్గరగా చదవటంద్వారా పిల్లలఅభ్యాసం సాగేది. అధ్యయనంలోని గ్రంథాలన్నీ మతసంబంధమైనవి పాఠ్యాంశాల్లో పాలి అధ్యయనం, మతకర్మలకు అవసరమైన ప్రార్థనల అధ్యయనం ప్రధానంగా ఉండేది. బుద్ధుని జీవితం, బుద్ధుని బోధనలు, జాతకకథలు ప్రధాన శిక్షణాంశాలు.

ఆరామాలు కేంద్రంగాసాగే బౌద్ధవిద్య వేదాలను, బ్రాహ్మణుల అనువంశికతను, కులవ్యవస్థను గుర్తించలేదు. అందువల్ల బౌద్ధవిద్యావిధానం వేదాధ్యయనం మీద ఆధారపడిలేదని చెప్పవచ్చు. బౌద్ధ ఆరామాల్లోని అధ్యయనాంశాల గురించి ఇత్సింగ్ వివరంగా పేర్కొన్నాడు. దేశవ్యాప్తంగా బౌద్ధసన్యాసులు ప్రతి ఒక్కరు రెండు మాత్రికేత కీర్తనలు అధ్యయనం చేయాల్సిఉంటుంది. మహాయాన, హీనయాన శాఖలు రెంటిలోకూడా ఈ పద్ధతి పాటించేవారు. ఇందుకు ఆరు కారణాలు పేర్కొన్నారు. వీటివల్ల బుద్ధుని విజయాలగురించిన పరిజ్ఞానం ఏర్పడుతుంది. కీర్తనల రచనావిధానం తెలుస్తుంది. భాషస్వచ్ఛతనుగురించిన జ్ఞానాన్నిస్తాయి. వీటిని పాఠ్యక్రమంలో ఛాతి విశాలం అవుతుంది. వీటిని గానంచేయటంద్వారా సభాసమావేశాల్లో ఏర్పడే బెంకు నశిస్తుంది. వీటి అధ్యయనంవల్ల వ్యాధులనుంచి రక్షణపొంది జీవితకాలం పెరిగేందుకు వీలుకలుగుతుంది.

ఆరుసంవత్సరాల వయసులో ప్రారంభమై ఇరవై సంవత్సరాల వయసువరకు సాగే వ్యాకరణాధ్యయనం ఇందులో భాగమే. ఉన్నతవిద్యలో భాగంగా విద్యార్థులు పాణినీయ వ్యాకరణం, కాశికావృత్తి అధ్యయనం, పద్య, గద్య రచనావిధానం, హేతువిద్య, అభిధర్మకోశాల అధ్యయనం

చేసేవారు. తర్కశాస్త్ర అధ్యయనంతో వారు హేతువాద దృష్టిని పెంపొందించుకుంటారు. జాతకమాల అధ్యయనంద్వారా వారి అవగాహనాసామర్థ్యం పెరుగుతుంది.

తరువాతి కాలంలో నలందా, విక్రమశిల, ఓదాంతపురి వంటి ఆశ్రమాలలో తాంత్రిక తత్త్వశాస్త్రం అధ్యయనాంశంగా రూపొందింది. 5--12 శతాబ్దాలమధ్య పాటలీపుత్ర, నలందా, విక్రమశిల, ఓదాంతపుర వంటి ఆరామాలకు అనుబంధంగా ఉన్న కళాశాలలు తాంత్రికవిద్యల అధ్యయనానికి పేరుపొందినట్లుగా తెలుస్తున్నది. ప్రాచీన ఈజిప్టులో దేవాలయాలు పిరమిడ్లకు అనుబంధంగా ఉండటంతో అధ్యయనాంశాలలో రసవాదం కూడా భాగమైంది.

బోధన ప్రధానంగా మౌఖికంగానే సాగేది. బుద్ధుడు తనబోధనలను గ్రంథస్థం చేయలేదు. ప్రాచీన సాంప్రదాయిక పద్ధతిలోనే తన బోధనలను మౌఖికరూపంలో అందించాడు. ప్రశ్నోత్తరాలద్వారా బోధనసాగడం సాధారణపద్ధతి. బుద్ధునికి, మిలిందపన్హకు మధ్యజరిగిన సంభాషణల్లో ఈ విషయం స్పష్టమైతుంది. భారతీయ గ్రంథాలు ఈ సంభాషణలను వాద సంవాదాలుగా పేర్కొన్నాయి. గీతలో కృష్ణార్జునులనడుమ జరిగిన సంవాదం ఇందుకు తార్కాణం. ఇలాంటి చర్చలద్వారా సందేహనివృత్తి కలుగుతుంది. అన్నిదోషాలు వెలుగులోకివచ్చి సరైనదోషనివృత్తికి వీలుకలిగేది. గురువు సాన్నిధ్యంలో జరిగేచర్చలద్వారా అధికప్రయోజనం చేకూరేది. విద్యలక్ష్యం కేవలం వ్యక్తిగత ప్రతిభాప్రదర్శన మాత్రమే కాకుండా ప్రవర్తనారూపకల్పన కాబట్టి కేవలం మౌఖిక శిక్షణమాత్రమే ఇచ్చే ఉపాధ్యాయునికి కాకుండా ఆచార్యులకే ఉన్నతస్థానం లభించేదని ఇత్సింగ్ పేర్కొంటాడు. కేవలం బట్టీయం వేయటంద్వారా కాకుండా అవగాహనద్వారా జ్ఞాపకశక్తిని పెంపొందించుకొని జ్ఞానాన్నిపొందటం నాటి అధ్యయనవిధానంలో ప్రముఖ అంశంగా ఉండేది.

### *1.1.6. వృత్తివిద్యలు :*

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర, మ్లేచ్ఛ భేదాలు -- చేసేపని, ప్రతిభల ఆధారంగా ఏర్పడేవేకాని పుట్టుకనుబట్టికావు అన్నది శుక్రాచార్యువిభావన. వర్ణంనుంచికాని అనువంశికంగాకాని బ్రాహ్మణత్వం సిద్ధించదు. కళలు, శాస్త్రాలలో నైపుణ్యం సాధించిన వ్యక్తి గురువుగా అర్హత పొందుతాడే తప్ప, అధ్యయనం చేయనివ్యక్తి కేవలం పుట్టుకతో ఆచార్యుడుగా గుర్తింపు పొందలేడు. దీన్నిబట్టి బ్రాహ్మణత్వానికి జ్ఞానాన్ని మౌలికమైన అర్హతగా గుర్తించినట్లు తెలుస్తుంది. తగిన అర్హతలుకలిగి, ప్రవక్తకావాలనుకుంటే ఆ శిష్యునికి బ్రాహ్మణత్వాన్ని ఆపాదించే హక్కు గురువుకుండేది.

నాడు వైశ్యులకు సుశిక్షితమైన వ్యాపారవిద్య అందుబాటులో ఉంది. మహావగ్గలో మూడు వృత్తుల గురించి పేర్కొన్నారు. అవి లేఖ, గణన, రూప. కళింగరాజు ఖారవేలుని హాతిగుంఫ శాసనం కూడా ఈ మూడు శాఖలగురించి పేర్కొంటుంది. మనువు వైశ్యులకుద్దేశించిన వ్యాపారవిద్యలో వ్యాపారభూగోళం, అంకగణితం, కొన్నిభాషలు, వాణిజ్యాన్నిగురించిన అంశాలు భాగంగాఉన్నాయి.

భారతీయ విద్యావిధానంలో విజయంకంటే విధానానికి, ఫలితంకంటే బోధనాపద్ధతికి, ఫలితాలకంటే విద్యాసంస్థకి ప్రాధాన్యత ఉండేది. విద్యార్థి తన విభాగంలో నిపుణతపొంది రాణించగల్గటం ఈ విధానం ప్రధానలక్ష్యం. గురుశిష్యులమధ్యగల గాఢమైన, వాత్సల్యపూరితమైన అనుబంధం విద్యార్జనా క్రమంలోని ఒడిదుడుకులను అధిగమించేందుకు దోహదపడుతుంది. ఆధునిక విధానంలో సాంకేతికశాఖల్లోని ఆచార్యులు కేవలం కొన్నిగంటలపాటుమాత్రమే తమ విద్యార్థులతో

గడపటంవల్ల వారితో మమేకంకావటంకాని, వారినుండి సరైన ప్రతిభను వెలికితీయటంకాని చేసే అవకాశం లేదు. దేశీయ విద్యావిధానంలో వృత్తికి సంబంధించిననైపుణ్యాన్ని సాధించటం మాత్రమే ప్రధానం కాదు. అంతకుమించి అందులో ఒక జీవనవిధానం యిమిడిఉంది. యంత్రాలు, పరికరాలనడుమ విసుగును తొలగిస్తూ జీవితానికి దగ్గరగా మానవసంబంధాలు, సంస్కృతి, ధర్మం వంటి అన్నిఅంశాల్లో విద్యార్థిని మానసికంగా సుశిక్షితులను చేయటం దేశీయవిద్యావిధానంలోని ప్రధానాంశం.

మరోముఖ్యమైన గుర్తించదగిన అంశం వృత్తివిద్యార్థిగా ప్రవేశం పొందేందుకు కులం అడ్డంకికాకపోవటం. సంరక్షకుని అంగీకారం మాత్రమే ఇందుకు అవసరమయ్యేది. దీన్నిబట్టి వృత్తులమధ్య అడ్డుగోడలు కులాలమధ్య అడ్డుగోడలంత పటిష్ఠంగాలేవన్నది స్పష్టమౌతుంది. ఈ విషయంలో పాలి సాహిత్యంలో సరైన ఆధారాలు లభిస్తాయి. తండ్రి వృత్తినిగురించిన ప్రస్తావనలేకుండా తమ కుమారుడు స్వీకరించాల్సిన వృత్తిని గురించి తల్లిదండ్రులు చర్చించటం వినయపిటికలో చోటుచేసుకుంది. బ్రాహ్మణులు వైద్యులుగా, మేకలకాపరులుగా, వ్యాపారులుగా, వేటగాళ్ళుగా, పాములనుపెంచేవారిగా, విలుకాళ్ళుగా, సేవకులుగా, నిషాదులుగా, రథచోదకులుగా పనిచేసిన దాఖలాలున్నాయి. 495వ జాతకకథలో బ్రాహ్మణులు అనుసరించిన వివిధ వృత్తుల చిట్టా కనిపిస్తుంది.

కాలక్రమంలో ఒక కులానికిచెందిన వారు ఒకే వృత్తిని చేపట్టడం, తద్వారా వారిమధ్య బంధాలు దృఢంకావటం, ఫలితంగా బయటివ్యక్తికి అవకాశం కల్పించకపోవటం జరిగింది. కొడుకుకు తన తండ్రివృత్తిలో శిక్షణ లభించేది. అలా విద్యావిధానం గృహప్రధానమైనదిగా ఉండేది. పిల్లలకు వృత్తిపరమైన స్వేచ్ఛలేదు. తమ తండ్రి వృత్తిలోనే శిక్షణ లభించేది. తండ్రి బిడ్డలకు సహజంగా తన వృత్తిలోనే శిక్షణగరిపేవారు. ఇందులో పిల్లలు తమ తండ్రులనుంచి కొంతమేరకు నైపుణ్యాన్ని పొందేవారు. అనుకూలమైన వాతావరణం కారణంగా తాము పెరిగిన వృత్తికిసంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అసంకల్పితంగానే పొందేవారు.

అయితే పుట్టుకే వృత్తిని నిర్ణయించే వ్యవస్థలో వ్యక్తి తన సామర్థ్యాలను పూర్తిగా ఉపయోగించుకునే అవకాశం లేకపోయింది. దీంతో అనేకమంది ఇతరవృత్తులకు అర్హులైనప్పటికీ పుట్టుకతో సంక్రమించిన వృత్తినే కొనసాగించాల్సి వచ్చేది. అదేవిధంగా వ్యక్తి ఒక వృత్తిలో ఎంతప్రతిభావంతుడైనప్పటికీ ఆవృత్తికి చెందిన కులంలో పుట్టకపోతే ఆవృత్తిని చేపట్టేందుకు వీలుండేదికాదు. పుట్టుక ఆధారంగా రూపొందే ఇటువంటి వృత్తిసంఘాల్లో సృజనాత్మకతకు, వ్యక్తిత్వ వికాసానికి అవకాశంఉండదు. వ్యక్తి సామాజిక భవితవ్యం అతని కులసాంప్రదాయిక స్థాయి పరిమితులకు లోబడిమాత్రమే ఉండటం ఇందుకు కారణం. సాంప్రదాయిక వృత్తినిపుణుని బోధన తన జ్ఞానాన్ని పునరుత్పత్తి చేస్తుందే తప్ప అభివృద్ధికి దోహదకారి కాలేదు. అలా వృత్తిని అభ్యసించిన వ్యక్తులు నూతన విజ్ఞానంపట్ల, పరికరాలపట్ల సరైన దృష్టిని ప్రదర్శించలేరు. తమ పూర్వీకులకంటే తెలివిగా ప్రవర్తించటానికి నిరాకరిస్తారు. పుట్టుకద్వారా అసంకల్పితంగా జరిగే ఈ గురుశిష్యులఎంపిక విద్యారంగంలో మెరుగైన ఫలితాలసాధనకు అడ్డంకిగా నిలిచేది.

### *1.1.7. ఉపాధ్యాయ విద్యార్థి సంబంధాలు :*

ప్రాచీన విద్యావిధానంలో ఉపాధ్యాయ విద్యార్థి సంబంధాలను అధ్యయనం చేయాలంటే వారి

జీవన విధానాన్ని, విధులను, వ్యక్తిత్వాలను అధ్యయనం చేయాల్సి ఉంటుంది.

బోధకులలో మూడు తరగతులున్నాయి. అవి గురువు, ఆచార్య, ఉపాధ్యాయ. అన్ని క్రతువులను నిర్వర్తించి వేదాలలోని నియమాలను బోధించేది 'గురువు'. కేవలం ఉపనయనం మాత్రం నిర్వహించి, వేదాలను బోధించేది 'ఆచార్య'. వేదాలలోని ఒకభాగంమాత్రం బోధించేది 'ఉపాధ్యాయ'. ఈ మూడు తరగతుల బోధకులగురించి మనుస్మృతి ఇలా వివరించింది.

ఆచార్యుడు:

ఉపనీయతు యశ్శిష్యం వేదమధ్యాపయే ద్విజః

సంకల్పం న రహస్యం చతమా చార్యం ప్రచక్షతే (మనుస్మృతి: 1997: 37)

ఉపనయనం చేసుకున్న శిష్యునకు కల్పము, రహస్య సహితమైన వేదాన్ని సాంగోపాంగంగా నేర్పించేవానిని ఆచార్యుడంటారు.

ఉపాధ్యాయుడు:

ఏక దేశంతు వేదస్య వేదాంగాన్యపి వాపునః,

యోఽధ్యాపయతి వృత్త్యర్థ ముపాధ్యాయస్య ఉచ్యతే (వైదే : 37)

వేదభాగమైన మంత్రాన్నో, బ్రాహ్మణాన్నో వేదాంగాలైన శిక్షా వ్యాకరణాదులలో దేనినైనా తన వృత్తిధర్మాన్ననుసరించి శిష్యునకు ఉపదేశించే వానిని ఉపాధ్యాయుడంటారు.

గురువు:

నిషేకాదీని కర్మాణియః కరోతి యథావిధి

సంభావయతి చాన్నేన సవిప్రో గురుచ్యతే (వైదే : 37)

గర్భాదానం మొదలైన కర్మలను యథావిధిగా చేయించువానిని, అన్నంపెట్టి పోషించు వానిని గురువని అంటారు.

సిగలోవాదసుత్త లో విద్యార్థి, ఉపాధ్యాయుల విధులగురించి పేర్కొన్నారు. ఉపాధ్యాయుని పట్ల వినమ్రత చూపటం, అతనికి సహకారం అందించటం, అతని అవసరాలు తీర్చటం, బోధనపట్ల శ్రద్ధచూపటం ద్వారా విద్యార్థి ఉపాధ్యాయుని గౌరవించాలి. ఉపాధ్యాయుడు విద్యార్థులకు సరైనజ్ఞానాన్ని అందించటం, విజ్ఞానసాంకేతిక శాస్త్రాలలో శిక్షణనివ్వటం, వారిగురించి ఇతరులతో మంచిగా మాట్లాడటం, వారిని ప్రమాదాలనుంచి కాపాడటం వంటి చర్యలద్వారా తనశిష్యుల పట్ల ప్రేమనుచూపాలి.

**విద్యావిధానంలో ఉపాధ్యాయునిపాత్ర:**

ఉపా ధ్యాయుడు అధ్యయనంలో, ప్రవర్తనలో ఉత్తముడై ఉండాలనే ఉద్దేశ్యంతో 'ఉత్తమ' అనే అర్థంలో గురువు అనే పదాన్ని సృష్టించారు. ఇతరులను సత్ప్రవర్తనాపరులుగా తీర్చిదిద్దే వ్యక్తిగా గురువును(ఆచారం గ్రాహయతి ఇతి ఆచార్య) 'ఆచార్య' అనికూడా పేర్కొన్నారు. అన్ని మతాల మూలభావన(ధర్మం ఆచినోతి ఇతి ఆచార్య) 'ఆచార్య' అని పేర్కొన్నారు. ఉపాధ్యాయుడు తప్పక శ్రోత్రీయుడై (గత మూడు తరాలవారు వేదపండితులై)ఉండాలి, బ్రహ్మనిష్ఠతో ఉండాలని ముండకోపనిషత్తు పేర్కొంది.

ఋగ్వేదంలోని ప్రాతిశాఖ్యలో ఉపాధ్యాయుని పాండితీపరమైన అర్హతను గురించిన వివరాలిలా ఉన్నాయి. ఉపాధ్యాయుడు పాఠ్యాంశాలను అవగాహనపర్చుకున్నవాడు, బ్రహ్మచారి విధులను నిర్వర్తించిన వాడు, అధ్యయనంలో మంచిసామర్థ్యంకలవాడు, చర్చల్లో విజయం

సాధించినవాడు అయిఉండాలి.

ఉపనిషత్తుల్లో ఉపాధ్యాయుని అర్హతలగురించిన మరిన్ని వివరాలున్నాయి. వేదకుటుంబం నుంచి వచ్చినవాడైఉండాలి. ఉపాధ్యాయునిగా విధులను నిర్వర్తించాలనే కోరికగలవాడై ఉండాలి. తన శిష్యులకు తండ్రిగా మనోవాక్కాయ కర్మణా పనిచేయగలవాడై ఉండాలి.

విద్యావంతుడైన ప్రతివ్యక్తికి ఇతరులకు శిక్షణనిచ్చే నైపుణ్యం ఉండదు. ఒకరికి తన కళను ప్రదర్శించటంలో, మరొకరికి తననైపుణ్యాన్ని వ్యక్తీకరించటంలో నేర్పరితనం ఉంటుంది. ఈ రెండు లక్షణాలు కలిగిఉన్న వ్యక్తిని ఉపాధ్యాయులలో ఉత్తమస్థానంలో ఉంచవచ్చు.

మాళవికాగ్నిమిత్రంలో ఇద్దరు నాట్యాచార్యులమధ్య ఏర్పడిన వివాద సమయంలో 'ఉత్తమ గురువు'నుగురించి కాళిదాసు ఇదేవిధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తారు.

శిష్టాక్రియా కస్యచిదాత్మ సంస్థా
సంక్రాంతి రన్యస్య విశేషయుక్తా!
యస్యోభయం సాధు స శిక్షకాణాం
ధురి ప్రతిష్ఠాపయితవ్య ఏవ॥ (కాళిదాసు. 2002: 24)

ఒకరికి శాస్త్రజ్ఞానము తనవరకు మాత్రమే పరిమితమై విశిష్టముగా ఉంటుంది. మరొకనివద్ద శాస్త్ర బోధనాపద్ధతి విశేషయుక్తముగా ఉంటుంది. శాస్త్రజ్ఞానము, శాస్త్ర బోధనాపద్ధతి రెండూ ఎవరి వద్ద బాగా ఉంటుందో అతడే శిక్షకులలో ఉత్తముడు.

పాండిత్యం, బోధనా సామర్థ్యం రెండూ ఎవరిలో పుష్కలంగా ఉంటాయో వారినే ఉత్తమ గురువుగా పరిగణించాలన్నది కాళిదాసు అభిప్రాయం.

ప్రశాంతజీవనం, ఉత్తమఆలోచనలు, క్రమమైన జీవితం, సుఖాలను ఆశించనివ్యక్తిత్వం, మనోనిశ్చలత వీటన్నిటికీ మించి వృత్తిపట్ల నిబద్ధత భారతీయ ఉపాధ్యాయుని వృత్తిపరమైన విజయానికి దోహదపడే ప్రధానాంశాలు.

కేవలం స్వాధ్యయనం వల్ల కలిగే ఫలితాలను ఉపనిషత్తులు గుర్తించి, ఉపాధ్యాయుని జ్ఞానానికి ప్రతినిధిగా పేర్కొన్నాయి. ముండకోపనిషత్తు ప్రకారం "స్వాధ్యయనం ద్వారానో, మేధాశక్తి ద్వారానో, విస్తృత సమాచారాన్ని గ్రహించటం ద్వారానో ఆత్మసాక్షాత్కారం జరగదు." వేదాలను గురుప్రమేయం లేకుండా అధ్యయనం చేసినందుకు బాధలుపడిన యవక్రతుని కథ మహాభారతంలో కనిపిస్తుంది (వానప్రస్థం, 134-137 అధ్యాయాలు). కేవలం పుస్తకలద్వారా వేదాధ్యయనం సాధ్యపడదు. సరైన ఉచ్చారణ, ఊనిక ఉపాధ్యాయుని ద్వారా అభ్యసించటంవల్లనే సాధ్యమౌతుంది. అందువల్ల ఉపాధ్యాయుని నుంచే అభ్యసించాలని, అలా అధ్యయనంచేసిన శాస్త్రమే ఫలిస్తుందని ఉపనిషత్తులు పేర్కొన్నాయి.

### *1.1.8. విద్యాభ్యాస విధులు, నియమాలు:*

విద్యాభ్యాసానికి మొదటి షరతు శిష్యుడు గురువు ఇంటిలోనే నివసించాలి. ఈ విషయంలో ఆధునిక విద్యావేత్తలు విద్యావిధానంలో రెండు అంశాలను పేర్కొంటారు. ఒకటి అంతర్గతం, మరొకటి బాహ్యసంబంధి. మొదటిది విద్యార్థి అంతఃసామర్థ్యం, రెండవది విద్యార్థి పరిసరాలు. విద్యార్థి అభిరుచిని, అంతర్గతసామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రాచీన గురువులు 'అధికార' సిద్ధాంతాన్ని అభివృద్ధి పరిచారు. పరిసరాలు విద్యార్థి విద్యపై చూపే దీర్ఘకాలిక ప్రభావాన్ని వారు గుర్తించారు.

అందువల్లనే విద్యార్థి మెదడు అభివృద్ధిచెందటం మొదలవగానే అతనిని ఇంటినుంచి నైతికబలాన్ని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించే చోటుకు బదిలీచేసేవారు. పాఠశాలలోని ప్రశాంతమైన, ఉత్సాహపూరితమైన వాతావారణం, అక్కడి వ్యక్తుల ఉత్తమ జీవనవిధానం విద్యార్థికి స్ఫూర్తినిచ్చేవి. ఆధునిక విద్యావేత్తలు పేర్కొనే ఆశ్రమ బోధనా విధానమే నాటి విద్యావిధానంలోని ప్రధానాంశం కూడా. అయితే ప్రాచీన విద్యా విధానంలో శిష్యుడు గురువు ఇంట్లో కుటుంబసభ్యునిగా ఉంటూ అక్కడ తన స్వంతకుటుంబవాతావరణాన్ని అనుభవిస్తూ ఉండటంచేత ఇది ఆధునిక కృత్రిమ ఆశ్రమపాఠశాలల్లోని లోపాలను అధిగమించగలిగింది. టోల్సలలో ప్రాచీన భారతీయ ఆశ్రమ విధానం నేటికీ ఉనికిలో ఉంది. అయితే ఉపాధ్యాయునితో కలిసి నివసించడమనేది అన్ని విద్యాసంస్థల్లో తప్పనిసరికాదు.

గురువుకోసం భిక్షాటనచేయటం, పవిత్ర అగ్నిని కాపాడటం, గురువు గృహాన్ని కాపాడటం, మనసా, వాచా, కర్మణా ఉపాధ్యాయుని సేవించటం శిష్యుల ప్రధాన విధులుగా మనువు పేర్కొన్నాడు.

**విద్యార్థి జీవితాన్ని క్రమబద్ధంచేసే నియమనిబంధనలు:**

వేకువఝామునే మేలుకొనటం: నాడు శిక్షణకంటే, క్రమశిక్షణకు అధికప్రాధాన్యత ఉండేది. విద్యార్థి సాధారణ జీవనాన్ని ఆరంభించేందుకు సహకరించటమే నాటి విద్యావేత్త విధి. ఇటువంటి క్రమశిక్షణ వేకువనే మేలుకొనటంతో ప్రారంభమౌతుంది. ప్రార్థన: సూర్యుని విశ్వవ్యాప్త దైవంగా భావించి ప్రార్థించటం మరో క్రమశిక్షణా నియమం. స్నానం: మానసిక, భౌతిక ఆరోగ్యంకోసం ప్రతిరోజూ క్రమంతప్పక స్నానాలుచేయాల్సి ఉంటుంది. దుస్తులు: బ్రహ్మచారులు సామాజిక స్థాయినిబట్టి వరుసగా నార, పట్టు, ఉలు దుస్తులు ధరించాల్సి ఉంటుంది. ఆహారం: పూజించిన ఆహారం బలాన్ని, జీవశక్తిని ఇస్తుంది. పూజించని ఆహారం వ్యక్తి శారీరక, మానసిక ప్రపంచాలను నాశనం చేస్తుందని మనువు భావన. నిద్ర: విద్యార్థి కటికనేలపై నిద్రించాలి. మంచం పైన నిద్రించరాదు. శిష్యుడు గురువుకంటే తక్కువ ఎత్తులో నిద్రించాలి, గురువు నిద్రించిన తర్వాత నిద్రించి, గురువు మేల్కొనకముందే మేల్కొనాలి. పగలు నిద్రించరాదు. మహాభారతం ప్రకారం సంధ్యాసమయంలో నిద్రించటం జీవితకాలాన్ని తగ్గిస్తుంది. బ్రహ్మచర్యం: విద్యార్థిదశలో వ్యక్తి పూర్తిగా విద్యార్జనకే అంకితంకావాలి. తన విద్యార్జన పూర్తయ్యేంతవరకూ కటిక బ్రహ్మచర్యాన్ని పాటించాలన్నది వాత్స్యాయనుని ఉద్దేశ్యం. ప్రాచీన గ్రంథాలన్నీ అధ్యయనానికంటే క్రమశిక్షణకు అధిక ప్రాధాన్యాన్నిచ్చాయి.

ప్రాచీనకాలంలో ఏడుసంవత్సరాలవరకు పిల్లవాని విద్య పాఠశాలలోకంటే ఇంటివద్దనే అధికంగా జరిగేది. క్రమేణా మత కర్మకాండలు సంక్లిష్టం కావటం, మంత్రాల అర్థం సాధారణప్రజలకు అవగాహనకాకపోవటం వంటి వాటివల్ల విద్యార్థుల జ్ఞానాన్ని పెంచేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవలసివచ్చింది. ఉపాధ్యాయుని కుటుంబం కేంద్రంగా వేదపాఠశాలలు, ప్రత్యేక పాఠశాలలు నడిచేవి. అలాంటి ఉపాధ్యాయులు గృహస్థులుకూడా అయిఉండేవారు. విద్యార్థులు అన్నిచోట్లనుండి ఇక్కడికి వచ్చేవారు.

**అధ్యయనం--ప్రారంభవయస్సు:**

విద్యార్థిజీవితం ప్రారంభమయ్యే వయసు కాలాన్నిబట్టి మారుతుంటుంది. ప్రాచీన విద్యావేత్తలు పుట్టుకనుండి ఐదవసంవత్సరం వరకు ఆటలాడేవయసుగా గుర్తించారు. విద్యాభ్యాసం

ఏడు సంవత్సరాల వయస్సులో ప్రారంభమవుతుంది. అనేకమంది మానసికవేత్తలప్రకారం మెదడు పరిపూర్ణ రూపాన్ని సంతరించుకునేది ఈ వయస్సులోనే.

ఉపనయనమహోత్సవం బ్రాహ్మణునికి వసంతఋతువులో, క్షత్రియునికి గ్రీష్మఋతువులో, వైశ్యునికి శరదృతువులో జరుగుతుంది. ఇలా ఉపనయన నిర్వహణ వయస్సుకు, కాలానికి కూడా ఒక ప్రత్యేకత ఉన్నట్లుగా తెలుస్తున్నది. అలాగే భారతదేశంలో వసంతఋతువు శాంతి, సమృద్ధికి, వేసవి శక్తికి, శరదృతువు ఫలానికి సంకేతంగా నిలుస్తాయి.

**విద్యార్థుల ఎంపిక, ప్రవేశాలు:**

ప్రాచీన విద్యావిధానంలో పాఠశాలప్రవేశానికి విద్యార్థులను ఎంపికచేసే సాంప్రదాయం ఒకటి ఉంది. మనువు ప్రకారం కేవలం పది రకాల పిల్లలను మాత్రమే శిక్షణకోసం ఎంపికచేయాల్సి ఉండేది --- ఉపాధ్యాయుని కుమారుని, వ్యక్తిగత సేవ చేసిన వానిని, మరో పాఠ్యాంశాన్ని బోధించే వ్యక్తిని, మంచి వ్యక్తిని, ఉత్తమ ఆలోచనలుగల వ్యక్తిని, విశ్వసనీయమైన మిత్రుని, గ్రహించిన జ్ఞానాన్ని అవగాహనపర్చుకుని, వినియోగించగల సామర్థ్యంగల వానిని, పోషకుని, తపస్విని. (11, 138, 240, 241) ఉశానసంహిత ప్రకారం -- ఆచార్యుని కుమారుని, శ్రద్ధగా వినగలిగినవానిని, ముందే కొంత జ్ఞానాన్ని పొందిన వ్యక్తిని, విజయుని, శారీరకంగా, మానసికంగా ఉత్తముని, బంధువుని, మతగ్రంథాలను అర్థంచేసుకోగలిగిన సామర్థ్యం గలవ్యక్తిని, దానంచేయటంలో ఉదారుని, మంచివ్యక్తిని, రక్తసంబంధీకుని -- అధ్యయనానికి ఎంపికచేయవచ్చు. యాజ్ఞవల్క్య సంహిత ప్రకారం -- కృతజ్ఞులు, అణకువగలవారు, తెలివిగలవారు, పవిత్రులు, మానసిక, శారీరక బాధలు లేనివారు, ఈర్ష్యను జయించినవారు, మంచి ప్రవృత్తిగలవారు, స్నేహితులకు సేవచేయగలవారు, తమ అధ్యయనాన్ని, ధనాన్ని పంచగలవారు -- మతశిక్షణను పొందేందుకు అర్హులు.

నాడు నేరస్థులను విద్యావంతులను చేయటం నిషేధం. అందుకే ఏవిధమైన శిక్షణలేకుండా తన గురువు గృహంలో కొంతకాలం నివసించాల్సి ఉండేది. ఈ కాలంలో విద్యార్థిని పరీక్షించేందుకు చాలినంత అవకాశం ఉపాధ్యాయునికి దొరుకుతుంది. విద్యార్థి అర్హుడని గుర్తించినపుడే వేదాధ్యయనంలో శిక్షణనిచ్చేవారు. విద్యార్థి ప్రవర్తనలో ఏమైనా లోపాలుంటే ఈ సంవత్సరకాలంలో గురువు సరిదిద్ది బోధించేవారు.

దీన్నిబట్టి ప్రాచీనకాలంలో గురువులు ఉన్నతవిద్యను విచక్షణారహితంగా అందరికీ బోధించేవారు కాదని తెలుస్తుంది. శీలం, సామర్థ్యం, అనువంశికత, పరిసరాలు వ్యక్తిని అర్హునిగా నిర్ణయించినప్పుడే గురువు శిక్షణనిచ్చేవారు.

"Uniformity is the essence of any and every system, whereas infinite variety and infinite irregularities are the characteristics of people. The only education, therefore, that deserves the name or is really beneficial, is that which ministers to individual capacity and personality. When that connection and response are lacking, teaching and being taught are a funeral waste of time". (Sunday times, London, Aug 7, 1925)

**మానసిక, నైతిక క్రమశిక్షణ:**

అధ్యయన నియమాలన్నీ చాలాకఠినంగానూ, విద్యార్థిజీవితాన్ని నిర్బంధించేవిగానూ, విద్యార్థి ప్రాపంచిక సుఖాలను దూరం చేసేవిగానూ నేడు మనకు కనిపిస్తాయి. వాస్తవానికి ఆ

నియమాలు ఉల్లాసాన్ని దూరంచేసినప్పటికీ ఆనాటి విద్యాలక్ష్యమైన ఆధ్యాత్మికానందాన్ని పొందేందుకు భౌతికంగా సహకరిస్తాయి. ఇవి విద్యార్థులను నైతికవర్తనులుగాను, ప్రవర్తనలో గౌరవప్రదులుగానూ రూపొందిస్తాయి. గురువు ఇంట్లో చేసే శారీరకశ్రమకారణంగా విద్యార్థుల శరీరదార్ఢ్యం పెంపొందుతుంది. ఉదయాస్తమయాల కాలంలో చేసే ప్రార్థన, మతగ్రంథాల అధ్యయనం, కర్మకాండల కారణంగా విద్యార్థికి నైతికమైన శిక్షణ లభించినట్లయింది. మంత్రాలు, శ్లోకాల విశ్లేషణ, ప్రకృతి పరిశీలన, కర్మకాండలకు సామగ్రి సిద్ధంచేయటం వంటి చర్యలతో మేధోపరమైన వికాసానికి అవకాశం కల్గింది. ఉపాధ్యాయునినుంచి దేవతలగురించిన నిగూఢాంశాలను అర్థంచేసుకోవటం, ప్రారంభంనుంచి చివరివరకు పాఠ్యాంశాలను భట్టీయంవేయటం వంటివి జ్ఞాపకశక్తికి, ఊహాశక్తికి దోహదపడతాయి. విద్యార్థి అంతఃసామర్థ్యాలను వికసింపచేయటం ఇలాంటి బాహ్యానియమాల ప్రధాన ఉద్దేశ్యం. ఇవి విద్యార్థిని జ్ఞానసంపాదనకు సిద్ధంచేస్తాయి. ఇలాంటి క్రమశిక్షణాయుతమైన జీవితం అంతఃస్వాతంత్ర్యాన్నిస్తుంది. ఈ కారణంగానే ప్రాచీన భారతీయులు ఉపాధ్యాయుని వద్దచేరిన ఉద్దేశ్యం తరచూ విద్యార్థి మదిలో ఉండేట్లుగాను, ఆ లక్ష్యసాధనకోసం విద్యార్థి తన పూర్తి శక్తియుక్తులనుపయోగించేట్లుగాను వాతావరణాన్ని కల్పించారు. విద్యార్థికి స్ఫూర్తినిస్తూ విజ్ఞానసాధనకు ఉన్ముఖుని చేయటమే విద్యప్రధానలక్ష్యం అన్నది విద్యావేత్తల అభిప్రాయం. ఉత్సాహపూరితమైన బోధనకంటే విద్యార్థి స్వశక్తికే పెస్టాలజీ అధిక ప్రాధాన్యాన్నిచ్చారు.

శిష్యుడు తన గురువు ధరించేదుస్తులకంటే, భుజించే ఆహారం కంటే తక్కువస్థాయి దుస్తులు, ఆహారం స్వీకరించాలి. తన గురువు కంటే తక్కువస్థాయి పడకనే ఉపయోగించాలి. గురువు నిద్రించిన తర్వాత నిద్రించి, గురువు మేలుకొనకముందే మేలుకొనాలి. తన గురువుకు హితంకాని ఎటువంటి వాక్కును గురువు సమక్షంలో పలికరాదు. కౌటిల్యుని అర్థశాస్త్రం ప్రకారం శిష్యుడు తన జీవితాన్ని పణంగా పెట్టి అయినా గురువుకు కృతజ్ఞుడై ఉండాలి. గురువు లేనిసమయంలో గురుపుత్రునికి, తన సహాధ్యాయులలో పెద్దవానికి కృతజ్ఞుడైఉండాలి.

**బోధనా రుసుము:**

బోధనకు ధనాన్ని ఆశించటం తీవ్రంగా ఖండిస్తూ, ధనంకోసం బోధించేవాని శూద్రునితో సమానంగా మహాభారతం భావించింది. జ్ఞానాన్ని ఈ జన్మలో జీవనంకోసం ఇతరులకు విక్రయించేవాడు తదుపరి జన్మలో దానినుంచి ఎటువంటి ప్రయోజనం పొందడు అని విష్ణుపురాణం పేర్కొంటుంది. రుసుము చెల్లించి పాఠాలు అభ్యసించటంకూడా ఉప పాతకం క్రిందకేవస్తుంది. మాళవికాగ్నిమిత్రంలో కేవలం జీవనంకోసం అధ్యయనం చేసే వ్యక్తి జ్ఞానంతో వ్యాపారంచేసే వ్యక్తి అని పేర్కొన్నారు. తన అప్రయోజక కుమారులకు బోధించినందుకు రాజు అమరశక్తి విష్ణుశర్మకు శతశాసనాలందించేందుకు సిద్ధపడగా ఆ గురువు ఇలా పేర్కొంటారు. "నాహమ్ శాసనా శతేనాపి విద్యావిక్రయం కరిష్యామి"

సాంకేతిక విద్యవిషయంలో అప్రెంటిస్‌లు తమ గురువులకు బోధనా రుసుము చెల్లించటం ఉంది. తక్షశిలలో విద్యార్థి మొత్తం బోధనారుసుమును చెల్లించాకే ప్రవేశం పొందుతాడు. అయితే అలా ధనం రూపంలో చెల్లించేందుకు బదులుగా విద్యార్థి తన గురువుకు సేవలరూపంలో చెల్లించవచ్చు. ఇలాంటివారు పగలు తమ గురు సేవచేసి, రాత్రి శిక్షణపొందుతారు. కొన్నిసమయాల్లో విద్యార్థి గురుసేవకు ఎటువంటి సమయాన్ని వెచ్చించక, పూర్తిసమయాన్ని అధ్యయనానికి వెచ్చించాలని భావిస్తాడు. అదేసమయంలో అతను బోధనారుసుము చెల్లించలేనివాడై ఉంటాడు. ఇటువంటి

సమయంలో విద్యార్థి తన విద్యాభ్యాసానంతరం రుసుము చెల్లించేందుకు అవకాశంఉంటుంది. విద్యార్థి ఏరకంగానూ రుసుము చెల్లించలేని పక్షంలో ఒక స్వచ్ఛంద సంస్థ వీరికి ఉచితవిద్య నందించేందుకు ముందుకు వచ్చేది. కొందరు తమతమ రాజ్యాలద్వారా పొందిన ఉపకారవేతనాలు గురువుకు చెల్లించి విద్యాభ్యాసం చేసేవారు.

### *1.1.9. విద్యావిధానం : రాజ్యపోషణ:*

కౌటిల్యుని అర్థశాస్త్రం ప్రకారం ప్రాచీనకాలంలో రాజ్యం అనాథలకు విద్యావసతి సౌకర్యాల కల్పనబాధ్యతలను స్వీకరించింది. రాజ్యపోషణలో పెరిగే వీరు శాస్త్రం, అంగవిద్య, మాయాగత, మతజీవనంలోని విభిన్న విధులు, జంభకవిద్య, అంతరచక్ర, సంసర్గ విద్యాశాస్త్రం వంటి అంశాలు అధ్యయనం చేసేవారు. మహమ్మదీయపాలనా కాలంలో బహ్మనీ సామ్రాజ్యంలోని కొందరు ముస్లింరాజులు అనాథల విద్యకోసం నిధులు సమకూర్చి వారికి విద్యావకాశాలు కల్పించటం విశేషం.

అంతేకాక రాజ్యం గూఢచారులకు శిక్షణనిచ్చేందుకు అవకాశాలు కల్పించింది. వీరికి వివిధ రాజ్యాలకు అనుగుణంగా మారువేషాల్లో సంచరించే కళలు, వివిధభాషలు, గూఢలేఖనం, సంజ్ఞలతో భాషణం వంటి వాటిలో శిక్షణనిచ్చేవారని కౌటిల్యుడు అర్థశాస్త్రంలో పేర్కొంటారు.

దీన్నిబట్టి ప్రాచీన భారతీయ పాలకులు విద్యపట్ల అమిత శ్రద్ధాసక్తులు చూపినట్లు తెలుస్తుంది. వీరిలోకొందరు విక్రమశిలమాదిరిగా కొన్ని ఆశ్రమ విశ్వవిద్యాలయాల స్నాతకోత్సవాల్లో పాల్గొని డిప్లొమాలు ప్రదానం చేసినట్లుగా కూడా తెలుస్తుంది. అయితే అక్కడ ప్రత్యేక విద్యాశాఖగాని, పాఠశాల, కళాశాలల పర్యవేక్షణాధికారులుగాని లేరు. అక్బర్ రూపొందించినట్లుగా పాఠశాలలు, కళాశాలలకు ఎటువంటి నియమావళిని రూపొందించలేదు. అయితే దీనివల్ల విద్యాసంస్థలకు స్వయం ప్రతిపత్తి లభించి స్వేచ్ఛగా నిర్వహించుకునే వీలుకలిగింది. పాలకులు విద్యాసంస్థల నిర్వహణకు అవసరమైన భౌతికవసతులు కల్పించి, ఉచితభూమి, కట్టడాలు, ఇతర అవసరాలకోసం నిధులు సమకూర్చినప్పటికీ వాటి నిర్వహణ విషయంలో ఎటువంటి షరతులను, నిబంధలను విధించలేదు. ప్రాచీన కాలంలో రాజులు విద్యావ్యవస్థకు పోషకులుగా ఉంటూ విశ్వవిద్యాలయాలను నిర్మించి తమ సంపదనంతా వాటికి ధారాదత్తంచేశారు కాని వాటిపైన ఎటువంటి ఆధిపత్యాన్ని కోరుకోలేదు. రాజులు సాధారణంగా గ్రామసభలకు ఆస్తులను అప్పగించి ఆప్రాంతంలోని అధ్యయన కేంద్రాలపర్యవేక్షణ వారికే కేటాయించేవారు. రాజులు ఏ కవినైనా ప్రోత్సహించాలనుకున్నా అది గ్రామసభద్వారా మాత్రమే చేసేవారని తెలుస్తున్నది.

### *1.1.10. విద్య: ప్రయోజనం:*

ప్రాచీన విద్యావిధానం మూడు ప్రధాన ప్రయోజనాలనుద్దేశించి రూపొందింది. వాటిలో మొదటిది జ్ఞానసముపార్జన. సామాజిక బాధ్యతగా మత కర్మకాండల నిర్వహణ రెండవది. మూడవది అన్నింటికంటే ముఖ్యమైనది వ్యక్తి శీలనిర్మాణం.

**విద్య : జ్ఞానసముపార్జన:**

వేదాధ్యయనానికి సరైనరూపం "స్వాధ్యాయ". ఋక్, యజుస్, సామ వేద పరిజ్ఞానం (త్రయీ) ఇందులో భాగమే. వీనితోపాటుగా భారతీయులు రూపొందించిన జ్ఞానశాఖలు వ్యాకరణం, ధ్వనివిజ్ఞానం, తర్కం, తత్త్వం వంటివి. ఇతిహాసం, వార్తా, దండనీతి, ధనుర్వేద, ఖగోళ,

న్యాయశాస్త్రాలు, వైద్యం, యంత్రశాస్త్రం, లలితకళల్లోని అన్నిశాఖలు ఉన్నాయి.

ముండకోపనిషత్తు విద్యలను 'పరావిద్యలు' 'అపరావిద్యలు' అని విభజించింది. ముండకోపనిషత్తు ప్రకారం నాలుగు వేదాలు, ఆరు వేదాంగాలు అపరావిద్యలు. 'అపరావిద్యలు'గా పేర్కొనే అన్నివిద్యలకు అతీతంగా అంతిమజ్ఞానంగా 'పరావిద్య'లను పేర్కొన్నారు. నాలుగువేదాలు, ఆరు వేదాంగాలు 'అపరావిద్య లై'తే, అంతిమజ్ఞానాన్నందించేందుకు సహాకరంచేవి 'పరావిద్య'లు.

అపరా ఋగ్వేదో యజుర్వేద: సామవేదో2థర్వవేద:

శిక్షా కల్పో వ్యాకరణం నిరుక్తం ఛన్దో జ్యోతిషమితి

అథ పరాయయా తదక్షర మధిగమ్యతే -- (ముండకోపనిషత్తు)

ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వవేదము -- నాలుగువేదాలు, శిక్షా, కల్పము, వ్యాకరణం, నిరుక్తం, ఛందస్సు, జ్యోతిషము -- వేదాంగాలు ఆరు అపరావిద్యలు అంటే శ్రేష్ఠముకాని విద్యలని, ఏ విద్యలచేత అక్షరసత్యం తెలిసికొనబడుతుందో ఆ విద్యలు పరావిద్యలు అంటే శ్రేష్ఠమైన విద్యలని ముండకోపనిషత్తు పేర్కొంటున్నది.

వేదాలు అన్ని విద్యలకు మూలమని వాటిలో అక్షరసత్యము తెలిపే విద్యలున్నాయని అందరి నమ్మకం. అయితే వస్తు జ్ఞానానికి తోడ్పడే విద్యలు ప్రకృతివిద్యలని పరిగణింపబడుతున్నాయి. ఆత్మజ్ఞానానికి, పరమార్థ జ్ఞానానికి సంబంధించిన భావప్రధానాలైన కవిత్వ, గాన, నాట్య, చిత్రలేఖన, శిల్పాది కళా విద్యలకు వేదాలు మూలమని ప్రసిద్ధి. అయితే ఆధ్యాత్మిక విద్యలకు ఆకరాలని చెప్పే వేదాలు అపరావిద్యలన్నది ఋషీశ్వరుని నిరూపణ.

పరావిద్యల అధ్యయనానికి అందరూ భౌతికంగానూ, శారీరకంగానూ సమర్థులైఉండరు. ఈ క్లిష్టతను అధిగమించేందుకు ప్రాచీన భారతీయులు విద్యను జీవితకాలంసాగే నిరంతరప్రక్రియగా భావించి, వ్యక్తి జీవితాన్ని నాలుగుదశలుగా విభజించి, ప్రతిదశలోనూ వేరువేరు బాధ్యతలను అప్పగించి, వాటినిర్వహణద్వారా తర్వాతి దశకు చేరే అవకాశం కల్పించారు. అలా వారు లౌకికప్రపంచం ఉనికిని గుర్తించి లౌకికజీవనానికి అవసరమైన వృత్తివిద్యలను కులప్రాతిపదికపై ఏర్పర్చారు.

**విద్య: సామాజిక నిబద్ధత:**

సామాజిక నిబద్ధత ప్రాచీన విద్యావిధాన లక్ష్యాలలో ఒకటి. సామాజిక నిబద్ధతకలిగిన వారు సమాజానికి భారం కారు. ఇతరుల వ్యక్తిగత విషయాల్లో జోక్యంచేసికోరు. తన శారీరక, మానసిక ఎదుగుదలకు కారణమైన సమాజాభివృద్ధికి తమవంతు సహకారాన్ని అందిస్తారు. ఈ ఉద్దేశంతోటే సామాజిక నిబద్ధతను విద్యాప్రయోజనంగా పేర్కొన్నారు.

**విద్య: శీలనిర్మాణం:**

ఆధ్యాత్మికతకు సంబంధించిన అంశాలకు భారతీయులు ప్రాధాన్యం ఇచ్చారు. భారతీయ విద్యార్థి పాఠశాల జీవితం నైతికత ప్రధానంగా రూపొందింది. వ్యక్తి అభిరుచులకు స్పష్టత చేకూర్చటం, వ్యక్తి ఆశయాలను వేగవంతంచేయటం, వాటిని పటిష్ఠం చేయటం విద్య ప్రధానబాధ్యత అన్నది ఫ్రోబెల్ భావన. వ్యక్తి శీలనిర్మాణమే విద్యపరమార్థమన్నభావనకలవాడు జర్మన్ విద్యావేత్త హెర్బర్ట్ స్పెన్సర్. ప్రాచీన భారతీయ విద్యావేత్తలు కూడా శీలనిర్మాణానికి అధిక ప్రాధాన్యమిచ్చినట్లుగా తెలుస్తుంది.

**విద్య: సత్ప్రవర్తన:**

విద్య ప్రథమ ప్రయోజనం సత్ప్రవర్తన, మంచి నడవడి (మహాభారతం, సభాపర్వం, 5వ అధ్యాయం), అధ్యయనం ముఖ్య ప్రయోజనం మంచి ప్రవర్తన, నడవడిక (మహాభారతం, ఉద్యోగపర్వం, 38వ అధ్యాయం)

స్మృతి, సృతుల ద్వారా వ్యక్తిలో చొప్పించదగిన ఉన్నత సంస్కారం వ్యక్తిత్వం. అందువల్ల కేవలం వేదాధ్యయనం ద్వారా మాత్రమే వ్యక్తి శీలనిర్మాణం జరగదన్న అంశాన్ని నాటి విద్యావేత్తలు గుర్తించారు. కౌటిల్యుని ప్రకారం అన్ని విజ్ఞానశాస్త్రాల ప్రధానలక్ష్యం జ్ఞానకేంద్రాలను అదుపులో ఉంచుకోగల్గటం.

సామాజిక సామర్థ్యాన్ని పెంపొందించడమే ప్రాచీన విద్యావిధానం ప్రధానలక్ష్యంగా ఉండేది. విద్యకు, సమాజానికి మధ్యగల సంబంధం అత్యంత ప్రధానమైనది. జీవితంలోని విభిన్న రంగాలకు అవసరమైన ఉత్తమ నిపుణులను విద్యే దేశానికందిస్తుంది. శాస్త్రం జ్ఞానాన్ని సుసంపన్నం చేసేవిధంగా ఆవిష్కరణలు చేస్తుంది. ప్రకృతిశక్తులపైన మానవులకు ఆధిపత్యాన్నిస్తుంది. విజ్ఞానశాస్త్రాన్ని సరైనవిధంగా ఉపయోగిస్తే అది మానవజీవితాన్ని సుసంపన్నం చేస్తుంది. విద్యద్వారా మానవుని ఆధ్యాత్మిక, భావాత్మక, భౌతిక సామర్థ్యాలు వృద్ధిపొందుతాయి. పేదరికానికి, దుఃఖాలకు, కష్టాలకు అవిద్యే మూలకారణం. జ్ఞానమే వీటన్నింటిని నశింపజేస్తుంది. ఇవి విద్యపట్ల భారతీయుల అభిప్రాయాలు.

విద్యకుసంబంధించిన ఈ ప్రాధాన్యత కారణంగానే ప్రాచీనభారతీయులు ప్రత్యేకించి వేదవిద్యకు, పూర్ణ జ్ఞానానికి అధిక ప్రాధాన్యతనిచ్చారు. "అధ్యయనం వ్యక్తికి ఆత్మవిశ్వాసాన్నిస్తుంది. సరైన మూర్తిమత్వాన్నిస్తుంది. శక్తి, సామర్థ్యాలను తద్వారా ఆనందాన్ని, కీర్తి, ప్రతిష్ఠలను, స్నేహాన్ని, మార్గదర్శకత్వాన్ని విద్య అందిస్తుంది" అని భర్తృహరి పేర్కొంటారు. కల్హణుడు తన రాజతరంగిణిలో మూర్ఖులు హేళనచేసినా అధ్యయనమనే వృక్షం తన వేర్లు, మొగ్గలు కనిపించకపోయినా సంక్షోభసమయంలో ఫలాలనందిస్తుందని పేర్కొన్నాడు. మహాభారతంలో పేర్కొన్నట్లు అభ్యాసం, ధైర్యం, నైపుణ్యం, శక్తి, సహనం మనిషికి సహజ మిత్రులు. .

గౌతమసంహిత ప్రకారం సంపద, సంబంధాలు, పుట్టుక, చర్యలు, జ్ఞానము, వయస్సు వ్యక్తికి గౌరవాన్నిచ్చే మౌలికాంశాలు. అయితే వీటిలో జ్ఞానం ఉత్తమస్థానాన్ని ఆక్రమిస్తుంది. ఇది ఆరోగ్యానికి, విజయాలకు ఆధారభూతమైనది. మనువు ప్రకారం నిజాయితీగా సంపాదించిన ధనం, బంధువులు, స్నేహితులు, వయస్సు, శ్రమ, జ్ఞానం అనేవి వరుసగా ఒకదానిని మించినవి. వశిష్ఠసంహిత ప్రకారం అధ్యయనం, సంపద, వయస్సు, బంధుత్వం, వృత్తి అదేక్రమంలో గౌరవించదగినవి. అన్నింటికంటే అధ్యయనం ఉత్తమమైనది. మహాభారతంలో అష్టావక్ర అభిప్రాయంలో కాని మనువు ప్రకారంకాని వయసు, నెరిసిన జుట్టు, సంపద, మిత్రులు ఒక వ్యక్తికి పెద్దవానిగా గుర్తింపునివ్వవు. వేదవేదాంగాలను అధ్యయనం చేసినవ్యక్తే గొప్పవాడిగా గుర్తింపుపొందుతాడు.

అధ్యయనాన్ని మించిన సంపద మరేదీలేదు. వాస్తవానికి ప్రాచీన కాలంలో ఒక వ్యక్తిని బ్రాహ్మణునిగా గుర్తించేందుకు జ్ఞానం ప్రాథమిక అర్హతగా భావించేవారు. తర్వాతికాలంలోకూడా బ్రాహ్మణత్వం పుట్టుకద్వారా నిర్ణయింపబడే సమయంలో కూడా వేదాధ్యయనం అందరు బ్రాహ్మణుల తప్పనిసరి విధిగా భావించటం కనిపిస్తుంది.

అదేవిధంగా బ్రాహ్మణేతరులైనవారు అధ్యయనశీలురైతే వారిమంచి అధ్యయనం

చేయవచ్చునని గుర్తించవచ్చు. స్త్రీలు, రత్నాలు, జ్ఞానసంపద, విజయం, పవిత్రత, మంచిమాట, వివిధరకాలైన కళలు-- వీటిని ఎక్కడినుంచైనా పొందవచ్చున్నది మనువు అభిప్రాయం. సంక్షోభసమయాల్లో బ్రాహ్మణవిద్యార్థి బ్రాహ్మణేతర గురువునుంచి పాఠాలను అభ్యసించవచ్చును. గౌతముడు కూడా సంక్షోభసమయంలో బ్రాహ్మణవిద్యార్థి శాస్త్ర, కళలను బ్రాహ్మణేతరులనుంచి అభ్యసించవచ్చని పేర్కొంటాడు.

శుక్రాచార్యుని భావనలో వ్యక్తి నిరుపేదైనా వయసు, అధ్యయనం, అందం ఉంటే అతనికి కుమార్తెనిచ్చి వివాహం చేయవచ్చు. అందం, వయసు, సంపదల ఆధారంగా పెళ్ళికుమారుని నిర్ణయించకూడదు. ముందుగా కుటుంబాన్ని, అధ్యయనాన్ని, వయసును, ప్రవర్తనను, సంపదను, రూపాన్ని చివరగా జన్మస్థలాన్ని ఇదేక్రమంలో పరిగణనలోకి తీసుకున్న తర్వాతనే వివాహప్రస్థావనచేయాలని పేర్కొనేవారు.

ప్రాచీనభారతంలో జ్ఞానానికి, అధ్యయనానికి అధిక ప్రాధాన్యత లభించింది. ప్రాచీన విద్యాసంస్థస్థాయి, అవి సాధించిన విజయాలు ప్రామాణికమైనవిగా నిలుస్తాయి. మొత్తంమీద ప్రాచీనకాలంలో విద్యకు సంబంధించి రెండు భావనలు కనిపిస్తాయి. తాత్వికత ఆధారంగా అలౌకిక ప్రపంచానికి అనుగుణంగా వ్యక్తిని సిద్ధంచేసేదే విద్య అన్నభావన ఒకటి. కులప్రాతిపదికన ఏర్పడిన వృత్తుల ఆధారంగా జీవనానికి దోహదపడేదే విద్య అనేభావన మరొకటి. మౌలికమైన విద్యనందించేందుకు ప్రాథమిక పాఠశాలలు ఏర్పడినప్పుడు అవి వృత్తిశిక్షణకు ఉద్దేశించినవిగానే పనిచేశాయి. అదేసమయంలో ఈ విద్యావిధానం అనేకమంది మేధావులను రూపొందించి మేధోపరంగా దాని ప్రాధాన్యాన్ని నిలుపుకొన్నది.

==================

## మధ్యయుగంలో విద్యభావన

మధ్యయుగంలో ప్రజలకు శిక్షణనిచ్చేందుకు ప్రత్యేకమైన సంస్థలు లేవు. మొగల్ పాలకులకు విద్య పట్ల ఆసక్తి ఉన్నప్పటికీ, వారు విద్యకోసం ప్రత్యేక శాఖనుమాత్రం ప్రారంభించలేదు. అంటే ఆకాలంలో విద్య పట్ల రాజ్యం ఎటువంటి బాధ్యత వహించలేదు. అయితే పాలకులు విద్యాసంస్థల స్థాపనకు, వాటిపోషణకు కృషిచేశారు. పండితులను ప్రోత్సహించటంతో పాటుగా వారికి ఉదారంగా ఆర్థికసహాకారాన్నందించేవారు.

ఇస్లాం అధ్యయన సంస్థలు మక్తాబ్, మద్రసాలకు ప్రభుత్వం, ప్రైవేట్ వ్యక్తులు ఆర్థిక సహాయాన్నందించేవారు. ఉపాధ్యాయులను రాజ్యం నియమించేది. ఈ విద్యాసంస్థలకు పెద్దమొత్తంలో ఆస్తులు కూడా అమరేవి. ముక్తాబ్‌లు, మద్రసాలతోపాటుగా ముస్లిం పాలకులు స్థాపించిన మసీదులుకూడా విద్యా కార్యక్రమాలకు కేంద్రాలుగా ఉండేవి. బహుశా చాలాచోట్ల ముక్తాబ్‌లు, మద్రసాలు మసీదులలోనే కలిసిఉండటం ఇందుకు కారణం కావచ్చు. ప్రవక్తల ఖాన్‌ఖాస్‌లు కూడా కొన్నిచోట్ల విద్యాకేంద్రాలుగా ఉండేవి.

మహమ్మదీయుల దండయాత్రలు, వారి పరిపాలన భారతీయ సామాజికవ్యవస్థలో అనేక మార్పులకు కారణమైంది. ఈ మార్పులు విద్యారంగంలోకూడా ప్రతిఫలించాయి. విదేశీయులు పాలకులుకావటంతో భారతీయ విద్యా రంగంలోని దేశీయస్వభావానికి ఆటంకం ఏర్పడింది. అయినా స్వదేశీ విద్యావిధానం ప్రైవేట్‌వ్యక్తుల సహాయంతో తన ఉనికిని నిలుపుకోగలిగింది. ముస్లిం ఆక్రమణదారులు భారతీయ విశ్వ విద్యాలయాలను ధ్వంసం చేసినట్లుగాను, అందలి గ్రంథాలయాలను నాశనం చేయడంతో పాటుగా, హిందూ, బౌద్ధ మతాలకు చెందిన పండితులను హత్యచేయడమో లేదా రాజ్యంనుంచి బహిష్కరించడమో చేసినట్లుగాను ఆనాటి రచనల ఆధారంగా మనకు తెలుస్తుంది. అయితే రాజ్యంనుంచి ప్రోత్సాహం లభించకపోయినా కొన్ని సేవాసంస్థల సహాయ సహకారాలతో దాదాపు రెండువందల సంవత్సరాలపాటు స్వదేశీ విద్యావిధానం తనఉనికిని నిలుపుకోగలిగింది.

ముస్లింలపాలన ప్రథమదశలో ఉత్తరభారతదేశంలో వారి జనాభా అధికంగా నగరాలు, పట్టణాల్లోనే కేంద్రీకృతమై ఉండేది. పాలకులు ముస్లింవిద్యను బాగా ప్రోత్సహించారు. అయితే మొదట్లో ముస్లింవిద్య ఎక్కువగా పట్టణాలకే పరిమితమైంది. గ్రామాల్లో అంతగా వ్యాప్తి చెందలేదు. కొద్దిమంది ముస్లింరాజులుమాత్రం దేశీయవిద్యను ప్రోత్సహించటంతోపాటుగా సంస్కృత గ్రంథాలను అరబిక్, పర్షియన్ భాషల్లోకి అనువదింపజేశారు. కాని వారిలో అనేకమంది భారతీయవిద్యను నిర్లక్ష్యంచేసి, దేవాలయాలను, ఆరామాలను విధ్వంసం చేయటం, భారతీయ విద్యాసంస్థలను మూసివేయటం వంటి చర్యలద్వారా ఆ విద్యావిధానానికి తీవ్రమైనహానిచేశారు.

కాల క్రమంలో పర్షియన్ మహమ్మదీయుల అధికారభాష అయింది. పూర్వంలో మక్తాబ్‌లు, మద్రసాలు ముస్లింలకే ప్రత్యేకించబడినా తర్వాతికాలంలో హిందువులకుకూడా ప్రవేశం లభించింది. బ్రాహ్మణుల వలన విద్యాసౌకర్యాలకు దూరమైన నిమ్నవర్గాల ప్రజలకు ముస్లిం విద్యాసంస్థలు

ప్రవేశం కల్పించాయి. ఒకవైపు భారతీయులు పర్షియన్ నేర్చుకొనటం, మరోవైపు మహమ్మదీయులు సంస్కృతగ్రంధాలను అనువదించడం కారణంగా ఈ రెండింటి కలయికతో ఒక నూతన భాష ఆవిర్భవించింది. అదే ఉర్దూ.

### *1.2.1. ముస్లిం విద్యావిధానం- ప్రాధమికవిద్య/ మౌలికవిద్య:*

మధ్యయుగంలో ప్రాధమిక పాఠశాలలపై మహమ్మదీయ ఆధిపత్యం బాగానే ఉన్నట్లుగా తెలుస్తున్నది. అయితే పాలకులు పార్శీని అధికారభాషగా ఉపయోగించటంతో హిందువులు సైతం ప్రభుత్వోద్యోగాల కోసం మహమ్మదీయపండితులవద్ద పార్శీని అభ్యసించాల్సి వచ్చింది. ఈ పార్శీ ప్రాధమిక పాఠశాలలు మహమ్మదీయకాలంలో బాగా పెరిగాయి. అక్బర్ సన్నిహితమిత్రుడు, మంత్రి అబుల్‌ఫజల్ ఇలా అంటారు. "భారతదేశంలో ఉపాధ్యాయుడు --అక్షరజ్ఞానం, అర్థవిజ్ఞానం, పద్యజ్ఞానం, ఛందోజ్ఞానం, క్రితం పాఠ్యాంశం-- ఈ ఐదింటిలో శ్రద్ధ కనబరవాల్సి ఉంటుంది. ప్రతివిద్యార్థి నీతివిద్య, అంకగణితం, వ్యవసాయవిజ్ఞానం, క్షేత్రగణితం, జ్యామితి, ఖగోళశాస్త్రం, భౌతికవిజ్ఞానం, గృహవిజ్ఞానం, ప్రభుత్వపాలన, వైద్యం, తర్కం, తబి, రియాజి, ఇలాహి విజ్ఞానాలు, చరిత్ర వంటి అంశాలు క్రమంగా అధ్యయనం చేసేవీలుంటుంది. సంస్కృతాధ్యయన సందర్భంలో విద్యార్థులు వ్యాకరణం, నియాయ్, వేదాంత, పతంజలి లను అధ్యయనం చేయాల్సి ఉంటుంది"

జ్ఞానమే సత్యావిష్కరణకు మూలమని భావించిన ఇస్లాం, జ్ఞానార్జనకు అధిక ప్రాధాన్యాన్నిచ్చింది. (Amir Ali.1906:361) విద్య ప్రాధాన్యతను గుర్తించిన మహమ్మద్‌ప్రవక్త విధేయులైన స్త్రీ పురుషులందరికీ విద్యను తప్పనిసరి చేశాడు. కాబట్టి స్త్రీలు విద్యకు అనర్హులు అన్న భావన నాడు లేదని భావించవచ్చు. బీబీ ఫాతిమా, జైనాబ్, హమ్జా, హఫ్సాహ్, సఫియా, మరియా వంటి అనేకమంది ముస్లిం స్త్రీలు సాహిత్యంలో రాణించారు. భారతదేశంలోని ముస్లింలు విద్యార్జనపట్ల నిర్లక్ష్యంచూపలేదు. ముస్లింల పాలనాకాలంలో భారతదేశంలో మక్తాబ్, మద్రసాలు, మసీదులు, మఠాలద్వారా, ప్రైవేట్ గృహాలద్వారా విద్యావ్యాప్తి జరిగింది. ఆరోజుల్లో విద్యార్థికి అధ్యాపకునికి మధ్య చర్చలద్వారా జ్ఞాన సముపార్జన జరిగేది. మసీదులకు అనుబంధంగా పాఠశాలలుండేవి. ఈ పాఠశాలలు రాజ్యంనుంచి లభించేనిధులతో, భూస్వాముల, ధనికుల సహాయంతో నడిచేవి. ప్రాధమికవిద్య మక్తాబ్‌లద్వారా, సెకండరీవిద్య మద్రసాలద్వారా లభించేది.

అయితే మతబోధకులు, మౌల్వీల ఆధ్వర్యంలో మక్తాబ్‌లుండటంవల్ల అక్కడి బోధనకు మతం భూమికగా నిలిచింది. ఇదేలక్షణంతో గృహ కేంద్రంగా కూడా విద్యావిధానం సాగింది. ముల్లా, మౌల్వీ, మౌలానాల గృహాలన్నీకూడా విద్యా కేంద్రాలే. వీరివద్ద విద్యనభ్యసించే విద్యార్థులకు ఉచిత భోజన, వసతి సదుపాయాలు లభించేవి. ఇలాంటి విద్యా కేంద్రాల్లో విద్యనభ్యసించిన వారిలో మంచి పాండిత్యాన్ని పొందినవారుకూడా ఉన్నారు.

మహమ్మదీయ పాలనలో భారతదేశంలో మరోరకం విద్యావిధానం కూడా ఉండేది. కుల, మత, వర్గ, జాతి భేదాలతో సంబంధంలేకుండా గ్రామీణప్రాంతంలోని పిల్లలకు పఠన, లేఖన, గణితాల్లో మూడింటిలో శిక్షణలభించేది. ఈ బోధనలో ప్రతిఫలాపేక్ష ఉండేదికాదు. బ్రిటిష్ ఆక్రమణకు ముందువరకు బెంగాల్ ప్రాంతంలో ఎనభైవేలకు పైగా ఇటువంటి పాఠశాలలు పనిచేసేవి. వాస్తవానికి ముస్లింపాలనకు ముందుకూడా ఇటువంటి గ్రామీణ పాఠశాలలుండేవి. ముక్తాబ్‌లలో పఠన లేఖనాలతో పాటుగా మతకర్మకాండల నిర్వహణకు అవసరమైన భాగాలను ఖురాన్‌నుంచి అధ్యయనం చేయాల్సి

ఉండేది. అయితే ఈ ముక్తాబ్‌లలో హిందువులకు కూడా ప్రవేశం లభించేది. ప్రభుత్వంలో ఉన్నతస్థాయి అధికారాన్ని పొందాలంటే పర్షియన్, అరబిక్ భాషల అధ్యయనం తప్పనిసరి కావడంతో అనేకమంది హిందూ విద్యార్థులుకూడా వీటిలో చేరేవారు. పేదలకు అనాథలకు ఉచితవిద్య నందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక పాఠశాలలను కూడా నెలకొల్పింది.

ముస్లిం పిల్లలు, రాజకుమారులు నాలుగు సంవత్సరాల, నాలుగు నెలల, నాలుగు రోజులు నిండగానే బిస్మిల్లా-ఖాని క్రతువును నిర్వహించి వివిధ కళలు, శాస్త్రాల అధ్యయనానికి నాంది పలికేవారు. సురాహ్-ఈ-ఇక్రా అనే అధ్యాయాన్ని ఖురాన్‌నుంచి పఠనంచేసి విద్యార్థిచేత పలికించేవారు. ఈ విధానం మొఘలుల కాలానికి ముందునుంచి ఉండేది. ప్రస్తుతం కూడా కొనసాగుతున్నది. మొఘలుల కాలంలో అనేకమైన మక్తాబ్‌లు స్థాపించబడ్డాయి. జహంగీర్ కాలంలో ముఖ్య మైన పట్టణాల్లో, గ్రామాల్లో మక్తాబ్‌లు, ప్రైవేట్ పాఠశాలలు ప్రారంభ మైనాయి.

ఆ కాలంలో ప్రాథమికస్థాయిలో ముద్రిత పుస్తకాలు లేవు. మట్టిలోకాని, తక్తీ అనే చెక్క పలకపైనకాని విద్యార్థులు తమ వేళ్ళతో అక్షరాలు దిద్దేవారు. అక్షరాల అధ్యయనం తరువాత కఠినమైన పదాలు నేర్పేవారు. ఈ పదాలు  ఖురాన్‌నుంచి ఎంపికచేసినవై ఉంటాయి. వాటి పద నిర్మాణం, అర్థం వివరించేవారు. దస్తూరీ పట్ల అత్యంత శ్రద్ధ కనబరిచేవారు. పఠన, లేఖనాల అనంతరం వ్యాకరణం బోధించేవారు. ఈ బోధనకు అవసరమైన పాఠ్యాంశాన్ని ఖురాన్‌నుంచి గ్రహించేవారు. అయితే అర్థం పట్ల అవగాహన లేకుండానే పిల్లలు పాఠ్యాంశాన్ని భట్టీయం పట్టేవారు. అయిదు ప్రార్థనలకు అవసరమైన భాగాలను మాత్రం వారు తప్పక అధ్యయనం చేయవలసి ఉండేది. అలా మక్తాబ్‌లలో ఇచ్చే శిక్షణ మతం ప్రధాన భూమిక కలదిగా సాగింది. ఖురాన్ అధ్యయనం అనంతరం విద్యార్థులు, గులిస్థాన్, బస్తన్ లనుంచి పాఠాలను, ఫిరదౌసి కవితలను అధ్యయనం చేసేవారు. తరగతి మొత్తంచేత బిగ్గరగా వల్లెవేయించటం ద్వారా పహరాప్ (ఎక్కాలు) అధ్యయనం సాగేది.

మధ్యాహ్నభోజన విరామంతో మక్తాబ్‌లు ఉదయం సాయంత్రం పనిచేసేవి. బోధనకోసం ఎటువంటి ధనాన్ని వసూలు చేసేవారు కారు. అయితే విద్యాభ్యాసానంతరం విద్యార్థులు గురుదక్షిణ చెల్లించే అవకాశం మాత్రం ఉండేది. ధనాపేక్షతో బోధించేవారిని పాపులుగా పరిగణించేవారు. ఉచితవిద్యతో పాటుగా విద్యార్థులకు ఉచిత భోజన, వసతి సదుపాయాలను కల్పించవలసిన బాధ్యత ఉపాధ్యాయునిదిగానే ఉండేది. వివాహం వంటి సందర్భాలలో లభించే కానుకల ద్వారా ఉపాధ్యాయుడు విద్యార్థుల ఖర్చు భరించాల్సి వచ్చేది. (J.N. Sarkar.1919:299)

విద్యార్థి నైతిక, మానసిక వికాసం మహమ్మదీయ విద్యావిధాన ప్రధానలక్ష్యంగా ఉన్నట్లుగా తెలుస్తున్నది. విద్యావిధానం అక్బర్ కాలంలో ఉన్నతశిఖరాలను చేరింది. పాఠ్యాంశాల నాణ్యత పెరిగింది. విద్యార్థులు తమ జీవితలక్ష్యాలకు అనుగుణమైన విద్యనుపొందేందుకు కావలసిన అవకాశాలన్నింటిని ఆ విద్యావిధానం కల్పించింది. నాటి విద్యావిధానంలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు పాఠ్యాంశాల ఎంపిక విషయంలో పూర్తి స్వేచ్ఛ ఉండేది. అయితే వయసుకు అనుగుణంగా విద్యార్థులు తప్పనిసరిగా అధ్యయనం చేయాల్సిన అంశాలు మాత్రం కొన్ని ఉండేవి. అంటే ప్రయోజనాత్మకమైన విద్యను పాఠ్యాంశాలలో భాగం చేశారు. తక్కువ సమయంలో, ఎక్కువ అంశాలను అధ్యయనం చేసేందుకు అనుగుణంగా విద్యాబోధనను పటిష్టపరిచారు.

ముందుగా పర్షియన్ వర్ణమాలను సరైన ఉచ్చారణతో బోధించేవారు. అనంతరం రెండక్షరాల పదాలను చెప్పేవారు. ఆ తర్వాత వాక్యాలను తప్పులేకుండా చదవటం నేర్పేవారు. అలా విద్యార్థులు

స్వయంగా చదవగల్గేవారు. అవగాహనను కొనసాగించేందుకు పున: బోధన, పున:విమర్శలు జరిపేవారు. దీనివల్ల పాఠ్యాంశాల అధ్యయనకాలం తగ్గి అధ్యయనాన్ని పటిష్ఠంచేసేందుకు వీలుకలిగేది. మత, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక ఐక్యతను పెంపొందించేందుకు అక్బర్ కుల, మత ప్రమేయంలేని లౌకిక అధ్యయన విధానాన్ని ప్రవేశపెట్టాడు. ఫలితంగా వివిధ మతాలకు చెందిన విద్యార్థులందరికీ ఒకే పాఠశాలలో ఒకే పాఠ్యాంశాలను బోధించేవారు. దీనివల్ల ఒకేజాతి భావన, భిన్నత్వంలో ఏకత్వ భావన పెంపొందేందుకు అవకాశం చిక్కింది. సమకాలీన అంశాలను నిర్లక్ష్యం చేయుటం భావ్యం కాదనే ఉద్దేశ్యంతో అక్బర్ జీవితావసరాలకు ఉపకరించే విద్యకు ప్రాధాన్యతనిచ్చాడు. అయితే ఆకాలంలో నేటి మాదిరిగా విద్యకుసంబంధించి ఎటువంటి ప్రభుత్వశాఖలు లేవు. విద్యాశాఖాధికారులుకూడా లేరు. కొన్ని పాఠశాలలుమాత్రం చక్రవర్తి స్వంత పర్యవేక్షణలో పనిచేసేవి.

కుల, మత ప్రమేయంలేకుండా మహమ్మదీయ విద్యాసంస్థలు పనిచేస్తుండటంతో హిందూమతంలోని కులవ్యవస్థ ప్రభావం కొంతమేరకు తగ్గింది. అయితే మహమ్మదీయపాలకులు విద్యావ్యాప్తిలో స్థిరమైన పద్ధతులు అవలంభించకపోవటం, ప్రజల పేదరికం ఫలితంగా విద్యావిధానం నిర్లక్ష్యానికి గురైంది. మహమ్మదీయ పాఠశాలల్లో పర్షియన్ మాధ్యమంద్వారా విద్యావిధానం సాగేది. కాని ఖురాన్ అరబిక్‌లో ఉన్నందున అరబిక్ తప్పనిసరిగా అధ్యయనం చేయాల్సి ఉండేది. ఈ విద్యాసంస్థలలో హిందువులకుకూడా ప్రవేశం లభించేది. ఇప్పుడు ఆంగ్ల విద్యమాదిరిగానే నాడు రాజ్యపాలనలో అధికారం కోసం భారతీయులు పర్షియన్‌ను అభ్యసించేవారు.

*2.ఇస్లాంవిద్యావిధానం-- ఉన్నత విద్య:*

ముందు చెప్పినట్లుగానే ముస్లిం విద్యావిధానం ముస్లిం రాజులనుండి, ప్రైవేటువ్యక్తుల నుండి సహాయసహకారాలు పొందింది. కానీ ఇస్లాం విద్యావిధానం భారతీయ విద్యావిధానంతోనూ, బౌద్ధ విద్యావిధానంతోనూ అనేక అంశాల్లో విభేదించింది. అధికారులు విద్యావ్యాప్తినెరపటంలో అనుసరించిన అస్తవ్యస్త విధానాలే ముస్లిం విద్యావిధానం భారతదేశంలో నిలదొక్కుకోలేక పోవటానికి కారణమైనాయి. ఒక రాజుద్వారా గొప్ప ప్రోత్సాహాన్ని పొందిన విద్యారంగం, తర్వాతి కాలంలో మరొకరిచేత నిర్లక్ష్యానికి గురయ్యేది.

మాధ్యమిక, ఉన్నతవిద్యకు సంబంధించిన ముస్లిం పాఠశాలలను, కళాశాలలను 'మద్రసాల'ని పిలిచేవారు. ఇవి మసీదులకు జతపడి ఉండేవి. కొన్నిసార్లు ఇవి ప్రముఖవ్యక్తుల సమాధులకు కూడా జతపడి ఉండేవి. ఈ సమాధులలో ఉండే అనేకగదులను విద్యార్థులవసతికోసం వినియోగించేవారు. వీనిలో కొన్ని మద్రసాలు విశ్వవిద్యాలయ స్థాయిని కూడా పొందాయి. ఈ మద్రసాలు మతాన్ని భూమికగా కలిగి ఉన్నాయి. ఈ సంస్థలద్వారా ఇస్లాం మత సంప్రదాయాలని, ఆచారాలని బోధించేవారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎప్పుడూ ఒకరికొకరు సన్నిహితంగా ఉండేవారు. అలా తమ జ్ఞానాన్ని విస్తృత పరచు కునేందుకు అవసరమైన పద్ధతులను ఉపాధ్యాయులనుంచి గ్రహించేవారు. మధ్యయుగంలో తూర్పుబెంగాల్ మినహా భారతదేశమంతటా ముస్లింలు దాదాపు పట్టణప్రాంతాల్లోనివసించేవారే. ఫలితంగా హిందూ పండితుల మాదిరిగా కాకుండా ముస్లిం పండితులు ప్రధానంగా పట్టణాల్లోనే పనిచేశారు. ఆగ్రా, ఢిల్లీ, లాహోర్, జాన్‌పూర్, గుజరాత్, సియాల్‌కోట్, అహ్మదాబాద్ వంటి అనేక నగరాలు ముస్లింల ఉన్నతవిద్యకు ప్రధానకేంద్రాలుగా

రూపొందాయి. అక్బర్‌కాలంలో మినహా మిగిలినకాలంలో సద్ర్ అని పిలిచే మతాధికారే విద్యా వ్యవహారాలన్నింటికీ అధికారిగా ఉండేవారు. ఇతను ముస్లిం విద్యావిధానంలో ఒక తనిఖీ అధికారిగా ఉండేవాడు.

ఢిల్లీసుల్తానులుకూడా విద్యపట్ల మంచి శ్రద్ధను కనబరిచారు. ఘజనీ తరువాతివారు రాజధానిని ఘజ్నీనుంచి లాహోర్‌కిమార్చటంతో 12వశతాబ్దంలో లాహోర్ ముస్లిం అధ్యయన కేంద్రంగా మారింది. అల్లావుద్దీన్‌ఖిల్జీ కాలంలో బదౌని ప్రముఖ ముస్లిం అధ్యయన కేంద్రంగా పేరుపొందింది. విద్యావ్యాప్తిపట్ల జహంగీర్‌కూడా అమితశ్రద్ధచూపాడు. తను రాజ్యాధికారం చేపట్టినవెంటనే, అంతవరకూ పాడుబడిన అనేక మక్తాబ్‌లు, మద్రసాలను పునరుద్ధరించాడు. ఔరంగజేబు కూడా ముస్లింవిద్య పట్ల అమితాసక్తి చూపాడు. అయితే హిందువుల విషయంలో మాత్రం అత్యంత కఠినంగా ప్రవర్తించాడు.

మొఘలులకాలంలో రాజులు, ప్రైవేటువ్యక్తులు అనేక కళాశాలలు స్థాపించినప్పటికీ భారతదేశంలో ఆకాలంలో విద్య విస్తృతంగా వ్యాప్తిచెందలేదని తెలుస్తున్నది. జహంగీర్, షాజహాన్ కాలాల్లో తరచూ కళాశాలల పునరుద్ధరణ జరగటాన్నిబట్టి కళాశాలల వ్యవస్థాపకులు మరణించిన వెంటనే లేదా స్థాపకులకు ఉత్సాహంతగ్గిందని తెలుసుకున్న వెంటనే ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆ కళాశాలను విడిచివెళ్ళేవారన్నవిషయం తెలుస్తున్నది.

**A.సాధారణ పాఠశాలలు:**

ముస్లిం విద్యార్థులు మహమ్మదీయ ఉపాధ్యాయులు నడిపే పాఠశాలల్లో మాత్రమే ముస్లింవిద్యను అభ్యసించేవారు. ఐతే వీరు భూగోళశాస్త్రము, జ్యోతిషశాస్త్రము, గణితశాస్త్రము, వైద్యశాస్త్రము వంటి మతేతర విషయాల అధ్యయనంకోసం హిందూ ఉపాధ్యాయులు నడిపే పాఠశాలలకు కూడా హాజరయినట్లు ఆధారాలున్నాయి. హిందువులు మహమ్మదీయ ఉపాధ్యాయుల మద్రసాలకు హాజరైనట్లులేదు. అక్బర్‌కాలంలోమాత్రం పర్షియన్ అధికారభాష కావటంతో పర్షియన్ అధ్యయనంకోసం హిందువులు మద్రసాలకు హాజరుకావటం మొదలైంది.

డిగ్రీతర్వాత ఉన్నతవిద్యను కొనసాగించదలచినవారు తమతమ ప్రత్యేకరంగాల్లో నైపుణ్యంకోసం పేరుపొందిన పండితుని వద్ద కొన్నిసంవత్సరాలు గడపాల్సిఉండేది. ముస్లిం విద్యార్థి తప్పనిసరిగా మతసంప్రదాయాలను అభ్యసించేవాడు. పేరుపొందిన ఉపాధ్యాయులు ఎంపికద్వారా మాత్రమే విద్యార్థులను చేర్చుకునేవారు. ఇంకా ఉన్నతవిద్యను అభ్యసించాలనుకునేవారు పాశ్చాత్య, మధ్యఆసియాలలో ముస్లిం విద్యకు ప్రధానకేంద్రాలైన మక్కా, మదీనా, బస్రా, కుఫా, యెమెన్, డేమాస్కస్, కైరో, నిషాపూర్ (ఇరాన్), బాగ్దాద్, హిజాజ్, ఖురసాన్ వంటి ప్రదేశాలకు వెళ్ళాల్సి ఉండేది. అనేకమంది ముస్లింలతోపాటు భారతదేశంనుంచి ఒకరిద్దరు హిందువులుకూడా ఆప్రాంతాలకువెళ్ళి అధ్యయనం చేసినట్లుగా తెలుస్తున్నది.

**B.పాఠ్యాంశాలు:**

భారతదేశంలో మధ్యయుగంలో మద్రసాలలోను, ఇతర ఉన్నత అధ్యయనకేంద్రాల్లోను ఎటువంటి పాఠ్యాంశాలను బోధించేది సరైన సమాచారమేదీ మనకు లభించలేదు. ప్రసిద్ధ వ్యక్తుల జీవితచరిత్రల సంకలనం 'ముంతఖాబ్-ఉత్- తవరీఖ్' లో బదౌని ఆకాలంలోని పండితులు, కవులు నాటి పాఠ్యాంశాల్లోని అన్ని గ్రంధాలను అధ్యయనంచేసినట్లు పేర్కొన్నాడు. అయితే ఆ గ్రంధాల పేర్లుకాని ఆనాటి పాఠ్యాంశాల వివరాలుగాని అందులో పేర్కొనలేదు. కొందరు ముస్లిం రాజులు

అధ్యయనంచేసిన గ్రంథాలు మాత్రమే నాటి పాఠ్యాంశాల గురించిన సమాచారానికి ఆధారంగా నిలుస్తాయి.

అధ్యయనాంశాలను బదౌనీ విజ్ఞానశాస్త్ర, విజ్ఞానశాస్త్రేతర అంశాలుగా విభజించాడు. మేధస్సుతో సాధన చేయాల్సిన అంశాలను శాస్త్రాంశాలలో చేర్చాడు. అవి తత్త్వశాస్త్రము, ఖగోళశాస్త్రము, జ్యామితీయగణితము, జ్యోతిష శాస్త్రము, యాంత్రిక శాస్త్రము. మిగిలిన అంశాలు కేవలం జ్ఞాపకశక్తికి మాత్రమే పరిమితమైనవి.

అధ్యయనాంశాలను అబుల్‌ఫజల్ ఇలాహి, రియాజి, తబికీ అనే మూడురకాలుగా విభజించాడు. ఇలాహి పవిత్ర మతసంప్రదాయాలకు సంబంధించినది. గణితము, ఖగోళశాస్త్రము, సంగీతం, వైద్యశాస్త్రాలకు సంబంధించినది రియాజి. అన్ని భౌతికశాస్త్రాలు తబికీ క్రిందకువస్తాయి. ముస్లింవిద్యాసంస్థలలో అధ్యయనాంశాలు వ్యాకరణం, అలంకారశాస్త్రం, తర్కం, మతధర్మశాస్త్రం, అధిభౌతిక శాస్త్రం, సాహిత్యం, న్యాయశాస్త్రం. ఖగోళశాస్త్రం, గణితము, వైద్యశాస్త్రంకూడా పాఠ్యాంశాల్లో భాగంగా ఉన్నాయి. దార్-ఇన్- నిజామియా రచనల్లో ఔరంగజేబుకాలంలో అమలులోఉన్న అరబిక్ పాఠ్యాంశాల వివరాలున్నాయి. ఆ వివరాల ప్రకారం వ్యాకరణం, వాక్యవిజ్ఞానం, అలంకారశాస్త్రం, తత్త్వశాస్త్రం, తర్కం, బోధనాశాస్త్రం తోపాటుగా విద్యార్థులు తఫ్సీర్ (ఖురాన్‌లోని ప్రధానాంశాలు), ఫిఖ్ (మహమ్మదీయ న్యాయశాస్త్రం), హదీస్ (ప్రవక్త ఆచారాలు), గణితశాస్త్రాలనుకూడా అధ్యయనం చేయాల్సిఉండేదని తెలుస్తున్నది. క్రీ.శ॥ 1688లో ఓ హిందూరచయితరాసిన 'ఖులాసతు-ఇ-మక్తిబ్' లో మద్రసాలలో ఉపయోగించిన పర్షియన్ గ్రంథాల పూర్తిసూచిక ఇచ్చినట్లుగా తెలుస్తున్నది. ఇల్తుత్‌మిష్ కాలంనుంచి మద్రసాలలోని పాఠ్యాంశాలు ఒకేవిధంగా ఉన్నాయి. విద్య ప్రధానంగా మతప్రాధాన్యం కలదిగా ఉండేది. ఈ మద్రసాలలో ప్రధానంగా బోధించే అంశాలు తఫ్సీర్ (ఖురానలోని ప్రధానాంశాలు), హదీస్ (సంప్రదాయం), ఫిఖ్ (న్యాయశాస్త్రం). ఈ అంశాలతోపాటుగా వ్యాకరణం, సాహిత్యం, తర్కం, మార్మికవిజ్ఞానం, బోధనావిజ్ఞానం ఉండేవి.

మొఘలులపరిపాలన ఉత్తరార్థంలో అధ్యయనంలో హేతు విజ్ఞానశాస్త్రాలు ఆధిక్యత వహించాయి. 18వ శతాబ్దం మధ్యభాగంలో ముల్లా నిజాముద్దీన్ రూపొందించిన పాఠ్యప్రణాళిక దేశవ్యాప్తంగా అందరూ అనుసరించినట్లుగా తెలుస్తున్నది. అందులో ఖగోళ అక్షాంశ విజ్ఞానం, బీజోత్పత్తి విజ్ఞానం, వ్యాకరణం, వాక్యవిజ్ఞానం, తర్కం, తత్త్వశాస్త్రం, గణితశాస్త్రం, అలంకారశాస్త్రం, న్యాయశాస్త్రం, న్యాయసూత్రాలు, తార్కికవిజ్ఞానం, సాంప్రదాయ విజ్ఞానం ఉన్నాయి. కొన్ని దశాబ్దాల అనంతరం మరి నాలుగు అంశాలు పాఠ్యాంశాలుగా చేర్చారు. అవి సాహిత్యం, చట్టాలు, వివాదాలు, హెదిస్ సూత్రాలు.

ఈ పద్ధతిలో పాఠ్యపుస్తకాలకు తగినప్రాధాన్యత లేదు. అధ్యయనానికి సంబంధించిన సమాచారమంతా ఉపాధ్యాయుడే అందించాల్సి ఉండేది. ఫిరోజ్‌తుగ్లక్‌కు చరిత్ర, ఖగోళ, వైద్యశాస్త్రాలపట్ల మంచి ఆసక్తి. అందువల్ల ఈ అంశాలు కూడా మద్రసాలలో బోధించేవారు.

ప్రజలు ఉత్తమపౌరులుగా రూపొందాలంటే విస్తృతదృక్పథం, సమగ్రజ్ఞానం అవసరమని భావించిన అక్బర్ ఉన్నతవిద్యకు సంబంధించి ముస్లిం మతధర్మశాస్త్రానికి అనుగుణంగా రూపొందిన పాఠ్యాంశాల్లో అనేక సంస్కరణలు తీసుకొచ్చాడు. ప్రతి విద్యార్థి నీతివిద్య, అంకగణితం, వ్యవసాయవిజ్ఞానం, క్షేత్రగణితము, రేఖాగణితము, ఖగోళశాస్త్రము, సాముద్రికశాస్త్రం,

గృహవిజ్ఞానం, ప్రభుత్వపాలన, వైద్యం, తర్కం, తబీ (భౌతికశాస్త్రాలు), రియాజి (పరిమాణ విజ్ఞానం), శాస్త్రవిజ్ఞానం, చరిత్ర తప్పనిసరిగా అధ్యయనంచేయాల్సి ఉంటుందన్న నియమాన్ని అక్బర్ ఏర్పరిచాడు. సంస్కృతం అభ్యసిస్తున్న కొందరు ముస్లింవిద్యార్థులను దృష్టిలోఉంచుకుని సంస్కృత పాఠశాలల్లో వ్యాకరణం, న్యాయము, వేదాంతము, పతంజలి వ్యాఖ్యానం బోధించేట్లుగా అక్బర్ చర్యలు తీసుకున్నాడు. అక్బర్‌కాలంలో విద్యకు ఒక లౌకికదృక్పథం ఏర్పడింది. హిందూ విద్యార్థులు అనేకులు ముస్లింలకు ఉద్దేశించిన మక్తాబ్‌లు మద్రసాలలో ప్రవేశంపొందటం దీనికి బలాన్ని చేకూరుస్తుంది. తరువాతి యాభై సంవత్సరాలలో పెద్ద సంఖ్యలో హిందూ పండితులు, చరిత్రకారులు, పర్షియన్ కవులు రూపొందారు. దేశంలోని ముస్లిం పాఠశాలలన్నింటిలో దాదాపు ఒకే విధానంలో అవే పాఠ్యాంశాలను బోధిస్తూ ఉన్నా ఓ ప్రత్యేక అంశంలో పేరుపొందిన అధ్యయన కేంద్రం కోసం, తగిన ఉపాధ్యాయుల కోసం విద్యార్థులు ఓ అధ్యయనకేంద్రంనుండి మరో కేంద్రానికి వలసవెళ్ళేవారు. షాజహాన్ కాలంలో వైద్యం ఓ అధ్యయనాంశంగా ఉండేది. ఆ కాలంలోని వైద్యులు అన్ని అంశాలలోను సమగ్రమైన జ్ఞానాన్ని కలిగి ఉండేవారు. మద్రసాలలో పరిపాలనా విధానాన్నికూడా బోధించేవారు. అది కేవలం రాజులుమాత్రమే అధ్యయనంచేయాల్సిన అంశంగా ఆనాడు పరిగణించలేదు. అందువల్ల ఈ అంశం పాలకులతోపాటుగా పాలితులకుకూడా బోధించేవారు. ప్రజలు ప్రభుత్వ శాఖలతో మమేకంకావటంవల్ల బాధ్యతాయుతమైన ప్రభుత్వపాలనకు వీలవుతుందని భావించటమే దీనికి కారణం.

C.ఉన్నతస్థాయిలో బోధనాంశాలు:

గణితము:

మొఘలులకాలంలో పాఠ్యప్రణాళికలోని విజ్ఞానశాస్త్ర అంశాల్లో గణితానికి ప్రథమస్థానం ఉండేది. మద్రసాలలో గణితం తప్పనిసరి అంశంగా అక్బర్‌చక్రవర్తి ప్రకటించారు. భౌతిక, రసాయన శాస్త్రాలు ప్రత్యేకశాఖలుగా కాక గణితశాస్త్రంలో భాగంగా మాత్రమే అధ్యయనం చేసేవారు. ఆకాలంలో ప్రజలకు లోహాలు, లోహసంయోగాల ప్రయోజనాలు తెలుసు. రసవాదంలో వాటి ప్రజలకు నమ్మకం ఉండేది. దాన్ని ఒక యోగినుంచి అక్బర్‌చక్రవర్తి అభ్యసించినట్లుగా చెప్పుకునేవారు.

ఖగోళశాస్త్రం, జ్యోతిషశాస్త్రం:

ప్రజలకు, పాలకులకు ఖగోళ, జ్యోతిషశాస్త్రాలలో నమ్మకం ఉండటంతో ఈ రెండింటి అధ్యయనానికీ మంచి ప్రోత్సాహం లభించింది. పాఠశాల, కళాశాలస్థాయిలో ఈ రెండు అంశాలూ చేర్చారు. ఖగోళశాస్త్రం తప్పనిసరి పాఠ్యాంశంగాను, జ్యోతిషశాస్త్రం ఐచ్ఛికాంశంగానూ తీసుకున్నారు. ఖగోళశాస్త్ర అధ్యయనాన్ని తప్పనిసరి చేస్తూ అక్బర్ చక్రవర్తి ఆదేశాలు జారీచేశాడు. ఖగోళ, జ్యోతిషశాస్త్రాలు రెండింటిలో మంచి నైపుణ్యం, ప్రావీణ్యం గలవారిగా భారతీయులు పేరుపొందారు. సూర్య, చంద్రగ్రహణాల కాలాన్ని వారు ఖచ్చితంగా లెక్కగట్టి చెప్పగలిగేవారు. షాజహాన్ కాలంలో ప్రసిద్ధ ఖగోళశాస్త్రజ్ఞుడు ముల్లా ఫరీద్ మనాజిన్ 'జిఖ్-ఇ-షాజహానీ' అనే పేరుతో ఒక ఖగోళపటాన్ని తయారు చేశాడు.

వైద్యశాస్త్రం:

పాఠ్యాంశాల్లో వైద్యశాస్త్ర అధ్యయనాన్ని ప్రధానాంశంగా చేర్చారు. విద్యార్థులు వైద్యశాస్త్రాన్ని తప్పనిసరిగా అభ్యసించాలని అక్బర్ చక్రవర్తి ఫర్మానాను జారీ చేశాడు. వైద్యశాస్త్ర

అధ్యయనం తప్పనిసరి పాఠ్యాంశమని బదౌనిపేర్కొన్నాడు. అయితే ఇందులో ఆయుర్వేద, యునాని వైద్యవిధానాలు రెండూ బోధించేవారు. వైద్యవిద్యకు సర్‌హింద్ ప్రధాన కేంద్రంగా పేరు గాంచింది. ఆకాలంలో వైద్య వృత్తి అనువంశికం. ఈ వృత్తిలో శిక్షణనిచ్చేందుకు అనుభవజ్ఞులైన హకీంలు (వైద్యులు) స్వంతంగా ప్రైవేటు సంస్థలను స్థాపించారు. వీరిలో కొందరు వైద్యశాస్త్రం పైన గ్రంథాలు కూడా రచించారు. శరీరావయవాలను ఖండించడం అమానుషమని భావించడంవలన హిందువులు శస్త్రచికిత్సపట్ల విముఖత చూపినట్లుగా భావిస్తున్నారు. అయితే ముస్లింలకు ఈ విముఖత లేదు. దీంతో వారు శస్త్రచికిత్సలు, టీకావైద్యం అభ్యసించే వీలుకలిగింది. భారతీయ శస్త్రచికిత్సా నిపుణులు కొన్ని ప్రముఖ శస్త్రచికిత్సలు జరపగలసామర్థ్యంతోపాటుగా, కృత్రిమ అవయవాలు కూడా తయారుచేయగలిగి ఉన్నట్లు తెలుస్తున్నది. కాలికట్‌లోని హిందువులు వైద్యంలోని అన్నిశాఖలలో ప్రత్యేక నైపుణ్యం కలిగిఉన్నారు. మందుల తయారీని కూడా వీరు అభ్యసించారు. నాడు పశువైద్యశాస్త్రంకూడా అభివృద్ధిచెందింది. ఏనుగులు, గుర్రాల వైద్యవిధానంలో శిక్షణఇచ్చినట్లుగా ఆధారాలున్నాయి. ఏనుగులవైద్యానికి సంబంధించినంతవరకు షేక్ హసన్ కుమారుడు షేక్ బినా ప్రముఖ శస్త్రకారుడుగా పేరుపొందాడు. రాయ్‌బారి అనే పేరుగల హిందూతెగ, ఒంటెలకు మంచి వైద్యం అందించింది. తాత్ప్య, తాజి అనే రెండు పద్ధతుల ద్వారా ఒంటెలను అనారోగ్యాన్నుంచి కాపాడేవారని తెలుస్తున్నది.

తత్త్వశాస్త్రం, చరిత్ర, భూగోళ శాస్త్రం:

తత్త్వశాస్త్రం, చరిత్ర, భూగోళ శాస్త్రాలు కూడా పాఠశాలల్లో, కళాశాలల్లో బోధనాంశాలుగా ఉన్నాయి. తత్త్వశాస్త్రం, గణితశాస్త్రం రెండూ భారతదేశంలో ప్రాచీనశాస్త్రాలే. హిందువులు ఈ రెండు అంశాల్లో నిష్ణాతులు. మహమ్మదీయులు చరిత్రను అధ్యయనం చేయడంలో ఉత్సాహం చూపారు. మధ్యయుగం మొత్తంమీద సమర్థులైన చరిత్రకారులుగా పేరుపొందిన అబుల్‌ఫజల్, బదౌని, నిజాముద్దీన్ అహ్మద్, అబుల్ హమీద్ లాహోరి, ఖాఫి ఖాన్ వంటివారు ఈ కాలంలో జన్మించినవారే. అయితే పాఠశాల, కళాశాలల్లో భూగోళశాస్త్రం అంతప్రాధాన్యం కలిగిన అంశంకాదు. ఇది పాఠ్యాంశంగా గుర్తింపు పొందలేదు. ఫలితంగా ప్రజలకు తమ ఇరుగుపొరుగు దేశాల గురించి స్వల్పంగా మాత్రమే తెలిసింది. హుమాయూన్ విస్తృతమైన భౌగోళికపరిజ్ఞానం కలిగి ఉన్నాడు. జగన్‌మోహన్ అనే సంస్కృతపండితుడు ఆ కాలంలో ప్రసిద్ధిపొందిన ఒక భౌగోళిక గ్రంథం 'దేశావళి వివృతి' రచించాడు. ఇందులో 56దేశాల భౌగోళిక వివరాలు నమోదై ఉన్నాయి.

ముస్లిం విద్యాసంస్థలలో పర్షియన్ మాధ్యమంగా విద్యాబోధన జరిగేది. కాలక్రమంలో ఉర్దూభాష ఉత్తరభారతంలో సామాన్యవ్యావహారిక భాషగా ఉపయోగంలోకి వచ్చింది. అయితే ఇది మొఘలులకాలంలోకాని, సుల్తానులకాలంలోకాని బోధనామాధ్యమంగా మాత్రం వినియోగంలోలేదు. నిర్దేశించిన గ్రంథాలబోధన, బట్టీయంద్వారా అభ్యసనం నాడు వాడుకలోఉన్నాయి. ముస్లింపాలన ప్రారంభంలో సరైన వ్రాతసామగ్రి అందుబాటులో లేకపోవటంతో బోధన అధికంగా మౌఖికంగానే సాగేది. పాఠ్యాంశాలపట్ల సమగ్ర అవగాహన ఏర్పర్చేందుకు సెమినార్లు, చర్చలు జరిగేవి. మద్రసాలు రెసిడెన్షియల్ విద్యాసంస్థలే అయినా డేస్కాలర్స్‌కూడా ఉపన్యాసాలు వినేందుకు అవకాశం లభించేది. విద్యార్థుల ఉపయోగంకోసం మద్రసాలన్నింటికీ ఓ మంచి గ్రంథాలయం అనుబంధంగా ఉండేది.

నాడు ఉపాధ్యాయునికి, విద్యార్థులకు మధ్య సన్నిహితమైన, స్నేహపూర్వక సంబంధాలుండేవి. విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనావేసేందుకు ఎటువంటి సాంవత్సరిక పరీక్షలు

ఉండేవికావు. ఈ విషయంలో ఉపాధ్యాయునికి విద్యార్థిపట్ల మంచి అవగాహన ఉండటంవల్ల, ఉపాధ్యాయుని నిర్ణయమే అంతిమమైనదిగా ఉండేది.. తర్కంలో, తత్త్వశాస్త్రంలో ప్రత్యేక నైపుణ్యంపొందిన వ్యక్తికి 'ఫజిల్', మతధర్మశాస్త్రంలో 'ఆలిమ్', సాహిత్యంలో 'ఖాబిల్' డిగ్రీలు ప్రదానం చేసేవారు. డిగ్రీలు ప్రదానంచేసే సమయంలో ఒక కార్యక్రమం జరిగేది. ఉత్తమమైన, తెలివిగల విద్యార్థులకు పతకాలు ప్రదానం చేసేవారు. ఉపాధ్యాయవృత్తి గౌరవప్రదమైన వృత్తిగా గుర్తింపుపొందింది. అత్యధిక విద్యాసంస్థలు గురుకులాలుకావటంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసిజీవించటంవల్ల వారిమధ్య సన్నిహితసంబంధానికి వీలుకలిగేది. విద్యార్థుల సత్వర జ్ఞానసంపాదనకు ఇది తోడ్పడింది. మానిటరింగ్ విధానం నాడు అమల్లోఉంది. బోధనలో, క్రమశిక్షణ అమలుపరిచటంలో ఈ విధానం ఉపాధ్యాయునికి బాగా సహకరించేది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు ఉన్నప్పటికీ విద్యాసంస్థల్లో ప్రైవేటువ్యక్తులు నడిపేవే అధికంగా ఉండేవి. వీటి నిర్వహణకోసం భారీగా ఆస్తులను కల్పించేవారు. ప్రైవేటు విద్యాసంస్థల్లోని విద్యార్థులనుంచి వ్యక్తిగతసేవలుమినహా మరే ఇతర రుసుములు వసూలుచేసేవారుకారు. బడి ఎగ్గొట్టే విద్యార్థులకు శారీరకశిక్షలు విధించేవారు. కొరడా, బెత్తాలు ఉపయోగించేవారు.

D.వృత్తివిద్య/ సాంకేతిక విద్య:

ఈ కాలంలో అనేకరకాల కళలు ఉచ్ఛస్థితిని పొందాయి. అంటే నాడు సాంకేతిక విద్య ఒక క్రమపద్ధతిలో అమల్లో ఉండేదని భావించవచ్చు. అనేక తరగతుల ప్రజలు కళాత్మక, వృత్తిపరమైన, సాంకేతిక విద్యలు అభ్యసించేవారు. చేతివృత్తులపట్ల ఉత్సాహం, అభిరుచి ఉన్నవారికి సాంకేతిక శిక్షణనిచ్చేందుకు అనేక పారిశ్రామిక కేంద్రాలుండేవి. పారిశ్రామిక శిక్షణకుద్దేశించిన కార్ఖానాల నిర్వహణ బాధ్యత ప్రజాపనులనిర్వహణశాఖ చూసేది. అక్కడ శిక్షణపొందిన వారు మంచి వృత్తికారులుగా రూపొందేవారు. అయితే శిక్షణాకాలంలో ఎటువంటి రుసుము వసూలుచేసేవారు కారు. శిక్షణా ప్రారంభంలో మతపరమైన కర్మకాండ నిర్వహించేవారు. లేత వయసులోనే శిక్షణ మొదలయ్యేది. పనిముట్లను ఉపయోగించటం, పనిచేసే విధానాన్ని పరిశీలించటం ద్వారా వీరు నైపుణ్యం సంపాదించేవారు. నైపుణ్యం పెరిగేకొద్దీ వారికి వేతనాలు లభించేవి. శిక్షణపూర్తికాగానే వారు స్వయంగా ఉత్పత్తి ప్రారంభించడమో, తమ శిక్షకుల పరిశ్రమల్లోనే శాశ్వత స్థానాన్ని పొందటమో చేసేవారు. అలా పేదపిల్లలు ఉపాధి పొంది కుటుంబ ఆర్థికపరిస్థితిని మెరుగు పర్చుకునేందుకు వీలయ్యేది. ఈ వృత్తిశిక్షణా కేంద్రాలను ప్రారంభంలో ప్రభుత్వం నిర్వహించింది. అయితే ప్రభుత్వం నిర్వహణనుంచి వైదొలగడంతో వీటి క్షీణదశ ప్రారంభమై చివరకు ఉనికిలోలేకుండా పోయాయి.

నైపుణ్యంగల వృత్తికారులు తమ పిల్లలకు కళల్లోనూ, చేతివృత్తుల్లోనూ ఇంటివద్దే శిక్షణనిచ్చేవారు. సహజమైన వాతావరణంలో పిల్లలు పనిలో తమ తండ్రిని అనుకరించేవారు. తండ్రులుకూడా చేతివృత్తుల్లో తమనైపుణ్యాన్ని తమ పిల్లలకు నేర్పటాన్ని గర్వంగా భావించేవారు. అయితే ఇది ఓ రకమైన కులవ్యవస్థకు దారితీసింది. కొన్ని కుటుంబాలు కొన్ని ప్రత్యేక వృత్తుల్లో నైపుణ్యంపొంది తమ వృత్తినైపుణ్య రహస్యాలను ఇతరులకు వెల్లడించేవారుకారు. దీంతో పిల్లలు తమకునచ్చిన ఉపాధిని ఎంచుకునేందుకు ఎటువంటి స్వేచ్ఛ లేకుండాపోయింది.

అల్లావుద్దీన్ ఖిల్జీ, ఫిరోజ్‌షా తుఘ్లక్, సికందర్‌షా లోడీ, షేర్‌షాసూరి వంటి ముస్లింరాజులు సాంకేతికవిద్యను ప్రోత్సహించారు. నూటఎనభై వేలమంది బానిసలకు సాంకేతికవిద్య అందించేందుకు షేర్‌షాసూరి తగిన ఏర్పాట్లు చేసినట్లుగా తెలుస్తున్నది. అతడు ఇందుకోసం

పారిశ్రామిక శిక్షణా విభాగాన్నొకదాన్ని ఏర్పరచి దానిపట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచాడు. అతని సంరక్షణలో సుమారు పన్నెండువేలమంది బానిసలు నైపుణ్యులైన వృత్తికారులుగా రూపొందారు. యుద్ధఖైదీలకు కూడా వివిధ వృత్తులలో శిక్షణనిచ్చి వారిని స్వతంత్ర వృత్తికారులుగా, విధేయతగల పౌరులుగా రూపొందించేవారు.

మొఘల్ చక్రవర్తులు అక్బర్, జహంగీర్‌లుకూడా సాంకేతికవిద్యను ప్రోత్సహించినవారే. అక్బర్ కాలంలో పారిశ్రామిక శిక్షణా విభాగాన్నొకదాన్ని దివాన్-ఇ-బయుతత్, మీర్ సమాన్‌ల ఆధ్వర్యంలో నెలకొల్పారు. వివిధ అంశాల్లో నైపుణ్యంకోసం వివిధ శాఖలు ఇందులో ఉన్నాయి. స్వర్ణకార్యం, చిత్రలేఖనం, అద్దకం, తివాసీల తయారీ, ఆయుధాల తయారీ వంటి వాటిలో శిక్షణ నిచ్చేందుకు ప్రత్యేక కేంద్రాలతో కూడిన ఒక కార్ఖానా అక్బర్ రాజభవనానికి దగ్గరలో ఉండేది. ఈ కార్ఖానాలు యువకులకు సాంకేతిక, వృత్తివిద్యలలో శిక్షణనిచ్చేవి. నిపుణులవద్ద వారు శిక్షణపొందేవారు. అనంతరం వీరు తమ స్వంత పరిశ్రమలను స్థాపించుకునేవారు. యంత్రాలకు సంబంధించిన ప్రయోగాలపట్ల అక్బర్ ప్రత్యేక శ్రద్ధ కనబర్చాడు.

17వశతాబ్దంలో బెర్నియర్ తన పర్యటనలో భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో కార్ఖానాలు కనుగొన్నాడు. స్వర్ణకారులుగా, చిత్రకారులుగా, దర్జీలుగా, చర్మకారులుగా, సిల్క్ తయారీలో ఇంకా అనేకమంది వృత్తికారులు పనిచేయటాన్ని చూసాడు. వీరంతా తమపిల్లలకు తమ వృత్తిలోనే శిక్షణ ఇవ్వటాన్నికూడా గమనించాడు. వైద్యులుకూడా తమ కుమారులకు అదే వృత్తిలో శిక్షణనిచ్చేవారు. మొత్తంమీద మొఘలులకాలంలో వృత్తులు, కళలు అభివృద్ధిచెందాయి. సరైన సాంకేతిక శిక్షణ, పారిశ్రామిక నైపుణ్యంతోనే ఇది సాధ్యమైందని భావించాలి.

బావుల తవ్వకం, వంతెనలు, కాలువల నిర్మాణం, రోడ్ల నిర్మాణం వంటి సాంకేతికపనుల నిర్వహణకోసం ఉద్దేశించిన ఉద్యోగులు అందరూ భారతీయులేకావటం గమనార్హం. ఇంకా వీరిలో కొందరిని ముఖ్యమైన భవంతులనిర్మాణం కోసం ఇతరదేశాలకు తీసుకుని వెళ్ళేవారు. దేశంలోనే వీరికి శిక్షణనిచ్చేందుకు తగినవసతులున్నట్లుగా తెలుస్తోంది.

సాహిత్యంపట్ల ఎటువంటి ఆసక్తి, అభిరుచి లేనివారికి సాంకేతికవిద్యలో శిక్షణనిచ్చేవారు. మక్తాబ్, మద్రసాలలో ప్రతిభ కనబర్చని వారిని వివిధ కళల్లో, వృత్తుల్లో శిక్షణకోసం సాంకేతిక శిక్షణా కేంద్రాలకు పంపేవారు. వీరు తమ ఉపాధ్యాయులు, నిపుణులతో కలసి జీవిస్తూ వారినుంచి వృత్తి నైపుణ్యాలను అభ్యసించేవారు. వ్యాపారవర్గాల పిల్లలకోసం వారు స్వంతంగా పాఠశాలలను ఏర్పరుచుకున్నారు. అంకగణితము, పఠన,లేఖనాలలో నైపుణ్యంకోసం, వ్యాపారఖాతాల నిర్వహణ గురించిన శిక్షణకోసం ఈ పాఠశాలల్లో తగిన ఏర్పాట్లుండేవి. వృత్తిశిక్షణ అనేక మతకర్మకాండలతో కూడి ఉండటం విశేషం. పరిశ్రమలు, వాణిజ్యం పొందిన స్థాయినిబట్టి మధ్యయుగంలో సాంకేతిక విద్యావిధానం క్రమానుగతిని అంచనావేయవచ్చు.

### *1.2.3. దేశీయ విద్యావిధానం--ప్రాథమికవిద్య:*

ముస్లింల ఆక్రమణ తర్వాత దేశీయ విద్యావిధానానికి రాజులమద్దతు అంతరించింది. సంస్కృతిని పరిరక్షించే వ్యక్తులు, ధనవంతులు, పండితులు, గ్రామసంఘాలుమొదలైనవాటిపై భారతీయ విద్యావిధానం ఆధారపడింది. మధ్య యుగంలో విద్యావిధానం మతబద్ధమైనదిగా ఉంది. దేశీయ విద్యావిధానం బ్రాహ్మణుల ఆధిపత్యంలోను, మహమ్మదీయ విద్యావిధానం మౌల్వీల

నియంత్రణలోను ఉండేది. ఉన్నతకులాల విద్యార్థులు ప్రవేశంపొందినా టోల్స్‌లో సంస్కృతవిద్య ప్రధానంగా బ్రాహ్మణులకే పరిమితమై ఉండేది. గణితం, పఠన, లేఖనాలలో శిక్షణకోసం సంస్కృతవిద్యకు సమాంతరంగా ప్రాథమిక విద్యావిధానం కొనసాగింది. పాఠశాలల్లో బోధించే ప్రాథమికవిద్య సుమారు మూడు సంవత్సరాలుండేది. వ్యాపార, వ్యావసాయిక వర్గాలు ఈ విధానం కారణంగా లబ్ధిపొందాయి. 'టోల్స్' పూజారులు, విశ్రాంతివర్గాల అవసరాలకు పరిమితమైనాయి.

'ఉపనయన' క్రతువు నిర్వహించిన తర్వాత హిందువులు తమ పిల్లలను సాధారణవిద్యకు పంపేవారు.. ఈ పాఠశాలలు చెట్టునీడనో, ఇంటి వరండాలోనో జరిగేవి.. కొన్నిచోట్ల ఇందుకోసం వేరుగా ఇళ్ళుకూడా ఉండేవి. ఈ సంస్థల్లో విద్యార్థులు పఠన, లేఖన, అంకగణితాలు అభ్యసించేవారు. పాఠశాల ఉపాధ్యాయులుగా ప్రధానంగా కాయస్థులు పనిచేసేవారు. బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ, ఇంకా క్రింది కులాలనుంచి కూడా ఉపాధ్యాయులుండేవారు. పండుగలవంటి సందర్భాల్లో బహుమతులు స్వీకరించేవారేకాని, విద్యార్థులనుంచి ఎటువంటి రుసుము వసూలుచేసేవారుకారు. డబ్బుకోసం బోధించే ఉపాధ్యాయుడు సామాజికంగా నిరసనకు గురయ్యేవాడు. అయితే విద్యార్థులు ఉపాధ్యాయులకు సేవలందించేవారు. వ్యవసాయం, వ్యాపారం వంటివాటి ద్వారా ఉపాధ్యాయులు ఆదాయాన్ని పొందేవారు. కొన్నిప్రాంతాల్లో నిమ్నకులాలుకూడా విద్యనభ్యసించినట్లు తెలుస్తున్నది.

సాధారణంగా విద్యార్థులు 5-16సంవత్సరాల మధ్య వయస్సు వారుగా ఉండేవారు. విద్యావిధానం ప్రయోజనప్రధానంగా సాగేది. అయితే నీతివిద్య మాత్రం ఇందులో భాగంగాలేదు. తూనికలు, కొలతలుకు సంబంధించిన విజ్ఞానం ప్రధానమైనదిగా భావించేవారు. అందువల్ల ఇది తప్పనిసరి పాఠ్యాంశంగా ఉండేది. ఈ ప్రాథమిక పాఠశాలల్లో నల్లబల్ల, పలక, బలపం వంటివి లేవు. విద్యార్థులు చెక్కబల్లపైగాని లేదా యిసుకలోగాని రాయాల్సివుండేది. అందమైన చేతివ్రాతకు ప్రాధాన్యమిచ్చేవారు. నాటి అన్ని పాఠశాలల్లో ప్రాంతీయభాష శిక్షణామాధ్యమంగా ఉండేది.

ప్రాథమిక పాఠశాలల్లో శిక్షణ నాలుగు దశలుగా సాగేది. మొదటి దశలో, విద్యార్థులు యిసుకపై అక్షరాలు రాయటం నేర్చేవారు. రెండవ దశలో చేతి ఆకులపై ఉపాధ్యాయుడు రాసిన అక్షరాలు విద్యార్థులు దిద్దేవారు. తర్వాత సంయుక్తాక్షరాలు ఉచ్చరించేవారు. ఆతర్వాత అచ్చులు, హల్లుల కలయికతో ఏర్పడే సాధారణ పేర్లను నేర్చేవారు. మూడవదశలో చేతిఆకుల స్థానంలో పెద్ద అరటిఆకులను వాడేవారు. ఈ దశలో పదాలద్వారా వాక్యనిర్మాణం, వ్యావహారికభాషకు, రచనాభాషకు మధ్య భేదాన్ని బోధించేవారు. ఆ తర్వాత అంకగణిత సూత్రాలు నేర్పేవారు. ప్రతి ఉదయం పాఠశాలమొత్తంచేత ఎక్కాలు పలికించేవారు. వాణిజ్య, వ్యవసాయ లెక్కల్లో విద్యార్థులు శిక్షణపొందేవారు. నాలుగవదశలో వ్యాపారలావాదేవీల లెక్కలు, వ్యాపారలేఖలు, ఫిర్యాదులు వంటి అంశాలలో విద్యార్థులు శిక్షణపొందేవారు. ఆ తర్వాతనే విద్యార్థులు రాతకోసం కాగితాన్ని ఉపయోగించేందుకు అనుమతి లభించేది. అక్బర్‌కాలానికి తులసీదాస్ హిందీ రామాయణం ఉత్తరభారతంలోని అనేక ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానపాఠ్యాంశంగా ఉన్నట్లుగా తెలుస్తున్నది. బెర్నియర్ ప్రకారం ప్రాథమికవిద్య తర్వాత విద్యార్థులు పురాణాలు, ఉపనిషత్తులు, వేదాలు అభ్యసించేవారని తెలుస్తున్నది. భాషతోపాటుగా మౌలికగణితం కూడా బోధించేవారు. ఈ అంశంలో భారతీయ విద్యార్థులకు చాలా నైపుణ్యంఉండేది. శబ్దంకరుని అంకగణితసూత్రాలు ముస్లింల కాలంలోనే రూపొందినట్లుగా, అందులో ఉపయోగించిన అనేక పర్షియన్‌పదాలనుబట్టి భావిస్తున్నారు.

తెల్లవారుఝాము మొదలుకొని ఉదయం తొమ్మిదినుండి పదివరకు పాఠశాలలు పనిచేసేవి.

మధ్యాహ్నభోజనం అనంతరం కొంత విశ్రాంతి తర్వాత విద్యార్థులు మూడుగంటలకు పాఠశాలకు తిరిగివచ్చి సాయంత్రంవరకు తమ అభ్యసనాన్ని కొనసాగించేవారు. నాడు మానిటోరియల్ పద్ధతి అమల్లోఉండేది. శిక్షణలో మరీ ప్రాథమికస్థాయిలో ఉన్నవారికి శిక్షణ ఇచ్చేందుకు ఉపాధ్యాయునికి సహాయకులుగా తెలివిగల విద్యార్థులు కొందరు పనిచేసేవారు. ప్రతిఉపాధ్యాయునితో ఇటువంటి విద్యార్థులు సగటున నలుగురు లేదా ఐదుగురు ఉండేవారు. అయితే ఈ సంఖ్య పదిహేనుకు మించేది కాదు.

హంటర్ కమిషన్‌గా పేరుగాంచిన 1882 విద్యా కమిటీ రిపోర్ట్ ప్రకారం ఇదేతరహా స్వదేశీ ప్రాథమిక పాఠశాలలు బొంబాయి, మద్రాసు ప్రెసిడెన్సీలలో ఉన్నట్లుగా తెలుస్తున్నది. ఉదయం ఆరుగంటలకు పంతోజీ అని పిలువబడే గ్రామ ఉపాధ్యాయుడు విద్యార్థులకోసం గ్రామాన్ని చుట్టివస్తాడు. అలా విద్యార్థులను తీసుకుని గదిలోనో, ఇంటి వరండాలోనో పాఠశాల ప్రారంభిస్తాడు. మొదటి అర్ధగంట సూర్యుడు, సరస్వతి, గణపతి వంటి వివిధ దేవతలను ప్రార్థించేందుకు కేటాయించబడేది. ఆ తర్వాత విద్యార్థులచేత అక్షరాలు దిద్దించటం, ఆ తర్వాత చూచివ్రాత. కేవలం ఈ అంశాలు మాత్రమే అభ్యసించాల్సిన చిన్నపిల్లలు ఉపాధ్యాయుని కొడుకునుంచి, పెద్ద పిల్లల నుంచి శిక్షణ పొందితే, ఉపాధ్యాయుడు పెద్ద పిల్లలకు బోధించేవారు.

మద్రాస్ ప్రెసిడెన్సీలో ఈ ప్రాథమికపాఠశాలలు 'ప్యాల్' పాఠశాలలుగా పేరుగాంచాయి. 'ప్యాల్' అనేది మూడు అడుగులు వెడల్పు, మూడు అడుగులు ఎత్తుగల ఒక అరుగు. విద్యార్థులు ఈ అరుగుపైన కూర్చుంటే, ఉపాధ్యాయుడు 'కొరడు' అని పేర్కొనే కొంచెం ఎత్తైన ప్రదేశంలో కూర్చునేవాడు. ఈ ప్యాల్ పాఠశాలలు ప్రత్యేకించి పఠన, లేఖన, గణితాల్లో శిక్షణకు ఉద్దేశించినవి. ఈ పాఠశాలల్లో సగటున 21 మంది విద్యార్థులుండేవారు. యిసుకనేల, కొన్ని నల్లబల్లలు, కొన్ని కాజన్ ఆకులు ఈ పాఠశాలల్లో బోధనాసామగ్రి. చేతిలో కమ్మీతో ఉపాధ్యాయుడు క్రమశిక్షణను అమలుపరచేవాడు. బడిదొంగలు చాలా తీవ్రమైన శిక్షలు పొందేవారు. పండితుల సమక్షంలో తల్లిదండ్రులు తమకొడుకుని ఉపాధ్యాయునికి అప్పగించేవారు. ఇలా విద్యార్థిని ఉపాధ్యాయునికి అప్పగించే ముందు అనేక మతసంబంధమైన క్రతువులు నిర్వహించేవారు. పఠన, లేఖన, అంకగణితాలతోపాటుగా తమిళ/తెలుగు భాషకు చెందిన నాలుగైదు ఉత్తమ గ్రంథాల్లో ఒకదాన్ని అధ్యయనం చేసేవారు. ఈ అధ్యయనంనుంచి విద్యార్థులు కొంత నైతిక శిక్షణనుకూడా పొందేవారు. పఠనం తర్వాత విద్యార్థులకు లేఖనంలో శిక్షణలభించేది. విద్యార్థులు తమ వ్రేలితో యిసుకనేలపై అక్షరాలు రాయటం ద్వారా వర్ణమాల నేర్చుకునేవారు. అనంతరం నల్లబల్లలేదా, పలకపై బలపంతో రాసేవారు. ఆ తర్వాత కాజన్ ఆకులపై ఇనుపఘంటంతోగాని, వెదురుకలంతో కాగితంపైగాని రాసేవారు. పఠనం, లేఖనం, గణితం, కావ్యాల అధ్యయనంతో పాటు విద్యార్థి వ్యవసాయ, వ్యాపార లావాదేవీల గురించి అధ్యయనంచేయాల్సి ఉండేది. ఐదు సంవత్సరాల వయసులో విద్యాభ్యాసం ప్రారంభమయ్యేది. పాఠశాల ఉదయం ఆరు గంటలకు మొదలయ్యేది. క్రితంరోజు పాఠాన్ని విద్యార్థి ఆ మధ్యాహ్నం చూసిరాసి ఉపాధ్యాయునిచే సరిచేయించుకోవాలి. మరుసటిరోజు ఉపాధ్యాయునికి వల్లించేందుకు వారు తమ పాఠ్యాంశాన్ని ఇంటివద్ద అభ్యసించాల్సి ఉంటుంది. విషయపరంగా విభేదించినా, దేశంలోని అన్ని ప్రావిన్స్‌లలో ఉన్న విద్యావిధానంలోని సాధారణాంశాలు ఒకేవిధంగా ఉన్నట్లుగా తెలుస్తున్నది.

ముస్లిం పాలనలో పర్షియన్ రాజభాషగా రూపొంది 1835 వరకు అలాగే కొనసాగింది.

ప్రభుత్వశాఖల్లో కొలువు సంపాదించాలంటే పర్షియన్ భాషాధ్యయనం తప్పనిసరి అయింది. ఫలితంగా హిందువులుకూడా పర్షియన్ పాఠశాలల్లో చేరేవారు. ఈ పాఠశాలల్లో వ్యాకరణంలో ప్రాథమిక సూత్రాలు, ఉత్తరప్రత్యుత్తర ప్రక్రియలు, ప్రసిద్ధిపొందిన పద్యాలు, కథలు పాఠ్యాంశాలు. కొన్నిసార్లు అలంకారశాస్త్రం, వైద్యశాస్త్రం మతధర్మశాస్త్రం వంటివికూడా బోధించేవారు. స్వదేశీ పాఠశాలలు దేశీయంగానూ, వ్యాపారబద్ధంగానూ ఉంటే మహమ్మదీయ పాఠశాలలు కొంతమేరకు సాహిత్యపరంగా, తాత్త్వికమైనవిగా ఉండేవి. మహమ్మదీయ పాఠశాలల్లో పఠనం అనంతరం లేఖనం బోధిస్తే, స్వదేశీ పాఠశాలల్లో లేఖనం అనంతరం పఠనం బోధించేవారు. పాఠశాల విద్యార్థుల హాజరుశాతంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో తేడాలున్నప్పటికీ మధ్యయుగంలో భారతదేశవ్యాప్తంగా ప్రాథమికవిద్యమాత్రం ఇదేపద్ధతిలో ఉండేది.

దేశీయ పాఠశాలలు నాలుగువిధాలుగా ఉనికిలో ఉండేవి.

(1)కొన్ని దేవాలయాలకు అనుబంధంగా ఉండేవి. పాఠశాల ఉపాధ్యాయులు ఆలయభూములపై ఆధారపడి జీవించేవారు. వారు విద్యార్థులనుంచి కొన్ని సమయాల్లో బహుమతులు, రుసుము స్వీకరించేవారు. ఇవి పూర్తిగా ఆలయాలకు అనుబంధంకావు. ఇందులో ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరూ బ్రాహ్మణేతరులై ఉండేవారు.

(2)గ్రామ జమీందార్లు, ధనవంతుల ఉదారత ఫలితంగా కొన్ని ప్రాథమికపాఠశాలలు రూపొందాయి. వీరు ఈ పాఠశాలలు స్థాపించటంవెనుక తమ పిల్లల విద్యపట్ల ఉత్సాహం కలిగిఉండటమే ప్రధానకారణం. అదేపాఠశాలల్లో ఇతర విద్యార్థులు కూడా విద్య నేర్చేవారు. కొన్నిసార్లు వీరు పాఠశాలకోసం తమ ఇంటి ఆవరణలోనే వసతి కల్పించేవారు.

(3)వ్యాపార దృక్పథంతో వ్యాపారవర్గాలవారు కొన్ని పాఠశాలలు నెలకొల్పారు. తమ వ్యాపారప్రయోజనాలకోసం వీరు ఈ పాఠశాలలు నడిపేవారు. రుసుము చెల్లించగలిగి, పఠన, లేఖన, అంకగణితాల్లో శిక్షణ అవసరమని భావించేవారు, కుల ప్రసక్తిలేకుండా విద్యకోరేవారు ఉండే పట్టణాల్లో ఈ పాఠశాలలు పనిచేసేవి.

(4)మరో పాఠశాలలు 'మహాజని పాఠశాలలు'. అనేకమంది ప్రాంతీయ వ్యాపారులు తమ పిల్లలు తమ వ్యాపారంలో మెళుకువలు గ్రహించాలనే ఉద్దేశ్యంతో వారికి లేఖన, గణాంకాల్లో శిక్షణకోసం ఉపాధ్యాయుని నియమించేవారు. అలా ఏర్పడినవే ఈ మహాజని పాఠశాలలు.

దేశీయ ప్రాథమిక పాఠశాలలు ప్రయోజనం ప్రధానలక్ష్యంగా నడిచేవి. ఉన్నత జీవనవిధానాన్ని అలవర్చేందుకు, కళాత్మక ఆలోచనను అభివృద్ధిపరచేందుకు ఈ పాఠశాలల్లో ఎటువంటి ఏర్పాట్లు లేవు. ఈ పాఠశాలలన్నీ పఠన, లేఖన, గణితాల్లో శిక్షణనిచ్చేందుకు, వాటిని వినియోగించే పద్ధతులు నేర్పేందుకు ఉద్దేశించబడినాయి. పాఠ్యాంశాల్లో సాహిత్యం ఉన్నప్పటికీ నిజమైన సాహితీస్పృహ మాత్రం కొరవడింది. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు సరస్వతీవందనం బట్టీయంవేస్తారు. కొన్ని పాఠశాలల్లో పురాణ గాథలలో శిక్షణ లభిస్తుంది.

**దండనలు:**

విద్యార్థులు ఉపాధ్యాయులను గొప్పగా గౌరవించేవారు. వారు గౌరవంగా ఉపాధ్యాయుని పాదాన్ని స్పృశించి అతని అనుమతితో, అతనితో వినయంగా సంభాషించేవారు. అసభ్యంగా ప్రవర్తించే విద్యార్థులను పాఠశాలనుంచి బహిష్కరించేవారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, కావాలని మోసంచేయటం, చెడునడవడి కల విద్యార్థులకు పాఠశాల పనిగంటల తర్వాతకూడా పనిచేయించటం,

పాఠాన్ని అనేకమార్లు రాయించటం, చెంపదెబ్బ, చెవి మెలితిప్పటం, తొడల క్రిందనుంచి చేతులతో చెవులు పట్టుకొని బొటనవ్రేలిపై కూర్చునేవిధంగా చేయటం వంటి శిక్షలు విధించేవారు. బెత్తంతో క్రమశిక్షణను అమలుచేసేవారు. పిల్లల వైఫల్యాలకు, నేరాలకు పరిస్థితినిబట్టి తీవ్రమైన శిక్షలుకూడా విధించేవారు.

స్వదేశీ పాఠశాలల్లో ఉపాధ్యాయునికి, విద్యార్థికి మధ్య సన్నిహితసంబంధం ఉండేది. తమ విధులపట్ల ఉపాధ్యాయులు చాలా శ్రద్ధ కలిగిఉండేవారు. విద్యార్థులను తమ స్వంత కుమారులుగా భావించి వారిపట్ల అంతటి అభిమానాన్ని చూపేవారు. విద్యార్థులుకూడా గురువులను తండ్రులుగా అభిమానించేవారు. ఒకే తరగతి విద్యార్థులమధ్య, ఒకే పాఠశాల విద్యార్థులమధ్య స్నేహపూర్వక సంబంధాలుండేవి. తోటి విద్యార్థులకు సహాయంచేయటం గొప్ప అదృష్టంగా భావించేవారు.

**బోధనా విధానం:**

ఆనాటికి వ్యక్తిగత బోధన అమల్లోఉంది. ప్రతివ్యక్తి తన సామర్థ్యంమేరకు ఉన్నతిని సాధించే అవకాశం ఉండేది. మానిటోరియల్‌పద్ధతి అమల్లో ఉంది. దీనివల్ల ఉపాధ్యాయులకు బోధనలో సహాయంగా ఉండటమేకాక, తెలివిగల విద్యార్థులు బోధనలో శిక్షణ పొందే వీలుండేది. భవిష్యత్తులో ఉపాధ్యాయవృత్తిని స్వీకరించేందుకు వారిని సంసిద్ధులను చేయడమేకాక, వారు ఇంతవరకూ పొందిన జ్ఞానాన్ని మదింపుచేయటంకూడా దీనివల్ల సాధ్యపడింది. ఈనాటి ఆధునిక మాంటిస్సోరి బోధనలో అనుసరించే పద్ధతులు--పఠనానికి ముందు లేఖనాన్ని పరిచయంచేయటం, అక్షరాలను దిద్దించటంద్వారా వాటి ఆకృతులను మెదడులో నిక్షిప్తంచేయటం-- ఇవి రెండూ ఆనాడు వాడుకలో ఉన్నాయి. ఈనాటి ప్రాథమికవిద్య ప్రభుత్వ నియంత్రణలో, ప్రభుత్వ పర్యవేక్షణలో ఉన్నా ప్రాచీన ప్రాథమిక విద్యావిధానంలోని అనేక లక్షణాలు నేడు కూడా కనిపిస్తాయి.

### *1.2.4. దేశీయ విద్యావిధానం--ఉన్నతవిద్య:*

క్రీస్తుశకం 1-12 శతాబ్దాల కాలంలో భారతీయ భావనలో వేదవిద్యే ఉన్నతవిద్య. ఈ వేదవిద్య చివరకు వేదాలను పఠించటానికి మాత్రమే పరిమితమైపోయింది. క్రీ॥శ ప్రారంభంనుంచి బౌద్ధ ఆరామ కళాశాలలు సాధారణ మానవునికి విద్యనందించటం ప్రారంభించాయి. ఇందులోని పాఠ్యాంశాలు భారతీయ కళాశాలల పాఠ్యాంశాల వంటివే. వీటిలో సంస్కృతంతోపాటుగా పాలీ కూడా బోధించేవారు. బౌద్ధం అందరికీ విద్యనందించింది. భారతదేశంలో కాంచిపుర, నలందా, ఒదాంతపురి, శ్రీ ధాన్యకటక, విక్రమశిల వంటివి ప్రముఖమైన బౌద్ధ అధ్యయనకేంద్రాలు. మహమ్మదీయ పాలకులు దేశాన్ని ఆక్రమించుకున్న తర్వాత బౌద్ధులకు చెందిన అన్ని ప్రధాన అధ్యయనకేంద్రాలను ధ్వంసం చేశారు. కాశ్మీర్, బెనారస్, మిథిల, నదియాలు మధ్యయుగంలోఉన్నతవిద్యకు పేరుగాంచిన అధ్యయన కేంద్రాలు.

కాశ్మీర్: ప్రాచీనకాలంలో కాశ్మీర్ హిందువుల, బౌద్ధుల అధ్యయనానికి ప్రసిద్ధిపొందిన కేంద్రంగా ఉండేది. క్రీ.శ. 1010లో పంజాబ్ ముస్లిం పాలనలోకి వచ్చినప్పుడు అనేకమంది పంజాబీ పండితులు శరణార్థులుగా కాశ్మీర్ వచ్చారు. అక్కడి స్త్రీలు కూడా సంస్కృత, ప్రాకృతాలలో మాట్లాడగలవారే. ప్రాచీనసాంప్రదాయంలో పండితులకు ఉచితవిద్యాబోధన కాశ్మీర్‌లో అనేక శతాబ్దాలపాటు కొనసాగింది.

బెనారస్: హిందుస్తాన్‌లో బెనారస్ ప్రధాన అధ్యయన కేంద్రంగా పేరుపొందినట్లు

అబుల్‌ఫజల్ నుంచి మనకుతెలుస్తుంది. ఇక్కడ శిక్షణ పొందేందుకు ప్రజలు దేశంలోని వివిధ ప్రాంతాలనుండి తరలి వచ్చేవారు. ప్రపంచంలో ప్రసిద్ధిపొందిన సన్యాసులు బెనారస్‌లో నివాసం ఏర్పాటుచేసుకొనడంతో, వారినుంచి ఆధ్యాత్మిక శిక్షణపొందేందుకు అనేకమంది వచ్చేవారు. ఒక గురువువద్ద శిక్షణపొందే విద్యార్థులు 4-7 మధ్య ఉండేవారు. మంచి నైపుణ్యంగల గురువువద్ద 12-15 మంది విద్యార్థులుండేవారు. విద్యార్థులు 10-12 సంవత్సరాలపాటు శిక్షణకోసం తమ గురువులవద్ద ఉండేవారు.

ఇందులో విద్యార్థులు ముందుగా సంస్కృతాన్ని అభ్యసించాల్సి ఉండేది. అయితే ఈ సంస్కృత భాష కేవలం పండితులకుమాత్రమే అర్థమయ్యేదిగా ఉండేది. తత్త్వశాస్త్రం, వైద్యం, ఖగోళశాస్త్రం, భూగోళశాస్త్రంకూడా ఇక్కడ బోధింపబడేవి. తత్త్వశాస్త్ర అధ్యయనానికిముందుగా వేదాల సంక్షిప్తరూపాలైన పురాణాలు అధ్యయనం చేయాల్సిఉండేది. వైద్యవిద్యలో రోగులకు చికిత్సచేసే పద్ధతులగురించి బోధించేవారు. శరీరశాస్త్రం మాత్రం అసలుబోధించేవారుకారు. ఖగోళశాస్త్ర అధ్యయనం కొన్ని పత్రికలు, సిద్ధాంతాల ఆధారంగా జరిగేది. భూగోళశాస్త్రబోధన వింతగా ఉండేది. భూమి త్రిభుజాకారంలో చదరంగా ఉండేదని బోధించేవారు. మొఘల్ చక్రవర్తుల ప్రోత్సాహం కారణంగా బెనరస్ మేధావుల కార్యకలాపాలకు కేంద్రంగా మారింది. హిందూమత తాత్త్వికత మౌలికసూత్రాలను బోధించి, అన్వయించిచూపగల ప్రసిద్ధ పండితులక్కడుండేవారు. వేదాంతం, సంస్కృత సాహిత్యం, వ్యాకరణం వంటి అంశాల అధ్యయనానికి బెనారస్ పేరుగాంచింది. ఈ మూడు అంశాల అధ్యయనంకోసం దేశంనలుమూలల నుంచి విద్యార్థులు ఇక్కడకు వచ్చేవారు.

మిథిల: ఉత్తరబీహార్ లోని మిథిల అధ్యయనానికి మరో ప్రముఖకేంద్రం. మొఘలుల కాలంలో తర్కవిద్యకు ఇది పేరు పొందింది. ఆనాడు భారతీయ ఉన్నతవిద్యకు పేరుపొందిన నవద్వీపం/నదియా మిథిలనుంచే స్ఫూర్తిని పొందింది. నదియాలోని ప్రముఖ తార్కికులు 15వశతాబ్దంలో మిథిలలో అభ్యసించినవారే. హిందువులకు మిథిల మంచి అధ్యయనకేంద్రంగా ఉండేదనే అంశం అబుల్‌ఫజల్ ధృవపరిచాడు. షాజహాన్ కాలంలో మిథిల పండితులకు,కవులకు ప్రసిద్ధిపొందింది. మహామహోపాధ్యాయ గోకులనాథ్ నదియాకు వెళ్ళి అక్కడ 'నవ్యన్యాయ' పేరుతో కొత్త తార్కిక అధ్యయనకేంద్రాన్ని స్థాపించాడు.

నదియా: స్మృతి, వ్యాకరణాలు బోధించినప్పటికీ నదియా తర్కశాస్త్రపరంగా మంచి పేరుపొందింది. ప్రత్యేక గుర్తింపు పొందేందుకు విద్యార్థులు సిద్ధాంతచర్చల్లో పాల్గొనేవారు. అధ్యయనాంశాల్లో విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలించేందుకు తరచూ ఈ చర్చలు జరిగేవి.

నవద్వీపంలోని ఉన్నత విద్యాసంస్థలకు తాల్స్ అనిపేరు. ఒక్కో తాల్‌లో సుమారు 25మంది విద్యార్థులుంటారు. మొఘలులకాలంలో ఈ అధ్యయనకేంద్రం నవ్యన్యాయ అనే నూతన తాత్త్విక దృక్పథానికి పేరుపొందింది. తాల్స్‌లో బోధించే అంశాలు ఆరు. అవి కవిత్వం, వ్యాకరణం, ఖగోళ జ్యోతిషాలు, అలంకారశాస్త్రం, నిఘంటునిర్మాణం, తత్త్వశాస్త్రం. నవద్వీపంలోని ఈ తాల్స్‌లో సంస్కృతం తోపాటుగా ప్రాకృతం, పాలీ, బెంగాలీ వంటి భాషలు బోధించేవారు. నిమ్నకులస్తులు కూడా శాస్త్రాలలో శిక్షణ పొందేవారు. పండితులమధ్య చర్చలు సర్వ సామాన్యం. కీర్తన, యాత్రా, కథాకథ వంటివాటి ద్వారా పురాణ, ఇతిహాసబోధనలను ప్రజలకు అందించేవారు.

'నవ్యన్యాయ' కారణంగా నవద్వీపం ప్రముఖస్థానాన్ని పొందింది. వసుదేవ సార్వభౌమ నదియాలో మొదటి నవ్యన్యాయ కేంద్రాన్ని స్థాపించాడు. అతని అనుయాయి రఘునాథశిరోమణి

నదియాలో నవ్యన్యాయ తాత్త్విక సిద్ధాంతాన్ని స్థాపించినవ్యక్తి. నదియాకు ముందు ఈ తత్త్వ దర్శనానికి మిథిల ప్రముఖకేంద్రంగా ఉండేది. మిథిలలో 'నవ్యన్యాయ' అధ్యయనంచేసిన విద్యార్థులెవరూ దానికి చెందిన పాఠ్యపుస్తకాలు, ఉపన్యాసంలో రాసుకున్న అంశాలూ ఏవీ మిథిలనుంచి బయటకు తీసుకెళ్ళేందుకు వీలుండేదికాదు. ఫలితంగా నదియ పండితులలో నవద్వీపంలో 'నవ్య-న్యాయ' స్థాపించాలనే కోరిక కలిగింది. గంగేముని 'నవ్య-న్యాయ' గ్రంథాన్ని, తత్త్వచింతామణిని జ్ఞాపకశక్తితో వాసుదేవసార్వభౌముడు మిథిలనుంచి తెచ్చి నదియాలో 'నవ్య-న్యాయ'కు చెందిన పెద్ద సంస్థను స్థాపించాడు. ఈయన నవ్య-న్యాయలోని ఛందోభాగం 'కుసుమాంజలి' కూడా ఇలానే జ్ఞప్తి కుంచుకున్నాడు. నదియాలో ఈ రెండింటిని లిఖితరూపంలోకి మార్చాడు.

నదియాలోని వాసుదేవసార్వభౌముని న్యాయ పాఠశాలలో రఘునాథశిరోమణి మొదటి విద్యార్థి. మిథిల తార్కిక పాఠశాల అధిపతిని వాదనలో ఓడించటంద్వారా రఘునాథుడు దేశవ్యాప్తంగా పేరుపొందాడు. రఘునాథుడు స్వయంగా స్థాపించిన తర్క పాఠశాలలో అనేకమంది పండితులు రూపొందారు. 16వశతాబ్దంలో రఘునందన భట్టాచార్య ఒక నూతనపాఠశాల 'స్మృతి'ని నదియాలో స్థాపించారు. గీత, భాగవతము, ఇంకా అనేక హిందు పురాణగాథలు నదియాలో బోధించేవారు. 1860లో నవద్వీపంలోని తొల్‌లలో సుమారు 4000 మంది విద్యార్థులు, 600మంది ఉపాధ్యాయులు ఉన్నట్లు తెలుస్తున్నది.

మధ్యయుగం ప్రారంభంలో దక్షిణభారతంలో అనేక దేవాలయకళాశాలలు పనిచేశాయి. చంగల్‌పట్టు జిల్లాలోని తిరువారియూర్ దేవాలయకళాశాల 13-14 శతాబ్దాలలో ప్రముఖకళాశాలగా పేరుపొందింది. అక్కడి శైవదేవాలయానికి ఇది అనుబంధంగా ఉండి, వ్యాకరణబోధనకు పేరుపొందింది. గుంటూరుజిల్లాలోని మాలకాపురం దేవాలయకళాశాల 13వశతాబ్దంలో ప్రసిద్ధి పొందింది. కళాశాలతోపాటుగా ఒక వసతిగృహం, వైద్యశాలకూడా దేవాలయానికి అనుబంధంగా పనిచేశాయి. వసతిగృహంలో 150 మందికి వసతిఏర్పాట్లుండేవి. ఎనిమిది మంది ఉపాధ్యాయులు కళాశాలలో పనిచేసేవారు.

సింధ్ ప్రాంతంలోని ఠిర్హత్, గోకరనాద్, తత్తాహ్‌లు భారతీయ అధ్యయనానికి పేరుపొందిన మరికొన్ని కేంద్రాలు. తత్తాలో మతధర్మశాస్త్రం, తత్త్వశాస్త్రం, రాజనీతిశాస్త్రం ప్రత్యేక అధ్యయనాంశాలు. ముల్తాన్ మరో అధ్యయనకేంద్రం. అక్కడ హిందువులు అనేక పాఠశాలలు స్థాపించారు. అది ఖగోళ, జ్యోతిష, గణిత, వైద్యశాస్త్రాల అధ్యయనానికి పేరుపొందింది. పంజాబ్‌లోని సర్‌హింద్ ఆయుర్వేద వైద్య పాఠశాలకు పేరుగాంచింది. దేశవ్యాప్తంగా అవసరమైన వైద్యులందరూ ఈ కేంద్రంనుంచే వెళ్ళేవారని తెలుస్తోంది.

బెంగాల్, బీహార్‌లలో తొల్‌లు, ఉన్నత సంస్కృతాధ్యయన పాఠశాలలు ధనికుల కానుకలపై ఆధారపడి నడిచేవి. తొల్‌లోని ఉపాధ్యాయుడు తన విద్యార్థులకు ఉచితవసతి, బోధనాసౌకర్యాలు కల్పించేవారు. సంస్కృతభాషా సాహిత్యాలు ఈ తొల్‌లలో ప్రధాన అంశాలు. 19వ శతాబ్దం ప్రారంభంలో కూడా బెంగాల్‌లో తొల్, చతుష్పదివంటివి అనేకం కనిపిస్తాయి. చతుష్పది కళాశాలల్లో వ్యాకరణ, స్మృతి, పురాణ, దర్శన అనే నాలుగు శాస్త్రాలు బోధించేవారు. బెంగల్‌లో మూడు రకాల పాఠశాలలుండేవి. మొదటి శ్రేణిలో వ్యాకరణం, కవిత్వం, పురాణాలు, స్మృతులు అధ్యయనం చేసేవారు. రెండవ శ్రేణి పాఠశాలల్లో కేవలం స్మృతి, పురాణాలు మాత్రమే అధ్యయనాంశాలుగా

ఉండేవి. మూడవ శ్రేణి పాఠశాలల్లో న్యాయ, దర్శనాలు ప్రధాన అధ్యయనాంశాలు. తొల్‌లలో కొన్నిసార్లు ఖగోళ, జ్యోతిష, గణిత, భూగోళ, చరిత్ర, రాజనీతి శాస్త్రాలుకూడా అధ్యయనాంశాలుగా ఉండేవి. పాలి, ప్రాకృతం, హిందీ, బెంగాలి, ఒరియా వంటి ప్రాంతీయ భాషలు తొల్‌లలో బోధించేవారు. ఈ ఉన్నత విద్యాకేంద్రాలలో సామాన్య, భౌతిక శాస్త్రాల అధ్యయనమాత్రం లేదు. అంశాలన్నింటిలో వ్యాకరణ, తత్త్వశాస్త్రాలు సమగ్రంగా బోధించేవారు. సాహిత్య, తత్త్వశాస్త్రాలమాదిరి వ్యాకరణం ఒక ప్రత్యేక అంశంగా స్నాతకోత్తర స్థాయిలో బోధించేవారు. పాణిని అష్టాధ్యాయి బోధనలో లేదు. దాని స్థానంలో భట్టోజీ దీక్షితుని సిద్ధాంత కౌముది, వోపదేవుని కాతంత్ర, ముగ్ధబోధ బోధించేవారు.

హర్షవర్ధముని కాలంనుంచి సంస్కృతబోధన, పరీక్షావిధానాల స్థాయిలో మార్పు కనిపించింది. మొఘలుల కాలంలో వేద అధ్యయనం ఉనికిని కోల్పోయింది. 14వ శతాబ్దంలో సాయనుడు చిట్టచివరి వేద వ్యాఖ్యాత. నాలుగు వేదాలు, హిందూ తత్త్వంలో ఆరు మార్గాల పైన మంచి అవగాహనగల ప్రథమశ్రేణి పండితుడు 16వ శతాబ్దానికి చెందిన గంగభట్ట. 16వ శతాబ్దంనాటికి సంస్కృతాధ్యయనం బ్రాహ్మణుల ఏకస్వామ్యం క్రిందకు వచ్చిందని భావించవచ్చు.

పేరుపొందిన నిపుణులైన ఉపాధ్యాయులు, పండితుల నివాసాలే విద్యాకేంద్రాలుగా రూపొందాయి. వాటినే విశ్వవిద్యాలయాలనేవారు. హిందువులు దేవాలయాలు, పవిత్రస్థలాలను ఉన్నతవిద్యా కేంద్రాల స్థాపనకు ఎన్నుకునే వారు. ఉపాధ్యాయులు బోధనలో ఏకాగ్రతతో పాల్గొనేందుకు వీలుగా ఈ ప్రదేశాలు ఉపాధ్యాయులకు ఆదాయవనరులను కల్పించేవి. హిందూమతం గురించి అధ్యయనం చేసేందుకు ఈ కేంద్రాలలో కొన్నింటిలో ప్రత్యేక అవకాశాలుండేవి. బెనారస్, నదియా, మిథిల, మధుర, ప్రయాగ, హరిద్వార్, ఉజ్జయిని, అయోధ్యలు హిందువులకు ఉన్నతవిద్య అధ్యయనకేంద్రాలుగా పేరుగాంచాయి. ఈ కేంద్రాలలో దేశంలోని అన్ని వైపులనుంచి విద్యార్థులు ప్రవేశంపొందేవారు. స్నాతకస్థాయి విద్యకుశిక్షణా కాలం పన్నెండుసంవత్సరాలుగా ఉండేది. నేటి డాక్టరేట్ డిగ్రీతో సమానమైన గుర్తింపు పొందేందుకు విద్యార్థి పేరుపొందిన ఉపాధ్యాయునివద్ద మరికొన్ని సంవత్సరాలపాటు విద్యనభ్యసించాల్సి ఉండేది. 17వశతాబ్దంలో ప్రముఖకవి సుందరదాసు బెనారస్‌లో ముప్పై సంవత్సరాలపాటు విద్యనభ్యసించారు.

మొత్తంమీద క్రీ.శ.1800 వరకు హిందువులలో ఉన్నతవిద్య ఒకేపద్ధతిలో సాగింది. నవ్య-న్యాయ, స్మృతి, వ్యాకరణం బోధనాంశాలుగా హిందువులకు ప్రీతిపాత్రమైనవి. ముస్లిం పాలనాకాలం మొత్తంలో అధ్యయనవిధానం, అధ్యయనాంశాలు, విద్యా విధానం ఒకేమోస్తరుగా ఉన్నట్లుగా తెలుస్తున్నది.

========================

## ప్రాచీన-మధ్యయుగాల్లో స్త్రీవిద్య

భారతదేశంలో స్త్రీవిద్యపైన పండితులకు విభిన్న అభిప్రాయాలున్నాయి. స్త్రీ మెదడుకు క్రమశిక్షణలేదు, ఆమె వ్యక్తిత్వం శక్తివంతమైనదికాదు అని ఋగ్వేదంలో పేర్కొన్నట్లుగా తెలుస్తున్నది.

మధ్వాచార్యుని ప్రకారం ద్విజులకుటుంబాలలో బాలురతోపాటు బాలికలుకూడా ఎనిమిది సంవత్సరాల వయసులో వేదాధ్యయనానికి అర్హులు. వేదాధ్యయనానికిముందు బ్రహ్మచారులు పవిత్రబంధాన్ని ధరించే సంప్రదాయం ఉన్నట్లుగా తెలుస్తుంది.

"పురాకల్పే కుమారీణాం మౌంజీబంధనమిష్యతే

అధ్యాపనంచ వేదానాం సావిత్రీ బంధనం తథ"

వేదకాలంలో బాలికలకు కూడా ఇటువంటి ప్రారంభక్రతువే నిర్వహించేవారు. సరస్వతీదేవి ధరించే జంధ్యం యిందుకు నిదర్శనం. పార్శీలలో స్త్రీ, పురుషులిరువురిలో జంధ్యాన్ని ధరించే సంప్రదాయం ఉండటం గమనించాల్సిన అంశం. బ్రహ్మచర్యంతో సహా జీవితంలోని నాలుగుదశలు స్త్రీలకు వర్తించేవని, స్త్రీపురుషులిరువురికి వేద మంత్రాలను పఠించేహక్కు ఉందని తెలుస్తున్నది.

బాలికలకు విద్యా, ధర్మనీతి బోధించాలి. అలా అధ్యయనంద్వారా పరిపుష్టిపొందిన స్త్రీ తన తండ్రి, భర్తల కుటుంబాలకు మంచిపేరుతెస్తుందన్నది ప్రాచీనుల భావన. పతిమర్యాద, పతిసేవన, ధర్మశాసన వంటివిషయాల్లో స్త్రీ జ్ఞానం సంపాదించేంతవరకు తండ్రి తన కుమార్తెకు వివాహం చేయరాదన్నది నాటి నియమం.

వాస్తవానికి ఋగ్వేదంలోనికొన్ని శ్లోకాలు స్త్రీలు రాసినవే. వారు మంత్రాలు ఉచ్చరించిన వారే. అయితే తర్వాతికాలంలో స్త్రీలకు అధ్యయనానికి, పఠనానికి అనుమతి లభించలేదు. బుద్ధునికాలంలోకూడా స్త్రీలకు శాస్త్రాధ్యయనం, పఠన,లేఖన అధ్యయనాల్లో హక్కు ఉండేది. కాలక్రమంలో స్త్రీలకి ఈ వేదాధ్యయనం, పవిత్రసాహిత్యాధ్యయనం నిషేధించారు. అయితే ఈ చర్య సరిగ్గా ఎప్పుడు చోటుచేసుకుందో నిర్ణయించటం సాధ్యపడలేదు.

స్త్రీలు వేదాధ్యయనానికికాని, క్రతువుల నిర్వహణకుకాని అర్హులుకారని స్మృతులు పేర్కొంటున్నాయి. స్త్రీకి వివాహమే వేదాధ్యయనం వంటిదని, పతిసేవ, గృహనిర్వహణే పవిత్రాజ్ఞలను పూజించటమని మనువు పేర్కొన్నాడు. తొమ్మిదవ అధ్యాయంలో 18వ శ్లోకం పవిత్రగ్రంథాల అధ్యయనాన్ని, మతకర్మల నిర్వహణను స్త్రీలకు నిషేధించింది. వేదాధ్యయనం నుంచి స్త్రీలను వెలివేసినట్లుగా ఇది రుజువుపరుస్తున్నట్లుగా జగన్నాధుడు అభిప్రాయపడ్డాడు.

నారదస్మృతి 18వఅధ్యాయం, 30వశ్లోకం ఇలా పేర్కొంటుంది.

"తథాహి శాస్త్రాధ్యయనాధికారిత్వాత్ శాస్త్రమాత్రోపజీవి ధర్మోధర్మజ్ఞానాభావాత్

స్వాతంత్ర్య వర్తమానత్వేన పురుష పారతంత్ర్యా భావాతేనోపదేశ సంఘుశ్చ"

శాస్త్రాధ్యయనానికి వీలులేకపోవటంతో శాస్త్రజ్ఞానం ఆధారంగాచేసే ధర్మాధర్మనిర్ణయ విచక్షణ లేకపోవటంతో స్త్రీలు పరాధీనులైనారన్నది వీరి అభిప్రాయం. స్త్రీలు శూద్రుల వలెనే వేదాలను వినేందుకు అనర్హులని భాగవతపురాణం పేర్కొంటుంది. మెగస్తనీస్ ఇండికాలోకూడా ఈ విషయం పేర్కొనట్లుగా తెలుస్తున్నది. బ్రాహ్మణులు తత్త్వజ్ఞానాన్ని తమ భార్యలకు బోధించరని పేర్కొంటూనే కొందరుమాత్రం తత్త్వజ్ఞానాన్ని కలిగిఉన్నట్లుగా మెగస్తనీస్ పేర్కొంటాడు.

స్త్రీలకు వేదాధ్యయనాన్ని నిషేధించడానికి భారతదేశంలో జరిగిన విదేశీ ఆక్రమణలు కారణంగా చెప్తారు. దాదాపు ప్రతిదేశంలో అభివృద్ధిచెందే దశలో స్త్రీలను హీనంగాచూసే భావన ఉందని పేర్కొంటారు. "In fact, she was not a unit but a zero in the sum of human civilisation" (Cady Santon: 290)

ఈ కాలంనుంచి కుటుంబనిర్వహణే స్త్రీబాధ్యతగా భావించటంతో బాలికలవిద్య

గృహసంబంధమైనది, వృత్తి సంబంధమైనదిగా రూపొందింది. స్త్రీ వ్యవసాయ, వ్యాపారరంగాలలో పురుషులకు సహాయకారిగా ఉండాలని, పురుషుని కోసం స్త్రీ సంగీతం, కళలు అభ్యసించాలని శుక్రనీతిసారంలో శుక్రాచార్యుని భావన. వాత్స్యాయనుడు కామసూత్రంలో వివాహిత స్త్రీల విధులను ఇలాపేర్కొంటాడు.

దినసరివాచకం తర్వాత మిగిలిన పెరుగునుంచి వెన్నతీయటం, విత్తనాలనుంచి నూనెనుతీయటం, చెరకునుంచి పంచదార, బెల్లం తయారీ, పత్తినుంచి దారాన్నివడికి, బట్టనేయటం, తాళ్ళునేయటం, కోతలు, నూర్పులు చూడటం, చద్దన్నం, నూకలు, బొగ్గులు వంటివి వృధాకాకుండా ఉపయోగించేట్లు చేయటం, సేవకుల జీతభత్యాలగురించిన జ్ఞానం, వ్యవసాయంపట్ల శ్రద్ధ, పశువుల సంక్షేమం, సయోధ్య చేకూర్చగల పరిజ్ఞానం, గొర్రెలు, కోళ్ళు, చిలుకలు, కోయిలలు, నెమళ్ళు, కోతులు, లేళ్ళు వంటివి పెంచటం, దినసరి జమాఖర్చులు గణించటం--- ఇవన్నీ భార్యల విధులు. వీటన్నింటికి శిక్షణ బాలిక స్వంతగృహంలోనే తల్లిపర్యవేక్షణలో జరుగుతుంది. ఉమ్మడి కుటుంబవ్యవస్థ కారణంగా వివాహంతర్వాత మెట్టినింటిలో ఈ శిక్షణ కొనసాగుతుంది.

స్త్రీ తనవయసులో కేవలం ప్రయోగాత్మకంగా మాత్రమే అర్థంచేసుకోగలిగిన 64విధాలైన కామకళను వ్యక్తిగతంగా అధ్యయనం చేయాల్సిఉంటుందని వాత్స్యాయనుడు పేర్కొంటాడు. ఈ విషయంలో బాలికకు గురువులుగా 1. తనతోపాటు పెరిగి, పురుషునితో సంబంధంకలిగిన తన సేవకురాలి కుమార్తె 2. పురుషునితో సంబంధం కలిగిన నిజాయితీగల స్నేహితురాలు 3. సమవయస్కురాలైన తన పిన్నమ్మ 4. నమ్మకంగలిగిన సేవకురాలు. 5. యింతక్రితం పురుషునితో సంబంధం కలిగిన సన్యాసిని 6. తన స్వంత అక్కయ్య వంటివారు ఉండాలని ఆయన భావన.

వాత్స్యాయనుని స్త్రీవిద్యకు సంబంధించిన ప్రణాళిక ఆదర్శవంతమైనదిగా కనిపిస్తుంది. సాహితీ పరమైన అంశాలు, గృహసంబంధమైన కళాపరిజ్ఞానం, పాకశాస్త్ర పరిజ్ఞానం, పారిశుద్ధ్యం, దుస్తులు, సదుపాయాలకు చెందిన జ్ఞానం, మానవ కళలకు, సృజనాత్మక కళలకు, శాస్త్రవిజ్ఞాన కళలకు సంబంధించిన జ్ఞానం, సంగీతజ్ఞానం, నాటక పరిజ్ఞానం, ఆచార వ్యవహారాలు, చిత్రకళ, వ్యాయామ విజ్ఞానం, ఈ ప్రణాళికలోని అంశాలు.

తాంత్రికవిద్యల్లో ప్రవీణులైనవారిలో అనేకమంది మహిళలున్నారు. తాంత్రిక తెగల్లో స్త్రీలు గురువులుగా ఉన్నట్లు కల్హణుని రాజతరంగిణిలో పేర్కొన్నట్లు తెలుస్తున్నది. మిగిలినవారికంటే శాక్త్యులలో స్త్రీలు మరింత స్వేచ్ఛను, ఆలోచనాపరిజ్ఞానాన్ని కలిగిఉన్నారు.

బానిస స్త్రీలకు గానం, వీణ, మృదంగం, మురళి వంటివి వాయించటం, పఠనం, నాట్యం, నటన, లేఖనం, చిత్ర లేఖనం, పూమాలల అల్లకం, ఇతరుల మనసులను ఆకర్షించి లోబరుచుకొనగలగటం వంటి విద్యలను నేర్పించేవారని కౌటిల్యుని అర్థశాస్త్రంలో పేర్కొన్నట్లు తెలుస్తున్నది.

గీత వాద్య పాఠ్య నృత్త నాట్యాక్షర చిత్ర వీణా వేణు మృదఙ్గ పరచిత్త జ్ఞాన గన్ధమాల్యా సంయూహన సంపాదన సంవాహన వైశిక కలాజ్ఞానాని గణికా: దాసీరఙ్గోపజీవినీశ్చ గ్రాహయతో రాజమణ్డలాదాజీవం కుర్యాత్ (కౌటిల్యుడు.1999: 262)

గణికలకు, గణికాలుకాని వేశ్యలకు, నాట్యరంగంమీద జీవించే నటాదుల భార్యలకు గీతాదులు నేర్పినవారికి గ్రామ-నగరాదులవల్ల రాజుకు లభించిన ధనంనుంచి జీతం ఇవ్వాలి. ఆఖ్యాయికలు మొదలైనవి (పాఠ్యం), పదార్థాల అభినయం (నృత్తం), వాక్యార్థాల అభినయం, నాటకాదుల ప్రయోగం

(నాట్యం), లిపి, వ్రాత (అక్షరం), చిత్రించడం (చిత్రం), ఎదుటివారి మనస్సుగ్రహించే విధానం (పరచిత్తజ్ఞానం), సుగంధ ద్రవ్యాలు తయారుచేయడం (గంధసం యూహనం), మాలికలు అల్లడం (మాల్యసంపాదనం), ఒళ్ళుపట్టడం (సంవాహనం), దత్తకాచార్యులు రచించిన వేశ్యాశాస్త్రం (వైశికమ్), ఇవికాక చతుష్షష్టి కళలలో చేరిన ఇతర కళలు బానిస స్త్రీలకు అధ్యయనాంశాలుగా ఉండాలని కౌటిల్యుడు పేర్కొన్నాడు.

కౌటుల్యుని ప్రకారం వేశ్యలు తమ అందానికీ, యవ్వనానికీ, పాండిత్యానికి పేరుపొందారు. వేశ్యావాటిక నిర్వాహకురాలు సంవత్సరానికి వెయ్యిపణాలకు ఈ స్త్రీలను రాజాస్థానంలో నియమించేది. వాత్స్యాయనుడు వేశ్యల లక్షణాలగురించి పేర్కొంటూ కామశాస్త్రం, దాని అనుబంధకళలు, ఇతర 64కళల్లో ప్రావీణ్యం కలిగివుండాలని పేర్కొన్నాడు. కౌటుల్యుడు కూడా వేశ్యలవిద్యపట్ల సమగ్ర దర్శనాన్ని ప్రదర్శించాడు.

నిరంతరం దేవాలయాలకు అనుబంధంగా ఉండే నృత్యకారిణులను సాధారణంగా దేవదాసీలని పిలుస్తారు. కల్హణుడు రాజతరంగిణిలో, కాళిదాసు మేఘదూతంలో దేవదాసీల గురించిన ప్రస్తావన ఉంది. నాట్యకత్తెలు తప్పనిసరిగా కళంకితులై ఉండాలని లేదు. కానీ వారిజీవితంలో చెడును ప్రేరేపించే పరిస్థితులు అనేకం. వీరిలో కొందరు మచ్చలేని జీవితం గడిపినప్పటికీ, అనేకమంది పరిస్థితులకారణంగా అగౌరవప్రదమైన స్థాయికి చేరే అవకాశాలుండటంతో ఈ దేవదాసీ వ్యవస్థ, వేశ్యా వ్యవస్థతో సమానమైనదిగా గుర్తింపుపొందింది.

Abbe J.A.Dubois తన ప్రసిద్ధరచన Hindu Manners. Customs and Cermonies లో ఇలా అంటారు. "Every temple of any importance has in its service a women in India who enjoy the privilege of learning to read, to dance and to sing."

వేశ్యలను రాజ్యం గూఢచార వ్యవస్థలో విస్తృతంగా వినియోగించినట్లు కౌటుల్యుని అర్థశాస్త్రంలో పేర్కొన్నారు. దాని ప్రకారం వేశ్యలు రాజు, ఇతర అధికారుల గృహాల్లో గూఢచారిణులుగా పనిచేసినట్లు తెలుస్తున్నది. వీరు తాము గ్రహించిన రహస్యాలను సంగీతసాధనాలద్వారానో, లేదా గూఢలేఖనంద్వారానో తమవారికి చేరవేసేవారు. దీన్నిబట్టి నాటికే స్త్రీలు లేఖనం, సంజ్ఞలను గుర్తించటం వంటి విద్యలు అభ్యసించినట్లు తెలుస్తుంది.

### *1.3.1. దేశీయ విద్యావిధానం-- స్త్రీవిద్య :*

వేదకాలంలో స్త్రీపురుషులందరూ వారి సామర్థ్యానికనుగుణంగా కులప్రసక్తిలేకుండా విద్యాభ్యాసానికి అర్హతకలిగి ఉన్నారు. ఆకాలంలో ఉన్నతవర్గాలకేకాకుండా విద్య ప్రజలందరికీ అందుబాటులో ఉండేది. స్త్రీ, పురుషులందరూ సాహితీ సంబంధమైన, మత సంబంధమైన విద్య మౌలికసూత్రాలను అధ్యయనంచేసేవారు. స్త్రీలుకూడా వేదకీర్తనలు రచించేవారు. వారికి యజ్ఞనిర్వహణకు, పవిత్ర మంత్రోచ్చారణకు వీలుండేది. విద్యాభ్యాసానంతరం స్త్రీలకు వివాహాలుజరిగేవి. వారు నాటి మేధోసంపదలో భాగం పంచుకునేవారు. తాత్వికచర్చల్లో పాల్గొనేవారు. నాడు అనేకమంది మహిళా అధ్యాపకులున్నట్లు ఉపనిషత్తులనుంచి మనకు తెలుస్తుంది. నృత్యం, గానం వంటి కళల్లో స్త్రీలుకూడా శిక్షణపొందేవారు. మీమాంస వంటి కఠినఅంశాలు అధ్యయనం చేసేందుకు కూడా పండితస్త్రీలు ఉత్సాహంచూపారు. మైత్రేయి, గార్గి, ఆత్రేయి, సులభ వంటి పండితులు జ్ఞానవికాసానికి తమవంతు కృషి చేశారు. నాడు బాలికలకు బోధించే ఉపాధ్యాయినులు

ఉండేవారు. ఆనాడు విద్యార్థినుల వసతిగృహాలగురించి పాణిని పేర్కొన్నాడు. మనుస్మృతి ప్రకారం క్రీ.పూ 200శతాబ్దంనాటికి బాలికలు వేదాధ్యయనంచేసే అర్హత కోల్పోయారు. మతపరంగా స్త్రీ వివక్షతకు గురికావటంతో, స్త్రీవిద్యకు పెద్ద ఆటంకం ఏర్పడింది. వేదాధ్యయనానికి, వేదకర్మకాండల నిర్వహణకుగల హక్కులు నిరాకరించబడ్డాయి.

ఉన్నత కుటుంబాలలోని స్త్రీలుమాత్రం విద్యనుకొనసాగించారు. అయితే వారికి వేదవిద్య అందలేదు. సంగీతం, నృత్యం, ముద్రణ, మాలల తయారీ, గృహాలంకరణ వంటి గృహకళల్లో, లలితకళల్లో మౌలికశిక్షణలభించింది. వారు సంస్కృత, ప్రాకృతాలను చదవటం, రాయటం నేర్చుకున్నారు. ఈ కళల్లో శిక్షణనిచ్చేందుకు ధనిక కుటుంబాల్లో శిక్షకులను నియమించుకునేవారు. శిక్షణకోసం ప్రత్యేకమైన శిక్షకులను నియమించుకునే తాహతులేని సామాన్యకుటుంబాల్లో మాత్రం స్త్రీవిద్య చాలావేగంగా క్షీణించింది.

క్రీ.పూ.200--క్రీ.శ.1200ల మధ్యకాలంలో స్త్రీవిద్యావకాశాలు బాగా క్షీణించినా, దక్షిణభారతంలో ప్రాకృతంలో కవిత్వం రచించిన అనేకమంది ప్రఖ్యాత కవయిత్రులు తయారవటం విశేషం. వారిలో ఏడుగురు పేర్కొనదగ్గవారు. వారు రవా, రోహా, మధావి, అనులక్ష్మి, పాహలి, వద్ధావలి, శశిపర్వ. నాటి సాహితీ, తత్త్వ విమర్శల్లో కొందరు పండితస్త్రీలు పాల్గొన్నట్లు తెలుస్తున్నది. వారు మీమాంస, వేదాంత, సంస్కృత సాహిత్యాల్లో ప్రావీణ్యులు. కొందరు స్త్రీలు వైద్యవిద్యనుసైతం అభ్యసించారు. వీరిలో అధికశాతం స్త్రీసంబంధమైన వ్యాధులనివారణలో శిక్షణపొందారు. వారిలో కొందరు వైద్యశాస్త్రంలో ప్రముఖగ్రంథాలుకూడా రచించారు.

బౌద్ధం ప్రారంభంలో మఠాలస్థాపనద్వారా స్త్రీవిద్యకు ప్రోత్సాహం లభించింది. అయితే క్రీ.శ. నాలుగవ శతాబ్దంలో ఆరామాలు కళాశాలలుగా అంతర్జాతీయంగా ప్రాముఖ్యంపొందటంతో స్త్రీకి విద్య నిరాకరించటం మొదలైంది. దీంతో నాలుగవ శతాబ్దానికి మఠాలు తమఉనికిని కోల్పోయాయి.

తమబాలికలకు విద్యాబోధనకోసం ప్రైవేటు శిక్షకులను నియమించుకున్న అనేకమంది భారతీయ ఉన్నతవర్గ కుటుంబాలు ముస్లింలపాలనలో జరిగిన రాజకీయతిరుగుబాటు ఫలితంగా నశించిపోయాయి. దీంతో స్త్రీవిద్యాశాతం బాగా పడిపోయింది. మొత్తం బాలికలలో కేవలం కొద్దిశాతం మాత్రమే విద్యనుపొందేవారు. వారుకూడా ప్రత్యేకించి రాజపుత్ ప్రముఖులు, బెంగాలీ జమిందారీ కుటుంబాలవారే. బాలికలకోసం ప్రత్యేకపాఠశాలలు లేవు. కొన్నిచోట్లమాత్రం బాలురతోపాటు బాలికలకు కూడా బోధించేవారు. అదికూడా ప్రాథమికవిద్య వరకు మాత్రమే.

మధ్యయుగంలో భారతదేశంలో స్త్రీలలో అక్షరాస్యత విపరీతంగా పడిపోయింది. బాలురతోపోల్చినప్పుడు బాలికలకువిద్య అంతముఖ్యమైనదనే భావనలేదు. హిందూ, ముస్లిం కుటుంబాలలో విస్తృతంగా అమలౌతున్న బాల్యవివాహాలు బాలికల విద్యకు పెద్ద అడ్డంకిగా నిల్చాయి. అబుల్‌ఫజల్ తన అక్బర్‌నామాలో ఈ విధమైన బాల్యవివాహాలగురించి పేర్కొన్నాడు. భారతీయులు తమపిల్లలకు బాల్యంలోనే వివాహాలుచేసేందుకు ఆతురత చూపేవారని అబుల్‌ఫజల్ రాశాడు. సమాజంలోని ఉన్నతవర్గప్రజలు ప్రతివిషయంలోను పాలకులను, గొప్పవారిని అనుకరించారు. అందువల్ల వాళ్ళు స్త్రీ విద్యను నిర్లక్ష్యంచేయలేదు. కాని వివాహానంతరం స్త్రీ తనకుటుంబవ్యవహారాలు, పిల్లల ఆలనాపాలనా చూసుకోవలసి రావటంతో విద్యార్జనకు, మేధోవికాసానికి తగిన సమయం, అవకాశం దొరికేదికాదు. అప్పటికీ కొందరు ధనికులు తమకుమార్తెలకు విద్యాబోధనకోసం ప్రైవేటు శిక్షకులను నియమించారు. దీనివల్లనే మధ్యయుగంలో

కూడా ఉన్నతవిద్యనభ్యసించిన మహిళలు మనకు తారసపడతారు.

బెంగాల్ జానపదుల్లో బాలికలు పుష్పవతులయ్యేంత వరకు బాలురతోకలసి చదువుకునే వారనేందుకు దృష్టాంతాలున్నాయి. మధ్యయుగరచన 'ఇచ్ఛావతిహారన్'లో కథానాయకుడు చారుబ్రహ్మ, కథానాయిక ఇచ్ఛావతి ఒకే పాఠశాలలో, ఒకే ఉపాధ్యాయునివద్ద కలసి అభ్యసించినట్లుగా పేర్కొన్నట్లు తెలుస్తున్నది. మధ్యయుగ బెంగాల్‌లోని చండీకావ్యాల్లో స్త్రీ సాహితీపాండిత్యం గురించిన ఆధారాలు కనిపిస్తాయి. పద్దెనిమిదవవ శతాబ్దంలో ఘనరాం చక్రవర్తి రచన 'ధర్మమంగల్'లో ప్రజాప్రముఖులుగా హీరా, సురిక్షాలను గూర్చిన వివరణ ఉంది. అదే రచనలో లక్ష్మి అనే ఒక నిమ్నజాతి స్త్రీ సైనికదుస్తులుధరించి యుద్ధానికి సన్నద్ధమైనట్లుగా ఉదహరించారు. ఇదేరచనలో లావ్‌సేన్ రాజ్యంలో లేనిసమయంలో అతనిరాజ్యంపై దండెత్తిన గౌడరాజుతో యుద్ధంచేసేందుకు భార్యలలో ఒకరైన కళింగ సైనికదుస్తులుధరించి యుద్ధభూమికి వెళ్ళినట్లు తెలుస్తున్నది. మైమన్‌సింగ్ జానపదగేయాల్లో ఆనాటి స్త్రీలు కొందరు కుట్లు, అల్లికలు, వంటపనితోపాటుగా చిత్రలేఖనం వంటి కళల్లోకూడా నిపుణులుగా పేరుపొందినట్లుగా తెలుస్తున్నది. 16వ శతాబ్దపురచన 'మానసమంగళం'లోను, దుఖిని రచన 'పదవలి'లోను నృత్యం ఒక కళగా అభ్యసించినట్లు పేర్కొన్నట్లుగా తెలుస్తున్నది. ఉన్నతవర్గ మహిళలు కొందరు ఉన్నతవిద్యను అభ్యసించారు. 19వశతాబ్దం ప్రారంభంలో పేరుపొందిన బెంగాలీ రామాయణరచయిత్రి, బన్సీదాస్ కుమార్తె చంద్రావతిపేరు తటస్థపడుతుంది. 18వశతాబ్దం మధ్యలో భరతచంద్ర రచన 'విద్యాసుందర్'లో ఉన్నత విద్యావంతురాలైన విద్య తనప్రియుడు, కాబోయేభర్త సుందర్‌తో తత్త్వశాస్త్ర సంబంధమైన క్లిష్టమైన అంశాలను చర్చించినట్లుగా తెలుస్తోంది.

ఈ కాలంలో సంగీతంలోను, నృత్యంలోను నైపుణ్యంగల వేశ్యలు, నృత్యకారిణులు ఉండేవారు. అక్బర్, జహంగీర్‌ల సమకాలికుడు కేశవదాస్ కథనుంచి ఓర్ఛపాలకుడు ఇంద్రజిత్‌సింగ్ కొలువులో ఆరుగురు నిపుణులైన గాయనీమణులు, నృత్యకారిణులు ఉన్నారని తెలుస్తున్నది. బన్సీదాస్ 'మానసమంగళ్', ఘనరామ్‌చక్రవర్తి 'ధర్మమంగళ్'లలో సంగీతకళాకారిణుల గురించిన దృష్టాంతాలున్నట్లు తెలుస్తున్నది. వీటన్నింటినిబట్టి 16వ శతాబ్దంలో స్త్రీవిద్యపట్ల విముఖత లేదని గుర్తించవచ్చు. నిమ్నజాతి స్త్రీలు నిరక్షరాస్యులుకాగా, ఉన్నతవర్గాల, అగ్రవర్ణాల స్త్రీలుమాత్రం విద్యనుంచి పూర్తిగా దూరంకాలేదు.

నాడు విధవావిద్యగురించి ప్రత్యేకశ్రద్ధ చూపారు. అలా విద్యావంతులైన కొందరు తర్వాత ఉపాధ్యాయినులుగా పనిచేశారు. ఆరోజుల్లో భారతీయస్త్రీలు కీర్తన, యాత్రా వంటి ప్రముఖ వినోద మాధ్యమాలద్వారా విద్యావంతులైనట్లు తెలుస్తున్నది. పురాణాలు, ఇతిహాసాల అధ్యయనం ఉన్నత తరగతి స్త్రీలలో ప్రముఖంగాఉండేది. సంగీతం, నృత్యం, వివిధ సంగీత వాయిద్యాలు ఉపయోగించటం కొందరు స్త్రీలకు కాలక్షేపంగా ఉండేది. లలితకళల్లోని అంశాల్లో సాధారణ మహిళలు, నృత్యకారిణులు ప్రత్యేక నైపుణ్యం చూపేవారు. శాస్త్రాలు, వ్యాకరణం, నిఘంటువులు, సాహిత్యం, నాటకం, అలంకారశాస్త్రం వంటి అంశాలుకూడా స్త్రీల పాఠ్యాంశాలుగా ఉన్నట్లుగా తెలుస్తున్నది. పాఠశాలల్లోమాత్రం గృహనిర్వహణకు చెందిన అంశాల్లో బాలికలకు శిక్షణఇచ్చేవారు.

### *1.3.2. ఇస్లాం విద్యావిధానం- స్త్రీవిద్య:*

వాస్తవానికి ముస్లిం సమాజంలో విద్య స్త్రీ, పురుషులిరువురికీ తప్పనిసరి. వారి

విద్యావకాశాలు నిర్లక్ష్యానికి గురికాలేదు. వారు మేధోపరమైన, నైతికమైన విద్యలు రెంటినీ పొందారు. మధ్యయుగంలో అనేకమంది మతపరమైన ఆలోచనాదృష్టిని కలిగి ఉండేవారు. స్త్రీవిద్య సమాజానికి హానిచేస్తుందనుకోకున్నా, అది అనవసరమనే భావనమాత్రం వారికి బలంగాఉండేది. యువతులను ఇంటిపనికి సంసిద్ధులను చేయాలన్నది వారిఆలోచన. అప్పటికీ స్త్రీ అభివృద్ధికి కృషిచేసిన వ్యక్తులుకూడా కొందరున్నారు. పర్దా పద్ధతివల్ల ముస్లిం స్త్రీవిద్య నియంత్రణకు గురైంది. ఆరోజుల్లో ముస్లిం బాలికలకు ప్రత్యేక పాఠశాలలుకూడా ఉండేవి. కొందరు బాలికలు పాఠశాలల్లో విద్యనభ్యసించినప్పటికీ, వారు చిన్నవయస్సులోనే పాఠశాలను వదలవలసి వచ్చేది. రాజుల అంతఃపురాల్లోని స్త్రీలలో కొందరు విద్యావంతులేకాక విశిష్టగుర్తింపు పొందినవారు కూడా ఉన్నారు. సాధారణవిద్య పొందలేకపోయినా స్త్రీలు గృహసంబంధమైన విధులలో శిక్షణ పొందేవారు.

ఉన్నతవర్గాల ముస్లిం మహిళలు తమఇండ్లలో ప్రైవేటుగా విద్యాభ్యాసంచేసేవారు. ఇల్తుత్‌మిష్ కుమార్తె సుల్తానా రజియా అత్యంత విద్యావంతురాలు. చదవటం, వ్రాయటంతోపాటుగా సుల్తానా గుర్రపుస్వారీ, ఆయుధప్రయోగం వంటివి నేర్చుకుంది. బాబర్ కుమార్తె గుల్బదన్‌బేగం విద్యావంతురాలైన వనిత. మొఘలులకాలంలో మొదటి విద్యారత్నంగా ఆమె పేరుపొందింది. పర్షియన్‌లో ప్రముఖ గ్రంథం 'హుమయున్‌నామా' రచించింది. హుమాయున్ పాలనలోని సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాల గురించిన విలువైన సమాచారం ఈ గ్రంథంలో లభిస్తుంది. అక్బర్‌తల్లి హమీదాబానుబేగం మంచి వ్యక్తిత్వంగల విద్యావంతురాలు. హుమాయున్ మేనకోడలు సలీమాసుల్తానాకూడా విద్యావంతురాలు. పర్షియన్ భాషా, సాహిత్యాలపైన పూర్తి అవగాహనకలది. అక్బర్ కాలంలో రాచరిక స్త్రీలకు ప్రత్యేకశిక్షణ లభించేది.

జహంగీర్ భార్య నూర్‌జహాన్‌కి పర్షియన్, అరబిక్ భాషలు బాగాతెలుసు. రాజకీయ, పాలనా, సాహిత్యరంగాల్లో మూడింటిలో మంచి ప్రవీణురాలు. షాజహాను కుమార్తె జహనారాబేగం కూడా మంచి కవయిత్రి. ముంతాజ్‌మహల్ మేధస్సుకు పేరుపొందింది. ఔరంగజేబు పెద్దకుమార్తె జేబున్నిసాబేగం మరో విద్యావంతురాలైన రాకుమారి. ఆమెకు పర్షియన్, అరబిక్ భాషలు తెలుసు. ఆమె ఖురాన్‌ను బట్టీయంపట్టింది. అందమైన చేతిరాతలో శిక్షణపొందింది. గణితం, ఖగోళశాస్త్రం వంటి క్లిష్ట శాస్త్రాలలో నైపుణ్యంకలది. మంచి కవయిత్రి. ఔరంగజేబు చిన్నకుమార్తె జీనత్‌ఉన్నిసాకూడా సాహిత్యంలో ప్రవీణురాలు. సతీఉన్నిసా ఉన్నతవిద్య, సమగ్ర సాహితీజ్ఞానం వల్ల జహనారాబేగంకు శిక్షకురాలయ్యింది.

వీటన్నింటినిబట్టి మధ్యయుగ భారతదేశంలో ఉన్నత, రాచరిక కుటుంబాలకుచెందిన బాలికలు, స్త్రీలు కొంతమేరకు మత, సాహితీ విద్యను పొందినట్లు తెలుస్తున్నది.

మధ్యయుగంలో కొందరు పాలకులు, ధనికులు బాలికలకోసం పాఠశాలలు నెలకొల్పారు. మాల్వార్ సుల్తాన్ జలాలుద్దీన్, 15వ శతాబ్దంలో స్త్రీవిద్యకు ఆద్యుడు. అతని రాజధానిలో దాదాపు ముప్పై బాలికాపాఠశాలలుండేవని తెలుస్తున్నది. ఈ రంగంలో కృషిచేసిన మరోవ్యక్తి మాల్వాకు చెందిన ఘియాజుద్దీన్‌ఖిల్జీ. అతని అంతఃపురంలో అనేకమంది ఉపాధ్యాయినులుండేవారు. స్త్రీలకు కళలు, వృత్తివిద్యలు నేర్పేందుకు సారంగపూర్‌లో ఒక మద్రసాను నెలకొల్పాడు. ఇక్కడ స్త్రీలకు నృత్యం, సంగీతం, కుట్టుపని, నేతపని, చెక్కపని, బంగారుపని, చెప్పులతయారీ, అమ్ములతయారీ, బొంతల తయారీ వంటివాటిలో శిక్షణనిచ్చేవారు. అక్బర్ చక్రవర్తి కూడా స్త్రీవిద్యపట్ల ఉత్సాహంచూపాడు. ఫతేపూర్ సిక్రీలో తన ప్రాసాదంలో ఒక బాలికాపాఠశాలను స్థాపించాడు. జాఫర్

షరీఫ్ 'కానూన్-ఇ-ఇస్లాం'లో ముస్లిం స్త్రీ విద్యావిధానాన్ని గురించి సమాచారమున్నట్లుగా తెలుస్తున్నది. ఆరోజుల్లో మధ్యతరగతి వారికికూడా అనేక బాలికాపాఠశాలలున్నట్లు దీన్నుంచే తెలుస్తుంది. వీటిలో అనుభవంకల స్త్రీలు ఖురాన్, గులిస్థాన్, బుస్థాన్ వంటి సాహిత్యగ్రంథాలు, నైతికవిద్యకు సంబంధించిన గ్రంథాలు బోధించేవారు. బాలికల విషయంలోకూడా మక్తాబ్ ఉత్సవాలు జరిగేవి. పవిత్ర ఖురాన్ అధ్యయనం పూర్తిచేసినవెంటనే బాలికల తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు బహుమతులందించేవారు. ఈ సంప్రదాయం భారతదేశంలోనేకాక ప్రోవిన్షియల్ రాజ్యాలలోకూడా ఉండేది. కొందరు ముస్లిం స్త్రీలు భర్తమరణానంతరం ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించి పేదబాలికలకు మతశిక్షణ, పవిత్రఖురాన్ పఠనాలలో శిక్షణనిచ్చినట్లుగా తెలుస్తున్నది.

బాలికలు శిశువిద్యను తల్లిదండ్రులనుండి గ్రహించేవారు. బాలికలకు ప్రత్యేక పాఠశాలలు లేవు. బాల్యదశలో వారు బాలురతోపాటు అభ్యసించేవారు. కొన్ని సంవత్సరాల అనంతరం వారు బాలురనుంచి వేరుపడి ప్రైవేటు పాఠశాలల్లోనో, ఇండ్లల్లోనో విద్యనభ్యసించేవారు. వీరు వంట, నేతపని, కుట్టుపని, అల్లకం, శిశుపాలన వంటి వాటిలో శిక్షణనిచ్చే పెద్దల పర్యవేక్షణలో ఉండేవారు. గృహవిజ్ఞానం, గృహకృత్యాలు పాఠ్యబోధనలో ప్రముఖస్థానం ఆక్రమించేవి. ప్రాథమికస్థాయిలో ముస్లింమహిళలు ఖురాన్‌తోపాటుగా పఠన,లేఖన, అంకగణితాల్లో శిక్షణపొందేవారు. ముస్లిం రాణులలో కొందరు ఉన్నత విద్యావంతులే అయినా వారి విద్యకూడా అనేక పరిమితులకులోబడి మాత్రమే సాగేది. మొఘల్ రాణుల అధ్యయనం వారి బాల్యవివాహంతో ఆగిపోతుంది. అందువల్ల వారిలో అతికొద్దిమంది మాత్రమే భాషపైన మంచిపట్టు సంపాదించ గలిగేవారు. వివాహంతర్వాత వారు సాంస్కృతిక, విద్యావిషయాలతో సంబంధాన్ని కోల్పోయేవారని తెలుస్తున్నది.

మధ్యయుగంలో సగటు మధ్యతరగతి కుటుంబాల మహిళలకు హిందీ, పర్షియన్, ప్రొవిన్షియల్ భాషల్లో చాలినంత జ్ఞానం ఉండటంవల్ల, మతగ్రంథాల అధ్యయనానికి వీలుకలిగింది. విధవా విద్యకు అధికప్రాధాన్యత ఇవ్వటంతో కొందరు విధవలు ఉపాధ్యాయినులయ్యారు. అయితే నిమ్నవర్గాలకు చెందిన స్త్రీలకుమాత్రం విద్యలేకుండా పోయింది.

*"By Education I mean
an all round drawing out
of the best in child and man
-- body, mind and spirit"*

*------- Mahatma Gandhi*

==================

## ఆధునిక కాలంలో 'విద్య' భావన

ఆధునిక భారతీయ విద్యావిధానాన్ని అధ్యయనం చేయాలంటే కేవలం భారతీయ సామాజిక, ఆర్థిక చరిత్రలను అధ్యయనం చేయటంతో సరిపోదు. సమకాలీన పాశ్చాత్యసమాజానికి ప్రత్యేకించి ఇంగ్లాండ్‌కి చెందిన సామాజిక, రాజకీయ, విద్యా రంగాలలో చోటుచేసుకున్న అభివృద్ధిని అధ్యయనం

చేయాల్సి ఉంటుంది. భారతీయ విద్యాసంస్థలనేకం ఆంగ్ల విద్యాసంస్థలకు అనుగుణంగా రూపొందాయి. ఇంగ్లాండ్‌లో విద్యావిధానంలో జరిగే ప్రతిమార్పు ప్రభావం భారతవిద్యావిధానంపై ప్రతిఫలించేది. అందుచేత భారతవిద్యావిధానాన్ని ఆంగ్ల విద్యావిధానాన్నుంచి వేరుచేసి అధ్యయనం చేయాలనుకోవటం సమంజసంకాదు.

స్వదేశీ విద్యావిధానానికి--నూతన విద్యావిధానానికి మధ్య ఒక సంఘర్షణ ఈ కాలంలోనే తలెత్తింది. తమ ప్రత్యేక అవసరాలను అధిగమించేందుకు దేశీయ పరిస్థితులకు అనుగుణమైన విద్యావిధానాన్ని రూపొందించుకునే ప్రయత్నం ఒకవైపు, బ్రిటీషువిద్యావిధానాన్ని భారతదేశంలో అమలుచేసేందుకు విదేశీయులు చేస్తున్న ప్రయత్నం మరోవైపు రెండు విభిన్న స్రవంతులను ముందుకు తెచ్చాయి.

19వ శతాబ్దం ప్రథమార్ధం వరకు దేశీయ విద్యావిధానం ఉనికిలో ఉండేది. అనంతరం మిషనరీలు పాశ్చాత్య విజ్ఞానాన్ని, ఆంగ్ల భాషా సాహిత్యాల అధ్యయనాన్ని ప్రోత్సహించాయి. నూతన విద్యావిధానంద్వారా విద్యావంతులైనవారు, దాని ప్రయోజనాన్ని గుర్తించినవారు, ప్రభుత్వాధికారులు మిషనరీలతో జతకలిసారు. వీరందరి కృషి ఫలితంగా నూతన విద్యావిధానం అమలు సాధ్యపడింది.

అయితే ఈ నూతన విద్యావిధానం అమలుకు ప్రధాన కారణాలుగా కొన్నింటిని చెప్పుకోవచ్చు. 1. విక్టోరియా కాలపు బ్రిటీషువారికి తమ భాష, సాహిత్యం, విద్య ప్రపంచంలోనే అత్యుత్తమమైనవన్న భావన ఉండటంతో భారతదేశంకూడా వారిని అనుసరించాలని భావించటం. 2. భారతీయులుకూడా ఆ కాలంలో మొదటిసారి పాశ్చాత్య సంస్కృతితో ప్రభావితులైన కారణంగా బ్రిటీషు నమూనాను అనుకరించేందుకు అత్యుత్సాహం ప్రదర్శించటం. 3. నూతన విధానంలో విద్యావంతులైనవారు సులభంగా ప్రభుత్వ సర్వీసుల్లో నియమితులు కావటం. వీటి ఫలితంగా ఈ విధానం ప్రాధాన్యతను పొంది 19వశతాబ్దం చివరికల్లా స్వదేశీ విద్యావిధానం దాదాపుగా అంతరించి దానిస్థానంలో ఆంగ్ల విద్యద్వారా పాశ్చాత్య విజ్ఞానాన్ని అందించే నూతన విద్యావిధానం ప్రవేశించింది.

అయితే వెంటనే మరికొన్ని సంఘటనలు చోటుచేసుకున్నాయి. రష్యా-జపాన్ యుద్ధం తర్వాత జపాన్‌లాంటి దేశాలు తమ ఉనికిని చాటుకునేందుకు ప్రయత్నించాయి. ఇది భారతీయుల భావాలపైన తీవ్ర ప్రభావాన్ని చూపింది. దీంతో భారతీయులు అనేకులలో దేశీయ విద్యావ్యవస్థనుగురించిన ఆలోచన మొదలైంది. పూర్వులమాదిరిగా కాకుండా వీరు తమ దేశ సాంస్కృతిక చరిత్రను అధ్యయనం చేయసాగారు. మరోవైపు మొదటి ప్రపంచయుద్ధం కారణంగా పాశ్చాత్య సంస్కృతీ, సాంప్రదాయాల్లోని లోపాలు వెలుగుచూసాయి. అంతేకాకుండా పాశ్చాత్య విధానాలను యథాతథంగా అనుసరించటంలోని లోటుపాట్లు గుర్తించే వీలుకలిగింది.

ఇన్ని కారణాలదృష్ట్యా భారతీయులు ఆంగ్లేయ విద్యావిధానాన్ని యథాతథంగా దిగుమతి చేసుకునేందుకు మారుగా తమ అవసరాలకు అనుగుణమైన నూతన విద్యావిధానాన్ని రూపొందించుకునే ప్రయత్నం ప్రారంభించారు. అలాంటి ప్రయత్నాల్లో భాగంగానే విశ్వభారతి, జామియా మిలియా సంస్థలు అధికారిక వ్యవస్థకు వెలుపల పనిచేస్తే బెనారస్, అలీఘర్ వంటివి అధికార వ్యవస్థలో భాగంగానే పనిచేశాయి. ఇందులో మిషనరీలు, యూరోపియన్ విద్యాధికారులు, భారతీయ విద్యావేత్తలు ప్రముఖ పాత్ర వహించారు.

ముందుగా మిషనరీలు, అనంతరం యూరోపియన్ విద్యాధికారులు, చివరగా భారత

విద్యావేత్తలు భారత విద్యావిధానాన్ని ప్రభావితం చేశారు. స్వదేశీ విద్యావేత్తలు 19వ శతాబ్దం పూర్వభాగంలో ఆధునిక విద్యాసంస్థల స్థాపనకోసం నిధుల సేకరణ వాటి నిర్వహణ బాధ్యతలు చేపట్టి 19వ శతాబ్దం చివరి దశాబ్దాల్లో విద్యావ్యవస్థను జాతీయీకరించేందుకు కృషి చేశారు.

అయితే తదుపరి రాజకీయ దృక్పథం మరింత విస్తృతమై విద్యావ్యవస్థపైన పూర్తి నియంత్రణను భారతీయులు ఆశించారు. వీరి కోరిక 1921, 1937లలో కొంతమేరకు 1947 నాటికి పూర్తిగాను సిద్ధించింది. మిషనరీలు తమ విద్యాసంస్థలను భారత క్రైస్తవులకు అప్పగించాయి. విద్యావిధాన రూపకల్పన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలోకి వచ్చింది.

వీటన్నింటినీ రాజకీయ పరిణామాల నేపథ్యంలో అధ్యయనం చేసినప్పుడే ఆధునిక భారతీయ విద్యావిధాన పరిణామక్రమాన్ని సమగ్రంగా ఆవిష్కరించటం సాధ్యపడుతుంది.

### *1.4.1. బ్రిటీషు కాలంలో విద్యావ్యవస్థ:*

బ్రిటీషుకాలంలో విద్యారంగంలో చోటుచేసుకున్న సంక్షోభాలన్నింటి వెనుక రాజకీయ భూమిక ఉంది. భారతదేశంలో పాలనకు మద్దతుగా వారు చేపట్టిన చర్యలన్నీ గొప్పవిగాను, వైఫల్యాలు మాత్రం వారి నియంత్రణ పరిధిలో లేని అంశాలుగాను చూపారు. మరోవైపు ఇంగ్లాండ్‌లోను జపాన్, టోక్యోవంటి స్వతంత్ర దేశాలలోను, ఫిలిప్పీన్స్‌వంటి పరాధీన దేశాలలోను జరిగిన అభివృద్ధితో పోల్చి భారతదేశంలో విద్యాభివృద్ధి విషయంలో బ్రిటీషు విద్యాప్రణాళికలు విఫలం చెందిన వైనాన్ని భారతీయులు ఎత్తిచూపారు.

ఏదేమైనప్పటికీ భారతదేశంలో నూతన విద్యావిధానం జాతీయ సమస్యలను సాధించే విషయంలో పూర్తిగా విఫలమైందన్నభావన చోటుచేసుకున్నది. చేపట్టిన కొన్ని చర్యలుకూడా రాజకీయ బానిసత్వం, ఆర్థిక దోపిడీలను కప్పిపుచ్చేందుకు చేపట్టినవేతప్ప మరింకేంకావు అని దేశీయ విద్యావేత్తలు భావించారు.

**జాతీయ విద్యావిధాన రూపకల్పనలో వైఫల్యం:**

భారతదేశానికి ఒక జాతీయ విద్యావిధాన రూపకల్పన చేయకపోవటం బ్రిటీషు పాలనలో విద్యాపరంగా జరిగిన పెద్ద తప్పిదంగా భావిస్తారు. అయితే భారతీయులు విద్యావంతులయ్యేందుకు బ్రిటీషువారు పరోక్ష చర్యలద్వారా కొంతమేరకు దోహదపడ్డారు. 1944లో యుద్ధానంతర విద్యాభివృద్ధి ప్రణాళికను రూపొందించారు. అయితే ఈ చర్య భారతీయులను తృప్తిపరచలేదు.

విద్యావిషయికంగా మొదటిసారిగా కర్జన్ 1904లో చర్యలు చేపట్టినప్పటినుంచి 1937లో భారతీయులు విద్యపై పూర్తి ఆధిపత్యాన్ని పొందేంతవరకు విద్యావిధానం అనేక వైరుధ్యాలతోనే సాగింది. చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం అధికారులు బ్రిటీషు విద్యావిధానానికి పూర్తిగా మద్దతు తెల్పగా, జాతీయ వాదులుమాత్రం బ్రిటీషుపాలన భారతదేశాన్ని సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా దెబ్బతీసిందని భావించారు. ఒక జాతీయ విద్యావిధానాన్ని రూపొందించే విషయంలో బ్రిటీషువారి వైఫల్యానికి కారణాలు అనేకం కనిపిస్తాయి. .

అంతర్జాతీయంగా భారతదేశ స్థానాన్ని గుర్తించలేకపోవటం అందులో ఒకటి. బ్రిటీషువారి వలసవాదతత్త్వం భారతీయ వ్యక్తిత్వాన్ని గుర్తించలేకపోయింది. మిషనరీలు ఈ దేశాన్ని క్రైస్తవవ్యాప్తికి ఒక అనుకూల ప్రదేశంగా భావించారు. కంపెనీ దీన్ని వ్యాపారానికి అనువైన ప్రాంతంగా భావించింది. ముడిసరుకులను అందించేదిగా, వాటితో తయారైన బ్రిటీషు ఉత్పత్తులకు

అనుకూలమైన మార్కెట్‌గా ఈ దేశాన్ని ఉడ్స్ డిస్పాచ్ భావించింది. బ్రిటీష్ పరిపాలనతో ప్రభావితంచేసేందుకు అనువైన ప్రదేశంగా కర్జన్ భావించారు. రెండవ ప్రపంచయుద్ధం పూర్తయ్యేంత వరకూ అధికారిక ప్రణాళికలన్నీ భారతదేశాన్ని ఒక స్వతంత్రమైన, సాంస్కృతిక ప్రాధాన్యంగల దేశంగా గుర్తించేందుకు నిరాకరించాయి.

ప్రాచ్య పాశ్చాత్య సంస్కృతులమధ్య ఒక సమ్మేళనాన్ని సాధించేందుకు ప్రయత్నించక పోవటం రెండవవైఫల్యం. ఈ విషయంలో బ్రిటీషు విద్యాపరిపాలనావిభాగం కూడా సఫలంకాలేదు. మిషనరీలు కూడా ఇందుకు ప్రయత్నించలేదు. వారు మతాంతరీకరణకు ప్రాధాన్యతనివ్వటం, క్రైస్తవం, పాశ్చాత్య సంస్కృతులు రెండూ విడదీయరానివనే భావన, ప్రాచీన భారతీయ సంస్కృతీ సంప్రదాయాల ప్రాధాన్యతను గుర్తించలేకపోవటం కారణంగా మిషనరీలు పైవిషయంలో స్తబ్దంగా ఉన్నాయని భావించాలి. ఇంకా భారతీయులకు యూరోపియన్ క్లబ్‌లలో ప్రవేశాన్ని నిరాకరించి రెండు సంస్కృతుల ఐక్యతకు వీలుకాని వాతావరణాన్ని సృష్టించారు. ఇలాంటి చర్యల కారణంగా ఏర్పడిన జాతివైరుధ్యాలు రాజకీయ వైషమ్యాలుగా మారి భారతీయులు అనేకులు పాశ్చాత్య సంస్కృతిపట్ల వైముఖ్యాన్ని ప్రదర్శించే పరిస్థితికి కారణమైనాయి. ఫలితంగా ఒక సమగ్రమైన, ప్రణాళికాబద్ధమైన ప్రాచ్య పాశ్చాత్య సమ్మేళనంకోసం కృషి చేసే వీలులేకపోయింది.

బ్రిటీష్‌వారి విద్యాయంత్రాంగం వైఫల్యానికి మరోకారణం లక్ష్యాలలో సమగ్రత లోపించటం. 1813 చార్టర్ చట్టం ప్రాచ్య భాషా సాహిత్యాల పునరుద్ధరణ, అభివృద్ధిగురించి చర్చించింది. 1854 డిస్పాచ్ యూరప్ విజ్ఞానశాస్త్రాలు, సాహిత్యాలు, తత్త్వశాస్త్రాది అంశాల అభివృద్ధికి బాటలువేసింది. 1822 కమిషన్ ఈ అంశాలు అసలు చర్చించలేదు. కర్జన్ భారతీయ మేధావుల అనువంశిక లోపాలను సరిదిద్దే చర్యలగురించి పేర్కొన్నాడు. 1913 ప్రకటన వ్యక్తిత్వ రూపకల్పన విద్యావిధాన ప్రధానలక్ష్యంగా ప్రకటించింది. మొదటినుంచీ భారతీయులను ప్రభుత్వశాఖల్లో ఉద్యోగులుగా తీసుకోవటమే పరమలక్ష్యంగా శిక్షణసాగేది. ఐతే ఈ ప్రాధాన్యతలు కాలాన్నిబట్టి మారుతుండేవి. స్వయంపాలనకై భారతీయులకు శిక్షణనిచ్చే అంశంకూడా తరచూ చర్చకువచ్చేది. మెకాలే, మెట్‌కాఫ్‌లు ఈ విధమైన చర్చను ముందుకుతెచ్చినవారిలో ప్రముఖులు. భారతీయులు ముందుకు తెస్తున్న 'స్వరాజ్' భావనను వీలైనంతవరకూ తెరమీదకు రాకుండా చూసేందుకు అనేకమంది అధికారులు ప్రయత్నించారు. ఐతే అనేకమంది అధికారులు, కమిటీలు, కమిషన్లు, రిపోర్టులు అనేక సమస్యలను చర్చించినా ఒక సంపూర్ణ జీవనవిధానానికి అనుగుణమైన సమగ్ర విద్యావిధానాన్ని గురించిన చర్చ లోపించటం గమనార్హం. స్వాతంత్ర్యానంతరం 'భారత విశ్వవిద్యాలయాల చట్టం 1949' ద్వారానే ఈ దిశగా ప్రయత్నం జరిగిందని భావించాలి.

సరైన పద్ధతులు చేపట్టకపోవటం బ్రిటీష్ విద్యావిధానంలోని ఒక లోపమైతే, చేపట్టిన పద్ధతులు సరైనవి కాకపోవటం మరోలోపం. 1900వరకు ఉనికిలో ఉన్న స్వదేశీ విద్యావిధానాన్ని పూర్తిగా నిర్లక్ష్యంచేయటం, పాశ్చాత్యపద్ధతులపై ఎక్కువగా ఆధారపడటం, ఇంగ్లాండులో అనుసరించిన అన్నిరకాల ప్రణాళికలను యధాతథంగా భారతదేశంలో ప్రవేశపెట్టే ప్రయత్నం చేయటం ప్రధానమైన లోపాలు.

ఇంగ్లాండ్ అభివృద్ధిచెందిన పారిశ్రామికదేశం. భారతదేశం గ్రామీణ, వ్యవసాయాధారిత పేదదేశం. ఈ రెండింటిమధ్యగల సామాజిక, ఆర్థిక వైరుధ్యాలు ఇంగ్లాండ్‌ను ఇండియాకు సరైన నమూనాగా నిలపలేవు. అయితే బ్రిటీషు పరిపాలకులు మాత్రం ఇంగ్లాండ్‌ను ఇండియాకు నమూనాగా

చూపేందుకు ప్రయత్నించారు. ఈ కారణంగా భారత సాంప్రదాయిక వ్యవస్థ, భారతదేశంతోపాటు సమాన సామాజిక, ఆర్థిక నిర్మాణం కలిగిన ఇతర అభివృద్ధిచెందిన దేశాల నమూనాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. భారతీయ విద్యావ్యవస్థ బ్రిటీష్ విద్యావ్యవస్థతో ముడివేయబడి ఉండటం మన విద్యావ్యవస్థకు తీవ్రమైన హానిచేసింది.

ఆంగ్లాన్ని బోధనా మాధ్యమంగా అంతటా ఉపయోగించటం, మాధ్యమిక, కళాశాల స్థాయిలో ఇంగ్లీష్ బోధనపై అమిత శ్రద్ధ కనబర్చటం, ఇంగ్లీషు జాతీయభాషగా రూపొందుతుందన్న భావనతో జాతీయ భాషలను మొత్తంగా నిర్లక్ష్యంచేయటం చరిత్రలోజరిగిన మరికొన్ని తప్పిదాలుగా భావించవచ్చు. ఈ విషయంలో Rawlinson అభిప్రాయం గుర్తుచేసుకోవాల్సి ఉంటుంది. "The failure of the British Rule in India, is so far as it was a failure, was due to a sheer want of imagination" (H.G.Rawlinson: 241)

దేశ సామాజిక, రాజకీయ, ఆర్థిక అభివృద్ధితో సమాంతరంగానే విద్యాభివృద్ధి సాధ్యపడుతుంది. బ్రిటీష్ పాలనలోని కొన్ని అంశాలు ఇందుకు ప్రోద్బలకంగాలేవు. మతం విషయంలో తటస్థధోరణి సామాజిక సంస్కరణలతోపాటు అన్ని సామాజికాంశాలను విస్మరించేందుకు దారితీసింది. ఫలితంగా అస్పృశ్యత, బాల్య వివాహాలు ప్రభుత్వ సహాయంతోగాని, చట్టంద్వారాగాని నిరోధించేందుకు వీలులేకుండాపోయింది. ఈ విషయంలో కొన్ని భారత స్వతంత్ర రాజ్యాలు బ్రిటీష్ ఇండియాకంటే మెరుగైన చర్యలు చేపట్టాయి. అయితే సామాజికాంశాల్లో అధికారులు జోక్యం చేసుకోకపోవటం వెనుక సాంప్రదాయ వర్గాలను బలపరిచే ధోరణి కనిపిస్తుంది. ఈ ధోరణి విద్యాభివృద్ధిని కృంగదీస్తుంది.

అదేవిధంగా భారతదేశ రాజకీయ పరాధీనతకూడా విద్యాభివృద్ధికి ఆటంకంగా మారింది. జాతీయ సౌభ్రాతృత్వ భావన కల్పించేముందుగా వివిధ మత, కుల, వర్గ సమూహాలను పాఠశాల విద్యలో ఒకచోట చేర్చేట్టుగా జాతీయ విద్యావిధానంలో చర్యలు చేపట్టాలి. అయితే అటువంటి భావన పెంపొందటం రాజకీయంగా బ్రిటీష్‌వారికి ప్రయోజనకరంకాదు. అందువల్ల మతవర్గ సహజీవనంకోసం ఎటువంటి ప్రయత్నం చేయలేదు. ఇంకా విభజించి పాలించటమనే సిద్ధాంతాన్ని కూడా అనుసరించారు. హిందూ, ముస్లిం వర్గాల విద్యావిధానాలు ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా వేరువేరుగా పెంపొందేందుకు వీలుగా ప్రణాళికలుకూడా సిద్ధంచేశారు.

మరో అంశం బ్రిటీషువారి ఆర్థిక విధానాల వైఫల్యం కారణంగా దేశంలో పేదరికం విపరీతంగా పెరిగింది. అటువంటి ఆర్థిక పరిస్థితుల్లో విద్యాభివృద్ధి సాధ్యంకాదు. మరో రకంగా చెప్పాలంటే బ్రిటీషు పాలన భారతీయ జీవితంలో సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాలను పూర్తిగా విస్మరించింది. జాతీయ విద్యావిధానం భారతప్రజల రాజకీయ, సామాజిక, ఆర్థిక పునరేకీకరణకు దారితీస్తుంది కాబట్టి బ్రిటీష్‌పాలకులు జాతీయ విద్యావిధానాన్ని రూపొందించే ప్రయత్నం చేయలేదు.

బ్రిటీష్ విద్యావిధాన వైఫల్యానికి మరో ప్రధానకారణం భారతదేశంలో ఒక జాతీయ విద్యావిధానాన్ని రూపొందించేందుకు సమర్థులైన వ్యక్తులను ఎంపికచేయకపోవటం. బ్రిటీష్ ఇండియా పాలనావ్యవస్థలో విద్య ఏనాడూ ప్రాధాన్యతకలిగిన అంశంగా గుర్తింపుపొందలేదు. మాయో భావనలో అనుభవజ్ఞులైన అధికారులు తమ శక్తియుక్తులను ఆర్థికపరమైన, న్యాయపరమైన అంశాలపై వెచ్చించిన అనంతరం సూర్యాస్తమయంలో విద్యాప్రణాళికలు రూపొందించేవారు. ప్రజాభిప్రాయం, ఆర్థిక వనరుల పరిధికి లోబడి శీలనిర్మాణం, ఉత్తమ పౌరుల రూపకల్పన వంటి అంశాలుండేవి.

(A.Mayhew.----:9)

ముందుగా రూపొందించుకున్న లక్ష్యం, దాని సాధనకు అనుగుణమైన నిర్దిష్ట ప్రణాళిక లేకపోవటం బ్రిటీష్ విద్యావ్యవస్థ వైఫల్యానికి ప్రధానకారణం. పరిపాలనకు సంబంధించి ప్రణాళికల రూపకల్పన ప్రధానంగా ఇరవయ్యవ శతాబ్దపు భావన. 19వశతాబ్దంలో భారతీయ విద్యావేత్తలకు ఈ విధమైన ఆలోచన లేకపోవటం ఆశ్చర్యకరమైన విషయం కాదు. అయితే 1944 వరకు మన విద్యావేత్తలు ఎటువంటి ప్రణాళికలు రూపొందించలేదు. బ్రిటీషు అధికారుల్లో అనేకులు స్వల్పమైన తాత్కాలిక ప్రయోజనాలను ఆశించి పనిచేయటమే ఇందుకు ప్రధానకారణం. జాతీయ విద్యావిధాన రూపకల్పనకు సుదీర్ఘ ప్రణాళిక తప్పనిసరి. అయితే భారతదేశంలో సుదీర్ఘ ప్రణాళికలు లేనికారణంగా భారత విద్యావ్యవస్థలో అభివృద్ధి మందగించింది.

బ్రిటీష్ పాలనలో జాతీయ విద్యావిధానం రూపొందకపోయినప్పటికీ భారతీయ విద్యావికాసం కోసం బ్రిటీష్‌వారు చేపట్టిన చర్యలు కొన్ని ఉన్నాయి. వానిలో ప్రముఖమైనది ఆంగ్ల భాషా సాహిత్యాలను, వాటిద్వారా పాశ్చాత్య శాస్త్ర సాంకేతిక, వైజ్ఞానిక, పారిశ్రామిక అభివృద్ధిని, పాశ్చాత్య సామాజిక, రాజకీయ తాత్త్వికతను భారతీయులకు అందించటం. భారత సామాజిక సాంస్కృతిక వ్యవస్థల్లో తిరోగమన భావాలు ప్రవేశించిన సమయంలో ఇది జరగటం గమనార్హం. ప్రాచీన సాంప్రదాయిక ఆలోచనల స్థానంలో ఆధునికతకు, పునర్వికాసానికి పాశ్చాత్య ఆలోచనావిధానం పునాది వేసింది. భారత సాంస్కృతిక వ్యవస్థలో ఒక గొప్పమార్పుకు ఇది కారణమైంది.

భారతీయ సంస్కృతులను, భాషా సంప్రదాయాలను పాశ్చాత్య ఆధునిక విధానంలో అధ్యయనం చేయటం మరో అంశం. శాస్త్రీయత, విమర్శనాత్మకత, సూక్ష్మీకరణ, ఆధునికీకరణ ఆధునిక అధ్యయనంలో ప్రధానాంశాలు. ఈ ఆధునికపద్ధతి ప్రాచ్యభాషల్లో పాశ్చాత్య పండితులనుంచి మొదలైంది. స్వదేశీ ప్రణాళికల తయారీకి ఇది ఉపకరించింది.

ఆధునిక భారతీయ భాషలను బ్రిటీష్ ప్రభుత్వం నిర్లక్ష్యంచేసిందన్నది నిజమే అయినా మరోవైపు వాటి అభివృద్ధికి కూడ బ్రిటీష్ ప్రభుత్వం కారణమైంది. అధికారులు, మిషనరీలు ఆధునిక భారతీయ భాషలను అధ్యయనం చేశారు. వాటికి వ్యాకరణాలు, నిఘంటువులు రూపొందించారు. ఆయా భాషలపైన మొదటిసారిగా పుస్తకాలు వెలువరించారు. ఆదిమజాతుల భాషలపైకూడా యూరోపియన్లు అధ్యయనం సాగించారు. "లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా" వెలువరించిన సర్ జార్జ్ గ్రియర్‌సన్ కృషి ఇందులో ప్రముఖమైనది. మొత్తంమీద యూరోపియన్ మేధావుల కృషి కారణంగానే భారతీయ భాషల అభివృద్ధి మొదలైందనటం అవాస్తవంకాదు.

ఆధునిక భారతీయ జీవితంలో అనేక ఆధునిక భావాలవ్యాప్తికి పాశ్చాత్యప్రభావం దోహదపడింది. అస్పృశ్యతకు వ్యతిరేకంగా పోరాటం, మహిళలు జాగృతం కావటం, సామాజిక సేవాభావన, విద్యారంగంలో ఆధునికభావాలు వంటి అంశాల్లో పాశ్చాత్య భావనల ప్రభావం కనిపిస్తుంది. అయితే ఈ ధోరణులు కేవలం పాశ్చాత్య ప్రభావం వల్లనే వచ్చాయని చెప్పలేం. అయితే ప్రాచీన సంస్కృతీ, సంప్రదాయాలను పునఃపరిశీలన చేయటంద్వారా ఈ భావనలు మరింత బలపడేందుకు వీలుపడింది.

చివరగా ఆధునిక ప్రజాస్వామ్య సంస్థలు, పాశ్చాత్య న్యాయ, వైద్య విజ్ఞానాలు, ప్రెస్, సినిమా, రేడియో, లైబ్రరీ, మ్యూజియం వంటి విద్యావ్యాప్తి కారకాల విషయంలో పాశ్చాత్య చర్యలు దోహదపడ్డాయి. భారత విద్యారంగంలో బ్రిటీష్‌వారి కృషికి పైన పేర్కొన్న అంశాలు నిదర్శనాలుగా

నిలుస్తాయి.

*1.4.2. స్వాతంత్ర్యానంతరకాలంలో విద్యావ్యవస్థ:*

స్వాతంత్ర్యానంతరం భారత విద్యారంగంలో ఒక నూతనశకం ప్రారంభమైందని భావించాలి. విద్యావ్యవస్థలో రావాల్సిన విప్లవాత్మకమైన మార్పులు స్వాతంత్ర్యానంతరం చోటుచేసుకుంటాయని మేధావులు ఆశించారు. నాయకులుకూడా ఇదే భావనను వ్యక్తంచేశారు.

1948 జనవరిలో కేంద్ర విద్యామంత్రి మౌలానా అజాద్ నేతృత్వంలో జరిగిన భారత విద్యాసదస్సు ప్రారంభోపన్యాసంలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ "విద్యాసదస్సులలో ప్రతిసారి విద్యావిధానాన్ని స్వల్ప మార్పులతో కొనసాగిస్తున్నారు. ఇది సరైనచర్య కాదు. ఈనాడు దేశంలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. విద్యారంగంకూడా ఆ మార్పులకు అనుగుణంగా రూపొందాలి. విద్యావిధానం సంపూర్ణంగా విప్లవీకరించబడాలి" అని పేర్కొన్నారు. అయితే అనేక కారణాలవల్ల భారతదేశంలో విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకోలేదు. అనేక నూతన అంశాలు రూపొందుతున్నా, చివరకు అవన్నీ ప్రాచీన సాంప్రదాయిక విద్యావిధానాన్ని కొన్ని స్వల్పమార్పులతో విస్తృతపరచాయేతప్ప విద్యను విప్లవీకరించలేకపోయాయి.

స్వాతంత్ర్యానంతర విద్యాభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు 1944 యుద్ధానంతర విద్యాభివృద్ధి ప్రణాళికను భూమికగా మేధావులు అంగీకరించలేదు. అందువల్ల విద్యాప్రణాళికల రూపకల్పనకు ప్రజల అవసరాలకు అనుగుణమైన అనేక నూతన ఆలోచనలు, విధానాలు అమలుకు నోచుకున్నాయి.

**స్వాతంత్ర్యానంతరకాలంలో విద్యాభివృద్ధి:**

స్వాతంత్ర్యానంతరం మొదటి నాలుగుసంవత్సరాలు అనేక ఒడిదుడుకులతో నడిచాయి. వీటిలో ప్రధానసమస్య పాకిస్థాన్‌నుంచి వచ్చిన వలసలకు పునరావాసం ఏర్పాటు. ప్రధానసమస్యల్లో మరికొన్ని 1935 భారతచట్టం స్థానంలో రాజ్యాంగరచన చేయాల్సిరావటం, బ్రిటీష్ అధికారులు వెంటనే వైదొలగిన కారణంగా పరిపాలనను పునరుద్ధరించే నిమిత్తం పాలనాశాఖలను పునర్నిర్మించాల్సి రావటం. స్వతంత్ర రాజ్యాల స్థానంలో పరిపాలనా సౌలభ్యంకోసం క్రొత్త రాజ్యాల ఏర్పాటు వంటివి. ఈ చర్యల కారణంగా 1947-51 మధ్య విద్యకు సరైన ప్రాధాన్యత ఇవ్వలేక పోయారు. అయితే ఈ కాలంలోకూడా సార్జంట్ ప్రణాళికననుసరించి కొంతమేరకు అభివృద్ధి జరిగింది.

1950లో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి నాంది పలికారు. కేంద్రంలో ప్రణాళికాసంఘాన్ని ఏర్పాటుచేసి విద్యతో సహా అన్ని అంశాల్లో సమగ్ర అభివృద్ధికోసం పంచవర్ష ప్రణాళికల రూపకల్పన బాధ్యతనప్పగించారు. అలా విద్య దేశ సమగ్రాభివృద్ధిలో భాగమైంది. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలోని విద్యాభివృద్ధిని సమగ్రాభివృద్ధిలో భాగంగానే అధ్యయనం చేయాల్సి ఉంటుంది.

**విద్య-- ఉమ్మడిజాబితా:**

విద్య ఉమ్మడిజాబితాలో చేర్చటం విషయమై విద్యాకమిటీలో వాద వివాదాలు చోటుచేసుకున్నాయి. ఉమ్మడిజాబితాలో చేర్చినట్లయితే విద్యపైన చట్టాలుచేసేందుకు కేంద్రానికి వీలుచిక్కుతుంది. పి.యస్.సప్రూ అధ్యక్షతన ఏర్పడిన ఉన్నతవిద్యాకమిటీ సమస్యను మొత్తం పరిశీలించి కనీసం ఉన్నత విద్యనైనా ఉమ్మడిజాబితాలో చేర్చాలని సిఫారసు చేసింది. పి.యస్.కిర్పాల్, వి.యస్.ఝా ల అభిప్రాయం ప్రకారం విద్య మొత్తం ఉమ్మడిజాబితాలో ఉండాలి.

అలా లేనికారణంగానే విద్యారంగంలోని అనేక కమిటీల ప్రయోజనకరమైన సలహాలు కేవలం కాగితాలకే పరిమితమైనాయని, విద్యాశాఖామంత్రుల సదస్సు తీర్మానాలు కాని, కేంద్ర విద్యాసలహాసంఘం సూచనలుకాని అమలుకాలేదని వీరి భావన.

అయితే ఈ భావనలను మిగిలినవారు విభేదించారు. భారతదేశంలాంటి పెద్దదేశంలో విద్య కేంద్రీకృతం కావటం సమంజసం కాదని, ప్రస్తుతం అనుసరిస్తున్న విధానమే సరైనదని వీరిభావన. విద్యను ఉమ్మడిజాబితాలో చేర్చటం వల్ల అవాంఛనీయ కేంద్రీకరణకు దారితీయవచ్చని, ఈ చర్య స్వేచ్ఛకు నష్టం కలిగించవచ్చని వీరు భావించారు. ప్రస్తుత విధానంలోనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విద్యకుసంబంధించిన బాధ్యతల పంపిణీకి చాలినంత అవకాశం ఉందని, దాన్ని సరిగా ఉపయోగించుకోవటం లేదని వీరు భావించారు.

**ఉన్నతవిద్య:**

జాతీయ విద్యా పునర్నిర్మాణంకోసం, దేశ సామాజిక, ఆర్థిక అభివృద్ధికి అవసరమైన శాస్త్ర,సాంకేతిక నైపుణ్యంకోసం, విశ్వవిద్యాలయాల్లో విద్యావిధాన రూపకల్పనకోసం 1948లో విశ్వవిద్యాలయ విద్యాకమిషన్‌ను స్థాపించారు. కమిషన్ అనేక సూచనలు చేసింది. అవి

నాడు ఇంటర్, డిగ్రీ స్థాయిలో మితిమీరిన ప్రత్యేకాంశాల అధ్యయనం సాగేది. దీన్ని సరిదిద్దే ఉద్దేశ్యంతో పాఠశాల, కళాశాల స్థాయిల్లో సాధారణ అధ్యయనాన్ని ప్రవేశపెట్టాలని కమిషన్ నిర్ణయించింది. వ్యక్తిగా, పౌరుడిగా విద్యార్థికిగల ప్రత్యేక నైపుణ్యాలు, వైఖరుల ఆధారంగా సాధారణ, ప్రత్యేకాంశాలను రూపొందించవలసిందిగా కమిషన్ కోరింది. పరిశోధనా సంబంధమైన జ్ఞాన విస్తృతి విషయంలో విశ్వవిద్యాలయాల పాత్రను గురించి కమిషన్ నొక్కి చెప్పింది. అనువర్తిత పరిశోధనలను ప్రైవేటుసంస్థలు, పరిశ్రమలకు వదలివేసి మౌలిక పరిశోధనలను విశ్వవిద్యాలయాలు చేపట్టాలని కమిషన్ నిర్దేశించింది. పరిశోధన విశ్వవిద్యాలయాలు చేపట్టే ఒక సామాజిక చర్యమాత్రమే కాదని, ఉన్నతమైన బోధనకు పరిశోధన ఒక ముందస్తు అవసరంగా భావించాలని కమిషన్ పేర్కొంది. స్నాతకోత్తరస్థాయిలో విద్య-పరిశోధనా సంస్థ గుణాత్మక, గణాత్మకాభివృద్ధికోసం పనిచేయాల్సి ఉందని కమిషన్ భావించింది.

వ్యవసాయం, వాణిజ్యం, విద్య, శాస్త్ర సాంకేతిక జ్ఞానం, న్యాయం, వైద్యం, ప్రజాపాలన, వ్యాపార పాలన, పారిశ్రామిక సంబంధాలు వంటి వివిధ వృత్తివిద్యా నైపుణ్యాల పెంపులో విశ్వవిద్యాలయాల బాధ్యతను కమిషన్ గుర్తుచేసింది. ఇటువంటి అన్నిరంగాల్లో ఇతరదేశాల్లో జరుగుతున్న అభివృద్ధి, దేశ అభివృద్ధి అవసరాలు దృష్టిలో ఉంచుకొని మౌలిక శాస్త్రవిజ్ఞానాల్లో, మానవీయ శాస్త్రాల్లో సరైన ప్రణాళికను రూపొందించటంతోపాటుగా నూతన శాఖలను ప్రారంభించాలి. ఈ నూతన ప్రక్రియను చేపట్టేందుకు వీలుగా విశ్వవిద్యాలయాలన్నింటికి స్వయం ప్రతిపత్తి కల్పించాలని కమిషన్ పేర్కొంది.

ఇంకా విశ్వవిద్యాలయ స్థాయి విద్యను ఉమ్మడిజాబితాలో చేర్చటం, ఆర్థికవిషయాల్లో, ప్రత్యేక అధ్యయనాంశాల్లో సమన్వయం, విశ్వవిద్యాలయాలు, జాతీయ పరిశోధనా సంస్థలమధ్య సమన్వయం, ప్రభుత్వ కళాశాలలకు క్రమంగా విశ్వవిద్యాలయ హోదా కల్పన, కేంద్ర సర్వీసుల వేతనాలకు తగ్గకుండా ఉపాధ్యాయుల వేతనాలు ఏర్పరచి, సమర్థులైన వ్యక్తులు ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకునేందుకు వీలుకల్పించటం, సంవత్సరపర్యంతం చేసే కృషికి విలువకల్పించే ఉద్దేశ్యంతో పరీక్షా విధానంలో మార్పులుచేసి లక్ష్యాత్మక పరీక్షల నిర్వహణ చేపట్టటం, పారిశ్రామిక, వ్యవసాయిక

రంగాల్లో, వివిధ సామాజిక రంగాల్లో పెరుగుతున్న అవసరాలు తీర్చేందుకు గ్రామీణ కళాశాలలు, విశ్వవిద్యాలయాల స్థాపన వంటి అనేక అంశాలను కమిషన్ ప్రతిపాదించింది.

**ఉన్నతవిద్య-- భారీపెరుగుదల:**

స్వాతంత్ర్యానంతరకాలంలో ఉన్నతవిద్యలో విపరీతమైన పెరుగుదల చోటుచేసుకున్నది. ఈ పెరుగుదల విద్యారంగంలో ప్రధాన సమస్యగా రూపొందింది. ఇందుకు విభిన్నకారణాలు కనిపిస్తాయి.

1. ఎంపికచేసిన కొందరికిమాత్రమే ఉన్నతవిద్యలో ప్రవేశాలు కల్పించటం లేదా ప్రవేశాలను క్రమబద్ధీకరించటంలో ప్రభుత్వ ఉదాసీనత ఉన్నతవిద్యలో విపరీతమైన రద్దీకి ప్రధానకారణంగా భావించాలి. 1944 విద్యాకమిటీ ఉన్నతవిద్య పొందినవారికి, విద్యావకాశాలకూ మధ్య అనులోమ సంబంధముండేట్లుగా చూడాలని సిఫార్సుచేసింది. అయితే ఈ సూచన అటు కేంద్ర ప్రభుత్వానికిగాని, ఇటు రాష్ట్రప్రభుత్వాలకుగాని అంగీకారయోగ్యం కాలేదు. ఈ విధమైన పరిమితి విధించటం సామాజికంగా వెనుకబడిన వర్గాల ప్రయోజనాలను దెబ్బతీస్తుందని వీరిభావన. ఫలితంగా మితిమీరిన ప్రవేశాలకు వీలుకలిగింది. మాధ్యమికవిద్య పూర్తిచేసిన ఎవరికైనా ఏదోఒక కళాశాలలో, ఏదోఒక కోర్సులో ప్రవేశానికి అవకాశం దొరికేది.

2. రాజకీయ, సాంఘిక కారణాలవల్ల కళాశాలల గుర్తింపు నిబంధనలు సరళం కావటంతో చాలినన్ని వసతులు, సమర్థులైన అధ్యాపకులు లేకుండానే అనేక కొత్త కళాశాలలు ఏర్పడ్డాయి. దీంతో నాణ్యత లోపించటంతోపాటుగా, ఉన్నత విద్యలో విద్యార్థుల నమోదు విచక్షణారహితంగా పెరిగిపోయింది.

3. మాధ్యమిక విద్యావిధానంలోని ప్రధానలోపంకూడా ఉన్నతవిద్యలో రద్దీకి దోహదపడింది. విద్యార్థులను కళాశాలకు అర్హులుగా తయారుచేస్తూనే మరేఇతరవిధంగా పనికిరానివ్యక్తులుగా రూపొందించటమే ఈ లోపం. ఉన్నత విద్యలో మితిమీరిన ప్రవేశాలకు విద్యావ్యవస్థలోనే ఈవిధమైన వెసులుబాటు చోటుచేసుకుంది.

4. ఉన్నతవిద్యకు సామాజికంగా చెప్పుకోదగినస్థాయిలో గిరాకీ ఏర్పడింది. ప్రభుత్వశాఖల్లో ఎటువంటి ఉద్యోగాలకైనా ఇదొక్కటే మార్గంకావటం, మాధ్యమిక స్థాయి ఉద్యోగాలకూడా ఉన్నతవిద్యే కనీసార్హత కావటం ఇందుకు ప్రధానకారణంగా చెప్పుకోవాలి.

5. ముఖ్యంగా పట్టణ మధ్యతరగతి వర్గాలకు ఉన్నతవిద్య ఉద్యోగంకోసం ఉద్దేశించిందిగా కాక ఉద్యోగానికి ప్రత్యామ్నాయంగా మారింది. 16-17సంవత్సరాల వయసులో మాధ్యమికవిద్య పూర్తిచేయగానే అబ్బాయికి ఉద్యోగం దొరకకపోవటం, అమ్మాయికి వివాహవయస్సు రాకపోవటంతో మరో ఆలోచనకు తావులేకుండా తల్లిదండ్రులు పిల్లల చదువు కొనసాగిస్తారు. ఉన్నతవిద్యకు ప్రభుత్వం భరించే సబ్సిడీ, అనేక విద్యాసంస్థల్లో నామమాత్రపు ఫీజుల వసూలు ఇందుకు కొంతమేర దోహదపడతాయి.

**ఉన్నతవిద్యలో పెరుగుదల : పరిణామాలు**

అయితే మాధ్యమిక, ఉన్నత విద్యారంగాల్లోని ఈ పెరుగుదల కొన్ని మంచి ఫలితాలను అందించింది. ఇంతకుముందు అవకాశంలభించని అనేక సామాజికవర్గాలకు మాధ్యమిక, ఉన్నత విద్యకు అవకాశం దొరికింది. సమానవిద్యావకాశాలు, కొంతమేర సమాన ఆర్థికావకాశాలు లభించే వీలుకలిగింది. సమాజంలోని బలహీనవర్గాలు సామాజికంగా విస్తరించేందుకు అవకాశం ఏర్పడి, వారి చైతన్యానికి దోహదపడింది. వీలైనంతమేర సామాజికాభివృద్ధికి కారణమైంది.

మరోవైపు ఇది కొన్ని ప్రమాదకర పరిణామాలకు కారణమైంది. ప్రమాణాలను దెబ్బతీసింది. విద్యావంతులైన నిరుద్యోగులను పెంచి విద్యావ్యవస్థలో తీవ్రమైన వత్తిడికి కారణమైంది. ఇది ఉన్నత విద్యారంగాన్ని అదుపుచేయలేనంత భారీగా రూపొందించి, మరింత ప్రధానమైన సార్వత్రిక ప్రాథమికవిద్య, వయోజన అక్షరాస్యత వంటి రంగాలకు నిధులకేటాయింపుకు అడ్డుగా నిలిచింది.

ఇక్కడ మరో అంశం గుర్తించాలి. ఈ విధమైన విస్తరణలోకూడా భారతదేశం విద్యావంతమైన దేశంగా రూపొందలేదు. అభివృద్ధిచెందిన, పెరుగుతున్న దేశాలతో పోల్చితే ఉన్నతవిద్యలో ప్రవేశాల శాతం ఇంకా తక్కువగానే ఉందని చెప్పాలి. అయితే మొత్తం జనాభాలో ఉన్నతవిద్య అభ్యసించేవారి శాతంకానీ, అసలు ఉన్నతవిద్య పొందేవారి మొత్తం సంఖ్యలుకానీ ప్రధాన సమస్యకాదు. వ్యవస్థలోని మానవవనరుల ఉత్పత్తికి, ఆ వనరుల వినియోగం విషయంలో దేశ ఆర్థికవ్యవస్థకుగల సామర్థ్యానికి మధ్య పెరుగుతున్న అగాధం ప్రధాన సమస్య.

**పరిశోధన:**

దేశ సామాజికాభివృద్ధికి మూలమైన శాస్త్ర సాంకేతిక పరిశోధనల్లో ప్రగతిసాధించటం స్వాతంత్ర్యానంతర సంఘటనల్లో ప్రముఖమైనది. భారతదేశం తరతరాలుగా తనలో జీర్ణించుకున్న సహనం, సౌభ్రాతృత్వం, జ్ఞానం వంటి మానవతా విలువలతో శాస్త్ర, సాంకేతికాభివృద్ధిని జతపరచగల సామర్థ్యంపైనే దేశాభివృద్ధి ఆధారపడిఉందన్నభావనతో పండిట్ జవహర్‌లాల్ పరిశోధనారంగానికి స్ఫూర్తినిచ్చారు. 1958లో భారతప్రభుత్వ శాస్త్రవిజ్ఞాన ప్రణాళికా రూపకల్పన జరిగింది. జాతీయ శాస్త్ర విధానం లక్ష్యాలివి

శాస్త్ర విజ్ఞానాన్ని, పరిశోధనను అన్నిరకాలుగా వృద్ధిపరచటం, దేశంలోనే ఉన్నతమైన నైపుణ్యంగల పరిశోధకులను రూపొందించి, వారి పరిశోధనలు దేశప్రగతికి దోహదకారులని గుర్తించటం, శాస్త్ర, విద్య, వ్యవసాయ, పారిశ్రామిక, రక్షణ రంగాల్లో దేశ అవసరాలకు అనుగుణంగా శాస్త్ర సాంకేతిక నిపుణులను అందించటం, సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీసి శాస్త్ర పరిశోధనలో ఉపయోగించుకొనటం.

మొత్తంమీద ఉన్నతవిద్యకు సంబంధించినంతవరకు కొన్ని సరైన మార్పులు చోటుచేసుకున్నాయని భావించాలి. విశ్వవిద్యాలయాల్లో, కళాశాలల్లో బోధనకు, అధ్యయనానికి అనువైన వాతావరణాన్ని ఏర్పరుస్తూ భౌతిక వనరుల కల్పనకోసం చర్యలు చేపట్టినా విద్యార్థుల సంఖ్యలో భారీ పెరుగుదల కారణంగా ఇవి లెక్కలోకి రాకుండాపోయాయి. భారతీయ భాషలను బోధనామాధ్యమంగా వాడేందుకు కొన్ని ప్రయత్నాలు జరిగాయి. శాస్త్రీయ పదజాలాన్ని రూపొందించి భారతీయ భాషల్లో పుస్తకప్రచురణ విస్తృతంగా చేపట్టారు. స్నాతకోత్తర స్థాయిలో ప్రమాణాలు బాగా పెరిగాయి. పరిశోధక విద్యార్థుల సంఖ్య బాగా పెరిగింది. రివ్యూకమిటీల సూచనల ఆధారంగా విశ్వవిద్యాలయాలు తమ బోధనాంశాల పునర్నిర్మాణ కార్యక్రమాలు చేపట్టాయి.

ఉన్నతవిద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తే ఇంకా చేపట్టాల్సిన చర్యల గూర్చిన అవగాహన ఏర్పడుతుంది. విద్యార్థుల పెరుగుదలకు తగినస్థాయిలో ఉపాధ్యాయుల, వనరుల పెరుగుదల లేకపోవటంతో ప్రమాణాలస్థాయిలో తగ్గుదల కనిపిస్తున్నది. సరైన సామర్థ్యం లేని అధ్యాపకుల నియామకం, సరైన వనరుల లోపం కారణంగా బోధనలో నాణ్యతలోపిస్తున్నది.

ఉన్నతవిద్యలో విప్లవాత్మకమైన మార్పులకు కొన్ని చర్యలు చేపట్టాల్సి ఉంది. విశ్వవిద్యాలయాల ప్రవేశాలను పరిమితం చేయటం. పాఠ్యబోధనా పద్ధతుల్లో, పరీక్షా విధానాల్లో

విశ్లేషణాత్మక సంస్కరణలు చేపట్టటం బోధనకు, పరిశోధనకుమధ్య ఒక సమన్వయం సాధించటం భారతీయ భాషలను బోధనా మాధ్యమంగా స్వీకరించటం ఆర్థికంగాపరిపుష్టిగా ఉంటూ, సమర్థవంతంగా పనిచేసే పటిష్టమైన సంస్థల స్థాపన వంటివి గుణాత్మకమార్పుకు దోహదకారులవుతాయి. కఠిన నిర్ణయాల అమలు విషయంలో రాజకీయ చిత్తశుద్ధి లేకపోవటంతో ఈ మార్పులకు వీలు కలగటంలేదు. ఫలితంగా అదే పాత విద్యాప్రణాళికలనే కొద్దిపాటి మార్పులతో విస్తృతపర్చటంతో ప్రణాళికా రహితమైన విస్తృతివల్ల జనించే వత్తిడి యధావిధిగా చోటుచేసుకుంటున్నది. ఈ అర్థంకిని అధిగమించగలిగినప్పుడే భారతదేశంలో ఉన్నతవిద్య ఉత్తమమైనదిగా రూపొందుతుంది..

**మాధ్యమిక విద్య:**

సెకండరీ విద్యాకమిటీ డా. ఏ.యల్.మొదలియార్ అధ్యక్షతన 1952లో ఏర్పాటై 1953లో రిపోర్టు సమర్పించింది. మాధ్యమిక విద్యా పునర్నిర్మాణంలో స్వాతంత్ర్యానంతరం వచ్చిన కమిటీల్లో ప్రధానమైనది. కమిటీ చేసిన సూచనల్లో ప్రధానమైనవి

ఇందులో త్రిభాషాసూత్రాన్ని అమలుచేయాలి. అవి మాతృభాష, జాతీయభాష, ఇంగ్లీషు. ఇంకా పాఠ్యాంశాలుగా సోషల్, సైన్స్, గణితం మరియు క్రాఫ్ట్ అధ్యయనాంశాలు. మానవీయశాస్త్రాలు, సాస్త్ర, సాంకేతికవిద్య, వ్యాపారవిద్య, వ్యవసాయ విజ్ఞానం, కళలు, గృహవిజ్ఞానం లనుంచి మూడింటిని ఐచ్ఛికాంశాలుగా స్వీకరించి అధ్యయనం చేయాల్సి ఉంటుంది.

మాధ్యమికవిద్యలో ప్రధానలోపం అది పూర్తిగా అకడమిక్ లక్షణాన్ని కలిగిఉండటం. ఈ కారణంగా మాధ్యమికవిద్య అనంతరం ఉన్నతవిద్యకు మాత్రమే దారితీస్తుంది. ఈ పద్ధతిలో మార్పుకోసం, సుదీర్ఘంగా కొనసాగుతూ వస్తున్న ఈ లోపాన్ని సరిదిద్దేందుకు, విద్యార్థుల అభిరుచులు, అభిప్రాయాలు, సామర్థ్యాలు గుర్తించి వాటికి అనుగుణంగా పాఠ్యాంశాలను రూపొందించేందుకు వీలుగా కమిషన్ బహుళప్రయోజన పాఠశాలల రూపకల్పన చేసింది. ఈ పాఠశాలల్లో సాంకేతికవిజ్ఞానం, వ్యవసాయం, లలితకళలు, గృహవిజ్ఞానం వంటి అంశాలలో తరగతులుంటాయి. మాధ్యమిక విద్య అనంతరం విద్యార్థులను జీవితంలో విభిన్నరంగాలలో ప్రవేశపెట్టటం, తద్వారా విశ్వవిద్యాలయాలపైన వత్తిడి తగ్గించటం ఈ విద్యాసంస్థల ప్రధానలక్ష్యం.

సంకుచితమైన పరిధి, నిర్వహణపద్ధతుల్లో యాంత్రికత తదితర అంశాలతో నిండివున్న సాంప్రదాయిక పరీక్షా విధానాన్ని ఆధునిక మూల్యాంకన పద్ధతులద్వారా మార్పు చేయాలని కమిషన్ పేర్కొన్నది. విద్యార్థి జ్ఞాపకశక్తినిమాత్రమే పరీక్షించేదిగా కాక నూతన విధానం విద్యార్థి సంపూర్ణవికాసాన్ని గణించేదిగా, విద్యార్థి అధ్యయనపర్యంతం ప్రగతిని సమీక్షించేదిగా ఉండాలని పేర్కొన్నారు.

**మాధ్యమిక విద్యాభివృద్ధి:**

స్వాతంత్ర్యానికి పూర్వంవరకూ భారత విద్యావ్యవస్థలో మాధ్యమికవిద్య బలహీనమైనవ్యవస్థగానే ఉండేది. స్వాతంత్ర్యానంతరంకూడా అది అలాగే కొనసాగుతోంది. అందుకు వివిధకారణాలున్నాయి.

1. ప్రాథమికవిద్యకు లభించినంత ప్రచారం లభించక అనేక సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురికావటం.. 2. సెకండరీ విద్యాకమిటీ సూచనలమేరకు పాఠశాలల, కళాశాలల ప్రణాళికా రూపకల్పన సరిగా జరగకపోవటం. 3. ఉన్నతవిద్య ప్రణాళికారహితంగా విస్తరించటాన్ని నిరోధించలేకపోవటం. 4.

విభిన్నరీతుల్లో విద్యార్థులను రూపొందించటంకోసం మాధ్యమిక స్థాయిని వృత్తికేంద్రంగా మార్చేందుకు అవసరమైనచర్యలు చేపట్టకపోవటం. 5. గుణాత్మకాభివృద్ధికి అవసరమైన ప్రణాళికల రూపకల్పనపట్ల పూర్తి నిర్లక్ష్యం వహించటం.

**మాధ్యమికవిద్య-ప్రాధాన్యత:**

ప్రాథమికవిద్యకు, ఉన్నతవిద్యకు మధ్య సమోధ్యలా పనిచేసే మాధ్యమికవిద్యలో విలువల స్థాపన ప్రాధాన్యత వహించింది. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు మాధ్యమిక పాఠశాలలనుంచే వస్తారుకాబట్టి మాధ్యమిక పాఠశాలల్లోని ప్రమాణాలు తిరిగి ప్రాథమికవిద్యను మెరుగుపర్చేందుకు దోహదపడతాయి. మరోవైపు విశ్వవిద్యాలయాల విద్యార్థులు మాధ్యమికవిద్య నుంచి వస్తారుకాబట్టి ఉన్నతవిద్యలో ప్రమాణాలుకూడా మాధ్యమికవిద్యపైనే ఆధారపడతాయి. అందువల్ల విద్యావ్యవస్థ మొత్తంగా ఆరోగ్యవంతంగా ఉండాలంటే మాధ్యమికవిద్యను మెరుగుపర్చటం తప్పనిసరి అవసరం. అయితే ఈ ప్రధాన అంశం అశ్రద్ధకుగురైంది. ప్రణాళికల్లో ప్రాధాన్యతాక్రమంలో ప్రాథమికవిద్య, ఉన్నతవిద్య, సాంకేతికవిద్యలున్నాయి. వీటికి కేటాయించగా మిగిలిన నిధులపైనే మాధ్యమికవిద్య మనుగడ ఆధారపడింది. అయితే ప్రాధాన్యతనుగుర్తించి మొత్తంలో మూడవవంతు కేటాయింపులు మాధ్యమికవిద్యకు వెచ్చించాల్సి ఉంది. విశ్వవిద్యాలయ విద్యకు సిద్ధంచేయటం ఒకవైపు, మరోవైపు వృత్తివిద్యనందించటం ఇంటర్మీడియెట్ స్థాయిలో ప్రధాన లక్ష్యాలుగా ఉండాలని కలకత్తా విశ్వవిద్యాలయ కమిషన్ (1917-19) సూచించింది.

**ప్రణాళికా రహిత విస్తరణ:**

ప్రణాళికలేని అపరిమిత పెరుగుదలకు అనేక కారణాలున్నాయి. 1. ప్రాథమిక విద్య ఉద్యోగవిలువను కోల్పోవడంతో ప్రతివారు ఇంటర్మీడియేట్ పూర్తిచేసి ఉద్యోగప్రయత్నంచేయటమో, ఉన్నతవిద్యను కొనసాగించేందుకు దీన్ని ఉపయోగించటమో జరుగుతున్నది. ఉన్నత, మధ్యతరగతివారు 12/13సంవత్సరాలకు ప్రాథమికవిద్య పూర్తిచేయటంతో, ఇది ఉద్యోగానికి తగిన వయస్సు కాకపోవటంతో విద్యను కొనసాగించటంతో మాధ్యమికవిద్యకు గిరాకీ పెరిగింది. మాధ్యమిక స్థాయిలో ప్రభుత్వఫీజులు నామమాత్రం కావటం ఈ పరిస్థితికి మరికొంత దోహదపడింది. మాధ్యమికవిద్యలో చోటుచేసుకుంటున్న ఈ పెరుగుదల ఉన్నతవిద్యపై రెండురకాల ప్రభావాలను చూపింది. ఒకవైపు మాధ్యమికవిద్య గ్రామీణప్రాంతాలవారికి, బలహీనవర్గాల వారికి అందుబాటులోకి వచ్చింది. మరోవైపు విద్యాప్రమాణాల్లో పతనానికి, సరైన ప్రమాణాలులేని కళాశాలల పెరుగుదలకు కారణమైంది. విశ్వవిద్యాలయ విద్యపైన వత్తిడిపెంచింది. ఉన్నతవిద్యలో కూడా ఇదేపరిస్థితి ఏర్పడింది.

**విభిన్నమార్గాల అన్వేషణ-వృత్తివిద్యలు:**

ప్రాథమిక ఉపాధ్యాయుల శిక్షణ, పాలిటెక్నిక్‌లు, పారిశ్రామిక శిక్షణసంస్థలు, పరిశ్రమలకు శ్రామికుల కల్పన, సెక్రటేరియల్, కమర్షియల్ కోర్సులు, పారామెడికల్ సిబ్బంది శిక్షణ, వ్యవసాయంలో శ్రామికుల శిక్షణ, గ్రామీణ కుటీరపరిశ్రమలకోసం శిక్షణ వంటివి ఈ విభిన్నమార్గాలు. అయితే మొత్తంవిద్యలో వృత్తిశిక్షణ పొందేవారిశాతం 9 మాత్రమే కావటం గమనార్హం.

మాధ్యమికస్థాయిలో వృత్తివిద్యకు ప్రాధాన్యతలేకపోవటానికి కారణాలు అనేకం. ఉన్నత, మధ్యతరగతుల్లో వృత్తివిద్యలపట్ల సరైన గౌరవం లేకపోవటం, శిక్షణకు వ్యయం అధికంగాఉండటం, సరైన ఉపాధ్యాయులు లభ్యంకాకపోవటం, వృత్తివిద్యానంతరం సరైన ఉపాధి అవకాశాలు

లభిస్తాయన్న నమ్మకంలేకపోవటం కారణాలుగా కనిపిస్తాయి. పాలిటెక్నిక్‌లు, పారిశ్రామికసంస్థలు పెరిగిన తర్వాతకూడా పారిశ్రామిక మాంద్యం ఏర్పడి నిరుద్యోగం ఎక్కువగా ఉండటంతో వాటి ప్రవేశాలు తగ్గాయి. విభిన్న రంగాల్లో అవకాశాలు పెరిగేవిధంగా ఆర్థికవ్యవస్థలో మార్పులు చేసేందుకు ప్రయత్నించటమే ఈ సమస్యకు సరైన పరిష్కారమార్గంగా కనిపిస్తున్నది.

**గుణాత్మకచర్యలు:**

మాధ్యమికవిద్యకు వనరులకొరత అధికంగా ఉంది. ఉన్నవనరులనుకూడా మాధ్యమికవిద్య పరిమాణాత్మక పెరుగుదలకు వెచ్చించటంతో గుణాత్మకవిద్యకు విఘాతం కలుగుతోంది. మొత్తంమీద ఉన్నతవిద్య వ్యాపించటంతో మాధ్యమిక ఉపాధ్యాయులు మంచి అర్హతగలవారు వచ్చే అవకాశం ఏర్పడింది. అయితే ఉద్యోగభద్రత విషయంలో సమస్య అలాగే ఉండిపోయింది. ప్రైవేటు రంగంలోని అనేక మాధ్యమిక పాఠశాలల్లో అధ్యాపకుల శ్రమను దోచుకోవటం అధికంగా ఉంది. పాఠ్యాంశాలను, పాఠ్యపుస్తకాలను మెరుగుపర్చటం, నూతన బోధనాపద్ధతుల అమలు, పరీక్షా సంస్కరణలు, వృత్తిశిక్షణ, శాస్త్రసాంకేతిక రంగాల్లో శిక్షణ వంటి అంశాలు మాధ్యమిక విద్యారంగంలో అభివృద్ధికి దోహదపడతాయి. అయితే ఈ అభివృద్ధి నాణ్యతలేని సంస్థల విపరీతమైన పెరుగుదల కారణంగా మరుగునపడి పోయింది.

**ప్రాథమికవిద్య:**

1947 వరకు ప్రాథమికవిద్యలో జరిగిన అభివృద్ధి రెండు ప్రధానఅంశాలను ముందుకు తెస్తుంది. రాజ్యాంగంలో 45వ ఆర్టికల్‌లోని ఆదర్శ సూత్రాలలో స్థానం కల్పించటం ద్వారా 6-14 మధ్య వయస్సుగల పిల్లలందరికీ నిర్బంధ సార్వత్రిక విద్యను అందించాలన్న ఆదర్శానికి ప్రాధాన్యతకల్పించటం ఒకటి. రెండవది బేసిక్ విద్యావిధానం ద్వారాకాని, అటువంటి సమాంతర విధానంద్వారా కాని విద్యావిధాన స్వభావాన్ని మార్చాల్సిన అవసరం. ఇవి రెండూ ప్రాథమిక విద్యాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు. వీటి అమలు విద్యావ్యవస్థలో మౌలికమార్పులకు దోహదపడుతుంది. అయితే దురదృష్టవశాత్తూ ఈ రెండూ ఆచరణకు నోచుకోలేదు. ఫలితంగా విద్యావ్యవస్థలో మార్పులన్నీ సంస్కరణలరూపంలో స్వల్పంగానే చోటుచేసుకున్నాయి. విస్తరణ తప్పనిసరి అవసరంకాని మాధ్యమిక, ఉన్నత విద్యారంగాల్లో మోతాదుకు మించి విస్తరణ జరుగటం, విస్తరణే ప్రధానలక్ష్యం కావాల్సిన ప్రాథమికవిద్యారంగంలో అవసరమైనంతమేర విస్తరణ జరగకపోవటం అతి విషాదకరమైన అంశం.

**ప్రాథమిక విద్యావ్యాప్తి:**

ప్రాథమిక విద్యావ్యాప్తి మూడుదశల్లో సాధ్యపడుతుంది. అవి సార్వత్రికసౌకర్యాల కల్పన, సార్వత్రికప్రవేశాలు, సార్వత్రిక క్రమబద్ధీకరణ. ఈ మూడు వరుసక్రమంలో కాకుండా ఒకేసారి తీసుకోవాల్సిన చర్యలు.

గతకాలం వరకు ప్రాథమికవిద్య సార్వత్రికసౌకర్యాలకల్పనే ప్రధానంగా జరుగుతున్నది. వేలకొలది పాఠశాలలు స్థాపించారు. ప్రతి శిశువు నడిచి వెళ్ళగలిగినంత దూరంలో పాఠశాల ఉండటం ప్రస్తుతస్థితి. ప్రాథమికోన్నత పాఠశాలల స్థాపనకూడా ఈ దశలోనే జరుగుతున్నది.

అయితే పాఠశాలస్థాపన మొదటిదశ మాత్రమే. సాధారణంగా పాఠశాల ప్రారంభంలో విద్యాపరంగా చైతన్యవంతులైన సామాజికవర్గాల నుంచి పిల్లలు ప్రవేశిస్తారు. క్రమంగా పాఠశాలలో విద్యార్థుల నమోదు పెరుగుతుంది. పేద సామాజిక వర్గాలస్థాయిలో విద్యార్థుల నమోదు

కష్టతరమౌతుంది. ఇందువల్లనే ప్రాథమికస్థాయిలో సార్వత్రిక ప్రవేశాలు కష్టతరమౌతాయి. అయినప్పటికీ ఈ దిశగా సరైన ప్రయత్నాలు జరుగుతునాయనే చెప్పవచ్చు.

ప్రస్తుతం పాఠశాల బయట ఉండే పిల్లలు బలహీనవర్గాల పిల్లలు కావటంతో వీరిని తిరిగి పాఠశాలల్లోచేర్చటానికి అవసరమైన చర్యలు చేపట్టాల్సిఉంది. బాలికల ప్రవేశాలను పెంచేందుకు తగిన ప్రత్యేక చర్యలు చేపట్టాలి. ఇదేవిధంగా షెడ్యూల్డ్ కులాలు, తెగల విషయంలో కూడా ప్రత్యేక చర్యలు చేపట్టాలి. ప్రాథమిక విద్య విషయంలో దేశంలోని అన్నిప్రాంతాలు ఒకేవిధమైన ప్రగతి సాధించలేదు. పట్టణ ప్రాంతాల్లో పాఠశాలల్లో బాలబాలికల సంఖ్య అధికం. అయితే గ్రామీణప్రాంతాల్లో మాత్రం బాలబాలికల ప్రవేశాలు తక్కువ కాగా ప్రత్యేకించి బాలికల ప్రవేశాలు మరింత తక్కువగా ఉన్నాయి.

ప్రాథమికవిద్య విషయంలో కేరళ, తమిళనాడులు ముందుండగా రాజస్థాన్, బీహార్, ఒరిస్సాలు వెనుకబడ్డాయి. ఒకే రాష్ట్రంలోకూడా ప్రాంతాలవారీగా తేడాలు కనిపిస్తాయి. విద్యాభివృద్ధిలో చోటుచేసుకున్న ఈ సామాజిక, ప్రాంతీయ అసమానతలను అధిగమించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సి ఉంది.

ప్రాథమిక పాఠశాలల్లో సార్వత్రిక ప్రవేశాలకోసం చేపట్టాల్సిన చర్యలలో ప్రధానమైనవి. పాఠ్యపుస్తకాలు, పఠన, లేఖన సామగ్రి ప్రతి పేదవిద్యార్థికి ఉచితంగా అందేట్లు చర్యలు తీసుకోవాలి. మధ్యాహ్నభోజనపథకం ప్రధానమైన శక్తివంతమైన కార్యక్రమం. మన రాష్ట్రంతోసహా అనేక రాష్ట్రాల్లో అమల్లోకివచ్చింది. ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశంపొందినవారందరూ ఈ పథకంవల్ల లబ్ధిపొందే వీలుంది. దీన్ని సమర్థవంతంగా అమలుచేయాల్సిఉంది.

పిల్లలు విద్యావకాశాలు పొందటంలో విద్యపట్ల, విద్యాప్రయోజనంపట్ల, విద్యాప్రాధాన్యత పట్ల తల్లిదండ్రులకుగల స్పృహ ప్రముఖపాత్ర వహిస్తుంది. విద్యావంతులైన తల్లిదండ్రుల పిల్లలు పాఠశాల్లో ప్రవేశం పొందటం సర్వసాధారణం. కాబట్టి వయోజనులు విద్యావంతులుకావటం ప్రాథమికవిద్యలో ప్రవేశాల పెరుగుదలకు దోహదపడుతుంది. కాబట్టి వయోజనవిద్య కై సరైన చర్యలు చేపట్టాల్సిఉంది.

సార్వత్రిక విద్యాసాధనకు మరో సాధనం నిర్బంధ విద్యాచట్టాన్ని అమలుపర్చటం. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో నిర్బంధ విద్యాచట్టం పుస్తకాలకే పరిమితమైంది. అతికొద్ది కేసులుమాత్రమే నమోదైనాయి. అయితే ప్రాథమిక విద్యలో ప్రవేశాలు శిక్షలపైకాక ప్రోత్సాహకాలపైనే ఆధారపడి ఉంటాయన్నభావన బలంగా ఉంది. తల్లిదండ్రులు పంపగలిగిన స్తోమతకలిగిఉండి పంపని పరిస్థితుల్లో మాత్రమే నిర్బంధ విద్యాచట్టం అమలు వీలుపడుతుంది. పేదరికంవల్లనో, మరే ఇతరకారణంవల్లనో పిల్లలను పాఠశాలకు పంపలేని కుటుంబాల విషయంలో ఈ చట్టం నిస్సహాయంగా చూస్తూ ఉండిపోవాల్సి వస్తుంది.

మూడవదశ సార్వత్రిక క్రమబద్ధీకరణ. పై రెండింటికంటే ఇది మరింత క్లిష్టతరమైన అంశం. 6సంవత్సరాల వయస్సులో ఒకటవ తరగతిలో ప్రవేశంపొందిన ప్రతివిద్యార్థి అతనికి 14సంవత్సరాలు వచ్చేవరకు 8వతరగతివరకు పాఠశాల వీడకుండేట్లు చూడాలి. అయితే ప్రస్తుతం ఇందుకు పూర్తిభిన్నంగా జరుగుతోంది. తరగతివారీగా చూస్తే బడిమానివేతలు ఎక్కువగా ఒకటవతరగతిలో కనిపిస్తున్నాయి. ఒకటవతరగతిలోనే సగంమంది విద్యార్థులు పాఠశాల వదలివేస్తున్నారు. ఒకటవతరగతిలో ప్రవేశంపొందినవారిలో కేవలం 40శాతంమంది మాత్రమే ఐదవతరగతికి చేరుతున్నారు. ఎనిమిదవతరగతికి ఇది 25శాతంగా ఉంది. అంటే ఒకటవ తరగతిలోచేరిన ప్రతి

వందమందిలో 25మంది మాత్రమే 8వతరగతికి చేరుతున్నారు. మిగిలిన 75మంది ఏదోఒక తరగతిలో ఒకటిలో 35శాతంమించి, 2-5మధ్య 25శాతంమించి, 6-8మధ్య 16శాతంమించి బడి మానివేస్తున్నారు. ఈ మానివేతలే సార్వత్రిక ప్రాథమికవిద్యకు పెద్ద ప్రతిబంధకాలుగా మారాయి. అన్ని అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఇది సాధారణసమస్యగా ఉంది.

ఈ విధమైన మానివేతలకు ప్రధానకారణం పేదరికం. కుటుంబజీవనంకోసం పేదకుటుంబాల్లో పిల్లలు ఇంటివద్దకాని, బయటకాని పనిచేయాల్సి వచ్చేది. బాలురు పొలాల్లోకాని, కూలీలుగాకాని పనిచేస్తే, బాలికలు తల్లికి సాయపడుతూ చిన్నపిల్లల పరిరక్షణ చూస్తారు. ఈ పిల్లలు మనం ఆశించినట్లుగా తమ పూర్తికాలాన్ని పాఠశాలల్లో గడపడం వీలుపడదు. దీంతో తొమ్మిది సంవత్సరాల వయసులో వీరు స్కూలు వదిలేస్తారు. పిల్లలు పెరిగినకొద్దీ వారు పనిచేయాల్సిన అవసరం పెరుగుతూవస్తుంది. పేదరికం కారణంగా జరిగే మానివేతలు పిల్లల వయసుతోపాటు పెరుగుతూ వస్తాయి. సామాన్యమానవుని ఆర్థికస్థితిలో మెరుగుదలే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం. అయితే ఈ లోగా పూర్తికాలాన్ని వెచ్చించలేని వీరికోసం స్వల్పకాలిక విద్యనందించేందుకు ఏర్పాట్లుచేయటం మరో చర్య.

ఈ మానివేతలకు ఇతరకారణాలు సామాజికమైనవి, విద్యాపరమైనవి. సామాజిక కారణాల్లో బాల్యవివాహాలు, అనారోగ్యంవంటివి ఉన్నాయి. విద్యాసంబంధమైన కారణాల్లో నాసిరకమైన పాఠ్యప్రణాళిక, ప్రాంతీయ జీవనవిధానంతో సంబంధంలేని పాఠ్యాంశాలు, నాణ్యతలేని బోధనాపద్ధతులు, ఆకర్షణీయంగాలేని పాఠశాలలు, నిస్తేజమైన పాఠశాల పరిసరాలు వంటివాటిని పరిగణించవచ్చు. విద్యలో గుణాత్మకమైన ప్రగతి, పాఠ్యాంశాలకు, పరిసరాలకుమధ్య సమన్వయం ఉండేట్లుచూడటం చేపట్టాల్సిన చర్యలు.

ఈ పరిస్థితుల్లో రాజ్యాంగంలోని 45వ ఆర్టికల్‌ని అమలుపర్చటం సాధ్యమయ్యేపనికాదు. ఈ వైఫల్యాలకు విభిన్న కారణాలు కనిపిస్తాయి.

సార్వత్రిక ప్రాథమికవిద్యాపథకం అత్యంత ఖర్చుతో కూడుకున్నది కావటంతో, జాతీయాదాయంలో కనీసం ఆరుశాతం దీనికోసం వెచ్చించాల్సిన కారణంగా వనరుల కొరత తీవ్రంకావటం ప్రధానకారణం. పూర్తికాలికమైన సంస్థాగత శిక్షణపైనే మనం దృష్టి కేంద్రీకరించటం రెండవది. ప్రస్తుత భారతవ్యవస్థలో కేవలం సంపన్న కుటుంబాలనుంచి వచ్చిన పిల్లలకుమాత్రమే పూర్తికాలిక అధ్యయనానికి వీలుపడుతుంది. మన పిల్లల్లో అధికసంఖ్యాకులు పేద, మధ్యతరగతికి చెందినవారు. వీరు కుటుంబపోషణకోసం పనిచేయాల్సి ఉంటుంది. దీంతో వీరిలో అనేకమంది వయసు మీరిన తర్వాత పాఠశాలల్లో చేరాలని ఆశిస్తారు. ప్రస్తుత వ్యవస్థలో ఇందుకు వీలులేదు. అందువల్ల ప్రస్తుత వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తేవాల్సి ఉంది. ఒకేచోట, ఒకే కాలంలో ప్రవేశాలకు మారుగా వివిధవయసుల్లో ప్రవేశాలకు వీలుకల్పిస్తూ, స్వల్పకాలిక విద్యావ్యవస్థను రూపొందించాల్సి ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టింది. వయోజనవిద్యా కార్యక్రమాల అమల్లో నిర్లక్ష్యం మరోకారణం. ఈ కారణంగా పిల్లలను పాఠశాలదిశగా ఉత్సాహపరిచే కుటుంబ వాతావరణం ఏర్పడే అవకాశం ఉండదు. పేదరిక నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలుకూడా సార్వత్రిక ప్రాథమికవిద్యా సాధనలో కీలకపాత్ర పోషిస్తాయి.

**బేసిక్‌విద్య:**

మరోప్రధానాంశం బేసిక్ విద్యలో భాగంగా అమలుచేసిన సాంఘిక ఉపయుక్త ఉత్పాదక

పథకం. మొదట్లో బేసిక్ విద్యావిధానంపట్ల అందరూ ఉత్సాహాన్ని ప్రదర్శించారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అన్ని ప్రాథమిక పాఠశాలలను ఆకస్మాత్తుగా బేసిక్ పాఠశాలలుగా మార్చింది. ఇతరచోట్ల కొన్ని ఎంపికచేసిన ప్రదేశాల్లోను, పాఠశాలల్లోను బేసిక్‌విద్యను ప్రవేశపెట్టారు. ఉపాధ్యాయశిక్షణ ప్రాధాన్యతను గుర్తించి అన్ని ఉపాధ్యాయశిక్షణా సంస్థలను బేసిక్ విధానంలోకి మార్చాలని నిర్ణయించారు. కొన్నిచోట్ల ఈ ప్రయోగాన్ని మాధ్యమికస్థాయివరకు విస్తరించారు. అయితే సరైన స్థాయిలో ఈ ప్రణాళిక అమలుజరగలేదని భావించినవారు మరొక ప్రణాళికను 1956లో ప్రవేశపెట్టారు. ఈ విధానంలో భాగంగా స్వల్పంగా ప్రాథమికపాఠశాలల్లో అమలుపర్చి కొంతకాలంతర్వాత వాటిని పూర్తిస్థాయి పాఠశాలలుగా అభివృద్ధిచేయాలని తలచారు. అయితే ఇదికూడా సంతృప్తికరంగా అమలుకాలేదు.

బేసిక్ విద్యావిధానం అనేక మంచిభావాలతో ఏర్పడింది. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు సరైన కృత్యాలు, పనితోకూడిన అభ్యసనం, సరైన శారీరకశ్రమ, సామాజిక ఉత్పాదనా కార్యక్రమంలో పాల్గొనటం వంటి చర్యలతో విద్యభావనలో మార్పుకు కృషిచేయటం, విద్యార్థిని భావిజీవితానికి సిద్ధంచేయటం, విద్యార్థి వ్యక్తిగత, మేధోపరమైన, భావనాత్మకమైన వృద్ధికి తోడ్పడటం బేసిక్ విద్యావిధానం ప్రధాన ఉద్దేశం. బేసిక్ విద్యావిధానం అమలులో సంతృప్తికరమైన ఫలితాలు అందించకపోయినా పుస్తకకేంద్రంగా సాగే పాత భావనను బద్దలుచేసింది.

బేసిక్ విద్యావిధాన వైఫల్యాలకు కారణాలు: 1. ప్రస్తుత ప్రాథమిక విద్యావిధానం ప్రత్యేకించి ఉన్నత, మధ్యతరగతి వర్గాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించింది. పూర్తికాలిక శిక్షణ ఇందులో ప్రధానమైనందున ఇది పిల్లలను జనంనుంచి వేరుచేస్తుంది. భారతదేశంలో ఉన్నత, మధ్యతరగతి వారికి, ప్రత్యేకించి పట్టణ ప్రాంతాలవారికి సాంప్రదాయికంగా శారీరక శ్రమపట్ల న్యూనతభావం, పుస్తకకేంద్రమైన విద్యావిధానం పట్ల మోజు అధికం. సామాజికవర్గాలలో ఏర్పడిన ఈ సామాజిక, మానసిక విముఖతను అధిగమించటం సులభ సాధ్యంకాదు. కేవలం మాటల్లో, భావాల్లో ఈ విద్యాసంస్కరణ స్వభావాన్ని గుర్తించారేతప్ప అమలుకోసం పటిష్టమైన చర్యలుమాత్రం చేపట్టలేదు. 2. సాధారణ ప్రజలనుంచికూడా ఈ విధానంపట్ల వ్యతిరేకత వచ్చింది. మధ్య, ఉన్నతవర్గాలవారి చర్యలను అనుకరించటం దిగువతరగతివారి సాధారణ స్వభావం. పట్టణప్రాంతాల్లోని ఉన్నత, మధ్యతరగతులకు పుస్తకప్రాధాన్యంగల విద్యావిధానాన్ని, గ్రామీణప్రాంతాలకు, పేదవర్గాలకు శ్రమప్రాధాన్యంగల విద్యావిధానాన్ని రూపొందించినప్పుడు గ్రామీణ పేదవర్గాలు తమకు తక్కువస్థాయి విద్యావిధానాన్ని రూపొందించినట్లుగా భావించేందుకు అవకాశం ఉంది. బహుశా అందువల్లనే బేసిక్ విద్యావిధానం "The best education for other people's children" అన్న నిర్వచనాన్ని పొందగలిగిందని భావించాలి. ఈ విధంగా సామాన్యజనంకూడా ఉన్నత, మధ్యతరగతుల మాదిరిగా బేసిక్‌విద్యావిధానాన్ని వ్యతిరేకించి దేశవ్యాప్తంగా ఒకే విద్యావిధానాన్ని కోరారు. ఈ భావన బేసిక్‌విద్యావిధానానికి ఆటంకమైంది. 3. ఆచరణలో అనేక సాంకేతిక సమస్యలు కూడా చోటుచేసుకున్నాయి. బేసిక్ పాఠశాలల్లో నేత, మగ్గం వంటి వాటిపై విపరీతమైన శ్రద్ధ చూపేవారు. వ్యవసాయం మంచిఫలితాలకు అవకాశమున్న విభాగమే అయినా భూమి కొరత కారణంగా కొన్ని పాఠశాలల్లో మాత్రమే ఇది ప్రవేశపెట్టారు. క్రాఫ్టులో ప్రవీణులైన ఉపాధ్యాయులశిక్షణ కష్టసాధ్యమైనపని. అవసరమైన పరికరాల లభ్యతలేదు. అవసరమైన ముడిసరుకులు లభించేవికావు. తయారైన వస్తువుల అమ్మకానికి సరైన మార్కెట్‌సౌకర్యం లేదు. 4. పాఠశాలల సంఖ్య పెరగటంతో

సమస్య మరింత తీవ్రమైంది. అనేకచోట్ల సరైన ఉపాధ్యాయుల కొరత, వనరుల కొరత కారణంగా విజయవంతం కాలేదు.

బేసిక్‌విద్యను విద్యాకమిషన్ (1964-66) సమగ్రంగా పరిశీలించింది. బేసిక్‌విధానంలోని ప్రధానాంశాలు మౌలికంగా సరైనవి కాబట్టి, అవసరమైన కొన్నిమార్పులతో విద్యారంగంలోని అన్నిస్థాయిల్లో ప్రవేశ పెట్టవచ్చునని భావించింది. 1. విద్యారంగంలో ఉత్పాదకత. 2. ఉత్పాదనాప్రక్రియకు, బోధనా ప్రణాళికకు సమన్వయం. అందుకు అనుగుణమైన భౌతిక, సామాజిక పరిస్థితుల కల్పన. 3. ఉత్పాదకప్రక్రియలో భాగంగా పాఠ్యాంశాల్లో ప్రవేశ పెట్టే బోధనాంశాలు 'పని అనుభవం' క్రాఫ్ట్ వంటివి కాక ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాలకు చెందినవి అయి ఉండేలా చూడటం. విద్యాకమిషన్ గుర్తించిన మౌలికాంశాలు.

**గుణాత్మకాభివృద్ధికి కార్యక్రమాలు:**

ప్రాథమిక ఉపాధ్యాయుల వేతనాల్లో చెప్పుకోదగ్గ పెరుగుదల కల్పించాలి. విశ్వవిద్యాలయ స్థాయిలో, కళాశాల స్థాయిలో జరిగిన పెరుగుదల ఇక్కడ జరగలేదు. ఉపాధ్యాయుల అర్హతలు పెంచేందుకు చర్యలు చేపట్టాలి. ప్రాథమికస్థాయిలో బోధనా ప్రణాళికలను మరింత అభివృద్ధిపరచాలి. దురదృష్టవశాత్తు పనిఅనుభవం సంతృప్తికరంగా ఆచరణలోకి రాలేదు. ప్రాథమిక విద్యా ప్రణాళిక ప్రాంతీయ పరిస్థితులకు అనుగుణంగా రూపొందాల్సి ఉంది. పాఠ్యప్రణాళిక, మూల్యాంకన పద్ధతుల్లో శాస్త్రీయత అవసరం.

**వయోజన విద్య:**

స్వాతంత్ర్యానంతరంకూడా వయోజన విద్యా కార్యక్రమానికి సరైన ప్రాధాన్యత లభించలేదు. సార్వత్రిక ప్రాథమికవిద్యను 1960లోపు నిర్బంధంగా అమలుజరిపి ఉంటే ప్రస్తుతం వయోజన అక్షరాస్యత సాధ్యమై ఉండేదని అనేకమంది భావన. అయితే ఈ నిర్బంధ సార్వత్రిక విద్యాపథకం అమలులో వెనుకబడింది. ప్రాథమికస్థాయిలో పాఠశాలల్లో చేరిన అనేకమంది సంపూర్ణంగా అక్షరాస్యులు కాకుండానే బడి మానివేయటంతో సార్వత్రిక ప్రాథమికవిద్యాపథకం వయోజన విద్యావ్యాప్తికి దోహదకారి కాలేకపోయింది. గ్రామీణప్రాంతాల్లో పొందిన అక్షరాస్యతను వినియోగించుకునేందుకు అనువైన పరిస్థితులు లేక, వారు తిరిగి నిరక్షరాస్యులుగా మారిపోతున్నారు.

వయోజన నిరక్షరాస్యత దేశాభివృద్ధికి ప్రధానఆటంకంగా ఉంది. దీని నిర్మూలనకు చర్యలు చేపట్టాల్సి ఉంది. వయోజనులు విద్యావంతులుకావటం సామాజిక జీవనవిధానంలో గుణాత్మకమైన మార్పుకి దోహదపడుతుంది. వయోజనవిద్యారంగంలో రెండు ప్రధానాంశాలను గుర్తుంచుకోవాలి. మొదటిది సామాజికవిద్య. ఇందులో అక్షరాస్యతతోపాటుగా వ్యక్తిని సాంఘీకరణ చేసే లక్ష్యం ఇమిడిఉంది. పౌరశిక్షణ, ఆరోగ్యం, శాస్త్రజ్ఞానం, వృత్తి సామర్థ్యాన్ని మెరుగుపర్చే నైపుణ్యాలు సామాజిక విద్యలో భాగంగా ఉంటాయి. వయోజనులందరికీ ఈ విద్య అందినట్లయితే ఈ భావన సామాజికమార్పుకు దోహదకారి కాగలదు. రెండవది విశ్వవిద్యాలయస్థాయిలో వయోజనవిద్య అందించటం. ఇందులో అక్షరాస్యత, సామాజికవిద్య వంటి అంశాలుండవు. మాధ్యమిక, ఉన్నతవిద్య పొందిన వ్యక్తుల విద్యను కొనసాగించే ప్రయత్నమిది. సమాజం నిరంతరం వేగంగా మార్పుచెందుతున్నక్రమంలో ప్రతివ్యక్తి తనకుతానుగా నిరంతర విద్యావంతులుగా ఉండాల్సిఉంది. ఇందువల్ల నిరంతర విద్యాప్రణాళికలు మరింత ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి. భారతీయ విశ్వవిద్యాలయాలుకూడా ఈ ప్రణాళికలు చేపట్టాయి.

**పూర్వపాఠశాలవిద్య:**

ప్రాధాన్యత గుర్తించినా తగినచర్యలు చేపట్టని మరోఅంశం పూర్వప్రాథమికవిద్య. అయితే ఇటీవలికాలంలో దీని ప్రాధాన్యతను అందరూ గుర్తిస్తున్నారు. అందుచేతనే పూర్వప్రాథమిక పాఠశాలలు పెరుగుతున్నాయి. అయితేఇవి అధికంగా పట్టణప్రాంతాలలోనే కేంద్రీకృతమౌతున్నాయి. అందునా ఉన్నత, మధ్యతరగతి వర్గాలకే పరిమితమైనాయి. అయితే ఈ విద్య పేదవర్గాలకు మరింతగా అవసరం. ఆ దిశలో ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిఉంది.

**సమాన విద్యావకాశాలు:**

ప్రభుత్వ ప్రధానలక్ష్యాలలో సమానవిద్యావకాశాలు ఒకటి. ప్రాథమిక, మాధ్యమిక, విశ్వవిద్యాలయాల స్థాయిలో విద్యావసరులను విస్తృతపర్చటంద్వారా ఈ దిశగా చర్యలు చేపట్టినట్లైంది. ఇందులో భాగంగా చర్చించాల్సిన ప్రత్యేకాంశాలు కొన్ని ఉన్నాయి.

బాలబాలికలకు మధ్య విద్యాపరంగా తేడా ఇంకా అలాగే ఉంది. విద్యలో ఉన్నతస్థాయికి పోయేకొలదీ ఈ తేడా పెరుగుతూ వస్తున్నది..1958లో ప్రభుత్వం దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ అధ్యక్షతన స్త్రీవిద్యపైన జాతీయ కమిటీని నియమించింది. బాలికలవిద్యకు ఏర్పడుతున్న ప్రతిబంధకాలను గుర్తించి, బాలికలుకూడా బాలురతో సమానంగా విద్యనభ్యసించేందుకు ప్రత్యేకించి ప్రాథమిక, మాధ్యమికస్థాయిలో చేపట్టాల్సిన చర్యలను సూచించాలని ప్రభుత్వం కమిటీని కోరింది. కమిటీ తన పరిశీలనల ఆధారంగా కొన్నిసూచనలుచేసింది. స్త్రీవిద్యను ప్రత్యేక సమస్యగా గుర్తించి కొంతకాలం పాటు ఇందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. స్త్రీవిద్యకు జాతీయస్థాయిలో, రాష్ట్రస్థాయిలో మహిళాకమిషన్‌ను ఏర్పాటుచేయాలి. ఒక ప్రత్యేక ప్రభుత్వశాఖను ఏర్పాటుచేయాలని సూచించింది.

**వ్యవసాయ విద్య:**

వ్యవసాయరంగానికి ప్రోత్సాహం తగినంతగా లభించటంలేదని, వ్యవసాయవిద్యను ప్రధాన జాతీయ అంశంగా భావించాలని విశ్వవిద్యాలయాల విద్యాకమిషన్ పేర్కొంది. ఈ విధమైన గుర్తింపు సౌకర్యాల పెంపునకు, వ్యవసాయ విజ్ఞానసంస్థల స్థాపనకు, ప్రత్యేక శిక్షణాసౌకర్యాలనేర్పరచి వ్యవసాయ విజ్ఞానశాస్త్రాల్లో నిపుణులను రూపొందించేందుకు వీలు కల్పించింది. వ్యవసాయవిద్యలో నాణ్యత పెంచేందుకు, వ్యవసాయవిద్య, పరిశోధనలు సంయుక్తంగా నిర్వహించే అమెరికా లాండ్‌గ్రాంట్ కళాశాలల మాదిరిగా వ్యవసాయ విశ్వవిద్యలయాలను స్థాపించాలని నిర్ణయించారు. భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ ఐసిఏఆర్ ద్వారా వ్యవసాయంలో పరిశోధనను అభివృద్ధి పర్చారు. విస్తృత పరిశోధనలతో ఈ సంస్థను అనుసంధించటంవల్ల సస్యవిప్లవం సాధ్యమైంది.

వైద్య, సాంకేతిక విద్యారంగాల్లోకూడా ఇటువంటి అభివృద్ధే జరుగుతున్నది. ప్రస్తుతం భారత వైద్య విజ్ఞానసంస్థలు, జాతీయ వైద్యవిద్యా పరిషత్‌లు వైద్య విద్యాభివృద్ధికి విస్తృతంగా కృషిచేస్తున్నాయి. వ్యవసాయాధారమైన భారత ఆర్థికవ్యవస్థను పారిశ్రామికంగా కీలకమైనదిగా రూపొందించాల్సి ఉంది.

**ఇతర కార్యక్రమాలు:**

దేశాన్ని కొన్ని యూనిట్లుగా విభజించి విద్యాసమాచారాన్ని సేకరించే ప్రక్రియసాగుతున్నది. మొదటి దేశవ్యాప్త విద్యాసర్వే ప్రాథమిక, మాధ్యమిక విద్యలపైన 1957లో జరిగింది. అయితే ఏకకేంద్ర ప్రవేశాలు, పూర్తికాలిక శిక్షణ, క్రమానుగత శిక్షణ వంటివాటిపైన ప్రత్యేక శ్రద్ధచూపటం ఆహ్వానించదగ్గ పరిణామం కాదు. పూర్తికాలిక శిక్షణతోపాటు అల్పకాలిక, స్వీయ అధ్యయనాలను

అభివృద్ధిపరచాలని విద్యాకమిటీ సూచించింది. ప్రాథమికస్థాయిలో బహుముఖీనమైన ప్రవేశాలను కల్పించేందుకు ప్రథకం సిద్ధమైంది. మాధ్యమిక, విశ్వవిద్యాలయ స్థాయిల్లోకూడా స్వల్పకాలిక స్వీయ అధ్యయనాలను అనుమతించటం విద్యావకాశాలను మెరుగుపర్చుతుంది. అయితే స్వాతంత్ర్యానంతరం ప్రైవేటు సంస్థలపాత్రలో చెప్పుకోదగ్గ మార్పువచ్చింది. నాడు అంకితభావం కల ఉపాధ్యాయులు గుణాత్మకమార్పుకు దోహదపడ్డారు. అయితే ప్రస్తుతం విద్య కార్పోరేటీకరణకు గురౌతున్నది.

*1.4.2. స్వాతంత్ర్యానంతరవిద్య-- ఒక విహంగావలోకన:*

*1.* జాతీయ విద్యావిధానం: స్వరాజ్యపోరాటంతోపాటుగా దేశీయ విద్యావిధానంగురించిన భావనకూడా పెంపొందింది. ఈ భావన వాస్తవరూపందాల్చేందుకు అధికారిక విద్యావిధానానికి వెలుపల పనిచేసే కొన్ని విద్యాసంస్థలను ప్రయోగాత్మకంగా స్థాపించారు. సెకండరీ విద్యాకమిటీ (1952-53), విశ్వవిద్యాలయ కమిషన్ (1952-53)లు వాటి వాటి పరిధిలో జాతీయ విద్యావిధానాన్ని నిర్వచించాయి. మిగిలిన రంగాల్లో శాస్త్రీయ పరిశోధన, సాంకేతిక, వైద్య, వ్యవసాయ విద్యారంగాల్లో ప్రధానమైన కమిటీల సూచనలమేరకు ఇదేవిధమైన కృషి జరిగింది. అయితే వీటన్నింటికంటే సమగ్రమైన ప్రయత్నం జాతీయ విద్యాకమిషన్ (1964-66) చేసింది. ఈ విద్యాకమిషన్ భావనలో ప్రస్తుతం అమల్లో ఉన్న విద్యావిధానం సాంప్రదాయిక భూస్వామ్య వ్యవస్థ నిర్దేశించిన పరిమితులకులోబడి పాలకుల అవసరాలను తీర్చేందుకు రూపొందినది. ఆధునిక, ప్రజాస్వామ్య, సామ్యవాద సమాజ అవసరాలను నెరవేర్చాలంటే ఇటువంటి సమాజంలో విప్లవాత్మకమైన మార్పులు అవసరం. లక్ష్యాల్లో, బోధనా పద్ధతుల్లో, ప్రణాళికల్లో, విద్యార్థుల పరిమాణం, ఉపాధ్యాయుల ఎంపిక, వృత్తి శిక్షణ వంటి అనేక అంశాల్లో సంస్థాగతమైన మార్పులు అవసరం. అటువంటి జాతీయ విద్యావిధాన రూపకల్పన చేసి, అమలుకు విద్యాకమిషన్ ప్రయత్నించటం జాతీయ విద్యకోసం ఇంతకాలం చేస్తున్న ఆలోచనలకు వాస్తవరూపంగా భావించవచ్చు.

అయితే ఆలోచనల్లో వచ్చిన పరిణామాన్ని గుర్తించాల్సి ఉంది. 1947వరకు జాతీయ విద్యాసంస్థల ఏర్పాటు ప్రభుత్వ వ్యవస్థకు వెలుపల ప్రభుత్వేతర సంస్థల ఆర్థికసహకారం, నియంత్రణతో జరిగేది. అయితే స్వాతంత్ర్యానంతరకాలంలో అలాంటి పరిస్థితిలేదు. పూర్వం జాతీయసంస్థలు సాధారణ వ్యవస్థలో భాగమై ఉండగా ప్రస్తుతం మొత్తం వ్యవస్థను జాతీయంగా రూపొందించే ప్రయత్నం జరుగుతున్నది.

అయితే విద్యాకమిషన్ రిపోర్టును జాతీయ అంతిమనిర్ణయంగా భావించాల్సిన పనిలేదు. అది నాడు విప్లవాత్మకమే అయినా నేటి పరిణామాల దృష్ట్యా దాన్ని అంత విప్లవాత్మకమైనదిగా భావించలేము. వేగంగా మారుతూవస్తున్న ఆధునిక సమాజంలో ప్రజల మారుతున్న ఆశలు, ఆశయాలను అందుకోవాలంటే విద్యావిధానంపైన ఆలోచనలు నిరంతరం కొనసాగుతూ ఉండాలి. అందువల్ల జాతీయ విద్యావిధాన రూపకల్పన అనేది ఒక నిరంతర ప్రక్రియ. ప్రస్తుతం మనకు విద్యావ్యవస్థను పునర్నిర్మించి, అభివృద్ధిపరచి, విస్తృతపర్చేందుకు అవసరమైన పరిజ్ఞానం ఉంది. అయితే మన ఆలోచనలను ఆచరణరూపంలోకి మార్చటం, ఆచరించి చూపటంలోనే మనం వైఫల్యం చెందుతున్నాం. విద్యాభివృద్ధికి సంబంధించి అందరూ ఆమోదించిన ప్రణాళికను అమలుచేయటం ఎందుకు సాధ్యపడటంలేదన్నది ప్రధానంగా పరిశీలించాల్సిన అంశం. అలా అమలు చేయగల్గితే

విద్యారంగంలో మార్పు సాధ్యమౌతుంది.

2. దేశాభివృద్ధిలో ప్రధానసాధనంగా విద్య: ప్రాచీన సంప్రదాయంలో విద్య ఆత్మసాక్షాత్కారానికి ప్రధానసాధనంగా భావించబడింది. ఆధునికకాలంలో దేశాభివృద్ధికూడా విద్య ప్రధానలక్ష్యంగా గుర్తింపుపొందింది. ఈ నమ్మకమే స్వాతంత్ర్యోద్యమకాలంలో జాతీయ విద్యావిధాన రూపకల్పనకు ప్రేరణనిచ్చింది. అందుచేతనే విద్యాకమిషన్ "దేశ భవిష్యత్తు తరగతిగదిలో రూపుదిద్దుకుంటుంది" అని పేర్కొన్నది.

అయితే పరిణామ క్రమంలో విద్య రెండు ప్రధానపాత్రలు పోషించాల్సిఉంది. యధాతధస్థితిని కొనసాగించటంకోసం కాలానుగుణంగా కొన్ని అవసరమైన మార్పులుచేయటం, తద్వారా యధాతధస్థితిని బలీయంచేసి కాపాడటం మొదటిపాత్రకాగా రెండవది జాతి అవసరాలు, ఆశల ఆధారంగా నూతన సామాజిక నిర్మాణానికి రూపకల్పనచేయటం.

ప్రభుత్వ సహాయంతో, ప్రభుత్వ నియంత్రణలో పనిచేసే విద్యావిధానం ఏ సమాజంలోనైనా పాలకుల ప్రయోజనాలను కాపాడేదిగా ఉంటుంది. అందులోజరిగే స్వల్ప మార్పులు, సర్దుబాట్లుకూడా పాలకవర్గాల ప్రయోజనాలకు లోబడే ఉంటాయి. ప్రస్తుతం ఈ దేశంలో ఇదేపరిస్థితి కనిపిస్తున్నది. బ్రిటీష్‌పాలకులు రూపొందించిన విద్యావ్యవస్థ ప్రధానంగా ఇటువంటి వర్గాల ప్రయోజనాలకై ఉద్దేశించినదే. బ్రిటీష్ పాలన ముగియగానే పట్టణ ఉన్నత, మధ్యతరగతి వర్గాలు, ధనికరైతులు, సంపన్న గ్రామీణులు అధికారంలోకి వచ్చిన ప్రధానవర్గాలు. అందువల్లనే మన విద్యావ్యవస్థ వీరి ప్రయోజనాలను కాపాడేదిగానే ఉండిపోయింది. ఈ కారణంగానే ప్రాథమికవిద్యకుమారుగా మాధ్యమిక, ఉన్నతవిద్యలు అధిక ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మన విద్యావ్యవస్థ సామాన్యప్రజల ప్రయోజనాలు కాపాడేదిగా లేకపోవటానికి ఇదికూడా ఒక ప్రధానకారణం. అందువల్లనే "సాంకేతికస్వామ్యం" (Technocracy) ----- సామాన్య ప్రజల ఉత్పాదకశక్తిని పెంచేందుకు వీలుగా ఆధునిక శాస్త్రవిజ్ఞానాన్ని అక్షరాస్యతతో నిమిత్తంలేకుండా ప్రజలందరికి అందించే ప్రయత్నం ----, ఇంకా నిరక్షరాస్యతా నిర్మూలన, 6-14సంవత్సరాల వారికి నిర్బంధ సార్వత్రిక ప్రాథమిక విద్యాపథకం వంటి అంశాలు తగినంత ప్రాధాన్యతను, వనరులను సంతరించుకోలేకపోయాయి.

విద్యను సంస్కరించే ప్రయత్నం సంపూర్ణంగా విజయవంతంకావటం కష్టసాధ్యమైన విషయం. అయితే విద్యావిధాన సహాయ సహకారాలు లేకుండా సమాజంలో నిర్మాణాత్మకమైన మార్పులుచేసే ప్రయత్నం విజయవంతంకాదు. అసమానతలు, సంకుచితత్వాల ఆధారంగా పనిచేస్తున్న సామాజిక నిర్మాణాన్ని న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వాలపై పనిచేసే ఆధునిక సమాజంగా మార్చాలంటే ప్రస్తుత విద్యావిధానాన్ని మార్పుచేసి, జాతీయ అవసరాలు, ఆశయాలకు అనుగుణంగా ఒక నూతన విద్యావిధానాన్ని రూపొందించాల్సి ఉంది.

రాజకీయంగా, ఆర్థికంగా సామాజిక నిర్మాణాన్ని మార్చే సమాంతర యత్నాల మద్దతులేని కారణంగానే విద్యావ్యవస్థను పునర్నిర్మించేందుకు చేసే ప్రయత్నాలు విఫలం చెందుతున్నాయన్నది వాస్తవం. ఈ రెండింటిని సమన్వయపరచగలిగితేనే మార్పు సాధ్యమౌతుంది.

3.మౌలిక ప్రాధాన్యతలు: విద్యావ్యవస్థలో మౌలికమైన అంశాల్లో అంకితభావంలోపించటం జాతీయ విద్యావిధానరూపకల్పనలో వైఫల్యానికి ప్రధానకారణం. విద్యాకమిషన్ ప్రకటించినప్రకారం రాజ్యాంగంలో ప్రకటించిన నూతన సమాజసృష్టికి తోడ్పడేట్లుగా ప్రజల ఆకాంక్షలు, అవసరాలు

దృష్టిలోఉంచుకొని విద్యావ్యవస్థను రూపొందించటం దేశముందున్న ప్రధానకర్తవ్యం. 1947లో విద్యావ్యవస్థ పరిధి చిన్నదికావటంతో మార్పులు సులభంగా సాధ్యమైఉండేవి. అలా జరగకపోవటంతో బ్రిటీష్‌పాలననుంచి సంక్రమించిన విద్యావిధానం కొద్దిమార్పులతో విస్తరించేందుకు వీలుకల్పించినట్లయింది. ఫలితంగా సమస్య మరింత సంక్లిష్టమైంది. ఈ విధానంవల్ల ఏర్పడుతున్న విషపరిణామాలను నివారించాలంటే విద్యావిధానంలో మార్పుచేయటం తప్పనిసరి.

విద్యా పునర్నిర్మాణంలో రెండవప్రాధాన్యత ప్రమాణాల పెరుగుదల. అన్ని అధ్యయనాంశాల్లో చెప్పుకోదగ్గ మెరుగుదల ఉన్నప్పటికీ ప్రమాణాల విషయంలో తగిన శ్రద్ధచూపకపోవటంవల్ల తక్కువస్థాయి సంస్థలు ఏర్పడేందుకు అవకాశం కలిగింది.

అయితే గుణాత్మకాభివృద్ధికి నిధుల అవసరం ఎంతైనా ఉంది. అది పెద్ద సమస్యకాదు. విద్యాకేటాయింపుల్లోనే ఇందుకు కొంతకేటాయించవచ్చు. కానీ గుణాత్మకాభివృద్ధికి డబ్బుకంటే మానవశ్రమ ఎక్కువగా అవసరం. విద్యార్థుల ప్రతిభను వెలికితీయటంలో ఉపాధ్యాయుల అంకితభావం, విద్యార్థుల ప్రయోజనాలతో మమేకంకాగలవ్యక్తిత్వం, విద్యార్థుల శ్రద్ధ, విద్యలో నాణ్యత వీటన్నింటిపైన విద్యాప్రమాణాలు ఆధారపడి ఉన్నాయి. ఉపాధ్యాయులను విద్యా ప్రణాళికలో, అభివృద్ధిలో భాగంచేయటం. కఠినశ్రమ, అంకితభావం, ఆదర్శభావాలతో నిండిన వాతావరణం కల్పించటం ద్వారాన్నే గుణాత్మకమైన అభివృద్ధి వీలౌతుంది.

మూడవ ప్రాధాన్యత వసతులను విస్తృతపర్చటం, నాణ్యతలను మెరుగుపర్చటం, విద్యావిధానాన్ని మార్పుచేయటం. వీనిలో ఏ ఒక్కదాన్ని మరొదానికంటే ప్రముఖమైనదిగా చెప్పలేము. అవసరమైన నిధులులభిస్తే విద్యారంగంలో నాణ్యతను మెరుగుపర్చటం సులభసాధ్యమే. అయితే ఇక్కడ సమస్య రెండు విధాలు. ప్రాథమికస్థాయిలో అయితే విద్యను విస్తృతపర్చడమే అసలు లక్ష్యం. సార్వత్రిక ప్రవేశాలు, క్రమబద్ధీకరణ క్లిష్టమైన చర్యలే. ఈ విషయాల్లోకూడా నాణ్యతను మెరుగుపర్చడం, మానవశ్రమ రెండూ ప్రధానమైన అంశాలే. మరోవైపు మాధ్యమిక, ఉన్నత స్థాయి విద్యారంగంలో ప్రణాళికారహితంగా, అతిగా జరుగుతున్న విస్తృతిని నియంత్రించడం నిజమైన అవసరం. ఇది కూడా క్లిష్టమైన సమస్యే. అయితే మనం ఈ రెండువిషయాల్లోకూడా వైఫల్యం చెందాము. ప్రాథమికస్థాయిలో అవసరమైన విధంగా విద్యారంగాన్ని విస్తృతపర్చలేకపోయాం. మాధ్యమిక, ఉన్నత విద్యాస్థాయిలో అసంబద్ధమైన వ్యాప్తిని నియంత్రించలేక పోయాం. ఈ రెండు అంశాలు మనం అత్యంత జాగ్రత్తవహించాల్సినవి.

4. పెట్టుబడులపట్ల మితిమీరినశ్రద్ధ: స్వాతంత్ర్యానంతరకాలంలో విద్యా పునర్నిర్మాణం విషయంలో పెట్టుబడులకు మితిమీరిన ప్రాధాన్యతనివ్వటం ఒక పెద్ద బలహీనత. విద్యారంగానికి అధికమొత్తంలో కేటాయింపులు లేకపోవటమే విద్యావిధానవైఫల్యానికి ప్రధానకారణమన్న ఒకభావన బలంగా ఉండటం ఇందుకు ప్రధానకారణం. విద్యాప్రణాళికలన్నింటిలో నిధుల అవసరం ఉంటుందన్నది వాస్తవం. అయితే విద్యాప్రణాళికలో ఆర్థికాంశం ఉండటంవేరు, మౌలికంగా ఆర్థికప్రణాళికైఉండి ఒక ప్రత్యేకమైన విద్యాప్రణాళికపైన ఇంతమొత్తం వెచ్చించాలని తలచటం వేరు.
బ్రతకటం కోసం తినటానికి, తినటంకోసం బ్రతకటానికి మధ్య ఉన్న తేడాలాంటిది ఇది. ఈ మౌలికమైన వైరుధ్యాన్ని గుర్తించకుండా అన్నిప్రణాళికలకు మనం అసాధారణమైన ఆర్థికకోణాన్ని ప్రతిపాదిస్తున్నాం. ప్రణాళికలోని మౌలికాంశంకంటే దాని ఖర్చు మనకు ప్రధానంగామారిపోయి, అదే ధోరణి మన ఆలోచనల్లో భాగమైపోయింది.

విద్యాభివృద్ధికి డబ్బు అవసరమైనప్పటికీ, కేవలం డబ్బు ఖర్చుచేయటంద్వారానే అభివృద్ధి సాధ్యంకాదన్న అంశం మరవకూడదు. ఇలా డబ్బుకిచ్చే అధిక ప్రాధాన్యత అధికవృధాకు దారితీస్తున్నది. ఆలోచనలను ఆచరణలో పెట్టటంకంటే డబ్బు ఖర్చుచేయటం సులభం. ఆలోచనలను ఆచరణలో పెట్టకుండా చెప్పుకోదగ్గఫలితాలు సాధ్యపడవు. ఖర్చుకు అధికప్రాధాన్యతనివ్వటానికి మారుగా మంచి ప్రణాళికలు, అంకితభావంతోకూడిన మానవప్రయత్నానికి అధికప్రాధాన్యతనివ్వటం అవసరం.

5. స్వదేశీఉద్యమ ప్రాధాన్యత : స్వాతంత్ర్యానంతరకాలంలో విద్యాపునర్నిర్మాణం కోసం మనం అమలుచేస్తున్న కార్యక్రమాలన్నింటికీ అవసరమైన ఆలోచనలు, ప్రణాళికలకోసం విదేశీనైపుణ్యంమీద మితిమీరి ఆధారపడటంతో అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. 1947కి పూర్వం మనం ఇంగ్లాండ్‌పైన ఇలా ఆధారపడ్డాం. అయితే స్వాతంత్ర్యానంతరం ఇది కొంతమేరకు తగ్గినా ఈ విధంగా ఆధారపడే మనస్తత్వం మన ఆలోచనలపై ఆధిపత్యం వహించటం మానలేదు. అందుచేతనే తరువాతి కాలంలో రష్యా, అనంతరం అమెరికా ఇలా ఏదోఒక దేశం మన ఆలోచనలపై ఆధిపత్యం వహిస్తూనే ఉంది. ఈ విధమైన మేధోబానిసత్వం వినాశకరమైన పరిణామాలకు దారితీస్తుంది.

సామాజిక నిర్మాణ పరంగాకాని, విద్యాభివృద్ధిలోకాని విదేశీ నమూనాలపై ఆధారపడటం సరైనదేనా అన్న అంశం తీవ్రంగా ఆలోచించాల్సి ఉంది. భారతదేశానికి అవసరమైన సామాజిక నిర్మాణరూపకల్పనకు సరైన పరిష్కారాన్ని సూచించినవ్యక్తి మహాత్మాగాంధీ. అయితే గాంధీ స్వదేశీభావన అంగీకారం పొందలేకపోయింది. అసంబద్ధమైన పాశ్చాత్య పారిశ్రామిక, వినియోగదారీ సమాజాలు మనకు నమూనాలుగా నిలిచాయి. అదేరీతిలో పాశ్చాత్య విద్యావిధానాలు మన లక్ష్యాలైనాయి. ఈ విధంగా పాశ్చాత్య సమాజాలను, వారి విద్యావిధానాలను అనాలోచితంగా అనుకరించటం పెద్దతప్పిదం. ఆ సమాజాల స్వభావంకానీ, వారి విద్యావిధానంకానీ మనకు సరిపడేవికావు. ఇందుకుగాను ఒక స్వదేశీ భావన అవసరం. మనకు అవసరమైన సమాజస్వభావాన్ని నిర్ణయించుకునేందుకు ఇది దోహదకారి కాగలదు. ఆ సమాజం ఒకవైపు శాస్త్ర, సాంకేతిక విజ్ఞానంతోను, భారతదేశ జీవలక్షణాలైన నైతిక విలువలతోను జతకూడి ఏర్పడినదై ఉంటుంది. మన విద్యావిధాన స్వభావంకూడా ఇందులో ఇమిడి ఉంటుంది. ఈ రెండు ప్రయత్నాలు నిబద్ధతతో జరిగినప్పుడే రాజ్యాంగపీఠిక సూత్రాలకనుగుణమైన భారతసమాజాన్ని, దాని అవసరాలు, సామర్థ్యాలకు అనుగుణమైన విద్యావిధానాన్ని రూపొందించగల్గుతాం.

# 2. తెలుగుసాహిత్యం : విద్య : వస్తుగత విమర్శ

“వస్తువు, రూపం, భాషల్లో శతాబ్దకాలంపాటు తెలుగుసాహిత్యం ప్రయాణించిన దూరం నిజానికి తెలుగుసమాజం ప్రయాణించిన దూరం” (సి.వి.సుబ్బారావు.1986: v).

అనేభావన సమాజంలోని మార్పుకు సాహిత్యంలోని మార్పుకు (వస్తు, రూపాలలో)గల సన్నిహిత సంబంధాన్ని స్పష్టంగా వ్యక్తీకరించగలిగింది.

చలనశీల స్వభావం కలిగిన సమాజంలో నిరంతరం మార్పులు చోటుచేసుకుంటూఉంటాయి. ఫలితంగా జీవితంలో, అనుభవాలలో, ఆలోచనలలో మార్పులు సంభవిస్తాయి. ఆలోచనలలోవచ్చేమార్పు చైతన్యంలోమార్పుకు దారితీస్తుంది. ఈ మార్పులన్నీ సాహిత్యంలో, అభివ్యక్తీకరణ పద్ధతులలో మార్పులకు కారణమవుతాయి. అంటే సమాజంలోని మార్పులు సాహిత్యంలోని (వస్తు,రూపాలలో) మార్పుకు ప్రేరణనిస్తాయి. సాహిత్యంలోని (వస్తు, రూపాలలో) మార్పు సమాజంలోనిమార్పును సూచిస్తుంది. తెలుగుసాహిత్యంలో ఈ ధోరణిని గుర్తించవచ్చు.

సాంప్రదాయ సాహిత్యంనుంచి నేటి ఆధునిక సాహిత్యంవరకు వచ్చిన రచనలను పరిశీలిస్తే సాహిత్యంలో వస్తుపరంగాను, అభివ్యక్తీకరణ పద్ధతులలోను వస్తున్న మార్పు సామాజిక మార్పులను ప్రతిఫలించటాన్ని మనం స్పష్టంగా గుర్తించవచ్చు.

అయితే ఈ వస్తు, రూపాలనేవి ఒక దానినుండి మరొకదాన్ని వేరుచేయలేని రెండు విభిన్న అంశాలు. ఎటువంటి సాహిత్యంలోనైనా సామాజిక వస్తువు, కళాత్మకరూపం విడివడనటువంటివి.

“Marx himself believed that literature should reveal a unity of form and

content" (Terry Eagleton.1976: 20)

వస్తువు, రూపం - ఈ రెండింటికలయికే రచన. వస్తువును కళాత్మకంగా వ్యక్తంచేసే విధానమే రూపం. వస్తువు ఎంత అభ్యుదయకరమైనదైనా దానికి అనుగుణమైన రూపం లేకపోతే ఆ విషయం ఉద్దేశించిన రీతిలో పాఠకులకు చేరదు. వస్తురూపాల మధ్యగల అంతర్గత సంబంధాన్ని హెగెల్ స్పష్టంగా వ్యక్తీకరించాడు.

"Content is nothing but transformation of form into content, and form is nothing but transformation of content into form." (Terry Eagleton.1976: 22)

సాహిత్యనిర్మాణంలో వస్తు,రూపాలనేవి సమన్వయ ప్రాధాన్యతగల అంశాలు. స్వభావం ఆధారంగా స్వరూపం ఏర్పడుతుందన్న మౌలికభావన ప్రాతిపదికగా వస్తువులోమార్పు రూపంలోమార్పుకు కారణమవుతుందని గ్రహించవచ్చు. అంటే రూపంలోమార్పు వస్తువులో మార్పును సూచిస్తుంది. వస్తురూపాల ఐక్యత అనేది అనివార్యం. వస్తువు దానికి అనుగుణమైన కళాత్మక రూపాన్ని పొందినపుడు వస్తురూపాలమధ్య సమన్వయం కుదురుతుంది. సరైన సాహితీరూపంలో వ్యక్తీకరణ జరిగితేనే సామాజికచైతన్యం కూడా ప్రాముఖ్యత సంతరించుకుంటుంది.

వస్తు, రూపాలలో వస్తువే సామాజిక పరిస్థితులకు అనుగుణంగా వెంటవెంటనే మారుతుంటుంది. అయితే దానికి అనుగుణంగా అంతేవేగంతో రూపంలో మార్పురాదు. ఈ కారణంగా వస్తురూపాలమధ్య వైరుధ్యం ఏర్పడుతుంది. ఈ వైరుధ్యాన్ని అధిగమించి వస్తు, రూపాలమధ్య సమన్వయం సాధించగలిగినప్పుడే రచనలో పరిపూర్ణత ఏర్పడుతుందని భావించవచ్చు. అయితే ఈ వస్తురూపాలను కేవలం సైద్ధాంతికంగా మాత్రమే వేరుచేసి చర్చించగల అవకాశం ఉంది.

ఒకే వస్తువు అనేక రూపాలలో ప్రదర్శించబడవచ్చును. ఒక విషయాన్ని వ్యక్తంచేయటానికి ప్రత్యేకించి ఒకరూపం ఉండదు. అయితే ఒక ప్రత్యేక రూపంలో మాత్రమే ఒక వస్తువు పరిపూర్ణంగా వ్యక్తీకరించబడుతుంది. అప్పుడే సాహిత్యంలో సమగ్రమైన ఆవిష్కరణ జరిగినట్టుగా భావించాలి. సాహిత్య విమర్శలో వస్తు, రూప చర్చలు వేరుగా కనిపించినా అవిరెండూ ఐక్యంగానే సాగుతాయి.

ఈ నేపథ్యంనుంచి సాహిత్యాన్ని పరిశీలించినట్లయితే అందలి వస్తు, రూపాల మధ్య సమన్వయాన్ని గుర్తించే అవకాశం కలుగుతుంది. సాహిత్యంల్లో ఒక వస్తువు అనేకరూపాలలో వ్యక్తీకరించబడటం గమనించవచ్చు. అయితే కొన్ని ప్రత్యేక వస్తువులు, కొన్ని ప్రత్యేకరూపాలలో వ్యక్తీకరించబడినప్పుడే పరిపూర్ణత సిద్ధిస్తుంది. అలా వస్తురూపాల మధ్య సమన్వయం కుదిరినప్పుడే అది ఉత్తమ సాహిత్యంగా గుర్తింపుపొందుతుంది.

**సాహిత్యం : వస్తువు :**

మానవుడు, మానవ సంబంధాలు, మానవుని సామాజిక జీవితం, సామాజిక జీవితంలోని విభిన్న వైరుధ్యాలు -- వీటన్నిటి కళాత్మక ప్రతిఫలనమే సాహిత్యంలో వస్తువు అవుతుంది.

సమాజంలోని వాస్తవికత సాహిత్యంలో కళాత్మకంగా ప్రతిఫలిస్తుంది. ఈ ప్రతిఫలనం రచయిత దృక్పథానికి అనుగుణంగా రూపొందుతుంది. ఒకే యితివృత్తం వేరువేరు దృక్పథాలుగల రచయితల రచనలలో విభిన్న వస్తువులుగా రూపుదిద్దుకొనటం మనం గమనించవచ్చు. ఇతివృత్తం యొక్క చారిత్రకత, రచయిత సామాజిక చైతన్యం ఇతివృత్తాన్ని వస్తువుగా రూపొందించటంలో ప్రముఖపాత్ర వహిస్తాయి.

వస్తువు తనకు అనుగుణమైన రూపాన్ని రూపొందించుకుంటుందని, అందుచేత రూపంలో దోషం వస్తుగత దోషం కారణంగా ఏర్పడేదని హెగెల్ భావన. "Every definite content determines a form suitable to it. Defectiveness of form, arises from defectiveness of content." (Terry Eagleton. 1976: 20).

సమస్యలను యధాతథంగా వ్యక్తీకరించటం కాకుండా సమస్య మూలభావనను ముందుంచి మానవుని చైతన్యవంతుని చేయటం సాహిత్య లక్ష్యంగా భావించవచ్చు. ప్రత్యేకించి భారతీయ సాహిత్యం ప్రాచీనకాలంనుంచి మతభావజాలంతో నిండి ఉండటం గమనించవచ్చు. పునరుజ్జీవన దశలో సాహిత్యం మతపరమైన యితివృత్తాలనే స్వీకరించినా వాటిని మానవతావిలువలు వ్యక్తంచేసేందుకు ఉపయోగించింది. తరువాతికాలంలో సామాజికాంశాలను ఇతివృత్తాలుగా స్వీకరించి వానిలోని విభిన్నకోణాలను ప్రతిబింబించసాగింది. ఇందులో భాగంగానే తెలుగుసాహిత్యం విద్యారంగంలోని విభిన్న సమస్యలను తన రచనల్లో ప్రతిఫలింపజేసింది.

ఇలా రచనలో చిత్రించబడిన వివిధ సామాజిక అంశాలు, వాటి మూల్యాంకనమే వస్తువుగా రుపొందుతుంది. వస్తురూపాలు గతితార్కిక సంబంధం కలిగినవిగా భావించినా 'రూపం' రూపకల్పనలో వస్తువు ప్రాధాన్యత స్పష్టంగా గుర్తించవచ్చునన్నది విమర్శకుల స్థిర అభిప్రాయం.

"Marxist criticism seems form and content as dialectically related, and yet wants to assert in the end the primacy of content in determining form." (Terry Eagleton.1976 : 23)

ప్రపంచవ్యాప్తంగా విభిన్న రంగాలలో వస్తున్న మార్పులు భారత సామాజిక వ్యవస్థపైన తమప్రభావాన్ని చూపాయి. ఫలితంగా భారతీయ సమాజంలో ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో నూతనధోరణులు ప్రవేశించాయి. ఈ క్రమంలోనే విద్యారంగంలోకూడా అనేక మార్పులు చోటుచేసుకోసాగాయి. ఈ మార్పులు విద్యావిధానంతోపాటుగా వ్యవస్థ స్వరుపస్వభావాలను కూడా మార్చేవిగా రూపొందసాగాయి. ఈ దశలో విద్యావిధానంలో చర్చకువచ్చిన అనేక సమస్యలను తెలుగు సాహిత్యం వస్తువులుగా స్వీకరించింది. తెలుగుసాహిత్యం వస్తుపరంగా చేసిన ఈ విమర్శలో రెండు ప్రధాన పార్శ్వాలు కనిపిస్తాయి. అవి ఒకటి సామాజికమైనది కాగా రెండవది మనోవిశ్లేషణాత్మకమైనది.

### *2.1. సామాజిక విమర్శ:*

విద్యారంగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలవెనుకగల సామాజిక బాధ్యతను నేపథ్యంగా చేసుకుని వచ్చిన రచనల్లో ఈ సామాజిక విమర్శ అధికంగా కనిపిస్తుంది. వీనిలో విద్యావ్యవస్థలో చోటుచేసుకుంటున్న పరిణామాల వెనుకగల సామాజిక కోణం బలీయంగా ప్రతిఫలిస్తుంది. ఇలా సామాజిక కోణం ప్రతిఫలించే అంశాలు. విద్యావ్యవస్థలో అనేకం కనిపిస్తాయి. అందులో ప్రధానమైన అంశాలు

విద్య :సామాజిక వైరుధ్యాలు

విద్య : తల్లిదండ్రుల ప్రభావం

మేధోవలస

స్త్రీవిద్య

పరిశోధన

శ్రమ-ప్రతిభ-రిజర్వేషన్లు

వ్యాపారాత్మకవిద్య

**2.2. మనోవిశ్లేషణాత్మక విమర్శ:**

ప్రతి పరిణామానికి సామాజికప్రేరణ తప్పనిసరిగా ఉంటుందన్నది వాస్తవం. అయితే ఈ సామాజిక పరిణామాలు వ్యక్తి స్థాయిలో మానసికంగా చూపే ప్రభావాన్ని చిత్రించిన రచనల్లో మనోవిశ్లేషణాత్మకత గోచరిస్తుంది. ఈ మనోవిశ్లేషణాత్మక ప్రతిఫలనం విద్యావ్యవస్థకు చెందిన కొన్ని అంశాల్లో బలీయంగా ఉంటుంది. అవి

పాఠ్యపుస్తకాల భారం

క్రమశిక్షణ: హక్కులు

దండనలు

పోటీతత్త్వం

లైంగికవిద్య

పరీక్షా విధానం: మూల్యాంకనం

ఉపాధ్యాయులు : విభిన్న పార్శ్వాలు

విద్యార్థులు : వివిధ పార్శ్వాలు

===============

*సామాజిక వైరుధ్యాలు*

భారతీయ సామాజికవ్యవస్థలో 'కులం'పాత్ర గణనీయమైనది. కులానికీ, వర్గానికీ మధ్య ఏర్పడే ఘర్షణలకారణంగా నిచ్చెనమెట్ల సామాజికనిర్మాణం మరింత సంక్లిష్టంగా రూపొందుతోంది. కులం, వర్గం ఈ రెండింటిలో ఏర్పడే అంతర్గత వ్యత్యాసాలు సామాజికవ్యవస్థలో అంతరాలను పెంచాయి. ఒకే ఆర్థికవర్గానికి చెందిన వ్యక్తులమధ్య కులం అడ్డుగోడగా నిలిచి వైరుధ్యాలు సృష్టిస్తే, ఒకే కులానికిచెందిన వ్యక్తులమధ్య ధనిక, పేద వర్గ తారతమ్యాలు వైరుధ్యాలకు కారణమైనాయి.

కులంలో అంతర్గతంగా చోటుచేసుకునే వర్గసంఘర్షణలు, వర్గంలో అంతర్గతంగా జరిగే కులఘర్షణలు వివిధ్యాపరంగా అనేక సామాజికాంశాలను వెలికితెచ్చాయి.

----------ఆర్థికంగా వెనుకబడ్డ అగ్రవర్ణాలు విద్యా, ఉద్యోగావకాశాలకు దూరంకావటానికి కులప్రాతిపదికపై ఏర్పడిన రిజర్వేషన్లను కారణంగా భావించటం.

----------ఆర్థికంగా ఉన్నతస్థితికెదిగినవారుకూడా కులంపేరుతో రిజర్వేషన్లు వినియోగించుకోవటాన్ని, తద్వారా అవేకులాల్లోని పేదవర్గాలకు ద్రోహంచేయటాన్ని ప్రశ్నించటం.

----------పేదరికానిదంతా ఒకే కులంగా భావించాలన్న వర్గస్పృహ.

----------పేదరికంకంటే కులపరమైన అణచివేతే వ్యక్తుల ఆత్మగౌరవాన్ని కించపరిచే తీవ్రసామాజికసమస్యగా భావించే కులస్పృహ.

----------పేదరికంవల్ల వర్గపరమైనఅణచివేత, నిమ్నకులంకారణంగా కులపరమైన అణచివేత -- ఇలా

రెండురకాలుగా బాలలు అణచివేతకు గురికావలసిరావటం.

ఇలా విభిన్నకోణాల్లో కులపరంగా, వర్గపరంగా జరిగే అణచివేత స్వరూపస్వభావాలను తెలుగుసాహిత్యం వైవిధ్యభరితంగా చిత్రించింది.

కులస్పృహకు, వర్గస్పృహకుమధ్య వైరుధ్యాలను, వాటిపై విభిన్న ఆలోచనలను ముందుకుతెచ్చిన రచన 'వర్ణక్రమాలు'. రిజర్వేషన్లపేరుతో తమ అవకాశాలను నిమ్నకులాలు చేజిక్కించుకుంటున్నాయని అగ్రకులపేదలు భావిస్తే, నిమ్నకులాల్లోని ధనికవర్గాలు వర్గపరంగా ధనికులతోను, కులపరమైన ప్రయోజనాలకోసం కులంతోను ఐడెంటిఫై అయ్యేందుకు ప్రయత్నించటం ఇందులో ప్రధానంగా ప్రస్తావించారు.

దయామణికి సూటిగా ఏం సమాధానం చెప్పలేక, పెళ్ళి చెయ్యాలన్నా, పీనుగు లేవాలన్నా మానాభిమానాలు వదిలేసి, 'భిక్షాందేహి' అని నలుగురికాళ్ళూ పట్టుకోవాల్సినవాళ్ళం. మాకేమన్నా ఆస్తులా పాస్తులా? కాలేజీల్లో కోటాలా? ఉద్యోగాల్లో రిజర్వేషన్లా? ఏవుంది నా శ్రాద్ధం......' అంటూ తనకు అలవాటైన పద్ధతిలో ఫ్లాంక్ నుంచి ఎటాక్ మొదలుపెట్టారు శర్మగారు.

'ఆస్తిలేకపోతేనేం? వంశపారంగా వస్తున్న తెలివితేటలున్నాయి మీకు! హరిజనుడికేమో ఒక కాలు పొలంలోనే ఉంది. అలాంటి వాణ్ణి మెరిట్‌పేరుతో మీతో సమానంగా పరిగెత్తమంటారు. పైగా అది న్యాయం అంటారు. అమ్మో! ఎన్ని తెలివితేటలు? ఎంతైనా కరణం బుద్ధి పోనివ్వకున్నారు కాదు శర్మగారు' అంది దయామణి వెటకారంగా.

'మీరేమీ అనుకోకపోతే ఓ మాట అడగనా?' -- రాజుల లక్ష్మిగారు కలుగజేసుకుంటూ అన్నారు. ' మీరు టీచరు. మీ ఆయన క్లాస్ టు గెజిటెడ్ ఆఫీసరు. మీ విజయని మా పిల్లలకంటే ఎక్కువగా రెసిడెన్షియల్ కాన్వెంటులో చదివించారు. అమ్మాయికి మెడిసిన్లో సీటొచ్చింది..... రేపు డాక్టరవుతుంది......సమాజంలో ఉన్నతస్థానం చేరుకున్న మీలాంటివారికి కూడా రిజర్వేషన్లు ఏమిటి చెప్పండి......' నవ్వునవ్వుగా అంటించింది. ఆ.ప. లక్ష్మిగారి అబ్బాయికి మంచిమార్కులొచ్చినా ఏ ఇంజనీరింగ్ కాలేజీలోనూ సీటురాలేదు. అందుగురించి ఆవిడకి చాలా కష్టంగా ఉంది.

'వాళ్ళూ, వీళ్ళూ మీకు అన్యాయం చేశారని మీరు ఆవేశపడుతున్నారు. కాని మీరు మీవాళ్ళకు ఏం చేస్తున్నారో కొంచెం ఆలోచించండి......' రాజుల లక్ష్మిగారు ఊరుకోలేదు. దయామణి వాళ్ళు ఈమధ్య మారుతీకారు కొనుక్కున్నందుకు ఆవిడకి అసూయగా ఉంది. ఆ ప్రస్తావన తీసుకొస్తూ అంది -- 'కార్లలో దూసుకుపోయే మీలాంటి వాళ్ళు పొలంలో ఒక కాలు, స్కూల్లో ఒక కాలు ఉండే దళితులతో సమానమెలా అవుతారు? వాళ్ళ పేరుచెప్పి తరతరాలుగా ప్రత్యేక సౌకర్యాలు మీరే అనుభవించడం మీ సోదరులకి ద్రోహం చేసినట్టు కాదా?' (తోలేటి జగన్మోహనరావు, వర్ణక్రమాలు, వ్యక్తిత్వవికాసకథలు, పే 195-200)

అయితే కాలక్రమంలో సామాజికంగా ఉన్నతకులాల్లోని కొందరు ఆర్థికంగా అట్టడుగుస్థాయికి చేరారు. నిమ్నకులాల్లోని కొందరు ఆర్థికంగా ఉన్నతస్థితినిపొందారు. ఇది ఆయాకులాల్లో పేద, ధనికవర్గాలమధ్య అంతరాల పెరుగుదలకు కారణమైంది. రిజర్వేషన్లవంటి ప్రభుత్వసౌకర్యాలను వినియోగించుకుని ఉన్నతస్థాయికి ఎదిగిన నిమ్నకులాల్లోనివారు కులప్రాతిపదికపై పదేపదే రిజర్వేషన్లుపొందుతుండటంతో అగ్ర, నిమ్నకులాల్లోని పేదవర్గాలకు ప్రభుత్వ విద్యా, ఉద్యోగసౌకర్యాలు అందకుండాపోయాయన్నభావన బలంగా వినిపిస్తోంది. ఈ అంశం ప్రధానకథనంగా వచ్చిన రచనే 'మేధావులారా ఆలోచించండి'. ప్రభుత్వసౌకర్యాల కల్పనకు కులాన్నికాకుండా, వర్గాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలన్నది ఇందులో మూలభావన. అందుకే పేదరికానిదంతా ఒకేకులమన్న అభిప్రాయం ఇందులో వ్యక్తమైంది. అలా జరగనిపక్షంలో ఆర్థిక వ్యత్యాసాలు మరింతపెరిగే ప్రమాదం ఉందని, పర్యవసానాలు భయంకరంగా ఉంటాయని విద్యావ్యవస్థలోని అవకతవక పద్ధతులకువ్యక్తులు బలికాకతప్పదన్నది ఇందులో ప్రధానాంశం.

అవును. సుబ్బయ్యశాస్త్రి పుట్టినప్పటినుంచి దురదృష్టవంతుడే. లేమిలో పుట్టి లేమిలో పెరిగి, ఇంటింటా భిక్షమెత్తి కొన్నాళ్ళు వీధిబడిలోనూ, కొన్నాళ్ళు దీక్షితులుగారి గురుకులంలోనూ కష్టపడి చదువుకున్నాడు. మేధస్సు కింత వికాసాన్ని తెచ్చిపెట్టడం తప్ప కాలేకడుపుకు కసింత గరిటెడు గంజికూడా పోయలేదన్న విషాద సత్యాన్ని ఆలస్యంగా తెలుసుకున్నాడు.

కృష్ణ కాన్వొకేషన్ ఫోటో చూస్తున్న శాస్త్రిగారి కళ్ళు చెమ్మగిల్లాయి. ఓ నిరుపేద బ్రాహ్మణుడి కొడుకు... అలా బంగారు పతకంతో పరమపట్టభద్ర పట్టా పుచ్చుకుంటున్న ఆ అద్భుత దృశ్యం వెనుక....

ఎన్నెన్ని కష్టాలు దాగున్నాయో...... ఎన్నెన్ని కన్నీళ్ళు కాల్వలున్నాయో.... కన్నవారి ఎంతటి ఆకలి ఘోషలున్నాయో...... ఎందరి అవహేళనలూ, ఛీత్కారాలూ దాగున్నాయో....... ఎంతటి నిశ్శబ్ద అవమానాగ్నులు ప్రజ్వరిల్లినాయో......... ఎంతటి వేదన.... ఆ వేదన దాగుందో... ఎంతటి ఆకలి... ఆక్రోశం దాగుందో--- అవన్నీ నిశ్శబ్దంగా భరించిన ఆ బీద తండ్రికే తెలుసు! అవన్నీ ముఖ్యంగా అనుభవించిన ఆ నిరుపేద విద్యార్థికే తెలుసు!! ------------

ఫలితం మామూలే! డబ్బు జయించింది. రాజకీయం జయించింది. అంతేకాదు -- కొందరికి కులం బలం. తనకు అదే వ్యాకులం.

ఎన్నెన్నో చిత్రాలు జరుగుతున్న ఈ దేశంలో 'కులాల పేరుమీద' మనుషుల్ని విడదీయడమే కాదు. ఒకరి జీవితాన్ని అందలాలెక్కించగలరు..... మరొకరి జీవితాన్ని నేలనేసి కాలరాయనూగలరు. ఈ ఇంటర్వ్యూలోనూ అదే జరిగింది.

ఓడిన కృష్ణ -- పుట్టినప్పట్నుంచి -- ఆర్థికలేమితో నలుగుతూ చదువుకున్నా అతనిది అగ్రకులం కావడం దెబ్బకొట్టింది.

గెలిచిన అభ్యర్థులలో కటికదరిద్రం అనుభవించినవారూ ఉన్నారు. ఎండకన్నెరుగకుండా, ఆకలికోరల పదునెంతో తెలియకుండా, కార్లల్లో తిరిగి ఖరీదైన కళాశాలల్లో చదువుకుని, అత్తెసరు మార్కులతో మాత్రమే పాసైన వారూ ఉన్నారు. వారిలో కొందరికి "కులం" సాయపడింది.

".... వాడి పరిస్థితి చూస్తుంటే గుండెలు బాధతో విలవిలలాడి పోతున్నాయి..... వాడు చిరునవ్వే మరచి చాలా కాలమయ్యింది. ముప్పైరెండేళ్ళకే వాడు అరవైఏళ్ళ అకాల వృద్ధుడైపోయాడు. ఎలా... ఎలా.... ఎలా ఎదుర్కోవాలి ఈ క్లిష్ట పరిస్థితిని.... ఛీ....ఛీ వాడిని పెద్దచదువులు చదివించి ఘోరమైన పొరపాటు చేశాను....ప్స్..." ----------------

పెంచెలయ్యగారి బాల్య జీవితానికి పూర్తి భిన్నంగా, పూర్తి ఆర్థిక వెసులుబాటుతో, సాంఘిక సుస్థితిలో పెరిగిన ఆయన సంతానానికి పేదరికం తెలియదు. ఒకప్పుడు ఓబయ్య పడిన కష్టాలను గురించి కానీ, ఇప్పుడు సుబ్బయ్యశాస్త్రి పడుతున్న బాధలను గురించికానీ వారు విచారించే అవకాశంలేదు. పేదరికానిది ఒకే కులమన్న సత్యం వారికి అర్థంకాదు. ----------------

తన కొడుకు అకారణంగా ఈ వ్యవస్థలోని కొన్ని అవకతవకలకు బలైపోయాడన్న తీవ్రవ్యథతో వ్యవస్థమీద ప్రచండమైన కోపంతో శాస్త్రిగారు పేలడానికి సిద్ధంగా వున్న అగ్నిపర్వతంలా తయారయ్యారు. కనిపించిన ప్రతి మేధావితోనూ, ఈ వ్యవస్థలోని అవకతవకల్ని గురించి అనర్గళంగా ఉపన్యసిస్తున్నారు శాస్త్రిగారు. " మేధావులారా! ఆలోచించండి. పేదరికానిది ఒకే కులం" అంటూ వివరిస్తూనే ఉన్నారు. (మధురాంతకం, మేధావులారా!ఆలోచించండి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 14-3-'84, పే 28-33)

అగ్రవర్ణాల్లోని పేదరికాన్ని ప్రభుత్వం గుర్తించకపోతే వారుఎంచుకునే ప్రత్యామ్నాయమార్గాలెంత దుర్మార్గంగా ఉంటాయో చిత్రించిన రచన 'దుర్మార్గం'. ఆర్థికంగా తోడ్పాటునందించలేని తన దుస్థితికి చింతిస్తూ, కొడుకు భవిష్యత్తు బాగుండాలనే ఆశతో వికలాంగులకోటాకోసం కన్నబిడ్డను వికలాంగునిచేసేందుకు వెనుకాడని ఒక దుర్మార్గపునాన్నకథ ఇది.

"అవును సరసూ! వాడి కులాన్ని మార్చలేను. వాణ్ణి ఆడపిల్లను చేయలేను! పెద్దయ్యాక డొనేషన్లు కట్టి చదివించలేను! చదువయ్యాక లంచాలిచ్చి ఉద్యోగం కొనిపెట్టలేను! ఉద్యోగం రాకుండా వాడికి పెళ్ళిచేయలేను! అందుకే నా చేతనైనపని -- ఆ దే కసాయివాడిలా ఆ 'దుర్మార్గం' చేశాను. అందుకే వాడిపుడు అలా కుంటుతూ నడుస్తున్నాడు. అందుకే -- వాడికి 'అంగవికలుర' కోటాలో ఆనాడు ఇంజనీరింగ్ సీటొచ్చింది. అది చదవడానికి స్కాలర్‌షిప్ వచ్చింది. అందుకే ఇపుడు అప్లయ్‌చేసిన వెంటనే ఉద్యోగం వచ్చింది......లేకపోతే...." ఇంకా ఏదో చెప్తున్నాడు విశ్వనాథం....... కానీ ఆమెకు వినిపించటం లేదు.

"మీరు..... మీరే ఇలా కసాయివాడిలా......"

"అవును సరసూ! కసాయివాణ్ణే! కన్నకొడుక్కి కలలోకూడా ఏ తండ్రీ తలపెట్టకూడని దారుణానికి ఒడిగట్టిన నాపేరు 'గిన్నిస్‌బుక్'లో రాయాలి! కానీ ఈ పని ఎందుకు చేశానో తెలుసా?.....నామీద నాకు అసహ్యం కలిగి ఆ పని చేశాను! ఈ వ్యవస్థమీద కక్షకట్టి ఆ పాపానికి తలపడ్డాను! పెళ్ళి చేసుకుని భార్యతో సుఖపడాలే తప్ప--పావలా మల్లెపూలు కొనిపెట్టలేని దుస్థితికి కుమిలి కుమిలి ఏడ్చే పరిస్థితి రాకూడదని చేశాను..." అంటూనే కుర్చీలో వెనక్కి వాలిపోయి బాధగా కళ్ళు మూసుకున్నాడు. విశ్వనాథం పేరుగల ఆ దుర్మార్గపు నాన్న!! (జీడిగుంట రామచంద్రమూర్తి, దుర్మార్గం, ---------, పే 48-55)

ఆర్థికసమస్యను అధిగమించగల్గినా కులపరమైన అవివేకత అధికంగా బాధపెట్టడం 'ఉక్కుపాదం'లో చూడవచ్చు. ఆర్థికసమస్యను వ్యక్తిగతస్థాయిలో పరిష్కరించుకోగలిగినదే అయినా కులసమస్యను ఎదుర్కొనటం సాధ్యపడనిదైనాన్ని ఈరచన ప్రతిబింబించింది.

భయం భయంగా దిగులుగా బిక్కు బిక్కు మనుకుంటూ శివరాం, నేనూ డిగ్రీ చదవటం ప్రారంభించాం. చదువుకోసం

అప్పుడు మేము అనంతపురంలో ఉండటం విక్రమార్కుని సాహసం వంటిది. ఎవరెస్ట్ శిఖరాన్ని ఎక్కడం వంటిది. ఆకాశానికి నిచ్చెన వేయడం వంటిది. అయినా మొండి ధైర్యం తెచ్చుకున్నాం. భవిష్యత్తుమీద ఆశలు పెంచుకున్నాం. అయితే అడుగడుగున పేదరికంవల్ల ఎన్నో ఇబ్బందులు కలిగేవి. ఆ ఇబ్బందులు మాలో ఎక్కువ బాధ కలిగించేవి. కానీ పేదరికం కంటే మమ్మల్ని సమాజం ఎక్కువ గాయపరిచేది. మమ్మల్ని పురుగులకన్నా హీనంగా చూసేది. ఒక్కొక్క సంఘటన మాలోని రక్తాన్ని మరిగించేది. మమ్మల్ని సమాజం బాధపెడుతున్నట్లు ఎక్కడా కనిపించేదికాదు. (శాంతినారాయణ, ఉక్కుపాదం, దళితకథలు-4, పే 263-275)

విద్యాసంస్థల్లో ఉన్నత, పేద తరగతులమధ్య వైరుధ్యాలు ఒకవైపు, పేదల్లో మరలా అంతర్గతంగా కులపరమైన వివక్ష మరోవైపు -- ఇలా వర్గపరంగా, కులపరంగా రెండురకాలుగా విద్యార్థులు వివక్షను ఎదుర్కోవలసిరావటాన్ని 'బాలలదినం' చిత్రించింది. ప్రైవేటుపాఠశాలలు ఉన్నతవర్గానికి చెందినవికాగా, ప్రభుత్వపాఠశాలలు పేదవర్గాలవారివిగా ఒక చిన్నచూపు. అందులో విద్యార్థులకు పేదరికపు అణచివేత ఓవైపు, అంతకుమించి కులపరమైన అణచివేత నిరంతరం ఎదురవటమే ఇందులో కథాంశం.

కెమేరాలు క్లిక్ మన్నాయ్. ఆ కాన్వెంటు పిల్లలు పీస్‌బాస్ మంటూ రెండు ఇంగ్లీషు పాటలు పాడారు. తర్వాత 'వీళ్ళు తెలుగు పిల్లలేనా' అన్నట్లు కుంటి కుంటిగా తెలుగుపాట పాడారు. -------------------

ప్రెసిడెంటుగారు ఏదో పెద్ద బాధ వచ్చిపడ్డట్లు మొహం విసుగ్గాపెట్టి --- "మీవాళ్ళా? ఎవరెవరు పాడతారు?" అని అడిగారు. మేష్టారు వివరాలు చెప్పారు. ప్రెసిడెంటుగారు మొహం విరిచి "ఏలాగండీ? వాళ్ళొద్దు, మిగతావాళ్ళని పాడితే పాడమనండి. అయినా టైములేదనుకుంటాను" అంటూ ప్రెసిడెంటుగారు, మంత్రిగారివైపు వరిగొల్లారు. ------------

మేష్టారికి నోరు పెగల్లేదు. కళ్ళల్లో రెండు నీటిబొట్లు పూరాయి. చటుక్కున కళ్ళు వొత్తుకుని " రాముడు పాడకూడదట. వాడు మాలాడట. మీరిద్దరూ పాడితే పాడొచ్చు" అన్నారు. పిల్లలు బొమ్మల్లా నిలబడ్డారు.

"చెప్పండి. మీరిద్దరూ పాడతారా?"

"మేం పాడం మేష్టారూ!"

మేష్టారు వాళ్ళని ముగ్గుర్నీ దగ్గరికి తీసుకున్నారు. వాళ్ళ చేతుల్లో దండలు నలిగి వాడిపోయి వున్నాయి.

"మేష్టారండీ! ఈ దండలు......"

"వెయ్యక్కర్లేదమ్మా! ఈ దండల్లో వున్నవన్నీ మామూలుపూలు. సామాన్యమైనపూలు. ప్రత్యేకతలేని పూలు." (సింహప్రసాద్, బాలలదినం, ప్రజాసాహితి, మే'79, పే 27-35)

కేవలం కులం, కులస్పృహ, కులంచుట్టూ అల్లుకున్నభావజాలం, ఆకారణంగా ఏర్పడే విభిన్న సామాజిక పరిస్థితులు, వాటి ఫలితంగా నిమ్నకులాలు, ప్రధానంగా దళితులు పొందే అవమానాలు ఇలా కులం కేంద్రంగాచేసుకొని వచ్చినరచనలు అనేకం తెలుగుసాహిత్యంలో కనిపిస్తాయి. ఆ క్రమంలోనే కులస్పృహ కారణంగా విద్యారంగంలో చోటుచేసుకునే ఘటనలను కూడా సాహిత్యం చిత్రించింది.

----------పాఠశాలస్థాయిలోకూడా ఒకేతప్పుకు కులాన్నిబట్టి దండనలస్థాయిలోను, రూపంలోను వైరుధ్యాలుండటం.

----------గుణాన్నిబట్టికాక, కులాన్నిబట్టి వ్యక్తిమంచిచెడులను అంచనావేసే స్వభావం.

----------సామాజిక సంస్కరణలుగాను, అభ్యుదయకరమైనవిగాను చిత్రిస్తూ చేపట్టేచర్యలు వాస్తవానికి దళితుల ఆత్మగౌరవాని కించపర్చేవికావటం

----------బోధనాభ్యసన ప్రక్రియల్లోకూడా కులం ప్రధానమైన పాత్రను పోషించటం.

----------నిమ్నకుల ఔన్నత్యానికి, అగ్రకుల అహంకారానికి మధ్య కుదరని సయోధ్య.

----------కులపరమైన అణచివేతలోభాగంగా దళితులను విద్యకు దూరంచేసే ప్రయత్నం.

----------సామాజికస్పృహ లోపించిన ఉపాధ్యాయుల చర్యలు విద్యార్థుల జీవితాలకు ప్రతిబంధకాలు కావటం.

----------ఉపాధ్యాయుని సామాజికస్పృహ కులవివక్షకు వ్యతిరేకంగా విద్యార్థులకు ఆత్మ

ధైర్యాన్నివ్వటం.

వంటి అనేక అంశాలు కులం, కులస్పృహ ప్రధానాంశంగాచేసుకుని సాహిత్యంలో చర్చకువచ్చాయి.

గ్రామంలోని కులవైరుధ్యాలను సమగ్రంగా చిత్రించిన రచన 'ప్రశాంతం' ఈ వైరుధ్యాలు కేవలం అగ్ర, నిమ్నకులాల మధ్యేకాకుండా క్రిందికులాల్లోకూడా ఒక కులానికి, మరోకులానికి మధ్య ఎంతగాఢంగా నాటుకుపోయాయో అంగన్ వాడీ పాఠశాలను కేంద్రంగా చేసి చూపించటం కనిపిస్తుంది. నిమ్నకులానికి చెందిన స్త్రీలు పాఠశాలల్లో కులపరంగా లింగపరంగా వివక్షకు గురికావటం ఇందులో చిత్రించబడింది. అయితే ఇందులో కుల, లింగవివక్షలను పైపైన కాకుండా సమస్యలోతుల్లోకివెళ్ళి చర్చించటం కనిపిస్తుంది. పాఠశాలస్థాయినుంచే లింగపరమైన విభేదాలు ఎలా అమలౌతాయో, ఒకేతప్పుకు కులాన్నిబట్టి శిక్షలస్వరూపంలో తేడాలు ఎలాఉంటాయో పాఠశాలకేంద్రంగా చేసిన చిత్రణే ఈ 'ప్రశాంతం.'

'ఎప్పుడూ మా ఆడపిల్లలే కసువునూకాలా? మీరునూకండి కొన్నిదినాలు' అని మగపిల్లలతో ఆడపిల్లలు పేచీ పెట్టుకున్నారు. 'కసువునూకేది మాపనికాదు' అని మగపిల్లలు మొండికేసుకున్నారు. ఆరోజు ఎవరు కసువునూకాలని ఆడపిల్లల్లో సమస్య వచ్చింది.

బాపన టీచరు వచ్చాడు. చెత్తా చెదారంతో నిండిన గదినంతా కలయజూశాడు. ఎవరు ఎందుకు కసువు నూకలేదని విచారించాడు. అందరు చెప్పిన మాటలూ విన్నాడు. కమ్మవాళ్ళ పిల్లల్ని పీసమెత్తు మాట అనలేదు. కురవోళ్ల పిల్లల్ని మాట మాత్రంగా దండించాడు. మాదిగపిల్లల్ని మాత్రం -- 'ఇంత కొవ్వామీకు భ్రష్టుముండల్లారా!' అని వారి కులాన్ని తిట్టేసతిట్టు తిట్టకుండా తిట్టాడు. అందర్నీ వరుసలో నిలబెట్టి చేతులు చాపమని చింతబరికతో బాదాడు. ఆవిధంగా తను కులపరంగా పొందిన తిట్లూ,దెబ్బలూ,పరాభవాల్ని ప్రస్తుతం తన పిల్లలు అనుభవించవలసి వస్తే మాత్రం దుర్గమ్మ అప్పటిలాగా ఊరికే పడుండటంలేదు.

అంగన్‌వాడీ టీచరు మధ్యలో కల్పించుకుంది - 'ఫరవాలేదు లెండి. దుర్గమ్మ హరిజన్ అయినా గిన్నెలన్నీ బాగా తోమి శుభ్రంగా వంట చేసింది' అంది.

'హరిజనులు శుభ్రంగా ఉండరని, ఏనాడో తన పూర్వులు తన మనసులో నాటినభావం ఆ అంగన్‌వాడీ టీచర్‌లో ఇంకా పదిలంగా ఉన్నట్టుంది.

శుభ్రత అనేది మనిషి వృత్తికీ, ఆర్థిక వర్గానికీ సంబంధించినది. ధాన్యం పండించేవారు మట్టివాసన కొట్టకుండా, పాలమ్మేవారు పేడవాసన కొట్టకుండా ఎలా ఉంటారు? వారు ఉత్పత్తిచేసిన పాడినీ, పంటల్నీ అనుభవిస్తూనే; మరోవైపు వారి చెమట వాసనల ప్రత్యేకతల్ని అశుభ్రతగా ఆరోపణచేసే మనస్తత్వం కాయకష్టానికి దూరమైన కులాలకు మాత్రమే ఉంటుంది. తక్కెడపట్టుకునే కులానికి సంబంధించిన అంగన్‌వాడీ టీచరుకూడా ఆ మనస్తత్వానికి దూరం కాలేకపోయింది. హరిజనులు అశుభ్రంగా ఉంటారనే సామాన్య సత్యానికి ఒక అపవాదుగా మాత్రమే ఆమె తన హరిజన ఆయా శుభ్రతను ఒప్పుకోవడానికి సిద్ధపడింది.

'ఎంత శుభ్రంగా చేస్తేమాత్రం మాదిగమైల మాదిగమైలే? అదెల్లా పోతుందమ్మా?' అని నిలదీశాడు కురుబ కిష్టప్ప.

'ప్రాణంలేని ఆ పిండిమిషీనుకున్న విలువకూడా మా మాదిగోల్లకు లేదా? మేమూ మీమాదిరే మనుసులంకామా?' అంది దుర్గమ్మ.

మరో ఇద్దరు కురుబకులం మనుషులు వచ్చి వాదనకు దిగారు --'మాలమాదిగలు వండితే తినడానికి మేమేం గతిలేని వాళ్లమా? పోపోమ్మా! బాగా చెప్పొచ్చావు' అని గొంతులు పెంచి అరిచారు.

'సరే! మీ బిసి పిల్లోల్లకు ఉప్మా వద్దు అనుకుంటే అది మీ ఇష్టం' అంది అంగన్‌వాడీ టీచరు.

'మీ పిల్లోల్లకు వద్దన్నారు; సరే! యస్.సి పిల్లోల్లకు కూడా ఉప్మా లేకుండా చేస్తే మీకేమొస్తుంది' అంది అంగన్‌వాడీ టీచరు. ఆమాట అడగడానికి అయితే అడిగింది కానీ, ఆమె గొంతులో పెద్దగా బలంలేదు. పల్లెటూళ్ళలో ప్రజల అతితెలివికి గానీ, అజ్ఞానానికిగానీ లొంగిపోతే తప్ప తనలాంటి బడుగు టీచరమ్మలు ఉద్యోగాలు చేసుకోలేరని ఆమెకు బాగా తెలుసు. (స్వామి, ప్రశాంతం, తెలుగుకథ-96, పే172-188)

విద్యాసంస్థల్లో విద్యార్థులపైసాగే దండనల్లో కులప్రాతిపదికపై స్థాయీభేదాలుండటం గర్హనీయమంటూ 'మీకోసం మీపిల్లలకోసం' పేర్కొంది.

'ఊరు నేను సిలిమా సూల్లేదని సెప్పేలకే ఆ పోర్గానికి కోపం వచ్చి ఎరవల్లారా -- యింటికి పోతే మెతుకు దొరకదు. యీడ తిండిపెట్టి సదువుకోండ్రా అంటే సిలిమాలు -- సికార్లు కావల్సొచ్చినియా. పైపెమ్ము అబద్దాలు కూడానా' అనుకుంటూ

ఆయన కూమున్న కుర్చీ పక్క నేవున్న బెత్తం తీసుకొని ఆయనకి పాలొచ్చిందాకా యీన్ని కొట్టిండంట.' ----------

'ఆ రాత్రి తెల్లార్లు నిద్దర పోనియ్యలేదంట యీన్ని. తెల్లారి పొద్దుగాల్నే పెంటకుకి తీసుకెల్లి ఆ పోర్గిన్ యీడికి గుండు సేయించిండంట.' ----------

"మనం ఏం సేత్తంలే -- మీకోసం -- మీ పిల్లలకోసం యేడ్వటానికి యేసుప్రభువు సెప్పలేదూ? అంతకంటే యేం సేత్తం?" అదు యీమాట యేవుర్లేకంతో అన్నాడోగాని యింతకంటే యిప్పుడేం సెయ్యగలం? అనిపిచ్చింది. (గుడిపె ఏసోబు, మీకోసం.... మీ పిల్లలకోసం, దళిత కథలు, పే 36-39)

కులాలనుబట్టి వ్యక్తుల మంచిచెడ్డలను నిర్ణయించే స్వభావాన్ని ప్రశ్నిస్తూ వచ్చినరచన 'రుగ్మత'.

మనమంతా టీచర్లం. అంటే భావి భారత పౌరుల్ని తీర్చిదిద్దాల్సిన వాళ్ళం. బి.ఎడ్‌లూ, ఎమ్.ఎడ్‌లూ చేసి సిటిజన్‌షిప్ ట్రైనింగ్ పొందిన వాళ్ళం అయినా మనకే సరైన కల్చర్, సివిలిజేషన్‌లు లేవు. సభ్యతా, సంస్కారాలు మరచి ప్రవర్తిస్తున్న వాళ్ళు మనలో ఎందరో ఉన్నారు. టీచర్లకే కొంతమంది అధికులు, కొంతమంది అల్పులు అన్న భావన మనసుపొరల్లో ముద్రింపబడి పోయిఉంది. కులాలనుబట్టి ఫలానా వాళ్ళు ఫలానాకులం కనుక శుంఠలు, వెధవలు, పనికిమాలిన వాళ్ళు అనీ, ఫలానా వాళ్ళు ఫలానాకులం కనుక తెలివిగలవాళ్ళు, బ్రైట్ ఎలిజిబుల్ అండ్ కేపబుల్ అనీ భావించే టీచర్లున్నారు మన మధ్య. కులాలను బట్టి మనిషి మంచి చెడ్డల్ని, సామర్థ్యాన్ని నిర్ణయించే ఈ లక్షణం మనలో ఎప్పటికి పోతుంది? (భట్టిప్రోలు విజయలక్ష్మి, రుగ్మత, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 18-4-'90, పే 10-12)

సామాజికన్యాయంకోసం కులం ప్రాతిపదికగా ప్రభుత్వపరంగాను, ఇంకా ఇతరవిధాలుగాను చేపట్టే కార్యక్రమాలు అభ్యుదయకరంగా కన్పిస్తూఉన్నప్పటికీ, దళితుల ఆత్మగౌరవాన్ని కించపర్చేవిగాను, సామాజికంగా వారిని వెలివేతకు గురిచేసేవిగాను, మానసికంగా క్షోభకు గురిచేసేవిగాను ఎలా ఉంటాయో దళిత వ్యక్తిగతకోణంనుంచి 'ఉప్పునీళ్ళు' చిత్రించింది.

ఎంత ట్రైచేసినా మా సిస్టర్‌కు ఎం.బి.బి.యస్‌లో సీటు రాలేదు బాస్. ఏ ఎస్సీనో, ఎస్టీనో అయితే బాగుండేది. సీట్ దొరికేది. అసలు ఎస్సీ అంటే ఏమిటో తెలుసా బాస్. సుప్రీం కాస్ట్, కాలేజీల్లో రిజర్వేషన్‌లు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు -- స్కాలర్‌షిప్‌లు.... ఉచిత విద్య.....ఉచితంగా హాస్టల్లు.... ఓహ్ లైఫంటే వాళ్ళదిబాస్.....పుడితే ఎస్.సి.గా పుట్టాలిగానీ ఫార్వర్డ్ కాస్ట్‌లో పుట్టగూడదు బాస్...... బాస్టర్డ్ మనల్ని బతుకనీయరు బాస్.

ఆమాటలు శూలాల్లా కమల గుండెలో గుచ్చుకున్నాయి.----------------.

క్లాసులో కొందరిచూపులు కమలమీద నిలిచాయి. అలా తనను చూస్తున్నారని తెలిసి కమల వంచినతల ఎత్తలేక పోయింది. లేచి నిల్చోలేకపోయింది.----

"ఎందుకొద్దు.... మన క్యాంప్‌లో ఒక్క హరిజన స్టూడెంటైనా లేకపోతే ఎలా...... క్యాస్ట్‌వైజ్ పార్టిసిపెంట్ లిస్ట్ పంపించాలని మాకు ఆర్డర్స్ వచ్చాయి. షెడ్యూల్‌కాస్ట్ వాళ్ళుకూడా ఉన్నారని చూపిస్తే మనకు ఫండ్స్ తొందరగా వస్తాయి. అదిగాక హరిజన స్టూడెంటుతో మన క్యాంప్‌లో ఒక ప్రోగ్రాం ఉందికదా -- క్లాసులో ఉన్న ఒక్క హరిజన స్టూడెంట్ - హరిజన స్టూడెంట్ - కమల హరిజన స్టూడెంట్ - కమల హరిజన స్టూడెంట్ - ఇది కొత్తరకం వెలి -- భయంకరమైన వెలి -- కమల మనసు క్షోభిస్తోంది -- మూగగా రోదిస్తోంది. ------------

"మన క్యాంప్‌లోని హరిజన స్టూడెంట్ కమల ఆలయప్రవేశం" అన్నారు ఆవేశంగా పర్వేశ్వరరావుగారు.

చప్పట్లు మిన్నుముట్టాయి. ఉత్సాహంతో కొందరు ఈలలు వేశారు. అలాంటి అభ్యుదయ కార్యక్రమంలో పాల్గొంటున్నందుకు ఆనందంగా ఉందని మరోసారి చప్పట్లు కొట్టారు. -----------

కమలకు అక్కడ్నుంచి పారిపోవాలని ఉంది. ఆ రేపు రావద్దని ఉంది. ఆమె కళ్ళముందు జనం -- ఫొటోగ్రాఫర్లు కనిపిస్తున్నారు. తనను హరిజన బాలికని వేలెత్తి చూపుతున్నారు.-- కమల భారంగా కళ్ళు మూసుకుంది. ---------

"ఈ అమ్మాయేనా హరిజన స్టూడెంట్... ఏది ఒక స్నాప్..... జస్ట్ స్మైల్ ఒకే...."

"దేవాలయం వైపు అడుగులు వేస్తుంటే మీ కెలావుంది...... మీ మీన్ హౌ డు యూనివర్సిటీ ఫీల్...." రేడియో, టి.వి. వాళ్ళ ప్రశ్నలవి.

"మాదిగ దానికి ఏం వైభోగం పట్టిందిరా...... పుట్టుకంటే దీందిబాస్......" చిచి దీన్ని ఉంచుకోరా....... సీకూపట్తుంది వైభోగం......."

ఆ మాటలు ఈటెలై కమల గుండెను పెకలించాయి. దివ్యమైన ఆవేదన కళ్ళకు చిమ్మింది. అవి ఆనందభాష్పాలని రేడియో. టి.వి.వాళ్ళు రాసుకున్నారు.

క్యాంప్‌నుంచి వచ్చిన కమల తండ్రి ఒడిలో తలపెట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చింది........

"ఏంటి బిడ్డా.... ఏందే......" ఆదుర్దాగా అడిగిండు తండ్రి.

"నాన్నా మనం ఎక్కడికైనా దూరంగా పారిపోదాం నాన్నా ..... మనల్ని మనుషులుగా చూసేచోటికి పారిపోదాం

నాన్నా" తండ్రిఒడిని చుట్టేసి దీనంగా పిలుస్తూ అంది కమల..... (సదానంద శారద, ఉప్పుపేళ్ళు, వ్యక్తిత్వవికాస కథలు, పే 201-208)

బోధనలో సామాజికాంశాలు విస్మరించవీలుకానివని, అవికూడా బోధనలో నిర్ణయాత్మకపాత్ర పోషిస్తాయని అందులోనూ కులం నిర్ణయించేపాత్ర ప్రముఖమైనదని వ్యక్తీకరించినరచన 'ద్వంద్వసమాసం'. వ్యక్తిగత ప్రయోజనాలకోసం వ్యక్తిస్థాయిలో కులాన్ని అడ్డుగా భావించనివారు, సామాజికంగా మాత్రం కులస్పృహతో వివక్ష ప్రదర్శించటం ఈ రచన స్పృశించింది. వ్యక్తిగతంగాను, సామాజికంగాను వ్యక్తుల ప్రవర్తనలో ద్వంద్వ ప్రవృత్తిని ఇందులో చూస్తాం.

"మరేం లేదు. పెద్ద అర్జీగేమీ కాదు. మా అమ్మాయి అనిత మీ క్లాసులో ఉందిగదండీ! దానిపక్కన అమ్మక్షి అంటూ ఒక పిల్ల కూచుంటుందట! ఆ పిల్లను వెనక డెస్కుల్లోకి పంపించి ఆ జాగాలో శ్యామలారాణిని కూచోబెట్టాలి. శ్యామలారాణంటే తెలుసుగదూ! అడ్వొకేటు జగన్నాథరావుగారి కూతురు. ఏమిటోమరి! అమ్మక్షి అనే పిల్ల నంగనాచిలా ఉంటుందట. గుడ్లు మిటకరించి చూస్తుందట. మంచి బట్టలయినా తొడుక్కోదట. మా అమ్మాయికాపిల్ల పొలకువే నచ్చడంలేదు. అందుకని చెబుతున్నా. నేను చెప్పినట్టు చేస్తారుగదూ? చేస్తారులెండి! థాంక్స్....." ------------ (మధురాంతకం రాజారాం, ద్వంద్వ సమాసం, మధురాంతకం రాజారాం కథలు, పే 74-81)

విద్యాలయాలనుకూడా వీడని కులవివక్ష, దాన్ని ప్రతిఘటించేపాత్రలో ఉపాధ్యాయుడు, కులవివక్షను ఒక సామాన్యమైన విషయంగానే భావిస్తున్న పిల్లలు-- ఇవే 'తల్లిమట్టి'

అక్కడ బడి, గుడి రెండూ ఒక్కటే. గుడిలోకి హరిజనుల ప్రవేశం ఉండదు కాబట్టి బడిలోకి కూడా వాళ్ళకు ప్రవేశం లేదని వేరే చెప్పాల్సిన అవసరం వుండదేమో.

మూడవరోజు అటెండెన్సు రిజిష్టరును పారాయణం చేస్తుండగా గుడి బయటనుంచి ప్రెజెంట్‌సార్ అని వినిపించి తలెత్తి చూస్తే ఎత్తైన రాతిగడప పక్కన పలకా పుస్తకాలు పట్టుకుని సూర్యుని ఎండవేడిలో కూర్చుని కన్పించిన అయిదవ తరగతి చదివే పాప -- అంజినమ్మ లోపలికి రమ్మంటే రాలేదు, రాకూడదుసార్ అంది నా అజ్ఞానాన్ని వింతిస్తున్నట్టు నవ్వుతూ. మిగతా పిల్లలు కూడా ఉత్సాహంగా అరిచినారు మాదిగోళ్ళు గుడిలోనికి రారు సార్ అంటూ. ---------

"ఫరవాలేదు. బడి అందరిదీ" లోపలికిరమ్మని రెండుమూడు సార్లు పిలిచినా రాలేదు పాప. నేనే గట్టుదిగిపోయి పదమ్మా లోపలికి అని రెక్కపట్టుకుని లాగి వసారాలో కూర్చోబెడితే భయంతో ఏడుస్తూ కూర్చుంది ఒక మూల.

"మాదిగోళ్ల పాపని ముట్టుకున్నారు లేయ్. ఈ పొద్దు సాయంత్రం అయ్యోరివారి తేలో పాము కుడుతుంది" అంటూ నవ్వుతూ ఆ పాపకు దూరంగా జరిగి కూర్చుంటున్న పిల్లలు! మెల్లమెల్లగా పెద్దవాళ్ళ అజ్ఞానంలోకి మారిపోతూ ఉన్న పసిపిల్లల అమాయకత్వం! (స్వామి, తల్లిమట్టి, దళితకథలు, పే 222-235)

ఒక మామూలు ఉపాధ్యాయునికి కులంకారణంగా గ్రామాల్లో వసతిదొరకని స్థితిని, మనిషిఆత్మగౌరవాన్ని కించపర్చే కులపరమైన అణచివేతగా పేర్కొంటూ వచ్చిన రచన 'బందీ'.

ఇక్కడ అసలు సమస్య ఇల్లు కానేకాదు. మనిషిగా గౌరవించటం. నన్ను తమతో సమానంగా గౌరవించే వారైతే వారెందుకు కిరాయికుండుకోరు? నన్ను గౌరవించని వారికి నా విద్యను నేనెందుకు 'దానం' చేయాలి అనేది నా అహం లేదా ఆత్మ విశ్వాసానికి సంబంధించిన సమస్య. ఆ వూరు నక్సలైట్ల సానుభూతిపరులకు పెట్టింది పేరు. వాళ్ళ సంస్కృతే ఈ విధంగా వుంది. ఇంకా వేరే ఊళ్ళ సంగతి ఏంచెప్పను?

"నాకు ఇల్లయినా ఇప్పించండి. బదిలీ అయినా చేయించండి" అని నా డిమాండు. స్కూలు విద్యా కమిటీ మెంబర్లు ఒక్కరూ ముందుకు రాలేదు. (బి.ఎస్.రాములు, బందీ, బి.ఎస్.రాములు కథలు, పే 29-35)

నిమ్నకులాలను పథకంప్రకారం విద్యాబుద్ధులకు దూరంచేసి తమ స్వార్థానికి వాడుకునే అగ్రవర్ణ స్వభావచిత్రణే 'ఆత్మహత్య'. అంతేకాకుండా నిమ్నకులాలవారి శరీరావయవాలుకూడా అంటరానివిగాభావించే అగ్రకుల అహంకారం ఒకవైపు, తాము కుట్రకుబలౌతున్నామని గ్రహిస్తూకూడా కృతజ్ఞతాభావంతో త్యాగానికి సిద్ధపడే నిమ్నకుల ఔన్నత్యం మరోవైపు భిన్నధృవాలుగా ఇందులో ముందునిలుస్తాయి.

"నీ కొడుకులు బాగా చదువుకుంటే నిన్ను పనిచేయనివ్వరు. నీ తరువాత నీ కొడుకులు సేవకా వృత్తి చేయరు. నీవంటి నమ్మకమైన వ్యక్తి నాయుడు బాబుకి ఎవ్వరూ దొరకరు. అందుకే నీపిల్లలకి చదువు వద్దన్నాడు అంతేగాని నీ మంచికోరి కాదు" అనే వారందరూ అనేవారు. అదిప్పుడు నిజమేమోననిపిస్తోంది.

ఒకచేవిటి .... నాయుడుబాబు చేసిన ప్రతిపనిలోనూ మోసమే కనిపిస్తోంది. కొద్దిసేపు దీర్ఘంగా ఆలోచించిన తరువాత

ఒక నిర్ణయానికి వచ్చాడు. మంచినో, చెడునో..... మనసులో ఏమున్నా నాయుడుబాబు తనకెన్నోవిధాల సహాయపడ్డాడు. అలాంటి వ్యక్తి గురించి ఈవిధంగా ఆలోచించడం తగదనిపించింది.

ఈ ఆలోచనే తరతరాలుగా తమని బానిసలుగా చేస్తున్నదనే విషయం వాళ్ళకి తెలీదు. విప్లవం రావాల్సిన టైమ్‌లో విశ్వాసం ప్రబలింది. తనకెంత మనస్తాపము కలిగినా అవసాన దశలో నాయుడుబాబుని బాధపెట్ట కూడదనిపించింది. పరిశిగాడెన్ని విధాలుగా బ్రతిమలాడినా మూత్రపిండాలు తీసుకోడానికి నాయుడుబాబు అంగీకరించలేదు. ఆఖరిశ్వాస విడిచాడు. టెలిగ్రామ్ అందినవెంటనే నాయుడిగారి పెద్దకొడుకు వచ్చాడు. "ఒరేయ్ పరిశిగా నాన్నకేమైందిరా?" ఆతృతగా అడిగాడు. "ఆత్మహత్య చేసుకున్నారు బాబూ" అన్నాడు పరిశిగాడు నిట్టూరుస్తూ. (బొంగు వేణుగోపాలరావు, ఆత్మహత్య, దళితకథలు-5, 105-108)

నిమ్నజాతుల చదువు వారిలో ఆత్మగౌరవాన్నిపెంచి, ధిక్కారస్వభావాన్ని ప్రాదుకొల్పుతుందన్న కారణంగా వారిని విద్యకు దూరంచేసేందుకు ఉన్నతవర్గాలు నిరంతరం ప్రయత్నిస్తాయన్న అంశంతో వచ్చినరచన 'సమాధులనీడలు'. ఈ క్రమంలో వ్యక్తులను బలిగొనేందుకుకూడా వెనుకాడనంత తీవ్రమైన పర్యవసానాలు ఇందులో చోటుచేసుకోవటం గమనార్హం.

"ఏరా ముసలయ్యా, పీనుగులు పాతి, కాటికి కావలి కాసుకునే నీ మనవనికి సదువెందుకురే. సంగాడితోటి మా పిలగాళ్ళు సదువుకుంటే ఊళ్ళోని పెద్దోళ్ళంతా తలెత్తుకు తిరగాల్నా లేదా! ఇంగోపారి ఇట్టా అడగనీకి వచ్చినవంటే దవ్వ బండకాడ చెట్టుకుకట్టి కొరడాతో కొట్టిస్తా. వెనక్కిదిరిగి సూడకుండా ఎల్లిపో" గద్దిస్తూ చిత్తుగా తాగటంవలన నిప్పుకణికెల్లాగ ఉన్న కళ్ళతో ఉరిమి చూస్తూ చెప్పాడు.

గుండెల్లో గునపాలతో పొడుస్తున్నట్టుగ అనిపించింది. ముడతలుపడి ఎండిపోయిన చెంపలపైకి కారుతున్న కన్నీళ్ళను తుడుచుకోవాలనే ధ్యాసకూడా లేకుండా వెనక్కి తిరిగాడు. ---------------

వస్తున్న ఇద్దరిలో ఒకడు ఇంకా గుడిసె నాలుగడుగులు ఉండగానే "ఏరా ముసల్నాకొడకా! నీకు నీ మనవడికి వళ్ళు కొవ్వెక్కినట్టుంది. లేకపోతే ఊళ్ళోకొచ్చి సంగాడు పెద్దయ్యకొడుకు పక్కన కూసుంటాడా. ఇషయంద్దెలిసిన పెద్దయ్య జీతగాళ్ళతో సంగాడి మక్కెలిరగ్గొట్టిచ్చినాడు. అయింతకే అడు సచ్చూరుకున్నాడు. ఆడి శవం ఎవరు ముట్టుకోకుంటే తాడుతో బండికికట్టి లాక్కొచ్చినాం" వాడు మాటపూర్తిచేసేలోగానే ముసలయ్య కర్ర, లాంతరు కిందపడేసి బండి దగ్గరకు పరుగెత్తాడు. బండి వెనుక తాడుతో కట్టున్న సంగడిశవం చూసి "రేసంగా" అని దిక్కులు పగిలేలా అరిచాడు. ఆ అరుపుకు భయపడి గాలి ఒక్క క్షణం ఆగిపోయింది. (జి.రవికృష్ణ, సమాధుల నీడలు, శకలాలు: డా||జి.రవికృష్ణ కథలు, పే 8-13)

ఉపాధ్యాయుల్లో సామాజికస్పృహలోపించినకారణంగా విద్యాలయాల్లో చోటుచేసుకునే విషపరిణామాలను బహుముఖీనంగా చర్చించినరచన 'అభ్యుదయం'. ప్రాచీనకాలంలో పాఠశాలలో దండనలే బోధనలో నాణ్యతకు గీటురాళ్ళు కావటం అశాస్త్రీయమైన ఒక వాస్తవం. సామాజికస్పృహ కొరవడినప్పుడు ఉపాధ్యాయుల ప్రవర్తన విద్యార్థులను కించపర్చేదిగా ఉండటం సహజం. దాని పర్యవసానాలతీవ్రత ఏపాటిదో 'అభ్యుదయం' కూలంకషంగా చర్చించింది.

"ఆయన పేరు వింటే పిల్లలు నీళ్ళుతాగేవారు కాదట. పిల్లలు గజగజ వణికి పోయేవారు. చూపుడువేలు పట్టుకొని 'ఓం నమః శివాయః' ఇసకలో దిద్దబెట్టేవాడట. వేళ్ళు మంటలు పుట్టి పిల్లలు ఏడుస్తుంటే దూళ్ళకర్ర పుచ్చుకుని ఆ వేళ్ళమీదే వెనక్కితిప్పి కొట్టేవాడట. యిప్పటికీ మా పెదనాయన శిష్యులు కనిపించి-- 'యిప్పుడలాంటి గురువులే లేరు. అలాంటి చదువులే లేవు' -- అంటూంటారు. అప్పుడీ బడికి ఆయనే హెడ్‌మాష్టారు. ఆయనే అసిస్టెంటు. యిప్పుడంటే నేను హెడ్‌మాష్టరు, నువ్వు అసిస్టెంటు. మరొక పంతులమ్మ కూడా వస్తోంది. అయితే ఆరోజుల్లో ఇంతమంది పిల్లలెక్కడున్నారురా? చుట్టుపట్ల పదిపదిహేను గ్రామాల పిల్లలు చదువుకున్నా పాతికైదు మంది వుండేవారు కాదట. ఇప్పుడేముంది? నానాకులాల వాళ్ళూ చదువుకోవటంవలన - పూజామందిరంలాంటి బడులు పాకీదొడ్లలా తయారయ్యాయి. నిజంగా నాకు రోత కలుగు తోందంటే నమ్ము వెంకటేశ్వర్లు. యీ శూద్రపోళ్ళంతా చేరి -- వాళ్ళకు శుచీ-శుభ్రతా? --ఆ నాలిక తిరగమంటే ఎలా తిరుగుతుంది. అసలు అన్నికులాలవాళ్ళు చదవటం కూడా దేశానికి అరిష్టమేనంటాను. నువ్వేమంటావు వెంకటేశ్వర్లు?" ---------------

"ఏంది మాటాడేది. పిల్లగాడిని అలాగేనా కొట్టుకోటం. కొడితే కొట్టు -- సదవకపోతే పీరి ఎండెయ్యి. నువ్వు కొట్టావని కాదు నానొచ్చింది. నానా కూతలు కుయ్యకుండా నీనోరు కుట్టేద్దామని ఒచ్చాను. మా పిల్లగాడిని పట్టుకొని వాతో రిచ్చా లాగమంటావా? రిచ్చాలాగటానికయితే నీకాడికెందుకు అంపటం. 'నువ్వు మాలోడివి - దూరంగా ఉండి పాఠం ఒప్పగించు' అంటావట. 'అసలు మాలోళ్ళకి సదువు ఎందుకంటావంట' నువ్వు మడిసివా? ఏదో నాలుగచ్చరం ముక్కలొస్తే-- కాస్త తెలివబ్బుద్దని నీకాడికంపాను కాని ఉద్దోగాలు సేపెత్తాడనికాదు -- భూములు ఏలేత్తాడని కాదు. నువ్వు మాత్రం వాడిని ఎందుకు

పనికిరాకుండా చేస్తున్నావు. ఛా! నీ బతుకు చెడ" కేశవస్వామి పంతులు ముఖంమీద ఊసాడు. ............

"ప్రజలతో ఎలామసలుకోవాలన్నది యిప్పటికయినా తెలుసుకోండి. 'అంటరాని తనం' అనేది మనుషుల్ని విడగొట్టే విధానాల్లో ఒకటి. ముక్కుపచ్చలారని పిల్లల్ని మీ 'అంటరానితనం' 'కులతత్వం' 'మతమౌఢ్యం' అనే జాడ్యాలతో పాడు చేయకండి. ఆ పుస్తకంలో ఉన్న అక్షరాలేవో అవి నేర్పండి చాలు" (తమ్మినేని అక్కిరాజు, అభ్యుదయం?, ప్రజాసాహితి, డిశంబరు'79, పే 38-42)

పాఠశాలలే సామాజికవిప్లవానికి ప్రేరకాలుగా పనిచేస్తాయని, విద్య ఇందుకు దోహదకారి కాగలదని, ఉపాధ్యాయుని సామాజికస్పృహ స్ఫూర్తినివ్వగలదని పేర్కొన్నదే 'బతుకుబడి'. సామాజికంగా వెనుకబడిన విద్యార్థులను పాఠశాలవైపు ఆకర్షించేదిగా పిల్లల ఆహారపథకం ఔన్నత్యం ఇందులో కనిపిస్తుంది. ఇంకా ఉపాధ్యాయుని సామాజికస్పృహ పాఠశాలలోని కులవివక్షను ఎదుర్కొనేందుకు విద్యార్థులకు స్ఫూర్తినివ్వటంకూడా ఈ రచన చిత్రించింది.

బడికి దగ్గరైనది. పిల్లలు ఏదో యక్కాలు వల్లిస్తున్నారు. అ.......ఆ......లు కొందరు చదువుతున్నారు. చప్రాసి బెత్తం పెట్టుకొని పహరా తిరుగుతున్నారు. అదంతా చూసి ఉచ్చపడినంత పనయ్యింది ఆందోళన పెరిగింది రాముకి. ............

నీ పేరేంటి?... అని అడిగారు.

నాపేరు రాము.

ఎవ్వరు మీరు? ఏ వాడ?

మాల, మాదిగోళ్ల వాడ. మాదిగోళ్లం.

ఆ మాటతో ఎవరో గొల్లున నవ్వారు. ర్యాగింగ్ కాలేజీల్లో లాగా ఇక్కడ కూడా ర్యాగింగ్. మన పల్లెల్లో మాల మాదిగలు పుట్టుకనుండీ ర్యాగింగ్‌కు గురౌతుంటారని చాలామందికి తెలియదు. రాము అన్న ఈ కుల వివక్షత ర్యాగింగ్ విధానాలకు భయపడి చదువు మానేశాడు. ఆనాటి పల్లెల్లో కుల విషసంస్కృతిలో భాగంగా పెద్దలు, తమ తల్లిదండ్రులు అనుసరించిన విధానంతో ఈ పిల్లలు ఇలా ర్యాగింగ్ చేస్తున్నారు. ............

ఏంకావాలి బాబూ? అంటూ ఆప్యాయంగా అడిగాడు పెద్దసార్ రామూని. ఆ ఆప్యాయతకి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి రామూకు. ఉక్మా, పాలు--కన్నీళ్లతో, భయంతో ఆకలితో దుఃఖసముద్రమైన నోటితో సగం-సగం పలికాడు రాము. రాము ఆవేదనకు పెద్దసారు చలించిపోయాడు. పాలు, ఉక్మా ఆశకోసం ఈ పిల్లవాడు బడికొచ్చాడన్నమాట. ఉక్మా, పాలు పథకం ఎంత గొప్పది. ఈ ఆహార పథకం వల్ల ఎంత అనాథలకు ఆసక్తి, చదువుపట్ల శ్రద్ధ పెరిగింది. ఆలోచనలో పడ్డాడు సార్. ఎందరో అట్టడుగు వర్గాల పిల్లల్ని బడికి ఆకర్షిస్తుంది ఈ పథకం. ఈ ఊర్లో తొలి మాదిగ విద్యార్థిని సంపాదించింది ఈ పథకం. అందుకు నా అంగీకారమే ప్రధాన కారణం మనస్సులో అనుకున్నాడు. ..............

రాము నీళ్లకుండ మీద మట్టిచిప్పలో మామిడి తొక్కల అన్నం కలుపుకుని తింటున్నాడు. చప్రాసి ఆ చిప్పను రాముతోనే కడిగించి ఆ కుండమీద పెట్టించాడు. ఆ చిన్న ఘటన ఆ ఊర్లో ఎంత అల్లకల్లోలం రేపిందో? ............

రాము కుండ మీద మూత మట్టిచిప్పలో అన్నంతిన్న ఘటన దళితుల్లో -- ఊరిప్రజల్లో గొప్ప ధైర్యం పెంచింది. ఆ ఊరి మొదటి దళిత విద్యార్థి చదువు అంబేద్కర్ చూపుకు వేలైపోగింది. చదివించు, సమీకరించు, పోరాడు ఆశయం అంకురమై నిలిచింది. (దార్ల రామచంద్ర, బతుకుబడి, దళితకథలు-3, పే 159-167)

విద్యారంగంలో కులపరంగా కొనసాగే అమానవీయ సంఘటనలకిచ్చిన అక్షరరూపం 'సరీసృపాలు'. కళాశాలల్లో ర్యాగింగ్ ఓ అంటుజాఢ్యమైతే, అందులోనూ కులాన్ని ఆయుధంచేసి వ్యక్తి ఆత్మగౌరవాన్ని కించపర్చటం మరింత ఆందోళనకరమైన సంఘటన. విద్య వ్యక్తుల్లో విశాలభావాన్ని పెంపొందించాల్సి ఉండగా విద్యాపరంగా ఉన్నతస్థాయిని చేరేకొద్దీ కులస్పృహ మరింతపెరగటాన్ని 'సరీసృపాలు' చిత్రించింది. వ్యక్తి ఆత్మాభిమానాన్ని కించపర్చటం హత్యానేరానికి ఏమాత్రం తీసిపోని నేరమని ఈ రచన ప్రతిపాదించింది.

"మూడు నెలలుగా చెబుతున్నాను. నేను పడుతున్న నరకయాతన. అది నీ చెవికెక్కలేదు. 'కొడుకు డాక్టరైనాడత్రే!' అనే విస్మయానందకరమైన పలకరింపులు చెవుల్లో గింగురుమంటూండగా కలల్లో తేలిపోయే నీకు నా గొంతులోని దుఃఖపు కేకలు వినబడనే లేదు.

పల్లెనుంచి పట్నానికి చేరినంత మాత్రాన నా స్థాయి ఏం పెరగలేదు. మెడికల్‌కాలేజీలో చేరి భుజంపై తెల్లకోటు వేసినంత మాత్రాన నా నెత్తిన కిరీటం, నా భుజాలకు రెక్కలు మొలవలేదు. అక్కడా యిక్కడా నేను దళితుణ్ణే. అస్పృశ్యుణ్నే.

"ఓ రేయ్! కోటిగాడురా! ఏంజాసు! థర్టీ పర్సెంట్ బ్యాచా!"

"మోహనారావా పేరు? ఏ మోహనారావు? మోహనారావు సెకునా? మోహనారావు సెజావా?"

విన్నావా? ఈ మాటలు వినిపించకుండా నా చెవుల్లో సీసంకరిగించి పొయ్యటం మరిచిపోయ్యావు! మాటలకు కొంత ఎనర్జీ ఫాక్టర్ వుంటుందనీ అది సీసం విప్పులా గుండెల్ని భగభగ లాడించగలదని నీకు తెలియదా?

ఎన్నో ఆశలతో యిక్కడకు వచ్చాను. ఇది నువ్వనుకున్నట్లు సర్వస్థానం కాదు. చిత్రహింసల కొలిమి.

ఏపాటి ధైర్యపు కవచాన్నీ, ప్రతిఘటనకు అవసరమైన కరకు గోళ్ళనూ, పంజాలను యివ్వకుండా నన్నీ అరణ్యంలోకి త్రోశావు!

హాస్టల్ టెర్రస్‌మీద, బట్టలన్నీ విప్పేదీసి మెడలో చెప్పుల దండవేసి " మీ బాంచన్ దొర కాల్మొక్తా! కోలాగాజ్జీ! దయచూపండి!" అని ఎలుగెత్తి అరవటం, ఎట్లావుంటుందో అనుభవం! ----- ------------

"ఎంతో భవిష్యత్తు వున్నవాడు. పసివాడు. ఇలాంటి దుర్మరణం పాలవటం గుండె తరుక్కుపోతుంది. ఏంచేశానో ఈ తరం యువకుల ఆలోచనా వ్యవస్థ సజావుగా లేదనిపిస్తుంది. మెదళ్ళనిండా భయం.

మాహన్రావు యిలా చెయ్యకుండా వుండాల్సింది. తల్లిదండ్రులకు ఎంత గుండెకోత......? -------------

"పూర్వం దళితులు సంస్కృతం నేర్చుకొన్నారని రాళ్ళతో కొట్టి చంపేవారు. స్వతంత్రం వచ్చిన నలభైయేళ్ళ తరువాత మళ్ళీ అదే పరిస్థితి. ఉన్నత విద్యలకు దళితులు పనికిరారు. పల్లెల్లో రైతుకూలీలుగానో, పట్టణాల్లో కార్మికులుగానో ఆఫీసుల్లో చప్రాసీలుగానో బ్రతకాలి. తెలివిగలిగిన ఒకరిద్దరు మోహన్రావులను ఇలా నిర్దయగా చంపి మిగిలినవాళ్ళకు హెచ్చరికచేసే కుట్రయిది. ఈ కుట్రను భగ్నం చెయ్యాలి" -----------

మాలో ఒకడి మరణానికి మేము స్పందించిన తీరు తలచుకుంటే జుగుప్సాకరంగా వుంది. రెండు కన్నీటిచుక్కలు. ఒక నిముషం మౌనం. ఏదీలేదు. పశ్చాత్తాపం అసలే లేదు. కుల విద్వేషాల్లో ఒకళ్ళనొకళ్ళు నరుక్కుని రక్తంతోనే మృతునికి సంతాపం చెప్పాలనే ఈ రాక్షస ప్రవృత్తి మాకెక్కడినుంచి వచ్చింది? (వి.చంద్రశేఖరరావు, సరీసృపాలు, దళితకథలు-3, పే140-145)

కులవివక్ష కుష్ఠుకంటే తీవ్రమైనదనే వాస్తవం, కుష్టురోగులుకూడా కులవివక్షపాటించటాన్నిబట్టి అర్థంచేసుకోవచ్చు. వీరిలోని కుష్ఠుకంటే బలీయమైన కులజాడ్యాన్ని చిత్రించిన రచన 'పెద్దరోగం'.

"ఇంకా రెండురోజులే ఉంది. కుష్ఠు ఆసుపత్రి తప్ప మిగిలినవి కేటాయించేశాం. ఆసుపత్రి లోపలికి వెళ్ళి ఎవరూ రాయమనంటున్నారు" మున్సిపల్ కమిషనర్ చాంబరులో జరిగిన అత్యవసర సమావేశంలో టౌన్ ప్లానింగు ఆఫీసరు ఫిర్యాదు చేశాడు.

"మీకంత శ్రమెందుకు సార్! నేనే రాస్తాను. నాపేరున ఆర్డరు వేయండి." అని పుస్తకాలు తీసుకొని ఊరికి దూరంగా వున్న కుష్ఠు ఆసుపత్రికి బయలుదేరేడు రవి.

"నాకు ఈ అవార్డు వద్దని రాసేస్తున్నాను రమేష్" ఒక నిర్ణయానికి వచ్చిన తరువాత రవిలోని బాధ, కోపం, ఆందోళన కొంత తగ్గినట్లనిపించింది.

"ఆసుపత్రి సంఘటన గురించేనా? పోనీలెండి ఒక మంచిపని చేస్తున్నారు. అంటరానివారి గురించి అంతచేసేం, ఇంతచేసేం అని ఆత్మవంచన చేసుకునే ఈ ప్రభుత్వం ఇచ్చే అవార్డులు తీసుకోకపోవడమే ఓ గొప్ప అవార్డు" అన్నాడు రమేష్ ఆవేశంగా.

"కీర్తి కోసమో, అపకీర్తి కోసమో ఈ అవార్డును తిరస్కరించడంలేదు. కేవలం ఆత్మసంతృప్తి కోసమే. కుష్ఠుకంటే ముందు కులాన్ని నయంచేసే ఆసుపత్రులు ఈ దేశంలో రావాలి" అంటూ గదిలోంచి బయటికొచ్చాడు రవి. (కెమెరా విజయకుమార్, పెద్దరోగం, దళితకథలు-5, పే 195-200)

కేవలం భారతదేశానికిమాత్రమే ప్రత్యేకమైన సామాజికాంశం 'కులం'కాగా, 'వర్గం' ప్రపంచవ్యాప్తంగా అన్ని సమాజాలను నియంత్రించే ప్రధానాంశంగా ఉంది. ఉన్నతవర్గానికి, పేదవర్గానికి మధ్య ఘర్షణ స్థల, కాలాలతో నిమిత్తంలేకుండా సాగే ఒక నిరంతరప్రక్రియ. ఈ ఘర్షణ భారతదేశంలో మిగిలిన సామాజికాంశాలతోపాటుగా విద్యారంగాన్ని కూడా ప్రభావితంచేయటం సహజపరిణామం. ఈ నేపథ్యంలో 'వర్గం', వర్గాలమధ్య ఘర్షణలు ప్రధానాంశాలుగా అనేక రచనల్లో చర్చకువచ్చాయి.

----------సామాజిక గుర్తింపు కోల్పోతున్న కులవృత్తులకారణంగా ఆర్థికంగా వెనుకబడిపోవటం, దాని ఫలితంగా విద్యకు దూరంకావటం.

----------విద్యకోసం సాంప్రదాయికంగా అనుసరిస్తున్న కులవృత్తులను వీడాల్సిరావటం

----------వ్యక్తుల జీవనవిధానాన్ని నియంత్రించేదిగా ఆర్థికమాంద్యం

----------ఆర్థిక పరిస్థితులకారణంగా ప్రాధామ్యాలలో మార్పులేర్పడి విద్యకుదూరంకావటం.

----------సమాజంలోని ఉన్నత, పేదవర్గాలకు రెండింటికీ విద్య ప్రయోజనం ప్రశ్నార్థకంకావటం

వంటి వర్గపరమైన అంశాలను తెలుగుసాహిత్యం తన కథావస్తువులుగా చేసుకుంది.

కులవృత్తిని నమ్ముకున్నవారి ఆర్థిక వెనుకబాటుతనం, ఫలితంగా విద్యకునోచుకోలేనితనం, పర్యవసానంగా జీవితంతో రాజీపడక తప్పని స్థితి-- వీటన్నింటిని వేదనాభరితంగా 'ఎడారి'లో చూస్తాం.

"నీకు మంచి మార్కులే వచ్చాయి. నా చదువుల తల్లి సరస్వతి..... ఇందరు అప్లికేషను పెడతావా....." అడిగాడు మార్కుల పట్టీచూసి.

"చదువమ్మా.... నా కొడుకువైనా, కూతురువైనా నువ్వే.... నా కష్టం తగ్గిద్దా(మని నువ్వేమీ మానేకు..... నా కష్టం నాకున్నదే..... ఇది నాకు కష్టంకూడా కాదు..... అంతా భగవత్సేవ..... అంచేత నిన్ను డాక్టరుచేస్తానని మీ అమ్మకు మాటిచ్చాను." అని అన్నాడాయన పాతవాటి పాతకాలం కుర్చీమీద కాళ్ళు జాపుకుంటూ. తండ్రి పేరున్న హరికథకుడే ఐతేమాత్రం ఇదేం గవర్నమెంటు ఉద్యోగమా, నెలనెలకి టక్కున డబ్బులు చేతిలో వాలడానికి. ఒక మాసం అధికం, ఇంకోమాసం అనావృష్టి. లేందానికి, వున్నదానికి అన్నిటికీ ఖర్చులు. ఎక్కణ్ణుంచి తెస్తారు తండ్రి. ---------------

"వీణ నేర్చుకుంటా నాన్నా...." అన్నది. తండ్రి ఒక్కసారి తలతిప్పి స్తంభంపక్క నిండున్న కమలవైపు చూసి "వద్దమ్మా... ఆ సంగీతపు చదువు వొద్దు. గాత్రం, నాట్యం నేర్చుకుని నేను బాగుపడ్డాను..... నువ్వు బావుకోడానికి..... తల్లీ వద్దు.... వద్దుతల్లీ.... వాటిజోలికి మళ్ళీ వెళ్ళొద్దు......" తండ్రి తల అటుతిప్పేసుకున్నాడు. "నేనెప్పణ్ణుంచో అనుకుంటుండేదాన్ని...... పదోతరగతి అయ్యాక వీణ నేర్చుకుందామని...... అది నాకు ఇష్టం...... నేర్చుకుంటానాన్నా....." గోముగా అడిగింది. (దాట్ల నారాయణమూర్తిరాజు, ఎడారి, యువ, డిశంబర్ '80, పే 155-160)

తరాల అంతరాల కారణంగా వ్యక్తుల ఆలోచనల్లో ఏర్పడే వైరుధ్యాలు ప్రధానంగా చర్చిస్తూ సాగిన రచన 'మాధవసేవ'. సాంప్రదాయికంగా వస్తున్న వృత్తివిద్య అర్చకత్వానికి గుర్తింపుకు లోటులేనప్పటికీ ఆర్థికంగా బాగా చితికిపోతున్న వాస్తవాన్ని ఓవైపు గ్రహిస్తూనే, సాంప్రదాయక వృత్తిని వీడలేకపోవటంతో వ్యక్తి ఘర్షణకులోనుకావటం ఇందులో కనిపిస్తుంది. అయితే చివరకు మానవసేవే మాధవసేవ అనే భావనద్వారా అర్చకవృత్తికిమారుగా వైద్యవృత్తిని స్వీకరించటాన్ని అంగీకరించటంద్వారా సామాజిక మార్పులకు అనుగుణంగా వ్యక్తుల ఆలోచనల్లో మార్పులు రావాల్సిన ఆవశ్యకత ఉందన్నవాస్తవాన్ని ఈ రచన గుర్తించింది.

"అందుకోసమేకాదు. ముఖ్యంగా అక్కడికి వెళ్తున్నది. వాణ్ణి, అక్కడ వేదపాఠశాలలో చేర్పించేందుకు తీసుకెళ్తున్నాను. నేను, కృష్ణ ఒక్క వేదం మించి చదివేసిన పట్టలేకపోయాం. విష్ణు ప్రజ్ఞావంతుడు. వాడు మంచి వేదపండితుడు కావాలని, సకల శాస్త్ర పారంగతుడు కావాలని, మన వంశ ప్రతిష్ఠ నిలబెట్టాలని నా కోరిక. అక్కడ విద్య పూర్తిచేసుకుని వచ్చి మన వంశ సాంప్రదాయం ప్రకారం ఇక్కడ రాములవారి సేవలో వాడి జన్మ ధన్యం చేసుకోవాలని నా ఆకాంక్ష" చెప్తూ నెయ్యి, ముద్దపప్పు, చింతకాయ తొక్కు కలిపిన ఒక ముద్ద నోట్లో పెట్టుకున్నాడు.

అన్నపూర్ణమ్మ, కృష్ణశర్మ, గాయత్రి, విష్ణు అంతా ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. అందరికీ ఏదో చెప్పాలని వున్నా ధైర్యం చాలక నోరుమెదపటంలేదు.

గాయత్రి ఎలాగో ధైర్యం కూడగట్టుకుని "మామయ్యగారు మీరేంఅనుకోనంటే ఒకవిషయం చెప్పాలనుకుంటున్నాను. ఈ ఇంటికి వచ్చాక మీకుగాని, అత్తమ్మకు, వారికిగాని ఏ విషయంలో ఎదురుచెప్పలేదు. కాని ఇప్పుడు ఈ విషయం నా కన్నకొడుక్కి సంబంధించింది కాబట్టి చెప్పక తప్పటంలేదు. వాడు పదవ తరగతిలో ర్యాంకు తెచ్చుకున్నాడు. వాణ్ణి ఈ అర్చకవృత్తిలో దించడం నాకు సుతరామూ ఇష్టంలేదు. వాడికి కాలేజీ చదువులు చెప్పించాలని మా ఆశ. వాడు బాగాచదివి డాక్టరు కావాలని మా కోరిక" గుండె చేతిలో పట్టుకుని చెప్పాలనుకున్న నాలుగు మాటలు గబగబా చెప్పేసి 'హమ్మయ్య' అనుకుని కొంగుతో నుదుటన పట్టిన చిరుచెమట తుడుచుకుంది. -----------

"విష్ణు సీటు తెచ్చుకోవడం పెద్ద కష్టమైన పనేమీకాదు" -----------

"అప్పటికీ, ఇప్పటికీ అర్చకులకు సంఘంలో గౌరవ మర్యాదలకు ఏలోటు లేదు నాన్నగారు. ఎటొచ్చీ ఆర్థికంగా బాగా వెనుకబడిపోతున్నారు. ఎన్నో ఆలయాల్లో ఆలయమాన్యాలు గ్రామపెద్దల చేతుల్లోకి వెళ్ళిపోయి అర్చకుల పరిస్థితి చాలా దయనీయంగా వుంది. కొందరు పూటగడవడం కూడా కష్టమైన దుస్థితిలో ఉన్నారు. మన విషయం కొంతవరకూ మెరుగే అయినా మనదికూడా ఎదుగూ బొదుగూ లేని జీవితమని అక్కయ్య, బావగారి అభిప్రాయం. ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో అక్కయ్య అలా మాట్లాడ్డంలో ఏం తప్పు లేదనిపిస్తోంది నాన్నగారు" వివరించాడు కృష్ణశర్మ. --------

"ఇంతవరకు తరతరాలుగా మనవంశం మాధవసేవలో తరించింది. ఈరోజు నామనవడు వైద్యవృత్తి చేపట్టి

మానవసేవలో తరిస్తానంటున్నాడు. దానికి నేనెందుకు అభ్యంతరం చెప్పాలి. మానవసేవంటే మాధవసేవే కదా" అంటున్న రామశర్మ వంక అక్కడున్న అందరూ ఆనందాశ్చర్యాలతో చూశారు. (జి.రవికృష్ణ, మాధవసేవ, కలాలు: డా॥జి.రవికృష్ణ కథలు, పే 1-7)

ఆర్థికమాంద్యం మనిషి జీవనపరిస్థితులపై ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తుందో వ్యంగ్యాత్మకంగా చిత్రించిన రచన 'ఇన్‌ఫ్లేషన్'. వ్యక్తులు శ్రమపడి తమవిద్యాస్థాయిని మెరుగుపర్చుకున్నప్పటికీ ఆర్థికమాంద్యం పరిస్థితులను మరింతగా సంక్లిష్టంచేసి జీవనవిధానాన్ని నిర్దేశించటాన్ని ఇది గుర్తించింది.

'నాలుగేళ్ళ క్రితం అన్నయ్య రఘుకి బి.ఎస్‌సి. లో డెబ్బైశాతం వస్తే యూనివర్సిటీలో అతనికొక్కడికే ఎమ్మెస్సీలో సీటువచ్చింది. ఇప్పుడు బి.ఎస్‌సి లో ఎనభైఐదు శాతం వచ్చినా తనపేరు అన్నింటిలోనూ వెయిటింగ్‌లిస్ట్‌లో ఉంది ఎందుకు?

అమాటే అతను రఘుని అడిగాడు. రఘుకి నవ్వు వచ్చింది. అతనికి అంతుపట్టని విషయం మరొకటి ఉంది.

'ఇంటి పక్క కామేష్‌కి ఆరేళ్ళక్రితం ఎం.ఎస్‌సిలో యాభైఎనిమిది శాతం వచ్చింది. అతనికి ఆరునెలల్లో లెక్చరర్ ఉద్యోగం వచ్చింది. తనకి ఎం.ఎస్‌సిలో డెబ్బైఅయిదు శాతం వచ్చింది. రెండేళ్ళయినా ఇంతవరకూ ఉద్యోగంలేదు. కారణం? ఆ మాటే చెల్లెలు రాధకి చెప్పాడు.

ఎకనామిక్స్‌లో 'ఇన్‌ఫ్లేషన్' గురించి చదువుతున్న రాధ తలెత్తి చూసింది. ఆమె నవ్వుకుంది. ఆమె ఊహాక్కూడా అందని విషయం ఒకటుంది.

జీతాలు, మార్కులు, క్వాలిఫికేషను పెరిగినా కావలసినవి ఎందుకు కావటంలేదో వాళ్ళలో ఎవరికీ అర్థంకాలేదు. రాధ తాను చదువుతున్న ఎకనామిక్స్ మీద మనస్సు లగ్నం చెయ్యడానికి ప్రయత్నించింది. 'ఇన్‌ఫ్లేషన్' ఆమెకు ఎంతకీ అర్థంకాని చాప్టర్ అది. అయితే ఇప్పుడు తమ పరిస్థితిని అవగాహన చేసుకున్న రాధకి ఆ చాప్టర్ బాగా అర్థమవుతోంది. (వి.మోహన్‌కుమార్, ఇన్‌ఫ్లేషన్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 30-12-'81, పే 28-31)

కుటుంబ ఆర్థికస్థితిగతులతోపాటు, ప్రాధామ్యాలుకూడా పసిమనసులను బండబార్చి, విద్యకు దూరంచేస్తాయన్నది 'ఒకమొగ్గరాలింది' కథాంశం. తమ్ముడి విద్యను ప్రధానమైన అంశంగా భావించలేని అన్న నైజానికిబలైన పసిమొగ్గ శ్రీహరి.

శ్రీహరి మాటల్లోని గాద్గదికం కుమారస్వామిని కదిలించింది. లోకం బురదగుంటలో పడి నిస్సహాయంగా నిలుచున్న బండివాణ్ణి చూసి, దారినపోయే జనంలో నవ్వేవాళ్ళూ, 'అయ్యోపాపం' అని జాలిచూపించి పెదవివిరిచే వాళ్ళే చాలామంది. కుమారస్వామికాసమయంలో శ్రీహరి కెందుకో సహాయం చెయ్యాలనిపించింది.

"ఫీజు కట్టకపోతే ఏడాది చదువూ వృథా అయిపోతుంది. సరే, నాతో యింటికి రా. ఆ డబ్బు నేను సర్దుతాను. తరువాత తిరిగి ఇవ్వవచ్చు" అన్నాడు.

శ్రీహరి మాటలతో కృతజ్ఞత తెలుపుకోలేదు. భుజం మీద వేసిన చెయ్యిని తీసి కళ్ళకద్దుకున్నాడు. -------------

కాపుదాని చెట్టునుంచి, ఎదగని చెట్టునుంచి ఫలాల్ని ఆశించే మాలిలా కనబడ్డాడు రామకోటి - శ్రీహరికి. ఒకరకమైన విక్షిప్తత మనసులో రోలుచేసుకుంటుండగా, లేచి లోపలికివెళ్ళి లెక్కలపుస్తకంలో దాచిన డబ్బు తీసి అన్నచేతికిచ్చాడు. ఆ రాత్రి శ్రీహరి మనసులో ముసురుపట్టింది. కలవరింతల కలతనిద్రే శరణ్యమైంది. మరునాడు కూడా బారెడు పొద్దెక్కినా, సూర్యుడి కిరణం భూమ్మీద పడలేదు. ------------

"కాఫీ త్వరగా కలుపు. తల నొప్పిగా ఉంది" అంటున్నాడు రామకోటి వంటగది గుమ్మం మీద కూర్చుంటూ.

"అదే ప్రయత్నంలో ఉన్నాను. వెధవ బొగ్గులన్నీ తడిసిపోయాయి. పాతకాగితాలేమైనా ఇవ్వండి అంటించడానికి" అంటోంది రామకోటి భార్య.

శ్రీహరి తన లెక్కల పుస్తకం వంటింట్లోకి తీసుకువెళ్ళి, వాళ్ళ ఎదురుగా నాలుగైదు పేజీలు చింపి, వదినచేతిలో ఉంచాడు హాయిగా, వింతుగా నవ్వుతూ. ఒక పసి హృదయం బండబారింది. వికసించబోయే ఒక కుసుమం మొగ్గగానే రాలింది. (పింగళి వెంకటరమణారావు, ఒక మొగ్గ రాలింది, ఎలక్షన్ కథలు, పే 151-154)

సామాజికంగా రెండు విభిన్నవర్గాలకు విద్య ప్రయోజనకారి కాలేకపోవటాన్ని చిత్రించిన రచన 'రెండుమరణాలు'. ఇందులో రమణ, గట్టయ్యలు ఇద్దరు విద్యార్థులుగా కాక రెండు సామాజికవర్గాలకు ప్రతినిధులుగా నిలుస్తారు. ధనిక దోపిడీ వర్గానికి ప్రతినిధి అయిన రమణ జీవితానికిగాని, పేద శ్రామికవర్గానికి ప్రతినిధిగా గట్టయ్య జీవితానికిగాని విద్య ప్రయోజనకారిగా నిలవలేకపోయింది. ఇందులో విద్య సామాజిక ప్రయోజనాన్ని ప్రశ్నించటం చూస్తాం. ఫలితంగా వ్యాపార వర్గం, శ్రామికవర్గం విద్యను ప్రయోజనరహితమైందిగా భావించటం గమనించవచ్చు.

రమణ తండ్రి కృష్ణమూర్తి ఊసరవెల్లి అవతారమెత్తుతున్న ఆ పట్టణంలో మంచి బిజినెస్ మాగ్నెట్. బ్రాందిషాపు - దానిపైన లాడ్జింగ్ బరవ్ నుండి ఎరువులదాకా విస్తరిస్తున్నవాడు. ఆ విస్తరణలో రమణగానికి అక్షరజ్ఞానం తప్ప చదువుక్రింద అణిగిపోవడం వద్దు - తన యావదాస్తిని చతురతతో నడుపగల " రఫ్ అండ్ టఫ్" కావాలి. బడిలో బల్లలమీద కూర్చునే పిల్లవాడు లోకజ్ఞానం కోల్పోయి వట్టిదద్దమ్మ అవుతాడని అతని నమ్మకం. --------------

ఫలితంగా ఉదయం తొమ్మిదినుండి రాత్రి పన్నెండు గంటలవరకు రమణ చైతన్యం క్రమంగా ఆ బ్రాందీ షాపులో పాతుకపోయింది. ----------

రమణ ఆరోగ్యవంతమైన మున్నటిబుగ్గల్లో దాగున్నది అమాయకత్వం కాదని, అతని తెలివితేటలు మానవులకు సుఖసంతోషాలు ఇచ్చేవి కావని -- రమణ కొంటె ప్రశ్నలవెనుక, వ్యంగ్యంవెనుక వ్యాపారవిలువలున్నాయని యాతనతో అర్థమయ్యింది. కాని గట్టయ్య అమాయకత్వంవెనుక, ప్రశ్నలవెనుక, మౌనంవెనుక, పెనుగులాటవెనుక విజాయితీగల స్వచ్ఛమైన ప్రేమ దాగున్నదని, ఆ కళ్లవెనుక మానవజాతిపట్ల ఒక తీవ్రమైన పట్టింపున్నదని ఆలశ్యంగా అర్థమయ్యింది. ----------

బతుకడంకోసం'విద్య'ముఖ్యం. బడిలో నేనుచెప్పే విద్య ఇద్దరికి పనికిరాదనుకున్నారు. వాళ్ళిద్దరికి కావల్సిన విద్య చెప్పేతం నావిల్లకాదు. ఇద్దరు బడిమానుకున్నారు. రమణ బ్రాందిషాపులో నిత్యం గ్లాసులు, కాసుల గలగలలతో విద్యనారంభించాడు. రమణ పెట్టిపుట్టినవాడు గనుక.

కూటికోసం కోటివిద్యలు గనుక అలాంటివిద్యల్లో సైకిల్‌షాపు విద్య ఒకటని గట్టయ్య ఎంచుకున్నాడు. కాని అతని బతుకు దినదిన గండం నూరేళ్ళాయుష్షు. (అల్లం వీరయ్య, రెండు మరణాలు, రుతుపవనాలు, పే 196-205)

కులంపేరుతో నిమ్నవర్గాలు అణచివేతకు గురికావటాన్ని నిరసిస్తున్న సామాజికవిభాగం ఒకటికాగా, కులం ప్రాతిపదిగా అమలౌతున్న రిజర్వేషన్ల కారణంగా అసలైన ప్రతిభకు గుర్తింపులేకపోవటాన్ని నిరసించే సామాజికవిభాగం మరోవైపు కనిపిస్తుంది. అయితే కులపరంగా జరుగుతున్న అణచివేతతో పోల్చితే ఇది లెక్కించదగ్గ అంశంకాదన్నది మరోవాదన. ఇంకా రిజర్వేషన్లమిషనుచూపుతూ దళితవర్గాల్లో రిజర్వేషన్లప్రమేయంలేకుండా జనించే ప్రతిభనుకూడా గుర్తించ నిరాకరించే సామాజికభావనను ప్రశ్నించడంకూడా గుర్తించవచ్చు. మొత్తంమీద ప్రతిభ-కులం-రిజర్వేషన్లు-- ఈ మూడింటికిమధ్య నిరంతరం జరిగే ఘర్షణలను సాహిత్యం చిత్రించింది.

----------ప్రతిభకు కులప్రాతిపదికగా అమలయ్యే రిజర్వేషన్లకు మధ్య నిరంతర ఘర్షణ

----------రిజర్వేషన్లకారణంగా నిజమైన ప్రతిభకు అన్యాయం జరుగుతుందనే సామాజికవర్గాలు

----------కులం మాటున దాగిఉన్న ప్రతిభను గుర్తించ నిరాకరించే అగ్రకుల అహంకారం

వంటి ప్రతిభ చుట్టూ పరిభ్రమించే అంశాలు అనేకం చర్చకువచ్చాయి.

కులంప ప్రాతిపదికగా అమలుచేస్తున్న రిజర్వేషన్లకారణంగా ప్రతిభకు అన్యాయం జరుగుతుందన్నది ఒక వాదన. కులపరమైన అణచివేతతో పోలిస్తే ఇది అంత గణనీయమైన అంశం కాదన్నది ప్రతివాదన. కులపరమైన ఈ వివక్షను సమాజానికిచెందిన వికృతరూపంగా పేర్కొంటుంది 'మకరముఖం'.

"రిజర్వేషన్ కోటాలో ఉద్యోగం కొట్టేశావోయ్! అదృష్టం అంటే మీ 'ఎస్సీ' గాళ్ళదే అంటూ మా ఊళ్ళో ఒక అగ్రవర్ణ మిత్రుడు ఎద్దేవా చేస్తే కలవరం పుట్టింది నాకు.

"అంటే, నా ప్రతిభవల్ల నాకీ ఉద్యోగం రాలేదంటావా" అని నిలదీశాను ఆ అగ్రవర్ణ మిత్రుడిని.

"ప్రతిభ వీధి కాదోయ్! నీ కులానిది" అంటూ అసూయ విషంలా కక్కాడతను. ----------

"స్వతంత్రం వచ్చి ఇన్నేళ్ళయింది. ఇంకా రిజర్వేషన్లు కొనసాగిస్తే ప్రతిభగల వాళ్ళంతా మట్టిగొట్టుకుపోతారు" అన్న మాటల్ని నేను కాలేజీ చదివేరోజుల్నించి వింటూనే ఉన్నాను.

"ఎస్.సి., ఎస్.టి. లాంటి కులాలకు ప్రభుత్వం ఎన్నో విద్యావకాశాలు కల్పిస్తోంది. ఉచిత చదువు, ఉచిత భోజనం, బట్టలూ - ఇదంతా చాలదా వాళ్ళ అభివృద్ధికి? ఈ అవకాశాలను ఉపయోగించుకొని వాళ్ళు పోటీ పడాలి. అంతేగాని, కులంపేరుతో ఏ ప్రతిభా లేకుండా ఉద్యోగాలు ఇంకా కొట్టేయాలనుకోటం సాంఘిక ద్రోహం" అని మా లెక్చరరొకాయన ఉపన్యాసం దంచేస్తుంటే మండుకొచ్చేది నాకు. ------------

"అదే గుడి -- అదే స్కూలు" మాపించాడతను.

"అదేమిటి, ఆయన ఎండలో నిల్చుని పాఠాలు చెబుతున్నారే" అన్నాను దాదాపు వణుకుతున్న కంఠంతో.

"అతను హరిజనుడంటే హరిజనుడు. తప్పదుమరి."

అతి సాధారణమైన విషయంలా ఎంతో అలవోకగా అతను చెబుతూంటే, నా నాభిలో మంట రగిలి, గుండెల్ని ఎగదన్ని శరీరం దహించుకుపోతున్నట్టుగా అలాగే కాలుతూ కాలుతూ నిల్చుండిపోయాను నేను. కొద్ది క్షణాల తర్వాత సంబాళించుకొని, అతని ముఖంలోకి నిశ్చలంగా చూస్తూ, "నేను కూడా హరిజనుణ్ణే" అన్నాను దృఢంగా. (సింగమనేని నారాయణ, మకర ముఖం, సింగమనేని నారాయణ కథలు, పే 12-18)

కులం, కులస్పృహ వ్యక్తిగత ప్రతిభను వెలుగుచూడనీయకపోవటం, ప్రజ్ఞ, కృషితో గుర్తింపుపొందాలనుకున్న వ్యక్తి అందుకు విరుద్ధంగా కులం తనను వెంటాడి వేధించడాన్ని జీర్ణించుకోలేకపోవటం ప్రధానాంశంగా వచ్చినరచన 'భరతపుత్రుడు'.

"సెంద్రా నువ్వు చెప్పే మాటలు నాకర్థంగావురా.... ఎవుర్ని--ఎవుర్నంతరాలమీద కూకోబెడతాయిరా ఈ సదువులు?

నవుల్దాలా ఊళ్ళో జనం. తిండానికి తిండిలేక మునసబు పొలాన్ని, మునసబు ఊతిగాన్ని నమ్ముకుని నేను మిమ్మల్ని బతికించడమే కాదురా..... మా అయ్యా సెప్పులు కుట్టి బతికిచ్చాడు మా అందర్నీ. అలాంటోంశంలో పుట్టిన నీకు సదువులమీద మమకారం ఏందిరా? మానుకో.... ఇకనైనా మానుకుని మునసబుగారికంటా లెక్కల్రాయి...."

చెప్పేశాడు శివయ్య. అతని మనస్సులో ఉన్నమాట....కొడుకు భవిష్యత్తు ఎల్లల్ని నిర్ణయించేసింది. ఆ మాట..... అలాంటి మాటలు ఎప్పుడూ అంటుంటాడు!

రాత్రి పన్నెండయినా చమురు దీపం ముందు కూర్చుని చదూకుంటోంటే ఎప్పుడూ అంటుంటాడు!!! అవేవీ నచ్చవ్ చంద్రకు... ఈ నేలబారు బ్రతుకుల్నుంచి ఎదగ్గూడదనుకునే ఉద్దేశాలే నచ్చవ్..... అందుకే....

సమస్యల వలయపు బ్రతుకునుంచి విడివడడానికి అనుకున్న ఒకే ఒక ఆయుధం.... చదువు!

అదే ప్రాణంగా.... దాన్నే ఊపిరిగా మలుచుకునే చంద్రకు.......

ఇంట్లో పోట్లాడి, పోరాడి కాలేజీలో జాయిన్ అవ్వడం అంత కష్టంకాలేదు కాని...

మొదటి రోజుకాలేజీలోనూ.... ఆ తర్వాతెన్నోసారులు......

క్లాసులో చంద్ర కనబరిచే ఇంటలిజెన్సీ... దాన్ని రిప్రజెంట్ చేసే మెరిట్, ఇదంతా చూసి -- చూస్తూ కూడా.......

"మీరంతా గవర్నమెంటు ముద్దుబిడ్డల్రా బాబు. ఏముంది ఏ ఇంటరో అయిపోయిందంటే చాలు.... ఉద్యోగాలు పిలుస్తాయ్ మిమ్మల్ని. ఉద్యోగాలు వచ్చేదాకా మా నెత్తురు పీల్చేసుకుని సంపాదించుకునే డబ్బుతో మీకు అష్టైశ్వర్యాలు.... ప్చ్....దేనికైనా అదృష్టం ఉండాలి...." అంటుండేవాళ్ళు క్లాస్‌మేట్స్--

తన వెనకబడిన కులాన్ని వెలుపెట్టి చూపిస్తున్నారనే బాధకంటే..... తన బ్రిలియన్స్ వెనుక -- తన అద్భుతమైన మెరిట్ వెనుక.....

బోల్డంత ఆరాటం ఉంది... అంతకు మించి కష్టం ఉంది. ఇవన్నీ -- ఇవన్నీ -- గమనించరేం...?!

ఇక మీన్ మెంటాలిటీస్ సమస్య పోయింది.....

ఇకంతా చదువు -- మెచ్యూర్డ్ మెంటాలిటీస్ మధ్యేగా అని హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు. వాళ్ళలోనూ ఎంత టార్చరింగ్ ఉంటుందో చాలా త్వరగా తెలిసిపోయింది చంద్రకు. ---------

రీసెర్చ్....!

అక్కడా అంతే -- గైడ్ నానాసమస్యలు సృష్టించేడు. అయినా రెండు సంవత్సరాల్లో చంద్ర థీసిస్‌ని ఏక్సెప్ట్ చెయ్యక తప్పలేదు. -----------

ప్రపంచం మొత్తం నన్నో తక్కువకులం వాడికింద జమకట్టి జాలిపడి ఉద్యోగం ఇస్తానంటోంది తప్ప.... తక్కువ కులం వాడిలోనూ ఎక్కువ తెలివి తేటలున్నాయ్ అని గమనించడంలేదు. ---------------

గది మధ్యలో ... సీలింగ్ ఉచ్చుకి వేలాడుతోన్నాడు చంద్ర....

కాదు... చంద్ర... కాదు.

అపూర్వమైన.... అద్భుతమైన 'ప్రజ్ఞ'కి అది 'ఉరి'...!!

రేఖకి గుండాగిపోయినట్లైంది.

ఉబ్బిన కనుగుడ్లు దేన్నో ప్రశ్నిస్తున్నాయ్.... దేన్ని...?!

యుగాలు మారినా మారని మనుష్యుల మనస్తత్వాన్నా...??

ఒక విజ్ఞానపు ఉత్తుంగ తరంగాన్ని మట్టిలో కలిపివేసిన ప్రభుత్వ పాలసీల మరో కోణాన్నా?!

దేన్ని చంద్ర ప్రశ్నించేది....? -----------

ఇలాంటి భరతభూమిలో.... చంద్రలాంటి భరతపుత్రులెంత మంది ఆహుతౌతున్నారు....?! ---------

'మంచికి' 'ప్రజ్ఞకి' మానవతా విలువలు దొరక్క తమకు తామే ఆహుతైపోయే జ్ఞానుల్ని రక్షించండి. కాపాడండి!
(వి.కె.చైతన్య, భరతపుత్రుడు, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 3-5-'90, పే 32-36)

సామాజికంగా చోటుచేసుకునే మార్పు సంస్కృతీపరంగా కూడా అనేక ఘర్షణలకు

కారణమైంది. దళితులను స్వల్ప ఆకర్షణలతో మతాంతరీకరణకు గురిచేయటంతో వారు ప్రభుత్వసౌకర్యాలను కోల్పోవాల్సివచ్చింది. సరళీకృత విధానాలు దేశసంస్కృతిని, తద్వారా పిల్లల సాంస్కృతిక అలవాట్లను ప్రభావితంచేశాయి. విద్యారంగంలో ఆదర్శాల పేరుతో ఒకవైపు, అవినీతికారణంగా మరోవైపు విద్యార్థులు విద్యకుదూరమై హింసా సంస్కృతిని అలవర్చుకోవటం నిరంతరం జరుగుతున్నది. గిరిజనులను హింసపేరుతో సాంస్కృతికంగా పరాయీకరణకు గురిచేస్తూ ఆర్థికంగా పరాధీనులయ్యేందుకు కారణంకావటం మరో అంశం.

----------మతాంతరీకరణ దళితులను కులవివక్షనుంచి కాపాడకపోగా కులపరంగా లభించే ప్రభుత్వ సౌకర్యాలకుకూడా వారిని దూరంచేయటం

----------ఆదర్శాలపేరుతో విద్యార్థులను హింసకుపురిగొల్పి వారిని హింసావాదంలో సమిధలుగా మార్చే సంస్కృతి ఒవైపు

----------సామాజికఅవినీతి కారణంగా విద్యా, ఉద్యోగావకాశాలు మృగ్యమై సమాజంపట్ల ద్వేషంతో హింసామార్గంలో పయనించే సంస్కృతి మరోవైపు

----------స్థిరీకరించబడిన సాంస్కృతికవిలువలు నేపథ్యంగా తనచదువుకోసం సర్వం త్యాగంచేసిన తల్లినికూడా ద్వేషించే విధంగా పిల్లలప్రవర్తనపై ప్రభావంచూపుతున్న సామాజికపరిస్థితులు.

----------అభివృద్ధిపేరుతో చేపట్టేచర్యలు గిరిజనులను ఆర్థికంగా, సాంస్కృతికంగా పరాయీకరణకు గురిచేసేవైనం

----------సరళీకృతవిధానాలకారణంగా పాఠశాల విద్యార్థులపై జరుగుతున్న సాంస్కృతికదాడి

ఇలా సాంస్కృతికంగా విద్యారంగంలో చోటుచేసుకున్న అనేక అంశాలు చర్చకువచ్చాయి.

మతాంతరీకరణ కారణంగా దళితులు మతపరమైన ప్రయోజనాలు పొందకపోగా, కులపరంగా ప్రభుత్వంనుంచి లభించే సౌకర్యాలుకూడా దూరంకావటాన్ని చర్చించినరచన 'ఆ బోర్డింగుకి ఎల్లను'. ప్రభుత్వహాస్టళ్ళకంటే అధ్వాన్నంగా పనిచేస్తున్న మైనార్టీసంస్థల బోర్డింగ్‌ల పనితీరు ఇందులో ప్రధాన కథనం. కులంపేరుతో పిల్లల ఆత్మగౌరవాన్ని కించపర్చే దండనలు, దూషణలు బోర్డింగ్‌లపట్ల పిల్లలకు అభద్రతాభావాన్ని ఏర్పర్చాయి.

"ఆరోగ్యం కాదు. ఆ వార్డెను పాములోరు ఉన్ని తంతారంట. కొడతారంట. తోటపని సెయ్యాలంట. కూడు సరిగా ఉండదంట. ఆ నీల్ల మజ్జిగ అన్నంలో పోసుకుంటే -- పళ్లెం నిండా పురుగులు తేలతాయంట......."

ఒకనాడు మరి యేమయ్యిందో -- వొక పాప నిద్దరలేవలేదంట. అల్ల వార్డినమ్మగారు మా సిన్నమ్మను, ఆపాపను పిలిసి మోకాళ్లదండ యేయించి, ఎనిమిదిగంటలనుంచి తొమ్మిదిన్నర దాకా మాసిన్నమ్మను ఆ పాప సెవులకాడ గంట కొట్టమందట ఆ వార్డినమ్మగారు.

సెవులు దిమ్మెక్కి పాపం ఆ పాప యేడ్సి యేడ్సి పడిపోయిందట. అల్లకేం తెలుసు పిల్లల్ని పెంచటం. ఎంత తప్పుసేత్తే మాత్రం యిట్టానా బయం నేర్పేది?" కళ్లెర్ర సేసింది సౌరిలాత.

"మనపేర్లు సెప్పి కోట్లకు కోట్లు ఇతరదేశాలనుంచి డబ్బు తెప్పుకొనేది చాలక ఇంగ్లీషుమీడియం, హైదరాబాదు స్టాండర్డ్ అంటూ గొప్పోళ్ళ పిల్లలకి చదువులు చెప్పడం, హాస్టలోళ్ళు కట్టించి డబ్బులు వసూలుచేస్తూ ఏదో ఒకటి రెండు బోర్డింగుల్లో ఉచితంగా పిల్లల్ని చదివించినంత మాత్రాన పిల్లల్ని ఇలా చిత్రహింసలు పెడుతున్నారు. అదేమి అనే వాళ్ళు లేకపోవడంతో పసిపిల్లలమీద వాళ్ల కిరాయి మనస్తత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. ఎవరన్నా ఎదురుతిరిగితే వాళ్ళను ఇంటికి పంపించటం. ఈ బోర్డింగులకన్నా ఆ గవర్నమెంట్ హాస్టళ్లే నయం. పిల్లలే వార్డనుమీద పోట్లాడి మరీ మంచి అన్నం తింటారు. చదివినా, చదవకపోయినా వీళ్ళని పట్టించుకునే వాళ్ళుండరు. ఈ బోర్డింగుల్లో ఎంత హింసించినా, గవర్నమెంటు హాస్టళ్లో కంటే ఎక్కువమంది పాస్ కావటంలేదు" జానుబాబు సెప్పిందు.---

"మనం మతపోల్లం కదా! మరి మనకు ఆ గవరమెంటు ఆట్టల్లో సీటు దొరుకుద్దా."

నాకు అనుమానంగానే ఉంది. (గుడిసె ఏసోబు, "ఆ బోర్డింగుకి యెల్లను", దళిత కథలు, పే 24-27)

విద్యాగంధంతో వికసించాల్సిన విద్యార్థులు సాయుధవిప్లవం, పోరాటం, పేదలరాజ్యం వంటి

ఆదర్శాలపేరుతో తమ జీవితాలను బలిచేసుకోవటాన్ని విద్యారంగానికి సంబంధించినంతవరకు ఒక అవాంఛనీయ సంఘటనగా పేర్కొంటూ, ఫలితంగా సామాజిక నిబద్ధత కలిగిన వ్యక్తులను సమాజం పోగొట్టుకోవటాన్ని చిత్రించిన రచన 'ఆర్నెల్లదాకారాను'.

"సాయుధ విప్లవం తప్ప ఈదేశం బాగుపడాలంటే మరో మార్గంలేదు. హింసకు ప్రతిహింసే సమాధానం. తుపాకీ గొట్టంలోంచే రాజ్యాధికారం సంక్రమిస్తుంది. మనం మన శ్రమజీవుల రాజ్యాన్ని స్థాపించినప్పుడే ఈ అన్యాయాలు నశించి పోతాయి. మనం సమసమాజాన్ని స్థాపిస్తాం. కాబట్టి ఈనాడు అణగదొక్కబడ్డున్న మీలాంటివాళ్ళందరూ సమైక్యం కావాలి. దళితులు, బలహీన వర్గాలవాళ్ళు, అణగదొక్కబడినవాళ్ళు అందరూ ఏకంకావాలి. ప్రజాస్వామ్యాన్ని స్థాపించాలి. ఇప్పుడు సాగుతున్న గెరిల్లాపోరాటాన్ని ఇంకా ఉధృతం చేయాలి. అందుకు యువకులైన మీరంతా సిద్ధంకావాలి. మీరు సిటీలోనే ఉంటూ విద్యార్థుల్ని ఆర్గనైజ్ చేయాలి. కొంతకాలం తర్వాత మిమ్మల్ని దళాల్లోకి పంపిస్తాము. అంతవరకు సిటీలోనే కొన్ని బాధ్యతల్ని అప్పగిస్తాం. మీకప్పగించబడిన పనుల్ని జాగ్రత్తగా చేస్తుండండి. లాల్‌సలామ్" అంటూ లక్ష్మీపతి ముగించాడు. ---------------

మూడురోజుల తర్వాత ఓరోజు తెలతెలవారుతూండగా వాళ్ళముగ్గుర్నీ పోలీసులు జీపులో ఎక్కించుకొని ఆ ఊరి శివార్లలో ఉండే మామిడితోటదగ్గరకు తీసుకొచ్చారు.

"మీ ముగ్గుర్నీ వదిలేస్తున్నాము. వెళ్ళిపోండి. కమాన్ పరిగెత్తండి" అన్నాడు ఎస్.ఐ

వాళ్ళు పరిగెత్తే స్థితిలో లేరు. అయినా వాళ్ళలో బతికి బయటపడతామేమోనన్న ఆశ చావలేదు. ఆ ఆశవల్లనే వాళ్ళలో కదలిక ప్రారంభమైంది. వాళ్ళుముగ్గురు జీపుదగ్గర్నుంచి అతి కష్టంగా కొంచెం ముందుకెళ్ళారు.

"ఢాం.......ఢాం......ఢాం....." మూడుసార్లు తుపాకులు పేలాయి. మరుక్షణంలో ముగ్గురూ మూడు శవాలుగా మారిపోయారు. (నవీన్, ఆర్నెల్లదాకారాను, ఇండియా టుడే, 26-1-'99, పే 38-40)

అవినీతి కారణంగా విద్యావకాశాలను పోగొట్టుకుంటున్న వ్యక్తులు కసితో హింసామార్గాన్ని చేపట్టే ప్రమాదాన్ని శంకిస్తూ వచ్చినరచన 'నేర్పిందెవరు'

సుధీర్ ఇంతింత దిగజారిపోయినట్లు నీరసంగా మాట్లాడాడు. "సీట్లన్నీ అయిపోయాయమ్మా -- కొత్తగావచ్చినవాళ్ళు అసలు బి.సి యే ఐనా ఎస్.సి లా చేరారు. రికమెండేషన్లతో వచ్చినోళ్ళు, వాళ్ళను చేర్చడానికి ఖాళీలు లేకనే అసలు మమ్మల్ని తీసేసినట్లు అంటున్నారు! పోనీయండమ్మా -- నేను యిక్లాను చదివి మాత్రం చేసేదేముంది? నాకు వచ్చే ఉద్యోగమేమిటి! ఎందుకింకా నాకు చదువు!" ఆ మాటలు అంటూనే సుధీర్ రోషంగా వెళ్ళిపోయాడు.

ప్లేటుమీద అన్నం కుతకుత తెర్లుతూంది. సుధీర్ గుండెల్లో -- పదవితో, డబ్బుతో, అధికారం చెలాయించుకుంటున్న, పెద్దమనుషులున్న ఈసమాజం పట్ల, భావినేతలకు భరోసాఇవ్వని ప్రభుత్వం పట్ల కసితో ఇలాగే ఉడికిపోతున్నాడని పించింది రత్నకు.

ఒకనాడు యీ విద్వంసకూడా దొరక్కపోతే బందూకితో ఎదురుతిరగడు కదా! (రాజీవ, నేర్పిందెవరు?, జ్యోతి, ఆగస్టు '74, పే 25-30)

సమాజంలో ముందుగానే కొన్నివిలువలను ఏర్పరచుకుని, ఆ విలువలపరిధిలో, వాటికనుగుణంగా వ్యక్తుల ప్రవర్తనలుండాలన్న సూత్రాలను రూపొందించుకోవటం జరిగింది. అయితే స్థల, కాలాలకు అనుగుణంగా ఆ సూత్రీకరణలలో మార్పులను ఆహ్వానించాల్సిందిపోయి అవే విలువలకు సమాజం బానిసగామారి, ఆ పరిధిలోనే వ్యక్తుల నైతికతను అంచనావేసేందుకు ప్రయత్నించటంతో వ్యక్తుల ఆత్మగౌరవానికి భంగం కలుగుతోంది. ఇది విద్యాపరంగా విద్యార్థికిగల పాఠశాల సంబంధాలపై తన ప్రభావాన్ని చూపుతున్నది. ఫలితంగా సామాజిక నియంత్రణకు గురైన విద్యార్థి తన తల్లిని ద్వేషించే వ్యక్తిగా రూపొందినవైనమే 'కడుపుతీపి'లో కథాకథనం.

ఇపుడు వాడి కాంపోజిషనే దిద్దుతున్నాను. కాదు. ముత్యాల్లా పేర్చిన అక్షరాలు చూస్తున్నాను. భావాలు ఆవేశ పూరితాలు. విషయాల్ని చక్కగా సేకరించి, 'మాలతి మందార మాలలుగా కూర్చి'నట్లే వ్రాస్తాడు.

'సార్ ......' ఆ గొంతు ఎల్లన్నదే.

'రా. రా. నీ పుస్తకమే దిద్దుతున్నా.'

'సార్. పుస్తకమయితే దిద్దగలరేమో గాని నా జీవితాన్ని దిద్దుతారా?'

వయసుకి మించిన భావాలు వాడు వెలువరిస్తాడని తెలిసిన నేను ఆశ్చర్యపడలేదు. కాని ఆ వాక్యాన్నే మననం చేసుకుంటూ వాడివైపు చూశా.

చురుగ్గా వెలిగే కళ్ళల్లో విరుపేదన రెప్పల్ని తడుపుతోంది. -------------

'ఓరేయ్ కిట్టనివాళ్ళేదో అన్నారేమో. మీకనవసరం. వాటిజోలికి పోవాల్సిన పనిలేదు. కులం కాదు ముఖ్యం. గుణం.

మనపరువు నిలబెట్టే ప్లూరెంట్ వాడే. వాళ్ళే అల్లరిపిల్లగవని నాకు మాటిచ్చాండి. స్థిరంగా అన్నాను. ---------

కవరు తెరచి చూశాను. ముత్యాల్లాంటి అవే అక్షరాలు..... అమ్మా అని రెండుసార్లు రాసి కొట్టివేయబడింది. 'నిన్నెందుకో అలా పిలవాలనిపించడంలేదు. నా తల్లి అరుంధతి, సుకన్య, సుమతి, అనసూయల వంటి పతివ్రత అనుకున్నాను. ---------------- నువ్వెప్పుడు నాదగ్గరికి రాకు. వస్తే చస్తాను. నన్ను మర్చిపో. నీకు కొడుగ్గా పుట్టినందుకు జీవితాంతం కుమిలిపోయే దౌర్భాగ్యుడు -- ఎల్లన్న.'

ఆవేదనని అక్షరాల్లో పొదిగి, తన గుండెల్లో గుచ్చుకున్న గాలాన్ని లాక్కోలేక, దాని వంపు కలుక్కుమంటుంటే, నలిగి నలిగి, మనసు విరిగి విరిగి, బ్రతుకు బరువై నా అనే దిక్కు కరువై, తల్లడిల్లేవాడి గొంతు ప్రతిధ్వనిస్తోంది -- లేఖలో. (వక్రేంద్ర, కడుపుతీపి, యువ, ఫిబ్రవరి '82, పే 129-137)

సమాజంలో వ్యక్తిగా గుర్తింపు తండ్రిద్వారానే లభించటం పురుషస్వామ్య సమాజంలో ఒక సహజలక్షణం. ఈ కారణంగా కొడుకు విద్యకు ఆటంకం ఏర్పడటంతో మధనపడే తల్లి ఆత్మఘోష 'నాపేరు రాయొద్దు'

ప్రభుత్వపు గ్రాంటుకు ఆశించని ఈ కాన్వెంట్‌పై అధికారుల పలుకుబడి నడవదు. నాయకుల పైరవీలు నడవవు. అందుకని అందులో క్రమశిక్షణతో కూడిన చదువు చెబుతారు. -----------

ఆమె మనస్సు పరిపరివిధాల ఆలోచిస్తోంది. తాను చేసిన పొరపాటుకు తన చుట్టూరా ఎంతటి శిక్షావలయం అలుముకుని ఉందో ఇప్పుడు అర్థం అవుతోంది. గిరీను స్కూల్లో చేర్పించడం ఎలా? ఎవరినైనా పెళ్ళిచేసుకుంటే? ఎవరు పెళ్ళి చేసుకుంటారు? చేసుకుంటే ఇంకెన్ని సమస్యలు తలెత్తుతాయో? ----

శిరీషకి కాన్వెంట్ గుర్తొచ్చింది. అక్కడి ప్రిన్సిపాల్ గుర్తొచ్చింది. ఆమె రూంలో ఉన్న మేరీమాత బొమ్మ గుర్తొచ్చింది. టేబుల్‌మీదున్న శిలువబొమ్మ మరీమరీ గుర్తొచ్చింది. వెంటనే వెళ్ళి ప్రిన్సిపాల్‌ను కల్సి, గిరిపుట్టుకనుగురించి ఉన్నది ఉన్నట్టుగా చెప్పి తన బిడ్డ అప్లికేషన్‌ఫారంపైన తండ్రిస్థానంలో తనే సంతకం చేస్తానని నిర్ణయించుకున్నప్పుడు ఆమె కళ్ళల్లో కొత్తకాంతి కనిపించింది. (బోయ జంగయ్య, నాపేరురాయొద్దు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 21-9-'88, పే 16-19)

గిరిజనులపై జరిగే దోపిడీని ప్రధానంగా ఆర్థికపరమైందిగానే భావించాలి. అయితే గిరిజనుల అభివృద్ధి పేరుతో ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు చేపట్టే కార్యక్రమాలు తాత్కాలిక ప్రయోజనాలను అందించేవిగా, గిరిజనులను సాంస్కృతికంగా పరాయీకరణకు గురిచేస్తూ, ఆర్థిక బానిసత్వానికి కారణంకావటాన్ని సూటిగా ప్రశ్నించిన రచన 'రక్తాక్షువు'. అందుకే గిరిజనులు శాశ్వతప్రయోజనాలు చేకూర్చే పథకాలను కోరటం కనిపిస్తుంది. గిరిజనశిక్షణ పేరుతో ప్రభుత్వం కల్పించే పథకాల రెండవకోణాన్ని చూపటమే ఈ రచన ప్రధానోద్దేశం.

"నిజమే..... భోజనాలున్నాయి...... చదువులున్నాయి.... కాని అవి మా గిరిజనుల్ని నాగరిక ప్రపంచంలోకి వెళ్లి కొండకీ.... పల్లానికీ మధ్య వూగిసలాడేలా చేస్తున్నాయి. పదోతరగతి వరకు చదువు చెప్పి వదిలేస్తే పైచదువులకు వెళ్ళే స్తోమతలేక చదివిన చదువుతో కొండమీద పనులు చెయ్యలేక, మిడిమిడి జ్ఞానంతో నాగరికత వలలోపడి గిలగిలా తన్నుకుంటున్నారు. -------------

"బావన్నయ్యా...... ఒకసారి హాస్టలు వర్కర్లు జీయ్యం బస్తా మేట్రన్ యింటికి పట్టుకెళ్తుంటే నేనూ మరి కొందరు అమ్మాయిలం.... పట్టుకున్నాం. ప్రతిదానికీ నేను అడుగుతుంటానని.... ఎలాగైనా నన్ను స్కూలునుండి పంపించేయాలని ఆలోచించి..... నాకు ఎవరో అబ్బాయి ప్రేమలేఖలు రాస్తున్నాడని.... దొంగప్రేమలేఖలు పుట్టించి నన్ను అందరిముందు తిట్టి నన్ను స్కూలునుండి పంపించేశారు....." కిరుమమ్మ కళ్ళనుండి కన్నీటి చుక్కలు రాలేయి..... కొండమల్లెలు నేలకుజారినట్టు... కొండమీదికి వంగిన మబ్బు ఉన్నట్టుండి చినుకై జారినట్టు. ------------

యీ తాత్కాలిక ఉపశమన పద్ధతులే అభివృద్ధి కాదని చెప్పాలని వుంది..... కంటితుడుపు సంక్షేమ పథకాలతో గిరిజనుల బతుకులు బాగుపడిపోవని లోకానికి చాటాలని ఉంది.

విల్లుగా వంచడానికి
ఏ వెదురు మంచిదో ఎంచుకోవడం
ఏ ఆదివాసినడిగినా చెప్తుంది........
ప్రేమించు కోవడమంటే రక్షించుకోవడమని
కోతకొచ్చిన పంటని కాపుకాచుకునే ఏ రైతునడిగినా చెప్తారు."

అనే కవిత ఎవరిదో ఒకసారి వినిపించావు కదన్నా నువ్వు..... ఆ ఆదివాసి నేను కావాలి. ఆ రైతును నేను కావాలి. మాకోసం మా సంక్షేమం కోసం గిరిజనేతరులైనవారే త్యాగాల బాటలో పయనించడం తెలిసిన నేను 'నా మందకురాసిన బెల్లాన్ని చప్పరించుకుంటూ కూర్చోలేనన్నా. నాకు కావలసింది తాత్కాలికంగా ఆకలి మరిపించే పథకాలుకాదు. మా గిరిజన గూడేలు

దోపిడీకి గురుకాని విధంగా ఆకలిమాట ఎరుగని శాశ్వత పథకాలు కావాలి. ------------

ఆ అమ్మాయెవరో తెలుసా..... బనియన్ల తయారీకేంద్రంలోనో..... బుక్‌బైండింగ్ సెంటర్లోనో.... టైలరింగ్‌లోనో శిక్షణ పొంది నెలకు అయిదువందలో, ఆరువందలో జీతం తెచ్చుకుని పెండర్లు మూటపెట్టాక.... కొండెక్కి ఇంటిపట్టున ఉండలేక; శిక్షణ కాలంలో పరిచయమైన ఎటెండర్లో....డ్రైవర్లో....మరొకరో... మరొకరో ప్రలోభ పెడితే, వారి మాయమాటలకు భ్రమిసి.... నీటుగా తయారై నలుగురితో కలిసి తిరగడమే నాగరికతగా భావిస్తున్న నేటి అనేకమంది అమాయక గిరిజన పడచులకు ప్రతీక ఆ అమ్మాయి. ఆ యువకుడు ఓ జీప్ డ్రైవర్..... జీప్ వాడిసొంతంలా వాడుకుంటూ యిలా అమ్మాయిల్ని...... వాడినీ...." అంటూ అటువేపు కదలబోయాడు సంగు. నాకు తెలుసు అప్పుడతడిని వదిలేస్తే ఏమౌతుందో....." అందుకే పట్టి ఆపేను.

"సంగూ కొమ్ములు నరికితే ఏమౌతుంది....." (గంటేడ గౌరునాయుడు, రక్షాకుప్ప, ఏటిపాట, పే 130-138)

అంతర్జాతీయంగా సరళీకరణ విధానాల ఫలితంగా దేశంలో, తద్వారా పాఠశాల విద్యార్థులపై జరుగుతున్న సాంస్కృతిక దాడిని, దాని పర్యవసానాలను చిత్రించిన రచన 'అందరూ నిద్రపోతున్నారు'. వయస్సుతోపాటు, క్రమంగా వయసుకుతగిన అనుభవాలనతో పెరగాల్సిన బాలలను వయసుకుమించిన అనుభవాల్లోకిలాగి ఆనందించాలనుకోవటంలోని సాంస్కృతిక హైన్యాన్ని ప్రశ్నించటం ఈ రచన ముందుకుతెచ్చిన అంశం.

'బేబీ చేసిన డాన్సులు చూశావుగదా?... అలాంటి శృంగారగీతాలు, నృత్యాలు చదువుకుంటున్న పిల్లలకు నేర్పి, రచ్చబండ మీదకెక్కించి ఆడమనడం, ఆహా ఓహో అంటూ అందరూ నిక్కినిక్కి చూడటం, అదిమాని నువ్వూ నేనూ తలొంచుకోవడం.... ఎందుకొచ్చిన చదువులు నాన్నా?.... అటువంటి పాటలు, నృత్యాలు ప్రదర్శించకుండా జాగ్రత్తపడాలన్న ఇంగిత జ్ఞానం టీచర్లకు వుండక్కర్లేదూ? ఇన్నేళ్ళుగా చూస్తున్నాను. అటువంటివే నేర్పుతున్నారు. అటువంటివే బేబీచేత వేయిస్తున్నారు. ఇప్పటికే తానొక సినిమా తార అన్నంతగా పొగరెక్కిపోయింది దానికి! ఎప్పుడూ ముద్దుముద్దు మాటలు, గారాబచేష్టలు, బూతుపాటలు! సినిమా వర్తకుల స్వార్థపరత్వం, పెద్దవాళ్ళ మూర్ఖత్వం, బేబీలోని జంతుప్రవృత్తి ఈనాడు దాన్ని యిట్లా తీర్చిదిద్దాయి. చూస్తూఉండగానే ఎప్పుడో ఒకప్పుడు కొంప అంటుకుపోతుంది. అంతవరకూ నేను శుష్కోపన్యాసం చేస్తూ వుండాల్సిందే. నువ్విలా నిద్రపోతూ వుండాల్సిందే!.....

చంద్రశేఖరం దీర్ఘోపన్యాసం ఆపి, తండ్రికేసి చూశాడు.

'నాన్నా!'

రాజశేఖరం నేలమీద ఒరిగిపోయి గురక తీస్తున్నాడు. (కలువకొలను సదానంద, అందరూ నిద్రపోతున్నారు, భారతి, ఆగష్టు'78, పే 33-36)

తెలుగుసాహిత్యం సామూహిక సమస్యలతోపాటుగా వ్యక్తిగత సమస్యలనుకూడా సామాజిక నేపథ్యంతో చిత్రించటం మనం చూడవచ్చు.

----------శారీరక వైకల్యాన్ని సహృదయతతో అర్థంచేసుకోలేని సామాజికవైకల్యం

----------విద్యాదానంకోసం ఒక ఫాదరీ పడే నిరంతరవేదన

----------సంక్షేమహాస్టళ్ళ పనితీరుకారణంగా విద్యార్థిపడే మనోవేదన

----------సామాజిక గౌరవం లోపించిన తన వృత్తిపట్ల ఉపాధ్యాయుని నిరసన

----------తన మూలాలను వెతుక్కుంటూ వెనుతిరిగి, తనజీవితానికి సార్థకత చేకూర్చుకునేందుకు ప్రయత్నించే అధ్యాపకుని వేదన

ఇలా సాహిత్యం స్పృశించిన అనేక కోణాలు కనిపిస్తాయి. సమాజంలోని వైకల్యాలను రూపుమాపేందుకు పాఠశాల తనవంతు కృషిని చేసేందుకు మారుగా, శారీరకవైకల్యాన్ని ఎద్దేవాచేసే మానసిక దౌర్బల్యం కలిగిన ఉపాధ్యాయులు, విద్యార్థులు విరుద్ధపంలో కనిపిస్తారు. వ్యక్తి శారీరక వైకల్యాన్ని సానుభూతితో అర్థంచేసుకోని ఉపాధ్యాయుని ప్రవర్తన గర్హనీయం. వ్యక్తి శారీరక వైకల్యాన్ని ఎగతాళిచేయటం వ్యక్తి ఆత్మగౌరవాన్ని కించపర్చటంగానే భావించాలి. అనుక్షణం వ్యక్తిపై మానసికంగా జరిగే ఈ దాడి వ్యక్తిలోని అంతఃశక్తులను వెలికితీసేందుకు మారుగా వ్యక్తిని ఆత్మన్యూనతకు గురిచేసి సామాజికంగా నిర్వీర్యుని చేస్తుంది.

"ఒరేయ్ పీనూ..... నిన్నేరా కుంటోడా!" అంటూ ఒక్క వెక్కిరికేక పెట్టాడు.

సీను తుళ్ళిపడ్డాడు -- అదిరిపాటుగా లేచి నిలబడబోయి తూలిపడ్డాడు. కొందరు గొల్లున నవ్వేరు.

"సరిగా లేచి చావరా గాడిదా!" గద్దించాడు పంతులు.

సీను అయోమయంగా లేచాడు. మోకాళ్ళకిందకు జారిపోతున్న నిక్కరును కుడిచేత్తో పైకి లాక్కుంటూ ఊతగా ఎడంచేతిని గోడకు ఆనించి ఒంటికాలుమీద నిలుచున్నాడు.

పిల్లల దృష్టంతా సీనుమీద నిలిచింది. అందరూ వాణ్ని కుంటోడని, లంగడాయని, సొట్టోడని ఎగతాళి పట్టించిన వాళ్ళేగాని, వాడి దురదృష్టానికి కారణం ఏమిటని వాళ్ళకేగాదు సీనుకు కూడా తెలీదు. ------------

అందరిలోనూ తన అవిటితనాన్ని వేలెత్తిచూపటం వాణ్ని కష్టపెట్టింది. కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరిగాయి. ఎన్నో సందేహాలు తన అవిటితనం గురించి వాడి మనసులో తలెత్తాయి. ---------

పరుగుపందెంకోసం పిల్లలు వరుసగా నిలబడుతుంటే తనూ వాళ్ళ సరసన నిలుచున్నాడు. చూసిన వాళ్ళంతా ఫకాల్న ఒకటే నవ్వటం.

"వెధవని నీక్కాదూ చెప్పింది. ఒంటికాలి గుర్రంలాగా నువ్వూ, నీ పరుగూను...... రా, బయటకు." అంటూనే సీనును ఇవతలకు ఒక్క గుంజు గుంజాడు.

పిల్లలంతా 'హొయ్' అంటూ చప్పట్లు, కేరింతలతో గోలగోలగా అరిచేరు. ఏడుపు ముంచుకొచ్చింది. తన అవిటితనం మీద అందరూ కలిసి కత్తిగట్టినట్లుగా తల్లడిల్లి పోయాడు. (పల్లూరి శివప్రసాద్, చిరుదీపం, యువ, జులై '86, పే 111-120)

పాఠశాలకోసం ఎటువంటి త్యాగానికైనా వెనుదీయని ఒక ఫాదరీ త్యాగనిరతే 'గోవూ గోమాయువూ'

పోస్తే ఏంచేస్తాం.... పెద్దల మనసులు అలాగే ఉంటవి.... తమలో ఒకరిగా గుర్తించారు, తాతా అని ప్రేమగా పిలుస్తారు. పరమ పవిత్రమూర్తులు పసిపాపలు. తన పాఠశాల విద్యార్థులు. 'వాళ్ళకోసమే తన జీవితం అంకితమై పోనీ.... ----------

ఫాదరీ ఉద్రేకంతో బల్లమీద గుద్దేడు.

'నో.... నో.... నా కంఠంలో ప్రాణముండగా యీ బిల్డింగ్ కూలదొయ్యనివ్వను. ఇది నాశనం కాకుండా చివరివరకు చూస్తాను నేను. ఎటిపీకాస్ట్' ఆలా బల్లగుద్దటంలో అతని పండు జుత్తులోంచి కొబ్బరిపువ్వు ఒకటి పైకి వచ్చి బల్లమీద పడింది. తను నాటి పోషించిన కొబ్బరిచెట్టు కిందనుంచి వెడుతూంటే కృతజ్ఞతతో తన మీద వర్షించిన ప్రేమ పుష్పం అది. ఆ పిల్లలు ఈ పువ్వులు..ఈ పిల్లలు... తను పెంచి పోషించిన ఇంత మధురమైన అందమైన బాధ్యతనుంచి తప్పించుకుని పారిపోయే భీరువా తను? పిల్లలు అందరూ రాళ్ళేనా? కాదు.... అందులో రత్నాలు వున్నాయి. అన్నీ మట్టిబెడ్డలేనా? కాదు, కాదు. ఇందులో మాణిక్యాలు దొరుకుతాయి. వెతికి పట్టుకోవటంలో ఉంది. ప్రేమించి దిద్దటంలో ఉంది. మతానికి, దూరమైనదీ, మనిషికీ, మనిషికీ దగ్గరచేసేదీ, అదేదో పిల్లలకైనా చెప్పగలగాలి. చెప్పగలగాలి ఏమిటి, చెప్పితీరాలి. (అవసరాల రామకృష్ణారావు, గోవూ గోమాయువూ, సీకముక్కలు: అవసరాల రామకృష్ణారావు కథలు, పే 90-99)

ప్రభుత్వహాస్టళ్ళ దయనీయస్థితిని ప్రతిబింబించిన రచన 'చదువుఖరీదు జీవితం' (కంఠంనేని రాజగోపాల్, చదువుఖరీదు జీవితం, ప్రజాసాహితి, జులై'82, పే 51-56)

వృత్తికి సామాజికగౌరవం లోపించటంపట్ల ఒక ఉపాధ్యాయుని విరసస్వరమే 'గురుర్బ్రహ్మ...గురుర్విష్ణు'

"మీరేం చేస్తారులెండి. ఈ వ్యవస్థ ఇలా తగలడింది. ... పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పుతూ.... వాళ్ళ బంగారు భవిష్యత్తుకి ప్రథమ సోపానాలుగా నిలబడుతున్న టీచర్లని "బ్రతకలేక బడిపంతులు!" అని న్యూనత పరుస్తూ " పాపం అయ్యవారు!" అని తీసిపారేస్తూ, వాళ్ళను తక్కువగా..... లోకువగా చూడటం ఒక గొప్ప అలవాటుగా మారిపోయింది అందరికీ! వాళ్ళునేర్పే చదువు కావాలి.... కానీ... వాళ్ళను మాత్రం గౌరవించరు! వాళ్ళేలేకపోతే తమ పిల్లలభవిష్యత్తుకు పునాది ఉండదని తెలిసికూడా, వాళ్ళపట్ల ఇంత అనాగరికంగా ప్రవర్తించే ఈ మూర్ఖుల్ని చూస్తుంటే..." ఆవేశంతో కంఠం తడబడిందామెకు.....

ఏం చెబుతాడు ప్రభాకర్?

ఏమని ఓదార్చగలడామెను?!

"నీ ఆలోచనా విధానంతప్పు" అని ఆమెకు చెప్పే సాహసం లేక మౌనంగా ఉండిపోయాడతను. (ఆదూరి సావిత్రి, గురుర్బ్రహ్మ.... గురుర్విష్ణు...., ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 6-12-'90, పే 48-50)

తనుపుట్టిపెరిగిన సమాజంలోనే తనజీవితానికి సార్థకత చేకూరగలదన్న భావనతో తన నూతనజీవితంతో తెగతెంపులు చేసుకొని తనవాళ్ళమధ్య తనవాళ్ళకోసం జీవించేందుకు నిర్ణయించుకున్న అధ్యాపకుని కథే 'తెగతెంపులు'

తాను జన్మించినది ఈ ఊళ్ళో. పెరిగినది ఇక్కడ. తనవారు తరతరాలుగా ఈ గ్రామంలోనే ఉంటున్నారు. తానివాడు

చదువుకున్నాడంటే, తనకేమైనా శక్తి సామర్థ్యాలుంటే, తాసీగ్రామంలోనే నివశించి, ఈ నికృష్టమైన దశనుండి బయటపడి తోటి మానవులతో సమానంగా తనవారు జీవించగలుగడానికి ఏ కొంచమైనా తోడుపడగలిగితేనే సాఫల్యత సిద్ధిస్తుంది. లేకపోతే జీవితం వాస్తవంగా నిరర్థకమే కాగలదు. ...............

కాని, ఈనాడు ఇంటికి తిరిగివచ్చిన తరువాత ఆ రకమైన జీవితం తనది కాదనీ, అతి హీనమైన స్థితిలో జీవిస్తున్న తనవారి మధ్యనే అనీ వెంకయ్యకు స్పష్టమయింది. ...........

అందువల్ల ఇక్కడే నివసించి, ఇక్కడి వ్యక్తుల్యాసాల నిర్మూలనకు యథాశక్తి కృషి చేయడానికి, కొత్తగా తనకలవడిన జీవితానికి స్వస్తిచెప్పి తెగతెంపులు చేసుకోడానికి నిశ్చయించుకున్నాడు వెంకయ్య. ఈ మార్గం సుగమమైంది కాదు. ఈ నిశ్చయంతో వెంకయ్య మనస్సులో అణుమాత్రమైనా ద్వేషం లేకుండా పోయింది. ఇక ఈ పరిస్థితుల పట్ల అతని హృదయంలో కేవలం విచారం మాత్రమే ఉంది. (తూలికాభూషణ్, తెగతెంపులు, కిన్నెర, అక్టోబరు'51, పే 728-737)

ఇలా తెలుగు సాహిత్యంలో సామాజికసమస్యలు వైవిధ్యభరితంగా చోటుచేసుకున్నాయి.

*"And a woman who held a babe against her bosom said*
*speak to us of Children And he said:*
*Your children are not your children*
*They are the sons and daughters of Life's*
*Singing for itself.*
*They come through you but not from you,*
*And though they are with you yet they belong*
*to you.*
*You may give them your love but not your*
*thoughts,*
*For they have their own thoughts.*
*You may house their bodies but not their souls,*
*For their souls dwell in the house of to-morrow,*
*Which you cannot visit, not even in your dreams.*
*You may strive to be like them, but seek not*
*Make them like you.*
*For life goes not backward nor tarries with*
*Yesterday.*
*You are the bows from which your children as*
*Going arrows are sent forth"*

*----The Prophet, Kahlil Gibran,p.20.*

=====================

*విద్య : తల్లిదండ్రుల ప్రభావం*

ఆస్తిని పెట్టుబడిగా పెట్టినప్పుడు, తిరిగి పెట్టుబడికి తగిన ఫలితాలను ఆశించటం వ్యాపారసంబంధాలతో నిండిన వ్యవస్థలో ఒక సహజ పరిణామం. అదేవిధంగా పిల్లలను తమ స్వంత ఆస్తిగా భావించే ప్రపంచంలో, వారిపైన పెట్టుబడిపెట్టి, దాన్నుంచి లాభాలను పొందాలని తల్లిదండ్రులు ఆశించటంకూడా సహజ పరిణామంగానే మనం భావించాలి. వ్యవస్థలో మానవసంబంధాలు వ్యాపారీకరణ చెందుతున్నప్పుడు, దాని ప్రభావం పిల్లలు, తల్లిదండ్రుల మధ్యగల కుటుంబ సంబంధాలపైన కూడా పడుతుంది. ఈ పరిణామక్రమంలోనే పిల్లలనుంచి వారి స్థాయికిమించిన ఫలితాలను రాబట్టేందుకు తల్లిదండ్రులు ప్రయత్నిస్తారు. దీంతో పిల్లలపైన విద్యాపరంగా అధికభారం పడుతుంది. ఈ విధమైన నిర్బంధిత అధ్యయనం విద్యారంగంలోను, సామాజిక సంబంధాల్లోను అనేక వికృత ఫలితాలకు కేంద్రబిందువైంది. ఈ అంశాలన్నింటినీ తెలుగుసాహిత్యం సమగ్రంగా చర్చించింది. సాహిత్యం చర్చించిన ఆ అంశాలను ఇలా వర్గీకరించవచ్చు.

*తల్లిదండ్రుల అమితశ్రద్ధ : నిర్బంధిత అధ్యయనం -- పిల్లలపై దాని ప్రభావం*

*తల్లిదండ్రుల ప్రేమరాహిత్యం -- పిల్లలవ్యథ*

*అభిప్రాయాలు, అభిరుచుల్లో వైరుధ్యాలు*

*తల్లిదండ్రుల ఆశలకు -- పిల్లల ఆచరణకు సయోధ్య*

***తల్లిదండ్రుల అమితశ్రద్ధ : నిర్బంధిత అధ్యయనం -- పిల్లలపై దాని ప్రభావం :***

తల్లిదండ్రుల్లో అనేకమంది పిల్లలను తమస్వంత ఆస్తిగా పరిగణిస్తూ వారిపట్ల అవసరానికిమించిన శ్రద్ధ కనపరచటం మనకు తరచూ తారసపడే అంశం. అయితే ఇక్కడ తల్లిదండ్రులు తమపిల్లల విషయంలో శ్రద్ధచూపటానికి వెనుక సామాజిక కోణం, ఆర్థికకోణం ప్రముఖంగా కనిపిస్తుంది. ఈ క్రమంలోనే పిల్లల మానసిక కోణాన్నిమాత్రం విస్మరించటం గమనార్హం. ఫలితంగా పిల్లల్లో మానసిక సంఘర్షణ, ప్రారంభంలో తల్లిదండ్రులపట్ల, చివరకు సమాజంపట్ల ద్వేషంగా మారి పిల్లలు అసాంఘిక శక్తులుగా రూపొందే ప్రభావం కనిపిస్తుంది. ఇలా తల్లిదండ్రుల అమితశ్రద్ధ పిల్లలపై ఏ రూపంలో ప్రభావం చూపుతుందో సాహిత్యం దర్శించిన విధానాన్ని క్రమానుగతంగా ........

అమ్మతో ఆడుకోవాలని, నాన్నతో దోబూచులాడాలని, తాతయ్యలతో గెంతులు వేయాలని, అమ్మమ్మ నానమ్మల వద్ద గారాలు పోవాలని ఎంతో ఇష్టపడే పాపాయిని మితిమీరిన క్రమశిక్షణ పేరుతో సరదాలకు దూరంచేయటం ఎటువంటి విపరీత పరిణామాలకు దారితీస్తుందో చిత్రించిన రచన 'అనగా అనగా'.

అన్యోన్యమైన యువజంటకు ఎవ్వరినీ నొప్పించటం ఇష్టంలేదు. అందుకే ఆ మర్నాటినుంచే సంగీతంమాష్టార్ని - డాన్స్ టీచర్ని రమ్మని చెప్పేశారు.

ఆ విశాలమైన ఇంటిముందున్న అందమైన పూలతోటను టెన్నిస్‌కోర్టుగానూ ఈతకొలనుగానూ మార్చేసారు. టెన్నిస్ నేర్పడానికి ఒక కోచ్‌ను. ఈత నేర్పడానికి ఒక కోచ్‌ను నియమించారు. ఇక పాప సమయం పాప చేతుల్లోంచి -- పాప అమ్మానాన్నల చేతుల్లోంచి -- తాతయ్య చేతుల్లోంచి -- అమ్మమ్మ నానమ్మల చేతుల్లోంచి -- మాష్టారు, టీచర్, కోచ్‌ల చేతులలోకి వచ్చేసింది.

పాపతల్లిని ఒకరోజు చెప్పలేనంత దిగులు కమ్మేసింది. ఈ వ్యవహారమంతా పాపకు వయసుకు మించిన భారం అవుతుందేమోనని యువకుడి భుజం మీద తలవాల్చి కళ్ళనీళ్ళు పెట్టుకుంది. "ఏదైనా.... పాప నాకు దూరంగా .... ఇలా రోజంతా ఆటపాటలు లేకుండా ..... తన ఈడు వాళ్ళతో కలవకుండా.తల్లి వసిగింది. ..............

పాప దృష్టి విశాలమైన భవనం మీదుగా ఈత కొలను మీదుగా టెన్నిస్‌కోర్టు మీదుగా ఎత్తైన ప్రహరిని దాటి పక్కనున్న మైదానంపై నిలిచింది. ఆ మైదానంలో ఎవరో పిల్లలు ఆడుకుంటున్నారు. వాళ్ళ ఉరుకులు పరుగులు, నవ్వులు కేరింతలు, ఉల్లాసభరితమైన కేకలు పాపను ఆకర్షించాయి. వాళ్ళు ఎగరేస్తున్న రంగురంగుల గాలిపటాలు నీలాకాశంలో పడవల్లా సాగుతున్నాయి. పాప కళ్ళు విప్పార్చి వింతగా వినోదంగా చూస్తూ వుండిపోయింది. పాపకి వాళ్ళతో పాటు పచ్చిక మీద పల్టీలు వేయాలనీ, ఇసుక గూళ్ళు కట్టాలనీ, గులకల గుట్టలు పేర్చాలనీ, దొంగాటలు ఆడాలనీ అనిపించింది.

ఇంతలో చల్లటి సాయంకాలం పోతూపోతూ విందు చందమామని పంపించింది.

తారలతో నిండిన ఆకాశం -- పండు వెన్నెల -- పాప పరవశంతో కళ్ళు విప్పార్చి రెప్పవాల్చలేకపోయింది. ఏదో అద్భుతమైన అనుభవం పాపని ఆవహించింది. లిటిల్ ఏంజిల్ దుస్తుల్లో అప్పుడే విచ్చిన మల్లెమొగ్గలా వున్న పాప తన గుండెలనిండా ఊపిరి పీల్చుకొంది. తళతళా మెరుస్తోన్న ఏంజిల్ రెక్కలాకుట్టిన చేతులను విప్పార్చి -- అచ్చం లిటిల్‌ఏంజిల్ లాగానే -- ఓ అద్భుతమైన పక్షిలా ..... తిన్నగా .... స్వేచ్ఛగా మైదానం మీదుగా .... తారల తీరాలు చేరాలని ..... ఎగిరింది. (చంద్రలత, అనగా అనగా, నేనూ నాన్ననవుతా!, పే 194-202)

పిల్లలంటే డ్రాయింగ్ రూములో ఎక్సిబిట్ చేసే షో పీసులు కారనీ, వారిలో సుగుణాలూ, లోపాలూ ఉంటాయనీ, పిల్లల విజయాలకి ఆనందించాలేతప్ప, ఆ విజయాలను ప్రదర్శించాలనుకోవటం తల్లిదండ్రుల మూర్ఖత్వానికి నిదర్శనమనీ పేర్కొంటూ, అలాచేస్తే ఫలితాలెంత దారుణంగా ఉంటాయో చిత్రించిన రచన 'షోపీస్'

అంతవరకూ అన్ని సబ్జక్టులలో యూనివర్సిటీ ఫస్టువచ్చి గోల్డ్‌మెడల్స్ సంపాదించాడు. నాలుగో ఏడాది ఒక సబ్జక్టులో ఫస్ట్ రాలేదు. అతని గుండె ఆగినంత పనయింది. ఇక తల్లితండ్రులకి మొహం ఎలా చూపించడం? ఇన్నాళ్ళూ తన గురించి ఎంతోగొప్పగా చెప్పుకుంటున్నారే. ఇప్పుడు ఏమని చెప్పుకుంటారు? మా అబ్బాయికి ఒక సబ్జక్టులో ఫస్ట్ తప్పి పోయిందంటారా? ఇన్నాళ్ళూ వాళ్ళ కలలు నిజంచేస్తూ వచ్చిన తను ఈ వేళ వాళ్ళ ఆశయాలకు సరిపోయినంతగా ఎదగలేక పోయాడు. ఏం చెయ్యాలిప్పుడు? అతనికి ఒక్కటే మార్గం కన్పించింది. చదువు పూర్తిచేసి వైద్యుడిగా ఎందరికో ప్రాణాలు పోయాల్సినవాడు తనప్రాణాలు తనే తీసుకున్నాడు.(పాలంకి సత్య, షో పీస్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 25-12-'96, పే 52-53)

నేటికాలంలో విద్యార్థులు పైకి కన్పిస్తున్నంత గంభీరులుకారు. తల్లిదండ్రులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోలేని తమ అసమర్థతకు నిరంతరం కుమిలిపోయే సున్నితమనస్కులు. ఆ సున్నితమనసులపై భారం మోపితే జరిగే పరిణామాలను చిత్రించిన రచనలు 'ఆశ', 'కాంపెన్సేషన్'.

రమ్యకి తల్లిదండ్రులంటే ఎంతో అభిమానం. అంతకు మించిన భయం..... అందుకే ఆ పిల్లా ఎంతో కష్టపడి చదువుతోంది. ఈ ఎమ్‌సెట్‌లో తనకి మంచి ర్యాంక్ రావాలి. మెడిసిన్‌లో సీట్ రావాలి. అదే రమ్య ధ్యేయం! ఆ ధ్యేయంతో కష్టపడి చదువుతున్నప్పుడు హఠాత్తుగా అమ్మా, నాన్నా రమ్య మనసులో మెదుల్తారు..... హఠాత్తుగా చదవాలనే పట్టుదల సడలి, ఆమెలో భయం ప్రారంభమవుతుంది. మనసంతా వికలమైపోతుంది. మళ్ళీ హఠాత్తుగా తల్లిదండ్రుల ప్రేమ గుర్తొచ్చి తన మీద పెట్టుకున్న ఆశ గుర్తుకొస్తుంది. తిరిగి మనసును చదువు మీద లగ్నం చేయడానికి ప్రయత్నిస్తుంది.....

"అమ్మా రమ్యా! నీకు ఇంటర్‌లో స్టేట్‌ర్యాంక్ వచ్చిందమ్మా! తలుపు తియ్!" పిలుస్తూ తలుపుల్ని బాదారు.

చుట్టుపక్కలవాళ్ళ సాయంతో తలుపులు పగలగొట్టిన ఆ తల్లిదండ్రులు, విషం పుచ్చుకుని నిర్జీవంగా నేలమీద పడున్న కూతుర్ని చూసేసరికి, కెవ్వున అరిచి పడిపోయారు. తనపై ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులను ఎక్కడ నిరుత్సాహపరుస్తానో అనే భయంతో ఆమె అలా చేసింది. (వేదగిరి రాంబాబు, ఆశ, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 20-12-99, పే 66-67).

నందనరావు భార్యతో "అమ్మలూ! నువ్వు పొరబడుతున్నావు. ఇంజనీరింగ్ చదవాలన్నది నీ కోరిక. నీకు తీరని కోరికను నువ్వు అమ్మాయి నెత్తిమీద రుద్దేస్తున్నావు. ఇలా తల్లిదండ్రులు తమకు తీరని కోరికలను పిల్లలమీద రుద్దెయ్యడాన్నే కాంపెన్సేషన్ టెక్నిక్ ఇన్ డిఫెన్స్ మెకానిజం అని మా సైకాలజిస్టులంటారు. అమ్మాయి అభిప్రాయం అడుగుదాం" అన్నాడు.

"నీ ఇష్టం మమ్మీ" అంది హైమ.

పరీక్షలు దగ్గరపడ్డాకొద్దీ ఆమె గుండెలలో రైళ్ళు పరిగెత్తసాగాయి. తల్లి తనమీద ఎన్ని ఆశలు పెట్టుకుంది. తను నిజంగా ఎంట్రన్స్ పాసవగలదా? ఇంజనీరు అవుతుందా?

పరీక్షహాల్లోకి వెళుతున్నప్పుడు కూడా 'నా ఆశలన్నీ నీ మీదే పాపా! నువ్వు ఇంజనీరు కావాలి' అంది.

క్వశ్చన్ పేపర్ చూస్తున్న హైమ మనస్సులో ఒక్కటే ప్రశ్న. తల్లి ఆశలు తను తీర్చగలదా?

ఆప్రశ్న తప్ప ఆమెకు పేపర్‌లోని ప్రశ్నలు కన్పించలేదు.

ఆమె కలం కదలకుండా ఆగిపోయింది. ఇంకా చెప్పాలంటే ఆమె జీవితమే ముందుకు వెళ్ళకుండా ఆగిపోయింది. (పొలంకి సత్య, కాంపన్సేషన్, 4-12-'96, పే 52-53)

పిల్లలు అనుకూలవాతావరణంలో సహజసిద్ధంగా ఎదిగేందుకు వీలుకల్పించాలి. బలవంతంగా వారిని అధ్యయనానికి పురిగొల్పటం ఆశించిన ఫలితాలకు మారుగా పిల్లలకు తల్లిదండ్రులపట్ల వ్యతిరేకతను పెంపొందిస్తుంది. ఈ భావనను వ్యక్తీకరించే రచనే 'చదువు'

"అందరూ చూడు ఎలా ఆడుకుంటున్నారో. నేనూ కాసేపు ఆడుకుంటాను. అమ్మ ఆడుకోనివ్వటంలేదు." దీనంగా అడిగింది వందన. ఆ లేతముఖంలో ప్రతిఫలిస్తోన్న దైన్యం తనకే బాధ కలిగించింది. ఆసక్తితో పిల్లల మనసులు చదువువైపు మొగ్గేలా చూడాలిగాని బలవంతంగా వాళ్ళను కట్టిపడెయ్యాలనుకోవటం మంచి పద్ధతి కాదు. అది రేణుకకు అర్థమయ్యేలా ఎలా చెప్పటం?

"రేణూ నామాటలు నీకు చెవికెక్కవు. దాన్ని సరీ ఊపిరికూడా తీసుకోనీయకుండా చంపుతున్నావ్. చిన్నమొక్క దానికదే సహజంగా ఎదుగుతూ పెద్దదవాలేకాని ఎంత పోషణ చేసినా ఒక్కసారిగా చెట్టుగా ఎదగదు" అన్నాడు నచ్చచెప్పే ధోరణిలో. స్వేచ్ఛగా గాలిలో ఎగురుతూ కొమ్మ కొమ్మకు వాలుతూ, గొంతెత్తి పాటలు పాడుతూ ప్రకృతికే వన్నె తెచ్చే కోయిలకు రెక్కలు విరిచి పంజరంలో పడేసినట్లుగా వుండేది వందనను చూస్తుంటే.

"మరి .... ఇవ్వాళ స్కూల్లో మార్కులు చెప్పారు. వాణీకేమో ఫస్టు వచ్చింది. నాకు నాలుగు మార్కులు తక్కువ వచ్చాయి. నాది సెకండు ..... తక్కువొస్తే అమ్మ చంపేస్తానందిగా" అంది భయం నిండిన కళ్ళతో ఎక్కిళ్ళుపెడుతూ. ఆ మాటలకు రాజారావు హృదయం ద్రవించింది. కూతుర్ని గాఢంగా హృదయానికి హత్తుకున్నాడు. పెద్దరికపు పంతాలు, పట్టుదల చిన్నారి మనసుల్ని ఎంతగా గాయపరుస్తాయో అప్పుడుగానీ అతను గ్రహించలేక పోయాడు.

"రేణూ! డాక్టర్లు, ఇంజనీర్లు, కలెక్టర్లు..... ఈ అంతస్తులన్నీ మనకి తెలిసిన లేబిళ్ళు. పిల్లల ప్రపంచం వేరు! అందులో ఈ అంతస్తులూ, కల్మషాలూ వుండవు. మన ఆశల్ని, అభిజాత్యాన్ని వాళ్ళ మనసులమీద రుద్దటం రాక్షసత్వం అవుతుంది. ఎదుగుతున్న కొలదీ వాళ్ళంతట వాళ్ళే తెలుసుకుని తమని తామే తీర్చిదిద్దుకుంటారు. సంకుచిత దృష్టితో కర్కశంగా వాళ్ళ బాల్యపు సహజత్వాన్ని మలినం చేయకూడదు" (రెంటాల హనుమత్ ప్రసాద్, చదువు, యువ, జూన్ ౯,-----, పే 72-84)

అదే మాదిరిగా పిల్లలను అధ్యయనం విషయంలో వత్తిడిచేస్తే ఫలితాలెంత విషమంగా ఉంటాయో చిత్రించిన రచన 'అనామిక'

ఊర్మిళ కాలేజీకు వెళ్ళి వస్తోంది. చాలా తెలివైన పిల్లే. కానీ పల్లెలో ఆమె ఒక్క ర్తే తెలివైన పిల్ల. సిటీలో, కాలేజీలో అలాకాదు. చాలామంది పిల్లలు బాగా చదువుతారు. ఊర్మిళకి ఎన్నిమంచి మార్కులు వచ్చినా తృప్తిగా లేదు. క్లాస్‌ఫస్ట్ అన్నమాట ఎప్పుడూ తనకే ఉండడం అలవాటయిన ఆమెకు కాలేజీలో నలుగురిలో ఒకర్తెగా ఉండడం అసంతృప్తిగా ఉంది. తనకి ప్రత్యేకమైన పేరు ఉండాలన్నది ఆమె కోరిక. " వెంకటరత్నంగారి ఊర్మిళని చూసి బుద్ధి తెచ్చుకోండిరా" అనో, "ఊర్మిళలా చదవండి" అనో వినడం అలవాటయిన ఆమెకు తన నామరూపాలు నశించి అనామికగా మిగిలినట్లనిపించింది.

ఊర్మిళ ఫస్ట్ ఇయర్ అయ్యేసరికి వెంకటరత్నంలో భావాలు రూపుతాల్చాయి. తనకి ప్రత్యేకమైన స్టేటస్ ఊర్మిళ స్టేట్ ఫస్ట్‌గా పాసయితేనే వస్తుంది. అతను కూతుర్ని పిలిచి తన మనస్సులోని మాట చెప్పాడు.

ఇంటర్మీడియెట్ ఫలితాలు వచ్చాయి. ఊర్మిళ స్టేట్‌ఫస్ట్ రాలేదు. ఆమెపేరు పేపర్లో పడలేదు.

మర్నాటి పేపర్లో ఆమెపేరూ, ఫోటో, తండ్రిపేరూ పడ్డాయి. ఊర్మిళ ఫోటోకింద ఇలారాసి ఉంది. "అమ్మా ఊర్మిళా! నీకోసం మేము బెంగ పెట్టుకున్నాము. స్టేట్‌ఫస్ట్ రాకపోయినా ఫరవాలేదు. నీపేరు పేపర్లో రాకపోయినా ఫరవాలేదు. వెంటనే ఇంటికి రా."

పల్లెనుంచి పట్నం వచ్చిన వారికి ముందున్న ప్రత్యేకమైన హోదా పోతుంది. ఈ ప్రత్యేకత లేకపోవడాన్ని సైకాలజీలో అనామీ అంటారు. పల్లెటూరి స్కూల్లో అతి తెలివైన విద్యార్థినిగా పేరు పొందిన ఊర్మిళ సిటీలోని కాలేజీలో నలుగురిలో ఒక్క రైగా ఉండలేక పోయింది. స్టేట్‌ఫస్ట్‌గా ప్రత్యేకత నిలుపుకోవాలన్న ప్రయత్నం విఫలమైంది. ఇంట్లో నుంచి పారిపోయి ప్రత్యేకత నిలుపుకోవాలనుకుంది. ఎప్పుడూ మొదటగా ఉండాలన్న కోరిక పిల్లలలో కలగనీయకూడదు. (పోలంకి సత్య, అనామిక, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 2-10-'96, పే 4-5)

తల్లిదండ్రులు తమ మితిమీరిన ఆశలను తీర్చుకునేందుకు పిల్లలపై తెచ్చే వత్తిడి కారణంగా కొందరుపిల్లలు, తల్లిదండ్రులపట్ల వారి కోరికలపట్ల ద్వేషాన్ని పెంపొందించుకుంటారు. ఫలితంగా ఆ పిల్లలు తల్లిదండ్రుల ఆశలకు వ్యతిరేకంగా ప్రవర్తించటం ప్రారంభిస్తారు. నిర్బంధిత అధ్యయనం కారణంగా చోటుచేసుకున్న మరో విషపరిణామమే ఇది. ఈ అంశాన్ని వాస్తవరూపంలో చిత్రించిన రచన 'ఎంతెంతదూరం?' తన ఆశలను, ఆకాంక్షలను గుర్తించకుండా తల్లిదండ్రులు తమ ఆశలను తనపై రుద్దటాన్ని ద్వేషించి, చివరకు తన జీవితాన్ని చేజేతులా నాశనంచేసుకున్న వ్యక్తి జీవిత చిత్రణే ఇందలి ప్రధానాంశం.

'హూ(.... ఎక్కువ మార్కులొస్తే ఇంటర్‌లో బిపిసి తీసుకుని తరువాత ఎం.బి.బి.ఎస్ చదవాలి. కాదు చదివిస్తారు. తను డాక్టరుకావాలని అమ్మా, నాన్నల ఉద్దేశం. అందుకే..... అందుకే చదవకూడదు. అందుకేగా రాత్రి సినిమాకి కూడా వెళ్ళాడు! వాళ్ళకోరిక నేనెందుకు నెరవేర్చాలి....? నా కోరికలు వాళ్ళేం తీర్చారని?

ఇప్పుడు టెస్ట్‌లో తక్కువ మార్కులొస్తే ఏం చేస్తారు? ముఖం చిట్లించుకుంటూ తమకు వచ్చిన తిట్లన్నీ తిడతారు. కోపం పట్టలేక కొడతారు. అంతేగా? తక్కువ మార్కులు తెచ్చుకుని అమ్మా, నాన్నలని వారి ఫ్రెండ్స్ మధ్యలో ఇన్సల్ట్ చేశానన్న సంతోషం ఉంటుందిగా. అది చాలదూ?

మహేష్‌కి ఇప్పుడు ఆలోచించడం చేతవును. ఇది ఆలోచించే వయసే. కానీ ఆ ఆలోచనల్ని సరి అయినమార్గంలో పెట్టే ప్రేమ, ఆప్యాయత మహేష్‌కి కనుచూపుమేరలో లేవు.

ఫలితం - మహేష్ అనుకున్నట్లుగానే టెస్ట్ థర్డ్‌క్లాసులో పాసయ్యాడు.

'నే నెప్పుడైనా ఇలా వానలో తడిశానా? అసలు అమ్మ తడవనిచ్చిందా? డిసిప్లిన్ పేరుతో ఎంత కర్కశంగా ప్రవర్తించింది! ఎప్పుడూ తనఫ్రెండ్స్‌తోటీ, తోటికోడళ్ళతోటీ పోల్చుకుని తానూ స్టేటస్ మెయిన్‌టెయిన్ చేద్దామని ఆలోచించడమే. వాళ్ళ పిల్లలతో నన్ను పోలుస్తూ, తిడుతూ నా మనసు విరిగిపోయేట్లు చేసింది. నాన్న మాత్రం.... అమ్మ మాటకు తాళంవేస్తూ చనువు చూపిస్తే పిల్లలు నెత్తికెక్కుతారని, గారాబం చేస్తే చెడిపోతారని అపోహపడుతూ ఎప్పుడూ దూరంగానే వుండారు.

- ఫలితం వాళ్ళమీద నాకు పెరిగిన ద్వేషం, చదువులో అశ్రద్ధ.

డాక్టర్ అవాలని నాకూ ఉన్నా వాళ్ళ కోరిక తీర్చకూడదనే పిచ్చి ఆవేశంతో తెలివితేటల్ని బలవంతంగా చంపుకుని ఇంటరూ, డిగ్రీ మామూలుగా పాసై ఇలా క్లర్క్‌గా జీవితాన్ని సాగిస్తూ ఇష్టంలేని జీవితంతో రాజీపడుతూ.....

నో! వీల్లేదు! అలా అనుకోడానికి వీల్లేదు. వాడ్ని ఇంజనీర్ని చెయ్యాలని నా కనిపించినా ఏ తెలుగు లిటరేచర్లో చదివి

టీచర్‌ని అవుతానంటే తప్పకుండా ఒప్పుకుంటాను. వాడికి కేకులు, ఐస్‌క్రీంలు కొనిపెట్టాలని నాకున్నా వాడికి బఠాణీలు ఇష్టమైతే అవే కొనిపెడతాను. అలాగే..... అలాగే..... అన్నీనూ.

నాయిష్టాలను వాడిమీద రుద్దను. వాడి అభిరుచి కనుక్కుని దాన్ని గౌరవించి ఆ ఫీల్డ్‌లోనే ఎలాముందుకు పోవచ్చో వాడికి సలహాలిస్తాను. వాడు నాలా అసమర్థుడు కాకూడదు. వాడు నా గురించి గర్వంగా చెప్పుకోవాలి. అవును....(సూరంపూడి సుధ, ఎంతెంత దూరం...?, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 14-3-90, పే 37-38)

క్రమశిక్షణ పేరుతో పిల్లలను వినోదానికి, ఆనందానికి దూరంచేయటాన్ని, మితిమీరిన అధ్యయనంకోసం వారి స్వీయ అభిరుచులకు, అభిప్రాయాలకు విలువనివ్వకుండా తమ ఆలోచనలను తల్లిదండ్రులు పిల్లలతో ఆచరింపచేయటాన్ని, తద్వారా పిల్లల్లో తల్లిదండ్రులపైన చోటుచేసుకునే ద్వేష భావాన్ని విభిన్న కోణాల్లో చిత్రించిన రచనలు 'శేషప్రశ్న', 'వంశాంకురం'.

ప్రీతమ్ చదువులో చాలా చురుకైన కుర్రవాడు. క్లాసులో ఎప్పుడూ అందరికంటే ముందుంటాడు. అతని తెలివితేటలు చూసి ముచ్చటపడినా యింట్లో క్రమశిక్షణ పేరుతో అతను ఎంత బాధపడుతుంటాడో చాలాసార్లు ప్రత్యక్షంగా చూశాను నేను. ఉదయం ఐదుగంటలకంతా నిద్ర లేపుతారు. ఏడింటివరకు చదివిస్తారు. స్నానం, టిఫిన్ పూర్తిచేసి ఎనిమిదింటికల్లా స్కూల్ వ్యాన్ ఎక్కి వెళ్ళిపోతాడు. సాయంత్రం నాలుగింటికి రాగానే ఏడుగంటలవరకు ట్యూషన్‌కి పంపిస్తారు. రాత్రి తొమ్మిదింటి వరకు హోంవర్క్, స్టడీస్‌తో సరిపోతుంది. భోజనం చేశాక మళ్ళీ పదకొండువరకు చదివిస్తూ తల్లిగాని, తండ్రిగాని ప్రక్కనే ఉంటారు. ఆదివారం అయినా ఆకుర్రాడికి స్వేచ్ఛ వుండదు. తన వయసు స్నేహితులతో కలిసి ఆడుకునే అవకాశంయివ్వరు. అంతా యాంత్రికంగా, టైంటేబిల్ ప్రకారం జరిగిపోతుంది. ఆ వయసులో పిల్లలను చదువుపేరిట అలా నిర్బంధించటం, సహజమైన స్వేచ్ఛా వాతావరణానికి దూరంగా పెంచటం నా కెందుకో మనసుకి నచ్చేదికాదు. కాని యితరుల పిల్లల విషయంలో మనం చొరవచేసుకోవటం సభ్యతకాదని వూరుకునేవాడిని. అప్పటికీ ఒకసారి వుండబట్టలేక రంగనాథ్‌గారితో అన్నాను కూడా.

"పిల్లవాడిని మరీ అలా పుస్తకాల పురుగులా తయారుచేయటం బావుండదండీ! పిల్లలన్న తర్వాత చదువుతో పాటు ఆటపాటలు, స్నేహాలు, సరదాలు అన్నీ వుండాలి. అప్పుడే వాళ్ళకి మనోవికాసం కలుగుతుంది."

నా మాటలకు ఆయనిచ్చిన జవాబు విని యిక నేను మళ్ళీ మాట్లాడలేక పోయాను.

"ఇది కాంపిటీషన్ వరల్డ్ మాస్టారూ! మనం ఇప్పుడే వాళ్ళని బిగించాలి. లేకపోతే భవిష్యత్తులో చాలా ఇబ్బంది పడతారు. మీకేం? ఎన్నైనా చెబుతారు! మీకున్నది ఆడపిల్లకదా! ఎంతో కొంత కట్నం యిచ్చి పంపేసి చేతులు దులుపుకుంటారు. మగపిల్లల విషయం అలా కాదే!"

క్రమశిక్షణ పేరుతో పిల్లలను శిక్షించడం ఎంతవరకు సబబు అని ఎవరికి వారు గ్రహించాలి తప్ప ఎదుటివారు చెప్పడం భావ్యంకాదు. పోటీ అనేది విద్యలో సహజం. అంత మాత్రం చేత పిల్లలు ఆ వయసులో చవిచూడవలసిన సరదాలను, సంతోషాలను దూరం చేయడం ఎంతవరకు న్యాయం.

"నేనే కావాలని రెండులెక్కలు తప్పుచేశాను అంకుల్! అందుకే మార్కులు తగ్గి థర్డ్ ర్యాంక్ వచ్చింది."

ఆ మాటలకు ఆశ్చర్యపడ్డాను నేను. "కావాలని లెక్కలు తప్పుచేశావా? ఎందుకని?" అంటూ ప్రశ్నించాను.

"కోపం అంకుల్! మా మమ్మీ డాడీ మీద కోపం! ఎంత కసిగా వుందో వాళ్ళమీద నాకు. ఒక్కసారి ర్యాంక్ మిస్సయ్యానని నన్ను ఎలా కొట్టారు? అందరి పిల్లల్లాగా నన్ను సరిగ్గా ఆడుకోనివ్వరు. బయటికి ఎక్కడికీ తీసికెళ్ళరు. ఎప్పుడో ఒక్కసారైనా టీ.వీ చూడనివ్వరు. వాళ్ళమీద కసి తీర్చుకోవాలంటే నాకు చేతనయింది యిదొక్కటే! వాళ్ళు బాగా బాధపడేలా చేయాలి. నన్ను ఏం చేయగలరు? నన్ను ఏం చేయగలరు? కాకపోతే యింకాస్త కొట్టగలరు. అంతేగా!

ప్రీతమ్ మాటలు నన్ను దిగ్భ్రాంతికిగురిచేశాయి. నాకు నోట మాటరాలేదు. ఆ లేతమనసులో యిలాంటి ఆలోచనలు చోటుచేసుకున్నవని ఎవరైనా వూహించగలరా? తన స్వేచ్ఛను, స్వతంత్ర్యాన్ని, సరదాలని చదువు పేరిట హరిస్తున్న తల్లిదండ్రులకు యిలాంటి శిక్ష విధించాలని పసిమనసుకి తోచటం ఎంత విడ్డూరం!

ర్యాంకులు అంటూ కే.జీ క్లాసులనుంచే పిల్లలను చదువు పేరిట శిక్షించే తల్లిదండ్రులకు పసిపిల్లల మనసుని చదవగలిగే శక్తివుంటే ఎంత బావుండును! ఇందులో తప్పెవరిది? ఇది శేషప్రశ్న! (ఈతకోట రామారావు, శేషప్రశ్న, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 12-1-'95, పే 68-70)

పొద్దుట నాలుగు గంటలకు నిద్రలేచి ట్యూషన్‌కు వెళ్ళడం, ఆ తరువాత కాలేజీకి వెళ్ళడం, కాలేజీ అయ్యాక ఎంట్రన్స్ కోచింగుకు వెళ్ళడం. ఇంటికి వచ్చాక ట్యూషన్‌లో, కాలేజీలో, కోచింగ్‌క్లాసెస్‌లో ఇచ్చిన హోం వర్కులను చేసుకోవడం. రాత్రి పన్నెండుగంటలకు పడుకోవడం రాజా దినచర్య. దినచర్యలో ఏనాడూ మార్పులేని అంశం తనమీద తండ్రి ఎన్ని ఆశలు పెట్టుకున్నాడో వినడం. తండ్రి మాటలు విన్నకొద్దీ రాజా తప్పకుండా ఎంట్రన్స్ పరీక్ష పాసవాలనుకునేవాడు. తనకు ఇద్దరు ముగ్గురు అన్నదమ్ములున్నా బాగుండేది. తను కాకపోతే ఇంకొకళ్ళ ద్వారా తండ్రికోరిక తీరేది. ఇప్పుడు తండ్రి ఆశ నెరవేర్చవలసిన బాధ్యత తనమీదనే ఉంది. ఎలాగో ఏమో అన్న భయం అతనిలో అనుక్షణం మెదులుతూ ఉండేది.బిడ్డలు ఎక్కువైతే తల్లిదండ్రులు అందరికీ ప్రేమానురాగాలూ, సదుపాయాలూ, అవకాశాలూ ఇవ్వలేరంటారు. బిడ్డలు తక్కువైై తల్లిదండ్రులు అన్నీ ఇచ్చినా కష్టమేనా? అతి సర్వత్ర వర్జయేత్ అన్నారుకదా. తల్లిదండ్రులు ఆశాసౌధాలు నిర్మించుకుందుకు

బిడ్డలు పునాదిరాళ్ళు కాకూడదు సుమా! (పాలంకి సత్య, పంకాంకురం, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 18-12-'96, పే 6-7)

**తల్లిదండ్రుల ప్రేమరాహిత్యం -- పిల్లలవ్యధ :**

తమ ఆశలు, ఆశయాలు పిల్లలపైన రుద్దుతూ, పిల్లలను చదువు పేరుతో శారీరక, మానసిక హింసకు గురిచేసే తల్లిదండ్రులు ఒకవైపు, పిల్లలను అసలు పట్టించుకోని తల్లిదండ్రులు మరోవైపు. ఈ రెండురకాల తల్లిదండ్రుల కారణంగా పిల్లలు తమ జీవితాలను కోల్పోతున్నారు. తల్లిదండ్రుల అశ్రద్ధ కారణంగా వారి మమతానురాగాలకు దూరమయ్యే పిల్లల ఆవేదనలను చిత్రించిన రచన 'బీజం'

"బిడ్డకు కావలసినది ఏమిటో తెలుసుకుని ఆ అవసరాలు తీర్చడం తల్లితండ్రుల బాధ్యత. బిడ్డగురించి పూర్తిగా పట్టించుకోవలసింది తల్లే అని చాలామంది తండ్రులు అభిప్రాయపడుతూ ఉంటారు. అది చాలాతప్పు. ఈ విషయంలో తండ్రి బాధ్యతకూడా ఉంది. దాన్ని విస్మరించకూడదు. ఆడదానికి దొరికినంత తీరిక మగవాడికి దొరకకపోవచ్చు. అయినా కూడా కనీసం వారానికి ఒక్కసారైనా బిడ్డను దగ్గర కూర్చొబెట్టుకుని ఆ బిడ్డ ఎలా చదువుతున్నాడు. ఏఏ సబ్జక్టులలో తక్కువ మార్కులు వస్తున్నాయి, అలా వస్తే ఏ రకంగా వృద్ధిచేసుకోవాలి అన్న విషయాలు తండ్రులు పట్టించుకోవాలి....."

"పసిబిడ్డ మనసు సారవంతమైన భూమిలాంటిది. అందులో ఏ రకమైన 'బీజం' నాటాలి--అన్నది తల్లి తండ్రులు చేయవలసినపని. అమృతఫలాల్ని ఇచ్చే మంచి బీజం నాటితే ఆబిడ్డ పెద్దవాడైన తరువాత ఒక ఉత్తమ పౌరుడుగా, మంచి ఆదర్శపురుషుడుగా తయారవుతాడు. ఈ పని చేయాలంటే తల్లితండ్రులు అనుక్షణం బిడ్డగురించి పట్టించుకుంటూ ఉండాలన్నమాట! ఆ బిడ్డను ఏరకంగానూ పట్టించుకోక అలక్ష్యంచేస్తే ఆ బిడ్డమనసులో వేరుపళ్ళు ఇచ్చే బీజం నాటుకు పోతుంది. దాని ఫలితంగా ఆ బిడ్డ పెద్దవాడైన తరువాత సమాజానికి చీడపురుగు అవుతాడు. చెడు మార్గంలో పయనిస్తూ భూమికి బరువవుతాడు. గోపీ అలా కాకూడదు." (పాలకూర సీతాలత, బీజం, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 5-11-86, పే 76-84)

తమను నిర్లక్ష్యంచేసే తల్లిదండ్రుల కారణంగా పిల్లలు ప్రేమాభిమానాలకు దూరమై పడే మానసిక క్షోభను వేదనాత్మకంగా చిత్రించిన రచన 'ప్రేమరాహిత్యం'

"శౌరి... తన కన్నబిడ్డ శౌరి తను అనాధనన్న భావానికి లోనయ్యాడా? తల్లీ తండ్రీ ఉండికూడా తనకన్నా అనాధ బ్రతుకే నయమనే స్థితికి వచ్చాడా? ఇది ఎలా జరిగింది?"

కొడుకు భవిష్యత్తుకన్నా కూడా తన లక్ష్యసాధనే ముఖ్యమనుకున్న తనకు చివరకు ఆ కొడుకే మానసికంగా దూరమయ్యాడా? ఎందరో అనాథపిల్లలని చేరదీసి, వారి మనసులను తెలుసుకున్న తను తన కొడుకునే అనాథగా మార్చుకుందా? ఎదతెగని ప్రశ్నలు.... ఎద తెగిపోయే ఆలోచనలు. మరోసారి ఆ కాగితం చదవసాగిందామె.

"శరణాలయం వారికి నమస్కారాలు. నేనుకూడా అనాథనే. నన్ను మీ ఆశ్రమంలో చేర్చుకోరూ? మామమ్మీ నన్ను పట్టించుకోదు. మా డేడీ ఎప్పుడూ టూర్‌లోనే ఉంటారు. అనాథ శరణాలయంలో అయితే బాగా చూస్తారని మొన్న ఒకబ్బాయి చెప్పటంతో ఇది రాస్తున్నాను. ప్లీజ్! నన్ను చేర్చుకోండి. మీకు బోలెడు థాంక్స్ సరి. అన్నట్టు ఈ విషయం మమ్మీకి చెప్పవద్దు!"

అక్షరాలు వంకరటింకరగా ఉన్నా ఆ అక్షరాల వెనుకఉన్న హృదయం, ఆవేదన సరిగానే అర్థమయ్యాయి సుమిత్రకు. ఇది ఉద్యోగం. బాధ్యతతో కూడినదే కావచ్చు. కానీ తను కాకపోతే మరొకరు చేస్తారు. కాని తన కొడుకు బాధ్యతకు ప్రత్యామ్నాయం లేదే!

ఈ లోకంలో ఎటువంటి మినహాయింపు లేనిదీ - ఉండకూడనిదీ తల్లిప్రేమ ఒక్కటే. (పెద్దాడ వేంకట నరసింహా మూర్తి, ప్రేమరాహిత్యం, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 30-11-88, పే 51-53)

ముందుగా పిల్లలకు స్కూలుపట్ల ఉన్న భయాన్ని పోగొట్టేందుకు ప్రయత్నించనిదే పిల్లలకు మంచిచదువులు లభించవటూ నిర్బంధిత అధ్యయనాన్ని క్రమబద్ధీకరించాల్సిన అవసరాన్ని పేర్కొంటూ వచ్చినరచనే 'అమ్మా నేను స్కూలుకెళ్ళనే' పిల్లల్ని స్కూలుకి, ట్యూషనుకి పంపి తమ బాధ్యత తీరిపోయిందని తలచే తల్లిదండ్రుల బాధ్యతారాహిత్యాన్ని ఇందులో స్పష్టంగా చిత్రించారు. అసలు పిల్లలు ఎలా చదువుతున్నారో, వాళ్ళ సమస్యలేమిటో ఆలోచించకుండా, ఏపాఠాల్లో వాళ్ళు వెనుకబడి ఉన్నారో తెలుసుకోకుండా, చిన్నపిల్లలప్పటి నుండే తలకిమించిన సిలబస్‌ను గురించిన వాస్తవాన్ని అర్థంచేసుకోకుండా వారిని చదువుపేరుతో నిర్బంధించటం తల్లిదండ్రుల బాధ్యతారాహిత్యానికి గుర్తన్నది ఈ రచనలో చిత్రించారు.

అందరి తెలివితేటలు ఒకే విధంగా ఉండవు. కొంచెం వెనుకబడి ఉండే పిల్లల పట్ల మరింత శ్రద్ధవహించవలసి

వుంటుంది. క్లాసుకి డెబ్భైమంది పిల్లలుంటే టీచర్లు మాత్రం ఎంతవరకు శ్రద్ధవహించగలరు? తమకున్న ఒకరిద్దరు పిల్లల్ని చూసుకోవటమే తమకి కష్టంగా ఉంటే అరవై మందిపైన పిల్లల్ని వాళ్ళుఎలా గమనించగలరు. దానికితోడు పిల్లలకి మించిన సిలబస్. పుస్తకాలలో విజ్ఞానం ఉంటే చాలదుకదా! పిల్లలు దానిని జీర్ణంచేసుకోవాలి గదా. పిల్లలు స్కూలంటే భయపడుతున్నారంటే దానికి బాధ్యులు ఎవరు? దీనికి కారణం ఏమిటి? విద్యావిధానంలోని లోపం ఒక కారణమైతే తమలాటి వేలంవెర్రి తల్లిదండ్రులు మరోవిధంగా కారణం. అంతాకలసి పిల్లల చిన్నారి మనసుల్ని చిత్రవధ చేసేస్తున్నారు.

ఈ పరుగుల యుగంలో పోటీ తప్పటంలేదు. ఎవరు ఎంత ముందు ఉంటారా అన్న ఆలోచన తప్ప ఇతర విషయాలపై ఆసక్తి ఉండటం లేదు. అనురాగాలు, ఆప్యాయతలు చూపించే తీరిక ఎవరికీ ఉండటంలేదు. అంతా యాంత్రికం. కన్నందుకు పిల్లల్ని ఓ మంచి పేరున్న స్కూల్లో (జైల్లో) చేర్పించేస్తే బాధ్యత తీరిపోతుందనుకుంటే ఎలా? ఇప్పుడు ఇంటా బయటా బాధ్యతలతో అలసిన ఇల్లాలు పిల్లల చదువులేం పట్టించుకోగలరు? దానికితోడు చదువులూ అలాగే ఏడుస్తున్నాయి. ముందు పిల్లల మనసులో చదువంటే భయంపోగొట్టాలి. (యం.నిర్మల, "అమ్మా నేను స్కూలుకెళ్ళనే", తెలుగు విద్యార్థి, జులై '97, పే 31-32)

ప్రేమరాహిత్యం తల్లిదండ్రులపట్ల పిల్లలకు ద్వేషభావాన్ని పెంపొందిస్తుంది. అయితే ఇది పిల్లల మనసుల్లో పేరుకుపోయి అది వారి వివిధ చర్యల్లో వ్యక్తమవుతుంది. అలా తమ తల్లిపట్ల ఒక పిల్లవాని స్పందనే 'ప్రియమైన వస్తువు'

నేను పెట్టిన కార్టూన్ల కాంపిటీషన్ గురించి చెప్పి రవిగురించి ప్రస్తావిస్తూ -- "మీవాడు వేసిన బొమ్మ నాకు అర్థం కాలేదు. వాడు ఆ బొమ్మద్వారా ఏంచెప్పాలని అనుకుంటున్నాడో.... చిన్నపిల్లలని మనం తీసెయ్యకూడదు. అందరికీ ఏదో ఉంటుంది. వాళ్ళు నోరువిప్పి చెప్పలేని విషయాలు పిల్లలచేష్టలద్వారా వ్యక్తం చేశారు. ఆ భావాల్ని మనం అర్థం చేసుకుని వాళ్ళని ప్రోత్సహిస్తే భవిష్యత్తులో వాళ్ళ పెరుగుదల బావుంటుంది. అందాక అసలు వాడు ఆబొమ్మ ఏ ఉద్దేశంతోవేశాడో తెలుసుకోవాలనిపించింది. ఎలాగూ రోడ్డుమీద కలిశారు గదా అని ఇటువచ్చాను." అంటూ రవి గీసిన కార్టూన్ గురించి వివరించాను.

'డెయ్యం' కార్టూన్‌లోని భావం క్రమంగా అవగతం అవుతూంది. రవి దృష్టిలో తల్లి ఒక దెయ్యం.

పిల్లల ప్రతిఒక్క చర్యకి ఏదో ఒక అర్థం ఉంటుందన్న నా అంచనా తప్పుకాలేదు. (కాకాని కమల, ప్రియమైన వస్తువు, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 25-7-'96, పే 78-80)

**అభిప్రాయాలు, అభిరుచుల్లో వైరుధ్యాలు :**

తల్లిదండ్రుల అభిరుచులకు, ఆశలకు పిల్లల ఆలోచనలకు మధ్య వైరుధ్యాలేర్పడటం యుగధర్మం. దీన్ని తరాల అంతరంగా భావించవచ్చు. ఈ వైరుధ్యాలు సామరస్య పూర్వకంగా పరిష్కరించబడితే అద్భుతమైన ఫలితాలను పొందే వీలుంటుంది. అయితే తల్లిదండ్రుల అభిరుచులను పిల్లలపై బలవంతంగా రుద్దాలని ప్రయత్నించినప్పుడు ఫలితాలు దారుణంగా ఉండి పిల్లలభవిష్యత్తుకు అవి ప్రతిబంధకాలవుతాయి. ఈ నేపథ్యంతో వచ్చిన రచనలు చేతివేళ్ళు, జాతకం, బ్లాక్‌మెయిల్, ఎన్నిక.

రాజీకి ఫాషన్ టెక్నాలజీ కాని ఇంటీరియర్ డిజైనింగ్‌కానీ చదివి సొంతంగా బిజినెస్ చెయ్యాలని కోరిక.

కానీ తండ్రి దృష్టిలో ఎదగాలంటే అకడమిక్ కోర్స్ తప్పనిసరి.

"మా పెద్దమ్మాయి వాణి. ఎంట్రన్స్ రాంకుతో పాసయింది. గవర్నమెంట్ కాలేజీలో మెడిసన్ చదువుతోంది. చిన్నమ్మాయి రాజీ. పెద్దదానితో సమంగా చదివించక తప్పుతుందా? ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలో చదివిస్తున్నాను. అప్పు చెయ్యకుండా చదువు పూర్తవుతుందో లేదో!" తండ్రిమాటలు విన్నకొద్దీ రాజీలో దుఃఖం పెరిగిపోసాగింది. రాజీలో ఆలోచనలు విద్యాభ్యాసానికి విముఖంగా దారితీయసాగేయి. ఎంత ప్రయత్నించినా ఆమె చదవలేకపోయింది.చేతి అయిదు వేళ్ళూ ఒక్కలా ఉండాలనుకోవడం ఎంత పొరపాటో, పుట్టిన పిల్లలందరూ ఒకేలా ఉండాలనుకోవడం అంతే పొరపాటు కాదా? ఒక్కో వేలికీ ఒక్కో ఉపయోగం. ఒక్కో బిడ్డా ఒక్కోరంగంలో రాణించవచ్చునేమో! ఆలోచించండి. (పాలంకి సత్య, చేతివేళ్ళు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 1-1-97, పే 26-27)

"మరేమిటి చదువుతావు?"

"బ్యూటీషియన్ కోర్సు. బ్యూటీషియన్ అవడమే నా జీవితాశయం."

"బ్యూటీషియన్ ఏమిటి? జుట్టు కత్తిరించడమంటే మంగలిపని కాదూ?".

"దాన్నెవరూ మంగలిపని అనరు. హెయిర్ డ్రెస్సింగ్ అంటారు............"

"పద్మమ్మా రజనీ! సంఘంలో మనగౌరవమేం కావాలి? మెడిసిన్ చదువు. మా అమ్మాయి డాక్టరని చెప్పుకుంటే మాకు ఎంత గౌరవంగా ఉంటుందో!"

"మెడిసిన్ చదవమనీ, ఎమ్‌సెట్‌కి బాగా ప్రిపేర్ అవమనీ ప్రాణంతీసింది మీరే. బ్యూటీషియన్ కోర్సు చేసి ఉంటే ఈ పాటికి ఊరంతా నా పేరు మోగిపోతూ ఉండేది. కూతురు డాక్టరవాలని ఉంటే అందుకు తగిన సదుపాయాలన్నీ సమకూర్చరా?---------"

రజని రెండోసారి కూడా ఎమ్‌సెట్‌లో ర్యాంకు తెచ్చుకోలేదు. కానీ తల్లిదండ్రులకు కూతురు డాక్టరవ్వాలన్న కోరికను బ్లాక్‌మెయిల్ చేస్తూ రెండేళ్ళు హాయిగా గడిపేసింది. (పాలంకి సత్య, బ్లాక్‌మెయిల్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 25-9-'96, పే 30-31)

కొడుకులకు రాజీవ్, సంజీవ్ అని పేర్లు పెట్టుకున్నారు. ఇద్దరబ్బాయిలలో పెద్దవాడు డాక్టరూ, చిన్నవాడు ఇంజనీరూ అని నిర్ణయించుకున్నారు. ఆ విషయాన్నే పిల్లలిద్దరికీ నూరిపోస్తూ ఉండేవారు.

కానీ కొడుకు మాటలమీద తల్లిదండ్రులకి నమ్మకంలేదు. ఫారిన్ కేవలం చదువుకోసమే వెళ్ళే వారుండరు. చదువు కుని ఇండియాకి తిరిగి వచ్చినవాళ్ళు వాళ్ళకి తెలిసినంతవరకూ ఎవరూ లేరు. రాజీవ్ కూడా తిరిగివస్తాడన్న నమ్మకం వాళ్ళకిలేదు. ఇంట్లో డాక్టరు ఉండాలన్న కోరికమాత్రం ఉంది.

"ఇంట్లో ఒక డాక్టరుంటే బాగుంటుంది. అన్నయ్య ఇక మనదేశానికి వస్తాడన్న నమ్మకం లేదు. నువ్వు డాక్టరయితే మాకు మనశ్శాంతి. వార్ధక్యం ఎలా గడుస్తుందన్న బెంగ ఉండదు."

సంజీవ్ ఇష్టపడలేదు. తనకి ఇంజనీరింగ్ చదవాలని ఉందన్నాడు.

"చూశావా నీ జాతకం ప్రకారం నువ్వు డాక్టరు కావాలి." అంటూ సంజీవ్‌ని తల్లిదండ్రులు ఇంటర్మీడియెట్ బై.పి.సి. గ్రూపులో చేర్చారు.

సంజీవ్‌కి చదువు మీద ఆసక్తి తగ్గిపోయింది. తనకి ఇష్టమైన సబ్జక్టు చదవనివ్వని తల్లిదండ్రులపై కోపంవచ్చింది. ఎంతసేపూ మాథమాటిక్స్ గురించే ఆలోచించేవాడు.

తల్లిదండ్రుల నిరాశను వెల్లింపు చేస్తూ అతనికి ఎక్కడా ఉద్యోగం కూడా రాలేదు. సొంతంగా చిన్న మెడికల్ షాపు పెట్టుకున్నాడు. మాథమాటిక్స్ నూటికి నూరు మార్కులతో టెన్త్‌క్లాసు పాసయిన అబ్బాయి చివరకు చిన్న మందులషాపు నడిపేవాడిలా తయారయ్యాడు. (పాలంకి సత్య, జాతకం, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 16-10-'96, పే 30-31)

"చిన్నపిల్లల మనసులు ఎంత సున్నితాలు! పెద్దవాళ్ళు వాళ్ళకి బ్రతకనేర్పటం, చెప్పడం మరచిపోతున్నారు. ఎలా మెలగాలో క్షణంక్షణం కొరడా ఝుళిపించి అనుక్షణమూ శాసించి తనలాంటి వాళ్ళు మేలుచేస్తున్నామనే భ్రమలో కూరుకు పోతున్నారు."

"అసలు పిల్లల్ని మన అభిప్రాయాలకోసం నడుచుకోవాలి అనుకోవడం మానసిక బానిసత్వం కాదూ? పిల్లల సున్నితమైన మనసు అలా కరకుతేలిపోతుంది. ఎంతసేపూ ఎదుటివారితో పోటీపడి కంపేర్ చేస్తూ పిల్లల్ని నలిపేస్తాం! 'అసలు కంపారిజన్ చేసుకోకండి!' అంటూ చెప్పారు ఒక విఖ్యాత ప్రొఫెసర్. నిజమే. ఈ సృష్టిలో ప్రతిప్రాణీ యూనిక్. దేనిగొప్ప దానిదే! మన పిల్లలలో ప్రతివారికీ ..... అన్నీ ఎవరివి వారికి ప్రత్యేకం! వాటిని వారి వారికి తెలియచెప్పాలి. మనం మార్గదర్శకులం మాత్రమే! జీవన నిర్దేశకులంగాము.

ప్రతివాడూ ఐ.ఐ.టీ. ఇంజనీరైపోవాలంటే ఇదిగో ఇలాంటి పరిణామాలు ఏర్పడతాయి. వయసు, మనసు రెండూ పసి అవస్థలో ఉంటాయి. ఆలోచనా జ్ఞానం వికసించని వయసు. ఆవేశం హెచ్చు. అర్క్ ఎంతో మృదుస్వభావం. మొహమాటం గల పిల్లాడు. ఒక్క కొడుకు. ఏంచేస్తాం?"

రాంకులు, పరీక్షలు, మార్కుల స్థానంలో తృప్తిగా బతకాలి. ఆనందంగా ఉండాలి. సున్నితమైనమనసు కలిగి ఉండాలి. అందుకోసం మనిషి హాయిగా బతికేందుకు ఎన్నిమార్గాలు ఉన్నాయో అవన్నీ తను స్వయంగా అన్వేషిస్తూ ఆ అనుభవాలను కొడుక్కి ఎప్పటికప్పుడు అందించడం ఇప్పుడు భాస్కరం నేర్చుకున్నాడు. (అరుణవిప్లవ, ఎన్నిక, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 26-10-'98, పే 38-42)

కానీ తండ్రి చండ శాసనుడు. అందరూ తన అభీష్టం ప్రకారం నడుచుకోవాలనే తత్వం కలవాడు. అలా ఎవరైనా నడుచుకోకపోతే ఆయనకు కోపం వస్తుంది. కేకలేస్తాడు. కొడుకు నయితే కొట్టేవాడు కూడా.

ఆ కుర్రవాడికి చిన్నప్పటినుంచి ఎన్నెన్నో స్వంత ఆలోచనలుండేవి. స్వంత అభిరుచులుండేవి. కానీ తండ్రి అతని ఆలోచనల్ని పెరగనివ్వలేదు. అభిరుచుల్ని చంపేశాడు.

ఏ రోజు ఏంకూర తినాలన్నది కూడా తండ్రే చెప్పేవాడు. ఎప్పుడు నిద్రపోవాల్సిందీ, ఎప్పుడు లేవాల్సిందీ, ఏ సమయంలో ఆడాలో, ఎప్పుడు ఏం చదవాలో కూడా తండ్రే నిర్దేశించేవాడు.

తండ్రి తన విషయాలన్నింటినీ అలా నియంత్రించటం కుర్రాడికి ఏమాత్రం నచ్చేదికాదు. వొకటి రెండు సార్లు నియమాలను కావాలని ఉల్లంఘించాడు. తండ్రి విధించిన శిక్షల్ని అనుభవించాడు.

క్రమంగా అతనొక విషయాన్ని గుర్తించాడు. నియమాలకు లొంగి స్తబ్ధంగా పడివుండేకన్నా, వాటిని ఉల్లంఘించటంలో వొకవిధమైన సంతృప్తి, వెర్రి ఆనందం వుంది.

ఆ కుర్రాడు టెంత్ పరీక్షలు వ్రాశాడు. అతను పరీక్షల నెలా వ్రాసిందీ తండ్రి పరీక్షించాడు. ఆయన ఊహించిన స్థాయిలో రాయలేదని కోపం వచ్చింది. కొట్టాడు.

మనసులో తండ్రిపట్లనున్న ద్వేషం ఆ క్షణంలో పెల్లుబికింది. ఆవేశంగా మారింది. తిరగబడి తండ్రిని కొట్టాడా కుర్రాడు.

తండ్రి తిట్లలో కొత్త అర్థాలు.

'మార్కండేయా. నిన్ను క్రమ శిక్షణలో పెంచాలనుకొన్నది నాకోసం అను కుంటున్నావా బాబూ! నీ కొసమే. నీ బాగు కోరే. మనకుటుంబం శ్రేయస్సు కోరి. మన భారతదేశ శ్రేయస్సు కోరి నాయనా. మొక్కయి వంగనిది మానయి వంగుతుందా? క్రమశిక్షణ లేని వ్యక్తి ఎలా ఉన్నతుడవుతాడు? కష్టాలను ఎదుర్కొనగల ధైర్యం ఎలా వస్తుంది? క్రమశిక్షణ లేని అరాచకవాదులున్న కుటుంబం ఏం లెక్కొస్తుంది? క్రమశిక్షణ లేని వ్యక్తులతో నిండిన దేశం కుక్కలు చింపిన విస్తరి చందం కాదూ? తల్లితండ్రులు స్వార్థాన్ని కాస్త వదులుకొని బిడ్డల్ని క్రమశిక్షణతో పెంచితే ఆరోగ్య వంతమైన కుటుంబం, శక్తి వంతమైన దేశం నిర్మాణం అవుతాయని నా ఆశయం నా తండ్రీ....'మార్కండేయులు ఆశ్చర్యపోసాగాడు! (కప్పగంతుల మల్లికార్జునరావు, దిష్టిబొమ్మ, యువ ఏప్రిల్ 85,పే 109-120)

- "బాల్యం నిజంగా ఎంత గొప్పది. బాల్యాన్ని తిరిగి తిరిగి జీవించాలని అందరూ కలలు కంటారు. అమ్మమ్మలు మాత్రమే బాల్యాన్ని ముద్దాడి, మురిసిపోతూ మళ్ళీమళ్ళీ బాల్యాన్ని జీవిస్తారు. కొంచెం ఆలస్యం అయింది కానీ, ఇప్పటికైనా మించిపోయిందిలేదు. వర్షను చూసుకోడానికి వెళుతున్నాను." అని సంబరపడింది విజయ.

విజయకు అర్థంకాలేదు ముందు -- నోట్‌బుక్‌లోకి తొంగిచూసి, "పాపతో మాటలు, ఆటలు లేకుండా కేవలం ఏటైంకు ఏంచేసిందో తెలుసుకుని ఇన్నాళ్ళు తృప్తిపడిందా శిరీష" అనుకొని విజయ భయంతో వణికిపోయింది. ఆమె కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి. "బుక్స్, నైంటీస్, పెన్సిల్స్, పార్ట్నర్స్, ఎరేజర్స్ మధ్య పెరుగుతోంది వర్ష. పాపకు బాల్యం లేదు. అమ్మా నాన్నల ప్రేమలేదు. ఇదేమి జీవితం శిరీష!" కొంగుతో కళ్ళుతుడుచుకుంటూ అంది.

నేరస్థురాలిగా, అసహాయంగా నిలుచుండిపోయింది శిరీష. విజయ నిద్రపోతున్న వర్షమొళ్ళొంచి లాకెట్ తీసేసింది. "ఈ రోజునుంచి వర్ష నాదగ్గరే పడుకుంటుంది. మీ అమ్మమ్మలాగా నేనూ వర్షను చూసుకుంటాను."

తల్లిని పెనవేసుకొని, ఆమె భుజంపై వాలిపోయింది తప్పుచేసినట్లు.

విజయ కూతురి తలను ఆప్యాయంగా నిమురుతూ " ప్రేమలు, ఆపేక్షలు, మమకారాలు లేకపోతే మనకూ ప్లాస్టిక్ పువ్వులకు తేడా ఏమిటి? ఇంతలా బందీలయిపోకూడదు పరిస్థితులకు" అంది. (ఎస్.జయ, ప్లాస్టిక్ పువ్వులు, రెక్కలున్న పిల్ల, పే 21-28)

- చదువు మీదున్న ఆపేక్షతో చదువు వదిలేసి పారిపోవటం ఒక పేరడాక్స్.

ఇంట్లో అమ్మకు నేను చదువుకోవాలని ఉన్నా, నాన్న సాగనిచ్చిందెక్కడ? అమ్మ పొలంపనులకు కూలిపనికి వెళ్తా ఇంటిపనంతా నాకే చేప్పేది. సంపాదించింది తాగి తందనాలాడి కూలిపనికి పొమ్మని కొట్టడం తప్ప నాన్న చదువుకొమ్మన్న చెప్పాడు? తమ్ముని, చెల్లెల్ని ఎత్తుకొని ఆడించడంతో పాటు పెడతెచ్చి పిడకలు చేయడం, గట్టుకుపోయి కట్టెలు కొట్టుక రావడం మొదలుకొని మొత్తం పనులన్నీ నాకే చెప్పేవాళ్ళు.

నీ కొడుకు తిండి ఎక్కువై, గారాబం, స్వార్థం ఎక్కువై పారిపోయాడు. ఇంత కఠినంగా అంటున్నందుకు బాధ పడకు.

ఆనంద్! పిల్లలు కోరిందల్లా తెచ్చిస్తే నీప్రేమ వ్యక్తం చేసినట్లు అవుతుందనుకుంటున్నావు! అంటే అనిల్ నిన్ను ప్రేమించడానికి వస్తువుల్ని లంచంగా ఇవ్వదల్చుకున్నావన్నమాట!

"సమ్మర్ హిల్" పుస్తకం చదవమంటావు. ఆపద్ధతిలో పెరిగినపిల్లల్లో సమాజంకోసం నిస్వార్థంగా పనిచేసే వాళ్ళుగా ఎదిగినవెందరు. అనేది నా ప్రశ్న. ఈ ప్రశ్న వేసుకోకపోతే స్వేచ్ఛ పేరిట స్వార్థపరులుగా మార్చడం తప్ప చేసేదేమిటి?

అనిల్‌ను మార్చేముందు వాళ్ళఅమ్మ అమనిని మార్చు. నీ భార్యలో, పిల్లల్లో అవగాహన పెంచు. తల్లులు గొప్పవాళ్ళే. కాని వారు పిల్లలకు స్వార్థాన్ని నేర్పడం వల్లనే పిల్లల వ్యక్తిత్వాలు యిలా రూపొందుతున్నాయి. (బి.ఎస్.రాములు, మమతలు-మానవసంబంధాల కథలు, పే 48-53)

### తల్లిదండ్రుల ఆశలకు -- పిల్లల ఆచరణకు సయోధ్య :

తల్లిదండ్రుల శ్రమకు పిల్లల ఆచరణకు సయోధ్య కుదిరినప్పుడు వచ్చే ఫలితాలెంత ఆహ్లాదకరంగా ఉంటాయో, తల్లిదండ్రులపట్ల పిల్లలెంత ప్రేమాభిమానాలను చూపిస్తారో వ్యక్తం చేసే రచన 'అమ్మ'. పిల్లలపట్ల తల్లిదండ్రులు ప్రేమాభిమానాలు చూపగలిగితే అనుకున్న ఫలితాలను సాధించటంతో పాటుగా పిల్లలనుంచి సరైన స్పందనను పొందగలుగుతారన్నది ఇందులో స్పష్టంగా

వ్యక్తీకరించబడింది. సరైన జీవితపు విలువలతో పిల్లలను పెంచగలిగితే వారినుంచి అద్భుతమైన ఫలితాలను చవిచూడగలమనేందుకు ఈ రచన ఒక నిలువెత్తు దర్పణంగా నిలుస్తుంది.

పదవ తరగతినుంచీ తన చదువు గురించి ఆమె ఎంతో శ్రద్ధవహించింది. ఇంటర్‌కు వచ్చేసరికి ఆమె మరిన్ని జాగ్రత్తలు తీసుకుని చదివించింది. ఆమె క్లాసులో లెక్చర్స్‌కు ప్రిపేర్‌అవటం, ఇంటిపనులు చేసుకోటం, తనకు ప్రతిరోజూ, ఉదయం సాయంత్రం ట్యూషన్ చెప్పటం, స్టడీమెటీరియల్ తయారుచేయటం - నిజంగా ఇన్నేళ్ళూ అష్టావధానమే చేసింది ఉమాభారతి.జీవితాన్ని, నడవడికను తీర్చిదిద్దే ఎన్నో కమనీయమైన సూక్తులను వినిపిస్తూ, వాటి అర్థాన్ని వివరిస్తూ, పల్లవికి జీవితం పట్ల సరియైన దృక్పథం ఏర్పడేలా చేసింది. ఆమెకు ఆత్మ స్థైర్యాన్ని నూరిపోసింది.

ఇది కేవలం ఎమ్‌సెట్ కోసం ఇచ్చిన తర్ఫీదుకాదు. భావి జీవితానికి వేసిన పునాది.

అహర్నిశలు నిర్విరామంగా కృషి చేస్తూ, కొవ్వొత్తిలా వెలుగుతూ, తనను విజయశిఖరానికి ఎక్కించిన తల్లికి తప్ప, మరొకరికి ఈ కీర్తి దక్కడానికి వీల్లేదు. డబ్బు ఎరచూపి, 'సింహము పాలిసొమ్ము గోమాయువు కోరు చందమున' ఈ గౌరవాన్ని వాళ్ళ కాలేజీకి ఆపాదించుకోవటానికి ప్రయత్నించటం అసమంజసం, అనైతికం. అందుకే పల్లవి ఇలా స్పందించింది. మా అమ్మ తప్ప నాకు మరొక గురువు లేరు.

"క్షమించండి! నన్ను అపహాస్యం చేసుకోవద్దు. మా అమ్మే నావిజయానికి కారణం. అందుకు నాకెంతో గర్వంగాఉంది."

అంటూ తల్లిని కౌగిలించుకుని బావురుమని ఏడ్చేసింది పల్లవి. (పుత్రేవు సీత, అమ్మ, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 2-4-'97, పే 10-11)

*"The term "brain drain' refers to the migration on a permanent basis of highly qualified and talented manpower from a country in which it has been trained at considerable expense, to another country".*
*-----Binodkhadria. 1999:175*

=======

మేధోవలస

విద్యాపరంగా తెలుగుసాహిత్యంలో ప్రముఖంగా చోటుచేసుకున్న మరోప్రధానమైన అంశం మేధోవలస. మేధోవలసగురించిన విభిన్నకోణాలను విస్తృతంగా చర్చించటం తెలుగురచనల్లో మనకు కనిపిస్తుంది.

విద్యారంగంలో దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఒకటి మేధోవలస. మేధోవలసను నిర్దుష్టంగా నిర్వచించటం సాధ్యంకాదు. ఒకప్పటి భారత గణాంక సంస్థ ఛైర్మన్ పి. ఎస్. హస్సర్ ప్రకారం మేధోవలస అనేది "Flight of intellectual capital seeking profitable investment". అయితే ఇప్పటివరకూ 'మేధోవలస' ను గురించినచర్చ ఎక్కువగా విదేశాలకు వలసపోతున్న మేధకే పరిమితమైంది. అందువల్లనే మేధోవలసను అదే పరిభాషలో నిర్వచించటం కనిపిస్తుంది. "The term 'brain drain' refers to the migration on a permanent basis of highly qualified and talented manpower from a country in which it has been trained at considerable expense, to another country". కాని 'మేధోవలస' భావనను సంకుచితార్థంలో కాకుండా విస్తృతార్థంలో గ్రహించాల్సివుంది. మేధోవలస ప్రధానంగా రెండు విధాలు. ఒకటి బహిర్వలస(External BrainDrain), మరోటి అంతర్వలస(Internal BrainDrain). అయితే ఈ బహిర్వలసనే స్థూలంగా మేధోవలసగా చెప్తుంటారు. కానీ అంతర్వలసకూడా మేధోవలసలో ప్రధానభాగమే.

----------బహిర్వలస (External Brain Drain)

మేధోవలస -------------

----------అంతర్వలస (Internal Brain Drain)

**బహిర్వలస:**

ఈ మేధోవలసకు ప్రధాన కారణం లోపభూయిష్టమైన విద్యావిధానంగా పేర్కొనవచ్చు. చదివిన చదువుకు, చేసేఉద్యోగానికి, వ్యక్తిలోని సహజసిద్ధమైన ఆసక్తికి పొంతన కుదరకపోవటం నేటి మన విద్యావిధానంలో సాధారణాంశం. ఇక్కడ చదువు వ్యక్తి ఆసక్తి, అభిరుచులకు అనుగుణమైందిగా ఉండటంలేదు. కుటుంబ ఆర్థిక, సామాజిక స్థాయి, తల్లిదండ్రుల అభిరుచులు, చదువును పెట్టుబడిగా భావించి దాన్నించి అధికలాభాన్ని పొందాలని ఆశించటం వంటి విభిన్న అంశాలు వ్యక్తి చదువుపై ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా వ్యక్తి అభిరుచులతో నిమిత్తంలేకుండా చదువు సాగుతుంది. విద్యను కేవలం వ్యాపారంగా మాత్రమే చూసే వ్యవస్థలో పెట్టిన పెట్టుబడికి అధికలాభాలు పొందాలని ఆశిస్తారు. ఈ వ్యాపారభావనే మేధావులను సంపన్నదేశాలకు వలసపోయేట్లు చేస్తున్నది. ఈవ్యాపారదృష్టిని, దాని పర్యవసానాన్ని పేర్కొంటారు సత్యకామ్ తన రచనలో.

"అసలు ఎవరైనా మెడిసిన్ ఎందుకు చదవాలి? ఎందుకు చదవాలంటే ఓ హోదాకోసం చదవాలి. దిట్టంగా కట్నం కొట్టెయ్యడానికి చదవాలి. నర్సింగ్‌హోం పెట్టుకొని ముమ్మరంగా సంపాదించాలి. బామ్మరిదిచేత నర్సిగ్‌హోంకి అనుబంధంగా మెడికల్‌షాపు, క్లినికల్‌లేబూ పెట్టించి రోగుల్ని ఎడాపెడా అవసరం ఉన్నా లేకపోయినా వాయించాలి. అలా కాదనుకుంటే అమెరికాకి ఎగిరిపోవాలి....."

"తయారవుతున్న ప్రతీ డాక్టరు మీదా లక్షలాది రూపాయల ప్రజాధనం ఖర్చవుతోంది. ఎ అమెరికాకోపోయి నాదారి నేను చూసుకుంటే అనారోగ్యంతో మగ్గుతున్న మనగ్రామాల సంగతేమిటి?" అన్నాడు డా.దేవుడు. (సత్యకామ్‌సెటైర్లు, వైద్యో 'నారాయణా' హరి!, పే.-67-68) అన్న అభిప్రాయాన్ని వ్యక్తంచేయటం చూస్తాం.

ఇదే అభిప్రాయాన్ని ఇంకా బలంగా ముందుకుతెచ్చిన రచన 'ఎగిరిపోయిన ఆదర్శం'.

'చదువుకున్న వాళ్ళంతా పట్నాలకెగబడుతున్నారా! గ్రామాలు దేశానికి వెన్నెముకలని నాయకులు ఉపన్యాసాలివ్వటమే కాని, ఒక్క నాయకుడూ తన కొడుకును వైద్యం చదివించి గ్రామానికి పంపించడు. ఎప్పుడూ అమెరికా వైపే చూపు' అన్నాడు. ఏదో మాటల సందర్భంలో కేశవరెడ్డి సహజసిద్ధమైన ఉద్రేకంతో. అంతటితో ఊరుకోక తనకూతుర్ని వైద్యం చదువు చెప్పించి డాక్టర్నిచేశాడు. అయితే ఆచరణలో తన ఆదర్శం తలవంచుకోక తప్పని పరిస్థితి ఎదురైంది కేశవరెడ్డికి.

'పోనీ రేపు నీ కొడుకును వైద్యం చదివించి మన వూళ్ళో సేవ చేయమనరాదూ చూద్దాం?'

'ఒక ఆదర్శంతో, గమ్యాన్ని దృష్టిలో ఉంచుకుని యశోధరకు వైద్యం చదువు చెప్పించాను. ఆ గమ్యం దగ్గరికి చేరింది. నాకోరికను మీరు తీర్చాలి. మీరు, అమ్మాయి ఈ వూళ్ళో ప్రాక్టీసు......'

'వ్వాట్?'

'ఈ ఊరు కాకపోతే మీ ఊరు. మరో పల్లెటూరు. పల్లెల్లో పుట్టి డాక్టర్లు అయిన మీలాంటి వాళ్ళు పల్లెప్రజలకి సేవ చేయటానికి ముందుకురావాలి." ...............

కానీ, కూతురు అమెరికాలో ఉద్యోగం చేస్తే తనకేం లాభం? ఆమె చదువు కని బోలెడంత ఖర్చుపెట్టిన ఈ దేశానికేం లాభం? దగా! ఇదో రకం 'దగా' కాదూ? ...........

భార్య, కొడుకులతో పాటు వూరంతా అలాంటి మాటలతో పొడుస్తుంటే, కేశవరెడ్డి ఆదర్శం సిగ్గుతో తల వంచుకోక తప్పలేదు. (కప్పగంతుల మల్లికార్జునరావు, ఎగిరిపోయిన ఆదర్శం, కప్పగంతుల మల్లికార్జునరావు కథలు, పే 66-72)

**అంతర్వలస:**

చదివిన చదువుకు తగిన ఉద్యోగం లేకపోతే అది బహిర్వలసనే కాక అంతర్వలసను కూడా పెంపొందిస్తుంది. మెడిసిన్, ఇంజనీరింగ్, లా వంటి రంగాల్లో నైపుణ్యంపొందిన మేధావులు పరిపాలనారంగంలో ప్రవేశించడం ఇలాంటిదే. శాస్త్ర, సాంకేతిక రంగాలలో విద్యనభ్యసించినవారు పౌరసేవల్లో పనిచేయడం మేధోదుర్వినియోగంక్రిందికే వస్తుంది. దీనివల్ల కలిగే నష్టం మేధోవలసకంటే

తీవ్రమైనదే. ఇందుకు సి.వి.రామన్ జీవితమే ప్రధాన ఉదాహరణ. సి.వి.రామన్ జీవితపు తొలిభాగం ఇలాంటి అంతర్వలసకు గురైంది. "రామన్ భారతీయ ఆడిట్ అండ్ అకౌంట్ల శాఖలో తన కాలాన్ని...జీవితాన్ని పాడుచేశారు...... చివరికి ఆయన అందులో ఉండలేక దాన్ని వదిలి శాస్త్ర గవేషణకు అంకితమయ్యారు"(అశుతోష్‌ముఖర్జీ)

బహిర్వలసకంటే అంతర్వలస మరింత ప్రమాదకరమైనది. మధ్య ఆసియాలో టర్కీ, ఇరాన్ వంటిదేశాల్లో విద్యాధికులు విదేశాలకు వలసపోవడంవల్ల కల్గుతున్న నష్టం కంటే, దేశంలోనే పల్లెలనుంచి పట్నాలకు వలసవెళ్ళడం కారణంగా జరిగుతున్న నష్టం అధికంకావడం గమనార్హం. అర్థశాస్త్ర పరిభాషలో under employment గా పేర్కొనే అంశాన్ని కూడా ఈ అంతర్వలసకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ప్రముఖ వైద్యశాస్త్రజ్ఞులు కాకర్లసుబ్బారావుగారి అభిప్రాయం ఈ అంశాన్ని బలపరుస్తుంది. "He was of the view that the real brain drain took place 'within' the country when talented people were allowed to undergo frustrations." (Binodkhadria. 1999:175.)

ఈ అంతర్వలసప్రమాదాన్ని తెలుగుసాహిత్యం గుర్తించింది. గ్రామాలనుంచి బయల్దేరి విదేశాలకు చేరుకుంటున్న మేధస్సు తిరిగి గ్రామాలకు చేరాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పిన రచన 'ఎదిగొచ్చిన కొడుకు'

"నాపరిశోధనను అర్ధాంతరంగా విడిచిపెడుతున్నాను. చాతకాక కాదు. అంతకంటే మంచిపని చేసేందుకు ఇది పెద్ద ప్రతిబంధకమవుతోంది.-----

అందరిలాగానే నేనూ ఓ మంచి ఉద్యోగం చేజిక్కించుకొని, ఢిల్లీయో కలకత్తాయో మరో మహానగరమో పోయి, వీలైతే విదేశాలు పట్టేసి, నాకోసమో కాదంటే, నా అమ్మా నాన్నలకోసమో రేపురాబోయే భార్యా బిడ్డలకోసమో బతకాలా?

ఎందుచేతనో పాలుతాగిన గుండెనే గుద్దే దౌర్భాగ్యుల్లో నేనూ ఒకణ్ని కాలేకపోతున్నాను. అది తప్పైఅయితే... అది మీ పెంపకంలో లోపం అవుతుంది. ------------

ఇవాళ గ్రామాలనుంచి బయటకొచ్చి, చదువుకొని బాగుపడినప్రతివాడూ తన సుఖ జీవనంకోసం నగరాలు పట్టేస్తున్నాడు. ప్రజాధనంతో పెద్దచదువులు చదివిన ప్రతివాడూ విదేశాలకు వలస పోతున్నాడు. మన గ్రామాలూ, దేశం మురికిగుంటల్లా మారిన విషయం వాస్తవం. నరక సదృశంగా వున్నదీ నిజమే. వాటిని మార్చాల్సిన బాధ్యత ఎవరిది? ------

ఇదొక్కటేకాదు. అభివృద్ధిచెందిన దేశాల "గ్లోబలైజేషన్" నినాదం, దాని నేపథ్యంలో మనదేశంలో వచ్చిన సరళీకృత ఆర్థికవిధానాలు...ఇలాంటివే చాలా ఉన్నాయి. తెగినవాళ్ళు ప్రజలమధ్యన వుండి పోరాడకపోతే గ్రామాల్లోని అమాయక జనం దుమ్ములో కలిసిపోతారు. ---------(బి.వి.ఎ. రామారావు నాయుడు, ఎదిగొచ్చిన కొడుకు, నాగావళి కథలు, పే 66-74)

ఈ బహిర్వలస, అంతర్వలసలు రెండూ పరస్పర ప్రేరకాలే. అంతర్వలస బహిర్వలసకు దారితీస్తే, బహిర్వలసలు అంతర్వలసను ప్రేరేపిస్తాయి.




**మేధోవలసకు కారణాలు:**

మేధోవలసకు వెనుకగల ఉద్దేశ్యాలను రెండు ప్రధాన పార్శ్వాలుగా గణించవచ్చు. అందులో ఒకటి ఆర్థికపార్శ్వం కాగా మరొకటి సామాజిక పార్శ్వం.

ఆర్థికపార్శ్వం ("BRAINS GO WHERE MONEY IS")

మేధోవలస

సా మాజిక/సాంస్కృతిక పార్శ్వం ("BRAINS GO WHERE BRAINS ARE")

**ఆర్థికపార్శ్వం:**

పైరెండింటిలో ఆర్థికాంశం మేధోవలసకు ప్రధానకారణంగా భావించబడుతోంది. 'మేధ సంపదదిశగా పయనిస్తుంది' (Brains go where money is). అన్న నానుడి దీనికి బలాన్నిచేకూరుస్తుంది. ఆధునిక వసతిసౌకర్యాలు, ఉన్నత జీవన ప్రమాణాలు, స్వదేశంలోని నిరుద్యోగం, స్వల్పవేతనాలు వంటివి మేధోవలసను ప్రభావితంచేసే ఆర్థికాంశాలుగా భావించాల్సి ఉంటుంది. లాభాల ప్రలోభ సంస్కృతికీ మేధోవలసకూ గల సన్నిహితసంబంధాన్ని ముందుంచే ప్రయత్నం చేస్తూ..........

శివ: డబ్బులకోసం చదువులు.... గొప్పలకోసం చదువులు....విదేశాలకి ఎగిరిపోవటానికి చదువులు.... బాగుంది.... చాలా బాగుంది. ............

కృష్ణ: లాభం...పుట్టిన బిడ్డ మగయితే లాభం...వాడు ఇంజనీరో, డాక్టరో కావటం ఇంకెంతో లాభం....వాడు విదేశాలు వెళ్ళటం మరింత లాభం. విదేశాల్లోనే స్థిరపడటం ఇంకా ఇంకా లాభదాయకం....

పార: అవునండీ! ఇప్పుడంతా లాభాల ప్రలోభ సంస్కృతే గదండీ!..............

శివ: (వ్యంగ్యంగా) కలలు గంటున్నావు! నీ కూతురి గురించి నువ్వు కలలుగంటున్నట్లే నీ తండ్రిగా నేనూ కలలు గంటున్నాను. నువ్వు ఈ దేశప్రధానివైతే చూడాలని ఎంతో ఆశపడ్డున్నారా? మరి నా కల నిజంచేస్తావా? ఈ దేశప్రధాని నాకొడుకంటూ గొప్పగా చెప్పుకుంటాను. (రాజేశ్వరితో) ఏమ్మా! మీనాన్న నీగురించి ఎలాంటి కలలుగంటున్నాడో ఎప్పుడన్నా అడిగి తెలుసుకున్నావా? ..... చదువనేది జ్ఞాన సముపార్జనకు ఆలంబన కావాలిగాని డబ్బు సంపాదనకు మార్గం కాకూడదు. (వల్లూరు శివప్రసాద్, హింసధ్వని, డా!!అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్, పే 545-564)

అందుకే ఇంజనీరీకన్నా, డాక్టరీకన్నా, కలెక్టరుకన్నా జీవితం ఎంతోగొప్పదని, హోదాకోసం, గొప్పచెప్పుకోవటం కోసమో కాక మనిషి మనుగడకు ఉపయోగపడేదే అసలైన జ్ఞానమని హింసధ్వని పేర్కొంటుంది.

**సామాజికపార్శ్వం:**

ఆర్థికాంశంతో పోల్చినప్పుడు సామాజికాంశం అంతగా పరిగణనపొందలేదు. కాని సామాజికాంశం ప్రాధాన్యతను తక్కువగా అంచనా వేయలేం. 'మేధ మేధవైపుగా పయనిస్తుంది' (Brains go where brains are) అన్న నానుడి ఈ విషయాన్ని స్పష్టంచేస్తున్నది. ఈ సామాజికాంశంలో దేశంలో సమర్థవంతమైన, స్ఫూర్తినిచ్చే మేధోవ్యవస్థ లేకపోవటం మేధోవలసకు ప్రధానకారణంగా భావించబడుతున్నది. ఆర్థికకోణాన్నిదాటి మేధోవలసకుగల కారణాలను మొదటగా వెలికితీసిన వ్యక్తి అమర్త్యసేన్. మేధోవలసను వివరించే ఆర్థికకోణంలోని అసమగ్రతను పేర్కొంటూ సేన్ "........... Some of the usual explanations, such as income difference, distance, travel cost, or quotas, are of so little use in explaining inter-country variations of immigration of natural scientists, social scientists, engineers and doctors into the United States from the underdeveloped countries." అభివృద్ధిచెందుతున్న దేశాలనుంచి అభివృద్ధిచెందిన దేశాలకు జరిగే మేధోవలసకు ఆదేశాల్లోని అధికవేతనాలు, ఉన్నతజీవన ప్రమాణాలు వంటివి ప్రధానకారణం అన్న భావనను తిరస్కరిస్తూ సేన్

"Since income differences do not appear to explain variations of immigration into the United States, it is unlikely that the brain drain to America can be reduced significantly just by raising salary level of scientists, engineers and doctors in the under-devrloped countries" (Amarty Sen,1973)

స్వదేశీమేధావులకు విదేశాల్లోని మేధావులతో సరైనమేధోపరమైన సంబంధాలు లేకపోవటం ఈ మేధోవలసకు గల ప్రధానకారణంగా పరిగణించాల్సిఉంటుంది. అత్యున్నతపరిశోధనా రంగాల్లో

ప్రత్యేకమైనఅంశాలపై పరిశోధనలుజరిపే శాస్త్రవేత్తలు తరచూ వృత్తిపరమైన ఒంటరితనాన్ని ఎదుర్కొంటుంటారు. వారి వృత్తిపరమైన భాషను, భావాలను పంచుకొనేందుకుగానీ, వారి పరిశోధనలను గణించేందుకుగానీ సమర్థులైన వ్యక్తులు లభించరు. పరిశోధనారంగంలో సమర్థవంతమైన మేధోవ్యవస్థల ఉనికి/లేమి అనేది మేధోవలసకు ఒక ప్రధానకారణంగా భావించాలి. ఈ రకమైన మేధోవ్యవస్థల కల్పనద్వారా మేధాపరమైన వాతావరణాన్ని ఏర్పరచటం మేధోవలసనివారణకు సహకరిస్తుంది. శాస్త్రవేత్తలమధ్య సాధారణమైన, వృత్తిపరమైన సమాచారవినిమయం, సరైన నాయకత్వం, దిశానిర్దేశం, పరిశోధనలకు అనుగుణమైన వాతావరణాన్ని కల్పించటం, తగిన గుర్తింపు వంటి అంశాలు మేధోవ్యవస్థ నిర్మాణానికి దోహదంచేస్తాయి.

ఇటువంటి వాతావరణంలేనికారణంగా జరుగుతున్న మేధోవలసను బలంగాప్రతిబింబిస్తూ తెలుగుసాహిత్యంలో వచ్చిన రచన 'విక్రమార్కుడి సింహాసనం'.

"నాచదువుకు అమ్మా, నాన్నలే కాదు. దేశంకూడా ఖర్చు పెడుతోంది. నా చదువు నాకు బ్యాంకు ఉద్యోగం తేవచ్చు. సన్నిధి అయ్యేయస్సాఫీసర్ని చేయవచ్చు. కానీనా చదువందుకు కాదు. సైన్సులో ఇంకా లోతుపాతులు తెలుసుకొని దేశానికి సేవచేస్తాను. అప్పుడే నాచదువుకు ప్రయోజనం!" అన్నాను నేనందరికీ జవాబుగా.

ప్రతి విద్యార్థికోసం ప్రభుత్వం చేస్తున్న లక్షలాదిరూపాయలు వృధాకావడం పట్ల ఆవేదన చెందిన విద్యార్థి పడిన మానసిక సంఘర్షణ ఇందులో చిత్రించబడింది. విశ్వవిద్యాలయంలో పరిశోధన పూర్తిచేసుకున్న అనంతరం తన చదువును దేశప్రజలకు వినియోగించాలనుకున్న విద్యార్థి ఎదుర్కొన్న సామాజిక సవాళ్ళ చిత్రీకరణ ఇందులో ప్రధానాంశం.

"మనదేశంలో విక్రమార్కులిప్పటికీ లేరు. పాశ్చాత్య దేశాలు విక్రమార్కుడి సింహాసనాలు. ఇక్కడకు వచ్చిన భారతీయులు విజ్ఞానాన్ని పెంపొందించుకుంటారు. సంస్కారాన్ని తెచ్చుకుంటారు. శక్తి సామర్థ్యాలకు మెరుగు పెడతారు. అహంకారాన్ని విసర్జిస్తారు. కృషిని నమ్ముకుంటారు. కానీ ఈ లక్షణాలన్నీ సింహాసనం మీదున్నంతవరకే! వాళ్ళు తిరిగి భారతదేశం చేరుకోగానే యథాప్రకారం మారిపోతారు" అన్న సత్యకీర్తి మాటల్లో సామాజిక పరిస్థితులు వ్యక్తి జీవనవిధానాన్ని నియంత్రిస్తాయన్న అభిప్రాయం కనిపిస్తుంది. అయితే ఆ సామాజిక పరిస్థితులను నియంత్రించే శక్తిసామర్థ్యాలు వ్యక్తి అలవరచుకోవాలనే సూచనకు మారుగా ఇందులో పలాయనవాదాన్ని ప్రబోధించినట్లనిపిస్తుంది.

"సర్ - మీరు చెప్పింది నిజంకావచ్చు. ఆనిజం తెలుసుకున్న మీవంటి వాళ్ళు మనదేశం తిరిగివచ్చి మనవ్యవస్థను మార్చాలి." అన్నాను.

"లాభంలేదు. నేను విక్రమార్కుణ్ణి కాను. మనదేశం విక్రమార్కుడి సింహాసనం కాదు. నేను దేశానికి తిరిగివచ్చినా విద్యారణ్యులాగే మారిపోతాను."

"అయితే?"

"నువ్వు విద్యారణ్య గురించి చెప్పి నాకు మహోపకారం చేశావు. భారతదేశానికి వెడితే నేను విజ్ఞానశాస్త్రానికి న్యాయం చేకూర్చలేను. సైన్సుకు న్యాయం చేకూర్చలేనప్పుడు నావల్ల భారతదేశానికి ప్రయోజనముండదు. ఇక్కడుంటే నాకు సైన్సును సేవించుకున్న తృప్తి ఉంటుంది. నేను భారతదేశం తిరిగి వెళ్ళే ఉద్దేశం వదిలిపెట్టాను" అన్నారు సత్యకీర్తి.

ఆయన మాటల్లో - విదేశాల నుంచి మాతృదేశాభిమానంతో, తమ విజ్ఞాన సంపదను దేశ శ్రేయస్సుకు పంచి పెట్టాలన్న కోరికతో - భారతదేశానికి తిరిగి రావాలనుకునే నాన్‌రెసిడెంట్ ఇండియన్సందరికీ హెచ్చరిక ఉంది. (వసుంధర, విక్రమార్కుడి సింహాసనం, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 10-6-'87, పే .........)

కాబట్టి మేధోవలస నివారణ కేవలం పరిశోధనలపైన అధికవ్యయాన్ని వెచ్చించటం, అధికవేతనాలు, మంచి ప్రయోగశాలలు వంటివాటివల్లనే సాధ్యంకాదు. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం పెంపొందేందుకు వీలైన సామాజిక, సాంస్కృతిక వాతావరణాన్ని అభివృద్ధిచేయటం ద్వారా మేధోవలసను కొంతమేరకు తగ్గించడం సాధ్యమైతుంది.

**మేధోవలసను ప్రేరేపించే సామాజిక కారణాలు:**

ప్రతిభకు తగిన గుర్తింపు లేకపోవటం మేధోవలసకు ప్రధాన కారణం. ఆర్థిక, రాజకీయ, సామాజిక కారణాలవల్ల ప్రతిభకు తగిన గుర్తింపు లభించక పోవడం, ప్రతిభ లేనివారికి తరచూ అవకాశాలు లభిస్తుండటం కారణంగా మేధ స్వదేశాన్ని వదలి వలసపోవటం జరుగుతుంది. గుర్తింపులేమికారణంగా జరుగుతున్న మేధోవలసను నిరసిస్తూ వచ్చిన రచన 'వలస'.

"నాదేశం, నాప్రజలు అని గుండెలు బాదుకునే మీలాంటి నాయకులు వైద్యం కోసం విదేశాలకు వెళ్లాల్సిన దుస్థితి ఎందుకు కలుగుతోంది? కావాలంటే, మీకు ఆపరేషన్ చేయటానికి నాకన్నా మంచి సర్జన్‌లు ఎందరో దొరుకుతారు మన భారతదేశంలో. కానీ మీకది ఇష్టంలేదు. నిపుణులైన డాక్టర్లు మనకు లేకకాదు. మనడాక్టర్ల నైపుణ్యంమీద మనకు నమ్మకం లేక. తమవాళ్లే తమ ప్రతిభను గుర్తించనప్పుడు, ఇతరుల వెంటబడక ఏంచేస్తారు ఎవ్వరైనా! పల్లానికి నీరు ప్రవహించినట్లు, 'ప్రతిభ' గుర్తింపు లభించేచోటుకి పయనిస్తుంది. మేధోవలసలో తప్పు పట్టాల్సింది మేధావుల్నికాదు. మీలాంటి రాజకీయ నాయకుల్ని!". (రఘురామరాజు, వలస, రఘురామరాజు కథలు-పునరావృతం, పే 27-29)

శాస్త్రసాంకేతిక సంస్థల్లో రాజకీయ జోక్యం మేధోవలసకు మరో ప్రధానకారణంగా భావించవచ్చు. సాంకేతిక నిపుణులకు పూర్తి స్వేచ్ఛాస్వాతంత్రాలు లేకపోవటం, రాజకీయనాయకులకు నిపుణులకు మధ్య అభిప్రాయభేదాలు ఏర్పడటం కారణంగా నిపుణులు వృత్తిపరంగా నిరాశకు గురౌతున్నారు. ఫలితంగా వృత్తిపరంగా తమకు పూర్తిస్వేచ్ఛలభించే దేశాలకు పోవాలనే అభిప్రాయం బలీయమై మేధావులు దేశాన్ని విడిచి వలసపోవటం జరుగుతున్నది. సరిగ్గా ఇటువంటి అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తుంది 'మేధమథనం'.

"మూడేళ్ళ క్రితం నన్ను మీరు ముగ్గురూ ఇంటర్వ్యూ చేసి చిచ్చగాళ్లే వెళ్ళగొట్టినట్లు వెళ్ళగొట్టారు. జ్ఞాపకం ఉందా? నేను గడ్డివిత్తనాలలో ప్రొటీన్లు అధికంచేసే విధానాన్ని ఇండియాలోనే కనుక్కొన్నాను. ఆ విషయం నన్ను మీరు ఆరోజు చెప్పనివ్వలేదు. ఇంతలో జర్మన్ స్కాలర్‌షిప్ వచ్చింది. ఎలాగూ గడ్డిమొక్క విత్తనాల్లో ప్రొటీన్లు అధికం అయ్యేట్లు చేశావు కదా అదే ఫార్ములాను గోధుమ మీద పరీక్ష చేసి చూడమన్నారు. రెండు సంవత్సరాల్లో ఆ పని పూర్తిచేశాను."

మంత్రిగారు మూడు పురుగుల్ని కొరకొరా చూశారు. "ఇటువంటి దాకులాంటి కుర్రాళ్లే సెలక్టుచేయకుండా మీ ఇష్టం వచ్చినవాళ్ళను సెలక్టు చేశారటయ్యా? ఇదన్నమాట!" అన్నారు.

"ఇప్పుడీ ఫార్ములాను మనదేశం జర్మనీ ప్రభుత్వం నుంచి లక్షలడాలర్లు ఇచ్చి కొనాలని నిర్ణయించిందయ్యా"

"ఓ అదా! ఏం అవసరంలేదు సార్. ఇటువంటి పురుగుల్ని ముందు పరివారంయ్యింది. మనదేశంలో రిసర్చి చేసే మంచి కుర్రాళ్ళున్నారు. వాళ్ళకు తగిన వసతులు కల్పించండి. ఒక్క సంవత్సరంలో ఇంతకు మించిన విషయాలను కనుక్కుంటారు..............."

ఇండియా రాగానే ఆ విషయం మరిచిపోయారు మంత్రి. (ఉప్పుమంత్రి గోపాలరావు, మేధ మథనం, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 17-5-89, పే 36-37)

మానవవనరులను ప్రణాళికా బద్ధం చేయటంలో ప్రభుత్వవైఫల్యం మేధోవలసకు మరోప్రధానకారణం. సరైన ప్రణాళికలేకపోవటంతో దేశానికి అవసరమైనమోతాదుకు మించి సాంకేతిక నిపుణులుతయారై విదేశాలకు వలస అనివార్యమైతున్నది. దీన్నిబట్టి మేధోవలసను మనం కోల్పోతున్న నైపుణ్యంగా కాక 'నైపుణ్యపు పొంగిపొరలిపోత'గా పేర్కొనటం సహేతుకంగా వుంటుందన్నది మరో భావన.

**మేధోవలస ఫలితాలు:**

ధనార్జనాపరమైన అసమానతలవల్ల తీవ్రఅసంతృప్తి. స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానం నిరుపయోగం కావటం. విదేశాల్లోని మేధావులకు లభించే అధికగుర్తింపుకారణంగా స్వదేశంలోని మేధావులు ఆత్మన్యూనతకు గురికావటం. గ్రామాలనుంచి పట్టణాలకుజరిగే వలసవల్ల గ్రామీణాభివృద్ధి కుంటుపడటం.

'మేధ సంపద దిశగా పయనిస్తుంది', 'మేధ మేధవైపుగా పయనిస్తుంది' అన్న రెండుభావనల ఆధారంగా పరిశీలించినట్లయితే మేధోవలస అనేది గ్రామస్థాయినుంచి అంతర్జాతీయస్థాయివరకు జరుగుతున్న ఒక నిరంతరప్రక్రియగా గుర్తించవచ్చు. మేధ పల్లెలనుంచి పట్టణాలకు, నగరాలకు, ఇతరదేశాలకు సంపదను, మేధను వెతుక్కుంటూ పయనిస్తోంది. ప్రపంచీకరణ నేపథ్యంలో ఈ మేధోవలస మరింత అధికంకావటం ఇటీవలి పరిణామంగా గుర్తించవచ్చు. ఇలా పల్లెలనుంచి అంతర్జాతీయస్థాయికి పయనిస్తున్న మేధస్సు తిరిగి గ్రామస్థాయికి చేరకపోవటంవల్ల సమతులమైన

అభివృద్ధికి అవరోధం ఏర్పడుతుంది. గ్రామస్థాయికి, అంతర్జాతీయస్థాయికి మధ్య ఏర్పడుతున్న ఈ ఖాళీని భర్తీ చేయటంద్వారా మాత్రమే మేధోవలసవల్ల కలిగే ప్రయోజనాలు ప్రపంచ మానవాళికి అందే అవకాశం కలుగుతుంది.






"భగవంతుని సృష్టిలోకల్లా ఉత్కృష్టమైన వస్తువు
విద్యనేర్చిన స్త్రీ రత్నమే" ---గురజాడ

======

## స్త్రీవిద్య

According to the United Nations statistics, women make up half of the world's populations do two thirds of the world's work, earn one tenth of the world's wages and own one-hundredth of the world's wealth. (JoCampling: 1989, p 3)

తెలుగుసాహిత్యంలో స్త్రీ విద్యపై వచ్చిన రచనల్లో మూడు దశలు కనిపిస్తాయి. అందులో మొదటిది

విద్య స్త్రీని చీకటిలోనుండి వెలుగులోకి తెస్తుందన్న భావనతో పురుషులు స్త్రీవిద్యకు తోడ్పాటునందించటం. ఈ దశలో స్త్రీవిద్య పురుషునికీ, కుటుంబానికి సహాయకారి కాగలదన్న భావన అంతర్గతంగా ఉన్నట్లుగా తోస్తుంది. అందువల్లనే ఈ రచనల్లో స్త్రీ విద్యావిషయకంగా పురుషులు పాటుపడటం కనిపిస్తుంది. 'స్త్రీవిద్య', 'విద్య-వింతపతిత్వం', 'వెలుగులోకి' రచనలిలాంటివే.

'విద్య నేర్పినచో కలిగెడులాభమేమి? యుద్యోగములు చేయుట, సుత్తరములు వ్రాయుటకు వేరు ప్రయోజనమేమి కలదని యడుగుచుట యుక్తమే కాని విద్య---నాలో ఏమి చూపిన దీనియందలి దోషము నీకే తెలియును. అక్షరములను వ్రాయను చదువను నేర్చినంతమాత్రమున నెవరును విద్యావంతులు కాజాలరు. అనేకులు వ్రాసిన సద్గ్రంథములను చదివి వాని తాత్పర్యమును గ్రహింపగలవారలే విద్యాయుతులనబడుదురు. అట్టి విద్యవలన [illegible] [illegible]' (బండారు అచ్చమాంబ, స్త్రీవిద్య, నూరేళ్ళ పంట, పే 1-5)

'శివ! శివ! నాకేం దిక్కు తోచడంలేదు. భర్తృత్వానికీ, ఉపాధ్యాయత్వానికీ యేమీ పొత్తు కనపడటంలేదు. రాతిగుండె చేసుకుని నేనెక్కడ కొట్టేది. ప్రేమ, అనురాగం పెరగవలసినచోట కొట్లూ తిట్లూ, కఠినత్వమున్నా. బాబోయ్! ఆ మామగారి ముండా కొడుక్కి జ్ఞానం లేకపోవడం వల్ల కదా యీ పాట్లు పడవలసి వచ్చింది. వాడికే జ్ఞానముంటే యిలాగుండేదా? సరే ఏదో నెమ్మదిగా చెప్పి చూస్తాను. వింటే వింటుంది. లేకపోతే నోరుమూసుకుని కూచుంటా. అంతేకాని పడక గదిని యుద్ధరంగమెక్కడ చేసుకోను? నావల్ల కాదది.............' (వేకుమళ్ళ కామేశ్వరరావు, విద్య-వింత పతిత్వం, ప్రజాసాహితి సంపుటి '78, పే 33-43)

'మా అమ్మకు అక్షరజ్ఞానం లేదు మాస్టారూ. ఆ! ఆడపిల్లకి చదువులెక్కడ్లేదని చీకటిలోకి తోశారు ఆమెను. ఆ తరంలోని మనిషికి మీరు చదువు చెప్పాలి. బొమ్మలు చూసి పత్రికను పక్కనపడేసే వ్యక్తిని, ఆ పత్రికను చదివేలా మీరు చేయాలి. చీకట్లోని మనిషిని వెలుతురులోకి తీసుకురావాలి. అదొకటే కాలక్షేపం అవుతుంది."

ఆ మాటలు అంటుంటే అతని గొంతు వణికింది. తనకు చదువు రాకపోయినా బిడ్డల చదువుకు ఆమె ఆరాటపడింది.

బలవంతంమీద కొడుకు వెంట నడిచింది ఆవిడ. శర్మ ఇంట్లో మరోస్త్రీ అక్షరాలు దిద్దుతున్నది. ఆమె శర్మగారి భార్య. ఆడవాళ్ళు ఒకర్నొకరు చూసుకుని సిగ్గుపడ్డారు.

"నీవు మీఅమ్మ చీకట్లో ఉండిపోయిందని బాధపడ్డావు. మరి నాభార్యకూడా ఆ చీకట్లోనే ఉండిపోయిందని ఇంతకాలమూ తెలుసుకోలేక పోయాను.... బీదర్మయికూడా. నేను చాలా తప్పుచేశాను నారాయణా! నేను కూడా నాభార్యను వెలుగులోకి తీసుకు రావాలికదా!" (ఆదిరాజు వేణుగోపాల్, వెలుగులోకి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక. 13-3-91, పే 26-29)

స్త్రీ సంఘంలో తన ఉనికిని నిల్పుకొనేందుకు విద్య ఒక సాధనంగా రూపొందటం రెండవదశ. ఈ దశను ప్రతిబింబిస్తూ వచ్చిన రచన 'ఈ తప్పు చేయకు'.

"చెప్పాల్సిన అవసరం లేదనుకున్నాను. కానీ ఇప్పుడా అవసరం వచ్చింది. ఆరు సంవత్సరాల కాలాన్ని వృథాచేయక చదువుకొనుంటే, నాజీవితంలో కొన్ని కష్టాలన్నా తప్పేవి. చదువెంత విలువైందో ఇప్పుడర్థమైంది. అందుకే నీకు చెప్తున్నాను. విలువైన ఈ కాలాన్ని వృథా చేయవద్దని .... మళ్ళీ రమ్మన్నా చేతినుండి జారిపోయిన ఈ సమయం నీకురాదు. అవసరం వచ్చినప్పుడు చదువుకోవాలన్నా చాలా మంది విషయంలో కుదరదు లావణ్యా! నామాట విను. చదువు మానకు"

"పెద్ద చదువులు లేనివారెందరో హాయిగా, సుఖంగా ఉన్నారు!" అలాగే నేలచూపులు చూస్తూ మెల్లగా అంది.

"కావొచ్చు. ఇంకా చదువుకుంటే, ఇంకా హాయిగా, సుఖంగా బ్రతకొచ్చునేమో! అందరి జీవితాలూ నా జీవితంలా ఉండవు. కానీ, అవకాశమూ, సమయమూ రెండూ ఉన్నప్పుడు, వాటిని ఉపయోగించుకోక పోవడం ఒకవిధంగా నేరం! అవకాశాలు లేక ఎందరో చీకటిలో మగ్గిపోతున్నారు. చదువు నీ జీవితాన్ని ఎంతో ప్రభావితం చేస్తుంది. ..............." (వాచస్పతి, ఈ తప్పు చేయకు, నూరేళ్ళపంట, పే 160-168)

మూడవదశలో స్త్రీ తన ఉనికిని కాపాడుకోవటంతో తృప్తిచెందక తనవ్యక్తిత్వాన్ని పరిపూర్ణంగా తీర్చి దిద్దుకునేందుకు అనుగుణమైన విద్యకోసం పోరాడటం సాహిత్యంలో విస్తృతంగా చోటుచేసుకుంది. అయితే కేవలం ఉనికిని కాపాడుకోగలగటంతో స్త్రీ జీవితంలోసామాజికంగా పూర్తిమార్పువచ్చిందని మనం భావించలేం. జీవితాన్ని నిరంతర పోరాటంగా మారుస్తున్న సామాజికపరిస్థితులలో మార్పు రావల్సిఉంది. స్త్రీ తన జీవితానికి సంబంధించి తనే నిర్ణయాలను తీసుకోగలిగినప్పుడు ఈ మార్పువచ్చినట్టుగా మనం భావించవచ్చు. ఈ దిశలో స్త్రీకి సహాయకారులుగా నిలిచే విభిన్న అంశాల్లో విద్య ఒకటని సాహిత్యం గుర్తించింది.

ఐతే మనిషిని అజ్ఞానపు సంకెళ్ళనుంచి స్వేచ్ఛ దిశగా నిర్దేశించాల్సిన విద్య కూడా పురుషుని భావాలకనుగుణమైనదిగా రూపొంది ఉండటం నేటి విద్యావిధానంలో మనకు కనిపిస్తున్న అంశం. ఈ పరిస్థితి మనకు పాఠశాలస్థాయినించే ప్రారంభంకావటం చూడవచ్చు. పాఠ్యాంశాల్లో పురుష ఆలోచనలను, అభిప్రాయాలను ఇంకా స్త్రీలు ఎలా వుండాలని పురుషులు కోరుకుంటారో ఆ పరిజ్ఞానాన్ని అధ్యయనం చేయాల్సి రావటం ఇందుకు ఓ ఉదాహరణ.

విద్యావిషయంగా స్త్రీలో వెనుకబాటుతనానికి-- సమానావకాశాలు మృగ్యంకావటం, విద్యారంగంలో స్త్రీలు ఎదుర్కొనే వివక్ష ప్రధానకారణాలుగా భావించాలి. రోజ్‌మేరీ భావనలో పాఠశాలలు పెట్టుబడిదారీ వ్యవస్థకు అనుగుణమైన వ్యక్తులను రూపొందించే కర్మాగారాలు. "She argues that schools are in the business of turning out the future labour force (male) and the domestic workers (female). To do this schools have to teach boys and girls the behaviour appropriate to these two different roles." (Jo Campling(Ed).1989: 43)

ఈ భావనను మరింత ముందుకు తీసుకెళ్తూ జ్ఞానం అనేది పురుషుని దృక్పథం నుంచి ఎలా రూపొందుతున్నదో, స్త్రీ అనుభవాలు ప్రయత్నపూర్వకంగా ఎలా నిర్లక్ష్యంచేయబడ్డాయో వివరించారు డాలే స్పెండర్. వీరి అభిప్రాయంలో బాలుర తెలివితేటల వెనుక బాలికల అణచివేత దాగివుంది. Pat

Mahony in " School for the Boys " concludes that the problem is not girls under-achieving, or the system discriminating against them, or even capitalism, but what she calls "' Social Maleness "'.

వీరి ఉద్దేశ్యంలో ఈ సమాజంలో పురుషులుగా రూపొందాలంటే బాలురు బాలికలను నియంత్రించటం, బాలికలపై ఆధిక్యతను ప్రదర్శించటం నేర్చుకోవాల్సిఉంటుంది. పాఠశాలలు ఇందుకవసరమైన శిక్షణనిచ్చే కేంద్రాలుగా పేర్కొంటూ She argues that schools are the training grounds for patriarchy, where boys learn that they will have power over women, and practice that power by intimidating harassing and putting down the girls around them. Mixed schooling is therefore less to do with preparing girls for their future lives as battering them into submission to patriarchy (ibid: 44)

ఇలాంటి అభిప్రాయానికి బలాన్నిచేకూరుస్తూ కో--ఎడ్యుకేషన్‌లో స్త్రీలు ఎదుర్కొనే సమస్యలను ప్రతిబింబిస్తూ సమాజపు కట్టుబాట్లకు అనుగుణంగా స్త్రీలను రూపొందించేందుకు విద్యాలయాలు ఎలా తోడ్పడుతున్నాయో ప్రతిఫలిస్తూ వచ్చిన రచనే 'మా అమ్మాయి'.

'అమ్మాయిలు ఎందుకు 'ఎంపీసీ' గ్రూపు తీసుకుంటారో అర్థంకాదు. ఇంట్లో వంటలు, కుట్లు నేర్చుకోక, సీట్లకోసం, ఉద్యోగాలకోసం పోటీకి వస్తారు అని హేళన చేస్తారు. అబ్బాయిలంతా గొల్లున నవ్వుతారు. ఆ అమ్మాయి కళ్లలో నీళ్లు.'

"కో-ఎడ్యుకేషన్ అంటే ఏమో అనుకున్నాను. కానీ, ఇక్కడ ప్రతిక్షణం హృదయమ్మీద దాడి జరుగుతోంది మమ్మీ" అంది. ............

"ఏమిటి మీ అమ్మ నీకెప్పుడూ చెప్పలేదా, ఆడపిల్లవు భుజాలు వంచి నిలబడాలని తెలీదు" అని ఒక టీచర్ అంటే, మరో టీచర్ "ఇంతా ఎలిజెంట్ పిల్లకు మళ్లీ ఆ బాబ్డ్ కటింగ్ ఏమిటి? జడలువేసే తీరికకూడా ఉండదా మీ అమ్మకు. ఆవిడకు సోషల్ వర్క్ తప్ప పిల్లను ఎట్లా పెంచాలో తెలీదా?!" అంది.

ముగ్గురు నలుగురు టీచర్లు కలిసి నన్ను విమర్శిస్తుంటే, చాలా కోపంవచ్చింది. గట్టిగానే వాళ్ళకు సమాధానం చెప్పాననుకో. "టీచర్! జడలు పెంచుకొని పేలుపడకుండా, జుట్టురాలకుండా, ఇంకా పొడవు పెంచుకోవాలని అందరూ ఎంత కష్టపడుతుంటారో నాకు తెలుసు. హేర్ కటింగ్‌వల్ల ఏ చీకూ చింతా లేకుండా ఎంత హాయిగా ఉంటుందో మీకెవరికీ తెలీదు. అందుకని మీ సలహా పాటించను. డ్రెస్ విషయంలోనూ అంతే. ఇక మా అమ్మ గురించి, పిల్లల్ని హాయిగా పెరగనివ్వాలి కాని, ఒకరు పెంచడమేమిటి అంటుందని అన్నాను." ..............

"కుమ్మరి కుండలు చేసినట్టు, మనుషుల్ని స్త్రీలుగా, పురుషులుగా తయారు చేస్తోంది కుటుంబం అనుకుంటాం కదా! మన విద్యాలయాలు ఫ్యాక్టరీల్లాంటివి కదా!? క్లాసురూంలో ఒక్క అమ్మాయికి అమ్మాయిలా ఉండమని చెబితే, క్లాసులో ఉన్న నలభై మంది అట్లా తయారవుతారు" అంది. కూతురు చక్కని విశ్లేషణకు ఆనందం కలిగింది. కాని ఆ మాటల్లో ధ్వనించిన ఆవేదనకు చలించాను.(ఎస్. జయ, మా అమ్మాయి, రెక్కలున్నపిల్ల, పే 51-57)

ఇక్కడ విద్యాలయాలుకూడా స్త్రీని సామాజిక చట్రంలో బలవంతంగా ఇమిడ్చేందుకు తోడ్పడుతున్నాయే తప్ప స్త్రీకి స్వతంత్ర వ్యక్తిత్వాన్నిచ్చే కృషిలో భాగంపంచుకోవటం లేదన్నది నిర్వివాదాంశం.

బాలికలు విద్యావిషయంగా మరింత పరిణతినిచూపాలని కోరుకునే తల్లిదండ్రులుకూడా తమ పిల్లలు పాఠశాలలో మరింత ప్రజ్ఞనుచూపాలని కోరుకొంటారు కానీ ఈ ప్రజ్ఞాపాటవాలు సమాజం వారికి ఆపాదించిన స్త్రీత్వభావనకు లోబడిమాత్రమే ఉండాలని ఆశిస్తారు. అందుచేతనే తల్లిదండ్రులు స్త్రీవివాహానికిచ్చిన ప్రాధాన్యత విద్యకివ్వకపోవటం రచనల్లో స్పష్టంగా చోటుచేసుకుంది.

"జానకే కాదు రాధా, మన మధ్యతరగతి కుటుంబాలలో ఇలా బాధపడుతున్న వాళ్ళు నూటికి ఇంచుమించు ఎనభైమంది పైగా ఉంటారనుకో. ఈ తల్లిదండ్రులకు, మగపిల్లల చదువు విషయంలో ఉన్న శ్రద్ధ ఆడపిల్లల చదువు విషయంలో ఉండదు. అమ్మాయిలు పెద్దవారైన దగ్గరనుంచి, తమకు తాహతు లేకపోయినా అప్పోసప్పోచేసి అడిగిన కట్నంపోసి పెళ్ళిచేసి అత్తవారింటికి పంపేద్దామన్న గోలతప్ప మరోదృష్టి ఉండదు. అంతమాత్రంలో యుక్తవయస్సు వచ్చిన వాళ్ళకు వివాహం చెయ్యకూడదని నా అభిప్రాయం కాదు. కాని వివాహానికి ఎంత ప్రాముఖ్యం ఇస్తున్నారో చదువుకు కూడా అంతే

ప్రాముఖ్యం ఇవ్వాలి. మగపిల్లలతో సమానంగా బి.ఎ. లు, ఎం.ఎ. లు చదివించక పోయినా కనీసం, ఓ మెట్రిక్యులేషన్ వరకైనా ప్రతిఒక్కరినీ విధిగా చదివించాలి. దానివలన ఉత్తరోత్రా సంసారంలో ఒడిదుడుకులు వచ్చినా, లేక దురదృష్టవశాత్తు ఏ కష్టమొచ్చినా - వాళ్ళు కాళ్ళమీద వాళ్ళు నిలబడే అవకాశం, సంసారానికి ఆర్థికంగా సహాయపడగల మార్గం ఏర్పడతాయి. ఈ మంచిమార్పు వచ్చేవరకూ మన మధ్యతరగతి కుటుంబాలు బాగుపడవనుకో" (పి. నరసింగరావు, జానకి చదువు, ఆంధ్ర మహిళ, ఫిబ్రవరి '60, పే 81-84)

ఐతే వివాహవ్యవస్థలో స్త్రీ అణచివేత స్వరూపస్వభావాలు వెలికివచ్చి, వైవాహికజీవితంలో స్త్రీ పైజరుగుతున్న మానసిక అణచివేత ఒక సామాజిక సమస్యగా గుర్తింపు పొందింది స్త్రీ విద్యావంతురాలయిన తర్వాతనే అనేది ఇక్కడ ప్రధానంగా గుర్తించాల్సిన అంశం. కుటుంబజీవనానికి, విద్యద్వారా స్త్రీ తనుపొందిన వ్యక్తిత్వాన్ని నిలుపుకునేందుకు మధ్య జరిగే సంఘర్షణను చిత్రించిన రచనలు తెలుగులో అనేకం కనిపిస్తాయి.' గాంధారి రాగం', 'జైకి బహువచనం జైలు' రచనలు ఈకోవలోకే వస్తాయి.

ఇంతపని పెట్టుకుని వీధి వరండాలో నిలబడి ఆవేశపడిపోవడం తగదుకదా! పిల్లలకివేళ్టికి తిండిపెట్టకపోగా వాళ్ళు బాగా చదవలేరు. వాళ్ళ భవిష్యత్తంతా తను వాళ్ళకి సరిగ్గా వండిపెట్టడం మీదే వుంటుందంటాడు సుబ్బారావు. నిజమే కాబోలు అనుకుంటుంది సరస్వతి.

వాకిలి సరస్వతంత బాగా బట్టలు వుతకరు--పనిమనిషి సరస్వతిఅంత శుభ్రంగా ఇల్లుచిమ్మదు. ఎవరిపని వాళ్ళు చేసు కుంటేనే ఇల్లు బావుంటుంది అని సుబ్బారావు సరస్వతిని ఎప్పుడూ మెచ్చుకునేవాడు. రాను రాను సరస్వతికి తనపని తనుతప్ప ఎవరు చేసినా నచ్చడం మానేసింది.

ఆ విధంగా సరస్వతి పిల్లలచదువులతో, తనచదువుతో బయటి ప్రపంచంతో సంబంధం పోగొట్టుకుని సంసార సరస్వతి అయిపోయింది.

ఈ రోజు చెప్పలేకపోతుంది--ఈరోజే కాదు--గతకొద్దికాలం నించి సరస్వతిలో అశాంతి చెలరేగుతోంది--అంతా పడుకున్నాక బాబీ లెక్కల పుస్తకం తీసింది. పదిహేడు సంవత్సరాలయింది. తనకీ దేవత సరస్వతికీ సంబంధం తెగిపోయి-- వెనక్కి, వెనక్కి, పదిహేడు సంవత్సరాల వెనక్కి...... ఒక అరగంట, చీకట్లో తడుముకున్నట్టు తడుముకున్నాక సరస్వతికి ఆ లెక్క వచ్చేసింది. అంటే అంటే తను చదువు మర్చిపోలేదు. అవును. తనది బోలు చదువుకాదు. 'ఘంటా' చదువు. మాథమాటిక్స్ మెయిన్‌లో డిగ్రీ-కాలేజి ఫస్టు! యూనివర్శిటీలో ఫోర్త్ ర్యాంక్.

"తెలివిగల దానివి. ఇంకాచదువు -- పైకొస్తావు. పనికొస్తావు" కాలేజ్ ప్రిన్సిపాల్ బహుమతి యిస్తూ దీవించింది. కానీ ఆ దీవెన ఫలించలేదు.

"బాగానే వుంది సంబడం! ఈ చదువు చాల్లే-- ఇంకా చదివితే నీకన్నా పై చదువుల వాణ్ని తేవాలి. దాంతో ఇంకా వయస్సు పెరుగుతుంది. కట్నం పెరుగుతుంది. నావల్ల కాదమ్మా సరస్వతీ" అనేశాడు నాన్న.

పోనీ సరస్వతీ--ఇప్పుడు నువ్వు ఒక బాధ్యతగల గృహిణివి. ఇల్లు చూసుకో-పిల్లల్ని చూసుకో. అదీ ముఖ్యం--ఏ ఆడదానికైనా ఏంకావాలి చెప్పు! ఉన్న డబ్బుతో సుఖంగా బ్రతకడం--అన్నీ అమర్చుకోడం, కాస్త వెనకేసుకోడం, ఇదీ ముఖ్యం. గుర్తుపెట్టుకో సరస్వతీ! పైథాగరస్ థీరం గుర్తుపెట్టుకుని ఏం చేస్తావ్! ఆల్జీబ్రా లెక్కలు నీసంసారంలో తగాదాలు తీరుస్తాయా? ఏదో గవర్నమెంటువారు పద్దెనిమిదేళ్ళు నిండితేగానీ పెళ్ళి చెయ్యొద్దన్నారు గదా అని చదువుకుంటూ కాలక్షేపం చేశావు- చదువు చెప్పినందుకు వాళ్ళపేరు నిలబెట్టే మంచిమార్కులు తెచ్చుకున్నావు- బహుమతులు సంపాదించావు. అవన్నీ ఇప్పుడు అక్కర్లేదు- ఇప్పుడు సంసారం చూసుకో సరస్వతీ! అదీ ముఖ్యం! అతని కనుసన్నలలో మెసలి- అతన్ని మెప్పించుకో-అదమ్మా కావాల్సింది.

పదిహేడు సంవత్సరాలుగా ఇంటి చాకిరీ తప్ప మరో వ్యాయామం ఎరుగక ఇష్టంవచ్చినట్టు పెరిగిపోయిన వళ్ళు,ఆమెని అడుగు ముందుకు వెయ్యనివ్వలేదు. ఆయాసపడుతూ కూలబడిన ఒకప్పటి గర్ల్స్ స్టేట్ షటిల్ ఛాంపియన్ సరస్వతి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. సరస్వతి లేచి నిటారుగా నిలబడింది. "రేపటినుంచి నేనూ ఆడతాను" అని గిరుక్కున తిరిగి ఇంట్లోకి వెళ్ళింది. (పి.సత్యవతి, గాంధారి రాగం, ఇల్లలకగానే, పే 81-88)

పెళ్ళైన ఆడది ఒకరికి దీపంలా కనపడాలి. మరొకరికి ప్రాణంలా ఉండాలి. ఇంకొకరికి దైవంలా గోచరించాలి. మానవస్వరూపం అనిమాత్రం ఏ ఒక్కరికీ తోచకూడదు. ఇదీ నేటి వివాహవ్యవస్థలో స్త్రీలు పొందుతున్న గౌరవాదరాలు. అందుకే పెళ్ళిని ఒక ఊబిగా భావిస్తున్నారు నేటి మహిళలు. కుటుంబహింసను ఎదిరించటంలో భాగంగానే వీరు తమ వ్యక్తిత్వానికి ప్రాధాన్యతనిచ్చి స్వతంత్రజీవనానికి సిద్ధమవుతున్నారు. స్త్రీలు బానిసలుగా జీవించాల్సిరావటం

దురదృష్టకరమైన అంశంగా భావించినా, ఆ జీవితాన్ని వరప్రసాదంగా భావించే స్త్రీలపట్ల కనీససానుభూతికూడా చూపనవసరంలేదంటున్నది నేటి యువతరం. అలాంటి శిష్యురాళ్ళను ప్రోత్సహిస్తూ, వారికి తమ ఆశీస్సులందించే గురువులపై తిరుగుబాటు బావుటా ఎగురవేస్తున్నారు నేటి మహిళలు.

"దానికీ, దీనికీ పోలిక లేనిమాట మాత్రం నూటికి నూరుపాళ్ళూ నిజం. బాగాచదువుకుని డాక్టరేటు తెచ్చుకుంటే పెద్ద ఉద్యోగం వస్తుంది. మంచి జీతం లభిస్తుంది. ఇంకొకరి మీద ఆధారపడి బతక్కుండా, సంపాదించి బతకగల భద్రత లభిస్తుంది. అలాంటి సెక్యూరిటీలోనే ఆడదాని వ్యక్తిత్వం నిలబడేది. ఏదారి మాత్రమే ఉండగల అవకాశంతోనే ఆడవాళ్ళ శ్రమా, సమయమూ వృధాకావాలా! బతికున్నన్నాళ్ళూ మనల్ని మనం నిలబెట్టుకునే వ్యక్తిత్వం సముపార్జన పోరాటదిశలో మనం సంఘటితం కావొద్దా?"

"ఏమిటో నువ్వు చెబుతున్న ఒక్క ముక్క నాకర్థం కావడం లేదమ్మాయ్! మొగుడూ, పిల్లలతో హాయిగా తృప్తిగా బతక్క, ఏదో పోరాటదిశ అంటావేమిటి? నకాలంలో పెళ్ళికాక నీకేమైనా బుర్రపాడైందేమో!"

"మీరుచెప్పే ఏ విషయమూ నేను కాదనను. అయితే ఇంకొకరి దోపిడీకి గురికాకుండా మనం అహర్నిశం జాగ్రత్తగా కాపాడుకోవలసింది మరొకటుంది. దానిపేరే వ్యక్తిత్వం. దాన్ని కించపరిస్తే మాత్రం ప్రతిఘటించి తీరాలని నా నమ్మకం. అలాంటి మాయామర్మంలో పడి అదే ఓ సేవాధర్మంగా భావిస్తోంది గనకనే, సరస్వతిలాంటి వాళ్ళని చూస్తే ఒకప్పుడు నాకు సానుభూతి ఉండేది. ఇప్పుడదికూడా పోయింది.............."

"అవున్లెండి! ఎందుకు మాటాడుతుంది? 'జై' 'జై' ధ్యానాల జీవితం అనుకునే స్వప్నంలో బతుకుతోంది సరస్వతి. 'జై' కి బహువచనం 'జైలు' అని తెలుసుకోలేక పోతోంది. .............. . ....శరీరం ముల్లులాగా, మొహం చిప్పలాగా తయారు చేసుకోవడమే సతీధర్మమా? 'ఆలుచిప్ప' అనేపదం అలాగే ఏర్పడిందేమో మీ తెలుగుమేష్టర్లే చెప్పాలి. బానిసలా బ్రతకవలసి రావడం దురదృష్టమే. కాని బానిస వ్యవస్థ అనేది అదేదో వరప్రసాదంలా భావిస్తూ 'ఏదో ఇలా రాలిపోతే చాలు!' అనుకునే ఆడాళ్ళని మాత్రం గన్‌తీసి పేల్చెయ్యాలనుంటుంది నాకు. అలా తయారైన శిష్యురాళ్ళని చూసి దీవించే మేష్టర్లని చూస్తే మాత్రం ......'

రేవతి ఏంచేసునో గాని అలా చెబుతూంటే విని తట్టుకోడానికి మాత్రం ప్రభాకరం అక్కడలేడు. ఆ వీధి చివరనున్న ఆటోలో ఎలాగో ఆయాసంతో శరీరం చేరేసి, తొందరగా స్టార్టు చెయ్యమని డ్రైవరుకి చెబుతున్నాడు! (అవసరాల రామకృష్ణారావు, 'జై!' కి బహువచనం "జై'లు!", పిసముక్కలు: అవసరాల రామకృష్ణారావు కథలు, పే1-8)

వివాహం స్త్రీ వ్యక్తిత్వవికాసానికి అడ్డంకిగా నిలిస్తే, అందుండి స్త్రీని విముక్తిచేసి స్త్రీకి స్వతంత్ర జీవనవిధానాన్ని అందించేందుకు విద్య దోహదపడుతుందన్న భావాన్ని వ్యక్తంచేస్తూ వచ్చిన రచనల్లో 'కిటికీ'ఒకటి.

"పుస్తకాలు చదివితే చెడిపోతారు."

ఆ అమ్మాయి జవాబువిని మతి చెడినట్లయింది నాకు.

ఈ అభిప్రాయాన్ని ఎవరు మనలో నాటారోగాని చదువుకుని నాగరీకులమనుకునే చాలామందిలో ఇదేభావన. చదువంటే వెలుగు. వెలుగు మంచిచెడులని వేరుచేస్తుంది. దానినుంచి ప్రశ్న ఉదయిస్తుంది. అలా ప్రశ్నించడం చెడిపోవడం. అందుకనే స్త్రీలని, దిగువతరగతి మనుషులను మనసమాజం చాలాకాలం అక్షరాస్యతకు దూరంచేసింది. నీలు అత్తగారిలాంటి నిరక్షరాస్యురాలు మాటలు అనడానికేముంది.

ఉలిక్కిపడి చెదిరిన ముంగురులు సరిచేసుకుంటుంటే, ' అక్కా డాక్టరేట్ పొందేవు. అయినా, పెళ్ళిపేరుతో నీ జ్ఞానాన్ని నీలోనే ఇముడ్చుకుని సాదాసీదా జీవితాన్ని గడుపుతున్నావా? ఇంత తెలివి, చదువు ఉన్నా ఏంలేనట్లు, ఏందానట్లు నటించి బతకడం దుర్భరంకాదూ! మగవాడు పెళ్ళిపేరుతో తన వ్యక్తిత్వాన్ని కోల్పోనప్పుడు, ఆడది మాత్రమే తన వ్యక్తిత్వాన్ని ఎందుకు చంపేసుకోవాలి? ఏదిచేసినా పెళ్ళికోసమే అన్నట్లుగా ఎందుకు అన్నింటికీ తిలోదకాలివ్వాలి. ఆలోచించు. నువ్వు ఉదాసీనత వహిస్తే, నువ్వు నోరుంది మెదపకపోతే నీకు కొన్నాళ్ళకు ఈ కిటికీ కూడా మిగలదక్కా. కిటికీ అంటే స్వేచ్ఛ. కిటికీ అంటే మనసుకు వెలుగు. ఆ వెలుగేపోతే బతుకే వ్యర్థం. ఆలోచించక్కా' అని హెచ్చరించినట్లయింది.

ఒకలాంటి భయంతో ఉలిక్కిపడ్డాను. ఆరాత్రి నిద్రే కరువయింది నాకు. ఆ మర్నాడే ఆయనకి చెప్పేను. నేను అంతకు ముందు నాకొచ్చిన లెక్చరర్ పోస్టింగులో జాయినవుతానని.

ఆయన నావైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఉద్యోగం దేనికీ, మనకేం లోటు! ఆడదాని సంపాదన అవసరం లేదు అని అనకండి. నేను మనిషిని. నాకు కొంతవ్యాపకం కావాలి. ఆ వ్యాపకం నాకు సంతృప్తిని స్వేచ్ఛని కలిగించాలి. వంట చేయడం, పిల్లల్ని కని పెంచడం బాధ్యతలు. వాటిని నేను కాదనను. కానీ, ఒక యంత్రంలా వాటికోసమేనన్నట్లుగా బతకలేను. నేను పొందినజ్ఞానాన్ని నలుగురికీ పంచే అవకాశం నాకివ్వండి. పెళ్ళి మనిద్దర్నీ ఒకరికొకర్ని బంధితుల్ని చేయాలి గానీ, ఆడపిల్లని మాత్రమే బందీని చేయకూడదు.

నన్నర్థం చేసుకుంటారనుకుంటాను" అన్నాను.

ఆయన మాట్లాడలేనట్లుగా చూశారు. మాట్లాడినా నేను నామనసు కిటికీని మూసేందుకు సిద్ధంగాలేను. అది నా నిర్ణయం. బహుశా నాకళ్ళలో కనిపిస్తున్న విశ్వాసం, నామాటల్లోని స్థిరత్వం ఆయన్ని మాటాడనివ్వలేదేమో!

'థేలూ, ఇప్పుడే నేను కిటికీ తెరచేను' అనుకున్నాను మనసులో - ఆమెకు కృతజ్ఞతలు చెబుతూ. (మన్నెం శారద, కిటికీ, ఇండియా టుడే, ఫిబ్రవరి 21-5 మార్చి '97, పే 64-67)

స్త్రీ వ్యక్తిత్వానికి, వివాహవ్యవస్థకు మధ్య సంఘర్షణ ఏర్పడితే స్త్రీ తన వ్యక్తిత్వానికే అధిక ప్రాధాన్యతనిస్తుందని, ఇలా తన వ్యక్తిత్వ వికాసానికి విద్యను ప్రధానసాధనంగా ఉపయోగిస్తుందని ఈ విషయంలో పురుషునితో సమాన ప్రతిపత్తికోసం పోరాడుతుందని తెలియజేసే రచనే 'ఓ పెళ్ళికథ'

"అదృష్టమేనంటే - కాదామరి - చదువా - ఇంకేం చదువంటే. నెలలోపలే అమెరికా తీసికెళ్ళిపోతారు. అక్కడేదన్నా కోర్సు చేస్తే చేస్తుంది. అసలు ఆ అవసరం కూడా ఉండదనుకుంటా. అబ్బాయిది సొంత కంపెనీ. చాలా బాగా నడుస్తోంది. డాలర్లు సంపాదిస్తున్నాడు." ..........

"ఒక్కటేమిటి? అసలు మొత్తం విషయమంతా పరమ అనాగరికంగా, అటవికంగా ఉంది. చాలా తప్పు. అనాగరికులకూ, అటవికులకూ ఇంత రోత పెళ్ళిళ్ళు ఉండవు. అతనెవరో అమెరికాలో ఉండి అణుకువ, అందం గల భారతీయ స్త్రీకోసం కలలు కంటూ ఉంటే దానికి దీప్తి బలికావాలా".

"ఆరే, ఒక పాలేరు పనికి కుదరాలంటే వెళ్ళి ఆ పొలం, ఇల్లు, ఎన్ని గొడ్లున్నాయి, ఎలాంటి మనుషులు అవి స్వయంగా చూస్తారే. తన జీతం కచ్చితంగా మాట్లాడుకుంటారే. ఇది పెళ్లి. లేదా లాటరీ. నువ్వు జూదం ఆడవు. పెళ్లితో ఆడిస్తావా? చదువుకున్న ఆడపిల్లలు తమగురించి తాము ఆలోచించుకోకూడదా? సగంలో చదువు ఆపేసి ఇక్కడ అందర్నీ వదిలేసి ఎందుకా తొందర?

అతన్నే, 'మా అమ్మాయి నిన్ను చూడకుండా కుదరదు. నువ్వు వచ్చి మూడు నెలలయినా, ఏడాదైనా ఇక్కడ ఉండి అమ్మాయితో స్నేహం చేస్తే అప్పుడు చూస్తాం. అపుడైనా అమ్మాయి చదువు అయ్యేవరకు పెళ్ళి ప్రసక్తిలేదు' అనెందుకు చెప్పలేకపోయారు? ఒళ్ళంతా ఒకపక్క వెదెక్కుతుంటే, మరోపక్క చెమటలు దిగజారుతున్నాయి ఆ కుర్రాడికి.

"అదే నాకు ఒళ్ళు మండుతోంది. దీప్తి చదువు ఒక్క మాటతో ఆపేసిన మీకు నేను చదువాపడం ఎందుకిష్టంలేదు. దీప్తి మొగుడికి చాకిరీ చేసి తిండి సంపాదించుకోవడం ఇష్టమవుతోందిగానీ నేను నా పెళ్ళానికి చాకిరీ చేసి తిండి సంపాదించు కుంటానంటే సహించలేక పోతున్నారెందుకు? నాకూ, దీప్తికీ ఏమిటి తేడా? తేడా ఉంటే దానికి దీప్తి సిగ్గుతో చావడంలేదేం? కోపంతో ఉడుకుడెందుకులేదేం?"

"అదా, మగా ఒకటేనా?"

"ఒకటే, ఒకటే, ఒకటే".

కాలేజీకి వెళ్తున్న కూతుర్ని చూసి కన్నీరు కార్చింది నిర్మల.

సంతోషించాలో, బాధపడాలో తెలియక తలపట్టుకు కూచున్నాడు ప్రసాద్. (ఓల్గా, ఓ పెళ్ళికథ, మారేళ్ళపండు, పే 343- 350)

పెళ్ళికి, స్వతంత్ర వ్యక్తిత్వానికి మధ్య సంఘర్షణ తప్పనిసరి అయితే స్త్రీలు వివాహానికన్నా వ్యక్తిత్వాన్ని చ్చే విద్యకే ప్రాధాన్యాన్నిస్తారని చాటిచెప్పే రచనే 'రెండవతరం'

"సరే మీ జీవితం పాడైనాకాని ఆడవాళ్ళు సమర్థులు. చదువుకొంటే మొగవాళ్ళకి తీసిపోరు అని ఋజువు చేస్తున్నది. మీ జీవితం పాడైనా స్త్రీజాతికి మీరు పెద్ద మేలు చేశారు. స్త్రీకి వ్యక్తిత్వం ఉందని విశదపరచారు. మానసికంగా వ్యథ పడుతున్నారు. స్త్రీ జీవితానికి ప్రయోజనం సంసారమూ, పిల్లలని కదా! నిజమేకావచ్చు. అదే మీరు త్యాగం చెయ్యవలసి వచ్చింది. ప్రారంభంలో స్త్రీలు కొందరైనా ఈ త్యాగం చెయ్యక తప్పదు. జీవితం దగ్ధమైనాసరే వ్యక్తిత్వం నిలబెట్టుకోవాలి. నేనేమైనా సరే చదువుతాను. తరువాత మీ విధంగానే నా జీవితమూ వ్యర్థపడవలసి వచ్చినా వ్యర్థపడ్డానికి అంగీకరిస్తాను. కాని నా అభివృద్ధిని, జ్ఞాన సంపాదనను వొదిలిపెట్టను. ఇది జీవితానికి లక్ష్యమే. మనం ముందువాళ్ళం కాబట్టి ఇన్ని ఇబ్బందులు పడతాము. మన తరువాత తరంవారైనా ఆడదాన్ని గౌరవించి సమానత్వం అంటే ఏమిటో బోధపరచుకొంటారు. మీరంటూ మొదట చదువుకొని కొత్త మార్గం చూపబట్టే గదా యీనాడు వందలకొద్దీ మేము చదువుకొని ముందుకొస్తున్నాము. మీలాగే మేమూ జీవితాల్ని త్యాగం చేసుకొందామనుకొంటే. పోనియ్యండి. ఒక మహత్కార్యం కోసం ఒక జీవితం దగ్ధమైపోతే వచ్చిన చిక్కేంలేదు. నేను చదువుతాను. దాని చివర చూస్తాను" అన్నాది మా అక్క. దేశం నైతికంగా పతనమై ఉంది కాబట్టే మరింత తీవ్రంగాకృషి చేసి, ఎంత త్యాగానికైనా సంసిద్ధం కావాలి. అదీ మా అక్క వాదం. (చాగంటి సోమయాజులు, "రెండవతరం", కిన్నెర, జులై '50 పే 57-63)

మరికొందరు విద్యఏదో గొప్పప్రయోజనాన్ని అందిస్తుందని భావించరు. ఇందుకు కారణం ఈ విద్యనుంచి వారు ఎటువంటి ప్రయోజనాన్ని పొంది వుండకపోవడమే. వారిదృష్టిలో విద్య ఒక

తప్పనిసరి తద్దినం. బాలురు ఉద్యోగం వచ్చేంతవరకు, బాలికలు వివాహమై పిల్లలుకలిగేంతవరకు కాలక్షేపంకోసం చేసేపనిగా మాత్రమే వీళ్ళు విద్యను భావిస్తారు.

'కాదండి -- మాబావ-- ఇతనే వాళ్ళ కాలేజీలోనే చేరమని సీటు ఇప్పించాడండి-- అయితే నాతో పందెంవేశాడు నాకు మీకాలేజీలో సీటు రాదని --నేనేమో ఎలాగయినా తెచ్చుకుంటానని--చివరికి మీదయవల్ల నేనే పందెం గెలిచానుకోండి. మీదగ్గరకొచ్చేసరికి నేను ఆ కాలేజీలో ఫీజు కట్టేశాను. రాధ చెప్పిన్న ఆఖరిమాటలు ఇంక వినబడలేదు సంధ్యకి -- గబ గబా నడిచి వెళ్ళిపోతున్న అమ్మాయిని. అమ్మాయిని చూస్తూ అలా చాలాసేపు నిలబడిపోయింది. ఇందుకా తనంత కష్టపడి సీటు ఇప్పించింది!!

'ఏమిటే--రమా--విశేషాలు' ' ఏముంది--మామూలుగా--మాలతికి--దానికసలు చదువుమీద ఆసక్తిలేదు.--అన్నయ్యకి దీన్ని కాలేజీలో చేర్పాలని లేదు--లేకపోతే మా పదినకే అమ్మాయి కాలేజీకి వెళ్ళాలని సరదా మాత్రమే--దీనికి చక్కగా ముస్తాబయి. రోజూ ఒకచీర పోగ్గా కట్టుకు కాలేజీకి రావాలని--అనుకోకుండా ఈ సంబంధం కుదిరింది--అతను నైజీరియాలో డాక్టరు--చదువక్కర్లేదు--అందమైన పిల్ల కావాలనుకున్నాడు--అంతే--వారంరోజులు కాకుండా పెళ్ళి అయిపోయింది-- మామూలుగా -- హనీమూన్‌కి వెడుతున్నారు.'--చెప్పింది రమ. సంధ్యకి నవ్వాలో, ఏడవాల్లో తెలియలేదు.

'వేస్ట్-ఆఫ్ ఏ సీట్' అనుకుంటూ ముందుకు కదిలిపోయింది. (ముక్తేవి భారతి, సీటు దొరికింది, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 16-12-81, పే 12-15)

కేవలం పాఠశాలల్లో విద్యార్థుల నుంచి మాత్రమే కాకుండా ఉపాధ్యాయుల ప్రవర్తన, పాఠ్యాంశాలు కూడా బాలికలపైన విధి, నిషేధాలు ఏర్పర్చటం సహజపరిణామం. శైశవ దశనుంచి బాలురు బాలికలపైన తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించటం అభ్యసిస్తారు . లైంగికవేధింపులను బాలబాలికలమధ్య జరిగే ఒక అవాంఛనీయ సంఘటనలుగా భావించలేం. ఇది బాలికలపైన తమ ఆధిపత్యభావాన్ని నిరూపించుకునేందుకు, బాలికలను యద్ధాస్థానంలో ఉంచేందుకు బాలురు ఎంచుకునే ఒక సాధనం. స్త్రీని ద్వేషించటం వీరు ఓనమాలనుంచే ప్రారంభిస్తారు.

కొందరు ఉపాధ్యాయులు బాలురచర్యలను ఖండించకపోగా వారుకూడా ఇందులో భాగం పంచుకోవటం గమనార్హం. The geography teacher was definitely interested in girls. So interested that all girls had to sit in the front row in his lessons. There was quiet a sandal when a mirror was discovered under his desk, angled to look straight up our skirts. They didn't know how long it had been there. But he left soon after that. (ibid:62)

ఇలాంటి వ్యక్తిత్వాలను ప్రతిబింబిస్తూ వచ్చిన రచనే 'శత్రుస్పర్శ'.

'ఎక్కం తప్పకొట్టడం ఒక సమస్యయితే అది ఆయన మొహం చూస్తూ చెప్పడం యింకో సమస్య. అయిన్నా చూసి మొదట్రోజునుంచే తన శరీరాన్ని ద్వేషించుకోవడం మొదలుపెట్టింది చిట్టి.

"ఏమే... ఒసే....భడవకానా.... నిన్నెవడు చేసుకుంటాడోనే...నువ్వెదరగొడతావే..." అంటూ ఏమిటేమిటో మాట్లాడుతూ బుగ్గలు పట్టుకొని లాగుతూ, జడలు పట్టుకుని గుంజుతూ ఆల్జీబ్రా చెబుతుంటే లబ్‌డబ్... గుండె చప్పుడెక్కువై అర్థమయిందర్థమయిం దర్థమయిందంటూ తలూపి ఇంటికి పారిపోయి పుస్తకం తెరిస్తే బుర్రంతా శూన్యం. మొన్నటికి మొన్న నూటికి ఎనిమిది మార్కులొచ్చాయి లెక్కల్లో. ఏడుపొచ్చింది చిట్టికి. అసలా లెక్కలంటేనే వాంతొచ్చేనంత వికారంపెడుతోంది. '
(కొండేపూడి నిర్మల, మొద్దుబారిప్పు, శత్రుస్పర్శ: నిర్మలకథలు, పే 9-16)

ఐతే బాలికల పాఠశాలల్లోమాత్రం ఇటువంటి లైంగికవేధింపులు ఉండవు. అంతమాత్రంచేత బాలికాపాఠశాలలన్నీ, బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని, స్వేచ్ఛాభావనను పెంపొందిస్తాయని భావించలేం. ఆ పాఠశాలలు కూడా అధికశాతం బాలుర పాఠశాలల మాదిరిగానే నడుస్తాయి. ఇక్కడకూడా పురుషస్వామిక విలువలు నేర్పటం సాధారణం. బాలికలు తమపట్ల ఆత్మన్యూనతను, పురుషస్వామ్యంపట్ల గౌరవాన్ని పెంపొందించుకుంటారు.

భాషాపరంగా స్త్రీని వేరుచేయటం శతాబ్దాలక్రితం వ్యాకరణవేత్తలు అనుసరించిన బృహత్తరమైన ప్రణాళికగా భావించవచ్చు. స్త్రీలింగం కంటే పుంలింగం మరింత సమగ్రమైనదిగా వీరు

భావించారు. అందువల్లనే పురుష పదం మనిషికి పర్యాయపదంగా గుర్తింపు పొందింది. మనం తటస్థమైనది, పక్షపాతరహితమైనదిగా భావించేపదజాలం, స్త్రీలు అనివార్యంగా ఉపయోగించాల్సినది అయిన పదజాలం వారిని మరింత ఇబ్బందికి గురిచేసేదిగా ఉంటుంది. స్త్రీలు దీనిగురించి శ్రద్ధగా ఆలోచించనంతవరకూ ఇదిలాగే కొనసాగుతుంది. But until we actually think about it, it's not that obvious. We are so used to 'mankind', 'man's progess', 'manpower' and 'manmade' that we don't notice it at all. (ibid, p.95) సామాజికశాస్త్రాల అధ్యయనంలో మూలపురుషులు, యుగపురుషులు వంటి పదప్రయోగం ఇలాంటి భావసను బలపరుస్తుంది. మూల స్త్రీలు, యుగ స్త్రీలు అనే భాషాప్రయోగాలు వాడుకలో లేకపోవటం ఆనాటి సామాజిక పరిస్థితులకు దర్పణం పడుతుంది.

లైంగిక వేధింపులు విద్యాలయాల్లో స్త్రీలు ఎదుర్కొనే ప్రధాన సమస్య. అయితే ఈ విషయంలో బాలికలు ధైర్యంగా ఎదిరించి నిలబడలేరు. లైంగికవేధింపులకు విద్యార్థినుల విద్యాపరమైన ప్రగతికి సాపేక్షసంబంధాన్ని చూపుతూ ఉపాధ్యాయులు ప్రవర్తించేతీరే ఇందుకు ప్రధానకారణం.

If we refuse to go along with the sexual advances of male lecturers, we may find that they use their authority to mask their pique and down grade our work. (ibid:104)

Sexual harassment can also affect the quality of work we're able to do. (ibid:105)

The idea that favourable treatment in the exam will be the pay-off sxual favours is repugnant to us, as is the fear that if we speak out about sexual harassment tuters will use their authority to mask their anger and downgrade our final degree. It is the fear that we will pay the cost for their behaviour that often prevents us from speaking out on our own account. (ibid:105)

The major aim of our modular teaching system is to provide unskilled, unqualified, unconfident (and ungrateful) women with a facility that will enable them to grow. (ibid:117)

I was only told by a woman who calls herself a feminist not to criticise a history lecturer for his neglect of women because 'we've got a course on women next term. The long awaited course turned out to be 4 one hour seminars and they were almost all about women in relation to the family and domesticity -- about women and women's roles seen through men's eyes. I suppose there could be scope for discussion about the revolutionary way women are trying to control our own lives on our own terms, but from our past experience I know it's unlikely to happen when the seminars are set up in this manner. (ibid:132)

అనేకమందిస్త్రీలకి ఉన్నతవిద్య కాలక్షేపంగానో, అంతగా అవసరంలేనిదిగానో, అలంకారప్రాయమైనదిగానో, విశ్రాంతి సమయం విసుగుపుట్టించి సమస్యగా రూపొందటంతో చేసే కాలక్షేపంగానో రూపొందింది. మనజీవితాలను మార్చేందుకు, ప్రపంచాన్ని నూతనతరహాలో

ఆవిష్కరించేందుకు విద్య ఒక సాధనంగా పనిచేస్తుంది. కేవలం అర్హతలను, ఉద్యోగాన్ని అందించేదిగా మాత్రమే కాక క్రమానుగతిని సవాలుచేసేదిగా విద్యను గుర్తించాలి. ఇక్కడ స్త్రీవిద్య అనేపదానికి స్త్రీలకోసం స్త్రీల అజమాయిషీలో రూపొందేవిద్యగా భావించాలి. అంటే పురుషస్వామ్యంలో ఉన్న వనరులను స్త్రీ యాజమాన్యంలోకి తీసుకరావాలి. అంటే నిత్యజీవితంలో పురుషస్వామ్యంకారణంగా స్త్రీలకు ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించగలగటం.

స్త్రీలకు తమవిగా చెప్పుకునేందుకు అవసరమైన ప్రత్యేకచరిత్ర, సంస్కృతి, సృజించుకునేందుకు స్వంత జ్ఞానం, గుర్తింపుకోసం, వినియోగంకోసం తమదైన నైపుణ్యం, తమవైన రాజకీయ ప్రాధాన్యతలు ఉన్నాయికనుక పురుషులను వారి సమస్యలసాధనలో భాగం కానివ్వలేరు. పురుషుల అంగీకారంకోసం ఎదురుచూడటం, వారిని అనుసరించటం వంటి చర్యలవల్ల ప్రయోజనంలేదు. స్త్రీలు తమ స్వేచ్ఛకు తామే బాధ్యతవహిస్తారు. అంటే స్త్రీల తరఫున పురుషులు వకాల్తాచేపట్టడంనుంచి విడివడటంగా దీన్ని భావించవచ్చు.

పురుషుల మద్దతు స్త్రీలకు మరింత స్ఫూర్తినిస్తుందని భావిస్తారు. అయితే ఇది వాస్తవంకాదు. పురుషులద్వారా లభించే నకిలీ మద్దతు, గౌరవాలు అవసరంలేదు. స్త్రీవిద్య స్త్రీలజీవితాల్లో అతి ముఖ్యమైన అంశం. దానికి స్త్రీల దృష్టిలో అధికప్రాధాన్యత ఉంది. అందువల్ల దానిగురించి పురుషులభావనను పరిగణనలోకి తీసుకోనవసరంలేదు. స్త్రీలందరూ పురుషులను శత్రువులుగా భావించనవసరంలేనప్పటికీ, పరిస్థితులను చక్కదిద్దడంలో వారు ఏరకంగానూ సహాయకారులు కాలేరని మాత్రం స్త్రీలు భావిస్తారు. అయితే పురుషుల ఉనికి లేకపోవటమే స్త్రీవిద్యలో సాధికారిత చోటుచేసుకునేందుకు తోడ్పడే ప్రధాన అంశంగా భావించాలి.

స్త్రీవిద్యకుసంబంధించి పాఠ్యాంశాలలో రెండు ప్రధానాంశాలు ఉండాలి. ఒకటి విషయం ప్రధానంగా స్త్రీకేంద్రంగా ఉండాలి. అంటే స్త్రీ జీవితం, స్త్రీ తనదృష్టితో చూసే ప్రపంచం, స్త్రీ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను పెంచేందుకు దోహదపడే సంఘటనలు, నైపుణ్యాలు, సమాచారం ఇందులో ఉండాలి. స్త్రీస్వేచ్ఛను హరించే స్త్రీసంబంధమైన జ్ఞానం, వైఖరులు, ఊహలు, చరిత్రలో స్త్రీ పాత్రను విస్మరించేవి, భవిష్యత్తులో స్త్రీని తప్పుదారి పట్టించేవి, స్త్రీఆకాంక్షలకు విరుద్ధమైనవి స్త్రీల అధ్యయనాంశాల్లో భాగంకాలేవు.

మరో అంశం సంబద్ధత. ఈ సంబద్ధత ఇంటిపనులపేరుతో స్త్రీపై పరిమితులు, ఆంక్షలు విధించేవిషయమైనది కాదు. స్త్రీలు తమజీవితాలను మార్చుకునేందుకు తమకేమి అవసరమో, అందుకోసం తామేమి చేయాలో నిర్ణయించుకునేందుకు దోహదపడే సంబద్ధత అవసరం.

ప్రోత్సాహపూరితమైన, ఆశాజనకమైన వాతావరణంలో సామాజికంగా, రాజకీయంగా ఉపయోగకరమైన జ్ఞానాన్ని అధ్యయనం చేసేందుకు దోహదపడేది, స్త్రీ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు లక్ష్యంగా గలదిగా స్త్రీవిద్య ఉండాలి. స్త్రీ కేంద్రీకృత జ్ఞానాన్ని సమష్టిమార్గాల్లో రూపొందించటం స్త్రీవిద్య ప్రత్యేకత. స్త్రీల తరఫున వారి స్వీయ అనుభవాలు, శక్తివంతమైన ఆలోచనలు, బలమైన అనుభూతులు, రాజకీయ కార్యక్రమాలు వంటిచర్యల ద్వారా స్త్రీవిద్య కేవలం తెలివితేటలను, విద్యార్హతలను పెంపొందించేదిగా మాత్రమే కాకుండా స్త్రీకోసం ప్రపంచాన్ని మార్చేదిగా ఉండాలని స్త్రీలు భావిస్తారు.

స్త్రీలు ఏం అధ్యయనంచేయాలి? అనేదిమాత్రమే కాకుండా ఎలాఅభ్యసించాలి అనేదికూడా ప్రధానమే ఈ రెండు అంశాలపై స్త్రీవిద్యకు అదుపు ఉండాలి. పురుషులజోక్యాన్ని అధిగమించగల శక్తి

సామర్థ్యాలను పొందటం స్త్రీకి అసాధ్యంకాదు.

It's not only what we learn, it's how we learn that's important, and in both of these respects we have to be in control of what we do. The over riding power and potential for interference from men will never be far away. We have no illusions about the patriarchal world in which we're trying to build some space, but we also know that, in the end, 'doing it ourselves' is the only way in which we'll ever change the world. (ibid:161)

ఏదేమైనప్పటికీ విద్య స్త్రీజీవితంలో చెప్పుకోదగిన మార్పుకు దోహదపడుతుందని మాత్రం తెలుగుసాహిత్యం భావించింది. అందుకే విద్య స్త్రీకి వ్యక్తిత్వాన్నిచ్చి, అభివృద్ధికి దోహదపడుతుందని స్పష్టంచేసే రచనలనేకం కనిపిస్తాయి.

కుర్చీలో కూలబడ్డాడు అన్నయ్య. పబ్లిక్ సర్వీసు కమిషన్ పరీక్షలు రాసినంత సులభంగా, కాంపిటీషన్ ఇంటర్వ్యూలు గట్టెక్కినంత తేలికగా ఇంట్లో తలెత్తిన పరిస్థితినీ, దాని ప్రభావాన్నీ బేరీజువేయడం సాధ్యం కాదనుకుంటున్నాడా? ద్రవ్యోల్బణం, సరళీకృత విధానాల పరిణామాలు, ప్రచ్ఛన్నయుద్ధం ముగిసింతర్వాత ప్రపంచం తీరుతెన్నులు, యుగోస్లావియా అంతర్యుద్ధం వగైరాల్ని విశ్లేషిస్తూ అనర్గళంగా మాట్లాడే అన్నయ్య ఇక నోరు మెదపలేడు. మేధస్సును మరిగిస్తూ తీవ్రమైన మీమాంసలో పడ్డట్టున్నాడు. ……………………

పౌరుషం. అంతా పౌరుషం. నువ్వుకూడానా? ఛీ. నిన్ను మనసులేని మరబొమ్మ అనుకుంటున్నారేమో. అనుభవమున్నా ఆగ్రహం. ద్వేషం రగులుతుంది. ప్రేమంటు ఈ అర్థంలేని రాజీ ఏమిటి? పురుషాధిక్య సమాజంలో ఆడదానిపట్ల జరిగిన అన్యాయానికి పురుషకోణంలో నుంచే విచారణ జరిగి పురుషస్వభావంనుంచే తీర్పు ఇవ్వబడుతోంది. పూర్వకాలంలో ఒక వ్యక్తి ఒక వనితను బలాత్కారంగా పెళ్ళాడితే దాన్ని రాక్షసవివాహమనేవారు. ఇది వ్యక్తులు జరిపించాలనుకుంటున్న రాక్షసవివాహం! ఛీ. నీజీవితంపైన నీకుగల హక్కును గొంతుపగిలేలా చాటింపు వెయ్యి. గెలువ్.

"నాన్నా, ఆధునిక యుగంలో ఆటవిక న్యాయం చెల్లుబాటు కాజాలదు మామయ్యా. మీరు కాలం వెంట పరుగెత్తే మనుషులు. నేను కాలాన్ని నా వెంట పరుగెత్తేలా చేస్తాను. అన్నయ్యా, నువ్వు నాతోపాటు ముందుకు నడుస్తావా లేక వయసు మళ్ళిన తరం...." అన్నయ్య చప్పుడులేని తలుపు
గడియలాగాడు. ఎదురుగా విశాలవిశ్వం. ……………

"...... ఆడపిల్ల జీవితం కళంకమై పోతుందనే భావమే కళంకం. మానభంగాన్ని పవిత్రతకూ, కన్యాత్వానికీ ముడిపెట్టడం అవివేకం. జరిగింది ఒక పీడకల. మర్చిపో. నీకేమీ భయంలేదు. సంఘం తను సృష్టించుకున్న భయాలు, భేషజాల నడుమ కృత్రిమధర్మం పాటించబోతూ బతుకుతున్నది. దాన్ని మార్చడం ఈ యువతరానికే సాధ్యమవుతుంది. నువ్వు ముందుకు నడువు. ఆడపిల్లల్ని కరిచే కుక్కలకు సరైన గుణపాఠం నేర్పాలి. నీ వెనక నారీ జగత్తంతా నిలబడుతుంది. ఐ ఎంపథైజ్ విత్ యూ. నీకు అన్నిరకాల సహాయం చేయడానికి మేమంతా సిద్ధం. నీవు ఒంటరిదానివి కావు. ఉద్యమశక్తివి....."

ప్రిన్సిపాల్ గరిమాదేవి తల్లిలా వెన్ను తట్టింది. రేణుకా, మధూలిక, లావణ్య ..... తదితరులు చెదరని కరస్పర్శల ద్వారా మనోత్తేజం అందిస్తున్నారు.

వందలకాళ్ళు, వందల గొంతులు. నీకు రక్షణకవచంలాగా నిలుస్తూ ఎదురుగా చెక్కుచెదరని ఆత్మవిశ్వాసానికి, స్వాభిమానానికి ప్రతీకలా ఎత్తైన కాలేజీ బిల్డింగు. నింగిలోకి ఎగిరిన పావురాల గుంపు - స్వేచ్ఛా విహంగాలు (శేడే. గుమ్మటాకారపు శిఖరంపైన మెరిసిందే మందారంలా సంధ్యా సూర్యుడు. (ఆదెపు లక్ష్మీపతి, తిర్యగ్రేఖ, ఆదెపు లక్ష్మీపతి కథలు, పే 86-97)

స్త్రీవిద్య సామాజికమార్పుకు దోహదకారి కాగలదన్న అభిప్రాయానికి బలాన్నిచేకూర్చుతూ వచ్చిన రచన 'నాంది'

మరునాడు సుజాతను ఇంటికి పిలిపించాడు సర్పంచు శివరామిరెడ్డి. " రాత్రిబడి పోయి పగలు బొమ్మలాట ఆడిస్తున్నావా టీచరమ్మా! మూర్ఖాల్ల ముచ్చటకని ఊళ్ళో బడి పెట్టించింది. నీ బతుక్కింత జీతంరాళ్ళు వస్తాయని నేను సహాయం చేయబోతే ఊళ్లో అరాచకం లేపుతావా? నక్సలైటువని నిన్ను పోలీసులకు పట్టిస్తే నీయమ్మ, తమ్ముడు, చెల్లెళ్ళు ఏమైపోతారో ఆలోచించుకున్నావా? రాత్రిబడికి ఎవరూ రావడంలేదని రిపోర్టు రాసిచ్చి ఊరిడిసిపో. ఈ మేలు మరొక్కరయితే చేయరు. నీకుటుంబం బొగ్గా అంతా తెలుసు నాకు. ఆడకూతురివని, ముందూ వెనుక ఎవరూ లేరని వదిలేస్తున్నాను. అదే మొగాడు యుంటేనా...?" బెదిరించాడు సర్పంచ్.

"నాలుగు అక్షరమ్ముక్కలొచ్చినాయో లేదో ఆడదాన్నకు పొగరెక్కినాది. సారాయికొట్లు మూయించేక తయారైనారు. అలగాజనానికీ, ఆడోళ్ళకు చదువు వస్తే దేశమే అల్లకల్లోలమయిపోతాదని నాకు ముందే ఎరుక. మాఊళ్ళో కూడా రాత్రిబడి

పెట్టిచ్చినానని రికార్డుల్లో రాసుకోనీక అవి ఒప్పేసుకున్నాను. నువ్వు పెలకోపారి వచ్చి, మొగం జూపిచ్చి జీతం డబ్బులు తీసుకుపోలావులే అనుకున్నాను. మాసి మదనల్లు ఉంటే మాబాగా చేసినావు. ఆడోళ్ళను ఎగదోసి ఊరికే చిచ్చుపెట్టినావు. ఇంగ చాలు రాతిరిబడి"---------- (ఎస్.జయ, నాంది, రెక్కలున్నపిల్ల, పే 88-96)

ఈ రచన Women's education, as we define it, is a political education linked to women's liberation. (ibid:143) అన్నభావనను స్పష్టంగా ముందుకు తెచ్చింది.

స్త్రీలు తమకెటువంటి విద్యావిధానం అవసరమని భావిస్తున్నారో వారి మాటల్లోనే

Together they form the basis on which women's education concerned with women's liberation should be based. Principles like women--only classes, a curriculam which is based on women-centered knowledge; teaching learning approaches which breakdown hierarchies between 'experts' and 'others'; an atmosphere which discourages the divisiveness of class privilege, racism and lesbophobia; the validation of personal experience; knowledge which is politically useful in the battle against patriarchy; good child care; flexible timing; minimal fees and freedom from male interference and control. (ibid:141)

*University may represent the 'pinnacle of academic endeavour' the sole of learning where 'the collected wisdom of the past' is transmitted and where 'creative thinking continually pushes back the frontiers of knowledge'. But for us it also holds conflicting messages.*

=======

## పరిశోధన

విశ్వవిద్యాలయాల ప్రధాన లక్ష్యం మృగ్యంకావటం, పరిశోధనారంగంలో అవాంఛనీయధోరణులు ప్రవేశించటం నేడు సర్వసాధారణమైంది. ఆలా విశ్వవిద్యాలయ స్థాయిలో పరిశోధనారంగంలో చోటుచేసుకుంటున్న విపరీత ధోరణులను విశ్లేషణాత్మకంగా చర్చించిన రచనలు అనేకం కనిపిస్తాయి.

విశ్వవిద్యాలయస్థాయిలో వ్యక్తులు పరిపూర్ణ వ్యక్తిత్వం సంతరించుకున్నవారిగా ఉంటారని ప్రపంచం భావన. అయితే వారి ప్రవర్తనల్లోని విభిన్న పార్శ్వాలను సమగ్రంగా చర్చించిన రచనలను మనం చూడవచ్చు. స్నాతకోత్తర స్థాయి తరగతుల్లో గోల్డ్‌మెడల్‌కోసం జరిగే పోరాటంలో నైతిక పరిధులు దాటి విద్యార్థులనుసరించే వక్రమార్గాలు సాధారణవ్యక్తుల ఊహాకందనిరీతిలో సాగటాన్ని చిత్రించిన రచన 'యుద్ధపర్వం'. ఇందులో పరీక్షలలో విజయంసాధించేందుకు విద్యార్థులు అనుసరించే మార్గాలు యుద్ధనీతిని గుర్తుచేస్తాయి. యుద్ధంలో విజయమే ప్రధానంతప్ప, అందుకు అనుసరించిన మార్గాలు కావన్నది నేటి విద్యార్థుల భావనగా కనిపిస్తుంది. అందువల్లనే పరీక్షలను యుద్ధంతో పోల్చుకుని యుద్ధంలో గెలుపే ప్రధానంగా భావించి యువత ముందుకు సాగటం కనిపిస్తుంది. ఈ పార్శ్వాన్ని సమగ్రంగా చిత్రించిన రచనే 'యుద్ధపర్వం'.

"పిచ్చిదానా! వడ్డించేవాడు మనవాడైతే అదిచాలు. పంక్తిలో ఎంతచివరకూర్చున్నా భయముండదు." అంది భాగీరథి.

"వడ్డించేవాడు మనవాడైతే మాత్రం.....మనం మనపక్కవాడి కడుపు కొడతామా? పక్కవాడి విస్తరిలో భోజనాన్ని పెట్టనివ్వకుండా చేస్తామా? శ్వేత ఆ ఉద్యోగాన్ని ఎలాసంపాదించి ఉంటుందో నేను చాలా సులభంగా ఊహించగలను. అలా అడ్డదారిలో సంపాదించుకున్నది కూడా ఓ ఉద్యోగమేనా? అవినీతివల్ల పొందిన గెలుపు..... నిజాయితీవల్ల పొందిన ఓటమికంటే ఏవిధంగానూ గొప్పదికాదు" అంది మాళవిక.

"అంటే.... నీ ఉద్దేశం...."

"ఆశయసాధన కోసం మనిషి అవలంబించే. అనుసరించే నైతికమైన మార్గమే ముఖ్యం తప్ప....ఆ ఆశయసాధనలో మనిషి గెలవడం, ఓడడం ముఖ్యంకాదు. అంటే శ్వేత ఈ ఉద్యోగాన్ని గెలుచుకుంది. అయితే ఈ గెలుపునకు ఆవిడ

అనుసరించిన పద్ధతులు నీతి బాహ్యమైనవి కాదన్నా... నైతికదృష్టిలో శ్వేత ఓడిపోయినట్లే లెక్క. లక్ష్యసాధనకి నీతిబాహ్యమైన పద్ధతుల్ని వదిలి అసమర్థులు మాత్రమే అనుసరిస్తారు" అంది మాళవిక. ..........

"ఇది... యుద్ధనీతి. ప్రేమ అనే భావన ఉత్తరాలద్వారా నీ హృదయంలో చెలరేగడంవల్ల.... నీ ఏకాగ్రత నాశనమై... సైకలాజికల్‌గా నువ్ డిస్టర్బ్ అయి... చదువుపై ఉండే నీ మనసు స్థైర్యము పోతుంది. అప్పుడు నువ్ పరీక్షల్ని బాగా రాయలేవు. గోల్డ్‌మెడల్ కోసం జరుగుతున్న పోరాటంలో నువ్ సులభంగా ఓడిపోతావు. యుద్ధభూమిలో నైతిక విలువలకి సంబంధించిన తర్కానికి తావు ఉండదు. సింధూ! ఇది జీవితసంగ్రామం. ఇక్కడ ప్రత్యర్థిని ఏదో విధంగా పడగొట్టడమే ముఖ్యం. ఇది నా సిద్ధాంతం కాదు. ఇవాళ మానవజాతి పాటిస్తున్న యుద్ధనీతి ఇది. అవినీతి వల్ల సంక్రమించిన గెలుపు .... నిజాయితీ వల్ల సంక్రమించిన ఓటమికంటే గొప్పది కాకపోతే ..... నీప్రత్యర్థి మాళవిక ఇలా ఈ కుట్ర ఎందుకు పన్నినట్లు? దాని నోట్‌బుక్‌లో దొరికిన లెటరిదిగో" ఇచ్చింది హారిక.

"డియర్ గోపీ! మనప్లాన్ గొప్పగా పోతోంది. నేను చెప్పినట్లు నువ్ రాస్తున్న లెటర్స్ వల్ల... సైకలాజికల్‌గా డిస్టర్బ్ అయిపోయి చదవడం మానేసింది సింధు. ఇక గెలుపు నాదే. గోల్డ్‌మెడల్ నాకు రావడం గ్యారంటీ..." మాళవిక రాసి గోపీకి పోస్ట్ చెయ్యడం మరచిన ఆఖరిదైన ఆ లెటర్ని చదివి నేను కొయ్యబారి పోయాను. (వీరవల్లి వీణావాణి, యుద్ధపర్వం, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 6-6-'90, పే 47-51)

విశ్వవిద్యాలయంలోని చీకటికోణంలో తరచు తారసపడే వ్యక్తులు కొందరుంటారు. వారిజీవితంలో అధికభాగం యూనివర్సిటీలోనే గడిచిపోవటం సాధారణాంశం. వారి వ్యక్తిత్వలోపమో, లేక పరిస్థితుల నియంత్రణో కారణమేదైనా వారు విశ్వవిద్యాలయ విధానానికి బలిపశువులుగా మిగిలిపోతారు. అటువంటి వ్యక్తిత్వ చిత్రీకరణే 'కనకదాసు'. ఇటువంటి వ్యక్తుల జీవితాలు అనేకమంది ఇతర విద్యార్థులపై వ్యతిరేక ప్రభావాన్ని చూపుతాయి. పర్యవసానం ఎలా ఉంటుందో ఈ రచనలో కనిపిస్తుంది.

కనకదాసుకు 30 ఏళ్ళపైనే ఉంటాయి. యూనివర్సిటీ విద్యార్థులందరికీ అతను తెలుసు. అతను యూనివర్సిటీలో భీష్ముడు. అతను ఏ హాస్టల్‌కైనా వెళ్ళగలడు. ఏ మెస్‌లోనైనా తినగలడు. ఎక్కడైనా పడుకోగలడు. అతనికి ఎక్కడా అడ్డుపుండదు. ఎవరూ అడ్డగించడానికి సాహసించరు. కదిలిస్తే విజ్ఞానంతో ఎదుటి వాళ్ళని ఓడించగలడు. బూతులతో అవమానించగలడు. అవసరమైతే ఎదుటి వాళ్ళ పాకెట్‌మనీలోంచి డబ్బు తీసికెళ్ళగలడు.

కనకదాసుకు మూడు పోస్టుగ్రాడ్యుయేట్ డిగ్రీలున్నాయి. పి.హెచ్.డి.కి రిజిస్టర్ చేయించాడు రెండేళ్ళకిందట - కాని అతను పి.హెచ్.డి వర్క్ చేస్తున్న దాఖలాలు మాత్రం నాకు కనిపించలేదు. .........

"పి.జి. పూర్తవ్వగానే ఉద్యోగాలేం దొరకుతాయి. దానితో ఉద్యోగం వచ్చేవరకూ ఎం.ఫిల్. చేస్తాం. అతర్వాత పి.హెచ్.డి చేస్తాం. పి.జి. అయిపోగానే ఎం.ఫిల్. దొరక్కపోతే మరో పిజీలో చేరతాం. ఒక పి.జి. పూర్తవేతాక మరో పి.జి. సంపాదించడం సులువే. లేదా ఎల్‌ఎల్‌బి, జర్నలిజం, పి.జి.డి.సి.ఎ. లాంటి కోర్సుల్లో చేరతాం. ఎలాగో హాస్టల్‌నుంచి వెళ్ళిపోకుండా చూసుకుంటాం. ఇట్లా రెండు, మూడు డిగ్రీలయి, పి.హెచ్.డి చేసేసరికి మన తలనెరిసిపోతుంది. కనకదాసుది అదే కేసు." వివరించాడు రావ్.
..................

కనకదాసు మాట్లాడుతూనే వున్నాడు. " హలో మై డియర్ యంగ్ ఫ్రెండ్స్, మీరంటే నాకెంతో అభిమానం - జాలి కూడా - మీరిక్కడ వుండకండి - ఇప్పుడే వెళ్ళిపోండి - యూనివర్సిటీ లైఫ్ మత్తుమందులాంటిది. మార్క్స్‌కు ఈ విషయం తెలియదనుకుంటా" ................

"నో...... నేనేం చెప్తున్నాను? ఈ యూనివర్సిటీ గురించి కదూ? ఇక్కడి ప్రొఫెసర్లు బయటి ప్రపంచం దృష్టిలో మేధావులు. కాని వాళ్ళ మెదళ్ళకు బూజుపట్టి పోయింది. ఆ మెదళ్ళు పుచ్చిపోయినై. మహావాదులకు, కాకారాయుళ్ళకు ఇంటివిద్యార్థిలే లేవి కొట్టుకుంటూ వాళ్ళు ... చేస్తారు. ఇంటలిజెన్స్‌ను గుర్తించరు. మీకు గుర్తింపు వుండదు. నో, మైడియర్ ఫ్రెండ్స్! లీవ్ దిస్ యూనివర్సిటీ యాజ్ ఎర్లీ యాజ్ పాసిబుల్. డోంట్ వేస్ట్ యువర్ వాల్యుబుల్ టైం ఇన్‌దిస్ డార్క్‌నెస్."
..............

నాకు తల రెండుగా చీలిపోతున్నట్లనిపించింది. నుదురు చిట్లిపోతున్న బాధ, జుట్టు పీక్కోవాలనిపించింది. పిచ్చిగా అరవాలనిపించింది. యూనివర్సిటీ పెద్ద చీకటి జైలులా తోచింది. ఇక్కడ్నుంచి సాధ్యమైనంత త్వరలో బయట పడాలనే కోరిక మరింత బలపడింది. అక్కడ్నుంచి పారిపోవాలనిపించింది. అశాంతి మరింత పెరిగింది. ఈ ఆలోచనలో ఒక స్త్రీ అక్కడకు రావడం నేను గమనించలేదు. ఆమె కనకదాసును సమీపించి - మా అందరివైపూ చేతులు జోడించి " మావాడ్ని ఏమీ అనకండి బాబూ" అని వేడుకుంది. " మీవైపు ఇకనుంచి రానీయను. సాయంత్రంనుంచీ వాడికోసం గాలిస్తున్నా". అని చెప్పి కనకదాసుతో " ఇదేంపనిరా, కనకం! ఇంట్లోవుండక ఇక్కడికెందుకొస్తావురా? పొద్దున చెప్పావు కదరా, ఇకనుంచి ఇటువైపు రానని. ఇంటికి పోదాంపద?" అనిఅంది. ఆమె గొంతులోతులను గుర్తించడం కష్టమే అయింది. నాకు ఏడ్పొచ్చినంత పనైంది. కన్నీళ్ళు రాలాయి. ఎవరూ చూడకుండా తుడుచుకున్నాను. (కాలువ ప్రతాపరెడ్డి, కనకదాసు, కాలువ ప్రతాపరెడ్డి కథలు, పే 39-44)

పరిశోధనారంగంలో వివిధకోణాల్లో చోటుచేసుకుంటున్న అవాంఛనీయధోరణులను అనేక రచనలు చిత్రింపటం కనిపిస్తుంది. వీనిలో ఆచార్యుల పక్షపాతధోరణి కారణంగా ఉత్తమ ప్రోత్సాహిక విద్యార్థులు బలికావటం ఒక పార్శ్వం. ఆ పార్శ్వాన్ని సమగ్రంగా చిత్రించిన రచనే 'వెన్నెముక విరిగింది'.

ప్రొఫెసర్ మనసు జాలితో నిండిపోయింది. తను ఆశ్రిత పక్షపాతానికి పాల్పడిచేసిన ఒక చిన్నతప్పు రత్నంలాంటి ఒక విద్యార్థి బంగారు భవిష్యత్తును ఎలా తారుమారుచేసిందో అతనికి పూర్తిగా అర్థమైంది. తాను అదర్శానికి మరోపేరయిన గురువు స్థానంలో ఉండి కూడా న్యాయాన్ని పరిరక్షించలేక పోయాడు. న్యాయాన్ని పరిరక్షించవలసినవాడే, తానే అన్యాయానికి పాలుపడ్డాడు. దీన్ని ఏ న్యాయమూ, ఏధర్మమూ హర్షించదు. ..............

"సార్! మీమీద నాకు ఈ క్షణంవరకు కోపం ఉన్నమాట నిజమే. కాని ఈరోజు మీతో సంభాషించిన తరువాత ఆ కోపం ఎగిరిపోయింది. ఒకవిధంగా నేను పి.హెచ్.డిలో చేరకపోవడం నాకుటుంబం మంచికేనేమో. లేకపోతే నేను రీసెర్చి అంటూ ఉన్న ఆస్తిమొత్తం అమ్మించేవాణ్ణి. ఇంటిదగ్గిర ఉండబట్టి ఇంట్లోని ఆర్థిక బాధలు తెలిసి ఇపుడు కొంతవరకూ ఆదుకో గలుగుతున్నాను." అన్నాడు మాటలు తడబడగా. (పోల్లూరు సుబ్రహ్మణ్యం, వెన్నెముక విరిగింది, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 18-2-'87, పే 22-24)

ఇదేరకంగా విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ల పనితీరును వ్యంగ్యంగా, విమర్శనాత్మకంగా చిత్రించిన వైనం 'తప్పుల తమాషా'లో చూస్తాం.

"భద్రిరాజా, కొంప ముంచేశావోయ్! నువ్వు పూలమాల వేసింది ప్రొఫెసర్ కేడీకి కాదు, యూనివర్సిటీ కాంట్రాక్టర్‌కి! ఇదేం పరదా, స్టుపిడ్ ఫెలో?" అని నలుగుర్లోనూ నన్ను ఇన్‌సల్ట్ చేశారు.

"అదేమిటిసార్! అయనే కేడీరావుగారు. రెండేళ్ళు ఆయన పాఠాలు విన్నాను. ఆమాత్రం తెలీదా? అన్నాను.
..............

నేనిప్పుడు దండవేసిన బట్టతలాయన మేంచదువుకునే రోజుల్లో రీసెర్చిస్కాలర్‌ట. అందేత సహజంగానే ప్రొఫెసర్ కెడీ చెప్పాల్సిన క్లాసులన్నీ ఇతనే చెప్పాడు. (బి.వి.హెచ్.వి.బసవరాజు, తప్పులతమాషా, జ్యేష్ఠ కథలు, పే 181-184)

విశ్వవిద్యాలయాల్లో రోజురోజుకూ క్షీణిస్తున్న బోధనా విలువలను ఆవేదనాపూర్వకంగా చిత్రించిన రచన 'వలయం'. ఆచార్యుల బాధ్యతారాహిత్యానికి పరిశోధక విద్యార్థులు బలికావటాన్ని, పర్యవసానంగా సరైన పరిశోధక విద్యార్థులు రూపొందలేకపోవటాన్ని, ఫలితంగా బోధనావిలువలస్థాయిలో క్షీణతను వీటన్నింటిని ఒక విషవలయంగా పేర్కొంటూ వెలువడినదే 'వలయం'. వీటన్నింటికి విద్యావిధానవైఫల్యమే ప్రధానకారణంగా భావించటం ఇందులో కనిపిస్తుంది. అందువల్లనే వివేకాన్ని, విజ్ఞానాన్ని నేర్పక కేవలం ఆడంబరాన్ని పెంపొందిస్తున్న చదువులశాలలకి నిప్పంటించాలన్న భావనను ఇందులో వ్యక్తంచేయుటం కనిపిస్తుంది.

సైంటిస్టు దంపతులు! క్యూరీ దంపతులు అంతటి వాళ్ళవాలనే తపన! ఆశ! ఆశయం! ఇటు కుటుంబాలు, అటు కుటుంబాలు అంతా సంతోషించేరు, గర్వపడ్డారు. కాని, ఏం లాభం? నాలుగేళ్ళు గడిచేయి. ఈ యూనివర్సిటీలు, ఈ రీసెర్చిలు ఈ చదువులు! ఉత్సాహం చప్పగా చల్లారిపోయింది! ప్రొఫెసర్లు అప్‌టుడేట్ నాలెడ్జితో ఉండరు. సైంటిఫిక్ జర్నల్స్ చదవరు! వాళ్ళు పనిచెయ్యరు. పనిచేద్దామన్న పట్టుదలతో ఉన్న పిల్లల్ని ప్రోత్సాహపరచరు సరికదా, నీళ్ళు కార్చేస్తారు. నిరంతరం అధ్యయనం చెయ్యందే ఆచార్య అర్హత లేదన్న ప్రాథమిక విషయం మరచిపోయిన గురువులు! వాళ్ళ జ్ఞానం పెద్ద ఫుల్‌స్టాప్‌తో ఆగిపోయింది. తాము, తమపైనున్న "కుర్చీ"కి ఎలా ఎగబాకడమా అన్న తాపత్రయంతో ఆ రాజకీయాల్లోపడి కొట్టుమిట్టాడే వాళ్ళకి అప్ టు డేట్ నాలెడ్జి ఎలా ఉంటుంది? జర్నల్సు రిఫర్‌చేసే తీరుబడి ఎక్కడ దొరుకుతుంది? అన్ని హంగులతో ఓ మంచి ఇల్లు, సోఫాసెట్లు, డైనింగ్‌సెట్లు, రిఫ్రిజిరేటర్లు, కార్లు, డబ్బు, హోదా - కావాలి! వీటికోసమే పాట్లు! రోజురోజుకీ దిగజారుతున్న గురువులు! వీటన్నిటి మధ్యా మీదికి లేచి డాక్టరేట్లు పుచ్చుకొని గురువులను మించిన శిష్యులు ఉండటం లేదా? లేకేం? ఉంటున్నారు. కాని, వాళ్ళయోగ్యతలు వేరు!..................

కాలేజీలు చదువుతున్న అమ్మాయిలు, వాళ్ళ వేషభాషలు, మాటతీరూ, ఏదో పెద్ద చదువు చదివేస్తున్నామన్న టెక్కూ, భేషజం, నటన, ఏమీ రాకపోయినా ఏదో తెలిసున్నట్లు ఫోజుకొడుతూ అందర్నీ వెటకారంగా చూడ్డం, డిగ్రీలు చెప్పుకుని గొప్పపడటం! వీళ్ళని చూసి శాంత బెదిరిపోయి లోలోపల ముడుచుకు పోతూంది! కాలేజీ చదువులు వివేకాన్ని పెంచటంలేదు! వినయాన్ని నేర్పటంలేదు! అన్నిరకాల ఆడంబరాల్ని పెంచుతున్న ఈ చదువులశాలలకి నిప్పంపుల్ల గీస్తే! (దాగంటి తులసి, వలయం, తెలుగు కథ 1960-85, పే 152-160)

పరిశోధకరంగంలోని విపరీతధోరణులు, వాని పర్యవసానాలను విభిన్నకోణాలలో అనేక దృష్టాంతాలతో చిత్రించిన రచనలనేకం కనిపిస్తాయి. ఆచార్యుల స్థాయిలో అనైతికవర్తనం విశ్వవిద్యాలయాల ఔన్నత్యానికి ఎటువంటి అపప్రథను చేకూరుస్తుందో చెప్పలేం. 'సూర్యకిరణం' ఒక విశ్వవిద్యాలయంలో జరిగిన వాస్తవ సంఘటనకు ప్రతిబింబమంటూ రచయిత స్పష్టంచేసిన అంశం వాస్తవదూరమైనదిగా భావించలేం.

ఎవరికైనా అవసరాలు విలువలకన్నా ప్రధానమైనవి. భయం సత్యంకన్నా ప్రమాదకరమైనది. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ శాంతికిరణ్‌గుప్తాకు 1987 జనవరి 31వతేదీన భారత ప్రభుత్వం ఉత్తమశాస్త్రవేత్త అవార్డు ప్రకటించింది. సత్యప్రియకు ఉత్తమ ప్రోత్సాహక పరిశోధక అవార్డు లభించింది. అందరూ దిగ్భ్రాంతి చెందారు...... ............

తనమీదకు వంగి, చెవిదగ్గరగా తలపెట్టి, " జరిగిందేదో జరిగిపోయింది. ఫర్‌గెటిట్! నీప్రమోషన్ కళ్లముందు వస్తుంది! మాధవన్‌కు డైవోర్స్ చేస్తాయ్...... అంతా సవ్యంగానే ఉంటుంది. రాబోయే రోజులు మనవే! నీవిక్కడ రాణివి.... నేనక్కడ..."

"నో హర్రీ! ఆలోచించి నిర్ణయం తీసుకో.... జీవితంలో మైనర్ బ్రూటీలూ, మేజర్ బ్రూటీలూ ఉంటాయి.... ఏవికావాలో మనమే తేల్చుకోవాలి. దానిపై మన భవిష్యత్తూ, సౌఖ్యమూ ఆధారపడి ఉంటాయి."

సత్యప్రియ మాట్లాడలేదు. మరోసారి భుజంతట్టి గుప్తాగారు కదిలి కారెక్కి వెళ్ళిపోయారు. ............

'పరిశోధనల్తో ప్రపంచాన్ని మోసంచేసిన ఘనుడు!'

'విదేశీ మ్యూజియంలనుండి శిలాజాలను తస్కరించిన భారతీయ శాస్త్రవేత్త!'

'దొంగ ఫలితాలతో నిచ్చెనెక్కిన శాంతి కిరణం'

'అంతర్జాతీయ మ్యూజియంల నుండి శిలాజాల అంతర్ధానం'

'భారతీయ శిలల్లో లేని శిలాజాలను చూపిన అసత్యకిరణం'

అంటూ ప్రముఖ దినపత్రికలన్నీ మేజర్ అనే ఆస్ట్రేలియన్ పరిశోధకుడి విలేఖరుల సమావేశ వివరాలను ప్రచురించాయి. "నిన్ననే నగరంలో ప్రముఖ ఆస్ట్రేలియన్ పురాజీవశాస్త్రవేత్త అందించిన సమాచారం మేరకు.... వివిధదేశాల మ్యూజియం క్యూరేటర్లు అందించిన రిపోర్టుల మేరకు...." శాంతికిరణంపై సూర్యకిరణం ప్రసరించినట్లు వార్తలు వెల్లడించాయి.

రాజధాని నగరంలోని 'షేక్ సరాయి' కాలనీలోని డాక్టర్ ఎస్.కె.గుప్తా ఇంటుముందు జనం తండోపతండాలుగా గుమిగూడారు. పరస్పరం బాణాలు సంధించుకున్నారు. కెమెరాలు, వీడియోలు ఎగబడుతున్నాయి.

"ఆయన ఆరోగ్యం బాగాలేనందున ఎవ్వరినీ కలవటం కుదరదని ఆయన భార్యామణి వివరిస్తోంది..............

అక్కడ భర్త మాధవన్‌ను సత్యప్రియ గట్టిగా కౌగిలించుకుంది. అది భయంవల్లనో, కోర్కె వల్లనో ఒక్క క్షణం అతనికి తెలియలేదు!

(పంజాబ్‌లోని ఒక విశ్వవిద్యాలయంలో జరిగిన సంఘటన కథకు ఆధారం..... మిగతా వివరాలు కల్పితం... ఇది శాస్త్రవేత్తల సామూహిక ధర్మానికి సంబంధించినది కాదు.... కేవలం వైయక్తిక సంఘటన!) (చందు సుబ్బారావు, సూర్యకిరణం, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 12-4-'99, పే 30-34)

పరిశోధనారంగంలో అంశాన్ని సమగ్రంగా కాకుండా ప్రత్యేకనైపుణ్యం పేరుతో అంశాలన్నింటిని విడగొట్టి అధ్యయనం చేయటం, ఫలితంగా ఒక సమగ్రమైన ఆలోచనావిధానం లోపించటం వంటి విమర్శనాత్మక అంశాల స్పష్టమైన చిత్రీకరణే 'ఉద్యోగాలు' విశ్వవిద్యాలయ స్థాయిలో జరిగే అవినీతికర రాజకీయపుటంశాలను వ్యంగ్యంగా చిత్రీకరించటం ఇందులో చూస్తాం.

"నువ్వనుకున్నట్టు నేనసలు బోడిపికాయల స్పెషలిస్టునేనోయ్. అయితే గవర్నమెంటు వాళ్ళ పెద్దాసుపత్రి పెద్దదికదా అక్కడ ఒక్క బోడిపికాయలకే కాక రకరకాల స్పెషలిస్టులుంటారు. రకరకాల డిపార్టుమెంట్లుంటాయి. అంటే ఎలాగంటే చెముడుకాయల డిపార్టుమెంటూ, ఉసిరికాయల డిపార్టుమెంటూ అలాగన్నమాట. ప్రభుత్వం ఏంచేసిందంటే అందర్నీకలిపి ఏకమొత్తంగా వీళ్ళంతా డాక్టర్లు అని ఊరుకోకుండా ఆయన బోడిపికాయల ప్రొఫెసరూ, ఆయన చెముడుకాయల ప్రొఫెసరూ అని పేర్లెట్టింది. ప్రతిడిపార్టుమెంట్లోనూ పెద్దడాక్టర్ని ప్రొఫెసరనీ, చిన్నడాక్టర్ని అసిస్టెంటు ప్రొఫెసరనీ అంటారన్నమాట. అర్థం అయిందా? అన్నారండి.

నాకర్థంకాలేదండి. నాకు మా కనకారావు గుర్తొచ్చాడండి. ఆరోకటో క్లాసులో మన క్లాసుమేటులెండి. కూచున్న క్లాసులో కూచోకుండా ఏవేటి కాయేదు పాసయిపోయి సివరికి లెక్చరర్ అయిపోయాడండి. ఆడిప్పటికి రెండేళ్ళనుట్టీ ఆదేదో పేరు! నోర్తిరగని యూనివర్సిటీలో పనేస్తున్నాడండి. ప్రొఫెసరంట. ఆడు శెలవలకి మనూరొచ్చినప్పుడల్లా మనకొట్లో కూచోని బాతాకానీ ఏస్తాడండి. గబుక్కున ఆడు సెప్పే కబుర్లన్నీ గుర్తుకొచ్చేసాయండి.

అన్ని కబుర్లసారమూ ఒకటేనండి. యూనివర్సిటీ హెడ్డుమాస్టార్ని ఊసీ (వీసీ) అంటారంటకదండి. ఈ ప్రొఫెసర్లంతా పేరి పేసే నిర్వాకం ఏటంటే ఆ ఊసీని ఎందగొట్టి ఈ ఊసీని కూచోబెట్టా, ఈ ఊసీని పెడగొట్టి ఆ ఊసీని దింపోబెట్టా!

అంటేసంటుంది అల్లపని. ఆ యిసయాలన్నీ గుర్తొచ్చాయండి. అంతే ఎందునే అతిగాకదా! ..............

నాకు మతిపోయిందా, డాక్టరుగోరికి మతిపోయిందా తెల్చుకోలేకపోయానండి. డాక్టరుగోరే మళ్ళీ మాటాడారండి. " ఇంతకీ మనం మాటాడుకున్నదాంట్లో సారాంశం ఏమిటంటే సింపుల్‌గా చెప్పాలంటే ప్రభుత్వాసుపత్రుల్లో ట్యూటరు పోస్టుల్లేవు. అయినాసరే నాకు అసిస్టెంటు ప్రొఫెసరు స్థానంలో పోస్టింగిచ్చి నీకు కన్సర్నుడ్ డిగ్రీ లేదుకాబట్టి నువ్వు ట్యూటరువి అంది ప్రభుత్వం. మరైతే ట్యూటరుపోస్టనేది ఉన్నట్టా? లేనట్టా? నాకు ఉద్యోగం ఇచ్చేసినుందు లేదు. తీరా ఇచ్చాక నాపేరు ట్యూటరు." అన్నారాయన మొహం మూడంకెలా ముడిచి. ..................

యూనివర్సిటీల్లో జేరి పాటాల్చెప్పకుండా రాజకీయాల్చేసేటోళ్ళని రాజకీయపులోళ్ళు మరోటో అనకుండా ఆళ్ళని ప్రొఫెసర్లనే అంటున్నది. ఇంకా పైపెచ్చు ఆళ్ళకి డాక్టర్ డిగ్రీలుంటాయి. ఆ యూనివర్సిటీలోనే డాక్టర్ డిగ్రీలు ఇస్తా ఉంటారు.

కాపోతే కాలేజీల్లో కుర్రాళ్ళకి పాటాల్చెప్పకుండా బ్యాచీలు బ్యాచీలు ప్రైవేట్లు చెప్పుకునే మేష్టర్లని ట్యూటర్లనొమ్మ గవండీ పెబుత్వం? అనదండీ. ఆళ్ళనేమో లెక్చరర్లంటారండి. ఏవి ఇసిత్రంగుందండీ! ఇట్లాంటి ఇసిత్రాలు తెలుసుకుంటే అరే మాయమ్మా నాన్నా సెప్పిన పెదంవగ్గాని మవులాడి గాబోలండి. (పి.కృష్ణకుమారి, ఉత్తోగాలు, విపుల, నవంబరు'99, పే 110-115)

పరిశోధనారంగంలో సరైన ప్రోత్సాహం లేని కారణంగా ఔత్సాహిక పరిశోధక విద్యార్థులు దేశంపట్ల తమకుగల అభిమానాన్ని సైతం చంపుకొని విదేశాలకువలస వెళ్ళటం తప్పకపోవటాన్ని 'మేధ మథనం' చిత్రించింది.

"మూడేళ్ళ క్రితం నన్ను మీరు ముగ్గురూ ఇంటర్వ్యూ చేసి బిచ్చగాణ్ణి వెళ్ళగొట్టినట్టు వెళ్ళగొట్టారు. జ్ఞాపకం ఉందా? నేను గడ్డివిత్తనాలలో ప్రొటీన్లు అధికంచేసే విధానాన్ని ఇండియాలోనే కనుక్కొన్నాను. ఆ విషయం నన్ను మీరు ఆరోజు చెప్పనివ్వలేదు. ఇంతలో జర్మన్ స్కాలర్‌షిప్ వచ్చింది. ఎలాగూ గడ్డిమొక్క విత్తనాల్లో ప్రొటీన్లు అధికం అయ్యేట్లు చేశావు కదా అదే ఫార్ములాను గోదుమ మీద పరీక్ష చేసి చూడమన్నారు. రెండు సంవత్సరాల్లో ఆ పని పూర్తిచేశాను."

మంత్రిగారు మూడు పురుగుల్ని కొరకొరా చూశారు. " ఇటువంటి వాకులాంటి కుర్రాణ్ణి సెలక్టుచేయకుండా మీ ఇష్టం వచ్చినవాళ్ళను సెలక్టు చేశారటయ్యా? బుద్ధిలేదూ?" అన్నారు. ...........

"ఇప్పుడీ ఫార్ములాను మనదేశం జర్మనీ ప్రభుత్వం నుంచి లక్షలడాలర్లు ఇచ్చి కొనాలని నిర్ణయించిందయ్యా"

"ఓ అదా! ఏం అవసరంలేదు సార్. ఇటువంటి పురుగుల్ని ముందు ఏరిపారెయ్యండి. మనదేశంలో రీసెర్చి చేసే మంచి కుర్రాళ్ళున్నారు. వాళ్ళకు తగిన వసతులు కల్పించండి. ఒక్క సంవత్సరంలో ఇంతకు మించిన విషయాలను కనుక్కుంటారు..............."

ఇండియా రాగానే ఆ విషయం మరచిపోయాడు మంత్రి. (ఉడ్రైమంత్రి గోపాలరావు, మేధ మథనం, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 17-5-89, పే 30-37)

సరిగా ఇదేపరిస్థితులకు భయపడి భారతదేశంలో తన ఉనికికి ఏర్పడే ముప్పును గుర్తించి తిరిగి భారతదేశానికి రావటానికి ఇష్టపడని వ్యక్తి జీవితమే 'విక్రమార్కుడి సింహాసనం'.

"నా చదువుకు అమ్మా, నాన్నలే కాదు. దేశంకూడా ఖర్చు పెడుతోంది. నా చదువు నాకు బ్యాంకు ఉద్యోగం తేవచ్చు. పన్నిరి అడ్మినిస్ట్రేటివ్ సర్వీసుల్ని చేయవచ్చు. కానీనా చదువందుకు కాదు. సైన్సులో ఇంకా లోతుపాతులుతెలుసుకొని దేశానికి సేవచేస్తాను. అప్పుడే నాచదువుకు ప్రయోజనం!" అన్నాను నేనందరికీ బదులుగా.

ఇది నా ఆవేదన కూడా. ప్రతి విద్యార్థికీ శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం లక్షల్లో ఖర్చు పెడుతుంది. చాలామంది విషయంలో ఆ లక్షలు వృథా అవుతున్నాయి. ఎమ్మెస్సీలో యూనివర్సిటీ ఫస్టుగా వచ్చాను. మూడు సంవత్సరాల్లో పీహెచ్.డీ. సంపాదించుకున్నాను. నా ప్రొఫెసర్ నన్ను శభాష్ అని మెచ్చుకున్నారు. ఫారిన్ వెళ్ళటానికి రికమెండేషనిస్తానన్నారు.

"నేను ఫారిన్ వెళ్ళను. దేశంలోనే ఉండి నా చదువును దేశప్రజలకు వినియోగిస్తాను" అన్నాను.

ప్రొఫెసర్ నన్ను యూనివర్సిటీలోనే స్థిరపడేలా చేయాలన్నారు. నేనంగీకరించలేదు. నాకు టీచింగంటే ఆసక్తిలేదు. నా విద్యను మరికొందరు విద్యార్థుల్ని తయారుచేయటానికి కాక - దేశానికి పనికొచ్చే పరిశోధనలకు వినియోగించాలని నా కోరిక.

యూనివర్సిటీలు విద్యాలయాలే కావచ్చు. కానీ అక్కడ రాజకీయాలు. విద్యార్థుల్లో కులతత్వం, మతతత్వం. ప్రొఫెసర్స్‌లో ఒకరంటే ఒకరికి గిట్టదు. పరస్పరారోపణలు. అక్కడ పరిశోధనలకు తగిన వాతావరణం లేదని నేను రీసెర్చి చేసే కాలంలోనే గ్రహించాను. అందుకే నేను పీహెచ్‌డీ కాగానే ఒక జాతీయ పరిశోధనా సంస్థలో చేరాను. ..............

మనిషి మనిషి ముందు సమానంగా ఉండాలనుకోవటం లేదు. తన ప్రగతికోసం ఉద్యోగి అధికారికి బానిస. ఉద్యోగి భార్య అధికారి భార్యకు బానిస. గతంలో బానిసలుండేవారు. వాళ్ళు కొంతకాలానికి స్వేచ్ఛకోసం తిరగబడేవారు. ఇప్పుడు స్వేచ్ఛగా ఉన్నవాళ్ళు బానిసలు కావాలని ఎగబడుతున్నారు. ఈ బానిసలెప్పటికీ తిరగబడరు. వీళ్ళు మరెందరినో బానిసలను చేస్తారు. వీళ్ళు ప్రమాదకరమైన బానిసలు. ..........

"మనదేశంలో విక్రమార్కు లిప్పటికీ లేరు. పాశ్చాత్య దేశాలు విక్రమార్కుడి సింహాసనాలు. ఇక్కడకు వచ్చిన

భారతీయులు విజాయితీని పెంపొందించుకుంటారు. సంస్కారాన్ని తెచ్చుకుంటారు. శక్తి సామర్థ్యాలకు మెరుగు పెడతారు. అహంకారాన్ని విసర్జిస్తారు. కృషిని నమ్ముకుంటారు. కాని ఈ లక్షణాలన్నీ సింహాసనం మీదున్నంతవరకే! వాళ్ళు తిరిగి భారతదేశం చేరుకోగానే యథాప్రకారం మారిపోతారు" అన్నాడు సత్యకీర్తి.

"సర్ - మీరు చెప్పింది నిజంకావచ్చు. ఈనిజం తెలుసుకున్న మీవంటి వాళ్ళు మనదేశం తిరిగివచ్చి మనవ్యవస్థను మార్చాలి." అన్నాను.

"లాభంలేదు. నేను విక్రమార్కుడ్ని కాను. మనదేశం విక్రమార్కుడి సింహాసనం కాదు. నేను దేశానికి తిరిగివచ్చినా విద్యార్థుల్లాగే మారిపోతాను."

"అయితే?"

"నువ్వు విద్యార్థుల గురించి చెప్పి నాకు మహోపకారం చేశావు. భారతదేశానికి వెడితే నేను విజ్ఞానశాస్త్రానికి న్యాయం చేకూర్చలేను. సైన్సుకు న్యాయం చేకూర్చలేనప్పుడు నావల్ల భారతదేశానికి ప్రయోజనముండదు. ఇక్కడుంటే నాకు సైన్సును సేవించుకున్న తృప్తి ఉంటుంది. నేను భారతదేశం తిరిగి వెళ్ళే ఉద్దేశం వదిలిపెట్టాను" అన్నాడు సత్యకీర్తి.

ఆయన మాటల్లో - విదేశాల నుంచి మాతృదేశాభిమానంతో, తమ విజ్ఞాన సంపదను దేశ శ్రేయస్సుకు పంచి పెట్టాలన్న కోరికతో - భారతదేశానికి తిరిగి రావాలనుకునే నాన్‌రెసిడెంట్ ఇండియన్సందరికీ హెచ్చరిక ఉంది. (వసుంధర, విక్రమార్కుడి సింహాసనం, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 10-6-'87, పే 28-31)

పరిశోధకరంగంలో గురుశిష్యులమధ్య ఏర్పడే వైరుధ్యాలను చిత్రించిన రచన 'అసతోమా సద్గమయ'.

"ఈ మధ్య నేను రాత్రింబవళ్ళు లాబరేటరీలో పడిన శ్రమంతా 'సాజీ ఎఫెక్టు' - బాబాయి జీవిత సర్వస్వం - తప్పని తేల్చుకోడానికి సరిపోయింది. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో తప్ప ఆ సిద్ధాంతం పనికిరాదు. దాన్ని సరిగ్గా సంస్కరించి ప్రచురిస్తే శాస్త్రజ్ఞులలో బాబాయికి మిగిలేది అపహాస్యమేకాని కీర్తికాదు. శిష్యుడిగా, కొడుకుగా నా కర్తవ్యమేమిటో చెప్పు" అన్నాడు.
................

"మామగారు జీవితమంతా శాస్త్రజ్ఞుడిగా జీవించారు. ఆయన మీమీద పెట్టుకున్న ఆశ అదే; మీకిచ్చిన ఆశీర్వాదం అదే! ఆయన మీకిచ్చిన సందేశమే అది. దాన్ని నెరవేర్చిననాడు ఆయన మీగురించి గర్వపడతారే తప్ప, అపార్థం చేసుకోరు. నాకింతకన్నా ఏమీ తోచడంలేదు" అన్నది. (విజయలక్ష్మీ రామకృష్ణన్, అసతోమా సద్గమయ, విజయలక్ష్మీ రామకృష్ణన్ చిన్నకథలు, పే 109-123)

విశ్వవిద్యాలయ స్థాయిలో విద్యావిధానం ఏరూపంలో ఉంటే పాలనాయంత్రాంగానికి అనుకూలమో, ఏ రకమైన వాతావరణం ఇబ్బందికరమో వ్యక్తీకరించిన రచన 'ది బిగినింగ్ ఆఫ్ ద ఎండ్'.

'అభ్యుదయం' పాఠశాలల పేర్లతో ఆధ్యాత్మిక చింతన్ని ప్రవేశపెట్టాం - సత్యసాయిలాంటి వాళ్ళనా విషయాల్లో సూపర్‌వైజ్ చెయ్యమన్నాం! కాళ్ళు తప్పటడుగులు వేసేప్పుడే వాళ్ళకు కర్మవాదాన్ని నేర్పమన్నాం. ............

పాఠ్యాంశాల్లోకి అలాంటి చాలు విషయాల్ని దూర్చకండి. బాబాల విభూతిని గురించీ, బ్రహ్మచారుల పలుకుబడులను గురించీ చిన్నతనంలోనే చెప్పండి - చిగురులోనే వంగుతారు.

ఎంత ప్రమాదకరమైన ప్రశ్నో ఏమన్నా ఆలోచించావుటయ్యా మంత్రీ! కార్మికుల్ని గురించి పాఠశాలల్లో చెపితే కథ అడ్డంతిరిగి ఊరుకుంటుంది.

మధ్యాహ్నం వాడేమీ తినటం లేదని విద్యాలయాల్లో చెపితే - మరి ఉత్పత్తి చేసిందంతా ఏమౌతుందని ఊరకే అడిగేస్తారు మనల్ని-- కార్మికుల పొట్టల్ని కొట్టి కాపిటలిస్టులు తింటున్నారంటే .... ఎందుకూరుకుంటారయ్యా వాళ్ళు..... యువకరక్తం గదా అది - చదివేదంతా సంపన్నుల పిల్లలే అయినా సంస్కారం వస్తుందయ్యా విద్యతో ...... చైతన్యంలేని విద్యను బోధిస్తేనే సాఫీగా పోతుంది సమాజం ......

క్రమశిక్షణ ఉల్లంఘించాడనే నెరంక్రింద కుర్రాళ్ళి డిస్మిస్ చెయ్యండి. కార్మికుల్ని గురించి ముందెవరైనా అడిగితే కఠినచర్యలు తీసుకుంటామనండి--(తేజోనిధి, ది బిగినింగ్ ఆఫ్ ది ఎండ్, ప్రజాసాహితి, మార్చి '81, పే9-13)

===============

## శ్రమ-ప్రతిభ-రిజర్వేషన్లు

శ్రమ, ప్రతిభ, రిజర్వేషన్లు ఈ మూడు తరచూ వివాదాస్పదం కావటం తెలుగుసాహిత్యంలో అధికంగా కనిపిస్తుంది. ప్రతిభకు సరైన నిర్వచనాన్నిచ్చే ప్రయత్నంలో ఈ మూడు కీలకపాత్రపోషిస్తాయి. నిజమైన ప్రతిభనుగురించిన చర్చ సృజన సాహిత్యంలో నిరంతరం సాగుతుండటం మనకు కనిపిస్తుంది. ఈ క్రమంలోనే రిజర్వేషన్ల విశ్వసనీయత పైన, శ్రమ ఔన్నత్యం పైన విభిన్న అభిప్రాయాలు వ్యక్తంకావటం గమనార్హం.

---------- అలా వెలువడిన భావాలలో మొదటిది శ్రమను కించపరుస్తూ, కేవలం పుస్తక పరిజ్ఞానమే నిజమైన ప్రతిభగా పరిగణించే సాంప్రదాయాన్ని వ్యతిరేకించటం.

రిజర్వేషన్లకు వ్యతిరేకంగా సేవ్ మెరిట్ స్లోగన్లతో జరిపిన నిరసనలవెనుక శ్రామిక వృత్తులను కించపరచటం కనిపిస్తుందంటూ

మీరేం చేసినా
ఊడ్చినా బూట్‌పాలిష్ చేసినా
రైల్వే స్టేషన్లలో బస్‌స్టాండ్లలో సామాన్లు మోసినా
తోపుడు బళ్ళలో పళ్ళమ్మినా
ఫుట్‌పాత్‌లపై వాచ్ అమ్మినా
షేవ్ మెరిట్ నుంచి సేవ్ మెరిట్ (Shove Merit/Save) అని
ప్లే కార్డులు పట్టుకొని
కాన్వెంట్ ప్రొఫెషన్ స్లోగన్ల ప్రొసెషన్లు తీసినా
మా సహస్ర వృత్తుల శ్రమైక జీవనం
మీ ప్రతిభకు సాటిరాదని చెప్పడానికేనని మాకు తెలుసు (వరవరరావు, దారుణాలు, దళిత మానిఫెస్టో, పే 22-28)

"ప్రతిభంటే కేవలం బట్టీకొట్టిన చదువేనాడు వక్రధర! మానవుని నిత్యజీవితంలో అణువణువునా అదొక అంతర్భాగమై నిలిచివుంది. అగ్రవర్ణాలనుండి అట్టడుగు వర్ణాలవరకు అందరూ మానవులే! మేధావులే! ప్రతిభావంతులే! మానవసమాజంలో సమాజవికాసానికి ఒక్కొక్కరు ఒక్కొక్కపని చేయడానికి పూనుకున్నారు. ప్రతివారికీ వారివారి పనుల్లో ఎంతో ప్రతిభవుంది.

ప్రతిభంటే కేవలం పాండిత్యమే కాదు." (క్రాంతికిరణ్, అనర్హత, ప్రజాసాహితి, డిసెంబరు'90, పే 53-57,59)

------------ఇందులో భాగంగానే శ్రమ ఔన్నత్యాన్ని చాటిచెప్పటం.

శ్రమజీవనం చేస్తూ సమాజంకోసం సంపదని ఉత్పత్తి చేసేవాళ్ళు, పాపకార్యాలు చేసేవాళ్ళూ, ఏశ్రమా, ఏ ఉత్పత్తీ చేయనివాళ్ళు, ఉత్పత్తి ప్రక్రియలకు దూరంగా వుంటూనే ఆ ఉత్పత్తిని అనుభవించేవాళ్ళు పుణ్యాత్ములూనా? ఎక్కువ తక్కువల్ని, తారతమ్యాలని తనే సృష్టించానని చెప్పేవాడు దేవుడా? దేవుళ్ళకూడా తక్కువ బుద్ధులుంటాయి కాబోలునన్న విభిన్న ఆలోచనస్రవంతులను చర్చకు పెట్టిన రచన 'ఉత్పత్తిమనుషులు'

స్కూల్లో చదివేటప్పుడు ప్రతిరోజూ గ్రౌండ్‌లో ప్రార్థన సమయంలో పిల్లల చేత - "ఈ దేశం నా జన్మభూమి. ఈ గొప్పదేశంలో పుట్టడం నాకు గర్వకారణం....." అంటూ ప్రతిజ్ఞ చెప్పించేవారు.

మనుషుల గుణాల్ని బట్టీ, తెలివితేటలు, శక్తి సామర్థ్యాలు, వ్యక్తివిశేషాలను బట్టీ కాక, పుట్టిన కులాన్ని బట్టీ గౌరవించడం కానీ, అగౌరవించడం కానీ చేసే దేశంలో పుట్టడం ఏ రకంగా గర్వకారణ మవుతుందో తనకి బోధపడేదికాదు. తన చిన్న సందేహాలని తీర్చలేని గురువులన్నా, పెద్దలన్నా తన మనసులో ఏమూలో అసహ్యం పేరుకుంది. ---------------

ఏ రకమైన శ్రమ, సృజనాత్మక కార్యకలాపాలకీ చోటులేని కులంలో పుట్టిన తనకి ఈ భిన్న ఆలోచనా ప్రవాహాలెలా వచ్చాయో తనకి తెలిసేదికాదు. ఏమైతేనేం, తాత, మేనమామల కర్కశ నిరంకుశ పాదాలకింద తన జీవితం బియ్యం, కొబ్బరి చిప్పలు, చిల్లర డబ్బులు ఏరుకునే బ్రతుకైపోయింది. (డి.ఆర్.ఇంద్ర, ఉత్పత్తి మనుషులు, కథ 96, పే 65-70)

------------ ప్రతిభ పేరుతో వర్ణాధిక్యతను ప్రదర్శించే తత్వాన్ని వ్యతిరేకించటం, కేవలం ప్రతిభకొంతమంది సంపదగా భావించటాన్ని సవాలుచేస్తూ అందుకు దారితీసిన పరిస్థితులను విశ్లేషించటం

"సార్ ప్రతిభ అనేది మన అగ్రవర్ణాల సొత్తు అనుకుంటాం కానీ, అది ప్రతిభకాదు. పూర్వంనుంచి మనకు పెద్దల ఆస్తిలా సంక్రమిస్తున్న ఎన్నెన్నో సామాజిక అవకాశాల ఫలితం. దాన్ని వినయంగా అంగీకరించక పోవడం మన కృతఘ్నత. ఆ ప్రతిభ ఏదో మన రక్తంలో ప్రవహిస్తూంది అనుకోవడం మన అహంకారం."

"ఈ రిజర్వేషన్స్‌వల్ల ప్రతిభ అన్నా నాశనమవుతుంటే, దేశం ఇంక ఎవిధంగా బాగుపడుతుంది" అన్నాడు శేషశాస్త్రి.

"మనం రిజర్వేషన్స్‌వల్ల కోల్పోతున్న ప్రతిభావంతుల కంటే అగ్రకులాల అధికారమూ, డబ్బూ, పలుకుబడివల్ల కోల్పోతున్న ప్రతిభావంతుల సంఖ్య చాలాచాలా ఎక్కువ....." (స్వామి, విపర్యయం, ఇండియా టుడే , మే 6-20,1997 పే 50-53)

------------ ప్రతిభ కేవలం కొన్ని వర్ణాలకిమాత్రమే పరిమితమైందిగా భావించే వ్యక్తుల భావజాలాన్ని నిరసించటం.

"ప్రతిభంటే మనకున్నది, వాళ్ళకు లేనిది, అలాగావెధవలకి లేనిది. వేదాంతచర్చలు, పూజాపునస్కారాలు చేస్తూ, ఆనందానుభూతి కోసం కాస్తంత మద్యం సేవిస్తూ, మనిషి జీవితపరమార్థమైన శృంగార కళని తనివంతగా పోషిస్తూ మనం ఉదాత్తంగా జీవిస్తున్న రోజుల్లో ఈ అలగా జనం ఏంచేస్తున్నారు? రొట్టూడుస్తూ, బట్టలుతుకుతూ, చెప్పులుకుడుతూ, మన పీతిళ్ళెత్తుతూ, మన పొలాలు దున్నుతూ, మొరటుగా బతికారు." (శంకర్, చెప్పులదండ, అరుణతార, అక్టోబర్/నవంబర్ '90, పే 18-22)

------------ ప్రతిభనుగురించి సాగిన విస్తృతమైన చర్చకు మూలం రిజర్వేషన్లు. ఐతే ఈ రిజర్వేషన్లపట్ల అనుకూలంగాను, వ్యతిరేకంగాను విభిన్నభావాలు వ్యక్తంకావటం సాహిత్యంలో కనిపిస్తుంది. రిజర్వేషన్లకారణంగా ప్రతిభకు అన్యాయం జరుగుతున్నదన్న వాదన ఒకవైపు, సామాజిక అసమానతల కారణంగా ప్రతిభకు జరిగిన అన్యాయంముందు ఇది లెక్కించదగినదే కాదన్న వాదన మరోవైపు రచనల్లో ప్రతిఫలించింది.

"ఇలా ఎందుకు జరిగిందో తెలుసా! రిజర్వేషన్లు ఉండటంమూలాన. వెనుకబడినవారికీ, షెడ్యూల్డ్‌కులాలవారికీ, ఎక్స్‌సర్వీస్‌మెన్ పిల్లలకీ, అంగవైకల్యం కలవారికీ, అటుతర్వాత నాన్‌లోకల్‌వారికీ సీట్లుపోగా మిగిలినవాటిలో మిగిలినవాటిలో నువ్వు నెగ్గలేకపోయావు. అంతే, నీతప్పేంలేదమ్మా నువ్వు బాగానే చదివావు. "---------------

సమర్థులని అసమర్థులుగానూ, అసమర్థులను సమర్థులుగానూ చేసి అర్హతలని తారుమారు చేసేసే ఈ వ్యవస్థని మార్చేదెవరు? ---------------

నిజానికి బడుగువర్గాల వారిలా ఉన్నా ఏమి చేసింది?

పట్టకోసం కొన్ని వర్గాలని అణచి, ఇంకొన్ని వర్గాలని తృప్తిపరచే తుగ్లకుల్లాంటి లీడర్లది తప్పు.............

అగ్రవర్ణాలవారి ఆక్రందనలు బడుగువర్గాలవారి ప్రగతికి పోహానాలే అవుతున్నాయి.

నాది తప్పు. నాలా అగ్రకులంలో పుట్టినవారిది తప్పు. (విజయలక్ష్మి మురళీధర్, దిద్దుబాటు, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 21-8-86, పే 52-56)

## ఇదే అభిప్రాయాన్ని మరో కోణంలో వ్యక్తంచేసిన రచన 'శాంతి చనిపోలేదు'.

"ఒకప్పుడు అజ్ఞానంతో, మూర్ఖత్వంతో అగ్రకులాలవాళ్ళు నిమ్నకులాలవాళ్ళని అంటరానివారుగా పరిగణించిన విషయం వాస్తవమే. అందుకే కులాల అంతరాలు తొలగిపోయి అందరూ కలిసి జీవించాలనే ఉద్దేశ్యంతో ఆనాడు రిజర్వేషన్లు కల్పించారు. నేడు మనం ఆ పరిస్థితికి చేరుకున్నాం............... అలాంటప్పుడు ఇంకా ఈ రిజర్వేషన్ లెందుకు?.........., రిజర్వేషన్లు లేనిదే ఏమీ సాధించలేమా? ఏ రిజర్వేషన్‌తో అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించే స్థాయికి ఎదిగాడు? ఏ రిజర్వేషన్‌ని ఉపయోగించుకుని జాషువా అంతటి ఘనకీర్తిని చేజిక్కించుకోగల్గాడు? ఏ రిజర్వేషన్ ఉంటే ఒక బోయవాడు వాల్మీకి కాగలిగాడు? మీకు చేతనయితే రిజర్వేషన్లు రద్దుచేయమని పోరాడండి..." తన ఎదమ్యూజియంలో పదిలంగా దాచుకున్న భావాల్ని తనదైన బాణీలో ఆవేశంగా చెప్తోంది భారతి. (కె.గిరిజాలక్ష్మి, శాంతి చనిపోలేదు, తెలుగు విద్యార్థి, అక్టోబరు1997, పే 37-39)

## ............ మరోవైపు రిజర్వేషన్ల ఆవశ్యకతను పేర్కొంటూ

స్వాతంత్ర్య స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్నా ఇంకా రిజర్వేషన్లు ఎందుకనే వాదన జరుగుతూ ఉంటుంది. కానీ ఒకసారి ప్రగతిపథంలో అడుగుపెట్టి ముందుకు నడిచినవాళ్ళు మాత్రమే అంచెలంచెలుగా అభివృద్ధి పొందగలుగుతున్నారు. కాని వెనుకబడే వుండి దారిద్ర్యరేఖ దిగువున ఉన్నవాళ్ళలో ఎంతమంది ప్రాథమికస్థాయి చదువైనా చదువుకో గలుగుతున్నారు? (శీలా సుభద్రాదేవి, అంగడి, తెలుగు విద్యార్థి, సెప్టెంబరు 1997, పే 35-36)

"కష్టి గురించి వస్తులే. ఆర్థికంగా కన్నా సామాజికంగా మనకెంతో సెక్యూరిటీ వుంది. ఆ సెక్యూరిటీవల్ల మనం ఎలాగైనా నిలదొక్కుకోగలం. ఈ వ్యవస్థవల్ల ఆర్థికంగా, సామాజికంగా నలిగిన ఎంతో మందికి మంచిపుష్ ఇస్తేగాని వాళ్లకి సంఘంలో సముచితమైన స్థానందాదు అనేది అసలీ రిజర్వేషన్స్ ఏర్పడటానికి ప్రాతిపదిక. సరే ఆ గొడవవదిలేద్దాం. గవర్నమెంట్‌వల్ల ప్రతిభకి అన్యాయం జరుగుతోందని  పించిన ఈ ప్రజలందరికీ, ఇలాపేపర్స్ అవుటవడంవల్ల మంచిస్తూడెంట్సందరూ ఎంతో కృంగిపోతారని పించడం లేదా?...అంటే ఏ సమస్యకీ మూలసూత్రాల జోలికి ఎవరూ వెళ్లలేరు. మెరిట్‌ని ఏ రూపంలో కొనడానికయినా సిద్ధపడే ప్రజలకి సరియైనచైతన్యంలేదని బాగాతెలుస్తోంది " (దాసరి శిరీష, అల, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 5-6-87, పే 48-49)

## ............వివరంగా శ్రమకు ప్రతిభకు గుర్తింపుకోరుతూ

"ఏరా ! నా ఆశయం తెలుసుగా? ఈ కుళ్ళిపోయిన వ్యవస్థను మార్చాలి. ప్రతిభకు విలువలేని ఈ దేశాన్ని మార్చాలి. శ్రమ శక్తికి గుర్తింపులేని ఈ సమాజాన్ని మేల్కొలపాలి. అందరికీ అన్నం పెట్టలేని ఈ అన్నపూర్ణను ఆరెయ్యాలి. సంఘంలో గౌరవంగా చెలామణీ అయ్యే దోపిడీదార్లను ఉతికెయ్యాలి. ఆర్థిక అసమానతలను తొలగించాలి. కులం పిచ్చిగాళ్ళతో కుళ్ళిపోయిన ఈ నాగరిక సమాజాన్ని తగలబెట్టాలి!" ఆవేశంతో ఊగిపోతూ ఉపన్యాసం దంచాడు."..........

"హుం! విజ్ఞానం ఉందని అహంకారంతో ఊగిపోతారే తప్ప - ఇంత ఇంగిత జ్ఞానాన్ని సంపాదించుకుంటే - ఇలా కష్టాలు పడరు. అసలు చదువుకు, సంపాదనకు సంబంధం ఎందుకుండాలి. (వియోగి, విరుచీపం, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 18-10-89, పే 57-61)

## ప్రతిభ కుల, మతాలకు అతీతమైనదని చాటిచెప్పే ఉన్నతసంస్కారంగలిగిన ఒక ఉపాధ్యాయుని జీవితచిత్రమే 'అగ్నిహోత్రుడు'

"సభకు నమస్కారం! ఈ వేదికపైన ఉన్న వెంకటాద్రి అనే యువకుడు చిన్నప్పట్నుంచి నాకు బాగాతెలుసు. ఇతని తల్లిదండ్రుల్నికూడా నేనెరుగుదును. ఇతని తల్లి రమణమ్మ మాఇంట్లో పనిచేసేది. ఇతని తండ్రి మార్కండేయులు ఓ రిక్షా తొక్కుతూ తన కుటుంబాన్ని పోషించేవాడు."

వెంకటాద్రికి ఒళ్ళు మండిపోతోంది. తమ చరిత్ర ఈ పెద్దమనిషి కెందుకు?

"నిజానికి ఈ వేదికపైన కూర్చోవాల్సిన అర్హత నాకూ, మా సారథికంటే.... ఈ వెంకటాద్రికీ, ఇతని తండ్రికి మాత్రమే ఉంది. రిక్షావాడి బిడ్డగా పుట్టి ఐ.ఏ.ఎస్. కి సెలక్టయిన ఈ వెంకటాద్రి గొప్పవాడా? ఓ లెక్చరర్ బిడ్డగా పుట్టి ఐ.ఏ.ఎస్. కి సెలక్ట్ అయిన ఈ సారథి గొప్పవాడా? ఇకపోతే.... ఓ లెక్చరర్‌గా జాబ్‌చేస్తూ నా బిడ్డని ఆఫీసర్ని చేశాను నేను. రిక్షాతొక్కుతూ తన బిడ్డని ఆఫీసర్ని చేశాడు మార్కండేయులు. తండ్రులుగా ఇద్దరిలో ఎవరు గొప్పవాళ్ళు?" అంటూ గబుక్కున వేదికదిగి వెనుకభాగంలో నిలబడి ఉన్న మార్కండేయుల్ని వేదికపైకి తీసుకొచ్చాడాయన.

"జీవితంలో నేను ఏనాడూ పొందనంత ఆనందం.... ఈ తండ్రీ కొడుకుల్ని చూసి పొందుతున్నాను. ప్రతిభఅనేది కులాతీతమైందని చెప్పడానికి వీళ్ళిద్దరే సజీవసాక్షులు. ప్రతిభని గుర్తించి ప్రశంసించడానికి కులమత ఆర్థిక వ్యత్యాసాలు

అఘ్నుగోడలు కాకూడదు. ఈ తండ్రి కొడుకుల్ని అభినందిస్తూ... నిరుద్యోగిగా నేను ఎన్నాళ్ళున్న రోజుల్లో కూడా అమ్ముకోని నా గోల్డుమెడల్ని వీళ్ళకి బహూకరిస్తున్నాను" అంటూ ఆనందభాష్పాల్ని తుడుచుకుంటున్న రామచంద్రమూర్తిని చూసి సభ విస్తుపోయింది. అగ్నికి కాలుష్యాన్నంటగట్టిన వెంకటాద్రి శిలలా బిగుసుకుపోయాడు. (వీరపల్లె వీణావాణి, అగ్నిహోత్రుడు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 3-2-'88, పే 33-35)

--------------- అధ్యాపకవృత్తిని వ్యాపారంగా మార్చి, పేదవిద్యార్థులకు అన్యాయంచేసే ఉపాధ్యాయులపైన ఒక సెటైర్‌లాంటి రచన 'చంద్రునికో నూలుపోగు' ఇందులో పేదవిద్యార్థులు ఉపాధ్యాయుని బాధ్యతారాహిత్యాన్ని ఒక సన్మానపత్రంద్వారా తెలియచేయటం విశేషం.

"పరాత్పరరావు అధ్యాపకవృత్తిలో కాకలు తీరినయోధులు. చదువు 'కొనే'వారికి కల్పతరువు. ఖరీదుగా విద్యాదానం చేయుటంలో అందెవేసినచేయి.

ఆయన కనిపించనికాలం: అధ్యాపకుల సమ్మె ప్రారంభమైన రోజున అదృశ్యమై తిరిగి విరమించిన రోజువరకు.....

కనిపించకపోవడానికి కారణం: రోజుకు పద్దెనిమిది గంటలపాటు ఖరీదైన విద్యాదానం చెయ్యడానికి.... చదువు 'కొనుక్కు'నే'వారికి సంపూర్ణంగా న్యాయం చెయ్యడానికి.....

అత్యంత ప్రియమైనవి: "టైమ్ ఈజ్ మనీ. ఆలస్యం అమృతం విషం. దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకో. ధనమూల మిదం జగత్" అన్న లోకోక్తులు.

ఆచరించేవి: 'కాసులేనికి కోసెడు దూరంలో వుండు. దుడ్డులేని వాడిని చివరకు కూడా పడవ ఎక్కనివ్వవద్దు... దయకన్నా ధనమేమిన్న' అనే వారు నిత్యం స్మరించే మూడు మహామంత్రాలు.

కార్యదీక్షాపరత్వం: సమ్మెకు సార్థకత చేకూర్చే సందర్భంలో ప్రభుత్వం గురించిగానీ, సిలబస్ గురించిగానీ కాలేజీ విద్యార్థులు ఎవరడిగినా సమాధానం చెప్పని, నూటికి నూరుపాళ్ళు ఆచరించిన అకుంఠిత కార్యదీక్ష.

పేద విద్యార్థులకు ఇచ్చే ప్రోత్సాహం: కష్టపడి చదువుకుని పాసవుదామనుకున్న ఓ పేదవిద్యార్థి పరాత్పరరావుగారి కరుణా కటాక్షాలకు నోచుకోక వారివద్దకు ట్యూషన్‌కు వెళ్ళే స్తోమతలేక, సమ్మెఫలితంగా తప్పడంతో, ఓ విద్యాసంవత్సరాన్ని కోల్పోయాడు. సంవత్సరంవరకు రావలసిన ఉపకారవేతనం ఆగిపోయి కడుపునింపుకోవడానికి అతను వ్యవసాయకూలీగా అవతారం దాల్చడానికి వారు అపూర్వ అవకాశం ఇచ్చారు.

ప్రస్తుతం ఆడంబరాలకు, అధికారవ్యామోహాలకు, అందలాలు మోసే మనస్తత్వాలకు ఘనసన్మానం జరుగుతున్న యీ సమయంలో మా పేద విద్యార్థుల తరఫున చంద్రునికో నూలుపోగు! ఆదిత్యునివంటి ఆచార్యునికి ఓ చిరుదీపం! కుబేరునికి యీ కుచేలుడు సమర్పించుకునే చిరుకానుక!!!! (సూర్యప్రసాదరావు, చంద్రునికో నూలుపోగు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 27-4-98, పే 22-25)

==============

## వ్యాపారాత్మక విద్య

విద్య వ్యాపారాత్మకం కావటం నూతనఆర్థికవిధానాల ఫలితంగా భారతదేశ విద్యారంగంలో చోటుచేసుకుంటున్న గుణాత్మక పరిణామం. ఈ పరిణామాల ఫలితంగా విద్యావ్యవస్థలో వివిధ స్థాయిలలో అనేక దుష్ఫలితాలు సంభవిస్తున్నాయి. ఈ విపరీతపరిణామాలు తెలుగుసాహిత్యంలో ప్రధానవస్తువులైనాయి. ఐతే విద్య ప్రైవేటీకరణచెందటం ఫలితంగా సంభవిస్తున్న విపరీత పరిణామాలను ప్రాథమిక స్థాయిలో చిత్రించినంతగా, మాధ్యమిక స్థాయిలో చిత్రీకరణ జరగలేదు.

విద్య వ్యాపారాత్మకం కావటం వివిధస్థాయిలలో

------------ నర్సరీస్థాయిలో జరిగే వ్యాపారం : నిరసన

------------ విద్యా వ్యాపారాన్ని నిరసిస్తూనే, అదే చదువును కొనసాగించే బలహీనత

------------ పాఠశాలల వ్యాపారం వెనుకగల అసలు స్వరూపాన్ని చూసి నిరసించటం

------------ విద్యావ్యాపారం కారణంగా దిగజారుతున్న విలువలు.

------------ విద్యావ్యాపారంలో సమిధలౌతున్న బాలలు

------------ బోధనావిధానం కారణంగా దెబ్బతింటున్న సృజనాత్మకత

------------ ఆంగ్లమాధ్యమానికి ఏమాత్రం తీసిపోని వైకల్యాలుగల తెలుగు పాఠశాలలు

నర్సరీ స్థాయిలో ప్రవేశానికే తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతిబింబించిన రచన 'చదువు'. విద్యా వ్యాపారాన్ని నిరసిస్తూ నర్సరీ పాఠశాలలను బహిష్కరించాలనే తల్లిదండ్రుల నిర్ణయం ప్రధానంగా ఈ రచన సాగుతుంది.

"ప్లీజ్ హోల్డ్ యువర్ టంగ్! నేను మిమ్మల్ని ఇంజనీరింగు సీటో, మెడిసిన్ సీటో ఇమ్మనటంలేదు. కేవలం రెండో

క్లాసులో సీటిమ్మన్నాను. దానికెంత ఆర్భాటం చేస్తున్నారు! ప్రతిభను ప్రోత్సహించటంకాదు. అసలు గుర్తించటమే మీకు తెలీదని నాకు అర్థమైంది. ఫీజులు స్కూలు స్టాండర్డ్‌కు కొలబద్ద కాదన్న సంగతి తెలుసుకోండి. మావాడికి చదువు రాకపోయినా పర్లేదు కాని ఇలాంటి స్కూళ్లోని చదువొద్దు! ఈ కుసంస్కార వ్యాపార పటాటోపాలూ వద్దు! మీకూ, మీసీటుకూ, మీస్కూలుకూ ఓ నమస్కారం!" స్లిప్ అతడిమీదికి విసిరేసి వచ్చేశాం. (సింహప్రసాద్, చదువు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 22-9-'97, పే 24-25)

పిల్లలకోసం తమ స్వంత ప్రయోజనాలను త్యాగంచేసేందుకు సిద్ధపడే తల్లిదండ్రుల బలహీనతలను సొమ్ము చేసుకునే ప్రైవేటుపాఠశాలల వ్యాపార సంస్కృతి ప్రతిఫలనమే 'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్‌స్టార్'.

సుబ్బారావు మనస్సులో ప్రతిజ్ఞ చేసుకొంటున్నాడు. 'నాకొడుకు కళ్ళలో ఆ మెరుపు, ఆ ఆనందం శాశ్వతంగా నిలిచేందుకు నేను ఎంత కష్టమైనా పడతాను. ఎంత అవమానమైనా భరిస్తాను. కాని నాకొడుకు భవిష్యత్తుని నాదారిద్ర్యానికి బలి చేయను. ఎట్టి పరిస్థితుల్లో కూడా' అని!

వెంకటలక్ష్మిలో కూడా అవే భావాలు కదలాడుతున్నాయి. తల్లిదండ్రుల ఆ బలహీనతలే విద్యా వ్యాపారస్థులకు మూలధనం అని వారికి తెలియదు. ఆమె ఏదో తీవ్రంగా ఆలోచిస్తూ లేచి వంటింట్లోకి వెళ్ళింది. దేవుడిపటానికి దణ్ణం పెట్టుకొని లెంపలేసుకొంది. దీపాలోపలిలో మునిగున్న భర్తదగ్గరకెళ్ళి మౌనంగా అతనిచేతిలో మంగళసూత్రాలుంచింది. చివాల్న తలెత్తిన సుబ్బారావుకి, బోసిపోయిన మెడలో పసుపుతాడు ... దానికి వేలాడుతున్న పసుపుకొమ్ము కనబడ్డాయి......

కొడుకు ఆడుకొంటూ తనలో తను "ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్ .........హౌ ఐ వండర్ వాట్ యూ ఆర్?" అని పాడుతున్న రైమ్‌ని విన్న సుబ్బారావుకి మెల్లమెల్లగా జ్ఞానోదయం అవుతోంది. అది నిగూఢమైన సందేశం ఏదో అందిస్తున్నట్లు అనిపించసాగింది. అది తమవంటి పేద తల్లిదండ్రులకోసమే రాయబడినట్లుగా కూడా అనిపిస్తోంది. ఎందుకో మరి...? (సి.హెచ్.వెంకటేశ్వరరావు, ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 10-4-'96, పే 7-9)

ప్రైవేటు విద్యాసంస్థలు జలగల్లా మనుషులను పట్టి ఎలా పీల్చుకుతింటాయో 'గుడిసె ఏసోబు'లో సమగ్రంగా మనకు కళ్ళకు కడ్తుంది. తమ శ్రమతో రూపొందిన కాన్వెంట్‌లో తమ పిల్లలకే ప్రవేశం దొరకని పరిస్థితి ఈ రచనలోని విషాదకర పరిణామం. మైనారిటీ విద్యాసంస్థలు మైనారిటీ ప్రయోజనాలను దెబ్బతీస్తూ ఉన్నతవర్గ ప్రయోజనాలనే కాపాడే నైజం, విద్య వ్యాపారంగామారేక్రమంలో చోటుచేసుకునే ఒక విషపరిణామంగా 'గుడిసె ఏసోబు' చిత్రించింది.

కానీ తీరా కాన్వెంటు కట్టటం పూర్తయ్యాక మా పిల్లల్ని చేర్చుకోవాలంటే ... అదేదో ఫీజు కట్టమన్నారు. కొత్తబట్టలు కుట్టియాల, బూటుకావాల అన్నారు ఆ పెద్దమ్మగోరు. ఇంకా మాపిల్లల కోసం మేం యింగిలీసులో మాట్లాడాలట. అట్లసేత సదివించి, అట్లకురాని అచ్చరాలు యింటికాడ మేం సెప్పాలంట. యియ్యన్నీ మాకు సాధ్దిమయ్యే పన్లేనా? లేకపోతే సీటియ్యరంట.

ఇప్పుడా కాన్వెంటులో వున్న పిల్లల్లో దాదాపంతా గొప్పోళ్లపిల్లలే. బాపన దొరలుగారి పిల్లలు, కరణంగారి పిల్లలూ, మునసబ్బిల్లూ, రెడ్డిగారి పిల్లలూ, కోమటోరిపిల్లలూ, అంతా అట్లాగాని మా లేబరోళ్ల పిల్లలే లేరు. మేం తీసిన పునాదులు, మేం ఎత్తిన బండలు -- అన్నీ మాకు యిసమయ్యాయి.

"ఇదుగో మాదిగా -- ఈ కాన్వెంటులో చేరాలంటే -- ముందుగా ఎడ్మిషన్ ఫీజు కట్టాలి. డ్రస్ కుట్టించాలి. బూట్లు, టై కొనాలి. కనీసం మీకు సైకిలన్నా వుండాలి. పిల్లలకి యింటిదగ్గర ఇంగ్లీషు నేర్పాలి. మాథ్స్, సైన్స్‌కూడా చెప్పగలిగి వుండాలి. ఇవన్నీ మీవల్లకాదు. ఇవన్నీ సాధ్యంకానప్పుడు ఈ కాన్వెంటులో చదువుకోవడం ఇంపాసిబుల్. మీలాంటి వాళ్ళకు అడ్మిషన్ యిస్తే పిల్లలు ఫెయిల్ అయ్యి కాన్వెంటుకి బాడ్‌నేమ్ తెస్తారు. అయినా ప్రస్తుతం -- అన్ని సీట్లు ఫుల్ అయ్యాయి. ఇప్పుడు ఖాళీల్లేవు."

"అమ్మ, అమ్మ.... మీకాళ్ళు మొక్కుతా అంతమాటనకు తల్లి. దయసూడు తల్లీ...." అర్థమైంది నాకు.

"అమ్మా ..... పెద్దమ్మగోరు... కాస్త దయసూపండమ్మా.... నేనమ్మా యేసోబుగోణ్ణి. సామిలోరి మతపోణ్ణి తల్లీ.... ఈ కాన్వెంటు మా పిల్లలకోసమే అన్నారుగా తల్లీ ఆయేల? మీరు కూసున్నగది మేం కట్టిందేనమ్మా.... అమ్మా పెద్దమ్మగోరు.... మేం మతపోళ్లమే తల్లీ! ..... బీదోళ్లమమ్మా!!.... నా మాట ఆలకించినవాళ్లేలేరు.

గేటు పోలీసుగాడు నన్ను బైటికితోసి గేటు మూసిండు. (గుడిసె ఏసోబు, మా కాన్వెంట్, దళితకథలు, పే 13-16)

"కాన్వెంట్లలో చదువు బాగా చెప్తారనుకుంటాను, కదు?" అన్నాడు శివకామయ్య

ఆదేదో మెచ్చుకుంటున్నాడనుకొని గోతిలో పడ్డాను. "ఆ! మరి అందుకేగదా, వాళ్ళు ఫీజులకిందా, పుస్తకాలకిందా, యూనిఫారాలకిందా, ఆఖరికి బూట్సుకింద బోలెడు కుమ్మరింపచేస్తున్నాసరే కిక్కురుమనకుండా భరిస్తున్నాం!" అన్నాను.

"చివరిదాకా ఇలా ఇంగ్లీషు చదువుకుంటూ పోతే ఏమోగాని; ఇప్పుడుమాత్రం మావాడు; తెలుగు సుబ్బరంగా

మర్చిపోయేటు. ఇహా ఇంగ్లీషు లాగా! వాడాతిని మాటలన్నీ ఇంగ్లీషు మాటలే; భాష మాత్రం ఇంగ్లీషుకాదు!"

"నువ్వేం అలా అయిపోనక్కర్లేదు. ఇంగ్లీషు స్కూళ్ళు మన్ని పాడుచేస్తున్నాయి. నిజమే. కాని తెలుగు స్కూళ్ళు క్రమశిక్షణలేక, సదుపాయాల్లేక, శ్రద్ధగా, కరెక్టుగా పాఠం చెప్పగలిగే టీచర్లు తక్కువై, మరింత ఘోరంగా ఉన్నట్లున్నాయి. ఆ "దుంపలబడి"లో నేను చదవను మొర్రో అని గోలపెట్టింది మా అమ్మాయి. అందుకని-- (భరాగో, స్కూల్ ఆఫ్ థాట్, కులాసాకథలు, పే45-47)

ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థుల ప్రవేశానికి తల్లిదండ్రులు పడే ఇబ్బందులు పైరచనల్లో ప్రతిఫలిస్తే, ఆ పాఠశాలల్లో ఉపాధ్యాయుల దయనీయస్థితిని చిత్రించిన రచన 'యస్....మిస్'. చాలీచాలని జీతంతో తను చేసే ఉద్యోగంలోకూడా విద్యార్థుల భవిష్యత్తుపట్ల ఆశావహ దృక్పథంతో పనిచేసే వ్యక్తిగా ఇందులోని ఉపాధ్యాయురాలు నిలుస్తుంది.

"శ్రీ వెంకటేశ్వరా గ్రీన్‌లాండ్స్ ఇంగ్లీష్ మీడియం స్పెషల్ కాన్వెంట్ హైస్కూల్"

'అబ్బబ్బ! ఏమిటీ పొడుగుపేరు బాబూ..... తెలుగు మీడియం స్కూలులాగ' అనుకుంది.

'ఎనిమిది వందలమీద సంతకం పెట్టి.... నాలుగువందలు తీసుకొనే ఈ ఉద్యోగం చెయ్యటం కన్నా అమ్మ చూపెట్టిన సినిమా గేటుకీపర్ అప్పలరాజుని పెళ్ళి చేసుకోడమే నయం' అని గొణుక్కుంది కల్పన. స్కూలు యాజమాన్యం మీద, హెచ్.ఎమ్ మీద, సొసైటీ మీద, ఎదురుగా ఉన్న పిల్లలమీద కల్పనకు తిరుగులేని కోపం వచ్చింది!

"రెక్కల కష్టంపెట్టి, ప్రయివేటుస్కూల్లో సిమ్మాచెలం లాంటి కష్టజీవి పోలయ్యని ఎందుకు చదివిస్తున్నట్టు? పెద్దయినాక వాడికి పెద్దఉద్యోగం రావాలనేగా.' క్లాసుకి తిరిగివస్తున్న మిస్ కల్పనకు లోపల గుండెల్లో సముద్రంలాగ కల్లోలం చెలరేగింది. పెళ్ళయ్యేదాకా కాలక్షేపంగా లోకం మొహం కప్పటానికి చేసే పెదవ్యుద్యోగం కాదన్నమాట! టీచరు.

"రేపటి మనసమాజం యొక్క జాతకాలు తరగతి గదుల్లోనే రాయబడతాయి. తరగతిగదుల్లో కూర్చున్న విద్యార్థుల చేతి రేఖలుగారు. వారికి లభించే శిక్షణ దేశ సౌభాగ్యాన్ని ముందుగానే నిర్దేశిస్తుంది." అని అన్న మహానుభావుడెవరో -- అతనికి చేతులెత్తి నమస్కరించాలనిపించింది కల్పనా టీచరుకు. (వీరాజీ, యస్...మిస్, వీరాజీ కథలు, పే 226-232)

పై రచనలన్నీ పాఠశాలల ప్రైవేటీకరణవల్ల కలిగే దుష్ఫలితాలను చిత్రిస్తే, పిల్లలకు బాల్యాన్ని దూరంచేస్తున్న ప్రైవేటు విద్యావిధానాన్ని చిత్రించిన రచన 'మామిడిచెట్టు మళ్ళీపూసింది'

పిల్లలు దగ్గరికొచ్చారు. అందరూ ఒకే డ్రెస్ వేసుకొన్నారు. పక్క ఊళ్ళో కాన్వెంటు పెట్టారని తెలుస్తూనే ఉంది. పిల్లలు క్రమశిక్షణగల సైనికుల్లా నడుస్తున్నారు గానీ వాళ్ళ మొహాల్లో బాల్యం కన్పించటంలేదు. నా కెందుకో చాలా బాధ అన్పించింది. వీళ్ళకి ఈ చెట్లని చూసినా, ఈ పొలాల్ని చూసినా ఏమీ అన్పించదా? వీళ్ళు ఆటలాడుకోరా? ప్రపంచం ప్రకృతికి దూరమైపోతున్నదా? నా చిన్నప్పటి స్నేహితులు గుర్తొచ్చారు. వర్షంవాం ఎప్పుడూ చిరిగిన లాగూలే వేసుకొచ్చే వాడు. అయినా వాడి మొహంలో ఎంత ఆనందం కన్పించేదని! చెట్టెక్కి ఆ కొమ్మమీదనుంచి ఈ కొమ్మమీదకి గెంతేవాడు. కాన్వెంటు పిల్లలందరూ వెళ్ళిపోయారు. .............

స్కూలు వదిలే సమయమది. బ్యాగులు తగిలించుకొని వస్తున్న ఆపిల్లలు బస్తాలు మోస్తున్న కార్మికుల్లా ఉన్నారు. వాళ్ళు అన్ని పుస్తకాలు మోస్తున్నారు. చెట్టుకి దూరంగా వెళ్ళి కూర్చున్నాను. నాకు చాలా కుతూహలంగా ఉంది. పిల్లలు చెట్టుకింద ఆడుకోకపోవటం నాకిప్పటికీ వింతగా ఉంటుంది!

ఆ పిల్లలది అదే నడక. కనీసం చెట్టుకేసైనా చూట్టంలేదు. పిల్లలు చెట్టు దాటిపోయారు. నాకు బాధవేసింది. వెళ్ళి మీకు ఆటలు రావా అని కోపంగా అడగాలన్పించింది. వేగంగా అడుగులేసి బాబూ అని పిల్చాను. చివర్న నడుస్తున్న కుర్రాడు ఆగాడు. పదేళ్ళుంటాయి. మీరు ఆటలాడుకోరా అని అడిగాను. స్కూల్లో డ్రిల్లు చేస్తామని చెప్పాడు.

మామిడిచెట్టు మళ్ళీ పూసింది. చెట్టుకేసి చూపించి దానిని చూస్తుంటే నీకేమీ అన్పించటంలేదా అని అడిగాను. కుర్రాడు అమాయకంగా చూసి తలుపూపి పరుగెత్తాడు. (శాంతారామ్, మామిడిచెట్టు మళ్ళీ పూసింది, యువ, జనవరి'87, పే 8-12)

వ్యాపారదృక్పథంతో వెలిసే పాఠశాలల అసలు స్వరూపాన్ని, పాఠశాలలు వ్యాపారమయం కావటంవెనుక గల మూల కారణాలను విశ్లేషించిన రచన 'పెరటిచెట్టు'. పాఠశాలల స్థాపనవెనుక వ్యాపారమే ప్రధానభూమిక వహించడం, ఫలితంగా పాఠశాలల్లో ప్రమాణాలు లోపించటం ఇందులో చిత్రించారు. జీవితంలో ఎందుకూ కొరగానివ్యక్తులే చివరకు విద్యా వ్యాపారాన్ని జీవనోపాధిగా ఎంచుకోవటం విద్యారంగంలో విపరీతధోరణులకు ప్రధానకారణంగా ఇందులో చూపించారు.

"ఓహ్హో! అయామ్ సారీ! చూడండి. జంటనగరాలలో విపరీతమైన డిమాండ్ ఉన్న స్కూల్ మాది. ఇక్కడ అడ్మిషన్ కావాలంటే కనీసం మూడు సంవత్సరాలముందు, లేక మీ మిసెస్ ప్రెగ్నెంట్ అయిన వెంటనే మీపేరు రిజిస్టర్ చేయించుకుని ఉండాలి. అప్పటికప్పుడు కావాలంటే మాదగ్గర అడ్మిషన్స్ దొరకవు. అయామ్ రియల్లీ సారీ...." తలవంచుకుని తనపనిలో

మునిగిపోయాడు ప్రిన్సిపాల్. ....................

"ఆఁ.... ఈ స్కూల్‌కు అంత డిమాండ్ ఉన్నదా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు వెంకట్రావు.

"ఉండబట్టే గదా మేమిక్కడ ధావటం. ఈ స్కూల్లో ఫస్ట్‌క్లాస్ చదివినా ఒకటే, ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మే చదివినా ఒకటే" అన్నాడావ్యక్తి.

"చూడండి! మేము స్కూల్లో మీపిల్లవాడికి ఎలా ట్రైనింగ్ ఇస్తామో, ఇంటి దగ్గర మీరు వాడిని రెండింతలు బ్రెయినప్ చెయ్యాలి. అందువలన మేము పిల్లవాడి తల్లిదండ్రులను ఇంటర్వ్యూ చేస్తాము. నో.... మా కోచింగ్ స్టాండర్డ్‌కు తగినట్లు విద్యార్థుల తల్లిదండ్రులుండాలి. అది లేనట్లే వారి పిల్లలకు మా దగ్గర సీట్లు దొరకవు. వెళ్ళండి." అన్నాడు మెంబర్. ..........

"అదంతా పెద్ద కథ. నా చదువుకు ఎక్కడా ఫ్యూన్ ఉద్యోగం కూడా రాలేదు. ఈ సిటీకి పారిపోయి వచ్చి రకరకాల పనులు చేశాను. హోటళ్ళలో కప్పులు కడిగాను. ఇళ్ళల్లో అంట్లు తోమాను. బట్టలుతికాను. చివరకు ఒక మార్వాడీ సేఠ్ పిల్లలను రోజూ ఉదయం స్కూల్‌కు తీసుకువెళ్ళి సాయంత్రం ఇంట్లో దిగబెట్టే రిక్షా తొక్కడానికి పని కుదిరింది. అర్థంపర్థంలేని పెద్దపెద్ద పేర్లున్న ఇంగ్లీష్ మీడియం కాన్వెంట్ల పట్ల తల్లిదండ్రుల మోజు, పోటీలుపడి డొనేషన్స్ కడుతున్న తీరు నా భవిష్యత్తుకు మార్గం చూపాయి. వాళ్ళ బలహీనతను సొమ్ము చేసుకోవాలనుకున్నాను. ఫలితమే బూస్టర్ ఇంగ్లీష్ అకాడమీ. నిజానికి దాని అర్థంకూడా నాకు తెలియదు.................... "

"కలెక్టరాఫీసులో గుమాస్తాగా పనిచేస్తున్నాను. ఒరే గన్నయ్యా! నీతో గడిపిన ఈ కొద్ది సమయంలో నాకు రెండు జీవిత సత్యాలు తెలిశాయి. ఒకటి జీవితంలో పైకి రావాలంటే చదువు తెలివితేటలు ఒక్కటే చాలవు. మనకు కనిపించని అదృష్టం ఏదో మనకు సాయపడాలి. రెండు పెద్దపెద్ద పేర్లున్న కాన్వెంట్లలో చదివిన వారంతా గొప్పవారు కాలేరు. అందుకు నువ్వే సాక్ష్యం. నిజానికి మాఅబ్బాయి అడ్మిషన్ కోసం వచ్చాను. ప్రిన్సిపాల్ స్థానంలో నిన్ను చూసిన తర్వాత నిర్ణయం మార్చుకున్నాను. వస్తాను" అని బయటకు వచ్చాడు వెంకట్రావు. (ఐలాపురపు మురళీమోహన్, పేరులేదెట్లు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 21/27-12-'94, పే 54-56)

విద్యావ్యాపారంలో మానవసంబంధాలకు, మానవతావిలువలకు తిలోదకాలివ్వటం సాధారణమైపోవటాన్ని సునిశితంగా చిత్రించిన రచన 'కలుపు మొక్కలు'

"గోపాలం నువ్ ఎంత డబ్బుపోసి అక్షరాలు నేర్చుకున్నావ్. ఏమిద్యావని అనాథవైన నిన్ను చేరదీసి నీ ఆలనా పాలనా చూశారు మన ఊరివాళ్ళు. వారానికోరోజు నువ్వు చదువుకొని స్థిరపడేంతవరకూ పోషించిన కుటుంబాలు ఏమాశించాయి? ఏ బంధంవల్ల ఈ సమాజం నిన్నుమొన్నటి వరకు నీ బాధ్యతను భరించింది. ఆలోచించు. డబ్బు మనిషికి అవసరమే. ఆకలి తీరను మెతుకులు కావాలి. డబ్బుతో కొనలేనివి చాలావున్నాయి. తల్లి... తండ్రీ... గురువు. ఈ అమ్మాయి డాక్టర్ కావాలనుకుంది. డాక్టర్ని అవసరం లేకపోయింది.

రైల్లో రిజర్వేషన్‌తో గమ్యంచేరాలని కొందరనుకుంటే. కూర్చోను చోటులేకున్నా నిలబడో వేళ్ళాడో గమ్యం చేరేవాళ్ళు వుంటారు. గమ్యంచేరాక అంతా దిగాల్సింది భూమ్మీదే. పోవాల్సింది భూమ్మీదే. పదమ్మా!" అంటూ ముందుకుసాగిపోయాడు మాస్టారు. కలుపుమొక్కలు అసలుమొక్కల్లానే వాటిమధ్యే కలిసివుంటూ వాటిఆహారాన్ని తింటూ వాటిని ఎండగడుతుంటాయి. అందుకే సరైనరైతు వాటిని పీకి పారేస్తుంటాడు. చూసిన సత్యచిత్రం మనసులో కదిలి "జనం మదిలోని కలుపుమొక్కల్ని పీకే చదువులూ చెప్పాలి" అనుకున్నాడు బస్సులోకూర్చున్న మాస్టారు. (వారాల కృష్ణమూర్తి, కలుపుమొక్కలు, ఆంధ్ర భూమి సచిత్ర వారపత్రిక, 5-3-'92, పే 48-49).

"అసలీ చదువులేమిటి.... ఈ పరీక్షలేమిటండీ బాబూ.... మూడుసంవత్సరాలు నిండీ నిండకముందే యల్కేజీలూ, కిండర్‌గార్టెన్‌లంటూ పసిగుడ్డును కర్కశంగా కాన్వెంట్లకు పంపటం ఎప్పుడుమానుకుంటారో..... అప్పుడు....అప్పుడు బాగు పడతారు పిల్లలూ, తల్లిదండ్రులూ కూడా" చెప్పాడు మురళి.

"చదువు అంటే సర్టిఫికెట్లయిపోయింది. పిల్లవాణ్ని ప్రమోట్‌చేయటమే పరీక్షల ప్రధాన లక్ష్యం అయిపోయింది" అని నిట్టూర్చాడు శంకర్.

ఎలాగోలా పిల్లల్ని ప్రథమ శ్రేణిలో పాస్‌చేయటం, ఆటు తర్వాత వాళ్ళ ఫోటోల్ని, వివరాల్ని పత్రికల్లో ప్రకటించి తద్వారా తమతమ కాన్వెంట్లకూ, కాలేజీలకూ డిమాండ్ పెంచుకోవటం తప్ప చదువు ఎవరుచెబుతున్నారు సార్" సావధానంగా తన అభిప్రాయం వెలిబుచ్చాడు అవధాని. ..............

"పిల్లలు పుట్టీ పుట్టకముందే అంతవారు కావాలి, ఇంతవారు కావాలని కలలుకంటూ, తమ కోరికల్ని, ఇష్టాల్ని వాళ్ళ ద్వారా తీర్చుకోవాలనుకోవటం. నిద్రలేస్తూనే బతికి బయల్దేరటం, దీపాలు పెట్టే సమయానికి ఇంటికి చేరటం. బాల్యాన్ని అనుభవిస్తున్నారంటండీ అసలీనాటి పిల్లలు పాపం" పిల్లలపట్ల తన సానుభూతిని ప్రకటించాడు శంకర్. ..............

"నాన్నా! ఇవ్వాళ పరీక్ష అదరగొట్టేశాను. పుస్తకాలు చూసుకుంటూ రాసినా ఎవరూ పట్టించుకోలేదు. అన్నీ తెలిసిన ప్రశ్నలే అయినా ఫస్ట్‌మార్క్ తెచ్చుకోవచ్చు కదా అని నేను అన్నీ చూసే రాశాను. అయినా కాపీ కొట్టినట్లు అనుమానం రాకుండా ఉండేటట్లు రాశాను. సంబరంగా చెప్పినవాడి మాటలకు సమాధానం చెప్పకుండానే లోనికి నడిచాన్నేను.

వాడు చేసింది తప్పనని తెలిసినా వాడిని మందలించేందుకు కడుపుతీపి అడ్డువచ్చింది నాకు. ఇలాంటి అసహ్యపు

విద్యావిధానం నుంచి పిల్లల్ని దూరం చేయమని, ఇలాంటి అసహాయతనుండి పిల్లల్ని బయట పడవేయమని మౌనంగా దేవుణ్ని ప్రార్థించాను. (పెనుమాక నాగేశ్వరరావు, ప్రార్థన, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 10-7-'96, పే 4-6)

ప్రైవేటువిద్యలో దండనలు అసలు విద్యాప్రధానలక్ష్యాన్నే దెబ్బతీసేవిగా ఉండటాన్ని బహుముఖంగా చిత్రించిన రచన 'బలి'. క్రమశిక్షణని విద్యాసాధనకు తోడ్పాటునందించే ఒక అంశంగా కాకుండా క్రమశిక్షణే విద్య పరమలక్ష్యంగా భావించే ప్రైవేటుపాఠశాలలు, ఫలితంగా దెబ్బతింటున్న బాల్యం, బలిపశువులౌతున్న పిల్లలు వీటన్నింటి నేపథ్యంలో పిల్లల మానసిక స్థితిని హృద్యంగా చిత్రించటం ఈ రచనలో విశేషం.

అసలే తెల్లటి రంగుకల పిల్లవాడు. వీపుమీద వెదురుకర్రతో కొట్టిన వారలు ఎరిదాకా అతి దారుణంగా కనిపించాయి.

"అంతటి శిక్షపడేంత అల్లరిచేసే పిల్లవాడు కాదే!"

"ఆదేనమ్మా మంచినీళ్ళు తాగడానికి వెళుతుంటే దారిలో లెక్కలటీచరు కనిపించిందట. విష్ చేయలేదని రూమ్‌కి పిలిపించి ఈ పనిచేసింది మహాతల్లి"

ఆనందాతిరేకంలో మునిగివున్న ఆ పిల్లలు ముందుగా చూసుకోలేదు వారి హెడ్మాస్టరు వచ్చి అక్కడ నిలుచున్నట్లు.

ఆయనక్కడచూసిన వారి నవ్వులు ఠక్కున ఆగిపోయాయి. ఆయన కళ్ళలో నిప్పులు చెరుగుతున్నాయి. చేతిలో వున్న వెదురుకర్ర పిల్లలని భయపెట్టింది. ఆ వెదురుకర్ర మహిమ వారికి తెలియనిదికాదు. ఆ వెదురుకర్ర భయంతోనే స్కూల్లో కిక్కురుమనకుండా రోజంతా గడిపేస్తారు.

లోకంలోని డిసిప్లిన్ అంతా తనసొత్తు అన్నట్లుండే ఆయన అందర్నీ లైనుగా నిల్చోబెట్టాడు.

"వై ఆర్ యూ మేకింగ్ నాయిస్? "

అంతే అందర్నీ చేతులు చాచమన్నాడు.

అమాయకులైన మూడేళ్ళ పిల్లల దగ్గరనుంచి ఆత్మాభిమానంకల హైస్కూలు పిల్లలవరకు అందరిని కర్రతో ఛెళ్ళున కొట్టాడు. ఆ పిల్లలందరూ తన అధికారం ప్రదర్శించుకునేందుకు పనికివచ్చే సాధనాలు. ఎంత ఎక్కువ పనిష్మెంటు ఇస్తే అంత ఎక్కువ డిసిప్లిన్ మెయింటెయిన్ చేస్తున్నట్లు అనుకుంటాడాయన. స్నేహపూర్వకంగా కూడా డిసిప్లిన్ మెయిన్‌టెయిన్ చేయవచ్చని ఆ మూర్ఖుడికి తెలియదు.

ఆ దెబ్బలు వారి ఒంటికి తగలలేదు. హృదయంమీద పడ్డాయి. ఆ గాయాలు ఏనాటికీ మానవని ఆ మాస్టరుకి తెలియదు. ఎందుకు తెలియదు! తెలుసుకోవచ్చు! తెలుసుకునే ప్రయత్నం చేయడు! ---------------

సుమతికి మనసంతా చికాకుగా ఉంది. పిల్లలు సున్నితహృదయులు. ఇప్పుడేవి ముద్రపడితే వారి హృదయాల్లో అవి శాశ్వతంగా వుండిపోతాయి. ఈ పనిష్మెంటులు ఇవ్వడం ఏ రకంగా పిల్లల మనోవికాసానికి పనికి వస్తుంది!

జీవితం చాలా పెద్దది. పిల్లలెప్పుడూ మొదటిదశలోనే ఉంటారు. అలాటిది ఆ దశలోనే వారి జీవితం భయాందోళనలతో మొదలైతే, వారు ఆహ్లాదకరమైన వాతావరణంలో పెరగకపోతే ఎలా! వారు మంచి పౌరులు కావాలంటే, ప్రేమ, సామరస్యత లాటి సాధనాలని తీర్చు ఉపయోగించాలి కానీ ఇలా గుడ్లెర్రచేసి, వెదురుకర్రలు చూపించి భయపడేట్లు చేయడం ఏరకంగా పిల్లల భవిష్యత్తుకి ఉపయోగపడుతుంది! ---------------

ఆయన వళ్ళంతా జ్వాలలు పాకాయి.

ఆ పిల్లవాడి తల్లే తనమీదా, తన స్కూలుమీదా కంప్లెయింట్ ఇచ్చిందన్న సంగతి మరీ మరీ గుర్తుకివచ్చి ప్రతీకారం భగ్గుమంది. వేటాడగా, వేటాడగా చేతికి చిక్కిన లేడిపిల్లలా కనిపించాడు బాబీ. ఆయన తీవ్రమైన చూపులకి బాబీతోబాటు మిగతా పిల్లలు కూడా జడుసుకున్నారు.

ఆ పిల్లాడిని కొట్టడానికి లేచిన వెదురుకర్ర ఇంకా బాబీకి తగలనైనాలేదు.

బాబీ కిర్రటిగుసుకుపోయాడు. గాలి స్తంభించి పోయింది.

ఏనాడూ ఎదుటివారిని నొప్పించి ఎరగడు.

ఏనాడూ కష్టం తెలియకుండా పెరిగినవాడు.

ఇంకా లోకం అంటే ఏమిటో తెలియనివాడు.

ఏనాడూ కన్నవారితో దెబ్బలు తినలేదు.

ఏనాడూ దెబ్బలుతినేంత తప్పు చేయలేదు!

అందుకే

బాబీ గుండె ఆగిపోయింది!! (విజయలక్ష్మీ మురళీధర్, బలి, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 8-1-'87, పే 108-112)

కనీస సామాజికబాధ్యతను విస్మరించిన ప్రైవేటు పాఠశాలలపట్ల ఒక మాస్టారి ప్రతిస్పందనే 'మార్గదర్శులు'

"జీవితం అంటే విలువలేని వెధవలు. పిల్లలకేమి విలువలు అందిస్తారు కనుక? దేశానికేం సేవచేస్తారు? ఇవాళ ఎంత

చొకబారు వెధవలో తెలిసిపోయింది." అంటూ ఉగ్రుడైపోయాడు. ............

తొలిరోజు మధ్యాహ్నం వరకూ తన ప్రయోజకత్వానికి మురిసి పడుతూ నిలబడిన బోర్డు మాత్రం అత్యాచారానికి గురైన అభాగ్యురాలిలాగ అవమానభారంతో కుంగిపోయి ఉంది. దట్టంగా అంటించేసిన కరుణాకాన్వెంట్ రంగురంగుల పోస్టర్ల వెనుక మొహందాచుకుని, తన దుస్థితి గుర్తించిన ఏకైక వ్యక్తి వాసుదేవయ్య ఆవేదనను తలచుకుని గాఢంగా నిట్టూర్చింది. (గిడుగు రాజేశ్వరరావు, మార్గదర్శులు, తెలుగుకథ-96, పే 223-229)

విద్యావ్యాపారంలో పేదవారికి విద్య అందనిమానిపండు కావటాన్ని, ఉపాధ్యాయులు వ్యాపారులుగా అవతారం తాల్చటాన్ని చిత్రించిన రచన 'సరస్వతీ కటాక్షం'

"అయ్యో బంగారం లాంటి బిడ్డ! చదువుకోలేక పోయినంత మాత్రాన ప్రాణాలు తీసుకోవాలా?"

"కర్మ తల్లీ కర్మ! ఈ వయసులో అన్నపూర్ణమ్మలాంటి ఆమెకి ఇన్ని దెబ్బలు తగలాలా?"

"చదువొద్దు, ఏమొద్దు, ఆవాళ్టినుంచి తనతోబాటు పనిలోకి రమ్మని కుమారయ్య రాత్రి చెప్పేట్ట! పొద్దున చూసేసరికి ఏముంది...."

ఈ మాటలు వినిపించనంత దూరంకి పరిగెత్తాను. నాకిప్పుడు ఆవేశంలేదు, ఆవేదనలేదు. ఎవరిమీద కోపంలేదు. చదువుల్ని కొనుక్కోవాల్సి వచ్చిన దుస్థితికి దిగజారినందుకు ఈ సమాజం మీద జాలితప్ప మరేమీ అనిపించడంలేదు. సహాయం, మానవతా విలువలు మరచి సొమ్మే సర్వస్వం అనుకుంటూ సరస్వతిని విపణివీధిలో పెట్టి అమ్మకం ప్రారంభించిన వాళ్ళని చూస్తే హృదయం భగ్గుమని మండిపోవడమూలేదు!

నేను చదువుకునేరోజుల్లో మా మాస్టారుగారు అనేవారు--"ఉపాధ్యాయుడంటే ఎవర్రా?వాడో యముడు. విద్యార్థిలోని 'అజ్ఞానం' అనేదాన్ని చంపేసి నిర్దాక్షిణ్యంగా తీసుకుపోయే యముడు"అని. మరి నేటి విద్యావేత్తలో? వీళ్ళు ప్రతిభఅనే శిశువుని పెరగనీకుండా పొత్తిళ్ళలోనే హతిచి చంపుతున్నారు.

ఇది తెలిశాక కూడ నేను బాధపడ్డం అనవసరం! (వారణాసి, సరస్వతీకటాక్షం, విపుల, జనవరి '87, పే 25-32)

విద్య వ్యాపారంకావటాన్ని, వ్యాపారలక్షణాలన్నీ విద్యారంగంలో ప్రవేశించటాన్ని 'చదువు కొంటాఉండారు' సమగ్రంగా వర్ణించింది.

"అది సరేరా. కాన్వెంటు చదువులంటే అవ్వి కలిగినోళ్ళకే గదరా? ఆ డొనేషన్లు... ఆ పుస్తకాలు.... ఆ డ్రెస్సులు.... మనవల్ల అయ్యేపనేనంటావా?"

"అట్లనుకుంటే ఎట్లన్నా? దేనికన్నా పెట్టుబడి పెట్లన్ల అది యాపారం అవితిందా?"

"యాపారమా?"

"అంతే గదన్నా పేద్దానికైనా పెట్టుబడి పెట్టాల్సిందే. యాపారానికైనా పెట్టుబడి పెట్టాల్సిందే. అట్లా మాదిరే ఈ కాన్వెంటు చదువులు గూడా. అన్నా! అంతో యింతో పెట్టుబడిపెట్టి పేద్దించేస్తాం. రావాల్సినంత పంట చేతికి రావచ్చు, రాకపోవచ్చు. యాపారం చేస్తాం. అది శాతగాని యాపారమైతే నష్టపడి పోవచ్చు. కానీ కాన్వెంటు చదువులమింద పెట్టె పెట్టుబళ్ళకు దోకాలేదన్నా!"

"అదెట్లా?" అంటా వాడికల్లా నోరు తెర్చుకోని చూస్తాఉండా.

"కాకుండాపోతే ఇంకేందిరా? వెంకటరెడ్డిని ఏమో అనుకుంటా ఉంటే మొగలాయిమాట చెప్పెనే. అప్పుడు మనం చదువుకుంటా ఉంటిమి. ఇప్పుడు చదువు 'కొంటా' ఉండారు. కొనాలంటే పెట్టుబడి పెట్టాల్నా వద్దా నువ్వేచెప్పు. మన వెంకటరెడ్డినే తీస్కో. ఈ పిలగాడి మింద ఇప్పటినుంచీ ఎట్నో ఒకట్లా కష్టపడి పెట్టుబడి పెడ్తానే ఉంటాడు. ఒకలచ్చొ రొండు లచ్చలో అవితిందనుకో. రేపు ఈ పిలగాడు ఒక డాక్టరో ఇంజనీరో అవితాడు. అప్పుడు మార్కెట్లో వాడిరేటెంత? కనా కష్టంగా అయిదారు లచ్చలన్నా పలికితింది. అంతకంత లాబం సాల్దా?"

కాన్వెంటు చదువుల్లో మురి యిప్పేసి ముత్తారెడ్డన్న ముసిముసిగా నవ్వులా ఉండాడు. మాయమ్మ ఎర్రగెడ్డల యాపారం చేసె. తమలపాకుల యాపారం చేసె. చింతపొండు యాపారం చేసె. ఎన్ని యాపారాలు చేసినా యాడికి అందని ఆతికి వాలని బతుకేబతికె! -- నన్ను అద్దం పెట్టుకోని యిట్లామాదిరి యాపారం చేసుంటే? --

అయ్యింది పొయ్యింది అలిమేలమ్మ. కొంగుజాడించింది గోయిందమ్మ! అన్నెట్లు ఇప్పుడు ఎన్నమకుంటే మాత్రం ఏమి లాబం? (............, చదువు 'కొంటా' ఉండారు!, నాలుగ్గాళ్ళమండపం రాయలసీమ జీవనశైలి, పే 159-163)

*"There is no justification for torturing the young children by compelling them to carry very heavy bags of books everyday to schools. Textbooks should be treated as school property and thus, there should be no need for children to purchage the books individually and carry them daily to homes."*

*----Prof. Yashpal committe*

==============

పాఠ్యపుస్తకాల భారం

నేటి విద్యార్థి జీవితంలో పాఠ్యాంశాల భారంతోపాటుగా, పాఠ్యపుస్తకాల భారంకూడా వయసుకు మించిందిగా తయారయింది. అనేకమంది ముఖ్యంగా మధ్యతరగతికిచెందిన పట్టణప్రాంత విద్యార్థులు ఈ సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. జాతీయసలహామండలి కేంద్రప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో ఈ అంశాలను ప్రస్తావించింది. పాఠశాలవిద్యార్థుల పాఠ్యాంశాలభారాన్ని తగ్గించమని కోరుతూ, ప్రస్తుతపరిస్థితిని గురించి ఇలా వ్యాఖ్యానించింది. "The weight of the school bag represents one dimension of the problem; another dimension can be seen in the child's daily routine. Right from early childhood, many children specially those belonging to middle classes, are made to slog through home work, and coaching classes of different kinds. Leisure has become a highly scarce commodity in the child's especially the urban child's life."

తెలుగు సాహిత్యం విద్యావిధానంలోని లోపాలను ప్రతిఫలింపజేస్తూ వచ్చినరచనల్లో విద్యార్థుల పుస్తకాల భారాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ వచ్చిన రచనే 'నాన్నా నాకో బండికొనవూ!'పుస్తకాలభారాన్ని మోస్తూ నిరంతరం వేదననమభవిస్తున్న విద్యార్థులకు, బతుకుబండిని లాగేందుకు బాలకార్మికులుగామారినవారికి మధ్యగలసామ్యం ఇందులో మనకు గోచరమైతుంది.

కొందరు పిల్లలు తొక్కులు, పుల్లలు, కంపలు తట్టలకెత్తుకుని నడుస్తున్నారు. వాళ్ళమధ్య మూడు చక్రాల చిన్న కర్ర బండిలో ఎండిన తాటిబురికెలు, మట్టలు వేసుకుని దానికి తాడుకట్టి లాగుతూ పోతోన్నాడు అసిరిగాడు. వాడికి అది గొప్పగా ఉంది. అలాంటి బండి కావాలా? ఎందుకు? అన్నాడు సూర్యం ఆశ్చర్యంగా.

"వీన్ని ఆ బండిలో వేసి బడివరకు లాక్కుపోతాను!" అన్నాడు బుజ్జిగాడు భుజానికి బరువుగా వేలాడుతున్న పుస్తకాల సంచిని తీసి తండ్రికి చూపిస్తూ.

అవాక్కయ్యాడు సూర్యం. ఇంత చిన్న వయస్సునించి బ్రతుకు బరువుని లాగుతున్న అసిరిగాడికీ, చదువుల కార్ఖానాలో పడి నలిగిపోతూ భవిష్యత్తువైపు చూపులు పారిస్తున్న బుజ్జిగాడికీ ఏమీ తేడాలేదనిపించింది. (కె.తాయారమ్మ, నాన్నా నాకోబండికొనవూ!, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 5-10-88, పే 10)

అయితే ఇందుకు వ్యాపారధోరణిలో నడుస్తున్న పాఠశాలలే ప్రధానకారణమన్న వాదనను

'జీతం చదువు' ముందుకు తెచ్చింది.

"గాడిదబరువు మోసి మోసి మా పిల్లలు కూలీలుగా మారుతారని భయపడి పిల్లల పుస్తకాల మోపులు మేమే మోస్తున్నాం. చూచిరాత రాసిరాసి మా పిల్లల మెదడు మొద్దుబారి దురుకుదనం వస్తుందని హోమ్‌వర్క్ మేమే చేస్తున్నాం!" చిరుబుర్రులాడుతూనే దిగాలుగా చీదేశారు పిల్లల తల్లిదండ్రులు..........

"మోతాదుకి మించిన హోమ్‌వర్క్ ఇవ్వడానికి మూలకారణం నేనే. నన్ను క్షమించండి. పిల్లల చేతినిండా పని ఉండడానికి హోమ్‌వర్క్ పెంచమని నేనే చెప్పాను. మీకు కలిగిన అసౌకర్యానికి నేనే బాధ్యుడిని. నన్ను క్షమించండి" అంటూ పేరెంట్స్ కాళ్ళపైన పడ్డాడు విశానేరావు. (ఎమ్. హరా, జీతంచదువు, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 6-2-91, పే 37-39)

ఇంకా పాఠ్యపుస్తకాలభారాన్నే ప్రధాన ఇతివృత్తంగాచేస్తూ వచ్చిన రచనలు అనేకం తెలుగు సాహిత్యంలో మనకు తటస్థపడతాయి. పుస్తకాలభారాన్ని మోయలేక మోస్తున్న బాలబాలికలను, శిలువను భుజానవేసుకుని నడుస్తున్న క్రీస్తుతో పోల్చి విద్యావిధానం వారిపట్ల ముళ్ళకిరీటం కావటాన్ని నిరసించిన రచన 'హింసధ్వని'.

ఒక ప్రక్కగా శిలువను భుజానేసుకుని మోస్తూ భారంగా నడుస్తున్న ఏసుక్రీస్తు. మరోప్రక్కగా పెద్దపరిమాణంలో వున్న పుస్తకాల సంచుల్ని వీపులమీద మోస్తూ భారంగా అడుగులేస్తూ నడుస్తున్న కాన్వెంటు బాలబాలికలు. నేపథ్యంలో చర్చిగంటలు, చెళ్ళుచెళ్ళుమంటూ వినిపిస్తూ కొరడా దెబ్బలు... సన్నగా వినిపిస్తున్న పిల్లల కోలాహలం...

చిగురించే బాల్యంపై
పుస్తకాల భారం
సుతిమెత్తని పువ్వుమీద
పెనురక్కసి పాదం
ఆటలేదు పాటలేదు
ఊహలేదు సృజనలేదు.
మార్కులు, రాంకుల కొలతలు
పాఠశాల యంత్రశాల
....................

శివ: ఇంజనీరైనా, డాక్టరైనా, కలెక్టరైనా ఎంతో గొప్పది జీవితం. జ్ఞానం హోదాకోసం, గొప్పచెప్పుకోవటం కోసమో కాదు. మనిషి మనుగడకు ఉపయోగపడేదే అసలైన జ్ఞానం. ............

కృష్ణ: అవును సారథి! ఇవన్నీ హత్యలే! శిక్షాస్మృతి పరిధిలోకి రాని నేరాలే! బిడ్డ క్యార్‌మని ఏడుస్తూ భూమ్మీద పడగానే బారసాలకన్నా ముందే నుదిటిమీద రాతలు రాస్తున్నారు! గిరికీలు కొడుతూ గిలక్కాయలతో ఆడుకోవలసిన బాల్యాన్ని స్కూలు సంచులకు ఉరితీస్తున్నారు. బిడ్డలు పుడుతూనే పుస్తకాలయి, సాక్సయి, బూట్లయి, యూనిఫారాలుగా ర్యాంకుల్లోకి మారి కన్నవాళ్ళ కలల్లో ఇంజనీర్లు, డాక్టర్లు, కలెక్టర్లయి పోతున్నారు. ............................., మధ్యతరగతి మనుషుల్ని మహమ్మారిలా పీడిస్తున్న ఈ జబ్బుపేరే వృత్తివిద్యా వ్యామోహం..................(వల్లూరు శివప్రసాద్, హింసధ్వని, డా!!అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్, పే 545-564)

విద్యార్థులను వెన్నెముకలేని వ్యక్తులుగా రూపొందించే మోతబరువు విద్యవిధానాన్ని ప్రతీకాత్మకంగా నిరసిస్తూ -

పిల్లకొంచెం కూత ఘనము అన్నట్లు క్లాసు చిన్నదీ పుస్తకాలెక్కువా. ఆ పుస్తకాల సంచీ బరువు మోయలేకపోతే వెన్ను వొంగిపోతుంది. రేపు బాలుడికి గూనిరావొచ్చు. వెన్నెముక ఉండీ లేనట్లయిపోయో, వెన్నెముకలేనివాడయ్యో సంతానం పొందే అర్హతను కోల్పోయినా కోల్పోవచ్చు. అతి చిన్నతనంలోనే ఆకాశాన్ని, ఆకుపచ్చని చెట్లనీ చూడనివ్వకుండా క్లాసురూము గోడలమధ్య బంధింపబడుతూ...ఆ చిన్ని కనులను కంప్యూటర్ స్క్రీన్ మెల్లమెల్లగా కలుషితం చేస్తోంటే...తొందరలోనే కళ్ళకి అద్దాలు రావొచ్చు. అలక్ష్యంగా అంధత్వమొచ్చినా ఆశ్చర్యపడనక్కరలేదు.

బడి తొందరలో ఆదరా బాదరా తిండి. తినగానే పరుగు. దీనివల్ల గ్యాస్ట్రిక్, అసిడిటీ మొదలయిన ప్రాబ్లమ్స్.

హోంవర్క్ చేయగలనో లేనో...రాంక్ వస్తుందో రాదో...శిక్షా భయం...వీటివల్ల యాంగ్జయిటీ న్యూరోసిస్.... బి.పి. వంటి మానసిక రుగ్మతలు. ఇలాటివీ, ఇవీ మన విద్యావిధాన పరిణామాలు. పిల్లల బాల్యాన్ని దోచుకుంటున్న దోపిడీ దొంగలలో పెద్ద ఈ కుటిల విద్యావిధానమే............................. ఎప్పుడూ పుస్తకాలూ, ఆల్‌వర్క్ బట్ నో ప్లే.... వల్ల అతను మానవ సంబంధాలు, సున్నితమయిన మనోభావాలు, సెంటిమెంట్లు కోల్పోతూ, ప్రకృతిపట్ల అంధుడూ, సాటిమనిషి పట్ల యంత్రసమానుడూ అౌతాడు. పుస్తకాలూ కంప్యూటర్లూ దాటి బాహ్య ప్రపంచాన్ని సరిగా చూడనూలేడు, అర్థంచేసుకోనూ లేడు. మన విద్యావ్యవస్థా, సమాజమూ, నేటి బాలురని రేపటి యంత్రాలుగా మారుస్తున్నాయి."(ఇవ్వాపురపు రామచంద్రం, ఇంటికొక హంతకుడు, కథామహల్: దుప్పాటి శారదాంబ పోటీ కథలు, పే 94-109)

విద్యార్థుల బాల్యాన్ని దూరంచేసిన ఈ మోతబరువు పిల్లలపట్లచూపే క్రౌర్యాన్ని పేర్కొంటుంది 'కాపరి'

"మట్టిగా ఎత్తైన ఆవరణ గోడ. ఆవరణలో మట్టిగా గుబురైన దిరిసెన చెట్లూ కొబ్బరిచెట్లూ. లోనికివెళ్తే కోటలోకి వెళ్ళినట్లే (జైల్లోకి వెళ్ళినట్లే కొందరు పిల్లలకు అనిపిస్తుంది) పెద్దచెట్లేగాక పూలమొక్కలూ, తీగెలూ,గుబురులూ, పరిచిన పచ్చికలూ ఈ ఆకుపచ్చదనంతో, రంగు రంగుల పూలతో ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. కానీ , స్కూలుకు వెళ్తున్న పిల్లలు, ముఖ్యంగా కిందితరగతుల్లోని పిల్లలు టిక్కు టిక్కు మనుకుంటూ బండెడు పుస్తకాలు వేసుకుని వెళ్ళడం చూస్తుంటే చిన్న తనంలో జీవితం వాళ్ళపట్ల ఎంత క్రౌర్యాన్ని చూపుతూందో అనిపిస్తుంది." (మామునూరు నరసింహారావు, కాపరి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక , 16-4-86, పే.12)

వికలాంగుల పాఠశాలలో సైతం వారిపట్లకూడా కనికరంచూపని మోతబరువు

"అతని పుస్తకాలసంచివంక చూశాను. పదిమణుగుల బరువుంటుంది. తనశరీరాన్ని మోయటానికే కాళ్ళకు శక్తిలేదు. ఈ సంచిని మోయటమెలా?" (ఆర్.ఎం.చిదంబరం, ముగింపు దొరికింది, భారతి, ఏప్రిల్ 1961,పే 38--51).

ప్రొ॥ యశ్‌పాల్ నేతృత్వంలోని కమిటీకూడా ఈ అంశాన్ని తీవ్రమైనదిగా పరిగణించింది. అందుకే పాఠ్యపుస్తకాలను పాఠశాల ఆస్తిగా పరిగణించాలని, విద్యార్థులు వ్యక్తిగతంగా వీటిని కలిగిఉండాల్సిన అవసరంలేదని, ప్రతిరోజూ పాఠశాలకి ఇంటికి మోయాల్సిన అవసరంగాని లేదని పేర్కొంది.

"There is no justification for torturing the young children by compelling them to carry very heavy bags of books everyday to schools. Textbooks should be treated as school property and thus, there should be no need for children to purchage the books individually and carry them daily to homes."

*"Discipline is a training in self-control*
*and self-direction...*
*The true end of discipline is none other than*
*the achievement of self-control"*

*-------(R.C.Beery.1916:104-105)*

==================

## విద్య--క్రమశిక్షణ--హక్కులు

పిల్లలు తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల నుంచి ఎక్కువగా ప్రేమాభిమానాలను పొందటం సహజం. అయినా వారి అశక్తత, పరాధీనత వారిని అసహాయులుగా, అణచివేతకుగురిచేస్తూనే ఉంటుంది. అందువల్లనే ఈ అంశాన్ని బాలలహక్కులకోసం పనిచేసేవారు ప్రస్తావిస్తున్నారు. ఒక సమూహంలోనే తక్కువస్థాయిగా చూడబడుతూ, అలా చూడటం సరైనచర్యగా గుర్తింపు పొందటం పిల్లలవిషయంలో చోటుచేసుకున్న ఒక విషాదం. తమకు నచ్చిన రీతిలో పిల్లలను రూపొందించే హక్కు (బాధ్యత?) పెద్దలు కలిగి ఉండటం సాంప్రదాయికంగా పిల్లల విషయంలో జరుగుతున్న అణచివేతగానే భావించాలి.

సమాజంలోవ్యక్తులందరూ కలిగిఉన్న అనేకహక్కులు, స్వేచ్ఛలు, అవకాశాలు పిల్లలకు మాత్రం అందటంలేదు. వారు తప్పనిసరిగా పాఠశాలకు వెళ్ళాల్సిరావటం, సరిదిద్దుకునేందుకు అవకాశం లేకుండానే తల్లిదండ్రులచే దండనకు గురికావటం, తమ అభిరుచులకు అనుగుణంగా తిరిగే స్వేచ్ఛలేకపోవటం, తమ స్వంత విషయాలైన తిండి, దుస్తులు, స్నేహం వంటివి తల్లిదండ్రుల, ఉపాధ్యాయులు, ఇంకా ఇతరుల నిర్ణయాలమేరకే జరగటం పిల్లల విషయంగా జరుగుతున్న హక్కుల ఉల్లంఘన క్రిందికే వస్తుంది. వీటిని న్యాయమైన అంశాలుగా పేర్కొనవచ్చా?

జె.యస్. మిల్ తన రచన On Liberty లో

"The only purpose for which power can be rightfully exercised over any member of a cicilised community, against his will, is to prevent harm to others. He cannot rightfully be compelled to do or forbear because it will be better for him to do so, because it will make him happier, because, in the opinion of others, to do so would be wise or even right" (J.S.Mill.1975:10)

అయితే మిల్ పిల్లలను ఇందుండి మినహాయించటం గమనార్హం.

"It is hardly necessary to say that this doctrine is meant to apply only to human beings in the maturity of their faculties. We are not speaking of children, or of young persons below the age which the law may fix as that of manhood or womanhood. Those who are still in a state to require being taken care of by others, must be protected against their own actions as well as against external injury. (J.S.Mill.1975:11)

అయితే పిల్లలను సరళమైన నియమాలనుంచి మినహాయించటం ద్వారా మిల్ వారికి అన్ని హక్కులను నిరాకరించినట్లుగా భావించలేం. హక్కులు స్వయంనిర్ణయాధికారాలుగా పరిగణించబడే కొన్ని అంశాలకు మాత్రమే మిల్ ఇచ్చిన ఈ మినహాయింపు వర్తిస్తుందని మనం భావించాలి.

ఆరు సంవత్సరాల పిల్లలు తాము ఏ ఆట ఆడగలమో తెలుసుకోగలుగుతారు, అయితే ఎవరిని వివాహమాడాలో గ్రహించలేరు. మన సమాజం ఈ అభివృద్ధిని కొంతమేరకు గుర్తించినట్లుగా చట్టాలనుబట్టి తెలుస్తుంది. అయితే దీని ఆచరణమాత్రం కఠినంగాను, అవివేతరూపంలో అగౌరవపూర్వకంగా మాత్రమే ఉంటుంది. ముందే ఏర్పరుచుకున్న కొన్ని సామాజిక సూత్రాలకు అనుగుణంగానే ఈ ఆచరణ ఉంటుంది తప్ప పిల్లల అభిరుచులు ఇందులో పరిగణనలోకి రావు.

We now 'educate children for change', without giving much thought to whether the change is good for them or us.

పాఠశాల కేంద్రంగా తరచూ విద్యార్థుల హక్కులు ఉల్లంఘనకు గురికావటం సర్వసాధారణంగా జరిగే ఒక సహజ పరిణామమే. అయితే ఈ హక్కుల ఉల్లంఘన తరచూ క్రమశిక్షణ పేరుతో జరగటం గమనార్హం.

మనం పాఠశాలల్లో తరచూ క్రమశిక్షణాలోపాన్ని గురించి వింటుంటాం. పాఠశాలల్లో క్రమశిక్షణా సమస్యగురించిన అనేక రచనలు చదువుతుంటాం. క్రమశిక్షణ స్వరూపస్వభావాలు, లోపించటానికి కారణాలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలు వంటివి తరచూ చర్చకువచ్చే అంశాలు. ప్రభుత్వ పాఠశాలా విధానంలో క్రమశిక్షణాలోపం ప్రధానసమస్యగా తరచు ముందుకు వస్తుంది. క్రమశిక్షణ అనేది సామాజికంగా పాఠశాల మంచి, చెడు స్థాయిలను నిర్ణయించే ప్రముఖ అంశంగా గుర్తింపుపొందింద.

అయితే ఈ రకమైన క్రమశిక్షణకు సంబంధించి కొంత సంధిగ్ధతకూడా కనిపిస్తుంది. సాధారణ విద్యావంతుని దృష్టిలో క్రమశిక్షణ అనేపదం అదుపుచేయు అనేఅర్థంలోనే ఉపయోగంలో ఉంది.

Instead, it is to be seen as 'the process whereby student and staff relationships are structured to maximise attainments of students, to attain the most effective and effecient use of human and material resources and to facilitate the maximum satisfaction of needs for all members of the school.'

(Discipline in Secondary Schools in Western Australia, p.7)

విద్యాసంబంధమైన సాహిత్యంలో క్రమశిక్షణకు సంబంధించిన అనేక చర్చలు కనిపిస్తాయి. కొన్నిసార్లు ఈ చర్చలు వ్యక్తిగత క్రమశిక్షణనుగురించి పేర్కొన్నప్పటికీ, వాటిదృష్టి ప్రధానంగా తరగతికి, పాఠశాలకు సంబంధించినదిగానే ఉంటుంది. సాధారణంగా పాఠశాల, క్రమశిక్షణ అనేవి

రెండూ పరస్పరం సంబంధం ఉన్న జంటపదాలుగా కనిపిస్తుంటాయి. అయితే పాఠశాల క్రమశిక్షణ పట్ల సాధారణాభిప్రాయాన్ని, దాని విద్యాసంబంధమైన విలువను గుర్తించాల్సిఉంది.

ఒకరు తన తరగతిని క్రమశిక్షణలో ఉంచుతున్నాడంటే, అతను తరగతిని తన అజమాయిషీలో ఉంచుకున్నాడని అర్థం. ఇది సైనికవిభాగంలోని క్రమశిక్షణకాకపోయినా దాదాపు అలాంటిదే. నిశ్శబ్దము, ఏకాగ్రత, క్రమపద్ధతి, సమయపాలన వంటివి ఉపాధ్యాయుని ఆధిపత్యంకింద ఆచరణలోకి వస్తాయి. క్రమశిక్షణాయుతమైన తరగతికి, అదుపులోఉన్న తరగతికి మధ్య గల వ్యత్యాసం ఇక్కడే గ్రహింపుకొస్తుంది. బలంద్వారానో, మందులద్వారానో, ప్రలోభాలతోనో యిలా వివిధ రకాలుగా అదుపుసాధించవచ్చు. అంటే ఉపాధ్యాయుడు వీనిలో కొన్ని లక్షణాలు కలిగి ఉండాల్సిన అవసరం ఉంది.

కొందరికి క్రమశిక్షణ అంతిమలక్ష్యమనే భావనకూడా ఉంది. జాన్ విల్సన్ ఇటువంటి అభిప్రయాన్నే వ్యక్తం చేస్తూ "Discipline should be seen as 'an educational objective in its own right -- not just as a facilitator for education"(J.Wilson.1977:43)

మానవుని జీవనవిధానంలో పరిసరాలు వ్యక్తిని నియంత్రించటం సాధారణాంశం. అందువల్ల వ్యక్తికి క్రమశిక్షణ అవసరమున్నది విల్సన్ అభిప్రాయం. మనం క్రమశిక్షణకు బద్ధులం కాకపోతే, అధికారానికి విధేయులం కాకపోతే మన ఉనికి, అభివృద్ధి సాధ్యంకాదు. అని విల్సన్ భావిస్తారు.

క్రమశిక్షణను సాధించేందుకు అనుసరించే మార్గాలుకూడా క్రమశిక్షణగానే పేరుపొందాయి. పాఠ్యాంశాల వస్తు, రూపాలు, ఉపాధ్యాయుని వైఖరి, ఉనికి, బోధనోపకరణాల వినియోగం, బోధనకు సిద్ధంకావటం వంటివన్నీ తరగతిపై ఉపాధ్యాయుని అధిపత్యాన్ని పెంపొందించి, తరగతిని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు దోహదపడేవే.

క్రమశిక్షణ శిక్షకు పర్యాయపదంగా కూడా ఉపయోగంలో ఉంది. అనేక దగ్గరపోలికలున్నా అవి రెండూ వేరువేరు భావనలే. వ్యక్తి నైతిక వైఫల్యానికి ప్రతిగా వ్యక్తిపై తీసుకునే చర్యను దండనగా గుర్తించవచ్చు. అయితే క్రమశిక్షణలోకూడా నైతికవైఫల్యం ఉంటుంది. అయితే దాని ప్రధానఉద్దేశ్యం సంస్కరణ.

క్రమశిక్షణను సమర్థించేవారు వారి వాదనకు మద్దతుగా స్వీయశిక్షణను ముందుకు తెస్తారు. అంటే ఆత్మనిగ్రహం, ఆత్మనిర్దేశనం క్రమశిక్షణ అంతిమలక్ష్యంకావాలన్నది వీరిభావన. ఇతరులచే క్రమబద్ధీకరించ బడటానికి మారుగా స్వీయక్రమశిక్షణ న్యాయమైనది. అయితే క్రమశిక్షణను పెంపొందించేందుకు తరగతిగది మాత్రమే సరైన ప్రదేశంగా భావించలేం. బాహ్యక్రమశిక్షణనుంచి, అంతఃశిక్షణకు చేసేప్రయాణం సుదీర్ఘమైనదంటారు మరియా మాంటిస్సోరి. We do not consider an individual disciplined, only when he has been rendered as artificially silent as a mute and as immovable as a paralytic. He is an individual annihilated, not disciplined. We call an individual disciplined when he is master of himself, and can therefore regulate his own conduct when it shall be necessary to follow some rule of life. (M.Montessori.1912:86)

తరగతిలోని అనేక అంశాలు క్రమశిక్షణపై ప్రభావం చూపుతాయి. సాంప్రదాయికమైన గురు,శిష్య సంబంధాలు, తరగతుల పరిమాణం, పాఠ్యాంశాల స్వరూపస్వభావాలు వంటి అనేక పాఠశాల లక్షణాలు ప్రేరకాలుగా పనిచేస్తాయి.

స్వతఃసిద్ధమైన క్రమశిక్షణతోపాటుగా అధ్యయనానికి స్ఫూర్తినివ్వటంకూడా అవసరమే. ఇది తరగతిలో క్రమశిక్షణ ఉన్నపుడే సాధ్యమౌతుంది. ఉపాధ్యాయుని నుంచి అవసరమైన బోధన లభించేనిమిత్తం విద్యార్థులకు తగిన నైతిక వాతావరణాన్ని నెలకొల్పడమే క్రమశిక్షణ ప్రధాన ఉద్దేశ్యం. అయితే అధ్యయనానికి అవసరమైన స్ఫూర్తిని బోధనద్వారా అందివ్వగలమా అనేది మాత్రం సందేహమే. పాఠ్యాంశాల్లోని అంశాలను అధ్యయనం చేయాలనే కోరికనుమాత్రం పెంపొందించగలం. అయితే దీన్ని తరగతిగత అధ్యయనంగానే భావించాలి. తరగతిగత అధ్యయనం, తరగతిగత క్రమశిక్షణను కోరుతుంది. అసలు అధ్యయనానికి క్రమశిక్షణ అవసరమా అన్నది మరొక సందేహం. అధ్యయనానికి కొంత క్రమశిక్షణ అవసరమని భావించినా దాని విద్యావిలువ ప్రశ్నార్థకమౌతుంది. మౌనం, ఏకాగ్రత, శ్రద్ధ వంటి మనం సాధారణంగా భావించే క్రమశిక్షణాసూచికలు విజ్ఞానానికి, బోధనకు సంబంధించిన విద్యా విలువలుగా పరిగణన పొందాయి. జ్ఞానమనేది ఉపాధ్యాయుని నుంచి విద్యార్థులకు అందజేయబడే ఒక అంశంగా గుర్తింపు పొందింది. విద్యార్థులు ఉపాధ్యాయుడందించే విజ్ఞానాన్ని అందుకునే జడపదార్థాలుగా ఉంటారు. విద్యార్థులు ఈ విషయాన్ని గుర్తించి అందరి దృష్టి ఉపాధ్యాయునివైపు సారించగలిగితే అదే మంచి క్రమశిక్షణ వర్ధిల్లినట్లయితుంది. కొంత అతిశయోక్తిగా అనిపించినప్పటికీ పాఠశాలల సామాజిక నిర్మాణం, భౌతిక నిర్మాణం వైవిధ్యాన్ని అంగీకరించవు. శబ్దం ఇతర తరగతులకు ఇబ్బందికరం కావటం, ఉపాధ్యాయుడు తోటివారి దృష్టిలో, ప్రధానోపాధ్యాయుని దృష్టిలో మంచిస్థానాన్ని పొందాల్సిన అవసరం ఉండటం దీనికి ప్రధానకారణం.

తరగతిగత క్రమశిక్షణకు తరమూగా నైతికకోణం ఆపాదించబడుతుంది. యధాతథస్థితిని కొనసాగించేందుకు తరగతిలో క్రమశిక్షణను ఉపయోగించటం తరమహోటుచేసుకునే అంశం. క్రమశిక్షణ పేరుతో పాఠశాల విద్యార్థులపై జరిగే అణచివేత, వారి సాధారణ హక్కులను కాలరాసే నైజం కళ్ళముందుంచిన రచన 'బాలలదినం'

"ఇంతమంది పిల్లలు వారి ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా, ఆ కొద్దిమంది పెద్దల అహాన్ని తృప్తిపరచడానికి నియంత్రించబడితే, మీలాంటి పెద్దలు ఒకవ్యక్తిని గౌరవించడం అంటే అతని అడుగులకింద పూలరేకులు పరచడం అనే సంస్కృతిక ప్రాణంపోస్తుంటే, ఇలాంటి కార్యక్రమాల్ని స్కూలుపెద్దలు వ్యాపార దృక్పథంతో పోషిస్తుంటే, మార్పు ఎలా వస్తుందండీ? ఎలా?"

"అంతదాకా ఎందుకు? ఈరోజు వీళ్లనిలా నిలువుకాళ్లమీద నిలబెట్టి, ఆటను, కడుపును మాడుస్తూ, వారిస్వేచ్ఛను, క్రమశిక్షణ పేరుతో హరించటం నిర్దయంచు, మనం సంతోషంతో, ...సంబరంతో ... బాలలదినోత్సవం జరుపుకోవటం హాస్యాస్పదంగా లేదూ? నామట్టుకు నాకయితే ...ఈ కార్యక్రమాలు అందమైన పేరుపెట్టి, ఈ చిన్నారులచేతచేయించే వెట్టిచాకిరిలాగా అన్పిస్తాయి."

"ఆ. . . అయినా ఏం బాలలదినోత్సవాలైంది. ఈ పిల్లల్ని చూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది............... మీరన్నట్లుగా పిల్లలకోసం ప్రత్యేకంగా శ్రద్ధవహించాల్సిన రోజున, వారి స్వేచ్ఛకు మన మూర్ఖత్వంతో పెట్టే తద్దినంలా వుందండీ ఈ రోజు పరిస్థితి!" ............

క్రమశిక్షణ పేరుతో అంతసేపూ కదలకుండా నిలబెట్టబడిన పిల్లల్ని గమనిస్తోన్న పైన ఆకాశం, కింద ఇసుక కోపంతో మండిపడుతున్నట్లున్నాయి. (చంద్రలత, బాలలదినం, నేనూ నాన్ననవుతా!, పే 8-21)

క్రమశిక్షణ: అమలు-నిర్వహణ అన్న రచనలో రాబర్ట్ సచిన్ పాఠశాలల ఉద్దేశ్యం గురించి ఇలా అంటారు.

"Society itself lives according to accepted rules, and since one of our main objectives in education is to prepare youngsters to live in our society, they must be trained to live according to established rules" (R.L.Sachin, 1961:7)

ఇందుకోసం క్రమశిక్షణను ఉపయోగించటం ఎటువంటి సామాజిక సమస్యలని సృష్టించదని

భావిస్తారు. క్రమశిక్షణ ఇందుకోసమే రూపొందించిన విధానమని నమ్మటమే దీనికి కారణం. మొత్తంమీద క్రమశిక్షణకు విద్యాసంబంధమైన విలువ ఉందని గుర్తించలేం. అయితే ఇక్కడ మనం తప్పనిసరిగా గుర్తించాల్సిన ప్రత్యేక అంశం ఒకటి ఉంది. అన్ని సమాజాల్లో సామాజికస్థితిని యథాతథంగా ఉంచేందుకు వీలుగానే విద్యావిధానం రూపొందుతుంది. కనుక పాఠశాల క్రమశిక్షణ ఈ ఆధిపత్యరీతిని కొనసాగించే విధంగా ప్రజల భాగస్వామ్యాన్ని నియంత్రిస్తుంది. అందువల్ల ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగానే పాఠశాల క్రమశిక్షణ ఉంటుంది. అయితే మన సామాజిక జీవనాన్ని అమూల్యమైన అంశంగా గుర్తిస్తూ అందుకు అనుగుణమైన సామాజికనియమాలను రూపొందించనంతవరకూ, పాఠశాల క్రమశిక్షణను గురించిన ఆలోచనలు అసంపూర్తిగానే మిగిలిపోతాయి.

*"whether any kind of punishment at all is morally Justifiable. This question is critical, because punishment involves an unpleasant imposition on another person as a matter of deliberate principle, it will therefore be the first to accupy our attention"*

===========

విద్య--దండనలు

బెత్తం చేతబట్టుకున్న ఉపాధ్యాయునే మనం నేటికీ పాఠశాలకు ప్రతీకగా భావిస్తున్నాం. అవాంఛనీయమైన నియమనిబంధనలు, పూర్తి విధేయత చూపనందుకు విధించే దండనలు, గందరగోళమైన నిర్బంధపూరిత వాతావరణంతో పాఠశాల సైనికశిక్షణా శిబిరంలా గోచరిస్తుంది.

సామాజికస్థాయిలోను, ఆలోచనల్లోను, ఆసక్తులు, సామర్థ్యాలలోను, ఆకాంక్షలలోను విస్తృతమైన వైరుధ్యం కలిగిన అనేకమంది విద్యార్థులను వారి ఆకాంక్షలు, ఆసక్తులు, అభిరుచులతో నిమిత్తంలేకుండా ఒక అనాసక్తికర వాతావరణంలో ఒకచోటచేర్చి ముందే సిద్ధంచేసుకున్న కొన్ని సూత్రాలకనుగుణంగా వారి వైయక్తిక, సామాజిక వికాసానికి కృషిజరుగుతున్నట్లుగా భావించబడే ఒకానొక ప్రదేశమే 'తరగతిగది'. అయితే ఇక్కడ ఉపాధ్యాయుడు తనకు అందుబాటులోని అంశాలను ఉత్సాహపూరితంగా, సంబద్ధతతో విద్యార్థులకు అందించే ప్రయత్నం చేయవచ్చు. కానీ ఉపాధ్యాయుని బోధనకూడా మితిమీరిన పాఠ్యాంశాలు, స్వల్పకాలవ్యవధి, నిధులు, పాలనాపరమైన నియంత్రణలు వంటి అనేక అంశాలకు లోబడిమాత్రమే సాగుతుంది.

ఇటువంటి పరిస్థితుల్లో పాఠశాలల్లో విద్యకు, దండనలకు మధ్యగల సహసంబంధం ప్రముఖమైన అంశంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఇంకా విద్యార్థులతో సన్నిహితంగా ఉండే వారందరిమధ్య చర్చల్లో చోటుచేసుకున్నది.. అయితే ఈ దండనలు కేవలం పాఠశాలలకుమాత్రమే పరిమితమైన అంశంగా పరిగణించలేం. అయితే పాఠశాలల్లోమాత్రం ఈ దండనలు ఒక వ్యవస్థీకృతమైన శిక్షణాసాధనాలుగా గుర్తింపుపొందటం ప్రమాదకర పరిణామంగా గుర్తించకతప్పదు.

ఇదే అంశాన్ని తెలుగుసాహిత్యం మరింత విస్తృతంగా, లోతుగా చర్చించింది. విద్యావ్యవస్థలోని ఈ దండనా విధానాన్ని బహుముఖీనంగా చర్చించిన రచనల్లో 'పసిరిమొగ్గలు'

ఒకటి.

"కేవలం జీతం ఇవ్వలేదన్న నెపంతో విద్యకు బదులు ఇంత శిక్షలనిస్తుంటే--భయంకాక మరేం మిగులుతుంది? బళ్ళో వాడికి ఇంగ్లీషు-లెక్కలు చెప్పే మాష్టార్లు కొంతవరకూ బాధ్యులే! పిల్లలస్థాయి మానసికశక్తి గ్రహించకుండా బోధించి, వాళ్ళకు రాకపోతే హింసిస్తుంటే అది పసివాళ్ళ మనసులపై ఎలాంటి ప్రభావాన్ని కలిగిస్తుందో ఈ పసివాని కథే చెపుతుంది! ఇన్ని రకాలుగా ఇంతమంది ఎటుచూసినా ఆ పసివెధవను క్రూరంగా హింసించేవారు, చావగొట్టేవారు, భయపెట్టేవారే కనిపిస్తున్నారు కానీ ఒక్కరు కూడా సానుభూతితో దగ్గరకు తీసుకొని వాడి బాధను అర్థంచేసుకొనడానికి ప్రయత్నించే వారు కానీ, ప్రేమను చూపించేవారు కాని లేకపోయారు. అంతేనా! వాడికి ఇష్టమైన చిత్రలేఖనం నేర్చుకుందామంటే తగిన అవకాశంలేదు. పైగా ఇష్టంలేని, ఆసక్తిలేని, వంటపట్టని సబ్జక్టులు బలవంతాన చదివించే విద్యావిధానంలో లోపంకూడా కారణమేమో అనిపించింది.

"ఎంత ఆలోచించినా ఆ పసివాడి చావుకు అందరూ బాధ్యులే ననిపించింది. అందరూ అంటే మనమే మన సమాజమే. విజ్ఞానశాస్త్రంలో ఎన్నెన్నో పరిశోధనలు చేసి, అద్భుతాలను సృష్టించవచ్చు. కాని, ప్రకృతిసిద్ధమైన ఒక్క పుష్పాన్ని ఏ ఒక్కరైనా సృష్టించగలరా! భావికాలపు నందనోద్యానవనంలో కుసుమించి వికసించే పుష్పాలకు ఆధారభూతమైన ఇలాటి పసిరిమొగ్గలు ఇలా మొదట్లోనే నేలరాలి పోవటమో, లేక ఎందుకూ పనికిరాక పైపెచ్చు హానికరంగా తయారవడమో జరుగుతుంటే ఇక మనదేశానికి భవిష్యత్తేది? ఈనాడు నేలరాలి పోయిన పసిరిమొగ్గను ఒక్కదాన్నే నేను కళ్ళారా చూశాను. ఇలా ప్రతినిత్యం ఎన్ని పసిరిమొగ్గలు రాలిపోతున్నాయో! ఎప్పుడైనా మన సమాజంలోని మేధావులుకాని, రాజకీయవేత్తలు కాని, ఉపాధ్యాయులు కాని, విద్యావంతులు కాని, కనీసం తల్లిదండ్రులుగానీ ఆలోచించారా? అలా రాలిపోడానికో, లేక చీడపురుగుల్లా మారిపోవటానికో ఆ పసిరిమొగ్గలను పట్టి పీడిస్తున్న పరిస్థితులేమిటో, కారణాలు ఏమిటో ఒక్కసారి మనం ఆలోచించి వాటి నివారణకు సరియైన, తక్షణచర్యలు తీసుకోకపోతే ఇక మనకు మిగిలేది అంధకారంలో అలమటించే భావితరమే! అందుకే అంటున్నాను ఇలాటి పసిరిమొగ్గలను శ్రద్ధాసక్తులతో పెంచాల్సిన బాధ్యత స్వీకరించకుంటే ఈ సమాజానికి చివరికి అక్షేయారంలో ఉండదు అని! " (సోమంచి రామం, పసిరిమొగ్గలు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 18-4-79, పే 69-75)

తప్పుచేసినవ్యక్తిని దండించటం వంటి సూత్రీకరణలద్వారా దండనను న్యాయబద్ధమైనదిగా చూపటం జరుగుతుంది. అయితే వ్యవస్థీకృతంగా విధించే శిక్షలకు మరింత హేతుబద్ధత అవసరమని గుర్తించాల్సి ఉంటుంది. అయినా దండనలవిషయంలో జరిగే అనేక చర్చల్లో ఈ విషయం విస్మరించడం గమనిస్తాం. శిక్షను ఒక అధికారయుతమైన చర్యగా భావించడమే ఇందుకు ప్రధానకారణం. అయితే అది సమంజసంకాదు. కానీ ఇటువంటి భావన అనేకమందిలో కనిపిస్తుంది. అటువంటి భావనలను ప్రతిబింబించే రచన 'బలి'. విధించే శిక్షలను శిక్షణలో భాగంగా భావించేవారి చర్యలు విద్యారంగంలో ఎటువంటి విషపరిణామాలకు దారితీస్తాయో ఇందులో చిత్రించటం చూస్తాం.

లోకంలోని డిసిప్లిన్ అంతా తనసొత్తు అన్నట్లుంటే ఆయన అందర్నీ లైనుగా నిల్చోబెట్టాడు.

" వై ఆర్ యూ మేకింగ్ నాయిస్? "

అంతే అందర్నీ చేతులు చాచమన్నాడు.

అమాయకులైన మూడేళ్ళ పిల్లల దగ్గరనుంచి ఆత్మాభిమానంకల హైస్కూలు పిల్లలవరకు అందరిని కర్రతో ఛెళ్ళున కొట్టాడు. ఆ పిల్లలందరూ తన ఆధిక్యం ప్రదర్శించుకునేందుకు పనికివచ్చే సాధనాలు. ఎంత ఎక్కువ పనిష్మెంటు ఇస్తే అంత ఎక్కువ డిసిప్లిన్ మెయింటెయిన్ చేస్తున్నట్లు అనుకుంటాడాయన. స్నేహపూర్వకంగా కూడా డిసిప్లిన్ మెయిన్‌టెయిన్ చేయవచ్చని ఆ మూర్ఖుడికి తెలియదు.

ఆ దెబ్బలు వారి వంటికి తగలలేదు. హృదయంమీద పడ్డాయి. ఆ గాయాలు ఏనాటికీ మానవని ఆ మాస్టరుకి తెలియదు. ఎందుకు తెలియదు! తెలుసుకోవచ్చు! తెలుసుకునే ప్రయత్నం చేయడు!(విజయలక్ష్మీ మురళీధర్, బలి, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 8-1-'87, పే 108-112)

అధికారయుతంగా శిక్షలను అమలుపరచటానికి సమర్థనగా కొన్ని కారణాలు చూపుతారు. శిక్షించటం వ్యక్తుల స్వీయం నిర్ణయానికి వదిలేస్తే వారు స్వ, పర భేదాన్ని చూపేప్రమాదముంది. అంతేకాకుండా తప్పులు వెదకటంలో అనైతిక ఉద్దేశ్యాలు, అనిశ్చితి చోటుచేసుకుంటాయన్నది వీరి వాదన. సంస్థాగత ప్రక్రియలో ఇలాంటివాటికి వీలుండదని పేర్కొంటూ అందుకు కొన్ని ఉదాహరణలను చూపుతారు. శిక్షించేందుకు అధికారంగల వ్యక్తి ప్రతి తప్పుకు శిక్షలువిధించటం అంగీకారయోగ్యం కాదు. తల్లిదండ్రులు తమ పిల్లలను దండించే అధికారం ఉంటుంది కాని తాము పట్టుకున్న దొంగను శిక్షించే అధికారం ఉండదు. ప్రభుత్వాధికారులకు నేరస్తులను దండించే అధికారం

ఉంటుంది కాని ఇతర తప్పులను శిక్షించే వీలుండదు. కాబట్టి సంస్థాగత దండనలు సమర్థనీయమే అన్నది వీరి భావన.

అయితే శిక్షను వ్యక్తి నైతికవైఫల్యానికి ఫలితంగా భావించేట్లయితే నైతికతలోని వైవిధ్యాలగురించి మనం చర్చించాల్సి ఉంటుంది. ఒకరికి నీతిబాహ్యంగా అనిపించింది మరొకరికి మరొకవిధంగా అనిపించవచ్చు. అలాంటప్పుడు ఒకచర్య శిక్షార్హమైనది అని ఎవరు నిర్ణయించాల్సి ఉంటుంది? ఇందుకోసమే ప్రజాస్వామ్య సంస్థలున్నాయని పేర్కొనటం సులభం. అయితే విస్తృతాధికారాలు కలిగిన అతిపెద్ద సంస్థలుకూడా న్యాయబద్ధంగా వ్యవహరించలేకపోతున్నాయని అవి విధించే శిక్షలలోని అసంబద్ధతనుబట్టి అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత సామాజికసంస్థలు న్యాయాన్నికాపాడుతున్నాయని, అందువల్ల వాటి దండనా విధానం అంగీకరించదగినదని భావించలేం. పాఠశాలకు సంబంధించిన విద్యాలక్ష్యాల సాధన పేరుతో విద్యార్థులను దండించేఅధికారం ఉపాధ్యాయులు కలిగిఉండటం న్యాయబద్ధమని అంగీకరించటం కూడా ఇలాంటిదే. పాఠశాలల్లోని దండనావిధానం గమనించినట్లయితే విద్యార్థులు దండించబడేందుకు కారణమైన అనేక నేరాలు వ్యవస్థాజనితమైనవే. అంటే సంస్థలు విద్యార్థులు తప్పుచేసే పరిస్థితులు కల్పించి అన్యాయంగా నేరానికి పురికొల్పటం ఈ కోవలోకేవస్తుంది. విసుగుపుట్టించే బోధన, అనవసరమైన నియంత్రణ, అనారోగ్యకరమైన పోటీతత్వం వంటి పరిస్థితులు విద్యార్థులను తప్పుచేసేందుకు పురిగొల్పుతాయి. వ్యవస్థీకృతమైన దండనావిధానంలోని తీవ్రఇబ్బందులు ఇవి.

విద్య -- పాఠశాల కేంద్రంగా సాగే దండనలను గురించి ఆలోచించినప్పుడు విద్యార్థులు దండనకు గురికాకుండా ఉండేందుకు ప్రయత్నించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తప్పులకు దండనలుండాలని భావిస్తే, బాల్యదశలో విద్యార్థుల చర్యలకు వారిని బాధ్యులను చేయలేం కాబట్టి, వారు శిక్షలకుకూడా అర్హులుకారు. ఇటువంటి అభిప్రాయం తెలుగు సాహిత్యంలో 'పాలబుగ్గల పసివాడు'లో స్పష్టంగా వ్యక్తం కావటం మనం గమనించవచ్చు.. దండనకు సరైన ప్రాతిపదిక లోపించటం ఇందులో కనిపిస్తుంది.

బడికి వెళ్ళే దారిలో వాడికి తోచుకువచ్చిన ఆలోచనలు ఇవి:

' నేను ఖూనీ చేశానా?

దొంగతనం చేశానా?

ఎవరినైనా కొట్టానా?

ఎవరిమీదనైనా తిరగబడ్డానా?

గుబద్ధాలాడానా?

అల్లరి చేశానా?

మరైతే, ఇప్పుడు బడికి ఎందుకు వెళుతున్నాను?

ఏంతప్పు చేశానని?.....

బడిలో పంతులమ్మ ఇంటిపాఠం చూపించమన్నది. పలక చూపాడు మూర్తి. పంతులమ్మ బెత్తం అందుకున్నది. మూర్తి బెత్తంవైపు చూశాడు. వాడికి పంతులమ్మ ముఖం బాగాతెలుసు. పుస్తకాలకొట్టువాడి ముఖంకూడా తెలుసు . అయితే, మొదటివారం లోగా పాఠ్యపుస్తకాలు విడుదలవుతాయని ప్రకటించిన మంత్రిముఖం తెలియదు. పాఠ్యపుస్తకాల అట్టలపైన ముద్రించబడే 'ప్రభుత్వ ప్రచురణము' అనేది వాడికి తెలియదు.

వాడికి కనిపిస్తున్నదొకటే! బెత్తం! (-----, పాలబుగ్గల పసివాడు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 29-11-78, పే 76-77)

విద్యార్థులపై తీసుకునే చర్యలు వారికి శిక్షణనిచ్చేవిగా ఉండాలేతప్ప శిక్షించేవిగా ఉండకూడదు. ఈ విషయంలో కొంత అవగాహన అవసరం. చిన్నపిల్లలను శిక్షలకు మారుగా క్రమశిక్షణలో ఉంచేప్రయత్నం చేయాలి. క్రమశిక్షణ నైతికమైన అభివృద్ధిదిశగా సాగుతుంది. కానీ

దండనలో నేరానికి శిక్ష మాత్రమే ఉంటుంది.

పాఠశాలల్లో చోటుచేసుకునే దండనలు, ఇంకా విద్యార్థులను దండించే విషయంలో ఉపాధ్యాయులకుగల అధికారం -- విద్యకు, శిక్షలకు మధ్యగల సంబంధం ఎంతసమస్యాత్మకమైనదో తెల్పుతాయి. దండన అవసరమైన పరిస్థితుల్లోకూడా అది విద్యావ్యతిరేకమైనదిగానే ఉంటుంది. విద్యావిలువలు కాపాడేందుకుద్దేశించిన విద్యాసంస్థల్లో చోటుచేసుకునే దండనలు విద్యతో వాటికిగల సంబంధాన్ని ప్రశ్నార్థకంగా మారుస్తాయి. దండనలు విద్యాలక్ష్యసాధనకు దోహదపడుతాయా? అన్నది ఒక పెద్ద సమస్య.

ఈ సమస్యను వెలుగులోకి తెచ్చిన రచన 'సదువు'. చదువు హింసకు పర్యాయపదంగా రూపొందుతున్న పరిస్థితులపట్ల నిరసనరూపమే ఈ రచన.

"నేను బడికి పోనుపో " అని మొండికేసిన సర్వన్నను ఎన్నో హింసలు పెట్టారు. ఇల్లు పోలీస్‌లాకప్‌లా మార్చారు. తొడపాశం పెట్టారు. కోదండంఅని దూలానికి తలకిందులుగా వేలాడదీసి కొట్టారు. తిండికి ఎండబెట్టారు.------అన్నను కొట్టిన దెబ్బలు చూసి భయంతో తాను బడికి వెళ్ళాతేమో-- చదువు గురించి ఎందుకింత హింస.

విశ్వకవి రవీంద్రుడు పద్నాలుగేళ్ళదాకా చదువనేది లేకుండా స్వేచ్ఛగా తిరిగాడు. చదువు గురించి ఒత్తిడి లేనందువల్లే టాగోరు విశ్వకవి అయ్యాడేమో. అందుకే ఆయన స్వేచ్ఛాయుత విద్యకోసం శాంతినికేతన్ స్థాపించాడేమో. సర్వన్న కూడా టాగోర్‌కున్న అవకాశాలుంటే గొప్ప రచయిత అయ్యేవాడేమో.-----------------

"ఉన్నమాట చెప్పాలంటే నేటి పాఠశాల విద్యావ్యవస్థ పిల్లల సృజనాత్మకతకు, స్వేచ్ఛకు వారి ఇష్టాలకు తగు ప్రాధాన్యం ఇవ్వటంలేదు. స్వీయ వ్యక్తీకరణ శక్తిని అణచివేసి వారిని రిలే కేంద్రాలుగా మారుస్తోంది. వారిని ఒక టేపు రికార్డరు లా, ఒక రేడియో, టీవి రిలేకేంద్రాలుగా మార్చుతున్నాం. నీవుచెప్పింది నీకు అప్పగించడం, పాఠ్యాంశాలకు జవాబు రాయడం ఇవన్నీ మనిషిలోని శ్రద్ధాసక్తుల్ని సృజనాత్మకతని అణచివేయడమే కదా. కేవలం లిపి నేర్చుకోవడం కోసం అన్నేళ్ళు చదువుకోవలసిన పనలేదు. తనతోవలో తాముపోయేవాణ్ణి పిలిచి మరీ దెంప మీద కొట్టినట్లు దళితుల్ని పాఠశాలకంటూ రప్పించి నీ మెదడు మొద్దురాచిప్పని ముద్రవేసి అణిచివేస్తోంది వ్యవస్థ" నిష్కర్షగా అన్నారు లక్ష్మయ్య.

"అంటే బడిలో నేర్చుకునేదేదీ జీవితానికి పనికిరావడంలేదనా?"

"నేను అలా అనడంలేదు. ఈ వ్యవస్థ ప్రకారం పాఠంలో ఏవుందో అదే పిల్లలు వ్యక్తీకరించాలి. పాఠం చదివేక పిల్లలకు కలిగే కొత్తభావాలను వ్యక్తీకరించే అవకాశం ఈ విద్యావ్యవస్థలో లేదు. ఇదొకటి. రెండోది. కొందరికి విషయం అర్థమవుతుంది కాని వ్యక్తీకరించలేరు. మూడోది కొందరు పాఠాల్లోని కొన్ని విషయాల్ని హృదయంలోనే దాచుకోవాలనుకుంటారు. అసలు సృజనాత్మకతను, వ్యక్తీకరణ శక్తిని కక్కు, కక్కు అని అనివార్యం చేయడమే సరైందికాదు.---------నీవు చెప్పిందాన్ని పిల్లలు తిరిగి అప్పజెప్పాలని కోరడం సృజనాత్మకత ఎలా అవుతుంది? నీవు, నీ పాఠానికనుగుణంగా పిల్లల్ని మరబొమ్మలుగా చ్రుతున్నావు. సరిగ్గా చెప్పాలంటే పాఠాన్ని అప్పగించాలి అనేంత నిర్బంధం మరొకటి లేదు. ఏమంటే పాఠంలోని భావాలని తన భావాలుగా 'అంగీకరిస్తే' తప్ప పిల్లలు సరిగా వ్యక్తీకరించ లేరు. పిల్లల భావాలకు విరుద్ధంగా నీ భావాలు లేదా నీ పాఠం ద్వారా చెప్పే భావాలు వారిపై నిర్బంధ భావాలుగా రుద్దబడడంలేదా?"---------

తర్జన భర్జనలు జరిగాయి. తనకు తాను స్వేచ్ఛగా తెల్సుకునే పరిస్థితులు, అవకాశాల్లో ఆసక్తి, అభిరుచి కలిగించేదిగా ఉండడమే సరైన సహజ విద్యావిధానం అని ఏకాభిప్రాయానికి వచ్చారు.-------------------

ఆటలు, పనిపాటలు, కలగలిసిన ఆశ్రమ విద్య విద్యార్థుల్లో జీవితమే ఒక ఆట అనే ఆనంద దృక్పథాన్ని కల్గించింది. (బి.ఎస్.రాములు, సదువు, బి.ఎస్.రాములు కథలు, పే 46-57)

విద్యార్థుల ప్రవర్తనలోని లోపాలకు విద్యావ్యవస్థలోని అసంబద్ధ విధానాలు కారణమైనప్పుడు విద్యార్థులను శిక్షించడంలోని ఔచిత్యాన్ని ఈ 'సదువు' ప్రశ్నించింది.

దండనవిధించే వారి తీర్పుతో దండనపొందే వ్యక్తి భాగం కానంతవరకు దండన అనేది అణచివేతచర్యగాను, భయం,అసహనం కలిగించేదిగానే ఉంటుంది. అంటే తనుచేసిన తప్పును గుర్తించి, దండన దానికి తగినదని వ్యక్తి భావించినపుడే దండనన్యాయబద్ధమైనదిగా గుర్తింపుపొందుతుంది. అయితే పాఠశాలల్లో చోటుచేసుకునే అనేకం విద్యార్థుల ప్రయోజనాలకు భిన్నంగానే ఉంటాయి. దండనతో ఇచ్చే వివరణ దండనకు కొంతమేరకు మద్దతుగా నిలుస్తుంది. అయితే అది చాలదు. వివరణలు వారధులుగా ఉండవచ్చు. కానీ అవి దూరాన్నికూడా గుర్తుచేస్తాయి.

ఈ మధ్యదూరమే విద్యాసంబంధంగా సరైన చర్యగా భావించే దండనకు అడ్డంకిగా నిలుస్తుంది. కారణాలేమి చెప్పినప్పటికీ అనైతిక చర్యలవలన మానవసంబంధాలలో విఘాతం ఏర్పడుతుందన్నది వాస్తవమే. అయితే అనైతిక సంఘటనకు విధించిన శిక్ష ఈ అంశాన్ని వ్యక్తంచేయగలిగి ఉండాలి. కానీ పాఠశాలలతో సహా ప్రభుత్వసంస్థలలో నేరాలు, శిక్షలుకూడా వ్యక్తిసంబంధమైనవిగా భావించబడవు. సంస్థాగత నియమానుసారంగా మొత్తం ప్రక్రియ కొనసాగుతుంది. శిక్షలువిధించే ముందు తర్వాతకూడా ఉపాధ్యాయ, విద్యార్థి సంబంధాలు అంతంతమాత్రంగానే ఉంటాయి. ఈ ప్రక్రియలో ఉపాధ్యాయ, విద్యార్థి సంబంధాలలో నేరం, శిక్షలపాత్ర అధికంగా ఉండి శిక్షను అమలుపరచేందుకు అనుగుణమైన వాతావరణానికి వీలులేకుండా చేస్తుంది. ఫలితంగా పాఠశాలలకేంద్రంగా సాగే దండనలను వ్యతిరేకించేందుకు తల్లిదండ్రులకు అవకాశం దొరకుతుంది.

శిక్ష తీవ్రతనుబట్టి శిక్షకుచెందిన విద్యావిలువ ప్రాధాన్యం సంతరించుకుంటుంది. తప్పుకు తగినస్థాయిలో దండనలుండాలి. అయితే తప్పుకు దండనకు స్థాయిని నిర్ణయించటం సులభసాధ్యమైన పనికాదు. అయితే పాఠశాలల్లో చోటుచేసుకునే అనేక దండనలలో తప్పును సరిదిద్దే నిబద్ధత లోపించటం సహజపరిణామం. ఇలా దండన ఉద్దేశించబడిన పూర్వాప్రవర్తనపట్ల అసంబద్ధమైన చర్యగా మిగిలిపోతున్నది.

సరిగ్గా ఇదే అంశాన్ని ప్రముఖంగా ప్రతిబింబించిన రచన విజయలక్ష్మీ మురళీధర్ 'బలి'. ఈ రచనలో వ్యక్తిగత క్రమశిక్షణ పేరుతో దండించిన విధానం, అందులో తప్పునుసరిదిద్దే నిబద్ధతలోపించటం స్పష్టంగా కనిపిస్తుంది.

అసలే తెల్లటి రంగుకల పిల్లవాడు. వీపుమీద వెదురుకర్రతో కొట్టిన చారలు ఎర్రగా అతి దారుణంగా కనిపించాయి.

"అంతటి శిక్షపడేంత అల్లరిచేసే పిల్లవాడు కాదే!"

"అదేనమ్మా మంచినీళ్ళు తాగడానికి వెళుతుంటే దారిలో లెక్కలటీచరు కనిపించిందట. విష్ చేయలేదని రూమ్‌కి పిలిపించి ఈ పనిచేసింది మహాతల్లి"

"కంప్లెయింట్ ఇవ్వలేదా!" ఆవేదనతో అడిగింది.

"ఆ మాట ఆ గొడవ అందుకే! కంప్లెయింట్ చేస్తే మార్కులు తక్కువేస్తుందని గొడవ పెడుతున్నాడు..." ఆమె మాటల్లో క్షోభ ఆగక కన్నీటిధారగా పొంగింది.

ఆ క్షోభ ఇంకెవరికి అర్థమవుతుంది? ఇంకో తల్లికి తప్ప!

..........

ఆనందాతిరేకంలో మునిగివున్న ఆ పిల్లలు ముందుగా చూసుకోలేదు వారి పెద్దసారు వచ్చి అక్కడ నిలుచున్నట్లు.

ఆయనొక్కక్షణంచూసిన వారి నవ్వులు టక్కున ఆగిపోయాయి. ఆయన కళ్ళలో నిప్పులు చెరుగుతున్నాయి. చేతిలో వున్న వెదురుకర్ర పిల్లలని భయపెట్టింది. ఆ వెదురుకర్ర మహిమ వారికి తెలియనిదికాదు. ఆ వెదురుకర్ర భయంతోనే స్కూల్లో కిక్కురుమనకుండా రోజంతా గడిపేస్తారు.

లోకంలోని డిసిప్లిన్ అంతా తనసొత్తు అన్నట్లుండే ఆయన అందర్నీ లైనుగా నిల్చోపెట్టాడు.

"వై ఆర్ యూ మేకింగ్ నాయిస్?"

అంతే అందర్నీ చేతులు చాపమన్నారు.

అమాయకులైన మూడేళ్ళ పిల్లల దగ్గరనుంచి ఆత్మాభిమానంకల హైస్కూలు పిల్లలవరకు అందరినీ కర్రతో ఛెళ్ళున కొట్టాడు. ఆ పిల్లలందరూ తన అధికారం ప్రదర్శించుకునేందుకు పనికివచ్చే సాధనాలు. ఎంత ఎక్కువ పనిష్మెంటు ఇస్తే అంత ఎక్కువ డిసిప్లిన్ మెయింటెయిన్ చేస్తున్నట్లు
అనుకుంటూంటాడాయన. స్నేహపూర్వకంగా కూడా డిసిప్లిన్ మెయింటెయిన్ చేయవచ్చని ఆ మూర్ఖుడికి తెలియదు.

ఆ దెబ్బలు వారి వంటికి తగలలేదు. హృదయంమీద పడ్డాయి. ఆ గాయాలు ఏనాటికీ మానవని ఆ మాస్టరుకి తెలియదు. ఎందుకు తెలియదు! తెలుసుకోవచ్చు! తెలుసుకునే ప్రయత్నం చేయడు!

..........

సుమతికి మనసంతా చికాకుగా ఉంది.

పిల్లలు సున్నితహృదయులు. ఇప్పుడేవి ముద్రపడితే వారి హృదయాల్లో అవి శాశ్వతంగా వుండిపోతాయి.

ఈ పనిష్మెంటులు ఇవ్వటం ఏ రకంగా పిల్లల మనోవికాసానికి పనికి వస్తుంది!

జీవితం చాలా పెద్దది. పిల్లలెప్పుడూ మొదటిదశలోనే ఉంటారు. అలాంటిది ఆ దశలోనే వారి జీవితం భయాందోళనలతో మొదలైతే, వారు ఆహ్లాదకరమైన వాతావరణంలో పెరగకపోతే ఎలా! వారు మంచి పౌరులు కావాలంటే, ప్రేమ, సామరస్యత లాటి సాధనాలని టీచర్లు ఉపయోగించాలి కానీ ఇలా గుడ్లెర్రచేసి, బెదురుకర్రలు చూపించీ భయపెట్టేట్లు చేయటం ఏరకంగా పిల్లల భవిష్యత్తుకి ఉపయోగపడుతుంది!

..............

ఆయన వళ్ళంతా జ్వాలలు పోశాయి.

ఆ పిల్లవాడి తల్లి తనమీదా, తన స్కూలుమీదా కంప్లెయింట్ ఇచ్చిందన్న సంగతి మరీ మరీ గుర్తుకివచ్చి ప్రతీకారం భగ్గుమంది. వేటాడగా, వేటాడగా చేతికి చిక్కిన లేతపిల్లగా కనిపించాడు బాబీ. ఆయన తీవ్రమైన చూపులకి బాబీతోపాటు మిగతా పిల్లలు కూడా జడుసుకున్నారు.

మెల్లిమెల్లిగా బాబీ వైపుకి కదిలాడు. బాబీ కూడా మెల్లిగా గోడవైపుకి వెనక్కి జరిగాడు.

తన తప్పేమిటో తెలియలేదు బాబీకి.

కసాయివాడు గొర్రెపిల్ల మెడమీద వేయబోయే వేటుకోసం ఎదురుచూస్తున్నట్లున్నారు మిగతాపిల్లలు.

ఆ పిల్లాడిని కొట్టడానికి లేచిన బెదురుకర్ర ఇంకా బాబీకి తగలనైనాలేదు.

బాబీ బిర్రబిగుసుకుపోయాడు. గాలి స్తంభించి పోయింది.

ఏనాడూ ఎదుటివాడిని నొప్పించి ఎరగడు.

ఏనాడూ కష్టం తెలియకుండా పెరిగినవాడు.

ఇంకా లోకం అంటే ఏమిటో తెలియనివాడు.

ఏనాడూ కన్నవారితో దెబ్బలు తినలేదు.

ఏనాడూ దెబ్బలుతినేటంత తప్పు చేయలేదు!

అందుకే

బాబీ గుండె ఆగిపోయింది!! (విజయలక్ష్మి మురళీధర్, బలి, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 8-1-'87, పే 108-112)

శారీరక శిక్షలు, పాఠశాలనుంచి తొలగించటం, దూషణ, సౌకర్యాలను నిరాకరించటం వంటివి విద్యాపరంగా వ్యతిరేకమైన, అనుత్పాదకమైన చర్యలుగా భావించబడతాయి. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాఠశాలల్లో పిల్లలను శిక్షించటాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులివ్వటం హర్షించదగ్గ పరిణామం. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ 18-2-'02న జారీచేసిన్న 16వ నెంబరు ఉత్తర్వు ప్రకారం 1966 సమగ్ర విద్యానిబంధనలలోని 122వ రూలుకు సవరణ సూచించారు.

In the said rules, the rule 122:

In the opening portion standard forms of punishments item (2) "Corporal Punishment" shall be omitted. Sub-rule (2) shall be omitted. The existing sub-rules (3), (4), (5) and (6) shall be read as (2), (3), (4), and (5) respectively.

అయితే పాఠశాలలో దండనను నిషేధించటంతో ఈ సమస్య పరిష్కారమైనట్లుగా భావించలేము.

"The elimination of punishment from social relationships, Paul Wilson argues, would only be possible along with the elimination of whole moral order of life." (P.S.Wilson,1971:113)

న్యాయానికి, వ్యక్తిగత బాధ్యతలకు విలువనిచ్చే సామాజికనిర్మాణంలో దండననుకాని, కనీసం దండించే అధికారంలో విశ్వాసాన్నికానీ సామాజిక క్రమంనుంచి వేరుపరచలేము. అయితే ఆచరణలో ఈ భావన ఇబ్బందులను ఎదుర్కొంటుంది. పాఠశాల కేంద్రీకృత శిక్షలవిషయంలో ప్రధానసమస్య శిక్షలుగా వాటి స్వభావాన్ని గురించికాదు. పాఠశాలవ్యవస్థలో వాటిని అమలుపరిచే విధానం గురించే ఆలోచించాల్సిఉంది. నిజానికి అక్కడ విద్యావిలువలను కాపాడటం, వాటిని

విద్యార్థులలో పెంపొందించటమే వీని ప్రధానఉద్దేశ్యం తప్ప వీనికి న్యాయం, వ్యక్తిగతబాధ్యతలు వంటి వాటితో ఎటువంటి సంబంధంలేదు. పాఠశాల దండనలలో ఎక్కువభాగం ఒకప్రత్యేక ఆధిపత్యసంబంధాన్ని సవాలుచేసే దురుసుప్రవర్తనకు సంబంధించినవై ఉంటాయి. అయితే ఆధిపత్యాన్ని సవాలుచేసే ఈ దురుసుప్రవర్తనలోని తీవ్రతాస్థాయిని కేవలం ఆ ప్రవర్తన ఆధారంగా గణించడం ఉండదు. అది సవాలుచేసిన ఆధిపత్యం అధికారస్థాయి ఆధారంగా నిర్ణయించబడుతుంది. ఈ అంశం పైరవనలో మనకు ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఇటువంటి చర్యల నైతికతను గణించేస్థాయిలో ఉపాధ్యాయులున్నారని నమ్మేందుకు వీలైన ఆధారాలు పాఠశాలచరిత్రలో మనకు లభించవు.

ప్రత్యామ్నాయ మార్గాలు లేనికారణంచూపి, ఉన్నవిధానాన్నే కొనసాగించటం సరైనచర్యగాభావించలేం. అందువల్ల ప్రస్తుత స్థితిని సవిమర్శనాత్మకంగా విశ్లేషిస్తూనే మరో ప్రత్యామ్నాయ మార్గాన్ని అభివృద్ధిపరచేందుకు ప్రయత్నించాల్సి ఉంటుంది.

*Overemphasis on the competitive system and premature specialization on the ground of immediate usefulness kill the spirit on which all cultural life depends, specialized knowledge included.*

*---Albert Einstein*
*(Ideas and Opinions p:67)*

==============

## విద్యలో పోటీ తత్త్వం

పందొమ్మిదవ శతాబ్దంలో ఆచరణలో ఉన్న అనేక భావనలలో కొన్ని ఇప్పటికీ సమాజంలో కొనసాగుతూనే ఉన్నాయి. అలా కొనసాగుతున్న భావనల్లో కొన్ని, క్రితంకంటే నేడు మరింత దృఢంగా వేళ్ళూనుకొని ఉండటం మనం గమనించవచ్చు. అలా దృఢంగా పాతుకుపోయిన భావనగా పోటీతత్త్వాన్ని పేర్కొనాలి. సమాజంలో ఈ పోటీ తత్త్వానికి ప్రధానకారణం 'డార్విన్ సిద్ధాంతం' అని పేర్కొంటారు. కాని ఇందుకు భిన్నంగా 'డార్విన్ సిద్ధాంత' రూపకల్పనకు సమాజంలోని ఈ పోటీతత్త్వమే మూలకారణమన్నది వాస్తవం. పోటీ ప్రధాన భూమికగా చేసుకునే, అనేకసమాజాల్లో పారిశ్రామికవాదం మొలకెత్తింది. అయితే పారిశ్రామికీకరణకు ప్రభుత్వాలనుంచి స్వల్పంగానే సహాయ సహకారాలందాయి. అందువల్ల మొదటితరం పారిశ్రామికవేత్తలు అధికంగా స్వయంశక్తి, స్వేచ్ఛ, పోటీ వంటి అంశాలపైనే ఎక్కువగా ఆధారపడ్డారు. అలా పరిశ్రమల్లో మొదలైన పోటీతత్త్వం సమాజంలో మిగిలిన అన్నిరంగాలకూ ప్రాకింది. పరంపరాగతమైన అభివృద్ధికి జీవితంలోని విభిన్నపార్శ్వాలలో జరిగే పోటీ ప్రధాన భూమిక వహిస్తుందన్నది డార్విన్ సూత్రీకరణ. దీని ఆధారంగా తరగతిగదిలో పోటీతత్త్వం విద్యార్థుల్లో శ్రమపడే స్వభావాన్ని పెంచేందుకు దోహదపడుతుందని విద్యావేత్తలు భావించారు. అలా ప్రారంభమైన స్వేచ్ఛాపూరితమైన పోటీతత్త్వం క్రమేణా పెట్టుబడిదారుల్లో తగ్గుముఖంపట్టి, మానవజీవితంలో మిగిలిన అన్ని పార్శ్వాల్లో (పెట్టుబడిదారీ వర్గాల్లో మినహా) మాత్రం ఒక ప్రముఖ ఆదర్శంగా నిలిచిపోయింది.

ఆ క్రమంలో విద్యారంగంలో ఏర్పడిన ఈ పోటీతత్త్వం రెండురకాల చెడుపరిణామాలకు దారితీసింది. సహకారతత్త్వం స్థానంలో పోటీతత్త్వానికి విద్యాబోధనలో అధిక ప్రాధాన్యం లభించటం మొదటిది. తరగతిగదిలో మితిమీరిన పోటీ ఏర్పడటం రెండవది.

ఉత్తమవిద్యార్థులను మితిమీరిన అధ్యయనానికి ప్రేరేపించటం ఈ పోటీతత్త్వం

విద్యావ్యవస్థకు అందించిన విషఫలంగా భావించాలి. ఫలితంగా విద్యార్థులలో సృజనాత్మకత, ఊహాశక్తి, మేధస్సువంటి మానసికశక్తులు సన్నగిల్లాయి. శారీరక ఆరోగ్యం దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. ఈ మితిమీరిన అధ్యయన ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతితరంలోనూ మేధావంతులైన యువకులు మానసికంగా వత్తిడికిగురౌతున్నారు. ఫలితంగా గొప్ప మేధోశక్తిని ప్రపంచం కోల్పోతున్నది.

పోటీతత్త్వం కారణంగా విద్యారంగంలో చోటుచేసుకున్న విషపరిణామాలు విస్తృతంగా, వైవిధ్యభరితంగా తెలుగు సాహిత్యంలో చర్చించటం కనిపిస్తుంది. అందులో భాగంగా విద్యలో ఈ పోటీతత్త్వం తెల్లివైన విద్యార్థులపట్ల శాపంగా రూపొందిన వైనాన్ని ముందుంచుతుంది 'రేపటిపువ్వు'. ఈరోజు మొగ్గగా ఉన్న రేపటిపువ్వును బలవంతంగా రెక్కలువిడదీసి వికసింపజేయాలనిచూస్తే మొగ్గగాకూడా మిగలదంటూ సహజసుందరంగా వికసించాల్సిన పసివాళ్ల మేధ పసితనంలోనే పరిమళించాలని ఆశిస్తే కలిగే విషపరిణామాల చిత్రణ ఇందులో కనిపిస్తుంది.

"నిజం ఉషా! బాబు నిర్లిప్తతకూ, నిరుత్సాహానికీ మూలం ట్యూషన్ పేరుతో ఉన్న ఆ కాసింత స్వేచ్ఛామయ కాలాన్ని మాయచేసిన నిర్బంధపు చదువే!"

"చదువు లాభమే గాని నష్టం లేదనుకున్నాను."

"నష్టం లేదనుకున్నావు గాని వాడికెంత కష్టమో ఆలోచించలేక పోయావు. మాతృభాష కాని ఈ కాన్వెంట్ చదువుల్లో సబ్జెక్ట్ అర్థం చేసుకోటానికే వాళ్ళ చిన్నమెదడెంతో అలసిపోతుంది. మోపెడు పుస్తకాలు మూపున మొయ్యటం, స్ట్రిక్ట్‌గా క్లాస్ వర్కులూ, ఆపైన పదేసిపార్లు హోంవర్కులు చెయ్యటమే పిల్లలకు శక్తికి మించిన పనులవుతున్నాయి." నిట్టూర్చింది పద్మ.

................

"ఉషా అదిగో ..... రేపటి ఆ పువ్వు చూడు. దాని రూపం ఈరోజు మొగ్గ. రేపటిదాకా ఆగితే దానంతటదే అతి సహజంగా సుందర సుమమవుతుంది. పసివాళ్ళ మేధ కూడా అంతే! పసితనంలోనే పరిమళాల ఫలితాలు వెదజిమ్మాలని ఆశించటం అత్యాశే కాదా? రేపటిదాకా ఆగలేక బలవంతంగా రెక్కలు విడదీస్తే... అది పువ్వు కాదు... మొగ్గగా కూడా మిగలదు!"

....................

"అందుకే ఉషా! అంత తొందరెందు కంటున్నాను. పిల్లల్లో గ్రహణశక్తి పెరిగేకొద్దీ...... అన్నీ సులభ సాధ్యమవుతాయి వాళ్ళకి. అంతేగాని తెలివైనవాడు కదాని శక్తికి మించిన బాధ్యతలప్పజెప్పుతూ, రోజంతా ప్రేమకూ, లాలనకూ, సహజానందానికీ, వాళ్ళను దూరంచేస్తూ, మరీ యాంత్రికంగా తయారుచేస్తే.... బాతూ బంగారు గుడ్డూ కథలా మొదటికే మోసం..... " (కె.వీణారెడ్డి, రేపటిపువ్వు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 11-1-89, పే 14-17)

సాధారణవిద్యావేత్త విద్యార్థులలో ఊహాశక్తిని వీలైనంతమేరకు నాశనంచేసేందుకు ప్రయత్నిస్తుంటాడు. ఊహాలనేవి నిబద్ధతలేనివి, క్రమశిక్షణకు లోబడనివి, వ్యక్తిగతమైనవి. వీటిని సత్యమని, అసత్యమని తేల్చిచెప్పలేము. అయితే విద్యార్థుల ప్రతిభను గణించాల్సి వచ్చినప్పుడు ఇవన్నీ ఉపాధ్యాయునికి అడ్డంకిగా నిలుస్తాయి. అంతేకాకుండా వాస్తవప్రపంచంతో విద్యార్థికి సంబంధం పెరిగేకొలదీ విద్యార్థిలోని ఊహాశక్తిని ప్రోత్సాహించటం మరింత క్లిష్టంగా మారుతుంది. దీనిఫలితమే విద్యారంగంలో చోటుచేసుకునే మేధోహింస.

ప్రాథమికస్థాయిలోను, మాధ్యమికస్థాయిలోను విద్యాపరంగా జరుగుతున్న మేధోహింసను చిత్రిస్తూ దానికి ఒక ఆరోగ్యవంతమైన ప్రత్యామ్నాయాన్ని ప్రతిపాదించిన రచన 'హింసధ్వని'.

ఒక ప్రక్కగా శిలువను భుజానేసుకుని మోస్తూ భారంగా నడుస్తున్న ఏసుక్రీస్తు. మరోప్రక్కగా పెద్దపరిమాణంలో వున్న పుస్తకాల సంచుల్ని వీపులమీద మోస్తూ భారంగా అడుగులేస్తూ నడుస్తున్న కాన్వెంటు బాలబాలికలు.

నేపథ్యంలో చర్చిగంటలు, రెళ్ళురెళ్ళుమంటూ వినిపిస్తూ కొరడా దెబ్బలు... సన్నగా వినిపిస్తున్న పిల్లల కోలాహలం...

చిగురించే బాల్యంపై
పుస్తకాల భారం
సుతిమెత్తని పువ్వుమీద
పెనుదక్కసి పాదం

ఆటలేదు పాటలేదు
ఊహాలేదు సృజనలేదు.
మార్కులు, ర్యాంకుల కొలతలు
పాఠశాల యంత్రశాల
..................
మనిషిని మనిషి కలిపే
విద్యనేడు రావాలోయ్
జ్ఞానానికి పరమార్థం
అనురాగం కావాలోయ్.
.................

శివ: చదువనేది జ్ఞాన సముపార్జనకు ఆలంబన కావాలిగాని డబ్బు సంపాదనకు మార్గం కాకూడదు. ..............

శివ: ఇంజనీరైనా, డాక్టరైనా, కలెక్టరైనా ఎంతో గొప్పది జీవితం. జ్ఞానం హోదాకోసం, గొప్పచెప్పుకోవటం కోసమో కాదు. మనిషి మనుగడకు ఉపయోగపడేదే అసలైన జ్ఞానం. ..........

సార: యస్! నేనంటున్నది నిజం. అసలు జబ్బు మీకు. చికిత్స చేయాల్సింది ముందు మీకు. మనిషికి వచ్చే ఒక్కో వ్యాధికి ఒక్కొక్క రకమైన క్రిములు కారణమవుతాయి. కల్పన వ్యాధికి కారణమైన క్రిములు మీరే! కల్పనంటే ఈ కల్పనే కాదు. వేలాదిమంది కల్పనలు. వారివ్యాధికి కారకక్రిముల్లాంటి తల్లిదండ్రులు--మీలా నేడు లక్షలమంది! పిల్లల్లో సహజంగా వుండే తెలివితేటల్ని బట్టి చదువుల్లో రాణిస్తారు. అభివృద్ధిలోకొస్తారు. తమ ఆశలకు, ఆకాంక్షలకు అనుగుణంగా పైకి రావాలన్న తల్లిదండ్రుల దురాశే ఈ రుగ్మతలకు అసలు కారణం. వేలంవెర్రిగా పిల్లల చదువుల కోసం ఆస్తుల్నేకాదు, తలలూ తాకట్టు పెడుతున్నారు. గుంటూరులో ఒక రెసిడెన్షియల్ కాలేజి విద్యార్థి చదివింది జ్ఞాపకం వుండటంలేదన్న నిరాశతో మూడంతస్తుల భవనంమీది నుండి దూకి ప్రాణాలు కోల్పోయాడు. మరో విద్యార్థి ఫ్యానుకు ఉరేసుకున్నాడు. పరీక్షల్లో పాసుకాలేదని, డిస్టింక్షను రాలేదని, ఎమ్.సెట్, ఇంజనీరింగుల్లో ర్యాంకులు రాలేదని.... ఇలా ఒకరా, ఇద్దరా... మానసిక రుగ్మతలతో సతమతమవుతున్న ఎందరెందరో విద్యార్థులు! ఆత్మహత్యలుగా చిత్రించబడుతున్న ఈ చావులన్నీ మీలాంటి తల్లిదండ్రులు మీలాంటి తల్లిదండ్రులు చేస్తున్న హత్యలు కావంటారా?.....చెప్పండి!

కృష్ణ: అవును సారధి! ఇవన్నీ హత్యలే! శిక్షాస్మృతి పరిధిలోకి రాని నేరాలే! బిడ్డ క్యార్‌మని ఏడుస్తూ భూమ్మీద పడగానే బారసాలకన్నా ముందే మెరిటిమీద రాతలు రాస్తున్నారు! గిరికీలు కొడుతూ గిలక్కాయలతో ఆడుకోవలసిన బాల్యాన్ని స్కూలు పందులకు ఉరితీస్తున్నారు. బిడ్డలు పుడుతూనే పుస్తకాలయి, సాక్సయి, బూట్లయి, యూనిఫారాలుగా ర్యాంకుల్లోకి మారి కన్నవాళ్ళ కలల్లో ఇంజనీర్లు, డాక్టర్లు, కలెక్టర్లయి పోతున్నారు. ................, మధ్యతరగతి మనుషుల్ని మహమ్మారిలా పీడిస్తున్న ఈ జబ్బుపేరే వృత్తివిద్యా వ్యామోహం.................

సార: Kalpana is suffering from a Major Depressive disorder, which is a serious illness. దిగులు, ఆందోళన, చదువంటే విముఖత, పరీక్షహాల్లో కూర్చోగానే గుండెదడ, జ్ఞాపకశక్తి కోల్పోయి జవాబులు రాయలేని దుస్థితి, అదో మానసిక దౌర్బల్యం. ఈ జబ్బు కేవలం మందులతో మాత్రమే నయంకాదు. ఆదరణ, ఆత్మీయత, అన్నిటినీ మించి స్వేచ్ఛ బ్రతుకు వాళ్లది, భవిష్యత్తూ వాళ్ళది. మీ దురాశా పూరితమైన ఆలోచనల బోనులో వాళ్ళ టాలెంట్‌ను బంధించకండి. వాళ్ళు మీరుగా కాదు. వాళ్ళు వాళ్ళుగానే పెరగాలి. అదే ఈ జాడ్యానికి అసలైన మందు.

శివ: నాకు తెలుసు! ఈ పరీక్షలు, మందులూ, మాకులూ నాచిట్టితల్లిని మామూలు మనిషిని చెయ్యలేవు. ఈ ప్రలోభాలకు, వ్యామోహాలకు, పోటీలకు, పరుగులకు దూరంగా తీసుకెళ్తాను. అంబాఅంటూ అరిచే లేగదూడల భాష నేర్పుతాను. చల్లని పైరుగాలులు, పచ్చని పంటపొలాలు చెప్పే ప్రకృతిపాఠాలు చదివిస్తాను. పక్షుల కిలకిలలు, సెలయేటి గలగలల సంగీతం వినిపిస్తాను. నేలతల్లి పైరు కథలు చెప్తాను. ప్రకృతి ఒడిలో మానవ జీవితాల్ని సార్థకంచేసే అసలు సిసలు కొత్త చదువులు చదివిస్తాను. అప్పుడు నాచిట్టితల్లి మామూలు మనిషవుతుంది.....మామూలు మనిషవుతుంది......(వల్లూరు శివప్రసాద్, హింసధ్వని, డా!!అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్, పే 545-564)

మరింత స్పష్టతకోసం పిల్లల చిత్రలేఖనం, వర్ణచిత్రాల విషయాన్ని గమనిద్దాం. ఐదు నుంచి ఎనిమిది సంవత్సరాల విద్యార్థుల్లో అధికశాతం స్వేచ్ఛాపూరిత వాతావరణంలో ప్రోత్సాహం లభించినపుడు చెప్పుకోదగిన ఊహాసామర్థ్యాన్ని కనబరిచారు. ఆత్మవిమర్శ చేసుకోగల స్థాయికి ఎదిగినతర్వాత అతికొద్దిమంది మాత్రమే తిరిగి చిత్రలేఖన సామర్థ్యాన్ని పొందగలిగారు. అయితే వారికి యధాతధంగా, ఖచ్చితమైన పద్ధతుల్లో చిత్రించటం బోధించిఉంటే వారు కళాత్మకంగా కాక శాస్త్రీయమైన చిత్రలేఖకులుగా రూపొందేవారు. ఫలితంగా వారి చిత్రాలలో ఊహలకు, కల్పనలకు స్థానం లేకుండాపోయేది. ఈ పరిస్థితిని ఎదుర్కోనాలంటే వారికి సరైనవిధంగా చిత్రించటంగురించిన

శిక్షణ, వారుకోరినప్పుడే, కోరిన అంశంలోనే అందించాలి. ఖచ్చితత్వం ప్రతిభకు గీటురాయి అన్న భావన వారికి రాకుండా చూడాలి. అయితే ఉపాధ్యాయునికి ఇది కష్టసాధ్యమైన అంశం. కళాత్మక నైపుణ్యం వ్యక్తిగత భావనలకు, అభిరుచులకు సంబంధించిన అంశం. అయితే లక్ష్యాత్మక పరీక్షలకు ఖచ్చితత్వం కొలబద్ద కావటంతో ఈ సంక్లిష్టత ఏర్పడింది.

విద్యార్థిలో వ్యక్తిగత నైపుణ్యాలను కాపాడాలంటే ఖచ్చితమైన బోధనను వీలైనంతమేరకు తగ్గించాలి. విద్యార్థుల వ్యక్తీకరణలో ఉపాధ్యాయుని జోక్యాన్ని తొలగించాలి.

వందమంది విద్యార్థులుగల ఏదైనా ఓ సాధారణ తరగతిని పరిశీలిస్తే తొంబైమంది కేవలం దండిస్తారనే భయంతో అభ్యసిస్తారు. తొమ్మిదమంది మాత్రం విజయం పొందాలనే పోటీ స్వభావం కారణంగా అభ్యసిస్తారు. ఒక్కరు మాత్రమే జ్ఞానం సంపాదించాలనే కాంక్షతో అధ్యయనం చేస్తారు. ఇటువంటి వైవిధ్యభరితమైన స్వభావాన్ని తొలగించటం సాధ్యంకాదు. అయితే స్వల్పకాలికం, స్వచ్ఛందం, నైపుణ్యవంతం అయిన బోధన ద్వారా 70శాతం మంది విద్యార్థులు జ్ఞానకాంక్షతో అధ్యయనం చేసేపరిస్థితులు కల్పించవచ్చు. గంటలతరబడి సాగే నిర్బంధ, అనాసక్తికర బోధనకంటే అతి స్వల్పకాలం సాగే స్వచ్ఛందమైన, ఆసక్తికర బోధనతో అధికంగా అధ్యయనంచేసే వీలుకలుగుతుంది.

అయితే ఇందుకు విరుద్ధంగా విద్యార్థుల వ్యక్తీకరణకు అవకాశమివ్వనిది, ఉపాధ్యాయుని నిరంతరజోక్యంతో నిండినది అయిన విద్యావిధానం అనివార్యంగా మారటం 'సందిగ్ధసంధ్య' చిత్రించింది.

రామకృష్ణ గారి విజయయాత్ర ఒకపక్క నుంచి యిలా సాగుతున్న తరుణంలోనే, మరోపక్క నుంచి ఎవరికీ తెలియకుండా ఓ అవాంఛనీయమైన మార్పు, మెల్లమెల్లగా దొపకింద నీరులాగ కాలేజీల్లోకి ప్రవేశించటం మొదలయింది. కాలేజీచదువుల అసలుఉద్దేశం సంపూర్ణ వ్యక్తివికాసం అనే అభిప్రాయం తెరమరుగై, దానిస్థానే పోటీపరీక్షలకి పనికివచ్చేదే విద్య అనేభావం చోటుచేసుకోవటం మొదలయింది. పోటీ ప్రపంచంలో విజయవంతమైన పోటుదీగా విద్యార్థిని తయారుచేసే వేదికలుగా కాలేజీలు రూపాంతరం చెందుతున్నాయి. ఈ ప్రక్రియలో భాగంగా సర్వసర్వత్రా ట్యుటోరియల్‌కాలేజీలు, రెసిడెన్షియల్‌కాలేజీలు పుట్టగొడుగుల్లా పెటపెటనా, పిచపిచగా పుట్టుకురావటం మొదలయింది. అందరు తల్లిదండ్రులకి ఒకటేకోరిక - తమ బిడ్డలు యింజనీర్లో, డాక్టర్లో అయిపోవాలి. ఆపైన వారు అమెరికా వెళ్ళిపోవాలి. అక్కడ అంతులేని డబ్బు ఆర్జించెయ్యాలి. "మావాడు స్టేట్స్‌లోవున్నాడు" అని అందరూ చెప్పుకోవాలి గొప్పగా. ఉడుకమైన ఉన్మాదస్థితి తల్లిదండ్రుల్ని ఆవహించేసింది. ఈ వెర్రికోరిక తల్లిదండ్రుల్ని ఎప్పుడు పెనుభూతంలా ఆవహించేసిందో, ఆనాటి నుంచే కళాశాలల్లో విద్యాస్వరూపాలు మారి పోయాయి. దాంతో ఎం.పి.సి., బై.పి.సి గ్రూపులు మాత్రమే అసలుసిసలైన చదువులనీ, తతిమ్మా ఆర్ట్స్ గ్రూపులు ఉత్తి చవట గ్రూపులనీ తల్లిదండ్రుల మనస్సుల్లో భావం ఏర్పడిపోయింది. .................

ఇంక తెలిసిందా శేఖర్, గవర్నమెంట్‌కాలేజీ లెక్చరర్లు వాళ్ళకాలేజీల్లో చాలా బరువైనజీతాలు పుచ్చుకుంటున్నారు. అయినా అది చాల్తున్నట్లులేదు. పార్ట్‌టైమ్ లెక్చరర్లుగా యీకాలేజీకి హడావిడిగా స్కూటర్లమీద వచ్చేసి, అదరాబదరా పాఠాలు చెప్పేసి, మళ్ళీ స్కూటర్లెక్కి వెళ్ళిపోతున్నారు. ఇవన్నీ చూస్తూ మతిపోయినవాడిలా నిలుచుండిపోయారు మేష్టారు. ఇది అని చెప్పటానికి వీల్లేని విస్పృహ ఆవరించేస్తోంది ఆయన్ని. కార్డినల్ న్యూమన్ ప్రబోధించిన "లిబరల్ పర్పస్ ఆఫ్ ఎడ్యుకేషన్" అన్నఉద్దేశం గాలికెగిరిపోయి, దానిస్థానంలో రిజల్ట్ ఓరియంటెడ్ ఎడ్యుకేషన్ వచ్చేసింది. చదువు గమ్యం జ్ఞానార్జనకాదు, ఉద్యోగార్జన, ధనార్జన అని చాటిచెపుతున్నాయి యీచదువులు అని భావించి మానసికంగా కృంగిపోతున్నారు మేష్టారు.

.................

ఈ సెటప్‌లో మనం సాధ్యమయినంత వేగిరం, అంటే ఈవెన్ కర్సరీగానైనా కోర్సులు పూర్తిచేసెయ్యాలి, ఆగస్టుకల్లా కోర్సులయిపోవాలి. ఆపైన కుర్రాళ్ళని పట్టుకొని రాత్రనక, పగలనక మారేసి, ప్రశ్నలన్నీ కంఠస్థంచేయించి, పరీక్షలకి తయారు చెయ్యాలి. మనలో మనమాట, యిక్కడచేరిన విద్యార్థులకి తెలివి, గిలివి లాంటివి ఏమీవుండవు. మన రెసిడెన్షియల్ కాలేజీలో చేరిన కుర్రాడు పరీక్షలు రాసేదాకా కాన్‌సంట్రేషన్‌కేంప్‌లో వున్నట్లే. మనం అంతలా పనిచేయిస్తేగాని వాళ్ళు ఎం.సెట్.లో రేంకులు తెచ్చుకోలేరు. ఆఫ్‌కోర్స్, ఆఖరినిముషంలో ఎమ్‌సెట్‌పేపర్నికూడా ఎలాగో ఓలాగ లీక్‌చేయించి మన విద్యార్థులకి అందేట్టు చెయ్యడానికి గట్టిప్రయత్నం జరుగుతుందనుకోండి. (ఎ.వి.రమణశాస్త్రి:- సందిగ్ధ సంధ్య, వంశధార కథలు,పే 52-59)

ఉపాధ్యాయుల భావాలతో విభేదించే విద్యార్థుల అభిప్రాయాలను ఉపాధ్యాయులు

ప్రోత్సహించాలి. బోధకుని భావాలను వ్యతిరేకించే రచనలనుకూడా చదివే అవకాశం విద్యార్థులకు ఇవ్వాలి. అయితే అన్వేషణను ప్రాదుకొల్పే భావనకు మారుగా అస్పష్టమైన సమాచారాన్ని దట్టించే విద్యావిధానంలో ఇది అరుదుగా జరుగుతుంది. ఇందుకు ఉపాధ్యాయుని నిందించాల్సిన పనిలేదు. కేవలం ద్వేషభావనలు, అసమగ్రతతో నిండిన సమాచార పరిజ్ఞానాన్ని ఉద్దేశించి రూపొందించిన పాఠ్యాంశాలే ఇందుకు ప్రధాన కారణంగా భావించాలి.

ఒక పేదకుటుంబంనుంచి వచ్చిన విద్యార్థి పరిస్థితిని పరిగణనలోకి తీసుకుంటే, అతని వ్యక్తిగతభావాలు పూర్తిగా మేధోసంబంధమైనవిగా ఉంటాయి. కానీ, అతని కుటుంబంలోనివారు మాత్రం పుస్తకపరిజ్ఞానం లేనివారు. అతను పేదరికానికి, ఒంటరితనానికి బలికాకుండా విశ్వవిద్యాలయస్థాయికి చేరితే తన అభిరుచికితగిన మిత్రులతో, తన అభిరుచులకు అనుగుణంగా జీవించాలని ఆశిస్తాడు. దీంతో అతను తెలివిగా కాకపోయినా ఉత్సాహపూరితంగా పనిచేస్తాడు. ఫలితంగా విద్యార్జన ముగిసేనాటికి తన మానసికసామర్థ్యాలను పూర్తిగా కోల్పోతాడు.

విశ్వవిద్యాలయాల్లో సాగే బోధనలో ప్రతివారికీ ఈ పరిస్థితి తప్పనిసరి. అయితే దీన్ని తొలగించటం సులభసాధ్యం కాదు. ప్రతిఒక్కరికి విశ్వవిద్యాలయ విద్యనందించటం కోరదగ్గదీ కాదు, ఆర్థికంగా అసాధ్యమైన అంశం. అందువల్ల విశ్వవిద్యాలయ ప్రవేశానికి ఏదో ఒక ఎంపికపద్ధతి అవలంబించాల్సి ఉంది. అదీ వ్యక్తిగత మేధోనైపుణ్యం మీద ఈ ఎంపిక ఆధారపడి ఉండాలి. అది ప్రవేశపరీక్షద్వారా కాకుండా, ఉపాధ్యాయులు తమ సాధారణపరిజ్ఞానంతో తమ పిల్లల్లోని కొంతమందిని ఎంపికచేస్తే కొంతమేరకు వత్తిడిని తొలగించనట్లవుతుంది. అయితే ఇది కొంతమేరకు స్వలాభాపేక్షకు, పక్షపాతధోరణికి దారితీయవచ్చు. అయితే అది ప్రస్తుతవిధానమంత లోపభూయిష్ఠమైనదిగా మాత్రం ఉండదు.

పట్టణప్రాంతాల్లో చాలినంత జనసమ్మర్దం గలచోట్ల శారీరక, మానసిక వికలాంగులకు ప్రత్యేక పాఠశాలల మాదిరిగానే మేధావులైన విద్యార్థులకు ప్రత్యేక పాఠశాలలు నెలకొల్పాల్సిన ఆవశ్యకత ఉంది. అమెరికాలో ఈ దిశగా ప్రయత్నాలు సాగినా అవి కొద్దిమోతాదులోనే జరిగాయి.

సృజనాత్మకతను మేధస్సుగా గుర్తించలేని అసంబద్ధ విద్యావిలువలను ఆలోచనాత్మకంగా 'అన్యాపదేశం' చిత్రించింది. అయితే మేధావులైన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణావసరాన్నికూడా ఈ రచనగుర్తించింది. అదేరీతిగా పిల్లల ప్రతిభ ఆధారంగా చేసే వర్గీకరణలోని అసంబద్ధతకూడా ఇందులో చర్చకువచ్చింది.

"ఔను. అబ్బాయి జస్ట్ ఎబోవ్ ఏవరేజ్. క్లాసులో పాఠం చెబుతున్నప్పుడు అటెన్షన్ చూపెడుతున్నట్టుగా కనబడడు. నోట్సు రాసుకుంటాడు కాని ఎగ్జామ్స్‌లో ఆన్సర్ యాజిటీజ్‌గా రిప్రొడ్యూస్ చెయ్యడు - అదర్‌థింగ్స్ జోడించి రాస్తాడు" హెచ్చెమ్ ప్రతిపాదనను బలపరుస్తున్నట్టుగా అంది క్లాస్‌టీచర్. ............

ప్రతిభావంతులు, ప్రతిభావంతులు కానివారు అనే ఈ అదృశ్య, అనధికార వర్గీకరణ జడసిద్ధాంతపు వెలుగులో విద్యార్థుల జవాబుపత్రాలను దిద్దే విధానంలోని అసంబద్ధత ఎవరైనా ఊహించుకోవచ్చు. ఈ అసంబద్ధత పిల్లల సమగ్ర వికాసానికి ఎలా అవరోధమవుతుందో ఆ పండితుడికి కొంచెం వివరంగానే చెప్పడానికి నిర్ణయించుకున్నాను. ............

"వర్గీకరణ ఒకమేరకు మంచిదే. ప్రతిభావంతుడు అన్న కితాబు కుర్రాడికి టానిక్‌లాగా పనిచేసి ఇతోధికంగా కృషి చేసి ఆ కితాబుని ఎల్లప్పుడూ సార్థకంచేసుకోవాలన్న స్ఫూర్తినిస్తుంది. అయితే ఇదే వర్గీకరణ ప్రతిభావంతుడు కానివాడు అనబడే కుర్రవాడిమీద నెగటివ్ ప్రభావం చూపుతుంది. వాడిని ఆత్మన్యూనతాభావంలో ముంచి వాడి సృజనాత్మకతను దెబ్బతీస్తుంది. ఆ ప్రమాదం జరగకుండా మీరు జాగ్రత్తలు తీసుకోవాలి." (ఆదెపు లక్ష్మీపతి, అన్యాపదేశమ్, ఆదెపు లక్ష్మీపతి కథలు, పే 122-129)

ఈ విషయంలో కొన్ని ఉత్సాహవంతమైన ఉదాహరణలు 190 ప్రజ్ఞాలబ్ధి(IQ)గల (సరాసరి ప్రజ్ఞాలబ్ధి 100) ఒక విద్యార్థి సాధారణ పాఠశాలలో ఉన్నట్లయితే అతనికి ఎటువంటి మిత్రులు

లేకపోగా ఒక మూర్ఖునిగా ముద్రవేయబడతాడు. అయితే ఆ విద్యార్థిని 164 సరాసరిప్రజ్ఞాలబ్ధి (IQ)గల ప్రత్యేక పాఠశాలలో చేర్పినప్పుడు అతనాపాఠశాలలో నాయకుడుగా గుర్తింపు పొందాడు. అనేక గురుతరమైన బాధ్యతలను నిర్వర్తించే అవకాశం కలిగింది. మేధావులైన విద్యార్థులకు, ఇతర సాధారణ విద్యార్థులతో కలిసిచదివే నిర్బంధాన్ని తొలగించగలిగితే అనవసరమైన బాధను, వత్తిడిని తొలగించినట్లవుతుంది. విద్యావిధానంలో ఇలాంటి అనవసరమైన వివిధ అంశాలను తొలగించటమే యువతను సరైన జీవనవిధానానికి ప్రేరేపించటానికి చేపట్టాల్సిన అసలైన చర్యగా భావించాలి.

ఇంకా మితిమీరిన అధ్యయనం ఒక ప్రధానమైన, సంక్లిష్టమైన సమస్యగా రూపుదాల్చింది. ఒక తెలివైన వ్యక్తి మితిమీరిన అధ్యయనం కారణంగా సహజ స్పందనలు, ఆత్మవిశ్వాసం, ఆరోగ్యం కోల్పోయి, తనశక్తిసామర్థ్యాలకు తగనిరీతిలో సమాజంలో సభ్యుడిగా మిగిలిపోవటం ప్రధానమైన అంశం. భౌతికపరిజ్ఞానం మరింతగా పెరిగేకొలదీ, సముపార్జించాల్సిన జ్ఞానం పరిమాణం పెరిగేకొద్దీ, ఇది మరింత శ్రమకుదారితీయటం మితిమీరిన అధ్యయనంలో సంక్లిష్టత. అయితే విద్యార్థులను మితిమీరి అధ్యయనం చేయాల్సిన అవసరంలేదని చెప్పటంద్వారా ఇందులోని చెడుని పరిహరించలేము. శిక్షణపొందిన, సమగ్రమైన జ్ఞానంపైనే మన సామాజికనిర్మాణం అధికంగా ఆధారపడి ఉంది. అయితే ప్రపంచంలో నేడున్న సమస్యలకు ఆచరణ ప్రధానమైన విద్యావిధానం లేకపోవడమే ప్రధానకారణంగా భావించాలి.

మితిమీరిన అధ్యయనం కారణంగా పిల్లల్లోచోటుచేసుకునే ఆలోచనల పరిణామక్రమాన్ని, మనోదౌర్బల్యాలను, సమాజంపట్ల, ముఖ్యంగా తల్లిదండ్రులపట్ల ఏర్పడే ద్వేషాన్ని చిత్రించిన రచన 'ఇంటికొక హంతకుడు'. ఇందులో పసిపిల్లల వ్యక్తిత్వంపై విద్యపేరుతో అనుక్షణం జరుగుతున్న దాడిని విశ్లేషణాత్మకంగా చిత్రించినవైనం కనిపిస్తుంది.

"ఓసారి నాకు ఫస్టురాంకు రాలేదు. ఒక్క మార్కుతో పోయింది. అందుకని-- బెల్టుతో కొట్టారు డాడీ. మమ్మీ అయితే నీమీదెన్నో ఆశలు పెట్టుకున్నాం. పెద్దయ్యాకనీవుగా అమెరికాలో వెలగబెడతావని" ...... అలా..... మాటలతో మరీ బాధించింది. కానీ...... డాడీమే అమెరికా ఎందుకెళ్ళలేదూ? నన్నెందుకూ చంపటం? అసలీ మమ్మీ, డాడీ లందరూ యింతే. వాళ్లు చెయ్యలేనివన్నీ వాళ్ల పిల్లలు చేసెయ్యాలనుకుంటారు.

ఆ ముఖానికే చెళ్ళున కొట్టినట్లయింది ఆ మాటలతో.

"కానీ..... ఫస్టు రాంకొచ్చే దొక్కళ్ళకే. మరి క్లాసులో ఫస్టు రాంకు రానివాళ్ళెందరో ఉండిపోతారు. వాళ్ళందరినీ వాళ్ళ అమ్మా నాన్నలిలాగే కొడతారా బెల్టులతోనూ, మాటలతోనూ? రేపు ఫ్రెండ్సు నడగాలి.

ఏం చదువో. పుస్తకాల బ్యాగు మొయ్యలేక వీపు నొప్పెడుతుంది. వొంగి వొంగి గూనొచ్చేస్తుందో ఏమో. పొద్దుట హాయిగా నిద్రపోనివ్వరు. పక్క మెలుకువచ్చినప్పుడు లేవడానికుండదు. పెద్దాళ్ళు ఏమో హాయి. వాళ్ళకేమ్యాలుండవు. ఉమ్మొండదు. పెద్దాళ్ళకే పొద్దుట ఆఫీసులు పెట్టే పిల్లలకే బదులుగా పెట్టటం బాగుంటుంది కదా? అదీ న్యాయం కదా?

..........

"ఆదివారాల్లో వర్క్ వైల్ యు వర్క్......ప్లే వైల్ యు ప్లే. నాకేమో నిజంగా ఆల్‌వర్క్...నోప్లే. స్కూలు...కంప్యూటరు... ట్యూషన్లు...హోంవర్కులు...ఆడుకుందుకు టైమును మిగలనివ్వరుగా. ఇదేమిటో....చెప్పేదొకటి. చేసేదొకటి ఈ పెద్దవాళ్ళు. పిల్లలుగా అంతా చదువుకుని, పెద్దయ్యాక ఆడుకోవాలి కాబోలు." వెక్కిరిస్తున్నట్లు ఉందా తీర్మానం.

..............

పరీక్షలయిన మర్నాటినుంచే - కంప్యూటర్ కోర్సు సమ్మర్ క్లాసెస్....గ్రామర్‌క్లాసులు...వచ్చేఏడాదియే క్లాసుకి ముందు నుంచే ప్రిపేర్‌చేసే ట్యూషన్లు... సెలవుకి శలవులున్న మాటేకాని బడిరోజులకంటే అధ్వాన్నంగా చదువుకోవాలి. నా శలవుల కలలన్నీ ఇలా కత్తిరించి ముక్కలుచేసి పారేశారు మమ్మీ, డాడీ కలసి. వాళ్ళమాటేతప్ప నామాట చెల్లదుగా. చిన్నపిల్లవాడివి..వీకేం తెలియదు. మేం చెప్పినట్లు చెయ్యి. నీ భవిష్యత్తు బాగుండడానికే.... అంటారు. వర్తమాన మంటూ ఉంటే కద, భవిష్యత్తు ఏదకూపోవడం? ఇది - వీళ్ళకి తెలియదు." ..................

"ఇది చాలా బాధపడవలసిన విషయమే. కాదనను. కానీ, దీనికి బాధ్యులెవరని కూడా ఆలోచించాలి. ఇవాళ - మీరే కాదు ప్రతి విద్యార్థి తండ్రీ స్థాయీ భేదంతో యిలాగే దోషిగా నిలబడుతున్నారు. కొడుకు అంతరంగపు పంచాయితీలో. దీనికి నిజమైన బాధ్యత విద్యావ్యవస్థదే. పిల్లకొండం కూడా ఘనము అన్నట్లు క్లాసు చిన్నదీ పుస్తకాలెక్కువా. ఆ పుస్తకాల సంచీ బరువు

మోయలేకపోతే వెన్ను వొంగిపోతుంది. రేపు బాలుడికి గూనిరావొచ్చు. వెన్నెముక ఉండీ లేనట్లయిపోవొచ్చు. వెన్నెముకలేనివాడయ్యో సంతానం పొందే అర్హతను కోల్పోయినా కోల్పోవచ్చు. అతి చిన్నతనంలోనే ఆకాశాన్నీ, ఆకుపచ్చని చెట్లనీ చూడనివ్వకుండా క్రూరంగా గోడలమధ్య బంధింపబడుతూ...ఆ చిన్ని కనులను కంప్యూటర్ స్క్రీన్ మెల్లమెల్లగా కలుషితం చేస్తుంటే...తొందరలోనే కళ్ళకి అద్దాలు రావొచ్చు. అలక్ష్యంగా అంధత్వం ముంచినా ఆశ్చర్యపడనక్కరలేదు.

ఒకటి తొందరలో ఆదరా బాదరా తిండి. తినగానే పరుగు. దీనివల్ల గ్యాస్ట్రిక్, అసిడిటీ మొదలయిన ప్రాబ్లమ్స్. హోంవర్క్ చేయగలనో లేనో...రాంక్ వస్తుందో రాదో...శిక్షా భయం...వీటివల్ల యాంగ్జయిటీ న్యూరోసిస్.... బి.పి. వంటి మానసిక రుగ్మతలు. ఇలాటివి. ఇవీ మన విద్యావిధాన పరిణామాలు. పిల్లల బాల్యాన్ని దోచుకుంటున్న దోపిడీ దొంగలలో పెద్ద ఈ కుటిల విద్యావిధానమే............ ఎప్పుడూ పుస్తకాలూ, ఆల్‌వర్క్ బట్ నో ప్లే.... వల్ల అతను మానవ సంబంధాలు, సున్నితమయిన మనోభావాలు, సెంటిమెంట్లు కోల్పోతూ, ప్రకృతిపట్ల అంధుడూ, పాటిమనిషి పట్ల యంత్రసమానుడూ ఔతాడు. పుస్తకాలూ కంప్యూటర్లూ దాటి బాహ్య ప్రపంచాన్ని సరిగా చూడనూలేడు, అర్థంచేసుకోనూ లేడు. మన విద్యావ్యవస్థా, సమాజమూ, నేటి బాలుర్ని రేపటి యంత్రాలుగా మారుస్తున్నాయి." ..................

చదువనేది దుర్భర శిక్షగా మారుతూండటంతో మీ అబ్బాయి మీమీద కక్ష పెంచుకుని మిమ్మల్ని చంపితే తప్ప తనకి ముక్తీ సుఖమూ శాంతీ ఉండవని మీమీద కత్తులు దూశాడు. మీనుంచి... తద్వారా మీరు వేస్తున్న విద్యాశిక్ష నుంచీ బయటపడితే హాయిగా ఉండగలనని అతని ఆశ. మీ అబ్బాయిది పరాకాష్ఠ చేరిన కక్ష కనుక బయటపడిపోయాడు. కానీ...యిప్పుడు చాలామంది విద్యార్థుల మానసిక పరిస్థితి యిదే. తల్లిదండ్రులనీ, టీచర్లనీ చంపెయ్యాలన్నంత కోపమూ కసీ ఆవేశ గుండెలలో.. మన విద్యావిధానం - ఇంటికొక హంతకుణ్ణి తయారుచేస్తోంది మరి. మీరూ నేనూ ఏంచెయ్యగలం?" (ఐవ్యాపురపు రామచంద్రం. ఇంటికొక హంతకుడు, కథామహల్: ముప్పాళ్ళ శారదాంబ పోటీ కథలు, పే 94-109)

విద్యలో అనారోగ్యకరమైనపోటీ కారణంగా బాల్యాన్నికోల్పోతున్న పసివారి మానసికస్థితికి నిలువుటద్దం 'నా బాల్యం ఏమైంది?'

చంద్రానికి తన బాల్యంగురించిన ఏ జ్ఞాపకాలూ ఎందుకులేవో తెలిసి తెలుసుకోవాలని తపనవుండేది. అందుకే ఫ్రాయిడ్, వివేకానంద, సార్త్రే మొదలైనవాళ్ళ బోధలూ డికెన్స్‌నుంచి హెరాల్డ్‌రాబిన్స్‌వరకూ నవలలు చదువుతూ వచ్చాడు. ...............

చంద్రాన్ని బళ్ళో వేసినప్పుడు ఎంతో పెద్దపండుగలా చేసాడు విశ్వేశ్వరం. అంతచిన్న ఉద్యోగి తాహతుకి మించిన ఖర్చు చేసాడు. ఆ ఫోటోలో చంద్రం బొద్దుగాబంగారంలాగ వున్నాడు. బూరెబుగ్గలూ, కాటుకతో మెరిసేకళ్ళూ, చిరునవ్వుతో సొట్టలుపడిన బుగ్గలూ .... తరువాత బాల్యం ఎలా గడిచిందో ఇంక ఫోటోలు లేవు.
ఎం.బి.బి.ఎస్‌లో చేరేముందు తీసిన ఫోటోలో అతని పీక్కుపోయిన మొహం, అలిసిపోయిన కళ్ళూ తప్ప. అప్పుడు అతనికి పదిహేడేళ్ళు.

రెండు ఫోటోలకీ మధ్యనున్న పన్నెండు సంవత్సరాల తన బాల్యం ఏమైంది - అనుకునేసరికి చంద్రం గుండెల్లో "ఢామ్" పగిలినట్లు దుఃఖంవచ్చి ఏడవసాగాడు. (బి.సి.హెచ్.వి.బసవరాజు, నాబాల్యం ఏమైంది?, "జ్యేష్ఠ"కథలు, 145-148)

వ్యావహారిక అంశాలు, శిక్షణాగతమైన పరిజ్ఞానంతో మాత్రమే గణించాల్సినవిగా రూపొందాయి. వీటికి వ్యక్తిగత భావాలు, స్పందనలు, అభిప్రాయాలతో నిమిత్తంలేకుండాపోయింది. ఇటువంటి పరిస్థితుల్లో మరింతగా రాజీధోరణిని అవలంభిస్తే తప్ప ఈ సంక్లిష్టమైన ప్రపంచంలో సాధారణపౌరుడు తన బాధ్యతలను సరిగా నిర్వర్తించలేడు. వీటన్నింటి కారణంగా ఆధునిక సామాజికక్రమంలో మేధోపరమైన విద్య అధికప్రాధాన్యతగల అంశంగా రూపొందింది.

విద్యా విధానంలో చాలినంత బోధనతోపాటుగా మితిమీరిన అభ్యసనం కారణంగా సంభవించే హానిని లేకుండా చూసుకోవాలి. ఇందుకు ప్రధానంగా మూడు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. జ్ఞానార్జన విషయంలో సాధ్యమైనంత మేరకు విద్యార్థికి మానసికమైన వత్తిడి లేకుండా చూడటం ప్రధానమైన అంశం. ఇందుకుగాను పరీక్షావిధానంలోకాని, ఉపకార వేతనాలలోకానీ, తెలివైనవిద్యార్థులను గుర్తించటంలో కానీ చెప్పుకోదగ్గ మార్పులు చోటుచేసుకోవాల్సి ఉంది. ఉపయోగంలేని శిక్షణా కార్యక్రమాలను పూర్తిగా తొలగించటం మరో ప్రధాన అవసరం. ఉన్నతస్థాయిలో చేసేబోధనలో ప్రశ్నలకు సరైన సమాధానాలను మెదళ్ళలో నింపేపద్ధతికిమారుగా విద్యార్థులలో అన్వేషణా తృష్ణను రగిలించేవిధంగా బోధనను రూపొందించాలన్నది మూడవ అంశం. అయితే ఇక్కడ మళ్ళీ పరీక్షావిధానాన్ని నిందించాల్సి వస్తుంది. ఉదాహరణకు తెలుగుసాహిత్యంలో

ప్రాథమిక పరీక్షలో ఉత్తీర్ణతపొందేందుకు ఏ గొప్ప రచయితల రచనను విద్యార్థి చదవాల్సిన అవసరంలేదు. అసలైన జ్ఞానానికిమారుగా సమాచారాన్నంతా ప్రోదిచేసుకున్న ఒక పుస్తకాన్ని బట్టీయం పడితే సరిపోతుంది. పరీక్షలకోసం విద్యార్థులు సంఘటనలు, జరిగిన ప్రాంతాలు, జరిగిన తేదీలు ఇలా పుస్తకాల్లో లభ్యమయ్యే సమాచారాన్నంతటినీ బట్టీయం పట్టాల్సి ఉంటుంది.

ఆసక్తిలేని అంశంపట్ల శ్రద్ధవహించాల్సి రావటం, అందుకు వత్తిడిచేయటం మేధోశ్రమలో విసుగుకు కారణమైతుంది. అందువల్ల అనాసక్తకర అంశాల్లోని అనాసక్తతను తొలగించగలిగితే అభ్యసనంలో విసుగును తొలగించినట్లే. ఈ సూచనలను పాటిస్తే సృజనాత్మకత, సమయస్ఫూర్తి వంటి సహజగుణాలు కోల్పోకుండానే విద్యార్థులు ఉన్నత విద్యను పొందగలరు. అయితే పరీక్షావిధానం, పోటీతత్త్వం ఉన్నంతవరకు ఇది సాధ్యంకాదు.

అయితే నేటి విద్యావిధానంలో అనాసక్తత ఒక సాధారణాంశంగా, అనివార్యమైందిగా రూపొందటం విషాదకర పరిణామం. సామాజికంగా అట్టడుగువర్గాలలో ఈ పరిణామం ఎటువంటి ప్రభావాన్ని చూపుతున్నదో 'సదువు' చిత్రించింది.

ఈ పాఠ్యపుస్తకాలు పట్టణవాసపు అగ్రకులాల మధ్యతరగతి పిల్లలకోసం రాసినట్టుంటాయి. పల్లెటూరి పిల్లలకు, అందునా దళితులకు అవి ఏమాత్రం ఆసక్తిలేని విధంగా ఉంటాయి. చిన్నప్పుడు తానూ ఎదుర్కొన్నాడీ సమస్య. ఇప్పుడు దీని పరిష్కారం తనచేతుల్లో లేదు. కుర్రాడు ఎలాగోలా ఇంటర్‌దాకా గట్టెక్కితే ఆతర్వాత చదువుబండి ఎంతదాకైనా సాగిపోతుంది.

"నేను బడికి పోనుపో" అని మొండికేసిన నర్సన్నను ఎన్నో హింసలు పెట్టారు. ఇల్లు పోలీసులాకప్‌లా మార్చారు. తొడపాశాలు పెట్టారు. [illegible] కాళ్లకు [illegible] కొట్టారు. ఎంతకొట్టారు......అన్నమకొట్టిన దెబ్బలు [illegible] భయంతో తాను బడికి వెళ్ళాడేమో... చదువు గురించి ఎందుకింత హింస.

విశ్వకవి రవీంద్రుడు పన్నెండేళ్ళదాకా చదువనేది లేకుండా స్వేచ్ఛగా తిరిగాడు. చదువు గురించి ఒత్తిడి లేనందువల్లే ఠాగోరు విశ్వకవి అయ్యాడేమో. అందుకే ఆయన స్వేచ్ఛాయుత విద్యకోసం శాంతినికేతన్ స్థాపించాడేమో. నర్సన్న కూడా ఠాగోరుకున్న అవకాశాలుంటే గొప్ప రచయిత అయ్యేవాడేమో... ...............

అన్నని పిచ్చివాడన్నారు. రవంత ఆర్తిత, కాసింత ఉల్లాసం, స్వేచ్ఛ ఉంటే చదువైనా, కులవృత్తయినా అన్న ఎంత ఎదిగి ఉండేవాడో. టీచర్ల శాడిస్టు స్వభావం, సమాజ మూర్ఖత్వం, మూఢవిశ్వాసాలు కల్సి భావవ్యక్తీకరణ సంతరించుకోని నర్సన్న వంటి వారి స్వేచ్ఛ, సృజనాత్మకతని, ఆశలు, ఆరాటాల్ని సమాజవిలువలకు, కులవ్యవస్థకు లొంగలేదని సమాజం ఎంతగా అణచివేసిందో, ఎందర్ని అణిచివేసిందో. .........................

"[illegible] నేటి విద్యావ్యవస్థ పిల్లల సృజనాత్మకతకు, స్వేచ్ఛకు వారి ఇష్టాలకు తగు ప్రాధాన్యం ఇవ్వటంలేదు. స్వీయ వ్యక్తీకరణ శక్తిని అణచివేసి వారిని రిలే కేంద్రాలుగా మారుస్తోంది. వారిని ఒక టేపు రికార్డరు లా, ఒక రేడియోలా, రిలే కేంద్రాలుగా మారుస్తున్నాం. నీవుచెప్పింది నీకు అప్పగించటం, పాఠ్యాంశాలకు జవాబు రాయటం ఇవన్నీ మనిషిలోని శక్తిసామర్థ్యాల్ని సృజనాత్మకతని అణచివేయడమే కదా. కేవలం లిపి నేర్చుకోవటం కోసం అన్నేళ్ళు చదువుకోవటంలో పసలేదు. తనలోపలే తానుపోయేవాళ్లని పిల్చి మరీ వెంట మీద కొట్టినట్లు దళితుల్ని పాఠాలకంటూ రప్పించి నీ మెదడు మొద్దుబారిపోయిన ముద్రవేసి అణిచివేస్తోంది వ్యవస్థ" నిష్కర్షగా అన్నాడు లక్ష్మయ్య.

"అంటే బడిలో నేర్చుకునేదేదీ జీవితానికి పనికిరావటంలేదనా?"

"నేను అలా అనటంలేదు. ఈ వ్యవస్థ ప్రకారం పాఠంలో ఏవుందో అదే పిల్లలు వ్యక్తీకరించాలి. పాఠం చదివేక పిల్లలకు కలిగే కొత్తభావాలను వ్యక్తీకరించే అవకాశం ఈ విద్యావ్యవస్థలో లేదు. ఇదొకటి. రెండోది. కొందరికి విషయం అర్థమవుతుంది కాని వ్యక్తీకరించలేరు. మూడోది కొందరు వాళ్ళలోని కొన్ని విషయాల్ని హృదయంలోనే దాచుకోవాలను కుంటారు. అసలు సృజనాత్మకతను, వ్యక్తీకరణ శక్తిని కక్కు, కక్కు అని అనివార్యం చేయటమే సరైందికాదు..........నీవు చెప్పిందాన్ని పిల్లలు తిరిగి అప్పజెప్పాలని కోరటం సృజనాత్మకత ఎలా అవుతుంది? నీవు, నీ పాఠానికనుగుణంగా పిల్లల్ని మరబొమ్మలుగా రుద్దుతున్నావు. సరిగ్గా చెప్పాలంటే పాఠాన్ని అప్పగించాలి అనేంత నిర్బంధం మరొకటి లేదు. ఏమంటే పాఠంలోని భావాలని తన భావాలుగా 'అంగీకరిస్తే' తప్ప పిల్లలు సరిగా వ్యక్తీకరించ లేరు. పిల్లల భావాలకు విరుద్ధంగా నీ భావాలు లేదా నీ పాఠం ద్వారా చెప్పే భావాలు వారిపై నిర్బంధ భావాలుగా రుద్దబడటంలేదా?"..............

తర్జన భర్జనలు జరిగాయి. తనకు తాను స్వేచ్ఛగా తెల్సుకునే పరిస్థితులు, అవకాశాల్లో ఆసక్తి, అభిరుచి కలిగించేదిగా ఉండటమే సరైన సహజ విద్యావిధానం అని ఏకాభిప్రాయానికి వచ్చారు.....................

ఆటలు, పనిపాటలు, కలబోసిన ఆశ్రమ విద్య విద్యార్థుల్లో జీవితమే ఒక ఆట అనే ఆనంద దృక్పథాన్ని కల్గించింది. (బి.ఎస్.రాములు, చదువు, బి.ఎస్.రాములు కథలు, పే 46-57)

పోటీతత్త్వం విద్యారంగానికి హానికల్గించేదిమాత్రమేకాదు, యువతకు ఒక ఆదర్శంగాకూడా నిలిచింది. ఇప్పుడు ప్రపంచానికి కావలసింది పరస్పరసహకారతత్త్వం, సమైక్యతలేకాని పోటీతత్త్వం కాదు. పోటీతత్త్వంలో నమ్మకం ప్రాచీనమైన భావనగా మిగిలిపోవాలి. పోటీతత్త్వం వల్ల ప్రయోజనముందని భావించినా అది ఆహ్వానించదగినదికాదు. ఇందుకు ప్రధానకారణం పోటీ అనేది శతృత్వభావనని, హింసాప్రవృత్తిని పెంచేందుకు దోహదపడుతుంది. పోటీతత్త్వంతో కూడిన ఆలోచనలతో పెరిగిన వ్యక్తులు సమాజాన్ని ఒక సమిష్టినిర్మాణంగా భావించటం సాధ్యపడదు. అందువల్ల నైతికంగానేకాక, ఆర్థికపరమైన అంశంగా కూడా యువకులలో పోటీతత్త్వాన్ని పెంపొందించటం అంగీకారయోగ్యం కాదు.

ఇలా పోటీతత్త్వాన్ని పెంపొందించిన కారణంగా విద్యార్థులలో చోటుచేసుకునే విషపరిణామాలను చర్చించిన రచన 'పందెపుగుర్రాలు'

"పోటీ స్వభావంవల్ల లాభం జరిగేది సమానుల మధ్యనే. లేకపోతే హాక్షేలు కొందరు తీకొన్న తంతవుతుంది. మీ పిల్లలతో రాంబాబు పోటీ అటువంటి ఫలితాన్నే ఇచ్చింది. పిల్లలని పందెపు గుర్రాల్లా పెంచకూడదు. చదువు మనిషికి చాలా అవసరం. ఎవరూ కాదనలేరు. కాని చదువంటే పరీక్షలు పాసవటమనే భ్రాంతి పోవాలి. సముద్రపుఒడ్డు, కాలువగట్లు, చింతతోపులు లేని ఈ ఊళ్లోకూడా, రాంబాబు కిటికీలోంచి చెట్లవంక, వాటిపై కువకువలాడే పక్షులవంక, ఆకాశంలో మబ్బులవంక చూడటం అలవాటు చేసుకున్నాడు. అతన్ని ఏ పెయింటింగ్ స్కూల్లోనో చేర్పించి చూడాల్సింది. తరువాత మనోవికాసానికి ఎన్నో మంచిపుస్తకాలు పరీక్షల బెడదలేకుండా చదువుకునేవాడు. అదివాలదూ? ఇప్పుడతనికి వచ్చిన జ్వరం మీరు తెచ్చిపెట్టిందనటంలేదు నేను. కాని, ఆపోటీలతోటీ, పరీక్షలతోటీ శరీరాన్ని శిథిలం చేసుకున్నాడు. (విజయరామకృష్ణ పి., పందెపు గుర్రాలు, విజయరామకృష్ణ పి చిన్నకథలు, పే 63-74)

అలా పోటీతత్త్వం వల్లకలిగే విభిన్న పరిణామాలను అన్నికోణాలనుంచి తెలుగుసాహిత్యం చర్చించింది.

================

## విద్య--లైంగిక విజ్ఞానం

విద్యార్థులకు లైంగికజ్ఞానం అవసరమా? అన్నవిషయం ఇటీవలికాలంలో ప్రముఖంగా చర్చనీయాంశం అయింది. అంతేకాకుండా లైంగికవిజ్ఞానాన్ని పాఠశాలల్లో పాఠ్యాంశంగా చేర్చేఅంశంపైనకూడా అనేక వివాదాలు చోటుచేసుకున్నాయి. ఈ సమస్యలనన్నింటిని తెలుగుసాహిత్యం ప్రతిఫలింపచేయటం విశేషం. తెలుగులో అనేక కథలతోపాటుగా, లైంగికవిజ్ఞానం ప్రధానాంశంగా 'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్‌స్టార్' నవలకూడా వెలువడింది. ఈ రచనలన్నీ లైంగికవిజ్ఞానబోధనావశ్యకతను గురించి వైవిధ్యభరితంగా చిత్రించాయి.

పిల్లల పుట్టుకకు సంబంధించిన విజ్ఞానాన్ని పిల్లలకు తెలియకుండా వ్యవహరించేందుకు ప్రయత్నించటం అనేక చెడు పరిణామాలకు దారితీస్తుంది. జ్ఞానానికి సంబంధించి కొన్ని అంశాలు చెడువి, అందులోనూ ప్రత్యేకించి ఆసక్తికలిగించే అంశాలు చెడువి అనే భావనను విద్యార్థులలో పెంపొందిస్తుంది. జ్ఞానానికి సంబంధించినంతవరకు ప్రతి అంశం మంచిది అన్నవిషయం నైతికసూత్రాలలో మౌలికమైనది. లైంగికవిద్య ఇందుకు మినహాయింపుకాదు. తన సహజ ఉత్సుకతతో లైంగికాంశాలను తెలుసుకోదలచినప్పుడు విద్యార్థిని నిరోధించటం సరైనచర్యకాదు. అటువంటి చర్యలకారణంగా నిరుత్సాహపూరితమైనదే అసలైన జ్ఞానం అని, అది ఉత్సాహపూరితమైనదైతే సరైనజ్ఞానం కాదని ఒక తప్పుడు నిర్ణయానికి వచ్చేప్రమాదముంది.

"చెప్పండి తాతీ! పెద్దమనిషవ్వడమంటే ఏంటి?" రెట్టిస్తూ అడిగింది స్వప్నిక. -----------

"ఏంటీ? పెద్దమనిషవ్వడమా? ఛీ బుద్ధిలేదూ? ఏంటా పిచ్చకాలం బుద్ధులు? ఏంటా పాడుమాటలు? అవలివన్నీ నీకెందుకు? పోయి... పోయి మీ నాన్ననే అడుగుతున్నావ్. అవ్వ... అవ్వ మాకాలంలో అయితే పాఠంలో ఏదన్నా అర్థం కాకపోతేనే తండ్రినడగాలంటే చచ్చేంత భయపడేవాళ్ళం. అమ్మో ఇప్పుడు! ఛీ సిగ్గులేదూ! అదేమన్నా మామూలు ప్రశ్న అనుకుంటున్నావా? భారద్దేశానికి రాజధానేంటి అని అడిగినంత తేలిగ్గా అడిగేశావ్! అయినా ఎక్కడికిపోతాయా తల్లిబుద్ధులు? ఆవిడకూడా ఓ పెద్ద పెరగాడు అంటుకదూ!" గట్టిగా అరవసాగింది వర్ధ.

"మమ్మీ! ఇంకా గట్టిగా అరిచింది స్వప్నిక.

"మాకు! ఇంకెప్పుడూ మా అమ్మనేం అనకు" (ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్‌స్టార్. ఉరిటి సులేఖ. ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక. 23-5-'96. పే 33)

ఇలా శాస్త్రీయమైన ఆసక్తిని నిషేధించటంతో మంచి ఆలోచనలతో పిల్లలుచేపట్టే కార్యక్రమాలు మూర్ఖమైనవిగా చిత్రించబడతాయి. గర్భాన్నిగురించి బాలికలకు తెలియజేయకపోవటం హర్షించదగ్గ అంశంకాదు. ఇంకా హానికరంకూడా. ఫలితంగా బాలికలు తాము బాలురకంటే తక్కువని భావిస్తూ తాము బాలురైతే బాగుండునని కోరుకుంటారు. గర్భాన్నిగురించిన అవగాహన వారికి లేనంతకాలం అన్నివిషయాల్లోను పురుషులు
స్త్రీలకంటే ఉన్నతులుగానే కన్పిస్తారు. అయితే పిల్లలను సృష్టించడంలో తమపాత్రను గుర్తించగానే బాలికలు స్త్రీత్వంపట్ల గౌరవాన్ని ఏర్పర్చుకొని బాలికలుగా ఉండటంలో తృప్తిని పొందుతారు.

లైంగికజ్ఞానానికి సంబంధించిన వాస్తవాల విషయంలో మౌనంగాఉండే తల్లిదండ్రుల ప్రవర్తన పిల్లలదృష్టిలో తల్లిదండ్రులు అబద్ధాలకోరులు అనేభావనను ఏర్పరుస్తుంది. అయితే ఇక్కడ తల్లిదండ్రుల అంచనాలకంటే ముందుగానే పిల్లలు వాస్తవాలు గ్రహించగలగటం గమనార్హం. అలా మొదటిసారిగా కొంతమేరకు విషయపరిజ్ఞానాన్ని పొందినతర్వాత, సహజంగా యువతలో ఉండే స్వభావంవల్ల అశాస్త్రీయ అంశాలనుకూడా తమఆలోచనల్లో స్థిరపరచుకుంటారు. ఈ విషయంలో పిల్లలతో అబద్ధమాడటం వాంఛనీయంకాదు. అలాంటి నైతికసూత్రమేదైనా ఉండిఉంటే అది సరైనసూత్రం మాత్రం కాదు.

పిల్లలకి ప్రేమని ఏంటి. కావలసినవన్నీ కొనిస్తే చాలని అనుకుంటారు. కానీ వయసొస్తున్న పిల్లలకి కూడా వయసురావడమంటే ఏమిటో. దానివల్ల వాళ్లలో శారీరకంగానూ, మానసికంగానూ ఏ విధమైన మార్పులు వస్తాయో, అప్పుడే ఆ మార్పుతర్వాత వాళ్ళెలా నడుచుకోవాలో చెప్పరు.

'మాకు మాత్రం మా పెద్దవాళ్ళెవరైనా చెప్పారా? మేమే తెలుసుకోలేదూ! అలాగే వాళ్లూ తెలుసుకుంటారు.' అని తేలిగ్గా తీసిపారేస్తారు.

ఆ కాలం వేరు. ఈ కాలం వేరు. కానీ పిల్లలను కన్నవారుమాత్రం కాలానుగుణంగా ప్రవర్తించడంలేదు. అసలు కొన్ని విషయాలను గురించి మాట్లాడటమే పాపం అన్నట్లుగా పెద్దవాళ్ళు ప్రవర్తిస్తారు. పిల్లల మనసులేమిటో తెలుసుకోరు. ఆ మనసుల్లో ఏ రకమైన మథనం ఉందో ఊహించే ప్రయత్నమే చెయ్యరు.........

ఈ మైత్రీలాంటి పాపల పరిస్థితుల్లో మార్పురావాలంటే ముందు వాళ్ళ తల్లిదండ్రుల్లో మార్పురావాలి. సెక్స్ ఎడ్యుకేషన్ తప్పనిసరి అని. అది నేర్పవలసినది తామేనని గుర్తుంచుకోవాలి. (గురజాల శోభాపేరిందేవి. Xఎడ్యుకేషన్. ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక. 10-12-'92. పే 72-73)

ఇతర అంశాలమాదిరిగానే సరిగ్గా అదేవిధంగా, అదేరీతిలో లైంగికవిషయాలపైకూడా సమాచారాన్నందించటం ప్రధానం. ఆ సమాచారం సూటిగా ఉండాలి. పిల్లలకు ముందుగా పువ్వులను ప్రేమించటం, పీతల కుప్పిగంతులు ఇంకా తల్లిదండ్రుల ప్రవర్తనకుసంబంధించిన సుదీర్ఘమైన శారీరక చర్యలగురించి చెప్పినతర్వాతనే లైంగికవిజ్ఞానాన్నందిచాల్సి ఉంటుందన్నది సాంప్రదాయకపెద్దల భావన. ఈ సమయంలో అనేక క్షమాపణలుకూడా చెప్పాల్సివస్తుందనికూడా వీరు పేర్కొంటారు. అయితే నిజానికి పెద్దల అతితెలివితేటలకి లోబడనట్లయితే పిల్లలు లైంగికవిజ్ఞానాన్నికూడా ఇతరవిషయాలమాదిరిగా సాధారణాంశంగానే భావిస్తారు. తల్లిదండ్రులు ఈ విషయంలో సహజంగా వివరించలేనిపక్షంలో ఈ నిషేధాలు, పరిమితులతో అంతగా ప్రభావితంకాని ఇతరులచే మాట్లాడించాలి. పిల్లలు ఇతరవిషయాలమాదిరిగా లైంగికాంశాలను భావించటం, వీటిని సాధారణమైనవిగా స్వీకరించటంలో యవ్వనానికి ముందువరకు ఎటువంటి కష్టం ఉండదు. అయితే యవ్వనంలోమాత్రం ఇది కొంతక్లిష్టంగా మారుతుంది. అయితే వారి మెదళ్ళు నిర్హేతుకమైన భయాలూ, నిషేధాలతో నిండి ఉండకపోతే యవ్వనంలోకూడా ఇది సాధ్యమే.

ఆ... టీచర్... మరేం... లేదు... సైన్స్... అదే సైన్స్‌లో ఓ పాఠం ఉంది 'అనువంశిక లక్షణాలు' అని. అందులో వీర్యం, అండాన్ని కలిసి ఫలదీకరణజరుగుతుంది. వీర్యం, అండం 'సెక్స్ యూనిట్స్' అని తెలుసు. కాని అవి ఎలా కలుస్తాయి? ఎవరు ఓ చోట చేర్చి ఫలదీకరణ చేస్తారు? తల్లిదండ్రుల లక్షణాలు పిల్లలకొస్తాయని కూడా ఉంది. అవెట్లా వస్తాయి?

మమ్మీ వేరు, డాడీ వేరు. నేను మమ్మీ కడుపులోనే ఉన్నాను. నాకు అమ్మ లక్షణాలే రావాలిగా! మరి నాన్నవెందుకొస్తాయి?

మొక్కల్లో అయితే నీరు, గాలి, కొన్ని పక్షులు ఇలా పరపరాగసంపర్కం సాయపడటానికి చాలా ఉన్నాయి. కానీ మనుషుల్లో, జంతువుల్లో ఎట్లా? ఆ పిల్లాడు సీరియస్‌గా అడుగుతున్నాడు. ఆ అడగటంలో ఇదివరకటి ఇబ్బందిలేదు. ఆ అడగటంలో సైన్స్ కనిపిస్తోందే కానీ సెక్స్ కన్పించటంలేదు. తెలుసుకోవాలనే జిజ్ఞాస ఉందేకానీ కాంక్షతోకూడిన కుతూహలం లేదు. ఈగ జీవితచరిత్రని గురించి అడుగుతోన్నంత సహజంగానే 'ఇంటర్‌కోర్స్' గురించికూడా అడుగుతున్నాడు. ఆ పిల్లాడి దృష్టిలో రెండూ ఒక్కటే! అలా కానిదల్లా ప్రతిదాన్ని బూతర్థంలో మాత్రమే చూడగల ఈ మనుష్యులది! (ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్‌స్టార్, ఉరిటి సులేఖ. ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 23-5-'96, పే 51)

ఇలాంటిదే మరో అనుమానం

'స్టెతస్కోప్' ఎలా కనుగొన్నారో సెక్స్ సంబంధంగల పాఠమది. డా. లినెక్ అనే ఫ్రెంచి డాక్టరు తనదగ్గరకు వచ్చిన యువ్వనం, అందాలరాశి అయిన రోగినెలా పరీక్షించాలో తెలీక ఇబ్బందిపడతాడు. ఎందుకంటే అప్పట్లో గుండెశబ్దాన్ని వినటానికి స్టెతస్కోప్‌లేదు. వైద్యుడు రోగిగుండెమీద చెవిపెట్టి శబ్దాన్ని వినేవాడు. డా.లినెక్ ఆ అమ్మాయినలా పరీక్షించే ధైర్యంలేక చాలాసేపు సతమతమయ్యి చివరకు ఓ గొట్టంగా చేసి పరీక్షచేస్తాడు. అదే ఈనాడు అనేక మార్పుల్లో స్టెతస్కోప్ రూపుదిద్దుకుంది. ఆ పాఠాన్ని చదివినప్పుడు ఉజ్వలికి అర్థంకానిదొకటే ఓ రోగిని పరీక్షించటానికి వైద్యుడంత తటపటాయించడం ఎందుకని! (ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్‌స్టార్, ఉరిటి సులేఖ. ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 23-5-'96, పే 51)

పబ్లిక్‌స్కూళ్ళలో విజయంకోసం తెలివితేటల్ని బలిచేసే సంప్రదాయం ఉంది. ఇందుకోసం పిల్లలను అవిశ్రాంతంగా భౌతికంగా శ్రమకు గురిచేయటంతో వారికి విశ్రాంతిగాని, లైంగికవిజ్ఞానంపట్ల అభిరుచిగాని కలిగేందుకు అవకాశంలేకుండా పోతుంది. అందువల్ల ప్రస్తుతవిధానంలోని లోపాలను గుర్తించి వాటిని అధిగమించాల్సిన అవసరం ఉంది. అవి 1. పిల్లల్లో అతీంద్రియమైన భయాలను ప్రొదుకొల్పుతున్నది. 2. ఇది అధికశాతంమందిని పిరికివాళ్ళుగా, మోసగాళ్ళుగా మారుస్తున్నది. 3. లైంగిక అంశాలనుగూర్చిన ఆలోచనలను, అనుభూతులను అశ్లీలమైనవిగా, గుప్తమైనవిగా భావించేట్లు చేస్తున్నది. 4. శాస్త్రీయమైన ఆసక్తిని పాపంగా భావింపచేస్తున్నది. ఆ కారణంగా వ్యక్తి ఆలోచనాశక్తి నశించి అనారోగ్యునిగా తయారౌతున్నాడు. 5. వ్యక్తిని అవిశ్రాంతకార్మికునిగా మార్చటంతో మేధోపరమైన వికాసానికి అవరోధంగా మారుతోంది.

జడ్జ్ లిండ్సే ప్రతిపాదించిన 'సహచర వివాహాలు' (సంతాననిరోధం, విడాకులు ఒప్పందంగా జరిగేవివాహాలు) ఈ సమస్యలకు ప్రత్యామ్నాయంగా నిలుస్తాయన్నది కొందరి భావన. విశ్వవిద్యాలయ విద్యార్థులు అధికంగా తాత్కాలికమైన పిల్లల్లేని వివాహాలను కలిగిఉంటే విశ్వవిద్యాలయజీవితం మేధాపరంగా, నైతికంగా మరింత ఉన్నతంగా ఉండే అవకాశం ఉందంటారు. మనం భావిస్తున్నట్లుగా అవిశ్రాంతం, అక్రమం కానటువంటిది, బుద్ధిహీనంగా చేసేది కాని లైంగిక కోరికకు ఇది పరిష్కారంగా పనిచేస్తుంది. పనికి కేటాయించిన కాలాన్ని ఇది వ్యర్థపరచదు.

లైంగికచర్య అంతర్గతంగా అసహ్యకరమైనది, అక్రమమైనది, రహస్యమైనది అనే భావనను పొందకుండా యువకులను నియంత్రించాలి. సెక్స్ ఒక ఉత్సాహపూరితమైన అంశం. అందువల్ల దానిగురించి ఆలోచించటం, మాట్లాడటం మానవసహజం. యువతలోని సహజసిద్ధమైన ఈ కోరిక పాలకులదృష్టిలో చెడ్డదిగా భావించబడుతున్నది. ఫలితంగా యువత తాము సహజంగా కలిగినదానికి మించిన ఉత్సుకతను ఈ విషయంలో కలిగిఉండటమేకాక నిషేధించిన ఫలంగురించిన ఉత్సాహంతో దానిగురించే నిరంతరం సంభాషిస్తూ ఉంటారు. అయితే వారి సంభాషణలు తప్పనిసరిగా మూర్ఖంగాను, అజ్ఞానంతోను కూడుకొని ఉంటాయి. ఇందుకుకారణం వారి తెలిసీ తెలియని తనము,

స్వంత ఊహాలకే వారిని వదలివేయటం. వ్యంగ్యమైనదిగా, నీచమైనకథలతోకూడినదిగా పిల్లల దృష్టిలో లైంగికపరిజ్ఞానం నిలిచిపోయింది.

ఫలితంగా పిల్లల ఆలోచనలు అసహజమైనవిగా రూపొందటానికి ఆస్కారమేర్పడింది.

......."నువ్వే సిగ్గుమాలిన దానివి. నీకూ సిగ్గు, లజ్జా లేదు. నేనేం నీలా బట్టల్లేకుండా ఎప్పుడు నిద్రపోలా? ఆ రాత్రి నన్ను బాగా కొట్టేసి నువ్వేమో తాత ఎదురుగా బట్టల్లేకుండా ఛీఛీ.... సిగ్గులేదు? నీకేలేదు.. నీకే... మమ్మీకి నీకే సిగ్గులేదు! షేమ్‌లెస్ క్రీచర్. ఎస్... యు ఆర్ ఎ షేమ్‌లెస్ క్రీచర్" రోషంగా అనేసింది స్వప్నిక ............

దెబ్బలవల్ల ఆ పిల్లలో మొండితనం అధికమవ్వసాగిందేగాని తగ్గటంలేదు... ఆ చూపులో తల్లిపట్ల నిర్లక్ష్యతా భావం కనబడుతోంది. ఆ పిల్ల కళ్ళు అవమానంతో, క్రోధంతో, రోషంతో ఎర్రబడ్డాయేగాని ఓ కన్నీటిచుక్కయినా రాలలేదు. ఇలా పెరిగిన పిల్లలు సంఘంమీద క్రమేణా ద్వేషాన్ని పెంచుకుంటూ ఒంటరితనాన్ని ఆశ్రయించుకుంటూ అందర్నీ అజమాయిషీచెయ్యాలని సర్వాధికారాన్ని చెలాయించుకోవాలని ఆశ: జీవితాన్ని నాశనం చేసుకుంటారు. (ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్‌స్టార్, ఉరిటి సులేఖ. ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 23-5-'96, పే 33)

సెక్స్‌భావన ఒక సహజమైన ఆనందంగా కవిసమయాల్లో పేర్కొంటారు. సెక్స్‌భావన కొన్నిసార్లు సున్నితమైనది, ఉత్సాహభరితమైనది, ఉద్రేకపూరితమైనది, గాఢమైనది. అయితే నైతిక విద్యావేత్తల ఆలోచనలపరిధికి వెలుపలనే ఈ భావాలుంటాయి. వారికిమాత్రం సెక్స్ ఆనందంతోకూడినదైతే దుర్మార్గమైనదిగానే కన్పిస్తుంది. ఈ విధమైన నైతికతకారణంగా కవిత్వం, ఆనందం, అందం వంటివి జీవితంనుంచి నెట్టివేయబడి జీవితంలోకి ఒకవిధమైన బండబారినతనాన్ని సంకుచితత్వాన్ని తెచ్చిపెట్టాయి. ఈ దృక్పథం నుంచే నంగనాచితనం, అల్పమైన ఆలోచనావిధానం రూపొంది సృజనాత్మకతానాశనానికి దోహదపడ్డాయి.

స్వతంత్ర ఆలోచనావిధానంలోకూడా కొన్ని ప్రమాదాలున్నాయి. అయితే ఆ ప్రమాదాలు జీవించటాన్నిగురించినవే మరణానికి సంబంధించినవికావు.

====================

## పరీక్షావిధానం--మూల్యాంకనం

ఒకవైపు సార్వత్రిక నిర్బంధ విద్యావిధానం, మరోవైపు ఉన్నతవిద్యారంగంలో జరుగుతున్న అవసరానికి మించిన పెరుగుదల విద్యారంగాన్ని ఒక పరిశ్రమగా రూపొందించాయి. దీంతో విద్యారంగంలో జరుగుతున్న అభివృద్ధిని గణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇందుకోసం సంస్థాగతమైన మూల్యాంకనాన్ని వృద్ధిపరచేందుకు అనేక సూచనలు ముందుకు వచ్చాయి. అయినా ఇంతవరకూ కొనసాగుతున్న పరీక్షావిధానంలో మాత్రం చెప్పుకోదగినంత మార్పురాలేదు. నేటి విద్యాసంస్థల్లో అనేకమంది విద్యార్థుల బాధ్యతను ఒకే ఉపాధ్యాయుడు స్వీకరించటం కనిపిస్తుంది. సంకుచితమైన ఉపాధ్యాయ, విద్యార్థిసంబంధాలతో నిర్మితమైన ఇటువంటి సంస్థల్లో పరీక్షావిధానం మూల్యాంకనంలో చివరిది, అతి సులభమైనదిగా గుర్తింపు పొందింది.

ఇలా పరీక్షావిధానం ఒక పరిశ్రమగా రూపొందటాన్ని కళ్ళముందుంచిన రచన 'స్క్వేర్‌స్క్వేర్‌స్క్వేర్.' పరిశ్రమగా రూపొందిన ఈ పరీక్షావిధానం అనేకమందిని పోషించటం మనం గమనిస్తాం. పరీక్షావిధానంలో చోటుచేసుకుంటున్న మార్పులను చిత్రించిన రచన 'పరీక్ష'

కాపీలు కొట్టి పరీక్ష పాసు కావచ్చుననే ప్రచార ప్రలోభానికి గురయిన కుటుంబాలు వీళ్ళు. కాపీ కొట్టేందుక్కూడా సమర్థత కావాలని తెలియని అమాయకులు! స్కూళ్ళల్లో తరగతి గది నిండా క్రిక్కిరిసి విద్యార్థులు. వాళ్ళకు పుస్తకాలుండవు. టీచర్లుండరు. బోధన లేదు. ఆటవిడుపులకు పిలుపుల్లేవు. పరీక్షల్లో ఇంత ఎక్కువగా కాపీలు జరగడానికి కారణాలేంటని ఎవరూ విచారించరు. పరీక్షలు పకడ్బందీగా జరగాలంటారు. అందుకు బోలెడంత ఖర్చు. అంతా బూటకం, నాటకం. ఈ తతంగంలో అమాయకులు బలి! అశ్రుపూరితాలయినాయి సుబ్బరామయ్యగారి నేత్రాలు.(ద్వారకా, స్క్వేర్-స్క్వేర్-స్క్వేర్, 21-12-'88, పే 78-79)

ఈ చదువుల విషయం ఆలోచిస్తే ఒక్కోసారి ఆశ్చర్యం కలుగుతుంది. భయమేస్తుంది. బాధగా ఉంటుంది. విద్యార్థుల భవిష్యత్తు మొత్తం వారురాసే పరీక్షలపైనే ఆధారపడివుంది. రోజురోజుకీ పోటీ విపరీతంగా పెరిగిపోతోంది. ఈ పోటీకి తట్టుకుని ముందుకు పోవాలంటే ఇలా పిల్లల్ని రాత్రింబవళ్ళు చదువుల్తో హింసించక తప్పదనిపిస్తుంది. వారికి ఈ చదువులలోకం తప్ప స్వేచ్ఛగా ఆడుకోడానికి, మిగతా విషయాలకు సమయమెక్కడిది? మనం వాళ్ళని బాధపెడుతున్నామని తెలిసినా తప్పడం లేదు. భవిష్యత్తు బాగుండాలంటే ఇప్పుడిలా కష్టపెట్టక తప్పదు. తల్లిదండ్రులకు కూడా విపరీతమైన మానసిక ఆందోళన, టెన్షన్ తప్పడంలేదు. పిల్లలు పరీక్షలు బాగారాసి, రిజల్ట్సు వచ్చి మార్కులు తెలిసేంతవరకూ ఒక టెన్షన్. తర్వాత మళ్ళీ ఎక్కడ సీటు సంపాదించాలో అనేది ఒక టెన్షన్. ఇంక ఉద్యోగాల విషయం గురించి చెప్పనవసరంలేదు. ఇలా అన్నీ పరీక్షలే! కేవలం పిల్లలకే కాదు.

వారి తల్లిదండ్రులకు కూడా! (కొమ్మిశెట్టి మోహన్, పరీక్ష, విపుల, ఫిబ్రవరి '98, పే 70-76)

ఇటీవల నిరంతర మూల్యాంకనం దీనికి ప్రత్యామ్నాయంగా భావించినా అదికూడా సమస్యాత్మకంగా మారింది. చివరకు పరీక్షలద్వారా జరిపే మూల్యాంకనంపైనే అధికభారం పడింది. సాధారణంగా పరీక్షలను వాటి విశ్వసనీయత, లక్ష్యాత్మకతల ఆధారంగా అంచనా వేయాల్సి ఉంటుంది. పరీక్ష దేనికొరకు ఉద్దేశించారో దాన్ని గణించగలిగితే ఆ పరీక్ష లక్ష్యాత్మకమైనదే.

పరీక్షలు విద్యార్థి అవగాహనా సామర్థ్యాన్ని, నిర్వహణా సామర్థ్యాన్ని, స్వతంత్ర ఆలోచనలను వ్యక్తీకరించగల నైపుణ్యాన్ని, వాదనా పటిమను, జ్ఞానపులోతులను అంచనా వేయగలిగి ఉండాలి. కృత్రిమంగా రూపొందించిన కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో విద్యార్థి ఎలాంటి సామర్థ్యాలను కలిగిఉంటాడు అనే విషయాన్ని మాత్రమే పరీక్షకులు అంచనావేయగలరు. పరీక్షా నైపుణ్యం విషయంలో కేవలం వారి సామర్థ్యం, ఉత్సాహం, అవగాహన మాత్రమే కారణం కానేరవు. ఆ అంశం ఎంత నైపుణ్యంగా బోధించారు. విద్యార్థి ఆరోగ్యం, పరీక్షానిర్వహణగది వాతావరణం వంటి అనేక కారణాలు విద్యార్థి పరీక్షా నైపుణ్యం పైన ప్రభావితం చూపుతాయి. ప్రస్తుత సంస్థల్లో ఈ పరిస్థితులెలా విద్యార్థిని ప్రభావితంచేస్తాయో వివరిస్తూ వచ్చిన రచనలు తెలుగుసాహిత్యంలో అనేకం. అలాంటి రచనల్లో 'షోకాజ్' ఒకటి.

వెలేసినట్లుగా వున్న మారుమూల గ్రామాల్నుండి వచ్చిన పిల్లలు వాళ్ళు. వెక్కెగాని, గదులు లేని స్కూల్ వాళ్ళది. హ్రస్వదృష్టిగల అధికారులకు దూరంగా వున్న స్కూల్ అవసరాలు కనిపించవు. అందుకే అధికారుల దృష్టినుంచి వెలివేయబడ్డ గ్రామాలో వున్న స్కూళ్ళ అవసరాలు. ఆ స్కూళ్లల్లో పనిచేసే టీచర్ల అవసరాలు, టీచర్ల పరిస్థితి. స్కూళ్ళ పరిస్థితి అలావుంటే పిల్లల పరిస్థితి ఎలావుంది?

పట్టణాలలో చదువు కొనలేని వాళ్ళు గ్రామాలలో వున్న స్కూళ్ళల్లో వుంటారు. దరిద్రరేఖ దిగువభాగాన ఉన్న కుటుంబాలనుంచి వచ్చిన వాళ్ళు గ్రామాలలో వున్న ఈ విద్యార్థులు. వీళ్ళ నిత్యజీవితాలలో ఎదురయ్యే ఏ సమస్యకు సమాధానం పుస్తకాలలో కనిపించదు. స్వతంత్రంగా ఆలోచించే స్వభావాన్ని మొగ్గలోనే తుంచేసే స్వభావంగల ఈ చదువు పట్ల వీళ్ళు దృష్టిని కేంద్రీకరించేట్టు అక్కడి స్కూళ్ళుగాని, టీచర్లుగాని చేయగలుగుతారా?

గ్రామాలు, స్కూళ్ళు, టీచర్లు, పిల్లలు, చదువు ఇవన్నీ ఎటువంటి వాతావరణంలో ఉన్నాయి? పాములేగాని విద్యుత్తులులేని వైకుంఠపాళిలో వున్నాయి. బ్యాంక్‌లో పనిచేసే అటెండర్లకు, పోస్టాఫీసులలో పనిచేసే నాలుగవ తరగతి ఉద్యోగులకు, టెలిఫోన్ ఎక్స్చేంజిలో పనిచేసే లైన్‌మెన్‌లకు 10వ తరగతి పుస్తకాలలోవున్న ఏ విషయం వాళ్ళ వృత్తికి తోడ్పడుతుంది? అప్పుకోసం దరఖాస్తు పెట్టుకోవడానికి, 10వ తరగతి పాస్ కావడానికి ఉన్న సంబంధం ఏమిటి?

ఇటువంటి అస్తవ్యస్తమైన వాతావరణాన్ని కల్పించిన ప్రభుత్వం చేస్తున్న తప్పుతో పోల్చితే, పరీక్షహాల్‌లో పిల్లలు చేసిన తప్పెంత? పిల్లలు చిన్న కాగితంపెట్టి రాస్తుంటే చూసీ చూడనట్టుగా వున్న నాతప్పెంత? ఆలోచించాను. రాస్తున్నాను. ఎవరైనా తప్పుచేస్తే ఆ తప్పు కేవలం వారిది మాత్రమే కాదు. వారిని తప్పుదారిన నడిపించిన వాతావరణానిది. వాతావరణాన్ని సరిచేయుని బాధ్యతలది. అంటే ప్రభుత్వానిది. అందుకే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాను......

కాపీ రాస్తున్న పిల్లల్ని డిబార్ చేయడంలో చూపుతున్న శ్రద్ధ, పిల్లలు చదువుకోవడానికి వీలైన వాతావరణాన్ని కల్పించడంలో ఎందుకు చూపడంలేదు? అని 'నిరాయుధులైన అభిమన్యులపై ఆయుధాలు సంధించడంలో గల న్యాయం ఏంటో తెలియజేయుమని' ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ నేనొక 'షోకాజ్' నోటీసు జారీ చేస్తున్నాను. (శేషు, షోకాజ్, శేషవాక్యం:శేషురచనలు, పే 77-83)

అంటారు రచయిత.

ఇదే ప్రధానఇతివృత్తంగా వచ్చిన రచన 'మార్పురావాలి'.

ఒక్కో తరగతి గదిలో అంతంత మంది పిల్లలు. చదువుకునే మిషతో స్కూలుకు వస్తున్నారు వారందరూ! వారికి చదువు నేర్పేందుకే తామూ ఉద్యోగాలు చేస్తున్నారు. పాపం! వాళ్ళకు చదువు రావడంలేదు. తమకు చదువు చెప్పే అవకాశం లేదు. తరగతిగదిలో అంతమంది పిల్లల్ని విశ్శృంఖలంగా ఉంచేందుకే అయ్యవారి శక్తియుక్తులు ఖర్చయిపోతాయి. ఇక చదువేం చెబుతారు! చెప్పినా ఎంతమంది నేర్చుకుంటున్నారో ఎలా తెలుసుకోగలుగుతారు! పైగా భారత, భాగవతాలంత సైజులో పాఠ్యపుస్తకాలు! ఒక విషయం చెప్పిన తరువాత దాన్ని విద్యార్థులు అర్థంచేసుకున్నారో, లేదో తెలుసుకునే వీలులేదు. రోజూ ముందుకు పోతూ ఉండాల్సిందే వెనక్కు చూడకుండా! అంటూ బాధనువ్యక్తంచేయటం కనిపిస్తుంది. (ద్వారకా, మార్పురావాలి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 26-6-'85, పే 75-78)

పరీక్షలు విద్యార్థి విద్యాసంబంధమైన నైపుణ్యాలను అంచనావేయటానికి మాత్రమే పరిమితం కాలేదు. సామాజిక స్థాయిని నిర్ణయించే అంశాలుగా పరిగణనపొందటంతో అవి విద్యార్థులను నిరంతరం మానసిక వత్తిడికి గురిచేస్తూ వ్యక్తి నైపుణ్యాల విధ్వంసానికి, ఒక్కోసారి శారీరక అనారోగ్యానికి చివరకు ఆత్మహత్యలకి కూడా కారణమవుతున్నాయి. దీని కారణంగా విద్యాపరంగా పొందలేని సామాజికగుర్తింపును మరోరూపంలో పొందేందుకు విద్యార్థులు ప్రయత్నిస్తారు.

ఫలితంగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఇతరమార్గాల్లో ఫలితాలను పొందేందుకు ప్రయత్నిస్తారు. పరీక్షాప్రమాణాలనే విద్యాప్రమాణాలుగా భావించటంవల్ల పరీక్షాప్రమాణాలను కాపాడే వర్గానికీ, ఇతరులకు మధ్య వైరుధ్యం ఏర్పడుతుంది. ఈ వైరుధ్యాలను వాటి ఫలితాలను ముందుంచిన రచనే 'పరీక్షిత్తు'. పరీక్షాప్రమాణాలను కాపాడటం, ఏదోరకంగా పరీక్షల్లో విజయం సాధించటం అనే ఈ రెండు భావనలకతీతంగా అసలు పరీక్షాప్రమాణాలను విద్యాప్రమాణాలుగా భావించటంలోని లోపాన్ని గురించి విమర్శనాత్మకంగా చర్చించాల్సిన అవసరాన్ని ఈ రచన వెలికితెచ్చింది.

"కాపీలు కొట్టిస్తే, విద్యాప్రమాణాలు పడిపోతాయండీ" అన్నాడు హెడ్మాస్టర్ వాళ్ళకు నచ్చచెప్పే ధోరణిలో.

అంత బరువైన మాట వినటం పాపం వాళ్ళకదే మొదటిసారి. తమ పిల్లవాడు వున్న తరగతినుండి పై తరగతికి వెళ్ళటమే వాళ్ళకు తెలిసిన ప్రమాణం! ఆ మాటకొస్తే ఆ హెడ్మాస్టరుకు మాత్రం ఏం తెలుసు? పరీక్షల ప్రమాణాలనే విద్యా ప్రమాణాలుగా భావిస్తున్న అసంఖ్యాక అధికారులలో అయినా ఒకరు!

"ఎవరికి కావాలిసార్ ఆ ప్రమాణాలు? మాకు మాపిల్లోల్లు పాస కావల్ల అంతే" డిమాండ్ చేస్తున్నట్లు ధీమాగా అడిగాడు ఒకరు... ఆ మాట తన్ను ఎకసెక్కెం చేస్తున్నట్లు అనిపించింది హెడ్మాస్టరికి.

"కష్టాలు అనుభవించటం మాకు కొత్తకాదు... కానీ మనం పడే కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరవుతున్నదే [illegible] బాధ! మనం కష్టపడి, ఎన్నెన్నో ఇబ్బందులు ఎదుర్కొని పరీక్షలు స్ట్రిక్టుగానే నిర్వహించామనుకోండి... ఇక విద్యాసంబంధీకులు అంతటితో ఆగుతారా? 'స్పాట్ వాల్యుయేషన్ సెంటరు' దగ్గరా తిరిగి తమపిల్లలు పాసయ్యేలా ఏర్పాట్లు చేసుకుంటారు. అక్కడా కుదరలేదనుకోండి. మళ్ళీ 'రీ ఎగ్జామినేషన్స్' అంటూ ఒకటి ఏడ్చి చచ్చాయిగా... ఆ పరీక్షల్లో తమవాళ్ళు [illegible] [illegible] [illegible]. [illegible] మనకు మిగిలేది నిందలూ, కక్షలూ మాత్రమే. ఎందుకు లేనిపోని గొడవలు తెచ్చుకోవటం" అని ఒక ఉపాధ్యాయుడు నిర్మొహమాటంగా చెప్పేశాడు పరిస్థితినంతా ..........

కంచు చెట్టు కింద విచ్చిన నీడలో పిల్లకిలాపతి చెట్టులతో మూలుగుతున్న హెడ్మాస్టర్.

అయన మాటలు, పరీక్షల మూలాల్ని కెలుకుతున్నట్లుగా తెరలు తెరలుగా వ్యాపిస్తున్నాయి. (సింగమనేని నారాయణ, పరీక్షిత్తు, ప్రజాశక్తి దీపావళి ప్రత్యేక సంచిక '91, పే 240-245)

పరీక్షాప్రమాణాలనే విద్యాప్రమాణాలుగా భావించటంలోని అసంబద్ధతను గుర్తించాల్సిన అవసరాన్ని పైరచన చర్చిస్తే, అందలి అసంబద్ధతను ప్రత్యేకంగా వివరించిన రచన స్పాట్‌వాల్యూయేషన్.

"మాస్టారూ, ఒక డౌటు. ప్రతి ఏడాది చూస్తున్నాను. ఈ కుర్రాళ్ళిలా పేపర్లలో ఉత్తరాలెందుకు రాస్తున్నారంటారు?"

గంధమాదనం అన్నాడు -- "ఎందుకంటే ఏం చెప్పను? చదువుమీద మనసుపోక. అసలు చదువెందుకో తెలీక. చదివి ఏం చెయ్యాలో అర్థంకాక." టెన్త్‌క్లాసు వరకూ అందరికీ చదువుండాలనుకొంటున్నాం బాగానే ఉంది. ఆ తరువాతేంచేస్తున్నాం? పోయిగా వ్యవసాయమో, వృత్తో చేసుకోనేవాళ్ళ్ని అక్కడ్నించి కొట్టించి హయ్యర్‌ఎడ్యుకేషన్ గుండంలోకి ఈడ్చేస్తున్నాం. పి.యు.సి. కావాలి మెడల్లో ఆస్తులున్నోళ్ళ పెద్దోళ్ళ ఎం.పి.సి. లోకి తోస్తున్నాం. వాళ్ళు మొయ్యలేని సిలబస్‌ను దావిగోళ్ళ మోయిస్తున్నాం. సినిమాహాళ్ళు, సారాకొట్లమధ్య కాలేజీలు పెట్టి 'అప్పుడాయినా మనస్సు అదుపు చేసుకో' అంటున్నాం. పరీక్షలో కాపీకొట్టాలనే కోరిక పిల్లలకసలు కలక్కుండా చెయ్యలేకపోయాం. దొరికితే కొక్కవించే మార్గాల్ని కొల్లలుగా కనిపెడుతున్నాం. ఇందుకోసం అంతరస్క్వాడ్, బాహ్య స్క్వాడ్, జిల్లా స్క్వాడ్, జోనల్‌స్క్వాడ్, స్పెషల్‌స్క్వాడ్... ఇట్లా కసికసిగా, వాళ్ళుదొంగలు, మనం పోలీసులం అన్నట్లు, స్క్వాడ్‌లువేసుకొంటూ పోతున్నాం.

"ఇన్ని టింగింపులూ వాళ్ళకోసం దేశాక మనకోసం మనం చేసుకొంటున్నదిమాత్రం ఏమిటి? ఏ వయస్సు వాళ్ళకి ఏ సైకాలజీతో పాఠం చెప్పాలో తెలిసివాళ్ళు మన లెక్చరర్ పోదరులు. ఎప్పుడూ ఆ క్లాసుకు పాఠం చెప్పని పరమావ్యక్తుడి చేత ప్రశ్నపత్రమిప్పించి గుప్పించాలిగనిన్ని అవకతవకలు దాంట్లో గుప్పిస్తున్నాం. 'మీ కోటా మీరు దిద్దిపొండయ్యా' అంటే, ఎట్లాగోట్లా మార్కు లేసేసి, మెయిల్ ఎప్పుడెక్కుదామా అని చూసేవాళ్ళే ఎక్కువమంది మనలో!

"పేపర్నిటికన్నా దారుణం ఏటిసనారి నిర్లక్ష్యం! జవాబు, పెర్మనెంటు పొస్టుల్లో ఇవాళుండి రేపెళ్ళిపోయే వాళ్లైతే

లెక్చరర్లని కొల్లలుగా వేశారు మహారాజశ్రీ దొరతనంవారు! ఇంతకన్నా ఘోరం భూమ్మీద ఎక్కడైనా ఉందా?

"అసలు చదువెందుకో, చదివి ఏంచెయ్యాలో తెలీని ఆ పసిగుండెల్లో ఎన్నెన్ని అలజళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయో, ఎన్నెన్ని ఆవేదనలు కళ పెళ్ళాడుతున్నాయో ఆలోచించేవాడెవడు? పట్టించుకొనేవాడెవడు? వ్యవస్థంతే వ్యవస్థ! ఈ అయోమయం విద్యావ్యవస్థ -- మెకాలే దొరగారి మానసపుత్రిక -- సమూలంగా మారితేగాని ఏం చెయ్యలేం. జాతి జీవన ప్రవాహంతో ముడిపడిపోయే సహజమైన విద్యావిధానాన్ని మనం ఏర్పరుచుకొనేటంతవరకూ మనహిందూదేశం పరిస్థితింతే! స్పాట్‌వాల్యుయేషన్లో మనం అన్నదుకాక ఉత్తరాలే చదువుతూంటాం!"(గుండు సుబ్రహ్మణ్యదీక్షితులు, స్పాట్‌వాల్యుయేషన్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 1-2-'89, పే 72-77)

పరీక్షాప్రమాణాలను విద్యాప్రమాణాలుగా భావింపజేసే విపరీతసామాజిక పరిస్థితిఫలితంగా ఏర్పడే దుష్ఫలితాలలో ఒకదాన్ని కళ్ళముందుంచిన రచన స్పాట్.

"చూడమ్మా నిన్ను బాధపెట్టాలని నేనలా మాట్లాడలేదు. నువ్వు తీసుకున్న నిర్ణయం ఎంత భయంకరమైందో చెప్పడానికే నేనిలా వచ్చింది. కేవలం పరీక్ష పాసవ్వడంకోసం నువ్వు ఏం కోల్పోవాలనుకున్నావో దాని విలువ నీకిప్పుడు తెలియకపోయినా అది పోయింతర్వాత తెలిసుండేది. పవిత్రమైన శీలాన్ని కోల్పోవడానికి నువ్వు సిద్ధపడ్డావంటే నువ్వు పరీక్ష పాసవ్వడం ఎంత ముఖ్యమో నేనర్థం చేసుకోగలను. కాని నువ్వు ఎన్నుకున్న మార్గం మాత్రం మంచిదికాదు.

చూడమ్మా! మానవ జీవితంలో ఒక్క డిగ్రీ పూర్తిచెయ్యడమే ముఖ్యంకాదు. డిగ్రీ పూర్తిచేసిన వెంటనే రావటానికి ఉద్యోగాలేమీ సిద్ధంగాలేవు. అలాగని డిగ్రీలేనంత మాత్రాన ఉద్యోగం రాకమానదు. అంతేకాకుండా ఈ పరీక్షపాసవ్వడం కూడా బ్రహ్మ ప్రళయంకాదు. మనస్సు కేంద్రీకరించి కొంచెం కష్టపడితే ఈజీగా పాసవ్వొచ్చు. తన సబ్జక్టులో పూర్‌గా వుండే స్టూడెంట్స్‌కి విపులంగా చెప్పడానికి ప్రతి లెక్చరరూ సిద్ధంగా వుంటారు. కాని నువ్విలా చెయ్యలేదు. ఎలాగోలా పాసయి పోవచ్చనే ధీమాలో వుండిపోయావు.

ఇప్పుడు పరీక్షపోతే ఇంకోసారి పాసవ్వొచ్చు. కానీ శీలంపోతే మాత్రం అది తిరిగిరాదు. ఇవన్నీ ఎందుకు చెబుతున్నానంటే నువ్వు సరిగ్గా నా మనుమరాలి వయస్సున్నదానవు. నాపిల్లలు తప్పు చేస్తుంటే నేను చూస్తూ ఊరుకోలేనుగా. అందుకే నీకిలా చెప్పవలసివచ్చింది. ............ ." (కట్టా రాంబాబు, స్పాట్, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 25-2-'93, పే 34-37)

స్పాట్‌వాల్యూయేషన్‌లోని విభిన్నపార్శ్వాలను చర్చించిన రచన స్పాట్‌లైట్.

ఎర్రకోటపైన మువ్వన్నె జండా ఎగిరి ముప్పైయేళ్ళుకావస్తున్నా ఈ దేశంలో విద్యావ్యవస్థ ఇంకా పొయ్యిమీద వుడుకుతున్న పాకంలాగానే ఉంది; వినియోగానికి సిద్ధమైన తినుబండారంలా లేదు. మధ్యమధ్యలో వంటచేసే వాళ్ళు మారిపోతూ వుండడం, కొత్తవాళ్ళు తయారీలోవున్న పాకంపైన సరికొత్తప్రయోగాలు తలపెట్టడం దీనికి పట్టిన దురదృష్టం. సిలబస్ విషయంలో మన అత్యాశ ఏనుగును తీసుకొచ్చి చిన్నభరిణెలో పెట్టాలనుకోడం కన్నా మెరుగ్గాలేదు. విద్యాలయాల సంఖ్య రేఖాభివృద్ధిని గురించిన 'బోస్టింగు'కు మాత్రమే ఉపకరిస్తోంది. ఆయిదేళ్ళ అమ్మాయికి పెళ్ళిచేసి సంసార బాధ్యతలన్నీ అప్పగించినట్లుగా కనిపించే పాఠశాలలే హెచ్చు. పంతుళ్ళ దగ్గరికొస్తే వాళ్ళల్లో పనిచేసేవాళ్ళకు కితాబులేదు; చేయనివాళ్ళకు దండనలేదు. ఉపాధ్యాయ వృత్తిని కేవలం ఒక హాబీగా భావించి వేరేవ్యాపకాల్లో నాలుగు రాళ్ళు గడించుకోగలిగిన వాళ్ళపనే మోతగావుంది. పరీక్షలకు పరిగణనలేదని తెలిసినప్పటినుండీ విద్యార్థులయ్యవార్లతో 'మీరు కొట్టినట్లే కొట్టండి, మేము ఏడ్చినట్లే ఏడుస్తామని చెప్పకనే చెబుతున్నారు. జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి పరీక్ష లొచ్చినప్పుడు శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలున్నాయన్న విషయం ప్రయోగాత్మకంగా రుజువైపోయింది. ఈ లొసుగులన్నీ మాకు తెలియనివేమీ కావు. కానీ మేము కళ్ళుండీగూడా చూడడం మానేశాం. చెవులుండీగూడా వినడం మానేశాం. 'అలో లక్ష్మణా' అన్నట్లుగా 'చెల్లో', డిల్లో' అనుకుంటూ రోజులు లెక్కించుకోడమే మాపని!

'స్పాట్‌లో మిగిలిన నాలుగురోజులూ నాగమణి పాలిటికి నాలుగుయుగాల్లా గడిచాయి. మాకుమాత్రం మామూలే! నాలుగు గడ్డురోజులుగానే గడిచాయి. ఇన్‌స్ట్రక్షన్ బాగున్న స్కూళ్ళల్లో విద్యార్థులు ఓ రకంగా మార్కులు తెచ్చుకుంటారు. చదువు చెప్పక కాపీ కొట్టటానికి వీలు కల్పించిన స్కూళ్ళలోని విద్యార్థులు నిరాఘాటంగా పాసైపోతున్నారు. చదువూ చెప్పక, కాపీకొట్టే సదుపాయమూ కల్పించని స్కూళ్ళలోని విద్యార్థులు రెక్కలు తెగిన ఉసిళ్ళకు మల్లే రాలిపోతున్నారు. ఎలాగైనా మార్కులు వేయించి బిడ్డను పైతరగతికి రవాణా చేయించే మహదాశయంతో విద్యార్థుల తల్లిదండ్రులు స్కూలు కాంపౌండుచుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. లోపల క్యాంప్ ఆఫీసర్ పరశురామయ్యగారు ఉదయం, సాయంకాలం ఉభయ వేళలా మైకులో హెచ్చరికలు కురిపిస్తున్నారు. జవాబుచదివి మార్కు లిచ్చే ఉపాధ్యాయులు యున్నారు. ఆ ఓపిక లేక రమారమిగా చేతికొచ్చినన్ని, మనసుకు తోచినన్ని మార్కులు పడేసే టీచర్లు -- అలాగే ముందుకు దూసుకుపోతున్నారు. (మధురాంతకం రాజారాం, స్పాట్‌లైట్, మధురాంతకం రాజారాం కథలు, పే 221-232)

పరీక్షావిధానాన్ని బలపరిచేవారు పరీక్షలు విద్యార్థులను అధ్యయనానికి ప్రేరేపిస్తాయని, తమ సంపూర్ణనైపుణ్యాలను ప్రదర్శించేందుకు అవకాశమిస్తాయని వాదిస్తారు. అలానే తమ ఆలోచనలకు, ఊహలకు ఒక రూపాన్నిచ్చేందుకు, కాలాన్ని సక్రమంగా వినియోగించుకునేందుకు, క్రమబద్ధమైన

అధ్యయనాన్ని అలవర్చుకునేందుకు పరీక్షలు సహకరిస్తాయని వీరి వాదన.

అయితే అధ్యయనానికి పరీక్షలు ప్రేరకాలుగా భావించే పక్షంలో, అధ్యయనాన్ని ప్రేరేపించేందుకు ఇంతకు మించిన ప్రేరకాలు మనకు లభ్యంకావా? విద్యాపరంగా పరీక్షలను న్యాయమైన ప్రేరకాలుగా భావించవచ్చునా? అసలు విద్యా బోధనలోని అంశాలు విద్యార్థుల జీవితావసరాలకు తగినట్లుగా ఉన్నాయా? నిజజీవితానికి దగ్గరగా ఉన్నాయా? వ్యక్తిగత భాగస్వామ్యానికి అవకాశంలేకుండా, సరైన స్నేహపూర్వక సంబంధాలకు అవకాశం లేకుండా కేవలం పరీక్షల భయం మాత్రమే ప్రేరణనివ్వగలదని మనం భావించగలమా? వంటి ప్రశ్నలకు సమాధానం వెతకాల్సిఉంటుంది. సర్గిగా ఇలాంటి ఆలోచనాధోరణితో విమర్శను వెలువరించిన వ్యక్తిగా తెలుగుసాహిత్యంలో చలం ని పేర్కొనవచ్చు. పరీక్షావిధానంపట్ల సమగ్రమైన దృక్పథాన్ని , సునిశితమైన విమర్శను వెలువరిచిన రచయిత చలం. తన మ్యూజింగ్స్‌లో పరీక్షార్థులైన విద్యార్థుల పట్ల సానుభూతిని ప్రకటిస్తూ, పరీక్షావిధానంలోని అసంబద్ధతను గుర్తిస్తూ ఇలా పేర్కొంటారు.

కుర్రాళ్ళు పరీక్షలకి రాస్తోవుంటే, కావలికూచున్నాను. ఈ పరీక్ష కాయితాలకి మార్కులువెయ్యడం యెక్కువబాధో, లేక వీళ్ళు రాస్తో వుండగా కావలికాయడం ఎక్కువబాధో నిర్ణయించుకోలేకుండా వున్నాను. ఈ కావలికాయడంలోని యీ అనుమానంలో నైతికనీచత్వం స్ఫురిస్తుంది. "మీరు దొంగలు. మీకు నీతిలేదు. నేను చాలా నీతిమంతుణ్ణి. మీ దొంగతనాలు పట్టి చీల్చేందుకు ఇక్కడ కూచున్నాను". అంటున్నట్టుంటుంది. వాళ్ళు తలెత్తి నావంక చూసి, మళ్ళీ తలలువొంచి రాస్తో వుంటే, అక్కడకూచోడం సిగ్గువేస్తుంది. వీళ్ళందరూ యెవరి పనిమీద వాళ్ళుంటారు. పనిలేనివాణ్ణి, ఎవరితోను ఏ సంబంధం లేనివాణ్ణి, పైగా విరోధినీ నేనే. పరదేశంలో భాషరానివాళ్ళో యేకాకినై కూచున్నట్టుంటుంది. (చలం. 1987:14)

ఎందుకూ ఈ యాతన! ఆ పిల్లలు ప్రశ్నల్ని సాగదీసి, సాగతీసి అట్లా లేనిపోని ప్రత్యుత్తరాలు రాయడం, నేనీ శూన్యాన్ని భరించలేక పంజరంలో పిట్టవలె కొట్టుకోవడం? ఎందుకోసం? ఎన్నేళ్ళకి, యెన్నాళ్ళకి యీలోకం ఇట్లాంటి అనర్థాలనుంచి బైటపడుతుంది? పైగా యింత నీచత్వంలో బాధలో నేర్చుకునే విద్య, యీ కాయితాలతో కొలిచే జ్ఞానం మనుష్యుల మెదళ్ళని వెలిగించి, లోకాన్ని ఉద్ధరిస్తుందట. ----------- ఉండి, ఉండి, యీ కావలి వృత్తిని భరించలేక ఒక్క అరుపు అరిచి, యీ విద్యనీ, యీ పరీక్ష కాయితాల్ని గబగబా తిట్టి, బైటికి పారిపోవాలనిపిస్తుంది. ఎప్పుడో యీ నిగ్రహశక్తి అల్పమైపోయి, బాధ అమితమై, అట్లాంటి వుపద్రవం చేస్తారేమో! (చలం. 1987:15)

ఇలాంటి ఆలోచనాధోరణితో తెలుగులో విస్తృతంగా రచనలు వెలువడినాయి. ఇవన్నీ విద్యారంగంలో పరీక్షావిధానం పైన అనేక ప్రశ్నలను లేవనెత్తాయి. నిరంతరమూల్యాంకనం కోసం నియతకాల పరీక్షలను తొలగించటంవల్ల కొంతమేరకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఇందులో బోధనాంశాలలో విద్యార్థి అవగాహన ముక్కలుగాను, ప్రత్యేకాంశాల అధ్యయనం మరింత ఎక్కువగాను ఉంటుంది. అధ్యయనాంశాలకు సంబంధించి ఒక విస్తృతమైన సంపూర్ణఅవగాహనను వీరు పొందలేరు.

అయితే మూల్యాంకనా విధానాన్నిబట్టి ఉపాధ్యాయ,విద్యార్థి సంబంధాల్లోని సంకుచితత్వాన్ని, జ్ఞానానికి సంబంధించిన ఒక అసామాజిక దృక్పథాన్ని గుర్తించవచ్చు. ఇటువంటి పరిస్థితి ఇంతయిదిగా పరీక్షల్లో మినహా మరెక్కడా గుర్తించలేము. ఈ విధానంలో విద్యార్థి తన ఆలోచనలకు ప్రతిగా ఒక అస్పష్టమైన గణాంకాన్ని మాత్రమే పొందగలుగుతాడు. నిరంతరం జరిగే

అధ్యయనంలో పరీక్షలు నిర్ణాయకాలుగాభావించటం సమంజసమా అన్నది పెద్దప్రశ్న.

పరీక్షా నిర్వహణ విషయంలో నిర్వాహకుల వ్యక్తిగత జీవితం పరీక్షలనిర్వహణపైన చూపే ప్రభావంయొక్క భిన్న పార్శ్వాలను ప్రతిబింబించినరచనలు సాహిత్యంలో చోటుచేసుకున్నాయి. పరీక్షానిర్వహణలోని లోపభూయిష్టతకు అకారణంగా బలైన వ్యక్తి తిరిగి అదేచర్యకు మరోవిద్యార్థిని బలికాకుండా చేసేందుకు తీసుకున్న సాహసోపేతమైనచర్యను తెలియజెప్పేరచన 'వంకరమనుషులు'.

అపరిపక్వమైన ఆలోచనలు, సాంద్రతలేని భావాలు అంతరంగంలో ఘర్షణ సృష్టించాయి. ఈ అంతర్ముఖత్వం నుంచి తప్పించుకునే ప్రయత్నంలో చదువుపట్ల మరింతకసితో శ్రద్ధపెంచుకున్నాను. అహర్నిశమూ పుస్తకమే ప్రపంచమైంది నాకు. అక్షరాలు నా ఆప్తమిత్రులయ్యాయి. వాక్యాంశాలు నా ప్రాణవాయువులయ్యాయి. నాచదువు తపస్సులా కొనసాగుతూ జ్వాలలు రేకెత్తిస్తోంది. నాకు తెలుసు--అమ్మా, నాన్నా తల్లడిల్లి పోయేరు.

చిన్నన్నయ్య సన్నద్ధంచేసుకున్నాడు. ధైర్యాన్నిస్తున్నట్టు నా భుజం తడుతూ చెప్పేడు. " నేనున్నానురా బుచ్చీ! నువ్వెంత చదువుకున్నా చదివిస్తాను. జీవితంలో రాజీపడకు తిరగబడు. అక్షరాలను హృదయాక్రాంతం చేసుకో. ఈ రాష్ట్రానికే ఫస్టుగా నెగ్గాలి నువ్వు." ..................

ఎవరూ ఊహించనంత వేగంగా స్క్వాడ్‌చేతిలోంచి ఆ కాగితం ముక్క లాగేసుకున్నాను. ఉండలాచుట్టి దాన్ని నమిలేశాను.

"డిసీజ్ టూమచ్. దీని పరిణామం ఏమిటో తెలుసామీకు?"

"తెలుసు. అయినా భయంలేదు." అదే తెగింపు నాలో. రుసరుసగా వెళ్ళిపోయేరు స్క్వాడ్.

మూర్తికళ్ళు కృతజ్ఞతతో మెరుస్తున్నాయి. చంద్రం మొహంలో భంగపాటు.

ఈ పేపర్లు ఇవ్వడానికి వెళ్ళేటప్పుడు సూపరింటెండెంట్‌గారు మెమోతో ఎదురుచూస్తుంటారు. ఇన్‌విజిలేటర్‌గా రెండు మూడేళ్ళు డీబార్‌చేస్తారు. ఇంక్రిమెంట్ ఆపి నన్ను ఇబ్బందికి గురిచేస్తారు. ఏదయినా జరుగుతుంది. జీవితంలో చెయ్యని నేరానికి పొందిన శిక్షముందు, ఇదెంత? నేను చేసినది తప్పో, ఒప్పో నా అంతరాత్మకు తెలుసు. ఆటవిక సమాజంలో ఆటవిక న్యాయమే సరైనది. ఇన్నాళ్ళూ నా మనస్సునావరించుకున్న వెలితి దూరమైనట్లనిపిస్తోంది. ఈ క్షణంలో. (కన్నేపల్లి చలమయ్యశాస్త్రి, వంకరమనుషులు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 2-12-'87, పే 63-69)

పైచర్యకు విరుద్ధంగా తనకు ఎదురైన చేదు అనుభవాలను తిరిగి విద్యార్థులు పొందటాన్ని చూసి ఆనందించే వ్యక్తిత్వాన్ని ముందుంచే రచన 'ది సినిక్'.

"అహ. అదికాదు. ఒక్కసారి ఆలోచించండి. స్లిప్పు రాయటం తప్పే. నేను కాదనను. అది మీరు వెంటనే తీసుకుని చింపేసి ఉంటే అతనికింక శిక్షపడి ఉండేదికాదు. కొంత టైం అయిన తర్వాత పట్టుకోవటం అంటే పరోక్షంగా ఆ తప్పుని మనే ప్రోత్సహించడమన్నమాట! ఒకడు ఒక అమ్మాయిని రేప్ చేయబోతున్నాడనుకోండి. అక్కడ మీరుంటే ఏం చేస్తారు? వాడికి పూర్తిగా అవకాశం కల్పించి తరువాత వాడిని పట్టుకుంటారా? లేక అది జరగకుండా ముందే ఆపుతారా?" ఆవేశంగా అతని వైపు చూస్తూ అన్నానేన్నను.

అతని తల తిరిగిపోయినట్లయింది. ఏం మాట్లాడాలో అతనికి అర్థం కాలేదు.

ఈ సంఘటన జరిగిన ఎన్నో రోజులకిగాని నాకు తెలియలేదు-- వీరభద్రరావు తన 'బిఇడ్' పరీక్షల్లో 'స్లిప్పు' రాస్తుండగా దొరికి పోయాడనీ -- రెండేళ్ళు యూనివర్సిటీ వాళ్ళు 'డిబార్' చేశారనీ! (శీలావీ మోహన్‌బాబు, ది 'సినిక్', ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 28-12-'79)

అయితే పరీక్షలు ఎవరి ప్రయోజనాలనుద్దేశించినవి? అన్న ప్రశ్నకు సమాధానం అంత సులభంకాదు. గతానికి, వర్తమానానికి చెందిన విజయాలకు సంబంధించినవి. విద్యార్థిపరంగా ఒక బహుమతిని లేదా విజయానికి సంబంధించిన అనుభవాన్నిచ్చేందుకు, తన సామర్థ్యాలను, బలహీనతలను గుర్తించేందుకు, అభివృద్ధిపొందిన తన సంపాదనా శక్తిని లెక్కించేందుకు, ఒక ప్రోత్సాహకంగా, విద్యార్థి పనినైపుణ్యానికి గుర్తింపునిచ్చేందుకు ఇవి దోహదకారులవుతాయి.

విశ్వవిద్యాలయసిబ్బందిపరంగా తమ బోధనానైపుణ్యానికి గీటురాయిగా, తాము బోధనాలక్ష్యాలను ఎంతమేరకు సాధించారో గుర్తించేందుకు, విద్యార్థుల్లో కఠినశ్రమను పాదుకొల్పేందుకు, రోగనిర్ధారణకొరకు, బోధనను విద్యార్థులకు అనుగుణంగా మార్చుకునేవిషయంలో

బోధకులకు సహకరించేందుకు, విద్యార్థులను ప్రత్యేక అధ్యయనాంశాలకు ఎంపిక చేసేవిషయంలో పరీక్షలు దోహదపడతాయి.

తల్లిదండ్రులపరంగా తమ వ్యక్తిగతమైన, ఆర్థికమైన పెట్టుబడికి తగిన ప్రతిఫలంగా ఇవి గుర్తింపు పొందుతాయి. భవిష్యత్ ప్రయోజనాలకు సంబంధించినంతవరకు. యజమానులకు అర్హతాస్థాయికి సంబంధించిన ప్రామాణికతకోసం. జ్ఞానానికి సంబంధించి భవిష్యత్తులో జ్ఞానవిస్తృతికోసం కృషిచేసే వారికి శిక్షణగాను, ప్రభుత్వానికి అవసరమైన వైద్యులు, సాంకేతికనిపుణులు వంటివారిని అందించేదుకు. పాఠశాలలకు ఒక లక్ష్యంగా, భవిష్యత్తులో తల్లి దండ్రులకు విజయాలకు సంబంధించిన సమాచారం అందించేందుకు, స్నాతకోత్తరస్థాయి సంస్థలకు భవిష్యత్ ప్రగతికి సూచికగా విశ్వవిద్యాలయ స్థాయిలో ప్రవేశాలు, నిష్క్రమణలకు సంబంధించి ఓ క్రమపద్ధతిని పాటించేందుకు, సమాజంలో తమ సంస్థ స్థాయిని పెంపొందించుకునేందుకు పరీక్షలు కొలబద్దలుగా నిలుస్తాయి.

అయితే ఇక్కడ మనంగమనించాల్సిన మరో అంశం ఉంది. పైన పేర్కొన్నప్రకారం పరీక్షలో ఉత్తీర్ణులైనవారు గెలుపొందిన భావన పొందుతారు. కాని పరీక్ష ఉత్తీర్ణులుకాని అనేకమంది మాటేమిటి?

పరీక్షల్లోని విశ్వసనీయత గురించికూడా చర్చించాల్సి ఉంది. ఒక పరీక్షను వేరువేరు వ్యక్తులుకాని, ఒకేవ్యక్తి వివిధసమయాల్లో కాని చేసిన మూల్యాంకనం ఒకే విధంగా ఉంటే ఆ పరీక్ష విశ్వసనీయత కలిగిఉందని భావించాలి. అయితే పరీక్షకు సంబంధించి మూల్యాంకనాన్ని వివిధ పరిస్థితులు ప్రభావితం చూపుతాయి. విద్యార్థిచేతిరాత, పరీక్షకునిఅలసట, శ్రమ, నిర్లక్ష్యం, లింగం, ఆశించేస్థాయిలో మార్పులు, విద్యార్థి సామర్థ్యం, వైఖరులను నిర్ణయించే విధానం, సామాజికస్థాయి, పరీక్షలో వ్యక్తంచేయబడిన అభిప్రాయాలు పరీక్షకునికి అంగీకారయోగ్యం అవుతాయో, కావో? వంటి విభిన్న అంశాలు పరీక్షా మూల్యాంకనాన్ని ప్రభావితం చేస్తాయి. ఇలాంటి విభిన్నఅంశాలు ఎలాంటి ప్రభావాన్ని చూపుతాయో వాటి ఫలితం ఎలా ఉంటుందో వర్ణించిన రచన 'టిక్కుసుల్తాన్'.

విజాయితీగా, పట్టుదలగా చదివి పరీక్షరాసిన విద్యార్థులకు కూడా ఐదు మార్కులుంటే మూడున్నర. రెండు మార్కులుంటే ఒకటిన్నర. చేతిరాత బాగున్నవాళ్ల తలరాత బాగున్నట్లే. పేపగునిండా గీస్తున్న ఎర్రెరని గీతలు..... లేత హృదయాలమీద కత్తితో గీస్తున్న గీట్లలాగా అనర్థులను అందలాలెక్కిస్తున్నారు. అర్థులను అగాథాలలోకి విసిరివేస్తున్నారు. 24వ తేదీన దినపత్రికల నిండా పదవతరగతి పరీక్షా ఫలితాలు......

అనుకున్నట్లుగా ర్యాంక్ రానందుకు కొందరిలో........

అనుకున్నట్లుగా క్లాస్ రానందుకు మరికొందరిలో......

అనుకున్నట్లుగా పాస్ కానందుకు ఎంతోమందిలో.....

కళ్ళు కన్నీళ్ళను కారుస్తున్నాయి! తల్లిని కోల్పోయిన పిల్లమేక బెదురుచూపులు ఎన్నివేల కళ్ళల్లోనో........

ఎన్నివేల చిట్టిచిట్టి పాదాల కింద నేల కరిగిపోతున్నదో...........

కన్నీటి కళ్ళకు పేపర్లో ఏముందో అస్పష్టత..... భవిష్యత్ అస్పష్టత..... పిల్లలు ఎందుకు పరీక్షతప్పారో ఊహకందని తల్లిదండ్రులు పిల్లల్ని తిట్టినా, కొట్టినా గొంతుపెగలని పిల్లలు ఘనీభవించిన కన్నీళ్ళు ప్రశ్నిస్తున్నది ఒక్కటే!

'సోక్రటీస్' కు విషాన్ని ఇస్తున్నది ఎవ్వరని.

మార్కులు సరిగ్గా రాలేదని భావిస్తే మీరు రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోండి..... పిలుస్తోంది బోర్డ్ ఆఫ్ సెకండరి ఎడ్యుకేషన్ కార్యాలయం. 'దాహంగా వుంటే రండి....నీరు తాగండి....దాహం తీర్చుకోండి....' అని పిలుస్తున్న ఎండమావి పిలుపు అది. ..................

మనిషిలాగా నవ్వుతూ దగ్గరకిపోగానే తినేసే 'హైనా'లాంటి జంతువులున్న అరణ్యం ఆ కార్యాలయం. 'ఆవును - దూడను రెండింటినీ తినేస్తామన్న పులిలాగా ఎదురుచూస్తున్న కార్యాలయం అది. తప్పిపోయిన పిల్లల ఆశల జాడలను వెతుక్కుంటూ వేలాదిమంది తల్లిదండ్రులు ఆ కార్యాలయం చుట్టూ..... తిండినీ, నిద్రనీ మానుకొని తండ్రి కోసం తండ్రితెచ్చే కబురుకోసం వీధి గుమ్మాలకు వ్రేలాడుతున్న వేలాది పిల్లల శబరికళ్ళు. (శేషు, 'టిక్కుసుల్తాన్', శేషవాక్యం శేషురచనలు, పే 84-93)

లోపభూయిష్టమైన పరీక్షా విధానాన్ని, మూల్యాంకనంలో చోటుచేసుకునే అవకతవకలను ముందుంచినరచన 'స్పాట్‌వాల్యుయేషన్'.

వంకర్లు తిరిగిపోతూ, ప్రతి అక్షరం నొక్కి నొక్కి ఫాషన్‌గా పలుకుతూ చంచల అంది: " అస్సామీనా? దిద్దేశాను గదండీ. మార్కుల పోస్టింగు కూడా అయిపోయింది."

"మీకు అస్సామీ వచ్చా?"

"రాదనుకోండి. రావాలంటారా?" తల సుతారంగా వంచుతూ, తన విశాలమైన కళ్ళు తిప్పుతూ చంచల అంది.

సాందీపని తెల్లబోతూ చూశారు. " మరి భాష రాకుండా పేపర్లెలా దిద్దారమ్మా?"

"ఎట్లాగేంటండీ! స్టెప్పుదగ్గర ఫుల్ మార్క్సు వేశానుగదా? రన్నింగ్ మాటర్ దగ్గర కొంచెం అటూ ఇటూగా వేశాను గదా. మొత్తంమీద మంచి మార్కులే వేశానెండి అయిదుగురికీ."

"అటూ ఇటూగా వెయ్యటమేంటి? అసలు నాకు చెప్పొద్దుటమ్మా! ఇప్పుడా కుర్రాళ్ళ భవిష్యత్తేమిటి?"

"ఏమీ అవ్వలేదు. హాయిగా పాసయ్యారు గద! పోనీ, ఇప్పుడు నన్నేంచెయ్యమంటారో చెప్పండి."

గొంతులో కోపం ధ్వనించగా సాందీపని అన్నారు: " ఏంచెయ్యమంటావా -- ఖర్మకాలి ఎప్పుడన్నా రభ రెస్తే మీకూ నాకూ అస్సామీ ధరోగా వచ్చని చెప్పు. అంతకన్నా ఏం చేస్తావు!"

అసలు ప్రజల్లోనే విద్యపట్ల అలక్ష్యభావం పెరగటం దీనికంతటికీ మూలమని నా అభిప్రాయం. దేనివల్లనయితే పాశ్చాత్యదేశాలు అభివృద్ధి శిఖరాలనధిరోహించినయో, ఆ విద్యపట్లే మన ఎం.ఎల్.ఏ. లకు, నాయకులకు, చివరికి పేరెంట్సుక్కూడా నిర్లక్ష్యం పెరిగింది. ఇదొక విషవలయం! ఈ విషవలయం ఛేదింపబడిన రోజుగాని, మీకూ, స్టూడెంట్సుకూ జీవితాలు బాగుపడవ్! దేశం బాగుపడదు.........." (గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు, స్పాట్ వాల్యూయేషన్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 21-11-'79, పే 61-67)

పరీక్షల మూల్యాంకనంలో చోటుచేసుకునే అవకతవకలు ఆకారణంగా జరుగుతున్న దోపిడీలను ప్రతిబింబించిన రచన 'దోపిడీ'

పరీక్ష పేపర్లు దిద్దటమనేది చాలా విసుగైన పని -- పదిపేపర్లు చూసేటప్పటికి చాలా ఓపిక నశించిపోతుంది -- బయటికి వెళ్ళి కాఫీ తాగి, సిగరెట్లు పీల్చి, గాసిపింగ్ చేసి మళ్ళీ వస్తారు -- సాధ్యమైనంత త్వరగా ముప్ఫై పేపర్లు పూర్తిచేసి వెళ్ళిపోవాలని ప్రయత్నిస్తుంటారు -- విద్యార్థి రాసిన ప్రతివాక్యం చదివి మార్కులు వేసేవాళ్ళు చాలా తక్కువమందే ఉంటారు -- చాలామంది మొదటిపేజీ చదవగానే ఆ విద్యార్థి సత్తా ఏమిటో పసిగట్టేస్తారు. ---------------

"ఏమండీ రాఘవయ్యగారూ! ఫిజిక్స్ పేపర్లో ఫ్లవర్స్ ఫిగర్సెందుకుంటాయండీ" అన్నాను.

అతను వెంటనే గాఢనిద్రలోంచి లేచినట్టుగా ఉలిక్కిపడి

"ఏమన్నారు? ఫ్లవర్సా? ఫిజిక్స్ పేపర్లో ఫ్లవర్సెందుకుంటాయి ..... కరెక్టే! అయ్యబాబోయ్! ఇది ఫిజిక్స్ పేపరు కాదండోయ్! బోటనీ పేపరు" అరిచినట్టుగా అన్నాడాయన. ఆమాట విని చుట్టుపక్కలున్న వేరే లెక్చరర్లు చాలామంది ఘొల్లున నవ్వారు -- అప్పటికే రాఘవయ్య బోటనీ పేపరును ఫిజిక్స్ పేపరనుకుని మూడొందలు దిద్దేసి మార్కులు వేసేశాడు ..................

"ఇదేమిటి? మార్కు లేశారేమిటి?" కంగారుపడిపోతూ అన్నాడాయన.

"పొరపాటున ఫిజిక్స్ పేపరేననుకుని వేసేశాను......" అన్నారు రాఘవయ్య కొంచెం తడబడుతూ--

"బోటనీ పేపరుని ఫిజిక్స్ పేపరని ఎలా అనుకుంటారు? కనీసం ఒక్కవాక్యం చదివినా తెలిసిపోతుందే.... దిసీజ్ టూ మచ్" కోపంగా అన్నారు ఛీఫ్ ఎగ్జామినర్ ..............

"అసలు మనం ఈ స్పాట్ వాల్యూయేషన్ కెందుకొచ్చాం? ఓ వెయ్యిరూపాయలొస్తాయని...... జీతం కాకుండా వెయ్యిరూపాయలంటే చాలా పెద్దమొత్తమే...... మనం చేసే పెద్దపనికూడా ఏముందని.......ముప్ఫైపేపర్లను ఓ గంట సేపట్లో దిద్దేవాళ్ళున్నారు."

"అలా దిద్దేవాళ్ళు విద్యార్థులకెంత అన్యాయం చేస్తున్నారో ఎప్పుడైనా ఆలోచిస్తారా? ఇదంతా విద్యార్థులను దోచుకోవటం కాదూ? మన విద్యార్థులంటే మనకు పిల్లలాంటివాళ్ళు.....మన పిల్లల్ని మనమే దోచుకోవటం ఎంత ఘోరం?..."కొంచెం ఆవేశంగా అన్నాను --

మీరనవసరంగా ఆవేశపడిపోతున్నారు సార్! మనం జీవిస్తున్నదే దోపిడీ వ్యవస్థలో..... ప్రతిచోట దోపిడీ....దోపిడీకి వావివరుసలుండవు. ఈ వ్యవస్థలో తల్లిని బిడ్డ, బిడ్డను తల్లి కూడా దోచుకుంటారు....ఈ దోపిడీని మనం ఆపగలమా?"

"ఆపలేకపోతే మానె....కనీసం మనం కూడా ఆ దోపిడీలో భాగస్వాములం కాకుండా ఉంటే చాలు."

"తప్పదు సార్.... దోపిడీ వ్యవస్థలో ప్రతివాడూ భాగస్వామి కాక తప్పదు...." అంటూ మోహన్ చాలా సేపు దోపిడీ యొక్క వివిధ స్వరూపాలను గురించి మాట్లాడాడు. (నవీన్, దోపిడీ, ఎనిమిదో అడుగు, పే 140-147)

ఇక్కడ విద్యార్థి ప్రతిభకంటేకూడా ఇతర పరిస్థితులప్రభావం అధికంగా ఉండటం గమనార్హం.

"All the experimental data has shown that for a particular performance expressed in terms of an exam script, assessment by different examiners produces marks with considerable variability such that in the determination of these marks the part played by the examiner can be greater than that of the performance of the examinee". (H.Pieron, Examens et docimologie, Paris, 1963; quoted in R.Cox, 'Examinations and Hiihger Education' Universities Quarterly, xxi, 3 (June, 1967), 300)

పరీక్షలు అనేక అంశాలను గణించేందుకు సాధనాలు కాబట్టి ఉత్తమ ఉద్దేశ్యంతో పనిచేసినప్పటికీ ఇద్దరు పరీక్షకులు పరీక్షా మూల్యాంకనంలో వేరువేరు ప్రమాణాలను ఆధారంగా గ్రహించే అవకాశం ఉంది. ఒకరు సమగ్రత, స్పష్టత, పొందిక గణిస్తే, మరొకరు స్వతంత్రత, విమర్శనాత్మకత, విషయపరిజ్ఞానాలను గణించవచ్చు. ఇరువురు అవగాహనానైపుణ్యాన్ని గుర్తించినప్పటికీ వేరువేరుగా గణించవచ్చు. ప్రమాణాలను, సామర్థ్యాలను సమానంగా గణించినప్పటికీ నిర్ణీతకాలంలో చేసే పరీక్షా మూల్యాంకనలో వానిని నిరంతరం మనసులో ఉంచుకోగలగటం సాధ్యమయ్యే అంశం కాదు.

అయితే ఇందుకుభిన్నంగా పేపర్లమూల్యాంకనాన్ని ఒక యజ్ఞంలా భావించేవాళ్ళుకూడా లేకపోలేదు .అటువంటి వ్య క్తే 'నారాయణస్వామి'.

ప్రతి సంవత్సరమూ ఏదో ఒక యూనివర్సిటీ నుంచి దిద్దటానికని పరీక్షా పత్రాలు వస్తూనే ఉంటాయి. ఆయన పరీక్షా పత్రాలు దిద్దటంలో ఒక నిర్దిష్టమైన పద్ధతిని అవలంబిస్తారు. రోజుకు నలభై పత్రాలకంటే ఆయన దిద్దరు. అంతకంటే ఎక్కువ దిద్దినట్లయితే విద్యార్థులకు న్యాయం చేకూరదని ఆయన నమ్మకము. ఎంత అనుభవజ్ఞులయినా మొదటి పదిహేను ఇరవై పత్రాలు స్థిమితంగా చూడగలరు గాని -- ఆ తరువాత ఏదోఒకవిధమైన తొందరపాటు తప్పకుండా కలిగి విద్యార్థులకు అపకారం జరుగుతుందని ఆయన విశ్వాసం. (ఇల్లిందల సరస్వతీదేవి, ఆదార్శ నారాయణస్వామి, స్వర్ణకమలాలు, పే 940-949)

దీర్ఘకాలిక పరీక్షా విధానానికి మారుగా సూచించిన ప్రత్యామ్నాయ మూల్యాంకనా విధానాలు కొన్నిసార్లు పరీక్షలకు పూరకాలుగాను, మరికొన్నిసార్లు పరీక్షలకుమారుగాను ఉపయోగించబడుతాయి. స్వల్పకాలిక పరీక్షలుకూడా పుస్తకాలుచూచి రాసే పద్ధతి, ప్రశ్నలను వెల్లడిచేసి జరిపే పరీక్షా విధానం, ఇంటికి ప్రశ్నపత్రాన్నందించి జరిపే పద్ధతి వంటివాటిద్వారా తొలగించవచ్చు. అయితే ప్రసిద్ధమైన ప్రత్యామ్నాయం నిరంతరమూల్యాంకనంగా భావిస్తున్నారు. ఇదికూడా పరీక్షరూపంలో ఉన్నప్పటికీ దీని ప్రధాన లక్షణం ప్రధానమైన ఒక అంశంమీద ఎటువంటి కాలపరిమితి లేకుండా, అవసరమైన సమాచారాన్ని పరిశీలించుకునే అవకాశం ఉండటం. వివరమైన సూచనల రూపంలో పునఃసమీక్ష ఉండటం.

అయితే విశ్వసనీయత, ప్రామాణికతలకు సంబంధించిన సమస్యలు కొంతమేరకు ఇక్కడకూడా ఉన్నాయి. 'any alternative system is likely to produce its own crop of casualties and its own varieties of stress.' (----) నిరంతర మూల్యాంకనంకూడా ర్యాంకింగ్, గ్రేడింగ్ పద్ధతులతోకూడి ఉన్నందున ఇవిసైతం సాధారణ పరీక్షా విధానంలోని సామాజిక స్థాయి వంటి వాటి నిర్ణాయకాలుగా మారి జీవితంలో సంఘర్షణను అధికం చేస్తాయి.

సమయకాలిక పరీక్షా విధానాన్ని బలపర్చేవారు నిరంతర మూల్యాంకనాన్ని మూల్యాంకన ప్రక్రియలో ఒక అభివృద్ధికర చర్యగా అంగీకరించరు. వీరి వాదనలో సమయకాలిక పరీక్షా విధానానికి ప్రత్యామ్నాయం లేదు. వీరిదృష్టిలో నిరంతర మూల్యాంకనం విద్యార్థులను నిరంతరం వత్తిడికి గురిచేసే ప్రక్రియ. ఇది బహిరంగంగా చేసే మోసం. ఉపాధ్యాయ విద్యార్థి సంబంధాలను ఇది నాశనం

చేయటమే కాక, కాలహరణ ప్రక్రియ. పరీక్షావిధానానికి ప్రత్యామ్నాయాన్ని వెదకాల్సిన అవసరం ఏమిటి? అది విద్యాసంబంధమైనదే అయితే, పరీక్షలు అరుదుగా ప్రత్యామ్నాయాలుగా లెక్కకు వస్తాయి. విద్యా సంబంధమైన అభివృద్ధి సంభాషణారూపంలోనూ, చర్చలద్వారానూ జరుగుతుంది. అయితే స్వల్పకాలిక పరీక్షా విధానంలో ఇటువంటి వాటికి అవకాశంలేదు. ప్రజలు విద్యావంతులయ్యేది పరీక్షలద్వారాకాకుండా ఇతర అంశాలద్వారా అని మనం గ్రహించవచ్చు.

ఈ పాఠశాల యంత్రాంగం ఒక్క రాత్రిలో మాయమయ్యేదికాదు. అయితే దీనికారణంగా మూల్యాంకనా విధానాన్ని అలాగ కొనసాగించే ప్రయత్నంచేయటం సమంజసం కాదు. నిరంతర మూల్యాంకనం కొంతమేరకు అభివృద్ధికరమైనది. దీన్నుంచి మనం మరికొన్ని మార్పులు, చేర్పులు చేయగలం. ఇక్కడ మనం మైకేల్ స్క్రివెన్ ప్రతిపాదించిన, బ్లూమ్ అభివృద్ధిపరిచిన విభజనను గుర్తించాల్సి ఉంటుంది. ఆ విభజనలో ప్రధానంగా వస్తుసంబంధమైన మూల్యాంకనం, రూప సంబంధమైన ముల్యాంకనం ఉంటాయి. ఒక అంశం, అధ్యాయం, కోర్సు పూర్తయినవెంటనే చేసేది వస్తుమూల్యాంకనం. విద్యార్థుల స్థాయిని నిర్ణయించటం, ఉపాధ్యాయుని బోధనాసామర్థ్యాన్ని లెక్కించటం, పాఠ్యాంశాలను సరిపోల్చటం ఈ మూల్యాంకనం ప్రధాన లక్ష్యం. సమయకాలిక పరీక్షలు ఇందుకు ఉదాహరణ. రూపనిష్పాదన మూల్యాంకనం బోధన పూర్తి చేసుకునే ముందుకాక విద్యార్థి రూపొందే క్రమంలోనే జోక్యం చేసుకుంటుంది. ఆక్రమంలోనే అది అవసరమైన మార్పులు, చేర్పులను సూచిస్తుంది. అందువల్ల వెంటనే అధ్యయనాంశాలను మరింత ప్రయోజనకరంగా మార్చే వీలుకలుగుతుంది. మనం పేర్కొనే నిరంతరమూల్యాంకనం రూపనిష్పాదకమూల్యాంకనానికి అవసరమైన పరిస్థితులను తృప్తిపరిచేక్రమంలోనిదే. అయితే ఇక్కడ సునిశితమైన భేదం ఉంది. రూపనిష్పాదక మూల్యాంకనం ప్రత్యేకించి అధ్యయనాన్ని మెరుగుపరచు కునేందుకు ఉద్దేశించింది. నిరంతరమూల్యాంకనం అధ్యయనపరిస్థితులను అభివృద్ధిపరిచేదే అయినా ప్రస్తుతం అది కేవలం ఎంపిక, పట్టాప్రదానాలకే పరిమితమైంది. ఈ రెండు అంశాలను సరిగా పునరైక్యం చేయటం వీలుకాదు. అంతేకాక ఇవి అధ్యయనంలో అవసరంలేని మానసికాంశాలు, ఇతర అంశాలనుకూడా పరిగణనలోకి తీసుకుంటాయి. అందువల్ల ముందుగా ఈ రెండుఅంశాలను వేరుచేయటం ప్రధానం. అర్హతలను ధృవీకరించటం వివిధసంస్థల బాధ్యత. అవి స్వంతంగా మూల్యాంకనం చేసి తమకు అవసరమైన వ్యక్తులను ఎంపికచేసుకుంటాయి. పాఠశాల ధృవీకరణలు కేవలం సంబంధిత కోర్సులో విద్యార్థి తృప్తికరంగా పాల్గొన్నదీ, లేనిదీ మాత్రమే తెలియజేయాలి. ఎటువంటి ఉత్తీర్ణత, విఫలతలగురించి, స్థాయిల నిర్ణయం వంటి అంశాలు ఇందులో పేర్కొనవలసిన అవసరంలేదు. ఇందువల్ల పాఠశాలవిద్య మరింత సుసంపన్నమవుతుంది. విభిన్న దిశలతో నిండిన మూల్యాంకనావిధానాన్ని అనుసరించాల్సిన పనిలేదు కాబట్టి ఇది మరింత సమర్థవంతమైన నియామకాలకు వీలుకల్పిస్తుంది. అయితే ఇది సులభసాధ్యంకాదు. విద్యాసంస్థలు ప్రభుత్వ అజమాయిషీలో ఉండటంచేత, వీరు ఇతరవర్గాల ప్రయోజనాలు కాపాడేందుకు ప్రాధాన్యతనిస్తారు కాబట్టి మూల్యాంకనంలో తమస్వామ్యాన్ని వదలుకోలేరు. అయితే ప్రస్తుత విధానంలో ఏర్పడిన వైరుధ్యాలే మూల్యాంకనంలో మార్పులకవసరమైన చర్యలు చేపట్టేందుకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తాయి.

అయితే తెలుగుసాహిత్యంలో మూల్యాంకనావిధానాన్ని, పరీక్షావిగానాన్ని గర్హిస్తూ వచ్చిన రచనలనేకం కనిపిస్తాయి కాని ప్రత్యామ్నాయ మార్గాలను సూచించిన దాఖలాలు మాత్రం ఎక్కడా

కనిపించవు.

*"In the west, it is the institution rather than the teacher which is emphasised and it is the school or college which a student regards as his alma mater. In India it is the teacher rather than the institution that is prominent and the same affection and reverence which a western student has for his alma mater are in India bestowed with a life-long devotion to the teacher"*

*------ Rev. F.E.Keay*

========================

ఉపాధ్యాయులు: విభిన్న పార్శ్వాలు

మాళవికాగ్నిమిత్రంలో ఇద్దరు నాట్యాచార్యులమధ్య ఏర్పడిన వివాద సమయంలో 'ఉత్తమ గురువు'ను గురించి కాళిదాసు ఇలా పేర్కొంటారు.

శిష్టాక్రియా కస్యచిదాత్మ సంస్థా సంక్రాంతి రన్యస్య విశేషయుక్తా!

యస్యోభయం సాధు స శిక్షకాణాం ధురి ప్రతిష్ఠాపయితవ్య ఏవ॥

పాండిత్యం, బోధనా సామర్థ్యం రెండూ ఎవరిలో పుష్కలంగా ఎవరిలో ఉంటాయో వారినే ఉత్తమ గురువుగా పరిగణించాలన్నది కాళిదాసు అభిప్రాయం.

ఇటువంటి ఉత్తమ గురువులతో పాటుగా మరోవైపు గురువు ఎలా ఉండకూడదో సూచించేందుకు నమూనాగా కన్యాశుల్కంలో గిరీశంపాత్ర నిలుస్తుంది. అందులో

"ఎంపోయ్ మైడియర్ వెంకటేశం! నీ దగ్గర కాపర్సు వున్నవా! నా దగ్గర కరెన్సీనోట్లు ఉన్నవిగానీ మార్చలేదు. పదళాలుపెట్టి ఓ శేరు మిఠాయి పట్టుకురా...." అంటూ శిష్యుడి డబ్బులతో పబ్బం గడుపుకునే గిరీశం గురువులవారు కనిపిస్తారు. (గురజాడ. 1986:)

బహుశా అందుకేనేమో

"గురుదేవోబహావస్సంతి శిష్య విత్తాపహారిణః!

దుర్లభోయం గురుర్దేవి! శిష్య చిత్తాపహారకః!!

అంటూ శిష్యుని దబ్బునుకాకుండా మనసును దోచుకునేవారే నిజమైన గురువులుగా పేర్కొనటం కనిపిస్తుంది.

ఇలా విభిన్న వ్యక్తిత్వాలు కలిగిన ఉపాధ్యాయులు నేడు మనకు ప్రాథమిక స్థాయినుంచి విశ్వవిద్యాలయ స్థాయివరకు తారసపడతారు. వీరందరి వ్యక్తిత్వచిత్రణ తెలుగుసాహిత్యంలో బహుముఖీనంగా చోటుచేసుకొనటం మనం గమనించవచ్చు.

*ఉపాధ్యాయుల జీవితం -- వ్యక్తిత్వం*

*ఉపాధ్యాయులు -- సామాజిక అవహేళన*

*ఉపాధ్యాయులు -- అవినీతి -- అనైతికత*

*ఉపాధ్యాయుల -- ఆదర్శ వ్యక్తిత్వం*

*ఉపాధ్యాయులు -- సామాజిక వైరుధ్యాలు*

*ఉపాధ్యాయ విద్యార్థి సంబంధాలు*

*ఉపాధ్యాయులు -- సామాజిక స్పందన*

### *ఉపాధ్యాయుల జీవితం -- వ్యక్తిత్వం :*

ఉపాధ్యాయుని జీవితానికి వ్యక్తిత్వానికి మధ్య నిరంతరం ఘర్షణ చెలరేగుతూ ఉంటుంది. ఈ క్రమంలో కొన్ని సార్లు వ్యక్తిత్వాన్ని చంపుకొని పరిస్థితులతో రాజీ పడాల్సి వస్తుంది. మరి కొన్నిసార్లు వ్యక్తిత్వాన్ని చంపుకొనలేక జీవితాన్ని బలిచేసుకోవాల్సి వస్తుంది. నిరంతరం జరిగే ఈ సంఘర్షణల్ని చిత్రించిన రచనలు తెలుగు సాహిత్యంలో అనేకం కనిపిస్తాయి.

ఉపాధ్యాయుని వ్యక్తిగత జీవితానికి, వృత్తికి మధ్యలో ఏర్పడే సంఘర్షణను చిత్రించిన రచన 'నన్ను అర్థంచేసుకుంటావు కదూ!' సామాజిక గుర్తింపు కొరవడిన ఉపాధ్యాయుని మానసిక పరివేదనే ఇందులో ప్రధాన కథాంశం. ఎంతో పూజ్యభావంతో ఉపాధ్యాయవృత్తిని చేపట్టి, తనకు బ్రతుకుతెరువై, గౌరవాన్నందిస్తున్న వృత్తికి న్యాయంచేయాలని చిత్తశుద్ధితో పనిచేసే ఉపాధ్యాయుడు సామాజికగౌరవం కోసం పడే తపన ఈ రచనలో ప్రతిబింబిస్తుంది.

బడిపంతుళ్ళ జీతాల సంగతి నీకు తెలిసే వుంటుంది. భావిభారత పౌరులను తయారుచేసేది బడిపంతుళ్ళేనని కీర్తిస్తారు గాని ఆ పంతుళ్ళ బ్రతుకులు ఎలా సాగుతున్నాయో. చీకటి బ్రతుకులలో కొట్టుమిట్టాడే ఈ పంతుళ్ళు భావితరానికి ఎలా వెలుగులు అందించగలరో ఆలోచించగలిగిన వాళ్ళు ఎవరు? తన పిల్లల్ని తాను వెలుగులోకి తీసుకరాలేని అసమర్థతకు క్రుంగిపోయే ఏ బడిపంతులు మాత్రం ఎదుటిపిల్లల బాగోగులు ఎంతమాత్రం చూడగలుగుతాడు?

ఆ అడ్రస్.... నీవిచ్చిన నీతమ్ముడి చిరునామా..... చూసిన క్షణాన నా నవనాడులు కృంగిపోయాయి. నా ఒంట్లోని రక్తమంతా నీరయిపోయినట్లు అనిపించింది. అందమైన ప్రపంచంలోకి క్షణాలమీద ఎలా అడుగుపెట్టానో, అలాగే క్షణాలమీదే ఆ ప్రపంచంలోంచి శూన్యంలోకి వచ్చినట్లయింది. ఎందుకా అని ఆశ్చర్యపడిపోతున్నావుకదూ, నీతమ్ముడు...... నీతమ్ముడు..... ఒకప్పుడు నేను కోరి ఎన్నుకుని, అనుక్షణం గౌరవించి, పూజ్యభావంతో అడుగుపెట్టి..... యిప్పుడు.... యిన్నేళ్ళ తరువాత ప్రతిక్షణం దేన్నయితే అసహ్యించుకుంటున్నానో, దేన్నయితే కసితీరా నిందిస్తున్నానో, ఏదయితే నా దరిదాపులకు రాకూడదని కోరుకుంటున్నానో సరిగ్గా అలాంటి...... అలాంటి వృత్తిలో....... అంటే మామూలు బడిపంతులుగా వుండటమే...... అదే.....దానినే... నేను భరించలేకపోయాను. వ్యథాభరితమయిన నా హృదయం నిముషాలమీద నన్ను శక్తిహీనుణ్ణి చేసేసింది.నన్ను మన్నించు శేఖరం! తులసిని మీ తమ్ముడికి యివ్వలేను. (తెనాలి సుశీలాదేవి, నన్ను అర్థం చేసుకుంటావు కదూ!, యువ, మే '83, పే 107-125)

జీవన స్థితిగతులు ఉపాధ్యాయుని జీవనవిధానాన్ని ఎలా నియంత్రిస్తాయో చిత్రించిన

రచనలు 'శుభలేఖ', 'పతిదేవుళ్ళుఆడకూతుళ్ళు'. ఈ రెండు రచనల్లోకూడా ఇతివృత్తం, కథాకథనం ఒకేవిధంగా ఉండటం యాధృచ్ఛికం కావచ్చు. కానీ ఇందులో చూపించిన విధంగా ఉపాధ్యాయుని జీవితం ఉండటంమాత్రం యాధృచ్ఛికం కాదు. ఒక వాస్తవం. ఉపాధ్యాయుని జీవితంలో అప్పులు ఒక సాధారణాంశం. అందుకోసం పి.ఎఫ్ నాశ్రయించటంకూడా అంతే సహజం ఆక్రమంలో ఉపాధ్యాయుడెదుర్కొనే ఇబ్బందుల చిత్రణే ఈ రెండురచనలు.

సుమారు మూడువేలు తీర్చవలసిన పరిస్థితిలో పడ్డాను. ఎలాగ తీర్చడం? స్కూలు మేష్టారుకి వచ్చే జీతంలో సాధ్యమా? ఏం తోచలేదు.... చివరికొక ఉపాయం తోచింది. ఇల్లు కట్టుకుందుకుగాని, వివాహానికిగాని అయితే ప్రావిడెంట్ ఫండ్ లోంచి పెద్దమొత్తంలోనే ఇస్తారు. అమ్మాయి పెళ్ళివంకను అప్పుతీసుకుంటే బాకీలన్నీ తీర్చేయవచ్చు. నెలనెలా జీతంలో వాళ్ళే బాకీ రాబట్టుకుంటారు. ఇందుకు నేనేమీ ప్రయత్నం చెయ్యక్కర్లేదుకదా అనుకున్నాను. పెళ్ళివంక అబద్ధం కదా అని నా మనస్సులో కించగా ఉన్నా పోతన్నగారు చెప్పిన "వారిజాక్షులందు, వైవాహికములందు ప్రాణ, విత్త, మాన భంగమందు..... బొంకవచ్చు నఘము బొందదధిప" అన్న మాటలు నాకు ఎంతో ధైర్యాన్నిచ్చాయి. ఒక్క శుభలేఖ అచ్చువేయించి ఆఫీసులో ఇచ్చి..... అమ్మాయి పెళ్ళి అని లోన్ తీసుకున్నాను..... ఇదీ జరిగిన విషయం బావగారూ. దైవసాక్షిగా చెబుతున్నాను. అబద్ధంకాదు" అన్నాడు విశ్వనాథం. (వేదుల మీనాక్షీదేవి, శుభలేఖ, మహిళ, సెప్టెంబరు'77, పే 24-26)

"నిజమేనండీ! ఇది పెళ్ళిపత్రికే! ఇందులో నా పేరున్నమాట గూడా నిజమే! కానీ ఇదిలా తయారుకావడానికి వెనుక మీరు నమ్మగలిగితే ఓ కారణం వుంది. సాధారణంగా బడిపంతుళ్ళకు అప్పులుపుట్టే అవకాశాలు అరుదు. వాళ్ళకు ప్రావిడెంటు ఫండని ఒకటి ఉంటుంది. సజావైన కారణం చూపిస్తే అందులోనుంచి కొంత అప్పు లభిస్తుంది. మా నాన్నగారికి డబ్బు అవసరంలేనిదెప్పుడు? అనారోగ్యంగా వున్న భార్యకు చికిత్సకోసం అంటూ ఆయన ఒక అమోఘమైన కారణాన్ని కనిపెట్టి అవసరమైనప్పుడల్లా ఆ సాకుతో అప్పు పుట్టించుకుంటూ వచ్చారు. ఇలా జర్గా జర్గా ఒకసారి మా అమ్మకు నిజంగానే జబ్బుచేసింది. ఇక బ్రతకదేమోననుకున్నాం. ఎలాగో ఆ గండం గడిచింది. అప్పటినుంచీ ప్రావిడెంటుఫండు అప్పుకోసమని తమ మామూలు పాత కారణాన్ని వాడుకునే నిబ్బరం నాన్నగారికి లేకపోయింది. మా చిన్నన్నయ్య ఉద్యోగ నిమిత్తం ఇంటర్వ్యూ కోసం ఢిల్లీ వెళ్ళవలసి వస్తే, అందుకని డబ్బు కావలసివచ్చి 'కూతురిపెళ్ళికోస'మంటూ అప్లికేషను పెట్టుకున్నారు. అనారోగ్యమంటే డాక్టరు సర్టిఫికెట్టు జతపరచాలి గదా! అలాగే కుమార్తె వివాహమంటే పెళ్ళి పత్రిక జతపరచాలి. నాన్నగారు ప్రెస్సుకువెళ్ళి ఒక్కటంటే ఒకటి మాత్రం అచ్చువేసి యివ్వమన్నారు! వాళ్ళు పనిలో పనిగా పదిహేన్నిందు పత్రికలు అచ్చువేసి యిచ్చారు. వాటిల్లో ఒకటి మీ చేతికి దొరికింది...." (మధురాంతకం రాజారాం, పతిదేవుళ్ళు ఆడకూతుళ్ళు, పాంథశాల, పే 183-192)

ఉపాధ్యాయుని జీవితానికి తులసి మొక్కని ప్రతీకగా తీసుకుని చేసిన రచన 'సెప్టెంబర్ 5'. ఎదగకుండా, ఎండకుండా నియంత్రిస్తూ తులసిని పూజించినట్లుగానే సమాజంలో ఉపాధ్యాయుని జీవితాన్నికూడా నియంత్రించటాన్ని ప్రతీకాత్మకంగా ఇందులో చిత్రించటం చూస్తాం.

తనకూ, తులసిమొక్కకూ ఎంతపోలిక! తను ఎదగాకూడదు, ఎండాకూడదు! తనేం పెద్ద ఆఫీసరా, మంత్రా బోలెడు డబ్బిచ్చి కూర్చోపెట్టడానికి? ఆరునెలలకు ఒకసారి జీతమిచ్చి ఇరుకు ఇంట్లో ఉండనిస్తున్నారు. రోజూ తులసిమొక్కలానే నమస్కారాలందుకోవాలి! ఏటా తులసిపండుగ చేసి, పూజలుచేసి మొక్కులు తీర్చమని వేడుకుంటారు. ఏటా గురుపూజోత్సవం చేసి తనను సత్కరించాలని సూచించారు మంత్రిగారు. రోజుకో గ్లాసుడు నీళ్ళుపోసి తులసిని బ్రతికిస్తుంది హైమ. తోచినప్పుడు నాలుగు జీతంరాళ్ళు పడేసి బతికిస్తున్నారు ప్రభుత్వంవాళ్ళు. నేనందరికీ పాఠాలు బాగా చెప్పాలి. భావి భారతపౌరులను తీర్చిదిద్దాలి. అందరి ఇంటా దీపాలు వెలిగించాలి. సమాజాన్ని దేశాన్ని ముందుకు నడిపించే యువకులను తయారుచెయ్యాలి. కాని, నాకు కూడు, గూడు ఏవి? తులశమ్మకు నోరు లేకపోతే నాకూ నోరులేదు. తులశమ్మ వడలిపోయి తన బాధను వ్యక్తం చేస్తుంది. తను వడలిపోయిన ముఖంతోను, మాసికలేసిన బట్టలతోను తన పరిస్థితిని వ్యక్తం చేసుకుంటాడు. తులసి పరిస్థితి తెలుసుకోవటానికి హైమకు ఇంగితంలేదు. తన పరిస్థితి తెలుసుకోవటానికి ప్రభుతకు ఇంగితంలేదు. హైమ చేసే పూజలకు, పెట్టే దండాలకు, చేసే ప్రదక్షిణాలకు కొదవలేదు. ప్రభుత చేయించే సన్మానాలకు, కాళ్ళకు పెట్టే దండాలకు, వేసేదండలకు కొదవలేదు!" (కుసుమ కె.మూర్తి, సెప్టెంబరు5, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 13-5-'81, పే 33-39)

ప్రభుత్వ అస్తవ్యస్త విధానాల కారణంగా ఉపాధ్యాయలోకం పడే ఇబ్బందులను చర్చించిన రచన 'తరం అంతరం.'

"నిజమే రాంజీ! ఈ ప్రభుత్వానికి అస్సలుబుద్ధిలేదు. అందరూ మాష్టార్లే అయినప్పుడు, ఒకే కాలంలో అయిదారేళ్ళటూ ఇటూగా రిటైరయే వాళ్ళ జీతాల్లో వ్యత్యాసం, పింఛన్లో వ్యత్యాసం. ఒకరు బ్రతగ్గలిగే ఏర్పాటు! ఒకరుచచ్చే ఏర్పాటు! ఏం జీవోలో ఏమో! పాపం! ఎందరు గుండెలాగి చచ్చారో? చావలేక బ్రతుకుతున్నారో?" అన్నాడు జాలిగా.

"కళ్ళు రెండూ లేని కబోదులం తల్లీ! ఇంత అన్నమున్నా, సాదకమున్నా దానం ధర్మం చేయండి తల్లులారా!

దిక్కూ మొక్కూ లేని అనాథలం. ఇంత అన్నం దానం చేసి పుణ్యం కట్టుకోండి తల్లులారా!"

అంటూన్న ఆ గొంతుల్లో ఒకటి మగగొంతుక. నాకు చిరపరిచితమైనదిగా ఉంది. ఉరుకున మిద్దె చివరికంటావెళ్ళి వీధిలోకి తొంగి చూచాను. యాచిస్తూ తచ్చాడుతూ వెళుతూన్న దంపతులు.... బాలాజీ మాష్టారు దంపతులు! (దినకర్, తరం అంతరం, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 17-12-'86, పే 48-51)

విలువలకోసం జీవించిన వ్యక్తి జీవితంలో ఏం పోగొట్టుకోవాల్సి వస్తుందో చిత్రించిన రచన 'వాహకులు కావాలి'

అరవై ఏళ్ళు నిండిన మాష్టారు, అందరూ ఉండీ, చివరకు ఎవరూ లేని మాష్టారు, మాబ్రతుకులకు ఒక అర్థం కల్పించి, తన బ్రతుక్కే ఏ అర్థమూ లేదని, చివరికి--ఇలా, చిరునవ్వూ చేయూతా లేక, ఒక మంచిమాటా -- ఒక సానుభూతీ లేక..... ఒంటరిగా, మనుషులకోసం -- వారి మమతలకోసం, ఎదురుచూసి ఎదురుచూసి, చివరికి ఆశవ్యర్థంకాగా, నిస్తేజమైన కళ్ళతో, నిరాశానిస్పృహలతో, ఆ కుక్కిమంచంలో, అలా కళ్ళు మూసారు మాష్టారు.

'అయ్యో - మాష్టారూ! అజ్ఞానమనే చీకటిని తొలగించి, అనేక వందల ఇళ్ళల్లో విజ్ఞాన జ్యోతులు వెలిగించిన మీకా-- చివరికి ఇలాంటి దుస్థితి పట్టింది! అయితేనేం మాష్టారూ! మీరు ఎవర్ని ఎక్కువగా ప్రేమించేవారో -- వారే మీ చివరి మజిలీకి కూడా వాహకులుగా తోడుగా వస్తున్నారు......' అనుకున్నాను. (దేవరాజు రవి, వాహకులు కావాలి, దేవరాజు రవి కథలు, పే 117-123)

విలువలకోసం జీవితాన్ని త్యాగంచేసే ఉపాధ్యాయుడు తమ కుటుంబంకోసం ఏమీ చేయలేకపోవటం, ఫలితంగా ఆ కుటుంబంలో తరువాతి తరాలుకూడా తిరిగి అదే స్థానాన్ని భర్తీచేయాల్సిరావటం వంటి అంశాలను చిత్రించిన రచనలు 'చంద్రహారం', 'తృణజ్యోతి'

బెత్తం చేత్తో పట్టుకొని దాకోపీసు అంటిన చేతిని తుడుచుకుంటూ చందూ తండ్రిగారి సింహాసనం వైపుకు నడిచాడు--

బెత్తాన్ని బెల్టు మొదటికి ఆనించి రాతిని చేత్తో తుడిచాడు. చేతి దాకోపీసు దాని కంటుకున్నది --

కొలిమి తిత్తుల్లా పగలంతా పనిచేసిన ఊపిరితిత్తులనిండా తమలపాకు తోటలనుండీ వచ్చే గాలిని నింపుకుంటూ తల పైకెత్తి దిగంతాలలోకి చూచాడు---

దూరంగా, ఎత్తుగా, శిథిలమైన లైటుహౌస్ ---

'పంతులూ ఇయిగో నీళ్ళు' శేషు చందూకు కొబ్బరినీళ్ళు అందించాడు--

'శేషూ ఓ అదా ముద్దపులిబొంగరాలు కూడా పట్రా' ---- (మునిగొండ శివప్రసాద్, చంద్రహారం, భారతి, జనవరి'73, పే 47-56)

బతకలేని బడిపంతులుద్యోగంలో బతుకీడ్చుకొచ్చి రిటైరైన నాన్నకు, పెళ్ళికి సిద్ధమై కూర్చొన్న రెండోకూతురు పెద్ద సమస్యగా ఎదురైంది. గతం తలచుకొని కళ్ళనీళ్ళు చేసుకొనేవాడు. ఆదేసమయంలో వారసత్వంలా, బడిపంతులై దిగబడ్డాడు తను. కొండంత ఆశ మళ్ళీ చిగురించింది. కానీ గొర్రెతోక జీవితంలో ఏంచేయగలిగాడు. నాన్న బ్రతికుండగా చెల్లెలు పెళ్ళి చేయలేకపోయాడు తను. (అబ్బరాజు శ్రీనివాసమూర్తి, తృణజ్యోతి, భారతి, మార్చి'72, పే 42-51)

ఉపాధ్యాయుడు తన కుమార్తె అభిరుచులు, అభిప్రాయాలకు గుర్తింపునివ్వకుండా, తన అభిరుచులకు అనుగుణంగా తీర్చిదిద్దాలనుకొని అందుకనుగుణంగా పెంచేందుకు ప్రయత్నించటం, తద్వారా ఏర్పడే ఫలితాలను చిత్రించిన రచనే 'శిల్పం'. పిల్లలపట్ల శృతిమించిన ఆత్మవిశ్వాసంతో ఉపాధ్యాయుడైన ఒక తండ్రి తీసుకున్న నిర్ణయాల ఫలితం పిల్లలపై ఎంత దారుణంగా ఉంటుందో ఈ రచనలో మనకు కళ్ళకు కట్టినట్టుగా కనిపిస్తుంది.

తను ఓడిపోయాడు. కాని ఎందుకు? కారణం ఏమిటి? లోపం తనదా? హేమసుందరిదా? బుర్రబద్దలు చేసుకొని ఆలోచించాడు. ఆఖరికి ఆత్మజ్ఞానమయింది! హేమసుందరిని తను పాలరాయిగా శిలగా, బంగారపు ముద్దగా భావించాడు. దాన్ని తన అభిరుచులకు అనుగుణంగా మర్చాలనుకున్నాడు. కాని ఆమె ప్రాణం ఉన్న మనిషి. కోరికలు, ఆలోచనలు, అభిరుచులువున్న మనిషి. వాటిని బంధిస్తే, శిల్పం చిట్లింది. జీవకళను కోల్పోయింది. ధ్యేయం మంచిదే. కాని దారిలో అన్నీ ఎగుడుదిగుడులే! (కప్పగంతుల మల్లికార్జునరావు, శిల్పం, యువ, ఆగస్టు '76, పే 100-108)

**ఉపాధ్యాయుడు -- సామాజిక అవహేళన :**

సమాజంలో ఉపాధ్యాయుడు పొందుతున్న అవమానాలకు కారణాలనేకం. ఇందుకు కేవలం ఏ ఒక్క ప్రత్యేకవర్గాన్నీ తప్పుపట్టలేం. అయితే ఉపాధ్యాయుల ప్రవర్తనకూడా ఇందుకు కారణమై

ఉంటుంది. అలాంటి పరిస్థితిల్లోకూడా గ్రామ ప్రజలనుంచి ఏమీ ఆశించకుండా పాఠశాల ఉద్ధరణకు తనకై తాను కంకణం కట్టుకున్న ఉపాధ్యాయుని చిత్రణే 'ఊబి'. ఇందులో విద్యార్థులే తన శక్తిగా ఉపాధ్యాయుడు తన కార్యాచరణ ప్రారంభించటం విశేషం.

"బడంతే బడే! ఏంబడి? ఆ ఎమ్మెల్యే ఉన్నాడంటే ఎమ్మెల్యే కేంటేటు! ఆ రాజు మేష్టు ఉన్నాడంటే మండల పెసిడెంటు సుట్టము. ఇదిగో ఉల్లోను మేష్టు ఉన్నాడంటే కొత్త పెసిడెంటు పిలకట్టు కొంగొట్టుకొని పికాల్లు కొడతాడు! అంటున్నారొకరు.

మాష్టారికిదంతా ఏదోలా ఉంది. ప్రభుత్వాలు మారుతున్నాయి. కొత్తపథకాలు వస్తూనే ఉన్నాయి. అయినా గ్రామాలు గోతుల్లోనే మూలుగుతున్నాయి. ఒక పిల్లాడు ఊబిలో పడితే ఊరందరూ వచ్చి బయటికి తీసారు. మరి గ్రామ రాజకీయాల ఊబిలో కూరుకుపోతున్న బడిని బయటికి లాగేదెవరు? బడినీ, బడిదొవనీ, పరిసరాల్నీ మార్చేదెవరు?

ఆలోచిస్తూ, అక్కడే నిలబడిపోయారు. బడివైపు చూశారు. ఊరువేపూ చూశారు. బడికీ ఊరికీ మధ్య కేంద్రబిందువులా తను! పిల్లలు తరగతి గదుల్లో సర్దుకుంటున్నారు. గోలగోలగా! యుద్ధభూమిలో నాయకత్వంలేని సైనికుల్లా కనిపించారు పిల్లలు. ఆలోచించీ.... ఆలోచించీ ఒక నిర్ణయానికి వచ్చినట్టు బడివేపు అడుగులేశారు మాష్టారు. ఊరుజనం..... తన చేతుల్లో లేకపోయినా -- బడిపిల్లలున్నారుగదా...... తనకు! (చింతా అప్పలనాయుడు, ఊబి, నాగావళి కథలు, పే 97-101)

ఆదాయాన్నిబట్టి, వ్యక్తి స్థాయిని అంచనావేసే సమాజంలో ఉపాధ్యాయులకు సైతం అంతకుమించిన గుర్తింపు లభిస్తుందనుకోలేం. అందుచేతనే ఉపాధ్యాయుని జీవనస్థితిపట్ల అవహేళనలు తరచూ చోటుచేసుకోవటం కనిపిస్తుంది. అలాంటి రచనే 'బేబీ'

ఎలిమెంటరీ స్కూలు మేష్టార్ని పెళ్ళిచేసుకుని సమాజంలో ఏ గుర్తింపూలేని బురద బ్రతుకు బ్రతకడం నాకిష్టంలేదు. అందుకే.....ఉత్తి మేష్టార్ని పెళ్ళిచేసుకుని నేనెలా సుఖపడగలను చెప్పు......" చులకనగా చూపుల్ని తుప్పలవేపు తిప్పుతూ అంది వర్ధని.

"ఏం మీనాన్న మాష్టారుకాదా... మిస్టర్....." ఎత్తిపొడుపుగా అడిగేను.

"అవును మా నాన్న మాష్టారే... అందుకే మాష్టర్లంటే నాకు అసహ్యం... వాళ్ళ బ్రతుకంటే మరీ అసహ్యం.... అందుకే ఆ ఊబిలోంచి నేనైనా బయటపడాలని కోరుకుంటున్నాను...." (దాట్ల నారాయణమూర్తిరాజు, బేబీ, యువ, మార్చి '78-, పే 142-147)

ఉపాధ్యాయుని చర్యలపట్ల సమాజంలో స్పందనలు అవహేళనా పూర్వకమైనవిగా ఉండటానికి కారణం, అతని చర్యలలోని నైతికత కాకపోగా, అతని సామాజికస్థాయిని ఇందుకు ప్రధాన కారణంగా భావించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంతో వచ్చిన రచనే 'ఆచార్యదేవోభవ'

ఇంట్లో తల్లిదండ్రులూ -- స్కూల్లో ఉపాధ్యాయుడు... పిల్లల్ని సరైన దారిలో పెట్టాల్సిన ఉపాధ్యాయుడిగా తనకున్న బాధ్యతనిబట్టే వాడిని మంచిమార్గంలోకి మళ్ళించాలని ఆ శిక్షవేశారు. అది తప్పా? తనుచేసిన పనికి రంగమ్మ సంతోషిస్తుందనుకున్నాడు గానీ... ఇలా వాడిముందే తనని అన్ని మాటలంటుందని ఎన్నడూ అనుకోలేదు.

ఎందుకిలా జరుగుతోంది? కాలంలో మార్పు వచ్చిందా? లేక మనుషుల్లో వచ్చిన మార్పా? ఏదయినా ఈ మార్పు తనలాటి ఉపాధ్యాయులు హర్షించరు. ఇటువంటి వాతావరణంలో తనలాటి వాళ్ళు బతకలేరు కూడా. ఏంచేయాలి?

ఆలోచనలతో తల దిమ్మెక్కిపోయిందాయనకు. ఖాళీ గిన్నెతో తిరిగి ఇంటివేపు నడకసాగించారు.

"ఏం మాష్టారూ. రెండో బెల్లుకూడా అయిపోయింది. ఇవ్వాళ బడికి పోలేదే? ఎవరో పలకరించారు.

"ఆ.... ఆ... వెడుతున్నా" అంటూ కిష్టయ్యపంతులు తడబడుతూ ముందుకు అడుగులు వేశారు.

"ఏం మేష్టర్లో.... ఏం చదువులో. పంతుళ్ళే ఇలా ఉంటే.... ఇక పిల్లలకి చదువేం వొస్తాది?"

ఆ మాటలు వినగానే కిష్టయ్యపంతులు మనస్సు మరింత బాధపడింది. అందరూ మాష్టర్లని నిందించే వాళ్ళే. ప్రతివాడికీ లోకువ ఉపాధ్యాయుడే. చదువు చెప్పినా తప్పే, చెప్పకపోయినా తప్పే. అందరూ చేసే అన్ని తప్పులకూ శిక్ష అనుభవించేవాళ్ళు తనలాటి పంతుళ్ళే -- అనుకుంటూ భారంగా ముందుకు నడిచారు కిష్టయ్యపంతులు. (చిన్నకోట సుశీలాదేవి, ఆచార్యదేవోభవ, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 12-8-'87, పే 60-62)

ఉపాధ్యాయునిపట్ల గ్రామసీమల్లో ఉండే చులకనభావాన్ని ప్రతిబింబిస్తూ వచ్చిన రచన 'గోదారి'. జీవితకాలం గ్రామాన్ని నమ్ముకుని బ్రతికిన మణవాళయ్యకు చివరగా గ్రామపెద్దలనుంచి లభించిన హేళనాపూరితమైన సమాధానం ఉపాధ్యాయునికి సమాజమిచ్చే గౌరవంలోని ఒక కోణాన్ని మనముందుంచుతుంది.

"ఒరేయ్ మణవాళయ్యా! ఎట్టి పరిస్థితిలోనూ మళ్లెలమడుగు విడిచిపెట్టొద్దు. ముప్పై అయిదేళ్ళుగా అక్కడే వున్నావు. నీ జీవశక్తినంతా ఆ వూరికే ధారపోశావు. కరణాన్నీ, మునసబునీ మంచిచేసుకుని ఎక్కడైనా నాలుగెకరాల నేల పట్టా

చేయించుకో! అదేమీ కుదరకపోతే మరేదైనా దారి చూపించమని ఊరి పెద్దలనే అడుగు. ఇంతకాలం ఊరిని నమ్ముకుని బ్రతికావుగదా, నీకు వాళ్ళేదైనా మార్గం చూపించకపోరు......" అన్నాడు చిన్నన్నయ్య.

"చెబితే నువ్వు జడుసుకుంటావేమో! అయినా చెప్పేస్తున్నాను. నువ్వీ ఊరికెంత బాకీపడి ఉన్నావో తెలుసా?"

ఒక లక్షా యిరవైవేలు!......"

"ఇక్కడ మల్లెలమడుగుంటూ ఒక ఊరే లేదనుకో. ఆ పైన ఒక బడికి సరిపడేటంతమంది పిల్లలు లేరనుకో --- ఇంత డబ్బు కళ్ళజూసి వుండడం నీతరంగాదు. ఏమంటావు?"

మణవాళయ్య సజీవ మానవమూర్తిగాదు -- వట్టి స్తంభీభూత శిలావిగ్రహం. రెండైన మరునాటి ఉదయం మణవాళయ్య కాపురముండిన యింట్లో జనసంచారం లేదు. అయితే అతడెందుకలా వెళ్ళిపోయాడో, ఎక్కడికి వెళ్ళాడో, మిగిలివున్న జీవితకాలం ఎలా వెళ్ళదీస్తాడో ఆలోచించినవాళ్ళు లేరు. (మధురాంతకం రాజారాం, గోదారి, మధురాంతకం రాజారాం కథలు, పే 117-124)

ఉపాధ్యాయుడు -- అవినీతి -- అనైతికత :

ఉపాధ్యాయులపట్ల సమాజంలో వ్యక్తమయ్యే వ్యతిరేకధోరణికి ప్రధానంగా బాధ్యులను చేయాల్సింది ఉపాధ్యాయులనే. కొందరు ఉపాధ్యాయుల అనైతిక ప్రవర్తన కారణంగా దాని ప్రభావం మిగిలిన సమాజం అంతటిపైన పడి, ఫలితంగా ఉపాధ్యాయులంతా అవహేళనకు గురికావటం జరుగుతున్నది. ఈ అనైతిక ప్రవర్తనను వివిధ స్థాయిలలో సాహిత్యం ప్రతిఫలించింది. ఈ క్రమంలోనే ఉపాధ్యాయుని అంతరంగాన్నికూడా ఆవిష్కరించే ప్రయత్నం చేసిన రచన 'అమ్మా!అమ్మా!'

"అసలు ఇదంతా ఈ శర్మగారితోనే వస్తుంది. రెండు మూడు నెల్లకైనా మందుపోర్టీ ఆరేజు వేయకపోతే బడికి రోజూ అటెండెన్సు వేయనంటాడు. స్కూలుకు సరిగా రావనీ, పిల్లలకు చదువు సరిగ్గా చెప్పటంలేదనీ ఇప్పటికే అందరూ అంటున్నారు. సెలవుల తర్వాతైనా వాలంటరీ రిటైర్మెంటుకు ఆలోచించాలి" రావ్ మనసులోనే తిట్టుకున్నాడు.

తను ఇన్నాళ్ళూ డబ్బొక్కటే ముఖ్యం అనుకున్నాడు. గౌరవం, మనిషికి విలువ అనేది ఇక్కడ పుట్టుపూర్వోత్తరాల్ని బట్టి కూడా నిర్ణయమవుతుంది కాబోలు" మనసులోనే మధించుకుంటూ లోపలికొచ్చి పడక్కుర్చీ వాల్చుకొని మత్తుగా మెత్తగా దానిలోకి ఒరిగేడు రావ్. (కాట్రగడ్డ దయానంద్, అమ్మా! అమ్మా!!, పండుటాకు, పే 46-52)

ఉపాధ్యాయుని అనైతిక ప్రవర్తన విద్యార్థుల భవిష్యత్తుపై ఎలాంటి ప్రభావం చూపుతుందో చిత్రించిన రచన 'రాలిన మొగ్గ'.

'నేనింక బడికి పోను'అన్నాడు పట్టుదలగా తల్లితో.

'ఎందుకని?'కోపంగా అరిచిందామె.

'నాకు ఏమీ అర్థంకావటం లేదు. మాష్టరు క్లాసులో ఏమీ చెప్పకుండా చాలామందిని ఇంటిదగ్గర నేర్చుకొని రమ్మంటున్నాడు. నాకు ఇంటిదగ్గర ఎవరుచెపుతారు?' ఎదురుప్రశ్న వేశాడు వాడు.

ఆరోజు సాయంత్రమే పుస్తకాలన్నీ పాతపుస్తకాలు కొనే షాపులో అమ్మేసి బ్రష్ లు, పాలిష్ డబ్బా తెచ్చాడువాడు.

'నేను పాలిష్ చేసి సంపాదిస్తాను.'

'ఓ...... రామూ! నువ్వా.'

'అవును సార్!' మాష్టారు తనను గుర్తుపట్టి పలకరించినందుకు సంతోషంలో ఉప్పొంగిపోయిందా పసిహృదయం.

'ఈ పని ఎప్పుడు మొదలుపెట్టావు?'

'రెండు నెలల్నుంచండి' వినయంగా జవాబిచ్చాడు.

'ఆ......మంచిది. నీకు తగిన పనే ఇది.' ఆయన నిరసనగా అంటూ పుస్తకంలో తలదూర్చాడు మళ్ళీ.

ఆ మాటలు వింటూనే శరీరంలో వందల సూదులు గుచ్చుకున్నట్లనిపించింది. ఏమీ మాట్లాడలేకపోయాడు వాడు.

తను చదువుకోడానికి సహకరించక, పైగా తాను శ్రమించి బ్రతుకుతుంటే అపహాస్యం చేసి తన లేత మనస్సును గాయం చేసిన ఈ సమాజంలోని విషపురుగులకు మొహం చూపటం కూడా ఇష్టంలేనట్టుగా రాముా మొహంమీద తమ్మిడి బొక్కా పరుచుకుంది. (చిల్లర భవానీదేవి, రాలినమొగ్గ, యువ, మే '81, పే 107-111)

పాఠశాలలో చోటుచేసుకునే దండనలుకూడా ఉపాధ్యాయుని అనైతిక వర్తనకిందకే వస్తాయి. తనబోధనద్వారా విద్యార్థులను ఆకట్టుకునే సమర్థతలోపించినప్పుడు, ఉపాధ్యాయుడు అవలంభించే అనైతిక వర్తనగానే దండనను పరిగణించాల్సి ఉంటుంది. ఇటువంటి ప్రవర్తన ఫలితాలు ఒక్కోసారి ఎంత దారుణంగ ఉంటాయో చిత్రించిన రచనే 'ట్రీట్మెంట్'

రుక్మాంగద్‌కి విపరీతమైన కోపం. కోపం వచ్చిందీ అంటే ఎదురుగున్న కుర్రవాడు దావు దెబ్బలు తినవలసిందే. కొట్టందే పిల్లలకు చదువు ఏమాత్రం రాదనే విషయం అతనిలో పూర్తిగా జీర్ణించుకుపోయింది. అందుకే అతనిచేత తన్నులు తినని కుర్రవాడు లేడు ఆ స్కూల్లో..... ప్రతి విద్యార్థికీ రుక్మాంగద్ ఓ రాక్షసుడిలా కనిపిస్తాడు.

"పిల్లల్ని కొట్టకుండా వారికి బుజ్జగించి మంచిమార్గాన చదువు చెప్పవచ్చు. తప్పకుండా వింటారు" అంటూ ఏ మాష్టారైనా చెప్పబోతే -- నిర్లక్ష్యంగా కొట్టేస్తూ -- అందుకే మీరంటే పిల్లలు అసలు భయపడరు." అనేవాడు.

పిల్లల్ని శిక్షించడానికి ఎండలో నిలబెట్టడం, రూలర్‌తో మణికట్టుమీద కొట్టడం, తొడపాశం పెట్టడం వగైరా పాత పద్ధతులకు స్వస్తిచెప్పి ఎప్పటికప్పుడు లేటెస్టు టెక్నిక్స్ కనిపెడుతూ ఉంటాడు. గాలిలో కుర్చీ వేయించడం, వేళ్ళమధ్య పెన్సిల్ ఉంచి నొక్కడం, ఇద్దరు ముగ్గుర్ని కలిపి పరస్పరం చెవులు పట్టుకుని ఒకరి కాలుమీద మరొకరు కాలు ఉంచి - గుంజీలు తీయమనేవాడు. అవతలివాడి కాలుమీదున్న తమకాలు ఏమాత్రం కదలకుండా గుంజీలు తీయడం చాలాకష్టం.

పిల్లల్ని కొట్టడం మంచి పద్ధతికాదనీ... వీలైనంత వరకు వారిని కొట్టకుండా చదువు చెప్పాలని హెడ్మాష్టరు ఎంతగా చెప్పినప్పటికీ రుక్మాంగద్ చెవికెక్కలేదు. అతని పాలిట పడకూడదని కొంతమంది విద్యార్థులు జాగ్రత్తపడితే - మరికొంతమంది అతని దెబ్బలకు రాటుదేలిపోయి - శరీరాన్ని అప్పగించేవారు.

కేశవ్ చలిజ్వరం వచ్చినవాడిలా వణికిపోతూ అడుగులోఅడుగు వేసుకుంటూ వచ్చాడు. వాడు దగ్గరికిరాగానే బలంగా దాచి లెంపకాయ కొట్టాడు. రోజూ క్రమం తప్పకుండా హోంవర్క్‌లు చేసుకొస్తూ శ్రద్ధగా చదువుకునే కేశవ్‌ను అంతకుమించి ఎక్కువ గా శిక్షించదలుచుకోలేదతను. కానీ ఆ దెబ్బకే కేశవ్‌వెళ్ళి గోడకు దగ్గరగా పడ్డాడు. పడ్డవాడు మరి లేవలేదు. (దాసరి వెంకటరమణ, ట్రీట్‌మెంట్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 21-6-'89, పే 38-39)

అధ్యాపకవృత్తిని వ్యాపారంగా మార్చి, పేదవిద్యార్థులకు అన్యాయంచేసే ఉపాధ్యాయులపైన ఒక సెటైర్‌లాంటి రచన 'చంద్రునికో నూలుపోగు' ఇందులో పేదవిద్యార్థులు ఉపాధ్యాయుని బాధ్యతారాహిత్యాన్ని ఒక సన్మానపత్రంద్వారా తెలియచేయటం విశేషం.

"పరాత్పరరావు అధ్యాపకవృత్తిలో కాకలు తీరినయోధులు. చదువు'కొనే'వారికి కల్పతరువు. ఖరీదుగా విద్యాదానం చేయడంలో అందెవేసినచేయి.

ఆయన కనిపించనికాలం: అధ్యాపకుల సమ్మె ప్రారంభమైన రోజున అదృశ్యమై తిరిగి విరమించిన రోజువరకు.....

కనిపించకపోవడానికి కారణం: రోజుకు పద్దెనిమిది గంటలపాటు ఖరీదైన విద్యాదానం చెయ్యడానికి.... చదువు 'కొనుక్కునే'వారికి సంపూర్ణంగా న్యాయం చెయ్యడానికి.....

అత్యంత ప్రియమైనవి: "టైమ్ ఈజ్ మనీ, ఆలస్యం అమృతం విషం, దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకో, ధనమూల మిదం జగత్" అన్న లోకోక్తులు.

ఆచరించేవి: 'కాసులేనికి కోసెడు దూరంలో వుండు. దుడ్డులేని వాడిని దివరకు కూడా పడవ ఎక్కనివ్వవద్దు... దయకన్నా ధనమేమిన్న' అనీ వారు నిత్యం స్మరించే మూడు మహామంత్రాలు.

కార్యదీక్షా పరత్వం: సమ్మెకు సార్థకత చేకూర్చే సదుద్దేశంతో చదువు గురించిగానీ, సిలబస్ గురించిగానీ కాలేజీ విద్యార్థులు ఎవరడిగినా సమాధానం చెప్పని, నూటికి నూరుపాళ్ళు ఆచరించిన అకుంఠిత కార్యదీక్ష.

పేద విద్యార్థులకు ఇచ్చే ప్రోత్సాహం: కష్టపడి చదువుకుని పాసవుదామనుకున్న ఓ పేదవిద్యార్థి పరాత్పరరావుగారి కరుణా కటాక్షాలకు నోచుకోక వారివద్దకు ట్యూషన్‌కు వెళ్ళే డబ్బులేక, సమ్మెఫలితంగా తప్పడంతో, ఓ విద్యాసంవత్సరాన్ని కోల్పోయాడు. సంవత్సరంవరకు రావలసిన ఉపకారవేతనం ఆగిపోయి కడుపునింపుకోవడానికి అతను వ్యవసాయకూలీగా అవతారం దాల్చడానికి వారు అపూర్వ అవకాశం ఇచ్చారు.

ప్రస్తుతం: అడంబరాలకు, అధికారవ్యామోహాలకు, అందలాలుమోసే మనస్తత్వాలకు ఘనసన్మానం జరుగుతున్న యీ సమయంలో మా పేద విద్యార్థుల తరపున చంద్రునికో నూలుపోగు! అదిత్యునివంటి ఆచార్యునికి ఓ చిరుదీపం! కుబేరునికి యీ కుచేలుడు సమర్పించుకునే చిరుకానుక!!! (సూర్యప్రసాదరావు, చంద్రునికో నూలుపోగు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 27-4-98, పే 22-25)

వ్యాపారవేత్తగామారిన ఒక అధ్యాపకుని ఆలోచనాధోరణి ఎంతటి హేయమైన రూపాన్ని పొందుతుందో, సంభాషణా రూపంలో ఎరిగింఛిన రచన 'చీలిక'. అధ్యాపకవర్గాల్లో వేళ్ళూనుకొని పోయిన వ్యాపారతత్వాన్ని ముందుంచిన రచన ఇది. ఇందులో ఉపాధ్యాయుని స్థానంలో ఒక ప్రముఖ వ్యాపారవేత్త కనిపిస్తాడు. అధ్యాపకులు వ్యాపారవేత్తలుగా మారి తమ వృత్తికి ద్రోహం చేస్తూ, వృత్తిని వ్యాపారంగా మార్చి పేద విద్యార్థులను ఈ వ్యాపారంలో సమిధలుగా మార్చటాన్ని ఇందులో స్పష్టంగా చిత్రించారు.

'ఆ(--మరి..... నిజంగా భాస్కరం! ఆ పదేళ్ళూ..... రోజుకు ఆరుగంటలు..... ఉదయం మూడు బేచ్‌లూ..... సాయంత్రం

మూడు పేగ్‌లూ.... చెప్పిచెప్పి కాలేజీలో నోరుపెగలక కూర్చుండిపోయేవాణ్ణి. చివరికి నోటినుండి బ్లడ్‌పడితే ఏ టీ.బీ. నో పట్టుకుందని చచ్చే భయపడ్డాను.... మా ఆవిడ ప్రయివేట్స్ మానేస్తేగాని వీల్లేదంది...లక్కీగా రక్తం నేసల్ రప్చర్ అన్నాడమకో డాక్టరు. ఆ పదేళ్ళ రక్తమాంసాల 'పెట్టుబడి' కదూ యిది.' అని విలివిగా నవ్వి.....

'పెట్టుబడి' అనే మాటను మళ్ళీ అని 'ఇలా పాపులరైజ్ చేయబడుతూంది' అని పెద్దగా నవ్వారు. నాకు నవ్వురాలేదు. ఏడుపొచ్చింది.

అన్నీ తెలిసిన ప్రకాశరావుగార్కి తన రక్తమాంసాల 'పెట్టుబడి' ఎవరికోసమో తెలియలేదంటే.... ఎందుకోసమో అర్థం కాలేదంటే..... నిజంగా బాధవేసింది.

నిద్రాహారాలు మాని పిల్లలకు ప్రయివేట్లుచెప్పి, కాలేజీలో గొంతులేక కూర్చుండిపోవటం...... ఎమ్మే చదివిన పిల్లకు ఎవర్నో కొనుక్కోవటానికా.... మెడికల్ సీటుకు బేరం పెట్టటానికా.... డబ్బుపెట్టి చదువుకుని, చదువుతో డబ్బుగడించి, డబ్బుతో చదువులుకొనుక్కుని. కొనుక్కున్న చదువులమ్ముకుని. అమ్ముకున్న డబ్బుతో కొనుక్కుని..... ఇదేనా జీవితం!

'నువ్వెన్నినా చెప్పోయ్. భాస్కరం..... బెర్నార్డ్‌షా చెప్పారుగా ప్రైవేట్‌ప్రాపర్టీ ఉన్నంతకాలం నథింగ్ హేపెన్స్అని ఈ స్వంత ఆస్తి పోవాలోయ్' అన్నారు. ఇద్దరం సాహిత్యం చర్చించుకుంటున్నాం... ఇలియట్, శ్రీశ్రీ, దోస్తోవిస్కీ, కృష్ణశాస్త్రి... వచ్చిపోతున్నారు... గుడిపాటి వెంకటచలం గుర్తొస్తున్నాడు... ఏది ఏమైనా కవిత్వానికి ప్రేరణ పెద్దన్నగారి పద్యమేనని ఓ తీర్మానం.... మార్క్స్‌కీ ఫ్రాయిడ్‌కీ నివాళులర్పిస్తూ మరోతీర్మానం... తిలక్‌చెప్పిన "భూమధ్యరేఖ"మీద నిలబడి ఇలాతీర్మానాలు చేసుకుంటుండగా...

'లేకిట్ భాస్కరం..... ఇంకోటితీసుకో ప్లీజ్' అంటూనే 'వెధవమ్యూపెమ్ము' అన్నారు. ఆ రెండోవిశేషణం గొడవగురించి!

'ఒద్దుగానండి...... గొడవేమిటి?' అన్నాను.

'తగాదా ఏముంది..... పిల్లీ థింగ్.... సర్వెంట్ మైండ్ .... జీతం పెంచమంటుంది.'

'ఎంతటా?'

'మళ్ళీ రూపాయి పెంచాలట....మూడేళ్ళక్రితమే పదికాదని పదకొండుచేశాం... ఇప్పుడు పన్నెండంటుంది' సీరియస్సయిపోయారు ప్రకాశరావుగారు. 'దట్సాల్‌రైట్.... నీ మూడ్ పాడుచేశానో ఏమిటో.... వన్‌మోర్... .ఇంకోటితీసుకో... డియర్... ప్లీజ్..వన్‌మోర్.....' బలవంత పెడుతున్నారు... తను...

ప్రతిదానికీ విలువవుంటుంది. 'వన్‌మోర్' పెగ్ విలువ నాలుగు రూపాయల్దాకా వుంటుంది.

పదకొండుకూ..... పన్నెండుకూ మధ్య వన్‌మోర్ గ్యాప్ ఉంటుంది!

దుఃఖం చూపుగా వచ్చిన భాస్కరానికీ..... గొంతులో కుక్కుతున్న వన్‌మోర్‌కీ.... వన్‌మోర్‌గ్యాప్‌కీ తేడా ఉంటుంది. 'ఆఫ్ హ్యూమన్ బాండేజ్' లో మనిషికీ మనిషికీ ఏదో తేడా వుంటుంది..... ఒక్క మనిషిలోనే రెండు బాండేజెస్ మాదలేనంతగా మత్తు ఎన్నిపెగ్గులు తీసుకున్నా రాదు. అసలు మేధావులకు మత్తు అంత తొందరగా రాదు... వచ్చిందనుకోవటం తప్పు!! (చందు సుబ్బారావు, వీలిక, భారతి, డిశంబరు'79, పే 42-45)

ఒక ఉపాధ్యాయుడు అవినీతిపరుడుగా ఎన్నిరకాలుగా ప్రవర్తించటానికి అవకాశముంటుందో అన్నింటినీ, అవినీతి యొక్క బహుముఖీనమైన రూపాన్ని చిత్రించిన రచన 'రాగాలచెట్టు'.

"పెంట్రవన్నా ఆడు యీ వూరి బడిల మేస్టుగ్గ..... మేస్టరోని ఎవులికి ఒక అచ్చరంముక్క సెప్పిన పాపాన పోలేదు. దుమ్ములగుండువాలాం. ఇప్పుడు బియ్యం బస్తాలు బండిలో ఎల్తన్నాయూ.... సకం అన్నాడు యిన్నాపుగదా అప్లలుకి తెచ్చిన బియ్యం అవి..... యీడింటికి సకమెలిపోతాయి?" తెల్లగుడ్డలవక్కకివి కసిగా చూస్తూ అన్నాడు పిల్లంగోవి కుర్రాడు పోదన్న.

"మామందరము అదా ఆ బడిలోనే సదివీపోలిమి. నాను ఆడు. పోదన్న నాకంటె ముందే ఆడు పేసెక్కి వుండిపోనాడు.... యిద యీ బుద్దగాడు ఐదు. మమ్మల్ని బడిమానిపించేసి ఒక్కలికి పంపించేమని మా అయ్యాల్తోటి సెప్పినాడు యీ నంజికొడుకే. మల్లీ యీడొక గురువట గురువు" కసిగా చూసేడు కర్రల దరువేసిన సంగమేసు.

"బడిగుంటల్ని పొలానికి తీసికెల్లి పనులు సేయించుకుంటాడు. పనికెల్లబోతే బాదీడమే యీ సిందవగాడి ఎనకాల తిరుగుతాడొకడు... వరదనాగ... అదొక గురువు... ఆడు అదా ఆకొండ కనబడతందిగదా... ఆ కొండమీద వూరిల ఆది వుజ్జోగం. ఆడెప్పుడూ ఆ కొండెక్కినట్టు తెలీదు. ఎప్పుడూ యీ తిరపతయ్య మేస్టుగ్గ ఎనకాల తిరిగితేనే సరిపోద్ది. అప్లలు బెల్లు యినబడితే పాలు బుక్కదాకి తయారైపోతాడు కేరేజీ కప్పుతోటి. తిరపతయ్యగారి పొలానపని. అప్లల్ల తిండి. ఆడిపేరు గంగయ్య." బుద్ధగాడు చెప్పేడు..... ఒకసారి తను పొలానికి పనికి రానంటే తిరపతయ్య.... గంటయ్యచేత కొట్టించిన దెబ్బల్ని గుర్తుచేసుకుంటూ.

...............

"జంతువుకే ఏనాడు జంకని మీరు
చదువు లేక మనిషి కాక లొంగిపోయారు.
అమ్మా ఓయమ్మా మా యమ్మలారా....
అన్నా ఎయన్నా మా యన్నలారా....
అందుకే.....

కొండదిగొచ్చి చదువుకోండి.....!

"ఇదంతా పోష్టు రన్నరు చంద్రం పని. వాడు ఉత్తరాలు పంచడానికి వెళ్ళినవాడు దప్పొకటి తీసుకెళ్తున్నాడు. గూడలన్నీతిరిగి పాటలుపాడి అందర్నీ చదువుకోమని చెప్తున్నాడు. మనం బడినుండి తగలేసిన గుంటలందర్నీ కొండలెక్కి, బండలెక్కి తీసుకొస్తున్నాడు" విషయం వివరించేడు వార్డెన్. ఆలోచనలో పడ్డాడు తిరుపతయ్య మాష్టారు. పాటలతో మారుమ్రోగి పోతోంది ఊరు పక్షుల అరుపుల్లో జాగ్రత్తముద్యోగ అడవిలాగా.

తిరుపతయ్య మాష్టారికి పాట తూటాలా తగులుతోంది ఎటువెళ్ళినా. ఆ పూరిగాల్లో పాట పిట్టలా ఎగురుతోంది. తిరుపతయ్య మాష్టారి ముఖం ఉడికిన ఎర్రపెండలం గుంపలా కమిలిపోయింది. కసిగా పళ్ళునూరేడు. ఆ రాత్రి గ్రామస్థులందరినీ సమావేశపరిచేడు. 'వాడెవుడు.... పోష్టుబంట్రోతు. వాడికి తెల్సిందేటి వాడు చెప్పేదేటి? వాడికొచ్చిన జీతంచాలక ఊరూరు తిరిగి పాటలు పాడుకుని కందులో, కొర్రలో కూడేసుకునేవాడు. అసలు మీకిది తెలుసో లేదో.... వాడు నక్సలైట్లమనిషి. పోలీసులు వాడికోసం తిరుగుతున్నారని అనుకుంటున్నారు కూడా.... సరదాకి సమర్థాడితే.... పొరబాటు కోక తీసుకున్నట్లు.... పాట చెప్తున్నాడని సరదాపడుతున్నారు గానీ... ఆ తరువాత రాలోయే దాన్ని కాసుకోలేకపోతున్నారు. అనవసరంగా యిరికిపోతారు సుమా. అయినాక నేనేరావాల....." బాణం వదిలేడు. అంతా ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. అంతా ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. సాంబరో తాత అన్నాడు కొంచెం ధైర్యంచేసి.

"ఏటిగురువా..... ఆడేటిసేసినాడు. ఆడికి తెలిసిన..... ముక్కలు సెప్తున్నాడు. జొన్నకూడైతే జొన్నకూడు గంటిజావైతే గంటిజావ ఆ పూటకి..... ఏది కలిగితే అవి కడుపుకి పోసుకుంటన్నాడు. ఉత్తరాలు యివ్వడానికెల్లి..... బడిమానేసిన గుంటల్ని తీసుకొత్తండు. బడిల కూకోబెడతండు. అదేనేటి తప్పు. సూడుమీ గుంటలు మున్నగ మాసగోర్లాగ నిగనిగలాడతాండ్రు" అని ఓ హాస్టలు కుర్రాడిని చూపించేడు. " యింతకు మునుపు యిలగే వుండీ వోలా గుంటలు?"

ఆ వెంటనే మరో యువకుడు జనంలోంచి " ఎలాగూ మమ్మల్ని సదవకుండ సేస్సినావు. ఈ కొండల్ల బండల్లాగ మార్సేసి దరమ్ము కట్టుకున్నావు. ఆకుని అందక పోకని పొందక మద్దిలైపోనాం. సదువు సెప్పడానికొచ్చినోడివి సవరదాన్నుంచుకోని కొండోలతోటి సుట్టరికం కలుపుకోని..... మావోలందర్నీ నీ కంబారోల్లాగ సేసుకున్నావు. మాం సదివితే నీకెక్కడ అన్యాయమైపోద్దో అని మాగుంటల్ని బడికెల్లకుండ సేస్సినావు. ఎంది..... సదువు సెప్పకపోయినా నీజీతం నీకు ఎలిపోస్తంది గాదా. మామేటి నీకు యిన్నాలూ అడిగినామా ఇప్పుడు నీకేటైపోయిందని మీటింగెట్టినావు..... మాకొక పాట, మాట వస్తుందంటే ఆ బాబు దయే గదా. ఏదైతే అదవ్వనీ..... సెంద్రవన్న యిక్కడే వుంటాడు. మాతోటే వుంటాడు."

" సదువులు సెప్పే గురువు నేననీ..... సవరగూడలో వొరుట్టాడా
సవరపిల్లని మనువుసేసుకుని నేమా మావపరోడినన్నాడా
గొర్రవాడ ఆ మొరకలన్నిటిని గడుసుతనంగా వదకట్టేడా
పదుపదులు అప్పులు యిచ్చి పోడుపంటలు పోగేసాడా
బడిగుంటలను ఇళ్ళకుతోలి హాస్టలు సరుకులు అందుకున్నాడా
అడివి నాసేతిలోని తమలపాకు అన్నాడా.....
కొండనాకళ్ళకింద కండసీమ అన్నాడా
ఏకులాగ వచ్చినోడు మేకై కూకున్నాడా

అదిగో విధంగ ఏకులాగ వచ్చినోడు మేకై... మేకల్లాంటి కొదవన్నల మీదికి పులిలా తయారైపోయేడు... జతబట్టల్తోటి మేష్టారుగా వచ్చినోడు పట్నంలో మేడలు కట్టేడు... తనపెళ్ళి పెళ్ళానికి పుట్టిన పిల్లలకి గిరిజన సర్టిఫికేట్లు రాయించి, మంచిచదువులకి పునాదులు వేసేడు. వుంచుకున్న కొండపిల్ల సంతానాన్ని మాత్రం పోలం పనుల్లోకి పంపించేడు అమ్మలారా ... చీమలే తమ పుట్టల్లో తెప్పవేసిన పాముల్ని దుట్టుముట్టి దీస్తి పనిపడతాయి. మరి మనం మన బూ(వుల్లో...... బతుకుల్లో దొరబడితే వల్లకోగలవా....... (గంటేడ గౌరునాయుడు, రాగాలచెట్టు, ఏటిపాట, పే 118-129)

అలాంటిదే మరో రచన 'మా ఊరిపంతులు'

స్కూల్లో పిల్లలకొచ్చిన స్కాలర్‌షిప్పులన్నీ పెళ్ళాంతో వేలిముద్రలు వేయించి జేబులో వేసుకునేవాడు. ఇక మధ్యాహ్నభోజన పథకం ప్రవేశపెట్టడం అతనికి మరీ కలిసొచ్చినట్లయ్యింది. ఇంట్లోకి రోజువారీ దినుసులు కొనడం పూర్తిగా మానేశాడు.

ఇలా నల్లేరుమీద బండిలా బ్రతుకుసాగిస్తున్న వెంకటనర్సయ్య పంతులుకు 'బెస్ట్ టీచర్ అవార్డు' రావడం అన్యాయం కదా? అమాటే అన్నాడు పక్కఊళ్ళో ఎలిమెంటరీ టీచర్‌గా పనిచేస్తున్న శేషాద్రి. " ఇది అన్యాయం. కాకపోతే మరేమిటండీ? రోజూ రంపనుగా బడికి వెళ్ళి పాఠాలు చెబుతూ స్కూలుకి అంకితమైపోయిన మాలాంటి వాళ్లను చేకినవాళ్ళులేరు. ఒక్కరోజుకూడా స్కూల్లో కనిపించని ఆ పంతులుకు మాత్రం అవార్డులు, సన్మానాలు. ఛీ ఛీ ఈ ప్రభుత్వానికి విశ్వాసంలేదు సుమండీ" అని తన కంఠశోష వెళ్ళబోసుకున్నాడు.

"ఆనందమా? పాడా. ఈ పాడు అవార్డు నా కొంపముంచింది. కాంతం! ఉత్తమ ఉపాధ్యాయుడికి ఇంతకుపూర్వం అయిదువేలు రొక్కం, ప్రశంసాపత్రం ఇచ్చేవాళ్ళు. ఇప్పుడా రొక్కాన్ని మూడువందలకు కుదించారు. ఈ విషయం తెలియక అయిదువేలు లంచంపెట్టి నాపేరు సిఫార్సు చేయించుకున్నాను. పైసా ఖర్చులేకుండా పేరొస్తుందనుకున్నానుగానీ ఇలా

అయిదువేలు క్షవరం అవుతుందనుకోలేదు. మనకొంప గుండమైపోయిందే కాంతం" అంటూ భోరుమంటున్నారు పంతులు. 'హన్నా?' అని ముక్కుమీద వేలేసుకుని మరీ ఆశ్చర్యపోయాను నేను. (జి.యస్.భూషన్‌రావు, మాతూరి పంతులు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 22/28-7-'92, పే 44-46)

ఉపాధ్యాయుని అనైతిక ప్రవర్తన విద్యార్థులపై ఎటువంటి దారుణమైన ప్రభావాన్ని చూపుతుందో 'సహనావవతు'లో మనకు స్పష్టంగా కళ్ళకు కడ్తుంది.

నేను....నేను మనిషినికాను.

నాకు మానవత్వం లేదు.అమాయకుడైన సత్యం చావుకి నేనే కారణం.ఇది నా మనసుకి తెలుసు. లోకానికి తెలీదు. ఇప్పటికి కాదు....ఎప్పటికీ తెలియదంతే. కొన్నిరకాల చావులంతే. ఎవరికీ అంతు చిక్కని నిర్ధంగా అమాయకంగా,అనామకంగా చచ్చిపోతారు. కాని ఆ చావువెనుక భయంకరమైన నిజం ఒకటి ఉంటుంది. దుర్భర సత్యం ఒకటి దాగి ఉంటుంది. కాలం శరీరం మీద అలాంటి కనిపించని మచ్చలెన్నో!

వాడు పేదరికంలో పుట్టి పెరిగాడు. వాడింట్లో దరిద్రం తాండవిస్తోంది. కాని...కాని వాడి చదువుకి అడ్డులేదు. దీనివల్ల తిండికి లోటు లేదు. బట్టలు, పుస్తకాలు, పైపెచ్చు స్కాలర్‌షిప్పు-- అన్నీ లభిస్తున్నాయి. అగ్ర కులాలకి చెందిన వాళ్ళనే కారణంవల్ల మా వెధవలకా అవకాశాలు పూజ్యం. వెనుకబడిన కులాలకు చెందిన పిల్లలు ఇంకా మరికొంత మంది ఉన్నా ,నాకు సత్యం మీదే ఎక్కువ ద్వేషం ఎందుకేర్పడిందో చెప్పలేను. బహుశా వాడు మా శేసు కన్నా తెలివయినవాడనే కారణం కావచ్చును.

ఏదో వంకపెట్టి సత్యాన్ని దండించటం మొదలుపెట్టాను. వాడు నన్ను చూస్తేనే జడుసుకునేలా తయారయ్యేడు. నేను క్లాసులో అడుగుపెట్టగానే వణికిపోయేవాడు. ఒక వికసించే పుష్పాన్ని నిర్దాక్షిణ్యంగా నలిపేస్తున్నాననే ఆలోచన కూడా నాకు రాలేదు. వాడినలా హింసించటంలో నాకేదో తృప్తిలాంటిది కలిగేది. నా తీరని సమస్యల కసి తీరుట కలిగించే చర్య అనుకుంటాను? రానురాను సత్యంలో చురుకుదనం నశించింది. మందకొడిగా, స్తబ్ధుగా తయారయ్యేడు.

ఏ కారణం వల్ల ప్రభుత్వం వాళ్ళకా సదుపాయాలు కల్పజేస్తుందో--- ఆ వెనుకబడినతనం వల్లనే-- ఆ సంస్కార హీనత చేతనే-- ఆ పెరిగిన వాతావరణ పరిస్థితుల వల్లనే--- వాడి ఉచ్చారణ, భాష-- లోప భూయిష్ఠంగా ఉందని నేనెందుకు గ్రహించ లేకపోయాను? అది సహృదయంతో అర్థం చేసుకుని సానుభూతితో సరిదిద్ద వలసిన బాధ్యత నా మీద లేదూ!
నా సంస్కారం ఏ మంటల్లో దగ్ధమైపోయింది? నా మనవత్వం ఎప్పుడు నశించిపోయింది? ఇంతలా రాక్షసుడినయిపోయానేం నేను! ఆ తరవాత సత్యం స్కూలుకి రాలేదు. ఎవరూ ఈ విషయం అంతగా పట్టించుకోలేదు.

ఇవాళ...............

పిడుగులాంటి వార్త! సత్యం చచ్చిపోయేడు. నా మెదడు నలిగిపోతోంది. నా పాపం నన్ను పిచ్చివాణ్ని చేస్తోంది. మరునాటి ఉదయం--

గణగణ మని గంట కొట్టేరు. పిల్లలంతా కిలకిలమంటూ స్కూలు గ్రౌండులోకి పరుగెత్తారు. టీచర్లం ఓ వరుసలో నించున్నాం. ప్రార్థన మొదలయింది.

"సహనావవతు సహనౌభునక్తు సహవీర్యం కరవావహై తేజస్వినావధీతమస్తు మా విద్విషావహై.. .సహనావయశ..." అంటూ పిల్లలంతా ముక్తకంఠంతో చదువుతున్న ఆ శాంతి పాఠం వినడానికి నాకు ధైర్యం చాలిందికాదు. నా ఒళ్లో సన్నని వణుకు మొదలై, నాకళ్ళ ముందు చీకటి ఆవరిస్తోంది---(పంతుల జోగారావు, సహనావవతు, ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక, 12-12-'79, పే 15-17)

ఉపాధ్యాయుని అనైతిక ప్రవర్తనకు పరాకాష్ఠ 'గంగాజలం'లోని మాస్టారి పాత్ర.

వెంక: (బెత్తంతో కొట్టాడు) ఏం దూరంగా పోతావ్ రా.... రా.... ఇటూ (తొడపాశం పెడుతున్నారు) ఏదో విచిత్రమైన ఆనందం అతని కళ్ళలో కనిపిస్తుంది. చిరూని గమనించి) ఆ రేయ్‌నానీ క్రికెట్ మ్యాచ్ జరుగుతుందిగాని స్కోర్ చూసిరారా? (తిరిగి వెళ్ళటానికి ప్రయత్నంచేస్తారు నాని) ఫరవాలేదు ఇటే వెళ్ళరా! ఒరేయ్ బంకుదగ్గర సిగరెట్లు కూడా తెచ్చిపెట్టు...(నానీ వెళ్ళిపోవటం చూసి వెనక్కు తిరిగి బెత్తంఎత్తాడు) ఏమ్మా ఇట్లాకాదు. ఇంతకంటే పెద్దశిక్ష వెయ్యాలి పద (అంటూ బసవయ్య ఇంటిలోపలికి తీసుకెళ్ళారు మాస్టారు చేసే అకృత్యాలకు పావని కేకలువేస్తుంది).

పావ: (తెరలో) వద్దు మాస్టారు వద్దు. నాన్నా....

మాస్టా: నోరుముయ్

నాని: (నానీ వచ్చాడు) మాస్టారు... మాస్టారూ.... (పావని మూల్గులువినిపించింది) చిరు తలుపులు బాదుతూ పావనీ. పావనీ..

చిరు: నువ్వు.... ను..వ్వు... పావని.... మవయ్యకు చెబుతా ఉండు.

వెంక: ఒకచేత్తో చిరూకళ్ళు మూశాడు. డబ్బు కళ్ళముందు ఆడించాడు. నానీ డబ్బు అందుకున్నాడు. వెంకట్రావుకు ఒక్క అడుగు దూరం జరిగి డబ్బు వెంకట్రావు ముఖాన కొట్టి పరుగెత్తబోయాడు. వెంకట్రావుమాస్టారు చేతులు చిరూ గొంతుకు బిగుసుకున్నాయి..... చిరు చనిపోయాడు. పావని ఈ దృశ్యాన్నిచూస్తూ నిశ్చేష్టురాలై నిల్చుంది.

సావి: (శ్లోకం జరుగుతున్నప్పుడు లేచి మాష్టారిపాదాలకు నమస్కరించి నావీ కాలి బూటు అందుకొని మాష్టార్ని ఎడాపెడా కొట్టింది. బసవయ్య వచ్చి కూతుర్ని దగ్గరకు తీసుకున్నాడు)

వీరా: మైనం ముద్దలాంటి పసిపిల్లలచేత ఓనమాలు దిద్దించి విజ్ఞానవంతుల్ని, వివేకవంతుల్ని చేసి ప్రతిభామూర్తులుగా తీర్చిదిద్దే అక్షరశిల్పి ఉపాధ్యాయుడు. తల్లిదండ్రులు రక్తమాంసాల్ని మాత్రమే పంచితే ఆ రక్తమాంసాలకు జ్ఞానభిక్షను ప్రసాదించే భగవంతుడు ఉపాధ్యాయుడు. మనదేశంలో గంగాజలం ఎంతో పవిత్రమైంది. అంతకన్నా పవిత్రమైంది ఉపాధ్యాయవృత్తి. రేయ్ పవిత్రమైన గంగాజలంలో కొన్ని కలుషిత పదార్థాలుచేరి అపవిత్రమైనట్లు నీలాంటి దుష్టులు, హీనులు పవిత్రమైన ఉపాధ్యాయవృత్తిలో దూరుతూ ఆవృత్తికే కళంకం తెస్తున్నారు. నీలాంటి కలుషిత పదార్థాన్ని వెలికితీసి శుద్ధిచేసినప్పుడే పవిత్రమైన విద్యాగంగాజలం జలజలజల ప్రవహిస్తుంది. అసలు మానభంగాలకు పాల్పడుతున్న నీలాంటివాళ్ళకి కాలిఫోర్నియా దేశంలో బిల్లుప్రవేశపెట్టినట్లు పురుషత్వాన్ని నిర్వీర్యం చేయటమే సరైన శిక్ష. ఎత్తుకో ఎత్తుకోరా వీడ్ని పద పోలీస్‌స్టేషనుకు. పదండి వీడికి శిక్షపడేలా చేద్దాం. (అరిశెట్టి శివన్నారాయణ, గంగాజలం, డాII అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్, పే 437-451)

అనైతికవర్తనులైన ఉపాధ్యాయుల లక్షణాల చిత్రీకరణ 'రిటైర్మెంట్,' 'సమర్థుడు'వంటి రచనలలో కనిపిస్తుంది.

ఆ రోజుల్లో ఏ పైరవీ లేకుండా దొరికే టీచర్ ఉద్యోగంలో చేరాడు భద్రాచలం. అదృష్టవశాత్తు పదిమంది అధ్యాపకులున్న పాఠశాలలోనే పడ్డాడు భద్రాచలం. కానీ ఏం లాభం? వాళ్ళంతా ఉన్నవాళ్ళు. సర్వీసు వున్నవాళ్ళు. అనుభవం వున్నవాళ్ళు. కానీ ఆదర్శాలు లేనివాళ్ళు. వ్యసనాలకు బానిసలు. 'చతుర్ముఖ' పారాయణులు. ప్రధానోపాధ్యాయునితో పాటు అందరూ అందరే. వర్షంపడితే సెలవే. పడే సూచనలున్నా సెలవే. ఇంకా ఎన్నోరకాల సెలవులు. (టి.లక్ష్మయ్య, రిటైర్మెంట్, తెలుగు విద్యార్థి, సెప్టెంబరు'91, పే 39-40)

అవినీతి, అక్రమార్జన అనేవి 'బలా'నికి కాదు, 'బలహీనత'కే చిహ్నాలు కాబోలు! రాఘవయ్యకు నిజంగా తెలుగులో పాండిత్యమూ, ప్రతిభా వుంటే, అతను విద్యార్థులకి బాగా చదువు చెప్పగలిగితే -- తన బుకాయింపుతో, డిప్లొమసీతో, చిరునవ్వుతో, నమ్మా, యితర్లని బాధపెట్టే అవసరమే వుండేదికాదు కాబోలు! అతనిలో నిజంగా లోపించింది సామర్థ్యమే! ఇక ఆత్మ విశ్వాసం మాత్రం ఎలా వస్తుంది? అంతే అనుకోవాలి. లేకపోతే మనిషి ఇలా కుప్పకూలిపోతాడా? (ఆర్.ఎస్.సుదర్శనం, సమర్థుడు, భారతి మే'59, పే 17-20)

కొందరు ఉపాధ్యాయుల అనైతికత తోటి ఉపాధ్యాయులను, మంచి విద్యార్థులను ఎలా ఆవేదనకు గురిచేస్తుందో చిత్రించిన రచన 'ఆచార్యదేవోభవ'

"ఆచార్య దేవోభవ అని మీరే చెప్పారుగదా టీచర్! కాపీ కొట్టడమేకాదు. అందుకు సాయపడటమూ తప్పేనన్నారు మీరు. కానీ మాదంతే టీచర్..... నేనెంత బాగా చదివినా ప్రయోజనం ఏమిటి? ఏదో క్లాసులోకి రాగానే ఇప్పుడు మీరు చూసిన వారంతా నన్ను బెదిరించారు. పరీక్షల్లో వేరేవాళ్ళకి ఆన్సర్లు చూపాలనీ లేకుంటే చంపేస్తామనీ..... అందుకే టీచర్ నాకు చదువు మీద ఇంటరెస్ట్ తగ్గిపోయింది. నాకసలేమీ రాకుంటే ఈ గొడవే ఉండేది కాదుకదా అనిపించింది" గద్గద కంఠంతో చెప్పాడు.

ఓ దృఢ సంకల్పంతో ఇంటికి వెళుతూ అనుకున్నాను. "నథింగ్ ఈజ్ రాంగ్ విత్ బాలూ...! బట్ సమ్‌థింగ్ ఈజ్ రాంగ్ విత్ హెడ్మాష్టర్... యూ మస్ట్ బీ పనిష్డ్.....!" (స్వరూపసిన్హా, ఆచార్యదేవోభవ, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 7-8-'91, పే 27-31)

### ఉపాధ్యాయుని ఆదర్శ వ్యక్తిత్వం :

జీవితంలో ఎంతటి ఇబ్బందులనెదుర్కొన్నా, కుటుంబంలో, సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా చిన్నచూపుతో ఎటువంటి అవహేళనలకు గురైనా, వీటన్నింటిని తట్టుకుని వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా నిలుపుకునే గురువులు నాడు, నేడు పోరాటయోధులుగా తారసపడుతూనే ఉంటారు. అలాంటి వ్యక్తిత్వాలు సాహిత్యంలో అడుగడుగునా మనకు దర్శనమిస్తూనే ఉంటాయి. అలాంటి వ్యక్తి చిత్రీకరణే 'మారనివిలువలు'

'పెదుక్కూ బియ్యానికి మంత్రాలు వేరయినా పంతులుకు మాత్రం పిల్లలంతా ఒకటే మేష్టారూ. ప్రెసిడెంటు కొడుకు, మునసబు అల్లుడు, కరణం కూతురు అంటూ వారిని గౌరవిస్తూ, బీదా బిక్కినా దండించేది? అందుకే మనసమాజం ఇట్లా తగలడింది.' అన్నాడు నిమ్న జాతుల ప్రతినిధి, పోస్టల్ టీచరు సుబ్బారావు ఉపదేశింపుగా. 'ప్రెసిడెంటు కొడుకయినా, ఫైర్మెన్ కొడుకైనా గురువుకు శిష్యుడేకాని గురువుకాడు. తప్పుచేసినవాణ్ణి శిక్షించాల్సిందే కాని ఒప్పుని వదలిపెట్టడం గురువు తన కర్తవ్యాన్ని విస్మరించడమే' నిదానంపంతులు నరసింహామూర్తి చెప్పాడు తాపీగా.

'ప్రసాద్ అంటే నాకేమీ ఈర్ష్యాద్వేషాలులేవు. ఆ పసివాని హృదయంలో రేగిన విషవాయువును హరించాను. జెండులు మారాయి కాని సకాలంలో పర్మ తీసుకోనకపోతే బుద్ధులు మారవు. వారి ఆస్తి, అంతస్థులతో నాకు నిమిత్తంలేదు. వారి భవిష్యత్తే ముఖ్యం. ఆ దృష్టితోనే ఉపాధ్యాయునిగా నా కర్తవ్యాన్ని నేను నిర్వర్తించాను. దాని ఫలితం పరిణామం ఏలాంటిదైనా స్వీకరించడానికి నేను సిద్ధమే. మీకు ఆందోళన కల్గించినందుకు విచారిస్తున్నాను.', అంటూ హెడ్‌మాస్టరు గారికి చెప్పి ఇంటికి వెళ్ళిపోయాడు. (పి.పాపిరెడ్డి, మారని విలువలు, యువ, మే '81, పే 75-86)

సమాజంకోసం జీవితాన్ని త్యాగంచేసిన వ్యక్తిగా 'మట్టిగుర్రం'లోని ఉపాధ్యాయుని పాత్ర నిలుస్తుంది.

అది సమితిపరిధిలో ఎవరికీ అక్కర్లేని మారుమూల కుగ్రామం. పది పన్నెండు కిలోమీటర్ల దూరమూ నడిస్తేగాని తార్రోడ్డు కనిపించదు. నైతికవిజయం సాధించిన తృప్తితో నా కళ్ళు వెలిగేయి. ఊరు బాధతో మూలిగింది. కన్నీటితో వీడ్కోలు చెప్పింది. వివాహమనే సంకెళ్ళు నాలాటి స్వేచ్ఛాజీవికి పనికిరావని నిర్ధారించుకున్నాను. ప్రపంచంలో ఎందరో పుడ్తారు. పుట్టినవాళ్ళంతా చస్తారు. అయితే చావుపుట్టుకల మధ్య తమదైన చరిత్ర సృష్టించుకున్న వాళ్ళెందరు? బ్రతికిన నాలుగు రోజుల్లోనూ సమాజానికి ఉపయోగపడే వాళ్ళెందరు? నాలో నిరంతర తపన. అజ్ఞానాంధకారంలో అమాయక ప్రాణులకి బాసటగా నిలవాలి. వాళ్ళలో జాగృతిని కలిగించాలి. జ్ఞానదీపాన్ని వెలిగించాలి. మరో బదిలీ ఈ కుగ్రామానికి చేర్చింది. ఈ గ్రామంలోనే నాజీవితం మరోమలుపు తిరగనున్న సంకేతం అందించింది అంతరాత్మ.

"వీళ్ళందర్నీ రెచ్చగొట్టి ఇలా అల్లకల్లోలం సృష్టిస్తున్నది నువ్వే అని తెలుస్తోంది. చేస్తున్న ఉద్యోగం చేదుగా ఉందా? ఇలాంటి తెలివితక్కువ పనులుచేస్తు ఎన్నాళ్ళు నెగ్గుకురాగలవు?" మండల ప్రెసిడెంటు విరుచుకుపడ్డాడు నామీద. మండలాధికారి, తాసిల్దారు, స్కూళ్ళ ఇన్‌స్పెక్టరు వంతులవారీగా బెదిరించేరు. అందరి మాటల్లోనూ అదే హెచ్చరిక. "ఉన్న ఉద్యోగం ఊడిపోగలదు. అప్పుడు రామచంద్రా అంటూ రోడ్డుపట్టి అడుక్కుతినగలవు."

నిజమే - కాళ్ళకు సంకెళ్ళు కట్టుకుని ఎదుటివాడిని రక్షించగలననే మూర్ఖత్వంలోనే జీవితం వృధాచేసేను. సంకెళ్ళు తెంచుకునే సమయం వచ్చేసింది. నా అన్న వారెవ్వరూలేని ఏకాకిని ఉద్యోగమనే బంధమే నన్ను గాలిపటంలా అటూఇటూ పరిగెత్తిస్తున్నది. నీలాటి గోముఖవ్యాఘ్రాలముందు తలొంచుకునేలా చేస్తోంది. ఏటి ఒడ్డున నిలబడి ఈతనేర్పడం కన్నా తెలివితక్కువతనమేముంటుంది? సజీవమైన నిర్ణయం నాలోపల మొలుస్తోంది.

ఇప్పుడు -- నేను సర్వ స్వతంత్రుణ్ణి. స్వేచ్ఛా విహంగాన్ని శతకోటి దరిద్రనారాయణులలో నేనూ ఒకణ్ణి. నన్ను నమ్ముకున్నవాళ్ళని నట్టేట్లో ముంచలేను. నీలా మట్టిగుర్రాన్ని కాలేను. అందుకే -- ఉద్యోగానికి రాజీనామా చేసేశాను. నా దారిని నేనే రక్షించుకుంటాను." (కన్నేపల్లి చలమయ్యశాస్త్రి, మట్టిగుర్రం, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 17-8-'88, పే 72-77)

ఉన్నతవ్యక్తిత్వం, ఆత్మగౌరవం గల ఉపాధ్యాయుడు తన ఔన్నత్యాన్ని కాపాడుకోవటానికి రాజునుసైతం ధిక్కరించేందుకు వెనుకాడకపోవటాన్ని చిత్రించిన రచన 'బడిపంతులు'

"రాజావారు బడికి రాగానే, నేను తలమీది టోపీతీసి చేతిలో పట్టుకోవాలి. అలా చేయడం చూసి చదువుకునేపిల్లలేమనుకుంటారు? రాజుగారి కంటే నేను-హెడ్మాష్టరిని-తక్కువవాణ్ణనుకోరా? విద్యార్థుల దృష్టిలో ఉపాధ్యాయుడల్పుడైతే క్రమశిక్షణ క్షీణిస్తుంది. పాఠశాల ప్రతిష్ఠకది భంగం!"

ఈ జవాబుచూసి ఎర్రయ్యప్రభువు మరీ ఆశ్చర్యపడ్డాడు. స్కూలుమాష్టరంటే ఎంత గొప్పవాడో తెలుసుకున్నాడు. ఉపాధ్యాయుని ఆత్మగౌరవానికి మెచ్చుకున్నాడు. (వింజమూరి శివరామారావు, బడిపంతులు, తెలుగు విద్యార్థి, జనవరి'79, పే 16)

ప్రతిభ కుల, మతాలకు అతీతమైనదని చాటిచెప్పే ఉన్నతసంస్కారంగలిగిన ఒక ఉపాధ్యాయుని వ్యక్తిత్వచిత్రణే 'అగ్నిహోత్రుడు'

"సభకు నమస్కారం! ఈ వేదికపైన ఉన్న వెంకటాద్రి అనే యువకుడు చిన్నప్పట్నుంచి నాకు బాగాతెలుసు. ఇతని తల్లిదండ్రుల్నికూడా నేనెరుగుదును. ఇతని తల్లి రమణమ్మ మాఇంట్లో పనిచేసేది. ఇతని తండ్రి మార్కండేయులు ఓ రిక్షా తొక్కుతూ తన కుటుంబాన్ని పోషించేవాడు."

"నిజానికి ఈ వేదికపైన కూర్చోవాల్సిన అర్హత నాకూ, మా పార్థుకంటే.... ఈ వెంకటాద్రికీ, ఇతని తండ్రికి మాత్రమే ఉంది. రిక్షా వాడి బిడ్డగా పుట్టి ఐ.ఏ.ఎస్. కి సెలక్టయిన ఈ వెంకటాద్రి గొప్పవాడా? ఓ లెక్చరర్ బిడ్డగా పుట్టి ఐ.ఏ.ఎస్. కి సెలక్ట్ అయిన ఈ పార్థు గొప్పవాడా? అసలే.... ఓ లెక్చరర్‌గా జాబ్‌చేస్తూ నా బిడ్డని ఆఫీసర్ని చేశాను నేను. రిక్షాతొక్కుతూ తన బిడ్డని ఆఫీసర్ని చేశాడు మార్కండేయులు. తండ్రులుగా ఇద్దరిలో ఎవరు గొప్పవాళ్ళు?" అంటూ గబుక్కున వేదికదిగి వెనుకభాగంలో నిలబడి ఉన్న మార్కండేయుల్ని వేదికపైకి తీసుకొచ్చాడాయన.

"జీవితంలో నేను ఏనాడూ పొందనంత ఆనందం.... ఈ తండ్రీ కొడుకుల్ని చూసి పొందుతున్నాను. ప్రతిభఅనేది కులాతీతమైందని చెప్పడానికి వీళ్ళిద్దరే సజీవసాక్షులు. ప్రతిభని గుర్తించి ప్రశంసించడానికి కులమత ఆర్థిక వ్యత్యాసాలు అడ్డుగోడలు కాకూడదు. ఈ తండ్రీ కొడుకుల్ని అభినందిస్తూ... నిరుద్యోగిగా నేను పస్తులున్న రోజుల్లో కూడా అమ్ముకోని నా

గోళ్ళు మెదళ్ళి వీళ్ళకి బహూకరిస్తున్నాను" అంటూ ఆనందభాష్పాల్ని తుడుచుకుంటున్న రామచంద్రమూర్తిని చూసి సభ విస్తుపోయింది. అగ్నికి కాలుష్యాన్నంటగట్టిన వెంకటాద్రి శిలలా బిగుసుకుపోయాడు. (వీరువల్లి వీరావాణి, అగ్నిహోత్రుడు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 3-2-'88, పే 33-35)

విద్యార్థి ప్రతిభకుకొలమానాలుగా రూపొందించిన కొన్ని ప్రమాణాలు విద్యార్థి ప్రతిభను గుర్తించేందుకు సరితూగనప్పుడు, విద్యార్థికోసం ఆప్రమాణాలకు అతీతంగా నిర్ణయాలు తీసుకోగల ఉత్తమ వ్యక్తిత్వంగల ఉపాధ్యాయుని పాత్ర 'పిచ్చి వెంకట్రావు'

"ఈ పుణ్యభూమిలో అఖరుకొక్క కుక్క పస్తుపడుకున్నాసరే, తనకు ఊర్ధ్వగతులు వద్దుపొమ్మన్నాడు వివేకానందుడు. దరిద్రనారాయణుడి సేవకోసం అవసరమైతే మళ్ళీమళ్ళీ యిలాంటి వెయ్యిజన్మలెత్తడానికైనా తాను సిద్ధమేనన్నాడు. కర్తవ్యసాధనకోసం జీవితాని', మీసుకళ్లేవాళ్ళ పద్ధతి అది. లోకం దృష్టిలో అలాంటివాళ్ళు పిచ్చివాళ్ళుగానే కనిపించవచ్చునుకోండి! అమాలకొస్తే వాళ్ళుగూడా లోకాన్ని ఖాతరుచెయ్యరు. అనగడంమరిచాను. మీరేంచేస్తుంటారండీ?

"మాతంతి చేస్తారుగాదూ! లోకాన్ని ఖాతరుచేయకపోవటమంటే ఏమిటంటారు? లోకం ఏర్పాటుచేసిన సాంప్రదాయాన్ని మన్నించకపోవడమన్నమాట! ప్రతి అల్లాటప్పావాడూ చేయగలడంటారా అంతటిపని! వేమన్నగారట, గుడిముంగిట చింకిపాతలతో గజగజ వణికిపోతున్న బిచ్చగత్తెను చూదాడట. వెంటనే గుడిలోపలికి వెళ్ళి అమ్మవారికి చుట్టబెట్టిన పట్టుచీరెను లాక్కొచ్చి ఆ దీనురాలికి కప్పేశాడట. అయ్యో ఇంకేమైనా ఉందా? తప్పుగదూ! అమ్మవారు కళ్ళుపొడిచెయ్యదూ! అనుకోవడం మానవ స్వభావం. రాళ్ళు దేవుళ్ళయితే రాసుల్ని మ్రింగవా అనగలిగే చేవ కోటికొక్కడికి మాత్రమే వుంటుంది...."

'ఒకసారి హైస్కూల్లో పరీక్షలు జరుగుతున్నాయి. ఒక పరీక్షకు నేను అరగంట లేటుగా గానీ వెళ్ళలేక పోయాను. నూటరెండు డిగ్రీల జ్వరతీవ్రతలో వాడిపోయిన తోటకూర కాడలా దస్కు పైన వాలిపోతున్నాను. ప్రక్కనే కూచుని హెడ్మాస్టరు గారు కాఫీ త్రాగించారు. 'ఏం భయపడొద్దు బాబూ! నీ చేతనైనంతవరకే వ్రాయి. వీలుగాకపోతే మానెయ్యి' అంటూ బుజ్జగించారు. వింటున్నారా మాష్టరుగారూ! ఆపరీక్షలో నాకు పాసవ్వటందుకు రావలసిన మినిమమ్ మార్కులకన్నా అయిదు మార్కులు తక్కువగా వచ్చాయి ......"

'మిగిలిన సబ్జక్టుల్లో ఎన్ని మార్కులొచ్చాయని అడగలేదు మీరు! వాటిలో బాగానే వచ్చాయి. కానీ ఏం లాభం? ఆరోజుల్లో రూల్సు చాలా స్ట్రిక్ట్‌గా వుండేవి. ఈ విద్యార్థి తప్పనిసరిగా యింకొక సంవత్సరం అదే క్లాసులో వుండవలసిందేనని హెడ్మాస్టరు మినహాగా మిగిలిన హైస్కూలు పరీక్షల కమిటీ నిర్ణయించింది. ఐతే కమిటీ నిర్ణయానికి వ్యతిరేకంగా, పరీక్షల నిబంధనలు త్రోసిరాజంటూ నాపేరు ప్రమోషనులిస్టులో కనిపించింది. ......... వారు నాష్టూడెంటు. వాడెలాంటి స్టూడెంటోయింది నాకు తెలుసు. వెధవ ముదనష్టం అయిదు మార్కులకోసం వాణ్ణి ఫెయిల్ చెయ్యమంటారటండీ! మిగిలిన వాటిల్లో అరవైలూ, డెబ్బయిలూ రాగా, ఒక సబ్జక్టులో అయిదు మార్కులు తక్కువవగానే ఇక వాడు పైతరగతికి పనికి రాడంటారా? ఆ మాత్రం యోగ్యతను గుర్తించి ఒక స్టూడెంటును పాస్ చేసే అధికారమైనా లేకపోతే యిక నాకీ హెడ్మాస్టరుగిరీ ఏం చేసుకోడానికండీ! మీకొక నమస్కారం! దీన్ని నేను తప్పనుకోలేదు. కర్తవ్యమనుకున్నాను. తర్వాత మీ యిష్టం. అనేశారు. (మధురాంతకం రాజారాం, పిచ్చి వెంకట్రావు, పాంథశాల, పే 91-107)

జీవితానికీ, వ్యక్తిత్వానికి మధ్య జరిగే సంఘర్షణలో ఉపాధ్యాయుడు ఎలా చితికిపోతాడో చిత్రించిన రచన 'పీల్చే జలగలు-ఏడ్చే అంతరాత్మలు'. ఆర్థికస్థితి ఉపాధ్యాయుని వృత్తిపరంగా ఎటువంటి ప్రభావాన్ని చూపుతుందో ఇందులో ప్రతిఫలిస్తుంది.

"కేశవయ్య టీచర్‌ను సస్పెండుచేశారు. ముప్పయియేళ్ళ మచ్చలేని సర్వీసున్న కేశవయ్య టీచర్‌ను నెగ్లిజెన్స్ ఆఫ్ డ్యూటీస్ అని సస్పెండు చేశారట." తోటి ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు చెప్పింటే ఆ వార్తవిని ఆంజనేయులు ఉలిక్కిపడ్డాడు. వణికిపోయాడు.

"నీతికి నిజాయితీకి మారుపేరయిన కేశవయ్య టీచర్‌కా యీగతి", అని పశ్చాత్తాపం కూడా పడ్డాడు. తేరుకొని, ఆయన తప్పేమిటి అని అడిగాడు.

"మన సిల్కు జిల్లా చేర్మన్, కార్పొరేషన్ కమీషనర్ గారు సరిగ్గా పదకొండు గంటలవేళ ఆకస్మిక తనిఖీగా స్కూలుకు వచ్చారట. ఆ సమయంలో కేశవయ్య టీచర్ టేబులిమీద తలపెట్టి నిద్రపోతున్నారట. క్లాసులో పిల్లలు గోల చేస్తున్నారట. చైర్మనే స్వయంగా లేపారట. నీళ్ళు తెచ్చి ముఖాన చిలకరించితేగాని మెలకువ రాలేదట. తరువాత మామూలే" అన్నాడు శ్రీనివాసరావు. కేశవయ్య టీచర్ అలా ఎందుకు చేశాడు." ఆశ్చర్యపోయాడు ఆంజనేయులు. 'అలా ఎందుకు చేస్తాడు? అతని పేదతనం, అయిదు నెలలయినా జీతాలివ్వని మునిసిపాలిటీ, వీధిలోకెళ్ళి ఒక్క రూపాయికూడ అప్పు పుట్టించుకోలేని అతని నిస్సహాయత అన్నీ కలిసి యింటిల్లిపాదిని మూడురోజులుగా పస్తులుపెట్టాయి. ఏభైఏళ్ళు దాటిన మనిషి పస్తులకు తట్టుకునే శక్తిలేక సొమ్మసిల్లిపోయాడు." ఆంజనేయులికి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆలోచిస్తూ నడుస్తూనే వున్నాడు ఆంజనేయులు.

"టీచర్గా వుండడకన్నా ఏదొకఆఫీసులో సన్నా జవానుగా వుండడమే మేలు. అంతో యింతో డబ్బు నిత్యమింటగా వుండేది. ఉపాధ్యాయవృత్తి పవిత్రమైందని అంటారందరు........ అయినా కాకేం? అపవిత్రత రాజ్యమేలుతుంటే పవిత్రతకు

మనుగడ ఎక్కడ. మనిషికి బలమైన శాపం ఆర్థిక బలహీనత. ఈ సోషలిజంలో దానికి టానిక్కు లేదేమో..... ఆంజనేయులికి నవ్వొచ్చింది అటువంటి ఆలోచన వచ్చినందుకు. (సనగరం పార్థసారథి, పిల్లే జలగలు--పెద్దే అంతరాత్మలు, మంజరి, 1974-'75, పే --)

ఉపాధ్యాయుల ఆలోచనావిధానంలోని ప్రగతిశీల దృక్పథాన్ని జీర్ణంచేసుకోలేని సమాజంనుంచి ఉపాధ్యాయులు పొందే ప్రతిఫలం ఎంత విషాదభరితమో వివరించే రచన 'అన్‌రెస్ట్' అయితే ఉపాధ్యాయుల బోధనలు విద్యార్థులను ఎంతగా చైతన్యవంతులను చేస్తాయోకూడా ఇందులో చూడవచ్చు.

"నేను ఇన్నాళ్ళూ పనిచేసిన కాలేజీలోని అమ్మాయిలంతా ఎప్పుడూ చీరెలూ, సినిమాలూ, సీరియల్ నవలలును ఫ్యాషన్లు తప్ప.... రాజకీయాలగురించి చర్చించడం నేనెప్పుడూ వినలేదు!.... మీలో కనిపిస్తోన్న.... రాజకీయ పరిజ్ఞానం.... నాకు ఆశ్చర్యాన్ని, ఆనందాన్నీ కలిగిస్తోంది! మీక్లాస్ నాకు కొత్త అయినా.... మీతో చర్చ.... నాకు....ఓ నూతన ఉత్తేజాన్ని, స్ఫూర్తినీ కలిగిస్తోంది!" అంటూ టేబుల్‌మీద ఉన్న బుక్స్ సర్దుకుంది అరుణ.

ఆ తర్వాత వారం రోజుల్లో అరుణకి వరుసగా అయిదులేఖలు అందాయి!

ప్రభుత్వ నిర్ణయాలకి వ్యతిరేకంగా క్లాసుల్లో పాఠాలు చెప్తున్నందుకు ఎందుకు సంజాయిషీ ఇవ్వకూడదో చెప్పాలంటూ ప్రభుత్వ అధికారుల నుండి మెమో! నక్సలైట్ల భావాలని విద్యార్థినుల్లో ప్రచారం చేస్తున్నారని, దానిపై సమగ్ర విచారణ జరిపించాలని ఏబీవీపీ ఆరోపణ. నీ ఉద్యోగమేదో నువ్వు చేసుకోకుండా, రిజర్వేషన్లకి వ్యతిరేకంగా విద్యార్థినులకి ఉపన్యాసాలు ఇస్తున్నావని తెలిసింది! ఇక నోరు విప్పితే -- నోట్లో నాలుక ఉండదని టీసీల తాఖీదు! 'మన రాష్ట్రంలో ఇప్పటికే రొనేషన్లు రద్దుచేశారు! నీ ఉపన్యాసాల హోరుతో పక్క రాష్ట్రాల్లో కూడా ఈ రొనేషన్లు రద్దుచేయించేలా ఉన్నావ్ -- ఒళ్ళు దగ్గర పెట్టుకో" అని డబ్బున్నవారి వార్నింగ్. 'నాల్గోడల మధ్య పాఠం చెప్పడం తప్ప బయటి ప్రపంచం చూడని నువ్వు, ఎండనకా, వాననకా రాళ్ళలో రప్పల్లో పేదప్రజలకోసం పాటుపడే మా గురించి చర్చించి..... విద్యార్థి నాయకురాలైన కిరణ్‌తో మాకు నీతులు చెప్పించే సాహసం చేస్తావా...... చూడూ... ఏకేం గతి పడుతుందో" అని బెదిరింపు.

అవును.... ఆరోజు... అరుణ మేడమ్.... ప్రజాస్వామ్య సోషలిజం అంటే సమానత్వంలేని స్వేచ్ఛ అన్నారు! కాని తన మనసులోని భావాలు స్వేచ్ఛగా వెల్లడించినందుకే అవిడ హత్యచేయబడ్డారూ అంటే మనది సమానత్వంలేని స్వేచ్ఛకాదు! స్వేచ్ఛలేని... సమానత్వంలేని..... అరాచకత్వం! స్వేచ్ఛ పేరుతో జనించిన విశృంఖలత్వం! అసలు ఈ అరాచకత్వం మనదేశంలో ఇలా కొనసాగుతున్నంత కాలం..... తాము ఏ స్వేచ్ఛనీ, ఏసమానత్వాన్నీ అనుభవించలేరు.

వాళ్ళు ఆలోచిస్తూనే ఉన్నారు! కొన్నిగంటల తర్వాత ఒక నిర్ణయానికి వచ్చారు! ఆ రోజు క్లాసులోంచి బయటికి వెళ్తూ అరుణ మేడమ్ చెప్పిన హితవు గుర్తొచ్చి...ఆ లక్ష్యసాధనకై ఉడతా భక్తిగా తమవంతు కర్తవ్యం నెరవేర్చుకోవడానికి..... ఒక సంఘటితశక్తిగా రూపుదిద్దుకోవడానికి. (అమృతలత, అన్‌రెస్ట్, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 9-10-'89, పే 152-160)

ఉపాధ్యాయుడెన్నటికీ స్వతంత్రుడేనన్న సందేశాన్నిచ్చిన రచన 'విముక్తి'. ఉన్నత వ్యక్తిత్వంకలిగిన ఉపాధ్యాయులెన్నటికీ అవమానాలను సహించరని, తమదైన వ్యక్తిత్వాన్ని నిలుపుకునేందుకు సాహసిస్తారని ఇందులో రుజువుచేస్తారు.

సదరు శర్మ ఆ ఫ్లూరి పరిషత్ పాఠశాలలో తెలుగుపండితుడు. పాఠాలు మహా పసందుగ చెప్పేవాడు. బోధనలో సమాసాలు చొప్పించేవాడు. శ్రావ్యంగా పద్యాలు ఆలపించేవాడు. వ్యాకరణం ఏ భాగానికాభాగం విడగొట్టి మరీ విశదీకరించేవాడు. అయితే ఆయన క్లాసంటే విద్యార్థులెక్కువమంది ఇష్టపడేవారు కారు. కారణం ఆయన తరగతంతా కలియజూస్తూ వేయికళ్ళతో ప్రతివానిని గమనించేవాడు. ఎక్కడైనా అలక్ష్యం కంటబడితే అదలించేవాడు. అల్లరినేమాత్రం సహించేవాడు కాదు. పైగా మధ్యమధ్య ప్రశ్నలేసి సమాధానం వచ్చేవరకు సతాయించేవాడు. సబ్జక్టులో వెనుకబడిన వారిని రకరకాలుగా దుయ్యబట్టేవాడు. ఒకోసారి చాలా ఘోరంగా కించపరిచేవాడు. అలా జరుగుతున్నప్పుడు అవతలివాడు ఎంతబాధ అనుభవిస్తున్నా లెక్క పెట్టేవాడు కాదు. (షేక్ మస్తాన్‌వలీ, విముక్తి, విపుల, జూన్'83, పే 120-130)

### ఉపాధ్యాయులు -- సామాజిక వైరుధ్యాలు :

ఉపాధ్యాయుల్లో అందరూ ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని కలిగి ఉంటారనికానీ, అందరు అవినీతిపరులుగా ఉంటారనికానీ చెప్పలేము. ఇటువంటి విభిన్న స్వభావాలు కలిగిన వేరువేరు వ్యక్తుల భిన్న ఆలోచనల మధ్య ఏర్పడే సంఘర్షణలను చిత్రించే రచనలుకూడా సాహిత్యంలో కనిపిస్తాయి. ఇంకా ఒకే వ్యక్తి ఒక సమయంలో ఉన్నతుడుగా కీర్తింపబడి, మరోసమయంలో దూషణకు

గురికావటం వెనుక వ్యక్తి ఔన్నత్యం కంటే సామాజిక పరిస్థితులు వ్యక్తిని నియంత్రించడమే మూలకారణంగా ఉంటుందన్న వాస్తవాన్ని అనేక రచనలు ప్రతిబింబించాయి. ఇలాంటి వైరుధ్యాలను ముందుంచిన రచన 'అవార్డు'

"అయ్యా... నాకు ఒంట్లోబాగులేదు. సి.ఎల్ పెట్టుకుందామంటే ఈయన ఈయకోడు. మెడికల్ లీవు పెట్టుకుందామంటే నా లీవు అక్కౌంటు ఒప్పుకోదు." అని చెప్పాను కమీష గొంతుతోనే.

మిన్నాటి ఎక్స్‌ప్లనేషన్ అర్జెంటుగా వచ్చింది. దాంతోపాటే ఏనాడో నేను పంపుకున్న ప్రపోజల్సు ఆమోదిస్తూ సెప్టెంబరు అయిదవ తేదీన హైద్రాబాదు రాజభవన్‌లో జరిగే ఉపాధ్యాయ దినోత్సవానికి హాజరై ఉత్తమ ఉపాధ్యాయ బహుమతి గ్రహించవలసిందిగా కోరుతూ ఆహ్వానం కూడా వచ్చింది. (కొడవంటి కాశీపతిరావు, అవార్డు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 30-1-'85, పే 27)

భిన్న మనస్తత్వాలుగల వ్యక్తుల మధ్య ఏర్పడే సంఘర్షణలను చిత్రించిన రచన 'అభినందన' ఒక ఉత్తమ ఉపాధ్యాయుడు, ఉత్తమ విద్యార్థిని ప్రోత్సహించేందుకు చూపిన చొరవ ఆదర్శవంతంగా కనిపిస్తుంది.

నిజంగా ఎవరైనా కష్టపడి చదివి, కాపీ చేయకుండా పాసవుతే వాడిని మనసారా అభినందించాలి. ఈ తలపురాగానే బాలయ్య కళ్ళలో మెదిలాడు. బాలయ్య ఎవరిదగ్గరా ట్యూషన్ చెప్పించుకోకపోయినా వెరీ ఇంటలిజెంట్ స్టూడెంట్ అని ఆనోటా, ఈనోటా విన్నాను. బాలయ్యమీద నాకు ప్రత్యేక అభిమానం ఉంది. అతను చాలా పేదవాడు. తండ్రి ఒంటెద్దుబండిని బాడుగకు తోలుతుంటాడు. బడి సమయంలో తప్ప బాలయ్య ఎప్పుడూ తండ్రికి తోడుగా ఉంటాడు. ఎన్నో మార్లు నేను బాలయ్య బరువైన బస్తాలను బండిపైకి మోస్తున్నప్పుడు, బండిపైనుంచి కిందికి మోస్తున్నప్పుడు కళ్ళారా చూశాను. బాలయ్య మీద అభిమానముండటానికి మరో కారణం ఉంది. నేను కూడా చిన్నతనంలో బాలయ్యలాగే మా నాన్నగారి వెంట సహాయంగా వెళ్ళేవాణ్ణి. మా నాన్నగారు బండితో బాడుగకు ఇటుక, రాళ్ళు, మన్ను, ఇసుక కావలసిన వారికి చేరవేసేవారు. బాలయ్య కూడా పెద్దయ్యాక నాలాగే ఒక స్థాయికి రావాలని మనసారా కోరుకునేవాణ్ణి. "అక్రమ మార్గంలో, కాపీ, అర్థబలాల ద్వారా ఉన్నతులవుతారు. చేతకానే ప్రబుద్ధుల వల్ల దేశానికి ఎంతో నష్టం జరుగుతుంది. అలా జరగకుండా నీలాగా విజయుడిగా పైకివచ్చేవారు దేశానికి ఎంతో అవసరం. అందుకే నిన్ను ప్రోత్సహించడానికి వచ్చాను...'నిన్ను' గుర్తించే వచ్చాను. ఆశీర్వదిస్తాను..." అంటూ బాలయ్యకు అభయమిస్తున్నట్లు భుజంమీద చేయివేసి కుదిపి తిరుగుముఖం పట్టాను. (ఎమ్మెల్యే నాజీ, అభినందన, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 10-1-'90, పే 36-38)

మిగిలిన రంగాల్లో మాదిరిగానే విద్యారంగంలోకూడా మంచి, చెడుల మధ్య నిరంతర ఘర్షణ జరుగుతూనే ఉంటుంది. ఉపాధ్యాయుల్లో ఈ రెండువర్గాలకుమధ్యకూడా ఇటువంటి ఘర్షణే అనుక్షణం చోటుచేసుకుంటూ ఉంటుంది. ఇందులో

పరిస్థితులనుబట్టి ఎవరోఒకరు విజయం సాధిస్తూ ఉంటారు. తన అవినీతికి అడ్డుగా నిలిచిన ఓ ఉత్తమ ఉపాధ్యాయుని బలితీసుకున్న ఉపాధ్యాయుని కథే 'దీపక్రిందనీరు'

"ఫామిలీ టౌన్లోనే ఉంటున్నారు. ఇక్కడ ఎలా బ్రతగ్గలం చెప్పండి? పిల్లల చదువులు సాగవు. నేనేమో వారంరోజు లీక్కుమంటే పదిరోజులు ఇంటికెళ్ళిపోతాను. ఇక్కడ పిల్లలెవ్వరూ బడికిరారు. వాగులవెంట, అడవుల్లోనూ తిరుగుతుంటారు. లేదా కట్టెలు కొట్టుకోడానికో, చింతబొట్లలు, విప్పపువ్వు, కుంకుండుకాయల్లాంటివి ఏరుకోడానికో వెళ్ళిపోతూ ఉంటారు. ఏదో ఇలా రోజులు దొర్లించేస్తూ ఉన్నాను" అంటూ ఎవరినో పిలవడానికన్నట్లు బయటికెళ్ళిపోయాడు సత్యం.

"మీ విద్యార్హతలు చూసిన జనం మీకు బాలామణి లాంటి క్షుద్రవిద్యలు తెలుసుననుకొంటున్నారు. ఇప్పుడు మీరే కన్నతల్లిమీద మీ విద్యలను ప్రయోగించారని అంటున్నారు. కన్నది చచ్చిపోయిందంటే!"

"మాస్టారూ! ఇది న్యాయమేనా? మీకు తెలీదూ?" గొంతులో దుఃఖం సుడితిరుగుతుండగా అన్నాడు వామన్రావ్.తెలుసు మాస్టారూ! నాకు తెలుసు. మరి వాళ్ళకేంతెలుసు? వాళ్ళు మూర్ఖులు. మనమిప్పుడేంచెప్పినా వినిపించుకునే స్థితిలో లేరు. దయచేసి నామాటవిని త్వరగా ఇక్కడ్నుంచి వెళ్ళిపొండి."

సత్యం గొంతులో ధ్వనిస్తున్న ప్రమాదాన్ని గుర్తించిన వామన్రావ్ మారుమాట్లాడకుండా బడినీ - బడిలో పిల్లల్నీ ఆప్యాయంగా ఒక్కసారి పరికించి చూసి బయటికి నడిచాడు. చాలా దూరం వెళ్ళి వెనుదిరిగి చూశాడు వామన్రావ్.నీళ్ళు నిండిన అతని మసక కళ్ళకి కుళ్ళు నవ్వు నవ్వుతున్న సత్యం మాస్టారు మాత్రం కనిపించలేదు! (అప్పచైతన్య, దీపక్రింద నీరు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 9-8-'89, పే 69-72)

నేడు ఉపాధ్యాయరంగంలో పనిచేసేందుకు అనుకూలమైన పరిస్థితులను ఏర్పాటుచేసుకోవటం ఉత్తమ ఉపాధ్యాయులు ఎదుర్కొనే ఓ ప్రధాన సమస్య. పరిస్థితులను తనకు

అనుకూలంగా మలచుకోగలగటం కత్తిమీద సాములాంటిది. ఇందులో ప్రధానమైన అడ్డంకి ఉపాధ్యాయులే కావటం ఒక విచిత్రమైన పరిస్థితి. ఈ స్థితిని చిత్రించిన రచనే 'అతడు జయించాడు'

"ఇదేం పేరోయ్! సరి సర్లే! పేరు ముఖ్యంకాదు. చదువెలా చెప్పావన్నది ముఖ్యం. పూర్వం ఋషులూ, సద్బ్రాహ్మణులూ విద్యాబోధన చేసేవారు. గురుశిష్యులిద్దరూ కూడా అదో తపస్సులా భావించేవారు. ఆ కాలమూపోయింది. ఆ చదువులూ పోయాయి. విష్వక్సేనుడు అని పలకలేని వాళ్ళుకూడా ఉపాధ్యాయులే! నిన్ను గురించి అనటంలేదోయ్! లోకం సంగతి చెబుతున్నా. ఇక ఈ పిల్లరాక్షసులున్నారు చూశావూ.... వీళ్ళకి చదువులకన్నా ఆటలూ, అల్లరీ ఇష్టం. వీళ్ళ తల్లిదండ్రులకేమో వీళ్ళని పనిలో ఒంగబెట్టేద్దామన్న ధ్యాసెక్కువ. ఇకచదువేం సాగుతుంది. నామొహం! అందుకే నానాకాలం చదువులైపోయాయి..."

"మనకిచ్చే జీతాలకి మరీ ఇంతగా ఒళ్ళొంచి పని చెయ్యక్కర్లేదోయ్!"

"కాన్వెంట్లో ఇంతకంటే తక్కువ జీతానికి ఇంతకంటే ఎక్కువ పనిచేయాల్సి వచ్చేది. మాస్టారూ!"

"అది ప్రైవేటు మేనేజిమెంటోయ్! వాళ్ళు జలగల్లా పీల్చేస్తారు. అలా ఇక్కడ పీలుస్తానంటే మనం ఊరుకుంటామా? మన ఫెడరేషన్ ఊరుకుంటుందా?"

"అక్కడ పనిచేసేవాటికన్నా మనకి సౌకర్యాలెక్కువగా ఉన్నాయి. ఉద్యోగ భద్రత ఉంది. అయినా ఫలితాల విషయంలో క్రమశిక్షణ విషయంలో ఇక్కడెంతో హీనంగా ఉంది."

"నీదే కాదు. నాదీ అదే వృత్తికదా! నాలాగా తామరాకుమీది నీటిబొట్టులా ఉండొచ్చుకదా! వియ్యన్నా! సిద్ధాంతాలు వేరు, జీవితం వేరు. వాటిని మన మార్గానికి అడ్డురానివ్వకూడదు. నీగురించి సర్పంచ్ ఎంత మండిపడుతున్నాడో నీకు తెలీదు...."

"నేను అట్టడుగు వర్గంనుంచి వచ్చాను. కష్టాలూ, కన్నీళ్ళూ, ఛీత్కారాలమధ్య పెరిగాను. అర్థాకలితో, చిరిగిన దుస్తులతో ఎదిగాను. అవమానాలూ, అవహేళనలూ, వ్యంగ్యోక్తులూ చవిచూస్తూ ఈ స్థితికొచ్చాను. నాలాగే నావాళ్ళంతా విద్యావంతులవ్వాలని, ఆర్థికంగా ఉన్నతస్థితికెదగాలని నా తపన. అప్పుడుగానీ వారి సాంఘిక బంధనాలు తెగవని నా తాపత్రయం. అందుకే ఆఫీసు ఉద్యోగాన్నికూడా కాదని ఈ వృత్తిలోకొచ్చాను. ఇది తప్పంటారా మాస్టారూ?" (సింహప్రసాద్, అతడు జయించాడు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 19-4-'99, పే 63-69)

ఉపాధ్యాయుల్లో మరోవర్గం తాము వృత్తిపరంగా న్యాయంచేసినా చెయ్యకపోయినా తల్లిదండ్రులుగా తమ పిల్లలకు బోధించే ఉపాధ్యాయులనుంచి మాత్రం ఉన్నతమైన బోధనను ఆశిస్తారు. వ్యక్తుల్లోని ఈ ద్వైదీభావాన్ని ప్రతిబింబిస్తూ వచ్చిన రచన 'నీకోన్యాయం--నాకోన్యాయం'

"ఆవేశపడకండి. మేడమ్! ఆలోచించండి. మీరొక గంట పాఠం చెప్పడానికి ప్రభుత్వం ఇచ్చే జీతం యాభైకంటే ఎక్కువే. మరి నాకు లభించేది పదికంటే తక్కువే. ఒకటో క్లాసు కుర్రాడికి నాలుగుక్లాసులు కేన్సిల్ చేస్తే దేశభవిష్యత్తు నాశం అయిపోయినట్లు బాధపడే మీరు, డిగ్రీక్లాసులు వరుసగా కేన్సిల్‌చేస్తున్నప్పుడు దేశ భవిష్యత్తు జ్ఞాపకం రాలేదా? ఒకటో క్లాసు పిల్లలేనా భావిభారత పౌరులు? డిగ్రీచదివేవారు భారతపౌరులు కారా? పదిపాఠాలకుగాను మీరు గతసంవత్సరం రెండేపాఠాలు చెప్పారట. మీరు స్టాఫ్‌రూములో కూర్చుని వేడివేడిగా రాజకీయాలు చర్చిస్తారు కాని, క్లాసు తీసుకోరనేది అబద్ధమా? ఆ లెక్కన నేను దొంగనైతే మీరు గజదొంగ కారా?"

జ్యోతి ముఖం చెక్కుతీసిన బీట్‌రూట్ అయింది. హృదయం కుతకుతమంటూండగా -- "డోంట్ టాక్ రబ్బిష్!" అని అరిచింది. సరస్వతి చెక్కు చెదరలేదు. అదే మృదు గంభీరస్వరంతో అంది -- "మా చెల్లి మీ విద్యార్థినే! గత సంవత్సరం మీరు సిలబస్ పూర్తి చేయకపోవడం వల్ల దాని పరీక్షపోయింది. దేశం అంటే మీఅబ్బాయి ఒక్కడేకాదు. దేశమంటే మీరూ, నేనూ, అందరూ! మీ అబ్బాయికి పాఠాలు పోతున్నాయని అంగలార్చడం కాదు. ఏ ఒక్క విద్యార్థికి పాఠాలు పోకూడదు! కాన్వెంట్‌లో తక్కువజీతానికే కట్టుబానిసగా పనిచేశారు. మరి ప్రభుత్వ ఉద్యోగంలో చేరగానే క్లాసులు ఎగ్గొట్టే లెక్చరర్‌గా ఎందుకు మారిపోయారు?" .........

"లెక్చరర్ ఉద్యోగం దొరకడంవల్ల వారంరోజుల క్రితమే ఆమె రిజైన్‌చేశారు. రేపే ఊరువిడిచి వెళ్ళిపోతున్నారు. రిజైన్‌చేసినా, కొత్తటీచర్ని నియమించేవరకూ పిల్లల పాఠాలు పోకూడదని ఉత్తపుణ్యానికి వచ్చి పాఠాలు చెబుతున్న ఆమె మీద ఏం చర్య తీసుకోవాలో, ఇప్పుడు చెప్పండి, మేడమ్!" (ప్రఫుల్లచంద్ర, నీకోన్యాయం-నాకోన్యాయం, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 7/13-9-'94, పే 64-65)

***ఉపాధ్యాయ విద్యార్థి సంబంధాలు :***

ఉపాధ్యాయ విద్యార్థి సంబంధాలు విద్యా విధానంలో ప్రధానపాత్ర వహిస్తాయి. ఈ సంబంధల్లో చోటుచేసుకునే ఆత్మీయతలను, అంతరాలను సాహిత్యం వివిధరూపాల్లో చిత్రీకరించింది. ఉపాధ్యాయుని ఉన్నత వ్యక్తిత్వానికి ఒక అధమ విద్యార్థి చెప్పిన వక్రభాష్యం 'ఉన్నారు

ఇలాంటివాళ్ళూ'

"వద్దు. మీరెవరూ నావెంట రావద్దు. విద్యార్థికీ, ఉపాధ్యాయుడికీ మధ్య ఎలాంటి విరోధభావానికీ తావులేదు. అతనేదో కుర్రతనపు ఆవేశంలో అలా అన్నాడని మనంకూడా అతడిలా చేయగలడని భయపడితే ఎలా? అయినా ఒక ఉపాధ్యాయుడిగా నాబాధ్యత నేను నిర్వర్తించాను. ఆ బాధ్యత నిర్వర్తించడంలో నాకేమీ స్వార్థంలేదు. అతనంటే ద్వేషమూలేదు. అతనైనా ఏదో ఆవేశంలో అలా అన్నాడేకాని ఈ పాటికి ఆలోచనకు లోనయ్యే ఉంటాడు. ఆలోచన వివేకాన్ని పెంచుతుంది."

తెలిసీ తెలియని ఈ వయసులో, అర్థంలేని ఆవేశంతో కుర్రాడుచేసే పనికి మనమూ ఆవేశపడి వారిని శిక్షించడం ద్వారా వారిలో మార్పును తేలేం. మంచితనంతోనే వారి మనసును జయించాలి. వారిని మంచి మార్గంవైపు మరల్చాలి. ఒక ఉపాధ్యాయుడిగా ప్రతి ఒక్కరినీ ఒక సానపట్టిన వజ్రంగా దేశానికి సమర్పించవలసిన బాధ్యత ఉన్న నన్ను నాచేతులతోనే ఒక మంచి వజ్రాన్ని పాడుచేసానో గ్రహపాటునో చెయ్యికోసిందని ముక్కలు చేయమంటావా."

చేతులెత్తి నమస్కారం చెయ్యాలనిపించింది నాకు. ఇలాంటివాళ్ళు ఇంకా ఉన్నారా అన్పించింది.

"సత్యం మాష్టారు నన్ను కాకాపట్టాలని చూస్తున్నాడు. అందుకే ఇలా చేశాడు"

విన్నాడుగా. అప్పుడనిపించింది నాకు 'ఉన్నారు ఇలాంటివాళ్ళూ' అని. (కర్నేని వెంకటకృష్ణారావు, ఉన్నారు ఇలాంటివాళ్ళూ!, యువ, ఏప్రిల్ '88, పే 115-120)

ఉత్తమ ఉపాధ్యాయునికి, ఉన్నత వ్యక్తిత్వంగల విద్యార్థికి మధ్యగల సంబంధంలోని ఉదాత్తతను చిత్రించిన రచన 'మన్నించండి మాష్టారూ!'

"పదిహేను ఏళ్ళక్రితం -- వేసవిసెలవుల్లో మా తాతగారి గ్రామం వెళ్ళాను. ఆయనోక పెద్ద భూస్వామి. ఆరోజున ఆయన సేవకులు కొందరు ఒక యువకుడిని కొరడాలతో కొడుతున్నారు. కాళ్ళతో తన్నుతున్నారు. పిడికిళ్ళతో గుద్దుతున్నారు. ఆ యువకుడు బాధతో విలవిలలాడిపోతున్నాడు. ఒంగలు మట్టుకుపోతున్నాడు. వంటిమీద బట్టలు తెలుతున్నాయి. నల్లని శరీరంమీద ఎర్రగా రక్తం తొంగిచూస్తోంది. అయినా విచిత్రం ఏమంటే-- ఆ యువకుడు ఏడ్వటంలేదు. ఎవరినీ ప్రతిఘటించలేదు. కాళ్ళా, వేళ్ళా పడలేదు.

ఇంతకూ అతడు చేసిన నేరం ఏమిటి? మా తాతగారి పొలంలోని నూతినీళ్ళు చేదుకుని తాగడం!

దెబ్బలు తిని, తిని, స్పృహ కోల్పోయేముందు గభాలున లేచి, శక్తినంతా కూడదీసుకుని మా తాతగారిదగ్గరకు మెరుపులా లంఘించి వచ్చి దభీమని నేలకొరిగాడు. ఒరిగిపోతూనే చటుక్కున తలఎత్తి చూసాడు. ఆ చూపులో శాపం ఉంది. ఉక్రోషం వుంది. నిస్సహాయత వుంది. తీవ్రత ఉంది....." అని కాసేపు ఆగి " ఆ తీవ్రతతో పోల్చితే నీ తీవ్రత ఎంత అని ఆలోచిస్తున్నా బాబూ! అతడు పొందిన అవమానంలో నీ అవమానం ఏమాత్రం! అతని ఆక్రందనలో నీ ఆక్రందన శాతం ఎంతని ఆలోచిస్తున్నా బాబూ" శాంతంగా అని సోఫాలో వాలిపడి కళ్ళు మూసుకున్నాడాయన. ఇంకేమీ అనలేదు. ఆయన ముఖంలో విషాదం అలుముకుంది.

తలతిరిగిపోతోంది కొంతసేపు నాకు. ఆ మాట గుచ్చి, గుచ్చి అడుగుతున్నట్టుగా ప్రశ్న: ఎప్పుడో, ఎవరో తాతముత్తాతలు చేసిన తప్పుకు మేం శిక్ష అనుభవించాలా?

"జానకిరామయ్యగారి కుటుంబానికి సాయంచేయలేకపోతే మానవత్వం అనే మాటకే అర్థంలేదు. నా ముందుగావే వున్నారు. ఇన్నేళ్ళకాయన ఇలా నా ముందు ప్రత్యక్షం కావడం నాకెంత సంతోషంగా ఉందో తెలుసా? పదిహేనేళ్ళక్రితం నాలో సైతాన్ ప్రవేశించాడు. నాది తెలిసీ తెలియని వయస్సు. మాష్టార్లలోనూ స్వార్థపరులుంటారని తెలియదు. స్వార్థంకోసం వాళ్ళు వైషమ్యాలు తేవడానికి కూడా వెనుదీయరని తెలియదు. అలాంటి స్వార్థపరుల బోధనవల్ల నా కళ్ళకు పొరలు కమ్మాయి. హృదయానికి మసకతెరలు పట్టాయి. నేను భయంకర అగాధంలో కూలిపోయేలోగా మాష్టారి క్షమాగుణం నా కంటిపొరల్ని తొలగించివేసింది. మనసుతెరల్ని కరిగించివేసింది. నేనప్పుడు ఆయనకు క్షమాపణ చెప్పుకోలేకపోయాను. ధైర్యం చాలక.... కాని ఇప్పుడు నేనొక మనిషిగా మారాను. క్షమాపణ చెప్పుకునే అర్హతను, ధైర్యాన్ని సంపాదించుకున్నా. మాష్టారు నన్ను గుర్తించనేలేదు. పదిహేనేళ్ళలో ఆయన కొంచెమైనా మారివుంటారా-- అని పరీక్షించడానికే అలా నటించాను. నా పిచ్చిగాని, ఆయనను పరీక్షించడానికి నేనెంతటివాడను! ఆయన కొంచెం కూడా మారలేదు. ఎంత కష్టించినా ఆయనకు కోపంరాదు. కోపం బదులుగా ఆయన స్వరంలో జాలి కురుస్తుంది. ఖేదం పలుకుతుంది. సమాజం నిండుగా వికటాట్టహాసం చేస్తున్న అవినీతి పిశాచాలమధ్య ప్రభావితం కాకుండా దృఢంగా నిశ్చలంగా వెలుగుతున్న న్యాయజ్యోతి ఆయన. ఆ జ్యోతి ఆరిపోకుండా కాపాడుకోవలసిన బాధ్యత నాకుంది. (ప్రఫుల్లచంద్ర, మన్నించండి మాష్టారూ!, యువ, జూన్ '82, పే 119-127)

మాష్టారి ఉత్తమ వ్యక్తిత్వానికి పిల్లల హృదయస్పందన ఎలాఉంటుందో చిత్రించిన రచన 'అరుగరుగో సుబ్బయ్య మేష్టారు--'.

సాయంత్రం వందమంది పిల్లలు, రెండుచేతులా గడ్డి కోసుకుని సుబ్బయ్య మేష్టారి ఇంటికెళ్ళారు. ముందు ఖాళీ స్థలంలో గేదెముందు దిగులుగా కూర్చున్న మేష్టారు కన్పించారు. ఎవరూ ఏమీ మాట్లాడలేదు. తెచ్చిన గడ్డి గుట్టగా గేదెముందు పోశారు. గేదె ఆబగా తింటోంది. సుబ్బయ్య మేష్టారు కదిలిపోయారు. " ఒరే అయ్యలూ! నాకోసం ఇంతదూరం వచ్చారా!

పొద్దుట్నుంచీ కాళ్ళూ,చేతులూ ఆడ్తంలేదురా! అన్నం సయించలేదు. నాకు ఒక్క సాయం చేయండ్రా! ఇంటికి వెళ్ళిపోతూ పోతూ నాచేత ఒక్క లెక్క చెప్పించుకు వెళ్ళండ్రా-- చాలు" అన్నారు. "తప్పకుండా" అన్నారు పిల్లలు.

గదివైపు తిరిగి అన్నారు మేష్టారు. " వీకు చక్కటి పచ్చగడ్డి తింటే ఆకలి తీరుతుంది. నాకు పిల్లలకి ఒక్క పాఠంచెప్తే కడుపు నిండుతుంది. (సత్యం శంకరమంచి, అడుగడుగో సుబ్బయ్య మేష్టారు--, అమరావతి కథలు, పే 371-373)

ఉపాధ్యాయ విద్యార్థి సంబంధాల్లో మూడవకోణాన్ని చిత్రించిన రచన 'ఆచార్యదేవోభవ'. విద్యార్థి తనను మించినవాడౌతాడనే భయంతో శిష్యునికి విద్యనందించని ఓ కుసంస్కారిని కూడా తన దైవంగా భావించిన ఉత్తమ వ్యక్తిత్వం కలిగిన విద్యార్థి ఉన్నత సంస్కారాన్ని ఈ రచన మనముందుంచుతుంది.

తన విద్య తన పిల్లలకే రాలేదు. ఒక అనామకుడికి తన విద్య దానంచేసి, వాడు సంగీతంలో తనని మించిపోవడం అతడి కెంతమాత్రం ఇష్టంలేదు. అందుకే సతీష్ కి సంగీత విద్య పూర్తిగా చెప్పలేదు.

"పూజ్యులైన గురువుగారికి నమస్కారములు.

మిమ్మల్ని వదిలివెళ్లడం నాకు చాలా బాధగా వుంది. నన్ను చేరదీసి, నాకు నాలుగు అక్షరంముక్కలు నేర్పిన మీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేనిది. ఇంకా మీకు భారంగా ఉండడం ఇష్టంలేదు. నా బ్రతుకు నేను బ్రతకాలనే ఈ ఇంటినుండి దూరంగా వెళ్ళిపోతున్నాను. మీతో చెప్పివెళ్తే, నన్ను పంపడానికి మీరు ఒప్పుకోరేమోనన్న భయంతో, ఇంత సాహసానికి పూనుకున్నాను. మీ మనసుకి బాధ కలిగిస్తున్నందుకు క్షమించమని అడుగుతున్నాను.

ఇట్లు

సతీష్!"

స్టేజీ మీద కూర్చున్న సతీష్ ఒక్కసారి గొంతు సవరించుకొని, "నేను ఈనాడు మీఅందరి మన్ననలు అందుకుంటున్నానంటే దానికి కారణం మా గోపాలరావు గురువుగారు. ఆయనకి నేను ఆజన్మాంతం ఋణపడి ఉంటాను. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అన్నారు పెద్దలు. కానీ నాకు తల్లీ, తండ్రీ, గురువూ, దైవం అన్నీ ఆయనే! నాకు ఈ సంగీత విద్య నేర్పిన ఆది గురువు ఆయన. ఆయనకి సభాముఖంగా నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను" అని ముగించాడు. (ఎమ్.ఉమాశాస్త్రి, ఆచార్యదేవోభవ, యువ, జనవరి '87, పే 92-99)

తన శిష్యులనుండి తనకు లభించే గౌరవాదరాలు ఉపాధ్యాయునికి తనవృత్తిపట్ల ఎటువంటి అభిమానాన్ని కలుగచేస్తాయో ఒక సంఘటనను భూమికగా చేసికొని చిత్రించిన రచన 'తాను వెలిగించిన దీపాలు'

రైల్వే కంపార్టుమెంట్లో ఎదురుబొమ్మల్లో కూర్చున్న వాళ్ళందరినీ పలకరిస్తున్నారు శర్మగారు. రంగసముద్రంలో లభ్యంకాని ఆతిథ్యం తనకు తమ్ములకోవల్లో లభ్యంకావడం ఎంత ఆశ్చర్యకరమైన విషయం! కానైతే ఆశ్చర్యానికి మూలకారణం అజ్ఞానమేనేమో! నిజానికిందులో ఆశ్చర్యపడవలసిన అవసరమేమీ లేదనిపిస్తుంది. దేశమంటే మట్టికాదనీ, మానవులనీ వివరించాడు కవి. అలాగే పాఠశాల అనగా ఇటుకలతోనూ, సిమెంటుతోనూ రూపొందించిన భవనాల సమూహం కాదు. పాఠశాల అనగా విద్యార్థులు. సుక్షేత్రంలో పడిన బీజంలా, శుక్తిలో పడిన స్వాతి చినుకులా విద్యార్థులపైన వెచ్చించిన శ్రమ చరితార్థం కాక తప్పదు. కోట్లకొలది మానవుల్లో ఉపాధ్యాయుడు కూడా ఒక్కడు. కానీ అతనిదొక మహోద్యమం. లేలేత మెదడులలో విజ్ఞానజ్యోతులను వెలిగించి భావికి బంగారుబాటలు తీర్చిదిద్దే ఉపాధ్యాయుడు తానొక అఖండ జ్యోతిలాంటివాడు. ప్రకాశంలో తగ్గుదల ఏర్పడకుండా జ్యోతి తనలాంటి జ్యోతులు ఎన్నింటినైనా సృష్టించగలదు. మర్యాదలూ, సన్మానాలూ, ఆర్థిక విజయాలూ -- జీవిత సార్థకతను నిర్ణయించే కొలబద్దలు కావు. అవి పైపై మెరుగులు. ఛాయాచిత్రాల మాటకేమి! అవి ఆవిష్కరింపబడవచ్చు, కాలక్రమాన బహిష్కరింపబడవచ్చు. కాని మనోఫలకాలపైన గాఢంగా హత్తుకుపోయిన ప్రతిబింబాన్ని మాత్రం ఎవ్వరూ చెరిపి వేయలేరు......

శర్మగారు స్వస్థలానికి తిరిగి వెళ్ళగానే మనవరాల్ని పిలిచారు. దగ్గరగా కూర్చోబెట్టుకుని ముంగురుల్ని సవరిస్తూ " చూడుతల్లీ! నీకిప్పుడు పదిహేనేళ్ళు. నీ పెళ్ళికిప్పుడు మించిపోయిందేమీలేదు. ఇంత చిన్నవయస్సులో నువ్వు సంసారభారాన్ని మోయలేవు. ఈ రోజే నేను అప్లికేషను వ్రాసి పడేస్తున్నాను. నువ్వు ట్రెయినింగు స్కూల్లో చేరు. పిల్లలు భగవత్స్వరూపులు. వాళ్ళ మధ్యన ఉండడమే భగవత్సాన్నిధ్యంలో వున్నట్టు. అంతకంటే ఆనందకరమైన వ్యాసంగం మరొకటి లేదు." అన్నారు. (మధురాంతకం రాజారాం, తాను వెలిగించిన దీపాలు, జీవితానికి నిర్వచనం, పే 92-100)

ఉన్నత సంస్కారంగల ఉపాధ్యాయునికి, ఉత్తమ వ్యక్తిత్వంగల విద్యార్థికి మధ్య ఏర్పడే అనుబంధం లోని గాఢతను చిత్రించిన రచనగా 'శివరంజని' నిలుస్తుంది.

"మీరు అడగకుండానే చెబుదామనుకుంటున్నానండీ! అమ్మాయి ఆసక్తి చూస్తున్నాను. విద్యయందు ఆసక్తి ఉన్న వాళ్ళకి చెప్పకపోతే మహాపాపం! విద్యాధిదేవతకి అపచారం చెయ్యడం అన్నమాట. నాకు సొమ్ముతో పనిలేదు. తీరుబడి

లేకపోయినా ఎలాగో వీలుచూసుకుని వస్తాను! అన్నారు శంకరం మేష్టారు.

రమ కళ్ళుమూసుకుని వాయిస్తోంది.

చెంపలమీదుగా కన్నీళ్ళు ప్రవహిస్తున్నాయి. నాగస్వరం వింటున్న నాగుపాముల్లా తలలూపుతున్నారు సభ్యులు. ఇవేమీ రమకు తెలియవు. కొంతసేపటికి రాగం ఆగింది. ఫిడేలు కిందపెట్టి కళ్ళు తెరిచింది.కళ్ళుతెరిచింది రమ!

తనకు... ఎదుట.... మేష్టారు!!

తేరిపారచూసింది రమ. తలమీదుగా అదే రుద్రాక్షరంగు కండువా కప్పుకుని మొదటి వరుసలో కూర్చున్నారు. "నీ శివరంజని విని వచ్చానమ్మా!" అన్నారు నవ్వుతూ శంకరం మేష్టారు. రమ చేతిలోని కమాను తెలియకుండా క్రిందపడి పోయింది. (వేముల మీనాక్షి దేవి, శివరంజని, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 1-11-'99, పే 38-47)

**ఉపాధ్యాయులు -- సామాజిక స్పందన :**

విద్యార్థుల విద్యాపరమైన వైఫల్యాలకు ఉపాధ్యాయులనే పూర్తి బాధ్యులనుచేయటం ఒక సామాజిక దుష్పరిణామంగా భావించాలి. విద్యార్థుల అధ్యయన సామర్థ్యాన్నిబట్టే వారి జ్ఞానార్జన ఉంటుందన్న విషయాన్ని భవభూతి ఇలా వ్యక్తం చెస్తాడు.

"వితరతి గురు: ప్రాజ్ఞే విద్యాం యదైవ తథాజడే
నతుఖలుతయో: జ్ఞానే శక్తిం కరోత్యపహంతివా!
భవతిచ పునర్భూయానీ భేద: ఫలం ప్రతితద్యథా
ప్రభవతి శుచిర్బింబోద్గ్రాహే మణిర్నమృదాంచయ:!!

శిష్యుల్లో తెలివిగలవారు, మందబుద్ధులు ఉంటారు. గురువు శిష్యులందరికీ ఒకేవిధంగా పాఠాన్ని బోధించినప్పటికీ వారివారి బుద్ధివిశేషాన్నిబట్టి వారి జ్ఞానం రూపొందుతుంది. మట్టిపెళ్ళకీ, రత్నానికీ ఉన్నతేడాలాంటిదే ఇది. ప్రతిబింబించే శక్తి మణిలో ఉంటుందికానీ మట్టిపెళ్ళలో ఉండదుకదా! అంటారు భవభూతి. అయితే దీన్ని కారణంగాచూపి ఉపాధ్యాయుడు తన సామాజిక బాధ్యతను విస్మరించటం సమంజసంకాదు.

పాఠశాలకు సంబంధించిన వివిధఅంశాల్లో సమాజం భిన్నరీతుల్లో స్పందించటం కనిపిస్తుంది. ఉపాధ్యాయులలో చోటుచేసుకుంటున్న నిర్లిప్తతకు వివిధ సామాజికవర్గాలు ఎలా కారణమౌతాయో చూపించిన రచన 'గొడుగు'

"అవును, నేనూ అదే అంటున్నా -- విద్యావిధానంలోని లోపాలన్నిటికీ ఉపాధ్యాయుడికే నిందలూ, తిట్లూ...... అతడు ప్రత్యక్ష దైవం కాబట్టి! అది పడటానిక్కూడా అతని కార్థికంగానూ సాంఘికంగానూ ఒక స్థాయంటూ లేదుకాబట్టి. అయితే ఆ స్థాయికి దిగజార్చింది మనం. ఉద్యోగాల్లేక ఎక్కడబడితే అక్కడ గోనెపట్టాలేసుకుని నాలుగు ప్రైవేట్లు చెప్పుకునే వాలాంటి మొత్తంలో ఏవిటో తెలియనివాళ్ళొకపక్క, అసలే ఇళ్ళెందుకున్నాయో అర్థంకాని లాభనష్టాలు బేరీజువేసే మేనేజిమెంట్లు ఒక వంకా, మంచివింప్లిమెంటు చెయ్యటానికిన్ని గోతులున్నాయని తెలిసికూడా పోస్టర్లమీద వత్తిడితెచ్చే డిపార్టుమెంటు మరోపక్కా, తమ పిల్లల పరీక్షపాసవటం గురించి ఆలోచించినంతగా వాళ్ళ చదువుసాముల గురించి అయుదు నిమిషాలుకూడా ఆలోచించడానికిష్టపడని పేరెంట్లు ఇంకోపక్క ఉపాధ్యాయుల జీవితాన్ని కుక్కలు చింపిన విస్తరిని చేసేసేరు. అంటే తనే.... ఏ భావిభారత పౌరుడే, నక్సలైటవ్వనీ, ఏ విద్యానిలయం ఎలా విలయతాండవాలు చెయ్యనీ అని నిరాశ చెందిపోయి ఏ ఎంత కాగొడుగు పట్టడం నేర్చుకున్నాడు ఉపాధ్యాయుడు," (కొడవంటి కాశీపతిరావు, గొడుగు, యువ, మే '84, పే 142-145)

విద్య ప్రయోజనం వెనువెంటనే సిద్ధించేది కాదు కాబట్టి, విద్యారంగంపట్ల, ఉపాధ్యాయులపట్ల సమాజం నిర్లిప్తత వహిస్తుందన్నది ఒక అభిప్రాయం. ఈ కారణంగానే ఉపాధ్యాయుడు సామాజికంగా చిన్నచూపు చూడబడుతున్నాడు. మరో అంశం ఉపాధ్యాయుని ఆర్థికస్థితి. ఆర్థికంగా క్రిందిస్థాయిలోఉన్న వ్యక్తులకు సమాజంనుంచి లభించే గౌరవాదరణలే ఉపాధ్యాయులకుకూడా లభిస్తాయి. ఇలా విభిన్న అంశాలను ప్రతిబింబించిన రచన 'జాతిరత్నం'.

నా భార్యకు నేను ఉపాధ్యాయ వృత్తిలో ఉండటం ఏమాత్రం యిష్టంలేదు. కారణం దీనిలో ఏమాత్రం సంపాదనలేదు. ఆ వచ్చే జీతంరాళ్ళుతప్ప మరో ప్రక్క ఆదాయం లేదు. నేటి సాంఘిక స్థితి అలా ఉండబట్టేకదా! కట్టుకున్న పెళ్ళానికి కూడా

ఉపాధ్యాయుడు లోకువ అయిపోయాడు. భావి పౌరుల మెదళ్ళలో విజ్ఞాన దీపికలు వెలిగించి జాతికి అందించే ఉపాధ్యాయుడు అందరికీ లోకువే. కారణం - వాడివల్ల అర్జంటు ఫైల్సు ఏవీ కదలవు. తన మూలంగా ఎవరికీ రావలసిన డబ్బు ఆగిపోదు. తన సంతకం లేకపోతే 'ఫలానావాలోను' సాంక్షన్ కాదనే బాధలేదు. 'ఫలానా బిల్లు' క్యాష్ కాదనే సమస్యలేదు. చదువు వలన కలిగే ఆకస్మాత్తు ప్రమాదము లేదు -- అర్జంటు ఉపకారము లేదు. వేగంగా సాగే ఆర్థిక లావాదేవీలేవీ ఉపాధ్యాయుడి మీదుగా సాగేవికావు. అందుకే ఉపాధ్యాయుడితో ఎవరికీ అవసరం లేదు. అనుకోవటంలో అతిశయోక్తిలేదు. చివరకు కట్టుకున్న భార్యకూడా. (తమ్మినేని అక్కిరాజు, జాతిరత్నం, ప్రజాసాహితి, డిశంబరు'82, పే 36-43)

ఉపాధ్యాయులపట్ల సమాజానికిగల చులకనభావాన్ని చిత్రిస్తూనే సమాజంలో ఉత్తమఉపాధ్యాయుని వ్యక్తిత్వాన్ని ముందుంచిన రచన 'బతికున్న నిజాయితీ' ఇందులో విద్యపట్ల సమాజంలో చోటుచేసుకున్న విభిన్న స్పందనలు కనిపిస్తాయి. హేళనాపూర్వకమైన స్పందన గ్రామస్తులనుంచి లభించగా, ఉపాధ్యాయుని వ్యక్తిత్వాన్ని అర్థంచేసుకున్న వ్యక్తిగా సర్పంచ్‌పాత్ర నిలుస్తుంది.

"ఇంకేమోయ్. ఇంతే గాడెబుర్రలో పడ్డట్టు -- ప్రభుత్వ పాఠశాలలో ఉద్యోగం వచ్చిందన్నమాట" -- ఓ మిత్రుని అనందం. "అయితే కష్టంలేని ఏర్పాటు పంతులు పనన్నమాట. పదినెలల పని, పన్నెండు నెల్ల జీతం." - మండలాఫీసులో గుమాస్తా మిత్రుని వ్యంగ్యం. "నువ్వు పాఠాలు చెప్పినా, చెప్పకున్నా నెలతిరిగేసరికి జీతం నీ చేతుల్లో.... ఉద్యోగాలలో రాజా -- ఈ గవర్నమెంట్ టీచర్ ఉద్యోగం. ఇంకా చెప్పాలంటే బతకనేర్చినవాడే బడిపంతులైనాడు" -- మరో నేస్తం హాస్యం. "మిత్రులారా! మీరన్నదాంట్లో తప్పేమీలేదు. లోకంలోని చాలామంది అభిప్రాయమే మీరూ చెప్పారు. కాని, అందరూ మీరనుకునే లక్షణాలుగల వాళ్ళే ఉండరు. నేను మాత్రం అలాకాను" ఆవేశంగా అన్నాడు తను.

గతంలో ఉపాధ్యాయుడంటే ఎంత గౌరవం, ఎంత అభిమానం, ఎంత ఆప్యాయత కనబరిచేది సమాజం! మరిప్పుడో? టీచర్ అంటే 'టీ తాగి చరించేవాడ'ని. 'టిల్-టిల్' పథకాన్ని కనుగొన్న శాస్త్రజ్ఞుడని. 'బతక నేర్చినవాడే బడిపంతులని'--అలా ఎన్నో కొత్తభాష్యాలు పుట్టుకొచ్చాయి.

ఇక సహనం చచ్చి ఆవేశం, ఆవేదన కట్టలుతెంచుకొంటున్నా కోపాన్ని అణచుకొంటూ- "చూడండి సార్! ఉపాధ్యాయులు కావడం మన అదృష్టం. మనం తీసుకునే జీతంలో శతాంశమైనా న్యాయం చేస్తున్నామా? ఎప్పుడైనా వృత్తిని గురించి ఆలోచించారా? ఎప్పుడైనా గంటకాగానే క్లాసులకు వెళ్ళారా? పాఠాలు ముందే చదువుకొని చెప్పారా ఏ రోజైనా? ఒక్కసారి మనపట్ల విద్యార్థుల భావాలెలా ఉన్నాయో తెలుసుకున్నారా? వారి దృష్టిలో మనకెంత గౌరవం ఉందో తెలుసా? పవిత్రమైన వృత్తిలో ఉంటూ, జీతం తీసుకుంటూ అదే వృత్తిని కించపర్చకండి. సార్! మన డి.ఎ.లూ, పే స్కేళ్ళూ పక్కకు నెట్టి వృత్తిని గురించి ఆలోచిద్దాం, సార్! ఇకనైనా పద్ధతులు మార్చుకుందాం! ప్రజల్లో మనపట్ల ఉన్న చెడుభావనల్ని తుడిచేద్దాం, సార్!" సౌమ్యంగా అనాలనుకున్నా కటువచనం తొంగిచూడక తప్పలేదు.

"మీ మాటలు, మీ ప్రవర్తనలు తప్పని తెలిసినా ఆత్మ వంచన చేసుకుంటున్నారు. ఎంతమంది విద్యార్థులున్నా కనీసం తరగతికి అయిదుమందైనా ... తరగతిలో నిలబెట్టే అయిదు నిముషాలుంటే చాలు. జీతంలో నాలుగో భాగం సార్థకమవుతుంది. పుస్తకాల్లోని పాఠాలు ఏమైనా చెప్పగలిగితే తినే తిండి వంటబడుతుంది. మారని వాళ్ళను చరిత్ర క్షమించదు. ఈ పిల్లలు పెద్దలై శపించకుండా ఉండరు. చరిత్రహీనులవుతారో, చరిత్ర నిర్మాతలవుతారో ఆలోచించుకోవాలి?" గుండెలో మండే బాధ ఇంటిదారి పట్టమంది.

"అందరు తల్లిదండ్రుల్లాగే మీ కొడుకుమీద ఎన్నో ఆశలు పెట్టుకుని ఉంటారు -- డాక్టర్‌నో, ఇంజనీరునో చేయాలని. ఈ ఆధునిక కాలంలో అన్ని పరీక్షలకు ఎంట్రన్స్ అనేది తప్పనిసరి. అందులో నిజమైన ప్రతిభ, తెలివి కలవాడికే విజయం వరిస్తుంది. మరి అలాంటి పరీక్షలకు వెళ్ళే విద్యార్థికి ఇప్పటినుంచే కాపీ కొట్టడం అలవాటైతే అతని భవిష్యత్తు శూన్యం కాదా? మీ కలలు కల్లలు కావా? కాపీకి అలవాటైనవాడు చదవడానికి బద్ధకిస్తాడు. ఉత్సాహం సన్నగిల్లుతుంది. శ్రమనిష్ఠ నీరు కారిపోతుంది. జ్ఞాపకశక్తికి పనిలేకుండాపోతుంది. చివరికి అతని పతనం పరాకాష్ఠకు చేరుకుంటుంది. ఈ చెడును ఆలోచించి మీ అబ్బాయి కాపీ కొడుతుంటే పట్టుకుని చీటీ తీసుకున్నాను. ........... . మీవాడి భవిష్యత్తు ఆలోచించే ఆన్సర్‌పేపర్ లాక్కొని పంపించాను." అన్నాడు.

అప్పుడు సర్పంచ్ ముఖంలో అనూహ్యమైన మార్పువచ్చి కుర్చీలోంచి లేచి చటుక్కున తన చేతులుపట్టుకుని, "సార్! మీమేలు జన్మలో మరువలేను. అసలు పాఠాలు మాత్రమే నేర్పేవాడు కాదు టీచరంటే. పుత్రసమానుడైన తన శిష్యుని భావి జీవితాన్ని గూర్చి ఆలోచించి దారిలో పెట్టేవాడే నిజమైన గురువని తెలుసుకున్నాను. నా ప్రవర్తనకు చింతిస్తున్నాను" పశ్చాత్తాపం ప్రతిధ్వనించింది. (కె.మధుసూధన్, బతికున్న నిజాయితీ, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, సెప్టెంబరు30/6అక్టోబరు --'92, పే 42-45)

మారుమూల పల్లెప్రాంతాలలో పాఠశాల స్థితిగతులను, ఆ ప్రజలకు పాఠశాల పట్ల గల అభిప్రాయాన్ని ముందుంచిన రచన 'వెలుగుసముద్రంలో చీకటిదీవి'

"ఓహో, మేష్టారు గారివా? ఇది మాకు పరిపాటే నాయనా? కూర్చో. ఏడాదికి నలుగురు మేష్టార్లయినా వస్తారు మా ఊరికి. రావటమూ, వెళ్ళిపోవటమూ. అంతేగానీ చదువు చెప్పిన పాపానమాత్రం పోరు. అసలిక్కడ చదువుకోవాలన్న ధ్యాసమాత్రం ఎవరికుంది? అదిగో, ఆ పెట్టెలోనే ఉన్నాయి స్కూలు రికార్డులు. ఆ పెట్టెగూడా స్కూలుదే. అదేగాదు, ఇంకా కుర్చీ ఒకటి, మేజా ఒకటి, ఒక నల్లబల్ల గూడా ఉన్నాయి. అన్నింటినీ తీసుకెళ్ళు. లక్షణంగా చదువు చెప్పుకో....."

తమ బిడ్డలు విద్యావంతులు కావాలని అభిలషించే కుటుంబాలు రంగాపురంలో చాలతక్కువ. చదువనేది విజ్ఞానదేవాగా అమృతంలాంటిదని వాళ్ళకు తెలుసు. కానీ ఈ ప్రభుత్వం మోహినీ రూపంతునుమళ్లే ఆ అమృతాన్ని ఏరికోరి కొందరికే మాత్రమే పంచిపెట్టకుండా అందరికీ సమానంగా పక్షిస్తానంటుందే కర్మ! రంగాపురం వారి ఇంగితాన్ని ప్రభుత్వం పసిగట్టలేకపోయింది. అందుకు ఫలితంగా ఏర్పడినదే ఆ ఊరి బడి. గుర్రాన్ని చెరువుదగ్గరికైతే తీసుకెళ్ళవచ్చుగానీ, దానికి ఇష్టంలేకపోతే నీళ్ళలా త్రాగించగలవు -- అన్నసామెత ఆ ఊరిపట్ల సార్థకమైంది. ఎర్రయ్య, పుల్లయ్య, జోగులు, వెంకటేశు అన్న పేర్లమధ్య విజయభూషణ్, విద్యాసాగర్‌ల వంటి పేర్లు చిక్కటిక్కరించటానికి సమ్మతించక ఘరానా కుటుంబీకులు తమ బిడ్డలను ఏ బంధువుల ఇంటికో, ఏ పట్టణాలకో పంపి చదివించుకుంటారు. ప్రభుత్వం వాడు పెట్టిన బడికి వస్తేగిస్తే ఎల్లయ్యలు పుల్లయ్యలే వస్తారు. వాళ్ళయినా ఎలా వస్తారు? అయ్యవారిపట్ల బలవంతంగానైన వస్తారు.

ఏదో పెన్నిధిని పోగొట్టుకున్న వాళ్ళకుమల్లే పిల్లలందరూ దిగాలుపడి ఎక్కడవాళ్ళక్కడ స్తబ్ధులై కూర్చుని వున్నారు. తల్లి తరువాత వాళ్ళకు ఉపాధ్యాయుడినైనా, చెలికాడినైనా నేనొక్కడినే. ఊరిపట్ల కలిగిన వైముఖ్యంవల్ల ఏమిటేమిటో అనుకున్నానుగానీ ఒక కుర్రవాడి అమాయక హృదయానికి ఆనందాన్ని అందివ్వగలిగినా చాలు. ఎలాంటి బాధలకైనా తట్టుకోవచ్చు. (మధురాంతకం రాజారాం, వెలుగుసముద్రంలో చీకటిదీవి, పాంథశాల, పే 26-40)

అయితే చదువు అవసరాన్ని గుర్తించి, బడిప్రాధాన్యాన్ని కుగ్రామాల్లో సైతం గుర్తించారన్న ఒక వాస్తవాన్ని 'బడి గంట మ్రోగేదెపుడో!' ముందుంచుతుంది. కానీ ఈ ప్రాంతాల్లో పనిచేసే ఉపాధ్యాయులెదుర్కొనే ప్రధాన సమస్య, పోలీసులకు, నక్సలైట్లకి మధ్య చితికిపోవటం. ఈ అంశాన్ని ఇందులో ప్రస్తావించారు.

పిలుపు దగ్గరపడింది. పిల్లలు పరుగులుతీస్తూ ఎదురువచ్చి పోతులెక్కారు. మీటింగు వేదికకు అలంకరించిన రంగురంగుల ముచ్చికాగితాలను ఎవరో పీకరించి వాటిని పిల్లలకిస్తున్నారు. ఆధునిక యుగంలో చదువు అవసరాన్ని గుర్తించి, పని, పాటల్లో సాయందేయగల పిల్లలను పనిమాల బడికి పంపుతున్నారు. రోజుకు నాలుగుపొద్దు బడిగంట మోగుతూనే ఉంది.

ఎవరూ కోర్చినాక పొట్టకూటి విద్యార్థులకోసం ఒకటే అల్పాహారం పెంచింది. భక్తులకోసం ఎదురుచూసే పూజారిలాంటి పంతులు పిలుపు చేసిన పోలీసులకు ఏజెంటుగా పనిచేస్తున్నాడనే అనుమానంతో సంఘపోళ్ళ చేతుల్లో చచ్చిపోయా. అతను అల్పమాత్రం పనిచెప్పినా తిరుగులానే ఉంది. పిల్లలు అల్పాహారానికి కూడా దూరమైపోయారే అనే బాధతో, పిల్లలు కూడా బాలల సంవత్సరాలు జరుపుకొంటారనే ఆశతో. (రాజేంద్రప్రసాద్ పండా, బడిగంట మ్రోగేదెపుడో!, యువ, ఏప్రిల్ '80, పే 162-169)

విద్యపట్ల, ఉపాధ్యాయులపట్ల సామాజిక స్పందనయొక్క మరోకోణం 'జ్ఞానక్షేత్రం'. ఉపాధ్యాయులకు తమ పూర్తి సహాయ, సహకారాలందించిన గ్రామస్తులు, అందుకు వారికి తమబోధనద్వారా ఉపాధ్యాయులందించిన ప్రతిఫలం ఇందులో కళ్ళకుకట్టినట్టు చిత్రించారు. ఉపాధ్యాయుల త్యాగనిరతికి కూడా ఇది తార్కాణంగా నిలుస్తుంది. ఉపాధ్యాయులకు, సమాజానికి సరైన సయోధ్య కుదిరినప్పుడు ఎటువంటి ఫలితాలు లభిస్తాయో ఈ రచన మన ముందుంచుతుంది.

"చదువురాని ఈ దేశంలో అక్షరజ్ఞానమిచ్చేవారు అరుదుగ్గ తినరయ్యా! మనకు వచ్చే కర్మమేమి? మనకు మేడలూ మిద్దెలూ అక్కరలేదు. చదువు చెప్పేవాళ్లే చెప్పిల్లే కొట్లే చోట మనకి స్థానంలేదు. ఎక్కడికయినా వెళ్ళి మనబడి మనమే పెట్టుకుందాం పదండి......" అందరూ ఉత్తరీయాలు దులుపుకు లేచారు. ఎవరో కుర్రాడితో పూరెయుతున్నాం అని ఇళ్ళకు కబురు చేశారు. ప్రయాణమయ్యారు.

"ఇక్కడే బడి" అని సంకల్పించి నాలుగు రోజ్ల కూడలికి వచ్చి నలుగురినీ చేరదీసి ఈ పూళ్ళో స్కూలు స్థాపిస్తామన్నారు. విస్తుపోయారు గ్రామజనులు. మన పూరేమి? ఇంగ్లీషు చదువేమి? ఈ పరగణాలో ఎక్కడా స్కూలులేదే! ఆ రాత్రికి భోజనం ఏర్పాటుచేశారు పంతుళ్ళకి.

ఎక్కడి పుల్లాలో ఎక్కడి పెరిగాలో ఈ గట్టన నిముషాల తల్లిని దింపి పందిలుమంది కుర్రల్ని, వ్యక్తుల్ని చేశారు. ఆ పరగణా అంతా అక్షరకాంతి పండారు. జ్ఞానక్షేత్రం పుష్కలంగా పండుతోంది. ఆ క్షేత్రం చుట్టూ నాలుగుపక్కలా నలుగురు పంతుళ్ళు ఎదిగి పడిన పంట చూసి నవ్వుతూ కన్నీళ్ళు రాలుస్తున్నారు.

వాళ్ళకి పెళ్ళాల నగలూ, కూతుళ్ళ పెళ్ళిళ్ళు పట్టలేదు. (సత్యం శంకరమంచి, జ్ఞానక్షేత్రం, అమరావతి కథలు, పే 295-297)

=======================

## విద్యార్థులు -- వివిధ పార్శ్వాలు

విద్యార్థులు -- వ్యక్తిత్వం

విద్యార్థులు -- వైరుధ్యాలు

విద్యార్థులు -- సంస్కారహీనత్వం

### విద్యార్థులు -- వ్యక్తిత్వం :

ఉన్నతమైన సంస్కారానికి ఓ నిలువెత్తు దర్పణంగా నిలిచిన విద్యార్థి జీవితచిత్రణ 'మానవత్వం పిలుపునిచ్చినవేళ'.

"ఏంటబ్బాయ్ ఏడ్చుకుంటూ ఉంటావు? అమృతా! మారాం చేసేందుకు ఇది సమయం కాదు. బుద్ధిగా చదువుకో! మా జలమల్లాగా నీజలమా కాకూడదని బళ్లోఏత్తుంటాం! నువ్వు కలకటేరు గావాల! అందుకని పెద్ద సదువులు సదవాల. ఎరికేనా?" అన్నది బతికి పంపుతూ అమృత తల్లి.

అసలే చంద్రశేఖరరావు రూపం పిల్లలపాలిటి సింహస్వప్నం కాగా, ఆయన చేతిలో నిరంతరం తాండవమాడే బెత్తం వాళ్ళను మరింత బెంబేలుపడేలా చేసింది. ముఖ్యంగా అమృతను! తెలిసిన ప్రశ్నకు కూడా సమాధానం చెప్పడానికి తడబడేవాడు. సమాధానం చెప్పటం ఏమాత్రం ఆలస్యం అయినా, చంద్రశేఖరరావు క్షమించేవాడుకాదు. అమృత అరచేతుల్ని వెదురు బెత్తంతో చీరేసేవాడు. రక్తసిక్తమైన అరచేతుల్ని మసకబారిన కళ్ళతో గమనించేవాడు అమృత. అతని గుండెల్లో కట్టుకున్న అందమైన ఆశాసౌధాలు కుప్పకూలి పోయేవి. అన్నీ తెలిసి చెప్పలేని తన అశక్తతను, అసమర్థతను మనసులో మౌనంగా నిందించుకునేవాడు. తనకు తెలిసింది ఎందుకు చెప్పలేడు? తెలియకపోతే తనకు చెప్పడానికెవరు ఉన్నారు? అందుకే కదా తన అమ్మ, అయ్య కడుపుమాడ్చుకొని తనకు ఫీజుకట్టేది! అమృతమనస్సులో మథనం ఇలా కొనసాగుతూనే ఉండేది. అవమానాన్ని సహిస్తూ, అభిమానాన్ని దిగమింగుతూ ఎలాగో ఆ సంవత్సరం గడిపేశాడు అమృత.

పండాగ్గుల చంద్రశేఖరరావు క్లాసులోకి వస్తూనే, "ఎక్కడరా అమృత? ఏడీ?" అని అరిచాడు.

అమృత లేచి నిలబడ్డాడు.

"ఏరోయ్! క్లాసు ఫస్టు వచ్చావురా! కాపీ గాని కొట్టావా, ఏం?" అన్నాడు చంద్రశేఖరరావు.

అమృత అవాక్కయి నిలబడిపోయాడు.

"ఒక్క లెక్క సరిగ్గా చెయ్యలేవు. ఒక్క ఇంగ్లీషు పాఠాన్ని సరిగ్గా అప్పజెప్పలేవు. ట్యూషన్ తీసుకోలేదు. ఎలా వచ్చింది నీకు ఫస్టు? నిజంచెప్పు!"

క్లాసులో పిల్లలంతా గొల్లున నవ్వారు.

అమృత తల ఎత్తలేదు. అతని కళ్లవెంట ధారాపాతంగా కన్నీళ్ళు కురుస్తున్నాయ్.

అమృత ఆ పీరియడ్ అంతా నిలబడే ఉన్నాడు. ఆయన అమృతను కూర్చోమనలేదు. పీరియడ్ కాగానే అమృతను

బయటికి పిలిచి -- "ఇదుగో! ఒరే! నీవు కాపీ కొట్టిన సంగతి నాకుతెలుసు. సాక్ష్యం కూడా చెప్పిస్తా అవసరమయితే. హెడ్మాస్టరుకు ఆవిషయం చెప్పాననుకో, నీ స్కాలర్‌షిప్ సంగతి అటుంచి నిన్ను స్కూల్లోంచి వెళ్ళగొడతారు. అర్థమయిందా? అందుకని నీకు శిక్షపడకుండా కాపాడినందుకు ఈ ఇంద్రై నాకు గురుదక్షిణ" అన్నాడు చంద్రశేఖరరావు.

"అదుగో ఆ ఆవేశమే పనికి రాదురా అయ్యా! కట్టుకున్న మొగుణ్ణి నాకెంత ఉండాల కోపం! చదువుకున్న పంతులయ్య సెంపు చదువుకోని మీఅమ్మ పగలేయటమే అయనకుసిద్ధ. అంతకన్న అవమానం ఏముంటుందిర అయ్యలా?"

అచ్యుత శవం దగ్గరకు వెళ్ళి పాదాలంటి నమస్కరించాడు. పంచాగ్నుల చంద్రశేఖరరావు కూతురు దగ్గరకు వెళ్ళి -- "అమ్మా! నేను మీ కులం వాడిని కాను. కాని మాష్టారు దగ్గర చదువుకున్న వాణ్ణి! శిష్యుడు కొడుకుతో సమానం అంటారు. మీకేమీ అభ్యంతరం లేకపోతే నాలుగోవైపు నేను పడతాను" అన్నాడు. అంత విషాదంలో ఉన్న చంద్రశేఖరరావు కూతురు ఏడుపుమాని ఆశ్చర్యంగా అచ్యుతవైపు చూసింది. ముకుందం నోట మాట లేకుండా నిలబడ్డాడు. (మాచిరాజు రామలింగేశ్వరరావు, మానవత్వం పిలుపునిచ్చినవేళ, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 22/28-7-'92, పే 68-71)

జీవితాన్ని అపురూపమైనదిగా భావించిన విద్యార్థి, దాని విలువను గుర్తించి, తన జీవితాన్ని తనుగా తీర్చి దిద్దుకునేందుకు సమాజంలో వ్యాప్తిలో ఉన్న కొన్ని భావనలను అధిగమించేందుకు చేసే ప్రయత్నమే 'ఫస్ట్‌స్టెప్'.

రామానికి మెల్లగా అర్థమవుతూ వుంది. అతనిలా అనుకున్నాడు. ఈ భయం ఇవన్నీ తను మంచివాడుగా గుర్తింపబడాలి, మెప్పుకోబడాలి అన్న తాపత్రయంవల్ల, అందరూ తనని యాక్సెప్ట్ చేయాలి అన్న తపనవల్ల. అవును ఇది నిజం. ఇట్లా అందరినీ సంతృప్తి పరచటం వల్ల తనకు ఒరిగేదేమిటి? చిరాకు, అసహనం, పెరుగుతున్న భయం. తనమీద తనకు అసహ్యం కలగడం కూడా మొదలయ్యింది. రామానికి ఎక్కడో చదివిన వాక్యాలు జ్ఞాపకం వచ్చాయి. తనను తను గౌరవించుకోలేని వాడికి ఇతరులు ఎప్పుడూ గౌరవం ఇవ్వరు అని. రామం ఒక నిర్ణయానికి వచ్చాడు. తను ఇకనుంచీ ఎప్పుడూ తనకు ఇష్టంలేని పనులు చేయడు. తనకు ఎవరి మెప్పూ అవసరంలేదు. ఇది తనజీవితం -- తనకు నచ్చిన రీతిలో బ్రతుకుతాడు. ఇట్లా అనుకోగానే అతనికి తలనుంచి బరువు దింపినట్లయ్యింది. (డి.రామారావు, ఫస్ట్‌స్టెప్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 5-6-'96, పే 8-9)

ఉపాధ్యాయుని ఉన్నతవ్యక్తిత్వాన్ని గుర్తించిన విద్యార్థుల వ్యక్తిత్వచిత్రణే 'నిజమైన తృప్తి', 'త్రివర్ణస్వప్నం'.

"వీళ్ళందరూ మీ హిందీ పిల్లలా!"

"అవునయ్యా! వీళ్ళు సన్మానానికి ఒప్పుకునేవరకూ ప్రాణం తీశారనుకో. మా దగ్గరమైనాకూడా తీసుకోరు. కనీసం దీనికన్నా ఒప్పుకోవాలంటూ సత్యాగ్రహంచేశారు. పసివాళ్ళ మనస్సు కష్టపెట్టలేక ఒప్పుకున్నా. కళాకపటం తెలీని ఈ పిల్లలు దేవుని ప్రతిరూపాలు. పైగా ఈ సన్మానంలో పైసా ఖర్చులేదు. వాళ్ళ తోటల్లో పూసిన పూలతో దండలు తయారు చేశారు. నాకోసం కవిత్వాలు-వ్యాసాలు వ్రాసుకొచ్చారు. వీళ్ళు పెయింట్‌చేసిన బొమ్మల్ని పటంకట్టితెచ్చారు నాకివ్వడానికి! ఎవరు గుర్తించినా, గుర్తించకపోయినా -- ఈ పసివాళ్ళు నాప్రతిభని గుర్తించారు. మాస్టారికి నిజమైన సన్మానం పిల్లల అభిమానమేనయ్యా! నాకెంపదా లేకపోయినా -- ఈ శిష్య సంపద ఉంది! అది చాలు నాకు!" మాస్టారి కళ్ళు నీటితో తడిశాయి. (చిన్నకోల సుశీలాదేవి, నిజమైన తృప్తి, తెలుగు విద్యార్థి, నవంబరు'98, పే 33-34)

గురుమూర్తి కళ్ళలో ఆనందభాష్పాలు. అయన వాళ్ళని దగ్గరకు తీసుకుని నుదురు ముద్దెట్టుకున్నాడు. చాలు ఈ తృప్తి చాలు తనకు. నిరాశావాదం తగదు. జాతిని గౌరవించేవాళ్ళు, జాతీయ లక్ష్యాలను మన్నించేవాళ్ళు ఈ జాతి గర్భమైన ఉన్నారు-రేపటిపౌరులు. నిన్న చూడకపోయినా, నేను కానరాకున్నా, రేపు ఎప్పుడోఒకనాడు మహాత్ములకలలు ఫలించక పోవు. భారతావని పూర్తిగా స్వర్గంగా భాసిల్లకపోదు. (కలువకొలను సదానంద, త్రివర్ణస్వప్నం, ఇండియా టుడే, 25-8-'98, పే 34-35)

గురువు వ్యక్తిత్వాన్ని, సంస్కారాన్ని గుర్తించి, గురువుకు కృతజ్ఞులై ప్రవర్తించే శిష్యుల వ్యక్తిత్వాన్ని ముందుంచే ప్రయత్నమే 'కర్తవ్యం'

"అమ్మా! నీకు గుర్తుంది కదూ! నా చిన్నతనంలో ఒకసారి ఎక్స్‌కర్షన్‌కు వెళ్ళి కాలుజారి నదిలో పడిపోయాను. అప్పుడు మా చలపతిరావు మాష్టారు, సుడిగుండాలను కూడా లెక్కచేయకుండా నదిలోదూకి, ప్రవాహానికి ఎదురీది నన్ను ఒడ్డుచేర్చారు"

"మాష్టారి ఒక్కగానొక్క కొడుకు అనారోగ్యంతో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంటే ...... అతణ్ణి..... అదే, మన నర్సింగ్ హోంలోని ఆరోనెంబరు పేషెంటుని........ నా చదువూ, శక్తీ ఉపయోగించి, చివరకు మృత్యుముఖం నుంచి కాపాడగలిగాను. నేను చేసింది తప్పా అమ్మా" అన్నది డాక్టర్ హారిత. (ధాయా రాఘవేంద్రరావు, కర్తవ్యం, జాగృతి: పారిశ్రామిక ప్రత్యేక సంచిక,'87, పే 136-138)

నిజమైన ఉపాధ్యాయుని వ్యక్తిత్వాన్ని గుర్తించగలిగిన సంస్కారం కలిగిన అసలైన విద్యార్థి చిత్రణే 'శిక్షించిన సౌజన్యం'. శిక్ష వ్యక్తిలో పరివర్తన తెచ్చేదిగా ఉండాలనే ఆదర్శానికి నిదర్శనైన

ప్రతిబింబం ఈ రచన.

మాడు! హిమవంతరావు! నీ బాగుకోసం ఇలా చేయక తప్పిందికాదు. చూసిచూడనట్లు వదిలేస్తే ఎందుకు పనికిరాకుండా పోతావు. నీమీద నాకు కక్ష, కార్పణ్యం లేదు. కోపం అసలే లేదు. ఒక్కడి మూలంగా కాలేజీ అప్రతిష్ఠ పాలవుతుంటే చూసి సహించటం నావల్ల కాదు. అందుకే ఇటువంటి చర్య తీసుకోవలసి వచ్చింది. నువ్వు ఉన్నవాడివేకాని ఆరోగ్యకరమైన ఆలోచనలు లేనివాడివి! నీ జీవితం సార్థకత ఏమిటో ఆలోచించు? విధ్వంసం కోసం కాకుండా పలుగురి క్షేమంకోసం ప్రయత్నిస్తే జీవితం ధన్యం అవుతుంది. ఎవరి జీవితపు మలుపు వారి చేతుల్లోనే ఉంది! చిత్తశుద్ధితో కృషి చేస్తే ఏ రంగమైనా ఆనంద తరంగమే! నువ్వు మనిషిగా మనాలంటే అందుకోసం ప్రయత్నించు. విష్ యు గుడ్‌లక్' అని చెప్పి వెళ్ళిపోయాడు.

'మాడంత' మీరు నామీదున్న ప్రేమతో యదార్థాన్ని గుర్తించకుండా మాట్లాడుతున్నారు. నిజానికి అక్కడ అనవసరంగా నాకెవరూ అపకారం చేయలేదు. నా కళ్ళు తెరిపించి, నేను జీవితంలో రాణించడానికి ఆ మహానుభావుడు రామస్వామి గారే పరోక్షంగా కారకులు! నాకు [illegible] గాక బ్రతుకును అర్థంచేసుకొనే జీవన మంత్రాన్ని ఉపదేశించినందుకు వారికే ఎంతో ఋణపడి వున్నాను. [illegible] ఉపాధ్యాయుడ్ని ఉంటే అంతకు మించిన అదృష్టంలేదు! అందుకే తమ్ముడు మోహనకృష్ణ నేను చదివిన కాలేజీలోనే చదవాలని నా అభిమతం, ఆకాంక్ష! (జి.భాను, శిక్షించిన సౌజన్యం, జాగృతి: పారిశ్రామిక ప్రత్యేక సంచిక, '87, పే 70-71)

ఉపాధ్యాయుని వ్యక్తిత్వానికి ప్రతిబింబాలే విద్యార్థులు. అలాంటి ఉత్తమ వ్యక్తిత్వంకలిగిన శిష్యులు గురువుపట్ల చూపే కృతజ్ఞతకు ఎల్లలు లేవని నిరూపించే రచనలే 'గురుదక్షిణ', 'గొడుగు'.

"ఏమిటోనోయ్ ప్రసాద్ ఈమధ్య చాలా విరక్తిగా వుంటోందోయ్!"

దుర్గాప్రసాద్ నివ్వెరపోయాడు. మాస్టారేనా ఇలామాట్లాడేది? కష్టాల్లో కూడా నవ్వే మాస్టారు, నవ్వుకు ప్రతిరూపంగా వుండే మాస్టారు. ఎదుటివారి బాధల్ని తనజోకులతో మైమరపింప జేసే మాస్టారేనా ఇలా దయనీయంగా మాట్లాడేది. మాస్టారు శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా చాలా మారారన్నమాట! ఎందువలన వచ్చిందో ఈ మార్పు? మంచి తుఫానులో చెక్కు చెదరక నిలిచే హిమవన్నగంలా ఉండే మాస్టారు ఎందుకిలా ఉన్నారో!

"మాస్టారూ! మీరు దేనిలో [illegible] కారణం ఏమిటి మాస్టారూ?" దుర్గాప్రసాద్ అడిగాడు.

మాస్టారు నవ్వారు. సర్వం కోల్పోయిన వ్యక్తి నవ్విన నవ్వులా వుందది. దుర్గాప్రసాద్ మనస్సుచివుక్కుమంది అర్ధరాత్రి అమృతం కురిసినట్లు, పాలరాతిపై ముత్యాలు రువ్వినట్లు--చల్లగా, హాయిగావుండే ఆ నవ్వు ఏదీ! ఏమైంది?

మాస్టారూ! మీకళ్ళలో నీళ్ళు నేను చూడలేనండీ. నవ్వే మీ పెదవులు దుఃఖంతో వణికిపోతే నేను భరించలేను మాస్టారూ మీ ముఖంలో చిరునవ్వు సదా వెలుగుతుండాలి ఆ వెలుగు లోకాన్ని వెలిగిస్తుండాలి మాస్టారూ! మీరభిమానించే ఈ శిష్యుడు మీకు గురుదక్షిణ ఇస్తున్నాడు స్వీకరించండి" అనందంగా అనుకున్నాడు.

"మాస్టారు [illegible] ఆ [illegible] ఎక్కడికో పారిపోయిందండి. పాపం ఆ నాలుగేళ్ళ కుర్రాడు అమ్మకోసం ఎలా ఏడుస్తున్నాడో" అంటున్నారెవరో. అది విని దుర్గాప్రసాద్ లోపలికెళ్ళి ఆ కుర్రాడిని ఎత్తుకున్నాడు.

ఆవిడ నివ్వెరపోతూ "ఇదేమిటండీ పిడివడినో తెచ్చారు" అంది.

"ఇది [illegible]" అంటున్నాడు చెప్పి కపిలకోక కుర్చీలో కూలబడిపోయాడు దుర్గాప్రసాద్. (చిన్నకోట సుశీలాదేవి, గురుదక్షిణ, ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక, 9-6-'83, పే 26-30)

విద్యార్థి ఉత్తమ సంస్కారానికి నిలువెత్తు దర్పణం 'గొడుగు'.

"మాస్టారూ!" అని పిలుస్తూ తన కళ్ళజోడు చేతికి తీసుకుని, "మీరు నన్ను గుర్తుపట్టలేదూ?" అని ఆందోళనగా ప్రశ్నించారు తను.

"రిటైరయి పోయాను కదా! ముసలితనం. ఏదీ గుర్తుండి చావదు."

"నేను, నేను మీ కిట్టుగాణ్ణి! చిన్నతనంలో నాకు అన్నంపెట్టి పోషించి, చదువు చెప్పించిన మీ ఇంటి పనిమనిషి రత్తమ్మ కొడుకుని!"

"బాబూ! నిన్నుఇంతటి ఉన్నతస్థితిలో చూడటం, అందులోనూ నాకు పై అధికారిగా చూడటం నాకెంతో గర్వంగా ఉంది." అని గంభీరంగానే అన్నారు.

డి.ఇ.ఒ. రాధాకృష్ణ తన హోదాసంగతే మరచిపోయాడు. పంతులుగారి పాదాలను తాకి నమస్కరించాడు.

"మాస్టారూ! ఆనాడు మీరు నిండు హృదయంతో నా చదువు గురించి ప్రోత్సాహం చూపించి ఉండకపోతే, నేనీ స్థితికి వచ్చి ఉండేవాణ్ణి కాను. నాకు తండ్రిముఖం తెలీదు. తల్లి ఆదరణకు నేను నోచుకోలేదు. ఆత్మీయులు అసలేలేరు. కాని, విద్యాబుద్ధులు చెప్పించిన మీరే నాకు తల్లీ, తండ్రీ, అంతకు మించిన దైవాలు!" అని అంటూన్నంతలో అతని గొంతుక బొంగురు పోయింది.

"కిట్టూ! ఎప్పుడో చిన్నతనంలో చేసిన సాయానికి ప్రత్యుపకారంగా నువ్వీనాడు నాకుటుంబాన్ని ఆదుకున్నావంటే "

"ఇది ప్రత్యుపకారమూ, ప్రతిఫలమూ కాదు మాస్టారూ! గురుదక్షిణ! అన్నాడు రాధాకృష్ణ. (సి.టి.ఎస్.రామయ్య,

గొడుగు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 4-7-'84, పే 35-37)

గురువుకు విలువనిచ్చే శిష్యుల వ్యక్తిత్వానికి ప్రతినిధిగా 'విలువ'లోని వ్యక్తి నిలుస్తాడు.

"నమస్కారం, సార్. మీరు నా స్టూడెంట్ అయి ఉంటారు. మర్చిపోయాను" అన్నాను, అతణ్ణి మర్చిపోయినందుకు సిగ్గుపడుతూ.

"మీరు శ్రీకాకుళం కాలేజీలో పనిచేసినప్పుడు నేను బి.ఎస్.సి. చదివే వాణ్ణండి. మాది 'సిక్స్‌టీఎయిట్' బాచ్ అండి. నేను మొన్ననే ఇక్కడ ఆర్.టి.సి. డిపో మేనేజరుగా పోస్ట్ అయ్యానండి" అన్నాడు ఎంతో వినయంగా!

"చాలా సంతోషం. కంగ్రాచ్యులేషన్స్. ఐయామ్ రియల్లీ ప్రౌడాఫ్ యూ" అన్నాను ఆనందంతో.

"ఇప్పుడు నేను జీప్‌లో రాజమండ్రి వెళ్తున్నాను. సార్! మీకు అభ్యంతరం లేకపోతే మీరు నా జీప్‌లో రావచ్చు' అన్నాడు, సుధాకర్‌తో. ఆశ్చర్య పోయాను అతని వినయానికి! సుధాకర్ నోటమ్మట మాటరాలేదు.

"చూశావా. ఈ ప్రపంచంలో మనిషికి కూడా విలువనిచ్చేవాళ్ళున్నారు" అని జీప్ ఎక్కాడు సుధాకర్. (కిల్లాన మోహన్‌బాబు, విలువ, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 27-12-'78, పే 50-51)

పెద్దల కుసంస్కారాన్ని సవాలుచేయగల వ్యక్తిత్వం కలిగిన విద్యార్థుల స్వభావ చిత్రణే 'రక్షకులు'

మైకు ముందుకొచ్చాడు. మొదట్లో కొంత తడబడ్డా తరువాత నెమ్మదిగా స్పష్టంగా చెప్పడం ప్రారంభించాడు. మహేష్ అనే పదహారేళ్ళ పిల్లవాడు "మొక్కల్ని మేమంతా కలిసి రెండు మూడేసి చొప్పున ఎత్తుకెళ్ళిపోయామండీ! ఈ దొంగతనానికీ, ఆనందు మాస్టారికీ ఏ రకమైన సంబంధమూ లేదు."

"ప్రతి ఏడూ మీరు మొక్కల్ని నాటుతారు. ఆ తరువాత వాటివిషయం పట్టించుకోరు. వాటికిస్కూల్లో దిక్కు లేదు. నీళ్ళులేక ఎండిపోతాయి. లేకుంటే పశువులొచ్చి తినేస్తాయి. తొక్కేస్తాయి. నాలుగేళ్ళనుంచీ మీమీద చూస్తూనే ఉన్నాం. మళ్ళీ వనమహోత్సవం చేసేటప్పుడు కొత్తవి నాటిస్తారు. పాతవేమయ్యాయని మీరుగాని, ఆ వచ్చే కలెక్టర్లూ, సైంటిస్టులూ ఎవరూ ఆలోచించరు. అసలవి కూడా మనలాంటి ప్రాణులేనని మీరే చెప్పారు. కాని అన్యాయంగా ప్రతిఏడూ వాటి ప్రాణాలతో చెలగాటమాడుకుంటున్నారు. మీ పొట్టలకే కొన్ని వందల ప్రాణుల్ని మీరు చంపేశారు. అందుకే మేమిసారి ఆలోచించుకుని చెరి కొన్ని మొక్కల్ని మా ఇళ్ళకు తీసుకెళ్ళిపోయాము. చంపేయడానికి కాదు మాస్టారండీ! నీరుపోసి పెంచి పెద్దచేయడానికి. ఈ దొంగతనానికి మిమ్మల్ని క్షమించమని వేడుకుంటున్నాను." చేతులు జోడించాడు మహేష్. (స్వరూప్ సిన్హా, రక్షకులు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 23-1-'91, పే 74-77)

పశ్చాత్తాపంతో పరివర్తన చెందిన ఒక విద్యార్థి వ్యక్తిత్వ చిత్రణే 'ఆచార్యదేవోభవ'

"నన్ను క్షమించండి మాస్టారూ?"

పశ్చాత్తాపంతో మనసులోనే గొణుగుతూ ఆచార్యదేవునికి సజల నయనాలతో అంజలి ఘటించా. నన్ను తృప్తిగా చూస్తూ ఆయన బస్ దిగుతుంటే.

నెళ్ళాళ్ళనుంచీ ఆయనను చూస్తూ, పలకరిస్తే ఎక్కడ అప్పు అడుగుతాడో అన్న నా స్వార్థం, రెండ్రోజుల క్రితం ఎండలో బస్సెక్కి కాస్త సీట్లో సర్దుకోమంటే ముఖం చాటేసి పక్కవాడిచేత సీటు లేదనిపించిన దౌర్భాగ్య శిష్యుడిగా నాకెందుకో నామీద, నా సంకుచితత్వం మీదా అసహ్యమేసి, కోపం కళ్ళలు తెంచుకుంటున్నాయ్! (శశిహాస్, ఆచార్యదేవోభవ, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 23-3-'88, పే 21)

విద్యార్థులు -- వైరుధ్యాలు :

ఒకే గురువుకు చెందిన శిష్యుల్లో విభిన్న మనస్తత్వాలుగల ఇద్దరి వ్యక్తిత్వాలను 'విలువ' చిత్రించింది.

"మాస్టారూ! మీ పెన్షన్, వగైరాలన్నీ నెల తిరిగేసరికల్లా శాంక్షన్ అయిపోతాయి. కానీ మీరు మరీ దగ్గరివారు కనుక చెప్తున్నాను. ఏమీ అనుకోకండి! మీకాలం కాదుకాదా ఇది! ఆ సెక్షన్ హెడ్ కాస్త గట్టివాడే రకం. వ్యవహారం తేలడంలేదు. కనీసం ఐదొందలైనా తీసుకుంటాడు. మీరు నాకు బాగా కావలసినవారు కనుక చదివేటికి చేరమాటాను. సమయానికి నా దగ్గరా లేవు. మీరు రెండు మూడు రోజుల్లో ఇవ్వండి..."

"అలాగేనయ్యా! తప్పకుండా! శ్రీధర్! నువ్వింతటి వాడవయినందుకు నాకెంతో సంతోషంగా ఉంది. పైగా నన్ను గుర్తుపట్టి......"

"ఎంతమాట మాస్టారూ! మీరు అన్నం పెట్టిన చెయ్యి. జీవితంలో మర్చిపోగలనా?"

శేఖర్‌తో పడరాని పాట్లు పడ్డాను.................

"చదువు అనేది ఒక వరం! చదువు లేక ఎంతమంది బికారులుగా తయారవుతున్నారో. చదువుకునే అదృష్టం, స్తోమత

ఉంటే నువ్వు ఆ అవకాశాన్ని దూరం చేసుకుంటున్నావంటే నీకు భవిష్యత్తు చీకటే అవుతుంది. కన్న తల్లిదండ్రులు ఎల్లకాలం ఉండరు. జీవితంలో నీ అంతట నీ కాళ్ళమీద నిలబడాలంటే చదువు ఎంతో అవసరం. ఈరోజు వీళ్ళతో జులాయిగా తిరిగేవాళ్ళెవ్వరూ రేపు నువ్వు అడుక్కుంటున్నప్పుడు నిన్నాదుకోరు.................."

నిజానికి ఆ రాత్రి ప్రశాంతంగా నిద్రపట్టాలి నాకు. కానీ పట్టలేదు. గురువుగా వాళ్ళెవ్వరూ బాగుపడాలనే కోరుకున్న వాడిని నేను. శ్రీధర్ గురించి ఆలోచించి [illegible] నిద్ర ఆగిపోయింది. నాలుగేళ్ళు నాదగ్గర దయాధర్మంతో చదువుకున్న శ్రీధర్ - ఈ ముదివయసులో నా గురించి తెలిసీ ఆశించాడంటే మానవత్వానికి అతనిచ్చే విలువ ఏమిటో అర్థంకావడంలేదు.

మొండివాడు ఎందుకూ పనికిరాడనుకున్న శేఖర్ చదివిన చదువుండా నలుగురిలో సగర్వంగా చెప్పుకునే స్థాయిలో బతుకుతున్నాడు. శ్రీధర్ కంటే అతని అంతస్తు తక్కువే కావచ్చు. మానవతా విలువల విషయంలో ధనానికి విలువనిచ్చే శ్రీధర్ కంటే, శేఖర్‌కి [illegible].

అయితే ఒక మనిషికి సాటిమనిషి ఇచ్చే విలువ అతని అంతస్తునుబట్టే ఉంటుందా? అవసరాన్ని అనుసరించా? [illegible] మానవత్వానికి ఉన్న విలువ తెలుసుకోలేకపోతున్నాడు. కానీ .....

ఆ 'కానీ'లోనే [illegible] నాకు అంతుపట్టడం లేదు. ఎక్కడో ఏదో లోపం ఉంది. ఆ లోపంలోంచి అసంతృప్తి [illegible] ? కానీ శేఖర్‌లాంటి వాళ్ళు ఉన్నంతకాలం నాలాంటివారి మనుగడకి ఢోకాలేదు! ([illegible] విలువ, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 18-1-'99, పే 74-77)

## విద్యార్థులు -- సంస్కారహీనత్వం :

ప్రపంచంలోని ప్రతిదీ వినియోగవస్తువుగా మార్పుచెందుతున్న ప్రస్తుతకాలంలో గురుశిష్య సంబంధాల్లోకూడా ఈ సంస్కృతి ప్రవేశించింది. ఇటువంటి సంస్కృతిలో ఉపాధ్యాయుని వ్యక్తిత్వాన్ని పెట్టుబడిగా చేసుకుని, దాన్నుంచి లాభాలను పొందాలనుకునే విద్యార్థులు రూపొందటం ఒక విషాద పరిణామం. ఈ పరిణామాన్ని చిత్రించిన రచనే 'జననీ... జన్మభూమీ'. విద్యార్థి అనైతికవర్తనకు పరాకాష్ఠగా ఇందులోని శిష్యుల ప్రవర్తనను పేర్కొనవచ్చు.

"ఏమో.... అలాంటి మనిషి ఎవరూ జ్ఞాపకంలేదు నాకు. అయినా ఎవరైతేనేం... ఇంగ్లీషు చెప్పడం మానేసి... తర్కీ తెలుగే చెప్పి ... [illegible] అన్యాయం చేసిన ఒక్కో బీదర్ని నేను సనేమిరా కల్పుకోనివ్వన్నాయ్యా! అయినా ఓల్డ్‌బాగ్.... [illegible]...!"

"అలా [illegible] వెళ్ళి దిక్కుంపెట్టేయ్. [illegible]. ఇక ఆ బస్‌లో ఆయన తల్చుకుంటే జరగనిది లేదు. [illegible] ... ఎవరి పరిహాసరోజుల్లో జరుగబోయే ఆయన స్కూల్‌లోలో గానీ... [illegible] వందలు వందలు వచ్చేస్తాయి మన క్లినిక్కి. ఇప్పుడు క్లినిక్ [illegible]!"

"ఇంత అప్రయోజకులు ఎట్లాగా నా కడుపున! మళ్ళీ వేరికొక్క చెప్పకపోయినా.... నలుగురు కలిసినచోట....... మేష్టారు ఒక్కమాట చెప్పినా...... మనపరంగాలో 'క్యూ'లో నిల్చుని టోకెన్లు కొనేవాళ్ళంతా.....ప్రక్క ఊరి ధర్మాసుపత్రివైపు పరిగెడతారని కూడా భయంలేదా.....మీకు? ధనుంజయరావుగార్ని పిల్చి.... కూర్చోపెట్టి....., చల్లని మంచినీళ్ళిచ్చి......., ఆ వేళ [illegible]... [illegible]! నా కడుపున చెడబుట్టారు మీరు....!" (మానస, జననీ... జన్మభూమీ!, యువ, ఆగస్టు '78, పే 145-156)

ఉపాధ్యాయునిపట్ల కనీస కృతజ్ఞతలేని విద్యార్థి సంస్కారాన్ని చిత్రించిన రచన 'కృతజ్ఞత'.

[illegible] అయిదారు రెండడుగులు వేశారు. ఒకసారి ఆగి తనని తాను పరీక్షించి చూసుకున్నారు. [illegible] బాగా మాసిపోయాయి. పొట్ట కొద్దిగా వెనుకకి తిరిసింది. అరిగిన అడుచెప్పులు మట్టిపట్టి ఉన్నాయి. చేతిలో పాతగొడుగూ, మాసిన గడ్డమూ చాలా అసహ్యకరంగా ఉంది ఆకారం. తనని తానే ఏవగించుకుంటూ--తనని పీడిస్తున్న దరిద్రాన్ని నిందించుకుంటూ--మేనేజర్ రూంలో అడుగుపెట్టారు.

"చేసిన ఉపకారానికి ప్రతిఫలం ఆశించకూడదనేవారు మీరు. బహుశా మరచిపోయారనుకుంటాను. నీతులను ఆచరణలో పెట్టడం బోధించినంత సులభం కాదన్నమాట నిజమేననిపిస్తోంది. ఆనాడు నన్ను చేరదీశారనీ, ఆదరించారనీ ఈనాడు నా ప్రిన్స్‌పల్స్‌కి వ్యతిరేకంగా ప్రవర్తించలేను. ఉన్నతాదర్శాలూ, ఉత్తమవ్యక్తిత్వం గల మీరు ఇలా ఎత్తిపొడుపు మాటలనడం భావ్యంకాదు. ఇంటర్వ్యూకి ముందుగా మీరు నన్ను కలుసుకొని ఈ విషయం ప్రస్తావించడం ధర్మవిరుద్ధమని మీకు చెప్పనవసరం లేదనుకుంటాను."

[illegible]

హుం..... [illegible] నీతులు వల్లించాడు! ఇవా వీరు ఆచరిస్తున్న నీతి నియమాలు? ఇవా వీరి ప్రిన్స్‌పల్స్?

డబ్బుకి ఉద్యోగాలమ్ముకొనే దౌర్భాగ్యస్థితికి దిగజారిన వీరికి మానవత్వం, మమతానురాగాలూ, భక్తి విశ్వాసాలూ వుంటాయనుకోవడం అవివేకం. తనకొడుక్కి ఉద్యోగం ఇచ్చినా ఇవ్వకపోయినా నిరంజన్ నీతిమంతుడుగా బ్రతుకుతున్నాడని అంతరాంతరాల్లో ఇంతవరకూ తను వాడిని ప్రశంసిస్తున్నాడు. తను నాటిన మొక్క మహావృక్షమై మధురఫలాల నిస్తోందని గర్వించాడు. కాని ఆ వృక్షానికి వేరుపురుగు పట్టింది! పతనం తప్పదు..... (గున్నంరాజు సుందరరావు, కృతజ్ఞత, యువ, అక్టోబర్ '79, పే 122-133)

## గురువును గౌరవించలేని విద్యార్థుల సంస్కారాన్ని చిత్రించిన రచన 'గురుశిష్యులు'

పలకరించబోయాడు. 'మాస్టారూ ....' అన్నపదం గొంతువరకూవచ్చి ఆగిపోయింది. తాను పలకరించి, ఆయన గుర్తుపట్టాకంటే తనులేచి ఆయనను కూర్చోమనాలి. బస్సంతా కిక్కిరిసి ఉన్నది. పైగా ఎండాకాలం. శేవాలా, పద్దా అవి అయిదునిమిషాలు తర్జనభర్జనలు పడ్డాడు. నెల్లూరువరకు అంటే నాలుగైదు గంటలు ప్రయాణం. మరి ఆయనెక్కడిదాకా వెళ్ళాలో? ఈ రష్‌లో లేచి మరొకరికి సీటు ఆఫర్‌చేయడమంటే తెలివితక్కువతనం మరొకటి ఉండదని అంతరాత్మ హెచ్చరిస్తున్నది. ఎప్పుడైనా శిష్యులు గురువులను గుర్తించాల్సిందే కాని శిష్యులను గురువులు గుర్తించడం అసంభవం! ఆయన కూడా మళ్ళీ ఇటు చూడలేదు. తనుకూడా ఇక ఆయనవైపు చూడకూడదు.

"అమ్మా,నాన్నా బాగున్నారా?"

ఉలిక్కిపడ్డాడు సురేష్. " మీరు .... మీరు" ఇంకా గుర్తుపట్టనట్లు నటిస్తూ అన్నాడు.

"నన్ను రామ్మూర్తి పంతులు అంటార్లే! మీ నాన్నగారూ, నేనూ కలిసి ఒకేస్కూల్లో కలిసి పనిచేశాం. ఆరోక్లాసు, ఏడోక్లాసులో మీరు నా శిష్యులు. మా అమ్మాయి కూడా వీతోపాటే చదివేది. ప్రస్తుతం అమ్మాయి ఇక్కడే పనిచేస్తున్నది.--------- సురేష్ సిగ్గుతో కుంచించుకుపోయాడు. మిలేరియా వచ్చినవాడిలా వణుకుతున్నాడు.

"కలెక్టరేట్‌లో ...... అటెండర్‌గా.... మరి మీ అమ్మాయి....లావిణ్య....." కంపిస్తున్న స్వరంతో అతి కష్టమ్మీద అన్నాడు.

"అమ్మాయి కూడా కలెక్టరేట్‌లోనే పనిచేస్తున్నది. కలెక్టర్‌గా...!" (జలపాపులూరి మురళీమోహనరావు, గురుశిష్యులు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 22-11-'99, పే 53-54)

## గురువుని, గురువు అమాయకత్వాన్ని హేళనచేసే కుసంస్కారం కలిగిన శిష్యుల వ్యక్తిత్వాన్ని చిత్రించిన రచన 'నాన్నకు చెప్పకే'

తండ్రి ముఖంలో అంతటి సంతోషం చూసుకుని ఎన్నేళ్ళయిందో లక్ష్మికి. అయినా ఎందుకో లక్ష్మి ముఖం బాగా కందిపోయింది. దుఃఖం పెల్లుబికి రాబోతోంది. తండ్రికి దూరంగావెళ్ళి కూర్చుంటూ ఆగని ........ అనుకుంది. "పిచ్చి నాన్నా.... ఎలా ఎలా చెప్పను నాన్నా! మీ చదవటమ్మ తెచ్చిన ఆ కాయగూరలు దారిలో పారబోసి మీ ప్రియ శిష్యులు ------- తెచ్చారని... వాళ్ళంతా అప్యాయంగా అదే నేటి మీ భార్య చెక్ నంబర్ కాదు నాన్నా మీకూతురు ఎదకోలతలని... వాళ్ళలా అలవాటుగా నన్ను ఏడిపిస్తుండారని......మీరు నమ్మే ఆ కాలం మనుషులు....ఇక లేరని..... ఎలా చెప్పను?---- . (మందూరి శ్రీధర్, నాన్నకు చెప్పకే!, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 4-5-'98, పే 8-10)

"నేను చిన్నప్పుడు మీచేతని పెరిగాను. మీ ఆశయాలూ, ఆదర్శాలూ నేర్చుకుంటూ పైకొచ్చాను. ఈనాటికీ ఆ ఆదర్శాల్ని ఆచరించాలన్న పోటీలోనే సాగిపోతున్నాను! అందుకే --నాకు ఒక సీటు రిజర్వేషన్ ఉన్నా, అది నేను తెలిసిన వాళ్ళకంటూ ఇవ్వటంలేదు. ఆ సీటు ఆటోమేటిగ్గా మెరిట్ కోటాకి కలిపేస్తున్నాను. మెరిట్‌కోటాలో సీటుదొరక్క మిగిలిపోయినవాళ్ళలో మొదటివాడికి ఆసీటు వెళ్ళిపోతుందన్న మాట!..."

"మీ ఇష్టం మాస్టారూ, మీరుఆజ్ఞాపించండి. ఆ సీటు మీ అబ్బాయికే ఇచ్చేస్తాను."

"ఒద్దొద్దు సుందరం...." కంగారుగా అన్నాడు జలధరం -- " నువ్వు కట్టుబడ్డ ఆదర్శం నాకెంతో సంతోషం కలిగిస్తోంది -- మాఅబ్బాయికి సీటొచ్చినదానికన్నా ఎక్కువ సంతోషం! ఆదేమార్గాన సాగిపో! ప్రతిభ ఉన్నవాళ్ళకే న్యాయం జరగనీ!"

"అప్పనుగానీ, ఎలా మేనేజ్ చేశావ్ పదిహేనువేలకే?" కాజువల్‌గా అడిగాడు జలధరం. అతని జవాబు తనకి పిడుగుపాటుగా తోస్తుందనీ, తన నమ్మకాల పునాదుల్ని కుదిపి కూలదోస్తుందనీ ముందుగా ఏమాత్రం తెలీదు కనక! తన సమాధానం అతన్ని తలక్రిందులు చేస్తుందని తెలియని భగవంతం, అంతే కాజువల్‌గా జవాబిచ్చాడు.

"ఏముంది సార్, డబ్బుదేకదా రాజ్యం! సుందర్రావనే -- ఓ బోర్డుమెంబర్ని పట్టాను. అతని వాటాకి ఉన్నసీటు పదిహేను వేలకి పట్టేశాను! ఆఫ్‌కోర్స్, కాస్త కష్టమే అయింది లెండి. పాతికవేలకి తగ్గనని చాలా పట్టుబట్టాడు..." ఆ తరువాత మాటలు జలధరం చెవుల్ని సోకడం మానేశాయి! అతని కళ్ళముందు ఆశల్నీ, ఆశయాలనీ, ఆదర్శాల్నీ, అనుబంధాల్నీ కూలదోస్తూ డబ్బు కట్టలు వికటాట్టహాసం చేస్తున్నాయి!! (పి.వి.ఆర్.శివకుమార్, అల్పజీవి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 18-3-'87, పే 48-50)

## విద్యార్థి మనస్తత్వంలో మార్పు సాధ్యంకాదన్న అభిప్రాయానికి గురువులు వచ్చే పరిస్థితిని చిత్రించిన రచన 'మనస్తత్వం'

క్లాసుకు వెళ్ళినా విద్యార్థుల ఈలలు, చప్పట్లూ, పిల్లికూతలూ, అరుపులూను! ఎంతో ఉత్సాహంగా చెప్పాలని ఉవ్విళ్ళూరే నాకు మొదట్లోనే నిరాశ ఎదురయింది. అసలు వీళ్ళు ఎందుకు అల్లరి చేస్తారో, అందులో వీళ్ళుపొందే ఆనందం ఏమిటో నాకర్థమయ్యేది కాదు. ఇదేమిటి స్టాఫ్‌రూమ్‌లో ఆనేవాళ్ళ కొందరు లెక్చరర్లు నేనేదో అసమర్థుణ్ణి అన్నట్లు చూసేవారు. ఆ చూపులు నేను భరించలేక పోయేవాణ్ణి. వాళ్ళక్లాసుల్లో సైన్సువిద్యార్థులు సైలెంటుగా ఉన్నమాట నిజమే. కాని అది వీళ్ళ చేతిలో ఉన్న ఆ ప్రాక్టికల్ మార్కులకోసం కానీ, వీళ్ళ మీద భక్తితోకాదని నాకు తెలుసు. అయినా వీళ్ళు మాత్రం అదేదో వీళ్ళ గొప్పతనమనీ, సమర్థతనీ ఫీలవుతూండేవారు. ఎన్నోసార్లు వాళ్ళతో వాగ్యుద్ధాలు జరుగుతుండేవి!

షాక్ తగిలినట్లయింది నాకు. నిన్న అంతగాచెప్పినా ఫలితం శూన్యం అన్నమాట! "ఈ దేశంలో విద్యార్థి మనస్తత్వం మరి మారదు" అనుకుంటూ ఇంటిముఖం పట్టాను! (కిల్లాన మోహన్‌బాబు, మనస్తత్వం, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 12-12-'79, పే 42-43)

ఇలా తెలుగుసాహిత్యంలో విద్యావిధానంపై వచ్చిన రచనల్లో సామాజికమైన, మనోవిశ్లేషణాత్మకమైన విమర్శ విభిన్నరీతుల్లో చోటుచేసుకోవటం గమనించవచ్చు.

# 3. తెలుగుసాహిత్యం: విద్య : రూపగత విమర్శ

రచనలోని అంతర్గత సమీకరణ, సుస్థిర నిర్మాణం సాహిత్యంలో 'రూపం' అవుతుంది. రూపం మూడు విభిన్న అంశాల కలయిక అన్నది మార్క్సిస్ట్ విమర్శకుల అభిప్రాయం. అవి సాపేక్ష స్వాతంత్ర్యంగల వివిధరూపాల సాహిత్యచరిత్ర, ఆ కాలంలో ప్రభావవంతంగా పనిచేస్తున్న ఆలోచనా విధానాలు, రచయితకు పాఠకులకు మధ్యగల సంబంధాలు.

రూపం భావజాలపరమైన స్వభావం కలిగి సామాజిక అంశాలను ప్రతిబింబించేదిగా ఉంటుంది. సాహిత్యరూపంలో వచ్చేమార్పు సామాజిక మార్పును సూచిస్తుంది. విషయంలో ఆధునికత రూపంలో కూడా ఆధునికతను కోరుతుందని విమర్శకుల భావన. వీటికి ఆధారమైన సామాజిక పరిస్థితులు, సంఘర్షణలు వేరుగా వుండటం రూపంలో కూడా వైవిధ్యం ఉండటానికి కారణమవుతాయి. ఇలా నూతన సాహితీరూపాలు నూతన జీవనవిధానాన్ని సూచించటం మనం గమనిస్తుంటాం.

అయితే విషయం, రూపం వస్తుగతంగా నిర్దేశితమవుతాయని భావించాలి. కానీ విషయంలో మార్పు వచ్చినంత వేగంగా రూపంలో మార్పు రాదు. రూపం తనదైన స్వాభావిక తర్కాన్ని అనుసరించి సాపేక్షంగా నెమ్మదిగా మారుతుంది. వీరేశలింగం సంఘసంస్కరణ ప్రధానలక్ష్యంగా చేసిన రచనలు, శ్రీశ్రీ అభ్యుదయం ప్రధానఆశయంగా నిర్దేశిస్తూ చేసిన రచనలు, నేడు విభిన్న సామాజికాంశాలను నేపథ్యంగా చేసుకుని వస్తున్న రచనలు ఇలా ఏకాలపు సాహిత్యాన్ని పరిశీలించినా ఆ కాలానికి అనుగుణంగా వస్తువులో మార్పు వచ్చినంత వేగంగా రూపంలో మార్పు రాకపోవటాన్ని గమనించవచ్చు.

విషయం, విధానం -- ఈ రెండింటి కలయికే రచన. విషయాన్ని కళాత్మకంగా వ్యక్తంచేసే

విధానమే రూపం. విషయం ఎంత అభ్యుదయకరమైన దైనా దానికి అనుగుణమైన రూపంలేకపోతే ఆ విషయం పట్లకూడా అలక్ష్యాన్ని సూచిస్తుంది. రూపంపట్ల అలక్ష్యం విషయంపట్లకూడా అలక్ష్యాన్ని సూచిస్తుంది.

తెలుగు సాహిత్యంలో విద్యావిధానం నేపథ్యంగా వస్తున్న వివిధరచనల్లో వస్తుపరంగానే కాకుండా రూపపరంగా కూడా విస్తృతమైన వైవిధ్యం కనిపిస్తుంది. ఇందులో రచనావిధానం పరిశీలిస్తే వచ్చిన రచనల్లో పాఠకగతరచనలు (Readerly Texts), రచయితగత రచనలు(Writerly Texts) రెండూ కనిపిస్తాయి. ఇక పాత్రచిత్రణలో విభిన్నరకాల పాత్రలు మనకు తారసపడతాయి. అందులో ఏకోన్ముఖ వికసన పాత్రలు, బహుముఖ వికసన పాత్రలు ప్రధానంగా కనిపిస్తాయి. ఇంకా కథనంలో యథాతథ కథనం, అనుభూత్యాత్మక కథనం, సర్వసాక్షి కథనం, ఉత్తమపురుష కథనం, ప్రథమపురుష కథనం, నాటకీయ కథనం, సంభాషణాత్మక కథనం, వర్ణనాత్మక కథనం, ఫాంటసీ, లేఖాకథనం, చైతన్యస్రవంతి కథనం వంటి విభిన్న కథనాలు కనిపిస్తాయి. ఎత్తుగడ, సంఘటన, సంఘర్షణ, సన్నివేశం, ముగింపు వంటి నైపుణ్యాలద్వారా రచనలో శిల్పపరమైన వైవిధ్యాన్ని సాధించటం కనిపిస్తుంది. ఇంకా భాషాపరంగా వ్యంగ్యం, విరామచిహ్నాలు, శీర్షికావైవిధ్యం వంటివి శిల్పాన్ని మరింతగా అంశాలద్వారా రచనల్లో వైవిధ్యాన్ని సాధించటం కనిపిస్తుంది.

తెలుగు సాహిత్యంలో విద్యావిధానం నేపథ్యంగా చేసుకొని వచ్చిన రచనల్లో రూపవైవిధ్యానికి కారణమైన ప్రధానాంశాలివి.

3.1. *రచనానిర్మాణం : పాత్ర చిత్రణ*

*3.2. కథనం*

*3.3. కథన శిల్పం*

*3.4. భాష*

====================

## రచనానిర్మాణం--పాత్రచిత్రణ

రచనా నిర్మాణం, పాత్రల రూపకల్పన అనేవి రచయితకుగల శిల్పనైపుణ్యానికి గీటురాళ్ళుగా నిలుస్తాయి. అయితే ఈ రెండింటికి మధ్య సమన్వయం అవసరం. పాత్రలనేవి కథావస్తువుకు అనుగుణమైనవిగానే ఉండాలి. ఈ పాత్రలు బహుముఖవికసనమైనప్పుడు రచన బహిర్గతంగా పాఠకగతమైనదిగానే ఉండాలి. అలా ఉన్నపుడే కథనం రక్తికడుతుంది. అదేరీతిలో రచన రచయితగతమైనదైతే పాత్రలు ఏకోన్ముఖంగా సాగుతాయి. ఇలా రచనకి, పాత్రలస్వభావానికి మధ్య సమన్వయం కుదిరినప్పుడు కథనం ఆసక్తికరమైనదిగా సాగుతుంది. తెలుగులో ఈ రచనానిర్మాణం, పాత్రల స్వభావచిత్రణ వివిధరీతుల్లో జరగటం చూడవచ్చు.

### రచనానిర్మాణం

ఫ్రెంచ్ విమర్శకుడు రోలాబార్త్ అభిప్రాయంలో రచనలు రెండువిధాలు. అవి writerly texts, Readerly texts. రచయిత ఆలోచనావిధానానికి అనుగుణంగా, రచయిత అభిప్రాయాలను యథాతథంగా ప్రకటించే రచనలు రచయితగత రచనలు (writerly texts). వీనిలో రచయిత భావాలు యథాతథంగా ఆవిష్కరించబడతాయి. రచయిత రచనద్వారా ప్రకటించదల్చుకున్నఉద్దేశాలు మినహా మరేవిధమైన ఇతరభావాలకు ఈ రచనల్లో వీలుండదు. రచయిత ఏ ఉద్దేశాన్నందించేందుకు రచనచేస్తాడో అదే ఉద్దేశం విస్పష్టంగా పాఠకునికి చేరుతుంది. పాఠకుడు తనదైనరీతిలో రచనను ఆవిష్కరించుకునేందుకు ఆస్కారం ఉండదు. అంటే రచనల్లో పాఠకుని ఊహాత్మక విశ్లేషణలకు అవకాశం ఉండదు.

పాఠకగత రచనలు (readerly texts) పాఠకుల ఆలోచనావిధానానికి అనుగుణంగా అనేకవిధాలుగా ఆవిష్కరించబడతాయి. రచయిత ఏ ఉద్దేశాన్ని ఆశించి రచించాడో ఆ ఉద్దేశంతో

పాటుగా పాఠకుల భావాలకు అనుగుణంగా తమదైనరీతిలో రచనను ఆవిష్కరించుకునేందుకు పాఠకగత రచనల్లో అవకాశముంటుంది. ఇంకా రచనలో వెలువడిన భావాలకు విభిన్నమైన అర్థాలను చెప్పుకునేందుకు ఈ రచనలు వీలుకల్పిస్తాయి. పాఠకుని దృక్పథం, సామాజిక పరిస్థితులు రచన ఆవిష్కరణలో ప్రభావం చూపుతాయి.

విద్యావిధానం ప్రధానకథాంశంగా చేసుకొని వచ్చిన వాటిలో పై రెండురకాల రచనలు కనిపిస్తాయి. ఇచ్ఛాపురపు రామచంద్రం 'తెలుగుమాస్టారు' రచయితగతరచన (Writerly Text)కు ఓ మంచి ఉదాహరణ. ఇందులో తెలుగుమాస్టారి జీవనవిధానాన్ని, నైతికవర్తనను హృద్యంగా చిత్రించారు. రచయిత తెలుగుమాస్టారిపై ఎటువంటి అభిప్రాయాలను కలిగి ఉన్నారో వాటినే తనరచనలో వెలిబుచ్చారు. రచయిత దృష్టిలో భౌతికంగాను, మానసికంగాను తెలుగుమాస్టార్లందరి ప్రవర్తన ఒకేవిధమైనది. జీవితంపట్ల వారి దృక్పథంకూడా ఒకేవిధం. అందుకే -- సాధారణంగా తెలుగుమాస్టార్లందరూ ఒకేలా ఉంటారు-- అంటూ మాస్టారిపరిచయం ప్రారంభిస్తారు. ఈ రచనలోని తెలుగుమాస్టారు అందరు తెలుగుమాస్టార్లకు ప్రతినిధిగా నిలుస్తారు.

సాధారణంగా తెలుగుమాస్టార్లందరూ ఒకేలా ఉంటారు. ఫ్యామిలీ ప్లానింగ్ రోజుల్లో కూడా గంపెడు సంతానమూ, అరిగిపోయిన చెప్పులు (ఉంటే) ఒక చేతిలో గొడుగూ (కుట్లూ, మాసికలూ ఉంటాయి. శ్రమపడి వెదికితే ఓ మూల- మాస్టారి పేరుకూడా కనిపించవచ్చు గొడుగు గుడ్డమీద) -- మరో చేతిలో సంచీ. (చవక రకానివే. రోడ్డుపక్క ఎక్కడా దొరికితే కూరలు కొనుక్కుని స్కూలుకయినా సరే పెండ్లిపిలుపుకు వెళ్ళడానికు--మాసిన, నలుపెయ్యో తెలుపుదో, అరుపెయ్యో నెలుపుదో అర్థరు పంచె--పొడుగు చేతుల కంటిమెడ చొక్కా -- చామనచాయ-- సమూరయిన ఎత్తు-- పడలిపోయిన శరీరమూ. నూటికి తొంభై ఎనిమిదిమంది తెలుగుమాస్టార్లింతే. మిగిలిన యిద్దరూ--తెలుగు మాస్టార్లు కాజాలరు.

మన ప్రాచీన సంస్కృతికి -- చిహ్నం తెలుగుమాస్టారు. కాలం మారినీ, తెలుగుమాస్టారు మారరు. వారిస్థానం-- సమాజపు తీరుతెన్నులతో నిమిత్తంలేకుండా -- సుస్థిరం. సుడిగాలి గడ్డిపోచలని ఏమీ చేయదు. .................. తెలుగుమాస్టారి హృదయంలోకి చూడగలిగితే -- పవిత్రతో, పంచగంధమో తప్ప మరేమీ కనిపించదు. అందుకే అనిపిస్తుంది -- తెలుగుమాస్టార్లు -- పిల్లలే అని.

అంటూ ప్రారంభించిన రచనలో-- తెలుగుమాస్టారి వ్యక్తిత్వం, భౌతిక స్వరూపం, తెలుగుమాస్టారి చిన్న చిన్న కోరికలు, తెలుగుమాస్టారి అభిమాన విషయాలు, జీవితపు నైతిక విలువల బోధన, శృతిమించిన ఆంగ్లభాషాభిమానం పట్ల విముఖత, సౌందర్యాభిమానం, కుటుంబజీవనంలో తెలుగుమాస్టారి అనుభూతులు, చెదరని స్థిరమైన కొన్ని విశ్వాసాలు, జీవితంతో రాజీ తప్పనిసరికావటం, చరమాంకంలో దయాభరితమైన నిష్క్రమణ-- లను ఆర్ద్రంగా చిత్రించారు. ఇందులో తెలుగుమాస్టారిని రచయిత ఏదృక్పథంతో, ఏవిధమైన భావాలతోనిండిన వ్యక్తిగా చూపించదలుచుకున్నారో అవేభావాలు పాఠకునికి చేరతాయి. పాఠకుడు తనకుతాను స్వేయంగా, తన ఆలోచనలకనుగుణంగా ఆవిష్కరణలు జరిపేందుకు వీలుపడదు. అందువల్ల దీన్ని రచయితగత రచనగానే పరిగణించవచ్చు.

రచయితగత రచనకు పూర్తి భిన్నమైనదిగా పాఠకగత రచనను (Readerly Text) పేర్కొనాలి. కాలువమల్లయ్య రచన 'సాంబయ్య చదువు' ఈ కోవలోకే వస్తుంది. సామాజిక పరిస్థితులచే ప్రభావితం కానిదిగా, సామాజికపరిస్థితులను ప్రభావితం చేయనిదిగా చదువు రూపొందటాన్ని చిత్రించిన రచన సాంబయ్య చదువు. వ్యక్తులలోని చైతన్యాన్ని చంపి, వ్యక్తిని ఓ మధ్యతరగతి మిధ్యాజీవిగా రూపొందించి కేవలం కుటుంబానికే పరిమితం చేసేదిగా ఇందులో చదువు కనిపిస్తుంది.

తనకొడుకు సాంబయ్యను ఎలాగైనా చదివించుకోవాలన్న తపన చిలుకయ్యది. అప్పటినుండి

చిలుకయ్య, సాంబయ్యలు అనుక్షణం సామాజికపరిస్థితులతో పోరాటాన్ని ప్రారంభించారు. ఒకవైపు దొరల ఆధిపత్యం, మరోవైపు కులవివక్ష, ఇంకోవైపు పేదరికం ఇలా విభిన్న సమస్యల నేపథ్యంలో సాంబయ్య డిగ్రీవరకు చదవగల్గేడు. సరిగ్గా అప్పుడే సాంబయ్యకు చదువు ప్రయోజనమేంటన్న అనుమానం మొదలైంది. అలానే ఉపాధ్యాయునిగా జీవితాన్ని కొనసాగించటం, పిల్లల చదువుకై ఆరాటం, మధ్యతరగతి ఆలోచనావిధానం, సామాన్యజీవితంతో రాజీ, ఎటువంటి మార్పు లేని చిలుకయ్య, రాజమ్మల జీవనవిధానం, అదే రెండుబక్కెట్లతో ఒంటినాగలెవసం వంటి విభిన్న సామాజికపరిస్థితులను విస్తృతంగా చర్చించటం కనిపిస్తుంది. రచనమొత్తంలో ఆ సామాజికపరిస్థితులను ఎదుర్కొనేదిశగా విభిన్న పాత్రల సంఘర్షణను చిత్రించటం చూడవచ్చు. వాస్తవ జీవితసమస్యలచుట్టూ పరిభ్రమించే ఈ రచనలోని సంఘటనలన్నీ పాఠకుడు తనదైనరీతిలో ఆవిష్కరించేందుకు అనుగుణంగా చిత్రించినవిగానే కనిపిస్తాయి.

పాఠకగత రచనకి ఒక మంచి ఉదాహరణగా ఉరిటిసులేఖ 'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్‌స్టార్' ని చెప్పుకోవచ్చు. సెక్స్ ఎడ్యుకేషన్ ప్రధాన కథాంశంగా వచ్చిన రచన ఇది. ఒక రెసిడెన్షియల్ స్కూల్‌ని ప్రధానకేంద్రంగా చేసుకొని సెకండరీ స్థాయిలో విద్యార్థులకు సెక్స్‌ఎడ్యుకేషన్ అవసరాన్ని, ఆక్రమంలో ఎదురయ్యే ప్రతిబంధకాలను ఇందులో చిత్రించారు. అయితే పాఠశాలల్లో ఎదురయ్యే వాస్తవసంఘటనలను యథాతథంగా పాఠకులకందించే ప్రయత్నం ఇందులో కనిపిస్తుంది.

ఆ... టీచర్... వరేం... లేదు... సైన్స్... అదే సైన్స్‌లో ఓపాఠం ఉంది 'అనువంశిక లక్షణాలు'అని. అందులో వీర్యం, అండాన్ని కలిసి ఫలదీకరణ జరుగుతుంది. వీర్యం, అండం సెక్స్‌యూనిట్స్ అనితెలుసు. కాని అవి ఎలాకలుస్తాయి? ఎవరు ఒదోటవేర్పి ఫలదీకరణ చేస్తారు? తల్లిదండ్రుల లక్షణాలు పిల్లలకొస్తాయనికూడా ఉంది అవెట్లా వస్తాయి?

మమ్మీ వేరు డాడీవేరు. నేను మమ్మీకడుపులోనే ఉన్నాను. నాకు అమ్మ లక్షణాలు రావాలిగా ! మరి నాన్నవెందుకొస్తాయి?

మొక్కల్లో అయితే నీరు, గాలి, కొన్ని పక్షులు ఇలా పరపరాగసంపర్కం సాయపడతానికి చాలా ఉన్నాయి. కానీ మనుషుల్లో, జంతువుల్లో ఎట్లా? ఆ పిల్లాడు సీరియస్‌గా అడుగుతున్నాడు. ఆ అడగటంలో ఇదివరకటి ఇబ్బందిలేదు. ఆ అడగటంలో సైన్స్ కనిపిస్తోందేకానీ సెక్స్ కన్పించటంలేదు.

తెలుసుకోవాలనే జిజ్ఞాస ఉందేకానీ కాంక్షతోకూడిన కుతూహలం లేదు!

ఈ జీవితచరిత్రనిగురించి అడుగుతోన్నంత సహజంగానే 'ఇంటర్‌కోర్స్'గురించి కూడా అడుగుతున్నాడు. ఆ పిల్లాడిదృష్టిలో రెండూ ఒక్కటే. సైన్స్ దృష్టిలోనూ రెండూ ఒక్కటే! అలాకానివల్లా ప్రతిదాన్నీ భూతద్దంలో మాత్రమే చూడగల ఈ మనుష్యులది! (1-4-96: 51)

"[illegible]" గట్టిగా అడిగింది స్వప్నిక. ..........

"ఏంటి? సెక్సుమనిషనవ్వతవా? ఛీ బుద్ధిలేదూ? ఏంటా పిచ్చికాలం బుద్ధులు? ఏంటా పాడుమాటలు? అసలివన్నీ నీకెందుకు? పోయి... పోయి మీ నాన్ననే అడుగుతున్నావ్. అవ్వ... అవ్వ మాకాలంలో అయితే పాఠంలో ఏదన్నా అర్థం కాకపోతేనే తండ్రినడగాలంటే చచ్చేంత భయపడేవాళ్ళం. అమ్మో ఇప్పుడు! ఛీ సిగ్గులేదూ! ఆదేమన్నా మామూలు ప్రశ్న అనుకుంటున్నావా? భారతదేశానికి రాజధానేంటి అని అడిగినంత తేలిగ్గా అడిగేశావ్! అయినా ఎక్కడికిపోతాయా తల్లిబుద్ధులు? ఆవిడకూడా ఓ పెద్ద నెరజాణ అంటకదూ!" గట్టిగా అరవసాగింది వర్ధ.

"మమ్మీ! ఇంకా గట్టిగా అరిచింది స్వప్నిక.

"చూడు! ఇంకెప్పుడూ మా అమ్మనేం అనకు"....... 33

...... ఆసమయంలోనే ఆ పిల్లకి సెక్స్‌మీద ఓ విధమయిన అసహ్యం ఏర్పడిపోయింది. ఓ రకమైన వ్యతిరేకత బలపడిపోయింది! సెక్స్ అన్నది ఓ 'తప్పు' అన్న అపోహ చోటుచేసుకుంది! సిగ్గుమాలిన తనానికి సెక్స్ ఓప్రతీక అన అభిప్రాయం స్థిరపడిపోయింది!

అతి హేయమైన చర్యగా చిత్రించబడింది. పసిమనస్సుపై గాఢంగాపడ్డ ఆ ముద్ర భవిష్యత్తులో ఆపిల్ల జీవితాన్ని నాశనంచేయటానికి నాంది పలకవచ్చు.

అసలు మనిషి మొండిగా తయారవ్వకూడదు. అలా జరగాలంటే బాల్యంనుండే తగుజాగ్రత్తలు తీసుకోవాలి. ఏ విషయంలోనైనా మంచి చెడ్డలు విశదీకరించి వాళ్ళకు తెలియపరచాలి. ప్రతివిషయంమీదా సరైన అవగాహన, విశ్లేషణ వుండాలి.

అహాన్ని సదా తృప్తి పర్చాలనుకునేవాడు మూర్ఖుడు. అహాన్ని నేర్పుతో జయించేవాడు జ్ఞాని. ..............

(ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్‌స్టార్, ఉరిటి సులేఖ, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 23-5-96).

అయితే సెక్స్‌ఎడ్యుకేషన్ పిల్లలకు బోధించాల్సిన విషయంలో భిన్నాభిప్రాయాలు వెలువడటం చూస్తాం. ఆ అభిప్రాయాలన్నీ ఇందులో వ్యక్తమైనాయి.

"అది తప్పని నేననుకోలేదు. ఆ వయసు పిల్లలకి సెక్స్‌గురించి సరైన అవగాహన ఉండాలన్న ఉద్దేశంతోనే బోధించాను కానీ వేరే దురుద్దేశం ఏంలేదు." .........

అయినా తొమ్మిదోక్లాసు పిల్లలకి ఆపాఠం ఉన్నాకూడా సైన్స్‌టీచర్లే దాన్ని దాటవేసి తక్కినపాఠాల్ని బోధిస్తున్నారు. ఆ లైంగిక విజ్ఞానాన్ని ఏ విద్యార్థికి ఆ విద్యార్థే స్వయంగా చదువుకుని ఏదయినా సందేహాలొస్తే టీచర్ని పర్సనల్‌గా కల్సి అడగొచ్చని చెప్తున్నారు. [illegible] అలాంటిది మీరేధైర్యంతో సెక్స్‌గురించి పిల్లల్తో మాట్లాడారు! దానివల్ల ఎన్ని అనర్థాలు జరుగుతాయో మీకుతెలీదా?

"మేడమ్, మీరెందుకు అలా ఆలోచిస్తున్నారో నాకయితే అర్థంకాలేదు కానీ అందరూ అనుకుంటున్నట్లు సెక్స్ గురించి మాట్లాడటం నేరమూకాదు! సిగ్గుపడాల్సిన విషయం అంతకన్నా కాదు! ఓ సైన్స్ టీచర్ అలా పాఠాన్ని దాటవేస్తున్నందుకు మనం సిగ్గుపడాలి." కొంచెం ఆవేశంగానే అంది.

"జీవంతికా మీరిలా ఆవేశపడటంలో ఏమాత్రం అర్థంలేదు. సెక్స్ ఎడ్యుకేషన్‌ని ప్రవేశపెట్టటాన్కి మనప్రభుత్వమే ఎంతగానో ఆలోచిస్తోంది. ఎంతోమంది పెద్దవాళ్ల అభిప్రాయాల్ని సేకరిస్తోంది. మరిదంతా ఎందుకు చేస్తోందంటారు! మీలాంటి వాళ్ళెవరూ దొరకకనా! మనసమాజం ఎలాంటిది? మన సంస్కృతి, సంప్రదాయాలు అవన్నీ మర్చిపోతున్నారా? మనం పవిత్రతకి బద్ధులై ఉండాలి. అయినా సెక్స్ ఎడ్యుకేషన్ అవసరమా లేదా అన్న విషయాల్ని మీతో చర్చించటాన్కి యిప్పుడు మిమ్మల్ని పిలవలేదు. మీరిలానే యిష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే ఉద్యోగం ఊడటం ఖాయం అన్జెప్పటాన్కే పిల్చాను." (26-9-'96 : 56)

రచయిత నిర్దుష్టంగా ఒక ప్రతిపాదన చేయకుండా విభిన్న ఆలోచనలను విభిన్న పాత్రలద్వారా వ్యక్తంచేయటంతో పాఠకుడు తన ఆలోచనలకు, అభిప్రాయాలకు అనుగుణంగా రచనను ఆవిష్కరించేందుకు వెసులుబాటు చిక్కింది. కాబట్టి దీన్ని పాఠకగతరచనగానే భావించవచ్చు.

పాఠకగత రచనకుమరో ఉదాహరణ 'అసిరిగాడి పుస్తకం'. స్కూలు పుస్తకం కొనుక్కోటం ప్రధానాశయంగా అసిరిగాడు పడినపాట్లు ధనిక, పేదవర్గాలపట్ల సామాజికధోరణుల్లోని వ్యత్యాసాన్ని స్పష్టంచేస్తాయి. కారులోంచి దిగిన ఒక పిల్లవాడికి తగ్గించి అమ్మడానికికూడా సిద్ధపడ్డవ్యాపారి, వాడు తిరస్కరించిన అదేపుస్తకాన్ని అసిరిగాడికి మాత్రం అదేధరకు అమ్మజూపటం, అంతవరకు అసిరిగాడ్ని అసలు పట్టించుకోని తత్వం సామాన్యులు, ధనికులపట్ల సమాజ ప్రవర్తనకు అద్దం పడుతుంది. అయితే ఇందులో రచయిత ఎటువంటి అభిప్రాయాలను వ్యక్తంచేయకుండా సామాజికచిత్రాన్ని యధాతథంగా ముందుంచే ప్రయత్నమే చేస్తాడు. కథ ఆవిష్కరణ మాత్రం పాఠకునికే వదిలివేస్తాడు. అందువల్ల ఇది పాఠకగతరచనకు ఇది ఒక గొప్ప నమూనాగా నిలుస్తుంది.

"పుస్తకం కావాలా?" గొంతులో అర్థింపులేదు. ఆప్యాయతలేదు. అధికారం ఉంది. అహంకారం ఉంది"

కావాలన్నట్లు బుర్ర ఊపేడు అసిరిగాడు. కాని ముందుకి కదలలేదు. కదిలితే ఎక్కడ తన్నుతాడో అని భయం.

"డబ్బులెచ్చావా?" తెచ్చానన్నట్లు తలవూపాడు అసిరిగాడు.

"ఊ... తీస్కో... ఏదీ నాపాయి ముప్పావలా" ఒత్తిపలుకుతూ అన్నాడు షాపువాడు.

అసిరిగాడు డబ్బులిచ్చేసి [illegible] పుస్తకం తీసుకొని ఆనందంగా ఇంటివేపు సాగిపోయాడు.

మరోమంచి పాఠకగత రచనగా 'ఎందుకు పారేస్తాను నాన్నా?' నిలుస్తుంది. ఇందులో తన కొడుకు చదువుకోసం పడితే తాపత్రయం చూసి తన చుట్టల అలవాటును మాని, ఆడబ్బుతో పుస్తకాలు కొనేందుకు సిద్ధపడిన తండ్రి ఇందులో కనిపిస్తాడు. అయితే ఈ విషయాన్ని వాచ్యంగా చెప్పక ముగింపును పాఠకునికే వదిలేయటం విశేషం.

"ఇందాకా చుట్టలకిచ్చిన డబ్బులున్నాయా పారేశావా?" అనడిగాడు కొడుకుని.

"ప....ప్పా....ప్పారేలేదు. జేబులో ఉన్నాయి... ఎందుకు పారేస్తాను నాన్నా? అన్నాడు కృష్ణుడు.

రచనలో ముగింపునుకాని, కథనంపైన నిర్ణయాలనుగాని పాఠకులకు వదలివేసే రచనగా 'పాలబుగ్గలపసివాడు' నిలుస్తుంది. అందువల్లేన దీన్ని పాఠకగత రచనగా పేర్కొనవచ్చు. పాఠ్యపుస్తకం

కోసం పాఠశాలలో చేసే నిర్బంధం పసివానిలో అంత: సంఘర్షణకు ఎలా కారణమౌతుందో ఇందులో వేదనాభరితంగా చిత్రించినా చివరకు ఎటువంటి నిర్ణయాలను వ్యక్తంచేయకుండా పాఠకుని ఆవిష్కరణకే రచనను వదలివేయటం వల్ల దీన్ని పాఠకగతరచనగా భావించవచ్చు.

బడికి వెళ్ళే దారిలో వాడికి తొలుచుకుతిని ఆలోచనలు ఇవి:

'నేను ఖూనీ చేశానా?

దొంగతనం చేశానా?

ఎవరినైనా కొట్టానా?

ఎవరిమీదనైనా తిరగబడ్డానా?

అబద్ధాలాడానా?

అల్లరి చేశానా?

మరైతే, ఇప్పుడు బడికి ఎందుకు వెళుతున్నాను?

ఏంతప్పు చేశానని?.....

బడిలో పంతులమ్మ ఇంటిపాఠం చూపించమన్నది. పలక చూపాడు మూర్తి. పంతులమ్మ బెత్తం అందుకున్నది. మూర్తి బెత్తంవైపు చూశాడు. వాడికి పంతులమ్మ ముఖం బాగాతెలుసు. పుస్తకాలకొట్టువాడి ముఖంకూడా తెలుసు . అయితే, మొదటివారం లోగా పాఠ్యపుస్తకాలు విడుదలవుతాయని ప్రకటించిన మంత్రిముఖం తెలియదు. పాఠ్యపుస్తకాల అట్టలపైన ముద్రించబడే 'ప్రభుత్వ ప్రచురణము' అనేది వాడికి తెలియదు. వాడికి కనిపిస్తున్నదొకటే! బెత్తం! (--------, పాలబుగ్గల పసివాడు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 29-11-78, పే 76-77)

## పాత్రచిత్రణ

'ఆస్పెక్ట్స్ ఆఫ్ ది నావెల్' లో ఇ.ఎమ్.ఫార్‌స్టర్ పాత్రలు స్వభావపరంగా రెండురకాలని పేర్కొన్నాడు. అవి 'Round and Flat Charectors' (ఏకోన్ముక, బహుముఖ వికసన పాత్రలు) ఇందులో ఫ్లాట్ కారెక్టర్స్ ఒకరకంకాగా, మరోరకమైన స్వభావం 'రౌండ్‌కారెక్టర్స్'ది. మనోవైజ్ఞానికులు తెల్పే 'టైప్స్', 'ఇండివిజువల్స్' అనే విభజనకూడా ఇలాంటిదే. 'ఫ్లాట్ కారెక్టర్స్' స్వభావం 'టైప్స్'కి దగ్గరగా ఉంటే 'ఇండివిజువల్స్' ను 'రౌండ్ కారెక్టర్స్'గా చెప్పుకోవచ్చు. (E.M.Forster, 1970: 75)

'ఫ్లాట్ కారెక్టర్స్' రచన ప్రారంభంనుంచి చివరివరకూ ఒకే రీతిగా సాగుతాయి. అంటే ఇవి పరిణామగతమైనవి కావు. ఈ పాత్రలు వ్యక్తిగతంగా అంటే మానసికంగా కాని, సామాజికంగా కాని ఎటువంటి సంఘర్షణలకు లోనుకావు. అందువల్ల పాత్ర ఆద్యంతం ఒకే విధమైన స్వభావాన్ని కలిగివుంటుంది. దీంతో పాత్ర ప్రారంభంలోనే పాత్ర ముగింపును పాఠకులు ఊహించగలుగుతారు. పరిస్థితులతో ఘర్షణపడటంగాని, రాజీపడటంగాని ఈ రకమైన పాత్రల్లో కన్పించదు. ఆ కారణంగా మానసిక సంఘర్షణకూడా ఉండదు. ఈ పాత్ర ఒకే రకమైన భావాన్ని, గుణాన్ని ఆధారంగా చేసుకొని రూపొందినదై ఉంటుంది.

'ఫ్లాట్ కారెక్టర్స్' కి పూర్తి విరుద్ధమైనవి 'రౌండ్ కారెక్టర్స్'. ఈ పాత్రల్లో ప్రారంభంనుంచి చివరివరకు ఒక పరిణామక్రమం కనిపిస్తుంది. పాత్ర విభిన్నమైన ఆలోచనలను కలిగివుంటుంది. ఆ ఆలోచనలమధ్య సంఘర్షణ కారణంగా వ్యక్తిలో అంత:సంఘర్షణ స్పష్టంగా కనిపిస్తుంది. అంతేకాకుండా సామాజిక పరిస్థితులతోకూడా ఈ పాత్రలు నిరంతరం ఘర్షణపడుతూ సాగుతుంటాయి. సామాజిక పరిస్థితులకారణంగా పాత్ర స్వభావంలో విభిన్నమైన మార్పులు చోటుచేసుకుంటాయి. అంటే పాత్ర వ్యక్తిత్వంలోకలిగే మార్పుకు సామాజికాంశాలను ప్రేరకాలుగాచూపడం ఈ పాత్రల పరిణామంలో కనిపిస్తుంది. అంటే నిరంతరం సామాజికంగా, మానసికంగా ఘర్షణకులోనౌతూ

బలీయమైన పరిస్థితులతో పోరాడుతూ కొన్నిచోట్ల రాజీపడుతూ అందుకనుగుణంగా తనవ్యక్తిత్వంలో మార్పుకులోనౌతూ సాగే పాత్రలే 'రౌండ్ కారెక్టర్స్'. ఈ పాత్రలు ప్రవృత్తిలోను, ప్రేరణలోను సంక్లిష్టమైనవి. ఈ పాత్రలు సద్గుణాలన్నీ మూటకట్టినట్లు ఉండవు. సహజ ప్రవృత్తిలో మానవత్వం తొణికిసలాడుతుంది. కానీ, బలహీనతలకూ, ప్రలోభాలకూ లొంగిపోతాయి. అయినా, ఎప్పటికప్పుడు మానవత్వపు అంచును అందుకోవటానికి సంఘర్షణతో సతమతమవుతాయి. ఈ పాత్రపోషణ రచయిత ప్రతిభకొక సవాలు. పాత్రపరంగా ఇవి బలహీనమైనవైనా పాత్రపోషణపరంగా ఇవి గొప్పవిగా నిలుస్తాయి.

'దండకారణ్యం'లో సారథి పాత్ర సంక్లిష్టపాత్రకు ఒక గొప్ప ఉదాహరణ. విశ్వవిద్యాలయజీవనచిత్రాన్ని బహుముఖీనంగా ముందుంచిన రచన దండకారణ్యం. విశ్వవిద్యాలయం ఒక దేవలయమని, జ్ఞానసంపదకు భాండాగారమని, సరస్వతీ తనయులకు నిలయమని భావించి అందులోకి అడుగుపెట్టిన ఒక విద్యార్థి దాని నిజస్వరూపాన్ని గుర్తించి అందుండి బయటపడ్డ వైనాన్ని ఇందులో చిత్రించారు. అయితే ఆ క్రమంలో విశ్వవిద్యాలయ చిత్రాన్ని విభిన్న పార్శ్వాలలో ఆవిష్కరించే ప్రయత్నం ఇందులో కనిపిస్తుంది. విశ్వవిద్యాలయంలో చేరినప్పటినుంచి సారథిలో నిరంతర సంఘర్షణను చూస్తాం. ఒక ఉన్నతమైన ఆదర్శంతో విశ్వవిద్యాలయంలో ప్రవేశించిన సారథికి అక్కడ ఎదురైన ప్రతి అనుభవం తన ఆదర్శాలను పరీక్షించేదికావటంతో అనుక్షణం బాహ్యపరిస్థితులతో ఓవైపు ఘర్షణపడుతూ, మరోవైపు వాస్తవాలకు, ఆదర్శానికి మధ్య ఏర్పడుతున్న అగాధాన్ని అర్థంచేసుకోలేక మానసిక ఘర్షణకు లోనికావటం ఈ రచనలో కనిపిస్తుంది. అందుకే

> తనకులానికి చెందిన విద్యార్థులందరినీ సంఘటితపరచి మరో కులంవాళ్ళను దెబ్బతీయడంకోసం ఉసికొల్పే తను చూసిన ప్రొఫెసర్ లాంటివాళ్ళూ ...డాక్టరేట్ డిగ్రీని ఆశచూపి లొంగతీసుకుని లేడీ రీసెర్చ్ స్కాలర్‌తో లైంగిక సంబంధాలు పెట్టుకుని లాడ్జీల్లో పట్టుబడుతున్న లెక్చరర్‌లాంటి వాళ్ళూ ...తనకన్నా తెలివైన విద్యార్థిని చూసి ఎంతో సంతోషంతో అభినందించడానికిబదులు అసూయతో కుళ్ళిపోయే నీచప్రవృత్తిగల రీడర్‌లాంటి వాళ్ళూ ...డబ్బులిస్తే యం.ఫిల్ థీసిస్ తనే రాసి ఇచ్చేస్తానని చెప్పి విద్యార్థులదగ్గర వేలకు వేలు డబ్బుల్ని గుంజుకుంటూ సిద్ధాంత వ్యాసాలను రాసిచ్చే అధ్యాపకులూ... తన అవయవాల సొంపుల్ని ఎరగా లెక్చరర్‌కి చూపి సులభంగా ఫస్ట్‌క్లాస్ తెచ్చుకుందామనుకునే శశికళలాంటి వాళ్ళూ ... ఆకలిగొన్న తన బిడ్డకు తల్లి స్తన్యం అందించి పాలిస్తున్న దృశ్యాన్ని చూసి కామాన్ని రెచ్చగొట్టుకునే పరమ నీచమైన స్వభావంగల రీసెర్చ్ స్కాలర్స్ లాంటివాళ్ళూ ... కష్టపడి చదవకుండా, 'కులం బలాన్ని' ప్రదర్శించకుండా కేవలం 'కులం బలం'తోనే గోల్డ్‌మెడల్స్‌ను సంపాదించుకుందామని ప్రతిక్షణం ప్రయత్నించే విద్యార్థులూ... పొరపొటున బట్టలమీద నీళ్ళు ఒలకబోసినందుకు క్షమించకుండా సర్వర్‌పై దయారహితంగా చేయిచేసుకున్న సంస్కారహీనులైన దినకర్‌లాంటి వాళ్ళూ ...ప్రేమ విషయంలో కూడా ఖాతాలు వేసుకుని, లాభనష్టాలను బేరీజు వేసుకుని డబ్బున్న అబ్బాయిని ప్రేమించ ప్రయత్నించే వర్తకపుదృష్టిగల పరిమళలాంటి వాళ్ళూ ... ప్రొఫెసర్లకూ, యూనివర్సిటీ పాలకవర్గాలకూ భట్రాజుల్లా భజనలుచేసి ... బానిసల్లా ఊడిగంచేసి తద్వారా యు.జి.సి. ఫెలోషిప్పులను సంపాదించుకునే పరిశోధక విద్యార్థులూ ... బంధుప్రీతి, లంచగొండితనం, కులతత్త్వం -- వీటి ఆసరాతో ఏనాటికయినా యూనివర్సిటీలో లెక్చరర్ ఉద్యోగాన్ని సంపాదించాలని పట్టువదలని విక్రమార్కుల్లా తమ డిపార్ట్‌మెంట్స్‌ను అంటి పెట్టుకునిఉండే వయసుమిగిన డాక్టరేట్ డిగ్రీ హోల్డర్లూ ... ఇలాంటి వారందరి వ్యక్తిత్వంలో మార్పు తప్పనిసరిగా రావాలి. ఇలాంటి వారంతా మానసికంగా ఎదిగితీరాలి. నైతిక విలువల్ని సంతరించుకోవాలి. మానవతా దృక్పథాన్ని అలవరుచుకోవాలి ... మానవాభ్యుదయానికి కృషి చేయాలి

అన్నకోరికను వ్యక్తం చేస్తాడు.

సంక్లిష్టపాత్రకు మరోమంచి ఉదాహరణగా 'సాంబయ్య చదువు'లో సాంబయ్య నిలుస్తాడు. సాంబయ్య తండ్రి 'చిలుకయ్య'పాత్రకూడా దాదాపు ఇలాంటిదే. రచన ప్రారంభంనుంచి ముగింపువరకుకూడా ఇద్దరూ జీవితంతో నిరంతరం సంఘర్షణ చేయటం కనిపిస్తుంది. వీరి ఘర్షణ,

పోరాటాలు మరింత తీవ్రంకావటానికి చిలుకయ్య తనకొడుకు సాంబయ్యను చదివించుకోవాలనుకోవటం మరింత దోహదంచేసింది. చదువుకుదూరమై తనుపడ్డ అవమానాలు పిల్లలు పడకూడదనే ఉద్దేశ్యంతో సాంబయ్యను బళ్ళోచేర్చేందుకు నిర్ణయిస్తాడు చిలుకయ్య. దీంతో ఒకవైపు చదువు మరోవైపు అవహేళనలు ఈ రెండింటితో తన అంతః, బహిర్ యుద్ధాన్ని ప్రారంభిస్తాడు సాంబయ్య.

విగ్రహారాధనం ఏర్పడటానికి గల కారణాలను ఇద్దరు ఉపాధ్యాయులు చెరో విధంగా చెబితే ఏది నమ్మాలో అర్థంకాక తెల్లమొహం వేసినాడు సాంబయ్య. 56

చెల్లెకు పెళ్ళిచూపులని అర్థమైంది సాంబయ్యకు. అంత చిన్నపిల్లకు పెళ్ళెందుకో మాత్రం అర్థంకాలేదు. మల్లేశం సారు చెప్పిన రామమోహన్‌రాయ్, వీరేశలింగం, గురజాడలాంటి వాళ్ళెంతోమంది జ్ఞాపకం వచ్చారు సాంబయ్యకు... తాను చూస్తున్నదానికీ, చదువుతున్నదానికీ మధ్యగల అంతరాలను గమనిస్తున్నాడు సాంబయ్య. 57

అలా పాఠ్యాంశాలపరంగా సాంబయ్య మానసికంగా ఘర్షణకుగురికాగా కులపరమైన అణచివేతల కారణంగా సామాజిక ఘర్షణ తప్పలేదు.

"మా చదివినవు తియ్య" అని తన పక్కనే ఉన్న కాళహస్తీశ్వర శతకాన్ని తీసి కఠినంగా ఉన్న ఓ పద్యాన్ని చూపాడు. "ఈ పద్యాన్ని చదవడానికి ఒక్క బ్రాహ్మణులకైతే తప్ప నోరే తిరగదు. మద్యం, మాంసాలు తినే శూద్రోల్లకు ఇవి చదువడం రాదు." అన్నాడు వెంకటేశ్వరరావు.

"నువ్వు చదువులో హుషారే. నీగురించి కాదు. నేం జెప్పేది. కాని బ్రాహ్మణుడో, బ్రాహ్మణాంశ ఉన్నవాడో ఐతే తప్ప సంస్కృత పదాలతో కూడిన పద్యాలను దోషాలు లేకుండా చదువలేడు"

ఆ మాటల్లోని దుర్మార్గాన్ని అర్థం చేసుకున్నాడు సాంబయ్య. అతని పసిహృదయం గాయపడింది. వెల్మారికి సరైన సమాధానం చెప్పి నోరు మూయించాలనుకున్నాడు.

"నిజమే పంతులుగారు అయితే పద్యాలను బాగా చదువరానోల్లు, సంస్కృత పదాలను మంచిగ ఉచ్చరించరానోల్లు బ్రాహ్మలకు పుట్టలేదన్నట్లేనా...?"

"కాదురా సాంబయ్యా! ఈ రోజుల్లో ఎవ్వరైనా చదువుకుంటున్నరు. వచ్చిందిగద మనకు స్వతంత్రం. ఆ గాంధి మహాత్ముడు పుట్టే దేశాన్ని పాడుజేసిండు. అందర్ని చంకకెక్కించుకున్నడు. అందుకే గిట్లయితంది"

కుటుంబంలో పేదరికంకారణంగా చోటుచేసుకుంటున్న సంఘటనలు, కట్నంపేరుతో చెల్లి పడే బాధలు సాంబయ్యలో అనేక జవాబులేని ప్రశ్నలకు కారణమైతున్నాయి.

బావకుద్యోగమైన తర్వాత ఆనాడిచ్చిన కట్నం తక్కువనిపించింది. తేవకోసారి చెల్లెను కొట్టి పంపిస్తున్నాడు. చెల్లె కాపురం నిలబెట్టడానికి తన తండ్రి ఏదో కొంత ఇచ్చి పంపిస్తున్నాడు. ఇవన్నీ ఎందుకు జరుగుతున్నాయి? ఊళ్ళో మూఢనమ్మకాలింకా చెక్కు చెదరకుండా ఉన్నాయి. వీరేశలింగం పంతులుగారు స్వాతంత్ర్యపోరాటం ముమ్మురంగా సాగుతున్న కాలంలో ఉండికూడా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనలేదు. అతడు కేవలం సంఘసంస్కరణల వరకే ఎందుకు పరిమితమయ్యాడు? సమయం దొరికినప్పుడల్లా ఎన్నో విధాలుగా ఆలోచిస్తూనే ఉన్నాడు సాంబయ్య. అతనిలో ఎన్నెన్నో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏ ప్రశ్నలకు సమాధానాలు మాత్రమాతనికి దొరకడంలేదు. 87

ఇక కళాశాలస్థాయిలో విభిన్న ఆలోచనాస్రవంతులు, వాటిమధ్యజరిగే సంఘర్షణతో సాంబయ్య ఉక్కిరిబిక్కిరి కాసాగాడు. పాఠ్యపుస్తకాలకంటే ఇతర పుస్తకాలవల్లే జీవితానికి సంబంధించిన విషయాలను తెలుసుకోవచ్చన్న విషయాన్ని క్రమక్రమంగా గ్రహిస్తున్నాడు సాంబయ్య. అలా నిరంతర సంఘర్షణలనడుమ డిగ్రీ పూర్తిచేసిన సాంబయ్యకు మొదటిసారిగా చదువు పరమప్రయోజనం పట్ల అనుమానం కలగసాగింది.

అసలిన్నేళ్ళ చదువులు తనకేం చెప్పాయి...? రాత్రింబవళ్ళు కష్టపడి చదివిన చదువులవల్ల తనకొచ్చిందేంటి? ఏం సాధించబోతున్నాడు తను. ఊళ్ళో దొరలకెందుకు వంగివంగి నమస్కారాలు పెట్టాలో ఈ చదువులు చెప్పలేదు. కొందరి కెందుకు నూర్లకొద్దెకరాల భూములున్నాయో, మరికొందరికేమాత్రం భూమెందుకులేదో తన ఇన్నేళ్ళ చదువు చెప్పలేదు. దొరల అధికారాలకు వెనకున్న మూలాలేంటో చెప్పలేదు. కొందరెంత కష్టపడుతున్నా కూలినాలితో అర్ధాకలితోనే ఎందుకు బతకాల్సి వస్తుందో ఏ చదువూ చెప్పలేదు.

నాన్న ఒంటి నాగలెప్పుడంతో సతమతంకావడం, అవ్వ తనజీవితాన్నంతా భూమికే అంకితం చేయడం వెనకున్న కోణాలు తనకే చదువులు చెప్పలేదు. తాను చూస్తూ ఉండగానే కొందరాస్తులు విపరీతంగా పెరగడం, మరికొందరివి సున్నా కావడం

ఎందుకు జరుగుతుందో చెప్పలేదు చదువులు. సమాజంలోని అంతరాలు, సాంఘిక దురన్యాయాలు, దోపిడీ, పీడన లాంటి ఏ విషయాన్నీ గూర్చి చెప్పలేదు చదువులు. అయినా తాను తనలాంటి లక్షలాదిమంది సుదీర్ఘకాలాన్నీ చదువులకోసం వెచ్చిస్తున్నారు.

తన చెల్లెల్లాంటి చెల్లెండ్లెంతోమందున్నారు సమాజంలో... మరిలాంటివాళ్ళ సమస్యలకు ఏం పరిష్కారాలను చెబుతుంది చదువు? అసలీ చదువులు తనలాంటి వాళ్ళనీసమాజంలో ఎలా బతకమన్నాయి? అసలీ చదువుల ప్రయోజనమేంటి?

ఈశ్వర్ చెప్పినట్లు ఈ చదువులు కేవలం గుమాస్తాలను తయారుచేయడానికేనా? పోనీ చదువుకున్న వాళ్ళందరికీ ఉద్యోగాలు దొరుకుతాయా? ఇప్పటికే ఎంతోమంది వీధుల్లో తిరుగుతున్నారు. తనలా చదువులో తెలివితేటలున్నవాడికి తొందరగానే ఉద్యోగం దొరకవచ్చు. కాని ఉద్యోగం దొరకనివాళ్లంతా ఏం చేయాలని చెబుతున్నాయీ చదువులు? ఎలా బతకమంటున్నాయి? అసలీ చదువులు, పాఠ్యపుస్తకాలు ప్రపంచం గూర్చి ఏం చెప్పాయి? సామాజిక పరిణామాల గూర్చి ఏం బోధించాయి? మరి తన ఇన్నేళ్ళ చదువుల కర్థమేంటి? సాంబయ్యలో రకరకాల ప్రశ్నలు.

ఈ సమాజంగూర్చి తాను కొంతైనా తెలుసుకున్నాడంటే అవి తాను బయట చదివిన పుస్తకాల ద్వారానే మరీ పాఠ్యపుస్తకాల చదువుల ఉపయోగమేంటి? చెల్లెలి సమస్య పరిష్కారం గూర్చి ఆలోచిస్తూ ఎన్నో విధాలుగా ఆలోచిస్తున్నాడు సాంబయ్య. తన చదువులకు ప్రయోజనమేంటి? చదువుకున్న వాడైన తాను నాలుగు కళ్ళతో ప్రపంచాన్ని చూస్తాడన్న తల్లికి తానే విధంగా పరిష్కారం చూపాలి? 122

స్వాతంత్ర్య పోరాటకాలంలో ఉండికూడా గురజాడ, వీరేశలింగం పంతులు లాంటివాళ్ళు స్వాతంత్ర్యం గురించి ఎందుకు పట్టించుకోలేదు? సంఘసంస్కరణల కోసమే సమయాన్నంతా ఎందుకు వెచ్చించారు? అప్పుడప్పుడనుకుంటూండే వాడు సాంబయ్య. సామాజిక సంస్కరణలెంత అవసరమో, వాళ్ళెందుకు వాటికీ ప్రాధాన్యతనిచ్చారో సాంబయ్యకు తన చెల్లె సంఘటన ద్వారా తెలిసింది. 122

తన ఆశయాలు, ఆలోచనల ప్రమేయం లేకుండానే సాంబయ్య ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించాడు. ఉపాధ్యాయ వృత్తిలోకూడా తన ఆదర్శాలకనుగుణంగా పనిచేయలేకపోయాడు. సమాజంలో ఉపాధ్యాయునిపట్లగల చిన్నచూపును గమనించి అందులోనుంచి తప్పుకోవాలనుకున్నాడు. నిరంతర సంఘర్షణకు లోనౌతూకూడా పరిస్థితులనెదిరించే ధైర్యాన్ని మాత్రం ప్రదర్శించలేకపోయాడు.

కొన్నేళ్ళు గడిచాయి. సాంబయ్యకు పిల్లలయ్యారు. అయినా చిలుకయ్య ఊళ్ళో ఒంటినాగలేవ్యవసం చేస్తూనే ఉన్నాడు. రాజమ్మ వ్యవసాయపు పనుల్లో మునిగి తేలుతూనేవుంది. వాళ్ళనేపని చేయకుండా కూర్చోని తినమనే ధైర్యం సాంబయ్యకులేదు. వ్యవసాయం మానుకోమన్నా చిలుకయ్య మానుకోవడానికి సిద్ధంగా లేడు. అయినా తాను చదువుకునే వయసులో ఏమైతే అనుకున్నాడో వాటిని చేయడానికి సాంబయ్య చుట్టూ గిరిగీసుకున్న కుటుంబపరిధి అనుమతించడంలేదు. 125

ఉద్యోగం దొరికి పదేళ్ళు గడిచిన తర్వాత ఒక్కసారి వెనుదిరిగి చూసుకున్నాడు సాంబయ్య. చాలామంది మధ్య తరగతి జీవుల్లాగే తానెంత మధ్యతరగతి ఊబిలో దిగి బతుకుతున్నాడో అర్థంచేసుకున్నాడు. ఆ ఊబినుంచి బయటపడే ధైర్యం మాత్రం అతనికి లేదు. బయటపడటం ఇష్టంకూడా లేదు. తన చదువు, తన జీవితం ఏం నేర్పింది? తను చదువుకొని ఏం సాధించగలిగాడు? తాను చదువులో క్లాసులో ఫస్టయి, ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణుడై అంత జీవితాన్ని చదువుకే అంకితంచేసి ఏం సాధించినట్లు. ఎన్నోరకాలుగా ఆలోచిస్తున్నాడు సాంబయ్య. 126

సాంబయ్య ఆలోచనల్లోగాని, ఆచరణల్లోగాని మధ్యతరగతి మనస్తత్వం గోచరిస్తుంది. ప్రతిదాన్ని ఆలోచనల్లో ప్రశ్నిస్తున్నప్పటికీ ఆచరణల్లో ప్రతిఘటించలేకపోవటం, పరిస్థితులతో రాజీపడటం కనిపిస్తుంది. తను ఆశించే ఆదర్శాలను నిలుపుకోలేక, వాస్తవాలను జీర్ణంచేసుకోలేక అనుక్షణం, నిరంతరం సామాజిక, కుటుంబ పరిస్థితులతో ఘర్షణ, రాజీలమధ్య ఊగిసలాడే వ్యక్తిత్వంగా సాంబయ్య పాత్ర నిలిచిపోతుంది.

సరిగ్గా ఇలాంటితరహా పాత్రే పంతుల జోగారావ్ 'విషగుళికలలోకూడా తారసపడుతుంది. ఆదర్శ ఉపాధ్యాయుడుగా రూపొందాలనుకున్న ఒకవ్యక్తి ఉపాధ్యాయవృత్తిలో ప్రవేశించింది మొదలుగా పొందిన నిరంతర ఘర్షణలు, ఉద్ధానపతనాలు, సాగించిన పోరాటాలు, అనివార్యమైన రాజీలు ఇలా ఒక సగటు మధ్యతరగతి వ్యక్తిత్వానికి నిఖార్సయిన ప్రతిబింబంగా

అతను పొందిన అనుభవాల ప్రతిఫలనమే ఈ నవలలో ఆవిష్కరించబడింది.

ఎన్నో ఆదర్శాలతో ఉపాధ్యాయవృత్తిలో ప్రవేశించిన 'విద్యాసాగర్'కు తోటి ఉపాధ్యాయుడు జానకేశ్వరరావు చూపించిన 'చీకటిదారులు'-- విద్యారంగంలోని అవినీతిరూపాలను కళ్ళముందుంచుతాయి. తను కలలుగన్న ఆదర్శ ప్రపంచానికి అక్కడి చీకటిప్రపంచానికి మధ్యఉన్న అగాధాన్ని అర్థంచేసుకోలేకపోయాడు విద్యాసాగర్.

కానీ బాధ్యతగల అధికారులూ, పవిత్రమయిన ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవాళ్ళూ కూడా అలా వుంటారనీ, అలా ప్రవర్తించగలరనీ మాత్రం అతను ఊహించలేదు. ముక్కుపచ్చలారని పిల్లలకి విద్యాబుద్ధులు నేర్పుతూ.. వాళ్ళకీ సమాజానికీ కూడా ఎంతో ఆదర్శప్రాయంగా ఉంటారనీ-- ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించబోవడం అదృష్టవశాత్తూ లభించిన వరం అనీ, ఇలా ఎన్నెన్నో కలలు కన్నాడు. ఎంతో ఊహించుకున్నాడు. పాపం పుణ్యం ప్రపంచమార్గం... కష్టం, సౌఖ్యం, శ్లేషార్థాలూ... ఏమీ ఎరుగని ఆ పసిపిల్లల మధ్య గడపగలిగే భాగ్యం లభించినందుకు పొంగిపోయాడు. అందుకే, ఎక్కడో మారుమూల కొండలమీద టీచరు పోస్టు లభించినా అతనందుకు బాధపడలేదు. తన ఆదర్శాలని అమలుచేసే సదవకాశం లభించినందుకు ఉప్పొంగిపోయాడు. 31

"విద్యా!" అని ఆత్మీయంగా సంబోధించి, తను నాంది చేసుకున్న క్షణంలో పొదివిపట్టుకుని, తనకోసం ఆరాటం చెందిన వ్యక్తి... జానకేశ్వరరావు... మంచి ఉన్నతభావాలు కలవాడే అని బోధపడుతూనే ఉంది. మరి అలాంటివాడు తనకి తొలి పరిచయంలో అలాంటి సంస్కారహీనులయిన వ్యక్తులసమూహం మధ్య ఎందుకు కనిపించాడు. 32

ఉన్నత భావాలుగల ఆఫీసర్లు, ఉద్యోగుల మధ్యే-- అసంతృప్తితో, అంధకారంగా కనిపించే భవిష్యత్తులోకి అవలోకిస్తూ, భయాందోళనలకి, విస్మృతులకి గురవుతూ ఆశాంతితో పోరాడే యువతరానికి ఎంత ఊరట కలుగుతుందో ఆవేశంగా వర్ణించాడు.

ఇంకా విద్యాసాగర్‌ను మరింత ఘర్షణకులోనుచేసే విద్యావిచిత్రం అతనికి ఆదిలోనే ఎదురవడం ఓ భయంకర అనుభవం.

"అందేటి. ఈ ఉద్యోగంలో చేరొద్దని నేనేకాదు, మెడమీద తలవున్న వాడెవడూ కూడా చెప్పడు. రేపు మంచిరోజని అంటున్నారుకదా! రేపు ఉదయం మళ్ళీ వస్తాను. ఓ జాయినింగ్ రిపోర్టు రాసివుంచండి. తీసికెళ్ళి ఎమ్.ఇ.ఓ.ని కలిసి ఇచ్చేస్తే సరిపోతుంది. ఉద్యోగంలో ప్రవేశించినట్లే...

ఈ మనిషిలో ఏదో చిరాకు వుంది. కనిపించని మెలికలేవో వున్నాయి. మనిషి మంచివాడే కావొచ్చును. కాని తను కోరుకునే మంచి ఇది కాదు. బీదవాడిని జాలిపడి తీసుకునే లంచంలో ఎంతో కొంతకాలం తగ్గించుకొనే మంచికాదు తను కోరుకునేది. అప్పుడే తెలిసి పదిమందికోసం తలదించుకునే మంచికాదు తను ఆశించేది. వెన్నెలంత స్వచ్ఛమయినది. మందుకుంచువులు ఎన మెరిసే గర్భీభవ్యంత నిర్మలమయినది. పవిత్ర పుణ్యజలాల లాగా పరిమళించేది-- అలాంటి మంచి తనకి కావాలి.

"అయాం సారీ... మిమ్మల్ని హర్ట్ చేసినట్టున్నాను. సూటిగా చెప్పాలంటే... ఇదివరకు నేను ఇక్కడే దగ్గర్లో వున్న వూళ్ళో పనిచేస్తూ వుండేవాడిని. కొండంగి ట్రాన్స్‌ఫరయి ఏడాదిన్నరయింది-- నిజం చెప్పాలంటే ఆ ఊరికి నేను కావాలని బదిలీ చేయించుకున్నాను. మీరు నమ్ముతారో లేదో... ఆ బదిలీకోసం నేను రెండువేలకు పైగా ఖర్చుపెట్టాను కూడా..."

"ఈ ఏడాదిన్నర కాలంలోనూ నేను ఒక్కసారి కూడా ఆ ఊరు వెళ్ళలేదంటే మీరు నమ్మకపోవచ్చు...".

"లాంగ్‌లీవ్ పెట్టేసనో, మరేదోనని అనుకోకండి- నెలనెలా జీతం అందుకుంటూనే వున్నాను."

పులిపుట్టులాంటి రిమోట్ ప్లేసెస్ ఇంకా చాలా ఉన్నాయి. అక్కడొక స్కూలు ఉన్న సంగతి రికార్డులవరకే పరిమితం.. ఇంతవరకూ ఏ టీచరూ వెళ్ళిన దాఖలాలేదు. ఇదిక్కడ విద్యాశాఖలో బహిరంగ రహస్యమే. అందుకు అమృతరావులాంటి వాళ్ళ జేబులు నిండుతున్నాయి. టీచర్లు వ్యాపారాలు చేసుకోవడమో, లోకల్ ట్యూషన్లు చెప్పుకోవడమో చేస్తుంటారు. అదనంగా వచ్చే ఆదాయంలో ఎంతో కొంత ఇవ్వక పోయినా ఫర్వాలేదు. ఇతర వ్యాపకాలు చూసుకోడానికి వాళ్ళకి కావలసినంత టైముంటుంది." 36

"విద్యా! క్షమించండి... నేను చెప్పేది అర్థం చేసుకోండి. మీకు తెలుసా! ఆ స్కూళ్ళు తనిఖీ చెయ్యాల్సిన అధికారులెవరికీకూడా ఆ ఊళ్ళెక్కడున్నాయో తెలీదు-- ఏ ఒక్కరూ కనీసం ఒకసారికూడా వెళ్ళి వుండరు. విజిట్లూ, ఇన్‌స్పెక్షన్లూ జరిపించినట్లు ఇక్కడే ఏ లాడ్జీగదిలోనో కూర్చుని రిపోర్టులు రాసుకుంటూ ఉంటారు. 37

"ఎన్నో ప్రశ్నార్థకాలతోనూ, మరెన్నో సందేహాలతోనూ నా ప్రయాణాన్ని ఆరంభిస్తున్నాను తండ్రీ! ఈ మార్గంలో ఎన్నో సవాళ్ళను ఎదుర్కొనే పరిస్థితి కనిపిస్తోంది. నాకా శక్తినివ్వు. ఏ ఆదర్శాలు నిలుపుకోవాలని కోరికోరి ఈ ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించవలిచేనో ఆ ఆదర్శాలు నిలుపుకునే బలాన్నివ్వు" 38

"అతను నాణేనికి ఒకవైపు మాత్రమే చూపిస్తున్నాడనిపిస్తోంది. అదే నిజమనీ, నమ్మమనీ చెప్తున్నాడు. తను చూపించే నాణేనికి బొరుసులేదు బొమ్మ లేదని వాదిస్తున్నాడు. బొమ్మా బొరుసులలో ఏదో ఒకటి మాత్రమే వుండడం అసాధ్యం

కదూ నాన్నా? అవినీతి మార్గాలు అవలంభించే ఉపాధ్యాయులు ఎక్కువమందే ఉంటారు. వాళ్ళకంటే ఎక్కువసంఖ్యలోనే ఉంటారు. బాధ్యతాయుతంగా పనిచేసేవాళ్ళు. మంచీచెడూ, వెలుగునీడల్లా అంతటా ఉంటాయి. మీకు చెప్పేంత వాణ్ణికాను. ఒక గొప్ప వ్యవస్థకు వ్యక్తుల మంచితనం వల్ల మరింత మేలు జరుగుతుంది. వ్యక్తుల చెడ్డతనం వాళ్ళనే పతనం చెందేలా చేస్తుంది తప్ప విస్తృతంగా విస్తరించిన ఆ మహావ్యవస్థను ఏమీ చెయ్యలేదు. టీచరవాలని చిన్నప్పటినుంచీ కోరుకున్నాను. నా కోరిక నెరవేరే సమయం వచ్చింది. మీరింక మరేమీ దిగుళ్ళు పెట్టుకోకండి నాన్నా. 38

ఇటువంటి అనుభవాల నేపథ్యంలోకూడా ఒక ఆదర్శ ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తించేందుకు సిద్ధపడిన 'విద్యాసాగర్' అక్కడ నిలదొక్కుకునేందుకు అక్కడి సామాజిక పరిస్థితులతో ఘర్షణ అనివార్యమైంది.

అందర్నీ సొంతమనుషుల్లాగా చూసే అమాయకమయిన సంస్కారం వీళ్ళది. నాలుగు అక్షరాలు నేర్పించి తమ పిల్లల్ని తీర్చిదిద్దటం కోసం వచ్చిన మేష్టర్లపట్ల ఎంతో ఆదరాన్ని చూపిస్తారు. కానీ, తమ స్వంతప్రయోజనాలకోసం, స్వార్థాలకోసం, తమ విలాసాలకీ, సౌకర్యాలకీ ఆటంకం కలుగుతుందన్న భయంతో యీ మారుమూల ఉండి పనిచెయ్యటానికి ఎవరూ అంగీకరించరు. అందుకోసం వాళ్ళొక అంతర్గత ప్రపంచం సృష్టించారు. ఒక అవినీతి వలయాన్ని ఏర్పరచుకున్నారు. తప్పించుకుందుకి కుటిలోపాయాల్ని కల్పించుకుంటున్నారు... ఒక్కరోజుకూడా ఇక్కడ బడి నడపనక్కరలేకుండానే తమ పబ్బం గడుపుకొస్తున్నారు. అదనపు ఆలవెన్సులతో జీతాలందుకుంటున్నారు. అవినీతిలో కూరుకుపోయిన అచ్యుతరావులాంటి అధికారులు ఈ విషపుగోతుల్ని పూలుకర్రల్లా నిలబెడుతున్నారు.

ఈ కొండ ఊరి ప్రజలకు, తమ ఊళ్ళో బడి ఎప్పుడు తెరుస్తారో తెలీదు. ఎప్పుడూ ఎందుకు మూతబడి ఉంటుందో అసలే తెలీదు. ఆ విషయాల్ని పట్టించుకోగలిగే పరిజ్ఞానమూ వారికి లేదు. పట్టించుకున్నా ఆ విషయం ఎవరికి తెలియజెయ్యాలో తెలీదు. తెలిసినప్పటికీ ప్రెసిడెంటులాంటి కొద్దిపాటి చదువుకున్నవాళ్ళకి అక్కర్లేదు. అవసరమయితే వాళ్ళని మంచిచేసుకునో, మందుపోసో తమకి అనుకూలంగా తిప్పుకునే చాకచక్యం కూడా ఆ మేష్టర్లకీ అధికారులకీ వుంది. అందుచేత... యీ అవినీతి అవిచ్ఛిన్నంగా సాగిపోతూనే ఉంది... 51

విద్యారంగం భ్రష్టుపట్టిపోయిందని దులపరించుకునేవారికి ముందుగా కనిపించే ముద్దాయి ఉపాధ్యాయుడే! కానీ...అదితప్పేమో...పాక్షిక సత్యమేమో··· సాకల్యంగా ఆలోచిస్తే 'కర్రతీ దావుకి కారణాలాను' అన్నట్లు··· దానికి జవాబుదారీ ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే కాదని అర్థమవుతుందేమో... 51

“అసలు నీకు తెలుసా! ఈ కొండజాతి ప్రజలు పశువుల పాలు పితకడానికి ఒప్పుకోరు... తల్లి పాలన్నీ దూడ తాగాల్సిందే... ఇప్పుడిప్పుడే మన టౌనువాళ్ళ వాసన వీళ్ళకి కొద్దిగా సోకుతోంది... గవర్నమెంటు గేదెలూ ఆవీ యిచ్చి వీళ్ళలో ఆ దృక్పథం కాస్త వెనుకంజవేసేలా చేసింది... ఇప్పుడిప్పుడే పాలుపితకడం... పట్టుకెళ్ళి అమ్మడం చేస్తున్నారు” అని చెప్పేడు.51

అతను నవ్వేడు. నవ్వి, “అంతవేగిరం బాగుచేయిస్తాననుకోను... ముందతనికి విశ్వాసం కుదరాలి... నువ్వు అందరి మేష్టర్లలాగా ఈ వాతావరణంలో యిమడలేక బెదిరి పారిపోవని... ఇక్కడే ఉండి పిల్లలకి పాఠాలు చెప్పుకుంటావని నీమీద నమ్మకం కుదరాలి” అన్నాడు. 52

అలా ఒక ఆదర్శంకోసం నిలబడుతున క్రమంలోనే 'విద్యాసాగర్' జీవనక్రమాన్ని నియంత్రించే సంఘటనలు చోటుచేసుకున్నాయి. అనారోగ్యంతో పాఠశాలలో పనిచేయలేకపోయిన కాలాన్ని అడ్డదారుల్లో సొమ్ము చేసుకోవటాన్ని సమర్థించుకోజూడటం ఆదర్శాలపై వ్యక్తిగత ప్రయోజనాలు విజయంసాధించడానికి తార్కాణం.

ఈ ఇరవైరోజులలోనే జానకేశ్వరరావు చాలా తతంగం జరిపించేడు. అతనూ, తండ్రీ బలవంతపెట్టడంతో తనూ కాదనలేకపోయేడు. ఆ పనిచేస్తూ ఉంటే ఒక్కొక్క మెట్టూ దిగజారి అధఃపాతాళానికి కుంగిపోతున్నట్లనిపించేది విద్యాసాగర్‌కి. ఆ పరిస్థితుల్లో అలా చెయ్యటం తప్ప మరో గత్యంతరం లేదని తనను తాను సమాధానపర్చుకోవాలని ప్రయత్నించేవాడు. మనసు ఎదురు తిరిగేది. తను... తను కూడా అందరిలాగే అడ్డదారిలో ప్రయాణానికి సిద్ధమవుతున్నాడా! తను చేసిందానికి ఏవో సంజాయిషీలూ, సమాధానాలకోసం వెతుక్కుంటున్నాడా! తన ఆదర్శం అబద్ధమేమో! తన నిజాయితీ గడ్డిపరక విలువ చెయ్యనిదేమో... తన అంతరంగంలో ఎక్కడో ఒక వెసులుబాటు వుంది. ఎక్కడో ఒక అపనమ్మకం వుంది... జానకేశ్వరరావులాగే తన వ్యక్తిత్వంలో కూడా ఏదో తెలీని 'మెలిక' వుంది... ఆ ఆలోచన రాగానే దుఃఖం ముంచుకొచ్చేది విద్యాసాగర్‌కి. ఆకులా వణికిపోయేవాడు... 66

“నువ్వీ జాయినింగు రిపోర్టు పంపించేవు... కనుక ఉద్యోగంలో చేరిపోయినట్లే. ఆ తర్వాత యింతవరకూ నువ్వు బడికి జ్వరంవల్ల వెళ్ళలేకపోయేవు... కొత్తగా చేరిన నీకు సెలవేం ఉంటుంది. అందేత... నువ్వు జాయినింగ్ రిపోర్టు పంపించిన తేదీనుంచీ యివాళ్టివరకూ యిందులో సంతకాలు పెట్టు... మరేం ఆలోచించకు... ఏ రిస్కూ లేదు... నువ్విప్పుడిందులో సంతకాలు చేయకపోతేనే రిస్కులో పడతావు... ఇదంతా మామూలే... అందరికీ తెలిసిందే... 66 వెళ్ళిపోయేముందు చింతలగూడెం మేష్టారు సత్యం... గుమ్మం వరకూ వెళ్ళిన వాడల్లా తిరిగి తన దగ్గరికి వచ్చి నెమ్మదిగా అయినా స్పష్టంగానే అన్న మాటలు అతని

చెవుల్లో గింగుర్లు తిరుగుతున్నాయి...

"విద్యా! మీరున్న ప్రస్తుత పరిస్థితిని నేను అర్థంచేసుకోగలను... మీ మనసులో తుఫాను భీభత్సం మీ కళ్ళలో చూసి నేను పోల్చుకోగలుగుతున్నాను... ఆశ్చర్యపడకండి... అపరాధభావన మనిషిని దహించివేస్తుంది. ఏవో కుంటిసాకులతో, సమర్థింపుల్తో ఆ భావనని తుడిచిపెట్టే ప్రయత్నంచేస్తే మనిషి ఇంకా ఇంకా పతనమైపోతాడు... నిజమయిన పశ్చాత్తాపంతో దహించబడినవాడే మనిషి మనిషిగా నిలదొక్కుకోగలుగుతాడు... అతని వ్యక్తిత్వం వికసించగలుగుతుంది... వైరుధ్యాలని అధిగమించగలగడంలోనే వ్యక్తి వికాసం జరుగుతుంది... మరోసారి తీరిగ్గా మిమ్మల్ని కలుస్తాను సెలవ్" అని వెళ్ళిపోయాడతను. 67

అయితే ఈ సంఘటన అతనిలో మానసికంగా అపరాధభావనని కలుగచేయటం పాత్ర సంక్లిష్ట స్వభావానికి సూచన. ఆ తర్వాత జానకేశ్వరరావు జీవనవిధానంలోమార్పు, వృత్తికి అంకితమవ్వాలన్న అతని నిర్ణయం విద్యాసాగర్‌ను ప్రభావితం చేసింది. అయితే అదీ అతనిలో ఎక్కువకాలం నిలువలేదు. వ్యక్తిగతప్రయోజనాలు అతనికి వృత్తిపైన ఏర్పడిన నిబద్ధతపైన తమప్రాబల్యాన్ని చూపసాగాయి.

బి.ఎస్సీ, ఎమ్.యూ.డీ చేసి కూడా ఇలా కొండప్రాంతంలో ఎలిమెంటరీ స్కూలు టీచరుగా ఉండిపోవలసి రావడం బాధకలిగించేది. ప్రమోషన్ వస్తేకానీ హైస్కూలుకి వెళ్ళవీలులేదు. తను చదువుకున్న చదువుకి కొంతలో కొంత సార్థకత చేకూరాలంటే ప్రమోషన్ రాక తప్పదు.

రోజులు గడుస్తున్నకొద్దీ అతనిలో ఉత్సాహం తగ్గిపోవడం ప్రారంభించింది. రోజూ బడికి వెళ్ళడం, పాఠాలు చెప్పడం, ఇంటికి తిరిగొచ్చాక వండుకుతినడం. తన జీవితంలో ఏదో స్తబ్దత ఏర్పడినట్లు అతనికి తోచింది. ఆ ఎలిమెంటరీ స్కూలు పిల్లలకి అఆలు మాత్రమే చెప్పుకోవడంతో అతను సమాధానపడలేక పోతున్నాడు. 83

ప్రమోషన్‌పొంది హైస్కూలు ఉపాధ్యాయునిగా అక్కడకూడా పరిస్థితులతో ఘర్షణతప్పని స్థితి. ముందుగా ఘర్షణ, ఘర్షణ అనంతరం రాజీ ఇదీ విద్యాసాగర్ జీవనముఖచిత్రం.

"ఏదో జరిగిందనీ, జరుగుతోందనీ మనం మన కర్తవ్యాన్ని విస్మరించలేం. విద్యారంగం రానురాను ఒక యుద్ధరంగంగా మారిపోతుంది. మనం సుశిక్షితులైన సైనికుల్లా పనిచేయక తప్పదు. ఇలాగ విమర్శలూ, ప్రతివిమర్శలూ చేసుకుంటూ మన విధిని మనం చేయకుండా వదిలెయ్యడం వివేకం అనిపించుకోదు. అందుచేత నేను ఇందాక ప్రతిపాదించినట్లుగా మీరంతా మరింతగా కృషి చేసి ఈసారి మనస్కూలు ఉత్తీర్ణతాశాతాన్ని బాగా పెంచాలని కోరుతున్నాను."

ఈ మహా యంత్రాంగంలో తను ఒక చిన్న మరలాంటివాడు. ఈ యంత్రం ఎలా తిరిగితే తానూ అలాగే తిరగాల్సి వస్తోంది... తుప్పుపట్టిన మరలతో, పనిచెయ్యని మొరాయించే భాగాలతో నూరాలుడే స్థితిలో ఉన్న ఈ యంత్రాన్ని సమూలంగా రిపేర్ చేయగలిగే మెకానిక్ ఎవరు? ఈ శిథిల యంత్రం దేశానికి మంచి ఉత్పత్తులను ఎలా అందించగలదు? 107

ఇలాంటి నిరంతర ఘర్షణ, రాజీలతోసాగే ఈ పాత్ర సంక్లిష్టపాత్రకు ఒక చక్కని నమూనాగా నిలుస్తుంది.

ద్వారకా 'పల్లెపిలిచింది'లో 'ప్రసాద్' పాత్ర కూడా దాదాపు 'విద్యాసాగర్' పాత్రను పోలిఉంటుంది. బదిలీమీద మారుమూల చీకటిపల్లె 'జంటాడ'కు వెళ్ళి అక్కడ విద్యాగంధంకోసం చేసిన కృషి, ఆ సందర్భంగా ఎదుర్కొన్న సంఘర్షణలు ఈ రచనలో ప్రధానభూమిక వహిస్తాయి. ఓ సగటు మధ్యతరగతి వ్యక్తిత్వానికి ప్రసాద్ పాత్ర ప్రతిబింబంగా నిలుస్తుంది. తను నమ్మిన ఆదర్శాలకు, విద్యావ్యవస్థలోని లోపాలకు మధ్య జరిగే ఘర్షణలో నలిగిపోయే పాత్ర ఇది.

....... "ఉద్యోగాల్లో కష్టమైనవి, సుఖమైనవి అంటూ ఉండవు కర్మగారూ! కష్టం, సుఖం చేసేవాడి సిన్సియారిటీ మీద ఆధారపడి ఉంటాయి. ఎంత సిన్సియరయితే అంత కష్టం. ఎంత ఇన్‌సిన్సియరయితే అంత సుఖం. ఒచ్చిన చిక్కంతా ఒక్కటే. మనవాళ్ళు సిన్సియారిటిని శిక్షిస్తున్నారు....." అన్నాడు.

....... "ఇప్పుడు మనకూ వచ్చింది త్రైరిలు రోగం! నువ్వు లెస్సన్‌ప్లాన్ సిద్ధంగా రాసిపెట్టుకొని ఉంటేచాలు. డి.ఇ.ఓ గారు చూపమన్నప్పుడు చూపిస్తే చాలు. నువ్వు మంచి టీచరుకిందనే లెక్క! నువ్వు క్లాసులోకి పోయినా, పోకపోయినా పాఠం చెప్పినా, చెప్పకపోయినా ఫరవాలేదు. ఆయనకు కావల్సింది పిల్లలు చదువు నేర్చుకోవటంగాదు, నువ్వు లెసన్‌ప్లాను తయారుచెయ్యటం. మనవాళ్ళు మహాగొప్ప మేధాసంపన్నులండీ! పరుగుపందెంలో నువ్వు పరిగెత్తితే ఓడిపోతావు. పరిగెత్తినట్లు నటించు. బహుమానం నీదే!"

మరోవైపు ఆదర్శానికీ, వ్యక్తిగత ప్రయోజనాలకూ మధ్య ఘర్షణ ఏర్పడినప్పుడు ఎటూ తేల్చుకోలేని మనస్తత్వం.

బయటి ప్రపంచంలో ఏం జరుగుతున్నదో తెలుసుకోవటంలేదు నేను. ఆయన మాటలకు నా తల తిరిగిపోయింది. నాకంటే తక్కువ సర్వీసున్నవాళ్ళు నాకంటే ఎక్కువజీతాలు అనుభవిస్తూ, ఎక్కువ వేతనాలు తీసుకుంటున్నారు.

"విన్నావా నువ్వు ప్రసాద్ అయ్యా! యువర్‌వర్క్ డోంట్ పేయూ టీజ్ దేస్!....

...... "ఇలా మారుమూల పల్లెల్లో ఉన్నందుకు అన్నీ నష్టాలే. హౌస్ రెంట్ అలవెన్సులులేవు. కాంపెన్సేటరీ అలవెన్సులు లేవు. జీవితంలో పైకొచ్చే అవకాశాల్లేవు. పరీక్షలు పాసయ్యేందుకు అవసరమైనంత సహాయం దొరకదు. ఆధునిక జీవితసౌకర్యాలమాట దేవుడెరుగు. ...... ప్రయోజనాలను మరచిపోయి పనిచెయ్యటం నేరం. ఆయన చాలా చక్కగా చెప్పాడు. "యువర్ వర్క్ డోంట్ పేయు టీజ్ దేస్" అని. అది ప్రత్యక్షర సత్యం. ...... "అవునూ, స్వవిషయాలను గురించి ఆలోచించేవాడు ఇతర విషయాలనుగురించి ఆలోచించగలడా? తన పురోభివృద్ధిని గురించి ఆలోచించేవాడు ఇతరుల అభివృద్ధికి పాటుపడగలడా? ఈ ప్రశ్నలకు ఈ వ్యవస్థే సమాధానం చెప్పాలి!

సర్వీసులో నాకంటే జూనియరు క్వాలిఫైడ్ హెడ్మాస్టరు కాలేగాదు. అందుక్కారణం అతను నాకంటే తెలివైనవాడుకావటం కాదు. విద్యా యోగ్యతలు ఎక్కువగా కలిగి ఉండటంవల్లకాదు. అతను సౌకర్యాలు ఎక్కువగా ఉన్న ప్రదేశంలో పనిచేస్తూ తన ఉన్నతికోసం కృషి చేసుకున్నాడు. నేను మారుమూల ప్రాంతంలో ఉండి ఈ పాఠశాల ఉన్నతికోసం కృషి చేశాను. అతనికి పురస్కారం నాకు శిక్ష! ఇది ఏ నీతికి చెందుతుందో తమకు, పాలనలో తమకు మార్గదర్శకత్వం వహిస్తున్న పెద్దపెద్ద అధికారులకు మాత్రమే తెలియాలి.

అలా-- వ్యక్తిగత జీవితానికి, ఆదర్శాలకు, సామాజిక అవినీతికి మధ్య నిరంతరఘర్షణతో సాగే ప్రసాద్ పాత్ర ఒక సంక్లిష్ట పాత్రకు ప్రతినిధిగా కనిపిస్తుందిందులో.

కాయతి అప్పారావు 'పంచరంగులు'లో విజయ పాత్ర ఆదర్శభావాలుగలది. అయితే జీవితంలోని నిమ్నోన్నతాలకు, జయాపజయాలకు మధ్య సంఘర్షణకు లోనుకాని పాత్ర ఇది. ఉపాధ్యాయుడికి భార్యగా ఉంటూ పాఠశాలలోని మధ్యాహ్నభోజనం విషయంలో చోటుచేసుకునే అవినీతిని ఎదిరించి, ఆదర్శ యువతిగా గుర్తింపు పొందటం ఆదర్శ వంతంగా కనిపించినప్పటికీ పాత్ర స్వభావపరంగా ప్రారంభంనుండి చివరివరకు ఎకరీతిగా సాగటం కనిపిస్తుంది. ఇది సామాన్యపాత్రకు (ఫ్లాట్‌క్యారక్టర్) చక్కని ఉదాహరణ.

మన్నెంశారద 'నిర్నిద్రగానం'లో గాయత్రి పాత్రకూడా ఇలాంటిదే. ఆదర్శవంతమైన అధ్యాపకురాలిగా, కళాశాలలో విద్యార్థులందరిని తీర్చిదిద్దేందుకు కృషిచేసే వ్యక్తిగా గాయత్రి పాత్ర నిలుస్తుంది.

జీతంరాళ్ళకోసం కాలేజీకివచ్చి, ముక్కునపెట్టుకున్న మూడువాక్యాలు వల్లించి- తర్వాత విద్యార్థులకి తమకు ఎలాంటి సంబంధం లేదనుకునే కొంతమందివల్ల విద్యార్థులలో క్రమశిక్షణా రాహిత్యం, చదువుపట్ల నిరాసక్తత, ఆడంబర ప్రియత్వం, సుఖలాలసత కల్గుతున్నాయని అనిపించి, సాధ్యమైనంతవరకు అందుబాటులో వున్నంతవరకు భావితరాన్ని తీర్చిదిద్దాలనే ఆకాంక్షతో అధ్యాపకవృత్తిని చేపట్టి, ఆటంకాలెదురైనా పట్టుదలతో అధిగమించి ఆదర్శాలకు కట్టుబడిన వ్యక్తిగా గాయత్రి పాత్ర ఇందులో కనిపిస్తుంది. ఇది ఫ్లాట్‌క్యారెక్టర్‌కి చక్కని ఉదాహరణ.

పై రెండుపాత్రలు ఆదర్శాలతోనిండిన మారనిపాత్రలుగా నిలిస్తే 'ఊబి'లో భానుమూర్తి పాత్ర పూర్తి అవకాశవాదంతో జీవన సోపానాలనధిరోహించిన పాత్రగా నిలిచిపోతుంది. ప్రొఫెసర్‌ను కాకాపట్టడంద్వారా విశ్వవిద్యాలయంలో ప్రవేశంపొంది ఎమ్మే సాధించుకున్న భానుమూర్తి లెక్చరర్‌గా పనిచేస్తూ 'గార్గి'లాంటి తెలివిగల విద్యార్థులకు బోధించేందుకు భయపడాల్సి రావటం, అడ్డదారుల్లో అందలాలెక్కాలనుకొనేవారు ఊబిలో జంతువుచందంగా విలవిలలాడాల్సి వస్తుందన్న వాస్తవాన్ని ప్రతిబింబించింది. ఇందులో భానుమూర్తిపాత్ర అవకాశవాదిగా ఫ్లాట్‌క్యారెక్టర్‌గా నిలుస్తుంది.

పి.వి.ఆర్.శివకుమార్ -- "ఆచరణల్లో ఆదర్శాలు"లో రెండువిభిన్నపాత్రలు కనిపిస్తాయి. ఆదర్శాలను తలకెక్కించుకొని, జీవిత వాస్తవాలను గుర్తించే ధైర్యంలేక ఊహల ప్రపంచంలోనే

విహరిస్తూ తనను తానే కోల్పోయిన అన్నగా భాస్కర్, ఆదర్శాలంటూ కూర్చోక జీవితాన్ని సరిగ్గా అంచనావేయగలిగి ఆచరణాత్మకరూపంలో విజయం సాధించిన తమ్ముడిగా శంభు. రెండు మారనిపాత్రలుగా, నమూనాపాత్రలుగా నిలుస్తాయి. రచన ప్రారంభంలో ఎటువంటి ఆలోచనావిధానాలతో నిండి ఉన్నారియో చివరివరకూ పాత్రలు అదేధోరణిలో సాగటం కనిపిస్తుంది. పాత్రల్లో ఎటువంటి పరిణామగతమైన మార్పులు గోచరించవు. అందువల్ల ఇవి ఫ్లాట్‌క్యారెక్టర్స్‌గానే మిగిలిపోతాయి.

ఆశయాలేతప్ప ఆచరణలో పెట్టాల్సిన విధానమూ, పెట్టగల సామర్థ్యమూ, పరిస్థితులతో రాజీపడి సర్దుకుపోతూనే నెగ్గుకురాగలిగిన చొరవా, తెలివిలేని భాస్కరం తనకు రాని ఫస్టుక్లాసునీ, హైక్లాసు ఉద్యోగాన్నీ అల్పుకు దుఃఖిస్తూనే, తనని కావాలనుకున్న సత్యనీ పోగొట్టుకుని చివరికి తనని తానే కోల్పోయాడు.

'ఇలాచేయాలి, ఇలా జీవించాల'ని ముందుగా ఏ నిర్ణయాలూ తీసుకోకపోయినా ఎదురుపడ్డ పరిస్థితులకి జంకక, అందంగా ముందుపరుచుకున్న భవిష్యత్తునీ, డాక్టర్ జీవితాన్నీ, కవితతో బ్రతుకు పంచుకోగల అవకాశాన్నీ సంతోషంగా ఎడచిపుచ్చుకునీ, తనకున్న పరిధిలోనే పరిశ్రమించి, పైకి రాగలిగి, ఇవాళ కాలుమీద కాలువేసుకు కూర్చోగలుగుతున్నా-- శంభు కాస్త తీరికచిక్కినప్పుడల్లా అన్నయ్య గురించే ఆలోచిస్తూ కూర్చునేవాడు.

రెండు విభిన్న మనస్తత్వాలతో కూడినప్పటికీ ఇవి రెండూ మారనిపాత్రలకు భిన్నమైన ఉదాహరణలుగా నిలుస్తాయి.

కె.మురళీకృష్ణ 'అంతర్యాగం'లో శరత్ పల్లెటూరి చదువు పూర్తిచేసుకుని పట్నంలో కళాశాలలో చేరిన ఒక అమాయక తెలివైన విద్యార్థి. కళాశాల వాతావరణం, అద్భుతమైన ప్రావీణ్యం ఉండికూడా కళాశాలలో బోధించక ట్యూషన్లలో చెప్పే అధ్యాపకులు, విద్యార్థుల్లో అధికులు ఉద్యోగార్థం పరీక్షలకు సిద్ధమయ్యేవారు. భాషలపట్ల వివక్ష ఇదీ కళాశాల వాతావరణం. ఇంకా భావపరంగా విభిన్న దృక్పథాలు కలిగిన విద్యార్థిసంఘాలు. ఆ విభిన్న దృక్పథాలను ఎలా అర్థంచేసుకోవాలో తెలీక అంతఃసంఘర్షణకు గురికావటం కనిపిస్తుంది.

"అటువైపువారు వాళ్ళు వాళ్ళు పురాతనభావాలు పట్టుకుని వేళ్ళాడే జీవచ్ఛవాలు! మన్నుతిన్నపాములు. వాళ్ళు అభివృద్ధి కాంక్షించరు. పురోగమనం వారికి పడదు. కొత్త ఊహలన్నా, కొత్త ఆలోచనలన్నా జంకుతారు. మనం ముందుకెళ్ళి పక్ష విపక్షలులేని సమసమాజం కోరితే వాళ్ళు వెనక్కెళ్ళి వేదకాలాన్ని కోరతారు"

"అటువైపువారు. వీళ్ళు ఏమీ పట్టనివాళ్ళు. తమపక్కనే అన్యాయాలు, అక్రమాలు జరుగుతున్నా వీరు పట్టించుకోరు. సినిమాలు క్రికెట్టు ఉంటేచాలు వీరికి. తమదాకా వస్తేకాని చలనముండదు వీళ్ళలో. ఎందుకూ పనికిరాని గొంగళి పురుగులు వీళ్ళు!" ఆవేశంగా అన్నాడు దేవేందర్.

"మరి మీరు?" ప్రశ్నించాడు శరత్.

"మా దృష్టిని విప్లవమార్గం, అత్యంతరహితం. అలజడి మాజీవితం. ఆందోళన మా ఊపిరి. తిరుగుబాటు మా వేదాంతం" అన్నాడు అల్తాఫ్ హుస్సేన్.

శరత్‌మనస్సు సందిగ్ధంలో పడింది. ఒకవంక కాలేజీలో దేవేందర్ మాటలు, లెక్చరర్ పాఠం, మరోవంక సంఘ ఆలోచనలు, ఒక వంక చదువుపట్ల తన అభిప్రాయాలు, అనుభవానికివస్తున్న చేదునిజాలు.... ఏది మంచి? ఏది చెడు? ఏది ఆదర్శం? ఏది అనుసరణీయం?

ఊళ్ళో తనజీవనం గుర్తుకువచ్చింది. కాలేజీకి వెళ్ళటం, పాఠాలు వినటం, రాత్రి ఇంటికివచ్చి చదువుకోవటం... అంతే అక్కడ సందిగ్ధతకు తావేలేదు. ఇక్కడకువచ్చిన వారంలోనే విభిన్న దృక్పథాలు, రకరకాల భావాలు పరస్పర విరుద్ధమైన సిద్ధాంతాలు.... తానెందుకు పట్నంవచ్చాడో ఆ చదువుతప్ప అన్నీ జరుగుతున్నాయి.

ఈ విభిన్న దృక్పథాలను అర్థంచేసుకోలేని అయోమయం ఒకవైపు కొనసాగుతుండగానే చదువు ప్రయోజనమేంటో అర్థంచేసుకోలేకపోవటం మరో పెద్ద ప్రశ్నార్థకంగా నిలిచింది.

తను పాఠ్యపుస్తకప్రపంచంలో మునిగిపోయిన సమయంలో బయటి ప్రపంచంలో ఆలోచనల తుఫానులు చెలరేగుతున్నాయి. ఆదర్శాల భవంతులు పునాదులతోసహా కూలిపోతున్నాయి. నూతనవాదర్శాల జిలుగువెలుగులతో సరికొత్త స్వర్గద్వారాలకు దారిచూపుతున్నాయి. తనకు బట్టీపట్టి మార్కులు తెచ్చుకోవటంతప్ప ఇదంతా తెలియదు.

తాను ఇన్నిరోజులు చదివినదానివల్ల తనకు ఉద్యోగంరాదు. దానికోసం వేరేచదువు, వేరే పరీక్షలు. ఇది పైచదువులకు తాను సాధించే అర్హత మాత్రమే! కానీ ఈ మార్కులు అందుకూ పనికిరావు. మళ్ళీ దానికో ప్రవేశపరీక్ష.

పోనీ ఈ చదువువల్ల తనకు సాటిమనుషులను అర్థంచేసుకునే శక్తి వచ్చిందా? ప్రపంచ మానవాళి జీవనగతిని అవగాహన చేసుకునే శక్తి వచ్చిందా? విశ్వరచనలో తనపాత్ర ఏమిటో గ్రహింపుకొచ్చిందా? ఏమీలేదు.

ఒకవైపు నిత్యనూతన సిద్ధాంతాలు నన్ను అయోమయంలో పడేస్తున్నాయి. ఏదిమంచి? ఏదిచెడు? ఏది ఆభిలషణీయం? ఏది అనుసరణీయం? నేనేంచేయాలి? నాకు మన ప్రాచీనసాహిత్యం, వేదాంతం, పురాణాలు చదవకపోవటం దోషంగా అనిపిస్తోంది. మరోవైపు ఇవన్నీ ఈ కాలంలో పనికిరావు అనిపిస్తోంది.

నేనీ పట్టాలుచ్చుకొనే ఉంది ఏదోచదివి, దొరికిన ఉద్యోగమేదో చేసుకుంటే నాకసలీబాధలే ఉండేవికావనిపిస్తోంది. పైగా మనుషుల స్వార్థం, మోసం, సంకుచితత్వం నాకు కొరుకుడుపడటంలేదు. నాగరికత అభివృద్ధిచెందుతున్నకొద్దీ మనిషి మానసికంగా ఎదగాలి. అంతే నైతికంగా దిగజారకూడదు. కానీ నాకు మనిషి మనిషిలా కనబడటంలేదు.'

విజ్ఞానం పెంపొందుతుంటే, పెంపొందించేది విద్య అయితే ఆ విద్యవల్ల విద్యార్థుల్లో అజ్ఞానతమస్సు కరిగి, భయంపోయి, విశ్వాసం కలగాలి. అది కలగట్లేదంటే కారణం విద్యార్థులు నేర్చుకునే విద్య సరైన జ్ఞానం కాదని అర్థం. మరి ఇది సరైన జ్ఞానం కాకపోతే, తాము చదువుతూకూడా అజ్ఞానంలోనే ఉంటున్నట్లయితే, మరి తమలోని చీకటిని పారద్రోలి జ్ఞానదీపులను వెలిగించే చదువేది? ఆ విజ్ఞానమేది?

ఆరాత్రి ఇక నిద్రపట్టలేదు. మంచంమీద పొర్లుతూ గడిపాడు. ఎంత ఆలోచించినా నిజమైన విజ్ఞానమేది? అన్న ప్రశ్నకు సమాధానం అతని మేధకందటంలేదు.

ఇటువంటి విభిన్న సంఘర్షణలమధ్య తన జీవనపంథాను నిర్దేశించుకుని అదేపంథాలో పయనించే పాత్ర శరత్‌ది. అందుకే చివరకు విద్యపట్ల ఒక స్థిరమైన అవగాహనకు రాగలుగుతాడు.

ఇది విద్యకాదు. ఇది చదువుమాత్రమే. ఇది కేవలం భౌతిక విషయ పరిజ్ఞానప్రదమే కానీ, విజ్ఞాన ప్రజ్ఞాపదం కాదు. వ్యక్తినిర్మాణ సమర్థంకాదు. జీవనోపాధి సంపాయించుకునేందుకు యువతను సంసిద్ధం చేస్తుందేతప్ప, యువతను మనిషిగా వికసింపజేసి ఉన్నత సమాజస్థాపనచేసే శక్తి ఈ విద్యలో లేదు. యువతకు కావలసింది చదువుకాదు. వ్యక్తిలో నిస్వార్థ సేవాభావాన్ని కలిగించి, పవిత్రశీలం, వినయం, సామర్థ్యం రూపొందించేది విద్య. తనలోనూ, సమస్త జగత్తులోనూ, సముద్రంలో ఉప్పులా కలిసిపోయిఉన్న విశ్వాత్మను సాక్షాత్కారం చేసుకొనేట్లు చేయగలిగేది విద్య. అనే ఒక స్థిరమైన అవగాహనతో జీవనపంథాను నిర్దేశించుకుంటాడు. అయితే పాత్ర ప్రారంభంనుంచీ చివరివరకు మానసిక సంఘర్షణకు లోనయ్యే 'సంక్లిష్టపాత్రకు' నిలువెత్తు దర్పణం ఈ శరత్‌పాత్ర.

కొండముది శ్రీరామచంద్రమూర్తి 'చిరుమువ్వల మరుసవ్వడి'. సాంప్రదాయికంగా వృత్తివిద్యలను విడిచి ఆధునిక విద్య దిశగా సాగేక్రమంలో వ్యక్తులకు, వారి విభిన్న ఆలోచనలకు నడుమ జరిగే ఘర్షణకు అక్షరరూపం ఈ రచన. ఇందులో నారాయణశర్మపాత్ర వృత్తివిద్యపట్లగల వ్యామోహాన్ని వదులుకోలేక, వస్తున్న మార్పులకనుగుణంగా జీవనవిధానంలో మార్పులు తప్పనిసరన్న వాస్తవాన్ని జీర్ణించుకోలేక నిరంతరం సంఘర్షణకు లోనౌతూ సాగుతుంది.

"నువ్వు విద్య చెప్పు! నేను అనుకున్నది జరిగి తీరాల్సిందే! నావిద్య నాతోనే అంతరించి పోటానికి వీల్లేదు! వాళ్ళను చూడవే- వేదాంతంవాళ్ళను, వెంపటివార్ని, హరివార్ని, భాగవతులవాళ్ళను, పసుమర్తివార్ని.......... ఎంత చక్కగా ఆ కుటుంబాల్లో ఈ నాట్యం నిలిచిఉందే? మనకేం వచ్చిందే ఈ దౌర్భాగ్యం? ఉన్నది వంశానికి ఒకడు! వాణ్ణి నాట్యకళా కోవిదుణ్ణి, సంగీత కళానిధిని చేయాలని నేను తపనపడుతుంటే..... నీకు ఇదేం దుర్బుద్ధే? నువ్వు చెడుగా ఆలోచిస్తున్నావే, వాణ్ణి చెడగొడుతున్నావే" ఆయనమాటల్లో కోపం, వేదన, పట్టుదల ..... అన్నీ కలిసిపోయి ఆ కంఠం విచిత్రంగా ధ్వనించింది.

ఈ రకంగా వృత్తివిద్యపట్ల తనకుగల అభిమానాన్ని స్థిరమైన అభిప్రాయాన్ని వ్యక్తంచేసిన నారాయణశర్మ తర్వాత వాస్తవాలను గ్రహించటంద్వారా ఆలోచనల్లో పరిణతిని ప్రదర్శించినట్లుగా గ్రహించవచ్చు.

"చూడండి. మరో విషయంకూడా ఉంది. మనం గ్రహించవలసింది. దాన్ని ఇంగ్లీషులో ఆప్టిట్యూడ్ అంటారు. విద్యార్థికి దేనిమీద అభిరుచి ఉందో తెలుసుకుని ఆ చదువు చెప్పాలి. మనకు ఆసక్తికరమైనవాటిని ఆ పసివాళ్ళమీద రుద్దకూడదు. కుమ్మరి కొడుకు కుమ్మరివాడు, వడ్రంగి కొడుకు వడ్రంగే కానక్కరలేదు. తండ్రి బంగారుపనివాడు అయినంత మాత్రాన అతగాడి కొడుక్కికూడా ఆవిద్య వచ్చి ఉండాలని ఎక్కడాలేదు. .......... స్టాలిన్ చెప్పులుకుట్టుకునేవాడి కొడుకు. అబ్రహాంలింకన్ వడ్రంగంపనివాడు. అంబేద్కర్ ఎంత తక్కువస్థాయినుంచి ఎంత ఎక్కువస్థాయికి వచ్చాడు! అంచేత నేర్చుకోను మొర్రో అంటూంటే విభీషణుడికి ఆ చాన్సు చెప్పడంలో అర్థం లేదనుకుంటాను. ఆపైన మీ ఇష్టం!"

అయినప్పటికీ తన అభిరుచులను, విద్యను వదులుకోలేక దొమ్మరస్త్రీకి విద్యనందించేందుకు సిద్ధపడటం అతనిలో జరుగుతున్న అంతఃసంఘర్షణని సూచిస్తుంది.

....... "క్షమించండి వాగ్భూషేశ్వర శాస్త్రులవారూ! నేను తొందరపడి ఒక నిర్ణయానికొచ్చాను. వచ్చినతరువాత హరిహరాదులు అడ్డమైనా అభిప్రాయం మార్చుకోను. ఈ పసిదానికి నాట్యవిద్య చెప్పాలనుకున్నాను. నాదగ్గర ఉన్న కళనంతా ధారబోయదల్చుకున్నాను. నా వారసురాల్ని చేద్దామనుకుంటున్నాను. ఇందుకు ఎవ్వరడ్డమైనా సహించను!"

చివరకు ఈ కారణంగా సామాజికంగా సాంప్రదాయిక వర్గాలతో ఘర్షణపడటం, బహిష్కరణకు గురైనా తను నమ్మిన ఆశయంకోసం శ్రమించే వ్యక్తిగా నారాయణశర్మది ఒక సంక్లిష్టపాత్రగా నిలుస్తుంది.

విద్యప్రధాన కథాంశంగా సాగే నవలల్లో ఇలా విభిన్నవ్యక్తిత్వాలు కలిగినపాత్రలు మనకు తారసపడతాయి.

*"A great technical accomplishment can co-exist with an inferior mind... A bad novel is ultimately seen to fail not because of its method, but owing to a fatal inferiority of its author's make up"*

*------- Q.D.Leewis*

*(Fiction and reading the public)*

=====

*కథనం*

రచయిత కథావస్తువునుబట్టి, పాత్రల స్వరూప స్వభావాలనుబట్టి అందుకు అనుగుణమైన కథనాన్ని ఎన్నుకుంటాడు. రచనలో పాత్రలకు, వస్తువుకు, కథనానికి సమన్వయం కుదిరినప్పుడే రచన పాఠకుని ఆకట్టుకోగలుగుతుంది.

రచనలో కథనాన్ని సాగించేందుకు రచయిత ఉపయోగించే పద్ధతుల ఆధారంగా కథనాన్ని వివిధరకాలుగా పేర్కొంటాం. సాధారణంగా వాడుకలో ఉన్న కథనాలు కొన్ని ఇవి.

*యధాతధ కథనం:* ఉన్నది ఉన్నట్లుగా, జరిగింది జరిగినట్లుగా అంటే యధాతధంగా చెప్పటాన్ని యధాతధ కథనంగా పేర్కొనవచ్చు. ఇందులో రచయిత వ్యక్తిగత స్పందనలకుగాని, పాఠకుని స్పందింపజేసేందుకుగాని వీలుండదు.

*అనుభూత్యాత్మక కథనం:* పాత్రల అనుభూతులు, ఆలోచనలు హృద్యంగా చిత్రీకరించటం ఈ కథనం ప్రత్యేకత. ఇందులో పాత్రల అనుభూతులు పాఠకులు తమవిగా భావిస్తారు. అంటే పాఠకుల హృదయాలను ఆవిష్కరించే అనుభూతుల ప్రధానంగా ఈ కథనం సాగుతుంది.

*సర్వసాక్షి కథనం:* రచయిత కథకుడుగా తనకున్న పరిధినిదాటి కథనంలో జోక్యంచేసుకుంటాడు. అలా రచయిత తనే స్వయంగా కథచెప్పటమే సర్వసాక్షి కథనం.

*ఉత్తమపురుష కథనం:* కథకుడు తన్నుతాను నేను అని ప్రస్తావించుకుంటూ కథనాన్ని సాగిస్తాడు. ఇందులో కథనమూ, వ్యాఖ్యానమూ కథకుడే చేస్తాడు. సాధారణంగా ఉత్తమపురుషకథనంలో కథచెబుతున్నపాత్ర రచనలో ప్రధానపాత్ర అయి ఉంటుంది.

*ప్రధమపురుష కథనం:* రచనలోని అప్రధానపాత్ర తనకోణంనుంచి కథచెప్పడం. అంటే కథనంలో భాగంగా ఉంటూనే దూరంగా ఉంటూ కథచెప్పటం ప్రధమపురుష కథనం.

*నాటకీయ కథనం:* రచయిత జోక్యం అసలు కనిపించని కథనమిది. కథనంలో సంపూర్ణమైన వస్తుగతతత్త్వం ఉందన్న భ్రాంతిని కలుగచేస్తుంది.

*సంభాషణాత్మక కథనం:* రచన ఆద్యంతం సంభాషణలతో కథనం రసవత్తరంగా సాగుతుంది.

వర్ణనాత్మక కథనం: ఇందులో వర్ణన ప్రధానంగా ఉంటుంది. వర్ణన మూడు విధాలుగా ఉంటుంది. అవి ప్రకృతిసౌందర్య వర్ణన, జంతుస్వభావచిత్రణ, మానవస్వభావచిత్రణ.

ఫాంటసీ: అవాస్తవికంగా కనిపిస్తూ గొప్ప జీవితవాస్తవికతను ఆవిష్కరించే కథనం.

అలిగరీ (అంతరార్థ కథనం): కథావస్తువులోకాని, పాత్రలలోకాని బాహ్యంగా కనిపించేదానికి భిన్నంగా అంతర్గతంగా వేరొక అర్థాన్నందించే కథనాన్ని అలిగరీ అంటారు.

లేఖాకథనం: కథనం మొత్తం లేఖారూపంలో సాగటమే లేఖాకథనం.

దినచర్యాకథనం: దినచర్యను యథాతథంగా చిత్రించే నిర్మాణశిల్పమే దినచర్యాకథనం.

చైతన్యస్రవంతి కథనం: మానవుని సుప్తచేతనలోని భావాలను ఆవిష్కరించే ప్రయత్నమే చైతన్యస్రవంతి. క్షణికమైన అనుభవాన్ని మొత్తం జీవితానుభవంతో ముడిపెట్టి యీ రెంటి తారతమ్యాలు విభజనలేకుండా ఉన్నది ఉన్నట్టు ప్రదర్శించే యత్నమే చైతన్యస్రవంతి అన్నారు బుచ్చిబాబు.

న్యూస్‌రీల్ కథనం: రచనకూ, సామాజికవాస్తవికతకూ ఉన్న సంబంధాన్ని మరింత నమ్మకం కలిగించేలా చిత్రించటానికి రుపొందించిన పద్ధతి.

ఇలాంటి విభిన్న కథనాలు తెలుగుసాహిత్యంలో విస్తృతంగా చోటుచేసుకున్నాయి.

సర్వసాక్షి కథనం: రచయిత కథకుడుగా తనకున్న పరిధినిదాటి కథనంలో జోక్యంచేసుకుంటారు. అలా రచయిత తనే స్వయంగా కథచెప్పటమే సర్వసాక్షి కథనం.

'సాంబయ్యచదువు'లో రచయిత కథనంలో జోక్యం చేసుకోవటం కనిపిస్తుంది, రచయిత జోక్యాన్ని సూచించే సంఘటనలు రచనలో మనకు తారసపడతాయి. సాంబయ్యను, చిలుకయ్య, మల్లేశం వంటి పాత్రలగురించి రచయిత పరిచయం చేయటం ఈ వాక్యాలలో కనిపిస్తుంది.

సాంబయ్యకిప్పుడు ఆరేళ్ళు. కొడుకునిక బడికి పంపించాలనుకుంటున్నాడు. చిలుకయ్య.

అలాంటి సమయంలోనే మల్లేశం అనే ఉపాధ్యాయుడా ఊరికి కొత్తగా వచ్చాడు. సాంబయ్య తరగతివాళ్ళకు తెలుగు చెప్పేవాడతను... అతను పాఠం చాలా గొప్పగా చెప్పేవాడు. ముఖ్యంగా మూఢాచారాల విషయం వచ్చినప్పుడు ఆవేశపూరితంగా చెప్పేవాడు... మల్లేశం బోధనా ప్రభావం సాంబయ్యపై ఎంతో ఉంది. రామమోహనరాయ్, వీరేశలింగం, గురజాడలపై పూజ్యభావ మేర్పడింది.

మల్లేశం బోధనలవల్ల సాంబయ్యలో హేతువాద బీజాలు నాటుకున్నాయి. 55

చంద్రగ్రహణం ఏర్పడటానికి గల కారణాలను ఇద్దరు ఉపాధ్యాయులు చెరో విధంగా చెబితే ఏది నమ్మాలో అర్థంకాక తెల్లమొహం వేసేవాడు సాంబయ్య. 56

సాంబయ్యపై ఆ మాటల ప్రభావమెంతో ఉంది. అందుకే సాంబయ్య దుబ్బాల ఇంటికెళ్ళినా వెంట పుస్తకాలు తీసుకెళ్తాడు. తనకు వచ్చిందని నమ్మకమున్నా ఇంకా చదువుతాడు. 61

సమయం దొరికినప్పుడల్లా ఎన్నో విధాలుగా ఆలోచిస్తూనే ఉన్నాడు సాంబయ్య. అతనిలో ఎన్నెన్నో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏ ప్రశ్నలకు సమాధానాలు మాత్రమాతనికి దొరకడంలేదు. 87

హెచ్.ఎస్.సి. పరీక్షలయ్యాయి. పరీక్షల్లో, మాస్ కాపీయింగ్ జరిగింది. విద్యార్థుల్లో ఒక విధమైన అరాచకత్వం ప్రబలింది. కాపీ చేయనివ్వని ఉపాధ్యాయులు కత్తిపోట్లు తినవల్సి వచ్చింది. కొందరు విద్యార్థులు పక్కనే కత్తులు పెట్టుకొని పరీక్షలు రాశారు. 88

ఉద్యోగం దొరికి ఏడేళ్ళు గడిచిన తర్వాత ఒక్కసారి వెనుదిరిగి చూసుకున్నాడు సాంబయ్య. చాలామంది మధ్య తరగతి జీవుల్లాగే తానెంత మధ్యతరగతి ఊబిలో దిగి బతుకుతున్నాడో అర్థంచేసుకున్నాడు. ఆ ఊబినుంచి బయటపడే ధైర్యం మాత్రం అతనికి లేదు. బయటపడటం ఇష్టంకూడా లేదు.

తన చదువు, తన జీవితం ఏం నేర్పింది? తను చదువుకొని ఏం సాధించగలిగాడు? తాను చదువులో క్లాసులో ఫస్టయి, ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణుడై అంత జీవితాన్ని చదువుకే అంకితంచేసి ఏం సాధించినట్టు ఎన్నోరకాలుగా ఆలోచిస్తున్నాడు సాంబయ్య. 126

ఈ చదువులు ఏరాయీకరణకి గురిచేస్తున్నాయని గమనిస్తున్నా మంచి ఉద్యోగమనే లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని పిల్లలను చదివిస్తున్నాడు. తన పిల్లల్లో ఒకర్ని కలెక్టర్, మరొకర్ని డాక్టర్ చేయాలని కలలు గంటున్నాడు. అప్పుడప్పుడాతనికి తన ఆదర్శాలు, చుట్టూ జరుగుతున్న పోరాటాలు, సాహిత్యం, శ్రీశ్రీలాంటివి జ్ఞాపకం వచ్చినా వాటిని బలవంతంగా

నొక్కి పెడుతున్నాడు. వృద్ధుడైన విలుకయ్య ఇంకా రెండు బక్కెట్లతో ఒంటినాగలెవ్వుసం చేస్తూనే ఉన్నాడు. రాజమ్మ పొలం పనులకెళ్తానే ఉంది. 127

పైవానిలో రచయిత తనకున్న పరిధినిదాటి కథనంలో జోక్యం చేసుకొని కథచెప్పటం గుర్తించవచ్చు. అంటేరచనలో రచయితే స్వయంగా కథచెప్పే ఈ కథనాన్ని 'సర్వసాక్షి కథనం'గా పేర్కొనవచ్చు.

కప్పగంతుల మల్లికార్జునరావు 'ఊబి' ఆద్యంతం రచయిత జోక్యంతో సాగుతుంది. సర్వసాక్షి కథనానికి ఇది మంచి ఉదాహరణగా నిలుస్తుంది. ఇందులో భానుమూర్తి, అతను వంటివి సర్వసాక్షికథనాన్ని సూచిస్తాయి.

భానుమూర్తికి గార్వి ప్రశ్నలతో మతిపోసాగింది. విద్యార్థులంతా తనలాంటివాళ్ళేననుకొన్నాడతను! కానీ యింత మేధావులుంటారా? అసలే అతనికి క్లాసుకి పోవాలంటే భయం. ఏవో ఉద్యోగాల కబుర్లు, సినిమా కబుర్లతో కాలక్షేపం చేద్దామనుకొంటే [illegible] అతనికి లెక్చరర్ ఉద్యోగం అంటే భయంవేయసాగింది.

ఇంకా వసుంధర 'కొత్తమేస్టారు', మురళీకృష్ణ 'అంతర్యాగం', కొండముది శ్రీరామచంద్రమూర్తి 'చిరుమువ్వల మరుసవ్వడి' వంటి రచనలన్నీ సర్వసాక్షి కథనంలోనే సాగుతాయి

మళ్ళీ కేశవశర్మ భార్య అన్నది.

అభ్యుదయమార్గంలో అలోచిస్తున్న ఆ అమ్మాయిముందు నారాయణశర్మ అవాక్కై అయిపోయాడు.

నారాయణశర్మ ఆశ్చర్యపడ్డాడు.

ఆ మగవాళ్ళిద్దరూ మరోమాట అనలేదు.

చిరుమువ్వయల మరుసవ్వడిలోని సర్వసాక్షి కథనానికి మచ్చుకు కొన్ని తార్కాణాలివి.

ఉత్తమపురుష కథనం: కథకుడు తన్నుతాను నేను అని ప్రస్తావించుకుంటూ కథనాన్ని సాగించటం. ఇందులో కథనమూ, వ్యాఖ్యానమూ కథకులే చేస్తారు. సాధారణంగా ఉత్తమపురుష కథనంలో కథ చెబుతున్నపాత్ర రచనలో ప్రధానపాత్ర అయి ఉంటుంది.

'విషగుళిక'లో కథనం అధికంగా ప్రధానపాత్ర 'విద్యాసాగర్' ద్వారానే జరుగుతుంది. ఇందులో ఇతను కథనంతోపాటు వ్యాఖ్యానం చేయటంకూడా కనిపిస్తుంది. అయితే అక్కడక్కడా రచయిత జోక్యంకూడా కనిపిస్తుంది.

కానీ బాధ్యతాయుతమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవాళ్ళు కూడా అలా వుంటారని, అలా ప్రవర్తించాలని [illegible] పిల్లలకి విద్యాబుద్ధులు నేర్పుతూ.. వాళ్ళకీ సమాజానికీ కూడా ఎంతో ఆదర్శప్రాయంగా ఉంటారని.. ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించబోవడం అదృష్టవశాత్తూ లభించిన వరం అని, ఇలా ఎన్నెన్నో కలలు కన్నాడు. ఎంతో ఊహించుకున్నాడు.

పాపం పుణ్యం ప్రపంచమార్గం... కష్టం, సౌఖ్యం, శ్లేషార్థాలూ... ఏమీ ఎరుగని ఆ పసిపిల్లలమధ్య గడపగలిగే భాగ్యం లభించినందుకు పొంగిపోయాడు. అందుకే, ఎక్కడో మారుమూల కొండలమీద టీచరు పోస్టు లభించినా అతనందుకు బాధపడలేదు. తన ఆదర్శాలని అమలుచేసే సదవకాశం లభించినందుకు ఉప్పొంగిపోయాడు. 31

పై కథనమంతా రచయితదిగానే భావించాలి. ఇక్కడ 'విద్యాసాగర్'పాత్రగురించి రచయిత మాట్లాడటం కనిపిస్తుంది. అయితే మిగిలిన కథనంమాత్రం ప్రధానపాత్ర విద్యాసాగర్ ద్వారా సాగిపోతుంది. అంటే కొన్నిచోట్ల సర్వసాక్షి కథనం ఉన్నా, అధికభాగం ఉత్తమపురుషకథనంలోనే సాగుతుంది.

ఈ మనిషిలో ఏదో తిరకాసు వుంది. కనిపించని మెలికలేవో వున్నాయి. మనిషి మంచివాడే కావొచ్చును. కాని తను కోరుకునే మంచి ఇది కాదు. బీదవాడని జాలిపడి తీసుకునే లంచంలో ఎంతో కొంతశాతం తగ్గించుకొనే మంచికాదు తను కోరుకునేది. తప్పని తెలిసీ పదిమందికోసం తలదించుకునే మంచికాదు తను ఆశించేది. వెన్నెలంత స్వచ్ఛమయినదీ, మంచుబిందువులు పడి మెరిసే గడ్డిపువ్వంత నిర్మలమయినదీ, పవిత్ర పూజాద్రవ్యాల లాగా పరిమళించేదీ.. అలాంటి మంచి తనకి కావాలి.

వర్ణనలో, సన్నివేశచిత్రీకరణలో రచయితజోక్యం కనిపిస్తుంది.

ఆ సాయంకాలపు నీరెండలో పులిపుట్టు గ్రామం– ప్రకృతిమాత ఒళ్ళో అమాయకంగా నిద్రపోతున్న పసిబిడ్డలా వుంది. నిజంలాగా నిర్మలంగానూ, నమ్మకంలాగా తేలిగ్గానూ కనిపించింది విద్యాసాగర్ కళ్ళకి. 53

మరోచోట విద్యాసాగర్ కథనం

చెప్పదలుచుకున్నది సూటిగా చెప్పే ఆ గుణమే జానకేశ్వరరావులో తనని ఆకర్షించింది. మెచ్చుకోలుగా అతనివేపు చూశారు విద్యాసాగర్. 54

రచయిత కథనం

ఆ పనిచేస్తూ ఉంటే ఒక్కొక్క మెట్టూ దిగజారి అధఃపాతాళానికి కుంచించుకుపోతున్నట్లనిపించేది విద్యాసాగర్కి. ఆ పరిస్థితుల్లో అలా చెయ్యటం తప్ప మరో గత్యంతరం లేదని తనను తాను సమాధానపర్చుకోవాలని ప్రయత్నించేవారు. మనసు ఎదురు తిరిగేది. తను... తను కూడా అందరిలాగే అడ్డదారిలో ప్రయాణానికి సిద్ధమవుతున్నాడా! తను చేసిందానికి ఏవో సంజాయిషీలూ, సమాధానాలకోసం వెతుక్కుంటున్నాడా! తన ఆదర్శం అబద్ధమేమో! తన నిజాయితీ గడ్డిపరక విలువ చెయ్యనిదేమో... తన అంతరంగంలో ఎక్కడో ఒక వెసులుబాటు వుంది. ఎక్కడో ఒక అపనమ్మకం వుంది... జానకేశ్వరరావులాగే తన వ్యక్తిత్వంలో కూడా ఏదో తెలీని 'మెలిక' వుంది... ఆ ఆలోచన రాగానే దుఃఖం ముంచుకొచ్చేది విద్యాసాగర్కి. ఆకులా వణికిపోయేవాడు... 66

పై కథనాలను పరిశీలిస్తే ప్రధానపాత్ర పరిచయ సన్నివేశాలలో రచయితజోక్యం కనిపిస్తుంది. మిగిలిన సమయాల్లో కథనం ప్రధానపాత్రద్వారా సాగుతున్నది. అందువల్ల సర్వసాక్షి, ఉత్తమపురుషకథనాలు రెండూ ఉన్నట్లుగా గుర్తించవచ్చు. అందుచేత దీన్ని మిశ్రమకథనంగా చెప్పవచ్చు.

ద్వారకా 'పల్లెపిలిచింది' ఆద్యంతం 'ఉత్తమపురుష'కథనంలో సాగుతుంది. ప్రధానపాత్రే కథాగమనాన్ని సూచిస్తూ ముందుకు సాగుతుంది. కథకుడుకూడా ఇందులో పాత్రేకనుక ఈ కథనశిల్పాన్ని 'ప్రత్యక్ష కథనశిల్పం'గా పేర్కొనవచ్చు. ఈ కథనశిల్పాన్ని సూచించే కొన్ని భాగాలివి. ప్రధాన పాత్ర తననుతాను నేను, ఐ, మై, మి అని సంబోధించుకోవటం ఉత్తమపురుష ప్రత్యక్ష కథనాన్ని సూచిస్తుంది.

…. జగిత్యాల ఊరుకాదా? అక్కడున్నవాళ్ళు మనుషులు కారా? వాళ్ళు బ్రతకటంలేదా? వాళ్ళు దరిద్రులైనా, జ్ఞానశూన్యులైనా భాషాభిమానం ఎంతగా కలిగిఉన్నారు! భాషమీది అభిమానంతో ఎంత త్యాగంచేశారా బడుగుజీవులు! ఆ మనుషుల్ని ప్రేమించకపోతే, అభిమానించకపోతే నాజన్మకు సార్థక్యం ఏముంటుంది? లెట్ మి నాట్ స్టే హియర్ ఎనీ లాంగర్ దెన్. ఐమస్ట్ గోటు మై ప్లేస్. ఐ మస్ట్ లివ్ అండ్ వర్క్ ఫర్ దెయిర్ గుడ్. స్థిరంగా నిర్ణయించుకున్నాను.

వాళ్ళెంతో అమాయకంగా ఉన్నారని వాళ్ళపాటికి వాళ్ళను వదిలేసి నాతోవ నేను చూసుకోగూడదు. …… ప్రారంభించిన కార్యాన్ని మధ్యలో వదలకుండా దాన్ని పూర్తిచేసేవరకు శ్రమించాలని చెప్పేవాడిని. వాళ్ళకు చెప్పిన మాటల్ని నేను చేసి చూపించాలి!

…. అభివృద్ధికోసం పాటుపడటం తప్పని ఇప్పుడు తెలిసింది. ఇది వ్యవస్థలో ఉన్నదోషం. అతను తన ఉన్నతికోసం పాటుపడ్డాడు. సాధించాడు. నేను పాఠశాల ఉన్నతికోసం పాటుపడ్డాను. దాన్ని సాధించాను. ఫలితంగా నేను వెనుకబడి పోయాను.

'తల్లిమట్టి' ఉత్తమపురుషకథనంతో సాగే రచన. అందుకే

నాది ఉపాధ్యాయ వృత్తి. కొత్తగా విడుదలైన జీవో వలన నాకు ఈ మధ్యే బదిలీ వచ్చింది కదిరి మండలానికి.

అంటూ కథనం ప్రారంభమౌతుంది.

నేనోతిక్క వెధవని చాలామంది అనుకుంటుంటారు. అనుకోనివ్వండి. నాకేం ఫర్వాలేదు. నేనందర్లాగా వుండననీ, అందర్లాగా ప్రవర్తించననీ నామీద ధాష్టీ. ఈ ధాష్టీకి నేనేమీ బాధపడ్డేదుగాని -నన్ను కిల్‌జోయ్ (Kill-Joy) గా కొందరు ముద్ర వేసినప్పుడు మాత్రం నిజంగా బాధపడ్డాను. రామనాథం మేష్టారి అమ్మాయి ఎవరితోనో లేచిపోయిందని టీకొట్టు దగ్గర చేరిన మేష్టర్లంతా సరదాగా చెప్పుకుంటుంటే - "మన స్టాఫ్ మెంబర్కి వచ్చిన కష్టం మనకొచ్చిన కష్టంలాంటిదే. విచారించడానికి బదులుగా మీరంతా ఆ విషయాన్ని తలుచుకొని ఎలా నవ్వగలుగుతున్నారో నాకర్థం కావటం లేదు" అని నేను చాలా కఠినంగా నా అభిప్రాయాన్ని చెప్పేను. నా మాటల్ని విని అంతా ముఖముఖాలు చూసుకున్నారు.

ఇలాసాగే ఈ ఉత్తమపురుషకథనం 'నాగావళి నవ్వింది'లోది. ఇందులోరచన ఆద్యంతం

ఉత్తమపురుషకథనంలోనే సాగుతుంది.

నాటకీయ కథనం: రచయిత జోక్యం అసలు కనిపించని కథనమిది. కథనంలో సంపూర్ణమైన వస్తుగతతత్త్వం ఉందన్న భ్రాంతిని కలుగచేస్తుంది.

కాయితి అప్పారావు 'పంచరంగులు' పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం తీరుతెన్నులను చర్చించిన రచన. రచన ప్రారంభంనుంచి చివరివరకు నాటకీయ పరిణామాలతో సాగుతుంది. అధికంగా సంభాషణలతోనే రచనంతా సాగుతుంది. రచయితగాని, మరే ఇతర కథకులుగాని ప్రత్యక్షంగా జోక్యంచేసుకోవటం రచనలో ప్రముఖంగా కన్పించదు.

"కంటికి నిద్రరావటంలేదురా!.... ఇంకేమైనా అందిరా విజయ? అని ప్రశ్నించారు.

"మహా గర్వపోతుబాబూ! గవర్నమెంటు పిల్లలకని ఇస్తున్న ఆహారపదార్థాలను దుర్వినియోగమెందుకు చేయాలని నన్ను నిలదీసి అడిగింది బాబూ! ఏమాటకూ సమాధానం చెప్పలేకపోయాను"

"నాగురించి ఏమైనా అందా!"

"ఇన్‌స్పెక్షన్ మీమీద ఏవో నాలుగుడబ్బులు దోచుకుపోదానికొచ్చారని ఎత్తిపొడిచింది"

"అలాగా!... విజయ అన్నదాన్లో తప్పేమీలేదురా! దొరకాలంనుంచీ వస్తున్న ఆనవాయితీ -- అప్పుడు చీకట్లో చేసేవారు. ఇప్పుడు వెలుగుల్లో నాలుగురోడ్ల కూడలిలో చేస్తున్నారు. అంతే తేడా".

సంభాషణలు ఇలా సాగిపోతుంటాయి. ఈ రీతిగా రచనంతా సంభాషణాత్మకంగానే సాగిపోతుంది. ఈ కథనాన్ని నాటకీయ కథనంగా పేర్కొనవచ్చు.

మన్నెంశారద 'నిర్నిద్రగానం'లోకూడా రచయిత, కథకుని జోక్యంలేకుండా కథనం సాగుతుంది. ఎక్కడా వీరు జోక్యం చేసుకున్న దాఖలాలు కనిపించవు. సంభాషణలతోనిండి ఉండి రచనంతా నాటకీయకథనంలో సాగుతుంది.

విజయార్కె 'జడ్జిమెంట్' ఇరవై సంవత్సరాలపాటు చదివిన చదువుకు గుర్తింపు, సర్టిఫికెట్లకు ఎటువంటి విలువ లేకపోవటాన్ని ప్రశ్నిస్తూ వచ్చిన రచన ఇది. అధికంగా సంభాషణలతో నాటకీయ కథనంతో నడుస్తుంది.

శివకుమార్ 'ఆచరణల్లో ఆదర్శాలు' రచనలో కథనంలో రచయితజోక్యం కొంతమేరకు, కథకుని జోక్యం మరికొంత మేర, సంభాషణారూపంలో అధికంగానూ చోటుచేసుకుంది.

నాలాంటి వాళ్ళు తెల్లమొహంవేసుకు చూస్తూ కూర్చుండిపోయాం. ఏతావాతా పొడుగునా కష్టపడ్డవాళ్ళం యిలాగే వుండిపోయాం! ట్యూషన్లో చేరినవాళ్ళు చలాగ్గా రాసేస్తున్నారు. లేచి దణాయించాను.

ఇది కథకుని కథనం. అంటే ఉత్తమపురుష కథనం.

ఉదయంనించీ శంభు అన్నయ్యని ఓదార్చటానికి చాలా ప్రయత్నించాడు.

"అఫ్టరాల్ క్లాసురానంత మాత్రాన అంత బాధదేనికన్నయ్యా? క్లాసులొచ్చినవాళ్ళందరూ రాజ్యాలేలేస్తున్నారా! రానివాళ్ళెవ్వరూ ఉద్యోగాల్చెయ్యట్లేదా?

........ భాస్కర్ ధోరణి అతడికి చికాకు కలిగించింది.

...... అతడిమాటలు వింటూనే భాస్కర్ ముఖం ఎర్రబారింది.

....... నాలుగైదు నెలలు గడిచాక కాస్త నిలదొక్కుకున్నాడు శంభు. పరిస్థితులన్నీ సమీక్షించుకున్నాక అతడు తనంతట తానే ఒక నిర్ణయానికి వచ్చాడు. కుటుంబం సజావుగా గడవటానికే కష్టంగా వున్న యీసమయంలో తనింకా చదువుకుంటూ కూర్చోవటం అర్థపర్థంలేని పనిగా తోచిందతనికి. తను చదువాపేసి ఏదో ఒకవిధంగా సంపాదనలోకి దిగితే తప్ప లాభం లేదనుకున్నాడు.

ఈ వాక్యాలన్నీ రచయిత కథనంలో జోక్యంచేసుకోటాన్ని సూచించేవే. ఇంకా ఇదేరచనలో సంభాషణలతోకూడిన కథనం కూడా కనిపిస్తుంది. మొత్తంమీద ఈ రచన సర్వసాక్షి, ఉత్తమపురుష, నాటకీయ కథనాలతో సాగుతుంది.

నాటకీయ కథనానికి 'దయచేసి చంపెయ్యండి' మంచి ఉదాహరణగా నిలుస్తుంది. రచన ఆద్యంతం సంభాషణలతోనే నడుస్తుంది. ఒక నిరుద్యోగి తన అంతరంగాన్ని ఒక వైద్యునితో పంచుకోవటం ప్రధానాంశంగా వచ్చిన రచనే ఇది.

"బళ్ళో వేసింది మొదలు - విశ్వవిద్యాలయం యింక బయటకుపో" అని ప్రపంచంలోకి తరిమేసే వరకూ అమ్మా నాన్నా బంధువులూ.....మాస్టర్లూ - అందరూ ఒకటే పాట -

"బాగా చదువుకో, వృద్ధిలోకి వస్తావు. మంచి మార్కులు తెచ్చుకో, గొప్ప వాడివౌతావు. చదువుకుని మంచి ఉద్యోగం తెచ్చుకుని సుఖపడు వెర్రిసీరు. నిజమే అనుకుని.... గుర్రాల్లు ఏలో పత్తల్లు ఒకటే చదువు. పగలూ రాత్రీ చదువే. ఒక్క నిముషం పుస్తకం వొదిలి ప్రపంచమేమిటో చూసేవాడు కాదు. క్లాసులో ఫస్టుమార్కులు, యూనివర్సిటీలో గోల్డ్‌మెడల్....వాటివే..."

"ఇకనేం?"

"చదువు చదుగులో ఏం కోల్పోయానో, చదువయ్యాక తప్ప తెలియలేదా యిదియలికి"

"ఏంతెలిసిందిప్పుడు?"

"చదువు - ఉద్యోగమివ్వదు. ఉద్ధరించదు. బ్రతకడంనేర్పదు...."

"ఐతే - చదువెందుకు?" ఆశ్చర్యంగా అడిగాను.

"చదువు చదువెందుకు కొరగాదో తెలుసుకుందుకే" (ఇద్యాప్పురపు రామచంద్రం, దయచేసి చంపెయ్యండి!, భారతి, అక్టోబరు 85, పే 14-17

లేఖాకథనం: కథనం మొత్తం లేఖారూపంలో సాగటమే లేఖాకథనం.

'అపశృతి' తనకు ప్రీతిపాత్రమైన ఉపాధ్యాయినికి శిష్యురాలు సామాజిక పరిస్థితులకు కలతచెందుతూ తనలోని వేదనను పదిసంవత్సరాల తర్వాత ఉత్తరంద్వారా పంచుకోవటం ఇందులో కథాంశం. లేఖలో గతానుగతికంగా పాత్రకు సంబంధించిన పాత అనుభవాలుకూడా స్ఫురణకు వస్తాయి. లేఖాకథనానికి ఇది చక్కని ఉదాహరణ. జీవితంలో స్థిరపడిన శిష్యుడు తన గురువుకు సాయపడాలనే ఉద్దేశ్యంతో గురువుకు రాసిన లేఖే 'ఆచార్యదేవోభవ'

లేఖాకథనానికి మరో ఉదాహరణ 'పంజరం' బాల్యమిత్రుడు కొమురయ్య బాల్యమిత్రుడు ఆనంద్‌కి రాసిన లేఖ ఇది. ఆనంద్ పిల్లలనుపెంచే విధానంలో సరైన దృక్పథం లోపించటాన్ని సునిశితంగా విమర్శించటం ఈ లేఖలో ప్రధాన కథాంశం.

మరో లేఖాకథనం 'మట్టిగుర్రం'. తనకు స్ఫూర్తిదాయకంగానిలిచి తనలో అభ్యుదయకరమైన ఆలోచనలు ప్రాదుకొల్పి చివరకు తనుమాత్రం సామాజిక అవినీతిచట్రంలో భాగమైపోయిన మిత్రునికి ఒక ఆదర్శ ఉపాధ్యాయుడు గతాన్ని గుర్తుచేస్తూ రాసిన ఉత్తరమిది. తన ఆదర్శాలు సహించలేనివారు తనపై చేసిన ఆరోపణలపైన విచారణకోసం వచ్చిన తన మిత్రుడే తననుప్రశ్నించటాన్ని జీర్ణించుకోలేక, జీవితంకన్నా ఆదర్శాలు గొప్పవిగా భావించి తన ఉద్యోగానికి రాజీనామా సమర్పించటం ఉన్నతవ్యక్తిత్వానికి నిదర్శనం. ఇదంతా లేఖగానే సాగటం విశేషం.

చైతన్యస్రవంతి కథనం: మానవుని సుప్తచేతనలోని భావాలను ఆవిష్కరించే ప్రయత్నమే చైతన్యస్రవంతి. క్షణికమైన అనుభవాన్ని మొత్తం జీవితానుభవంతో ముడెట్టి యీ రెంటి తారతమ్యాలు విభజనలేకుండా ఉన్నది ఉన్నట్లు ప్రదర్శించే యత్నమే చైతన్యస్రవంతి అన్నారు బుచ్చిబాబు.

పెద్దిభొట్ల సుబ్బరామయ్యగారి 'అలజడి' చైతన్యస్రవంతి కథనంలో సాగిన రచన. ఉత్తమ శాస్త్రవేత్తగా రూపొందాల్సిన గాంధీ ఆర్థికఇబ్బందులకారణంగా నిరుద్యోగిగా మిగిలి ఆత్మహత్యకు ప్రయత్నించి చివరకు జైలుపాలైన వ్యక్తిగా అతనిలోజరిగిన అతర్మథనాన్ని చిత్రించేందుకు రచయిత ఎంచుకున్నకథనం ఈ చైతన్యస్రవంతి.

గాంధీ పక్కకు ఒత్తిగిలి పడుకున్నాడు. అంతలో అతనికి ఎప్పుడో తాను చూసిన కడుపుతో వున్న పెద్ద బల్లి గుర్తుకు వచ్చింది. ఆ వెనువెంటనే వందలాది కాళ్ళతో అసహ్యంగా నడిచే కాళ్ళజెర్రి గుర్తుకు వచ్చింది. 'దానికి అన్నికాళ్ళెందుకో!' అనిపించింది. ఎక్కడినుంచో మృదువైన వాసన... జైల్లో ఈ వాసన ఏమిటి? ఆనాడు తాను సీసాలో తెచ్చుకున్న పదార్థం వాసన ఇలా మృదువుగాలేదు...చాలా ఘాటుగా వుంది.

చైతన్యస్రవంతి కథనానికి మరో ఉదాహరణ 'కల్లోల కలలమేఘం'

చాలు చాలు. చాల్చాలు లే. పదపద. పళ్ళుతోము. రుద్దు పళ్ళు రుద్దు. మింగు మింగు ముద్దలు మింగు. తోలు సంచీ నింపెయ్. నింపెయ్. నీళ్ళు కన్నీళ్ళు తాగెయ్ తాగెయ్. రొటీన్ లైఫ్. లైఫ్ ఈజ్ లైక్ ఎ రింగ్ విత్ హెజ్‌నో ఎండ్... నోరుమూయ్యరా... షికెస్ట్పయ్యరా... పద పద. పదిపది. నీకోసం ఆఫీసులో అటెండెన్స్ రిజిష్టర్ అభిసారికలా ఎదురు చూస్తూ వుంటుంది.

*సంభాషణాత్మక కథనం:* రచన ఆద్యంతం సంభాషణలతో కథనం రసవత్తరంగా సాగుతుంది.

ఆద్యంతం సంభాషణలుమినహా మరింకేంలేకుండా సాగిన వ్యంగ్యాత్మకరచనే 'పెజలమడిసి పవరు'. ఒక రాజకీయనాయకునికి కలెక్టరుగారి పియ్యేకు మధ్య జరిగిన సంభాషచే రచన పర్యంతం సాగుతుంది. ఉపాధ్యాయుల ఎంపికవిషయంలో నిజాయితీగా వ్యవహరించిన కలెక్టరు బదిలీతో కథ పూర్తౌతుంది. ఇది సంభాషణాత్మక కథనానికి మంచి ఉదాహరణ.

కథా ప్రారంభంలోను, ముగింపులోను ఒకే సన్నివేశాన్ని చిత్రించటంద్వారా కథనంలో వైవిధ్యాన్ని చూపించేప్రయత్నం 'బడిసాల'లో కనిపిస్తుంది. ఈ రెండు సన్నివేశాలమధ్య ఈ వైరుధ్యానికి వెనుక పాఠశాల నిర్మాణం కోసం ఉపాధ్యాయుని తపన, గ్రామస్థుల కృషి దాగిఉంది. అయితే రెండు ఒకే రకమైన సన్నివేశాలను ఆది, అంతాలలో చేసిన చిత్రణ కథనానికి మరింత ఆకర్షణగా నిలిచింది.

టప్...

అక్షరాలు దిద్దుకుంటున్న ఓ పిల్లాడి పలకమీద చినుకుపడి రూపాయి బిళ్ళంతమేర చెదిరి అక్షరం చెరిగిపోయింది.

"ఒరే సినుకులొత్తన్నాయిరా..." అన్నాడా పిల్లడు పక్క పిల్లాడితో ఆకాశంవైపు చూస్తూ.

"ఔన్రా".... అంటూ పలక సంచిలో పెట్టేసినా పిల్లడు.

టప్.... టప్.... టప్....

"ఒరే సినుకులు పడుతున్నాయిరా..." పలక సంచిలో పెట్టబోతూ పక్కవాడివేపు చూశాడో పిల్లాడు

"చినుకులు పడితే అప్పుడులాగ ఆలవిప్పరు. అక్షరాలు దిద్దు"

*న్యూస్‌రీల్ కథనం:* రచనకూ, సామాజికవాస్తవికతకూ ఉన్న సంబంధాన్ని మరింత నమ్మకం కలిగించేలా చిత్రించటానికి రుపొందించిన పద్ధతి.

'మా తెలుగు మేష్టారు' అట్లాంటాలో 1998లో జరిగిన ప్రథమతెలుగు సాహితీ సదస్సులో వేలూరి వెంకటేశ్వరరావు గారు చేసిన ప్రసంగవ్యాసమిది. ఇందులో తెలుగుమేష్టారి ఆత్మను ఆవిష్కరింపటం చూస్తాం. మిగిలినవాళ్ళ సంగతేమో నాకు తెలీదుకానీ నాకు మాత్రం తెలుగుమీద మమకారం, ఆసక్తి, ఈ దేశానికొచ్చిన తర్వాతకూడా ఇంకా కాస్తోకూస్తో మిగిలివుండటానికి ఒక ముఖ్యకారణం, మా తెలుగుమేష్టారే! అయన మా తెలుగు మేష్టారు. గరికపాటి మల్లావధానిగారు అని పేర్కొంటూ తెలుగుమేష్టారి జీవితానుభవాలను నెమరువేసే ప్రయత్నం చేశారు ఈ రచనలో. ఇందులో చిత్రించిన తెలుగుమేష్టారి అనుభూతులు అందరు తెలుగుమేష్టార్లవిగా నిలుస్తాయి. ఇది న్యూస్‌రీల్ కథనానికి దగ్గరగా ఉంటుంది.

ఇలా వైవిధ్యభరితమైన కథనాలతో సాహిత్యంలో విద్య పై అనేక రచనలు వెలువడ్డాయి.

"Works of art, however politically progressive
are powerless if they lack artistic quality"

-----Mao

========

*కథనశిల్పం*

సాధారణంగా వ్యక్తి తనపనిలో చూపించే కళానైపుణ్యాన్నే శిల్పం అంటారు. ఇది సృజనకు సంబంధించిన అంశం. సృజనాత్మకమైన ప్రక్రియలన్నింటిలో 'శిల్పం' ఉంటుంది. అయితే కథకునికి సంబంధించి ఈ నైపుణ్యాన్నే 'కథనశిల్పం'గా పేర్కొనవచ్చు. కథనశిల్పం కథకుని వ్యక్తిగతమైన ప్రతిభకుసంబంధించినది. దీన్ని రచనాశిల్పం అనికూడా అనవచ్చు. అంటే కథనంలోని సమస్త లక్షణాలు కథనశిల్పంలో భాగాలౌతాయి. కథనానికి సంబంధించిన ఎత్తుగడ, కథాగమనం, వాతావరణం, సన్నివేశచిత్రణ, ఆద్యంతాలకల్పన, కొసమెరుపుతోకూడిన ముగింపు ఇలా అనేక అంశాల సమాహారమే కథనశిల్పం.

జీవితంలో తారసపడే వ్యక్తుల మూర్తిమత్వం మాదిరిగానే, కథకుని సామర్థ్యాన్నిబట్టి చిత్రించే పాత్రలుకూడా పాఠకునిపై ప్రభావంచూపుతాయి. ఈ ప్రభావస్థాయి రచయిత పాత్రచిత్రణా నైపుణ్యంపై ఆధారపడి ఉంటుంది. కథనానికి అనుగుణమైన వాతావరణం, నేపథ్యం, పరిసరాలను ప్రతిభావంతంగా, ప్రతీకాత్మకంగా, సహజత్వం ఉట్టిపడేట్లుగా చిత్రించడమే సన్నివేశకల్పనాశిల్పం. రచనలోని పాత్రల స్థితిగతులకూ, సంఘటనలకూ, కథలో చోటుచేసుకునే సంఘర్షణలకూ సన్నివేశకల్పన ఉపబలకంగా పనిచేస్తుంది. పాత్రల్లో అంతర్గతంగాకాని, పాత్రలనడుమకాని, పాత్రకూ సామాజిక పరిస్థితికీ మధ్యకాని సంఘర్షణను ప్రోదికొల్పేవిధంగా సంఘటనలను, సన్నివేశాలను,

పాత్రలస్వభావాలను చిత్రించటం సంఘర్షణాశిల్పనైపుణ్యం. సంఘటనలు కథను వేగవంతం చేస్తాయి. అంటే సంఘటనల రూపకల్పనలో రచయిత నైపుణ్యంపైన కథనంలో వేగం ఆధారపడి ఉంటుంది. సంఘటనలను సహజసిద్ధంగా, ప్రభావవంతంగా ఉండేట్లు కూర్చడం గొప్ప శిల్పం. కథకులు తమ ఆలోచనల్లోని వస్తువు ఆధారంగా ఒక కథనాన్ని రూపొందించుకొనేందుకు ప్రత్యేకనైపుణ్యం అవసరమైతుంది. కథనం క్రమానుగతంగా, ప్రభావస్ఫోరకంగా సాగేందుకు వస్తువిన్యాసశిల్పం దోహదపడుతుంది.

ఇలా రచన స్వరూప స్వభావాలనుబట్టి కథనశిల్పం విభిన్నరీతుల్లో ఉంటుంది. కథనం ప్రారంభంనుంచి ముగింపువరకు పాఠకులను కదనంలో లీనంచేసేవిషయంలో కథనశిల్పం ప్రధానపాత్ర వహిస్తుంది. అయితే కథనంలో ప్రతి స్థాయిలో ఈ శిల్పం ఉన్నప్పటికీ, ఒక్కోరచనలో కథావస్తువుకు అనుగుణంగా, సముచితరీతిలో కథనశిల్పం ఎత్తుగడలోనో, సంఘటనాపరంగానో, సంఘర్షణా, సన్నివేశాలపరంగానో లేదా ముగింపులోనో ఈ శిల్పాన్ని కథకులు బలంగా ఉపయోగించవచ్చు. కాబట్టి రచన ప్రాధాన్యాలనుబట్టి కథనశిల్పం రూపొందుతుంది.

తెలుగుసాహిత్యంలో విద్యాపరమైన రచనల్లో ఈ కథనశిల్పం బహుముఖీనంగా ప్రతిఫలించింది. అయితే కథనం ఆరంభంలో అంటే ఎత్తుగడపరంగా, ఇంకా సంఘటన, సంఘర్షణ, సన్నివేశాలపరంగా, చివరలో ముగింపు స్థాయిలోను విభిన్నంగా కథనశిల్పం ప్రతిఫలించిన విధానాన్ని మనం చూడవచ్చు.

## ఎత్తుగడ

కథకులు తమ ఆలోచనలకు అనుగుణమైన ఇతివృత్తాన్ని ఆవిష్కరించేక్రమంలో ఒక మౌలికమైన అంశాన్ని ప్రారంభంలో చిత్రీకరిస్తాడు. రచనలోని ఈ ఆరంభాన్నే 'ఎత్తుగడ' అనవచ్చు. రచనలో ఆరంభం విభిన్నరీతుల్లో ఉండవచ్చు. స్వరూప స్వభావాలనుబట్టి ఎత్తుగడలను విభజించవచ్చు.

పాత్రల ప్రవేశం, ఆ పాత్రలమధ్య సంభాషణలతో కూడిన ఆరంభం ఒకటి. ఇందులో పాత్రలమధ్య సంభాషణలు కథాగమనానికి బీజంవేస్తాయి. ఇటువంటి ఆరంభాన్ని 'నాటకీయ ఆరంభం' అంటారు. ఇందులో పాత్రల మనోభావాలు వారిద్వారానే వ్యక్తమౌతాయి. ఇవి కథాగమనానికి సహకరిస్తాయి. అయితే కేవలం ఒక ప్రత్యేకమైన వర్ణనతో కథాగమనం మొదలైతే దానిని 'వర్ణనాత్మక ఆరంభం' అనవచ్చు. ఇందులో ఒక ప్రదేశాన్ని, వ్యక్తిని, సన్నివేశాన్ని వర్ణించటంతో కథ ప్రారంభమైతుంది. అంటే ఇందులో పాత్రల చిత్రణకీ, వాతావరణ చిత్రణకీ అవకాశం బాగా ఉంటుంది.

కథలో జరగబోయే సంఘటనలకు సంబంధించిన ఉత్సుకతను రేకెత్తించేదిగా ఉండే ఆరంభం మరొకరకం. ఇది పాఠకునికి రచనపట్ల ఆసక్తిని కలిగిస్తుంది. పాఠకులు కథలో లీనమయ్యేందుకు తోడ్పడుతుంది. కథను కడదాకా వదలకుండా చదివేందుకు స్ఫూర్తిగా నిలుస్తుంది. దీన్ని 'ఆసక్తికర ఆరంభం' అనవచ్చు. మరొకరకమైనది సామాన్యమైన ఆరంభం. ఇందులో ఇతివృత్తానికిచెందిన వివరణ కొంతమేరకు ఉంటుంది. దీన్ని 'ఇతివృత్తాత్మక ఆరంభం'గా పేర్కొనవచ్చు.

ఇంకా ఒక నీతివాక్యంతోను, స్వభావోక్తితోను ప్రారంభించటం.

కథను మధ్యనుంచి ప్రారంభించి తర్వాత దానికి పూర్వపు అంశాలను ప్రస్తావించి

అక్కడినుంచి ముందుకుసాగటం మరోరకపు పద్ధతి. ఇందులో కథ మధ్యలోని అంశమో, చివరి అంశమో ఎత్తుగడగా ఉంటుంది. దీన్నే 'ఫ్లాష్‌బ్యాక్ ఆరంభం'గా పేర్కొనాలి.

రాంబాబు కనిపించకుండా పోయి వారం రోజులు. ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాలు వచ్చికూడా సరిగ్గా వారం రోజులే!

ఇది 'అతిజాగ్రత్త'లో ఎత్తుగడ. ఇది కథపట్ల పాఠకునికి ఆసక్తిని కల్పించేందుకు అనుసరించే 'ఆసక్తికరమైన ఆరంభం'. మితిమీరిన అధ్యయనం కారణంగా కలిగే దుష్పరిణామాలు ప్రధాన కథాంశం. అయితే ఇందులో ఇక్కడ ఒక ఆసక్తికరమైన సంఘటనతో ప్రారంభించి తిరిగి గతానికి వెళ్ళి మళ్ళీ ప్రస్తుతానికి రావటం కథనంలోని విశేషం. రాంబాబు తప్పిపోయిన సంఘటనతో మొదలై, చదువు పేరుతో రాంబాబు ఎదుర్కొన్న హింసను చూపించి చివరకు రాంబాబు అతని మిత్రులు తమను చదువు పేరుతో హింసించకపోతేనే తిరిగివస్తామన్న ఉత్తరంతో కథ ముగుస్తుంది. ఇదే 'ఫ్లాష్‌బ్యాక్ కథనం'.

"నాయుడిబాబుకి నలతగా వుంది. లేవలేదు. కూర్చోలేదు" అనే విషయం క్షణాల్లో ఊరంతా ప్రాకిపోయింది.

అంటూ ప్రారంభమైన కథనం, పాలేరు పరిశిగాడి జీవితాన్ని చిత్రించి తిరిగి నాయుడుబాబుకోసం తన అవయవాలనిచ్చేందుకు సిద్ధపడ్డ పరిశిగాడితో చివరకు వస్తుంది. అయితే ఇంతవరకూ ఫ్లాష్‌బ్యాక్ కథనంతో సాగిన రచన చివరగా నాయుడు పరిశిగాడి మూత్రపిండాలను అంటరానివిగాభావించినకారణంగా చనిపోవటాన్ని ఆత్మహత్యగా చిత్రించటం కథనంలో కొసమెరుపు.

"ఒరేయ్ పరిశిగా నాన్నకేమైందిరా?" ఆత్రుతగా అడిగాడు.

"ఆత్మహత్య చేసుకున్నారుబాబూ" అన్నాడు పరిశిగాడు నిట్టూరుస్తూ.

ఫ్లాష్‌బ్యాక్‌కథనానికి మరో ఉదాహరణ

వాళ్ళు - ఇద్దరికిద్దరూ -

ఉలిక్కిపడ్డారు.

తెల్లబోయారు. ఒకనిమిషంపాటు షాక్ తగిలినట్లు శిలలైపోయారు.

జరిగిందేమిటో వాళ్ళకర్థంకాలేదు.

అర్థమయ్యాక -

నమ్మశక్యం కాలేదు.

అప్పుడతని కంటపడింది

ఆమె భుజం మీద గాయం

దానినుంచి ప్రవహిస్తున్న రక్తం!

అదే క్షణంలో

ఆమెకూడా చూసింది

అతని మోచేతిమీద దెబ్బ!

దానిలోంచి ఉబుకుతూ ఉరుకుతూ వొస్తున్న రుధిరం

మితిమీరిన అధ్యయనం కారణంగా విద్యార్థి నిరంతరం వత్తిడికి గురైనప్పుడు తన తల్లిదండ్రులను హత్యచేసేందుకు వెనుకాడరంటూ పిల్లల చదువుపట్ల వత్తిడి మంచిదికాదన్న సందేశంకోసం చేసిన రచన 'ఇంటికొక హంతకుడు'లో ప్రారంభసన్నివేశం ఇది. కుతూహలపూరితమైన ఆరంభానికి ఇదో గొప్ప నమూనా.

విసుగుచెందని విక్రమార్కుడు యథాప్రకారం శింశుపావృక్షంకేసి నడిచాడు. కటికచీకట్లో.... విషసర్పాలు బుసకొడుతున్నా భీతిచెందక చెట్టును సమీపించి, కొమ్మకు వ్రేలాడుతున్న శవాన్ని భుజాన వేసుకొని, తిరిగి ప్రయాణం ప్రారంభించాడు.

ఇలా ప్రారంభమైన 'అసర్థత' నిజమైన ప్రతిభను గుర్తించటం ప్రధాన కథాంశంగా సాగుతుంది. శ్రమటొన్నత్యాన్ని, శ్రమ వెనుక దాగివున్న ప్రతిభను ఎరిగించే ప్రయత్నం ఇందులో మనకు కనిపిస్తుంది. అయితే ఇందుకు భేతాళ, విక్రమార్కుల కథనాన్ని స్వీకరించటం కథను ఆసక్తికరంగా

మార్చింది. భేతాళ విక్రమార్కుల సంభాషణతోనే కథారంభం జరిగిందికాబట్టి ఇది 'నాటకీయ ఆరంభం'.

ఒక జీవిత సత్యంతో ప్రారంభమయ్యే రచనలు కొన్ని. అలాంటిదే 'కాల్‌గరల్'.

"లైఫ్ యీజ్ మెంట్ ఫర్ ఎంజాయ్‌మెంట్" ఆ ఎంజాయ్‌మెంట్‌కోసం ఎంత ఎమౌంట్ అయినా తగలెయ్యాల్సిందే. ఇదీ ఈ కథలో ప్రారంభం.

"అమ్మా నాకా బొమ్మ కొనిపెట్టవూ!"
"మరయితే చదువుకుంటావా?"
"అమ్మా బిస్కట్లు కావాలే!'
"అయితే ఓ గంట చదువుకో"
"అమ్మా చాక్లెట్లు"
"ముందా హోంవర్క్ కానీ"
"అమ్మా ఆకలేస్తుంది అన్నం పెడ్తావా?"
"ఎందుకు పెట్టాలిరా, చదువుకోరా అంటే అన్నం అంటావేం?"
"అమ్మా ఓ ముద్దివ్వవూ?"
"మార్కులు సరిగ్గా రావుకానీ, ముద్దుకాదు ఓ గుద్దు ఇస్తా వెధవా"

సంభాషణలతో మొదలైన ఈ రచన విజయలక్ష్మి మురళీధర్ "చ(ఛ)దువు". ఇందులో ఆరంభం సంభాషణాత్మకం కాబట్టి దీన్ని నాటకీయ ఆరంభానికి ఒక మంచి ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

కుతూహలపూరితమైన ఆరంభానికి రెండు పరస్పరవిరుద్ధమైన ప్రకటనల ద్వారా అవకాశమిచ్చిన కథ 'జీవనమార్గం'.

నాజీవితంలో రెండుసార్లు దుఃఖించాను. మొదటిసారి 'చదువుకోలేక పోతున్నందుకు' -- రెండవసారి 'చదువు కున్నందుకు'. ఇవి రెండూ పరస్పర విరుద్ధమైన దుఃఖాలు. వీటి గురించి వివరంగా వ్రాస్తేనేగాని నా దుఃఖపూరితమైన జీవితం మీకు పరిపూర్ణంగా అర్థంకాదు!

## సంఘటన

కొన్ని సమయాల్లో సాధారణాంశాలే విశేషాంశాలుగా రూపొందుతాయి. అలా ఏదైనా ఒక సాధారణాంశాన్ని విశేషంగా చిత్రించగలిగితే అదే సంఘటన. అంటే పాఠకుని అసంకల్పితంగానే రచనవైపు ఆకర్షితుడిని చేసేది, కథలో బాహ్యంగాను, అంతర్గతంగాను ప్రభావంచూపేది, ముఖ్యంగా కథాగమనాన్ని మలుపుతిప్పేది 'సంఘటన'.

పంతులు జోగారావ్ 'విషగుళిక'లో విద్యాసాగర్‌కు ఎదురైన తీవ్రసంఘటన 'పులిపట్టు'లో విషజ్వరానికి గురికావటం. ఇది తను ఏ ఆదర్శాలనైతే ఆచరించాలనుకున్నాడో వాటికే తిలోదకాలివ్వాల్సి రావటం. ఇది కథాగమనాన్ని మార్చే ఒక తీవ్ర సంఘటనగా భావించాలి. సాధారణపరిస్థితుల్లో జ్వరానికి గురికావటం ఒక సామాన్య సంఘటనే అయినా అది ఆ పాత్ర ఆదర్శాలకు పరీక్షగా నిలవటంతో ప్రత్యేకత సంతరించుకున్నది. ఆ ఘటన కారణంగా పాఠశాలకు హాజరు కాలేకపోవటం, ఆకాలాన్ని హాజరైనట్టుగా చూపటంద్వారా పరిస్థితులతో రాజీపడటం ఈ క్రమంలో పాత్రపడే సంఘర్షణ-- వీటన్నింటికారణంగా కథలో చోటుచేసుకునే మలుపు దీన్ని ప్రధాన సంఘటనగా పేర్కొంటాయి.

ఈ ఇరవైరోజులలోనే జానకేశ్వరరావు చాలా తతంగం జరిపించేడు. అతనూ, తండ్రీ బలవంతపెట్టడంతో తనూ

కాదనలేకపోయేడు.

ఆ పనిచేస్తూ ఉంటే ఒక్కొక్క మెట్టూ దిగజారి అధఃపాతాళానికి కుంచించుకుపోతున్నట్లనిపించేది విద్యాసాగర్‌కి. ఆ పరిస్థితుల్లో అలా చెయ్యటం తప్ప మరో గత్యంతరం లేదని తనను తాను సమాధానపర్చుకోవాలని ప్రయత్నించేవాడు. మనసు ఎదురు తిరిగేది. తను.. తను కూడా అందరిలాగే అడ్డదారిలో ప్రయాణానికి సిద్ధమవుతున్నాడా! తను చేసిందానికి ఏవో సంజాయిషీలూ, సమాధానాలకోసం వెతుక్కుంటున్నాడా! తన ఆదర్శం అబద్ధమేమో! తన నిజాయితీ గర్వపడక విలువ చెయ్యనిదేమో... తన అంతరంగంలో ఎక్కడో ఒక వెసులుబాటు వుంది. ఎక్కడో ఒక అవసమ్మతం వుంది... జానకేశ్వరరావులాగే తన వ్యక్తిత్వంలో కూడా ఏదో తెలీని 'మెలిక' వుంది... ఆ ఆలోచన రాగానే దుఃఖం ముంచుకొచ్చేది విద్యాసాగర్‌కి. ఆకులా వణికిపోయేవాడు... ౦౦

"నువ్వు జాయినింగు రిపోర్టు పంపించేవు... కనుక ఉద్యోగంలో చేరిపోయినట్టే. ఆ తర్వాత యింతవరకూ నువ్వు బడికి జ్వరంవల్ల వెళ్ళలేకపోయేవు... కొత్తగా చేరిన వీకు సెలవేం ఉంటుంది. అందేత... నువ్వు జాయినింగ్ రిపోర్టు పంపించిన తేదీనుండి యివాల్టివరకూ యిందులో సంతకాలు పెట్టు... మరేం ఆలోచించకు... ఏ రిస్కూ లేదు... నువ్విప్పుడిందులో సంతకాలు చేయకపోతేనే రిస్కులో పడతావు... ఇదంతా మామూలే... అందరికీ తెలిసిందే... ౦౦

దిలావర్ 'సమిధలు'లో విద్యారాజకీయాలు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌ల పర్యవసానంగా విద్యార్థిని 'పుష్ప' ఆత్మహత్య ఒక ప్రధాన సంఘటనకాగా

"సుగుణా!

బ్రతికి వుండగానే ఆడవాళ్ళను పీక్కు తినే మనుషులున్న ఈ ప్రపంచంలోంచి నీలాంటి మంచివాళ్ళను కూడా వదిలిపెట్టి వెళ్ళిపోతున్నా. అజ్ఞానపు చీకట్లను పోకార్చే జ్ఞానజ్యోతులు వెలగాల్సిన విద్యాలయాలు క్రూరమృగాలకు ఆలవాలం కావడం.. ఈతరం దురదృష్టం. వేధింపు పేరుతో విద్యార్థులు సాటి విద్యార్థులను ఎంత దారుణంగా హింసించగలరో - ఆ నరకాన్ని ప్రత్యక్షంగా అనుభవించాను. ఇంతకన్నా స్త్రీకి మరో మానభంగముంటూ ప్రత్యేకంగా వుంటుందని నేననుకోను. పచ్చినెత్తురుతాగే మాటలకు వేధింపు అని పేరుపెట్టి ప్రాణాలుతీసే పైశాచిక ఆటకు నేను పావునయ్యాను. నాలాంటి దుర్భర పరిస్థితి ముమ్ముందు ఏ ఆడపిల్లకూ కలగకుండా యీ సభ్యప్రపంచం చూస్తుందనే ఆశతో అంతిమ శ్వాస వదులుతున్నాను.

నీ దురదృష్ట వంతురాలు

పుష్ప.

మాస్టారులకు ప్రతినిధిగా విద్యాలయాల్లోని అరాచకత్వానికి ప్రకాశంమాస్టారు ఆవేదనతో మృతిచెందటం మరో ప్రధాన సంఘటన.

ఈ ఆందోళనల నేపథ్యంలో విద్యార్థుల విద్యాభ్యాసం దెబ్బతినే వైనంచూసి బాధపడే మాస్టారులకు ప్రతినిధి ప్రకాశం మాస్టారు.

"నా ప్రియమైన విద్యార్థులారా...! వ్యక్తిగతంగా మనకెవరిమీదా ద్వేషం ఉండక్కర్లేదు. మన అవిశ్రాంత పోరాటం వ్యక్తులతోకాదు. అజ్ఞానంతో, మూర్ఖత్వంతో, దారిద్ర్యంతో, మూఢవిశ్వాసాలతో. కులాలపేరిట, మతాలపేరిట, రాజకీయాల పేరిట గావించబడుతున్న మారణహోమంలో అమాయకవిద్యార్థులు సమిధలు కాకూడదన్నదే నా ఆరాటం. జ్ఞానపీఠాలుగా విలసిల్లవలసిన యీ విద్యాలయాల్లో క్రూరంగా కొనసాగుతున్న యీ రక్తతర్పణం ఆగాలన్నదే నా ఆకాంక్ష. తరంనుండి తరానికి నిరంతరం ప్రవహిస్తున్న యీ జాతిరక్తం ఏ ఉద్రేకపు మంటలకూ ఇంధనం కాకూడదన్నదే నా ఆవేదన -- ఈ ఆశయం కోసం నేను మొదటి బలిదానం అవుతున్నందుకు గర్విస్తున్నాను. నా రక్తాన్ని తిలకంగా దిద్దుకొని ప్రమాణం చెయ్యండి బాబూ ఈ ఆశయంకోసం అహర్నిశలూ పాటుపడతామని ప్రతిజ్ఞ చెయ్యండి బాబూ.." మాస్టారి గొంతులోంచి యిక మాటలు రాలేదు. మాస్టారి కళ్ళు అందరినీ ఏదో అర్థిస్తున్నట్లే, అందరినీ ఏదో ఆదేశిస్తున్నట్లే చూస్తున్నాయి.

రచనలో సమస్యల యధాతథ చిత్రణ, పరిష్కారాలకోసం పడే ఆవేదన కనిపిస్తుంది. ఇంతకుమించి లోతైన విమర్శ కాని, పరిష్కారాలకోసం చేసే సూచనలుకాని కనిపించవు.

వసుంధర 'కొత్తమేష్టారు' పిల్లలప్రవర్తనలో మార్పు ప్రధానాంశంగా వెలువడిన రచన. పిల్లలను హింసించకుండా వారి హింసాప్రవృత్తిలో మార్పుతేవాలన్నది తల్లి వసంత అభిప్రాయం. అయితే హింస స్వానుభవంలోకి రాకుండా ఆ బాధ వారికి తెలీటం వీలుకాదన్నది ఉపాధ్యాయుడు కోదండరామయ్య అనుభవపూర్వక జ్ఞానం. దాన్ని ఆచరణలో పెట్టే సంఘటనే కథాకథనంలో మలుపుకు, పిల్లల ప్రవర్తనలో మార్పుకు కారణమైతుంది.

ఉరిటి సులేఖ 'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్‌స్టార్' సెక్స్ ఎడ్యుకేషన్ పిల్లలకవసరమా అన్న కథాంశంతో వెలువడిన రచన. కాగా ఇందులో విభిన్న సంఘటనలు పిల్లలపై ఎలాంటి ప్రభావాన్ని

చూపగలవో తెల్పేందుకు అవసరమైన సంఘటనల రూపకల్పన ఉంది. అయితే ఇక్కడ ప్రధానంగా గమనించాల్సిన అంశం రచనలోని ప్రతి సంఘటన వెనుక దాన్ని ప్రేరేపించిన ఘటనలు జీవితానికి సంబంధించినవి కొన్ని ఉండటం. ఆ ఘటనలనుకూడా యథాతథంగా చిత్రించే ప్రయత్నం ఇందులో చేయటం విశేషం.

...... హఠాత్తుగా క్లాస్‌వంక చూసింది జీవంతిక. పిల్లలంతా బోర్డ్‌పై రాసినదాన్ని కాపీచేస్తున్నారు. ఆమె చూపులు అన్ని తలల్నిదాటి సరిగ్గా ఆఖరి బెంచీదగ్గర ఆగిపోయాయి.

అక్కడ .... సరిగ్గా అక్కడ ఓ అమ్మాయి నేలకు సుల్లే అర్ధనగ్నంగా (ఎడిట్)....

(ఇది ఓ అధునాతన పద్ధతుల్లో బోధిస్తోన్న స్కూల్ యు.కె.జీ.లోనూ, ఓ అన్న, చెల్లి సరిగ్గా అయిదేళ్ళ వయసుగల పిల్లల్లోనూ యదార్థంగా జరుగుతోంటే నే చూసిన సంఘటన) .....

....... లేదు... నేను... మరేం... ఈ... మరేం... మొన్న... అప్పుడు... అదే... ఎండాకాలం సెలవులకి... అమ్మమ్మోళ్ళింటినుంచి... వచ్చినంక... అప్పుడులేదూ... అప్పుడు... ఓసారి... అదే... ఓరాత్రి... ఊర్కే నిద్రపోయినట్లు... మమ్మీదగ్గర ఏక్ట్ చేసాగా... అప్పుడు... నే నిజంగానే... నిద్రపోయాననుకుని... మమ్మీ... (ఎడిట్) అందుకే అప్పుడుకూడా... వర్షం... పడిందిగా! అందుకే... ఇప్పుడుకూడా వర్షం పడిందిగా! అందుకే. ఈ వర్షం ఆడుకుంటున్నాం.

"గాడ్! ఇప్పుడేంచెయ్యాలి? ఎలా సముదాయించాలి? తల్లిదండ్రులారా, కొంచెం ఆలోచించండి. మాంసం తింటాంకదా అని దుమ్ములు మెళ్ళో వేస్కుని తిరగం కదా! చర్మాల్ని, కోర్కెల్ని ఆ నాలుగ్గోడలకే పరిమితం చేయండి. ఎదుగుతోన్న పిల్లల్ని తప్పుదోవ పట్టించకండి. ఆసక్తిగా వాళ్ళు అడుగుతోన్న ప్రశ్నల్ని మీ అర్థంలేని కట్టుబాట్లతో కట్టెయ్యకండి.

ఇందులో సంఘటన ఘటనా శిల్పానికి అధిక ప్రాధాన్యం ఇవ్వటం రచన ఆద్యంతం చూస్తాం. రచన మొత్తం అనేక సంఘటనల సమాహారంగానే సాగుతుంది.

పిల్లల్లో ఆధునిక ఆలోచనావిధానాన్ని ప్రోదుకొల్పే ఒక మహిళా అధ్యాపకురాలి హత్య పిల్లల్లో చైతన్యాన్నిరగిలించే ప్రధాన సంఘటనగా మారటం కథాంశంగా వచ్చిన రచన 'అన్‌రెస్ట్'. ఈ సంఘటన కథలో మలుపు కారణమయ్యిందనటానికి సూచనే విద్యార్థినులందరూ ఒక సంఘటితశక్తిగా రూపుదాల్చేందుకు ప్రయత్నించటం.

వాళ్ళు ఆలోచిస్తూనే ఉన్నారు! కొన్నిగంటల తర్వాత ఒక నిర్ణయానికి వచ్చారు! ఆరోజు క్లాస్‌లోంచి బయటకువెళ్తూ అరుణ మేడమ్ చెప్పిన హితవు గుర్తొచ్చి... ఆ లక్ష్యసాధనకై ఉడతాభక్తిగా తమవంతు కర్తవ్యం నెరవేర్చుకోవడానికీ... ఒక సంఘటితశక్తిగా రూపుదిద్దుకోవడానికీ.

పిల్లలచదువుకోసం సర్వస్వం త్యాగంచేసేందుకు సిద్ధపడిన పోతన్న ఆలోచనల్లో అనివార్యమైన మార్పుకు , పైడితల్లి జీవితంలో అనుకోని మలుపుకు కేంద్రబిందువుగా నిలిచిన సంఘటన పోతన్న ఇల్లుకాలిపోవటం. పైడితల్లి చదువుకోసం తెచ్చిన డబ్బుకూడా అందులో మసైపోవటంతో చివరకు తన కొడుకుని దొరబాబు కొడుకుతో పట్నానికి కూలీగా పంపటం కథనంలో కొసమెరుపుగా నిలుస్తుంది. తమ బ్రతుకుల్లో ఇంకా వెలుగురాలేదనే వాస్తవాన్ని సూచించే రచనే కాశీవిశ్వనాథం 'ఇంకా తెలవారలేదు'

విద్యార్థులు సన్మానం పేరుతో సమర్పించిన సన్మానపత్రం అధ్యాపకుడు పరాత్పరరావు వ్యక్తిత్వంలో ప్రబలమైన మార్పుకు కారణం కావటం 'చంద్రునికోనూలుపోగు'లో కనిపిస్తుంది. ఈ సన్మానపత్ర బహూకరణే ఈ కథలో ప్రధానమైనదిగా, కథనానికి బలాన్నిచ్చి, కథనంలో మలుపుకు దోహదకారిగా కనిపిస్తుంది.

"పరాత్పరరావు అధ్యాపకవృత్తిలో కాకలు తీరినయోధులు. చదువు'కొనే'వారికి కల్పతరువు. ఖరీదుగా విద్యాదానం చేయడంలో అందివేసినచేయి.

ఆయన కనిపించనికాలం: అధ్యాపకుల సమ్మె ప్రారంభమైన రోజున అదృశ్యమై తిరిగి విరమించిన రోజువరకు.....

కనిపించకపోవడానికి కారణం: రోజుకు పద్దెనిమిది గంటలపాటు ఖరీదైన విద్యాదానం చెయ్యడానికి.... చదువు 'కొనుక్కునే'వారికి సంపూర్ణంగా న్యాయం చెయ్యడానికి.....

అత్యంత ప్రియమైనవి: "టైమ్ ఈజ్ మనీ, ఆలస్యం అమృతం విషం. దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకో", ధనమూల

మిదం జగత్" అన్న లోకోక్తులు.

ఆచరించేవి: 'కానుకలేవీ కోసెడు దూరంలో వుంచు. దుడ్డులేని వాడిని చివరకు కూడా పడవ ఎక్కనివ్వవద్దు... దయకన్నా ధనమేమిన్న' అనే వారు నిత్యం స్మరించే మహోమంత్రాలు.

కార్యదీక్షా పంతత్వం: సమ్మెకు పూర్వకత చేకూర్చే పదుద్దేశంతో చదువు గురించిగాని, సిలబస్ గురించిగాని కాలేజీ విద్యార్థులు ఎవరడిగినా సమాధానం చెప్పని, నూటికి నూరుపాళ్ళు ఆచరించిన అకుంఠిత కార్యదీక్ష.

పేద విద్యార్థులకు ఇచ్చే ప్రోత్సాహం: కష్టపడి చదువుకుని పాసవుదామనుకున్న ఓ పేదవిద్యార్థి పరాత్పరరావుగారి కరుణా కటాక్షాలకు నోచుకోక వారివద్దకు ట్యూషన్‌కు వెళ్ళే డబ్బులేక, సమ్మెఫలితంగా తప్పడంతో, ఓ విద్యాసంవత్సరాన్ని కోల్పోయాడు. సంవత్సరంవరకు రావలసిన ఉపకారవేతనం ఆగిపోయి కడుపునింపుకోవడానికి అతను వ్యవసాయకూలీగా అవతారం దాల్చడానికి వారు అపూర్వ అవకాశం ఇచ్చారు.

ప్రస్తుతి: ఆడంబరాలకు, అధికారవ్యామోహాలకు, అందలాలుమోసే మనస్తత్వాలకు ఘనసన్మానం జరుగుతున్న యీ సమయంలో మా పేద విద్యార్థుల తరఫున చంద్రునికో నూలుపోగు! ఆదిత్యునివంటి ఆచార్యునికి ఓ చిరుదీపం! కుబేరునికి యీ కుచేలుడు సమర్పించుకునే చిరుకానుక!!!

తన కొడుకు తనలాకాకుండా మంచి స్థాయికిచేరాలనుకుని అందుకు ఆర్థికంగా తను సహాయపడలేని నిస్సహాయతను గుర్తించి, ఒక తండ్రి ఎన్నుకున్న పరిష్కారం కొడుకుని పుట్టంగానే కోటాకోసం వికలాంగుని చేయటం. పరమ దుర్మార్గంగా కనిపించే ఈ పాశవిక చర్యవెనుక ఓ తండ్రి వేదన దాగిఉండటం గమనార్హం. ఈ రచనలో ఈ సంఘటనే కథనాన్ని మలుపుతిప్పి తనలా కాకుండా కొడుకు తను ఆశించినరీతిలో ఉన్నతస్థాయికి చేరటం విశేషం.

"అవును నరసూ! వాడి కులాన్ని మార్చలేను. వాణ్ణి ఆడపిల్లను చేయలేను! పెద్దయ్యాక డొనేషన్లు కట్టి చదివించలేను! చదువయ్యాక లంచాలిచ్చి ఉద్యోగం కొనిపెట్టలేను! ఉద్యోగం రాకుండా వాడికి పెళ్ళిచేయలేను! అందుకే నా చేతనైనపని -- అదే కసాయివాడిలా ఆ 'దుర్మార్గం' చేశాను. అందుకే వాడిపుడు అలా కుంటుతూ నడుస్తున్నాడు. అందుకే -- వాడికి 'అంగవికలుర' కోటాలో ఆనాడు ఇంజనీరింగ్ సీటొచ్చింది. అది చదవడానికి స్కాలర్‌షిప్ వచ్చింది. అందుకే ఇపుడు అప్లైచేసిన వెంటనే ఉద్యోగం వచ్చింది......లేకపోతే...." ఇంకా ఏదో చెప్తున్నాడు విశ్వనాథం....... కానీ ఆమెకు వినిపించటం లేదు.

" మీరు..... మీరే ఇలా కసాయివాడిలా......"

" అవును నరసూ! కసాయివాణ్ణే! కన్నకొడుక్కి కలలోకూడా ఏతండ్రీ తలపెట్టకూడని దారుణానికి ఒడిగట్టిన నాపేరు 'గిన్నీసుబుక్'లో రాయాలి! కానీ ఈ పని ఎందుకు చేశానో తెలుసా?.....నామీద నాకు అసహ్యం కలిగి ఆ పని చేశాను! ఈ వ్యవస్థమీద కక్ష కట్టి ఆ పాపానికి తలపడ్డాను! పెళ్ళి చేసుకుని భార్యతో సుఖపడాలే తప్ప--పావలా మల్లెపూలు కొనిపెట్టలేని దుస్థితికి కుమిలి కుమిలి ఏడ్చే పరిస్థితి రాకూడదని చేశాను..." అంటూనే కుర్చీలో వెనక్కి వాలిపోయి బాధగా కళ్ళు మూసుకున్నాడు. విశ్వనాథం పేరుగల ఆ దుర్మార్గపు నాన్న!! (జీడిగుంట రామచంద్రమూర్తి, దుర్మార్గం, అమూల్యం కథలు, పే 48-55)

సమాజసేవపేరుతో తమ స్వంతపిల్లలకు ప్రేమను పంచివ్వకుండా వారిపట్ల తల్లిదండ్రులుచూపే బాధ్యతారాహిత్యానికి ఫెనుసవాలుగా నిలిచిన శౌరి తీసుకున్న నిర్ణయం కథనాన్ని అనుకోని మలుపుతిప్పుతుంది 'ప్రేమ రాహిత్యం'లో. తల్లిగా బాధ్యతనుగుర్తెరిగి తను సామాజికసేవా కార్యక్రమాలనుంచి తప్పుకొని తన బిడ్డకు ప్రేమనందించాలని నిర్ణయించటం పై సంఘటనకు వచ్చిన స్పందన. కథనంలో అనుకోని మలుపుకారణమైన సంఘటన శౌరి తనను అనాథశరణాలయంలో చేర్పుకోమంటూ తన తల్లి పనిచేసే శరణాలయానికి దరఖాస్తు చేసుకోవటం.

"శౌరి... తన కన్నబిడ్డ శౌరి తను అనాథనన్న భావానికి లోనయ్యాడా? తల్లీ తండ్రీ ఉండికూడా తనకన్నా అనాథ బ్రతుకే నయమనే స్థితికి వచ్చాడా? ఇది ఎలా జరిగింది?"

నమ్మలేని వాస్తవాన్ని గతం నమ్మించ చేస్తోంది. ఎన్నో సంఘటనలు..... ఒకటా? రెండా?ఎన్నో.... ప్రోగ్రెస్ రిపోర్ట్ కూడా పట్టించుకోని తన మాతృత్వాన్ని సవాలు చేసే సంఘటన కొడుకుని క్రమశిక్షణ పేరుతో ఆప్యాయతకు దూరంచేసిన మరొక సంఘటన తన తల్లిహృదయాన్ని చీలలు వారుస్తోంది. తల్లిదండ్రులతో కలసి పిక్నిక్‌కు వెళదామన్న చిన్నకోరికను ఆదిలోనే తుంచివేసిన మరొక సంఘటన ఎదపైన సమ్మెటపోటుగా మారింది. కొడుకు భవిష్యత్తుకన్నా కూడా తన లక్ష్యసాధనే ముఖ్యమనుకున్న తనకు చివరకు ఆ కొడుకే మానసికంగా దూరమయ్యాడా? ఎందరో అనాథపిల్లలని చేరదీసి, వారి మనసులను తెలుసుకున్న తను తన కొడుకునే అనాథగా మార్చుకుందా? ఎడతెగని ప్రశ్నలు.... ఎద తెగిపోయే ఆలోచనలు. మరోసారి ఆ

కాగితం చదవసాగిందామె.

"శరణాలయం వారికి నమస్కారాలు. నేనుకూడా అనాథనే. నన్ను మీ ఆశ్రమంలో చేర్చుకోరూ? మామమ్మీ నన్ను పట్టించుకోదు. మా డేడీ ఎప్పుడూ టూర్‌లోనే ఉంటాడు. అనాథ శరణాలయంలో అయితే బాగా చూస్తారని మొన్న ఒకబ్బాయి చెప్పటంతో ఇది రాస్తున్నాను. ప్లీజ్! నన్ను చేర్చుకోండి. మీకు బోలెడు థాంక్స్ మరి. అన్నట్లు ఈ విషయం మమ్మీకి చెప్పవద్దు!"

అక్షరాలు వంకరటింకరగా ఉన్నా ఆ అక్షరాల వెనుకఉన్న హృదయం, ఆవేదన సరిగ్గానే అర్థమయ్యాయి సుమిత్రకు. ఇది ఉద్యోగం. బాధ్యతతో కూడినదే కావచ్చు. కానీ తను కాకపోతే మరొకరు చేస్తారు. కాని తన కొడుకు బాధ్యతకు ప్రత్యామ్నాయం లేదే! ఈ లోకంలో ఎటువంటి మినహాయింపు లేనిదీ - ఉండకూడనిదీ తల్లిప్రేమ ఒక్కటే. (పెద్దాడ వేంకట నరసింహా మూర్తి, ప్రేమరాహిత్యం, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 30-11-88, పే 51-53)

## సంఘర్షణ

సంఘర్షణ రెండు విరుద్ధశక్తులమధ్య చోటుచేసుకుంటుంది. ఈ శక్తులు వ్యక్తి ఆంతరంగిక ప్రపంచంలోవికావచ్చు. లేదా బాహ్యప్రపంచంలోవి కావచ్చు. అయితే ఈ విరుద్ధశక్తులు ప్రాబల్యంకోసం చేసే ప్రయత్నం స్థాయినిబట్టి సంఘర్షణ తీవ్రత ఉంటుంది. సాహిత్యంలో ఈ సంఘర్షణ వివిధ రీతుల్లో, వివిధ శక్తులమధ్య ఉండవచ్చు. అంటే ఒకే పాత్రలో అంతర్గతంగా ఏర్పడవచ్చు. దీన్ని అంతఃసంఘర్షణగా పేర్కొనవచ్చు. రెండు లేదా అంతకుమించిన పాత్రలమధ్య ఏర్పడవచ్చు. పాత్రకు, పాత్రేతర అంశాలకు మధ్య ఏర్పడవచ్చు. ఈ రెండురకాలు బాహ్యసంఘర్షణ క్రిందకువస్తాయి.

పాత్రలమధ్య సంఘర్షణల స్వభావంలో భేదాలున్నాయి. పాత్రల అంతర్గత భావాలకు, బాహ్యగత చర్యలకూ ఘర్షణలు ఏర్పడవచ్చు. రచనలో సంఘర్షణ బాహ్యంగాగాని, ఇతివృత్తంలో భాగంగాగాని చోటుచేసుకోవచ్చు. పాత్రల లక్ష్యం ఒకటే అయినా ఆచరణల్లో వైరుధ్యాలకారణంగా సంఘర్షణలేర్పడవచ్చు. అయితే ఆయా పాత్రలపరిధిలో వాటి ప్రవర్తన సరైనదనే భావాన్ని పాఠకునిలో కలిగించగలిగితే రచనలో సంఘర్షణా శిల్పం అద్భుతంగా చిత్రితమైనదని భావించవచ్చు.

'సాంబయ్యచదువు'లో నిరంతరం సంఘర్షణలు కనిపిస్తాయి. చిలుకయ్య తనకొడుకుని చదివించాలనుకున్నప్పుడు దొరకు చిలుకయ్యకు మధ్య సంఘర్షణ.

"దండాలు దొరా! బాంచెను!" అన్నాడు అతడు వణికిపోతూ.

"ఏంది చిలుకయ్యా! ఎందుకస్తివి?" అన్నాడు దొర దర్పంగా.

"నా కొడుకును బడికి తోలన్ననుకుంటున్న దొర..." అన్నాడు నసుగుతూ.

ఆ మాటకి పకపకా నవ్వాడు దొర.

"ఏందిరా! నీ కొడుకు చదివి రాజ్యమేలటాడా? చదువుకున్న పోరడు నీ మాటింటాడా? చాకలోడు, మంగలోడు... అందరు చదివితే చదువుకేం విలువుంటది... నాకాడ గొడ్లు కాయడానికుండు..." అన్న దొర మాటలకి ఆ అమాయకపు తండ్రి ప్రతిస్పందన ఏమిటి? తన బిడ్డను చదివించుకుందుకు... మరెవరి సమ్మతినో తీసుకునే పరిస్థితులు... ఈ ఆధునికయుగంలో... ఇంకా ఎక్కడున్నాయి?

పాఠశాలలో నిరంతరం కులంపేరుతో జరిగే అణచివేతలవల్ల అంతరంగంలో, బయట ఏర్పడే ఘర్షణ

"పంతులూ! నీకు బుద్ధిలేదు. స్వతంత్రమచ్చిందని చిన్నంతరం పెద్దంతరం చూడకుంటేట్లు? అంటు ముట్టు మరిచిపోవుడేనా? గా పోరడెవ్వడు? పెద్ద మాదిగ లింగని కొడుకుగదా?" అన్నాడో పిల్లవాని దిక్కు చూస్తూ.

"అవును దొరా! మాదిగోల్ల పిల్లవాడే వాడు"

"అయితే దూరం కూచోబెట్టక నడుమనే కూచుండబెట్టినవేంది? మాదిగోల్లు చదువుకుంటే ఎక్కువంటే అందర్ని ముట్టుకునుడేనా? కోపంగా అన్నాడు వెంగళరావు.

"అవును దొరా! నేను మరిచేపోయాను" దొంతో అని.

"ఆరే నర్సిమ్మా! నువ్వు పోయి వెనుక కూరో. నేను నిన్న చెప్పింది జ్ఞాపకంలేదా?" బెత్తం ఝుళిపిస్తూ అన్నాడు వెంకటయ్య. 13

**చదువుకునే సమయంలో సాంబయ్యచూపే ప్రతిభకు, కులపరంగా అతనిపై జరుగుతున్నదాడికి నిరంతర ఘర్షణ**

"మా చదివినవి తియ్యి" అని తన పక్కనే ఉన్న కాళహస్తీశ్వర శతకాన్ని తీసి కఠినంగా ఉన్న ఓ పద్యాన్ని చూపాడు. "ఈ పద్యాన్ని చదవడానికి ఒక్క బ్రాహ్మణులకైతే తప్ప నోరే తిరగదు. మద్యం, మాంసాలు తినే శూద్రోల్లకు ఇవి చదువడం రాదు." అన్నాడు వెంకటేశ్వరరావు.

"నువ్వు చదువుల్లో హుషారే. నీగురించి కాదు. నేం చెప్పేది. కాని బ్రాహ్మణుడో, బ్రాహ్మణాంశ ఉన్నవాడో ఐతే తప్ప సంస్కృత పదాలతో కూడిన పద్యాలను దోషాలు లేకుండా చదువలేడు"

ఆ మాటల్లోని దుర్మార్గాన్ని అర్థం చేసుకున్నాడు సాంబయ్య. అతని పసిహృదయం గాయపడింది. పట్వారీకి సరైన సమాధానం చెప్పి నోరు మూయించాలనుకున్నాడు.

"నిజమే పంతులుగారు అయితే పద్యాలను బాగా చదువరానోళ్లు, సంస్కృత పదాలను మంచిగ ఉచ్చరించరానోళ్లు బ్రాహ్మలకు పుట్టలేదన్నట్టేనా...?"

"కాదురా సాంబయ్యా! ఈ రోజుల్లో ఎవ్వరైన చదువుకుంటున్నరు. వచ్చిందిగద మనకు స్వతంత్రం. ఆ గాంధి మహాత్ముడు పుట్టి దేశాన్ని పాడుజేసిండు. అందర్ని నెత్తికెక్కించుకున్నడు. అందుకే గిట్లయితంది"

**కుటుంబపరంగా చెల్లెలిపై కట్నంకోసం జరుగుతున్న కుటుంబహింస కారణంగా సాంబయ్యలో నైతికతకు, సామాజిక పరిణామాలకు మధ్య ఘర్షణ**

బావకుద్యోగమైన తర్వాత ఆమిచ్చిన కట్నం తక్కువనిపించింది. తేపకోసారి చెల్లెను కొట్టి పంపిస్తున్నాడు. చెల్లె కాపురం నిలబెట్టడానికి తన తండ్రి ఏదో కొంత ఇచ్చి పంపిస్తున్నాడు.

ఇవన్నీ ఎందుకు జరుగుతున్నాయి? ఊళ్ళో మూఢనమ్మకాలింకా చెక్కు చెదరకుండా ఉన్నాయి. వీరేశలింగం పంతులుగారు స్వాతంత్ర్యపోరాటం ముమ్మరంగా సాగుతున్న కాలంలో ఉండికూడా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనలేదు. అతడు కేవలం సంఘసంస్కరణల వరకే ఎందుకు పరిమితమయ్యాడు?

సమయం దొరికినప్పుడల్లా ఎన్నో విధాలుగా ఆలోచిస్తూనే ఉన్నాడు సాంబయ్య. అతనిలో ఎన్నెన్నో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏ ప్రశ్నలకు సమాధానాలు మాత్రమాతనికి దొరకడంలేదు. 87

**కళాశాలలో విభిన్న ఆలోచనాస్రవంతులు-- వాటన్నింటిలో ఏది సరైందో ఎంచుకోలేక సాంబయ్యలో అంతఃసంఘర్షణ**

"ఈ చదువులు కేవలం గుమాస్తాలను తయారుచేయడానికి పనికొచ్చేవి మాత్రమే. ఇవి చదివితే ఒరిగేదేంలేదు. అసలు చదువులు సమాజాన్ని గూర్చి చెప్పేవి. అవి మన విద్యాలయాల్లో చెప్పరు. మనకు కావాల్సింది శాస్త్రీయ విద్యావిధానం. 108

"సాంబయ్యా... నువ్వొక్క భ్రమలో ఉన్నావు. ఈ వ్యవస్థలో మనలాంటి వాళ్ళకేదో ఒరుగుతుందనుకోవడం శుద్ధ భ్రమ. నువ్వు మెరిట్ విద్యార్థివైనంత మాత్రాన నీకుద్యోగం దొరుకుతుందనుకోకు. దొరికినా నువ్వేదో నీ తల్లిదండ్రులను ఉద్ధరిస్తాననుకుంటున్నావేమో? ఉద్ధరించినా అది నీ ఒక్కడి కుటుంబంవరకే పరిమితం. నేను చేసేది మొత్తం తల్లిదండ్రుల కొరకు. ఈ దోపిడీ వ్యవస్థను కూల్చందే దేశానికి విముక్తిలేదు" అన్నాడు ఈశ్వర్. 108

"ఈశ్వర్..! అవన్నీ పెద్దమాటలు. దయచేసి నన్ను చదువుకోనియ్యి. నా ఇంటి పరిస్థితి రోజురోజుకూ దిగజారుతుంది. మా నాన్న అప్పుల్లో మునిగిపోతున్నాడు. ఈ పరిస్థితుల్లో నాకేమన్నా అయితే వాళ్ళు తట్టుకోలేరు. నాకీ వ్యవస్థలో మంచీ చెడూ రెండూ కనబడుతున్నాయి. నేనెటూ తేల్చుకోలేకపోతున్నాను. నువ్వు నా జోలికి రాకు" 109

సిద్ధాంతాలకోసం, ఓ ధ్యేయం కోసం ప్రాణాలర్పించడానికైనా సిద్ధంగా ఉన్న యువకులు కొందరుంటే, జులాయిగా తిరుగుతూ కాలేజీ జీవితాన్ని చదువుకోసం కాక ఎంజాయిమెంట్‌కోసమని భావించే విద్యార్థులు మరికొందరున్నారు. 110

**తను చదివినచదువు తనకేంనేర్పిందో అర్థంకాని అయోమయస్థితి. జీవితంలో ఎదురౌతున్న సమస్యలకు నేటికీ తను చదివిన చదువు పరిష్కారం చూపలేకపోవటాన్ని జీర్ణించుకోలేని సాంబయ్యలో ఎడతెగని ఆలోచనల సంఘర్షణ**

ఇన్నిన్నేళ్ళ చదువులు తనకేం చెప్పాయి...? రాత్రింబవళ్ళు కష్టపడి చదివిన చదువులవల్ల తనకొచ్చిందేంటి? ఏం సాధించబోతున్నాడు తను. ఊళ్ళో దొరలకెందుకు వంగివంగి నమస్కారాలు పెట్టాలో ఈ చదువులు చెప్పలేదు. కొందరి కెందుకు నూర్లకొద్దికరాల భూములున్నాయో, మరికొందరికేమాత్రం భూమెందుకులేదో తన ఇన్నేళ్ల చదువు చెప్పలేదు. దొరల అధికారాలకు వెనకున్న మూలాలేంటో చెప్పలేదు. కొందరెంత కష్టపడుతున్నా కూలినాలితో అర్ధాకలితోనే ఎందుకు బతకాల్సి

వస్తుందో ఏ చదువూ చెప్పలేదు.

నాన్న ఒంటి నాగలిపుసంతో సతమతంకావడం, అవ్వ తనజీవితాన్నంతా భూమికే అంకితం చేయడం వెనకున్న కోణాలు తనకే చదువులు చెప్పలేదు. తాను చూస్తూ ఉండగానే కొందరాస్తులు విపరీతంగా పెరగడం, మరికొందరివి సున్న కావడం ఎందుకు జరుగుతుందో చెప్పలేదు చదువులు. సమాజంలోని అంతరాలు, సాంఘిక దురన్యాయాలు, దోపిడీ, పీడన లాంటి ఏ విషయాన్ని గూర్చి చెప్పలేదు చదువులు. అయినా తాను తనలాంటి లక్షలాదిమంది సుదీర్ఘకాలాన్నీ చదువులకోసం వెచ్చిస్తున్నారు.

తన చెల్లెల్లాంటి చెల్లెండ్లెంతోమందున్నారు. సమాజంలో... మరిలాంటివాళ్ళ సమస్యలకు ఏం పరిష్కారాలను చెబుతుందీ చదువు? అసలీ చదువులు తనలాంటి వాళ్ళనీసమాజంలో ఎలా బతకమన్నాయి? అసలీ చదువుల ప్రయోజనమేంటి?

ఈశ్వర్ చెప్పినట్లు ఈ చదువులు కేవలం గుమాస్తాలను తయారుచేయడానికేనా? పోనీ చదువుకున్న వాళ్ళందరికీ ఉద్యోగాలు దొరుకుతాయా? ఇప్పటికే ఎంతోమంది వీధుల్లో తిరుగుతున్నారు. తనలా చదువుల్లో తెలివితేటలున్నవాడికి తొందరగానే ఉద్యోగం దొరకవచ్చు. కాని ఉద్యోగం దొరకనివాళ్ళంతా ఏం చేయాలని చెబుతున్నాయీ చదువులు? ఎలా బతకమంటున్నాయి?

అసలీ చదువులు, పాఠ్యపుస్తకాలు ప్రపంచం గూర్చి ఏం చెప్పాయి? సామాజిక పరిణామాల గూర్చి ఏం బోధించాయి? మరి తన ఇన్నేళ్ళ చదువుల కర్థమేంటి? సాంబయ్యలో రకరకాల ప్రశ్నలు. ఈ సమాజంగూర్చి తాను కొంతైనా తెలుసుకున్నాడంటే అవి తాను బయట చదివిన పుస్తకాల ద్వారానే మరీ పాఠ్య పుస్తకాల చదువుల ఉపయోగమేంటి? చెల్లెలి సమస్య పరిష్కారం గూర్చి ఆలోచిస్తూ ఎన్నో విధాలుగా ఆలోచిస్తున్నాడు సాంబయ్య. తన చదువులకు ప్రయోజనమేంటి? చదువుకున్న వాడైన తాను నాలుగు కళ్ళతో ప్రపంచాన్ని చూస్తాడన్న తల్లికి తానే విధంగా పరిష్కారం చూపాలి? 122

ఉపాధ్యాయునిగా తను నమ్మిన ఆదర్శాలకు, వాటిని ఆచరించలేకపోవటానికి మధ్య సంఘర్షణ

పల్లెల్లో ఆసమయంలో ఉపాధ్యాయుడికేమాత్రం విలువలేకపోవడం చూశాడు.

"అయ్యో సాంబయ్యా! నీకే ఉద్యోగం దొరుకలే! గీ టీచర్ నౌకరి కచ్చినవేంది?"

"నువ్వు చదువులుసాదుగద గీ నౌకరిజేత్తున్నవేంది?"

"అయ్యో సాంబయ్య గింత జదివి నువ్వు చేసేది పంతులు నౌకరేనా?" అంటూ

ఊరెళ్ళినప్పుడు తన ఉద్యోగాన్ని చులకన చేసి మట్లాడటం బాధ కలిగించింది సాంబయ్యకు.

"బతుకలేనోడు బడిపంతులని చదువుల గంటుసాదున్నావు. గీ నౌకరి జేత్తావు?" అనే చెప్పసాగారు.

ఇవన్నిటిమధ్య తాను ఉపాధ్యాయుడిగా చేరి ఏవేవో చేస్తానని కిషన్‌రెడ్డికి రాసిన ఉత్తరం జ్ఞాపకం వచ్చి సాంబయ్యలో రకరకాల సంఘర్షణలు మొదలయ్యాయి. మరో ఉద్యోగం కొరకు ప్రయత్నించక తప్పలేదు సాంబయ్యకు. 124

తన చదువు, తన జీవితం ఏం నేర్పింది? తను చదువుకొని ఏం సాధించగలిగాడు? తాను చదువుల్లో క్లాసులో ఫస్టయి, ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణుడై అంత జీవితాన్ని చదువుకే అంకితంచేసి ఏం సాధించినట్లు

ఎన్నోరకాలుగా ఆలోచిస్తున్నాడు సాంబయ్య. 126

ఆచరించలేకపోయిన ఆదర్శాలు, జీవితంతో రాజీ, ఫలితంగా తన ఓటమిని అంగీకరించలేని మనస్తత్వంతో ఘర్షణ

'అసలీ పోరాటాలు సరైనవేనా? న్యాయ సమ్మతమైనవేనా? పదేళ్ళక్రితమైతే తాను పోరాటాల్లో పాల్గొనకున్నా అవి న్యాయసమ్మతమైనవే అనుకున్నాడు... మరిప్పుడు?'

వాటిని గురించి ఆలోచించలేదు. తానిప్పుడనుభవిస్తున్న ఈ జీవితానికి భిన్నంగా ఏం జరిగినా తానిప్పుడు సహించలేడు. తాను గిరిగీసుకున్న పరిధిలోకి ఎవ్వరినీ రానీయలేడు. తన కుటుంబంగూర్చి తప్ప దేన్ని గురించీ ఆలోచించలేడు. అంతే... అంతే... అనుకున్నాడు సాంబయ్య.

ఈ చదువులు పరాయీకరణకి గురిచేస్తున్నాయని గమనిస్తున్నా మంచి ఉద్యోగమనే లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని పిల్లలను చదివిస్తున్నాడు. తన పిల్లల్లో ఒకర్ని కలెక్టర్, మరొకర్ని డాక్టర్ చేయాలని కలలు గంటున్నాడు.

అప్పుడప్పుడాతనికి తన ఆదర్శాలు, చుట్టూ జరుగుతున్న పోరాటాలు, సాహిత్యం, శ్రీశ్రీలాంటివి జ్ఞాపకం వచ్చినా వాటిని బలవంతంగా నొక్కి పెడుతున్నాడు.

వృద్ధుడైన చిలుకయ్య ఇంకా రెండు బక్కెద్దులతో ఒంటినాగలివుసం చేస్తూనే ఉన్నాడు. రాజమ్మ పొలం పనులకెళ్తూనే ఉంది. 127

ఇటువంటి అనేక సంఘర్షణలనడుమ చిలుకయ్య, రాజమ్మల జీవనచిత్రంలో ఏమాత్రం మార్పులేకపోవటం సంఘర్షణే వారి జీవనవిధానంగా సాగటం విశేషమని చెప్పలేం. మొత్తంమీద

నిరంతర 'సంఘర్షణ'ల చిత్రణతో కథనంలో ఉత్సుకతను రేకెత్తించారు. ఇంకా పాఠకుని హృదయానికి వేదనాపూరితమైన అనుభూతులను అందించటంద్వారా దళితుల జీవనవిధానంలోని విభిన్న కోణాలను ఆవిష్కరించేప్రయత్నం గొప్పగా జరిగిందని భావించవచ్చు. ఇందుకు సంఘర్షణోత్పాదనాశిల్పాన్ని రచయిత సమర్థవంతంగా వినియోగించుకొనటం గమనార్హం.

సంఘర్షణాశిల్పానికి మరో ఉదాహరణ పంతుల జోగారావ్ 'విషగుళిక'. ఉపాధ్యాయునిగా ఎంపికైన మొదటిరోజే 'చీకటిదారుల' ప్రస్తావనతో జానకేశ్వరరావుతో విద్యాసాగర్ సంఘర్షణ

"అంతేనా. ఈ ఉద్యోగంలో వేరొకరిని వేసేవారు. మెడమీద తలవున్న వాడెవడూ కూడా చెప్పడు. రేపు మంచిరోజని అంటున్నారుకదా! రేపు ఉదయం మళ్ళీ వస్తాను. ఓ జాయినింగ్ రిపోర్టు రాసివుంచండి. తీసికెళ్ళి ఎమ్.ఇ.వో.ని కలిసి ఇచ్చేస్తే సరిపోతుంది. ఉద్యోగంలో ప్రవేశించినట్లే...

ఈ మనిషిలో ఏదో తిరకాసు వుంది. కనిపించని మెలికలేవో వున్నాయి. మనిషి మంచివాడే కావొచ్చును. కాని తను కోరుకునే మంచి ఇది కాదు. పేదవాడని జాలిపడి తీసుకునే లంచంలో ఎంతో కొంతశాతం తగ్గించుకొనే మంచితనం తను కోరుకునేది. అప్పని తెలిసీ పదిమందికోసం బలిదించుకునే మంచితనం తను ఆశించేది. పెన్నెలంత స్వచ్ఛమయినదీ, మంచుబిందువులు పడి మెరిసే గడ్డిపువ్వంత నిర్మలమయినదీ, పవిత్ర పూజాద్రవ్యాల లాగా పరిమళించేదీ-- అలాంటి మంచి తనకి కావాలి.

"అయాం సారీ... మిమ్మల్ని హర్ట్ చేసినట్టున్నాను. సూటిగా చెప్పాలంటే... ఇదివరకు నేను ఇక్కడే దగ్గర్లో వున్న వూళ్ళో పనిచేస్తూ వుండేవాడిని. కొంతంగి ట్రాన్స్‌ఫరయి ఏడాదిన్నరయింది-- నిజం చెప్పాలంటే ఆ ఊరికే నేను కావాలని బదిలీ చేయించుకున్నాను. మీరు నమ్ముతారో లేదో... ఆ బదిలీకోసం
నేను రెండువేలకు పైగా ఖర్చుపెట్టేను కూడా..."

"ఈ ఏడాదిన్నర కాలంలోనూ నేను ఒక్కసారి కూడా ఆ ఊరు వెళ్ళలేదంటే మీరు నమ్మకపోవచ్చు..."

"లాంగ్‌లీవ్ పెట్టేననో, మరేదోనని అనుకోకండి. నెలనెలా జీతం అందుకుంటూనే వున్నాను."

"విద్యా! క్షమించండి... నేను చెప్పేది అర్థం చేసుకోండి. మీకు తెలుసా! ఆ స్కూళ్ళు తనిఖీ చెయ్యాల్సిన అధికారులెవరికీకూడా ఆ ఊళ్ళెక్కడున్నాయో తెలీదు-- ఏ ఒక్కరూ కనీసం ఒకసారికూడా వెళ్ళి వుండరు. విజిట్‌లూ, ఇన్‌స్పెక్షన్లూ జరిపించినట్టు ఇక్కడే ఏ లాడ్జిగదిలోనో కూర్చుని రిపోర్టులు రాసుకుంటూ ఉంటారు. 37

"ఎన్నో ప్రశ్నార్థకాలతోనూ, మరెన్నో సందేహాలతోనూ నా ప్రయాణాన్ని ఆరంభిస్తున్నాను తండ్రీ! ఈ మార్గంలో ఎన్నో సవాళ్ళను ఎదుర్కొనే పరిస్థితి కనిపిస్తోంది. నాకా శక్తినివ్వు. ఏ ఆదర్శాలు నిలుపుకోవాలని కోరికోరి ఈ ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించదలిచేనో ఆ ఆదర్శాలు నిలుపుకునే బలాన్నివ్వు" 38

"అతను నాణేనికి ఒకవైపు మాత్రమే చూపిస్తున్నాడనిపిస్తోంది. అదే నిజమనీ, నమ్మమనీ చెప్తున్నాడు. తను చూపించే నాణేనికి బొరుసుతప్ప బొమ్మలేదని వాదిస్తున్నాడు. బొమ్మా బొరుసులలో ఏదో ఒకటి మాత్రమే వుండడం అసాధ్యం కదా నాన్నా? అవినీతి మార్గాలు అవలంబించే ఉపాధ్యాయులు ఎక్కువమందే ఉండొచ్చు. వాళ్ళకంటే ఎక్కువసంఖ్యలోనే ఉండొచ్చు. బాధ్యతాయుతంగా పనిచేసేవాళ్ళు. మంచినెయ్యీ, వెలుగునీడల్లా అంతటా ఉంటాయి. మీకు చెప్పేంత వాణ్నికాను. ఒక గొప్ప వ్యవస్థకు వ్యక్తుల మంచితనం వల్ల మరింత మేలు జరుగుతుంది. వ్యక్తుల చెడ్డతనం వాళ్ళనే పతనం చెందేలా చేస్తుంది తప్ప విస్తృతంగా విస్తరించిన ఆ మహావ్యవస్థను ఏమీ చెయ్యలేదు. టీచరవాలని చిన్నప్పటినుంచీ కోరుకున్నాను. నా కోరిక నెరవేరే సమయం వచ్చింది. మీరింక మరేమీ దిగుళ్ళు పెట్టుకోకండి నాన్నా. 38

జానకేశ్వరరావు తను ఊహించని వాస్తవాలను ముందుంచినపుడు సాంఘిక అనైతికతపట్ల విద్యాసాగర్ మనసులో ఓ సంఘర్షణ

అందర్నీ సొంతమనుషుల్లాగా చూసే అమాయకమయిన సంస్కారం వీళ్ళది. నాలుగు అక్షరాలు నేర్పి తమ పిల్లల్ని తీర్చిదిద్దటం కోసం వొచ్చిన మేష్టర్లపట్ల ఎంతో ఆదరాన్ని చూపిస్తారు. కాని, తమ స్వంతప్రయోజనాలకోసం, స్వార్థాలకోసం, తమ విలాసాలకీ, సౌకర్యాలకీ ఆటంకం కలుగుతుందన్న భయంతో యీ మారుమూల ఉండి పనిచెయ్యడానికి ఎవరూ అంగీకరించరు. అందుకోసం వాళ్ళొక అబద్ధపు ప్రపంచం సృష్టించేరు. ఒక అవినీతి వలయాన్ని ఏర్పరచుకున్నారు. తప్పించుకుందుకి కుటిలోపాయాల్ని కల్పించుకుంటున్నారు... ఒక్క రోజుకూడా ఇక్కడ బడి నడపనక్కరలేకుండానే తమ పబ్బం గడుపుకొస్తున్నారు. అదనపు ఆలవెన్సులతో జీతాలందుకుంటున్నారు. అవినీతిలో కూరుకుపోయిన అచ్యుతరావులాంటి అధికారులు ఈ విషపుగోడల్ని పూటుకర్రల్లా నిలబెడుతున్నారు.

ఈ కొండ ఊరి ప్రజలకు, తమ ఊళ్ళో బడి ఎప్పుడు తెరుస్తారో తెలీదు. ఎప్పుడూ ఎందుకు మూతబడి ఉంటుందో అసలే తెలీదు. ఆ విషయాల్ని పట్టించుకోగలిగే పరిజ్ఞానమూ వారికి లేదు. పట్టించుకున్నా ఆ విషయం ఎవరికి తెలియజెయ్యాలో తెలీదు. తెలిసినప్పటికీ ప్రెసిడెంటులాంటి కొద్దిపాటి చదువుకున్నవాళ్ళకి అక్కర్లేదు. అవసరమయితే వాళ్లని మంచిచేసుకునో,

మందుపోసో తమకి అనుకూలంగా తిప్పుకునే వాకచక్యం కూడా ఆ మేష్టర్లకీ అధికారులకీ వుంది. అందుచేత... యీ అవినీతి అవిచ్ఛిన్నంగా సాగిపోతూనే ఉంది... 51

విద్యారంగం భ్రష్టుపట్టిపోయిందని దులపరించుకునేవారికి ముందుగా కనిపించే ముద్దాయి ఉపాధ్యాయుడే! కాని... అది తప్పేమో... పాక్షిక సత్యమేమో... సాకల్యంగా ఆలోచిస్తే 'కర్తుతి దావుకి కారణాలారు' అన్నట్టు... దానికి జవాబుదారీ ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే కాదని అర్థమవుతుందేమో... 51

"అసలు నీకు తెలుసా! ఈ కొండజాతి ప్రజలు పశువుల పాలు పితకడానికి ఒప్పుకోరు... తల్లి పాలన్నీ దూడ తాగాల్సిందే... ఇప్పుడిప్పుడే మన టౌనువాళ్ళ వాసన వీళ్ళకి కొద్దిగా సోకుతోంది... గవర్నమెంటు గేదెలూ ఆవీ యివ్వి వీళ్ళలో ఆ దృక్పథం కాస్త వెనుకంజవేసేలా చేసింది... ఇప్పుడిప్పుడే పాలుపితకడం... పట్నంకెళ్ళి అమ్మడం చేస్తున్నారు" అని చెప్పేడు.51

అతను నవ్వేడు. నవ్వి, "అంతవేగరం బాగుచేయిస్తాననుకోను... ముందతనికి విశ్వాసం కుదరాలి... మువ్వు అందరి మేష్టర్లలాగా ఈ వాతావరణంలో యిమడలేక బెదిరి పారిపోవనీ... ఇక్కడే ఉండి పిల్లలకి పాఠాలు చెప్పుకుంటావని నీమీద నమ్మకం కుదరాలి" అన్నాడు. 52

తన ఆదర్శాలకు గొడ్డలిపెట్టులాగా, తను నమ్మిన విలువలకు తనే సమాధికట్టేదిగా (తను అనారోగ్యానికి గురికావటంతో) తను పరిస్థితులతో రాజీపడి, తననుతాను సమర్థించుకోచూడటం, తద్వారా మానసికఘర్షణకు గురికావటం

ఈ ఇరవైరోజులలోనే జానకేశ్వరరావు చాలా తతంగం జరిపించేడు. అతనూ, తంత్రీ బలవంతపెట్టడంతో తనూ కాదనలేకపోయేడు.

ఆ పనిచేస్తూ ఉంటే ఒక్కొక్క మెట్టూ దిగజారి అథఃపాతాళానికి కుంచించుకుపోతున్నట్టనిపించేది విద్యాసాగర్‌కి. ఆ పరిస్థితుల్లో అలా చెయ్యడం తప్ప మరో గత్యంతరం లేదని తనను తాను సమాధానపర్చుకోవాలని ప్రయత్నించేవాడు. మనసు ఎదురు తిరిగేది.

తను... తను కూడా అందరిలాగే అడ్డదారిలో ప్రయాణానికి సిద్ధమవుతున్నాడా! తను చేసిందానికి ఏవో సంజాయిషీలూ, సమాధానాలకోసం వెతుక్కుంటున్నాడా!

తన ఆదర్శం అబద్ధమేమో! తన నిజాయితీ గడ్డిపరక విలువ చెయ్యనిదేమో...

తన అంతరంగంలో ఎక్కడో ఒక వెసులుబాటు వుంది. ఎక్కడో ఒక అపనమ్మకం వుంది... జానకేశ్వరరావులాగే తన వ్యక్తిత్వంలో కూడా ఏదో తెలీని 'మైలీ' వుంది...

ఆ ఆలోచన రాగానే దుఃఖం ముంచుకొచ్చేది విద్యాసాగర్‌కి. ఆకులా వణికిపోయేవాడు... 66

వెళ్ళిపోయేముందు చింతలగూడెం మేష్టారు సత్యం... గుమ్మం వరకూ వెళ్ళిన వాడల్లా తిరిగి తన దగ్గరికి వచ్చి నెమ్మదిగా అయినా స్పష్టంగానే అన్న మాటలు అతని చెవుల్లో గింగుర్లు తిరుగుతున్నాయి...

"విద్యా! మీరున్న ప్రస్తుత పరిస్థితిని నేను అర్థంచేసుకోగలను... మీ మనసులో తుఫాన్ బీభత్సం మీ కళ్ళలో చూసి నేను పోల్చుకోగలుగుతున్నాను... అధైర్యపడకండి... అపరాధభావన మనిషిని దహించివేస్తుంది. ఏవో కుంటిసాకులతో, సమర్థింపుల్తో ఆ భావనని తుడిచిపెట్టే ప్రయత్నంచేస్తే మనిషి యింకా యింకా పతనమైపోతాడు... నిజమయిన పశ్చాత్తాపంతో దహించబడినవాడే మనిషి మనిషిగా నిలదొక్కుకోగలుగుతాడు... అతని వ్యక్తిత్వం వికసించగలుగుతుంది... వైరుధ్యాలని అధిగమించగలగడంలోనే వ్యక్తి వికాసం జరుగుతుంది... మరోసారి తీరిగ్గా మిమ్మల్ని కలుస్తాను సెలవ్" అని వెళ్ళిపోయేడతను. 67

విద్యారంగంలోని అవినీతికి బాధ్యత ఎవరిదన్న ఆలోచనలతో నిరంతరం ఘర్షణ. జానకేశ్వరరావు జీవితంలో చోటుచేసుకున్న మార్పుతో మానసికంగా పరిణతికోసం ప్రయత్నం.

"అవును... అమ్మ వెళ్ళిపోయింది. నేనింక ఎవరికోసం కనిపెట్టుకుని ఇక్కడ ఉండాలి చెప్పు? ఎప్పటికీ స్కూలుకెళ్ళడం మానేసి ఇక్కడే గడిపేస్తూ నెలనెలా జీతం అందుకుంటూ నన్ను నేనింక వంచించుకోలేను. మనస్సులో ఇంక ఈ సంఘర్షణని నేను తట్టుకోలేను. అమ్మ మరణంతో నా ఇన్నాళ్ళ దొంగబతుక్కి ఆ అవసరం తీరిపోయింది. కొండంగి వెళ్ళిపోదామనుకుంటున్నాను" అన్నాడు.

అతని గొంతులో అపరాధభావన తొణికిసలాడుతోంది.

విద్యాసాగర్ కంటికి గంగాజలంతో శుద్ధిచేసుకున్న మనిషిలా కనిపిస్తున్నాడు జానకేశ్వరరావు.

వైయక్తిక కష్టనష్టాలనుకూడా పరిగణించకుండా తమ వృత్తిధర్మాన్ని నెరవేర్చాలిగే మనోనిబ్బరం ఏ కొద్దిమంది మనీషులకో కాని సాధ్యపడదు. జానకేశ్వరరావు మనీషికాడు... మనిషి. మామూలు మనిషి. గత్యంతరంలేని స్థితిలోకూడా అవకాశాలు వినియోగించుకోకుండా ఉండగలిగేటంత మహోన్నతుడేమీ కాకపోవచ్చు. రాగవిరాగాలూ, స్వార్థచింతనలూ, అమరికలూ, అంగుకంపనలూ... అన్నీవున్న మామూలు మనిషి. కానీ, పశ్చాత్తాపాగ్నిలో తన పాపచింతనని దహించ చేసుకోవాలని తపన పడే మనిషి అతను. అతనిప్పుడు పులుకడిగిన ముత్యంలా వున్నాడు.

"అంటే... అంటే ఏం చెయ్యదలుచుకున్నావు?" అనడిగాడు. కాస్సేపటికి గొంతు పెగుల్చుకుని.

"నేను పనిచేసే స్కూలు అభివృద్ధికే ఖర్చుచెయ్యాలని అనుకుంటున్నాను. పిల్లలకు కావాల్సినవీ, ప్రభుత్వం ఇవ్వనివీ అనేకం ఉంటాయి."

విభ్రమంగా అతనివేపు చూస్తూ, ఆనందాతిరేకంతో అతని చెయ్యి పట్టుకుని బలంగా వూపేశాడు విద్యాసాగర్.

"నీ అంత ఉన్నతంగా ఎందరుండగలరయ్యా!"

జానకేశ్వరరావు మనోహరంగా నవ్వేడు. మళ్ళీ అదే నవ్వు! లోతు తెలియని నవ్వు.

"ఇలాగే చెయ్యమనీ, చెయ్యాలనీ అందరికీ నేను సూచించడంలేదు. కానీ జీవితం ఏదో ఒక దశలోనయినా ఒక్కసారి వెనక్కి తిరిగిచూడాలనీ, వృత్తికి న్యాయంచేయాలనీ కోరుకుంటున్నాను" అన్నాడు జానకేశ్వరరావు.

కొన్నిరోజులుగా గుండెపొరల్లో నిండిపోయిన వ్యాకులత అంతా ఎలాంటి బాధా తెలియనివ్వకుండా చేత్తో తీసేసినట్లయింది. మనసు తేలికపడింది విద్యాసాగర్‌కి. 75

మళ్ళీ వ్యక్తిగత ప్రయోజనాలకోసం వెంపర్లాట, ప్రమోషన్‌తో ఉన్నతపాఠశాల ప్రవేశం. అక్కడా నిరంతరఘర్షణ, విద్యారంగంలోని ప్రతిసమస్యకు వ్యక్తులమధ్య, ఆలోచనలమధ్య నిరంతర ఘర్షణలు. ఈ సంఘర్షణలనడుమ తనపాత్రను నిర్వహించుకోలేని వ్యక్తిగా విద్యాసాగర్ పాత్రనిలుస్తుంది. అయితే ఇందులో రూపకల్పనచేసిన సంఘర్షణలు విద్యాసాగర్ పట్ల ఏస్థాయిలోనూ పాఠకునిలో సానుభూతే తప్ప, ద్వేషాన్ని నిర్మాణంచేయకపోవటం రచయిత సంఘర్షణాశిల్ప నైపుణ్యానికి నిదర్శనం.

ఆకలికారణంగా మాష్టారిడబ్బును దొంగిలించిన విద్యార్థి పడిన సంఘర్షణకు అక్షరరూపం 'ఆకలి! డబ్బుకావాలి!'

నిరంతరం అంతఃసంఘర్షణకు లోనైన పాత్రగా 'విద్యాధనం'లో రాంబాబు పాత్ర నిలుస్తుంది. తన సామర్థ్యానికి మించిన తెలివితేటలను ప్రదర్శించటంకాని, తన సామర్థ్యానికి మించి అధ్యయనంచేయటం కాని రాంబాబుకి వీలుపడలేదు. తన సామర్థ్యానికి, తల్లిదండ్రుల ఆకాంక్షలకి మధ్యనున్న అగాధం కారణంగా రాంబాబులో అంతఃసంఘర్షణ మొదలై అది చివరకు అతడిని శారీరకంగా మానసికంగా ఆందోళనకు గురిచేసేదిగా రూపొందింది. ఈ క్రమంలో రాంబాబులో చోటుచేసుకున్న సంఘర్షణల చిత్రణే ఇందులోని 'సంఘర్షణాత్మక కథనా'న్ని సూచిస్తాయి.

స్కూలుకు వెళ్ళాలంటే భయం. ఇంటికి వెళ్ళాలంటే భయం. వాడికి ఏడుపొచ్చింది. ఏడుస్తూనే హోంవర్కు చెయ్యడానికి పుస్తకాలు తీశాడు.

THE PLANETS REVOLVE AROUND THE SUN .... THE EARTH SPINS ON ITS OWN AXIS... ఏక్సిస్ అంటే?

సైన్సు పుస్తకాలు అవతల పడేసి మేథ్స్ తీశాడు వాడు.

'THE SIDE OF A SQUARE IS TWICE AS LONG AS THE SIDE OF ANOTHER SQUARE. HOW MANY TIMES IS THE PERIMETER OF THE FIRST SQUARE THAN THE PERIMETER OF THE SECOND SQUARE!'

The side of a square ... perimeter of the second square.... ఈ చదువు నేను చదువలేను. నాకేమీ అర్థం కాదు. స్కూల్లో టీచరు కొడుతుంది. ఇంట్లో నాన్న తిడతాడు. ఈసారి నాన్న తిడితే... పారిపోను.... చచ్చిపోతాను.... నాకు చచ్చిపోవాలనుంది......

'I WANT TO DIE' హోంవర్కు చెయ్యడానికి తీసిన నోటు బుక్కుమీద పరధ్యానంగా తన మనసులో అనుకున్నది రాశాడు.ఏడుస్తూనే.

సాయంత్రం వేళల్లో పిల్లలందరూ వీధుల్లో గోలచేస్తూ, గాలిపటాలెగరేస్తూ, బంతాట, క్రికెట్టూ ఆడుతుంటే నాకూ వాళ్ళలో కలిసిపోయి పిచ్చిగా ఆడుకోవాలనిపిస్తుంది. కాని, ఇంట్లో ఒంటరిగా గంటలతరబడి హోంవర్కు చేస్తూ కూర్చోవాలనిపించదు. చదువుకుని అన్నీ తెలుసుకోవాలన్న ఆసక్తి ఉందికానీ, నేను పాఠాలు అప్పచెప్పే టేపురికార్డరుగా, ప్రశ్నలకు సరైన సమాధానాలు అచ్చుగు పేపరులోదించే ఫొటోకాపీయర్లా ఉండలేను. చదువు పేరుతో నాచిన్నచిన్న కోరికలూ, ఆనందాలూ అన్నింటినీ నలిపేసి, నా పసితనం నాకు దూరంచేసి సవ్నేక మార్కులు స్కోరుచేసే కంప్యూటరుగా మార్చెయ్యకండి. - అని తన మనసులో తనకే అర్థం కాకుండా గందరగోళంగా మెదులుతున్న భావాలకు ఓ రూపం కలిపించి తల్లికి చెప్పడానికి వాడికి వయసూలేదు; భాషారాదు. పెదవి విప్పితే వచ్చేది ఏడుపే! (తోలేటి జగన్మోహనరావు, విద్యాధనం, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 31-10-90,పే26-29) [1]

## సన్నివేశం

రచనలో పాత్రలచుట్టూ ఉన్న స్థానిక పరిసరాలు, స్థలకాలాలు, వాతావరణం వంటి విభిన్నాంశాల సమూహాన్ని సన్నివేశం (Setting)గా పేర్కొంటారు. అయితే ఒక సన్నివేశంలో ఈ అంశాలన్నీ తప్పనిసరిగా ఉండాల్సిన అవసరంలేదు. వీటిలో కథాగమనానికి అనుగుణమైన ఏ కొన్ని అంశాలతోనైనా సన్నివేశానికి రూపకల్పనచేయవచ్చు. అయితే సన్నివేశం రచనలో ప్రదేశాన్ని, కాలాన్ని, కథను పాత్రలతో సమన్వయం చేయగలదిగా ఉండాలి.

ద్వారకా 'పల్లెపిలిచింది'లో సన్నివేశ చిత్రణ ఎంత గాఢంగా హృదయాలను హత్తుకునేదిగా ఉందో తెలుసుకునేందుకు ఈ సన్నివేశాన్ని ఉదాహరణగా తీసుకోవచ్చు. పాఠశాల అభివృద్ధికోసం గ్రామంలో చందాలు వసూలు చేస్తున్న ఉపాధ్యాయునికి ఎదురైన అనుభవ సన్నివేశం. అనుభవంలోని ఆర్ద్రతకు వాతావరణ కల్పన ఎంతగా దోహదపడ్తుందో ఈ సన్నివేశం మనముందుంచుతుంది.

...... ఆ ముసలాయన నాముందుకొచ్చి నుంచున్నాడు. బొడ్లో దోపుకుని వున్న అర్ధరూపాయి బిళ్ల బయటికితీసి... "నేను శానా బీదవాడివి. స్కూలుకోసం మీరు డబ్బు ఇంటింటికిపోయి వసూలు చేస్తున్నారని తెలిసింది. మీ పట్టుదలకు సంతోషిస్తున్నాను. ఎక్కువఇవ్వలేను. ఈ అర్ధరూపాయి తీసుకోండి. కాదనవద్దు. నాశక్తికొద్దీ ఇవ్వాలనినాకూ అనిపించింది." అంటూ నా చేతిలో పెట్టాడు.

...... అప్రతిభుడినయ్యాన్నేను. సహాయం అడుగుతామనుకున్న మనిషి సహాయం అందిస్తున్నాడు స్వచ్ఛందంగా!

...... "యాయవారం ఎత్తుకొని ఊరివాళ్ళమీద ఆధారుడి బ్రతుకుతున్నాను. నావాళ్ళంటూ ఎవరూ లేరు. ఒంటరివాణ్ణి" అన్నాడాయన. ఆయన కళ్ళలో మెరుపు. "వద్దనకుండా తీసుకోండి. అది నాకోరిక"

అతనిచ్చిన అర్ధరూపాయి తీసుకుని జేబులో వేసుకున్నాను. ఆయన పాదాలకు నమస్కారం చెయ్యబోయాను. "వద్దు వద్దు. మీరు పెద్దవాళ్ళు. పెద్దచదువులు చదువుకున్నవాళ్ళు" అంటూ వారించాడు.

ఆయన పెద్దతనంముందు నేనెంత! నాచదువెంత!

సెక్స్ఎడ్యుకేషన్ పాఠశాలల్లో బోధించటం ప్రధాన కథాంశంగా వచ్చినరచన 'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్‌స్టార్'. ఇందులో లైంగికవిజ్ఞానం పట్ల పిల్లలకేర్పడే కుతూహలాన్ని, వారికేర్పడే అనుమానాలను ఆరోగ్యకరమైన పద్ధతిలో తీర్చేందుకు ప్రయత్నించకపోవటంద్వారా కలిగే అనర్థాలను వివిధ సన్నివేశాల ఆధారంగా చిత్రీకరించటం చూస్తాం. అలాంటి వాటిలో ఒకటి

ఆడవాళ్ళ మాటలవల్ల ఆపిల్ల పెద్దమనిషయినట్టు ఆ సాయంత్రానికి స్వప్నికకు తెలిసింది. అల్లా తెలియటంయితే తెలిసిందిగానీ ఆ మాటకర్థం మాత్రం ఆ పిల్లకు తెలీలేదు.....

"చెప్పండి డాడీ! పెద్దమనిషవ్వటమంటే ఏంటి?" రెట్టిస్తూ అడిగింది స్వప్నిక. ............

"ఏంటీ? 'పెద్దమనిషవ్వటమా? ఛీ బుద్ధిలేదూ? ఏంటా పిచ్చకాలం బుద్ధులు? ఏంటా పాడుమాటలు? అసలివన్నీ నీకెందుకు? పోయి... పోయి మీ నాన్ననే అడుగుతున్నావ్. అవ్వ... అవ్వ మాకాలంలో అయితే పాతంలో ఏవన్నా అర్థం కాకపోతేనే తండ్రినడగాలంటే చచ్చేంత భయపడేవాళ్ళం. అమ్మో ఇప్పుడు! ఛీ సిగ్గులేదూ! అదేమన్నా మామూలు ప్రశ్న అనుకుంటున్నావా? భారతదేశానికి రాజధానేంటి అని అడిగినంత తేలిగ్గా అడిగేశావ్! అయినా ఎక్కడికిపోతాయా తల్లిబుద్ధులు? అదికూడా ఓ పెద్ద నెరజాణ అంటకదూ!" గట్టిగా అరవసాగింది వర్ష.

"మమ్మీ! ఇంకా గట్టిగా అరిచింది స్వప్నిక.

"చూడు! ఇంకెప్పుడూ మా అమ్మ నేం అనకు"....... (23-5-96 పే:33)

ఇక్కడి సన్నివేశం తల్లిదండ్రులమధ్య, ఇంట్లో సంభాషణాయుక్తమైనది. శారీరక పరిజ్ఞానం పట్ల అవగాహన అవసరమన్న అంశాన్ని, దానిపట్ల పిల్లలకు ఏర్పడే కుతూహలాన్ని సాంప్రదాయిక నిషేధాలపేరుతో అణచివేయటాన్ని, దాని పరిణామాలను తెలియచెప్పటం ఈ సన్నివేశ ప్రధాన ఉద్దేశం. రచయిత ఉద్దేశాన్నిబట్టి, సన్నివేశకల్పనలోని గాఢతను బట్టి పాఠకునిలో స్పందన కలుగుతుంది. పై సన్నివేశం అలాంటి స్పందనకు వీలుకల్పిస్తుంది.

కథా ప్రారంభంలోను, ముగింపులోను ఒకే సన్నివేశాన్ని చిత్రించటంద్వారా కథనంలో వైవిధ్యాన్ని చూపించేప్రయత్నం 'బడిసాల'లో కనిపిస్తుంది. ఈ రెండు సన్నివేశాలమధ్య ఈ వైరుధ్యానికి వెనుక పాఠశాల నిర్మాణం కోసం ఉపాధ్యాయుని తపన, గ్రామస్థుల కృషి దాగిఉంది. అయితే రెండు ఒకే రకమైన సన్నివేశాలను ఆది, అంతాలలో వేసిన చిత్రణ కథనానికి మరింత ఆకర్షణగా నిలిచింది.

టప్...

అక్షరాలు దిద్దుకుంటున్న ఒక పిల్లాడి పలకమీద చినుకుపడి రూపాయి బిళ్ళంతమేర చెదిరి అక్షరం చెరిగిపోయింది.

"ఒరే సినుకులొత్తన్నాయిరా..." అన్నాడా పిల్లడు పక్క పిల్లాడితో ఆకాశంవైపు చూస్తూ.

"ఔన్రా".... అంటూ పలక సంచిలో పెట్టేసేడా పిల్లడు.

టప్.... టప్.... టప్....

"ఒరే సినుకులు పడుతున్నాయిరా..." పలక సంచిలో పెట్టబోతూ పక్కవాడివేపు చూశాడో పిల్లాడు

"చినుకులు పడితే అప్పుడులాగ తలవిప్పరు. అక్షరాలు దిద్దు"

పైమాదిరిగానే రెండు ఒకేవిధమైన సన్నివేశాల నడుమ ఒక జీవిత వైవిధ్యాన్ని చూపిన రచన 'మేధావులారా ఆలోచించండి' ఈ రెండు సన్నివేశాల నడుమ ఒక జీవనపోరాటం కనిపిస్తుంది. బీదతండ్రి, నిరుపేద విద్యార్థి పక్ష అనంతమైన 'సంఘర్షణ దాగివుంది. ఎం.ఎ.లో బంగారుపతకాన్ని సాధించిన కృష్ణ జీవితంలో ఓటమి చవిచూడటానికి వెనుకనగల సామాజిక పరిస్థితులను ఈ రచన సమగ్రంగా చర్చించింది. ఒకే విధమైన ఈ రెండు సన్నివేశాలను చిత్రించటం ద్వారా కథనంలో అనుభూతిగాఢతను పెంచి కథలోని విషాదాన్ని లోతుగా అందించటం వీలుపడింది.

స్ప్రింగ్ డోర్స్...

స్ప్రింగ్ డోర్స్ వెనుక ఖరీదైన ఆఫీసరుగారి ఖరీదైన గది.

స్ప్రింగ్ డోర్స్ ముందు సాదా సీదా స్టూలు. స్టూలుమీద కాకీ యూనిఫారంలో బంట్రోతు సుబ్బయ్య శాస్త్రిగారు.

మరో ఆఫీసు.

స్ప్రింగ్ డోర్స్.

స్ప్రింగ్‌డోర్స్ ముందు కాకీ యూనిఫారంలో స్టూలుమీద కృష్ణ. -----

ఆరోజు సుబ్బయ్యశాస్త్రిగారు అక్షింతలకు అనుకోకుండా గురయ్యారో, కొడుకు 'జీవనభృతి' కోసం గురయ్యారో ఒక్కరికే తెలుసు. కానీ ఆ ఒక్కరూ ఇప్పుడులేరు.

## ముగింపు

కథనంలో చివరిదే ఈ ముగింపు. ఇక్కడితో కథ పూర్తవుతుంది. ఈ ముగింపులో ఉపయోగించే పద్ధతులను రెండు రకాలుగా పేర్కొనవచ్చు. అత్యంత నైపుణ్యవంతమైన ముగింపుపద్ధతి ఒకటి. ఈ పద్ధతిలో ముగింపు అంతవరకూ జరిగిన కథాంశానికి భిన్నంగా ఒక మౌలికమైన అంశాన్ని వెలుగులోకి తెచ్చి కథలో ఊహించని మలుపుకు కారణమౌతుంది. అయితే ఈ రకమైన ముగింపు సహజంగా రూపొందిద్దుకొనాలంటే రచయిత మంచి నైపుణ్యం కలవాడై ఉండాలి. రచయిత సమర్థత ఇందులో వ్యక్తమైతుంది. అలా కానిపక్షంలో రచన కృతకంగా తయారౌతుంది. ఇక్కడ రచయిత తను పాఠకులకు · అందించదల్చుకున్న అంశాన్ని చివరివరకు చెప్పకుండాఉండటంద్వారా పాఠకునిలో రచనపట్ల ఉత్సుకత కలుగజేస్తున్నాడు. ఈ రకమైన

కథనశిల్పాన్ని కొసమెరుపు ద్వారా కథకులు సాధిస్తారు. రెండవపద్ధతిలో కొసమెరుపుతో కాకుండా క్రమానుగతంగా సాధారణంగా ఉంటుంది. ఈ ముగింపు సాధారణంగా పాఠకులు ఊహించిందే అయి ఉంటుంది. అయితే ఈ ముగింపు మైదానిమాదిరిగా ఉత్సుకతను కలిగించకపోయినా పాఠకుని తృప్తిపరిచేదిగా ఉంటుంది. అంటే ముగింపులో మొదటిపద్ధతి పాఠకుని ఆశ్చర్యపరిస్తే, రెండవపద్ధతి పాఠకుని తృప్తిపరుస్తుంది.

ఇలా ముగింపులో కొసమెరుపుతో వచ్చిన రచనలు విద్యావిధానం కథాంశంగా వచ్చిన రచనల్లో అనేకం.

జీవితాలను వంటలకూ, గాడిపొయ్యికీ అంకితం చేసిన చరిత్రనుకలిగిన కుటుంబంలో పుట్టిన శాస్త్రికి చివరకు వంటలకు అవకాశందొరక్క ఉపాధికోసం వెతుక్కోవాల్సి రావటం జీవితంలోని ఒక విషాదమైతే, ఉపాధికోసం వెళ్ళినప్పుడు నైపుణ్యాన్ని సర్టిఫికెట్లతో లెక్కవేసే ప్రస్తుత సంస్కృతిలో నిజమైన నైపుణ్యం అవాక్కయ్యే పరిస్థితి దాపురించటం మరో విషాదం.

ఆకలిపోరాటం అది! ఆ పోరాటంలోనే అఖరికి తది, మది విడిపిపెట్టి----

నగరంలో ఉన్న అధునాతన ఉడిపి బ్రాహ్మణ హోటల్లో పనిచేసేందుకు వెళ్ళాడు. అక్కడి సూపర్‌వైజర్‌కి పొట్టను రెండుచేతుల్తోనూ చూపించి. చేతులెత్తి నమస్కరించాడు.

"ఏం చేస్తావు"

"వంటలు"

"డిప్లొమా ఉందా"

ఆమాట అర్థం కాలేదు పంతులికి. అదేమయినా అటువంటిది ఏదీ అతని దగ్గర లేదని చెప్పాడు.

"అయితే పనికిరావు" అన్నాడు.

'అమానుషం' కళాశాలలోని అరాచకవిద్యార్థుల ప్రవర్తనను సమయస్ఫూర్తితో ఎదుర్కొన్న అధ్యాపకురాలు జయంతి వ్యక్తిత్వమే ప్రధాన కథాంశం. ప్రవర్తనను సరిదిద్దేందుకు మందలించిన తనను అందరిముందు అవమానపర్చేందుకు విద్యార్థిచేసిన ప్రయత్నానికి జయంతి స్పందనే కథలో కొసమెరుపు.

'ఈ సృష్టిలో ఏ తల్లీ 'సుఖం'కోసం కొడుకును కోరదు. అదే జరిగితే ఆ కొడుక్కి అంతకుమించిన అవమానంఇంకోటి ఉండదు. అలాంటి దౌర్భాగ్యమైన దుస్థితే నీ కెదురైతే-- అవమానంతో చావకు అంబరీష్!

కుమిలిపోతున్న నిన్ను గుండెల్లో దాచుకుని ఓదార్చేందుకు ఈ తల్లి వుందన్న సంగతి మర్చిపోకు. తల్లిలా అందుకే నీకీ ముద్దు---"

అంతే--- అంబరీష్ తలవాల్చేశాడు భూమిలోకి. కుంగిపోవాలనుందతనికి.

ప్రభుత్వవిధానాల్లో మార్పులు ప్రజల ఆలోచనల్లో మార్పులకు ఏవిధంగా కారణమౌతాయో పాఠశాలల మధ్యాహ్న భోజనపథకం ప్రధాన కథాంశంగా చేసుకుని వచ్చిన రచన 'అమ్మా... నే బళ్ళోకెల్తానే!' ఈ కథనంలో ప్రత్యేకత ప్రారంభం ముగింపు రెండూ అమ్మా నే బళ్ళోకెల్తానే! అనే సంఘటనే ప్రధానంగా సాగటం. అయితే వెంట తను బళ్ళోకెల్తాననటానికి వెనుక చదువుకోటం అనే ఆలోచన ప్రధానమైన ప్రేరణకాగా చిన్నిగాడి ఆలోచనమాత్రం దేశ పేదరికానికి ఒక సవాలుగా నిలిచేది కావటం విషాదం.

"అదికాదే. మా కైరేలు ఎప్పుడొత్తారమె?"

"ఎందుకురా, చిన్నిగా?"

"నాను బళ్ళోకెల్తానే!"

"ఓరి నీ తెలివి దొంగల్తోలా! నీకూ సదూలు కావలసొచ్చాయేట్రా?" అంటూ నవ్వింది.

"సదూలు కాదే!"

"మరేటి?"

"బళ్ళోకెల్తే బువ్వెడతారే!" చిన్నిగాడు ఉత్సాహంగా చెప్పాడు.

యాదమ్మ కన్నులనుండి వెచ్చటి నీటిబిందువులు జారి పిల్లలిద్దరిమీద పడ్డాయి.

కథనాన్ని మొత్తాన్ని పాఠకులు ఊహించనివిధంగా మలుపుతిప్పగల సామర్థ్యం ముగింపుకుంటుంది.

తన పెంపకంలో తనపిల్లలు సమాజంలోని చెడును వేలెత్తిచూపే ధైర్యంగల పౌరులుగా రూపొందటాన్ని తనదైన రీతిలో అర్థంచేసుకున్న సాధారణ మధ్యతరగతి మనస్తత్వానికి ప్రతినిధిగా శివరామారావు 'ఈఇఉఊ'లో నిలుస్తారు. తమ చర్యలన్నీ సరైనవైనప్పుడు మరి వాటిని ఎందుకు వ్యతిరేకిస్తున్నారంటూ పిల్లలు ప్రశ్నించినపుడు అతనిచ్చిన సమాధానం ఊహాతీతమైందిగా కథనాన్ని అనుకోని మలుపుతిప్పుతుంది. కొసమెరుపుకు ఇది ఒక మంచి ఉదాహరణ.

"మీరు పక్కింట్లోనో, ఎదురింట్లోనో పుట్టి ఇలా హేతుదృష్టితో తల్లిదండ్రుల్ని ప్రశ్నిస్తూ, అన్యాయాల్ని ఎదిరిస్తూ సమాజానికి సేవచేస్తుంటే నేనూ చాలా ఆనందించేవాణ్ణి. కాని మీరు నాయింట్లో పుట్టారు. ఇదే నాకు చాలా ఇబ్బందిగా వుంది. మిమ్మల్ని సమర్థించడం కష్టంగా వుంది" అన్నారు శివరామారావు. ఆయన కళ్ళల్లో నీళ్ళున్నాయి.

ఆజాద్‌కీ, ఝాన్సీకి, సరోజినికి, సుభాష్ భగత్‌కి ఆ మాటలతో మధ్యతరగతి విప్లవ వేదాంతం అర్థమైపోయింది.

డాక్టరేట్‌కోసం తన అందచందాలను ఎరగా వేసేందుకు వెనుకాడని అనైతిక వర్తని సింధుజ. ఆమె వలలో చిక్కుకున్న శలభం ప్రొఫెసర్ వర్మ. వీరినడుమన బలైన సమిధ వెంకట్రావు. ఫలితంగా వెంకట్రావు థీసిస్ సింధుజ పేరుతో అనుమతి పొందింది. ఇంతవరకు కథనంలో కొత్తదనంలేదు. పెళ్ళిపేరుతో తనను వంచించిన సింధుజ అసలు స్వరూపం తెలియటమే కథనంలో ముగింపు తెచ్చిన కొసమెరుపు.

సింధుజ ఛాన్సిలర్‌నుండి పట్టా తీసుకుంది. మైకుముందుకొచ్చింది. "సభకు నమస్కారం. నేను ఈ డాక్టరేట్ తీసుకోవడానికి ముఖ్య కారకులు ప్రొఫెసర్ వర్మగారు" అన్నది.

ఉప్పొంగిపోయాడు వర్మ!

"తండ్రిలాంటి ఆయన ఆశీర్వచనాలతోనే నేనింత తొందరగా నా థీసిస్ సబ్మిట్ చేయగలిగాను. అందుకే ఈ డిగ్రీని ఆయన పాదాలవద్ద వుంచి నమస్కరిస్తాను" నవ్వుకుంటూ వెళ్ళి ఆయన పాదాలదగ్గరపెట్టి "నన్ను ఆశీర్వదించండి సర్" అంది.

మాటరానివాడిలా ప్రూనప్రుడిపోయాడు వర్మ.

మర్నాడు దినపత్రిక చదివినవారికి ఒక మూల చిన్నగా కొన్ని అక్షరాలు కన్పించాయి. ప్రొఫెసర్ వర్మ రాజీనామా!

తనకు శిక్షణనివ్వకపోయినా తనుగురువుగా భావించే గురువుకోసం గురుదక్షిణగా ఆటలో తనపటిమని, ఇంకా తన కాలును పోగొట్టుకున్న ఏకలవ్యశిష్యునిగా శిబో, చివరకు కోచ్ అవతారమెత్తాల్సి వచ్చింది. అంతవరకు సాధారణకథనంతో సాగిన రచన శిబో తన గురుత్వాన్ని ద్రోణాచార్యునితో పోల్చిన శిష్యులను వారించటం ముగింపులోని వైవిధ్యం.

శిబో చాలా సీరియస్‌గా అన్నారు: "మీరు ఏకలవ్యులు కావచ్చు! కాని నేను ద్రోణాచార్యుడిని కాను. నా శిష్యులు నన్ను మించాలని కోరుకుంటాను. వారిని కోరి నాశనం చేయడం నాధ్యేయం కాదు."

అయితే పై కథనానికి పూర్తి భిన్నమైన ముగింపునిచ్చిన రచన మరోటి. ఏకలవ్యుడు ద్రోణునికి గురుదక్షిణగా తన వేలు కోసివ్వటం పౌరాణిక కథనం. కొల్లి సత్యనారాయణగారి 'గురుదక్షిణ' కూడా సరిగ్గా అలాంటి రచనే. కానీ సంగీతాన్ని వీధిపాలు చేయకూడదన్న వాగ్దానాన్ని కోరిన అభినవద్రోణునికి శిష్యుడిచ్చిన సమాధానం కథలో కొసమెరుపు.

"మన్నించండి శాస్త్రిగారు! సంగీతం నేర్చుకోటానికి పంచముడు పనికిరాడు. పంచముని గురుదక్షిణ కావాలి నేర్పకపోయినా. సంగీతానికి కులమతాలతో ప్రమేయమెందుకండి? ప్రజల్ని విజ్ఞానవంతుల్ని చేయటానికి సంగీతం ఒక సాధనం. అదొక కళ. ప్రజలకోసం పాడవద్దంటున్నారు. కళ ప్రజలకోసం గాని, పండితులకోసం కాదు. మానుకోమని కోరటం సరస్వతీదేవిని అవమానపరచటం. గురువు మెప్పుకోసం ప్రజల్ని వదిలిపెట్టను" అని సూర్యం నిబ్బరంగా చెప్పాడు. నమస్కారంచేసి వెళ్ళిపోయాడు.

పసివాడి చేతిలోని పలక-బలపం ఒకరాజకీయనాయకుని పాఠంచెప్పినవైనాన్ని

కరుణరసాత్మకంగా చిత్రించిన రచన 'కార్యార్థి'. రాజకీయ నాయకుని కళ్ళకి అందరు వ్యక్తులూ అవసరార్థుల్లా కనిపించి తన మిత్రుడినికూడా గౌరవించలేని సంస్కారాన్ని ధనరాజ్ కలిగివుండటం, కార్యార్థి కనుక అవేమీ పట్టించుకోకుండా వచ్చిన పనికోసం ఆకాశాన్ని తాకేంత ఎత్తు గోపురాన్ని కట్టిన కూలీవాడుకూడా దాన్ని క్రిందనుండి చూసి ఆనందించాలన్న ఉద్దేశంతో తనను తాను సమాధాన పర్చుకొని తన కోరికను వెలిబుచ్చిన శివం-- ఇవేవీ కథనానికి ప్రత్యేకతచేకూర్చవు. అయితే శివం కోరిన కోరికే కథనంలో అనూహ్యమైన మెరుపులాంటి ముగింపునిస్తుంది.

"అయ్యా! గౌరవనీయులైన ఎం.పీ.గారూ! నేనొక కార్యార్థిని. మీరు స్వయంగా విద్యావేత్తలు. మీ బిడ్డలు సైతం ఉన్నతవిద్యనభ్యసిస్తూ పరదేశపు కీర్తిబావుటాని ఎగురవేస్తున్నారు. ఇదిగోండి. వీడు నా మనుమడు. ఈ రోజు వీడికి అక్షరాభ్యాసం. ఉన్నత విద్యావంతులకు తండ్రి అయిన మీచేత మొదటిసారి వీడికి అ.ఆలు దిద్దిస్తే ఈ పసివాడి విద్యా భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్న ఆశతో మీ దగ్గరకు తీసుకొచ్చాను. దయ ఉంచండి." చివరిమాట పూర్తిచేశానేమో అనుకున్నాడు శివం. ఎందుకంటే అప్పటికే అతడి గొంతు పూడుకుపోయింది. దృశ్యం కనబడలేదు. అప్పటికే కళ్ళు రెండు మసకబారాయి.

ధనరాజ్ అప్పుడు గమనించాడు. ఆ పసివాడిచేతిలో పసుపుపూసిన క్రొత్త పలక, బలపం. ఊహించని ఈ పవిత్రమైన గౌరవానికి నిశ్చేష్టుడైనాడు ధనరాజ్. అతడి చుట్టూ ఉన్న ఆశ్రితులకు ఊపిరి అందని పరిస్థితిలో వున్నట్టనిపించింది. ధనరాజ్ తల సిగ్గుగా వాలిపోయింది.

ముగింపు అనూహ్యమైనదే అయినా విషాదకరమైనదైతే దాని ప్రభావం మరింత గాఢంగా ఉంటుంది. ఇందుకు 'గాలిలోదీపం' ఉదాహరణగానిలుస్తుంది. సరిగ్గా పాఠశాల మూసేరోజున, వేసవిసెలవుల ప్రారంభానికి ముందు తప్పిపోయిన కిట్టిగాడికోసం సీతమ్మపడ్డ ఆవేదన హృదయాలని కరిగించేదైతే అదే కిట్టిగాడు సెలవుల అనంతరం పాఠశాల ప్రారంభించిన మొదటిరోజు పాఠశాలలో అస్థిపంజరంగా కనిపించటం కథనానికి కొసమెరుపుగా చెప్పుకొన్నా సీతమ్మ ఆవేదనను అది పరాకాష్ఠకు చేర్చిన అంశంగా విషాదాన్ని మిగులుస్తుంది.

వేసవి సెలవులు ముగిసి పిల్లలంతా వచ్చారు. బడిముందు నిలబడ్డారు. అప్పుడే మేష్టారు వచ్చారు. తాళం తీసి, గొళ్ళెంతీసి, తలుపులు తోసి, పాముకాటు తిన్నవాడిలాగా మాష్టారు వణికిపోయారు.

వాకిట్లో, రెండు తలుపులకు మధ్య బోర్లాపడి, రెండున్నర మూడు అడుగుల పొడవున్న ఒక పసిప్రాణి అస్థిపంజరం.

ఇదే కథాంశంతో వచ్చిన రచన 'పులిచంపని లేడికూన'. అయితే ఇందులో పాఠశాల యంత్రాంగ వైఫల్యాన్ని ప్రశ్నించటంకూడా కనిపిస్తుంది. అయితే ఈ ముగింపులో వాక్యాల విరుపులద్వారా భావాలలో తీవ్రతను పెంచటంచూస్తాం.

గోపి కనిపించాడు-త్వరలోనే! శివయ్య సెలవుల అనంతరం బడితలుపులు తెరిచినప్పుడు--- రెండు బెంచీలమధ్య బోర్లాలాపడి. శవం రూపంలో... దుర్గంధాన్ని వెదజల్లుతూ

ఆదృశ్యాన్ని చూసిన శివయ్యగుండె ఛిన్నాభిన్నమయింది- నేలకేసి కొట్టిన అద్దంలా! పగిలిన అద్దంముక్కల్లో జరిగిన ల శకలాలు. బడి విడిచిపెట్టే సమయానికి నిద్రపోతున్న గోపిని 'పరవశం'లో వున్న దమయంతి పట్టించుకోలేదు. మందు అత్రుతతో వున్న శివయ్య చూడకుండా తలుపులు బిగించాడు. మెలకువవచ్చి, పిచ్చి మొత్తుకొని తలుపులురాని చీకటి కుటిలో -- అయిదేళ్ళగోపి అన్నపానాదులులేక...ఆకలితో...కేకలేసి...కేకలేసి... వినిపించుకొనే నాథుడులేక కృశించి... కృశించి..... శివయ్య మస్తిష్కంలో వెయ్యి తుపాకులమోత...!

తమ పిల్లల చదువుకోసం తాపత్రయపడటం తల్లిదండ్రుల సహజస్వభావం. అయితే కథనంలో ఎక్కడా ఊహించనివిధంగా రత్తిచదువు విషయంలో మంగమ్మ ఆలోచనను చివరలో బయటపెట్టటంద్వారా కథనంలో అనుకోని మలుపుతో కథలో కొసమెరుపు చోటుచేసుకుంది 'చదువు-పెళ్ళి'లో.

"నేను అనుకున్న కాంతమ్మా, రత్తి పాసవ్వాల్లనే అనుకున్న నేను. ఇప్పటికే రత్తి సదువు సూసి, సోకు సూసి సంబంధాలు వస్తలేవు. వచ్చినోల్లు కూడ ఈమె పదోతరగతి సదువుతోందని తెలియంగానే ఏదో వంకపెట్టిసి మర్లిపోతన్నరు. ఇగ వాల్లు సదువుకోలేదని ఈమె వంకపెడతది. నేనెట్ల సచ్చునమ్మ మర్లల్లో. అందుకే రత్తి పరీక్షరాసేటప్పుడు మొక్కుకున్న రత్తి తప్పాలని." అన్న మంగమ్మ మాటలు విన్న కాంతకు ఆశ్చర్యం, కోపం, బాధ అన్నీ ఒక్కసారిగా కలిగాయి. ఈ మనుషులు ఎప్పుడు మారతారో గదా అనుకుని నిట్టూర్చింది.

వ్యక్తిత్వాన్ని గణించేందుకు వ్యక్తి ప్రతిభనుమాత్రమే కొలబద్దగా భావించని సమాజానికి ఒక సమ్మెటపోటు 'ధ్వని'లోని ఈ ముగింపు. కొసమెరుపుకు చక్కని ఉదాహరణ ఇది.

అతన్ని చూస్తుంటే, వాళ్ళకు ముచ్చటేసింది ఇంత చిన్నవయస్సులో ఎంత ఏకాగ్రత, చిత్తశుద్ధి. అందుకే, తెలుసుకోవాలనుకున్నారు. అతని తల్లిదండ్రులు ఎంత నిష్ఠాగరిష్ఠులో అనుకుంటూ. తమకు తెలిసివుంది తమ ఊళ్ళో అటువంటి ఆచార్యుల కుటుంబం ఏదీ లేదే. అయినా అతన్నే అడుగుతే తెలుస్తుందని.

"మీ నాయనగారి పేరేమిటి", అడిగారు ఆచార్యులు.

"రాజయ్య" జవాబు చెప్పాడు. పూజారి, భక్తులు ఉలిక్కిపడ్డారు. "ఏ రాజయ్య" ఇద్దరు అడిగారు.

"మాదిగరాజయ్య పంతులు పాలేరు" స్పష్టంగా చెప్పి, గీత పఠనంలో మునిగిపోయాడు.

గుళ్ళో రంగనాథుడు నవ్వినట్లు అనిపించింది ఆచార్యులకు, పంతులుకు. (బి.దామోదరరావు, ధ్వని, ---, పే 48-51)

'దీపంపురుగులు' రాయలసీమ సమస్యలు ప్రధానాంశంగా వచ్చిన రచనే అయినా, జీవితంలోని సమస్యలకు చదువు పరిష్కారం చూపగలదన్న నమ్మకాన్ని వ్యక్తంచేయటం విశేషం. ఆ ఆలోచనే ఈ రచనలో ప్రతీకాత్మకమైన ముగింపుగా నిలిచింది.

దీపం పురుగులు దీపం దగ్గరకు చేరాయి. పాపం ఆ పిచ్చి తల్లులు ఆ చలికి వేడికావాలనో ఏమో జ్వాలలో పడి మాడి మసి అయిపోతున్నాయి. ఆ దీపం ముందు కూర్చుని వీరయ్య కొడుకు సూరిగాడు గట్టిగా స్కూలుపుస్తకం చదువుతున్నాడు. 'గాంధీ మహాత్ముడు పోర్‌బందర్‌లో అక్టోబర్2,1869లో జన్మించాడు. ఆయన మనదేశానికి స్వరాజ్యం సంపాదించిన మహానీయుడు'. ...................

కుమార్‌రెడ్డి వందరూపాయలనోట్ల కట్ట ఒకటి నాగన్నచేతిలో పెట్టి "వీరిగాడికిచ్చిన మాట ప్రకారం నేను వీరిగాడి కొడుక్కి ఓదారి చూపిస్తాను. నీ మనవణ్ని రేపట్నుంచి ఇంటికి పంపించు. పన్లో పెట్టుకుంటా. మీకు సాయంగుంటాడు." కుమార్‌రెడ్డి తన ఔదార్యం చాటుకున్నాడు.

ఆమాట వినగానే, తోకతొక్కిన నాగుపాము బుస్సున పడగెత్తినట్లు, దెబ్బతిన్న చిరుతపులి కోపంగ తలవిదిలించినట్లు సూరిగాడు చివ్వున తలపైకెత్తాడు. వాడి చూపులు త్రినేత్రుడి తెరిచిన మూడోకన్నులా తీక్షణంగా వున్నాయి. బాణం ఎక్కుపెట్టిన అర్జునుడి కళ్ళలాగా స్థిరంగా వున్నాయి. దూసుకుపోయే బ్రహ్మాస్త్రంలా వాడిగావున్నాయి.

"నేను నీకాడ ఎప్పటికీ పన్లోచేరను. బడికిపోయి చదువుకుంటా"

వాడి మాటల్లోని స్థిరత్వానికి, చూపుల్లోని తీవ్రతకు కుమార్‌రెడ్డి ఉలిక్కిపడ్డాడు. స్వప్నంలో సింహం కన్పించిన ఏనుగులాగా. ఓ పిల్ల దీపంపురుగు దీపం దగ్గరకువచ్చి, తన వాళ్ళందరూ జ్వాలలోపడి మసి అవుతున్న వైనం గమనించి వెనక్కు తిరిగింది. (జి.రవికృష్ణ, దీపంపురుగులు, కథలు: జి.రవికృష్ణ కథలు, పే 19-27)

పాఠ్యపుస్తకాల భారానికి ఒక పిల్లవాని స్పందనకు ఇచ్చిన అక్షరరూపమే 'నాన్నా నాకోబండి కొనవూ!'

కొందరు పిల్లలు తొక్కులు, పుల్లలు, కంపలు తట్టల కెత్తుకుని నడుస్తున్నారు. వాళ్ళమధ్య మూడు చక్రాల చిన్న కర్ర బండిలో ఎండిన తాటి బురికెలు, మట్టలు వేసుకుని దానికి తాడుకట్టి లాగుతూ సాగిపోతున్నాడు అసిరిగాడు. వాడికి అది గొప్పగా ఉంది.

అలాంటి బండి కావాలా? ఎందుకు? అన్నాడు సూర్యం ఆశ్చర్యంగా.

"దీన్ని ఆ బండిలో వేసి బడివరకు లాక్కుపోతాను!" అన్నాడు బుజ్జిగాడు భుజానికి బరువుగా వేలాడుతున్న పుస్తకాల సంచిని తీసి తండ్రికి చూపిస్తూ. అవాక్కయ్యాడు సూర్యం. ఇంత చిన్న వయస్సునించి బ్రతుకు బరువుని లాగుతున్న అసిరిగాడికీ, చదువుల కార్ఖానాలో పడి నలిగిపోతూ భవిష్యత్తు వైపు చూపులు సారిస్తున్న బుజ్జిగాడికీ ఏమీ తేడాలేదనిపించింది. (కె.తాయారమ్మ, నాన్నా నాకోబండికొనవూ!, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 5-10-88, పే 10)

యుద్ధనీతి జీవనవిధానంగా మారినప్పుడు అవతలివ్యక్తిని ఓడించేందుకు ప్రేమకూడా ఆయుధమేనన్న సూత్రాన్ని కథాంశంగా చేసుకుని వచ్చినరచన 'యుద్ధపర్వం'. ఇందులో ప్రేమ పేరుతో తనతెలివితేటలపై జరుగుతున్న పరోక్షదాడిని చివరికి గుర్తించగల్గటంద్వారా కథనం సుఖాంతమైంది. ఈ గుర్తింపే కథలో కొసమెరుపుగా భాసిస్తుంది.

"ఇది... యుద్ధనీతి. ప్రేమ అనే భావన ఉత్తరాలద్వారా నీ హృదయంలో చెలరేగటంవల్ల.... నీ ఏకాగ్రత నాశనమై... సైకలాజికల్‌గా నువ్ డిస్టర్బ్ అయి... చదువుపై నుండి నీ మనసు డైవర్టయి పోతుంది. అప్పుడు నువ్ పరీక్షల్ని బాగా రాయలేవు. గోల్డ్‌మెడల్ కోసం జరుగుతున్న పోరాటంలో నువ్ సులభంగా ఓడిపోతావు. యుద్ధభూమిలో నైతిక విలువలకి సంబంధించిన తర్కానికి తావు ఉండదు. సింధూ! ఇది జీవితసంగ్రామం. ఇక్కడ ప్రత్యర్థిని ఏదో విధంగా పడగొట్టటమే ముఖ్యం. ఇది నా

సిద్ధాంతం కాదు. ఇవాళ మానవజాతి పాటిస్తున్న యుద్ధనీతి ఇది. అవినీతి వల్ల సంక్రమించిన గెలుపు .... నిజాయితీ వల్ల సంక్రమించిన ఓటమికంటే గొప్పది కాకపోతే ..... నీప్రత్యర్థి మాళవిక ఇలా ఈ కుట్ర ఎందుకు పన్నినట్లు? దాని నోట్‌బుక్‌లో దొరికిన లెటరిదిగో" ఇచ్చింది భాగీరథి.

"డియర్ గోపీ! మనప్లాన్ గొప్పగా పారుతోంది. నేను చెప్పినట్లు నువ్ రాస్తున్న లెటర్స్ వల్ల... సైకలాజికల్‌గా డిస్టర్బయిపోయి చదవటం మానేసింది సింధు. కనుక గెలుపు నాదే. గోల్డ్‌మెడల్ నాకు రావటం గారంటీ..." మాళవిక రాసి గోపీకి పోస్ట్‌చెయ్యటం మరిచిన అతికించని ఆ లెటర్ని చదివి నేను కొయ్యబారి పోయాను. (వీరపల్లె వీణావాణి, యుద్ధపర్వం, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 6-6-'90, పే 47-51)

ఉపాధ్యాయుని ప్రవర్తన విద్యార్థిని బడికి దూరంచేసినవైనాన్ని చిత్రించిన రచన 'శిలువకు తొడిగిన మొగ్గ'. పుస్తకం కోసం ఉపాధ్యాయుడు చేసిన వత్తిడికారణంగా ఒక తెలివైన విద్యార్థి సూర్యం పాఠశాలకు దూరంకావటం ఈ కథనంలో ముగింపు.

తలదించుకున్నాడు సూర్యం. టీచర్ తనను అంతేసి మాటలన్నందుకు. తోటి విద్యార్థుల ముందు తన పరువు పోయినట్లు బాధపడ్డాడు సూర్యం.

"కూర్చో వెధవా! నీలాంటి వాళ్ళు వుండబట్టే దేశం ఇలా ఏడ్చింది. పుస్తకం తెచ్చుకోమంటే నా పెళ్ళికి అడుగుతున్నాననుకుంటున్నావ్. నా ఇంటికేమైనా వొస్తుందారా? పుస్తకం లేకుండా రేపు బడికిరాకు. అర్థమైందా? విన్నేరా? ఏమంటున్నా? వినిపించిందా?"

సూర్యం ఆ తర్వాత ఎవరితోనూ మాట్లాడలేదు. ఆ రోజు బడి ఎప్పుడైపోతుందా అని ఎదురు చూశాడు. బడి అయిపోగానే ఇంటికి వెళ్ళిపోయాడు.......

సూర్యం పాడిబర్రెల కట్లు విప్పుతున్నాడు. నీళ్ళ బిందె పట్టుకొని బయటకువచ్చిన రామవ్వ కొడుకునుచూసింది. ఆమె గుండెలో ఏ మూలనో తుమ్మముల్లు గుచ్చుకున్నట్లయింది. సూర్యం నిన్నమొన్నటి సూర్యంలా లేడు. ఎంతో ఎత్తుకు ఎదిగినవాడిలా ఉన్నాడు. బర్రెల కట్లు విప్పుతూ సూర్యం తల్లివైపు ఒకసారి చూశాడు. ఆమె బాధపడుతున్నట్లనిపించింది వాడికి. నిశ్శబ్దంగా నవ్వాడు. వాడి పెదవులు విరిసీ విరియని పూరేకుల్లా ఉన్నాయి. కాదనకుండా గాలివాటు బరువుని భుజాలకెత్తుకునే ఇప్పుడిప్పుడే పాలు పడుతున్న జొన్నకంకిలా వున్నాడు. రామవ్వ ఒక నిట్టూర్పు విడిచింది. భూమాత బరువుగా మూలిగింది. (కాసుల ప్రతాపరెడ్డి, శిలువకు తొడిగిన మొగ్గ, కాసులప్రతాపరెడ్డి కథలు, పే 13-22)

ఇలా వైవిధ్యవంతమైన ముగింపులు అనేకం సాహిత్యంలో కన్పిస్తాయి. ఈ ముగింపులన్నింటిలక్షణం పాఠకుని ఊహాలకతీతంగా కథనాన్ని ముగించి పాఠకుని స్పందనలోని గాఢతను రెట్టింపు చేయటం.

====

## భాష

రచనలో వైవిధ్యం ఒక్కొకసారి భాషద్వారా సాధ్యపడుతుంది. భాషకుచెందిన అనేక అంశాలను భూమికగా చేసుకొని ఈ వైవిధ్యాన్ని సాధించవచ్చు. గ్రామీణ, ప్రాంతీయ మాండలికాలు, హాస్యం, వ్యంగ్యం, వాక్యపరమైన వైచిత్రి, పదాల విరుపు, విరామచిహ్నాల వినియోగం, శీర్షిక వంటి అనేక అంశాలు భాషాపరంగా కథనంలో నైపుణ్యానికి దోహదపడతాయి.

మాండలికాన్ని ఉపయోగించటంద్వారా కథనంలో వాస్తవికతకు, ఆ జీవితాలను మరింత దగ్గరగా చిత్రించేందుకు వీలుకలుగుతుంది. హాస్యంద్వారాను, వ్యగ్యాత్మకమైన కథనంతోను రచన మూలభావాన్ని పాఠకునికి అందించటం భాషాపరమైన ప్రధాన నైపుణ్యం. ఈ పద్ధతుల్లో తీవ్రమైన సమస్యలనుకూడా ఆహ్లాదకరవాతావరణంలో పాఠకునికి చేర్చవచ్చు. అయితే పాఠకుని ఆహ్లాదపర్చటం వ్యంగ్యరచనల ప్రధానఉద్దేశం అనుకున్నా, అంతర్లీనంగా పాఠకుని సమస్యదిశగా ఆలోచింపజేసేదిగా ఉండటం అవసరం. ఇంకా వాక్యపరమైన వైచిత్రి భావాల్లో గాఢతకు తోడ్పడుతుంది. రచనలో భావవ్యక్తీకరణ మరింతబలంగా జరిగేందుకు ఒక్కోసారి సంభాషణలంకంటే విరామచిహ్నాలతో సూచించే మౌనమే ఎక్కువగా దోహదపడుతుంది. ఇక రచనలో శీర్షిక సింహాద్వారంలాంటిది. శీర్షికనివ్వటంలో రచయిత నైపుణ్యం పాఠకుని రచనవైపు ఆకర్షితుణ్ణి చేస్తుంది.

### మాండలికం

విద్య భూమికగా వెలువడిన సాహిత్యంలో మాండలికంద్వారా భావాలను బలంగా వ్యక్తీకరించిన రచనలు అనేకం వచ్చాయి. రాయలసీమ మాండలికంలో వచ్చిన రచన ఎండ్లూరి సుధాకర్ 'అచ్చిరాలే ఆయుదాలు' భాషను ఆయుధంగా చేసి భావాల్లో తీవ్రతను పలికించింది.

"అవునన్నా! మావోళ్లలో మా నాయినే రవ్వంత సదూకోని పంతులైనాడు. మా నాయిన టీచరైన రోజున మా జేజినాయిన సంబరంతో కండ్ల నీళ్లు బెట్టుకున్నడు.

"అబయ్యా! నిన్నిట్లా జూస్తా వుంటే బోయిదిగా వుందిరా నాకు. యింత గాలానికి మనగూడేల్లో వొక సదువు దీపం వెలిగింది గదరా! యింగ యీ దీపాన్ని యిట్లనే వెలిగిస్తా వుండాల. సదువుల్లేకనే గదంబయ్యా కుక్కిన మంచాల్లో బతి నల్లుల మాదిరి నలిగి జస్తా వుండాము. అయ్యా! నా మనవల్నిగూడా గొప్పగ సదివియ్యాల. అంటా మా జేజినాయిన గుంట్లోకి బొయ్యేదాకా బో గలవరించేవోడు.

అయితే సుదన్నా మనోళ్లు యెంత పంతులైనా మాల మాస్టార్లని, మాదిగ పంతులనీ యీ పెద్దోల్లంతా పల్లెటూర్లలో యీనాటికీ పిల్చుకుంటానే వుంటారు. యీ దేసంలో పంతుల్లంటే బాపనోల్లనే నమ్మకముండ్లా! అది గుంజమాదిరి గుండెల్లో పాతుకుపోయుండాది. అందుకనే గావాల మావూర్లో పిలకపంతులు కిచ్చిన గవురవం మా నాయిన కిచ్చేవోల్లుగాదు.

అయితే మా నాయిన మాత్తరం దేనికి జంకేవోడుగాదు. "అచ్చిరాలున్నోడూ, ఆయుదాలున్నోడు వొకటే గదంట్రా!" అని దైర్నం జెప్పేవోడు. మా నాయిన సదస్తా వుంటే సీకట్లో సెంద్రవంక కదిలినట్టుండేది. ఆ యెలుతుర్లోనే నాలుగు అచ్చిరాలు నేర్చుకున్నం. అవటాలనుంచి సీకటంటే బయ్యం పోయింది.

అయితే కులముండ్లా! అది సీకటికంటే సిక్క నైంది. యిప్పుడు దాన్ని గోసే యెల్తురు గత్తులు గావాలన్నా!" అంటా యాదన పడతా మాట్లాడతున్నప్పుడు యాదాంతం. "బాగా జెప్పినవయ్యా! బిడ్డ జచ్చినా పురిటి కంపు పోదన్నట్టు యీ అంటరానితనం యుంటాదతానేవుంది"

అచ్చిరాలున్నోడూ ఆయుదాలున్నోడు వొకటే, సీకట్లో సెంద్రవంక కదిలినట్టుండేది, కులం సీకటిని గోసే యెల్తురు గత్తులు గావాల, బిడ్డ జచ్చినా పురిటి కంపు పోదన్నట్టు యీ అంటరానితనం

యంటాడతానేవుంది వంటి ప్రయోగాలు మాండలిక భాషను భావాల తీవ్రతనువ్యక్తం చేసేందుకు ఎలా ప్రయోగించవచ్చో గ్రహింపుకుతెస్తాయి.

భాషామాండలికంతో వచ్చిన వ్యంగ్యాత్మక రచన 'ఇతిహాసం'

తెలుగుమస్టారు లెక్కలుచెప్తే ఎంత హాస్యభరితంగా ఉంటుందో చిత్రించిన రచన 'తెలుగుమేష్టారి లెక్కలపాఠాలు".

పిల్లల నర్సరీ ప్రవేశంకోసం తండ్రుల అవస్థలను వ్యంగ్యాత్మకంగా చిత్రించిన రచన 'తెలుగుతండ్రిలేవరా- దీక్షబూని సాగరా!"

రాయలసీమ మాండలికంతో వచ్చిన రచన 'పనితనం'. ఇందులో పనినైపుణ్యానికి ,సర్టిఫికెట్లకు మధ్య సంబంధాన్ని ప్రశ్నిస్తూ సాగిన సంభాషణద్వారా ఈ మాండలికం స్వరూపస్వభావాలు తెలుస్తాయి.

" ఇన్ని మిషన్లు తోల్తావంటా ఉండావ్ గదా? బాగానే ఉండాది. అయితే నీ దగ్గిర ఏమన్నా సర్టిపికట్లు ఉండాదా?"

ఆ మాటతోగూడా వాడు పకపక నవ్వె!

" ఎందుకట్లా నవ్వతా ఉండావే?" …………

" కోపం చేసుకోబాకండ. రాయుతని మీ కెవురిచ్చినారు సర్టిపికట్లు?" చెంపమీద చెళ్ళుమని పెడితే చెబ్బ. పాయి మొకం కందగెడ్డ మారిరై పాయ.

" ఈ పిల్లెదవ యిట్లా మాదిర్తో అడిగినాడనుకోబాకండ. మీ పక్కనే ఉండాదే గోయిందరాజులసామి గోపరం. ఆ గోపరాన్ని కట్టె మహనుబావుడికి ఎవురిచ్చినారు సర్టిపికట్లు? పోనీ! ఆ గుడిముందర్నే ఉండాదికదా అంతపెద్ద తేరు. దాన్ని చెక్కినాయప్పకు ఎవురిచ్చినారు సర్టిపికట్లు? చేతిలో పనితనం ఉనోడికి సర్టిపికట్లు ఎందుకు సార్? అవ్వే నాదగ్గిరుంటేనా యీడిదాకా నేనెందుకొస్తాను సార్? ఏ గవర్నమెంటు(పెస్సు)లోనో కాళ్ళాడించుకుంటా కూసుండ్తా నాకూరు కుక్కలుతినేటివి!"
(పులికంటి కృష్ణారెడ్డి. పనితనం. నాలుగ్గాళ్ళమండపం: రాయలసీమజీవనశైలి. పే 282-288)

## వ్యంగ్యం

వ్యంగ్యం పైకి హాస్యస్ఫోరకంగానే ఉన్నా, దాని వెనుక అంతర్లీనంగా విషాదం దాగిఉండటం గమనార్హం. విద్యారంగంలోని కొన్ని మౌలికసమస్యలను వ్యంగ్యాత్మకంగా చిత్రించిన రచనలు తెలుగులో కనిపిస్తాయి.

ఎల్‌కేజి సీటుకోసం తల్లిదండ్రుల ఆరాటాన్ని, దాన్ని సొమ్ముచేసుకునే ప్రైవేటు యాజమాన్యాల ప్రవర్తనని వ్యంగ్యాత్మకంగా చిత్రించిన రచన 'అయితే ఫో…' ఇలాంటిదే మరో రచన 'హయ్యోపాపం పసివాళ్ళూ…'

యూనివర్శిటీల్లోని అవ్యవస్థని అవహేళనచేస్తూ వచ్చిన వ్యంగ్యాత్మకరచనే 'ఉజ్జోగాలు'

యూనివర్శిటీల్లోకెళ్ళి మాటాల్చెప్పకుండా రాజకీయాల్చేసేటోళ్ళని రాజకీయపులోళ్ళో మరోటో అనకుండా అళ్ళని ప్రొపెసర్లనే అంటరండి. ఇంకా పైపెచ్చు అళ్ళకి డాక్టరీ డిగ్రీలుంటాయి. ఆ యూనివర్శిటీలోనే డాక్టరీ డిగ్రీల ఇస్తా ఉంటారు. ఇహపోతే కాలేజీల్లో కుర్రాళ్ళకి పాటాల్చెప్పకుండా బ్యాచీలు బ్యాచీలు ప్రైవేట్లు చెప్పుకునే మేష్టర్లని ట్యూటర్లనొచ్చు గదండీ పెబుత్వం? అనదండీ. అళ్ళనేమో లెక్చరర్లంటాదండి. ఏవి విసిత్రం గుందండీ! ఇట్లాంటి ఇసయాలూ ఇసిత్రాలూ తెలుసుకుంటే అదే మాయమ్మా నాన్నా సెప్పిన సెపంచగ్యానమవుతాది గాబోలండి.

నాలుగు సంవత్సరాల బాబుకి ఎల్‌కేజీలో సీటుకోసంఇంటర్వ్యూకి సిద్ధంచేయటం కోసం తల్లిదండ్రులుపడే అవస్థలను హాస్యస్ఫోరకంగా చిత్రించిన రచనే 'ఎల్‌కేజి సీటు'.

"మనదేశ ప్రధాని ఎవరు? అని అడగ్గానే నువ్వు ఏమని చెప్పాలో తెలుసా?"

తెలీదన్నట్టుగా తల ఊపాడు.

"గౌడగౌడ! చెప్పు… గౌడగౌడ" పార్వతి చెబుతుంటే అందులో ఏదో తప్పు ఉన్నట్లుకామాక్షికి తోచి- "పార్వతిగారూ! గౌడగౌడ కాదండి… ఆయన పేరూ… " ఆలోచించసాగింది.

పాఠశాలలోని మధ్యాహ్నభోజనంపై వచ్చిన వ్యంగ్యరచన 'కొత్తరోగం'. ఎప్పుడూ చలాకీగా ఉండే పాప గత కొన్నిరోజులుగా డల్‌గా తయారుకావటానికి కారణమేంటా అని పేరుపొందిన ఆసుపత్రులూ, వైద్యులచుట్టూ తిరిగినా నయంకాని పాప జబ్బును ఒక కుర్రడాక్టరు నయంచేసిన విధానం అదీ ఆ డాక్టరు చేసిన సూచన ఆశ్చర్యంగొల్పేదిగా ఉంటుంది. ఆ సూచనే కథనానికి కొసమెరుపు.

"వెరీ సింపుల్. స్కూల్ మాన్పించండి." చెప్పారు.

"స్కూలికి వెళ్తే మిడ్ డే మీల్ తప్పదుకదా? ఇక అన్నం ఎక్కడ సయిస్తుంది? అందుకు" చెప్పారు ఇలాంటి అనేక వందల కేసులు గత నెలగా చూస్తున్న ఆ కుర్రడాక్టరు.

మధ్యాహ్నభోజన పథకంపైన వ్యంగ్యాత్మకంగా వెలువడిన రచన 'మిడ్‌డేమీల్స్ జిందాబాద్'. మధ్యాహ్నభోజన పథకం ఉపాధ్యాయులపై మరింతభారాన్నిమోపటం తద్వారా పాఠశాలల్లో బోధనాప్రమాణాలు పడిపోవటాన్ని వ్యగ్యంగా చిత్రించిన రచన ఇది.

"పిల్లలు తినలేని మధ్యాన్నభోజనాన్ని సద్వినియోగం చెయ్యటానికి ప్రభుత్వం పందుల్ని పెంచమని సలహా ఇచ్చినందుకు నాకెంతో సంతోషంగా ఉంది. ఇన్నాళ్ళు ప్రభుత్వం ఇంతోవిషయాన్ని గమనించలేదు. పందిపెంట చాలామంచి ఎరువు. అటువంటి ఎరువును స్కూళ్ళలో వృధాచెయ్యటం మంచిపద్ధతికాదు. అందువల్ల వెంటనే ప్రతిస్కూలుకూ అనుబంధంగా ఒకతోటనుపెంచి పందిపెంటను ఎరువుగా వాడితే....తోటరూపంలోకూడా స్కూలుకు ఆదాయంవస్తుంది" అంటూ ఎంతో వ్యంగ్యంగా రాశారు.

అయితే ప్రభుత్వం దినపత్రికలో ప్రచురించబడిన ఆఉత్తరాన్ని ఎంతోసీరియస్‌గా తీసుకొంది. ఆతని వ్యంగ్యాన్ని అర్థం చేసుకోలేక అది ఎంతో నిర్మాణాత్మకమైన సలహా అనుకొంది. వెంటనే పందిపెంట ఎరువుతో కూరగాయలతోటల్ని పెంచమని ప్రధానోపాధ్యాయులకు ఉత్తర్వులు వచ్చాయి. (జూపిటర్, మిడ్‌డే మీల్స్ జిందాబాద్, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 4-8-83, పే 50-52)

అవగాహనా రాహిత్యంతో ప్రతిస్వల్ప అంశాన్ని సమస్యగాచేసి కళాశాలల్లో విద్యార్థులు సమ్మెకుదిగటాన్ని ప్రధాన కథాంశంగా తీసుకుని రాసిన వ్యంగ్య కథనం 'మా కాలేజీ స్ట్రైక్' కళాశాలలో పగిలినకుండ కారణంగా ప్రారంభమైన సమ్మె దేశవ్యాప్తమై అల్లకల్లోలానికి కారణం కావటం, అలా కొంతకాలం సాగినతర్వాత చివరకు ఎవరిదీ తప్పుకాదని, కుండా చాలా పాతదవటంవల్ల రెండుగా విడిందని భావించి, ప్రస్తుతం పగిలిన కుండస్థానంలో కొత్తకుండను ఏర్పాటు చేయటం జరుగుతుందని ప్రిన్సిపాల్ చెప్పడంతో సమ్మె ముగియటం ఇందులో కథాంశం. అతిశయించిన సన్నివేశాల చిత్రీకరణ ఇందులో హాస్యానికి విలుకల్పించింది.

విశ్వవిద్యాలయాల్లోని పరిశోధనలను అవహేళనచేస్తూ వచ్చిన రచన 'ఓ చింత(వింత)కథ'. విశ్వవిద్యాలయంలోని చింతలతోపు పరిశోధనకు అనువైందని పేర్కొంటూ దాన్ని తమకే అప్పగించాలని విశ్వవిద్యాలయాల్లోని వివిధశాఖలు వివాదం లేవదీయడం ప్రధానకథాంశంగా ఈ రచన సాగుతుంది.

డా.చింతామణిగారు చెట్టుకొమ్మలకు పక్షుల పంజరాలను ఎంతఠీగా కట్టవచ్చో, దానివల్ల దేశానికి ఎంత ప్రయోజనమో తమ అప్లికేషన్‌లో నొక్కి వక్కాణించారు. ఆ మధ్య చింతకాయలు కోసుకోవడంకోసం వెళ్ళిన లెక్కల ప్రొఫెసర్‌గారు చింతగింజలతో లెక్క పెట్టడం పిల్లలకి సులువవుతుందనీ, దానివల్ల దేశంలో వెనుకబడిపోతున్న లెక్కల ఇంట్రెస్టు మళ్ళీ కల్గించవచ్చనీ పురాతన విద్యావిధానం పిల్లల్లో మేల్కొల్పవచ్చనీ, తమ డిపార్ట్‌మెంటుకే తక్షణం చింతలతోపును హస్తగతం చేయాలనీ దరఖాస్తు ఇచ్చేరు. ఎక్కడ ఆకు కన్పించినా స్వతఃసిద్ధమైన అధికారం తమదేనని వృక్షశాస్త్ర విభాగం, జంతువులను పెంచటానికి చింతలతోపే అనువైందని జంతువిభాగంవారు, పెద్దపెద్దచెట్లమధ్య వేరుశెనగ, పిల్లిపెసర, అల్లం, పసుపులాంటి పంటలు పండించి భూమిని పూర్తిగా సార్థకం చెయ్యాలనే తలంపు తమకుందంటూ వ్యవసాయవిభాగంవారు తమ అర్జీలను లిఖితబద్ధంచేశారు.

ఇలా హాస్యోక్తంగా సాగే ఈ రచన పరిశోధనల్లో చోటుచేసుకుంటున్న అలసత్వానికి ఒక హెచ్చరికగా నిలుస్తుంది. 'ఓపెన్ యూనివర్శిటీ కథ' ఆ విశ్వవిద్యాలయంలోని పాఠ్యాంశాలు,

పరీక్షా విధానాలపైన ఒక శ్వేతపత్రంలాంటిది. అయితే ఈ రచనకూడా వ్యంగ్యంగా సాగుతుంది.

## విరామచిహ్నాలు

విరామ చిహ్నాలతో కథనంలో గాఢతను పెంచినరచనలు అనేకం విద్యప్రధాన కథావస్తువుగా చేసుకుని వచ్చాయి. వానిలో ప్రత్యేకంగా గుర్తించదగ్గ రచన 'అనగా అనగా'. ఈ కథనంలో చిన్నవాక్యాలు, విరామ చిహ్నాలు, వాక్యాలలోని క్లుప్తత కథను సరళంగా మార్చి కథను చదవటంలో పాఠకునికి ఎటువంటి క్లిష్టత అనిపించకుండా చేస్తుంది.

అనగా అనగా ఓ ఊరు. ఆ ఊరిలో ఓ విశాలమైన భవనం. ఆ విశాలమైన భవనంముందు అందమైన పూలతోట. ఆ అందమైన పూలతోట చుట్టూ ఎత్తైన ప్రహరి. ఆ ఎత్తైన ప్రహరి గుండా లోపలికి వెళ్ళడానికి ఓ బలమైన పెద్దగేటు.

ఇందులో అంత్యానుప్రాసద్వారా కథనంలో ఆసక్తిని కలిగించేందుకు ప్రయత్నించటం కనిపిస్తుంది. వాక్యాల్లోను, భావాల్లోను క్లుప్తత మరో ప్రధానాంశం.

ఇక పాప సమయం పాప చేతుల్లోంచి - పాపు అమ్మానాన్నల చేతుల్లోంచి - తాతయ్యల చేతుల్లోంచి - అమ్మమ్మ నానమ్మల చేతుల్లోంచి - మాష్టారు, టీచర్, కోచ్‌ల చేతుల్లోకి వచ్చేసింది.

ఇందులో వాక్యాలవిరుపు, అంత్యప్రాసతో భాషావైవిధ్యాన్ని ప్రదర్శించటం గమనించవచ్చు. చదువు పేరుతో ఇంట్లో బందీ అయిన పాప స్వేచ్ఛావాయువులకోసం, దూరంగా స్వేచ్ఛగా ఆడుకుంటున్న పిల్లలను చేరాలని ప్రయత్నించి మేడపైనుంచి పడిపోయిన విషాదాన్ని చిత్రించిన వైనం భాషలో సరళతతోకూడా బలీయంగా ఉపయోగించవచ్చని నిరూపించింది.

తళతళా మెరుస్తోన్న ఏంజిల్ రెక్కల్లా కుట్టిన చేతులను విప్పార్చి - అచ్చం లిటిల్ ఏంజిల్ లాగానే - ఓ అద్భుతమైన పక్షిలా ... తిన్నగా ... స్వేచ్ఛగా మైదానం మీదుగా ... తారల తీరాలు చేరాలని ... ఎగిరింది.

యువకుడు అప్పటి వరకు మిలమిల్లాడుతోన్న లిటిల్ ఏంజిల్ లాగున్న రక్తపు ముద్దను చేతుల్లోకి తీసుకొని బయటకు పరిగెత్తాడు ...

ఆయన వెనకే భీతిల్లిన యువతి...

ఆవిడ వెనకే తత్తరిల్లిన తాతయ్యలు...

తల్లడిల్లిన అమ్మమ్మ నాయనమ్మలు...

విలవిలలాడిన కార్యదర్శి... గాబరాపడిన పంతులమ్మ, మాష్టారు, టీచర్, కోచ్‌లు పనిమనుషులు... అందరూ..... అందరూ......

పరుగులు తీసారు....

పాప ఆసుపత్రికి.....!

కథ కంచికి.........!!

మరి మనం.....???

భాషలో విరామచిహ్నాలతో భావానికి సంబంధించిన ఆర్ద్రతను గాఢంగా కల్గించవచ్చనేందుకు ఈ కథనం ఉదాహరణగా నిలుస్తుంది.

ఒకే శబ్దాన్ని పదే పదే సూచించటంద్వారా భౌతికస్పర్శకు వీలుకలుగుతుంది. అలా భాషద్వారా భౌతికస్పర్శకు వీలుకలిగించే ప్రయత్నాన్ని 'పిల్లలు మాయమైన వేళ...'లో చూస్తాం. బాలకార్మిక సమస్య తీవ్రతను, దానిపట్ల నిరసనను తెల్పేందుకు రచయిత భాషను ఈ రకంగా ఉపయోగించటం గుర్తించవచ్చు.

మన కార్మికశక్తిలో సగం - పిల్లలు.

మన కర్షకశక్తిలో సగం - పిల్లలు.

మన ఉత్పత్తిదారుల్లో సగం - పిల్లలు.

మన వినియోగదారుల్లో సగం - పిల్లలు.

మన ఆశలూ ఆశయాలూ - పిల్లలు.

మన ఆనందాలు అనుబంధాలు - పిల్లలు.

పిల్లలు - పిల్లలు - పిల్లలు.

ఈ పిల్లలకి బదులుగా ఏం ఇస్తున్నాం? బతుకుల బరువులు- చదువుల బరువులు. పైనుంచి, పసితనాన్ని చిదిమి వేసే చీకటి పనులు. చిన్నితనాన్ని అర్థంపెట్టుకొని చేయించే పిల్లపనులు - ఇవేనా వారికి అందుతోన్న బహుమానాలు? ............

విషాదాన్ని ఎంత గంభీరంగా పలికించగలమో అంతే తీవ్రంగా ఆనందాన్నికూడా భాషద్వారా అందించవచ్చనేందుకు ఇదే పద్ధతిని అనుసరించటం గమనార్హం. చిన్న చిన్న పదాలు, వాక్యాలు గొప్ప గొప్ప అనుభుతులను అందించటం ఇందులో విశేషం.

ఇక ఆ లోకం చేరిన పిల్లలది సందడే సందడి.

ఒకడు చిన్ని కృష్ణుడి దగ్గర వేణువు వూదడం నేర్చుకుంటున్నాడు.... కొంతమంది బాలభీముడి వద్ద కుస్తీపట్లు నేర్చుకుంటున్నారు. మరికొందరికి సిండ్రెల్లా నాట్యం నేర్పుతోంది. పైపర్ వాయిద్యాన్ని ఒకరు పరిశీలిస్తుంటే అల్లావుద్దీన్ దీపాన్ని మరొకరు పరీక్షిస్తున్నారు. ..........

ఊహాల ఉయ్యాలలూగేవాళ్ళు - సీతాకోకచిలుకలపై సవారి చేసేవాళ్ళు - ఇంద్రధనుస్సులపై జారుడుబండాడేవాళ్ళు - మేఘాల పరుపులపై పవళించేవాళ్ళు - తారల్ని మాలకట్టి చల్లో పెట్టుకొనేవాళ్ళు -!

సంతోషం - సంబరం - ఉత్సాహం - ఉల్లాసం;

అదేవిధంగా పదేపదే చేసేవ్యక్తీకరణద్వారా అనుభూతుల తీవ్రతను పెంచేప్రయత్నం ఈ రచనలో అనుక్షణం కనిపిస్తుంది.

" నిజమే. మీకు తెలియంది ఏముంది? తెలిసితెలిసే పిల్లల శ్రమశక్తిని దోపిడీ చేస్తున్నారు. తెలిసితెలిసే వారి అమాయకత్వాన్ని దోపిడీ చేస్తున్నారు. దోపిడీ - విలువలదోపిడీ - విశ్వాసవితిదోపిడీ - తెలిసితెలిసే ఈ ఫ్యాక్టరీలు - కంట్రాక్టర్లూ - బ్రోకర్లూ - "

పిల్లల గురించి ఆలోచించండి - ప్రేమతో ఆలోచించండి. (చంద్రలత, పిల్లలు మాయమైన వేళ . . . . , నేనూ నాన్నసప్నలా!, పే 169-180)

### శీర్షిక

కొన్ని శీర్షికలు కథకు సంబంధించిన పూర్తిసారాన్ని అర్థవంతంగా ధ్వనింపజేసేవిగా ఉంటాయి. మరికొన్ని పాత్రల మనోవృత్తిని ప్రతిబింబించేవిగా ఉంటాయి. కథలోని ఇతివృత్తాన్ని స్ఫురింపజేసేవి కొన్ని.భావానికీ, వ్యక్తికీ సంకేతాలైన ఏకశబ్ద శీర్షికలు, ద్విశబ్ద శీర్షికలు, అనేకశబ్ద శీర్షికలు. అయితే శీర్షిక భావస్ఫోరకమైనదై ఉండాలి. మేకనోచి అభిప్రాయంలో ఒక చిన్న కథనానికి అమోఘమైన శీర్షికలనుంచటం సరైనచర్య కాదు. రచన స్వభావానికి అనుగుణమైనదిగా శీర్షిక ఉండాలి.

"While a good title is essential, it is a great mistake to have a startling or sensational title followed by a quite little chatecter sketch. Keep the title in its proper proportions to the nature and interest of the story"

పంతులుజోగారావ్ 'విషగుళిక'-- ఆదర్శాలకోసం నిలబడే ఉపాధ్యాయునికి విద్యారంగంలో ఎదురయ్యే అనేకానేక చేదు సంఘటనలు విషగుళికలుగామారి వ్యక్తిని బహుముఖంగా నిర్వీర్యునిచేసి పతనానికి దోహదకారులు కావటాన్ని చిత్రించిన రచన ఇది. రచనలో అంతర్గర్భితమై ఉన్న నిగూఢభావాన్ని శీర్షికగా పెట్టటం జరిగింది. దీన్ని ప్రతీకాత్మక శీర్షికగా గణించవచ్చు. ఇదేరీతిలో విద్యావ్యవస్థలోని అరాచకాలకు సమిధలౌతున్న విద్యార్థులు, ఉపాధ్యాయుల సజీవచిత్రణే దిలావార్ 'సమిధలు'. పాత్రలే ఇతివృత్తంగా సాగిన ఈ రచనలో శీర్షిక ఇతివృత్తాత్మకం. విద్యారంగంలోని చీకటికోణాలు ఊబిగామారి విద్యార్థులను బలితీసుకోవటాన్ని ప్రతీకాత్మకంగా సూచించిన రచన 'ఊబి'.

సున్నితమైన హృదయంగల వ్యక్తి ధర్మరావు మేష్టారు. హెడ్మాష్టరు సింహాచలానికి తన భార్య చావుబ్రతుకుల్లో వున్న విషయాన్ని చెప్పి సెలవిప్పించుకోలేని చేతకానితనం మేష్టారుది. వ్యక్తులను అంచనావేయటంలో పొరపాటువల్ల సెలవివ్వనిరాకరించి హెడ్మాష్టరు చేసిన తప్పిదం. వెరసి భార్య మరణం, చలించిపోయిన ధర్మారావు మేష్టారు రైలుక్రిందపడి ఆత్మహత్య చేసుకోవటం. వ్యక్తుల స్వభావాన్ని అంచనావేయటంలో పొరపాటుజరిగితే చోటుచేసుకునే వైపరీత్యాన్ని సూచించే ప్రతీకాత్మకమైన శీర్షిక 'గ్లాస్ విత్ కేర్'

రాయలసీమ ముఠాకక్షలకు బలౌతున్న వ్యక్తులను ప్రతీకాత్మకంగా దీపంపురుగులతో పోలుస్తూ సాగిన కథనం 'దీపంపురుగులు'. ప్రతీకాత్మక శీర్షికకిది మంచి ఉదాహరణ. దీపం పురుగులు దీపంచుట్టూ పరిభ్రమిస్తూ అదే దీపానికి ఆహుతికావటం నాయకుల చుట్టూ పరిభ్రమిస్తూ నాయకులకోసం బలికావటానికి ప్రతీకాత్మకంగా ఇందులో చూపించారు. అయితే కిట్టిగాడు అలా నాయకులక్రింద పనిచేయ నిరాకరించటాన్ని,

ఓ పిల్ల దీపంపురుగు దీపం దగ్గరకువచ్చి, తన వాళ్ళందరూ జ్వాలలోపడి మసి అవుతున్న వైనం గమనించి వెనక్కు తిరిగింది.

అంటూ కిట్టిగాడు చదువును ఇందుకు ఆయుధంగా స్వీకరించటాన్ని ఈ రచన చిత్రించింది. ప్రతీకాత్మక శీర్షికకిది గొప్ప తార్కాణం.

పరిస్థితులకు వ్యక్తులుబందీలై ప్రేమలు, ఆపేక్షలు, మమకారాలు పోగొట్టుకుంటే మనుషులకు, ప్లాస్టిక్ పువ్వులకు తేడా ఉండదన్న వాస్తవాన్ని కథాంశంగా చేసుకుని వచ్చిన రచన 'ప్లాస్టిక్‌పువ్వులు'. ఇందులో పరిస్థితులకు బందీలై వ్యక్తులు జీవితంలోని అనుభూతులను కోల్పోతే ఆ జీవితం రంగు, సువాసనలేని పువ్వులతో సమానమని ప్రతీకాత్మకంగా సూచించేందుకు ఎంచుకున్న శీర్షిక 'ప్లాస్టిక్‌పువ్వులు'. ప్రతీకాత్మక శీర్షికకు ఇది చక్కని ఉదాహరణ.

" బాల్యం నిజంగా ఎంత గొప్పది. బాల్యాన్ని తిరిగి తిరిగి జీవించాలని అందరూ కలలు కంటారు. అమ్మమ్మలు మాత్రమే బాల్యాన్ని ముద్దాడి, మురిసిపోతూ మళ్ళీమళ్ళీ బాల్యాన్ని జీవిస్తారు. కొంచెం ఆలస్యం అయింది కానీ, ఇప్పటికైనా మించిపోయిందిలేదు. వర్షను చూసుకోడానికి వెళుతున్నాను." అని సంబరపడింది విజయ. -----------

విజయకు అర్థంకాలేదు ముందు -- నోట్‌బుక్‌లోకి తొంగిచూసి, " పాపతో మాటలు, ఆటలు లేకుండా కేవలం ఏబైరెండు ఏంచేసిందో తెలుసుకుని ఇన్నాళ్ళు తృప్తిపడిందా శిరీష" అనుకొని విజయ భయంతో వణికిపోయింది. ఆమె కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి. " బుక్స్, బైండర్స్, పెన్సిల్స్, షార్పనర్స్, ఎరేజర్స్ మధ్య పెరుగుతోంది వర్ష. పాపకు బాల్యం లేదు. అమ్మా నాన్నల ప్రేమలేదు. ఇదేమి జీవితం శిరీష !" కొంగుతో కళ్ళుతుడుచుకుంటూ అంది.

నేరస్థురాలిగా, అసహాయంగా నిలబడిపోయింది శిరీష. విజయ నిద్రపోతున్న వర్షమెళ్ళోంచి లాకెట్ తీసేసింది. "ఈ రోజునుంచి వర్ష నాదగ్గరే పడుకుంటుంది. మీ అమ్మమ్మలాగా నేనూ వర్షను చూసుకుంటాను." తల్లిని పెనవేసుకొని, ఆమె భుజంపై వాలిపోయింది శిరీష.

విజయ కూతురి తలను ఆప్యాయంగా నిమురుతూ " ప్రేమలు, ఆపేక్షలు, మమకారాలు లేకపోతే మనకూ ప్లాస్టిక్ పువ్వులకు తేడా ఏమిటి? ఇంతలా బందీలయిపోకూడదు పరిస్థితులకు" అంది. (ఎస్. జయ, ప్లాస్టిక్ పువ్వులు, రెక్కలున్నపిల్ల, పే 21-28)

'బళ్ళోకి వెళ్ళాలి' శీర్షికాపరంగా రెండు విభిన్న అర్థాలను పాఠకునికి అందించటం ఈ రచనలో విశేషం. బళ్ళోకి వెళ్ళాలన్న గోపాలెం కోరిక తండ్రికారణంగా మరో రూపంలో తీరటం ఈ కథలో విషాదం.

పెద్దయ్యగారు పడకకుర్చీలోంచి కష్టపడిలేచి 'ఏరికాపులేవోయ్! చదువుట, చదువు! చెప్పినపని చెయ్యలేక చతికిలబడుతున్నావు! చదువొక్కటే తక్కువైంది నీకు. చదువుకునే యోగ్యతే ఉంటే ఈ కర్మ మేమిటి? పో పో! ఫోందేపిరా! బళ్ళోకి వెళ్ళాలి!' అన్నారు మండిపడుతూ. గోపాలానికి కళ్ళనీళ్ళు గిర్రున తిరిగాయి. అలాగే తలవంచుకొని నట్టెండలో ఇంటిదారి పట్టాడు. తన కర్మ ఏమిటో తనకే బోధపడక మనసులో బాధపడుతూ! 'బళ్ళోకి వెళ్ళాలి! బళ్ళోకి వెళ్ళాలి!' అవే మాటలు అతని చెవుల్లో గింగురు మంటున్నాయి దారి పొడుగునా!

ఇప్పటికీ పాపం గోపాలం బళ్ళోకి వెళ్తూనే ఉన్నాడు. గంటలు కొడ్తూనే ఉన్నాడు.

విద్యార్థిదశలో ఉన్నతవ్యక్తిత్వంకలిగిఉండికూడి తదనంతరకాలంలో ఉద్యోగజీవితంలో అవినీతిపరులుగా రూపొందటాన్ని చిత్రించిన రచన 'బ్లాక్‌హోల్'. ఇందులో దక్షిణామూర్తి వ్యక్తిత్వం ఇలాంటి పరిణామాన్ని పొందిందే. అయితే లంచగొండితనం అందరినీ తనలోకి లాగేసుకునేంత శక్తివంతమైందన్న సూచనచేస్తూ దాన్ని బ్లాక్‌హోల్‌గా పేర్కొనటం విశేషం. తనచుట్టూ ఉన్న నక్షత్రాలని, గ్రహాలని తనలో కలిపేసుకునే లక్షణం కలిగిన బ్లాక్‌హోల్‌తో సమాజంలోని లంచగొండితనాన్ని పోల్చటం ద్వారా శీర్షికలో ప్రతీకాత్మకతను సాధించారు. ఇందులో దక్షిణామూర్తి కాంతిపుంజమైతే లంచగొండితనం ఒక బ్లాక్‌హోల్.

కథనంలో వైవిధ్యాన్ని గుర్తిస్తే 'మరోకర్ణుడి కథ' శీర్షికలో ప్రతీకాత్మకత సులభంగా గ్రహింపుకొస్తుంది. పిల్లల్లోని ఆసక్తిని, కళల పట్ల అభిమానాన్ని గుర్తించకుండా పొట్టకూటికి చదువుకునే చదువులే ముఖ్యమనుకునే తల్లిదండ్రుల స్వభావం, పిల్లల మనస్తత్వాన్ని అర్థంచేసుకోలేని పల్లెటూళ్ళలోని అమాయకపు తల్లిదండ్రులు, చదువు లేకపోబట్టే మట్టి పిసుక్కుని బతుకుతున్నాం, ఆ చదువులే ఉంటే ఆఫీసుల్లో కాలుమీద కాలేసుకుని కుర్చీల్లో కూర్చునే ఉద్యోగాలొచ్చేవి అనుకునే సాంబయ్యల ఆలోచనావిధానం ఇవన్నీ వ్యక్తుల అభిరుచులకు సమాధికట్టటాన్ని పౌరాణిక పాత్రతో పోల్చి చూపటం ద్వారా శీర్షికకు ప్రతీకాత్మకతను చేకూర్చారు.

శరీరధర్మం నిర్వర్తించడంవల్ల ఇద్దరుపిల్లలు పుట్టారు. పిల్లలకైనా కమ్మగా జోలపాడాలి. వాళ్ళకి సంగీతం నేర్పించాలి అనుకునేవాడు. రాగిణి ఎప్పుడైనా జోలపాడితే పిల్లలు గుక్కపెట్టి ఏడుస్తారు. కర్ణుడు రాగిణిభర్తగా, బ్యాంకు ఉద్యోగిగా బతికే ఉన్నాడు. కాని అతనిలోని కళాకారుడు చనిపోయాడు. కర్ణుడికి తల్లి, తండ్రి, మాస్టారూ, రాగిణీ, బ్యాంకు ఉద్యోగం అందరూ కలిసి అతనిలోని సంగీతాన్ని హత్యచేశారు. అతనిలోని కళాకారుణ్ణి చంపేశారు. ఈ సృజనహంతకులు ఐదుగురుకారు, ఆరుగురు. ఆ ఆరోవ్యక్తిని నేనే. నన్నూ, నా పాటనూ ఆరాధించి తన జీవితంలోకి ఆహ్వానించాడు. కాని అప్పటికే నాపాటకు పరవశించి మురళివాయించే కృష్ణుడు నాకోసం ఎదురుచూస్తున్నాడు. అందుకే నేను కర్ణుడిప్రేమను కాదన్నాను. కానీ కర్ణుడు చనిపోయాడని తెలిసీ - అదే అతనిలోని కళాకారుడు చనిపోయాడని తెలిసీ - నన్ను నేను క్షమించుకోలేక పోయాను. మీరైనా నన్నర్థంచేసుకుంటారా? మీ ఎరికలోని కర్ణుల్ని బతికించుకుంటారా? (భార్గవీరావు, మరో కర్ణుడికథ, నాపేరు, పే 39-44)

పెళ్ళి ఉభయుల అవసరమైనప్పుడు వివాహవిషయంలో కట్నకానుకల ప్రసక్తి ఎందుకు వస్తుందన్నది ప్రధాన సమస్య. అయితే ఈ దిశగా స్త్రీల ఆలోచనలు సాగేందుకు విద్య దోహదపడుతుందన్నది యదార్థం. అయితే ఆ క్రమంలో మహిళల ప్రవర్తన ఎలా ఉంటుందన్నది చిత్రించిన రచనే 'యజ్ఞపశువు'. ఇందులో స్త్రీని యజ్ఞపశువుతో పోల్చటం ద్వారా సామాజిక కట్టుబాట్లు తమకు చేసే ద్రోహాన్ని గ్రహించకే స్త్రీలు యజ్ఞపశువులుగా సమిధలౌతున్నారని, ఒకసారి గ్రహింపుకొస్తే వారు తీవ్రంగా స్పందిస్తారని పేర్కొంటారు. ఇందుకు యజ్ఞపశువును ప్రతీకగా చూపటం ద్వారా శీర్షికలో ప్రతీకాత్మకతను సాధించారు.

'ఇంకేం! అయితే యీనాడు మనం చదువంటే సంస్కృతిని అర్థంచేసుకోవాలి--వాడు చదువుకున్న వాడంటే ఏం లాభం లేదు. ఎందుకంటే-- లేకుంటే కొన్ని పక్షులకీ, మనకీ అటే తేడా వుండదు.'

'అయితే మానవుడి జీవితం యీనాడెందుకింత దౌర్భాగ్యంగా వుండాలి?'

'యజ్ఞపశువంటే మీకు తెలుసనుకుంటా?'

'తెలుసు'

'అవి మోక్షం పొందబోతున్నట్లు భావిస్తాయని కొందరు పెద్దలంటారు. బహుశా అంతేనేమో. అవుతే అవిషయం నిజం కాదని ఆ యజ్ఞపశువులకు అనిపిస్తేమటుకు మరుక్షణం కొమ్ములతో డొక్కల్లో పొడిచి పరుగెత్తుకువెళ్ళి యింత గడ్డి తింటూ తిరుగుతయి.'

'అబ్బే, మీ రేమిటో విషయంగాని విషయం మాట్లాడుతున్నారు' అని మొహం తిప్పుకున్నాడు సుందరం. (మా గోఖలే, యజ్ఞ పశువు, మాగోఖలే కథలు, పే 296-302)

శీర్షికాపరమైన వైవిధ్యానికి 'స్పాట్' ఓ చక్కని ఉదాహరణ. పరీక్షల్లో ఏదో ఓ రకంగా

విజయం సాధించాలని తప్పుచేసేందుకు సిద్ధపడిన ఓ అమ్మాయి జీవితంపై మచ్చపడకుండా కాపాడిన మాష్టారి కథే ఇది. ఇందులో స్పాట్‌వాల్యూయేషన్‌కు, అమ్మాయి వ్యక్తిత్వంపై మచ్చగా మిగిలితుందనే రెండింటికి సరిపడే అర్థంలో శీర్షిక 'స్పాట్' అని పేర్కొనటం చూడవచ్చు. అందుకే దీన్ని ద్విశబ్ద శీర్షికగా పేర్కొనవచ్చు.

ఇంకా వైవిధ్యపూరితమైన శీర్షికలు అనేకం తారసపడతాయి.

ఇలా భాషాపరంగా సాహిత్యంలో శిల్పాన్ని సాధించేప్రయత్నం అనేక రచనల్లో కనిపిస్తుంది.

# 4. తెలుగుసాహిత్యం : ప్రత్యామ్నాయ విద్య

ఉపాధ్యాయునికి విద్యార్థికి మధ్యగల సబంధాల స్వభావం ప్రాతిపదికగా నేటి విద్యావిధానాన్ని పరిశీలించినట్లయితే విద్యాబోధన ఒక కథా-కథన ప్రక్రియగా రూపొందటం కనిపిస్తుంది. ఇందులో ఉపాధ్యాయుని పని విద్యార్థుల మెదళ్లను సమాచారంతో నింపటానికి పరిమితమై పోయింది. ఆ సమాచారం కూడా వాస్తవదూరమైనది సంకుచితత్త్వంతో నిండినది కావటం గమనార్హం. పదాల శబ్దసౌందర్యం తప్ప అర్థానికి ప్రాధాన్యత లేకపోవటం ఈనాటి విద్యలో ప్రధాన భూమిక వహిస్తున్నది. ఉపాధ్యాయుడు సమాచారాన్ని విద్యార్థుల మెదళ్లలో నింపేవాడుగా, విద్యార్థులు కేవలం సమాచార గ్రహీతలుగా పనిచేసే నేటి విద్యావ్యవస్థలో విద్య ఒక డిపాజిట్ ప్రక్రియగా మారిపోయింది. అందుకే దీన్ని "బ్యాంకింగ్ విద్యావిధానం"గా పేర్కొనవచ్చు. డిపాజిట్లను సేకరించి, నిల్వ చేసుకోవడం విద్యార్థుల ప్రధానవిధిగా ఉండింది. వారు నిల్వచేసే సమాచారం ఆధారంగా వారు కలెక్టర్లు, ఇతర అధికారులుగా రూపొందే అవకాశం కలుగుతుంది. ఈ సమాచారాన్ని నిల్వచేసి, ప్రదర్శించే క్రమంలో విద్యార్థులు విపరీతమైన వత్తిడికి గురౌతారు. అలా వత్తిడికిలోనుచేసి విద్యార్థులనుంచి తాము ఆశించిన విషయాలను రాబట్టుకోవటం నేటి విద్యావిధానంలో ఒక సాధారణాంశం. అందుకే దీన్ని "ప్రెషర్ కుక్కర్ విద్యావిధానం" అనికూడా పేర్కొంటారు. సరైన నిర్దేశకత్వం లేని ఇలాంటి విద్యా విధానం కారణంగా చివరకు ప్రజలు సృజనాత్మకతకు, మార్పుకు, విజ్ఞానానికి దూరమైతున్నారు.

*బ్యాంకింగ్ విద్యావిధానం:*

"బ్యాంకింగ్ విద్యావిధానం" లో మేధావులుగా గుర్తింపు పొందినవారు మేధస్సు తమ ప్రత్యేక సొత్తుగా భావిస్తారు. ఇతరులను అజ్ఞానులుగా భావిస్తారు. ఇలా ఇతరులను అజ్ఞానులుగా చిత్రించటం వారిని అణచివేసేందుకనుగుణమైన ఆలోచనావిధానంలోని ప్రధానలక్షణం.

ఉపాధ్యాయుడు విద్యార్థులను అజ్ఞానులుగా పేర్కొనటం ద్వారా తన ఉనికిని కాపాడు కొనేందుకు ప్రయత్నిస్తాడు. అలా విద్యార్థులు తమ అజ్ఞానాన్ని, ఉపాధ్యాయుని గొప్పతనాన్ని అంగీకరిస్తారు. దీంతో వాళ్లు ఉపాధ్యాయునికి జ్ఞానాన్నివ్వగల తమ సామర్థ్యాన్ని మాత్రం గుర్తించరు.

ఉపాధ్యాయుడు-విద్యార్థి మధ్య జరిగే విరుద్ధ సంఘర్షణలద్వారానే విజ్ఞాన ఆవిష్కరణ జరుగుతుంది. అయితే ఈ లక్షణం"బ్యాంకింగ్ విద్యావిధానం" లో కనిపించదు. ఇందుకు విరుద్ధంగా ఈ విద్యావిధానంలోని వైఖరులు సమాజంలోని దోపిడీ స్వభావాన్ని ప్రతిబింబించేవిగానే ఉంటాయి. అవి

-----ఉపాధ్యాయుడు బోధిస్తాడు ; విద్యార్థులు వింటారు.
-----ఉపాధ్యాయునికి అన్నీ తెలుసు ; విద్యార్థులకు ఏమీ తెలీదు.
-----ఉపాధ్యాయుడు ఆలోచనాపరుడు ; విద్యార్థుల ఆలోచన అదొక్కటే.
-----ఉపాధ్యాయుడు మాట్లాడుతాడు ; విద్యార్థులు వింటారు.
-----ఉపాధ్యాయుడు క్రమశిక్షణ అమలుచేస్తాడు ; విద్యార్థులు క్రమశిక్షణ పాటిస్తారు.
-----ఉపాధ్యాయుడు నిర్ణయాలు చేస్తాడు ; విద్యార్థులు వాటిని శిరసావహిస్తారు.
-----ఉపాధ్యాయుడు పనిచేస్తాడు ; విద్యార్థులు అదే పనిని స్మరిస్తారు.
-----ఉపాధ్యాయుడు కార్యక్రమనియమావళి రూపొందిస్తాడు ; విద్యార్థులు దాన్ని అమలుపరుస్తారు.
-----ఉపాధ్యాయుడు తన వృత్తిపరమైన ఆధిక్యతతో జ్ఞానం యొక్క ఆధిక్యతను విస్మరిస్తాడు.

"బ్యాంకింగ్ విద్యావిధానం" మనుషులను పదార్థాలుగా భావిస్తుంది. సమాచారాన్ని నిల్వచేసే పనిలో విద్యార్థులు ఎంతగా నిమగ్నమవుతారో, వారిలో అంతగానూ క్రియాశీల చైతన్యం నశించిపోతుంది. నిష్క్రియాత్మకమైన ఈ పని విద్యార్థులను ప్రపంచంతో రాజీపడేట్లుగా తయారు చేస్తుంది.

ప్రపంచంలో మౌలికమైన మార్పుని ఆశించని దోపిడీ వర్గాలకి ఇది అనుకూలమైన అంశం. లాభదాయకమైన ఈ పరిస్థితిని కాపాడుకొనటం కోసం వారు విద్యావిధానంలో ఎటువంటి క్రియాశీల మార్పులనైనా వ్యతిరేకిస్తారు.

వాస్తవానికి దోపిడీవర్గాల ప్రయోజనాలు దోపిడీకి గురౌతున్నవారి చైతన్యంలో వచ్చే మార్పులపై ఆధారపడి ఉంటాయి. అయితే దోపిడీకి గురయ్యేవారు సమాజంలో భాగంగా ఉంటూనే తమను తాము పరాధీనులుగా భావిస్తారు. అయితే వాళ్లు తమను తాము వ్యక్తులుగా గుర్తించేందుకు నిర్మాణంలో మార్పుచేయటం అవసరం. ఈ మార్పు దోపిడీవర్గాల ప్రయోజనాలను దెబ్బదీస్తుంది. విద్యార్థుల్లో ఈ ప్రమాదాన్ని తొలగించేందుకు "బ్యాంకింగ్ విద్యావిధానం" దోహదపడుతుంది. ఈ విధానంలోని 'మానవతావాదం' స్త్రీ, పురుషులలో స్వతంత్ర భావాల రూపకల్పనకు అడ్డుగానిలుస్తుంది. తెలిసి, తెలియక ఈ బ్యాంకింగ్ విధానాన్ననుసరించేవారు (అనేకమంది బ్యాంక్‌గుమాస్తా తరహా ఉపాధ్యాయులు తాముచేస్తున్న అమానవీకరణను కనీసం గుర్తించలేక పోవటం గమనార్హం) తాము మెదళ్లలో దట్టించే సమాచారంలో అనేక వైరుధ్యాలున్నట్లు గుర్తించరు.

అయితే ఇటువంటి వైరుధ్యాలే చివరకు నిష్క్రియాపర విద్యార్థుల్లో క్రియాత్మకతను మేలుకొల్పి వాస్తవాలను గ్రహించేందుకు కారణమైతాయి. అలా క్రియాశీలురైనవారే తమ స్వేచ్ఛకోసం ప్రయత్నిస్తారు.

"బ్యాంకింగ్ విద్యావిధానం"లో విద్యార్థుల ప్రాపంచిక దృక్పధాన్ని క్రమబద్ధీకరించటం ఉపాధ్యాయుల విధి. తాము వాస్తవజ్ఞానంగా భావించే సమాచారాన్ని డిపాజిట్ చేసి, తద్వారా విద్యార్థులను మరింత నిష్క్రియాపరులుగా, ప్రపంచంతో రాజీపడగల వారుగా రూపొందించటమే ఈ క్రమబద్ధీకరణ.

అధికసంఖ్యాకులు ఇలా ప్రపంచంతో రాజీపడినంతకాలం, అల్పసంఖ్యాకుల నియంత్రణ కొనసాగుతూనే ఉంటుంది. "బ్యాంకింగ్ విద్యావిధానం" ఈ ప్రయోజనాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తుంది. కథలు, కబుర్లతో నిండిన పాఠాలు, ప్రత్యేకించి రూపొందించిన పాఠ్యాంశాలు, జ్ఞానాన్ని లెక్కించేపద్ధతి, ఉపాధ్యాయునికి విద్యార్థికి మధ్య గల దూరం, ఉత్తీర్ణతకు అనుసరించే పద్ధతులు, --- ఇలా ఈ పద్ధతిలోని ప్రతి అంశం విద్యార్థుల ఆలోచనా పరిజ్ఞానాన్ని నాశనంచేసేది గానే ఉంటుంది.

ఇతరులపట్ల సౌహార్ద్రత భావన ఆచరణలో వైఫల్యంచెందటాన్ని ఈ విధానంలో ఉపాధ్యాయుడు గుర్తించలేడు. సౌహార్ద్రతకు వ్యక్తులమధ్య నిజమైన సమాచార వినిమయం అవసరం. ఈ విధమైన పరస్పర సమాచార వినిమయంతోనే మానవజీవితానికి అర్థం చేకూరుతుంది. విద్యార్థి ఆలోచనల్లోని నిర్దిష్టత ఆధారంగానే ఉపాధ్యాయుని ఆలోచనల్లోని నిర్దిష్టతను గుర్తించవచ్చు. ఉపాధ్యాయుడు విద్యార్థులకోసం ఆలోచించటం, లేదా తన ఆలోచనలను విద్యార్థులపై రుద్దడం చేయకూడదు. ఇక్కడ, నిర్దిష్టమైన ఆలోచనంటే వాస్తవాలనుగూర్చి ఆలోచించగల్గటం. కేవలం పరస్పర భావవినిమయం ద్వారానే ఇది సాధ్యమౌతుంది. వాస్తవరూపం దాల్చినప్పుడే భావాలకు సార్థకత చేకూరుతుంది. ఇదే నిజమైతే విద్యార్థులు ఉపాధ్యాయునికి విధేయులుగాఉండటం సాధ్యంకాదు.

"బ్యాంకింగ్ విద్యావిధానం" స్త్రీ, పురుషులను కేవలం జడ పదార్థాలుగా భావిస్తుంది. ఈ భావన అభివృద్ధికి మారుగా వినాశానికి దారితీస్తుంది. పైశాచికత్వం (necrophily) అణచివేతను, అపరిమిత ఆధిపత్యాన్ని కోరుకుంటుంది. "బ్యాంకింగ్ విద్యావిధానం" ఇలాంటిదే. ఇది యాంత్రికం,జడం, చైతన్యరహితమైనది. ఇది విద్యార్థులను కేవలం గ్రహీతలుగా మారుస్తుంది. వ్యక్తుల క్రియాశీలశక్తిని నాశనంచేసి, వారి ఆలోచనలను, చర్యలను నియంత్రించటం ద్వారా వారు ప్రపంచంతో రాజీపడేటట్లు చేస్తుంది.

ఇటువంటి "బ్యాంకింగ్ విద్యావిధానం" పరిధిలోనే స్వేచ్ఛకోసం ప్రయత్నం చేయటం సాధ్యంకాదు. మానవీయమైన ప్రక్రియద్వారా స్వేచ్ఛను అందించటం సమాచారాన్ని డిపాజిట్ చేయటంలాంటిదికాదు. స్వేచ్ఛకోసం పాటుపడే నిజమైన వ్యక్తులు, స్వేచ్ఛపేరుతో చేసే (ప్రచారాలు, నినాదాలు వంటి డిపాజిట్స్) బ్యాంకింగ్ పద్ధతులను వాటి ఆధిపత్య భావాలను వ్యతిరేకిస్తారు. వీరు వ్యక్తులను జడపదార్థాలుగా చూసే "బ్యాంకింగ్ విద్యావిధానం" కు మారుగా "క్రియాశీల విద్యావిధానం" ను అనుసరిస్తారు.

***క్రియాశీల విద్యావిధానం :***

"క్రియాశీల విద్యావిధానం" లో ఉపాధ్యాయుడు కేవలం బోధకుడుగా మిగిలిపోడు.

విద్యార్థులతో జరిపే సంభాషణల్లో తాను గ్రాహకుడుగా కూడా మారతాడు. అదేసమయంలో బోధనకూడా చేస్తాడు. బోధనాభ్యసన ప్రక్రియలో వీరందరు సంయుక్తంగా భాగస్తులౌతారు. ఈ క్రమంలో ఆధిపత్య భావాలకు అవకాశం లేదు. ఈ ప్రక్రియలో స్వేచ్ఛకే ప్రాధాన్యం వుంటుంది. ఇందులో ఒకవైపు బోధించటం మరోవైపు గ్రహించటం వుండదు. పరస్పరం భావాలు పంచుకోవటం వుంటుంది. "బ్యాంకింగ్ విద్యావిధానం" లో భావాలు ఉపాధ్యాయుని స్వంతం మాత్రమే.

"బ్యాంకింగ్ విద్యావిధానం" లో ఉపాధ్యాయుని పని రెండు స్థాయిల్లో జరుగుతుంది. ముందుగా బోధనాంశాన్ని నిర్ణయించుకొని దాన్ని రూపొందించుకోవటం మొదటిదశ కాగా, దాన్ని విద్యార్థులకు బోధించటం రెండవదశ. ఇందులో విద్యార్థులు ఆ అంశాలపట్ల అవగాహన ఏర్పరచుకోవటంకాక ఉపాధ్యాయుడు బోధించిన అంశాలను తిరిగి అప్పగించటం వుంటుంది. ఇందులో విద్యార్థుల క్రియాశీల పాత్ర ఏమీ వుండదు. ఆ బోధనాంశం ఉపాధ్యాయుడు తన స్వంత ఆస్తిగా భావించటమే దీనికి ప్రధానకారణం. సంస్కృతీ, విజ్ఞానాలను కాపాడే నెపంతో చేసే ఈ బోధనలో మనం పొందేవి నిజమైన సంస్కృతీ,విజ్ఞానాలు కానేకావు.

"క్రియాశీల విద్యావిధానం" లో ఉపాధ్యాయుని, విద్యార్థుల చర్యలను వేరు వేరుగా చూడటం వుండదు. ఉపాధ్యాయులు ఒకసారి సత్యాన్వేషకులుగా, మరోసారి బోధకులుగా ఉండరు. ఎప్పుడూ సత్యాన్వేషకులుగానే ఉంటారు. వీళ్లు వాస్తవజ్ఞానాన్ని తమసొత్తుగా భావించరు. అందువలన ఎప్పటికప్పుడు తమజ్ఞానాన్ని సరిదిద్దు కుంటూ ఉంటారు. విద్యార్థులుకేవలం గ్రహీతలుగా కాకుండా, ఉపాధ్యాయునితో సహాన్వేషకులుగా పనిచేస్తారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సమాచారాన్నందిస్తారు. దానిపై విద్యార్థుల అభిప్రాయాలను సేకరించి, దాన్ని పునర్నిర్మిస్తారు.

స్వేచ్ఛ పునాదిగాగలవిద్య, మనిషిని సమాజంనుంచి వేరుచేసిచూడదు. ప్రజలతో సంబంధం లేకుండానే ప్రపంచం మనగలుగుతుందన్న భావనని ఈ విద్య తిరస్కరిస్తుంది. మానవుడు లేని ప్రపంచపు ఉనికిని ఇది గుర్తించదు. ప్రపంచంతో సంబంధంకలవారిగా, ప్రజల ఉనికిని మాత్రం గుర్తిస్తుంది. "క్రియాశీల విద్యావిధానం" లో ప్రపంచాన్ని ఒక జడపదార్థంగా కాక చైతన్యశీలమైనదిగా గుర్తిస్తారు.

---------"బ్యాంకింగ్ విద్యావిధానం" వాస్తవాలను కల్పనలుగా చేయటంద్వారా మానవుని ఉనికికి సంబంధించిన సత్యాలను మరుగుపరుస్తుంది.

---------"క్రియాశీల విద్యావిధానం" కల్పనల్లోని వాస్తవికతను వెలికితీస్తుంది.

---------"బ్యాంకింగ్ విద్యావిధానం" సంభాషణను నిషేధిస్తుంది.

---------"క్రియాశీల విద్యావిధానం" వాస్తవాలని వెలికితీసేందుకు అనుసరించాల్సిన ఒక తప్పనిసరి ప్రక్రియగా సంభాషణను గుర్తిస్తుంది.

---------"బ్యాంకింగ్ విద్యావిధానం" విద్యార్థులను కేవలం సహాయకులుగా వ్యవహరిం యాంత్రిక వస్తువులుగా భావిస్తుంది.

---------"క్రియాశీల విద్యావిధానం" విద్యార్థులను క్రియాశీల ఆలోచనాపరులుగా తయారుచేస్తుంది.

---------"బ్యాంకింగ్ విద్యావిధానం"విద్యార్థుల సృజనాత్మకతను (పూర్తిగా నశింపచేయకపోయినా) నిరోధిస్తుంది. చైతన్యంనుంచి ప్రపంచాన్ని వేరుచేసి చూపటం ద్వారా విద్యార్థులు పూర్ణమానవులుగా రూపొందకుండా ప్రపంచంతో రాజీపడేటట్లు చేస్తుంది.

..........“క్రియాశీల విద్యావిధానం” సృజనాత్మకతపై ఆధారపడి పనిచేస్తూ, ప్రపంచంలో క్రియాశీలమార్పులకు దోహదపడే విధంగా ప్రజలను రూపొందిస్తుంది.

మొత్తంమీద “బ్యాంకింగ్ విద్యావిధానం” వ్యక్తుల చారిత్రక ప్రాధాన్యతను గుర్తించ నిరాకరిస్తే, “క్రియాశీల విద్యావిధానం” చారిత్రక ప్రాధాన్యతే వ్యక్తుల ప్రాథమిక లక్షణంగా భావిస్తుంది. “క్రియాశీల విద్యావిధానం” దోపిడీదారుల ప్రయోజనాలను కాపాడదు. కారణం దోపిడీకి గురౌతున్న వర్గాలు ప్రశ్నించటాన్ని దోపిడీవర్గం సహించదు. అందుచేత చైతన్యశీలమైన సమాజంలో మాత్రమే ఇటువంటి విద్యావిధానం సాధ్యమౌతుంది.

విద్య మానవునికి ఉత్తమ జీవితాన్నందించే ఒక ప్రధాన సాధనంగా లెక్కించబడుతున్నది. సామాజిక పరిణామక్రమానికి దోహదపడేందుకవసరమైన జ్ఞానాన్నందించేదిగా విద్య గుర్తింపుపొందింది. తమ చుట్టూవున్న పరిస్థితుల పట్ల అవగాహన పెంపొందించేట్లుగా ప్రజలను చైతన్యపరిచేందుకవసరమైన ఆలోచనలను, సమాచారాన్ని అందించే సామర్థ్యం విద్యకుంది. జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు, సమాజంలో విస్తృతమైన అవకాశాలు కల్పించేందుకు విద్య దోహదపడాలి. అందుచేత విద్యను ఒక సృజనాత్మక అనుభవంగా మాత్రమే పరిగణించకుండా, సమాజంలో చోటుచేసుకునే అభివృద్ధియొక్క ప్రతికోణంలో కూడా విద్య ప్రమేయం ఉంటుందని భావించాలి.

రెండవ ప్రపంచయుద్ధం తర్వాత, అనేక దేశాలు వలసపాలననుండి విముక్తం కావడంతో అభివృద్ధిభావనకు ప్రాధాన్యతహెచ్చింది. విద్యనుగూర్చిన ఆలోచనలు ఇందులో భాగమైనాయి. సామాజిక అభివృద్ధి ఏకీకృతఅంశంగా కాకుండా ఆధునికతకుచెందిన భావాల్లో విభిన్న రూపాలు పొందింది. ఇది విద్యారంగంలో సామాజిక వైరుధ్యాలకు, ఆధిక్యత, పరాధీనతలకు దారితీసింది. సామాజిక మార్పుకు ఉత్ప్రేరకంగా పనిచేయాల్సిన విద్యావిధానాన్ని ప్రశ్నించడం కనిపిస్తుంది. ఆధునికకాలంలో సామాజిక సమానత్వం ప్రధానలక్ష్యంకావడం, ఆ దృక్పథంనుంచి విద్యను చూడటంతో, విద్య సమాజంలో అసమానతలను పెంచుతున్నట్టుగా అర్థమవసాగింది. స్వేచ్ఛను పొందేందుకు, దోపిడీని అంతమొందించేందుకు ఉద్దేశించిందిగా విద్యను చూడటంమానివేశారు.

సామాజిక, రాజకీయ కారణంగా వచ్చే ఆర్థికమార్పు, సాంకేతిక అభివృద్ధి -- సమాజంలోని అట్టడుగువర్గాలకు చేరకపోవడంతో ధనికులు మరింత ధనికులుగాను, పేదవారు మరింత పేదవారుగాను రూపొందటానికి కారణమైతోంది.

అభివృద్ధిభావనకు చెందిన ఆధిపత్య ఆలోచనావిధానాన్ని సంపన్న దేశాలనుంచి యధాతథంగా స్వీకరించటంతో మూడవప్రపంచదేశాలు తగ్గమూల్యం చెల్లించాల్సివచ్చింది. ఈ దేశాల్లో పాశ్చాత్యదేశాల్లో మాదిరిగా -- అంతర్గత సాంస్కృతిక వ్యవస్థీకృత వత్తిడులనుంచి పారిశ్రామికీకరణ, అభివృద్ధి చోటుచేసుకోలేదు. వాస్తవానికి నయావలసవాదంనుంచి స్వదేశీ ఆర్థికవ్యవస్థపై ఇవి బలవంతంగా రుద్దబడినాయి. ఈ కారణంచేత -- సాంస్కృతిక విధేయత, సామాజిక ఆర్థిక వైరుధ్యాలు చోటుచేసుకున్నాయి. విద్యావిధానంపైన కూడా ఈ ప్రభావంపడి వలసపాలనకనుగుణమైన, స్వదేశీ అవసరాలకు సరిపడని విద్యావిధానం రూపొందింది.

‘విద్య’ -- ఒకవైపు ఆధిపత్యభావనతో నిండినదిగాను, మరోవైపు సామాజిక అణచివేత నిర్మాణ తీవ్రతను తగ్గించి స్వేచ్ఛను ప్రసాదించేదిగాను పరిగణన పొందింది.

The optimistic radical visions of Freire's Padagogy of the oppressed(1920)

and an entirely new scheme like Illich's Deschooling Society (1973) were meant to by pass the system altogether and create a new, smaller-scale millennium for human beings. (Suresh Chandra Shukla.1998:5)

ఇది కిశోర్ భారతి, ఏకలవ్య (మధ్యప్రదేశ్) వంటి సంస్థల్లో యువ శాస్త్రవేత్తలు విద్యావిధానంలో మార్పుకోసం ప్రయత్నించేందుకు దోహదపడింది. ఈ ప్రయత్నం లక్ష్యం విద్యను సమాజంతోను, దాని అభివృద్ధితోను జతపర్చటం. పుస్తకాలు, బట్టీయం, పరీక్షలు వంటి దురవస్థ నుంచి పిల్లలను కాపాడ్డం, సృజనాత్మకతను పెంచేందుకు కృషి చేయటం.

విద్య రూపం, సారం రెండూ-- అంతర్జాతీయ మార్కెట్ ఆర్థికవ్యవస్థతో ప్రభావితమైన అభివృద్ధితో ముడిపడి వున్నాయి. నేడు వేరువేరు విద్యావిధానాలు అమలులో ఉన్నాయంటే అది కేవలం ఆర్థికవ్యవస్థ అవసరాలను తృప్తిపరచే ఉద్దేశ్యంతో రూపొందించింది కావడమే.

అభివృద్ధి అణగారినవర్గాల అభ్యున్నతితో ముడిపడిలేకపోతే-- అది ప్రజలకు స్వేచ్ఛను ప్రసాదించదు. UNDP మానవాభివృద్ధి నివేదిక (1990) ప్రకారం -- ప్రపంచంలోని వివిధప్రభుత్వాలు అనుసరించే మార్కెట్‌కనుగుణమైన పథకాలు-- ఎక్కువమంది ప్రజలకు అభివృద్ధిఫలాలను అందించటంలేదు. ఇందుకు ప్రధానకారణం ఆరోగ్యం, విద్య రంగాలలో సరైన పెట్టుబడులు లేకపోవటం. విద్యావకాశాల విషయంలో దీని ప్రభావం ఎక్కువగా కన్పించి ధనిక, పేదలమధ్య వ్యత్యాసాన్ని మరింతపెంచుతోంది. భారతదేశానికి సంబంధించినంతవరకు ప్రభుత్వపాఠశాలల విషయంలో పరిమాణాత్మక పెరుగుదల కనిపించినా, గుణాత్మకంగా మెరుగుదలలేదు. అందుచేత -పబ్లిక్‌స్కూల్స్- పేరుతో నడిచే ప్రైవేట్‌పాఠశాలల్లో చదివే ఉన్నతవర్గాలపిల్లలు అధికారంలో పదవులనుపొందటం చూస్తాం. అయితే అధికసంఖ్యాకులు ఈ పాఠశాలల్లో చేరలేరు. అందుచేత వారు ప్రభుత్వపాఠశాలల్లో చేరతారు. అందువల్ల విద్య ధనికవర్గాలకుచెందినది, కులప్రాతిపదికతో ముడిపడివున్నది, అత్యధికంగా వ్యాపారాత్మకం అయినదీ అయితే అది సమాజంలోని వైరుధ్యాలను పెంచిపోషించేదిగా మాత్రమే తయారౌతుంది.

ఇటువంటి విభిన్న సమస్యలనేపథ్యంలో విద్యావ్యవస్థ గురించిన సమగ్రమైన చర్చ తెలుగు సాహిత్యంలో చోటుచేసుకుంది. అయితే విద్యావ్యవస్థలోని విభిన్న సమస్యలను విశ్లేషించటంతో పాటుగా అంత విస్తృతంగా కాకపోయినా కొంతమేరకు ప్రత్యామ్నాయాలనుకూడా ఈ సాహిత్యం సూచించటం గమనార్హం. ఇందులో పాక్షికంగా విద్యావిధానంలోని కొన్ని సమస్యలకు ప్రత్యామ్నాయాలను సూచించిన రచనలు కొన్ని ఉంటే, మరికొన్ని విద్యావ్యవస్థకు సంపూర్ణమైన ప్రత్యామ్నాయాన్ని సూచించాయి. ప్రత్యామ్నాయ విద్య రెండు రకాలుగా వుండవచ్చు. ప్రస్తుత విద్యావిధానాన్ని పూర్తిగా తిరస్కరిస్తూ నూతన విధాన రూపకల్పన ఒకటి, కాగా మరొకటి కేవలం బోధన పద్ధతుల్లో మాత్రం మార్పు చేసేందుకు ప్రయత్నించటం.

A School is a place through which you have to pass
before entering life, but where the teaching proper
does not prepare you for life. -------Ernst Dimnet

Nothing in education is so astonishing as
the amount of ignorance it accumulates
in the form of inert facts -------Henry Adams

Education consists mainly in
what we have unlearned -------Mark Twain

We are faced with the paradoxical fact that
education has become one of the chief obstacles
to intelligence and freedom of thought. ------Bertrand Russell

My schooling not only failed to teach me what it professed
to be teaching, but prevented me from being educated
to an extent which infuriates me when I think of all
I might have learnt at home by myself. ------George Bernard Shaw

*"విద్య అంటే ఆనందించే శక్తిని వృద్ధిచెయ్యటం,*
*సౌందర్యాలకు కళ్లు తెరవడం,*
*బాధలనుంచి, కష్టాలనుంచి తప్పించుకునే నేర్పునివ్వడం.*
*ఇతరుల స్వేచ్ఛలను అణగించే స్వార్థపరత్వం నుంచి,*
*అంతా తనకేకావాలని దాముకునే కొపీనం నుంచి,*
*భయాలనుంచి తప్పించగలగటం."*

--------- *(చలం.1987: 184)*

===============================

తెలుగుసాహిత్యం-- ప్రత్యామ్నాయ విద్య

ప్రముఖ విద్యావేత్తలు వెలువర్చిన పై అభిప్రాయాలు ప్రస్తుత విద్యావిధాన స్థితిగతులను, ప్రత్యామ్నాయ విద్యావిధానాన్ని రూపొందించుకోవాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తాయి. ప్రత్యామ్నాయ విద్యావిధానాన్ని గురించి చర్చించేముందుగా ప్రస్తుత విద్యావిధానంలోని వివిధ సమస్యలను నాటికి తెలుగు సాహిత్యం సూచించిన పరిష్కారాలను గుర్తించాల్సి ఉంది. అలా విద్యావిధానంలోని ప్రధానమైన లోపాలను, వాటి విషయంలో తెలుగుసాహిత్యం స్పందనలను గుర్తించినట్లయితే ప్రత్యామ్నాయ విద్యావిధానంపట్ల ఒక స్పష్టమైన అవగాహనకు వీలుకలుగుతుంది.

విద్యావిధానంలో సాహిత్యం గుర్తించిన ప్రధాన సమస్యలివి.

- ...... నిర్బంధపూరిత అధ్యయనం
- ...... బోధనలో అశాస్త్రీయత
- ...... అనాసక్తికర వాతావరణం
- ...... విద్యలో విధానపరమైన ఘర్షణ

*నిర్బంధపూరిత అధ్యయనం:*

పిల్లలను చదువు పేరుతో నిర్బంధించటం వ్యక్తి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను కాలరాయటమే కాక వ్యక్తిలోని అంతర్గతశక్తులను నిర్వీర్యంకావించటమేనన్నది వాస్తవం. ఈ విధమైన నిర్బంధపూరితమైన అధ్యయనాన్ని ప్రముఖ శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ తీవ్రంగా వ్యతిరేకించారు.

"To me the worst thing seems to be for a school principally to work with methods of fear, force, and artificial authority. Such treatment destroys the sound sentiments, the sincerity, and the self-confidence of the pupil. It produces the submisive subject." (Albert Einstein.1954: 61)

ఇదే అంశాన్ని ప్రధానంగా చేసుకొని పిల్లల అభిరుచులకు, ఆకాంక్షలకు విరుద్ధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిని చదువు పేరుతో హింసించటాన్ని అనేక రచనలు విస్తృతంగా, మనోవిశ్లేషణాత్మకంగా చర్చించాయి. వీటన్నింటిలో అటువంటి విద్యావిధానంపట్ల నిరసనలు వినిపిస్తాయి.

విద్యని నాలుగు గోడల మధ్య బంధించి, కన్నవారికీ పిల్లలకీ మధ్య, గురువులకీ శిష్యులకీ మధ్య వుండవలసిన సామరస్యాన్నీ, మమకారాల్నీ, వాత్సల్యాలనీ మలినంచేసేసి, కఠినం చేసేసిన విద్యావిధానాన్ని సూటిగా ప్రశ్నించిన రచన చ(ఛ)దువు. విద్యావిధానం నచ్చక పాఠశాలలను వెలివేసి తనకైతాను చదువుకున్న రవీంద్రనాథ్ ఠాగూర్‌ను ఇందులో స్మరిస్తూ, ఈ విద్యావిధానం కారణంగా దేశం ఎంతమంది ఠాగూర్‌లను, ఎన్ని నోబుల్ బహుమతులను పోగొట్టుకుంటున్నదోనన్న అనుమానాన్ని వ్యక్తంచేయటం చుస్తాం. ఇందుకు విద్యార్థుల అభిరుచులకు అనుగుణమైన రీతిలో వారిని తీర్చిదిద్దాల్సిన అవసరాన్నికూడా చర్చించింది.

తను పుట్టింది చదువుకోడం కోసమేనా! కిలకిలమంటూ ఎగిరేపక్షుల్ని చూస్తే ఎందుకో తెలియదు శీనూకి ఏడుపు వచ్చేసేది చిన్నప్పటినుంచీ తను ఎగరలేదని తెలుసు! కానీ, కేవలం గాలిపీల్చటంకోసం ఆరుబయట కెడదామనీ, కేవలం కేరింతలు కొట్టడానికి కాస్త సమయం కావాలనీ, ఆడుకుంటూ, స్వేచ్ఛగా నవ్వుకుంటూ వుండామనీ, ఇష్టం వచ్చినప్పుడు చదువూ, ఇష్టం వచ్చినప్పుడు ఆటా ఆడదామనీ, అతని కోరిక.

కేవలం డాక్టర్లూ, ఇంజనీర్లూ, కలెక్టర్లూ కావాలనే కాకుండా, ఓ గవాస్కరో, రవిశంకరో, ఫుట్‌బాల్ ఆటగాడో, పెయింటరో, టీ.వీ ఆర్టిస్టో, సినిమా యాక్టరో, లేక పాన్ దుకాణంతో మొదలెట్టినా దాన్ని ఫైవ్ స్టార్ హోటల్‌గా మార్చగలిగే సామర్థ్యాలున్న బిజినెస్ మాన్ అవగలరేమో!

క్లాసులో ఫస్టు రాకపోతే నువ్వు వుత్త వెధవ్వి, శుద్ధ దండగ మనిషివి, ఎందుకూ పనికిరానివాడివి. గూండావి అవి ఎత్తిపొడిచి నిజంగానే ఎందుకూ పనికిరాని వాడిగానే చేసే బదులు, వారి టాలెంట్స్‌ని రాణలైజ్ చేస్తే! .........స్కూలు పిల్లల్ని కూడా తన స్వంత పిల్లలుగా ట్రీట్‌చేస్తాం అని గొప్పలు చెప్పుకునే ఆమె శిక్ష వేస్తోందే కానీ, అతనిలో మార్పు వచ్చేట్లు, అతనిలో పశ్చాత్తాపం కలిగేట్లు లాలించి చెప్పటంలేదు. కాపీ కొట్టినవాడు చాలా గట్టివాడనీ, మెంటల్‌గా స్ట్రాంగ్ అనీ యాలేం లేదు. ......

(విజయలక్ష్మీ మురళీధర్, చక్రభ్రమణం, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 5-10-89, పే 97-106)

సృజనాత్మకతకు చోటులేని బోధనావిధానం, శృతిమించిన అధ్యయనం ఫలితంగా సహజమైన అనుభూతులకు దూరమౌతున్న బాల్యాన్ని చిత్రించిన రచనలు ఇంకా అనేకం కనిపిస్తాయి. అవి మామిడిచెట్టు మళ్ళీ పూసింది,రేపటిపువ్వు, అనగా అనగా, శేషప్రశ్న, చదువు, ప్లాస్టిక్ పువ్వులు, నాబాల్యం ఏమైంది? వంటివి

అయితే ఈ నిర్బంధపూరిత అధ్యయనం పిల్లలను మానసికంగా, శారీరకంగా ఎలా చిత్రవధచేస్తుందో ఇంకా తల్లిదండ్రులపట్ల ద్వేషాన్ని పెంచి పిల్లలను హంతకులుగా మార్చేపరిస్థితులకు దోహదపడతుందో బహుముఖంగా 'ఇంటికొక హంతకుడు' చిత్రించింది. దీనంతటికీ కుటిలపూరితమైన విద్యావిధానమే కారణమని ఈ రచన భావించింది.

"ఇది చాలా బాధపడవలసిన విషయమే. కాదనను. కానీ, దీనికి బాధ్యులెవరని కూడా ఆలోచించాలి. ఇవాళ - మీరే కాదు ప్రతి విద్యార్థి తండ్రీ స్థాయీ భేదంతో యిలాగే దోషిగా నిలబడుతున్నారు. కొడుకు అంతరంగపు పంచాయితీలో. దీనికి నిజమైన బాధ్యత విద్యావ్యవస్థదే. పిల్లకొంచెం కూత ఘనము అన్నట్లు క్లాసు చిన్నదీ పుస్తకాలెక్కువా. ఆ పుస్తకాల సంచీ బరువు మోయలేకపోతే వెన్ను వొంగిపోతుంది. రేపు బాలుడికి గూనిరావొచ్చు. వెన్నెముక ఉండీ లేనట్లయిపోవొచ్చు. వెన్నెముకలేనివాడయ్యే సంతానం పొందే అర్హతను కోల్పోయినా కోల్పోవచ్చు. అతి చిన్నతనంలోనే ఆకాశాన్ని, ఆకుపచ్చని చెట్లనీ చూడనివ్వకుండా క్లాసురూము గోడలమధ్య బంధింపబడుతూ...ఆ చిన్ని కనులను కంప్యూటర్ స్క్రీన్ మెల్లమెల్లగా కలుషితం చేస్తూంటే...తొందరలోనే కళ్ళకి అద్దాలు రావొచ్చు. అలక్ష్యంగా అంధత్వమొచ్చినా ఆశ్చర్యపడనక్కరలేదు. బడి తొందరలో ఆదరా బాదరా తిండి, తినగానే పరుగు. దీనివల్ల గ్యాస్ట్రిక్, అసిడిటీ మొదలయిన ప్రాబ్లమ్స్. హోంవర్క్ చేయగలనో లేనో...రాంక్ వస్తుందో రాదో...శిక్షా భయం...వీటివల్ల యాంగ్జయిటీ న్యూరోసిస్.... బి.పి. వంటి మానసిక రుగ్మతలు. ఇలాటివి, ఇవీ మన విద్యావిధాన పరిణామాలు. పిల్లల బాల్యాన్ని దోచుకుంటున్న దోపిడీ దొంగలలో పెద్ద ఈ కుటిల విద్యావిధానమే.............. ఎప్పుడూ పుస్తకాలూ, ఆల్ వర్క్ అండ్ నో ప్లే.... వల్ల అతను మానవ సంబంధాలు, సున్నితమయిన మనోభావాలు, సెంటిమెంట్లు కోల్పోతూ, ప్రకృతిపట్ల అంధుడూ, సాటిమనిషి పట్ల యంత్రసమానుడూ ఔతాడు. పుస్తకాలూ కంప్యూటర్లూ దాటి బాహ్య ప్రపంచాన్ని సరిగా చూడనూలేడు, అర్థంచేసుకోనూ లేడు. మన విద్యావ్యవస్థా, సమాజమూ, నేటి బాలుని రేపటి యంత్రాలుగా మారుస్తున్నాయి." ..................

చదువనేది దుర్భర శిక్షగా మారుతూండబట్టే మీ అబ్బాయి మీమీద కక్ష పెంచుకుని మిమ్మల్ని చంపితే తప్ప తనకి ముక్తీ సుఖమూ శాంతి ఉండదని మీమీద కత్తులు దూశాడు. మీనుంచీ... తద్వారా మీరు వేస్తున్న విద్యాశిక్ష నుంచీ బయటపడితే హాయిగా ఉండగలనని అతని ఆశ. మీ అబ్బాయింది పరాకాష్ఠకు చేరిన కక్ష కనుక బయటపడిపోయాడు. కానీ...యిప్పుడు చాలామంది విద్యార్థుల మానసిక పరిస్థితి యిదే. తల్లిదండ్రులనీ, టీచర్లనీ చంపెయ్యాలన్నంత కోపమూ కసీ ఆలోచిత గుండెలలో.. మన విద్యావిధానం - ఇంటికో హంతకుణ్ణి తయారుచేస్తోంది మరి. మీరూ నేనూ ఏంచెయ్యగలం?" (ఇచ్ఛాపురపు రామచంద్రం, ఇంటికొక హంతకుడు, కథాసంపుటి: దుప్పూరి శారదాంబ పోటీ కథలు, పే 94-109)

## బోధనలో అశాస్త్రీయత:

బోధనలో శాస్త్రీయత లోపించటం విద్యావిధానంలో చోటుచేసుకున్న మరో విషపరిణామం. నేటి పాఠశాల విద్యా విధానం పిల్లల సృజనాత్మకతకు, స్వేచ్ఛకు వారి ఇష్టాలకు తగు ప్రాధాన్యం ఇవ్వటంలేదన్నది అనేకమంది అభిప్రాయం. వ్యక్తీకరణ శక్తిని అణచివేసి పిల్లలను రిలేకేంద్రాలుగా మారుస్తున్నదన్నది వారిభావన. ఈ అభిప్రాయాన్ని ప్రముఖంగా చర్చించిన రచన 'చదువు' అందువల్లే తనకు తాను తెలుసుకునే పరిస్థితులు పిల్లలకుండాలని, అప్పుడే ఆసక్తి, అభిరుచులతో విద్యావిధానం సహజసిద్ధంగా ఉంటుందన్న అభిప్రాయం ఇందులో వ్యక్తమైంది.

"నేను అలా అనడంలేదు. ఈ వ్యవస్థ ప్రకారం పాఠంలో ఏవుందో అదే పిల్లలు వ్యక్తీకరించాలి. పాఠం చదివేక పిల్లలకు కలిగే కొత్తభావాలను వ్యక్తీకరించే అవకాశం ఈ విద్యావ్యవస్థలో లేదు. ఇదొకటి. రెండోది. కొందరికి విషయం అర్థమవుతుంది కాని వ్యక్తీకరించలేరు. మూడోది కొందరు పాఠాల్లోని కొన్ని విషయాల్ని హృదయంలోనే దాచుకోవాలనుకుంటారు. అసలు సృజనాత్మకతను, వ్యక్తీకరణ శక్తిని కక్కు, కక్కు అని అనివార్యం చేయడమే సరైందికాదు.............నీవు చెప్పిందాన్ని పిల్లలు తిరిగి అప్పజెప్పాలని కోరడం సృజనాత్మకత ఎలా అవుతుంది? నీవు, నీ పాఠానికనుగుణంగా పిల్లల్ని మరబొమ్మలుగా

దుఃఖతున్నావు. సరిగ్గా చెప్పాలంటే పాఠాన్ని అప్పగించాలి అనేంత నిర్బంధం మరొకటి లేదు. ఏమంటే పాఠంలోని భావాలని తన భావాలుగా 'అంగీకరిస్తే' తప్ప పిల్లలు సరిగా వ్యక్తీకరించ లేరు. పిల్లల భావాలకు విరుద్ధంగా నీ భావాలు లేదా నీ పాఠం ద్వారా చెప్పే భావాలు వారిపై నిర్బంధ భావాలుగా రుద్దబడటంలేదా?"............ (బి.ఎస్.రాములు, చదువు, బి.ఎస్.రాములు కథలు, పే 46-57)

వ్యక్తీకరించ లేకపోవటం అనే ఈ లక్షణం ప్రపంచప్రసిద్ధి పొందిన అనేకమంది మేధావుల్లో వుండటం గమనార్హం. Dyslexia గా పేర్కొనే ఈ లక్షణం అల్బర్ట్ఐన్‌స్టీన్, విన్‌స్టన్‌చర్చిల్, వాల్ట్ డిస్నీ, బెంజిమిన్ ఫ్రాంక్లిన్, ప్రిన్స్‌ఛార్లెస్, మొజార్ట్, టోనీబ్లెయిర్, అగాథక్రిస్టీ, బిల్‌గేట్స్ వంటి ప్రముఖుల్లో వుంది. అయితే ఈ లక్షణం కలిగిన వారు ప్రత్యేకమైన ఆలోచనాధోరణి కలిగివుంటారన్నది గుర్తించాల్సిన అంశం.

A dyslexic has special talents and if the talents are recognised, praised and encouraged, he will excel in his field of interest--not in spite of the fact that he/she is dyslexic but because he is dyslexic. The unusual connections in tha brain of dyslexics make it difficult for them to read, write and arithmetic. But they have special gifts, are musically inclined, creative, intuitive, artistic, have spatial skills, mechanical ability, Mathematical conceptualisation skills and a vivid imagination. (Renu Malaviya, Thinking Differently, Quest, The Hindu, 13-4-'02)

ఈ రకమైన ఆలోచనలను వ్యక్తంచేస్తూ

పైకి రావటమంటే ఏమిటో నాకు తెలియదు. కాని నాకు అంతా తెలుసుకోవాలని వుంటుంది. నాకు ఈ ప్రపంచం చాలా వింతగా, తమాషాగా, ఆసక్తికరంగా కనిపిస్తుంది. నిన్నచేసిన చిత్తనంలోంచి ఈరోజు మొక్కవస్తే నాకు చాలా ఆశ్చర్యంగా వుంటుంది...... చదువుకొని అన్నీ తెలుసుకోవాలన్న ఆసక్తి ఉండికానీ, నేను పాఠాలు అప్పజెప్పే టేప్‌రికార్డర్‌గా, ప్రశ్నలకు సరైన సమాధానాలు అచ్చు పెకళ్లోదించే ఫొటోకాపీయంత్రా ఉండలేను. చదువు పేరుతో నాచిన్నచిన్న కోరికలూ, ఆనందాలూ అన్నింటినీ నలిపేసి, నా పసితనం నాకు దూరంచేసి నన్నొక మార్కులు స్కోరుచేసే కంప్యూటర్‌లా మార్చెయ్యకండి. (తోలేటి జగన్మోహనరావు, విద్యాధనం, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 31-10-90, పే 26-29)

ఇంకా ఇటువంటి అశాస్త్రీయ విద్యావిధానాన్ని ప్రశ్నిస్తూ వచ్చిన రచనలు సంధ్య అంచున, పలకా-- బలపం, ది బిగినింగ్ ఆఫ్ ది ఎండ్, అందరూ నిద్రపోతున్నారు.

### *అనాసక్తికరమైన వాతావరణం*

నేటి విద్యావిధానంలో మరో ప్రధాన సమస్య పాఠశాల వాతావరణం ఆసక్తిదాయకమైనది కాకపోవటం. బడిని పిల్లలమనోవికాసానికి దోహదపడే ఒక ఆహ్లాదకరమైన ప్రదేశంగా భావించకుండా, పిల్లలకు దాన్ని బూచిగా చూపి పిల్లలదృష్టిలో అది ఒక కంటకప్రాయమైన ప్రదేశంగా గుర్తింపజేస్తున్న ప్రవృత్తులను 'శిక్ష' చిత్రించింది.

"బాబాయ్...నేనింక పగలగొట్టను. నన్ను బళ్లోకి పంపొద్దని చెప్పు-- నేను...నేను...అమ్మ చెప్పినట్టు మాట వింటా..." ముక్కు నా పైజామాకు బుజ్జి రుద్దుతూ మళ్ళీ బిగ్గరగా బాకా ఎత్తాడు.

"ఇంకేం పతినగారూ....మీరు చెప్పిన మాటల్లా వింటానంటున్నాడుగా..... ఈ సారికి వదిలిపెట్టండి... మళ్ళీ ఏదైనా గొడవ చేస్తే నాతో చెప్పండి... కాళ్ళూ, చేతులూ కట్టి బళ్ళో పడవేసి వస్తా.... ఏరా.... సరేనా?" గద్దించాను--చివరలో సమస్యా పరిష్కారం సూచిస్తూ. (లాడిగిరి పోతరాజు, శిక్ష, భారతి, సెప్టెంబరు'66, పే 19-28)

పైవిధమైన భావన సమాజంలో ఏర్పడటానికి అనాసక్తికరమైన తరగతిగదులు, బోధనా విధానం లాంటివెన్నో కారణాలు. వీటిని చిత్రించిన రచనలు నీబళ్ళో చదవను, మార్పురావాలి.

అందరూ ఐదేళ్ళు నిండని పసిపాపలు. ఒక్క కిటికీమైనా లేని ఆ ఇరుకు గదిలో భారత భాగ్యవిధాతలు చెమటలు

కక్కుతున్నారు. ముగ్గురు పిల్లలు బాగా చిన్నవాళ్ళు - ఒక గోడవారకు చేరబడి నిద్రపోతున్నారు. ఇంకా కొందరు అక్షరాలు దిద్దుతున్నారు. వాళ్ళ ముఖాలు వాడిపోయున్నాయి. మాష్టారుగారి కుర్చీ చుట్టూ సుమారు ఒక పదిహేనుమంది పిల్లలు మూగి 'నాకు రాయండి - నాకు రాయండి' 'నాది చూడండి - నాది చూడండి' అంటూ కుమ్ముకుంటున్నారు. ఆ సందర్భంలో మాష్టారు అక్కడకు వచ్చిన వాళ్ళను గుర్తించడానికి కొంచెంసేపు పట్టింది. ..........

'నాన్నా! ఆ తోటలెంత బాగున్నాయో! అక్కడకెళ్దామా!' అన్నాడు ఉత్సాహంగా. ఆ సమయంలో అతని ముఖంలో ఎంతో కుతూహలం. ఎన్నో ప్రశ్నలు. ఆ కుతూహలాన్ని పెంపొందించి ఆ ప్రశ్నపరంపరకు సమాధానం చెప్పేబడి పిల్లలందరికీ ఎప్పటికైనా దొరుకుతుందా! (యు.ఎ.నరసింహామూర్తి, నీ బళ్ళో చదవను, భారతి, జులై 1974, పే 14-17)

ఒక్కో తరగతి గదిలో అంతంత మంది పిల్లలు. చదువుకునే మిషతో స్కూలుకు వస్తున్నారు వారందరూ! వారికి చదువు నేర్పేందుకే తామూ ఉద్యోగాలు చేస్తున్నారు. పాపం! వాళ్ళకు చదువు రావడంలేదు. తమకు చదువు చెప్పే అవకాశం లేదు. తరగతిగదిలో అంతమంది పిల్లల్ని నిశ్శబ్దంగా ఉంచేందుకే అయ్యవారి శక్తియుక్తులు ఖర్చయిపోతాయి. ఇక చదువేం చెబుతాడు! చెప్పినా ఎంతమంది నేర్చుకుంటున్నారో ఎలా తెలుసుకోగలుగుతాడు! పైగా భారత, భాగవతాలంత సైజులో పాఠ్యపుస్తకాలు! ఒక విషయం చెప్పిన తరువాత దాన్ని విద్యార్థులు అర్థంచేసుకున్నారో, లేదో తెలుసుకునే వీలులేదు. రోజూ ముందుకు పోతూ ఉండాల్సిందే వెనక్కు చూడకుండా! (ద్వారకా, పూర్ణిమరావాలి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 26-6-'85, పే 75-78)

విద్యావిధానంలో వైఫల్యాలకి వెనుకవున్న విస్తృతమైన కారణాలను చర్చించిన రచన 'అమ్మా నేను స్కూలుకెళ్ళనే'.

క్లాసుకి తెభైమంది పిల్లలుంటే టీచర్లు మాత్రం ఎంతవరకు శ్రద్ధవహించగలరు? తమకున్న ఒకరిద్దరు పిల్లల్ని చూసుకోవటమే తమకి కష్టంగా ఉంటే అరవై మందిపైన పిల్లల్ని వాళ్ళెలా గమనించగలరు. దానికితోడు పిల్లలకి మించిన సిలబస్. పుస్తకాలలో విజ్ఞానం ఉంటే చాలదుకదా! పిల్లలు దానిని జీర్ణంచేసుకోవాలి గదా. పిల్లలు స్కూలంటే భయపడుతున్నారంటే దానికి బాధ్యులు ఎవరు? దీనికి కారణం ఏమిటి? విద్యావిధానంలోని లోపం ఒక కారణమైతే తమలాటి వేలంవెర్రి తల్లిదండ్రులు మరోవిధంగా కారణం. అంతాకలసి పిల్లల చిన్నారి మనసుల్ని చిత్రవధ చేసేస్తున్నారు.

ఈ పరుగుల యుగంలో పోటీ తప్పటంలేదు. ఎవరు ఎంత ముందు ఉంటారా అన్న ఆలోచన తప్ప ఇతర విషయాలపై ఆసక్తి ఉండటం లేదు. అనురాగాలు, ఆప్యాయతలు చూపించే తీరిక ఎవరికీ ఉండటంలేదు. అంతా యాంత్రికం. కన్నందుకు పిల్లల్ని ఓ మంచి పేరున్న స్కూల్లో (హైలో) చేర్పించేస్తే బాధ్యత తీరిపోతుందనుకుంటే ఎలా? ఇప్పుడు ఇంటా బయటా బాధ్యతలతో అలసిన ఇల్లాలు పిల్లల చదువులేం పట్టించుకోగలరు? దానికితోడు చదువులూ అలాగే ఏడుస్తున్నాయి. ముందు పిల్లల మనసులో చదువంటే భయంపోగొట్టాలి. (యం.నిర్మల, "అమ్మా నేను స్కూలుకెళ్ళనే", తెలుగు విద్యార్థి, జులై '97, పే 31-32)

వెలేసినట్టుగా వున్న మారుమూల గ్రామాల్నుంచి వచ్చిన పిల్లలు వాళ్ళు. చెట్లేగాని, గదులు లేని స్కూల్ వాళ్ళది. హ్రస్వదృష్టిగల అధికారులకు దూరంగా వున్న స్కూల్ అవసరాలు కనిపించవు. అందుకే అధికారుల దృష్టినుంచి వెలివేయబడ్డ గ్రామాల్లో వున్న స్కూళ్ళ అవసరాలు, ఆ స్కూళ్ళల్లో పనిచేసే టీచర్ల అవసరాలు, టీచర్ల పరిస్థితి, స్కూళ్ళ పరిస్థితి అలావుంటే పిల్లల పరిస్థితి ఎలావుంది?

పట్టణాలలో చదువు కొనలేని వాళ్ళు గ్రామాలలో వున్న స్కూళ్ళల్లో వుంటారు. దరిద్రరేఖ దిగువభాగాన ఉన్న కుటుంబాలనుంచి వచ్చిన వాళ్ళు గ్రామాలలో వున్న ఈ విద్యార్థులు. వీళ్ళ నిత్యజీవితాలలో ఎదురయ్యే ఏ సమస్యకు సమాధానం పుస్తకాలలో కనిపించదు. స్వతంత్రంగా ఆలోచించే స్వభావాన్ని మొగ్గలోనే తుంచేసే స్వభావంగల ఈ చదువు పట్ల వీళ్ళు దృష్టిని కేంద్రీకరించేటట్లు అక్కడి స్కూళ్ళుగాని, టీచర్లుగాని చేయగలుగుతారా?

గ్రామాలు, స్కూళ్ళు, టీచర్లు, పిల్లలు, చదువు ఇవన్నీ ఎటువంటి వాతావరణంలో ఉన్నాయి? పాములేగాని నిచ్చెనలులేని వైకుంఠపాళిలో వున్నాయి బ్యాంక్‌లో పనిచేసే అటెండర్‌లకు, పోస్టాఫీసులలో పనిచేసే నాలుగవ తరగతి ఉద్యోగులకు, టెలిఫోన్ ఎక్స్ఛేంజిలో పనిచేసే లైన్‌మెన్‌లకు 10వ తరగతి పుస్తకాలలోవున్న ఏ విషయం వాళ్ళ వృత్తికి తోడ్పడుతుంది? అప్పుకోసం దరఖాస్తు పెట్టుకోవడానికి, 10వ తరగతి పాస్ కావడానికి ఉన్న సంబంధం ఏమిటి?

ఇటువంటి అస్తవ్యస్తమైన వాతావరణాన్ని కల్పించిన ప్రభుత్వం చేస్తున్న తప్పుతో పోల్చితే, పరీక్షహాల్‌లో పిల్లలు చేసిన తప్పెంత? పిల్లలు చిన్న కాగితంపెట్టి రాస్తుంటే చూసీ చూడనట్టుగా వున్న నాతప్పెంత? ఆలోచించాను. రాస్తున్నాను. ఎవరైనా తప్పుచేస్తే ఆ తప్పు కేవలం వారిది మాత్రమే కాదు. వారిని తప్పుదారిన నడిపించిన వాతావరణానిది. వాతావరణాన్ని సరిచేయని బాధ్యులది. అంటే ప్రభుత్వానిది. అందుకే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాను......

కాపీ రాస్తున్న పిల్లల్ని డిబార్ చేయడంలో చూపుతున్న శ్రద్ధ, పిల్లలు చదువుకోవడానికి వీలైన వాతావరణాన్ని కల్పించడంలో ఎందుకు చూపడంలేదు? అని ' నిరాయుధులైన అభిమన్యులపై ఆయుధాలు సంధించడంలో గల న్యాయం ఏంటో తెలియజేయమని' ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ నేనొక 'షోకాజ్ నోటీసు జారీ చేస్తున్నాను. (శేషు, షోకాజ్, శేషవాక్యం:శేషురచనలు, పే 77-83)

శారీరక హింసను మించిన మానసికహింసకుగురిచేస్తున్న పాఠశాలవాతావరణ పరిస్థితులను గర్హిస్తూ వచ్చిన రచన 'ఇది ఆకలిరాజ్యం' ఇందులో పాఠశాలలో జరిగే మానసికహింసను భరించలేక తిరిగి అలవాటైన శారీరక శ్రమే మేలని భావించి పాఠశాలను విడిచిన బాల్యం ఇందులో ప్రధానకథాంశం.

"ఇక బడిలో చూపులతో, మాటలతో, అవమానాలతో, ఎత్తిపొడుపులతో గుండెల్లోకి మెత్తని బాకులుదించే మనసెరుగని ఉపాధ్యాయులు, మమతలెరుగని మాష్టర్లు, నలిగిన చిరిగిన బట్టల్ని కించపరిచే ఖరీదైనబట్టల పిల్లలు, మళ్లీ వంటపేరుతో శరీరశ్రమ కొల్లగొడుతున్న 'వింత వాతావరణం'"

ఆకలి కడుపుల మీద అర్థమైన జోకులు చెప్పుకుని నవ్వుకుంటూ అన్నానికి బదులు హాలాహలాన్నందిస్తున్న కుళ్ళు వాతావరణం. ......

దుమ్ము.....దుమ్ము.....దుమ్ము.......

పశువులు, అప్పులు, పేడ, కాల్వగట్లు, బీడునేలలు, చింతలనీడలు, జీవితం మళ్లీ గాడిలో పడింది. శారీరక హింసను మించిన మానసిక హింసాప్రసక్తి లేదిప్పుడు. శ్రమ....శ్రమ.....శ్రమ.... అయినా అలవాటయిన శ్రమే. ఒకరోజు చింతచెట్టు నీడనచేరి రామిగాడన్నాడు: "ఒరోరే! మనాలోళ్ళు సదూకోవాలంటే ఒంటిపూట మాత్తరమే తిండెడితే కుదర్దురా. మూడు పూటలా పెట్టాల్సిందేరా. యేటంటవురా సిన్నాగా " సిన్నయ్య అవునని తలూపాడు. (మధురీ జీ. ఇది ఆకలిరాజ్యం, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 1-2-84, పే 46-53)

### విద్యలో విధానపరమైన ఘర్షణ:

ఆధునిక విద్యకు, సాంప్రదాయిక వృత్తివిద్యలకు నిరంతరం ఘర్షణ తప్పనిసరైతున్నది. ఇందుకు ప్రధానకారణం చదువు మనిషిజీవితావసరాలను తీర్చేదికాకపోవటం ఒకవైపు, మరోవైపు వృత్తివిద్యలు ఆదరణకోల్పోవటం ఫలితంగా ఈ రెండింటిలో దేన్ని ఎంచుకోవాలో తేల్చుకోలేని సందిగ్ధత. వీటిని చిత్రించిన రచనలు తృప్తి, బెదురు, యుద్ధం, మాధవసేవ, ఎడారి.

"చదువుకోమనంది-తప్పులేదు. ఈ కళ కూడా చేతిలో వుంటే లాభమేకానీ నష్టంలేదుకదా. . ." అంటూ అమ్మ నచ్చచెప్పడానికి ప్రయత్నించేది . ."

"కన్నా-ఎందుకురా ఈ ఉద్యోగాలు. బొమ్మలు చెయ్యడంలో ఇంతకంటే సంపాదించుకోవచ్చు. హాయిగా ఇంటిపట్టున మా కళ్ళముందే వుండొచ్చు. ఉన్న ఒక్కడివీ ఉద్యోగం పేరున మాకుదూరం కావటం ఎందుకు?" అంది తల్లి. (పాలకూర సీతాలత, తృప్తి, యువ, ఆగష్టు '86, పే 90-99)

"అందుకనే బాబూ ఆడు బయమున్నా దప్పుకొట్టటం నేర్పుదామనుకున్నా. చెప్పులుకుట్టటం నేర్పుదామనుకున్నా. ఏదో పని చేతిలో వుంటే ఎక్కడో అక్కడ గంజినీళ్ళైనా లాగుతాడు." అన్నాడు గంగన్న తిరిగి. ఆనందరావుకి ఏమంటానికీ తోచలేదు. గంగన్నకి ఎలా నచ్చచెప్పాలో తెలియలేదు. ఇంకా ఎంతమంది తల్లితండ్రులకి పిల్లల చదువుల విషయంలో ఇలాంటి బెదురుందో అనిపించింది. ఓదార్పుగా గంగన్నకి ఏదేవో చెప్పదామనుకున్నాడు. కానీ గొంతుపెగల్లేదు. చదువుని వుద్యోగం కోసం. బతుకుతెరువుకోసమే కాకుండా విజ్ఞాన సాధనంగా జీవితంలో చాలా సమస్యల్ని ఎదుర్కొనే ఆలోచనకి అవసరమైందానిగా గంగన్న ఆలోచించలేడని ఆనందరావుకి తెలుసు. ............ప్రోగ్రెస్ అవుతున్న సొసైటీలో నమ్మకం పెరగాలి...... ధైర్యం పెరగాలి. కానీ బెదురు అనుమానం పెరుగుతున్నాయని పించేటప్పటికి గంగన్నకన్నా ఎక్కువగా కుంగిపోయాడు ఆనందరావు. (వి.రాజారామమోహనరావు, బెదురు, జ్యోతి, ఫిబ్రవరి '77, పే 65-75)

ప్రకాశం వేదపాఠశాలకెళ్ళి రెండు రోజులయింది. చెరువుగట్టు దగ్గరా, కాలవగట్టు దగ్గరా పశువుల్ని మేపే కుర్రాళ్ళతో సాయంత్రంవరకు ఆడుకొని ఇంటికి వచ్చేవాడు. తల్లీ తండ్రీ ప్రకాశం వేదపాఠశాలకు వెళ్ళివస్తున్నాడనే అనుకున్నారు. ప్రకాశం మెయిన్‌రోడ్డు మీద హడావిడిగా తిరుగుతున్న కార్లనూ, రిక్షాలనూ, జనాన్నీ చూస్తూ కూచున్నాడు. తన ఈడు పిల్లలే శుభ్రమైన నిక్కర్లూ, చొక్కాలూ, బెల్‌బాటమ్ పాంట్లూ వేసుకుని ఉత్సాహంగా పుస్తకాలు పట్టుకుని వెళ్తుండటం చూశాడు. అతని మెదడులో మళ్ళీ ఆలోచనల పువ్వులు వికసించాయి.(కె.వి.యస్. వర్మ, యుద్ధం, యువ, ఆగష్టు '84, పే 78-86)

"ఇంతవరకు తరతరాలుగా మనవంశం మాధవసేవలో తరించింది. ఈరోజు నామనవడు వైద్యవృత్తి చేపట్టి మానవసేవలో తరిస్తానంటున్నాడు. దానికి నేనెందుకు అభ్యంతరం చెప్పాలి. మానవసేవంటే మాధవసేవే కదా" అంటున్న రామశర్మ వంక అక్కడున్న అందరూ ఆనందాశ్చర్యాలతో చూశారు. (జి.రవికృష్ణ, మాధవసేవ, శకలాలు: డా॥జి.రవికృష్ణ కథలు, పే 1-7)

"వీణ నేర్చుకుంటా నాన్నా...." అన్నది. తండ్రి ఒక్కసారి తలతిప్పి స్తంభంపక్క నిలుచున్న కమలవైపు చూసి

"పద్దమ్మా... ఆ సంగీతపు చదువు వొద్దు. గాత్రం, నాట్యం నేర్చుకుని నేను బాగుపడ్డాను..... నువ్వు బాగుపడ్డానికి..... తల్లీ వద్దు..... వద్దుతల్లీ.... వాటిజోలికి మళ్ళీ వెళ్ళొద్దు......" తండ్రి తల అటుతిప్పేసుకున్నాడు.

"నేనెప్పట్నుంచో అనుకుంటుండేదాన్ని...... పదోతరగతి అయ్యాక వీణ నేర్చుకుందామని...... అది నాకు ఇష్టం...... నేర్చుకుంటానాన్నా......" గోముగా అడిగింది. (దాట్ల నారాయణమూర్తిరాజు, ఎడారి, యువ, డిశంబర్ '80, పే 155-160)

విద్యలో విధానపరమైన మరో ఘర్షణ నైపుణ్యానికి, డిగ్రీకి, మధ్య ఏర్పడుతున్న సంబంధం. చదువంటే సర్టిఫికెట్లు, పిల్లలను ప్రమోట్‌చేయటమే ప్రధానలక్ష్య మైపోవటాన్ని విమర్శనాత్మకంగా చిత్రించిన రచన 'ప్రార్థన'.

"పిల్లలు పుట్టీ పుట్టకముందే అంతవారు కావాలి, ఇంతవారు కావాలని కలలుకంటూ, తమ కోరికల్నీ, ఇష్టాల్నీ వాళ్ళ ద్వారా తీర్చుకోవాలనుకోవటం. నిద్రలేస్తూనే బతికి గాయుల్తేరటం. దీపాలు పెట్టే సమయానికి ఇంటికి చేరటం. బాల్యాన్ని అనుభవిస్తున్నారంటే అపలీనాటి పిల్లలు పాపం" పిల్లలపట్ల తన సానుభూతిని ప్రకటించాడు శంకర్. ............ ఇలాంటి అసహ్యాపు విద్యావిధానం నుంచి పిల్లల్ని దూరం చేయమని, ఇలాంటి అసహాయతనుండి పెద్దల్ని బయట పడవేయమని మౌనంగా దేవుణ్ని ప్రార్థించాను. (పెనుమాక నాగేశ్వరరావు, ప్రార్థన, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 10-7-'96, పే 4-6)

"తొమ్మిది తరాలనుండి సీతారామపురం వేణుగోపాలస్వామి కొలువు చేసిన మాపూర్వులలో అందరికీ చిత్తశుద్ధీ, పొక్క శుద్ధీ మాత్రమే అవసరమయ్యాయి. నావరకూ వచ్చేసరికి 'డిప్లొమా' బాధ ఒకటి సిద్ధమైంది....." (భరాగో, పూజారి, కులాసా కథలు, పే 227-233)

"ఈ పిల్లెదవ యిట్టా మాటిర్తో అడిగినాడనుకోబాకండ. మీ పక్కనే ఉండారే గోయిందరాజులసామి గోపరం. ఆ గోపరాన్ని కట్టిన మహానుబావుడికి ఎవురిచ్చినారు సర్టిపికట్లు? పోనీ! ఆ గుడిముందర్నే ఉండాదికదా అంతపెద్ద తేరు. దాన్ని చెక్కినాయప్పకు ఎవురిచ్చినారు సర్టిపికట్లు? చేతిలో పనితనం ఉన్నోడికి సర్టిపికట్లు ఎందుకు సార్? అవేవీ నాదగ్గరుంటేనా యీతీరాగా నేనెందుకొస్తాను సార్? ఏ గవర్నమెంటు(ఆ)పీసుల్లోనో కాళ్ళాడించుకుంటా కూసుంట్టా నాకూడు కుక్కలుతినేటివి!" (పులికంటి కృష్ణారెడ్డి, పనితనం, నాలుగ్గాళ్ళమండపం రాయలసీమజీవనశైలి, పే 282-288)

ఈ క్రమంలోనే విద్య పరమ ప్రయోజనాన్నిగురించి ఆలోచించాల్సిఉంటుంది. విద్య ప్రయోజనాన్ని గుర్తించగలిగినప్పుడే ప్రత్యామ్నాయ విద్యావిధానాన్ని రూపొందించుకోవటం సాధ్యపడుతుంది. విద్య ఎలా ఉండాలన్న విషయంలో విభిన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. వీటిలో కొన్ని విద్య భౌతిక ప్రయోజనాలను అందించేదిగా ఉండాలన్నది ఒక భావన కాగా మరొకటి విద్య విజ్ఞానాన్నందించేదిగా ఉండాలన్నది. ఇలా విభిన్న అభిప్రాయాలు సాహిత్యంలో ప్రతిఫలించటం మనం చూడవచ్చు. విద్య ప్రయోజన రాహిత్యాన్ని చర్చించిన రచనలుకూడా కొన్ని కనిపిస్తాయి. వీటిలో వ్యక్తమైన అభిప్రాయాలద్వారా చదువు ఎలా ఉండకూడదో తెలుసుకోను వీలుకలుగుతుంది.

### చదువు : ప్రయోజనరాహిత్యం

చదువుల్లోని ప్రయోజనరాహిత్యాన్ని వ్యక్తంచేసిన రచనలు 'నాగావళినవ్వింది', దయచేసి చంపెయ్యండి, వింతపశువు.

"మాష్టారు, మీకు తెలియందేముంది. మన చదువులు ఉత్త దండగచదువులు. అందులోనూ సుధాకర్ ఎన్నుకున్నది ఫిలాసఫీ గ్రూపు. ఈ సబ్జక్టు ఏవిధంగానూ కూడుపెట్టదు. మనం జీవించడానికి ఎప్పటికైనా ఒక బతుకుతెరువు వెదుక్కోవాలి కదా! సుధాకర్ కాస్త ముందుగానే తెలివితెచ్చుకొని నాలుగురాళ్ళు సంపాదించుకుంటానని ముందుకివస్తుంటే, మనం ఎందుకు అడ్డు తగలాలి చెప్పండి? బతుకుగురించి సుధాకర్‌కి వున్న అవగాహన నాకూ చిన్నప్పుడే వుండివుంటే, నాజీవితం ఇంతకంటే మెరుగ్గా వుండివుండేదేమో". (ఎ.వి.రెడ్డిశాస్త్రి, నాగావళి నవ్వింది, అసంగత సంగతాలు, పే 56-78)

విద్య యొసగును వినయంబు. ఉహు... కానేకాదు. ఏ విద్యావంతుల్లోను తవింత వినయం చూడలేదు." ఖచ్చితంగా అనుకొన్నాడు. అందుకే అన్నాడు నిండు మనస్సుతో--" మూర్తీ! నీవు ఇంతకొద్దికాలంలో ఇంత అభివృద్ధి సాధించావంటే చాలా ఆశ్చర్యంగా, ఆనందంగా ఉందోయ్! కానీ నీవు చదువుకొని ఉంటే ఇంకా రాణించి - -" "లేదు మాష్టారూ, చదువుకొని ఉంటే స్కూల్లో అటెండరు గానే ఉండి ఉండే వాణ్ణి."

అతను అంటున్నదేమిటో అర్థం అయిందాయనకు. (సెంటినా సరోజిని, వింతపశువు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 28-10-87, పే 102-103)

"చదువు - ఉద్యోగమివ్వదు. ఉద్ధరించదు. బ్రతకడంనేర్పదు...."

"ఐతే - చదువెందుకు?" ఆశ్చర్యంగా అడిగాను.

"చదువు చదువెందుకు కొరగాదో తెలుసుకుందుకే" (ఇవ్వాప్పురపు) రామచంద్రం, దయచేసి చంపెయ్యండి!, భారతి, అక్టోబరు 85, పే 14-17)

జీవితంనుంచి తప్పించుకునేందుకు చదువు ఒక సాధనంగా ఉపయోగపడుతుందన్న అభిప్రాయం వ్యక్తం చేసిన రచన 'వాళ్ళుపాడిన భూపాలరాగం'

"నాన్నా నీకు ఏమని చెప్పాలో నాకు తెలియదు. కాని నేనెవర్నీ ఉద్ధరిద్దామనీ, ఏదో ఘనకార్యం చేద్దామనీ చదువుతానననటంలేదు. చదివేసి పెద్దఉద్యోగాలు చేస్తాననే నమ్మకం లేదు. నేనెందుకు చదువుతానంటున్నాను! జీవితం నుంచి తప్పించుకుందుకు. ఆకాశంలో పక్షిలా వీలైనన్నాళ్ళు స్వేచ్ఛగా బ్రతకడానికి -- నీకు తెలియదులే నాన్నా! ఇప్పుడు తెరుచుకున్న కళ్ళతో మరొక్కసారి ప్రపంచాన్ని జాగ్రత్తగా పరిశీలించి నా స్థానం ఎక్కడో నేనేం చెయ్యాలో నిర్ణయించుకోవాలి. అందుకు వ్యవధికోసమే ఈ చదువు." (పి.శ్రీదేవి, వాళ్ళుపాడిన భూపాలరాగం, జయంతి, జులై'59, పే 12-25)

జీవితావసరాలు తీర్చేదిగా విద్య ఉండాలన్న అభిప్రాయం కారణంగా విద్యను విడిచివేయటంలోని ఆవశ్యకతను సూచించిన రచన 'రెండుమరణాలు'

బతుకడంకోసం'విద్య'ముఖ్యం. బడిలో నేనుచెప్పే విద్య ఇద్దరికీ పనికిరాదనుకున్నారు. వాళ్ళిద్దరికీ కావల్సిన విద్య చెప్పడం నావల్లకాదు. ఇద్దరు బడిమానుకున్నారు. రమణ బ్రాందిషాపులో నిత్యం గ్లాసులు, కాసుల గలగలలతో విద్యనారంభించాడు. రమణ పెట్టిపుట్టినవాడు గనుక.కూటికోసం కోటివిద్యలు గనుక అలాంటివిద్యల్లో సైకిల్‌షాపు విద్య ఒకటని గట్టయ్య ఎంచుకున్నాడు. (అల్లం వీరయ్య, రెండు మరణాలు, ఋతుపవనాలు, పే 196-205)

అయితే విద్య ప్రయోజనం వర్గపరమైనదని ఉన్నతవర్గాలకు మాత్రమే విద్య ప్రయోజనకారిగావుంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తంచేసిన రచన 'రెక్కలులేని పక్షి'

"చదువుకో నాయన్న చదువుకో తంత్రీ
చదువుకుంటే నీకు సౌఖ్య మచ్చేను...." ..................

చదువుకుంటే సుఖం వుంది. నిజమే! అయితే అది ఎవరికి? ఉన్నవాళ్ళకే. లేని వాళ్ళకి కానేకాదు. ఈ పాటని ఆ ఉన్నవాళ్ళకి మాత్రమే ప్రత్యేకించి చెప్పాలి. అలా కాకుండా అందర్నీ ఒకే గాట్లో కట్టేసించినట్లుగా ఉన్నవాళ్ళని లేనివాళ్ళని ఒకటిగా కలిసి చెప్పటం ఎంతవరకు న్యాయం? లేనివాళ్ళకి లేనిపోని ఆశలు చూపెట్టడమే కదా? ------------ (జక్కగుంద రఘునాథరెడ్డి, రెక్కలులేని పక్షి, భారతి, అక్టోబరు1980, పే 26-31)

## చదువు : భౌతిక ప్రయోజనం

ఇలా విద్య ప్రయోజన రాహిత్యాన్ని గురించిన భావనలు కొన్ని వెలువడగా మరోవైపు విద్య భౌతికావసరాలు తీర్చేదిగా ఉండాలన్న అభిప్రాయం వ్యక్తంకావటం గమనార్హం.

చదువు భౌతికావసరాలు తీర్చేసాధనమన్నది 'సుబ్బిగాడి'లాంటి కొందరి నమ్మకం. బహుశా మొదటితరం విద్యావంతులు సౌకర్యవంతంగా జీవించటాన్ని చూడటంద్వారా ఏర్పర్చుకున్న అభిప్రాయంగా దీన్ని భావించాలి. ఇంకా పరుగు, విద్యాబోధల్లో కూడా ఇదే అభిప్రాయం వ్యక్తమైంది.

ఈ బాధలన్నీ పోవాలంటే పూర్తి పరిష్కారం సుబ్బిగాడికి తట్టకపోయినా, చదువుకొంటే ఈ బాధలుండవనీ పెద్దగా పెరిగి ఉద్యోగం చెయ్యొచ్చు. మంచిగుడ్డ కట్టుకోవచ్చని. తలకు నూనె రాసుకోవచ్చని. వంటికి సబ్బురుద్దుకోవచ్చని. వీళ్ళందరిచేతా తిట్లు తినకుండా పోతుందని మాత్రం ఆలోచించపోగాడు.

చదువుకోవడానికి డబ్బులు, పనిచెయ్యకుండా చదువుకుంటే తిండి ఎట్లా దొరుకుతుంది? చదువుకొన్న వాళ్ళ పరిస్థితులు అందరివీ ఎలా వుంటున్నాయి. మున్నగు ఆలోచనలు రాకపోయినా, ముఖ్యంగా తను చదువుకోవాలని మాత్రం తలంచాడు. .......... (వై.నేతాంజనేయప్రసాద్, సుబ్బిగాడు, ప్రజాసాహితి, నవంబరు- డిశంబరు'80, పే 13-16&58&61)

చదువుకొంటే ఏదైనా అయిపోవచ్చు. ఎవరినెత్తిమీదైనా కూర్చుని పెత్తనంచెయ్యవచ్చు అన్న అభిప్రాయం ఏర్పడింది. అలా నేను చదువుకొని పైకి రావాలంటే కొందరైనా చదువు సంధ్యా లేకుండా ఉండిపోవాలి. లేదా చదువులో నేను ముందుంటే వాళ్ళు వెనకుండాలి. అప్పుడే నేను అందరికంటే ముందుంటానన్న సంగతి నాకు ఎవరూ చెప్పకపోయినా తెలిసిపోయింది. (నందిగం కృష్ణారావు, పరుగు, నందిగం కృష్ణారావు కథలు, పే 101-107)

"చదువు చదివిన వాళ్ళంతా ఇస్త్రీ లాగు చొక్కాలు తొడుక్కొని కళ్ళద్దాలు పెట్టుకోని పోయిగావుంటారు. సుఖపడుతారు. గౌరవనీయులనిపించుకుంటారు. కుర్చీలమీద కూర్చుంటారు. పెద్దవాళ్ళౌతారు. నేనెందుకు కాకూడదని" రాముడు చేరాడు బళ్ళో.

"పంతులుగారూ, నాకు గర్వమూరాలేదు. లెక్కలు రాకనూపోలేదు. నాకు చదలిచ్చే దేముడూ లేకపోయె. కూరగాయలు కొనే ఇల్లూ లేకపోయె. ఇవ్వటానికి డబ్బు లేకపోయె. అందుకని మీప్రశ్నలో అసలువిషయం తెలియ లేదండి." అని కళ్ళు తుడుచుకుంటూ చెప్పాడు.

"ఓరి పిచ్చివాడా, ఈలోకంలో చదువంటూఅంతే. మనకులేకపోయినా వున్నవాళ్ళకన్నా చేసి పెట్టటం నేర్చుకోవాలి. లేకపోతే నీకు వుద్యోగం ఎట్లా వస్తుంది?" (సి.వి. కృష్ణారావు, విద్యాబోధ, సృజన, ఆగష్టు '69, పే 51-52)

## చదువు : వ్యక్తిత్వవికాసం

మరోవైపు చదువుకు వ్యక్తిగత కోణాన్నాపాదిస్తూ సమగ్ర వ్యక్తిత్వ వికాసాన్నిచ్చేదే చదువు అన్న అభిప్రాయం వ్యక్తమైంది. చదువు కేవలం ఉద్యోగంకోసమే అన్న అభిప్రాయం సరైనదికాదన్నది ఒక వాదన. చదువు మనిషికి ఆత్మస్థైర్యాన్నిస్తుందని పేర్కొన్న రచన 'గోల్'

"చూడు భాయ్.... నేను- ఈ పని మాత్రమే చేస్తానని గిరిగీసుకుని కూర్చోకూడదు. .........., చదువుకునేది కేవలం ఉద్యోగం కోసమే అనుకోవడం మన ఎదగని మనస్తత్వానికి నిదర్శనం. చదువు మనిషికి ఆత్మస్థైర్యాన్ని ప్రసాదిస్తుంది... విజ్ఞానవంతుల్ని చేస్తుంది. .........." (ఆకోతుల శ్రీనివాసరావు, గోల్, తెలుగు విద్యార్థి, డిశంబరు1998, పే 43-44)

చదువు వ్యక్తుల జీవితాల్లో మార్పునుతెస్తుందన్న ఆలోచన వ్యక్తంచేసిన రచన 'చదువు'

"నీ మొహం! చదువెప్పుడూ అవసరమే. ప్రతిమనిషీ చదువుకోవాలి. ఆ చదువుని సద్వినియోగం చేసుకోవాలి. దేశమూ బాగుపడుతుంది. ఏ మనిషికామనిషీ బాగుపడతాడు. ..............

"ఈ వయసులో కూడా చదువుకుని డిగ్రీ తెచ్చుకుందంటే మీ అమ్మకి కలిగే గౌరవం చాలా గొప్పది. ఎప్పుడో ఒక రోజు ఈ చదువే మీ అమ్మని సమస్యలనుంచి ఆదుకోవచ్చు. ఎవరికి తెలుసు? ఇద్దరూ బాగాచదవండి. ఈ చదువుకి ఉపయోగంలేదనీ, ఎవరినో తృప్తి పరచడానికి చదువుతున్నాననీ భావించకండి. మీకే ఎప్పుడో ఒకరోజు ఉపయోగపడగలదు. ఇది ఒక ఆస్తి.........." (కప్పగంతుల శ్రీ కృష్ణబహదూర్, చదువు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 22-8-90, పే 35-38)

అక్షరాలు రాయటం, చదవటంమాత్రమే చదువుకాదని, వ్యక్తివికాసానికి దోహదపడేదే విద్య అన్నది 'స్త్రీవిద్య', 'నాన్న'ల అభిప్రాయం.

"విద్య నేర్చినచో కచేరీలకుబోయి యుద్యోగములు చేయుట, నుత్తరములు వ్రాయుటకు వేరు ప్రయోజనమేమి కలదని నీవడుగుట యుక్తమే కాని నీవు---నాలోచించి చూచిన దీనియందలి లోపము నీకే తెలియును. అక్షరములను వ్రాయను జదువను నేర్చినంతమాత్రమున నరులు విద్యావంతులు కాజాలరు. అనేకులు వ్రాసిన సద్గ్రంథములను జదివి వాని తాత్పర్యమును గ్రహింపగలవారలే విద్యాయుతులనబడుదురు. అట్టి విద్యవలన బుద్ధి వికసించును. అట్టి విద్య వలన బుద్ధి వికసించును. అనేక సద్గ్రంథములలోని యమూల్యములగు నుపదేశవాక్యములు మనసునకాటి మనుజుల నుదాత్తవంతులనుగా జేయును. వారియందలి దుర్గుణపుంజములు పోయి సద్గుణ పరంపర లాస్థానమునలంకరించును లోకానుభవమును గనుటకు వారలు విశేష యోగ్యులగుదురు. (భండారు అచ్చమాంబ, స్త్రీవిద్య, నూరేళ్ళ పంట, పే 1-5)

"నాకు చదువంటే ఇష్టంలేదు" చాలా పొగరుగా జవాబుచెప్పాను.

"జీవితంలో మనిషిగా వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దటానికి చదువు చాలా అవసరం బాబూ! చదువుకోకుండా ఏం చేస్తావు చెప్పు" -- ఆ మాటలవెనక ఎంత ఆవేదన ఉన్నదో!

"నీకేం పనేదు. ఎప్పుడూ చదువు చదువని ప్రాణాలు తీంటావ్. ఈసారి చదువు మాట ఎత్తితే ఇంటికే రాను....." బెదిరించి బయటికి పరుగుతీశాను.........

గమ్యంలేని నడక-- ఈ పదేళ్ళూ గమ్యంలేని నడకే -- ఎక్కడా స్థిరత్వంలేదు. చదువుకోనందుకు కుమిలిపోని క్షణం లేదు. కడుపునిండక కాళ్ళు కడుపులో పెట్టుకున్నప్పుడు నాన్నమాటలే--కూలీ దొరకక ఊరూరా తిరిగినప్పుడూ నాన్నమాటలే. అదృష్టముండి ఏ పెళ్ళిలోనో ఒకరోజెప్పుడైనా ఒక స్వీటు దానం దొరికినప్పుడూ నాన్న తలపులే. నాన్న మరపుకురాలేదు-- ఆ ఆప్యాయత, ప్రేమ, ఆయన విలువ, చదువు విలువ-- జీవితంలో ఒక్కొక్క అనుభవంతో బాగా తెలిసొచ్చింది. పేపర్‌బాయ్‌గా, స్టేషన్లో కూలీగా-- ఎన్నో అవతారాలు. (తెన్నేటిసుధ, నాన్న, యువ, జనవరి '83, పే 137-141)

### చదువు : సామాజిక కోణం

అయితే చదువు కేవలం భౌతిక సుఖాలకుమాత్రమే ఉద్దేశించినది అనే ఈ అభిప్రాయాన్ని 'వైద్యో నారాయణో హరి' బలంగా వ్యతిరేకించింది. చదువు ప్రధాన ఉద్దేశ్యం సామాజిక ప్రయోజనంకావాలన్నది ఇందులో వ్యక్తమైన ఉద్దేశ్యం. ఇందులో చదువుకు సామాజిక కోణాన్నందించటం విశేషం. చదువు సామాజిక ప్రయోజనం ప్రధానంగా సాగాలన్న అభిప్రాయాన్ని ప్రముఖ శాస్త్రవేత్త ఐనిస్టీన్ వెలిబుచ్చటం గమనార్హం.

"Some times one sees in the school simply the instrument for transfering a certain maximum quantity of knowledge to the growing generation. But that is not right. Knowledge is dead; the school, however, serves the living. It should develop in the young individuals those qualities and capabilities which are of value for the welfare of the commonwealth. (Albert Einstein.1954: 60)

"అసలు ఎవరైనా మెడిసిన్ ఎందుకు చదవాలి? ఎందుకు చదవాలంటే ఓ హోదాకోసం చదవాలి. దిట్టంగా కట్నం కొల్లగొట్టడానికి చదవాలి. నర్సింగ్‌హోం పెట్టుకొని ముమ్మరంగా సంపాదించాలి. బొమ్మరిదివేత నర్సింగ్‌హోంకి అనుబంధంగా మెడికల్‌షాపు, క్లినికల్‌లేబూ పెట్టించి రోగుల్ని ఎడాపెడా అవసరం ఉన్నా లేకపోయినా వాయించాలి. అలా కాదనుకుంటే అమెరికాకి ఎగిరిపోవాలి....."

" తయారవుతున్న ప్రతీ డాక్టరు మీదా లక్షలాది రూపాయల ప్రజాధనం ఖర్చవుతోంది. ఏ అమెరికాకోపోయి వాడారి వేసు చూసుకుంటే అనారోగ్యంతో మగ్గుతున్న మనగ్రామాల సంగతేమిటి? " అన్నాడు డా.దేవుడు. (సత్యకామ్‌సెట్టిపల్లి, వైద్యో 'నారాయణో' హరి, పే-67-68)

### చదువు : సమగ్ర మానవ వికాసం:

చదువు కేవలం పుస్తక పరిజ్ఞానంకాదని మానవ సమాజవికాసానికి దోహదపడే ప్రతిచర్య విద్యలో భాగమేనన్న విస్తృతమైన అర్థాన్ని వ్యక్తంచేసిన రచన 'అనర్హత'

"ప్రతిభంటే కేవలం బట్టీకొట్టిన చదువేకాదు చక్రధర్! మానవుని నిత్యజీవితంలో అణువణువునా అదొక అంతర్భాగమై నిలిచివుంది. అగ్రవర్ణాలనుండి అట్టడుగు వర్గాలవరకు అందరూ మానవులే! మేధావులే! ప్రతిభావంతులే! మానవసమాజంలో సమాజవికాసానికి ఒక్కొక్కరు ఒక్కొక్కపని చేయడానికి పూనుకున్నారు. ప్రతివారికి వారివారి పనుల్లో ఎంతో ప్రతిభవుంది. ప్రతిభంటే కేవలం పాండిత్యమే కాదు." (క్రాంతికిరణ్, అనర్హత, ప్రజాసాహితి, డిశంబరు'90, పే 53-57,59)

### ప్రత్యామ్నాయ విద్య:

ఇలాంటి విభిన్న భావనలతోపాటుగా తెలుగుసాహిత్యం నిజమైన చదువు ఎలా ఉండాలో, అందుకు విధానపరంగా ఎటువంటి చర్యలు తీసుకోవాలో రచనల్లో సూచించింది. ఇవే ప్రత్యామ్నాయ విద్యావిధానంపట్ల మనకు అవగాహనకు వీలు కల్పిస్తాయి.

బాల్యానందాన్ని కోల్పోకుండా జీవనోపాధికై ఎదగటం అనే భావనని తెలుగుసాహిత్యం బలంగా వ్యక్తంచేసింది.ఒక పూట పని ఒకపూట చదువు విధానం భారతదేశవిద్యావిధానానికి మంచి పరిష్కారంగా పనిచేస్తుందన్నసూచన 'రియల్‌ఎస్టేట్'లో మనముందుకొస్తుంది. భారతీయ వ్యవస్థలో జవహర్‌లాల్ భావన, తెలుగు సాహిత్యంలో చలం భావన ఇందుకు దగ్గరగా కనిపిస్తాయి.

"మల్లయ్యకు మావో అంటే ఎంతో అభిమానం. మావో ఇండియాలో పుట్టి అంబేద్కర్‌తో దోస్తీ పట్టాల్సిన

వాడంటాడతడు. వైనాలో మాతో ప్రవేశపెట్టిన విద్యా ప్రణాళికను, కమ్యూనిజాన్ని ఎంతో అభిమానిస్తాడు మల్లయ్య. ఒకపూట పని ఒకపూట చదువు అనే పిల్లు పద్ధతి అతనికి గొప్ప ఆదర్శం. కులవ్యవస్థ విధించిన దారిద్ర్యం, అసమానతలకు "పని-చదువు" పిల్లు పద్ధతే పరిష్కారం అంటాడతడు. అప్పుడే మన యిండియాలో "నిర్బంధ ప్రాథమిక విద్య" ఆశయం నెరవేరడంతో పాటు "ఉన్నత విద్య" అందరికీ అందుబాటులోకి వస్తుందని అతని విశ్వాసం. తద్వారా ఈ దారిద్ర్యం, సోమరితనం, పనిపట్ల అగౌరవం, కులమతాల హెచ్చుతగ్గులు అదృశ్యమవుతాయంటాడు. అప్పుడే ప్రపంచంలో ఇండియా ఒక ఆదర్శరాజ్యంగా ఎదుగుతుందంటాడు. ..............." (బి.ఎస్.రాములు, రియల్ఎస్టేట్, బి.ఎస్.రాములు కథలు, పే 36-45)

అనంతపురంజిల్లాలోని 'టింబక్టు కలెక్టివ్' సంస్థ ఇలాంటిదే. ఈ సంస్థ ఆధ్వర్యంలో 'ప్రకృతిబడి', 'చిన్నబడి', 'వెన్నెలబడి', 'రెసిడెన్షియల్‌బడి' అని నాలుగు బడులు నడుస్తున్నాయి. "బాలానందాన్ని కోల్పోకుండా జీవనోపాధికై ఎదగడం" అన్న ప్రధాన లక్ష్యంతో ఈ సంస్థ సాగుతున్నది. ప్రకృతిబడిలో పిల్లలు చదువునేర్చుకోవాలన్న తత్త్వవేత్తల ఆశయాలకనుగుణంగా ఈ బడులుంటాయి. పిల్లలు చదువు అంటే భయపడి పారిపోకుండా, వారికి సృజనాత్మకమైన పద్ధతిలో చదువుకొనే వాతావరణం ఇక్కడ లభిస్తుంది.

అది పిల్లల ఆనందాల్నీ, అభిరుచుల్నీ దృష్టిలోపెట్టుకుని చదువునేర్పాలన్న సంకల్పంతో ప్రత్యామ్నాయ విద్యాసంస్థల రూపకల్పన 70లలో ప్రారంభమైంది. చిత్తూరు జిల్లా రుషీవ్యాలీ రూరల్ సెంటర్ శాటిలైట్ స్కూల్స్ ఇందుకు ఉదాహరణ. పిల్లలపట్ల, విద్యపట్ల అపార ప్రేమాభిమానాలున్న విద్యావేత్త శివరాం దీనికి ఆద్యులు. వీరి ఆధ్వర్యంలోనే 80లలో నెల్లూరు జిల్లా పల్లెపాడులో 'సృజన' స్కూలు ఏర్పాటయింది. ఈక్రమంలోనే 1984లో హైదరాబాదు 'వికాసభారతి' మొదలైంది. గిజూభాయి, మాంటిస్సోరి, ఫ్రోబెల్, సుఖోమ్లీన్స్కీ వంటి విద్యావేత్తలు ఆవిష్కరించిన అపురూపవిషయాలతో సృజనాత్మక పద్ధతుల్లో విద్యనేర్చుకునే అవకాశాలు కల్పించే సంస్థ ఇది.

ఇవే ఆలోచనలు 'పసిరిమొగ్గలు'లో వ్యక్తమైనాయి.

"ఆ గ్రామంలో పసిపిల్లల దగ్గరనుంచి పదిహేనేళ్ళ పిల్లల వరకు అందరూ ఒకే విశాలమైన ఆవరణలో సస్యశ్యామలమైన చెట్లు,చేమల క్రింద ఆడుకుంటూ, పాడుకుంటూ హుషారుగా ఉన్నారు. ఆ ఆవరణ ముందు "శిశు విహార్" అనే బోర్డు కనపడింది. పసిపిల్లలను ముసలివారు లాలించి, జోలపాడి ఆడిస్తున్నారు. పిల్లలందరూ ఎవరికి ఇష్టమైన పని వారు చేసుకుంటున్నారు. కొందరు తెలుగు పుస్తకాలు చదువుకుంటున్నారు. కొందరు ఇంగ్లీషు, మరి కొందరు లెక్కలు--- ఇంకొకచోట చిత్రలేఖనం, మరోచోట సంగీతసాధన, ఇంకొకచోట వ్యాయామసాధన--ఇలా ఆ ఆవరణలో అంతా వారి అభిరుచికి తగినట్లు వారు తర్ఫీదు పొందుతున్నారు. ఆ ఆవరణలో తప్పితే గ్రామంలో పిల్లలు ఇంకెక్కడా లేరు. " (సోమంచి రామం, పసిరిమొగ్గలు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 18-4-79, పే 69-75)

ఇంకా చదువంటే కేవలం పుస్తకాలుచదవటం మాత్రమేకాదని జీవితాన్ని చదవటమే నిజమైన చదువు అంటూ, పేర్కొన్న రచనలు 'విద్యావివాహనాశాయ', 'పరమగురువు'. విద్య పరమార్థం విజ్ఞాన సముపార్జన. విద్య మనిషిలో వినయాన్ని, వివేచనాశక్తిని, సంస్కారాన్ని పెంచుతుంది. అహాన్ని అణచివేస్తుంది. అన్నది వీటిలో వ్యక్తమైన అభిప్రాయం. వికాసభారతిభావనకూడా ఇలాంటిదే కావటం విశేషం.

"చదువు అంటే పుస్తకాలు చదవడం మాత్రమే అన్న భ్రమలో ఉన్నట్లున్నావు నువ్వు. మనుషుల్ని, జీవితాన్ని చదవడం నేర్చుకోవాలి. దానికి ఈ కళ్ళజోడు పనికిరాదు. ఏ ప్రిఫరెన్స్‌లూ, ప్రెజుడిస్‌లూ లేని సమదృష్టి కావాలి. నీ సాహిత్య పఠనం ద్వారా ఆ సమదృష్టి అలవాటు చేసుకోవాలి నువ్వు...." (కె.గోదావరిశర్మ, విద్యావివాహనాశాయ, విపుల, జనవరి 1988 పే 14-21)

"కాదు... చదువు విజ్ఞానంకోసం మాత్రమే. సంపాదనకోసం కాదు. చదువుకు, సంపాదనకు సంబంధమే లేదు."

ఆచార్యులు మాటలురానివాడిలా కొడుకు మొగంలోకి తదేకంగా చూస్తున్నారు.

"నాన్నా! ఇంతకాలంగా నేను పుస్తకాల పురుగును మాత్రమే. ఏ జీవితపుటల్లోకి తొంగిచూడలేదు." (పులికంటి కృష్ణారెడ్డి, పరమగురువు, తెలుగు కథ-96, పే 53-63)

"చదువంటే పుస్తకాలలోని విషయాలను వల్లించగలగడమో, రాయగలగడమో మాత్రమే

కాదు. కాయితాలమీది డిగ్రీలనో, జీతపురాళ్ల ఉద్యోగాలనో సంపాదించిపెట్టేది అంతకంటేకాదు ---- పిల్లలు, సబ్జక్టుల మధ్యవున్న కార్యకారణ సంబంధాన్ని అర్థంచేసుకొని, తనముందున్న సమస్యలలోని అంశాలు తమ స్థాయిలో విడదీసి చూసుకోగలిగేలా చేసి, వాళ్లలో నిద్రాణమై వున్న శక్తియుక్తులను వెలికితీసి మెరుగు పెట్టగలిగిన శిక్షణే అసలైన చదువు" అన్నది వికాసభారతి భావన. అందుకే పిల్లలు బడి అంటే భయపడని వాతావరణం ఇక్కడ కనిపిస్తుంది.

బండెడు హోంవర్కుతో, పరీక్షలంటే భయంతో, ర్యాకులకోసం పోటీలతో తమనితాము కృశింపచేసుకునేలా చేసే బోధనాపద్ధతులకు దూరంగా సహజమైన పరిసరాలలో పిల్లలు చదువును ఆనందమయమైన కార్యక్రమంగా భావించేలా ఈ స్కూళ్లు నడుస్తున్నాయి.

అనంతపురంలోని 'తపోవన్' స్కూలు, టింబక్టు కలెక్టివ్ స్కూళ్లు, హైదరాబాదులోని 'సెంటర్ ఫర్ లెర్నింగ్', ఆనందభారతి, శ్లోక, విద్యారణ్య,జహీరాబాద్ లోని దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ వారు నిర్వహించే 'పచ్చశాల', విజయవాడలోని 'వికాసవిద్యావనం' వంటిస్కూళ్లు ప్రత్యామ్నాయ విద్య నందించేందుకు కృషిచేస్తున్నాయి. సాహిత్య విమర్శలో ప్రత్యామ్నాయవిద్యను గూర్చిన చర్చలనేకం కనిపిస్తాయి.

"మీ నలుగురూ తెచ్చిన సమాచారం ఆధారంగా శాంతివనం పెంచుదాం. మీ విజ్ఞానమే మూలస్తంభాలుగా, మీ భావాలే పునాదులుగా, మీ ఉత్సాహచైతన్యాలే గోడలుగా, మీ వివేకమే కప్పుగా ఒక ఆశ్రమం నెలకొల్పుదాం. శాంతివనం అనురాగ నందనవనం అవుతుంది. ఈ నందనవనంలో ఎన్నెన్నో శాంతి వృక్షాలు పెరగాలి. ఫల పుష్పాదులతో విలసిల్లాలి. ఇక్కడ దుఃఖం, దారిద్ర్యం, బాధ, అసంతృప్తి, శోకం, అవినీతి,విషాదం····· విచారం వీటికి తావుండదు. అంతటా సంతోషం, సంతృప్తి, శాంతి, ఆర్ద్రత, చైతన్యం, ఉత్సాహం, ఉత్తేజం····ఇవే, ఇవే అలరారాలి. అందరిఒక్కటనే భావన వుండాలి"(రాగనందనం)

'తనకుతాను స్వేచ్ఛగా తెల్సుకునే పరిస్థితులు, అవకాశాల్లో ఆసక్తి, అభిరుచి కలిగించేదిగా ఉండడమే సరైన, సహజ విద్యావిధానం.······ఆటుపోటులు, ఎనిపాటులు కలగలసిన ఆశ్రమవిద్య విద్యార్థుల్లో జీవితమే ఒక ఆట అనే ఆనంద దృక్పథాన్ని కలిగించింది. అన్నిపనులూ వాళ్లొక ఆటలాగే నేర్చుకునేవారు. (చదువు)

పై అభిప్రాయాన్నే సామాజికదృష్టితో వెలిబుచ్చిన రచన 'పీడితుల చదువు' తిండి, బట్ట, ఇల్లు వంటి కనీసావసరాలను పొందేందుకు అవసరమైన జ్ఞానాన్నివ్వని చదువుపట్ల ఇందులో నిరసన కనిపిస్తుంది.

తను పుస్తకాల్లో చదువుకున్న ప్రజాస్వామ్యానికీ, ఇక్కడ ధనవంతుల ఏలుబడికీ ఎక్కడా పొంతనఅందటంలేదు. ఓట్లకోసం జరిగే ఈ ధనాధిపత్యం దగా చర్యల్ని ఏ సోంఘికోపాధ్యాయుడూ వివరించలేదు. ఏ సోషియాలజీ లెక్చరరూ, ఏ పొలిటిక్సు ఉపన్యాసకుడూ తనకు పాఠాలుగా చెప్పలేదు. తను కాలేజీల్లో చదివిన చదువు భయంకరమైన ఈ భూస్వాములు సృష్టించిన విషవలయాల్లోని కఠినమైన చిక్కుల్ని ఛేదించటానికి ఏమాత్రం సరిపోదు.------------ ఈ కసాయి కుతంత్రాలకు దూరంగా అజేయమైన శక్తిగా తనగూడెం జనాన్ని మలిచేందుకు--ఆ జీవితం చదువును తను నేర్చుకొని వారికి నేర్పాలని నిర్ణయించుకున్నాడు. (బొల్లిముంత నాగేశ్వరరావు, పీడితుల చదువు, ప్రజాసాహితి, ఏప్రిల్ 1983, పే 52-64, 15, 17)

విద్యావిధానంలో మార్పురావాలని ఆశించే ఆలోచనలు అనేకం మనకు నిజజీవితంలో, సాహిత్యంలో తారసపడతాయి. అటువంటి ఆలోచనలు వ్యక్తమైన రచన కాన్వెంట్‌విద్య. విద్య వ్యాపారాత్మకం కావటంపట్ల నిరసన చూస్తాం.

"ఖచ్చితంగా నాన్నగారూ! వ్యాపార సంబంధాలతో ముడిపడిన విద్య నిజాయితీతో కూడుకున్నది ఎలా అవుతుంది? ఈ విద్యావ్యవస్థ క్షుణ్ణంగా పరిశీలిస్తే ఇందులో ఎంత నిజంవుందో మీరే తెల్సుకుంటారు. ఒక సాధారణమైన ఉద్యోగి కొడుక్కి వున్నతచదువులు చెప్పించాలంటే ఆఫీసులో లంచాలు పుచ్చుకుంటేగానీ సాధ్యంకాదు. అలాగే ఆ కొడుకు చదివి వచ్చి అదేమార్గంలో పయనించాలి. అంతేనా? ఇంకా "మా అబ్బాయి చదువుకింత ఖర్చు పెట్టాం! ఆ మొత్తం మీరివ్వాలి" అన్నట్టు వరకట్నాల మార్కెట్‌లో అబ్బాయిల్ని బేరానికి పెట్టాలి. ఇదంతా వ్యవస్థలో సాగుతున్న పచ్చి కుళ్లువ్యాపారం నాన్నగారూ."

"ఈ విద్యావ్యవస్థ బాగుపడే వరకు నేను స్కూల్‌కి వెళ్ళి చదవను నాన్నగారూ! నేను తాతగారి దగ్గరే అన్ని విజ్ఞాన విషయాలు నేర్చుకుంటాను. అంతేకాదు తాతగారితో పాటు నేనూ విద్యావిధానంలో మార్పులకోసం కృషిచేస్తాను." (కోవ పద్మావతి, కాన్వెంట్ విద్య, ఏప్రిల్ 1993, పే 43-44)

చదువంటే కేవలం పరీక్షలు పాసవడమనే భ్రాంతిపోవాలి. సృజనాత్మకతని హత్యచేయని విద్యావిధానం కావాలన్న కోరికనువ్యక్తంచేసిన రచన 'పందెపుగుర్రాలు' అనారోగ్యకరమైన పోటీకారణంగా పిల్లల్లో సృజనాత్మకత నాశనమైపోతున్నదన్న వేదన ఇందులో వ్యక్తమైంది.

"పోటీ స్వభావంవల్ల లాభం జరిగేది సమానుల మధ్యనే. లేకపోతే పాల్గొలు కొందను ఢీకొన్న తంతవుతుంది. మీ పిల్లలతో రాంబాబు పోటీ అటువంటి ఫలితాన్నే ఇచ్చింది. పిల్లలని పందెపు గుర్రాల్లా పెంచకూడదు. చదువు మనిషికి చాలా అవసరం. ఎవరూ కాదనలేరు. కానీ చదువంటే పరీక్షలు పాసవడమనే భ్రాంతి పోవాలి. సముద్రపుఒడ్డు, కాలువగట్లు, చింతతోపులు లేని ఈ ఊళ్లోకూడా, రాంబాబు కిటికీలోంచి వెల్లవంక, వాటిపై కువకువలాడే పక్షులవంక, ఆకాశంలో మబ్బులవంక చూడటం అలవాటు చేసుకున్నాడు. అతన్ని ఏ పెయింటింగ్ స్కూల్లోనో చేర్పించి చూడాల్సింది. తరువాత మనోవికాసానికి ఎన్నో మంచిపుస్తకాలు పరీక్షల బెడదలేకుండా చదువుకునేవాడు. అదిచాలదూ? ఇప్పుడతనికి వచ్చిన జ్వరం మీరు తెచ్చిపెట్టిందనడంలేదు నేను. కానీ, ఆపోటీలతోటీ, పరీక్షలతోటీ శరీరాన్ని శిథిలం చేసుకున్నాడు. (విజయలక్ష్మీ రామకృష్ణన్, పందెపు గుర్రాలు, విజయలక్ష్మీరామకృష్ణన్ చిన్నకథలు, పే 63-74)

మెకాలేదొర మానసపుత్రికైన ప్రస్తుత విద్యావిధానంలో సమూలమైన మార్పులనుకోరుతూ వచ్చిన రచన 'స్పాట్‌వాల్యుయేషన్'

"అసలు చదువెందుకో, చదివి ఏంచెయ్యాలో తెలీని ఆ పసిగుండెల్లో ఎన్నెన్ని అలజళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయో, ఎన్నెన్ని ఆవేదనలు కళ పెళ్ళాడుతున్నాయో ఆలోచించేవాడెవడు? పట్టించుకొనేవాడెవడు? వ్యవస్థంతే వ్యవస్థ! ఈ అయోమయం విద్యావ్యవస్థ -- మెకాలే దొరగారి మానసపుత్రిక -- సమూలంగా మారితేగాని ఏం చెయ్యలేం. జాతి జీవన ప్రవాహంతో ముడిపడిపోయే సహజమైన విద్యావిధానాన్ని మనం ఏర్పరుచుకొనేటంతవరకూ మనహిందూదేశం పరిస్థితింతే!స్పాట్‌వాల్యుయేషన్లో మనం అన్నదులకాక ఉత్తరాలే చదువుతూంటాం!"(గుండు సుబ్రహ్మణ్యదీక్షితులు, స్పాట్‌వాల్యుయేషన్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 1-2-'89, పే 72-77)

విద్యపేరుతో పసిపిల్లలపై జరుగుతున్న హింసను, దాని ఫలితాలను సమగ్రంగా చిత్రించిన రచన 'హింసధ్వని'. ఆ హింసని ఖండించటంతోపాటుగా విద్యావిధానంలో ఎటువంటి మార్పులురావాలని ఆశిస్తున్నారోకూడా ఇందులో సూచించారు.

ఒక ప్రక్కగా శిలువను భుజానేసుకుని మోస్తూ భారంగా నడుస్తున్న ఏసుక్రీస్తు. మరోప్రక్కగా పెద్దపరిమాణంలో వున్న పుస్తకాల సంచుల్ని వీపులమీద మోస్తూ భారంగా అడుగులేస్తూ నడుస్తున్న కాన్వెంటు బాలబాలికలు. నేపథ్యంలో చర్నాకోలలు. చెళ్ళుచెళ్ళుమంటూ వినిపిస్తూ కొరడా దెబ్బలు... సన్నగా వినిపిస్తున్న పిల్లల కోలాహలం...

......................

చిగురించే బాల్యంపై
పుస్తకాల భారం
సుతిమెత్తని పువ్వుమీద
పెనురక్కసి పాదం
ఆటలేదు పాటలేదు
ఊహలేదు సృజనలేదు.
మార్కులు, రాంకుల కొలతలు
పాఠశాల యంత్రశాల

..................

మనిషిని మనిషి కలిపే
విద్యనేడు రావాలోయ్
జ్ఞానానికి పరమార్థం
అనురాగం కావాలోయ్.

..................

శివ: ఇంజనీరింగన్నా, డాక్టరీఅన్నా, కలెక్టరుఅన్నా ఎంతో గొప్పది జీవితం. జ్ఞానం పోటాకోసం, గొప్పచెప్పుకోవటం కోసమో కాదు. మనిషి మనుగడకు ఉపయోగపడేదే అసలైన జ్ఞానం. ............

పిల్లల్లో సహజంగా వుండే తెలివితేటల్ని బట్టి చదువులో రాణిస్తారు. అభివృద్ధిలోకొస్తారు. తమ ఆశలకు, ఆకాంక్షలకు అనుగుణంగా పైకి రావాలన్న తల్లిదండ్రుల దురాశే పిల్లల్లో రుగ్మతలకు

అసలు కారణమని పేర్కొంటూ వేలంవెర్రిగా పిల్లల చదువుల కోసం ఆస్తుల్నేకాదు, తలలూతాకట్టు పెట్టడాన్ని ఈ రచన నిరసించింది. పరీక్షల్లో ప్యాసుకాలేదని, డిస్టింక్షనురాలేదని, యం.సెట్, ఇంజనీరింగుల్లో ర్యాంకులు రాలేదని.... ఇలామానసిక రుగ్మతలతో సతమతమవుతున్న ఎందరెందరో విద్యార్థుల ఆత్మహత్యలు నిజానికి తల్లిదండ్రులుచేస్తున్న హత్యలే అన్నఅభిప్రాయం ఇందులో వ్యక్తమైంది. బిడ్డలు పుడుతూనే పుస్తకాలయి, సాక్సయి, బూట్లయి, యూనిఫారాలుగా ర్యాంకుల్లోకి మారి కన్నవాళ్ళ కలల్లో ఇంజనీర్లు, డాక్టర్లు, కలెక్టర్లయి పోతున్నారు. మధ్యతరగతి మనుషుల్ని మహమ్మారిలా పీడిస్తున్న ఈ జబ్బుపేరే వృత్తివిద్యా వ్యామోహం. దీనికిబలైపోతున్న అనేకమంది పిల్లలకు ప్రతినిధే ఇందులో కల్పన. అందుకే ఈ వ్యామోహానికి దూరంగా ప్రకృతిఒడిలో కొత్తచదువులు చదివించే ప్రయత్నం ఇందులో కనిపిస్తుంది.

సారా: Kalpana is suffering from a Major Deprissive disorder, which is a serious illness. దిగులు, ఆందోళన, చదువంటే విముఖత, పరీక్షహాల్లో కూర్చోగానే గుండెదడ, జ్ఞాపకశక్తి కోల్పోయి జవాబులు రాయలేని దుస్థితి, అదో మానసిక దౌర్బల్యం. ఈ జబ్బు కేవలం మందులతో మాత్రమే నయంకాదు. ఆదరణ, ఆత్మీయత, అన్నిటినీ మించి స్వేచ్ఛ. బ్రతుకు వాళ్లది, భవిష్యత్తూ వాళ్ళది. మీ దురాశా పూరితమైన ఆలోచనల బోనులో వాళ్ళ టాలెంట్‌ను బంధించకండి. వాళ్ళు మీరుగా కాదు. వాళ్ళు వాళ్ళుగానే పెరగాలి. అదే ఈ జాడ్యానికి అసలైన మందు.

శివ: నాకు తెలుసు! ఈ పరీక్షలు, మందులూ, మాకులూ నాచిట్టితల్లిని మామూలు మనిషిని చెయ్యలేవు. ఈ ప్రలోభాలకు, వ్యామోహాలకు, పోటీలకు, పరుగులకు దూరంగా తీసుకెళ్తాను. అంబా అంటూ అరిచే లేగదూళ్ళ భాష నేర్పుతాను. చల్లని పైరుగాలులు, పచ్చని పంటపొలాలు చెప్పే, ప్రకృతిపాఠాలు చదివిస్తాను. పక్షుల కిలకిలలు, సెలయేటి గలగలల సంగీతం వినిపిస్తాను. నేలతల్లి పైరు కథలు చెప్తాను. ప్రకృతి ఒడిలోమానవ జీవితాల్ని సార్థకంచేసే అసలు సిసలు కొత్త చదువులు చదివిస్తాను. అప్పుడు నాచిట్టితల్లి మామూలు మనిషవుతుంది......మామూలు మనిషవుతుంది......(వల్లూరు శివప్రసాద్, హిందుధ్వని. డా!!అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్, పే 545-564)

పై ఆలోచనను అదేరీతిగా ప్రతిబింబించిన రచన పిల్లలు మాయమైనవేళ. ఇందులో సమస్యను పిల్లలదృష్టినుంచి చిత్రించటం విశేషం. తమకు ఎటువంటి విద్యకావాలో, తామాశించినవిద్య ఏరూపంలో ఉండాలో తమ ఆశలు, ఆకాంక్షలు, అనుభూతులు ఎటువంటి విద్యావిధానం ఆవిష్కరిస్తుందో కల్పనాత్మకమైన ఒక సన్నివేశంద్వారా ఇందులో చిత్రించటం విశేషం.

ఇక ఆ లోకం చేరిన పిల్లలది సందడే సందడి.

ఒకరు చిన్ని కృష్ణుడి దగ్గర వేణువు వూదడం నేర్చుకుంటున్నారు.... కొంతమంది బాలభీముడి వద్ద కుస్తీపట్లు నేర్చుకుంటున్నారు. మరికొందరికి సిండ్రెల్లా నాట్యం నేర్పుతోంది. పైపర్ వాయిద్యాన్ని ఒకరు పరిశీలిస్తుంటే అల్లావుద్దీన్ దీపాన్ని మరొకరు పరీక్షిస్తున్నారు. ..............

ఊహల ఉయ్యాలలూగేవాళ్ళు - సీతాకోకచిలుకలపై సవారి చేసేవాళ్ళు - ఇంద్రధనుస్సులపై జర్రునజారేవాళ్ళు - మేఘాల పరుపులపై పవళించేవాళ్ళు - తారల్ని మాలకట్టి తల్లో పెట్టుకొనేవాళ్ళు -!

సంతోషం - సంబరం - ఉత్సాహం - ఉల్లాసం! ...............

పిల్లలను పిల్లల్లాకాక,, పువ్వుల్లా విరియాల్సిన మొగ్గల్లా కాకుండా, తూకంబుతుకుల లోకంలో వ్యాపార దృక్పథ ప్రపంచలో కృత్రిమ పువ్వుల్లా మలచుకోవటాన్ని గర్హిస్తూ ఆ పువ్వులు రంగు, వాసన, సున్నితత్వం, సహజత్వం కోల్పోతున్నాయని గుర్తించాల్సిన అవసరాన్ని తెలియచెప్పింది.

"చిట్టికి బడి పుస్తకాలు ముఖ్యమే. కానీ చదువు అక్కడితో పూర్తవదు. ఆ బౌండు పుస్తకాల్లో బంధించబడని చదువును ప్రకృతి నేర్పుతుంది. చెట్టు పుట్ట గుట్ట మిట్ట ఇవి నేర్పుతాయి చదువును. కల్పన ప్రకృతికి ప్రియపుత్రిక. కల్పనామయ ప్రపంచం మాది. అయితే, చదువుల చట్రం బిగించి, ఊహలరెక్కలు తెంపి, సృజనకు సంకెళ్ళువేసి, భావాలను బంధించి మూసల్లాగా తయారుచేయడం ఏ మాత్రం సబబు?" ................

"నిజమే. మీకు తెలియంది ఏముంది? తెలిసితెలిసే పిల్లల శ్రమశక్తిని దోపిడీ చేస్తున్నారు. తెలిసితెలిసే వారి అమాయకత్వాన్ని దోపిడీ చేస్తున్నారు. దోపిడీ - విలువలదోపిడీ - విద్యలవిధిదోపిడీ - తెలిసితెలిసే ఈ ఫ్యాక్టరీలు - కంట్రాక్టర్లూ - బ్రోకర్లూ - " ..............

ఒక చిన్నినాటి అసంతృప్తిలోంచే హిట్లర్ తలెత్తాడు. ప్రపంచాన్నే విషాదంలో ముంచే అలాంటి పిల్లల కథ పునరావృతమవ్వకుండా జాగ్రత్త పడాల్సింది నేడే. ----------- ఇక, మా అందరి అభ్యర్థన నివేదన ఒక్కటే - పిల్లల్ని పిల్లలుగానే ఎదగనీయండి. పిల్లల గురించి ఆలోచించండి - ప్రేమతో ఆలోచించండి. (చంద్రలత, పిల్లలు మాయమైన వేళ . . . . , నేనూ నాన్ననవుతా!, పే 169-180)

ప్రత్యామ్నాయమైన విద్య ఏరూపంలో ఉండాలని పిల్లలు భావిస్తారో ఆ భావనలని యధాతథంగా అక్షరబద్ధం చేసిన రచనలు 'విద్యాధనం', 'పసిరిమొగ్గలు'

పైకి రావటమంటే ఏమిటో నాకు తెలియదు. కాని నాకు అంతా తెలుసుకోవాలని వుంటుంది. నాకు ఈ ప్రపంచం చాలా వింతగా, తమాషాగా, ఆసక్తికరంగా కనిపిస్తుంది. చిన్నవేసిన విత్తనంలోంచి ఈరోజు మొక్క వస్తే నాకు చాలా ఆశ్చర్యంగా వుంటుంది.--------- సాయంత్రం వేళల్లో పిల్లలందరూ వీధుల్లో గోలచేస్తూ, గాలిపటాలెగరేస్తూ, బంతాట, క్రికెట్టూ ఆడుతుంటే నాకూ వాళ్ళలో కలిసిపోయి పిచ్చిగా ఆడుకోవాలనిపిస్తుంది. కాని, ఇంట్లో ఒంటరిగా గంటలతరబడి హోంవర్కు చేస్తూ కూర్చోవాలనిపించదు. చదువుకుని అన్నీ తెలుసుకోవాలన్న ఆసక్తి ఉందికానీ, నేను పాఠాలు అప్పజెప్పే టేప్‌రికార్డరుగా, ప్రశ్నలకు సరైన సమాధానాలు అన్నరు పేపరులోదించే ఫొటోకాపీయర్లా ఉండలేను. చదువు పేరుతో నాచిన్నచిన్న కోరికలూ, ఆనందాలూ అన్నింటినీ చంపేసి, నా పసితనం నాకు దూరంచేసి నన్నొక మార్కులు పోగుచేసే కంప్యూటరుగా మార్చెయ్యకండి. - అని తన మనసులో తనకే అర్థం కాకుండా గందరగోళంగా మెదులుతున్న భావాలకు ఓ రూపం కల్పించి తల్లికి చెప్పడానికి వాడికి వయసూలేదు; భాషారాదు. పెదవి విప్పితే వచ్చేది ఏడుపే!

విద్య పరమార్థం విజ్ఞానమే అయితే, దానికి ఈ ఉరుకులూ, పరుగులూ అక్కర్లేదు. వాడికి తగిన విధంగా మెల్లిగా నేర్చుకుంటాడు. ఏదో ఒకరంగంలో తన ప్రతిభ చూపిస్తాడు. కాని........ వాడికి ఈ చదువు బతుకు తెరువు. వాడు రేపటిపౌరుడు. వాడి జీవితం ఓ పరుగుపందెం. పరుగు ఆపినవాడు వెనుకబడిపోతాడు. వెనుకబడ్డవాడు నాశనమైపోతాడు. వాడు అలసిపోతున్నాడని తల్లితండ్రీ జాలిచూపించినా రేపు లోకం జాలి చూపించదు. నిర్దాక్షిణ్యంగా తన కాళ్ళక్రింద తొక్కేసి వెళ్ళిపోతుంది. వాడు అడుగడుగునా - స్కూల్లో, కాలేజీలో, యూనివర్సిటీలో, ఉద్యోగాల్లో కాంపిటేషన్‌కి తట్టుకు నిలబడాలంటే ఇష్టమైనా, కష్టమైనా ఈ రేట్‌రేస్‌కి, ఈ ఆశాభంగాలకి ఇప్పట్నుంచే అలవాటు పడాలి. (తోలేటి జగన్మోహనరావు, విద్యాధనం, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 31-10-90,పే26-29)

విధానాల్లో పరిపక్వత ప్రధానాంశంగా వచ్చిన రచనలు సాహిత్యంలో కన్పిస్తాయి. రచయితలు సామాజికంగా ఏ మార్పుకోరుతున్నారో ఆ మార్పు చేకూరినప్పుడు ఇంక రచయితలు తమ కలాలను పక్కనుంచి వేరే వృత్తిని ఎంచుకోవాల్సివస్తుందన్న సూచనతో ముగిసే రచన 'వింతప్రపంచం'. భవిష్యత్తుపట్ల ఆశావహదృక్పథం ఇందులో కనిపిస్తుంది. నామిళ్ళదిన్నెను ఒక ఆదర్శరాజ్యంగా పేర్కొంటూ అందులో విద్యాపరమైన అసంబద్ధతకు తావులేకపోవటాన్ని ఈ రచన అక్షరబద్ధంచేసింది.

ఆ సన్నివేశంలో నాకు మరింత అపురూపంగా తోచిన మరొక విషయం అక్కడి గురుశిష్యసంబంధం. శకుంతలను అత్తవారింటికి సాగనంపుతూ, ఆ వియోగక్లేశాన్ని ఎదుర్కోలేక ఆశ్రమ వాసులు దుఃఖించటం సమస్త సాహిత్యంలోను గొప్ప కరుణార్ద్ర ఘట్టంగా పేర్కొంటారు. బడిపిల్లలకోసం ఏర్పాటైన ఆ వీడ్కోలు సమావేశాన్ని బట్టి నేనా ఘట్టాన్ని ఊహించుకోటం సాధ్యమైంది. అయిదేళ్ళ అన్యోన్య బతితోను, అధ్యాపకులతోను కలిగిన ఎడబాటు విద్యార్థులచేత వెక్కిళ్ళు పెట్టిస్తూ ఏడ్పించింది. ఉపాధ్యాయులచేత కన్నీళ్ళు పెట్టించింది. అయ్యవార్లు అత్యంత ప్రేమాభిమానాలతో పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి వుండాలి. విద్యార్థులు ఎంతో భయభక్తులతో , శ్రద్ధాసక్తులతో చదువుల్ని ఒంటబట్టించుకుని వుండాలి. అలాగాకపోతే వాళ్ళమధ్య యిలాంటి గాఢమైన అనుబంధం నెలకొనే అవకాశం ఎక్కడిది? చాలని దానికి హెడ్మాస్టరుగారు మరొక విస్మయావహమైన వార్త నాచెవిలో వేశాడు. పాఠ్యపుస్తకాలు చేతికిచ్చి, ఇన్విజిలేటర్లని లేకుండా చేసినా నెమిళ్ళదిన్నె విద్యార్థులు కాపీ కొట్టరట!

అవిధేయత, అలసత్వం, అవినీతి, స్వార్థప్రకోపం, చేటుబుద్ధి, చేతివాటుతనం-- యిలా నేనెరిగిన లౌకిక వ్యాయామలేవీ చెల్లుబడి లేనిచోట నేనూ ఒక గెలివరులా గ్రుక్కిళ్ళు మ్రింగవలసి వచ్చింది.

"ఒక ధ్యేయంతో ఏర్పాటైన సంస్థల్ని అదికాస్తా నెరవేరిన తర్వాత రద్దుచేసేస్తారు గదండీ! ఏ కళకైనా పరమార్థం సమాజశ్రేయస్సు. అది చేకూరి, ఇక తమ అవసరం సమాజానికి లేదనిపిస్తే రచయితలు తమతమ కొట్లు మూసివేయడానికి సిద్ధమేనని నేననుకుంటున్నాను" అన్నాను. (మధురాంతకం రాజారాం, వింత ప్రపంచం, మధురాంతకం రాజారాం కథలు, పే 140-147)

ఇలా ప్రత్యామ్నాయ విద్యపట్ల స్పష్టమైన ఆలోచనలతో నిండిన విమర్శ తెలుగు సాహిత్యంలో కనిపిస్తుంది.

ముగింపు:

విద్యపట్ల పటిష్ఠమైన, నిర్దుష్టమైన అవగాహనను అందించటంలోను, విద్యారంగంలోని విభిన్న విధానాల హేతుబద్ధత, నిర్హేతుకతలను గుర్తించటంలోను, ప్రత్యామ్నాయ విధానాల రూపకల్పనకోసం తగిన సూచనలు చేయటంలోను తెలుగు సాహిత్యం విస్తృతపరిధిలో చర్చించింది. ఫలితంగా ఒక సమగ్రమైన, సంబద్ధమైన విద్యావిధానాన్ని ప్రత్యామ్నాయంగా ప్రతిపాదించేందుకు వీలుకలిగింది.

బాలానందాన్ని కోల్పోకుండా జీవనోపాధికై ఎదిగేందుకువీలుపడేది, కేవలం పుస్తకాలు చదవటం మాత్రమేకాకుండా జీవితాన్ని చదవగలిగేది, విజ్ఞాన సముపార్జనకు వీలుకలిగించేది, మనిషిలో వినయాన్ని, వివేచనాశక్తిని, సంస్కారాన్ని పెంచేది, అజ్ఞానాన్ని అణచివేసేది, తిండి, బట్ట, ఇల్లు వంటి కనీసావసరాలను పొందేందుకు అవసరమైన జ్ఞానాన్నిచ్చేది, వ్యాపారాత్మకంకానిది, కేవలం పరీక్షలకే పరిమితంకానిది, సృజనాత్మకతని హత్యచేయనిది, ఆరోగ్యకరమైనపోటీకి వీలుండేది నిజమైన విద్యావిధానమన్న ఒక సమగ్రమైన భావనను తెలుగుసాహిత్యం మనకందించింది.

స్వాతంత్ర్యానంతర తెలుగుసాహిత్యంలో విద్యావిధానంపై వచ్చిన రచనలను అవలోకిస్తే కొన్ని ప్రధానమైన అంశాలు గమనంలోకి వస్తాయి.

వానిలో ప్రధానమైన అంశం సాహిత్యంలో ప్రాథమిక, ఉన్నతవిద్యా సమస్యలు చర్చకువచ్చినంతగా మాధ్యమిక విద్యకు చెందిన అంశాలు చోటుచేసుకోకపోవటం. బహుశా రచయితలలో అధికసంఖ్యాకులు ప్రాథమిక, ఉన్నతవిద్యలతో అనుబంధం కలిగినవారుకావటం ఇందుకు కారణం కావచ్చు. అంతేకాకుండా మాధ్యమికవిద్యపట్ల సమాజంలో సరైన అవగాహనలేకపోవటం, దాన్ని అంత ప్రయోజనకరమైందిగా భావించకపోవటం కనిపిస్తుంది. ఈ సామాజిక లక్షణం రచయితల్లో కూడా ఉండటంమూలంగా రచయితల దృష్టిని మాధ్యమికవిద్య ఆకర్షించలేకపోయిందని భావించాలి. అయితే మాధ్యమిక స్థాయిలో పనిచేసే వారినుంచి మాధ్యమికవిద్య ప్రధానాంశంగా చేసుకొని వచ్చిన రచనలు కనిపిస్తాయి. ఉదాహరణకు నవీన్, రెడ్డిశాస్త్రిగారల రచనలను ఇందుకు ఉదాహరణగా తీసుకోవచ్చు. అయితే ఇటీవలికాలంలో విద్యలో కార్పోరేట్ దృక్పథం పెంపొంది విద్య వ్యాపారీకరించబడేక్రమంలో మాధ్యమికస్థాయిలో దాని విషపరిణామాలు అధికంగా చోటుచేసుకోవటంతో రచయితల దృష్టి మాధ్యమికవిద్యపైన ప్రసరించసాగింది. ఫలితంగా సాహిత్యంలో మాధ్యమికవిద్య ఈ మధ్యనే చోటుచేసుకోసాగిందని భావించవచ్చు.

విద్యావిధానం కవిత్వంలో ప్రధానవస్తువు కాలేకపోవటం రెండవ అంశం. సాధారణంగా భావాత్మకమైన అంశాలే కవిత్వంలో ప్రతిఫలించేందుకు వీలుంటుంది. భావతీవ్రత కల్గిన అంశాలను వ్యక్తీకరించేందుకే కవిత్వాన్ని సాధనంగా ఉపయోగించటం జరుగుతుంటుంది. సామాజికంగా ఒక అంశం వ్యక్తుల అనుభూతులను ప్రభావితం చేయగల్గేదైనప్పుడే దాన్ని కవి స్వీకరించేందుకు అవకాశం ఉంటుంది. వాస్తవానికి విద్య అవసరాన్ని, ప్రాధాన్యాన్ని సమాజంలోని అధికవర్గాలు గుర్తించేపరిస్థితులు భారతదేశంలో ఇంకా పూర్తిస్థాయిలో ఏర్పడలేదు. కొంతమేరకు గుర్తించినప్పటికీ, వ్యక్తి అనుభూతులను, భావాలను ప్రభావితంచేసే స్థాయిలో విద్య గుర్తింపు పొందలేదు. ఈ కారణంగా విద్యావిధానం కవిత్వంలో వస్తువుకాలేకపోయింది. అందువల్లనే విద్యావిధానంపై వచ్చిన కవిత్వం అతి స్వల్పంగానే కనిపిస్తున్నదని భావించాలి. వరవరరావు ధార్యూవూ వంటి ప్రతిభను ప్రధానాంశంగా తీసుకుని వచ్చిన కొన్ని కవితలు మాత్రమే కనిపిస్తాయి.

మూడవ అంశం నవలల్లో అనేకం విద్యావిధానాన్ని ప్రధానాంశంగా చేసుకొని వచ్చినవి కనిపించినా వాటిలో సాంద్రతలోపించటం. పాంటయ్యచదువు వంటి కొన్ని మినహా విద్యావిధానంలోని సమస్యలను బహుముఖీయంగాను, లోతుగాను చర్చించిన రచనలు ఎక్కువగా కనిపించవు. అయితే సమస్యలను యథాతథంగా చిత్రించటంమాత్రం కనిపిస్తుంది. సమస్యలకు వెనుకగల సామాజిక, ఆర్థిక కారణాలను విశ్లేషణాత్మకంగా చర్చించటంమాత్రం వీనిలో చోటుచేసుకోలేదు.

చివరిది ముఖ్యమైనది విద్యావిధానాన్ని సమగ్రంగాను, లోతుగాను, విశ్లేషణాత్మకంగాను, విమర్శనాత్మకంగాను చర్చించిన సాహిత్య ప్రక్రియగా కథ రూపొందటం. కథాప్రక్రియలో విద్యావ్యవస్థకు చెందిన ప్రతి అంశం గాఢంగా ప్రతిఫలించింది. కథకున్న పరిమితి దృష్ట్యా ఒకే అంశానికి పరిమితంకావటంతో దాన్నే విస్తృతంగా చర్చించే వీలుకలిగింది. ఫలితంగా ఆ అంశం సమగ్రరూపం రచనలో అవిష్కరణపొందింది. అలా కథల్లో విద్యారంగానికి చెందిన విభిన్న అంశాలు విభిన్న రీతుల్లో ప్రతిఫలించాయి. నాటకాల్లో 'హింసధ్వని'లాంటి అతికొద్ది రచనలు మాత్రమే విద్యావ్యవస్థ ప్రధానాంశంగా వచ్చాయి.

ఇలా విభిన్న ప్రక్రియల్లో, విభిన్న రీతుల్లో విద్యావ్యవస్థకు చెందిన విభిన్నాంశాలు స్వాతంత్ర్యానంతర తెలుగుసాహిత్యంలో చోటు చేసుకున్నాయి.

అయితే ప్రక్రియాపరమైన పరిమితి లేకపోవటంవల్ల విద్యావిధానాన్ని ప్రతిఫలింపజేసిన స్వాతంత్ర్యానంతర తెలుగుసాహిత్యం మొత్తం ఇందులో భాగం కాలేదనేది వాస్తవం. అందువల్ల ప్రక్రియా పరిమితులతో పరిశోధనచేయగలిగితే సాహిత్యంలో విద్యావ్యవస్థ ప్రతిఫలనాన్ని మరింత సమగ్రంగా చర్చించే వీలుకలుగుతుంది.

=========

## అనుబంధం

### కథలు

అంకెలగారడీ, చక్రపాణి, తెలుగుస్వతంత్ర, 1-6-'56, పే 26-28.
అంగడి, శీలా సుభద్రాదేవి, తెలుగువిద్యార్థి, సెప్టెంబర్ '97, పే 35-36.
అందనా, దావలి సాంబశివ సుబ్రహ్మణ్యం, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, మే31/6జూన్-'95, పే 14-16.
అందనా, పంతుల జోగారావు, అపురూపం, పే 162-167.
అంతర్వలయం, హరిజాలు, జయంతి, జులై '60, పే 26-32.
అంత్యాక్షరి, కేతు విశ్వనాథరెడ్డి, కథ '96, పే 71-80.
అందరూ నిద్రపోతున్నారు, కలువకొలను సదానంద, భారతి, ఆగష్టు'78, పే 33-36.
అందరొక్క తైతే......, తుర్లపాటి లక్ష్మి, తెలుగు విద్యార్థి, ఆగష్టు'99, పే 39-41.
అకారణశత్రువు, ఏ.జయలక్ష్మిరాజా, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 28-2-'96, పే 68-70.
అగ్నిసంస్కారం, కె.లలితావలం, యువ, పే-156-157.
అగ్నిహోత్రుడు, వీరపల్లె వీణావాణి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 3-2-'88, పే 33-35.
అచ్చిరాలే అయుదాలు, ఎండ్లూరి సుధాకర్, మల్లెమొగ్గల గొడుగు, పే 92-95.
అడవిపువ్వు, బి. మురళీధర్, విపుల, జులై 87, పే 20-28.
అడిగిరాని వివరాలు, మధురాంతకం రాజారాం, భారతి, జూన్ '57, పే 51-61.
అద్వైప్రప్లవర్వం, గుండు సుబ్రహ్మణ్యదీక్షితులు, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 2-8-'84, పే 38-44.
అతడు జయించాడు, సింహప్రసాద్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 19-4-'99, పే 63-69.
అతి జాగ్రత్త, సూర్యప్రసాదరావు, ఆంధ్రజ్యోతి దీపావళి ప్రత్యేకసంచిక, 1995, పే 185-188.
అనగా అనగా, చంద్రలత, నేనూ నాన్నవవుతా!, పే 194-202.
అనర్హత, క్రాంతికిరణ్, ప్రజాసాహితి, డిశంబరు'90, పే 53-57,59.
అనాథ, కల్యాణసుందరీ జగన్నాథ్, ఇండియాటుడే, 22-12-'98, పే 44-47.
అనామిక, పాలంకి సత్య, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 2-10-'96, పే 4-5.
అంత్యాక్షరి, కేతు విశ్వనాథరెడ్డి, కథ '96, పే 71-80.
అన్యాపదేశమ్, ఆదెపు లక్ష్మీపతి, ఆదెపు లక్ష్మీపతి కథలు, పే 122-129.
అన్ రెస్ట్, అమృతలత, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 9-10-'89, పే 152-160.
అన్నదాతా! సుఖీభవ!, అరుణ, భారతి, జూన్ '85, పే 50-54.
అపశృతి, బి.సుధాకర్, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 2-8-'90, పే 38-40.
అపాత్రము, సి.బ్రహ్మం, విపుల, మే '87, పే 99-102.
అబ్బాయిపదువు, కె.శ్యామల, భారతి, ఫిబ్రవరి '51, పే 183-190.
అభినందన, ఎమ్మెస్రాజ్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 10-1-'90, పే 36-38.
అభ్యుదయం?, అమ్మినేని అక్కిరాజు, ప్రజాసాహితి, డిశంబరు'79, పే 38-42.
అమానుషం, ఆర్.లక్ష్మిప్రియ, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 20-12-'90, పే 24-26.
అమ్మ, పుట్రేపు సీత, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 2-4-'97, పే 10-11.
అమ్మా! అమ్మా!!, కాట్రుగడ్డ దయానంద్, పండుటాకు, పే 46-52.
అమ్మా అలకించవే, పిస్కకోల సుశీల, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 16-5-'96, 32-35.
" అమ్మా నేను స్కూలుకెళ్ళనే", యం.నిర్మల, తెలుగు విద్యార్థి, జులై '97, పే 31-32.
"అమ్మా... నే బళ్ళోకెళ్తానే!",కె.తాయారమ్మ, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 28-12-'83, పే
అయోచితదైవం, అవసరాల రామకృష్ణారావు, తెలుగుస్వతంత్ర, 19-3-'54, పే 15-16.
అయితే ఫో.....మల్లిక్, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 11-7-'91, పే 20-21.
అయ్యకుచెప్పాలి, కాంతారామ్, యువ, జులై '86.
అయ్యవారి నట్టిల్లు, పాలెపు బుచ్చిరాజు, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 19-1-'95.

**అరుగురుగో సుబ్బయ్య మేష్టారు...**, సత్యం శంకరమంచి, అమరావతి కథలు, పే 371-373.

**అరుణ్‌గాడి** చదువు, బి.రాజమోహన్, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 19/25-7-'95, పే 76-79.

**అర్హత**, పరుచూరి ఫణికుమార్, విపుల, జూన్'87, పే 35-39.

**అల**, దాసరి శిరీష, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 5-8-87, పే 48-49.

**అలజడి**, పెద్దిభొట్ల సుబ్బరామయ్య, భారతి నవంబరు '74, పే 35-41.

**అల్పజీవి**, పి.వి.ఆర్.శివకుమార్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 18-3-'87, పే 48-50.

**అవతలికోణం**, తురగా జానకీరాణి, ఆంధ్రపత్రిక ఉగాదిసంచిక, 1960-'61, పే 26-31.

**అవార్డు**, కొడవంటి కాశీపతిరావు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 30-1-'85, పే 27.

**అవినీతి అంచులపై**, నిఖిలేశ్వర్, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 1-4-'87, పే 21-24.

**అక్షరశిఖరం**, పక్కి శివప్రసాద్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఏప్రిల్ 27-3మే,'94, పే 66-67.

**అసతోమా** సద్గమయ, విజయలక్ష్మి రామకృష్ణన్, విజయలక్ష్మి రామకృష్ణన్ చిన్నకథలు, పే 109-123.

**అసిరిగాడి** పుస్తకం, పాతూరు రాజేంద్రప్రసాద్‌వర్మ, ప్రజాసాహితి, ఏప్రిల్ '80, 25-28.

**అస్తమించిన** సూర్యుడు, కప్పగంతుల శారద, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 6-2-'92, పే 68-71.

**అక్షరబంధం**, ఎ.వి.రమణప్రసాద్, తెలుగువిద్యార్థి, డిశంబర్ '98, పే 25.

**అక్షరసూర్యుడు**, ర.వ.స., ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 15-4-'84, పే 37-39.

**ఆకలి!దబ్బుకావాలి!**, గుమ్మనూరు రమేష్‌బాబు, భారతి, డిశంబర్ '84-జనవరి '85, పే 17-20.

**ఆచార్యదేవోభవ**, ఎమ్.ఉమాలక్ష్మి, యువ, జనవరి '87, పే 92-99

**ఆచార్యదేవోభవ**, కామినేని కృష్ణకుమారి, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక , 13-9-90, పే 52-53.

**ఆచార్యదేవోభవ**, పాలెపు బుచ్చిరాజు, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 2-3-'95, పే 40-41.

**ఆచార్యదేవోభవ**, వి.వి.బి.రామారావు, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, అక్టోబర్26/1నవంబరు-'94, 48-49.

**ఆచార్యదేవోభవ**, శశిహాస్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 23-3-'88, పే 21.

**ఆచార్యదేవోభవ**, విన్నకోట సుశీలాదేవి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 12-8-'87, పే 60-62.

**ఆచార్యదేవోభవ**, స్వరూప్‌సిన్హా, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 7-8-'91, పే 27-31.

**ఆచార్య** నారాయణస్వామి, ఇల్లిందల సరస్వతీదేవి, స్వర్ణకమలాలు, పే 940-949.

**ఆత్మహత్య**, బొంగు వేణుగోపాలరావు, దళితకథలు-5, 105-108.

**ఆన్సర్**, రాధిక, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 15-11-'90, పే 78-79.

"**ఆ బోర్డింగుకి వెళ్లను**", గుడిసె ఏసోబు, దళిత కథలు, పే 24-27.

**ఆమెఆవేదన అతనిఅంతరంగం**, పోట్లూరు సుబ్రహ్మణ్యం, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 11-3-'87, పే 43-46.

**ఆయా**, సదానంద్ శారద, విపుల, మే '87, పే 115-121.

**ఆర్నెల్లదాకారాను**, నవీన్, ఇండియా టుడే, 26-1-'99, పే 38-40.

**ఆలయంలేని దేవత**, భాస్కర స్వర్ణాంబ, 18-5-88, పే 36-39.

**ఆలింగనం**, ..., తెలుగు విద్యార్థి, నవంబరు'91, పే 49-50.

**ఆశ**, ఎ.ఎస్.రమేష్, యువ, ఏప్రిల్ '88, పే 11-13.

**ఆశ**, ఏ.సువర్ణ, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 6-3-91, పే 26-27.

**ఆశ**, వేదగిరి రాంబాబు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 20-12-99, పే 66-67.

**ఇంకానా ఇకపై చెల్లదు**, యస్. జయ, దళితకథలు-5, పే 220-229.

**ఇంకా తెలవారలేదు**, యస్.కాశీవిశ్వనాథం, ప్రతిధ్వనులు, పే 135-157.

**ఇంటర్వ్యూలో కృష్ణారావు**, ముదిగొండ శివప్రసాద్, అమంటితం, పే 257-270.

**ఇంటికొక హంతకుడు**, ఇచ్ఛాపురపు రామచంద్రం, కథామహల్: దువ్వూరి శారదాంబ పోటీ కథలు, పే 94-109.

**ఇతిహాసం**, మెతుకు మనోహర్‌రెడ్డి, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 24-10-'85, పే 78-79.

**ఇది ఆకలిరాజ్యం**, మధుర్ జీ, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 1-2-84, పే 48-53.

**ఇది బాల్యం... బంధాలొద్దు!**, విన్నకోట సుశీలాదేవి, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 9-11-'95, పే 30-32.

**ఇదేనా స్వాతంత్ర్యం**, రుద్రరాజు సుబ్బరాజు, విపుల, సెప్టెంబర్ '87, పే 71-78.

**ఇదే విప్లవం**, వి.కె.విశ్వనాథశర్మ, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 10-10-'84, పే 56-57.

**ఇన్‌ఫ్లేషన్**, వి.మోహన్‌కుమార్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 30-12-'81, పే 28-31.

**ఇన్విజిలేషన్**, అమృతలత, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 15-11-'90, పే 80-81.

**ఇన్స్పెక్షన్**, అమృతలత, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 17-1-'91, పే 36-38.

**ఈజలజ**, పులిపాక శ్రీరామచంద్రమూర్తి, ఆంధ్ర సచిత్రవారపత్రిక, 19-9-'91, పే 58-62.

ఈ కొరగానిచదువు, వి.వి.రావు, ఆంధ్రమహిళ, మే '59, పే 21-23.

ఈ తప్పు చేయకు, వాచస్పతి, నూరేళ్ళపంట, పే 160-168.

ఈ దేశం నాదనుకానీ..., గోవిందరాజు సీతాదేవి, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 24-11-'83, పే 60-64.

ఉక్కుపాదం, శాంతినారాయణ, దళితకథలు-4, పే 263-275.

ఉద్యోగాలు, పి.కృష్ణకుమారి, విపుల, నవంబరు'99, పే 110-115.

ఉత్తమ ఉపాధ్యాయుడు... తయారవుతున్నాడు, శుభ, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 2-11-'83, పే 35-39.

ఉత్పత్తి మనుషులు, టి.ఆర్.ఇంద్ర, కథ '96, పే 65-70.

ఉద్యోగాలు, బలివాడ కాంతారావు, భారతి, ఫిబ్రవరి '57, పే 5?-57.

ఉన్నతోద్యోగాలు, కరుణకుమార, భారతి రజతోత్సవసంచిక, జనవరి '49, పే 129-159.

ఉన్నాయి ఇలాంటివాళ్ళూ!, కవ్వని వెంకటకృష్ణారావు, యువ, ఏప్రిల్, '88, పే 115-120.

ఉపయోగపడే చదువు, ఆనంద్, అరుణతార, జనవరి '85, పే 36-38.

ఉప్పునీళ్ళు, సదానంద శారద, వ్యక్తిత్వవికాస కథలు, పే 201-208.

ఉషోదయం, మాడభూషి రామగోపాల్, అపురూప కథాప్రభ, పే 2-15.

ఊబి, చింతా అప్పలనాయుడు, నాగావళి కథలు, పే 97-101.

ఊరికొక బడి,కలువకొలను సదానంద, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 29-3-'99, పే 66-68.

ఎంట్రన్స్ కమ్ ఎగ్జిట్, గన్ను కృష్ణమూర్తి, విశ్వరచన, జనవరి '86, పే 14-16.

ఎండమావులు, చిర్రకోల సుశీలాదేవి,ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 26-4-'99, పే 50-54.

ఎంతెంత దూరం...?, సూరంపూడి సుధ, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 14-3-90, పే 37-38.

"ఎందుకుపారేస్తాను నాన్నా?", దాగంటి సోమయాజులు, దాసోకథలు, పే 98-105.

Xఎడ్యుకేషన్, గురజాడ శోభాపేరిందేవి, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 10-12-'92, పే 72-73.

ఎక్స్ వైజర్, ఎస్.భారతి, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 15-10-'92, పే 26-27.

ఎగిరిపోయిన ఆదర్శం, కప్పగంతుల మల్లికార్జునరావు, కప్పగంతుల మల్లికార్జునరావు కథలు, పే 66-72.

ఎజుకేటెడ్ ఇల్లిటరేట్, అమృతలత, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 13-12-'90, పే 64-66.

ఎడారి, దాట్ల నారాయణమూర్తిరాజు, యువ, డిశంబర్ '80, పే 155-160.

ఎదిగొచ్చిన కొడుకు, బి.వి.ఎ. రామారావు నాయుడు, నాగావళి కథలు, పే 66-74.

ఎనిమిది ఏళ్ళు, కె.ఆర్.కె.మోహన్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 28-7-'97, పే 60-62.

ఎన్నిక, అరుణపప్పల, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 26-10-'98, పే 38-42.

ఎటిసేత్తి... ఆఆఆఆ...., సత్యం మందపాటి, అమెరికాబేతాళుడి కథలు, పే 93-99.

ఎల్‌కేజీ సీటు, వారణాసి రామకృష్ణ, విపుల, ఫిబ్రవరి '99, పే 18-25.

ఎస్.ఐ.నవేద్యం, తల్లావజ్ఝల పతంజలిశాస్త్రి, ఆంధ్రజ్యోతి దీపావళి ప్రత్యేకసంచిక, 1991, పే 282-288.

ఏకలవ్యుడు, ఘంటికోట బ్రహ్మాజీరావుకథలు, మయూరాక్షి, పే 154-157.

ఏది గమ్యం, కొలకలూరి ఇనాక్, సూర్యుడు తలెత్తాడు, పే 161-169.

ఏది ధర్మం, ఓగేటి ఇందిరాదేవి, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 7/13-9-'94, పే 51-55.

ఏది సంస్కారం, వాత్రేవు రమాదేవి, విశ్వరచన, 16-5-'88, పే 7-10.

ఒక బలపం విరిగింది, ఎమ్.సి.ఆంజనేయులు, తెలుగువిద్యార్థి, డిశంబర్ '94, పే 21-24.

ఒక మొగ్గ రాలింది, పింగళి వెంకటరమణరావు, ఎలక్షాన్ కథలు, పే 151-154.

ఓ చింత(వింత)కథ, కల్లూరి కామేశ్వరీదేవి, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 14-3-'91, పే 76-78.

ఓ పాప వ్యధ, ఇవ్వాపురపు రామచంద్రం, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 21-2-'90, పే 57-59.

ఓపెన్ యూనివర్శిటీ కథ, ఎమ్మెస్సార్ మూర్తి, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 31-7-'96, పే 68-69.

ఓ పెళ్ళికథ, ఓల్గా, నూరేళ్ళపంట, పే 343- 350.

ఓ మహిళా దారిఇదిగో...., కొడవంటి కాశీపతిరావు, యువ, జూలై '76, పే 109-114.

ఓస్, ఏపుసెజ్జేనా, సత్తిరాజు కృష్ణారావు, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 25-4-'96, పే 12-13.

ఔదార్యం, ఎం.వి.రమణారెడ్డి, పరిష్కారం కథలసంపుటి, పే 67-82.

ఔదార్యానికి అటూ ఇటూ, పూర్ణాప్రసాద, సాహితి, మార్చి '66, పే 16-22.

ఔన్నత్యం, కిల్లాన మోహన్‌బాబు, యువ, డిశంబరు '86, పే 11-16.

కంచె, సింగమనేని నారాయణ, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 3-2-'88, పే 10-12.

కంచే చేనుమేస్తే...?, ముద్దంశెట్టి, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 1-12-'97, పే 12-13.

కంటకాభరణం, అవసరాల రామకృష్ణారావు, పేకముక్కలు, పే 292-295.

కాంపన్సేషన్, పాలంకి సత్య, 4-12-'96, పే 52-53.

కడుపుతీపి, వజ్రేంద్ర, యువ, ఫిబ్రవరి '82, పే 129-137.

కడుపుమండితే..., క్రాంతికిరణ్, ప్రజాసాహితి, మార్చి '80, పే 35-41.

కత్తిమీదసాము, కప్పగంతుల మల్లికార్జునరావు, యువ, మే '84, పే 119-128.

కనకదాసు, కాసుల ప్రతాపరెడ్డి, కాసుల ప్రతాపరెడ్డి కథలు, పే 39-44.

కనిపించని ముల్లు, ఆర్.యం.చిదంబరం, భారతి, మార్చి '58, పే 19-27.

కనువిప్పిన సత్యం, పమిడిముక్కల లక్ష్మణరావు, కృష్ణాపత్రిక 1957 మే 25, పే-11.

కనువిప్పు, వెలపాని ప్రసాదరావు, భారతి, ఫిబ్రవరి '61, పే 73-81.

కనువిప్పు, ముద్దంశెట్టి హనుమంతరావు, యువ, జూన్ '87, పే 124-130.

కన్నీళ్ళొలికాయి, చందు సోంబాబు, యువ, జనవరి '83, పే 126-136.

కర్షుడిబాపు, పంతుల జోగారావు, అపురూపం, పే 78-83.

కర్తవ్యం, ఛాయా రాజు దేవేంద్రరావు, జాగృతి, పారిశ్రామిక ప్రత్యేక సంచిక.'87, పే 136-138.

కర్మయోగులు, గిడుగు రాజేశ్వరరావు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 26-4-89, పే 13-16.

కర్మవీరుడు, కలువకొలను సదానంద, ఇండియాటుడే, 23-11-'99, పే 50-52.

కలుపుమొక్కలు, వారాల కృష్ణమూర్తి,ఆంధ్ర భూమి సచిత్ర వారపత్రిక, 5-3-'92, పే 48-49.

కల్పతరువులు, సుస్మితా రమణమూర్తి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 7-2-'79, పే 37-39.

కల్లోల కలలమేఘం, లోకేశ్వర్.పి, తెలుగు కథ-1999, పే 37-45.

కళ్ళజోడు, గరిమెళ్ళ నరసింహశర్మ, యువ, మే '87, పే 141-153.

కాగితపు పడవలు, రామా చంద్రమౌళి, యువ, ఫిబ్రవరి '78, పే 130-134.

కాన్వెంట్, ఖజానా, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 18-5-'88, పే 68-72.

కాన్వెంట్ కోచింగ్, మల్లిక్, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 12-9-'85, పే 30-31.

కాన్వెంట్ విద్య, కోన పద్మావతి, ఏప్రిల్ 1993, పే 43-44.

కాపరి, మామునూరు నరసింహారావు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక , 16-4-86, పే.12.

కార్యార్థి, మల్లిరెడ్డి చంద్రశేఖరరెడ్డి, మందాకిని, జులై'95, పే 33-35.

కాల్‌గర్ల్, ఎమ్.డి.సౌజన్య, యువ, ఏప్రిల్ '84, పే 128-134.

కిటికీ, మన్నెం శారద, ఇండియా టుడే, ఫిబ్రవరి 21-5 మార్చి '97, పే 64-67.

కిటుకు, కాలువశ్రీ, భారతి, మార్చి'86, పే 48-51.

కృతజ్ఞత, గున్నంరాజు సుందరరావు, యువ, అక్టోబర్ '79, పే 122-133.

కేతకి, పైడిపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి, స్రవంతి, జులై '78, పే 16-21.

కొత్తతరం, నీలి, దళితకథలు-3, పే 193-195.

కొత్తపులు, బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు, జయంతి, జనవరి '59, పే 23-26.

కొత్తరోగం, మల్లాది వెంకటకృష్ణమూర్తి, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 19-5-'83, పే 10.

కోటివిద్యల్లోనూ చేదవిద్య, విహారి, భారతి, ఫిబ్రవరి '81, పే 13-16.

కోడక కోడక కోడక ఈ పట్టా, గుండు సుబ్రహ్మణ్యదీక్షితులు, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 28-8-'85, పే 51-55.

క్రోటను మొక్కలు, ఎరువాళ్ళ సోమేశ్వర్, భారతి, అక్టోబరు 1968, పే 63-68.

క్లాసురూములో ప్రజాస్వామ్యం, కె.యస్.ప్రసాదరావు, తెలుగువిద్యార్థి, పే 9-10.

గంగాజలం, అరిశెట్టి శివన్నారాయణ, డా॥ అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్, పే 437-451.

గాంధారి రాగం, పి.సత్యవతి, ఇల్లలకగానే, పే 81-88.

గాంధీపాఠం, యం.సి.శివశంకరశాస్త్రి, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 10-7-'96, పే 44-45.

గుండు, బమ్మిడి జగదీశ్వరరావు, ప్రజాసాహితి, మే '97, పే 49-53.

గుండెలో కోయిల, విహారి, భారతి, డిశంబరు'85, పే 40-42.

గజఈతరాలు, గొరుసు జగదీశ్వరరెడ్డి, తెలుగుకథ-1999, పే 66-78.

గణనీయులు, మధురాంతకం రాజారాం, మధురాంతకం రాజారాం కథలు, పే 50-56.

గమ్యం, ఎం.వి.రమణారెడ్డి, పరిష్కారం కథలసంపుటి, పే 83-100.

గరళం, కె.బి.కృష్ణ, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 5-10-'95, పే 24-25.

గాఢమైన బంధం, పాలంకి సత్య, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 23-10-'96, పే 46-47.

గాలిలోదీపం, కొలకలూరి ఇనాక్, సూర్యుడు తలెత్తాడు, పే 76-79.

గిట్టుబడుపులు, సూరిశెట్టి సీతారామారావు, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 29-8-'84, పే 47-50.

గుడ్ ఓల్డ్‌వరల్డ్, ఎస్.వి.ఎస్.రావు, తెలుగు భాషాపత్రిక, అక్టోబర్ '72, పే 88-89.
గుర్తుమున్న, కొప్పుల భానుమూర్తి, ప్రజాసాహితి, జూన్ 95, పే 9-15.
గుణమిచ్చిన గుణపంధి, పురిజాల సుధాకర్, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 25-12-'85, పే 56.
గురుదక్షిణ, శలిదేవర వెంకట బాలకృష్ణారావు, ఆంధ్రమహిళ, ఏప్రిల్ '61, పే 6-11.
గురుదేవోభవ!, దొరవేటి, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 30-9-'99, పే 77.
గురువుగారూ...., రమణ, స్రవంతి, జనవరి '91, పే 10-13.
గెలుపు, కె.కె.రఘునందన, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 2-8-'89, 43-45.
గోడ, శ్రీ మధురేజీ, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 6-7-'83, పే 32-39.
గోరంత లాలింత, రావి.ఎన్.అవధాని, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 9-12-'99, పే 52-53.
గోల్డ్‌మెడలిస్ట్, అనంతం, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 18/24-10-'95, పే 28-29.
గురుదక్షిణ, కొల్లి సత్యనారాయణ, ప్రజాసాహితి, జూలై '94, పే 36-38.
గురుదక్షిణ, విస్సాకోల సుశీలాదేవి, ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక, 9-6-'83, పే 26-30.
గురుబ్రహ్మ.... గురుర్విష్ణు..... ఆదూరి సావిత్రి, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 6-12-'90, పే 48-50.
గురువుకు పాఠం, దగ్గుమాటి పద్మాకర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 23-12-87, పే 71-72.
గురుశిష్యులు, జలసూత్రులూరి మురళీమోహనరావు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 22-11-'99, పే 53-54.
గెజిటెడ్ ఆఫీసర్, కాశీ విశ్వనాథ్, కథామంజరి, పే 288-296.
గొడుగు, కొడవంటి కాశీపతిరావు, యువ, మే '84, పే 142-145.
గొడుగు, పి.డి.ఎస్.రామయ్య, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 4-7-'84, పే 35-37.
గోవూ గోమాయువూ, అవసరాల రామకృష్ణారావు, పేకముక్కలు: అవసరాల రామకృష్ణారావు కథలు, పే 90-99.
గోదారి, మధురాంతకం రాజారాం, మధురాంతకం రాజారాం కథలు, పే 117-124.
గోల్, ఆబోతుల శ్రీనివాసరావు, తెలుగు విద్యార్థి, డిశంబరు1998, పే 43-44.
గ్రహశాంతి, యస్.రాధాకృష్ణ మూర్తి, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 8-10-'87, పే 100-103.
గ్లాస్ విత్ కేర్, గిరీశం, సాహితి, ఫిబ్రవరి '66, పే 63-70.
జ్ఞానయోగం, వీరపల్లె వీణావాణి, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 15-5-'95, పే 54-56.
జ్ఞానక్షేత్రం, సత్యం శంకరమంచి, అమరావతి కథలు, పే 295-297.
జ్ఞాపకం, కె.ఎస్.వి.నరసింహాం, భారతి, ఆగస్టు 1975, పే 35-38.
చందా, తమ్మినేని అక్కిరాజు, ప్రజాసాహితి, నవంబరు'77, పే 38-40.
చంద్రహారం, ముదిగొండ శివప్రసాద్, భారతి, జనవరి'73, పే 49-56.
చంద్రునికో నూలుపోగు, సూర్యప్రసాదరావు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 27-4-98, పే 22-25.
చదివించరు ఈ గురువులు...., పత్తి సుమతి, వంశధార కథలు, పే 23-27.
చదువా! నీ విలువెంత?, బి. రాధికాకృష్ణ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 28-10-'87, పే 123-124.
చదువు, అన్వేషి, విపుల, అక్టోబర్ '82, 99-104.
చదువు, జయనాగరాజు, ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక, 2-9-'87, పే 68-69.
చదువు, బి.సి.హెచ్.వి.బసవరాజు, "జ్యేష్ఠ" కథలు, పే 116-123.
చదువు, కిల్లాన మోహన్‌బాబు, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 29/4-5/5-'92, పే 70-71.
చదువు, ఆర్.రామకృష్ణ, విపుల, సెప్టెంబరు'97, పే 78-85.
చదువు, ఐవాపురపు రామచంద్రం, యువ, మార్చి '78, పే148-153.
చదువు, కప్పగంతుల శ్రీ కృష్ణ బహదూర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 22-8-90, పే 35-38.
చదువు, ఎ.శ్రీధర్, యువ, అక్టోబర్ '81, పే 99-111.
చదువు, సింహప్రసాద్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 22-9-'97, పే 24-25.
చదువు, రెంటాల హనుమత్‌ప్రసాద్, యువ, జూన్ '85, పే 72-84.
చ(ద)దువు, విజయలక్ష్మి మురళీధర్, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 5-10-'89, పే 97-106.
చదువుకుంటే?......, సాక్షి, ప్రజాసాహితి, నవంబరు'85, పే 23-24&45.
చదువు 'కొంటా' ఉంటారు!, పులికంటి కృష్ణారెడ్డి, నాలుగ్గాళ్ళమండపం: రాయలసీమ జీవనశైలి, పే 159-163.
చదువు'కొన్న'వాడు, కోన పద్మావతి, తెలుగువిద్యార్థి, జూలై '93, పే 71-75.
చదువుఖరీదు జీవితం, కంఠంనేని రాజగోపాల్, ప్రజాసాహితి, జూలై'82, పే 51-56.
చదువు-పెళ్ళి, దేవులపల్లి లక్ష్మి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 23-11-'83, పే 32-33.
చదువెందుకు?, కప్పగంతుల మల్లికార్జునరావు, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 1-4-'87, పే 52-55.

దాపుక్రింద నీరు, ఆప్త చైతన్య, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 9-8-'89, పే 69-72.
చిగురు, వాకాటి పాండురంగారావు, కథామంజరి, పే 219-225.
చిన్నదేవ, పాలెపు బుచ్చిరాజు, యువ, జనవరి '87, పే 124-131.
చిరుదివ్వె, రాధ-మోహన్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 13-7-'83, పే 76-78.
చిరుదీపం, యువ, వల్లూరి శివప్రసాద్, జులై '86, పే 111-120.
చిరుదీపం, వియోగి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 18-10-89, పే 57-61.
చిల్లులు, సిసింద్రీ, నవంబర్16/15డిశంబర్-'90, పే 32-34.
చీలిక, చందు సుబ్బారావు, భారతి, డిశంబరు'79, పే 42-45.
చుక్కలముడి, పి.యస్.నారాయణ, కొత్తకథ, పే 106-119.
చెప్పులదండ, శంకర్, అరుణతార, అక్టోబర్/నవంబర్ '90, పే 18-22.
చెప్పులు, కావులూరు వెంకట నారాయణరావు, వ్యక్తిత్వవికాస కథలు,పే 9-17.
చెప్పులు, జింబో, దళితకథలు-3, పే 155-158.
చేతివేళ్ళు, పాలంకి సత్య, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 1-1-97, పే 26-27.
జత్తి, పి.చంద్, భూవిర్భాసితులు: పి.చంద్ కథలు, పే 49-52.
జననీ జన్మభూమిశ్చ..., మూడవ పిడ్డి పుణ్యశీలాప్రసాద్, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 26-1-'84, పే 60-64.
జననీ.... జన్మభూమీ!, మానస, యువ, ఆగష్టు '78, పే 145-156.
జన్మదినకానుక, బలాచంద్రయ్య, ఇండియాటుడే, 25-5-'99, పే 42-44.
జాతకం, పాలంకి సత్య, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 16-10-'96, పే 30-31.
జాతస్య మరణం ధ్రువం, వింధ్యవాసిని, యువ, జూన్ '85, పే 98-110.
జాతిరత్నం, తమ్మినేని అక్కిరాజు, ప్రజాసాహితి, డిశంబరు'82, పే 36-43.
జానకి చదువు, పి. నరసింగరావు, ఆంధ్ర మహిళ, ఫిబ్రవరి '60, పే 81-84.
జిజ్ఞాస, రావపూడి రమేష్, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 13-12-'99, పే 26-28.
జీతం చదువు, ఎమ్.హరా, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 6-2-'91.
జీబ్రా, జాతశ్రీ, భారతి, జనవరి '80, పే 49-51.
జీవన మార్గం, తమ్మినేని అక్కిరాజు, ప్రజాసాహితి, జనవరి 1982, పే 9-14.
జీవన్నాటకం, కప్పగంతుల మల్లికార్జునరావు, యువ, ఏప్రిల్ '78, పే 74-86.
జీవాతువు, ఆర్.వసుంధర, భారతి, మార్చి '71, పే 66-72.
జీవితపు మలుపు, మురయా, భారతి, ఏప్రిల్ '56, పే 60-70.
జీవితాలతో చెలగాటం, బొమ్మిడి అచ్చారావు, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 2-9-'99, పే 54-56.
జెరజూపోక్క, దోరవేటి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 17-4-'96, పే 36-39.
'జై!' కి బహువచనం "జై'లు!", అవసరాల రామకృష్ణారావు, పేకముక్కలు: అవసరాల రామకృష్ణారావు కథలు, పే1-8.
టార్చిలైటు, కరుణకుమార, ప్రజాసాహితి, మార్చి '79, పే 9-12.
'టిక్కుసుల్తాన్', శేషు, శేషవాక్యం: శేషురచనలు, పే 84-93.
ట్రీట్‌మెంట్, దాసరి వెంకటరమణ, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 21-6-'89, పే 38-39.
ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్,సి. హెచ్. వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 10-4-'96, పే 7-9.
డబ్బున్నోళ్ళింటేమెుంతమోజా! రంధి సోమరాజు, భారతి, మార్చి '81, పే 37-40.
డొనేషన్లు, ప్రణవి, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 20-11-'91, పే 49-52.
తొందరపడి... తొందరపడి, ద్వారకా, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 3-10-'84, పే 49-55.
తనదాకా వస్తే....., బిళా చంద్రయ్య, జాగృతి: పారిశ్రామిక ప్రత్యేక సంచిక, '87, పే 123-124.
తప్పు, కోనేరు రాజబాబు, ఆంధ్రజ్యోతి దీపావళి ప్రత్యేకసంచిక 1993, పే 253-256.
తప్పులతమాషా, బి.సి.హెచ్.వి.బసవరాజు, "శ్రేష్ఠ" కథలు, పే181-184.
తమతమ నెలవులు తప్పిన, తెలగరెడ్డి పుల్లయ్య, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 13-2-'92, పే 14-17.
తరం అంతరం, దినకర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 17-12-'86, పే 48-51.
తల్లిప్రాణం, సుబ్రహ్మణ్యశాస్త్రి, ప్రబుద్ధాంధ్ర, జనవరి '35, పే 1-10.
తల్లిమట్టి, స్వామి, దళితకథలు, పే 222-235.
తాను వెలిగించిన దీపాలు, మధురాంతకం రాజారాం, జీవితానికి నిర్వచనం, పే 92-100.
తాహతు, పాలంకి సత్య, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 30-10-'96, పే 26-27.
తిరుగుబాటు, టి.శ్రీవల్లీరాధిక, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 21-5-'97, పే 8-12.

తిర్యగ్గోళు. ఆదెపు లక్ష్మీపతి, ఆదెపు లక్ష్మీపతి కథలు, పే 86-97.

తెగతెంపులు. తూలికాభూషణ్, కిన్నెర, అక్టోబరు '51, పే 728-737.

తెగినపేగు. చక్రవేణు, అరుణతార, సెప్టెంబర్ '91, పే 7-11.

తెలుగుతండ్రీ లేవరా--దీక్షబూని సాగరా, మల్లిక్, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 19-11-'92, పే 56-57.

తెలుగుబాల సుకీబవ!, పులికంటి కృష్ణారెడ్డి, నాలుగ్గాళ్ళమండపం, పే 119-123.

తెలుగుమేష్టారి లెక్కలపాఠాలు,---, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 23-8-'84, పే 20-21.

తురాయిచెట్టు మళ్ళీనవ్వింది, భట్టిప్రోలు కృష్ణమూర్తి, యువ, నవంబర్ '83, పే 161-173.

తృణజ్యోతి, అబ్బూరాజు శ్రీనివాసమూర్తి, భారతి, మార్చ్'72, పే 42-51.

తృష్ణ. పాలకూరి లలిత, యువ, ఆగష్టు '80, పే 90-99.

తోడుకోసం. జయప్రద, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 18-4-'84, పే 25-29.

త్రివర్ణస్వప్నం. కలువకొలను సదానంద, ఇండియా టుడే, 25-8-'98, పే 34-35.

దర్పం. ఆర్.శశికళ, అరుణతార, ఆగష్టు '92, పే 13-20.

దయచేసి చంపెయ్యండి!. ఇచ్ఛాపురపు రామచంద్రం, భారతి, అక్టోబరు 85, పే 14-17.

దాహం. దుబాకుల భాగ్యలక్ష్మి, ప్రవంతి, మార్చ్/ఏప్రిల్ '96, పే 44.

దిక్కుమాలిన కాలేజీ. కె.ఎస్.వై.పతంజలి, రచన, ఫిబ్రవరి '00, పే 262-264.

దిక్కులేనిపక్షి. సవ్యసాచి, నాట్యకళ, జులై '70, పే 49-54.

దిదృక్ష. విజయలక్ష్మి మురళీధర్, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 21-8-86, పే 52-56.

ది బిగినింగ్ ఆఫ్ ది ఎండ్, తేజోనిధి, ప్రజాసాహితి, మార్చ్ '81, పే9-13.

ది రేప్. విజయలక్ష్మి మురళీధర్, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 8-11-'90, పే 26-29.

దిష్టిబొమ్మ. కప్పగంతుల మల్లికార్జునరావు, యువ, ఏప్రిల్ '85, పే 109-120.

ది 'సినిక్', కిల్లాన మోహన్‌బాబు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 28-12-'79.

దీపంపురుగులు. జి.రవికృష్ణ, శకలాలు: జి.రవికృష్ణ కథలు, పే 19-27.

దుష్టసమాసం. మధురాంతకం రాజారాం, భారతి, జూన్ '58, పే 55-69.

దుర్మార్గం. జీడిగుంట రామచంద్రమూర్తి, అమూల్యం కథలు, పే 48-55.

దుర్వినియోగం. ఆకెళ్ళ రాజ్యలక్ష్మి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 13-5-'87, పే 54-55.

దూరం. ఇచ్ఛాపురపు రామచంద్రం, భారతి, జనవరి 1976, పే 42-44.

దూరంగా సారంగధర, సత్యం శంకరమంచి, అమరావతి కథలు, పే 318-320.

దేవుడు ఏడుస్తున్నాడు,శ్రీకంఠమూర్తి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 1/7-12-'93, పే 34-37.

దేవుడూ-జిందాబాద్, యర్రంశెట్టిశాయి, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 15-12-'82, పే 25-29.

దోపిడీ. నవీన్, ఎనిమిదో అడుగు, పే 140-147.

దోసెడుమల్లెలు, రావినూతల సువర్నాకన్నన్, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 21-9-'98, పే 38-41.

ద్వంద్వ సమాసం, మధురాంతకం రాజారాం, మధురాంతకం రాజారాం కథలు, పే 74-81.

ధర్మభ్రష్టుడు, పోడవరపు రామశేషయ్య, భారతి, ఫిబ్రవరి '58, పే 15-19.

ధీరులు. ఎ.విజయలక్ష్మి, అభ్యుదయ, ఆగష్టు '78, పే 38-40.

ధ్వని, టి.దామోదరరావు, వ్యక్తిత్వవికాస కథలు,పే 48-51.

నాంది, ఎస్.జయ, రెక్కలున్న పిల్ల, పే 88-96.

నభోరహస్యం...., భట్టిప్రోలు విజయలక్ష్మి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 24-1-'90, పే 39-40.

నన్ను అర్థం చేసుకుంటావు కదూ!, తెనాలి సుశీలాదేవి, యువ, మే '83, పే 107-125.

నరమేధం జరుగుతోంది, పంతుల జోగారావు, అపురూపం, పే 135-142.

నాకీ బహుమతివద్దు, గుబ్బల సత్యనారాయణమూర్తి, 6/12-4-'94, పే 63-65.

నాగావళి నవ్వింది, ఎ.వి.రెడ్డిశాస్త్రి, అసంగత సంగతాలు, పే 56-76.

నాన్న, తెన్నేటిసుధ, యువ, జనవరి '83, పే 137-141.

నాన్నకు చెప్పకే!, మంథూరి శ్రీధర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 4-5-'98, పే 8-10.

నాన్న మంచివాడు కాదమ్మా!, తాళ్ళూరు నాగేశ్వరరావు, సాహితి, మార్చ్ '62, 50-55.

నాన్నా, ఒక్క ఛాన్సియ్యవూ!, పాలంకి సత్య, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 27-11-'96, పే 14-15.

నాన్నా నాకో బండికొనవూ!, కె.తాయారమ్మ, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 5-10-'88, పే 10.

నాపేరురాబొమ్మ, బోయ జంగయ్య, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 21-9-'88, పే 16-19.

నాబాల్యం ఏమైంది?, ఐ.సి.హెచ్.వి.బసవరాజు, "జ్యేష్ఠ" కథలు,పే 145-148.

నిజమైన తృప్తి, విన్నకోట సుశీలాదేవి, తెలుగు విద్యార్థి, నవంబరు'98, పే 33-34.

నిజరూపాలు, కవ్వగుంతుల మల్లికార్జునరావు, కవ్వగుంతుల మల్లికార్జునరావు కథలు, పే 94-103.

నిధి, గుండు సుబ్రహ్మణ్యదీక్షితులు, భారతి, జులై '84, పే 15-20.

నిరుద్యోగమా... నీకు జోహారు, కట్టా రాంబాబు, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 9-4-'92, పే 60-62.

నిష్కృతి, విజయ, కృష్ణాపత్రిక, 20-7-'57, పే 11,12,24&26.

నిరంజనం చదువు, ఇల్లిందల సరస్వతీదేవి, తులసిదళాలు, పే 675-689.

నీకోన్యాయం-నాకోన్యాయం, ప్రఫుల్లచంద్ర, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 7/13-9-'94, పే 64-65.

నీ బళ్ళో చదవను, యు.ఎ.నరసింహమూర్తి, భారతి, జులై 1974, పే 14-17.

నీహారిక, జి.యస్.భూషణరావు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, మే31/6జూన్-'95, పే 51-53.

నేనుసైతం, జె.సుధారఘునాథ్, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 20-5-'93, పే 48-51.

నేర్పిందెవరు?, రాజీవ, జ్యోతి, ఆగస్టు '74, పే 25-30.

న్యాయం-ధర్మం, ఇల్లిందల సరస్వతీదేవి, తులసిదళాలు, పే 746-753.

పంజరం, బి.యస్.రాములు, మమతలు మానవసంబంధాలకథలు, పే 48-53.

పందెపుగుర్రాలు, విజయలక్ష్మి రామకృష్ణన్, విజయలక్ష్మి రామకృష్ణన్ చిన్నకథలు, పే 63-74.

పెంపకం, కందుకూరి లింగరాజు, మే '49, పే 412-425.

పతిదేవుళ్ళు ఆడకూతుళ్ళు, మధురాంతకం రాజారాం, పాంథశాల, పే 183-192.

పవితనం, పులికంటి కృష్ణారెడ్డి, నాలుగ్గాళ్ళమండపం: రాయలసీమజీవనశైలి, పే 282-288.

పనిమాలితనం, అక్కినేని కుటుంబరావు, ఇండియా టుడే, జనవరి 21-5 ఫిబ్రవరి 1995, పే 62-66.

పయోధరఘోష, ద్వారకా, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 4-3-'87, పే 66-70.

పరమగురువు, పులికంటి కృష్ణారెడ్డి, తెలుగు కథ-96, పే 53-63.

పరాన్నజీవి, కాసుల ప్రతాపరెడ్డి, కాసుల ప్రతాపరెడ్డికథలు, పే 70-75.

పరిణామం, ఘట్టి ఆంజనేయశర్మ, జులై '47, పే 25-27.

పరీక్ష పంటలు, వల్లూరి రంగారావు, ప్రజాసాహితి, ఫిబ్రవరి '79, పే 21-32.

పరీక్షా ఫలితం, వద్దిపల్లి దయానందం, స్వతంత్ర, 6-6-'59, పే 28-30.

పరీక్ష, కొమ్మిశెట్టి మోహన్, విపుల, ఫిబ్రవరి '98, పే 70-76.

పరీక్ష హాలులో ప్రహసనం, బి.సి.హెచ్.వి.బసవరాజు, "జ్యేష్ఠ" కథలు, పే 135-137.

పరీక్షిత్తు, సింగమనేని నారాయణ, ప్రజాశక్తి దీపావళి ప్రత్యేక సంచిక '91, పే 240-245.

పరుగు, నందిగం కృష్ణారావు, నందిగం కృష్ణారావు కథలు, పే 101-107.

పలకా-- బలపం, చెరబండరాజు, ప్రజాసాహితి, జులై 1984, పే 27-30.

పలకా-బలపం, సత్యవాణి పోరుమామిళ్ళ, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 5-12-'79, పే 69-73.

పసిరిమొగ్గలు, సోమంచి రామం, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 18-4-79, పే 69-75.

పాకీది, అవిశెట్టి సుబ్బారావు, దళితకథలు, పే 60-72.

పాఠాల ఆచార్యులు, శంకరగంటి రంగాచార్యులు, స్రవంతి, ఫిబ్రవరి '91, పే 11-14.

పాతాళిప్పటికో, డొంపేటి, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 10-7-'96, పే 67-69.

పాప-హోంవర్కు, వసుంధర, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 26-10-'95, పే 68-69.

పాపం టిప్పు సుల్తాన్, సూర్యప్రసాదరావు, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 6/12-12-'95, పే 36-38.

పాలబుగ్గల పసివాడు, ---, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 29-11-78, పే 76-77.

పిచ్చి వెంకట్రావు, మధురాంతకం రాజారాం, ఆంధ్రపత్రిక ప్రమాది సంవత్సరాది సంచిక, 1973-74, పే 65-72.

పిల్లలు మాయమైన వేళ . . . . , చంద్రలత, నేనూ నాన్ననవుతా!, పే 169-180.

పి.హెచ్.డి, అడివి సూర్యకుమారి, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 10-12-'87, పే 26-29.

పీడితుల చదువు, బొల్లిముంత నాగేశ్వరరావు, ప్రజాసాహితి, ఏప్రిల్ 1983, పే 52-64,15&17.

పీతకష్టాలు, కె.కె.రఘునందన, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 20/26-5-'92, పే 42-45.

పీల్చే జలగలు--ఏడ్చే అంతరాత్మలు, సనగరం పార్థసారథి, మంజరి, 1974-'75, ---.

పుట్టినరోజా, ఆదెపు లక్ష్మీపతి, ఆదెపు లక్ష్మీపతికథలు, పే 114-121.

పుత్రోత్సాహం, మధురాంతకం రాజారాం, జీవితానికి నిర్వచనం, పే 156-162.

పునరంకితం, ఎమ్.వి.యస్.శర్మ,ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక,19-7-'89, పే 73-78.

పులివయసి లేడికూన, సైదిపాల, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 26-5-'83, పే 36-38.

పులుకడిగిన ముత్యం, అయ్యగారి శ్రీనివాసరావు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 1/7-3-'95, పే 30-34.

పూజారి, భరాగో, కులాసా కథలు, పే 227-233.

పెజల'మనిషి'ఎవరు, సత్యకామ్, సత్యకామ్ సెటైర్లు, పే 75-76.

పెద్దక్క ఉద్యోగం, శివల జగన్నాథరావు, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 1-8-'90, పే 26-27.

పెద్దచదువు, ఓగేటి శివరామకృష్ణ, భారతి, జూన్ '51, పే 574-584.

పెద్దరోగం, కెమెరా విజయకుమార్, దళితకథలు-5, పే 195-200.

పెరటిచెట్టు,బలసా-పుటూరి మురళీమోహన్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 21/27-12-'94, పే 54-58.

పోస్టుమన్ పి హెచ్.డి, చిట్టూరి కోటేశ్వరరావు, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 8-8-'96, పే 12-18.

ప్రశాంతం, స్వామి, తెలుగుకథ-96, పే172-188.

ప్రార్థన,పెనుమాక నాగేశ్వరరావు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 10-7-'96, పే 4-6.

ప్రియమైన వస్తువు, కాకాని కమల, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 25-7-'96, పే 78-80.

ప్రెజెంటేషన్స్, అమృతలత, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 27-12-'90, పే 46-48.

ప్రేమనిచ్చిన ప్రేమవిమ్మనం [?], మంజుశ్రీ, ఇండియాటుడే, 21-12-'91/5-1-'92, పే 84-87.

ప్రేమరాహిత్యం, పెద్దాడ వేంకట నరసింహ మూర్తి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 30-11-88, పే 51-53.

ప్రేరణ, బందరు కాళిదాస్, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 23-5-'90, పే 38-39.

ప్లాస్టిక్ పువ్వులు, ఎస్.జయ, రెక్కలున్న పిల్ల, పే 21-28.

ఫలించిన దీవెన, యం.వి.కమలాదేవి, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 12-7-'89, పే 26-28.

ఫస్ట్ స్టెప్, డి.రామరావు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 5-6-'96, పే 8-9.

ఫాన్సీ, పాలడుగు వెంకటేశ్వరరావు, భారతి, ఆగస్టు '88, పే 23-26.

ఫిక్స్డ్ డిపాజిట్, మంధా వెంకటరమణారావు, ఆంధ్రజ్యోతి దీపావళి ప్రత్యేకసంచిక 1993, పే 42.

ఫిర్యాదు, కలా చంద్రశేఖరశాస్త్రి, భారతి, జులై '47, పే 89-92.

బందీ, బి.ఎస్.రాములు, బి.ఎస్.రాములు కథలు, పే 29-35.

బంధం, వేములపల్లి స్వర్ణ, యువ, జనవరి '78, పే 138-143.

బడి, జీనరసింహమూర్తి, తెలుగు అమెరికా, జులై '78, పే 26-28.

బడిగంట (మోగేదెప్పుడో!), రాజేంద్రప్రసాద్ పండా, యువ, ఏప్రిల్ '80, పే 162-169.

బడిగంటలు, కవిరావు, తెలుగువిద్యార్థి, జనవరి '57, పే 18-21.

బడిపంతులు, విజయమూరి శివరామారావు, తెలుగు విద్యార్థి, జనవరి'79, పే 16.

బడిపాట,గంటేడ గౌరునాయుడు, ఏటిపాట, పే 39-48.

బతికున్న నిజాయితీ, కె.మధుసూదన్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, సెప్టెంబరు30/6అక్టోబరు --'92, పే 42-45.

బతుకుబడి, దార్ల రామచంద్ర, దళితకథలు-3, పే 159-167.

బలహీనుడి ఆత్మనిగ్రహం, కొండముది శ్రీరామచంద్రమూర్తి, యువ, మార్చి '78, పే 137-141.

బలి, విజయలక్ష్మి మురళీధర్,ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 8-1-'87, పే 108-112.

బళ్ళోకెళ్ళాలి, జమదగ్ని, నూటపదహార్లు, పే 456-461.

బాకీ, అవసరాల రామకృష్ణారావు, పేకముక్కలు, పే 123-129.

బాకీ, కె.వి.యస్.వర్మ, ఆంధ్రజ్యోతి దీపావళి ప్రత్యేకసంచిక 1995, పే 138-143.

బాతుగాడికి ఒకటే, బీనాదేవి, కథలు కబుర్లు, పే 24-29.

బాబోయ్! కంప్యూటర్మ్యాల్, యర్రంశెట్టిశాయి, ఆంధ్రజ్యోతి దీపావళి ప్రత్యేకసంచిక 1993, పే 219-220.

బాబోయ్ బడికెళ్ళను, గురజాడ శోభాపేరిందేవి, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 21-1-88, పే 30-34.

బామ్మ తపఃఫలం, తాలికాభూషణ, కిన్నెర, జులై '50, పే 35-38.

బాలలదినోత్సవం, రాయసం వెంకట్రామయ్య, నాగరాజేయమ్, పే 114-119.

బాలలదినం, చంద్రలత, నేనూ నాన్నవుతా!, పే 8-21.

బాలలదినం, సింహప్రసాద్, ప్రజాసాహితి, మే'79, పే 27-35.

బి.ఎస్.రాములు, మమతలు-మానవసంబంధాల కథలు, పే 48-53.

బీజం, పోలుకూర సీతాలత, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 5-11-8[?], పే 76-84.

బురఖా, సలీం, విశ్వబ్రహ్మసంగీతం, పే 9-15.

బుడగలు, సింగమనేని నారాయణ, విపుల, సెప్టెంబర్ '79, పే 50-67.

బుద్ధిగా చదువుకుంటానునాన్నా, శ్రీరామచంద్ర, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 10-7-'85, పే 16-19.

బూట్ పాలిష్, కళింకోట ప్రభాకరదేవ్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 27-12-78, పే 34-35.

బెదురు, వి.రాజారామమోహనరావు, జ్యోతి, ఫిబ్రవరి '77, పే 65-75.

జేజీ, దాట్ల నారాయణమూర్తిరాజు, యువ, మార్చి '78, పే 142-147.

బొట్టురు, తమ్మినేని అక్కిరాజు, ప్రజాసాహితి, జనవరి '96, పే 32-38.

బొమ్మలబొక్కా, పంతుల జోగారావు, అపురూపం, పే 147-149.

బ్రతుకుబడిలో, స్వర్ణా సుధాకర్, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 15-10-1992, పే 36-37 .

బ్రతుకుబరువు, కాసారం కుప్పుస్వామి, భారతి, డిశంబర్ '58, పే 65-74.

బ్లాక్‌మెయిల్, పాలంకి సత్య, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 25-9-'96, పే 30-31.

బ్లాక్‌హోల్, అనామకుడు, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 14-6-'90, పే 76-79.

భగవంతుడి జాబితా,మధురాంతకం రాజారాం, పాంథశాల, పే 221-229.

భరతపుత్రుడు, వి.కె.చైతన్య, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 3-5-'90, పే 32-36.

భిక్షాపాత్ర, జి.వి.కృష్ణారావు, ఆదర్శశిఖరాలు, పే 25-45.

మొండిగోడ, కలువకొలను సదానంద, జయంతి, మే '60, పే 29-39.

మకరముఖం, సింగమనేని నారాయణ, సింగమనేని నారాయణకథలు, పే 12-18.

మట్టిగుర్రం, కన్నేపల్లి చలమయ్యశాస్త్రి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 17-8-'88, పే 72-77.

మనస్తత్వం, కిల్లాన మోహన్‌బాబు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 12-12-'79, పే 42-43.

మనిషి-పశువు, ఎమ్.పార్థసారథి, భారతి, మే '80, పే 27-28.

మన్నించండి మాష్టారూ!, ప్రఫుల్లచంద్ర, యువ, జూన్ '82, పే 119-127.

మమ్మీ, ఆకలి, రావి-ఎన్-అవధాని, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 28-10-'99, పే 52-54.

మరో కర్ణుడికథ, భార్గవీరావు, నాపేరు, పే 39-44.

మా అమ్మాయి, ఎస్.జయ, రెక్కలున్న పిల్ల, పే 51-57.

మాఊరి పంతులు, జి.యస్.భూషన్‌రావు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 22/28-7-'92, పే 44-46.

మా కాలేజీ స్ట్రైక్, ధరణిప్రగడ వెంకటశేషగిరిరావు, యువ, జూన్ '86, పే 81-86.

మా కాన్వెంట్, గుడిసె ఏసోబు, దళితకథలు, పే 13-16.

మాతృదేవోభవ, డా. నరసింహామూర్తి, విపుల, నవంబరు '97 పే : 5-9.

మా తెలుగుమేష్టారు, వేలూరి వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 17-8-'98, పే 86-88.

మాధవసేవ, జి.రవికృష్ణ, శకలాలు: డాక్టర్.జి.రవికృష్ణ కథలు, పే 1-7.

మానవత్వం పిలుపునిచ్చినవేళ, మాదిరాజు రామలింగేశ్వరరావు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 22/28-7-'92, పే 68-71.

మామిడిచెట్టు మళ్ళీ పూసింది, శాంతారామ్,యువ, జనవరి'87, పే 8-12.

మాయ, ఆర్.వసుంధర, భారతి, ఫిబ్రవరి '68, పే 20-28.

మారని విలువలు, పి.పాపిరెడ్డి, యువ, మే '81, పే 75-86.

మార్గదర్శులు, గిడుగు రాజేశ్వరరావు,తెలుగుకథ-96, పే 223-229.

మార్పు, టి.ఎస్.రాములు, టి.ఎస్.రాములు కథలు, పే 58-66.

మార్పురావాలి, ద్వారకా, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 26-6-'85, పే 75-78.

మాష్టారూ నాచేతిలో చాకు?, నన్నపనేని ఉమాదేవి, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 11-7-'91, పే 72-75.

మిడ్ డే మీల్స్ జిందాబాద్, జూపిటర్, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 4-8-'83, పే 50-52.

మీకోసం.... మీ పిల్లలకోసం, గుడిసె ఏసోబు, దళిత కథలు, పే 36-39.

మీ నీతులు మాకొద్దు, ఇ.టి.రామారావు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 10-8-'88, పే 51-55.

మీపిల్లల్ని ఇంతేనా......, కిన్నెర, యువ, ఆగష్టు '85, పే 95-101.

ముఖ్యమంత్రి ప్రశ్న, పింగళి వెంకటరమణరావు, ఎలక్షన్‌కథలు, పే 29-30.

ముగింపు దొరికింది, ఆర్.ఎం.చిదంబరం, భారతి, ఏప్రిల్ 1961,పే 38--51.

ముప్పయిరూపాయలు, వి.గోపాలకృష్ణ, భారతి, మార్చి'55, పే 47-51.

ముసలాడిమాట, క్రొవ్విడి లక్ష్మన్న, భారతి, మే'53, పే 424-429.

మూడుముళ్ళు, పింగళి వెంకటరమణరావు, ఎలక్షన్‌కథలు, పే 135-138.

మేధ మథనం, ఉద్దెమఱ్ఱి గోపాలరావు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 17-5-89, పే 36-37.

మేధావి, దండుసుబ్బారావు, భారతి, జులై'79, పే 9-13.

మేధావులారా!ఆలోచించండి, మధురేశ్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 14-3-'84, పే 28-33.

మేలుకొలుపు, గంధ్రేటి పెంటయ్య, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 23-8-'84, పే 42-43.

మైనస్ ఇంటూ మైనస్, పులిపాక శ్రీరామచంద్రమూర్తి, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 18-4-'84, పే 16-29.

మొద్దురాచిప్ప, కొండేపూడి నిర్మల, శతృస్పృశ: నిర్మలకథలు, పే 9-16.

మొలక, కొడవంటి కాశీపతిరావు, మందాకిని, జులై '95, పే 8-11.
మోడల్, పులిపాక శ్రీరామచంద్రమూర్తి, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 27-3-'85, పే 42-46.
మోడల్, వాణిశ్రీ, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 19-9-'90, పే 44-45.
మౌనవీణాగానమిది, శివిస్ ధనిశెట్టి, కథ '98, పే 113-116.
యజ్ఞ పశువు, మా గోఖలే, మాగోఖలే కథలు, పే 296-302.
యథార్థదృశ్యాలు, మునిమాణిక్యం నరసింహారావు, తెలుగువాణి, జూన్/జులై '85, పే 59-67.
యస్...మిస్, వీరాజీ,వీరాజీ కథలు, పే 226-232.
యుద్ధపర్వం, వీరపల్లె వీణావాణి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 6-6-'90, పే 47-51.
యుద్ధం, కె.వి.యస్. వర్మ, యువ, ఆగస్టు '84, పే 78-86.
యూనిఫాం, పెనుమాక నాగేశ్వరరావు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 4-7-90, పే 74-78.
"రెండవతరం", దాగంటి సోమయాజులు, కిన్నెర, జులై '50పే 57-63.
రెండు మరణాలు, అల్లం వీరయ్య, రుతుపవనాలు, పే 196-205.
రక్తాశువు, గంటేడ గౌరునాయుడు, ఏటిపాట, పే 130-138.
రక్షకులు, స్వరూప్ సిన్హా, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 23-1-'91, పే 74-77.
రాగాలచెట్టు, గంటేడ గౌరునాయుడు, ఏటిపాట, పే 118-129.
రాగింగ్, అమృతలత, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 20-12-'90, పే 70-74.
రాగింగ్, విలుకూరి దేవపుత్ర, ప్రజాసాహితి, డిశంబర్ '79, పే 26-32.
రాతమారిపోయింది, అవసరాల రామకృష్ణారావు, పేకముక్కలు, పే 1ƀ8-122.
రాలినమొగ్గ, విల్లర భవానీదేవి, యువ, మే '81, పే 107-111.
రిపేర్‌స్కాలర్, రాయసం వెంకట్రామయ్య, నాగరాజీయమ్, పే 140-145.
రిటైర్మెంట్, టి.లక్ష్మయ్య, తెలుగు విద్యార్థి, సెప్టెంబరు'91, పే 39-40.
రియల్ఎస్టేట్, బి.ఎస్.రాములు, బి.ఎస్.రాములు కథలు, పే 36-45.
రీ-సెర్చ్, రాధిక, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 6-12-'90, పే 78-80.
రుగ్మత, భట్టిప్రోలు విజయలక్ష్మి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 18-4-'90, పే 10-12.
రుణం, బులుసు వెంకటేశ్వర్లు, భారతి, మే '86, పే 12-15.
రెక్కలులేని పక్షి, జబ్బగుంట రఘునాథరెడ్డి, భారతి, అక్టోబరు1980, పే 26-31.
రెక్కవిప్పిన బాల్యం, గాయత్రీదేవి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 10/16-5-'95, పే 18-21.
రేపటిపువ్వు, కె.వీణారెడ్డి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 11-1-89, పే 14-17.
రేపటి సూర్యునికోసం, పరిమళ, అరుణతార, అక్టోబరు'95, పే 17-23.
లెక్కలమాష్టారు, సలీం, మందాకిని, సెప్టెంబర్ '95, ....
లేతమొలకలు, అరిగె రామారావు,బుచ్చిబాబు స్మారక కథాసంపుటం 1:అరిగె రామారావుకథలు, పే 213-221.
లోయలు, ఆర్.యం.చిదంబరం, భారతి, నవంబర్ '57, పే 64-70.
వంకర, సి.సుజాత, రెప్పవాలు చప్పుడు, పే 42-50.
వంకరమనుషులు, కన్నెపల్లి చలమయ్యశాస్త్రి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 2-12-'87, పే 63-69.
వంశాంకురం, పాలంకి సత్య, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 18-12-'96, పే 6-7.
వింతపశువు, సెంటినా సరోజిని, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 28-10-87, పే 102-103.
వింత ప్రపంచం, మధురాంతకం రాజారాం, మధురాంతకం రాజారాం కథలు, పే 140-147.
వెంకడు, దాగంటి సోమయాజులు, భారతి, ఏప్రిల్'53, పే 301-304.
వయసు మనసు, సూర్యప్రసాదరావు, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 18-9-'86, పే 68-70.
వర్ణక్రమాలు, తోలేటి జగన్మోహనరావు, వ్యక్తిత్వవికాస కథలు, పే 195-200.
వల, బొంగు వేణుగోపాలరావు, తెలుగువిద్యార్థి, జులై '97, పే 41-43.
వలచీనావమ్మ, ఎస్.భవాని, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 7-1-'93, పే 56-57.
వలయం, దాగంటి తులసి, తెలుగు కథ 1960-85, పే 152-160.
వలపు, రఘురామరాజు, రఘురామరాజు కథలు-పునరావృతం, పే 27-29.
వాన, [illegible]
వానలపిల్లాడు, మునిపల్లెరాజు, భారతి, జనవరి '53, పే 64-75.
వాత్సల్యావాతిన భూపాలరాగం, పి.శ్రీదేవి, జయంతి, జులై'59, పే 12-25.
వాహకులు కావాలి, దేవరాజు రవి, దేవరాజు రవి కథలు, పే 117-123.

విక్రమార్కుని సింహాసనం, వసుంధర, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 10-6-'87, పే 28-31.

విజయగర్వము, ఇల్లిందల సరస్వతీదేవి, ఫిబ్రవరి '50, పే 151-154.

విజయానికి అడ్డదారి, వసుంధ బసవేశ్వరరావు, తెలుగువిద్యార్థి, అక్టోబర్ '94, పే 39-42.

విద్య-వింత పశుత్వం, బేకుమళ్ళ కామేశ్వరరావు, ప్రజాసాహితి నవంబరు '78, పే 33-43.

విద్యాదీక్ష, ఉష శ్రీ, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 31-5-'99, పే 18-23.

విద్యాధనం, తోలేటి జగన్మోహనరావు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 31-10-90,పే26-29.

విద్యాబోధ, సి.వి. కృష్ణారావు, సృజన, ఆగష్టు '69, పే 51-52.

విద్యావ్యవసన పద్ధతి, వామరాజు లక్ష్మీనరసింహారావు, తెలుగువాణి, మార్చి '83, పే 17-20.

విద్యార్థి, వేదుల లక్ష్మణమూర్తి, భారతి, ఫిబ్రవరి '56, పే 51-64.

విద్యావిధానం, పులుగుండ్ల రామకృష్ణయ్య, భారతి, ఫిబ్రవరి '60, పే 15-19.

విద్యావివాహానాశాయ, కె.గోదావరిశర్మ, విపుల, జనవరి 1988 పే 14-21.

విద్యా వివాహానాశాయ...?, ద్విభాష్యం రాజేశ్వరరావు, యువ దీపావళి ప్రత్యేక సంచిక 1977, పే 44-47.

విపర్యయం, స్వామి, ఇండియా టుడే , మే 6-20,1997 పే 50-53.

విఫలంగాని విజిట్, రత్నం, తెలుగుస్వతంత్ర, 13-4-'56, పే 14-16.

విముక్తి, షేక్ మస్తాన్‌వలీ, విపుల, జూన్'83, పే 120-130.

విలయనృత్యం, కొర్లపాటి శ్రీరామమూర్తి లంక శివరామకృష్ణశాస్త్రి, జయంతి, మార్చి '60, పే 12-23.

విశ్వనరుడు, ఎమ్.సుగుణరావు, వ్యక్తిత్వవికాస కథలు, పే 57-61.

విషాదం పొంగి పొర్లింది,జనస్వామి కోదండరామశాస్త్రి, భారతి, మే'58, పే 77-86.

విషాదాంతం, నాగభూషణ్, భారతి, సెప్టెంబర్ '56, పే 21-32.

విష్ణుశర్మ ఇంగ్లీషుచదువు, భమిడిపాటి కృష్ణమూర్తి, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 1-10-'98, పే 64-65.

వీడ్కోలు, ఎమ్.వి.వి.సత్యనారాయణ, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 4-3-'87, పే 50-51.

వెన్నెల, రవీంద్ర, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 18-1-'84, పే 81-85.

విలువ, కిల్లాన మోహన్‌బాబు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 27-12-'78, పే 50-51.

విలువ, పి.వి. శేషారత్నం, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 18-1-'99, పే 74-77.

విశ్వనరుడు, ఎమ్.సుగుణరావు, వ్యక్తిత్వవికాస కథలు, పే 57-61.

వెన్నముక విరిగింది, పోట్లూరు సుబ్రహ్మణ్యం, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 18-2-'87, పే 22-24.

వెలుగు నీడ, పులాపు బాలకేశవులు, విపుల, డిశంబర్ '88, పే 20-24.

వెలుగులోకి, ఆదిరాజు వేణుగోపాల్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 13-3-91, పే 26-29.

వెలుగుసముద్రంలో చీకటిదీవి, మధురాంతకం రాజారాం, పాంచజన్య, పే 26-40.

వెల్‌విషర్స్, దాసరి రామచంద్రరావు, పంచతంత్రకథలు, పే 112-118.

వేడుకభూపాతుద్యమం, వేణు, ఆంధ్రజ్యోతి దీపావళి ప్రత్యేకసంచిక 1983, పే 113-124.

వేదాంతి, జి.వి.కృష్ణారావు, జి.వి.కృష్ణారావు రచనలు-ఆరవసంపుటి, పే 161-168.

వైద్యో'నారాయణో' హరిః, సత్యకామ్ పెద్దిశ్రీ, పే -67-68.

శంకరోపాఖ్యానము, బాలశ్రీ, స్వతంత్ర, 27 జూన్ 1959 పే 20-22.

శంకుస్థాపన, వారపల్లి లక్ష్మీనారాయణాచార్యులు, భారతి, సెప్టెంబర్ '79, పే 28-33.

శాంతి చనిపోలేదు, కె.గిరిజాలక్ష్మి, తెలుగువిద్యార్థి, అక్టోబర్ '97, 37-39.

శాంతి పావురం, ప్రభాకర్‌జైని, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 23-5-'90, పే 32-37.

శతాయుష్మాన్‌భవ, కె. వరలక్ష్మి, జీవరాగం కథలు, పే 101-106.

శాస్త్రి కాలేజీచదువు, భమిడిపాటి శివరామకృష్ణశర్మ, భారతి, జనవరి '47, పే 15-23.

శిలువకు తొడిగిన మొగ్గ, కాసుల ప్రతాపరెడ్డి,కాసులప్రతాపరెడ్డి కథలు, పే 13-22.

శిలువవేసినమనుషులు, కేతు విశ్వనాథరెడ్డి, దళితకథలు, పే 150-159.

శివయ్య గ్రామసేవ, ఇల్లిందల సరస్వతీదేవి, తులసీదళాలు, పే 1310-1323.

శివరంజని, వేదుల మీనాక్షీదేవి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 1-11-'99, పే 38-47.

శిల్పం, కప్పగంతుల మల్లికార్జునరావు, యువ, ఆగష్టు '76, పే 100-108.

శిక్ష, తాడిగిరి పోతరాజు, భారతి, సెప్టెంబరు'66, పే 19-28.

శిక్ష, వల్లూరు శివప్రసాద్, యువ, జూలై '85, పే 123-133.

శిక్షించిన సౌజన్యం, జి.భాను, జాగృతి పారిశ్రామిక ప్రత్యేక సంచిక, '87, పే 70-71.

శుభ లేఖ, వేదుల మీనాక్షీదేవి, మహిళ, సెప్టెంబరు'77, పే 24-26.

శేషప్రశ్న, ఈతకోట రామారావు, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 12-1-'95, పే 68-70.

షోకాజ్, శేషు, శేష వాక్యం:శేషురచనలు, పే 77-83.

షో పీస్, పాలంకి సత్య, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 25-12-'96, పే 52-53.

సందిగ్ధ సంధ్య, ఎ.వి. రెడ్డిశాస్త్రి, వంశధార కథలు, పే 52-59.

సంధ్య అందున, వంశీ కృష్ణ, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 30-1-91, పే 22-24.

సంబంధం, చిత్ర, కథ '94, పే 29-36.

సంస్కృతులు, నాగభూషణ్, ఆంధ్రపత్రిక దుర్ముఖి సంవత్సరాది సంచిక, పే 87-100.

సత్తిగాడి "సాతంత్రం", కె.దయానంద్, ప్రజాసాహితి, ఆగష్టు'93, పే 30-32.

సదువు, టి.ఎస్.రాములు, టి.ఎస్.రాములు కథలు, పే 46-57.

సదూకుంటాన్రయ్యా!, రాయపు రెడ్డి సత్యనారాయణ, యువ, జూన్ '86, పే 106-116.

సన్నివేశం, చందు సుబ్బారావు, అభ్యుదయ, జూలై '79, పే 27-30.

సముద్రుడు, ఆర్.ఎస్.సుదర్శనం, భారతి మే'59, పే 17-20.

సమాధుల నీడలు, జి.రవికృష్ణ, శకలాలు: డాII జి.రవికృష్ణ కథలు, పే 8-13.

సరస్వతీకటాక్షం, వారణాసి విపుల, జనవరి '87, పే 25-32.

సరస్వతీ! నమస్తుభ్యమ్, ఇచ్ఛాపురపు రామచంద్రం,ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 28-9-'88, పే 75-77.

సరిహద్దులు, దాసరి శిరీష, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 3-5-89.

సరీసృపాలు, వి.చంద్రశేఖరరావు, దళితకథలు-3, పే140-145.

సహనావవతు, పంతుల జోగారావు, ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక, 12-12-'79, పే 15-17.

"సారంగ"రాగం, భరాగో, కులాసా కథలు, పే 169-176 .

సిక్‌నెస్, కాముల ప్రతాప రెడ్డి, కాముల ప్రతాప రెడ్డికథలు, పే 28-32.

సీటుదొరికింది, ముక్తేవి భారతి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 16-12-81, పే 12-15.

సీటుదొరికింది, రంధి సోమరాజు, భారతి, జూలై '82, పే 16-18.

సుడిగుండం,మొల్లు మురళీధర్‌రావు, విద్యుల్లత, ఆగస్టు-సెప్టెంబరు'70, పే 1-6.

సుబ్బిగాడు, వై.నేతాంజనేయప్రసాద్, ప్రజాసాహితి, నవంబరు- డిశంబరు'80, పే 13-16&58&61.

సూర్యకిరణం, చందు సుబ్బారావు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 17-4-'99, పే 30-34.

సూర్యగ్రహణం, బులుసు-జి-ప్రకాష్, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 5-12-'96, పే 71.

సెప్టెంబరు5, కుసుమ కె.మూర్తి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 13-5-'81, పే 33-39.

సైకాలజీ, ఇల్లిందల సరస్వతీదేవి, స్వర్ణకమలాలు, పే 241-252.

సైబర్‌వల, సలీం, నిశ్శబ్దసంగీతం, పే108-116.

సొరంగం, తురగా జానకీరాణి, కదంబం, పే 219-226.

స్కూల్ ఆఫ్ థాట్, భరాగో, కులాసాకథలు, పే45-47.

స్టడీఅవర్స్, అమ్ములలత, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 10-1-'91, పే 36-38.

స్టాఫ్‌రూమ్‌లో, ఎ.వి. రెడ్డిశాస్త్రి, అసంగతసంగతాలు,పే 14-19.

స్క్రక్-స్క్రక్-స్క్రక్, ద్వారకా, 21-12-'88, పే 78-79.

స్త్రీవిద్య, భండారు అచ్చమాంబ, నూరేళ్ళ పంట, పే 1-5.

స్త్రీస్వాతంత్ర్యం, జమదగ్ని, భారతి, నవంబర్ '49, పే 509-518.

స్థానవిలువ, దొరవేటి, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 18-9-'96, పే 30-31.

స్పాట్, కట్టా రాంబాబు, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 25-2-'93, పే 34-37.

స్పాట్‌లైట్, మధురాంతకం రాజారాం, మధురాంతకం రాజారాం కథలు, పే 221-232.

స్పాట్‌వాల్యుయేషన్, గుండు సుబ్రహ్మణ్యదీక్షితులు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 1-2- 72-77.

స్పాట్ వాల్యుయేషన్, గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 21-11- 79, పే 61-67.

స్పందన, శేషభట్టరు సీతాదేవి, ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 7/13-9-'94, పే 36-37.

స్పృహ, పులిపర్తి పూర్ణచంద్రరావు, విపుల, ఆగష్టు '87, పే 35-39.

స్ఫూర్తి, జి.యస్.గోపాలం, తెలుగువిద్యార్థి, మార్చి '93, పే 31-32.

స్మృతి, టి.ఎస్.రాములు, టి.ఎస్.రాములు కథలు, పే 2..-28.

స్వప్నసోపానాల ఆవల, రఘుకిషోర్, తెలుగుస్వతంత్ర, 5-5-'50, పే 24-25.

స్వర్గం జారిపోయింది, మాకినీడు సూర్యభాస్కర్, తెలుగువిద్యార్థి, నవంబర్ '98, పే 45-46.

స్వర్ణభారతి, సలీం, నిశ్శబ్దసంగీతం, పే 133-142.

స్వార్థపరులు, నాని, ప్రజాసాహితి, అక్టోబర్ '79, పే 15-18.

హిందీపరీక్ష, కరుణకుమార, భారతి, సెప్టెంబర్ '51, పే 806-810.

హింసధ్వని, వల్లూరు శివప్రసాద్, డా॥అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్, పే 545-564

హక్కు, యం.ఉదయభాను, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 18-11-'99, పే 40-41.

హద్దుమీరినదుదువారు దండించబడుదురు, సోమంచి యజ్ఞన్నశాస్త్రి, సాహితి, జూన్ '62, పే 66-78.

హయ్యోపాపం పసివాళ్ళు...., మల్లిక్, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 5-11-'92, పే 30-31.

హోలీడే, అమృతలత, ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 22-11-'90, పే 67-72.

## నవలలు

అంతర్మథనం, అల్లూరి రాజకుమారి, చతుర, మే '88.

అంతర్యాగం, కె.మురళీకృష్ణ, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 31-1-'96 to 24-7-'96.

అశాంతినికేతన్, సింహప్రసాద్, చతుర, మే '84.

ఆచరణల్లో ఆదర్శాలు, పి.వి.ఆర్.శివకుమార్, యువ, ఆగష్టు '76.

ఆదర్శం, కప్పగంతుల మల్లికార్జునరావు, చతుర, ఆగష్టు '79.

ఈ చరిత్ర ఎవరు రాస్తారో...., ఎమ్.టి.సౌజన్య, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 1-12-'82 to 9-2-'83.

ఊబి, కప్పగంతుల మల్లికార్జునరావు, యువ, అక్టోబర్ '82.

కడ్డాంతో విశ్వమార్గమ్, కొంపెల్ల లక్ష్మీసమీరజ, స్వాతి, సెప్టెంబర్ '01

కాన్వెంట్, కృష్ణజ, చతుర, నవంబర్ '97

కొత్తమేష్టారు, వసుంధర, సెప్టెంబర్ '85.

గమ్యం, చివుకుల పురుషోత్తం, చతుర, జూలై '78.

గూడు, రాధామనోహరన్, చతుర, జూన్ '86.

చదువు, కొడవటిగంటి కుటుంబరావు, 1998, విశాలాంధ్రా పబ్లిషింగ్‌హౌస్, హైదరాబాదు.

చిరుమువ్వల మరుసవ్వడి, కొండముది శ్రీరామచంద్రమూర్తి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 16-6-'82 to -----

చైతన్యపథం, ముద్దంశెట్టి హనుమంతరావు, నవంబరు '83.

జడ్జిమెంట్, విజయార్కె, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 5-9-'96 to 20-2-'97.

జగన్నాటకం, కాటూరి రవీంద్ర త్రివిక్రమ్, చతుర, జూన్ '79.

జీవనమథనం, యస్.యస్.లక్ష్మి, చతుర, మే '86.

ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్‌స్టార్, ఉరిమి సులేఖ, ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 21-3-96 to 10-10-96.

డాక్టరేట్, అశ్విని, చతుర, ఆగస్ట్ 2000.

తెలుగుమాష్టారు, ఇచ్ఛాపురపు రామచంద్రం, భారతి, జనవరి '77 to మార్చి '77.

తొలిపొద్దు, సింహప్రసాద్, చతుర, జూలై '88.

దండకారణ్యం, వీరపల్లి వీణావాణి, చతుర, అక్టోబరు '85.

నిదురుకురిసిన కల, టి.మురళీధర్, 25-10-'95 to 24-1-'96.

నిర్నిద్రగానం, మన్నెం శారద, యువ, ఆగష్టు '86 to జూన్ '87.

పల్లె, కొమ్మిరెడ్డి విశ్వమోహన్ రెడ్డి, చతుర, సెప్టెంబరు '81.

పల్లె పిలిచింది, ద్వారకా, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 7-2-'90 to 13-6-'90.

పవిత్రపాపి, కొండముది శ్రీరామచంద్రమూర్తి, చతుర, ఆగష్టు '83.

పావని, దాశరధి రంగాచార్య, చతుర, జూన్ '78.

పావులు, పి.శ్రీరామచంద్రమూర్తి, చతుర, ఏప్రిల్ '87.

పంచరంగులు, కాయితి అప్పారావు, యువ, జూలై '84.

బాల్య విధాతలు, పల్లేటి బాలాజీ, స్వాతి, జూలై '98.

మాల్గాడిబొమ్మలు, కాలువ మల్లయ్య, చతుర, సెప్టెంబర్ '99

రవళి, సి.యస్.రావు, చతుర, ఏప్రిల్ '85.

రాగాన్వేషణ, మాధవపెద్ది పుణ్యశీలాప్రసాద్, చతుర, డిశంబరు '87.

విషగుళిక, పంతుల జోగారావ్, చతుర, మే '93.

వేకువపూలు, జతిన్‌కుమార్, చతుర, ఫిబ్రవరి 2000.

సాంబయ్య చదువు, కాలువ మల్లయ్య, చతుర, నవంబర్ '95.

సమిధలు, దిలావర్, భారతి, జూన్ '85 to మార్చ్ '86.

స్వయంకృతం, శంకరమంచి పార్థసారధి, జూన్ '85.

స్వాభిమానం, అల్లూరి రాజకుమారి, చతుర, జనవరి '03.

## పరిశీలించిన పత్రికలు :

అక్షరార్చన (సాహిత్య వ్యాససంకలనం), అభ్యుదయ, అరుణతార, అరుణరేఖ(అమెరికన్ ప్రజాసాహిత్య సంచిక), అవతార్ మెహెర్(1994) మాసపత్రిక, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రజ (1948,నవంబర్) (ప్రజా సామాన్య మాసపత్రిక), ఆంధ్రప్రదేశ్, ఆంధ్రప్రభ వారపత్రిక, ఆంధ్రభూమి వారపత్రిక, ఆంధ్రమహిళ, ఉదయిని (1936 మే త్రైమాసిక పత్రిక, కొంపెల్ల జనార్ధనరావు), కల్కితురాయి (1986 జనవరి, మాసపత్రిక), కళ (భారత కళాపరిషత్,చలసాని ప్రసాదరావు), కళాదర్బార్(1970 ఫిబ్రవరి), కళాకేళి(శ్రీశ్రీ షష్టిపూర్తి అభినందన సంచిక), కళారత్న, కిన్నెర(1950 జులై--1950 డిశంబర్), కృష్ణాపత్రిక (వజ్రోత్సవసంచిక), గానకళ, గిరిజన ప్రభంతి(1996 మే, మాసపత్రిక, (సం) భూక్యా చినవెంకటేశ్వర్లు), చతుర, చేతన(శ్రీశ్రీ సంస్మరణ సంచిక), జమీన్ రైతు, జయంతి(1958 నవంబర్), ఠాగోర్ శతజయంతి సంచిక, జ్యోతి, తరంగిణి, తెలుగు, తెలుగు కోయిల (తెలుగు సాంస్కృతిక సమితి, మైసూరు), తెలుగుభాషా పత్రిక, తెలుగు విద్యార్థి, తెలుగు స్వతంత్ర(వార పత్రిక), దివాకర ప్రభ (1987), దీపిక ( వై. విద్యాసాగర్), నవభారతి, నవోదయ ( (సం) నీలంరాజు వెంకటశేషయ్య), నాట్యకళ, పుష్పమాల, పొద్దు (దళాల్ది ప్రత్యేక సంచిక), పద్మజ్యోతి (1983 జులై, తెలుగు మాసపత్రిక, (ఎడి) పెండెంరవీంద్రరావు, హైదరాబాదు), పల్లెటూరు (సంస్కృతిక మాసపత్రిక), పండితభారతి, ప్రజాస్వామ్యం (1977, ప్రత్యేక సంచిక, తెలుగు వికాససమితి), ప్రతిభ (నవ్యసాహిత్య పరిషత్పత్రిక), ప్రత్యూష (సాహిత్య మాసపత్రిక, సాహితీ కళానికుంజం, ఇచ్చోడ, ఆదిలాబాద్), ప్రబుద్ధాంధ్ర, ప్రబోధిని, ప్రసారిత, ప్రారంభవిద్య (సంవత్సరాది సంచిక), బృందావని (సాంస్కృతిక పక్షపత్రిక), భారతి, మణిమంజరి (వాఙ్మయ యోగ పరిశోధనా పత్రిక, ప్రభాకర పరిశోధక మండలి, హైద-45), మానవసేవ (1913 మే, మాసపత్రిక, (సం) నాళంకృష్ణారావు, సత్యవోలు అప్పారావు,రాజమహేంద్రవరము), మిసిమి, మోహనజ్యోతి (1978 ఆగష్టు, ఔత్సాహిక కళాకారుల మాసపత్రిక), మంజరి (తెలుగు సాంస్కృతిక సంఘం, కల్లికోట), మందాకిని, యువ, రంజని (1969--1983, ప్రత్యేక సంచికలు, శ్రీశ్రీ), వనిత, వాఙ్మయి (అర్ధవార్షిక పరిశోధన పత్రిక, తెలుగు విశ్వవిద్యాలయం), విద్యార్థి వాణి, విద్యుల్లత (1970, యువ సాహిత్య మాసపత్రిక, సాహితీ మిత్రమండలి, కరీంనగర్), విపుల, విమర్శిని (పరిశోధనపత్రిక), విమోచన (1976 డిశంబర్, పరిశోధనపత్రిక), విశ్వరచన (పోతుకూచి సాంబశివరావు), విశ్వహిందు (1975 జనవరి, హిందూధర్మ సమ్మేళన ప్రత్యేకసంచిక), వీణ (1936 జూన్, తెలుగు మాసపత్రిక), వేకువ (1971 అక్టోబర్-1971 డిశంబర్, సాహిత్య త్రైమాసిక పత్రిక, (సం) కె. శివారెడ్డి), వైజయంతి, వైశాఖి ((సం) మారేపల్లి రామయ్య శాస్త్రి, పురిపండా అప్పలస్వామి కవితాసమితి, విశాఖపట్టణం), వైశ్యవాణి, వందేమాతరం, వెండివెలుగులు (1992, యువభారతి,రజతోత్సవ సంచిక), శారదా మంజీరము (1985 సెప్టెంబర్, రజతోత్సవ వ్యాససంపుటి, ప్రకాశంజిల్లా రచయితల సంఘం, ద్వితీయమహాసభల సంచిక), శోభ (1947 ఏప్రిల్(ప్ర.సం),సచిత్ర మాసపత్రిక, (సం) దేవులపల్లి రామానుజరావు), సమత, సమాలోచన (జాతీయ సాంస్కృతిక పక్షపత్రిక, విద్వాన్ బులుసు సీతారామ శాస్త్రి), సమీక్ష (పత్రిక), సరస్వతీ సామ్రాజ్యమ్ (1942, అయ్యంకి వెంకటరమణయ్య గారి సన్మాన సంచిక), సారస్వతజ్యోతి (1954 డిశంబర్, త్రైమాసిక సారస్వత పత్రిక, (సం)టి.వెంకట రామారావు, కరీంనగరము), సాహితి, సుజాత (ఆంధ్ర సారస్వత పరిషత్ సప్తమ మహాసభ సంచిక), సోవియట్ భూమి, సోవియట్ వ్యాసావళి, సోవియట్ సమీక్ష, సందేశం (1954 మే(ప్ర.సం), 1958 డిశంబరు), మార్క్సిస్టు సిద్ధాంత రాజకీయ మాసపత్రిక ((సం)కంభంపాటి సత్యనారాయణ, తమ్మారెడ్డి సత్యనారాయణ, కఠియాల గోపాలరావు, మహీధర రామమోహనరావు), సంవేదన (త్రైమాసిక మాసపత్రిక, రాచమల్లు రామచంద్రారెడ్డి), సంస్కృతి, స్త్రీ స్వేచ్ఛ, స్నేహలత (1973 అక్టోబరు, లోహియావిజ్ఞానసమితి), స్పందన వాణి (1978 జులై(ప్ర.సం), (ఎడి) అక్కలసరస్వతీబాయి, స్పందన సాహిత్య సమాఖ్య, మచిలీపట్టణం), స్రవంతి (దక్షిణభారత హిందీ ప్రచారసభ, ఖైరతాబాద్, హైదరాబాద్), స్వతంత్ర (1957 సెప్టెంబరు(ప్ర.సం), (ఎడి) గోరా శాస్త్రి).

================

## సహకరించిన పుస్తకాలు

తెలుగు:


అరిగె రామారావు. (1995). అరిగె రామారావు కథలు. శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్, హైదరాబాదు.

అశోక్‌కుమార్, కె.పి. (సంపా). (1999). ఎనిమిదో అడుగు. ప్రత్యూష ప్రచురణలు, వరంగల్.

ఆడెపు లక్ష్మీపతి. (1997). నాలుగుదృశ్యాలు. ఆదిత్య పబ్లికేషన్స్, గోదావరిఖని.

ఇనాక్, కొలకలూరి. (1983). ఊరబావి. జ్యోతి గ్రంథమాల, అనంతపురం.

ఇల్లిందల సరస్వతీదేవి. (1981). తులసీదళాలు. సుదర్శన, హైదరాబాదు.

ఇల్యా ఎహ్రెన్‌బర్గ్.
(అను) తుమ్మల వెంకటరామయ్య. (1989). రచయితా-శిల్పమూ. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.

ఉపద్రష్ట సాయి. (1994). అగ్నినక్షత్రం. ప్రాప్తిబుక్స్, మద్రాసు.

ఉష శ్రీ. (1993). అమృతకలశం. ఉష శ్రీ మిషన్, విజయవాడ.

ఓల్గా. (1999). కన్నీటికెరటాల వెన్నెల. స్వేచ్ఛ ప్రచురణలు,హైదరాబాదు.

కప్పగంతుల మల్లికార్జునరావు. (1996). కప్పగంతుల మల్లికార్జునరావు కథలు. క.గా.కా.కొ.ప్రచురణలు, హైదరాబాదు.

కనకయ్య, గుండెడప్పు(సంపా). (------). ఎదురుచూపులు. ఎ.పి.దళిత రీసర్చ్ సెంటర్, హైదరాబాదు.

కల్యాణసుందరీ జగన్నాథ్. (1997). అలరాసపుట్టిళ్లు. కుసుమబుక్స్, విజయవాడ.

కామేశ్వరి, డి. (1997). కాదేదీ కథకనర్హం. స్వీయ ప్రచురణ, హైదరాబాదు.

కావ్ యూ-పావ్.
(అను)కొల్లి సత్యనారాయణ. (1999). నేనూ బతికే వెళ్తా. పి.డి.యస్.యు. ప్రచురణ, హైదరాబాదు.

కాళిదాసు.
(తె)జి.వి.శ్రీహరి సుబ్రహ్మణ్యశర్మ. (2002). మాలవికాగ్నిమిత్రమ్. ఆర్.పి.శాస్త్రి ప్రచురణలు, స్టోనీకార్నర్, హైదరాబాద్.

కాళీపట్నం రామారావు. (1986). కాళీపట్నం రామారావు కథలు. ఆర్.కె.పబ్లికేషన్స్, విశాఖపట్నం.

కాళీపట్నం రామారావు. (సంపా). (------). రుతుపవనాలు. ఆర్.కె.పబ్లికేషన్స్, విశాఖపట్నం.

కుటుంబరావు, కొడవటిగంటి. (1998). చదువు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.

కృష్ణకుమార్.
(అను)సహవాసి,కలేకూరిప్రసాద్. (1992). చదువు--చర్చ. హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాదు.

కృష్ణకుమార్.
(అను) ప్రభాకర్ మందార. (1998). చదువు--మంచి చెడ్డలు. హైదరాబాద్ బుక్ ట్రస్ట్,

హైదరాబాదు.

కృష్ణకుమార్.(అను) అనంత. (1998). పిల్లల పాఠాలు- పెద్దలకు గుణపాఠాలు. హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాదు.

కృష్ణమూర్తి, ఆర్.ఎస్. (1996). ఛాయాచిత్రాలు. జ్యేష్ఠ లిటరరీ ట్రస్టు, విశాఖపట్నం.

కృష్ణమూర్తి, వారాల. (1993). గేవరదున్న. రాధాపబ్లికేషన్స్, హైదరాబాదు.

కృష్ణారావు, నందిగం. (1999). నాలుగుకాళ్ల న్యాయం. సాక్షి పబ్లికేషన్స్, సికింద్రాబాద్.

కేతు విశ్వనాథరెడ్డి. (1982-90). కుటుంబరావు సాహిత్యం (1-6 సంపుటాలు). విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ.

కేతు విశ్వనాథరెడ్డి.
పోలు సత్యనారాయణ. (1994). చదువు కథలు. అందరికీవిద్య రాష్ట్ర ప్రచారవేదిక, హైదరాబాదు.

కేతు విశ్వనాథరెడ్డి. (1997). జద్యాగ్ని. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.

కేశవకుమార్,
కె. సత్యనారాయణ.(సం). (1995). దళిత మేనిఫెస్టో. విస్ఫోటన, సెంట్రల్ యూనివర్సిటీ, హైదరాబాదు.

కౌటిల్యుడు,
(వ్యా) పుల్లెల శ్రీరామచంద్రుడు. (1999). అర్థశాస్త్రమ్. జయలక్ష్మి పబ్లికేషన్స్, హైదరాబాదు.

గంటేడ గౌరునాయుడు. (1997). ఏటిపాట. శ్రీకాకుళ సాహితి.

గిజుభాయి బధేకా.
(అను) పోలు శేషగిరిరావు. (1989). తల్లిదండ్రుల తలనొప్పి. హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాదు.

గిజుభాయి బధేకా.
(అను) పోలు శేషగిరిరావు. (1997). పగటి కల. హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాదు.

గురజాడ అప్పారావు.
పెట్టి ఈశ్వరరావు (సంపా) (1986). కన్యాశుల్కం. విశాలాంధ్రా పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.

గోపి, ఎన్. (సంపా). (1999). తెలుగుకథ'96. పొట్టిశ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయం, హైదరాబాదు.

గోపి, డి. (1996). గుడిసెపిపోలు: దళితకథలు. దళిత స్త్రీ సాహిత్యపరిషత్, విజయవాడ.

జ్ఞానేశ్వర్, ధనరాజ్. (2000). తీరంచేరిన కెరటాలు. శిరీష ప్రచురణలు, వనపర్తి.

చంద్, పి.
రాములు, బి.యస్ (సం). (2000). భూనిర్వాసితులు. విశాలసాహిత్య అకాడమి ప్రచురణ, జగిత్యాల.

చంద్రయ్య, ఐతా. (1993). కథామంజూష. జాతీయ సాహిత్య పరిషత్తు, సిద్దిపేట.

చంద్రలత. (1997). నేనూ నాన్ననవుతా. శ్రీధర్ చిల్డ్రన్స్ హాస్పిటల్, నెల్లూరు.

చంద్రశేఖరరెడ్డి,
ఆర్. లక్ష్మీనారాయణ.కె. (1996). దళితకథలు.విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.

చక్రధరరావు, పాటిబండి. (1997). కథాచక్రం. విశాఖపట్నం.

చక్రపాణి, కాకాని. (1998). త్రిల్లింత. మీడియా హౌస్ పబ్లికేషన్స్, హైదరాబాదు.

చలం. (1987). మ్యూజింగ్స్. అరుణా పబ్లిషింగ్‌హౌస్, విజయవాడ.

చాగంటి సోమయాజులు. (1997). చాసో కథలు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.

జాన్‌హోల్ట్(అను) వి.శ్రీహరి. (2002). పిల్లలు ఎలా నేర్చుకుంటారు?, ప్రజాశక్తి బుక్‌హౌస్, హైదరాబాదు.

జాన్‌హోల్ట్(అను) డి.పాపారావు. (2003). పిల్లలునేర్చుకోవడంలో ఎలా వెనుకబడతారు?, ప్రజాశక్తి బుక్‌హౌస్, హైదరాబాదు.

జిడ్డు కృష్ణమూర్తి.
(అను) సి.హనుమంతరావు. (2000). విద్య: అందు జీవితమునకుగల ప్రాధాన్యము. కృష్ణమూర్తిఫౌండేషన్ ఇండియా.

జోగారావు, పంతుల. (1998). అపురూపం. ప్రోగ్రెసివ్ కమ్యూనికేషన్స్, హైదరాబాదు.

టెల్సుకోకు రొయనాగి.
(అను) ఎస్.వేణుగోపాల్. (1989). రైలుబడి. హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాదు.

తిరుమలరావు, జయధీర్ (సం). (1999). తెలుగు కథ 1996. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయము, హైదరాబాదు.

తిరుమలరావు, జయధీర్ (సం). (2000). తెలుగు కథ 1999. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయము, హైదరాబాదు.

త్రిపుర. (1999). త్రిపుర కథలు.పల్లవి పబ్లికేషన్స్.

దయానంద్, కాట్రుగడ్డ. (1999). పండుటాకు. కాట్రుగడ్డదయానంద్ కథలు.

దక్షిణామూర్తి, పోరంకి. (1988). కథానిక: స్వరూపస్వభావాలు. స్వీయ ప్రచురణలు, హైదరాబాదు.

నరసింహం, వుప్పల. (1994). ఎర్రలైటు. మైనాపబ్లికేషన్స్, బెంగుళూరు.

నరేందర్,కె.వి. (1999). బురదలో జాబిల్లి. సాహితీ గౌతమి, కరీంనగర్.

నళినీ తనేజా. (2000). విద్యారంగంపై మతోన్మాదుల దాడి. ప్రజాశక్తి ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాదు.

నవీన్, వాసిరెడ్డి.(సం). (1991). తెలుగు కథ(1960-85). హైదరాబాద్ బుక్ ట్రస్ట్.

నవీన్, వాసిరెడ్డి.
పాపినేని శివశంకర్(సం). (1995). కథ'94. కథాసాహితి.

నవీన్, వాసిరెడ్డి.
పాపినేని శివశంకర్(సం). (1997). కథ'96. కథాసాహితి.

నవీన్, వాసిరెడ్డి.
పాపినేని శివశంకర్(సం). (1998). కథ'97. కథాసాహితి.

నవీన్, వాసిరెడ్డి.
పాపినేని శివశంకర్(సం). (1999). కథ'98. కథాసాహితి.

నవీన్, వాసిరెడ్డి.
పాపినేని శివశంకర్(సం). (2000). కథ'99. కథాసాహితి.

నాగేశ్వరరావు, తాళ్లూరి. (1974). నూటపదహార్లు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ.

నామిని సుబ్రహ్మణ్యం నాయుడు. (2002). చదువులా? చావులా?? టామ్ సాయర్ బుక్స్, తిరుపతి.

నాయర్, వి.పి.బి. (1994). అమానుషం. సికింద్రాబాదు.

పతంజలి, కె.ఎన్.వై. (1998). చూపున్న పాట. గోపీ స్మృతి.

పాలోఫ్రెయిరె. ఆర్వీఆర్ (అను). (2002). విముక్తి-విద్య. ప్రజాశక్తి బుక్‌హౌస్, హైదరాబాదు.

పులికంటి, కృష్ణారెడ్డి. (1997). నాలుగ్గాళ్ల మండపం. విశ్వంభర పబ్లికేషన్స్, తిరుపతి.

ప్రతాపరెడ్డి, కాసుల. (1999). శిలువకుతొడిగినమొగ్గ. శైలీ పబ్లికేషన్స్, హైదరాబాదు.

పెద్దిభొట్ల, సుబ్బరామయ్య. (1994). పెద్దిభొట్ల సుబ్బరామయ్యకథలు. విశాలాంధ్ర

పబ్లిషింగ్‌హౌస్, హైదరాబాదు.

బసవరాజు, బి.సి.హెచ్.వి. (------) జ్యేష్ఠ కథలు. జ్యేష్ఠ లిటరరీ ట్రస్టు, విశాఖపట్నం.

బాలాజీ, పళ్లేటి. (1998). బాల్యవిధాతలు. స్వాతి సచిత్ర మాసపత్రిక, విజయవాడ.

బీనాదేవి. (------). కథలు-కబుర్లు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.

భరాగో. (1997). కులాసాకథలు. జ్యేష్ఠ లిటరరీ ట్రస్టు, విశాఖపట్నం.

భార్గవీరావు. (1997). నా పేరు. పాంచజన్య పబ్లికేషన్స్, హైదరాబాదు.

భార్గవీరావు.(సం). (2000). నూరేళ్ల పంట. ప్రిసంబుక్స్ ప్రైవేట్ లిమిటెడ్, బెంగుళూరు.

భాస్కర్, నలిమల. (1996). అద్దంలో గాంధారి.

మధురాంతకం రాజారాం. (------). కూనలమ్మకోన. కథాకోకిల ప్రచురణలు, దామల్‌చెరువు, చిత్తూరుజిల్లా.

మధురాంతకం రాజారాం. (------). జీవితానికి నిర్వచనం. కథాకోకిల ప్రచురణలు, దామల్‌చెరువు, చిత్తూరుజిల్లా.

మధురాంతకం రాజారాం. (------). పాంథశాల. కథాకోకిల ప్రచురణలు, దామల్‌చెరువు, చిత్తూరుజిల్లా.

మధురాంతకం రాజారాం.(సం). (------). ఒక దశాబ్ది తెలుగుకథలు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు.

మధురాంతకం రాజారాం,
సింగమనేని నారాయణ. (సం). (1998). తెలుగు కథకులు: కథనరీతులు. విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్. హైదరాబాదు.

మధుసూదనరావు, త్రిపురనేని.
వి.తిరుపతిరావు (ఎడి). (------). సాహిత్యంలో వస్తుశిల్పాలు. పర్‌స్పెక్టివ్స్, హైదరాబాదు.

మనువు.
(తా)యన్.యల్.నరసింహాచార్యులు (2000). మనుస్మృతి. గాయత్రీ ప్రచురణలు, హైదరాబాదు.

మణి, ఎ.ఎస్. (1999). అరవిందకథలు. హైదరాబాదు.

మా గోఖలే. (1993). మా గోఖలే కథలు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.

మోహన్, కె.ఆర్.కె. (1995). కె.ఆర్.కె.మోహన్ కథలు. శ్రీముఖ పబ్లికేషన్స్, హైదరాబాదు.

మృణాలిని. (2000). కోమలి గాంధారం. మృదులా పబ్లికేషన్స్.

మైరన్ వైనర్. (1997). బాలకార్మికులు-నిర్బంధవిద్య. బాలసాహితి, హైదరాబాదు.

మైరన్ వైనర్.(అను)శ్రీధర్‌గాంగేయ. (1998). పిల్లలు-రాజ్యం-చాకిరి-చదువు. హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాదు.

రఘురామరాజు,వి. (1996). పునరావృతం.

రచన 'శాయి (సం). (1999). కథామహల్. వాహిని బుక్‌ట్రస్ట్, హైదరాబాదు.

రమణారెడ్డి, ఎం.వి. (1999). పరిష్కారం.స్వీయ ప్రచురణలు, రాయవరం, ప్రొద్దుటూరు.

రవి దేవరాజు. (1996). దేవరాజు రవి కథలు. శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్, హైదరాబాదు.

రవికృష్ణ, గుర్రాల. (1999). శకలాలు. సీమసాహితి ప్రచురణ.

రవీంద్రనాథ్ టాగూర్.
(అను) విజయానీలగ్రీవం. (1992). విద్య. బాలసాహితీ బుక్ ట్రస్ట్, హైదరాబాదు.

రామచంద్రమూర్తి, జీడిగుంట. (1998). *అమూల్యంకథలు*. మూన్ పబ్లికేషన్స్, హైదరాబాదు.

రామారావు నాయుడు, బి.వి.ఎ(సం). (------). *నాగావళికథలు*. శ్రీకాకుళసాహితి, శ్రీకాకుళం.

రాములు, బి.యస్. (1998). *స్మృతి: బి.యస్.రాములు కథలు*. విశాల సాహిత్య అకాడమి ప్రచురణ, జగిత్యాల.

రాములు, బి.యస్.
చంద్రశేఖర్, వనమాల.(సంపా). (------). *ఆధునిక కథాసరిత్సాగరం*. విశాల సాహిత్య అకాడమి ప్రచురణ, జగిత్యాల.

రామ్మోహన్, సొదుం. (1999). *సాహిత్యంలో శిల్పం*. విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, హైదరాబాదు.

రాయసం వెంకట్రామయ్య. (1997). *చలపతీ! జిందాబాద్*. మహాలక్ష్మి పబ్లికేషన్స్,హైదరాబాదు.

రాయసం వెంకట్రామయ్య. (1999). *నాగరాజీయమ్*. మహాలక్ష్మి పబ్లికేషన్స్, హైదరాబాదు.

రుక్మిణి, నల్లూరి. (2000). *గీతలకావల*. విప్లవరచయితల సంఘం, గుంటూరు.

రెడ్డి శాస్త్రి, ఎ.వి. (1996). *అసంగత సంగతాలు*. శ్రీకాకుళ సాహితి.శ్రీకాకుళం.

లక్ష్మీనారాయణ, కె.(సం). (------). *అస్పృశ్యకథలు (1910-1998)*. రమాపబ్లికేషన్స్,పాతూరు, అనంతపురం.

లక్ష్మీనారాయణ, కె.(సం). (1998). *ఆర్థిక రాజకీయ కథలు (1910-1998)*.రమాపబ్లికేషన్స్, పాతూరు, అనంతపురం.

వెంకటరమణారావు, పింగళి. (1998). *నేలమీది నక్షత్రాలు.(ఎలక్షాన్)కథలు*. వాహినిబుక్ ట్రస్ట్, హైదరాబాదు.

వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. (1994). *నవలాశిల్పం*. విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, హైదరాబాదు.

వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. (1997). *వల్లంపాటి సాహిత్యవ్యాసాలు*, విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, హైదరాబాదు.

వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. (2002). *విమర్శాశిల్పం*. విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, హైదరాబాదు.

వెంకటేశ్వరరెడ్డి, అన్నపరెడ్డి(సం). (1999). *జి.వి.కృష్ణారావు రచనలు*. ప్రభాస పబ్లికేషన్స్, తెనాలి.

వరలక్ష్మి, కె. (1996). *జీవరాగం*. శ్రీ రవీంద్ర ప్రచురణలు, జగ్గంపేట.

వర్మ, కె.వి.యస్. (------). *నేనువేనే*. క్రాంతి ప్రచురణలు.

వాకాటి పాండురంగారావు.
పురాణంసుబ్రహ్మణ్యశర్మ(సం). (1993). *కథాభారతి*. నేషనల్‌బుక్‌ట్రస్ట్,ఇండియా.

వార్నర్.ఎస్.ఎ.
(అను) వి.శ్రీహరి,డి.పాపారావు. (2003). *టీచర్*. ప్రజాశక్తి బుక్‌హౌస్.

విజయరాఘవరావు, ఎల్చూరి. (1998). *ఆద్యంతాలు*. వేదగిరి కమ్యూనికేషన్స్, హైదరాబాదు.

విజయలక్ష్మి, అత్తలూరి. (1996). *అపూర్వ కథలు*. రాజేశ్వరి ప్రచురణలు, సికింద్రాబాదు.

విజయలక్ష్మి రామకృష్ణన్. (------). *విజయలక్ష్మి రామకృష్ణన్ చిన్నకథలు*. స్త్రీశక్తి ప్రచురణలు, టి.నగర్, చెన్నై.

విజయేంద్ర,టి.(అను) కె.సురేష్. (2001). *టీచరు-బాలకార్మికులు*. అజాద్ రీడింగ్ రూం,సికింద్రాబాదు.

విరించి, శ్రీ. (1990). *గంధపుచుక్క*. ప్రాప్తి బుక్స్, మద్రాసు.

విశ్వనాథ సత్యనారాయణ, (1969). *వేయిపడగలు*. వి.యస్.ఎన్.అండ్‌కో, విజయవాడ.

వీరాజీ. (1998). *వీరాజీ కథలు*. శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్, హైదరాబాదు.

వేదగిరి రాంబాబు (సం). (1994). *కొత్తకథ*. శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్, హైదరాబాదు.

వేదగిరి రాంబాబు (సం). (1998). *గొల్లపూడి మారుతీరావు సమగ్రసాహిత్యం(నాటికలు)*. షష్టిపూర్తి ప్రచురణలు, హైదరాబాదు.

వేదగిరి రాంబాబు (సం). (1999). గొల్లపూడి మారుతీరావు సమగ్రసాహిత్యం(కథలు). షష్ఠిపూర్తి ప్రచురణలు, హైదరాబాదు.

శాస్త్రి, ఎమ్.వి.ఆర్. (2001). మనచదువులు--విద్యావిధాన విశ్లేషణ. నవత ప్రచురణలు, హైదరాబాదు.

శివప్రసాద్, పుడిగొండ. (------). అముద్రితం.

సత్యదేవ ప్రసాద్, ఖండవల్లి. (2000). చదువుల చెట్లు. నవయుగభారతి, హైదరాబాదు.

సత్యనారాయణమూర్తి, ప్రోలాప్రగడ. (1997). విద్యాలను 'కొంటె'కథలు. తరుణ సాహితి ప్రచురణ, హైదరాబాదు.

సత్యం, మందపాటి. (1997). అమెరికా బేతాళుడికథలు. వాహిని బుక్‌ట్రస్ట్,హైదరాబాదు.

సత్యం, శంకరమంచి. (1983). అమరావతి కథలు. నవోదయపబ్లిషర్స్,విజయవాడ.

సత్యకామ్. (1999). సత్యకామ్ సెటైర్లు (అధిక్షేప హాస్యకథలు). స్వీయ ప్రచురణలు, సచేతన, హైదరాబాదు.

సత్యవతి, పి. (1995). ఇల్లలకగానే--.

సలీం. (1999). నిశ్శబ్ద సంగీతం. కిన్నెర పబ్లికేషన్స్, హైదరాబాద్.

సీతారాం ఏచూరి. (2000). పరిణామక్రమంలో భారతదేశ విద్యావ్యవస్థ. ప్రజాశక్తి బుక్‌హౌస్, హైదరాబాదు.

సీతారాములు, కె. (1998). జన్మభూమి. విశాలసాహిత్యఅకాడమీ ప్రచురణ.

సుధాకర్, ఎండ్లూరి. (1999). మల్లెమొగ్గల గొడుగు. దండోరా ప్రచురణలు, హైదరాబాదు.

సుబ్బారావు,సి.వి. (సం). (1986). విభాతసంధ్యలు (తెలుగుసాహిత్యంలో సమాజం). సౌత్ ఇండియా పబ్లికేషన్స్, హైదరాబాద్.

సుమతి, మొక్కపాటి. (1997). అ(వ)మానవ సంబంధాలు.

సూర్యనారాయణరాజు, వంతెన. (1999). జేబికి బంటెవరోయ్. వంతెన బ్రదర్స్ ప్రచురణ, అమలాపురం.

హరికిషన్, యం. (2000). మాయమ్మ రాచ్చసి. కర్నూలు బుక్ ట్రస్ట్.

హోఫర్, హెర్బర్ట్.

టి.డి. సత్యానందం(అను). (1979). విద్యార్థులు-ఉపాధ్యాయులు. సి.యల్.యస్.తెలుగు ప్రచురణలు, హైదరాబాదు.

......................, (1999). సంక్షోభంలో సామాజికశాస్త్రాలు. పి.డి.ఎస్.యు ప్రచురణ, హైదరాబాదు.

**ENGLISH:**

Aggarwal, J.C. (1995). *Education Policy in India:1992.* SHIRPA.

Aggarwal, J.C. and Agrawal, S.P. (1989). *National Policy on Education--Agenda for India 2001.* Concept Publications, NewDelhi.

Ahuwalia. S.P. and Bais, H.S. (-----). *Education-Issues and Challenges.* Ashish Publishing House, NewDelhi.

Amartya Sen (1973). *Brain Drain: Causes and Effects in Science and Technology in Economic Growth.* London, Macmillan.(Ed. B.R. Williams)

Amir Ali. (1906). *Spirit of Islam.* London.

Anita Gil. (1973). *Relevance of Education.* Gerge allen and Unwin, London.

Anne Husted Burleigh. (1973). *Education in a Free Society.* Liberty Fund,Inc, Indiana polis.

Atma Ram. (1990). *Higher Education in India -Issues and Perspectives.* Mittal Publishers

Beery.R.C. (1916). *Practical School Discipline*, International Academy of Discipline, Pleasant Hill, Ohio

Bertrand Russell. (1976). *On Education. Especially in Early Childhood.* Unwin Paperbacks, London.

Bertrand Russell. (1993). *Education and the Social Order.* Rontledge, London & NewYork.

Bhagat Ram Goyal. (-----). *Educating Harijans.*

Bhaskara Rao, Digumarti. (1997). *Success Story of a Primary Education Project.* APH Publishing Corporation, NewDelhi.

Binod, c. Agrawal. (2000). *Higher Education Through Telivision-The Indian Experience.* Concept Publishing Company, NewDelhi.

Binod khadria. (1999). *The Migration of Knowledge Workers: Second-Generation Effects of India's Brain Drain.* Sage Publications, New Delhi.

Cady Santon (-----). *History of Women Suffrage*, Vol. iii.

Carl Seeling (Ed). (1992). *Ideas and Openions by Albert Einstein.* Rupa &co, Calcutta.

Chaube, S.P.and Chaube, A. (1999). *Education in Ancient and Medieval India.* Vikas Publishing House Pvt Ltd, NewDelhi.

Debiprasad Chattopadhyaya. (1987). *Religion and society.* Ma-Le Prakashana, Bangalore.

Eagalcton. Terry. (1976). *Marxism and Literary Criticism.* London : Metuen.

Einstein Albert. (1954). Carl Seeling (Ed). *Ideas and Openions.* Rupa & Co. Calcutta.

Forster, E.M. (1970). *Aspects of the Novel,* A penguin International Edition, Penguin Books Ltd, England.

Gupta, S.C. (1998). *Emerging Challenges in Education.* Arya Book Depot, NewDelhi.

Gupta, O.P. (1993). *Higher Education in India Since Independence-UGC and its approach.* Concept Publishing, NewDelhi.

Hetukar, Jha. (1985). *Colonial Context of Higher Education in India.* Usha Publication, NewDelhi.

Indira Kulshreshtha(Ed). (1991). *Image of Women and Curriculum in Mother tongue.* NCERT, New Delhi.

Jo Campling(Ed). (1989). *Learning the Hard Way : Women's Oppression in Men's Education.* Macmillan Education Ltd.

John Dewey. (1944). *Democracy and Education.* Collier Macmillan Publishers, London.

John, S. Brubacher. (1978). *Modern Philosophies of Education.* Tata Mc Graw-Hill Puublishing Company Ltd, NewDelhi.

Kalyan, R. Salkar. (1990). *Rabindranath Tagore- His Impact on Indian Education.* Sterling Publications Pvt Ltd.

Kamat, A.R. (1973-74). *Education after Independence- Social Analysis.* Lalalajapatrai Institute, Bombay.

Kishore Gandhi(Ed). (1999). *Education- Challenges of the Twenty first Century-Global Context.* Vikas Publishing House Pvt Ltd, NewDelhi.

Kothari, D.S. (1966). *Education Commission.*

Krishnalal Ray. (1984). *Education in Medieval India.* B.R. Publishing Corporation, Delhi.

Lakshmi, S. (1989). *Challenges in Indian Education.* Sterling Publishers, NewDelhi.

Law.N.N. (------). *Promotion of Learning In India During the Muhammedon Rule.*

Mani.R.S.(Ed). (1965). *Educational Ideas Of Eminent Indians.*

Margaret, S. Archer. (1984). *Social Origins of Educational Systems.* Sage Publications, London Baverly Hills, NewDelhi.

Marmar Mukhopadhyay, and Madu Parhar(Ed). (1999). *Indian Education-Developments Since Independence.* Vikas Publishing House Pvt Ltd, NewDelhi.

Marmatha Kundu. (1994). *Tribal Education-New Perspectives.* Gyan Publishing House, NewDelhi.

Mathur,M.V., Ramesh, K.Arora, and Meena Sogani (Ed). (1994). *Indian University System Revitalisation and reform.* Wiley, NewDelhi.

Mill.J.S. (1975). D.Spitz (Ed). *On Liberty*, W.W.Norton & Co, NewYork.

Montessori.M. (1912). *The Montessori Method*, A.E. George ( Trans). Heinimann, London.

Mohanty, Jagannath. (1988). *Modern Trends in Indian Education.* Deep and Deep, NewDelhi.

Mohanty, Jagannath. (2000). *Current Trends in Higher Education.* Deep and Deep Publications Pvt Ltd, NewDelhi.

Naik, J.P. and Syed Nurullah. (1985). *A Student History of Education in India (1800-1973)* Macmillan India Limited, Delhi: Bombay: Madras: Pune.

Panda, B.N.and Tewari, A.D. (1997). *Teacher Education.* APH Publishing Corporation, NewDelhi.

Paulo Freire. (Tran) Myra Bergman Ramos. (1993). *Pedagogy of the oppressed.* Penguin Books.

Peters, R.S.(Ed). (-----). *The Philosophy of Education.* Oxford University Press.

Philip, H. Coombms. (1968). *World Education Crisis.* Oxford University Press, NewYork.

Rao, V.K. (1998). *Education in India.* Indian Publishers, Delhi.

Rao, V.K. (1999). *Trends in Education.* Rajat Publications, Delhi.

Rust, Val.D. (-----). *Alternatives in Education (Theoitical and Historical Perspectives).* Sage Studies in Social and Educational Change.(Vol-6). Sage Publications. London and Baverly Hills.

Sachin.R.L. (1961). *Discipline: How to Establish and Maintain it,* Englewood Cliffs, N.J.: Teachers Practical Press.

Sarkar.J.N. (1919). *Studies in Mughal India.* Culcutta.

Satya Sundaram, I. (1969). *Education at Crossroads.* Machilipatnam

Sharma, S.R.(Ed&Com). (1996). *Philosophy of Education vol (1to10).* Mohit Publications, NewDelhi.

Singh, Y.P.and Joshi, A. (1999). *Parishad Vs Private Schools- A Comparative Analysis.* APH Publishing Corporation, NewDelhi.

Sighal, R.P. (1988). *Indian Schools: A Study of Teacher-Pupil Ratio.* Vikas Publishing House Pvt Ltd, NewDelhi.

Somnath Saraf. (2000). *Education in Human Values.* Vikas Publishing House Pvt Ltd, NewDelhi.

Spencer, Herbert. (1976). *Essays on Education and Kindred Subjects.* Every Man's Library, Dutton, NewYork.

Steven, M.Cahn. (1970). *The Philosohical Foundations of Education.* Harper & Row Publishing, NewYork,Evanstin,London.

Sureshchandra Shukla, Rekha Kaul (Ed). (1998) *Education, Development and Underdevelopment.* Sage Publications, New Delhi, Thousand Oaks, London.

Verma, K.Shivendra. (1995). *Language in Education: Problems and Principles.* TR Publications, Madras.

Wilson.J. (1977). *Philosophy and Practical Education.* Routledge & Kegan Paul, London.

White head, O.M.A.N. (1972). *The Aims of Education And Other Essays.* Ernest Benn Limited, London.

------------------. (1970). *Report of the Education Commission 1964-66.* NCERT, NewDelhi.

-------------------. (1978). *Greek Class room hoax and other reflections on Indian Education.* Vikas Publishing House, NewDelhi.

-------------------. (1993). *Challenges and responses of Higher Education in India: Relevance of Sri Sathya Sai System of Education.* Sri Sathya Sai Institute of Higher Learning , Prasanthi Nilayam.

-------------------. (1995). *World Education Report.* Unesco Publishing, Oxford.

-------------------. (1995). *Education in India.* Ministry of Human Resource Development, NewDelhi.

------------------- . (1998). *Brain Drain.* Indian National Science Academy. New Delhi.